శ్రీ రామ సేవ

# శ్రీ మదాంధ్ర

# వాల్మీకి రామాయణము

## (మందరము) యుద్ధకాండము - 2

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

# వాల్మీకి రామాయణము

## (మందరము) యుద్ధ కాండము-2


రచన

**వావిలికొలను సుబ్బారావు**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

# SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

## (MANDARAMU) YUDDHA KANDAMU-2

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

*Published by :*
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణము

## విషయసూచిక

### యుద్ధకాండము - రెండవ భాగము


| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 59 | శ్రీరాముఁడు హనుమంతునిపై నెక్కి రావణుమీఁదికిఁ బోవుట | | 625 |
| 59 | శ్రీరామ రావణుల ప్రథమ యుద్ధము | ... | 627 |
| 59 | రావణుఁడు పరాజితుఁడై లంకకుఁ బోవుట | ... | 631 |
| 60 | రావణుఁడు తన పరాభవంబుఁ దలఁచి దుఃఖించుట | ... | 632 |
| 60 | రావణుఁడు మంత్రులను గుంభకర్ణు నిద్రలేప నియోగించుట | ... | 637 |
| 60 | రాక్షసులు కుంభకర్ణు నిద్ర లేపుట | ... | 651 |
| 60 | కుంభకర్ణుఁడు నిద్ర లేచుట | ... | 654 |
| 60 | యూపాక్షుఁడు కుంభకర్ణునితో తనని నిద్రలేపిన కారణముఁ దెలుపుట | | 657 |
| 60 | మహోదరుఁడు కుంభకర్ణునితో రావణుఁ జూడఁ బొమ్మని చెప్పుట | | 658 |
| 61 | రావణుఁ జూడఁబోవు కుంభకర్ణుఁ జూచి శ్రీరాముఁడు విభీషణుఁ బ్రశ్నించుట | ... | 661 |
| 61 | విభీషణుఁడు శ్రీరామునకుఁ గుంభకర్ణునిగుఱించి తెలుపుట | ... | 662 |
| 61 | శ్రీరాముఁడు నీలునితోఁ గుంభకర్ణునితోడ యుద్ధమునకు సేనల సిద్ధపఱుపుమని బోధించుట | ... | 676 |
| 62 | కుంభకర్ణుఁడు రావణుఁ జూచుట | ... | 668 |
| 62 | రావణుఁడు కుంభకర్ణుతోఁ శ్రీరామునివలన రాక్షసులకైన విపత్తు దెలుపుట | ... | 669 |
| 63 | కుంభకర్ణుఁడు రావణు నిందించుట | ... | 672 |
| 63 | రావణుఁడు కుంభకర్ణుఁ గోపించిపలుకుట | ... | 678 |
| 63 | కుంభకర్ణుఁడు రావణుని సమాధానపఱుచుట | ... | 680 |
| 64 | మహోదరుఁడు కుంభకర్ణమతమును ఖండించుట | ... | 688 |
| 64 | రావణునకు మహోదరుఁ డుపాయము జెప్పుట | ... | 694 |
| 65 | కుంభకర్ణుఁడు మహోదరు నిందించుట | ... | 697 |
| 65 | రావణుఁడు కుంభకర్ణునిఁ బ్రశంసించుట | ... | 699 |
| 65 | రావణుఁడు కుంభకర్ణుతో నొంటిగా యుద్ధమునకుఁ బోవలదనుట | | 700 |
| 65 | కుంభకర్ణుఁడు యుద్ధమునకై వెడలుట | ... | 703 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 66 | కుంభకర్ణునిఁ జూచి పరువిడు క్రోఁతులకు నంగదుఁడు ధైర్యముఁ జెప్పుట | | 707 |
| 66 | వానరులు కుంభకర్ణుతోఁ బోరి యోడి పాఱిపోవుట | ... | 708 |
| 66 | అంగదుఁడు కపులకు భయముఁ బాపి క్రమ్మఱించుట | ... | 710 |
| 67 | కుంభకర్ణుఁడు వానరసేన హతముఁ జేయుట | ... | 713 |
| 67 | ద్వివిదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 714 |
| 67 | హనుమంతుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 715 |
| 67 | శరభాదులు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 717 |
| 67 | కుంభకర్ణుఁడు వానరుల మ్రింగుట | ... | 718 |
| 67 | అంగదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 719 |
| 67 | సుగ్రీవుఁడు కుంభకర్ణుతోఁ బోరుట | ... | 720 |
| 67 | మూర్ఛిల్లిన సుగ్రీవునిఁ గుంభకర్ణుం డెత్తుకొని లంకలోనికిఁ బోవుట | | 723 |
| 67 | సుగ్రీవుఁడు కుంభకర్ణుని ముక్కు చెవులు కొఱికి శ్రీరామునొద్దకు వచ్చుట | ... | 725 |
| 67 | కుంభకర్ణుఁడు మత్తుఁడై వానరాదుల మ్రింగుట | ... | 727 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణుతో యుద్ధము చేయుట | ... | 728 |
| 67 | శ్రీరామ కుంభకర్ణుల సంవాదము | ... | 731 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణుని కాలుసేతులు నఱకుట | ... | 733 |
| 67 | శ్రీరాముఁడు కుంభకర్ణు శిరంబుఁ దెగవేయుట | ... | 736 |
| 68 | హతశేషులు రావణునకుఁ గుంభకర్ణు మరణంబుఁ దెలుపుట | ... | 740 |
| 68 | కుంభకర్ణు మరణంబునకు రావణుఁడు దుఃఖించుట | ... | 742 |
| 69 | త్రిశిరుఁడు రావణునకు దుఃఖశాంతివాక్యంబులఁ దెలుపుట | ... | 744 |
| 69 | దేవాంతక నరాంతకాతికాయ త్రిశిరోమత్త యుద్ధోన్మత్తుల రావణుఁడు యుద్ధమునకుఁ బనుచుట | ... | 747 |
| 69 | వానర రాక్షససేనల యుద్ధము | ... | 752 |
| 69 | నరాంతకుఁడు కపులఁ దునుమాడుట | ... | 757 |
| 69 | అంగద నరాంతకుల యుద్ధము | ... | 759 |
| 70 | అంగదుఁడు దేవాంతక మహోదర త్రిశిరులతోఁ బోరుట | ... | 763 |
| 70 | హనుమంతునిచే దేవాంతకుఁడు, నీలునిచే మహోదరుఁడు చచ్చుట | | 765 |
| 70 | హనుమంతునిచే త్రిశిరుండు చచ్చుట | ... | 766 |
| 70 | ఋషభునిచే మత్తుండు చచ్చుట | ... | 768 |
| 71 | అతికాయుఁడు కపులఁ బాఱఁదోలుట | ... | 769 |
| 71 | శ్రీరాముఁడు విభీషణు నతికాయుని గూర్చి యడుగుట | ... | 771 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 71 | అతికాయుఁడు లక్ష్మణుఁ దూలనాడుట | ... | 775 |
| 71 | లక్ష్మణుఁ డతికాయు ధిక్కరించి పలుకుట | ... | 777 |
| 71 | లక్ష్మణాతికాయుల యుద్ధము | ... | 779 |
| 71 | లక్ష్మణుచే నతికాయుఁడు చచ్చుట | ... | 783 |
| 72 | అతికాయాదుల మృతి విని రావణుఁడు దుఃఖించుట | ... | 785 |
| 72 | రావణుఁడు లంకయందంతటఁ గాపుంచుట | ... | 789 |
| 73 | ఇంద్రజిత్తు రావణు నూరార్చుట | ... | 790 |
| 73 | ఇంద్రజిత్తు మొకటిసారి యుద్ధమునకు వెడలుట | ... | 792 |
| 73 | ఇంద్రజిత్తు మాయాబలంబునఁ గపిసేనల నుఱుమాడుట | ... | 796 |
| 73 | శ్రీరాముఁడు లక్ష్మణునకు బ్రహ్మవరంబు మన్నించి యోర్చనోనుమని చెప్పుట | ... | 800 |
| 74 | విభీషణాంజనేయులు జాంబవంతుని వెదకుట | ... | 802 |
| 74 | జాంబవంతుఁడు హనుమంతుని కుశలమును విభీషణు నడుగుట | | 805 |
| 74 | జాంబవంతుఁడు హనుమంతుని సంజీవికరణిఁ దేర నియోగించుట | | 807 |
| 74 | హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుటకై పోవుట | ... | 808 |
| 74 | హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుట | ... | 812 |
| 74 | సంజీవనిచే వానరాదులు జీవించుట | ... | 816 |
| 75 | సుగ్రీవుఁడు లంకఁ గాల్పఁ గపుల నాజ్ఞాపించుట | ... | 816 |
| 75 | కపులు లంకఁ గాల్చుట | ... | 817 |
| 75 | కుంభనికుంభులు యుద్ధమునకు వెడలుట | ... | 823 |
| 76 | అంగదుఁడు కంపను వధించుట | ... | 828 |
| 76 | అంగదుఁడు ప్రజంఘుఁ జంపుట | ... | 829 |
| 76 | కుంభుఁడు వానరవీరుల నొప్పించుట | ... | 830 |
| 76 | అంగదుఁడు కుంభుచే నొచ్చిపడుట | ... | 831 |
| 76 | సుగ్రీవుఁడు కుంభుని నుపాలంభించుట | ... | 834 |
| 76 | సుగ్రీవుఁడు కుంభుని వధించుట | ... | 836 |
| 77 | నికుంభుఁడు కపులఁ బాఱఁదోలుట | ... | 839 |
| 77 | హనుమంతుఁడు నికుంభు వధించుట | ... | 841 |
| 78 | మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట | ... | 842 |
| 79 | మకరాక్షుఁడు శ్రీరాముఁ దూలనాడుట | ... | 844 |
| 79 | శ్రీరాముఁడు మకరాక్షు వధించుట | ... | 848 |

| సర్గసంఖ్య | | పుటసంఖ్య |
|---|---|---|
| 80 | ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకుఁ బోవుట ... | 850. |
| 80 | ఇంద్రజిత్తదృశ్యుఁడై కపిసేనల శ్రీరామలక్ష్మణుల నొప్పించుట | 852 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతతో హనుమంతుఁ డున్న దిక్కునకేగుట | 857 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతఁ జంపఁ బూనుట ... | 859 |
| 81 | ఇంద్రజిత్తు మాయాసీతను వధించుట ... | 861 |
| 82 | హనుమంతుఁ డింద్రజిత్తుతోఁ బోరుట ... | 862 |
| 82 | హనుమంతుఁడు రణంబు చాలించి శ్రీరాముఁ జూడఁబోవుట ... | 865 |
| 83 | హనుమంతుఁడు శ్రీరామునకు నింద్రజిత్తు సీతాదేవిని వధించెనని తెలుపుట | 866 |
| 83 | లక్ష్మణుఁడు శ్రీరామునితో ధర్మంబు నిరర్థకంబని చెప్పుట ... | 868 |
| 83 | లక్ష్మణుఁడు శ్రీరామునితో ధనంబు సర్వార్థసాధకంబని చెప్పుట | 875 |
| 84 | విభీషణుఁ డింద్రజిత్తు మాయోపాయంబు శ్రీరామునకు దెలుపుట | 880 |
| 84 | ఇంద్రజిత్తు నికుంభిలాయాగముఁ జేయువార్త విభీషణుఁడు శ్రీరామునకుఁ దెలుపుట ... | 882 |
| 85 | ఇంద్రజిత్తును జంప లక్ష్మణుఁ బంపుమని విభీషణుఁడు శ్రీరాము వేఁడుట | 883 |
| 85 | ఇంద్రజిత్తును జంప శ్రీరాముఁడు లక్ష్మణుని నికుంభిలకుఁ బంపుట | 886 |
| 86 | విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తుండు చోటు చూపుట ... | 888 |
| 86 | కపు లింద్రజిత్సేనలతోఁ బోరుట ... | 889 |
| 86 | హనుమంతుఁడు రాక్షసుల నాశన మొనర్చుట ... | 891 |
| 86 | ఇంద్రజిత్తు హనుమంతు నెదుర్చుట ... | 892 |
| 87 | విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తు యజ్ఞము చేయు న్యగ్రోధముఁ జూపుట ... | 893 |
| 87 | ఇంద్రజిత్తు విభీషణు నధిక్షేపించుట | 894 |
| 87 | విభీషణుఁ డింద్రజిత్తునకు సమాధానముఁ జెప్పుట ... | 896 |
| 88 | ఇంద్రజిల్లక్ష్మణుల సంభాషణము ... | 900 |
| 88 | ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధ ప్రారంభము ... | 902 |
| 89 | ఇంద్రజిత్తు లక్ష్మణబాణంబులచే నొచ్చుట ... | 905 |
| 89 | ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట ... | 908 |
| 90 | విభీషణుఁడు కపులఁ బ్రోత్సాహపఱచుట ... | 912 |
| 90 | ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట ... | 917 |
| 90 | లక్ష్మణుఁ డింద్రజిత్తు సారథిని జంపుట ... | 919 |
| 91 | ఇంద్రజిత్తు కపుల వంచించి లంకకుఁ బోయి రథికుఁడై వచ్చుట | 921 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 91 | లక్ష్మణుఁ డింద్రజిత్తును నొప్పించుట | ... | 923 |
| 91 | ఇంద్రజిల్లక్ష్మణులు దివ్యాస్త్రంబులఁ బోరుట | ... | 926 |
| 91 | లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించుట | ... | 929 |
| 91 | ఇంద్రజిత్తు మరణంబునకు లోకంబులు సంతోషించుట | ... | 932 |
| 92 | ఇంద్రజిత్తువధ విని శ్రీరాముఁడు లక్ష్మణుఁ గొండాడుట | ... | 934 |
| 93 | ఇంద్రజిత్తు మరణమునకు రావణుఁడు విలపించుట | ... | 938 |
| 93 | రావణుఁడు రాక్షసులతో దన పరాక్రమంబుఁ దెలుపుట | ... | 942 |
| 93 | రావణుఁడు సీతను జంపఁబోవుట | ... | 944 |
| 93 | రావణునిఁ జూచి సీతాదేవి దుఃఖించుట | ... | 946 |
| 93 | సుపార్శ్వుఁడు రావణునకు నీతిఁ దెల్పి మరలించుట | ... | 949 |
| 94 | మూలబల యుద్ధము | ... | 952 |
| 94 | శ్రీరాముఁడు మూలబలమును సంహరించుట | ... | 955 |
| 95 | రాక్షసస్త్రీ విలాపము | ... | 964 |
| 96 | రావణుఁడు పౌరుషోక్తులు పలుకుట | ... | 972 |
| 96 | రావణుఁడు యుద్ధంబునకు వెడలుట | ... | 975 |
| 96 | రావణున కపశకునంబు లగుట | ... | 977 |
| 96 | రావణుఁడు కపిసేన నుఱుమాడుట | ... | 978 |
| 97 | సుగ్రీవుఁడు రాక్షసుల వధించుట | ... | 979 |
| 97 | సుగ్రీవుఁడు విరూపాక్షు వధించుట | ... | 918 |
| 98 | సుగ్రీవుఁడు మహోదరుఁ జంపుట | ... | 983 |
| 99 | మహాపార్శ్వుఁ డంగదుచే హతుం డగుట | ... | 987 |
| 100 | రావణుఁడు కపులఁ బొలియించుట | ... | 991 |
| 100 | శ్రీరామరావణ యుద్ధము | ... | 993 |
| 101 | శ్రీరామరావణులు దివ్యాస్త్రంబులఁ బోరుట | ... | 998 |
| 101 | రావణ లక్ష్మణ యుద్ధము | ... | 1000 |
| 101 | లక్ష్మణుఁడు రావణశక్తిచే మూర్ఛపోవుట | ... | 1003 |
| 101 | శ్రీరాముఁడు లక్ష్మణుని గపుల కప్పగించుట | ... | 1006 |
| 101 | రావణుఁడు పరాజితుఁడై లంకకుఁ బరువెత్తుట | ... | 1009 |
| 102 | మూర్ఛిల్లిన లక్ష్మణుఁ జూచి రాముఁడు దుఃఖించుట | ... | 1010 |
| 102 | సుషేణుఁడు శ్రీరాము నూరార్చుట | ... | 1013 |
| 102 | హనుమంతుఁడు సంజీవని పర్వతంబుఁ దెచ్చుట | ... | 1014 |
| 102 | లక్ష్మణుఁడు మూర్ఛ దేఱుట | ... | 1015 |

| సర్గసంఖ్య | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 102 | లక్ష్మణుఁడు శ్రీరాముని రణంబునకుఁ బ్రోత్సాహపఱుచుట | ... | 1018 |
| 103 | శ్రీరామరావణుల కడపటి యుద్ధము ప్రారంభము | ... | 1019 |
| 103 | మాతలి శ్రీరాముకడకు నింద్రు పనుపున రథంబు దెచ్చుట | ... | 1021 |
| 104 | శ్రీరాముఁడు విజృంభించి రావణు శూలంబుఁ దునియలు చేయుట | | 1025 |
| 105 | శ్రీరాముఁడు రావణు నిందించుట | ... | 1028 |
| 105 | రావణు రథంబును సారథి మరలించుట | ... | 1031 |
| 106 | రావణుఁడు సారథిని దూషించుట | ... | 1033 |
| 106 | సారథి రావణునకు సమాధానము చెప్పుట | ... | 1034 |
| 106 | అగస్త్యుఁడు శ్రీరామున కాదిత్యహృదయం బుపదేశించుట | ... | 1037 |
| 107 | ఆదిత్యహృదయము | ... | 1040 |
| 108 | రావణుండు మరల శ్రీరామునిమీఁదికి యుద్ధమునకు వచ్చుట | ... | 1058 |
| 108 | శ్రీరాముఁడు మాతలిని హెచ్చరికగ నుండఁ జెప్పుట | ... | 1059 |
| 108 | రావణుమరణంబుఁ దెలుపు చిహ్నంబు లగపడుట | ... | 1061 |
| 109 | వానర రాక్షసులు శ్రీరామరావణ యుద్ధంబు దిగ్భ్రమగొనిచూచుట | | 1063 |
| 109 | శ్రీరాముఁడు రావణు ధ్వజంబు నఱకుట | ... | 1065 |
| 110 | రావణుఁడు భీమంబుగ శ్రీరాముతో బోరుట | ... | 1068 |
| 110 | శ్రీరాముఁడు రావణు శిరంబు నఱకుట | ... | 1072 |
| 111 | శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రంబున రావణు వధించుట | ... | 1075 |
| 111 | రావణు మృతికి లోకంబులు సంతోషించుట | ... | 1080 |
| 112 | విభీషణుఁడు రావణు కళేబరముఁ జూచి యేడ్చుట | ... | 1081 |
| 112 | శ్రీరాముఁడు విభీషణునకు దుఃఖోపశమనము చేయుట | ... | 1085 |
| 113 | రావణు భార్యలు రావణుఁ జూచి విలపించుట | ... | 1088 |
| 114 | మండోదరీ విలాపము | ... | 1092 |
| 114 | విభీషణుఁడు శ్రీరామునితో రావణుఁడు సంస్కారార్హుఁడు కాఁడని చెప్పుట | | 1113 |
| 114 | విభీషణుఁడు రావణునకు దహనాదిక్రియలు దీర్చుట | ... | 1116 |
| 115 | మాతలి శ్రీరామునిచే ననుజ్ఞాతుండై దివంబునకుఁ బోవుట | ... | 1118 |
| 115 | విభీషణ పట్టాభిషేకము | ... | 1119 |
| 115 | శ్రీరాముఁడు హనుమంతుని సీతాదేవియొద్దకుఁ బంపుట | ... | 1121 |
| 116 | హనుమంతుఁడు సీతాదేవికి విజయవార్తఁ దెలుపుట | ... | 1122 |

| సర్గసంఖ్య | | పుటసంఖ్య |
|---|---|---|
| 116 | సీతాదేవి హనుమంతుఁ బ్రశంసించుట ... | 1125 |
| 116 | హనుమంతుఁడు రాక్షసస్త్రీలఁ జంప సీతాదేవి యనుమతి వేఁడుట | 1128 |
| 116 | సీతాదేవి హనుమంతునితో రాక్షసస్త్రీల జంపరాదనుట ... | 1129 |
| 116 | సీతాదేవి శ్రీరాముఁ జూడఁ గోరుట ... | 1134 |
| 117 | సీతాదేవి సందేశమును హనుమ శ్రీరామునితోఁ జెప్పుట ... | 1135 |
| 117 | శ్రీరాముఁడు సీతాదేవిఁ దోడితేర విభీషణు నియోగించుట | 1136 |
| 117 | సీతాదేవిరాక శ్రీరామునకు విభీషణుఁడు దెలుపుట ... | 1138 |
| 117 | శ్రీరాముఁడు విభీషణుఁ గోపించుట ... | 1140 |
| 117 | సీతాదేవి శ్రీరాము సమీపంబునకు వచ్చుట ... | 1143 |
| 118 | శ్రీరాముఁడు సీతాదేవికిఁ దన జయంబుఁ దెలుపుట ... | 1144 |
| 118 | శ్రీరాముఁడు సీతాదేవిని దా నొల్లనని చెప్పుట ... | 1149 |
| 119 | శ్రీరాముని వాక్యంబులకు సీతాదేవి దుఃఖించి ప్రత్యుత్తరమిచ్చుట | 1152 |
| 119 | సీతాదేవి యగ్నిప్రవేశముఁ జేయుట ... | 1157 |
| 120 | దేవతలు శ్రీరామునకుఁ బ్రత్యక్షమై సీతాదేవి నిర్దోషురాలని చెప్పుట | 1162 |
| 120 | బ్రహ్మ శ్రీరాముని నుతించుట ... | 1168 |
| 121 | అగ్నిహోత్రుఁడు సీతాదేవిని శ్రీరామునకు మరల నర్పించుట | 1177 |
| 121 | శ్రీరాముఁడు సీతాదేవిని బరిగ్రహించుట ... | 1180 |
| 122 | సీతా శ్రీరామలక్ష్మణులు దశరథు సందర్శించుట ... | 1183 |
| 122 | దశరథుఁడు శ్రీరామునిఁ బ్రశంసించుట ... | 1186 |
| 122 | దశరథుఁడు లక్ష్మణునకు శ్రీరామసేవ కర్తవ్యమని బోధించుట | 1188 |
| 122 | దశరథుఁడు సీతాదేవి నూరార్చుట ... | 1191 |
| 123 | ఇంద్రుని వరముచే మృతవానరులు పునర్జీవితు లగుట ... | 1191 |
| 124 | విభీషణుఁడు శ్రీరాము సంస్కారాదు లంగీకరింపఁ బ్రార్థించుట | 1194 |
| 124 | శ్రీరాముఁడు విభీషణునిఁ బుష్పకంబుఁ దేర నియోగించుట | 1198 |

| సర్గసంఖ్య. | | | పుటసంఖ్య |
|---|---|---|---|
| 125 | శ్రీరాముఁడు విభీషణుచే వానరులకు గానుక లిప్పించుట | ... | 1200 |
| 125 | శ్రీరాముఁడు పుష్పకం బెక్కి సుగ్రీవాదుల కనుజ్ఞ యిచ్చుట | | 1202 |
| 125 | శ్రీరాముఁడు సుగ్రీవ విభీషణాదు లయోధ్యకు వచ్చుటకుసమ్మతించుట | | 1204 |
| 126 | శ్రీరాముఁడు సీతాదేవికిఁ బూర్వపరిచితస్థలంబులఁ జూపుట | | 1205 |
| 126 | సీతాదేవి తారాదికాంతల నయోధ్యకుఁ దోడ్కొనిపోవఁ గోరుట | | 1214 |
| 127 | శ్రీరాముఁడు భరద్వాజాశ్రమంబునఁ బుష్పకంబు డిగుట | ... | 1219 |
| 128 | శ్రీరాముఁడు హనుమంతుని భరతుకడ కనుచుట | ... | 1224 |
| 128 | హనుమంతుఁడు భరతు సందర్శించుట | ... | 1230 |
| 129 | హమమంతుఁడు భరతునకు శ్రీరామవృత్తాంత మంతయు దెలుపుట | | 1233 |
| 130 | శత్రుఘ్నుం డయోధ్యానగరంబు శృంగారింపించుట | ... | 1240 |
| 130 | భరతాదులు శ్రీరాము నెదుర్కొనఁ బోవుట | ... | 1242 |
| 130 | వానరులు రాక జాగగుటకుఁ గారణంబు హనుమంతుడు భరతుని కెఱింగించుట | ... | 1245 |
| 130 | విమానముననున్న శ్రీరామాదులను భరతునకు హనుమంతుఁడు కనఁబఱచుట | ... | 1247 |
| 130 | శ్రీరామ భరత సమాగమము | ... | 1249 |
| 130 | శ్రీరాముఁడు భరతునాశ్రమంబునకుఁ బోవుట | ... | 1253 |
| 131 | భరతుండు రాజ్యంబు శ్రీరామునకు నప్పగించుట | ... | 1254 |
| 131 | శ్రీరామాదులు జడలు విడుచుట | ... | 1256 |
| 131 | శ్రీరామాదు లయోధ్యకుఁ బ్రయాణ మగుట | ... | 1258 |
| 131 | శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ ఘట్టము | ... | 1265 |
| 131 | సీతాదేవి హనుమంతు బహూకరించుట | ... | 1265 |
| 131 | ఫలశ్రుతి | ... | 1278 |
| 131 | యుద్ధకాండాంతపద్యములు | ... | 1285 |

—♦ శ్రీరాముఁడు హనుమంతునిపై నెక్కి రావణునిమీఁదికిఁ బోవుట ♦—

ఉ. పాతితవీరయోధము ద్ర♦వద్ధరియూథముఁ జూచి రాముఁడున్
జాతరుషారుణాక్షుఁ డయి ♦ సత్వరుఁ డై దశకంఠుమీఁదఁ బో
వాతసుతుండు డాసి బల♦వంతు సుపర్ణుని విష్ణు వట్లు నన్
బూనెదవేశ! యెక్కి సుర♦శాసను శాసితుఁ జేయు టొప్పగున్. ౧౩౧౬

అర్థములు. పాతిత వీరయోధము=పడఁగొట్టఁబడిన వీరులగు యోధులు గలది, ద్రవత్+హరి యూథము = పరువెత్తుచున్న వానరసేన గలది, యగు తన సేనను జూచి, జాతరుషా=పుట్టిన కోపముచే, అరుణాక్షుఁడయి = ఎఱ్ఱని కన్నులు గలవాఁడై, సత్వరుఁడై = త్వరతోఁగూడినవాఁడై, వాతసుతుండు = హనుమంతుఁడు, డాసి=సమీపించి, సుపర్ణుని=గరుత్మంతుని, విష్ణువట్లు = విష్ణువెక్కినట్లు, సురశాసను=దేవతల దండించిన రావణుని, శాసితున్=దండించినవానిఁగా.

నేల నిలువఁబడినవాఁడు కదలక యొకచోటనే యుండును. రథమందున్న వాఁడు తిరుగుచుండును. కావున రథమందున్నవాఁడు వేసిన బాణము సులభముగా నిలుచున్నవానికిఁ దప్పక తగులును. నిలువఁబడినవాఁడు వేసినది తిరుగుచుండువానికి గుఱి తగులుట కష్టము.

తాత్పర్యము

తన యోధులు పడిపోవుటయు, రావణుని జూచి తక్కిన వానరులు పరువెత్తి పోవుటయు జూచి రామచంద్రమూర్తి కోపించి యిఁక నాలస్యము చేయరాదని త్వరపడి రావణు మీఁదికిఁ బోఁగా హనుమంతుఁడు సమీపించి బలవంతుఁడగు గరుత్మంతుని విష్ణు వెక్కినట్లు నీవు నాపై నెక్కి యీ రాక్షసుని దండింపుము.

సీ. అనవుడు నక్కపి♦వ్యాఘ్రుంబుమూఁపుపై, నారోహణ మొనర్చి♦యమితశౌర్య
ధనుఁడు రాముండు స్యం♦దనగతు వింశతి, బాహుని నంకను ♦ బాఱఁజూచి
రోషవశమున వై♦రోచనిపైఁ బాఱు, నుద్యతాయుధవిష్ణు♦నొప్పుమిగుల
వజ్రనిష్పేషని♦స్స్వనము మౌర్వీరావ, మంతకంతకు నిగు♦డారు చండ
తే. జలధిగంభీరరవమునఁ♦బలుకు నిట్లు, నిలునిలుము విప్రియం బట్లు♦సలిపి నీవు
దనుజవల్లభ యెచటికేన్♦జనెద వేని, విడుతు నంచుఁ దలంతువా♦వీరమాని.

అర్థములు. కపివ్యాఘ్రుంబు=వానరశ్రేష్ఠుని యొక్క, మూఁపుపై=భుజములమీఁద, ఆరోహణ మొనర్చి=ఎక్కి, స్యందన గత వింశతి బాహుని=తేరిపైనున్న యిరువది చేతులు గలవానిని, ఈ యుద్ధమందు రావణుఁడు పది తలలతో నిరువది చేతులతో నుండెను, వైరోచనిపై = బలిచక్రవర్తిపై, అమృతము పంచిన కాలమున ఉద్యతాయుధ విష్ణునొప్పు = ఎత్తఁబడిన యాయుధము గల విష్ణువు విధము, వజ్రనిష్పేషనిస్స్వనము=వజ్రము రాపిడిధ్వని వంటిది, మౌర్వీరావము=అల్లె

త్రాటి ధ్వని, నిగుడారుచుండన్ = వ్యాపించుచుండఁగా, విప్రియము = ప్రియము కాని కార్యము, సీతాహరణముకాని, లక్ష్మణ మూర్ఛగాని, వీరమానీ=వీరుఁడవు కాకున్నను వీరుఁడనని తలఁచువాఁడా.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నా వానరశ్రేష్ఠుని భుజములపై రామచంద్రమూర్తి యెక్కి రథముమీఁద నుండు నిరువది చేతుల రావణుని జూచి బలిమీఁద రోషముచే బాలు విష్ణువువలె వజ్రధ్వనివంటి వింటిధ్వని యంతకంతకు నతిశయింపఁగా సముద్రము యొక్క గంభీర ధ్వనివంటి ధ్వనితో నిట్లనెను. ఓరీ నిలునిలుము. నాకు నప్రియకార్యము నీ వా విధముగఁ జేసి యెచ్చటికిఁ బోయినను వీరమానీ! విడుతునని తలఁచితివా ?

కం. వినరా యింద్రునిఁ గాలుని, దిననాథు స్వయంభు శంభు ♦ దిగ్దశకంబున్
జనినను నిను విడువన్ నీ, తనువునకుం బ్రాణమునకుఁ ♦ దగులముఁ జెఱుతున్.

తాత్పర్యము

ఓరీ! విను నీవింద్రుని, యముని, సూర్యుని నీకు వరము లిచ్చిన బ్రహ్మ రుద్రులను పది దిక్కులను బోయి డాఁగినను నిన్ను వదలి పెట్టను. నీ ప్రాణము నకు నీ దేహమునకుఁ గల సంబంధము విడఁగొట్టుదును.

చం. తతగురుశక్తి నెవ్వనిని ♦ దాడితుఁ జేయుటఁ బొంగి పోయె దా
యతిబలశాలి లక్ష్మణుఁడె ♦ హావడి నీకొనరింపఁ గోరి నిన్
సుతతరుణీసమేతు రవి ♦ సూనున కప్పన సేయువాఁడు నై
మతిగొని యుద్ధభూమి నిను♦మార్కొన వచ్చె నటంచు నెంచుమీ. ౧౩౧

అర్థములు. తతగురుశక్తిన్ = విస్తారమైన గొప్పశక్తిచే, హావడి=కీడు సుతతరుణీ సమేతున్-నిన్ = కొడుకులు పెండ్లాము గల నిన్ను, వానితోడి సాంగత్యము నీకు వదలినదని భావము రవిసూనునకున్ = యమునకు, అప్పన=అర్పణ శబ్దభవము. అప్పన సేయువాఁడునై=అప్పగించువాఁడై.

తాత్పర్యము

నీ గొప్పశక్తిచే నెవనిని గొట్టుటచే మహావీరుఁడ నని పొంగిపోవుచున్నావో యా బలశాలి లక్ష్మణుఁడే నీకుఁ గీడు గలిగింపఁగోరి నీ పెండ్లాము బిడ్డల సాంగత్యము నీకుఁ దొలఁగఁజేసి యుద్ధమందు నిన్ను యముని యొద్దకుఁబంపవచ్చి యున్నాఁడని తలఁపుము. ఇది లక్ష్మణు విషయమని యైన నెంచవచ్చును. లక్ష్మణునకుఁ దనకు నభేదము చెప్పి నేనే లక్ష్మణుఁ డనుకొనుమని చెప్పెనని యైనఁ జెప్పవచ్చును. లక్ష్మణ బాధ తన బాధయే.

కం. ఈనేను గాదె యసుర వి, తానముఁ బదునాల్గువేలు ♦ దర్పోద్ధతమున్
నానాసాధనము జన, స్థానంబునఁ జంపినాఁడ ♦ సంగరమందున్. ౧౩౨

## తాత్పర్యము

నీ రూపమున లక్ష్మణుఁడు వచ్చినాఁడని చెప్పెదవు. లక్ష్మణుఁడు స్వయముగ వచ్చియే నన్ను గెలువలేక పోయెను. ఇఁక నీరూపమున వచ్చి నన్నేమి చేయఁగలఁ డందువా? ఇక్కడ నీకుఁ గానవచ్చు నేనుగదా జనస్థానమందు బల గర్వముగల నానాయుధములుగల రాక్షససమూహమును యుద్ధమందుఁ జంపితిని.

## —♦ శ్రీరామరావణుల ప్రథమయుద్ధము ♦—

చం. అనవుడు నాగ్రహం బడర ♦ నా రఘురామునియెక్కిరింతఁ బా
వని లయకాలవహ్నినిభ♦బాణములం బ్రహరించి నొంప నా
యనఘు స్వభావతేజ మది ♦ యంతకు నంతకు నెక్కుడయ్యె నా
తని దశకంఠమార్గణకృ♦తవ్రణుఁ గాంచి రుషావశాత్ముఁడై. ౧౩౨౧

అర్థములు. ఎక్కిరింత = వాహనము, "చక్కని రాయంచ యెక్కిరింత" యని శ్రీనాథుఁడు. శృం-నై-౧ ఆ-సరస్వతీ స్తుతి. లయకాల వహ్ని నిభ బాణములన్ = ప్రలయకాలాగ్నితో సమానములైన బాణములచే, ప్రహరించి = కొట్టి, నొంపన్ = బాధింపఁగా, మార్గణ = బాణములచే, కృతవ్రణున్ = చేయఁబడిన వ్రణములు గలవానిని, రుషావశాత్ముఁడై = కోపమునకు వశపడిన మనస్సు గలవాఁడై.

## తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా రావణుఁడు కోపించి రాముని వాహనమైన హనుమంతుని ప్రళయ కాలాగ్నితో సమానమైన బాణములచేఁ గొట్టి బాధింపఁగా నతని స్వభావ తేజ మంతకంతకు హెచ్చెను. ఇట్లు రావణుని బాణములచే గాయపడిన హనుమంతుని జూచి రామచంద్రమూర్తి కోపించినవాఁడై.

శా. ఆకర్ణాంతము లాగి చాపమును వే♦గాటోప మేపార నా
నాకిద్వేషిరథంబు నొక్కవడిఁ జ♦క్రాశ్వధ్వజచ్ఛత్రసూ
తాకుంఠాశనిశూలఖడ్గసుపతా♦కాన్వితమై ధాత్రిపై
నాకారం బెఱుఁగంగరాని గతి ను♦గ్గై రాల బాణావళిన్. ౧౩౨౨

అర్థములు. ఆకర్ణాంతము = చెవికొనవఱకు, వేగాటోపము = వేగము యొక్క సంభ్రమము, ఏపారన్ = అతిశయింపఁగా, నాకిద్వేషిరథంబు = దేవతలకు విరోధియగు రావణుని తేరు, నాకమందుండువాఁడు నాకి. ఒక్కవడి = ఒక్కసారిగ, చక్ర = చక్రములతోను, అశ్వ = గుఱ్ఱములతోను, ధ్వజ = టెక్కెములతోను, ఛత్ర = గొడుగుతోను, సూత = సారథితోను, అకుంఠ = మొక్కవోని, అశని = వజ్రమువంటి యాయుధము, శూల, ఖడ్గ, సుపతాకా = మంచి ధ్వజముతోను అన్వితమై = కూడినదై.

### తాత్పర్యము

వింటి యల్లెత్రాటిని చెవికొనవఱకు నీడ్చి వేగాతిశయమున నా దేవవిరోధి రథ మేకకాలమున చక్రములతోను గుఱ్ఱములతోను ఱెక్కలముతోను గొడుగుతోను సారథితోను వాడిమిగల వజ్రము శూలము కత్తి ధ్వజము వీనితో నిది యీ వస్తువని గుర్తింపరాని విధముగ పొడిపొడియై నేల రాల బాణ సమూహమును.

ఉ. కూలిచి యంతఁ బోక భృశ ♦ ఘోరమహాశనివజ్రసన్నిభం
 బైలలినీలు బాణమును ♦ నాతని వ్యూఢ భుజాంతరంబు దం
 భోళిని మేరుశైలము బు ♦ భుక్షుఁడు వ్రయ్యఁగ మోఁదినట్టు లా
 భీలముగాఁగ నాటుటయుఁ ♦ బెల్కుఱె నాతఁడు వీతచేష్టుఁడై. ౧౩౨౩

అర్థములు. కూలిచి = నేలఁబడఁగొట్టి, భృశఘోర = అధిక భయంకరమైన, మహాశని వజ్ర సన్నిభంబు=గొప్పపిడుగుతోను వజ్రముతోను సమానమై, వ్యూఢ = వెడలుపైన, భుజాంతరంబు = రెండు భుజములకు నడిమి ప్రదేశము, ఱొమ్ము, దంభోళిని = వజ్రముచే, బుభుక్షుఁడు = ఇంద్రుఁడు, వ్రయ్యఁగన్ = చీలునట్లు, ఆభీలము, గాఁగన్=భయంకరముగ, పెల్కుఱెన్ =విలవిలఁ బోయెను, వీతచేష్టుఁడై =చేష్టలుడిగినవాఁడై.

### తాత్పర్యము

నేలఁబడఁగొట్టి యంతటితో విడువక మిగుల భయంకరమై వేగమునఁ బిడుగుతోను, దెబ్బగొట్టుటయందుఁ గఠినత్వమందు వజ్రాయుధముతోను సమానమైన బాణముచే వాని విశాల వక్షమును నింద్రుఁడు మేరు పర్వతము పగులఁగొట్టినట్లు భయంకరముగా నాటుటయు, వాఁడు విలవిలబోయి చేష్టలు మాని.

తే. యోధుఁ డెవ్వఁ డశనికులి♦శోగ్రహతుల, కించు కేనియుఁ గలఁగఁడు♦సంచలింప
 డట్టి వీరుఁడు రామబా♦ణార్తి మిగుల, నడలి వదకుమ ధనువుము♦విడిచెఁ బుడమి.

అర్థములు. యోధుఁడు = యుద్ధవీరుఁడు, ఇందు మొదటి యక్షరము గాయత్రిలోని పదునెనిమిదవ యక్షరము, అశని = ఉత్పాతవేళ పడు పిడుగు యొక్కయు, కులిశ=వజ్రము యొక్కయు, హతులకు=దెబ్బలకు, ఇంచుకేనియు= కొంచెమైనను, కలఁగఁడు = వ్యాకులపడఁడు, సంచలింపడు=కదలఁడు, అడలి = విలపించి.

### తాత్పర్యము

ఏ యుద్ధవీరుఁడు పిడుగులు వజ్రాయుధములు దనమీఁదఁ బడినను కొంచెమైనను వ్యాకులపడఁడో కదలనైనఁ గదలఁడో యట్టి వీరుఁడు రామబాణముల వలన గలిగిన బాధచే మిక్కిలి విలపించి వడఁకుచు చేత నాయుధ మున్నఁ జంపునని యు, ఆయుధములేని వానిని జంపఁడనియుఁ దలఁచి నేలమీఁదఁ దన విల్లును వదలెను.

విల్లు పడిపోయె ననక విల్లు వదలె ననుటచే నిది బుద్ధిపూర్వకముగఁ జేసిన కార్యమే యగుచున్నది. ఏలన నిప్పు డా విల్లు శత్రువును గెలుచుటకుఁ బనికిరాకుం

డుటేగాక పరుగెత్తి పోవనీయక దెబ్బలుకొట్టించుటయందు మాత్రమే యుపయోగ పడుచున్నది. చేత విల్లుండు వఱకు రాముఁడు పోనీయఁడు. కొట్టుచునేయుండును. ఇట్టులే ప్రపన్నుఁడు ఇతర సమస్తోపాయముల వదలినవాఁడై యుండినవనే భగ వంతుఁడు రక్షించును. ప్రపత్తియే సిద్ధోపాయము. దీనితోడ మఱియొక యుపా యము భక్తిజ్ఞాన కర్మాదులలో దేనినైన నుపాయముగ గ్రహించితిమేని యది తరుణోపాయమును కాఁజాలదు గదా. మీఁదు మిక్కిలి ప్రపత్తిని ఫలింపకుండను జేయును. కావున సిద్ధోపాయనిష్ఠుఁడు మఱి దేనిని నుపాయముగా గ్రహింపరాదు.

ఉ. ఆకులపాటుఁ గూరుచు ని ♦ రాయుధుఁడై ధర నిల్చియున్న యా
నాకులవైరి యర్కరుచి ♦ నందము మీఱుకిరీట మర్ధచం
ద్రాకృతి గల్గుబాణమున ♦ నా మహితాత్ముఁడు డొల్ల నేసి య
ప్రాకృతయుద్ధధర్మకృతి ♦ బాధ దయారసపూర్ణ చిత్తుఁడై. ౧౩౨౯

అర్థములు. ఆకులపాటు = కలఁత, నిరాయుధుఁడై = ఆయుధము లేని వాఁడై, ధరనిల్చి యున్న = భూమిమీఁద నిలఁబడియున్న, నాకుల = దేవతల, వైరి=విరోధియొక్క, అర్కరుచిన్=సూర్యుని కాంతితో, డొల్లనేసి = పడఁగొట్టి, మహితాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు, కావుననే యప్రాకృత యుద్ధ ధర్మ కృతిన్=గొప్పవారియొక్క యుద్ధధర్మమును ననుసరించుటచే, నిరాయుధుని గొట్ట రాదను ధర్మము, బాధ దయారస పూర్ణచిత్తుఁడై=అధిక దయారసముచే నిండిన మనస్సు గలవాఁడై.

## తాత్పర్యము

కలఁత చెంది యాయుధములేనివాఁడై నేలమీఁద యుద్ధకార్య మేదియుఁ జేయక జడుని వలె నిలఁబడియున్న యాదేవవిరోధి రావణునియొక్క సూర్య కాంతిగల కిరీట మర్ధచంద్ర బాణమున గొప్ప మనస్సుగల వాఁడగుటచే నుత్తమ పురుషుల యుద్ధధర్మపద్ధతి ననుసరించి రామచంద్రమూర్తి మిక్కిలి దయగలవాఁడై కిరీటమును నేలఁబడఁగొట్టెను. దానినే కంఠమునకు గుఱిపెట్టి యుండినఁ దల యెగిరిపోయి యుండును. నా కిరీటము ఖండించి వాఁడు నాతలఁ దెగ్రవేసిన నేనేమి చేసియుండఁగలను? నాశక్తి యీ మాత్రమే కదా యని జ్ఞానము గలవాఁడై సీతను మరల నిచ్చును గాక, ఇది యాలోచించియైన బుద్ధిగలవాఁడు గాకుండునా? మొదటనే యేల చంపవలెనని దయగలవాఁడై కిరీటమును మాత్రము నేగుర గొట్టెను. దాని వలన బాధలేదు. వాని యధమస్థితి బయలుపడును. కిరీటము పోయిన ప్రభుత్వము పోయినట్టులేక దా.

కం. కోఱలు దీసిన పామన, నాఱినవేఁడిమిగలట్టి ♦ యర్కుండనఁగాఁ
దీఱఁగఁ గిరీట మాకృతి, మాఱి గతశ్రీకుఁడై స♦మనుజాదు ననున్. ౧౩౩౦

అర్థములు. తీఱఁగన్=నాశము కాఁగా, అకృతిమాతి=తల వెండ్రుకలు పోయిన విధవస్త్రీవలె మాఱురూపు పడి, వీఁడు రాక్షసరాజా యని గుర్తింపరాక, గతశ్రీకుఁడు=కాంతిహీనుఁడైన, మనుజాదమన్=రాక్షసుని.

తాత్పర్యము

కోఱలుతీసిన పామువలెను, చల్లారిపోయి వేఁడిమి తగ్గిన సూర్యునివలెను నాశముకాఁగా, కిరీటము పోయి తలవెండ్రుకలు పోయిన విధవ స్త్రీవలె మాఱురూపు పడి వీఁడు రాక్షసరాజగునా కాఁడా యనునంతటి కాంతిహీనుఁడైన రావణుని గాంచి రామచంద్రమూర్తి వానితో నిట్లనెను.

చం. అనితర సాధ్యముం బరభ ♦ యావహ మైన రణంబుసేసి తిం
దనుక, హతప్రవీరునిఁగఁ ♦ దద్దయుఁ జల్పితి నన్నుఁ గాన నీ
వనిఁ గడు డస్సినాఁడ వని ♦ యాత్మఁ దలంచి నిశాచరేంద్ర ! నిన్
దనుమఁగ నొల్ల రాముఁ డని ♦ ద్రుంపఁడు సుమ్మ నిరాయుధున్ జనున్.

అర్థములు. అనితర సాధ్యమున్=ఇతరులకు సాధ్యముకానిది, పరభయావహము = శత్రువులకు భయము గలిగించునది, హతప్రవీరునిఁగన్=చంపఁబడిన వీరులు గలవానిఁగ, అనిన్=యుద్ధమందు, నిశాచరేంద్ర = రాత్రులందుఁ దిరుగు వారిలో శ్రేష్ఠుఁడా, నీవు మోసయుద్ధము రాత్రులందుఁ జేయునట్లు నేను జేయను అని భావము.

తాత్పర్యము

ఇతరులకు సాధ్యముకానిదియు శత్రువులకు భయము కలిగించునదియు నగు యుద్ధ మింతవఱకుఁజేసి నాపక్షమునన్న వీరులఁ జంపి మిగుల బడలియున్నాఁడవు అని తలఁచి నిశాచరరాజా! నిన్నుఁ జంప సమ్మతింపను. రాముఁడు నిరాయుధుఁడగు వానిని, ఆయుధ మున్నను నలసి కాలుసేతులు చక్కఁగా గదలింపలేని వానిని జంపఁడుసుమా! ఏలయన, యుద్ధము చేసిచేసి యలసినవానిని రాముఁడు చంపినాడు, అదియొక శౌర్యమా? ఆమాత్రమున రావణునికంటె రాముఁడు శూరుఁడని యెట్లు చెప్పవచ్చును? అని లోకులందురు. ఆ కారణమున నిన్నుఁగొట్టను, అని భావము.

శ్లో॥ నచ హన్యాత్ స్థలారూఢాన్, న, క్లీబం నకృతాంజలిమ్
నాముక్తకేశం నాసీనం నతవాస్మీతి వాదినమ్.

శ్లో॥ నసుప్తం నవిసన్నాహం, న నగ్నం ననిరాయుధమ్
నాయుధ్యమానం పశ్యంతం, నపరేణ సమాగతమ్.

శ్లో॥ నాయుధ వ్యసన ప్రాప్తం, నార్తం నాతి పరిక్షతమ్
నభీతం నపరావృత్తం, సతాం ధర్మ మనుస్మరన్.

మనుస్మృతి-అ. ౭-౯౧, ౯౨, ౯౩ శ్లో.

తాను రథమున నుండఁగా రథము విడిచి నేలను నిలిచిన శత్రువును జంప రాదు. నపుంసకుని జంపరాదు. శరణు చొచ్చినవానిని జంపరాదు. తల విరియఁ

బోసికొన్న వానిని, కూర్చున్నవానిని, నేను నీవాఁడ నని శరణుచొచ్చిన వానిని జంపరాదు.

నిద్రించు వానిని, యుద్ధప్రయత్నము లేనివానిని, దెసమొలవానిని, ఆయుధములు లేనివానిని, తనతో యుద్ధము చేయనివానిని, యుద్ధమును జూచుచుండు వానిని, ఒరునితో యుద్ధము చేయువానిని జంపరాదు.

ఆయుధములు విఱిగిపోయిన వానిని, నొచ్చినవానిని, దెబ్బలు తిన్నవానిని, భయపడినవానిని, వెనుకకు మఱలిన వానిని శిష్టులగు క్షత్రియుల ధర్మమును దలఁచికొని చంపరాదు.

శా. పొమ్మీ లంక కనుజ్ఞ యిచ్చితిని బో ♦ పో గాసి దీఱంగ రా
రమ్మీ క్రమ్మఱ ధన్వివై రథివినై ♦ రాజన్మహాశస్త్రపూ
గమ్ముం గైకొని యప్డు చూచెదు శతాం ♦ గస్థుండ వై నాదు శౌ
ర్యమ్మున్ రాత్రిచరేంద్ర! యన్న హతద ♦ ర్పానందుఁ డై వాఁడునున్.

అర్థములు. గాసి దీఱంగన్=బడలిక తగ్గిపోఁగా, ధన్వివై=విల్లు పట్టినవాఁడవై, రథివినై=రథమునందు గూర్చుండినవాఁడవై, రాజత్ = ప్రకాశించు, మహాశస్త్రపూగమ్మున్ = గొప్ప శస్త్రసమూహమును, శతాంగస్థుండవై = రథమందున్నవాఁడవై, హత = సమసిన, దర్ప = గర్వము, ఆనందుఁడై = సంతోషము గలవాఁడై.

## తాత్పర్యము

ఇప్పుడు నన్నేమి చేయుమనెదవా ? నీకనుజ్ఞ యిచ్చితిని. నిర్భయముగ లంకకుఁబో. ఇఁక నిన్నుఁ గొట్టనుపో. పోయి బడలిక దీర్చుకొని మరల విల్లు దీసికొని రథమునందుఁ గూర్చుండి నీకుఁగల గొప్ప యస్త్రములన్ని తీసుకొని రా రమ్ము. అప్పుడు నీవు తేరిమీఁదనుండి నా శౌర్యము చూచెదవు. అనఁగా నపుడు నిన్ను విరథునిఁజేయక నిరాయుధునిజేయక చంపెద నని భావము. ఇట్లు చెప్పఁగా వాఁడు గర్వముడిగి సంతోషహీనుఁడై.

## —♦ రావణుఁడు పరాజితుఁడై లంకకుఁ బోవుట ♦—

కం. చాపము విఱుగఁగ సూతుఁడు, రూపఱ గుఱ్ఱములు చావఁ ♦ గ్రూరశరహతిన్
దీపులు గొను మెయితో నతఁ, డేపఱి విరిశిరముతోడ ♦ నేగెం బురికిన్. ౧౩౯

## తాత్పర్యము

విల్లు విఱుగఁగా సూతుఁడు చావఁగా గుఱ్ఱములు మరణింపఁగా క్రూరములైన బాణముల దెబ్బలచే నొప్పులు పుట్టిన దేహముతో వెండ్రుకలు విరియఁబోసికొనిన తలతో (ముడివేసికొను నవకాశము లేదు.) ప్రతాపము క్షయించి లంకకుఁ బోయెను.

ఉ. దానవదేవశత్రుఁ డతి ♦ దారుణశౌర్యుఁడు రాక్షసేంద్రుఁ డి
ట్లానతమూర్ధుఁ డౌచు సమ ♦ రావనిఁ బాసి పురిం జొరంగ నా

త్మానుజయుక్తుఁడై రఘుకు♦లాభరణంబు ప్లవంగవర్యుల
న్నామగ వీతశల్యుల నొ♦నర్చి శ్రమం బఱఁజేసె నయ్యెడన్. ౧౩౦

అర్థములు. ఆనతమూర్ధుఁడు = తలవంచుకొన్నవాఁడు, ఆఁడువారు మగవారు చూచి నవ్వుదు రను నవమానముచే నని భావము, సమరావనిన్ = యుద్ధభూమిని, ఆత్మానుజయుక్తుఁడై = తన తమ్మునితోఁగూడిన వాఁడై, ఇట్లనుటచే లక్ష్మణుఁ డపుడే మూర్ఛవిడిచి లేచె నని సూచన, వీతశల్యులన్ = బాణముల ములుకుల నూడఁదీయించిన వాఁడై.

తాత్పర్యము

దానవులకు దేవతలకుఁగూడ శత్రువు, మిగుల భయంకరమైన శౌర్యముగల వాఁడు నగు రాక్షసరాజు–రావణుఁడు, సిగ్గుచేఁ దలవంచుకొని యుద్ధభూమి విడిచి పోఁగా రామచంద్రమూర్తి తన తమ్మునితోఁగూడి బాణముల ములుకులు నాటుటచే బాధపడు వానరుల కా ములుకు లూడఁదీయించి గాసి దొలఁగించెను.

కం. హరిహయరిపు వోటఱి నిర్జరు లసురులు భూతగణము ♦ సాగరధరణీ
చరజలచరఋషిదర్వీ, కరదిక్సంతాన మెల్లఁ ♦ గల మలరారెన్. ౧౩౧

అర్థములు. హరిహయ రిపువు=ఇంద్రశత్రువు, రావణుఁడు, ఓటఱి=ఓడిపోఁగా, కరము=మిక్కిలి, అలరారెన్=సంతోషించెను.

తాత్పర్యము

ఇంద్రశత్రువగు రావణుఁడు యుద్ధమున నోడి పరువెత్తి పోఁగా దేవతలు అసురులు భూతములు సముద్రమునందుఁ జరించునవి, భూమియందుఁ జరించునవి, నీళ్ళయందుఁ జరించునవి, ఋషులు, సర్పములు, దిక్పాలకులు అన్నియు మిగుల సంతోషించెను.

—♦ ౬౦–వ సర్గము. రావణుఁడు తన పరాభవంబుఁ దలంచి దుఃఖించుట ♦—

సీ. రావణుఁ డటు లేగి ♦ రామశరంబులఁ, దలపోసి తలపోసి ♦ తలఁకుఁ జెంది
భగ్నదర్పుం డయి ♦ వ్యథితేంద్రియుం డయి, గరుడాభిభూతనా♦గంబునాఁగ
హర్యక్షముఖముక్త♦హస్తినా రాముని, బారిని బడి కాలు♦బారి తప్పి
సర్వతోముఖరామ♦చంద్రశరంబులు, తనుఁ దాఁకు చున్నట్లు ♦ తలఁచి బెగడి
తే. దీర్ఘముగ నూర్పు పుచ్చు చ♦దివ్యమైన, చిత్రకనకాసనమున నా♦సీనుఁడగుచు
దోడిరాక్షసవీరుల♦తోడ నిట్టు, లార్తుఁ డగుచును పచియించె ♦ నాత్మగతము.

అర్థములు. రామశరంబులన్ = రాముని బాణముల వేగము, వాఁడిమి క్రౌర్యము; తలపోసి=ఆలోచించి యాలోచించి,తలఁకుచెంది=ఇక్కడికిఁగూడవచ్చుచున్న వేమో యని భయపడి, భగ్నదర్పుండయి = గర్వము చెడిన వాఁడయి, వ్యథితేంద్రియుండయి=బాధపడుచున్న యింద్రియములు గలవాఁడు, బాణముల

దెబ్బలచే కాళ్ళుచేతులు లోనైనవి, వానిబాధచే, మనస్సు=బుద్ధి, గరుడ = గరుత్మంతునిచే, అభిభూత = అవమానింపఁబడిన, నాగంబు = సర్పము, నాఁగ = అనఁగా - వలె, హర్యక్షముఖ = సింహము నోటినుండి, ముక్త = విడువఁబడిన, హస్తినాన్ = ఏనుఁగువలె, కాలుబారి = యమునిబారి, సర్వతోముఖ = అన్ని ముఖముల వచ్చునట్టి, అందఱు వేయు బాణము లెదుటనుండి మాత్రమే వచ్చును. రామబాణములు అట్లుగాదు. వెనుకనుండితప్ప ఏప్రక్క చూచిన ఆ ప్రక్కనుండి యంతయు వచ్చుచుండును, ఆత్మగతము=తన మనస్సులో నున్నదానిని.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము రావణుఁడుపోయి రాముని బాణముల వేగము—వాఁడిమి—క్రౌర్యము తలఁచి తలఁచి యచ్చటికి నవి వచ్చుచున్నవేమో యని భయపడి నలుదిక్కులు చూచుచు గర్వముచెడి యింద్రియములు బాధింపఁగా గరుడుఁడు కొట్టి విడిచిన పామువలె, సింహము నోటినుండి విడువఁబడిన యేనుఁగువలె రాముని బారిబడి చావు దప్పి నానాముఖములుగా వచ్చు రాము బాణములు తన్నుఁ దాఁకు చున్నట్లు తలఁచి బెదరి నిట్టూర్పు విడుచుచు దివ్యమై విచిత్రమైన బంగారు పీఠముపైఁ గూర్చుండి తోడనున్న రాక్షసులతో దుఃఖించుచు తన మనస్సులో నున్నదిట్లు చెప్పెను.

మ. అకటా ! నా పరమాద్భుతంపుఁ దప మాహా ! వ్యర్థమై పోయెఁగా
వికటాయోధనసీమ వజ్రధరుఁ డౌ ♦ వృత్రారినిన్ గెల్చి నేఁ
డొకమర్త్యున్ గెలువంగలేక చెడితిన్♦యుద్ధక్షితిం, గాల మెం
తకు వచ్చెన్ మనుజాదనున్ మనుజుఁడే ♦ దర్పోద్ధతిన్ గెల్చెడిన్. ౧౩౩౩

అర్థములు. వికటాయోధనసీమన్ = భయంకరమైన యుద్ధభూమియందు, ఎంతకున్=ఎంత విపరీతస్థితికి, మనుజాదనున్=మనుష్యులఁ దినువానిని.

తా త్ప ర్య ము

అయ్యో ! యద్భుతముగా నేను జేసిన గొప్ప తపస్సంతయు నేఁడు వ్యర్థమై పోయెఁగదా! ఔరా! యేమి యీ చిత్రము! భయంకర యుద్ధమందుఁ వజ్రము ధరించినట్టియు వృత్రుని జంపినట్టియు నింద్రుని నేను జయించియు నేఁడొక మనుష్యుని గెలువలేక యుద్ధభూమియందుఁ జెడితిని. మనుష్యులఁ దినువారిని మనుష్యులు భుజబలగర్వముచే గెలుచుచున్నారు. ఎంతటి విపరీతకాలమువచ్చెనో చూచితిరా!

కం. మానవుడు భయంబు కలనన్, మానవుచే నీ కటంచు ♦ నాళీకభవుం
డానాఁడు పలికె ఘోరవుఁ, టానుడి ఫలియించె నేఁట ♦ కవితథ మగుచున్.

అర్థములు. కలనన్=యుద్ధమందు, నాళీకభవుఁడు = బ్రహ్మ, ఆనాఁడు= వరములిచ్చిననాఁడు, ఆ నుడి=ఆ మాట, అవితథము=వ్యర్థముకానిది.

## తాత్పర్యము

నాకు వరము లిచ్చునాఁడే బ్రహ్మదేవుఁడు నీకు మనుష్యులచే భయము కలదు అని చెప్పెను. ఆ మాట నేఁడు యథార్థమై ఫలించెను.

ఉ. దానవయక్షరాక్షసభుజంగవియచ్చరదేవతాళిచే
నే ననిఁ జావకుండ నళినీసుమసంభవుచే వరంబులన్
మానుగఁ గాంచినాఁడఁ దొలి మానవులన్ గణియింప నైతి దు
ర్మానముపేర్మి నిప్పు డది ప్రాణమునీఁదికిఁ దెచ్చెఁ గంటిరే. ౧౩౩౫

అర్థములు. అనిన్=యుద్ధమందు, నళినీసుమసంభవుచేన్=తామరయందుఁ బుట్టిన బ్రహ్మచే, తొలి=పూర్వము, దుర్మానము=దురహంకారము.

## తాత్పర్యము

దానవులయు యక్షులయు రాక్షసులయు సర్పములయు నాకాశ సంచారులయు దేవతలయు సమూహముచే యుద్ధమునందుఁ జావకుండ వరము బ్రహ్మదేవునిచేఁ బొందితిని. అప్పుడు దురహంకారముచే మనుష్యు లేమి చేయఁగల రని తలఁచి వారిపేరు చెప్పినవాఁడఁగాను. అది యిప్పుడు నాప్రాణమునకే యపాయము కలిగించునది యాయెను.

సీ. ఇక్ష్వాకుకులభవాధీశుం డయోధ్యలో, ననరణ్యుఁ డనియెడియవనివిభుఁడు
తొల్లి నాచే ననిఁ ద్రెళ్ళుచో ననుఁ జూచి, రాక్షసాధమ, నిన్ను రణమునందు
సుతులతో బలముతో హితులతో సచివవ,ర్గంబుతోఁ దురగసారథులతోడఁ
గులపాంసనా! చంపఁగలశూరుఁ డుదయించు,నస్మదన్వయమున నడిచిపడకు

తే. కుమతి! యంచును వచియించెఁ గువలయేశు
మాట నేఁటికి సూటి యై పాటి మీఱెఁ
దత్త్వ మిది యాట రాముని దశరథాత్మ
జాతు మానుషుఁగా నెంతు స్వాంతమందు. ౧౩౩౬

అర్థములు. అస్మదన్వయమునన్=నావంశమున, అడిచిపడకు=మిడిసిపడకు.

## తాత్పర్యము

కొందఱు నాకు హితము బోధించువారు రాముఁడు విష్ణువు నన్నుఁ జంపుటకై మనుష్యరూపమున వచ్చినాఁడనియు నతనితో సంధి చేసికొనుమనియుఁ జెప్పిరి. నా యభిప్రాయమది కాదు. ఏలన ఇక్ష్వాకువంశ రాజగు ననరణ్యుఁడను నయోధ్యానగర రాజును నేను యుద్ధములోఁ గొట్టితిని. అతఁడు నన్నుఁ జూచి యోరీ! నీచ రాక్షసుఁడా! కులపాంసనా! బుద్ధిలేనివాఁడా! నిన్ను యుద్ధమునందు కొడుకులతో సేనలతో మిత్రులతో మంత్రులతో గుఱ్ఱములతో సారథులతోఁ జంపఁగలవాఁడు నావంశమందుఁ బుట్టును. ఏల మిడిసి పడెదవు అని చెప్పెను. ఆ రాజుమాట నేఁటికి సరిదాఁకెను. ఇది వాస్తవ విషయము కావున రాముఁడు దశరథు కొడుకు మనుష్యుఁ డనియే నేను

దలంచెదను. దశరథుఁడు మనుష్యుఁడగు నేని యతని కొడుకు మనుష్యుఁడు గాక మఱియొకఁ డెట్లగును ?

ప్రాకృత మనుష్యులకు నప్రాకృతవిష్ణు వెట్లు పుట్టఁగలఁడు. ఇచ్చట భగవద్గీత యందలి యీశ్లోకములు స్మరింపఁదగినవి.

శ్లో॥ అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్
పరంభావ మజానంతో మమ భూతమహేశ్వర. అ. ౯-౧౧ శ్లో.

ద్వి. గీ. భూతనియామకమున సమర్థంబు, నాతతమా నా మహాభావ మెదను
దెలియంగఁ జాలని ధీ విరహితులు, వలనుగ మనుజ సంబంధ దేహమును
జేకొన్న న న్నుపేక్షింతురు పార్థ.

శ్లో॥ నమాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః
మాయయాపహృతజ్ఞానా, మాసురంభావ మాశ్రితాః అ.౭-౧౫ శ్లో.

ద్వి.గీ.ధరణి మూఢులు నరాధములునుమాయ,హరియింపఁబడినజ్ఞానాత్ములు,నసుర
భావాశ్రితులు నయి పరఁగు దుష్కృతులు, భావించి నాదుప్రపత్తినిగొనరు.

చ అవమతి నొంది మత్కృతిని ♦ నాఁకర మూని శపించె నన్ను వే
దవతి యనంగ నొప్పు నొక ♦ తన్వి తపస్విని పూర్వ మిట్లు, దా
నవ ! నిను నీ కులంబును వి♦నాశముఁ జేసెదఁ జూడుమంచు నా
యువిద విదేహనాథునకు ♦ నుద్భవ మయ్యెను సీతనా నిటుల్. ౧౩౭

అర్థములు. అవమతి=అవమానము,ఆఁకరము=కోపము.

తాత్పర్యము

నేను జేసిన పనికి నవమానపడి కోపించి వేదవతి యను నొక స్త్రీ తపశ్శాలిని రాక్షసుఁడా ! నిన్ను నీ కులమును నేను నాశము చేసెదనని శపించెను. ఆ వేదవతియే యిప్పుడు విదేహరాజునకు సీతయై పుట్టెను. ఆ వేదవతి ఋషికన్య. మనుష్యస్త్రీ కావున సీతయు మనుష్యస్త్రీయే. కావున సీతారాము లిరువురు మనుష్యజాతివారే. మనుష్యులు కనుకనే యొకరి నొకరు వివాహమాడిరిగాని రాముఁడు విష్ణువయినచో మనుష్యస్త్రీని వివాహమాడునా? సీత లక్ష్మి యైనచో మనుష్యుని వివాహమాడునా? కావున లక్ష్మీనారాయణులను వాదము నాకు సమ్మతముగాదు. అట్టి మహిమ వారేదియుఁ జూపలేదు. వారు చేసినవి యమానుషములు గావు. మనుష్యసాధ్యములే.

కం. గిరికన్యకయును రంభయు, వరుణునికన్యకయు నంది ♦ పలికిన యట్టుల్
జరుగఁ దొడంగెను రాక్షస, వరులారా! ఋషుల నుడు ల♦బద్ధము లగునే.

అర్థములు. గిరికన్యక = పార్వతి, నుడులు = మాటలు, అబద్ధములు = అసత్యములు.

రావణుఁడు కైలాసమెత్తినపుడు భయపడిన పార్వతి స్త్రీ యీతని చావునకుఁ గారణమగును గాక యని శపించె నని యీపద్యముచే గ్రహింపనగు.

రంభ — రంభా నిమిత్తమున నలకూబరుఁ డిచ్చిన శాప ముత్తరకాండమున ౫౯౬-౫౯౭ పద్యములందున్నది. నందికేశ్వరుఁడు రావణున కిచ్చిన శాప ముత్తర కాండమున ౩౪౬-౩౪౭ పద్యము లందున్నది.

వరుణుని కన్యక - ఈమె పుంజికస్థలయై యుండవలెను. ఈమె నిమిత్తమై బ్రహ్మ శపించె నని యీకాండమున ౪౯౬-౪౯౭ పద్యము లందున్నది. ఆమె కాదేని పార్వతీశాపము వలె నిదియు నీ వాక్యముచే సిద్ధము కావలెను.

## తాత్పర్యము

పార్వతియు రంభయు వరుణుని కూఁతురు నందీశ్వరుఁడు నన్ను గుఱించి చెప్పినట్లు జరుగ నారంభించెను. ఋషుల మాట లబద్ధములగునా ?

ఉ. శాపచయంబుచంద మిది • చక్కఁ నెఱుంగుచు నర్హయత్నులై
యాపుగ మూలకోత్తికము•లందును గోపురమూర్ధసీమలం
దేపున నిల్చి యుండుఁడ, యహీ•నగభీరుని దేవదైత్యద
ర్పాపహు బ్రహ్మశాపవివ•శాత్ముని లేపుఁడు కుంభకర్ణునిన్. ౧౩౩

అర్థములు. శాపచయంబు=నాకుఁగల శాపములవిధము, అర్హయత్నులై = చేయఁదగిన యత్నముగలవారై, ఆపుగ = వానరులు పైపడిరాకుండ యూరిలో వారికి రక్షకులుగ, మూలకోత్తికములందు=మూలలనుండెడి బురుజులందు, గోపుర మూర్ధసీమలన్=గోపురముల పై భాగములందును, (వచ్చు విరోధుల దూరమున నుండఁగానే చూచుటకు) అహీన గభీరుని = (౧) అహి+ఇన+గభీరుని=సర్పరాజగు నాదిశేషునివలె గాంభీర్యము గలవానిని, (౨) హీనముగాని గాంభీర్యము గల వానిని గంభీరశబ్దము భావప్రధాన నిర్దిష్టము, బ్రహ్మశాప వివశాత్ముని = బ్రహ్మశాపముచే దేహము తెలియని వానిని, లేపుఁడు=నిద్రలేపుఁడు.

## తాత్పర్యము

ఇది నాకుండు శాపముల విధము. ఇది మీరు తెలిసికొని విరోధుల సంహరించు విషయమై చేయఁదగిన ప్రయత్నములు చేయుఁడు. ఈ శాపములు నన్ను బాధించునుగాని మిమ్మెవ్వరిని బాధింపవు. కావున మీకు రాఁగల భయములేదు. మీ రజాగ్రత్తగా నుంటిరా చెడుదురు. కావున నా నిమిత్త మైనను గాకున్నను మీ నిమిత్తమైన మీరు జాగ్రత్తగా నుండుఁడు. మమ్మే నేమిచేయమనెదవందురా? మూలలందుండు బురుజులందుఁ గూడ గోపురములందును కావలసి నందఱు రక్షకులుండవలయును. మఱియొకటి, బ్రహ్మశాపముచే నిద్రపోవుచున్న కుంభకర్ణుని నిద్ర లేపవలెను.

## తాత్పర్యము

ఇది తిక్క తెలిసినది రోఁకలి తలకుఁజుట్టు మనునట్లున్నది. ఇన్ని శాపములు నా కున్నవి, నాతోడ మీ రేల చావవలెను, సంధి పడుద మను మాట విడిచి యుద్ధవిషయమే చెప్పెను. ఇంతకంటె మూర్ఖత్వ మెందుగలదు?

—♦ రావణుఁడు మంత్రులను గుంభకర్ణుని నిద్రలేప నియోగించుట ♦—

ఉ. చచ్చెఁ బ్రహస్తుఁ డుగ్రరణ ♦ శౌండుఁడు, నే నని నిర్జితుండ నై
వచ్చితి, నెవ్వ రింకఁ బగ ♦ వారిని మార్కొని యోర్చువార? లా
పోచ్చెములేని బంటసుర ♦ పుంగవుఁ డా ఘటకర్ణుఁ డొక్కఁడే
హెచ్చినశక్తి వైరి వధి ♦ యింపఁ గలం డని నిశ్చితాత్ముఁడై. ౧౩౮౦

అర్థములు. ఇప్పుడు కుంభకర్ణుని నిద్రలేపవలసినంత యేమిపని పడెనందురా? ఉగ్రరణశౌండుఁడు = భయంకర యుద్ధమున దక్షుఁడు, నిర్జితుండను = జయింపఁ బడినవాఁడను, పొచ్చెము=లోపము.

## తాత్పర్యము

భయంకర రణమునందు సమర్థుఁ డగు ప్రహస్తుఁడు చచ్చెను. నేను బరాజయమునొంది వచ్చితిని. పగవారి నెదిరించి జయముపొందఁగల వాఁడిఁక నెవ్వఁడున్నాఁడు. కావున లోపములేని శూరుఁడు కుంభకర్ణుఁడొక్కఁడే తన బలముచే వైరులఁ జంపగలవాఁడు అని నిశ్చయించుకొన్నవాఁడై.

సీ. ద్వారంబు లెల్ల య♦త్నంబునఁ గావుఁడు, ప్రాకారముల నెక్కి ♦ పగ ఱఁ గనుఁడు
ఈ లీల నే నుండఁ ♦ గాలోపహతమతి, హాయిగాఁ జింత లే ♦ కాద మఱచి
నిద్రించు చున్నాఁడు ♦ నిశిచరవర్యుండు, నేఁడు తొమ్మిదియాఱు ♦ నెనిమిదియును
మాసముల్ నిద్రించు ♦ మంతనం బుండి యింతకుఁ దొమ్మిదవనాఁడ ♦ తవిలె నిద్ర
తే. యిపుడు మేల్కొల్ప సుకరం బ♦హీనబలునిఁ, గుంభకర్ణుని రాక్షస♦కులవరేణ్యు
నతఁడు మేల్కొనెనేని యు♦హతము సేయు, రాజపుత్రాన్వితముఁ గీశ♦రాజి నిజము.

అర్థములు. పగఱన్ = శత్రువులను, ఈలీల = ఇట్టి కష్టదశయందు, కాలోపహతమతిన్ = కాలముచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁడై, హాయిగాన్ = సుఖముగా, ఆదమఱచి = నిన్నుఁ దా మఱచి, రాజపుత్రాన్వితము = రాజపుత్రు లగు రామలక్ష్మణులతోడి, కీశరాజిన్ = వానర సమూహమును.

## తాత్పర్యము

వానరులు లోపలికి రాకుండ గవనులన్నియు మిగులఁ బ్రయత్నముతోఁ గాపాడుఁడు. వారు దూరమం దుండఁగానే చూచుటకై ప్రాకారము లెక్కి పగవారిని జూచుచుండుఁడు. ఇట్టి కష్టదశయందు నే నుండఁ గాలవశమున హాయిగా దేహము మఱచి కుంభకర్ణుఁడు నిద్ర పోవుచున్నాఁడు. అతఁ డొకొక్కసారి ఆఱో యేడో యెనిమిదో తొమ్మిదో నెలలు నిద్రించును. వాఁడింతకు ముందు తొమ్మిదవనాఁడు నిద్రపోయెను. ఇఁకను గాఢనిద్రలో లేఁడు కావున నిప్పుడే

సుఖముగ నిద్ర లేపవచ్చును. వాఁడు మేలుకొనెనా రామలక్ష్మణులను వానరులను గూడఁ జంపఁగలఁడు.

ద్వారంబులెల్లన్=పురద్వారముకాక తక్కిన వాకిండ్ల నన్నిటిని. ౧౩౩౯ పద్యమునఁ బురద్వార రక్షణము చెప్పఁబడియున్నది కావ నిందుండు ద్వారశబ్దము తక్కిన ద్వారములను దెల్పును. ప్రాకారముల నిత్యాది=మన శత్రులైన వానరులు ప్రాకారములపై నెక్కకుండునట్లు మీరు ముందుగా జాగ్రత్తగాఁ బ్రాకారములపై నెక్కియుండుఁడు, నేను, ఈలీలన్ = ఈవిధముగా, ఇట్లు విచార సముద్రములో మునిఁగి దుఃఖించుచు, ఉండఁగా, నిశిచరవర్యుండు=కుంభకర్ణుఁడు, కాల+ఉపహత మతిన్=చెడుకాలముచేఁ జెఱుపఁబడిన మతితో, చింతలేక, ఆదమఱచి, హాయిగా నిద్రించుచున్నాఁడు. కుంభకర్ణుఁ డిట్లు నిద్రించుట యిపుడు మాత్రమేగాదు. ఎల్లప్పుడును నిట్లే యనుచున్నాఁడు. ఏకి త్యాది=ఒకప్పు డేడు మాసములు నిద్రించును. ఒకప్పుడుతొమ్మిది యొకప్పుడాఱు యొకప్పుడెనిమిది మాసములు-ఇట్లుగానిద్రించుచుండును. కుంభకర్ణుని నిద్రకు నిన్ని మాసములని యొకవ్యవస్థ లేదు. వానికెన్ని నెల లిష్టమో యన్ని నెలలు నిద్రించు చుండును. “ఆవలఁ గుంభకర్ణ నికటావనికిం జతురాస్యుఁ డేగి నీ భాగవతంబుఁ జెప్పుమన వాఁడును నిద్దురఁగోరెఁ బెక్కులేండ్లు” అనెడి యుత్తరకాండపద్యమును బట్టి చూచినను గుంభకర్ణుఁడు బ్రహ్మను గూర్చి వరప్రార్థన చేయునపుడు తనకు బహుకాలము నిద్ర కలుగునట్లు ప్రార్థించెఁగాని యింతకాల మని యొక వ్యవస్థగా నడుగలేదు గదా. కాఁబట్టి మాసవ్యవస్థలేకయే కుంభకర్ణుఁడు నిద్రించుచుండునని యిచ్చటఁ జెప్పినది యుక్తమే “అనివేఁడిన దయ గూడిన,మనమున ననెనీతఁ డాఱుమాసంబులు గూర్కను నొక్కపగలు మేల్కొని తినుగావుత మిన్నిపగిదిఁ దిరుగుచు జగతిన్”అని యీ కాండముననే యిఁకఁగొంత పైన రాముని గుఱించి విభీషణుఁడు చెప్పఁగలమాటలోఁ గుంభకర్ణుని నిద్ర యాఱు మాసములని యున్నను దీనికిని దానికిని విరోధము రాకుండునట్లు సమాధానము నెఱుంగుఁడు. అదెద్ది యనఁగా పైపద్యములో నాఱుమాసములు మాత్రమే చెప్పియున్నవిగాని మిగత మాసములు చెప్పలేదు. ఇందుఁదక్కినవిగూడఁజెప్పియున్నవి. కావ నచ్చటఁ జెప్పని యంశము నిచ్చటనుండి తీసికొని సరిపుచ్చుకొనునది. ఇటు చేసినచో నీ రెండు పద్యములకును విరోధము రాదు. లేదా యందలి యాఱుమాసము లన్నదానికి ఆఱు మాసములకుఁ దగ్గకయని యర్థము చెప్పినచో నే డెనిమిది మాసములు నిద్రించినను నాఱుమాసములకుఁ దగ్గక నిద్రించి నట్లే యగును గావ నిట్లైనను విరోధపరిహారము చేసికొనునది. లేదా పైన చెప్పఁగల విభీషణుని వాక్యములోని యాఱుమాసము లనుట యేసరి. దాని ననుసరించి విరోధ పరిహారము చేయవలెను. అదెట్లనఁగా ఆ యాఱు మాసములలోని యొక్కొక్క మాసమునకును ముప్పది దినము లని యచ్చట నభిప్రాయము. ఈ పద్యములోని

యేడు తొమ్మిది యాఱు నెనిమిదియును మాసము లని చెప్పఁబడిన మాసములలో నొక్కొక్క మాసమునకును నాఱుదినములని యభిప్రాయము. ఏడు తొమ్మిది యాఱు నెనిమిదిమాసములు కలిసి ముప్పదిమాసము లగునుగదా. ఆఱు దినములొకమాసము చొప్పున ముప్పదిమాసములకును నూటయెనుబది దినములైనవి. ఇన్ని దినములును, ముప్పదిదినములు గల మాసము లాఱగునుగదా. కాఁబట్టి యీ పద్యములోని కుంభకర్ణుని నిద్రాకాలమునకును పైని విభీషణుని వాక్యములోని కుంభకర్ణుని నిద్రాకాలమునకును విరోధపరిహార మగును. కృష్ణయజుర్వేద సంహిత యం దేడవకాండములో 'గవామయన' మని యొకయాగము వివరింపఁబడి యున్నది. ఈ యాగ మొక సంవత్సరము చేయఁదగినది. కాఁబట్టి దీనికి సత్రమని పేరు. దీనికి వలసిన సమస్తాంగములును నీ యాగప్రకరణమందే చెప్పియున్నవి. మఱొకచోటినుండి తెలిసికో నక్కఱలేదు. కాన నిది ప్రకృతి యాగ మనఁబడును. దీని తర్వాత 'ఉత్సర్గిణామయన' మ్మని మఱియొక సత్రయాగము చెప్పియున్నది. ఇదియు సాంవత్సర కాలికమే. రెండవ సత్రమునకు వలసిన సమస్తాంగములును నీ ప్రకరణమందుఁ జెప్పలేదు. కొన్ని "గవామయన" ప్రకరణమునుండి తెలిసికొని యిందుఁ జేయవలెను. కాన నీ రెండవసత్రము మొదటి సత్రమునకు వికృతి యనఁబడును. ప్రకృతిసత్రసంవత్సరమున నొక్కొక్క మాసమునను ముప్పది సోమయాగములు తప్పక చేయవలెను. ఒక్కొక్క దినమైన నూరకుండరాదు. వికృతి యాగమునను ప్రతిమాసమును ప్రతిదినము సోమయాగము చేయవలసినదే. కాని యిందుఁ బ్రతిమాసము నొక దిన ముత్సర్గము తప్పక చేయవలెనని విధించియున్నది. ప్రతిమాసమును నేనే దినమున సోమయాగోత్సర్గము చేయవలసినదని సందేహము రాఁగా నా కాండమునందే యేడవ ప్రపాఠకమున నాఱవపనసలో నాల్గు మాసవికల్పములనుఁ జెప్పి యం దొక్కొక్క మాసమునకుత్సర్గదినము చెప్పఁబడియున్నది. ఆ పనస నీ క్రిందివిధముగాఁ జూచుకొనుఁడు.

పనస, షడ్భిర్మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి షడ్భిర్హి మాసా న్సంపశ్యంతి ! అర్ధమాసై ర్మాసా న్సంపాద్యాహ రుత్సృజం త్యర్ధమాసైర్హి మాసా న్సం పశ్యంతి. అమావాస్యయా మాసా న్సంపాద్యాహ రుత్సృజం త్యమావాస్యయాహి మాసా న్సంపశ్యంతి, పౌర్ణమాస్యా మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి పౌర్ణమాస్యాహి మాసా న్సంపశ్యంతి" యీ రీతిగాఁ గలదు. ఈశ్రుతి కర్థము, షడ్భిః=ఆఱు దినములచే, మాసాన్ = నెలలను, సంపాద్య = సంపాదించుకొని, పూర్తిచేసికొని, అహః = ఆపై దినమును, ఏడవదినము, ఉత్సృజంతి = విడుచుచున్నారు. షడ్భిః+హి = ఆఱు దినములచేతనే గదా, మాసాన్ = నెలలను సంపశ్యంతి=తెలిసికొనుచున్నారు. వేదమార్గానుసారు లని శేషము, వేదమున, నాఱు దినము లొక మాసముగాఁ జెప్పుటచే దన్మార్గానుసారు లందఱు నాఱు

దినముల నొకమాసముగా నెన్నుదురు. కాబట్టి యాఱుదినము లొకమాసముగా నెంచి యం దాఱు సోమయాగములు చేసి యా పైది యగు నేడవ దినమున నుత్సర్గము చేయవలెను అని యొక పక్షము. అర్ధమాసైః=మాసములోని సగపాలు చేత, పదునైదుదినములచేత మాసాన్ సంపాద్య = ఒక్కొక్క మాసమును బూర్తిచేసికొని, అహః+ఉత్సృజంతి=ఆపైది యగు పదునాఱవ దినమును విడుచుచున్నారు. అర్ధమాసైః+హి=పదునైదు దినముల చేతనేకదా, మాసాన్ + సంపశ్యంతి = నెలలను దెలిసికొను చున్నారు. వేదమార్గానుసారు లని శేషము. వేదమునందు "పక్షా వైమాసా" యని పదునైదు దినములను నొక మాసముగాఁ జెప్పియున్నందునఁ దన్మార్గానుసారు లందఱును బదునైదు దినములను నొకమాసముగా నెన్నుదురు. కానఁ బదునైదు దినముల నొకమాసముగాఁ బెట్టికొని వానియందుఁ బదునైదు సోమయాగములుచేసి యాపైది యగు పదునాఱవ దినమున నుత్సర్గము చేయవలెను అని రెండవ పక్షము. అమావాస్యయా మాసాన్సంపాద్యాహరుత్సృజంతి=అమావాస్యతో మొదటిమాసము పూర్తి చేసికొని యాపైదినమగు శుక్లపక్షము పాడ్యమినాఁడు ఉత్సర్గము చేయుదురు. అమావాస్య యాహిమాసాన్ సంపశ్యంతి, చాంద్రమాన ప్రకారము అమావాస్య కమావాస్యకేగదా మాసపూర్తి యని తలంపఁబడును. చాంద్రమాన ప్రకారము నడచుకొనువారు అమావాస్య కమావాస్య యొక నెలయని యెంతురు. కాన నొక శుక్లపక్ష పాడ్యమి మొదలు పై యమావాస్యదాఁక ముప్పది సోమయాగములుచేసి యంతవఱకు నొక నెలను బూర్తిచేసికొని యాపై శుక్లపక్షమున పాడ్యమినాఁ డుత్సర్గము చేయవలెనని మూఁడవ పక్షము. పౌర్ణమాస్యామాసాన్సంపాద్యాహ రుత్సృజంతి పౌర్ణమాస్యాహి మాసాన్ సంపశ్యంతి, బార్హస్పత్యమాన ప్రకారము నడుచుకొనువారు పున్నమకుఁ బున్నమ యొక నెలగానెన్నుదురు కాన వారి మత ప్రకార మొక బహుళ ప్రతిపత్తి మొదలు పున్నమ వఱకు ముప్పది సోమయాగములుచేసి యాపైది యగు బహుళ ప్రతిపత్తునాఁ డుత్సర్గము చేయవలెనని నాల్గవ పక్షము. ఈనాల్గు పక్షములలోఁ జెప్పియున్న నాల్గు విధములైన మాసములును బ్రసిద్ధములే యని తెల్పుటకై యాయా వాక్యమునందును హి శబ్దము ప్రయోగింపఁబడినది. హి శబ్దము ప్రసిద్ధి వాచకము. కాఁబట్టి పౌర్ణమాస్యమావాస్యలవలెనే యర్ధమాస, షడ్దినములును మాసము లనియే ప్రసిద్ధములని యీశ్రుతి భావము. కాఁగా నాఱుదినములును నొక మాసమని యేర్పడినదికదా. ఇట్టి శ్రౌతమగు షడ్దినరూప మాసమును గలదని యెంచి విభీషణ వాక్యములోని యాఱుమాసములనే, "యేడు తొమ్మిది యాఱునెనిమిదియును మాసము" లని యిందుఁ జెప్పియున్నాఁడు. కాఁబట్టి వక్ష్యమాణ విభీషణ వాక్యమునకును దీనికిని విరోధము లేదు. కొందఱ శ్రుతిలోని "షడహైర్మాసా న్సంపాద్యాహ రుత్సృజంతి షడహైర్హిమాసా న్సంపశ్యంతి" యను భాగమునకు మఱొక

విధముగా నర్థము చెప్పుదురు. అదెట్లన - షడహైః - అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినములచేత, ముప్పది దినములచేత, మాసాన్ = నెలలను, సంపాద్య = పూర్తిచేసికొని, అహః-ఆపైది యగు ముప్పది యొకటవ దినమును-ఉత్సృజంతి= విడుచుచున్నారు. షడహైః+హి = అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినముల చేతనేగదా-మాసాన్ = నెలలను సంపశ్యంతి = తెలిసికొనుచున్నారు. సావన మానప్రకారము నడుచుకొనువారని శేషము, ముప్పది సూర్యోదయము లొక సావనమాస మనఁబడును. ఈక్రమప్రకారము ముప్పది దినములు ముప్పది సోమ యాగములు చేసి ముప్పదియొకటవ దిన ముత్సర్గము చేయవలెనని ప్రథమ పక్ష మని భావము. ఈ శ్రుతి కాఱు దినములు మాత్రమే యొకనెల యని యభిప్రాయ మైనచో సమాహారముచేసి షడహేనయనియే గదా చెప్పుట సరసము. అట్లు చెప్పక షడహైః యని బహువచనాంతముగాఁ జెప్పుటచే ననేకషడహము లని యర్థమగును గాన నవి యొక మాసమునకుఁ దగినట్లు ఐదింటిచేఁ బెంచఁబడిన షడహములుగాఁ జెప్పవలె నని వీరి యభిప్రాయము. వీరి మతమంత సరిగాదు. ఏలయనఁగా "షడహైః" యన్నప్పుడు బహువచన స్వారస్యమెంచినచో "అర్ధమాసైః" యన్నప్పుడును బహువచన స్వారస్యము చూడవలదా ? అందును దత్స్వారస్యము చూచినచో మూఁడుపక్షము లొకమాస మని యేర్పడును. అది యెవరికిని సమ్మతముకాదు. కాన నొకచో బహువచన స్వారస్య మంగీకరించుట మఱొకచో లేదనుట యిది యుక్తముకాదు. ప్రసిద్ధములుగా నున్న మాసములను బట్టియే యీ శ్రుతి కర్థము చేయవలెను. "పక్షా వై మాసాః" యను శ్రుతి ప్రసిద్ధినిబట్టి "యర్ధమాసైః" యన్నప్పుడు బహువచనస్వారస్యము వదలినట్లు 'షడహైః' యన్నప్పుడును మీరు చెప్పినట్టి బహువచన స్వారస్య మక్కఱలేదు. బహుదిన వాచకము గాన బహువచనాంతముగా నున్నదని చెప్పినంతనే చాలును, అర్ధమాసైర్హి, అమావాస్యయాహి, పౌర్ణమాస్యాహి యను స్థలములందుఁ బ్రసిద్ధిద్యోతక హిశబ్ద మున్నట్లు "షడహైర్హి" యను చోటను బ్రసిద్ధి ద్యోతక హిశబ్దముండుటచే షడహమాస మను పక్షమును బ్రసిద్ధమనియే యీ శ్రుతికి భావము. మఱియుఁ జూడుడు. "షడహై ర్మాసాన్ సంపాద్య యత్సప్తమ మహ స్తస్మి న్నుత్సృజేయుః" అని యుత్తరానువాకములోని వాక్యము వీరికి విరోధించును. అదెట్లనఁగా షడహైః+మాసాన్+సంపాద్య. ఆఱేసి దినములచే మాసములను బూర్తి చేసికొని, యత్+సప్తమం+అహః-ఆపైదియగు నేడవ దిన మేది కలదో,తస్మిన్=ఆ దినమున, ఉత్సృజేయుః-వదలుదురు. సోమ యాగము నని శేషము. ఆఱుదినము లొక మాసముగాఁ బెట్టుకొని యందాఱు సోమ యాగములు చేసి యాపైదియగు నేడవ దినమున సోమయాగము వదలవలెనని యీ శ్రుతిభావము. ఇందు ముప్పదియొక్కఁవ దిన ముత్సర్గము చేయవలెనని చెప్పక

యేడవ దినమునఁ జేయవలెనని ప్రత్యేకించి 'యత్స పమమహ' యని చెప్పుటచే మాసముగా నిన్నఁబడిన షడహములు అయిదింటిచేఁ బెంచఁబడిన యాఱుదినములు కావనియు, ఆఱే దినములనియు స్పష్టమగుచున్నది. ఇందలి మాస శబ్దమునకు మానైకదేశమని యర్థము చెప్పినచో స్వారస్యభంగమగును. కాన నాఱుదినములు మాసమనుటయే యీ యనువాకమున కభిప్రాయము. దీనితో నైకకంఠ్యము చేసినచోఁ బూర్వానువాకములోని షడహములు అయిదింటిచేఁ బెంచఁబడినవి కావనియు, ఆఱు దినములు మాత్రమే యనియు నిర్ధారణ మగును. కాన రెండవ యర్థము సరికాదు. మొదటియర్థమే సరియని యెఱుంగునది.

గాఢనిద్రలోనున్న యీతని నిపుడు మేలుకొల్పుట యసాధ్యమని యెంచకుఁడు. ఇతఁడిప్పుడే కొన్ని దినములకుఁ బూర్వము నిద్రింప నారంభించెను గాన గాఢనిద్ర నొందియుండఁడని యభిప్రాయముతోఁ జెప్పుచున్నాఁడు. మంత్రనంబుండి ఇత్యాది= మంత్రనంబుండి మాతోడ నాలోచనాసభలోనుండి. ఇంతపన్ = ఈదినమునకుముందు తొమ్మిదవనాఁడు, నిద్ర తవిలెను=నిద్రింప నారంభించెను. నిద్రారంభదినమున కీదినము తొమ్మిదవదినమని భావము. దీనివలన నేర్పడిన దినసంఖ్య యీక్రిందివిధముగా నెఱుఁగునది." ఈతఁడాఱు మాసంబులు కూర్కొను నొక్క పగలు మేల్కాంచి తినుఁగావుత" (యు.౬౦.౫౭) మని చెప్పియుండుటచేతఁ గుంభకర్ణుఁడు నిద్రలేచి యొక్క దినమే మేల్కాంచియుండునుగాన నాదినమే రావణాలోచన సభలోనుండి మరుసటి దినము మొదలు నిద్ర కారంభించెను, "రావణానుజుఁ డా వెంటనె వచ్చె" నని (యు.౩౧౬)యుండుటచేత నాలోచన నాఁడే విభీషణుఁడు రామునొద్దకు వచ్చెనని తోఁచును. "సుకీర్తి గ్రహించె దశాస్యభ్రాతనే" (యు.౩౧౯) యనియుండుటచేత రాముఁడును నతనిని వెంటనే గ్రహించినట్లు తోఁచుచున్నది. నాటి మొదలు మూఁడు దినములు సముద్రప్రార్థనకై రాముఁడు దర్భశయ్య బరుండి యుండెను. నాల్గవదినము మొదలెనిమిదవ దినము వఱకు నైదు దినములు సేతుబంధము. సేతువు కట్టిననాఁడే సాయంకాలము రామాదులు సువేలపర్వత మెక్కియుండిరి. నాఁటి రాత్రియే సుగ్రీవ రావణుల ద్వంద్వయుద్ధము. ఆ మఱుసటి దినము తుముల యుద్ధము. నాఁటి రాత్రియే రామలక్ష్మణులకు నాగపాశబంధ విమోచనములు, ధూమ్రాక్షవజ్రదంష్ట్రాకంపనుల వధము కూడ నా రాత్రియే. మరుసటి దినము ప్రహస్తవధ, రావణ మకుట భంగములు. నాఁడే రావణుఁడు కుంభకర్ణుని లేపుమనుట, కాఁగా నీ దినమునకుఁ బదవ దినమున విభీషణుఁడు బైలుదేరి పోయెను. కుంభకర్ణుని నిద్రారంభము తొమ్మిదవ దినము. ఈ రీతిగా దినసంఖ్య లెఱుంగునది యని కొంద ఱభిప్రాయపడిరి. అదంత బాగుగా నుండలేదు. రామాదులు సువేలారోహణము చేసిననాఁటి రాత్రి పూర్ణచంద్రోదయము వర్ణించుటచేత నాఁడు పున్నమయని తోఁచెడిని. రావణవధ మమావాస్య యనుట సర్వసమ్మతమే

కదా! కాన వీరి యభిప్రాయానుసారము విదియనాఁడు రావణుని మకుటభంగమై యుండవలెను. అట్లైనచో నీ బహుళ ద్వితీయ మొదలు అమావాస్య దాఁక నింత యాలస్యములో యుద్ధము జరుగుచుండుటకు హేతువు కానరాదు. కాన వీరుచెప్పిన దిన సంఖ్యను సేతుబంధమువఱకు నొప్పుకొని శేషించినది వారి వారి వధము కడన చెప్పిన దినసంఖ్యగానే చెప్పుట యుక్తము. అదెట్లనఁగా ఈ పద్యములో నింతకుఁ దొమ్మిదవ నాఁ డనుటకు యుద్ధారంభమునకుఁ దొమ్మిదవ నాఁ డని యర్థము. యుద్ధారంభము బహుళ ప్రతిపత్తు.తత్పూర్వము తొమ్మిదవ దినము శుద్ధ సప్తమి. ఈ సప్తమినాఁడే కుంభకర్ణ నిద్రారంభము. రాముని దర్భశయనారంభము కూడ నాఁడే. శుద్ధ షష్ఠినాఁడు విభీషణుని రాముఁడు స్వీకరించుట. శుద్ధ నవమి దాఁక దర్భశయ్య. దశమ్యాది చతుర్దశ్యంత మైదు దినములు సేతు బంధనము.పున్నమ సువేలారోహణము. బహుళ పాడ్యమి యుద్ధారంభ నాగపాశబంధ మోక్షములు. ద్వితీయనాఁడు ధూమ్రాక్షవధ. తృతీయ వజ్రదంష్ట్రవధము. చతుర్థి నకంపన వధము. పంచమిఁ బ్రహస్త వధ. షష్ఠి రావణ మకుటభంగము. ఆపై కుంభకర్ణ వధాదులు. అమావాస్య రావణవధ. ఇట్లు దిన సంఖ్య చేయుటయే యుక్తము. ఈ ప్రకార మింకను నీ యుద్ధ దిన వర్ణనము ఈ కాండములోని ౨౧౬.౨ వ పద్య వ్యాఖ్యానమున స్పష్టమగును. మఱి కొందఱు ముందు చెప్పిన దోషము లను బరిహరించుచు మొదట వారి మతమునే కొంత చక్కపఱిచి చెప్పు చున్నారు. అదెట్లనగా, సీతాహరణమునకుఁ బూర్వము పదమూడేండ్లు గడ చిన వనుట సర్వవిదితముకదా. పదునాల్గవ సంవత్సరారంభము సీతాపహరణ మనుట పంపాతీర వసంతర్తు వర్ణనచేత సుస్పష్టము.వాలి వధానంతరము వర్షాకాల వర్ణనమగుటచే వాలి వధ యాషాఢమాసమని తెలియవచ్చుచున్నది. ఆశ్వయుజ మున సీతను వెదకుటకై ప్రోత్సాహపఱచుటయు స్పష్టమే. ఆపై స్వయంప్రభా గుహాలో బహుకాలము గడచిపోయినదిగదా. 'కపితండము పూచిన తీఁగెలంగదుం బొలిచిన మాధవావనిజము ల్గని డాడె వసంత వేళయం. చలకు వహించినేలఁబడ'' (కి౧ ౨౨౯)నని చెప్పియుండుటంబట్టియాగుహాలోనుండి వెలువడుటఫాల్గునమాసము నని తెలియుచున్నది. లంకా ప్రవేశము నాఁటిరాత్రి "చంద్రుఁడు న్వెలసెను బూర్ణ శృంగుఁడయి (సుం.౧౯౯) యని చెప్పియుండుటచేతఁ త్రయోదశికిఁ బూర్వము చంద్రుడుపూర్ణశృంగుఁడై కన్పట్టఁడు కావునలంకాప్రవేశము ఫాల్గుణశుద్ధత్రయో దశిగా నుండవలెను. హనుమంతుఁడేరాత్రిలంకలో సీతను వెదకెనో యామఱునాఁడే లంకాదాహముచేసెననుట."రాత్రివేళను దుర్గకర్మంబు తెలఁగు. సాధ్యపడదయ్యె నెల్లనుజక్కఁజూడఁ, బగట నంతయుఁజూచు టవశ్యకార్యము" (సు.౧౧.౪౯) అని చెప్పుటంబట్టి స్పష్టమగుచున్నది. ఈపూట నిలిచి మఱుగున రేపటఁ బోరాదె" యని సీత ప్రశ్నించినను "అని యిట్టు లూరార్చి యవనిజఁగనుఁగొని, పయనింప

నాయ త్తపడుచు" ననియుండుటచేతహనుమంతుఁడులంకాదహనమునాఁడేయందుండి తిరిగి వచ్చెనని తోఁచుచున్నది. హనుమంతుఁడు తిరిగి వచ్చుటకై యరిష్ట పర్వతము నెక్కినపుడు కవి యప్పటి యాపర్వతమును "మార్తాండ కరబోధ్యమానోన్నమ ద్ధాతు నేత్ర సంజాతమై నెగడు దాని"నని వర్ణించెడి నెపమున సూర్యోదయమును చెప్పియుండుటచేతను, అనంతరము సూర్యాస్తమయము చెప్పమిని లంకాదాహము నాఁడే హనుమ సముద్రము దాఁటి మధ్యాహ్నమునకుఁ బూర్వమే యంగదాదు లతో మధువన విధ్వంసక పూర్వకముగా రామ సన్నిధానముఁ బ్రాపించెననుట తెలియనగును. నాఁడే మధ్యాహ్న కాలమున వానరసేన దండయాత్ర యనుట. "అగునిది మంచి మూర్తము ప్రయాణము సేయఁగఁ బర్మమిత్రుఁడున్, గగ నము మధ్యముం దఱిసెఁ గ్రాలు నిదే విజయావహంబునై, నెగడిననమ్మహూర్తము" (యు. ౪౭) అని యాప్రకరణమునందలి పద్యముచే స్పష్టమగుచున్నది. నాఁడు చతుర్దశియుఁ గొన్ని గడియలున్నది; పూర్ణిమాతిథి యని "ఉగ్రకిరణ తనయ యుత్తర ఫల్గుని నేఁడను (యు. ౫౦) పద్యముచేఁ దెలియుచున్నది. వానర బలంబు నూఱులు వేలును నూఱువేలును గోట్లు, కొలఁదిగా ధారణిఁ గలయఁ బర్వి రేయుఁ బగలును నడిచె" (యు. ౭౯) ననియు "నిలువక పోయి పోయి" (యు. ౮౦) యనియుఁ జెప్పుటఁబట్టి, యే దినమున నభిజిల్లగ్నమునందువానరసేన దండయాత్ర చేసెనో యా మఱునాఁడే సముద్రతీరము చేరెనని తెలియుచున్నది. మఱియు నేదినము లంకాదాహము జరిగెనో నాఁడే రావణుఁడు దానినిగూర్చి రాక్షస సభలోఁ గొంచెము సేపాలోచించి పిదప వెడలిపోయెనని "తావారినెల్ల వీడి నిజావాసముఁ జొచ్చెఁ బరిజనావళి తోడన్" (యు.౧౮౩) అను పద్యముచేఁ దెల్పి లంకాదాహదిన వృత్తాంత మంతటితో ముగించి 'విభీషణుండు చొచ్చె మఱునాఁటి వేకువ శుద్ధమతిని' (యు. ౧౮౬) నని యామఱునాఁటి వేకువ విభీషణుని ద్వితీయోపదేశమును దెల్పి యాపై రావణుఁడు కుంభకర్ణాదులతో నాలోచన సభకు వచ్చినపుడు విభీషణుఁడు మూఁడవతూరి హితోపదేశము చేసె నని చెప్పి "అని పరుషం బగు వాక్యము నని ఖలు రావణుని రావణానుజుఁ డా వెంటనె వచ్చె సలక్ష్మణుఁడౌ, జనకసుతానాథుఁ డున్న స్థలమున కంతన్" (యు. ౩౧౮) అని లంకాదాహదినమునకు మఱునాఁడే విభీషణుఁడు రాముని సన్నిధానమునకు వచ్చెనని చెప్పుట చేతఁ గూడ లంకాదాహ దినమున నే రాముఁడు యుద్ధమునకై బైలుదేరి యా మఱునాఁడే సముద్రతీరము చేరెననుట స్పష్టపడు చున్నది. "ఉగ్రకిరణతనయ యుత్తరఫల్గుని నేఁడ"ని ప్రయాణదినము పూర్ణిమాతిథి యనియు, నా మఱునాఁడు సముద్రతీరము చేరినపుడు "క్షణదాది ఘోరంబు కలిత ఫేనకదంబ హాసితంబు భృంగనృత్యాంచితంబు, జైవాతృకోదయ సంజృంభితంబును బ్రతికుపలయహిత వ్యాకులితము' నివర్ణించుటచే నాఁడును గొన్ని గడియలు పున్నమ

యున్నదనియుఁదోఁచు చున్నది. వానరసేన సముద్రతీరము చేరుటయు విభీషణుఁడు రామ సన్నిధానముఁ జేరుటయు నొక్క దినముననే జరిగిన దయ్యు నొకటి చెప్పిన పిదపనే మఱొకటి చెప్పనగును గానఁ గవి క్రమముగా నా సంగతులను జెప్పెనే గాని వేఱు విధముగాఁ దలఁపరాదు.

రాముని దర్భశయనము ఫాల్గున బహుళ ప్రతిపత్తునాఁ డారంభింపఁబడెను. నాఁడే కుంభకర్ణుని నిద్రారంభమును, తదియదాఁక దర్భశయనమే. చవితి మొదలు అష్టమివఱకు నైదు దినములు సేతుబంధము. అష్టమిరాత్రి సువేలారోహణము "సంధించెను బూర్ణ శీతకరదీప్త విభావరియున్ మనోజ్ఞమై"(యు.౭౦౭)యని సువేలారోహణము నాటిరాత్రి పూర్ణచంద్రుఁ డున్నట్లు చెప్పఁబడియున్నదే ? అష్టమి నాఁడు పూర్ణచంద్రుఁ డెక్కడిది యని యాక్షేపింపవలదు. పూర్ణ శీతకరునిచేత వలెనే దీప్తయని యర్థము చేసికొన్నచో నాఁటిరాత్రి పూర్ణచంద్రుఁ డుండనక్కఱ లేదుగదా. వానరసేనలో భేర్యాదు లున్నట్టు గొప్పగొప్ప దీపములుకలవు కాన నాఁటిరాత్రియా వెలుతురుచేఁ బూర్ణచంద్రుని చేతవలెఁ బ్రకాశించు చుండినది యని భావముగాన నే విరోధము లేదు. సువేలారోహణము చేసిన మఱునాఁడే అనఁగా నవమినాఁడు పగలు లంక ముట్టడి జరిగెను. "రాముఁడు ............ ................బుద్ధ్యాదులు గొల్వ గిరిని డేయి వసించె" (యు ౭౦౯) నని ప్రారంభించి "వేవిన యంత నవ్వీరులు లంకలో" (యు. ౭౧౧) నిత్యాది లంక ముట్టడి ప్రారంభింపఁబడి యున్నదిగదా. ఆపగలే తుములయుద్ధము నాఁటిరాత్రియే రామలక్ష్మణుల నాగపాశ బంధమోక్షాదులు. అదెట్లనఁగా, "రాక్షసులు, మేనుల రక్తముల్ గురియ మేకొనఁజాలక చివ్వకెప్పుడో కొక్కనిశవచ్చునంచుదమయుల్లములం దలపోయుచుండఁగా, భానుఁడు గ్రుంకెఁ గ్రోఁతులకుఁ బ్రాణవినాశిని రాత్రి ధ్వాంతసంతానము పర్వఁజేయుచును దారసిలెం గనుగానకుండఁగన్" అనియారంభించి "ఆ పెంజీకఁటి యుద్ధ వ్యాపారము జరుగఁగ" ననియు "వినంబడెన్ రవము లా రాత్రిన్ సమిద్ధారిణిన్" అనియు, "పాలిచెఁ గాళరాత్రి పోలిక నా రాత్రి యట్టి సమయమునను నసురవరులు, పింజుగట్టి నిశితకాండముల్ గురియుచు, రాముఁ దాఁకి రుగ్రరభసమునను" అనియు, "ఘోరంబగు నా యామిని. ఘోరతరంబయ్యె నపుడు గుండెలు పగులన్" అనియు "పీఁడు రేకయ్యుమున మ్మదసాధ్యుఁ" డనియు నా రాత్రినే యా యుద్ధప్రకరణమున నచ్చటచ్చటఁ దెల్పుచు వచ్చి "రావణ భావణంబు లిటు క్రూరనిశాటుఁడు వారిఁబల్కి జ్యా భీషణఘోషణం బరుల పెల్కుఱఁ జేయుచు శాత్రవస్మయ ప్రేషణ శోషణాహిశరబృందముఁ బైకయిఁ గ్రమ్మి దుష్టవిద్వేషణ భూషణాత్ములను వే శరబద్ధులఁ జేసె నీసునన్" ఇత్యాదిగా వారి శరబంధము చెప్పఁబడి యున్నదిగదా. కాఁబట్టి నాఁటిరాత్రియే నాగపాశ బంధమోక్షములు, రామలక్ష్మణులకు నాగపాశబంధమోక్షమైన వెంటనే యా

నిశీథమున ఏనుగు లుప్పొంగు చుండఁగా దానిని విని రావణుఁడోర్వ లేక మహాకోప ముతో ధూమ్రాక్ష వజ్రదంష్ట్రులను బంపెను. వీరు యుద్ధమునకు వచ్చునపుడు పగలని సూచించెడి గుఱుతులేవియు లేవు కావునను, వానర సంతోషము వెంటనే వీరువచ్చిరని చెప్పుటచేతను వీరి యుద్ధమా రాత్రియే జరిగినది. ఆరాత్రి శేషముననే వీరి వధము జరుగఁగా రెండవ దినమున ననఁగా దశమినాఁ డకంపనుని యుద్ధ వధములు జరిగెను. అకంపనుఁడు యుద్ధమునకు బయలుదేరునపుడు "దుర్దినముగాఁ దోఁచె సుదినమయ్యు" (యు. ౧౧౮౬) అని పగటి గుర్తు లుండుటచే నకంపన యుద్ధము పగలే యనుట స్పష్టము. నాటి పూర్వాహ్ణముననే రావణుఁడు నగరమంతయుఁజుట్టి సేనను బరీక్షించుట, అకంపన యుద్ధమైన వెంటనే నాఁటి మధ్యాహ్నమే ప్రహస్త యుద్ధము జరిగినది. ప్రహస్తుఁడు యుద్ధమునకు బోవునపుడు "గ్రహాళులెల్ల నంబర మునఁ బోరఁగా దోఁడఁగె"నని చెప్పఁబడి యున్నది. గ్రహాళులు రాత్రియందే కనఁబడునవి గాన దీనిం జూడ బ్రహస్త యుద్ధము రాత్రి యనియే తోఁచును గదా యని యాక్షేపింపవలదు. పగటిపూటఁ జూడ వీలుపడని యనేక సంగతులు పగలే జరిగినట్లు ఈయుద్ధ ప్రకరణములం దచ్చటచ్చటఁ జెప్పుట కలదు. "శశికి బ్రియంబు ప్రాజాపత్యమగు రోహిణిని నాక్రమించె నిందునిసుతుఁడు" అని రావణ యుద్ధ ప్రకరణమునఁ జెప్పబడి యున్నది. "సర్వరాత్రంబు కలను నలుప" నని రావణ యుద్ధ ప్రకరణమున నుండుటచే నా యుద్ధము రాత్రికదాయని యెంచవలదు. సర్వరాత్రం బను పాఠము తప్పనియు సప్తరాత్రమనియే సరియైన పాఠమనియు నచ్చట వివరిం చెదము. కావున రావణ యుద్ధము పగలే జరిగినది. ఈ రీతిగా ప్రహస్త యుద్ధమునఁ జెప్పిన గ్రహాళుల సంగతి మనకుఁ గనఁబడక పగలే యాకాశమున జరిగి యుండ వచ్చునుగదా! కావునదిపగటిపూటయనుటకు బాధకముకాదు. ప్రహస్తవధమైననాఁడే ఆ వెంటనే రావణ పరాజయము, కుంభకర్ణ ప్రబోధ యుద్ధములును జరిగినవి. వీని వెంటనే యానాఁడే యింద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రామాదుల బంధించుటయుఁ దద్విమోచనమును జరిగినవి. ఇందు రావణ పరాజయాది కుంభకర్ణవధాంతముకాల మిదియని నిర్ధారణగాఁ జెప్పలేదు గాని బ్రహ్మాస్త్రబంధము మాత్రము "అఱువది యేడు కోటుల వనాటులు భీమతరస్వులిట్టులు, కృతిదినపంచమాంశమున నబ్జజు ప్రీతికిఁ బాత్రుఁడైన యా, కటకు సురారిచేఁ దెగిరి" యని చెప్పఁబడి యున్నందున సాయంకాలము జరిగినదని తెలియుచున్నది. దినపంచమాంశమనఁగాఁ బగటి యైదవ భాగమగు సాయంకాలము. ప్రాతః, సంగవ, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయంకాలము లని పగ లైదుభాగములుగ భాగింపఁబడి యున్నది. "ప్రాతస్సంగవ మధ్యాహ్నాపరాహ్ణాస్సాయ మిత్యమీ! ఏకస్యాహ్నః పంచభాగా విహితాః కాల చింతకై" యని ప్రమాణవాక్యము. కాఁబట్టి ప్రహస్తవధము మధ్యాహ్నముకాఁగా నాపై రావణ పరాజయాది కుంభకర్ణ వధాంతము జరిగి నాటి సాయంకాలమున

బ్రహ్మాస్త్ర బంధమోక్షము లైనట్లు తోఁచుచున్నది. ఆ రెండవనాటి రాత్రియే బ్రహ్మాస్త్రమోచనమైననెంటనే మరల వానరులు లంకను ముట్టడివేసి లోనఁజొచ్చి లంకను దహించిరి. "రౌద్రంబైన నిశాముఖంబున రుషారంబుల్ ప్లవంగేంద్రులా! కద్రూసంభవులట్టులూర్పుచును నుల్కాహస్తులై లంక నత్యుగ్రాటోపము తోడఁ జొచ్చి" (౧౭౯౦ యు.) యని యాప్రకరణము నందలి పద్యము. ఆపైనా రాత్రియే కుంభనికుంభ యూపాక్ష శోణితాక్ష ప్రజంఘాకంపన మకరాక్షులు యుద్ధమునకై వచ్చి మడిసిరి. కాఁగా యుద్ధమారంభించిన రెండు దినములలో మూలబలము, ఇంద్రజిత్తు రావణుఁడు వీరు తప్ప తక్కిన వీరులందఱు హతులైరి.

మూఁడవ దినము. అనఁగా ఫాల్గున బహుళైకాదశి మొదలు ఇంద్రజిద్యుద్ధము జరిగినది. "మూఁడహోరాత్రముల్ వేఁడిమిమై పోరి చచ్చెఁగా నెల్లెల్లా శక్రజితుఁ"డను పద్యమును బట్టి యింద్రజిద్యుద్ధము ఏకాదశి ద్వాదశి త్రయోదశి యను మూఁడు దినములు జరిగినదని తెలియుచున్నది. కాఁగా నింద్రజిద్వధము వఱకు నైదుదినములు గడచినవి. ఆఱవ దినమున అనఁగాఁ జతుర్దశినాఁడు మూల బల వధము. నాఁటి సాయంకాలము మొదలు రేయింబవలు రావణ యుద్ధము జరిగి యేడవ దినమున రావణ వధ మాయెననియైనను జెప్పవచ్చును. లేదా, ఏడవదినము మొదలు రేయుం బవలు రావణ యుద్ధము జరిగి యెనిమిదవనాఁటి యుదయమున పుచ్ఛామావాస్యగడియలలో రావణవధమాయెననియైనను జెప్పవచ్చును. ఈ రెండు పక్షములందును నమావాస్య గడియలలోనే రావణవధమని యెఱుఁగునది. కాన రావణవధము అమావాస్యనాఁ డన్న లోకప్రవాదము కూడ నీరెండు పక్షములకును సరిగా నున్నది. "కృష్ణచతుర్దశి నిపుడు లేచి। యభ్యమిత్రుండ వగుచుఁ బ్రయాణ మన్న। హన మొనర్చి యమావాస్య యగుట రేప। బలఁగములతోడ ననికేగి గెలుపుఁ గొనుము" (యు. ౩౧౭౦) అను పద్యమును గూడ నీ రెండు పక్షములకును సరిపడుచుకొనవచ్చును. రావణసైన్యము రావణుఁడును వీరియుద్ధమేడు రాత్రులు జరిగినట్లే క్రింది విధముగా నేర్పడుటచే "నిలుపకయె సప్తరాత్రంబు కలను సలుప" నను పాఠము కూడ సరిపడు చున్నది. ఈప్రకారముగా దినసంఖ్య నేర్పఱుచు కొన్న యెడల "మంతనం బుండి యింతకుఁ దొమ్మిదవనాఁడ తవిలె నిద్ర" యను నీ పద్యభాగమును సరసముగా సమన్వయించు చున్నది. అదెట్లనఁగా, ఇంతకున్ = ఈదినమునకు, నాకిరీట భంగమైన దినమునకు పూర్వము, తొమ్మిదవనాఁడు+అ. ఈ దినము కాక దీనికి ముందు దినము మొదలుకొని ముందటి తొమ్మిదవ దినమునందే, మంతనంబుండి నిద్రతవిలెన్, పూర్ణిమాశేషము గల ఫాల్గున బహుళ ప్రతిపత్తిథియందు రామాదులు సముద్రతీరము చేరుటయు విభీషణ స్వీకారమును కుంభకర్ణ నిద్రారంభమును, దానికిఁ బదవదినమగు దశమినాఁడు రావణ మకుట భంగము కాఁగాఁ గుంభకర్ణుని నిద్రారంభదినము రావణమకుట

భంగదినమునకు ముందు దినమునుండి తొమ్మిదవదిన మనిభావము. "వినవే జానకి యింక రెండు నెలలే విశ్వాస పూర్వంబుగాఁగను నే వేచెద నంతరమే గదువు" (సుం. ౫౬-౮) అని రావణుఁడు సీతతోఁ జెప్పిన మాటను జూచినను "ఇఁక మాస యుగంబు చిక్కెఁదత్తావధియందుఁ జెల్లెడిఁజుమా దశమంబగు మాస మియ్యెడన్" (సుం.౮౪౯) అని హనుమంతుని గూర్చి సీతచెప్పిన మాటను జూచినను సీత లంకలో నున్న సంవత్సర కాలములో పదవమాసమే హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించి నట్లేర్పడు చున్నది. అది మాఘమాసమే గదా కావలెను. ఈ క్రిందఁ జెప్పిన దిన సంఖ్యయంతయు ఫాల్గున మాసములోని వని చెప్పియున్నాఁడే. ఈ రెండును బరస్ప రమును విరోధింపవాయని కొందఱాక్షేపింతురు. అదిసరిగాదు. "సారెకుఁజెప్పవయ్య కపిసత్తమ నేనిఁక నొక్కమాసమే, తీరువనై నఁ బ్రాణములు దేహమునం ధరియించు దాన నాపై రఘుచంద్రమా నిజము ప్రాణమునిల్వదు" (సుం.౯౮౬) అని సీత హను మంతునితోఁ జెప్పినమాటనుబట్టి చూడఁగా నాజరుగుచున్న యొకమాసమేలంకలో నున్నట్లేర్పడు చున్నది. ఇదియే నిజము. ముందటి సీతావాక్యమును రావణవాక్య మును రావణాభిప్రాయము ననుసరించినవి సీత యూరట చెందుటకై రావణుఁ డింకను రెండుమాసము లున్నట్లు సీతతోఁ జెప్పెను. ఈ రావణాభిప్రాయము ననుస రించియే సీత, రెండుమాసములు మిగిలి యున్నట్లు మొదట హనుమంతునితోఁ జెప్పినది. కాని ఆమెకు వాస్తవము తెలియును గాన నీ జరుగుచున్న మాసము అరణ్యవాసపు పదునాల్గు సంవత్సరములకుఁగడపటిమాసమని యెంచి యీజరుగు చున్న మాసము తప్ప నాపై బ్రదుకలేనని స్వాభిప్రాయముగా హనుమతోఁజెప్పి నది. కాన నది కడపటిదగు ఫాల్గునమాస మనుటయే యుక్తము అని మూఁడవ పక్షమువారి సిద్ధాంతము.

మేలొకల్ప సుకరంబు-మేలొకల్పుట సులభముగాఁ జేయఁదగినది. అతఁ డిత్యాది - కుంభకర్ణుఁడు నావలె శాపగ్రస్తుఁడు కాఁడుగదా యని భావము - కీశరాజిన్ = వానర సైన్యమును.

చ. అసురులనెల్ల మేటి పర•మార్థము భీకరసంగరస్థలిన్
గసిమసి చేయు శాత్రవుల•కాండములం బనిపూన నట్టిఁ డా
నసమబలుండు గ్రామ్యసుఖ•మందలి ప్రీతిని మూఢుఁడై మహా
లసగతి నుండు నెప్పుడుఁ,ద•లంపఁగ లేఁడు మదీయదుఃఖమున్. ౧౩౫.౨

అర్థములు. అసురులనెల్ల మేటి=రాక్షసులందెల్ల శ్రేష్ఠుఁడు, సప్తమ్యర్థమున ద్వితీయ, భీకర=భయంకరమైన,సంగరస్థలిన్=యుద్ధప్రదేశమందు, పరమార్థము= ఉత్తమ ప్రయోజనముగల వస్తువు, "ఆహవభూమిలోనఁ బరమార్థము పార్థుఁ"డని భారతము, ఉద్యో.(౨)ఇదివాస్తవము.ఇది యనఁగా అసురులందు మేటియగునది. .........గసిమసి చేయున్=చంపును. గసి యనఁగా నూనెలో నాముదములో

బడుగున నిల్చెడి వ్యర్థపదార్థము — ముటికి — మసి=బూడిద, పనిపూనన్ = అది తన పనిగాఁ బూనెనేని......మూఢుఁడై =దేహమే తెలియనివాఁడై, గ్రామ్యసుఖమందలి ప్రీతిని = పల్లెటూళ్ళవారికి సోమరితనముతోఁ గాలము గడుపుట, నిద్రపోవుటయందుఁ బ్రీతి యెక్కువ, ఇచ్చట గ్రామ్యసుఖ మనఁగా నిద్ర, మహాలసగతిన్ = పెద్ద సోమరివలె.

తాత్పర్యము

నా తమ్ముఁడు కుంభకర్ణుఁడు రాక్షసులందు శ్రేష్ఠుఁడు. ఇది యథార్థము. భయంకర యుద్ధములందు పూనెనేని శత్రువుల సమూహములను నాశము చేయును. అటువంటి యసమాన బలశాలి నిద్రాసక్తుఁడై దేహము తెలియక పెద్ద సోమరి వలె నెప్పుడు నుండును, గాని నా దుఃఖము తెలిసికొనలేఁడు. ఇఁక నాలోచించుట యెక్కడిది ?

కం. ఆతండు లేచినేనియు, సీతాధవువలన నాకు•సిద్ధించిన యీ
యాతతపరిభవమంతయు, వే తీర్పన్ సంతసముఁ•నెలయుదుఁ బిదపన్. ౧౬౪౩

అర్థములు. ఆతతపరిభవము=గొప్ప యవమానము.

తాత్పర్యము స్పష్టము.

తే. శక్రతుల్యబలుఁ డతి•సాహసాంకుఁ; డట్టివాఁ డనిలోన నా•కిట్టిపాటు
సంభవించియుఁ దోడ్పడఁ•జాలఁ డేని,యింక వాఁడుండియును నాకు•నేమిఫలము.

అర్థములు. నిద్రపోవువాని లేపరాదు గదా యందువేని, శక్రతుల్యబలుండు = ఇంద్రునితో సమానుఁడగు బలశాలి, అతిసాహసాంకుఁడు = మిగులఁ దెంపే యాభరణముగాఁ గలవాఁడు.

తాత్పర్యము

నిద్ర లేపరాదను నీతి ననుసరించితిమేని యిఁక వాఁ డాఱు నెలలకుఁ గాని నిద్ర లేవఁడు. అంతవఱకీ యుద్ధ మటులే జరుగుచుండునా? ఇంద్రునివంటి బలశాలి మహాసాహసి, అటువంటివాఁడు నాకు యుద్ధమం దిటువంటి కష్టమువచ్చిన పిమ్మటఁ గూడఁ దోడుపడ గాఁడేని వాఁడుండి నాకేమి లాభము ? ఉండియు లేనివాఁడే కదా.

సీ. వాని లేపుఁడటన్నఁ•బరమసంభ్రాంతులై, యసుకలు గంధమా•ల్యములుభక్ష్య
వర్గముల్ గొనిమహా•ద్వారమై యెటుచూడ, యోజనాయతమయి•యుండుకుంభ
కర్ణునిగుహా సర్వ • గంధప్రవాహినిఁ,జొచ్చుచో నాతని • హెచ్చుటూర్పు
గాలిచే నబ్బల • శాలులు గాలికి, వగుడాకులట్టులై • యెగిరిపోవ

తే. వెండియును వారలెంతెంతొ•కండికష్టమున నిల్ద్రొక్కికొని పాద•ములనులోనఁ
జొచ్చి కాంచనకుట్టిమ•సుందరంపు, గుహను నిద్రించువానిని•గుంభకర్ణు. ౧౬౪౪

అర్థములు. పరమ సంభ్రాంతులై = మిగుల వేగిరపాటు గలవారై మహాద్వారమై=పెద్ద వాకిలి కలిగి, యోజనాయతమయి=యోజనముపొడవుగలిగి,

సర్వగంధప్రవాహిని = సమస్త పరిమళ ద్రవ్యములు విశేషముగఁ గలదానిని, వగుడాకులు=మిక్కిలి యెండిన యాకులు, సల్లద్రొక్కికొని = నిలుచునట్లు కాళ్ళు గట్టిగ నొత్తిపెట్టుచు, కాంచనకుట్టిమ=బంగారు నేలకట్టులచే (అ) బంగారు నీరు పూఁతపూసిన నేలచే, సుందరపుగుహాయందు=అందమైగుహవలెనుండుదానియందు,

### తాత్పర్యము

వాని నిద్దుర లేపుఁడని చెప్పఁగా మిగుల వేగిరపాటు గలవారై రాక్షసులు వాఁడు నిద్దుర లేచి పూసికొనుటకుఁగాను గంధము, ధరించుటకు పూలదండలు తినుటకు భక్ష్యములు అన్నము తీసికొని పెద్ద వాకిలిగలదై యేప్రక్క చూచిన నొక యోజనము నిడివి గలిగి సమస్త పరిమళవస్తువులు విస్తారముగఁ గల కుంభకర్ణుఁడు నిద్రించు గుహలోనికిఁ బోవునపుడు వాని యూర్పు గాలి విస్తారముగ వచ్చుటచే నా రాక్షసులు బలవంతులయ్యు నోరుగాలికి వగుడాకులవలె నెగిరిపోవసాగి మరల నెంతో కష్టముపై నిబ్బరించుకొని కాళ్ళు నేల నూఁదిపెట్టుచు ప్రవేశించి బంగారు నేలకట్టుచే నందమైన గుహయందు నిద్రించు కుంభకర్ణుని.

సీ. భీమదర్శను నేల • విఱిగి యొఱఁగుగిరి, భంగిని బాన్పుపైఁ • బడినవాని
విసదారి యనఁ బెద • బుసలు కొట్టుచువాని, వికటంపు నిలువెంద్రుకలవాని
భయదనాసాపుటుఁ • బాతాళవిపులాస్యుఁ, గాంచనాంగదబద్ధ • కాయు బలియు
మకుటమండితమూర్ధు • మహితమేదోరక్త, గంధు నరిందముఁ • గాంచి దాసి

తే. మేరుపర్వతసన్నిభా • మిషచయంబు, మహిషమృగసూకరములసం • హతులునద్భు
తంపుటన్నంపుఁబ్రోవు • మద్యములు పెక్కు, రకములును నెత్తుటికుండలు • ప్రక్కనుంచి.

అర్థములు. భీమదర్శను=చూచుటకు భయంకరుఁడగువానిని, విసదారి= పాము, భయదనాసాపుట = భయంకరములైన ముక్కు రంధ్రములు గలవానిని, పాతాళ విపులాస్యున్ = పాతాళమువలె వెడలుపగు ముఖము గలవానిని, కాంచనాంగదబద్ధకాయున్=బంగారు భుజకీర్తులచేఁ గట్టఁబడిన దేహము గలవానిని, బలియున్ = బలవంతుని, మకుట = కిరీటముచే, మండిత = అలంకరింపఁబడిన, మూర్ధున్=శిరస్సుగలవానిని, మహితమేదోరక్తగంధున్=విశేషముగ మాంసము రక్తము వాసనగలవానిని, అరిందము = శత్రువుల నణఁచువానిని, మేరుపర్వత సన్నిభ = మేరుపర్వతముతో సమానమైన. ఆమిషచయంబు = మాంససమూహము, మహిష=దున్నపోతులయు, మృగ=పశువులయు, సూకర = పందులయు, సంహతులు=సమూహములు, మద్యములు=సారాయములు.

### తాత్పర్యము

నిద్దురపోవుచున్నప్పుడును జూచుటకు భయంకరుఁడైనవానిని, కొండ విఱిగి నేలపై నొఱగి పడినట్లు పానుపుమీఁద బండుకొనినవానిని, పామువలెఁ బెద్ద బుసలు కొట్టుచున్నవానిని, భయంకరముగా నిలబడి యుండు వెండ్రుకల వానిని,

భయంకరములైన ముక్కుబొక్కలు గలవానిని, పాతాళమువలె వెడలుపైన ముఖము గలవానిని, బంగారు భుజకీర్తులు కట్టఁబడిన దేహము గలవానిని, బలవంతుని, కిరీటముచే నలంకరింపఁ బడిన తలగలవానిని, విశేషముగ మాంసము రక్తము యొక్క వాసనగల వానిని, శత్రువుల నణచు వానిని, చూచి సమీపించి, వాఁడు నిద్రలేవఁగానే తినుటకు మేరుపర్వతముతో సమానమైన మాంసరాశిని, దున్నపోతులు, మృగములు, పందులు వీని మాంసముల సమూహమును, ఆశ్చర్యకరమైన యన్నపురాశిని అనేక విధములైన సారాయములు నెత్తురు కడవలు ప్రక్కనుంచి

—♦ రాక్షసులు కుంభకర్ణుని నిద్రలేపుట ♦—

కం. అలఁదిరి యుత్తమగంధము, లలిమాల్యంబులును బరిమ♦ళపువస్తువులున్
నిలిపిరి మేనన్ ధూపం, బులవైచిరి స్తోత్రములను♦ బొగడిరి యసురుల్. ౧౩౮౭

## తాత్పర్యము

ఇట్లు నిద్దుర లేవగానే తినుటకుఁ ద్రాగుటకు కావలసినవి సిద్ధముగా నుంచి నిద్దుర లేపఁ బ్రారంభించిరి. రాక్షసులు మంచి గంధము పూసిరి. పూలదండలు వాసన ద్రవ్యములు దేహమునందుంచిరి. పొగలు వైచిరి. స్తోత్రములఁ బొగడిరి.

స్రగ్ధర. పూరింతుర్ చంద్రతుల్యం♦బులు బహుళదరం♦బుల్ దిశల్ వ్రీలిపోవన్
ఘోరధ్వానంబు లోలిన్ ♦ గుమికొని యసురుల్ ♦ గొల్పి రవ్వార లేకా
కారంబై కుత్తుకల్ వ్ర♦క్కలుగఁ జన నిరా♦ఘాటబాహావిరావం
బారూఢం బయ్యె క్ష్వేళా♦యతరవములు పెన్♦పోవడిం గూర్చె లంకన్.

అర్థములు. చంద్రతుల్యంబులు = చంద్రునివలెఁ దెల్లనైనవి దరంబుల్ = శంఖములు; గుమికొని = గుంపుగూడి, ఏకాకారంబై = ఒక్క విధముగ, వ్రక్కలుగఁ జనన్ = పగిలిపోఁగా, నిరాఘాట బాహావిరావంబు = అడ్డములేక వాయించు చేతుల చప్పుళ్ళు ఆరూఢంబయ్యెన్ = అతిశయించెను, క్ష్వేళాయతరవములు = సింహనాదముల విస్తారధ్వనులు, పోవడిన్ = ఆపదను.

## తాత్పర్యము

దిక్కులు పగిలిపోవునట్లు చంద్రునివలెఁ దెల్లనైన యనేక శంఖములను బూరించిరి. రాక్షసులు గుంపుగూడి భయంకరముగ అందఱు నొక్క విధముగ గొంతులు పగిలిపోవునట్లు ధ్వనులు చేసిరి. అడ్డము లేక చేతులు చప్పుళ్ళు గొట్టిరి. సింహనాదములు చేసిరి. ఈ ధ్వనులు లంకలో నుండువారికి మిగుల నుపద్రవము గలిగించెను.

స్రగ్ధర - మరభనయయయ = ఎనిమిదింట నెనిమిదింట యతులు.

సీ. పణవభేరీశంఖ ♦ పటునినాదంబులు, క్ష్వేళితాస్ఫోటిత ♦ సింహనాద
ములు బహుళములైన♦మున్గి సాధ్వసమునఁ, బక్షులు దెసలందుఁ♦బఱచిపఱచి

దివికిని నెగఁబ్రాఁకి ♦ దిగ్భ్రమ గొని గఱుల్, తడఁబడ సుడివడి ♦ తత్తఱమున
నేలపై వ్రాలె నా ♦ నిశిచరుల్ వేసరి; విసివి గాసిని బడి ♦ యసము దూలి
తే. రంతెగా కసురేంద్రుఁడొ♦కింత యైన, మేలుకొనకున్న వెండియు♦జాలిమాలి
ముద్గరగదాద్రిభూరుహా♦ముసలతతులఁ, జేకొలందిని మోఁదిరి♦డాకమెఱసి.

అర్థములు. పణవ = ఉడుకలయు, భేరీ = నగారాలయు, శంఖ = శంఖములయు, పటునినాదంబులు=దృఢమైన చప్పుడులు, క్ష్వేళితాస్ఫోటిత సింహనాదములు=గొప్ప సింహనాదములు, చెవులలో చేసిరి, కొట్టిరి-సాధ్వసమున=భయమున, గఱుల్=రెక్కలు. అసము దూలిరి = గర్వహీనులైరి, జాలిమాలి = జాలిలేక, మోఁదిరి—కొట్టిరి.

తాత్పర్యము

ఉడుకలు, నగారాలు, శంఖములు ప్రమోగించిరి. పెడబొబ్బలు పెట్టిరి. తట్టిరి. సింహనాదములు చేసిరి. ఈ ధ్వనులకు పక్షులు భయమున ముసిఁగి దిక్కుల వెంట బరువెత్తి పరువెత్తి యాకాశమున కెగరి, దిగ్భ్రమగొని రెక్కలు తడఁబడ, సుడివడి తత్తఱపాటున నేలపైఁబడెను. ఆ రాక్షసులు శ్రమపడి బడలి గర్వము విడిచిరి. అంతియకాని కుంభకర్ణుఁడు కొంచెమైన మేలుకొన్నవాఁడుకాఁడు. ప్రక్క పొరలిన వాఁడు కాఁడు. దానికి వారు దయవదలి ముద్గరములతోను, గదలతోను, కొండలతోను, చెట్లతోను, చేతుల కొలఁది వారి బలము కొలఁది కొట్టిరి.

తే. అధిక బలవంతు లయ్యును ♦ య్యసురవరులు, రావణానుజనాసికా ♦ రంధ్రజాత
మారుతోద్ధతి నిలువంగ♦నేరరైరి, మహితవాతూలహతిఁదూలు♦ మబ్బులనఁగ.

అర్థములు. రావణానుజ=రావణు తమ్ముని, నాసికారంధ్రజాత = ముక్కు బొక్కలందుఁ బుట్టిన, మారుతోద్ధతిన్=గాలిదెబ్బచేత. మహిత వాతూలహతి= పెద్దసుడిగాలిదెబ్బకు, తూలు=కొట్టుకొనిపోవు.

తాత్పర్యము

ఆ రాక్షసులందఱు మిగుల బలవంతులే యైనను కుంభకర్ణుని ముక్కులలో నుండి వచ్చు గాలిదెబ్బచే పెద్దసుడిగాలి దెబ్బకు మేఘములవలె కొట్టుకొనిపోయిరి.

ఉ. భీమబలాఢ్యు లొక్కపది♦వేల నిశాచరు లోలి నందఱున్
స్తోమముఁ జేరి యొక్కపరి ♦ తూర్యమృదంగఘటాలినాద ము
ద్దామముగాఁగఁ జేసియును ♦ దానవవీరుఁ డొకింతయేనియున్
దా మెయి తెల్వి గానమిని♦దారుణయత్నముఁ జేయ బూనుచున్. ౧౦౩౪౧

తాత్పర్యము

భయంకర బలసంపత్తిగల పదివేల రాక్షసులు గుంపుగా నొక్కచోటఁ జేరి యొక్కసారిగా వాద్యములు మద్దెలలు కుండలు వీని యొక్క ధ్వని యధికముగఁ జేసియును రాక్షసుఁడు కొంచెమైన తెలివివచ్చినవాఁడు కాకుండుటచే ఘోర ప్రయత్నము చేయఁబూని.

ఉ. దండ కశాంకుశంబులను ♦ దద్దయుఁ గొట్టుచు నుష్ట్రివాజి వే
దండఖరాదిజంతువుల ♦ దానవవీరుని ద్రొక్కఁ జేసియున్
దండిగ నల్లజంతులరొ♦దల్ పరఁగింపఁగఁ జేసి తారునున్
మెండుగ శంఖభేరుల న♦మేయముగా ధ్వనిచేసి రెండియున్. ౧౩౫౨

అర్థములు. దండ = కట్టెలతోను, కశ = కొఱడాలతోను, అంకుశంబులను = అంకుశంబులతోను, ఉష్ట్రి = ఒంటెలచేత, వాజి = గుఱ్ఱములచేత, వేదండ = ఏనుఁగులచేత, ఖర = గాడిదలచేత, ఆదిజంతువుల = ఈ మొదలయిన జంతువులచే,

తాత్పర్యము

కట్టెలచేత, కొఱడాల చేత, అంకుశంబులచేతను విశేషముగఁ గొట్టిరి. ఒంటెల చేత, గుఱ్ఱములచేత, ఏనుఁగులచేత, కంచరగాడిదలచేత, మన్నులు లోనగు నితర జంతువులు చేతఁ ద్రొక్కించిరి. ఆ జంతువు లన్నియుఁ నఱవఁ జేసిరి. తాముగూడ, శంఖధ్వనులు భేరీధ్వనులు విశేషముగాఁ జేసిరి. మఱియును.

కం. సుత్తెల దూలంబుల పెనుఁగత్తుల గునపముల గుదెల ♦ ఖండపరశులన్
హత్తినశస్త్రులకొలఁదివి, మొత్తిరి లేకెదను దయయు♦ మోమోటంబున్. ౧౩౫౩

అర్థములు. గునపములున్ = గడ్డపాఱల చేతను, ఖండపరశులన్ = గండ్ర గొడ్డండ్ల చేతను.

తాత్పర్యము స్పష్టము.

కం. గింగురు మని వీనులు లంకం గల యసురులకు శైల ♦ కాననయుత మె
ల్లం గలయఁగఁ దన్నాదము, భంగగతిం బూర్ణమగుచు♦వ్యాపింపంగన్. ౧౩౫౪

అర్థములు. గింగురుమని = చెవులలో గీఁయ్యని ధ్వనిపుట్టునట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. అంతకును లేవ కున్నను, బొంతన వెయిభేరు లొక్క ♦ పూఁపున రక్ష
స్సంతతి పసిండికోడుపుల, నెంతయు మ్రోయింపఁ గదలఁ ♦ డించుక యేనిన్.

అర్థములు. ఒక్కపూఁపున = ఒక్క ప్రయత్నముతో, కోడుపులన్ = నగారాలు వాయించు కట్టెలచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. శాపవశంబునం బరవ ♦ శత్వమునం బడియున్న రాక్షసుం
గోపవశాత్ములై మఱియు♦కొండుపరాక్రమ ముద్యమించి భే
రీపటలంబు నూతనము ♦ క్రేవలఁ గొట్టుచుఁ గేశసంఘముల్
మోపుగఁ బీఁకుచుం జెవులు ♦ మోఱకులై క్షతజంబు గాఱఁగన్. ౧౩౫౬

అర్థములు. ఉద్యమించి = ప్రయత్నించి, కేశసంఘముల్ = తలవెండ్రుకల గుంపులను, మోఱకులై, మూర్ఖులై మొరటులై, క్షతజంబు = నెత్తురు.

తాత్పర్యము

బ్రహ్మశాపముచే దేహము తెలియక పడియున్న రాక్షసుని కోపవశులై మఱియొక పరాక్రమము చూప యత్నించి క్రొత్తగారాల సమూహము వాని చెవుల యొద్దనే కొట్టుచు వెంట్రుకలు గుంపుగఁ బట్టి పీఁకుచు నెత్తురు కాఱునట్లు చెవులను.

కం. కొఱకుచుఁ గరనఖరంబులఁ, బెఱుకుచు నుదకుంభములను ♦ పీనులలోనన్
నెఱపుచుఁ దలయును ఱొమ్మును, జఱచుచు ముద్గరము లెత్తి ♦ సంబాధింపన్.

అర్థములు. కరనఖరంబులన్ = చేతి గోళ్ళచే - ఉదకుంభములను = నీటి కుండలను

తాత్పర్యము

కొఱుకుచు చేతి గోళ్ళఁ బెఱుకుచు కడవలతో నీళ్లు చెవులలోఁ బోయుచు ముద్గరములతోఁ దలమీఁద ఱొమ్మమీఁదఁ గొట్టుచు బాధింపఁగా.

చ. కదలక యున్న రజ్జుచయ ♦ గాఢనిబద్ధశతఘ్ని కావలిన్
మదమున నెల్ల రొకట మొగి ♦ మర్దనముం బచరించుచున్ మఱిన్
మదకరులొక్కవేయి యొక ♦ మాఱుగఁ బాఱఁగ మీఁదఁ దోలఁగా
నెదొ తనుసోఁకినట్లయిన ♦ నించుక కన్నులు విచ్చె నంతలోన్. ౧౩౫౪

అర్థములు. రజ్జుచయ = త్రాళ్ళసమూహముచే, గాఢనిబద్ధ = దృఢముగాఁ గట్టఁబడిన, శతఘ్నికావలిన్ = శతఘ్నుల వరుసలచే.

తాత్పర్యము

ఇంత చేసినను గదలక యుండుటచే త్రాళ్ళచే గట్టిగాఁ గట్టఁబడిన శతఘ్నుల గుంపులచే అందఱొక్కసారిగ గొట్టుచు మదించిన వేయి యేనుగు లొక్కసారిగా మీఁదఁ దోలఁగా నేదో దోమ దేహమునకుఁ దగిలినట్లు కాఁగాఁ గొంచెము కన్నులు విచ్చెను.

—♦ కుంభకర్ణుఁడు నిద్ర లేచుట ♦—

చ. ధరకుజవారపాతములు ♦ దారుణశస్త్రచయప్రహారముల్
సురరిపుఁ డేమియుం దలఁప ♦ జూడఁడు, నిద్దుర లేచినంతనే
దరికొను నాఁకటన్ వెఱచి ♦ దానవవీరుఁడు మేను విదుర్చుచున్
సరగున లేచి నాగతను ♦ శైలనిభం బగు బాహుయుగ్మమున్. ౧౩౫౫

అర్థములు. ధరకుజవారపాతముల్ = తన మీఁదఁ గొండలు చెట్లు గుంపుగఁ బడుటను, దారుణ శస్త్రచయప్రహారముల్ = తీక్ష్ణములైన శస్త్రముల దెబ్బలుగాని. దరికొను = మండుచున్న, మేన్ = దేహమును, సరగున = శీఘ్రముగ, నాగతను = పాముల దేహముతోను, శైల = పర్వతముతోను, నిభంబు = సమానము.

తా త్ప ర్య ము

కన్నులు దెఱచినను నిద్దురమత్తు విడువకుండుటచే రాక్షసులు కొండలు చెట్లు మీఁద వేసిరి, తీక్ష్ణ శస్త్రములతోఁ గొట్టిరి గాని యిది యేమో వానికిఁ దెలియ లేదు. ఆ విషయమై యాలోచించిన వాఁడును గాఁడు. ఇట్లు నిద్దుర లేచి మండు చున్న యాఁకలిచే భయపడి కుంభకర్ణుఁడు దేహము విదురించుచు శీఘ్రముగ లేచి పొడవున పాము దేహముతోను కఠినత్వమున పర్వతమును బోలిన చేతులు రెండు.

కం. జాడించి సిల్లి నెండియు, బాడబముఖతుల్యమైన♦వక్త్రముఁ దెఱవన్
జాడఁగఁ బాతాళమునకు, నీడగు వది మేరుగతది♦నేశ్వరుఁ బోలెన్. ౧౩౬౦

అర్థములు. బాడబముఖతుల్యము = బడబానల ముఖముతో సమాన మైన, వక్త్రము=నోరు, మేరుగతదినేశ్వరున్ = మేరుపర్వతమందున్న సూర్యుని.

తా త్ప ర్య ము

జాడించి యొడలు విఱిచి బడబానలముతో సమానమైన నోరు తెఱవఁగా నది పాతాళము వలెను మేరుపర్వతమందలి సూర్యుని బోలెను, సూర్యుఁడు మేరువును ప్రదక్షిణించునే కాని శిఖరమునకు రాఁడు కావున నిచ్చట మేరుశబ్దము సావర్ణిమేరు పర్వతమని తెలియవలెను, ఇందు కుంభకర్ణుని వక్త్రము మేరుశిఖర గత సూర్యుఁడు.

ఆ. ఆవులించి లేచు♦నాతనియాకృతి, కొంగచాలుతోడ♦ రంరు మీఱు
వానగురియు మబ్బు♦వమువున రహి మీఱెఁ, గలయఁజూచె నాల్గు♦కడల నతఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. జ్వలదగ్నికి సదృశము చం, చలలకుఁ దుల్యంబునై న♦చక్షుర్ద్వయమున్
బలముగ మండుమహాగ్రహ, ములతోఁ బురిడించె నంత♦నునుకొను క్షుధచేన్.

అర్థములు. జ్వలత్+అగ్నికి=మండుచున్న అగ్నికి, సదృశము = సమా నము, చంచలలకుఁ దుల్యంబు = మెఱుపులకు సమానము, చక్షుర్ద్వయమున్ = రెండుకన్నులు, పురుడించెన్ = పోలెను, క్షుధచేన్ = ఆకలిచేత.

తా త్ప ర్య ము

మండుచున్న యగ్నికి మెఱుపునకు సమానమైన యతని రెండుకన్నులు బలముగల మహాగ్రహముల వలె నుండెను. అంతట వాఁ డాఁకలిచే.

ఉ. అచ్చట నున్న భక్ష్యవివి♦ధామిషకాసరసూకరాళిఁ దా
నిచ్చ భుజించి శోణితము♦నెంతయుఁ గ్రోలియు మద్య మాదిగా
హెచ్చుగఁ ద్రావి తృప్తిఁగొని♦యింద్రవిరోధి చెలంగుచుండ నం
దచ్చపుభీతి డాఁగిన సు♦రారులు నెల్వల వచ్చి మ్రొక్కుచున్. ౧౩౬౩

అర్థములు. భక్ష్య = తినఁదగిన, వివిధామిష = పలువిధములైన మాంస ములు, కాసర = దున్నపోతులయు, సూకరాళి = పందులయు గుంపుల మాంస

మును, ఇచ్ఛన్=ఇష్టముదీర, శోణితము = నెత్తురు, క్రోలి = త్రావి, మద్యము = సారాయము.

## తాత్పర్యము

అచ్చట నుంచిన భక్ష్యములు నానా విధములైన మాంసములు, దున్నపోతులయు పందులయు మాంసములు కావలసినంత దిని నెత్తురు సారాయము త్రావి తృప్తిపడి, సంతోషించినవాఁడు కాఁగా వానికి భయపడియెందెందో దాఁగియుండిన రాక్షసులు బయటవచ్చి వానికి నమస్కరించుచు.

సీ. తనచుట్టు నిల్చినఁ ♦ గని కుంభకర్ణుండు, నిద్రావిశదభూరి♦నేత్రయుగుఁడు
కలుషీకృతేక్షణుఁ ♦ డల వారి నందఱ, వీక్షించి బోధన♦విస్మయమున
మీరందఱిటు నన్ను ♦ మేలుకొల్పితి రేల, రాక్షసేశునకు భ♦ద్రంబ కాదె?
భయకారణం బేమి ♦ పాటిల్ల లేదుగా?, యూహింప నాకు సం♦దేహ మొదవెఁ

తే. గడఁగి నన్నుఁ బ్రబోధించు♦కారణమున, సత్యముగ గొప్పయాపద♦సంభవించెఁ
బరులచే జాగ దేటికిఁ♦బలుకుఁ డిపుడు, నన్నుఁ బ్రతిబోధితునిఁ జేయ♦నున్నకతము

అర్థములు. నిద్రా + అవిశద భూరి నేత్రయుగుఁడు = నిద్రచే స్పష్టముగా దెఱవఁ బడని పెద్ద కన్నులజంట గలవాఁడు. ఇంకను నిద్దుర మబ్బు పోలేదని భావము. కలుషీకృత + ఈక్షణుఁడు = కొఱనిద్రలో లేచుటచే నెఱ్ఱగానున్న కన్నులు గలవాఁడు. బోధన విస్మయము=ఏల వీరు నన్ను నిద్దుర లేపిరని యాశ్చర్య పడుచు, ప్రబోధించు = మేలుకొలుపు, పరులచేన్ = శత్రువులచేత, జాగు = ఆలస్యము, ప్రతిబోధితుని=మేలుకొన్న వానిని.

## తాత్పర్యము

తనచుట్టు నిలువఁగాఁ గుంభకర్ణుఁడు నిద్దురమబ్బు వదలని కొఱనిద్రలో లేచుటచే నెఱ్ఱనైన రెండు కన్నులతో వారి నందఱఁజూచి యేల వీరు నన్ను నిద్రలేపిరని యాశ్చర్యపడుచు వారితో నిట్లనియె. ఏల మీ రీవిధముగ నన్ను నిద్రలేపితిరి? రావణుఁడు క్షేమముగానున్నాఁడా? వాఁడు బాగుండిన నన్ను లేపవలసిన కారణ ముండదే వాఁడును భయపడవలసిన కారణము కలుగ లేదుకదా. నాకేదో సందేహము తోఁచుచున్నది. నన్ను నిద్రలేపిన కారణమున శత్రువులచే నేదో గొప్ప కీడు మూఁడినది. ఏల యాలస్యము చేసెదరు? నన్ను మేలుకొలిపిన కారణము చెప్పుఁడు.

ఉ. నెట్టెదఁ బాకశాత్రవుని♦నేని దివంబుననుండి త్రెళ్ళఁగాఁ
గట్టెద నాశ్రయాశుఁ బెను♦గాటపుఁగట్టుల నింక నేరినేన్
గొట్టెద నుగ్గునూచముగఁ ♦ గూర్కెడు నన్నొక మాత్ర లేపఁగా
నిట్టుల నాలోఁ సందు దను♦జేంద్రుఁడు చెప్పుఁడ యేమి మూఁడెనో. ౧౩౫౫

అర్థములు. పాకశాత్రవుని = ఇంద్రుని, ఆశ్రయాశున్ = అగ్నిని

తా త్ప ర్య ము

ఇంద్రుని స్వర్గమునుండి పడ మెడపట్టి నెట్టెదను. అగ్నిహోత్రుని గట్టిగాఁ గట్టి నైచెదను. మఱి యెవరినైనఁ జూర్ణముగాఁ గొట్టెదను. సామాన్యమైన కారణమున నన్ను రాక్షసరాజు నిద్రలేపఁ బ్రయత్నింపఁడు. కావున నేమి విపత్తు సంభవించెనో చెప్పుము.

—♦ { యూపాక్షుఁడు కుంభకర్ణునితో నతని నిద్రలేపిన కారణము దెలుపుట } ♦—

కం. ఈపగిదిఁ గుంభకర్ణుఁడు, కోపరసావేశమునను ♦ గుఱుకొని పలుకన్
యూపాక్షుఁ డనెడి మంత్రిరి,యూపటుబలు డాసియనెఁ గృ♦తాంజలి యగుచున్.

అర్థములు. గుఱుకొని = ప్రయత్న పూర్వకముగా, పటుబలుఁన్ = మహాబలశాలిని, డాసి=సమీపించి.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. దైవకృతంబు భీతి మన ♦ దైత్యుల కెన్నఁడుఁ గల్గ దిప్పు డో
దేవ మహాభయం బొదవెఁ ♦ దీనుపరాక మనుష్యవాళిచే
నీ వఱ కెన్నఁడేన్ దితిజ ♦ బృందము చేతను దానవాళిచే
దైవతకోటిచేఁ గనని ♦ దాయము గల్గెఁ జుమీ నరాళిచేన్. ౧౬౬౭

అర్థములు. దైవకృతంబుభీతి = దేవతలవలనఁ గలిగిన భయము, దితిజ= దైత్యులచేతను, దితికుమారులు దైత్యులు, దానవాళిచేఁ=దానవుల గుంపుచేతను, దనువను దానికుమారులు దానవులు, వీ రందఱు జాతులు వేఱైనను గుణముల నందఱు నొకటే. అందఱు దేవబ్రాహ్మణ విరోధులే. మనుష్యభక్షకులే, కుటిల వ్యాపారులే, దైవకోటిచే-వీరు అదితి కుమారులు, దాయము=ఉపద్రవము.

తా త్ప ర్య ము

మన రాక్షసులకు దేవతల భయ మెన్నఁడు లేదు. ఇప్పుడు మనకు చక్కఁ బఱుప సాధ్యముగాని మహాభయము మనుష్యులచేఁ గలిగెను. ఇంతవఱకు దైత్యులచే దానవులచే దేవతలచేఁ గలుగని యుపద్రవము నేఁడు మనుష్యులచేఁగలిగెను.

కం. భూమీధరకాయులు శా, ఖామృగములు లంకఁ జుట్టి ♦ క్రాలెద రధిపా!
భూమిసుతాహరణార్తుఁడు, రాముని చేఁ గీడు మూఁడె ♦ రక్షస్తతికిన్. ౧౬౬౮

అర్థములు. భూమీధరకాయులు=పర్వతములవంటి దేహము గలవారు. శాఖామృగములు=వానరులు, భూమిసుతాహరణార్తుఁడు = సీతను నపహరించుటచే బాధపడు వాఁడు, రక్షః+తతికిన్=రాక్షససమూహమునకు.

తా త్ప ర్య ము

కొండంత దేహముగల వానరులు లంకను ముట్టడించినారు. సీతాదేవిని హరించుటవలన బాధపడు రామునిచే రాక్షసులకు చావుకాలము వచ్చినది.

ఉ. వచ్చి వనాటుఁ డొక్కఁడు ♦ వార్యబలోద్ధతి లంక కంతకున్
జిచ్చిడె నక్షుఁ జంపె మును ♦ సేవలతో నిభపంక్తితోడ ని
ప్డెచ్చినశక్తి రాముఁడు ది ♦ నేశ్వర తేజుఁడు సంగరంబునన్
జిచ్చితి వోరి యంచు సుర ♦ శాత్రవనాథునిఁ దోలె రావణున్. ౧౩౬౯

అర్థములు. వనాటుఁడు=వానరుఁడు, చిచ్చు=అగ్ని, ఇభపంక్తితోడన్=ఏనుఁగుల గుంపుతో.

తాత్పర్యము

మును వానరుఁ డొక్కఁడు వచ్చి లంకగాల్చెను. అక్షుని జంపెను. ఇప్పుడు సూర్యతేజస్సుగల రాముఁడు బలవంతుఁడై వచ్చి రావణుని జచ్చితివి పొమ్మని యుద్ధమునందుఁ బరువెత్తునట్లు కొట్టెను.

కం. రాణను దితిదనుభవగీ, ర్వాణులు సమకూర్ప లేని ♦ భంగము సీతా
ప్రాణేశ్వరుఁ డిడి రావణుఁ, బ్రాణంబులు పోయి పోని♦వానిగఁ జేసెన్.

అర్థములు. రాణను=ఒప్పిదముతో, దితి దనుభవ గీర్వాణులు=దితిభవ=దైత్యులు, దనుభవ=దానవులు, గీర్వాణులు=దేవతలు, భంగము=అవమానము.

తాత్పర్యము

దైత్యులు, దానవులు, దేవతలైనను కలిగింపఁజాలని యవమానమును సీతావల్లభుఁడు కలిగించి ప్రాణములు పోయి పోనివానిఁగఁ జేసి విడిచెను. అవమానము చేత రాముని బాణముల దెబ్బలచేత నన్నిప్రాణములు పోయినట్లే యున్నను సీ యందలి యాశతో నొక్కప్రాణము బిగఁబట్టుకొని యున్నాఁడు.

కం. అని యూపాక్షుఁడు పలికిన నవిఁ దనయగ్రజునిపాటు ♦ నాలించి యనెన్
గినుక వివృత్తాక్షుం డై, యనుపమబలశాలి రావ♦ణానుజుఁ డతనిన్. ౧౩౭౧

అర్థములు. వివృత్త + అక్షుఁడు=తిరుగుచున్న కన్నులు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము

—♦ మహోదరుఁడు కుంభకర్ణునితో రావణుఁ జూడఁ బొమ్మని చెప్పుట ♦—

ఉ. ఈక్షణ మేగి రాఘవస ♦ మేతముగా హరిసైన్యమెల్ల యూ
పాక్ష వధించి వెండి యసు ♦ రాధిపుఁ గాంచెదఁ దృప్తిఁ గూర్చెదన్
రాక్షసకోటికిన్ వనచ ♦ రప్రచయక్షతజామిషంబులన్
దక్షత రాఘవాస్రములఁ ♦ ద్రావెదఁ దుష్టిగ నే స్వయంబుగన్. ౧౩౭౨

అర్థములు. యూపాక్షా! యట్లగునేని నే నీనిమిషమందే పోయి రామలక్ష్మణులతోడ వానరసేన నంతయుఁ జంపి తరువాత రావణునిజూచి రాక్షసులకుఁ దృప్తి కలిగించెదను. వనచర ప్రచయ=వానర సమూహములయొక్క, క్షతజ = నెత్తుటిని, ఆమిషంబులన్=మాంసములను, రాఘవాస్రములన్ = రామలక్ష్మణుల నెత్తురును, తుష్టిగన్ = తృప్తి కలుగునట్లు, స్వయంబుగన్ = నేనే సొంతముగా,

తాత్పర్యము స్పష్టము.

తే. ఇటులు పలికిన రోషవి♦వృద్ధదోష, మైన యాతనిగరోక్తు ♦ లాలకించి
యుచితగతిదోఁపఁబల్కె-మ♦హోదరాఖ్యుఁబరఁగు నైఋతయూథప♦పరివృఢుండు.

అర్థములు. రోషవృద్ధదోషము=కోపముచే వృద్ధిపొందిన దోషముగలది, రావణ పరాభవము విని రోషించెనేకాని తాను జేయఁదలఁచిన దాని యందలి దోష మాలోచించినవాఁడుకాఁడు, ఆలకించి = విని, నైఋత యూథప పరివృఢుండు = రాక్షస యూథపతులలో శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. రావణువచనంబుల విని, యావల గుణదోషముల స♦మాలోచనముం
గావించి పదంపడి విజ, యావహాగతి రణముఁ జేయ♦నర్హమటన్నన్. ౧౩౨౪

అర్థములు. విజయావహాగతిన్=గెలుపుగలుగు మార్గముగ.

తాత్పర్యము స్పష్టము.

శా. కాని మ్మంచును లేచె లేచుటయు ర♦క్షస్సంఘముల్ వేగ ర
క్షోనాథుం గదియంగఁ బోయి కరముల్ ♦ జోడించి మేల్కాంచెన్న వాఁ
డైనీ సోదరుఁ డున్నవాఁ డసురలో♦కాధీశ! నీ వేగి స
న్మానింతో యతఁ డిందు వచ్చినను ప్రే♦మం గారవింతో యనన్. ౧౩౨౫

తాత్పర్యము

అట్లులే చేసెదనని లేచెను. ఇట్లు లేవఁగానే రాక్షసులు ముందుఁబోయి రావణుని జూచి చేతులు జోడించి, రాజా! కుంభకర్ణుఁడు నిద్ర మేల్కాంచెన్నవాఁడు. నీవు పోయి యతని గారవించెదవా? అతఁడిచ్చటికి వచ్చిన గారవించెదవా? యని యడుగఁగా.

ఉ. ఆతఁడు వచ్చుఁ గాక యిత ♦ కాతని నర్ఘసమర్చనాదిసం
ప్రీతునిఁ జేయు టొప్పు నన ♦ వే చని వారలు మిమ్ముఁ జూడ మీ
భ్రాత సురారినేత తమి ♦ వర్తిలెడిం జనఁ గోరుదే? యనం
జేత మిగుర్ప వల్లె యని ♦ శిక్షితశాత్రవుఁ డాత్మతల్పమున్. ౧౩౨౬

అర్థములు. అర్ఘసమర్చన్ = తగిన పూజచేత, ఆదిన్=తొలుత, సంప్రీతుని = సంతోషించిన వానిని, చేతము = మనస్సు, ఇగుర్పన్ = సంతోషింపగా, ఆత్మతల్పమున్=తన పానుపును.

తాత్పర్యము

ఆతఁడే యిచ్చటికి రానిండు, అతని ముందు గౌరవించి సంతోషింపఁజేసి యావల కార్యవిధము చెప్పవలెను, అని చెప్పఁగా వారుపోయి మీ యన్న నిన్నుఁ జూడఁగోరుచున్నాఁడు. పోవుట క్షేమా యనిన సంతోషించి తన పానుపును,

కం. విడిచి వెలి వచ్చి వదనము, గడిగికొని నిమజ్జనంబుఁ ♦ గావించి నగల్
దొడి బలవర్ధనపానముఁ, గడుపారఁగఁ ద్రావె దప్పి ♦ కడమవడంగన్.

అర్థములు. నిమజ్జనము = స్నానము, నగల్ దొడి = ఆభరణములు ధరించుకొని, బలవర్ధన పానము = బలముగలిగించు పానము, దీనినే వీరపాన మందురు. యుద్ధమునకు ముందు వీరులు దీనినిఁ బానముచేయుదురు. కడమువడం గన్ = కొలఁత పడువట్లు.

తాత్పర్యము

విడిచి వెలుపల వచ్చి ముఖము కడిగికొని స్నానముచేసి యలంకరించుకొని బలము వచ్చుటకై వీరపానము గావించి దప్పిఁదీర్చుకొన్నవాఁడై.

తే. రావణాజ్ఞను వెస మది♦రా ఘటంబు, లమితవివిధోపహారంబు♦లసుర లీయఁ
గుంభములు వేయి ద్రావియా♦కుంభకర్ణుఁ, డతులతేజో బలోపేతుఁ♦డయి మదించి.

అర్థములు. మదిరాఘటంబు = సారాయము కడవలు, వివిధోపహారం బులు=నానావిధములైన కానుకలు, బలోపేతుఁడు = బలముతోఁగూడినవాఁడు, మదించి=మత్తుగొన్నవాఁడై.

తాత్పర్యము స్పష్టము.

చ. ప్రలయకృతాంతతుల్యవిభ♦వంబున నన్నఁ గనుంగొనంగ న
బ్బలియుఁడు పోవుచో ధరణి ♦ పాదహతిన్ వడఁకాడెఁ దత్పురిం
గల యుపనిష్కరంబులును ♦ గ్రాలెఁ దదీయపరిష్క్రియాతతిన్
వలనుగ రెండువంకలను ♦ బద్ధకరాంజలిపంక్తి రాజిలెన్. ౧౩౨౯

అర్థములు. ప్రలయ కృతాంతతుల్య విభవంబునన్=ప్రలయకాలమందలి యమునితో సమానమైన మహిమతో, పాదహతిన్ = కాలి త్రొక్కుడుచే, ఉప నిష్కరంబులును = రాజమార్గములు, గొప్పదుర్గములు గల పట్టణములోని రాజ మార్గములకే యుపనిష్కరము లని పేరు. సామాన్య పట్టణములోని రాచబాటలకు ఘంటాపథము లని పేరు. ఉపనిష్కరము = ఇం దంతట సైన్యము పర్యాప్తమై చల్లఁబడును అని వ్యుత్పత్త్యర్థము. 'తత్పురస్యోపనిష్కర' మ్మని యమరము. తదీయపరిష్క్రియా తతిన్=అతని యాభరణముల సమూహముచే, బద్ధకరాంజలి పంక్తి=అంజలి జోడించిన వారి వరుస.

తాత్పర్యము

ఆ బలశాలి ప్రలయకాల యముని గొప్పతనముతో నన్నను జూడఁబోవు చుండఁగా వాని కాలి త్రొక్కుడులచే భూమి వడఁకెను. ఆ పురమందలి రాజ మార్గములు వాని యాభరణములచేఁ బ్రకాశించెను. మార్గముల నిరువంకల నందఱు చేతులు జోడించి నిలఁబడి యుండిరి.

చ. కమలజువీటి కేగు బల♦ఘస్మరు పోలికఁ బోవువానిఁ దే
జమున ఖరాంశువంటు విల♦సత్పరిమాణవిహీనకాయు భూ
ధ్రమహితశృంగకల్పు నల♦రాక్షస సత్తముఁ గుంభకర్ణుఁ బ
ట్నము వెలి ముట్టడించిన వ♦నౌకసులుం గని యబ్రపాటునన్. ౧౩౩౦

అర్థములు. బలఘస్మరు పోలికన్=ఇంద్రునివలె, ఘస్మరుఁడనఁగా తిండి పోతు, ఇచ్చట సంహారించినవాఁడని యర్థము. ఖరాంశున్ = సూర్యుని, పరిమాణ విహీన = కొలఁత చెప్పరాని, కాయున్ = దేహముగలవానిని, భూధ్ర = పర్వతము యొక్క, మహిత = గొప్పదగు, శృంగకల్పున్ = శిఖరముతో సమానమైన వానిని, పట్నము = పట్టన శబ్దభవము, వనౌకసులున్ = వానరులుకూడ, వాఁడు కోటగోడలకంటె నెత్తుగానున్న కారణమున ప్రాకారములకు వెలుపలనున్న వారికిని వాని శరీరము కానవచ్చెను. అబ్రపాటునన్=ఆశ్చర్యమున.

తా త్ప ర్య ము

బ్రహ్మయింటికిఁబోవు నింద్రునివలె నన్నయింటికిఁ బోవుచున్నవానిని తేజమున సూర్యుఁబోలి యతని తాఁకుచున్న పరిమితి చెప్పరాని దేహము గలవానిని కొండశిఖరముతో సమానమైనవానిని. అంత యెత్తుగలవాఁ డగుటచేతనే కుంభకర్ణుని లంకకు వెలుపల నుండు వానరులుకూడఁ జూచి యాశ్చర్యపడిరి.

కం. ఎకవడి పరువిడి పనములు, గుదివడి నిలఁబడిరి కపులు • కొందఱు రామున్
గదిసి శరణంబుఁజొచ్చిరి, మదమఱి యిలఁబడిరి భీతిమతు లగు క్రోతుల్.

తా త్ప ర్య ము

కొందఱు క్రోఁతులు భయపడి పరువెత్తి కాళ్ళు కుప్పలుగాఁ గూలఁబడిరి. కొందఱు రామునొద్దకుఁ బోయి నీవేగతి రక్షింపుమనిరి. కొందఱు భయపడి గర్వముడిగి నేలఁబడిరి.

—•{ ౬౧-వ సర్గము. రావణుఁ జూడఁబోవు కుంభకర్ణుఁ జూచి శ్రీరాముఁడు విభీషణుఁ బ్రశ్నించుట }•—

సీ. పర్వతాకారుని • భయదశరీరుని, మున్ను నారాయణు • చెన్ను దోఁప
నాకాశమంటు దే•హంబును గలవాని, సాంబుతోయదనిభుఁ • డైనవానిఁ
గాంచన కేయూర • కమ్రభూషాంచితుఁ గని కీశసైన్యంబు • కాందిశీక
మగుటకు రఘూత్తంసుఁ•డతులచాపముఁ గొని, యచ్చెరువున రావ•ణానుజాతు
ఆ. ననియె నెవ్వఁడయ్య • యద్రిసంకాశుండు, మకుటధారి మహికి•మహితకేతు
వనఁగఁదగినవాఁడు•సైరావతీవారి, వాహమునకు నీడు•వచ్చువాఁడు. ౧౬౭౨

అర్థములు. మున్ను నారాయణు చెన్నుదోఁప=త్రివిక్రమావతారమందు వలెనని భావము. సాంబు = నీళ్ళతోఁగూడిన, తోయదనిభుఁడు = మేఘముతో సమానుఁడు, కాంచన కేయూర = బంగారు భుజకీర్తులచేతను, కమ్ర=మనోహరమైన, భూషాంచితున్ = ఆభరణములచేతను ప్రకాశించువానిని, కాందిశీకము = భయముచే బరువెత్తినది, కాం+దిశీకము=ఏదిక్కునకుఁబోవునది తెలియనిది. అద్రిసంకాశుండు=పర్వతముతోసమానుఁడు,మకుటధారి=కిరీటము ధరించినవాఁడు, సైరావతీ=స+ఐరావతీ = మెఱుపుతోఁ గూడిన, వారివాహనమునకు = మేఘ

ము...ను, "శంపా శతహ్రదా హ్రాదినై రావత్యః క్షణప్రభా" యనియు "అభ్రం మేఘో వారివాహం" యనియు నమరము. బృందారకుండో=దేవతలారా.

తా త్ప ర్య ము

పర్వతమువలె నెత్తైన యాకారము గలవానిని, కనుకనే భయంకరమైన శరీరము గలవానిని, పూర్వము త్రివిక్రమావతారమున నారాయణునివలె నాకాశముఁ దాఁకుచున్న దేహము గలవానిని, నీటితోఁ గూడిన మబ్బువలె నల్లని దేహకాంతి గలవానిని, బంగారు భుజకీర్తులు, మనోహరములైన భూషణములు ధరించినవానిని చూచి వానరసేన భయపడి పరువెత్తసాగెను. అప్పుడు రామచంద్రమూర్తి యసమానమైన విల్లుతీసికొని యాశ్చర్యపడి విభీషణుఁజూచి యెవ్వరయ్యా వీఁడు కొండవలె నున్నాఁడు. కిరీటము ధరించినాఁడు. భూమికి ధ్వజమువలె నున్నాఁడు, ధ్వజము తన చుట్టునుండు మనుష్యులకంటె నెత్తై యందఱకుఁ గానవచ్చుచుండును. అట్టులే వీఁడును భూమియందుండు నన్నిటికంటె నెత్తైయున్నాఁడని భావము. మెఱుపులతోఁడి మేఘమునకు సమానుఁడు.

తే. కపిలనేత్రుండు కోటప్రాకారమునకు, మీఁద నొక్కఁడ తెలిసెడి మేనితోడ
నరుగుచున్నాఁడులంకలో నతఁడు రాక్షసుండొ యటుగాక బృందారకుండొ
చెపుమ.

అర్థములు. కపిలనేత్రుండు=గోరోజనము కన్నులవాఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. పాఱుచు నున్నవారు మన వానరు లెల్లరు వానిఁజూచి దై
వాఱు భయాననఁ బూర్వమిటు వంటి మహాద్భుత భూత ముర్విపైఁ
దేఱఁగఁ జూడలే దన సుధీవరుఁడైన విభీషణుండు దాఁ
దాఱనిభక్తి నిట్టులను దాశరథిప్రవరున్ నయంబునన్. ౧౬౭౮

అర్థములు. దైవాఱు = అతిశయించిన, సుధీవరుఁడు = పండితులకు శ్రేష్ఠుఁడు, తాఱని=తగ్గని, భూతము = జంతువు, ప్రాణి; నయంబునన్=అణఁకువతో, సుధీవరుఁడు నయంబుగఁ జెప్పె ననుటచే విభీషణుఁడు కుంభకర్ణుని గుఱించి భయంకర వృత్తాంతము చెప్పినను సౌమ్యముగ మృదువుగఁ జెప్పెనని భావము. తేఱఁగన్ = బాగుగ.

తా త్ప ర్య ము

వానినిజూచి మిగుల భయపడి మన వానరులందఱుఁ బరువెత్తుచున్నారు. ఇంతకుముం దిటువంటి మిగుల నద్భుతమైన ప్రాణిని భూమిమీఁదఁ జూడలేదు. అని యనుగఁగా మిగుల బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడగుటచే నెవరి కెప్పు డెట్లు చెప్పవలయునో తెలిసినవాఁడై నయముతో భక్తితో రామచంద్రునితో నిట్టులనెను.

—విభీషణుఁడు శ్రీరామునకుఁ గుంభకర్ణుగుఱించి తెలుపుట—

సీ. భండనంబునఁ గిట్టి దండి వాసవుఁ బట్టి, యోటమిఁ గూర్చిన మేటిబంటు
విశ్రవసోముని విఖ్యాతపుత్రుండు, కుంభకర్ణుం డనఁ గోఱలువాఁడు

ఇంతటిపొడువును ♦ నింతటిలావును, బెరరక్కసులకు నె♦వ్వరికి లేమ
వరదానకృతబలుల్ ♦ సురవైరు లందఱు, నతఁడు స్వభావబ♦లాధికుండు
తే. అమరగంధర్వకిన్నర♦యక్షభుజగ,దనుజవిద్యాధరులఁ బ్రవి♦దారణమున
నొడిచి యున్నాఁడు వేనవేల్♦తడవ లితఁడు,సురలకీతనిపేరుహృ♦చ్ఛూలమధిప!

అర్థములు. భండనంబునన్=యుద్ధమందు, కిట్టి = సమీపించి, ఓటమి = అపజయము, మేటిబంటు=గొప్ప శూరుఁడు, పెరరక్కసులకు=ఇతర రాక్షసులకు, వరదానకృతబలుల్=వరములను సంపాదించుకొనుటచే బలము గలవారు,స్వభావబలాధికుండు = పుట్టువుచేతనే మిగుల బలము గలవాఁడు, ప్రవిదారణమునన్ = యుద్ధమందు, ఒడిచి=ఓడించి, హృచ్ఛూలము=గుండె గాలము.

తాత్పర్యము

యుద్ధమునందు సమీపించి బలవంతుఁడగు నింద్రుని బట్టుకొని యోడించిన శూరుఁడు విశ్రవసుముని కొడుకు వీని పేరు కుంభకర్ణుఁడు. ఇతర రాక్షసులం దెవ్వరు నింతలావు పొడుగు గలవారు లేరు. రాక్షసులందఱు బ్రహ్మరుద్రుల వరములచే బలవంతులైరి. వీనికి బలము పుట్టువుచేతనే వచ్చినది. అసురులను గంధర్వ కిన్నర యక్షులను సర్పములను దనుజులను విద్యాధరులను యుద్ధమం దెన్నివేల మాఱులో యోడించి యున్నాఁడు. దేవతలకు వీనిపేరు గుండెలలో గాలము వంటిది. ఒకనాఁడు నిద్రమేలుకొనియుండు వాఁడీ కార్యమెట్లు చేసెనని సందేహము బాధించుచున్నది. ఇది బ్రహ్మ వరమునకు ముందటి వార్తయై యుండవలెను.

కం. శూలంబు గేలఁ గ్రాలఁగ, నాలమున విరూపనేత్రుఁ♦డై వీఁ డకరన్
గాలుండో యని నిర్జర,జాలంబులు డాయ లేక ♦ సాధ్వస మందున్. ౧౩౮౬

అర్థములు. ఆలమునన్ = యుద్ధమందు, విరూపనేత్రుఁడై=వికారమైన కన్నులు గలవాఁడై, అకరన్=విజృంభింపఁగా, శూలశబ్దము విరూపనేత్ర శబ్దము, శూలధరుఁడైన విరూపాక్షుఁ డగు రుద్రునివంటి వాఁడని సూచించుచున్నది. కాలుండో=యముఁడో, సాధ్వసమందున్=భయపడును.

తాత్పర్యము

శూలము చేతఁబట్టుకొని యీ విరూపాక్షుఁడు యుద్ధమునందు విజృంభింపఁగా వీఁడు యముఁడో యని దేవతాసమూహములు దగ్గఱ రాలేక భయపడును.

సీ. పుట్టి పుట్టక మున్న ♦ భూరిబుభుక్షార్తి, వేనవేల్ జంతుల ♦ వీఁడు మ్రింగ
గడఁగుడుఁ బ్రజలెల్లఁ ♦ గడుభయంపడి చని, వేలుపుఱేనికి ♦ విన్నవింప
జంభారి దంభోళిఁ ♦ గుంభకర్ణుని వైవ, నత్తాఁకునఁ జలించి ♦ యార్భటింప
నమ్మహారవమున ♦ కడలు భూవలయంబు, వెండియు దిగులున ♦ గం డడంగెఁ
తే. కుంభకర్ణుండు హరిహయు♦కుంభిరదముఁ, బీఁకి దానన మర్దించె ♦ వృత్రవైరి
నేటుపడి వాసవుం డార్తి♦రాటుపడఁగ, వ్యసనసంతప్తులైరి దై ♦ త్యారిసురలు.

అర్థములు. భూరి = అధికమైన, బుభుక్షార్తి = ఆఁకటి బాధచే, కడఁగుడున్ = ప్రయత్నింపఁగా, వేలుపుఱేనికిన్ = ఇంద్రునకు, జంభారి=ఇంద్రుఁడు, దంభోళి = వజ్రాయుధమును, తాఁకున = దెబ్బచే, ఆర్భటింపన్ = అఱవఁగా, అడలు = చలించు, గండు = బీరము, హరిహయకుంభి=ఇంద్రుని యేనుఁగు-ఐరావతముయొక్క, రదము=దంతము, రాటుపడఁగన్=ఉపద్రవపడునట్లు.

తాత్పర్యము

వీఁడు పుట్టి పుట్టకముందే మిగుల నాఁకలిగొన్నవాఁడై వేలకొలఁది జంతువులను మ్రింగ యత్నింపఁగా ప్రజలందఱు నిటులైన లోకము త్వరలోనే శూన్యమగునని భయపడి యింద్రునకుఁ దెలుపఁగా నాయన వీనిమీఁద వజ్రాయుధము వైచెను. ఆదెబ్బతిని వణఁకి యఱవఁగా వానిధ్వనికిఁ జలించు భూచక్రము మఱింత దిగులుపడెను. అప్పుడు కుంభకర్ణుఁడు ఐరావతము దంతము పెఱికి దానితోనే యింద్రుని గొట్టెను. ఆ దెబ్బకు నింద్రుఁడు మిగుల నుపద్రవపడఁజూచి దైత్యులు ఋషులు మిగుల వ్యసనపడిరి.

ఉ. ఈతఁడు పెట్టు రాయిడి స • హింపఁగ లేక ప్రజాసమేతుఁడై
ధాతను డాయఁగాఁ జని శ • తక్రతుఁ డింతయు విన్నవించె నీ
పాతకు లోకభక్షణము • స్వర్జనధర్షణ మన్యకామినీ
వ్రాతభృశాభిమర్శనముఁ • బాడొనరించుట యాశ్రమస్థలుల్. ౧౬౪౮

అర్థములు. రాయిడి = ఉపద్రవము, ప్రజాసహితుఁడై = లోకులతోడ, శతక్రతుఁడు = ఇంద్రుఁడు, పాతకు = పాపాత్ముని, లోకభక్షణము = ప్రజలను దినుట, స్వర్జన ధర్షణము=దేవతలఁ బీడించుట, అన్యకామినీవ్రాత=ఇతర స్త్రీ సమూహమును, భృశాభిమర్శనము=మిక్కిలి బాధించుట.

తాత్పర్యము

ఇతఁడు పెట్టు నుపద్రవము సహింపలేక యింద్రుఁడు లోకులతోడ బ్రహ్మ యొద్దకుఁబోయి యీపాపాత్ముఁడు ప్రజలను భక్షించుట, దేవతల బాధించుట, ఇతర స్త్రీలను జెఱచుట, ఋష్యాశ్రమములు పాడుచేయుట-యివి యన్నియు విన్నవించెను.

కం. ఈకరణి వీఁడు నిత్యము లోకుల భక్షించె నేని • లోకేశ్వర! భూ
లోకము పాడఱు నన్న ది, వౌకస్తతి నూఱడించి • యబ్జభవుండున్. ౧౬౪౯

అర్థములు. ఈకరణిన్ = ఈ విధముగ, దివౌకస్ + తతిన్ = దేవతా సమూహమును, అబ్జభవుఁడు = బ్రహ్మ.

తాత్పర్యము స్పష్టము.

తే. కుంభకర్ణునిఁ గనుఁగొని • గుండెలదర, నిబ్బరము దెచ్చుకొని వాని • నెమ్మిఁబిలిచి
సత్యముగ నిన్నులోకనా • శంబు కొఱకె, విశ్రవసుఁడు వినిర్మించె • విశ్వవైరి.

అర్థములు. నిబ్బరము=ధైర్యము విశ్వవైరి = లోకమునకు నపకారము చేయువాఁడా.

### తాత్పర్యము

కుంభకర్ణునిఁ జూచి భయపడి గుండె లదరఁగా మరల ధైర్యముఁ దెచ్చుకొని వీనిని మంచితనముగాఁ దగ్గఱకుఁ బిలిచి నిన్ను నిజముగ లోకము నాశముఁ జేయఁ గోరియే విశ్రవసుఁడు పుట్టఁజేసెను.

సీ. కావున నిది యాదిఁ•గా నీవు పడియుండు, ఘటకర్ణుఁడా! మృత•కల్పుఁడ వయి
యని శపియించిన • నాతని మ్రోలను, తత్క్షణంబున వీఁడు • ధరణిఁ ద్రెళ్ళఁ
బరమసంభ్రాంతుఁ డై•పంక్తికంధరుఁ డను, దాత నీ కిటు సేయఁ•దగ వటయ్య
నీమనుమండు వీ•నిని శపింపఁగఁ జన్నె, యుమ్మెత్తనైనఁ దా • నెమ్మిఁ బెంచి
తే. నఱుక న్యాయంబె ఫలవేళ•నలినగర్భ! నీదుసూక్తిని దబ్బుఁ జే•నెఱయఁ గలదె
కరుణ దలపోసి శయనజా•గరములందుఁ, గాలనిర్ణయ మొనరింపఁ•గ దెమహాత్మ.

అర్థములు. మృతకల్పుఁడవు = చచ్చినవానికంటెఁ గొంచెము తక్కువ చచ్చినవాని కూపిరి యాడదు, వీనికాడును, కల్పప్రత్యయము కొంచెము తక్కువఁగా సమత్వమును జెప్పును. పరమ సంభ్రాంతుఁడై = మిగుల వేగిరపాటు గల వాఁడై, శయన జాగరములందు=ఇన్ని దినాలు నిద్రపోవలె, ఇన్ని దినాలు మేలు కొని యుండవలె నను నేర్పాటు.

### తాత్పర్యము

కాఁబట్టి యిది మొదలు కుంభకర్ణా! నీవు చచ్చినవానితో సమముగఁ బడి యుండుము, అని శపింపఁగానే యచ్చటనే యాక్షణమందే వీఁడు నేలఁబడెను. అప్పుడు రావణుఁడు మిగులఁ దత్తఱపడి బ్రహ్మనుజూచి తాతా! నీ విట్లు శపింప వచ్చునా? వీఁడు నీమనుమఁడు గాఁడా? వీనిని సృష్టించిన వాఁడవు నీవుగాదా? ఉమ్మెత్త చెట్టునైనను దాను పెంచి ఫలవేళ నఱుక వచ్చునా? అయినను ముందు మించి శపించితివి. నీమాట యసత్యము కానేరదు. అయినను నిన్నిదినాలు నిద్రపో వలె నిన్నిదినాలు మేలుకొని యుండవలె నను నియమ మేర్పాటు చేయుము.

కం. అని వేఁడిన దయఁగూడిన, మనమున వనె నీతఁ డాఱు•మాసంబులు గూ
ర్కును నొక్కపగలు మేల్కొని, తినుఁ గావుత మగ్నివగిదిఁ•దిరుగుచు జగతిన్.

### తాత్పర్యము

అని ప్రార్థింపఁగా దయ గలవాఁడై వీఁ డాఱు నెలలు నిద్రించునుగాక ఆవల నొక పగలు మేల్కొని యగ్నిహోత్రునివలె నాఱు నెలలతిండి యొకనాఁడు తిని విహరించును గాక యని బ్రహ్మచెప్పెను.

బ్రహ్మశాప మనునది కుంభకర్ణుఁడు కోరిన వరమే. కుంభకర్ణుడు తపసు చేయఁగా బ్రహ్మ ప్రత్యక్షమై నీ కేమి వరము కావలయునని నిత్యత్వ మనఁబోయి నిద్రాత్వమనెను. అట్టులే కానిమ్మని బ్రహ్మ చెప్పెను. "కుంభకర్ణుని వికటాననకిం జతురాస్యుఁ డేగి నీ, భావగతంబు జెప్పుమన వాఁడును నిద్దురఁగోరెఁ బెక్కు

శేం, ద్గ్లావిధియట్లు లౌతమని స్వాలయమునం జనె"నని యుత్తరకాండమునఁగలదు. ఈ౩౦ పద్యము అంతకుముందే బ్రహ్మ శపించియుండిన వీఁడు తపస్సు చేయుటే సంభవించి యుండదు. ఇందుఁ జెప్పఁబడిన ఆఱునెల లనునది అధమ పక్షము. అంతకుఁ దగ్గదు. అంతకు హెచ్చి ఏడు-ఎనిమిది-తొమ్మిది నెలలైనఁ గావచ్చును. ఈ విషయము ముందే చర్చింపఁబడినది.

ఉ. అట్టిఁడు కుంభకర్ణుఁడు మ • హాత్మక ! యీతని మేలుకొల్పె ని
 ప్పట్టున నార్తిఁ గూరి దశ • వక్త్రుఁడు త్వద్బలభీతుఁ డౌట, స్వా
 రాట్టువిరోధిఁ గన్గొని ద • రంబున బాఱెడిఁ గ్రోఁతులెల్లఁ దా
 మెట్టు పెనంగు వారో యని • నీతఁడు మార్కొనె నేని రాఘవా ! ౧౩౯౩

అర్థములు. అట్టిఁడు=అట్టివాఁడు, త్వద్బలభీతుఁడు=నీ బలమునకు భయపడినవాఁడు, స్వారాట్టు విరోధి=ఇంద్రవిరోధి, కుంభకర్ణుని-దరంబునన్=భయముచే.

తా త్ప ర్య ము

మహాత్మా ! కుంభకర్ణుఁ డిటువంటివాఁడు. నీ బలమునకు భయపడి రావణుఁడు వీని నిప్పుడు నిద్రలేపెను. ఈ రాక్షసునిజూచి వానరులు భయపడి పరువెత్తుచున్నారు. వీఁడు యుద్ధములో నెదిరించినప్పు డెట్లు యుద్ధము చేయుదురో యేమో.

తే. తనదు శిబిరంబు విడి యీ • దర్పధుర్యుఁ, డరుగుదెంచుచు నున్నవాఁ • డనికి దేవ
 వానరులఁ బట్టి యిరు కేల • వాతవైచి, కొనుచుఁ దరువునఁ జనుదెంచు • గుణధురీణ !

అర్థములు. శిబిరము=విడిది, గృహము, వాత=నోర.

తా త్ప ర్య ము స్పష్టము.

చ. ఇదియొక కీలుబొమ్మ యసు • రేశ్వరకల్పిత మాట దీనికై
 యదరకుఁడీ కపిప్రవరు • లంచును జాటుట మేలు దానిచే
 వదలి భయంబు వానరులు • వర్తిలువార లటన్న హేతుమ
 ద్గదితము లాలకించి ప్లవ • గధ్వజినీపతి రాముఁ డిట్లనున్. ౧౩౯౪

అర్థములు. అసురేశ్వర కల్పిత=రావణునిచేఁ గల్పింపఁబడినది, కపిప్రవరులు = కపిప్రవరులారా, హేతుమత్ + గదితములు = కారణములతోఁ గూడిన మాటలు, ప్లవగధ్వజినీపతిన్=వానర సేనానాయకుని, నీలుని.

తా త్ప ర్య ము

వానరులారా ! దీనినిజూచి మీరు భయపడవలదు. ఇది మిమ్ము బెదరించుటకై రావణాసురుఁడు గల్పించిన కీలుబొమ్మ అని సేనలలో నలువైపులఁ జాటించుట మేలు. అటుచేసిన వానరులు భయపడక యుందురు. అని చెప్పఁగా యుక్తియుక్తములైన యతని మాటలు విని రామచంద్రమూర్తి నీలునిఁబిలిచి యిట్లనియె.

విభీషణుఁడు చెప్పిన నీతి సునీతియైనను రామచంద్రమూర్తికి సమ్మతమైనది కాదు. అందసత్యభాషణము, వంచనము నను రెండు దోషములు గలవు. ఒకసారి

వంచన చేసిన వారిని లోపలు గలకాలము నమ్మరుగదా, కావున రామచంద్రమూర్తి ఋజుమార్గముననే వర్తింపఁదలఁచెను.

### శ్రీరాముఁడు నీలునితోఁ గుంభకర్ణుతోడ యుద్ధమునకు సేనల సిద్ధపఱుపు మని బోధించుట

సీ. పావకీ! చని మన•బలఁగంబు సర్వంబు, వ్యూహము ల్దీర్పవిూ•యొప్ప మెఱయ
లంక ద్వారంబుల • సంక్రమస్థలములఁ, జర్యల నరికట్టు • సత్వరముగఁ
గుధరశృంగంబులుఁ • గుజ వితానంబులు, శిలలును జతగూర్చి•సిద్ధపడుము
సాధనహస్తులు • శైలపాణులు నయి, వనచరుల్ నిలువంగ • వలయు నన్న
ఆ. నీలుఁ డెల్లకపుల • కోలి నెఱిఁగించె, రామునాజ్ఞఁ గీశ•రాజు లెల్ల
నట్ల సిద్ధపడిరి•యద్రిశృంగంబులు, వృక్షతతులుఁ గేల•వెలయ మండ. ౧౩౯౬

అర్థములు. పావకీ=పావక కుమారా! అగ్నిహోత్రుని నందనా, సంక్రమస్థలములన్=వంతెనలు కట్టిన చోటులను, చర్యలను = గోపుర పార్శ్వములందలి భట సంచార ప్రదేశములను, అరికట్టుము = అడ్డగింపుము, సాధన హస్తులు = ఆయుధములు ధరించినవారు, శైలపాణులును=చేతియందుఁ గొండలు గలవారు, ఓలి = క్రమముగా.

### తాత్పర్యము

నీలా! మన వానర సేనల నచ్చటచ్చటఁ దగినట్లు నిల్పి యుంచుము. లంక వాకిండ్లను అగడ్తల మీఁది వంతెనలను గోపురముల ప్రక్కల భటు లుండు ప్రదేశములను, నడ్డగింపుము. కొండ శిఖరములు చెట్లు ఱాలు సమకూర్పుము. వానరులు ఆయుధములు కొండలు చేతులందు ధరించి సిద్ధముగ నుండవలెను. అని చెప్పఁగా నీలుఁ డా రామాజ్ఞను వానరుల కెల్ల దెలిపెను, వానరులును రామచంద్రమూర్తి చెప్పినట్లు కొండ శిఖరంబులు వృక్షములు చేతులందు ధరించి యుండిరి.

కం. శరభ గవాక్షాంగద కే,సరిసూనులు పెచ్చుపెరిఁగి • శైలతటంబుల్
కరములఁ గొని ద్వారంబుల, నరికట్టిరి వైరిభీక•రార్భటు లెసఁగన్. ౧౩౯౭

అర్థములు. పెచ్చుపెరిఁగి=విశేషముగ విజృంభించి, వైరి భీకరార్భటులు= శత్రువులకు భయంకరమైన సింహనాదములు.

### తాత్పర్యము

శరభుఁడు గవాక్షుఁడు అంగదుఁడు హనుమంతుఁడు మిగుల విజృంభించి కొండశిఖరములను చేతుల ధరించి పగవారు భయపడునట్లు సింహనాదములు చేయుచు నరి కట్టిరి.

కం. నగములు కేలం దాలిచి, యగచరసంఘంబు నిలువ • నద్రిసమీపా
నుగతమహాంభోధరతతి,పగటుం దలపించెఁ గన్గ•వకు వేఁగగుచున్. ౧౩౯౮

అర్థములు. నగములు = కొండలు, అద్రిసమీప = కొండదగ్గఱ చేరిన పెద్ద మేఘముల యొక్క, నగటున్=విధమును.

తాత్పర్యము

కొండలు చేతులధరించి వానరులు నిలువఁగా పర్వతసమీపమందు వెంబడించిన పెద్ద మేఘముల సమూహమును స్మృతికి వచ్చునట్లు చేసెను. అది కన్నులకు బాధాకరమై యుండెను.

—♦ ౬౩-వ సర్గము. కుంభకర్ణుఁడు రావణుఁ జూచుట ♦—

కం. కోదనిద్దురముబ్బున నతి, మదిరాపానమున నైన ♦ మత్తును బెరయన్
మది యాకులితంబుగ దశే, నదనుం గన రాక్షసప్ర♦వరుఁ డరిగె వెసన్.

అర్థములు. కోదనిద్దుర = కోదవనిద్దుర, కొఱనిద్దుర — అతిమదిరాపానమున=విస్తరించి సారాయము త్రాగుటచే, బెరయన్ = కలియఁగా, ఆకులితంబుగ=కలఁత చెందినట్లుగ, ప్రవరుఁడు=శ్రేష్ఠుఁడు.

తాత్పర్యము

కొఱఁత నిద్దురలో లేచిన మబ్బును, విస్తారముగఁ ద్రాగుటచేఁ గలిగిన మత్తును గలియఁగా మనస్సు కలఁతపడఁగా రావణునిఁజూడ రాక్షసశ్రేష్ఠుఁ డగు కుంభకర్ణుఁడు త్వరగా పోయెను.

సీ. రాక్షసవీరుల ♦ రాజి భజింపఁగఁ, బురజనుల్ చల్లఁగఁ ♦ బుష్పవితతి
రమ్యలక్ష్మీకమౌ ♦ రాజమార్గంబునఁ, జని హేమజాలక ♦ సమ్మతంబు
తతభానుభాస్వర ♦ దర్శనంబును విశా, లం బగు నన్న గృ ♦ హంబుఁ దరణి
యభ్రజాలముఁ జొచ్చు♦నటుఁ జొచ్చి లోఁ జని, కక్ష్యాంతరంబులు♦గడచి పోయి
తే. దూరముననఁ బాకవిద్వేషి♦తోయజభవుఁ జూచుభంగిని నగ్రజుఁ♦జూచియతఁడు
పుష్పకవిమానమునఁ జింత♦మునిఁగియుండఁ, జేరఁజనఁ గుంభకర్ణుండు శీఘ్రగతిని.

అర్థములు. రమ్యలక్ష్మీకము = మనోహరమైన యందము గలది, హేమజాలక సమ్మతంబు = బంగారు కిటికీలచేత సర్వప్రియమైనది, తత = విస్తారముగ భానుభాస్వరము = సూర్యకాంతిచే, దర్శనంబును = కానవచ్చు నాకారముగలది దృశ్యత ఇతి దర్శన మ్మని వ్యుత్పత్తి, ఆకారము అని యర్థము. తరణి=సూర్యుఁడు, అభ్రజాలము = మేఘసమూహము, కక్ష్యాంతరంబులు = లోపలి తొట్టికట్లు, పాకవిద్వేషి = ఇంద్రుఁడు, తోయజభవున్ = బ్రహ్మను.

తాత్పర్యము

వీరు లగు రాక్షసుల సమూహము వెంబడింపఁగ పురములోనివారు పూలు చల్లఁగా మనోహరమైన యందముగల రాజమార్గంబునఁబోయి బంగారు కిటికీలచే మనస్సునకుఁ బ్రియము కలిగించుచు సూర్యునివలెఁ బ్రకాశించు నాకారము గలిగి

వెడలు పైన యన్న యింటిని సూర్యుఁడు మేఘములందుఁ బ్రవేశించినట్లు ప్రవేశించి తొట్టికట్లు దాఁటిపోయి దూరమున నుండియే యింద్రుఁడు బ్రహ్మను జూచునట్లు చూచి యతఁడు చింతలో మునిగియుండుటచేఁ దన రాక తెలిసికొనలేక యుండఁగా దగ్గఱకుఁ బోఁగా.

శా. రమ్మా నాయన! యంచు రావణుఁడు హా•ర్షం బారఁగా లేచి ప్రే
మ మ్మెప్పారఁగఁ గౌఁగిలించుటయు స•మ్మానంబుతో నన్నపా
దమ్ముల్ ఫాలము సోఁక మ్రొక్కి నికట•స్థం బైన పీఠంబునన్
సమ్మోదంబున నుండి యిట్టు లనె రూ•క్షప్రేక్షణుం డన్నతోన్. ౧౪౦౧

అర్థములు. నికటస్థము=సమీపమందుండు, రూక్షప్రేక్షణుఁడు = కఱకుఁజూపులు గలవాఁడు.

తాత్పర్యము

నాయనా వచ్చితివా యని సంతోషముతో లేచి ప్రేమాతిశయమునఁ గౌఁగిలింపఁగా కుంభకర్ణుఁడు అన్న పాదములకు నొసలు దాఁక నమస్కరించి సమీపమందున్న పీటపై గూర్చుండి కోపముచేఁ గఱకులైన చూపులతో నిట్లనెను.

కం. భూవర! నాపైఁ బ్రేముడి, నీ వేళను నన్ను లేప • నేలా చెపుమా?
యేవంక భయము దొసరెనొ, యెవాఁ డొకొ ప్రేతభావ•మిపుడు వహించున్.

అర్థములు, ప్రేముడిన్=ప్రేమచే, ప్రేతభావము—మరణము.

తాత్పర్యము స్పష్టము.

కం. త్వరగ వచింపుము యన సో•దరకోపస్థితి నెఱింగి • దశముఖుఁ డీష
త్పరివృత్తలోచనుండై, యరమర లేకనియె నమ్మ•హావీరునితోన్. ౧౪౦౩

అర్థములు. ఈషత్=కొంచెము, పరివృత్తలోచనుండై=తిరిగెడు కన్నులు గలవాఁడై, అరమర=భేదభావము, సందేహము.

తాత్పర్యము

త్వరగా చెప్పుము, అనఁగా తమ్ముఁడు తన స్థితి విని కోపించి యున్నాఁడని తెలిసికొని రావణుఁడు కొంచెము కోపముచేఁ గన్నులు తిరుగుచుండ నితఁడు చేయునో చేయఁడో యను సందేహములేక యా వీరునితో నిట్లనియె.

-• రావణుఁడు కుంభకర్ణుతో శ్రీరామునివలన రాక్షసులకైన విపత్తు దెలుపుట •-

ఉ. తమ్ముఁడ! నీవెఱుంగవు గ•దా సుఖసుప్తుఁడ వౌటఁ బెద్దకా
లమ్మగ నన్ను రాఘవుఁ డ•లంచెడిరీతి, దినేశసూతి సా
హ్య మ్మొనరింప సైన్యయుతుఁ•డై వనరాశిఁ దరించి సోఁకుసై
న్యమ్మును సర్వ మాజిని వి•నాశము సేసెడి మూలముట్టుగన్. ౧౪౧౪

అర్థములు. సుఖసుప్తకవు=సుఖముగా నిద్రించువాఁడవు, పెద్దకాలముగ=దీర్ఘకాలముగ, యుద్ధము ప్రారంభమై రెండు దినములే యైనను దుఃఖావమాన

ములచే చాలఁగాలము గడచినట్లున్నది, నిమిష మొక యేఁడుగానున్నది, అలంచెడి రీతి=బాధపెట్టుచున్న విధము, దినేశసూతి=సూర్యపుత్త్రుఁడు, సుగ్రీవుఁడు, వనరాశిన్ = సముద్రమును, తరించి = దాఁటి, పోఁతుసైన్యమ్మును = రాక్షససేనను, ఆజిని=యుద్ధమందు, మూలముట్టుగన్=నిశ్శేషముగ.

తాత్పర్యము

తమ్ముఁడా! నీవు సుఖముగా నిద్రించుచుండుటచేత దీర్ఘకాలముగ రాముఁడు నన్ను బాధపెట్టు విధము నీకుఁ దెలియదుకదా! సుగ్రీవుఁడు తోడుపడ సేనతో సముద్రము దాఁటివచ్చి రాక్షససేన నంతయు కూఁకటివ్రేళ్ళతో నాశము చేయుచున్నాఁడు.

తే. కంటివే సేతు వొక్కఁటి ♦ కల్పితంబు, సేసి లంకాపురీప్రాంత♦భాసమాన
నిష్కుటోపవనంబుల♦నెగడఁ జేసె, వానరై కార్ణవంబు భూ♦జాని యయ్యొ.

అర్థములు. లంకాపురీప్రాంత=లంకానగరమునకు చుట్టు, భాసమాన = ప్రకాశించు, నిష్కుటోపవనంబులన్=ఇంటితోఁటలు, ఉద్యానవనములు–నిష్కుటము = ఇంటికి చేరికగానుండి ఆ యింటివారికి మాత్రమే యుపయోగపడునది, ఉద్యానము = పదుగురి కుపయోగపడునది, వానరైకార్ణవంబు=కేవల వానర సముద్రమును, భూజాని = రాముఁడు, భూభర్త.

తాత్పర్యము

చూచినావా! సముద్రమునకు సేతువొకటి కట్టి లంక చుట్టునుండు తోఁటలలో దొడ్లలలో వానరు లను సముద్రముచే రామచంద్రుఁడు నించినాఁడు.

ఉ. పోరికి రాక్షసోత్తములు ♦ పోవుటె కాని యొకండునే నిజా
కారముతోడఁ గ్రమ్మఱుట ♦ కానను, వానరులందు నొక్కఁడేన్
జేరుగలట్టివీరుఁ డని ♦ బిద్దుటయున్ వినరాదు, దాన లోఁ
గూరెను భీతి, నీ పురముఁ ♦ గూరిమి కావుము వీరసత్తమా! ౧౮౨౬

అర్థములు. బిద్దుటయున్=చచ్చుటయు.

తాత్పర్యము

యుద్ధమునకుఁ బోయిన రాక్షస వీరు లట్టులే పోవుటేకాని పోయిన స్వరూపముతో వచ్చినవాఁడు లేఁడు. వానరులందుఁ బేరుగల వీరు డొక్కఁడైనఁ జచ్చినట్లు తెలియలేదు. ఆ కారణమున భయమగుచున్నది. వీరోత్తమా! ఈనగరమును నీవు దయతో రక్షింపుము.

ఉ. కూలుతు గాక యాప్లవగ♦కోటుల నంచును నిద్ర లేపితిన్
జాలఁగ గోశసంచయము ♦ సత్త్వము నాశిలె, నమ్ముమీ, జర
ద్బాలజనావశిష్ట మగు♦పట్టన మన్ననిమిత్త మియ్యెడం
బాలన సేయుమా నలువు♦మా యతిదుష్కర మైనకార్యమున్. ౧౮౦౭

అర్థములు. కోశసంచయము = ధనము, సత్త్వము=బలము = జరత్ + బాల జనావశిష్టము = ముసలివాండ్రు పిల్లవాండ్రు మాత్రము మిగిలినది. అతి దుష్కరము=మిగుల కష్టమైన పని.

తాత్పర్యము

వానరసమూహమును నీవు చంపుదువుగాక యని నిన్ను నిద్రలేపితిని. ఆర్జించిన ధనములోను బలములోను చాలభాగము నశించినది. ముసలివాండ్రు పిల్లవాండ్రు మిగిలిన యీ నగరమును అన్న నిమిత్తమై రక్షింపుము. మిగులఁ గష్టముతోఁ జేయదగిన కార్యము నీవు చేయుము. పిల్లవాండ్రు ముసలివాండ్రు మాత్రమే మిగిలినదనే యింకను బట్టలేదు. ఇంద్రజిత్తు మొదలగు శూరులున్నారు. మూలబల మున్నది. అది నశించిన తరువాత నీగతి వచ్చును. అయినను కుంభ కర్ణునికి జాలి పుట్టుటకై యీ మాట చెప్పెను.

ఉ. ఎన్నఁడు నీకు మున్ను వచి•యించినవాఁడనె యిట్లు? స్నేహసం
పన్నత యాదరంబు నతి•మాత్రము నీపయి నా కెఱుంగవే?
పన్నగ దేవతాసురుల•భండనవేళల వారినెల్ల శౌ
ర్యోన్నతిఁ గెల్వవే? మఱవు•నొందితివా యవి యన్ని యెప్పుడున్? ౧౮౦

తాత్పర్యము

తమ్ముఁడా! మునుపెన్నఁడైన నేనిట్లు నీకుఁ జెప్పితినా? నీమీఁద నాకెంత యాదరము స్నేహము విశేషముగ నున్నదో నీ వెఱుఁగవా? దేవతలకు రాక్షసులకు యుద్ధము జరిగిన వేళల దేవతలను నీవు నీ శౌర్యముచే గెలువలేదా? అప్పుడు నీవు చేసినదంతయు నే నెప్పుడైన మఱచితినా?

ఉ. భీమపరాక్రమాఢ్య! భుజ•వీర్యము శౌర్యము ధైర్యమున్ సమి
ద్భూమిని నేఁడు చూపు, మిలఁ • బోటుమగండు భవత్సమానుఁ డే
డీ? మహితప్రియంబు ఘటి•యింపుము నాకిది, బంధులోక సం
గ్రామకళాప్రియా! మనయ•రాతులఁ ద్రుంపు తలంపు నెయ్యమున్. ౧౮౧

అర్థములు. భీమపరాక్రమాఢ్య = భయంకరమైన పరాక్రమ సంపదగల వాఁడా! సమిత్ + భూమిని = యుద్ధభూమియందు, పోటుమగండు = శూరుఁడు, భవత్సమానుఁడు = నీకు సరియగువాఁడు, బంధులోక = చుట్టముల సమూహమునకు, సంగ్రామకళా=యుద్ధవిద్యకు, ప్రియ=ప్రియమైనవాఁడా, అరాతులన్= విరోధులను, నెయ్యము=స్నేహము.

తాత్పర్యము

భయంకర పరాక్రమసంపత్తి గలవాఁడా! నీ భుజబలము, శౌర్యము, ధైర్యము నేఁడు యుద్ధభూమియందుఁ జూపుము నీవంటి శూరుఁడు నీకు సమానుఁ డేఁడీ? ఎక్కడ లేఁడు, నాకిది మిక్కిలి ప్రియమైనది. నీవును బంధువులందు యుద్ధవిద్యయందుఁ

బ్రియముగలవాఁడవు. కావున మన శత్రువుల చంపుము. మాయందు స్నేహము దలంపుము.

కం. నాకౌకసులం దోలిన, నీకు వనౌకసులు మాఱె • నిరుపమతేజ
శ్శ్రీక భవద్బలపవనో, ద్రేకవిఘాతములఁ జేయు • ద్వేషిఘనములన్.

అర్థములు. నాకౌకసులన్=దేవతలను, తోలిన=తఱిమిన, వనౌకసులు=వానరులు, మాఱె=ఎదురా, భవత్ బల = నీ బలమనెడి, పవనోద్రేక విఘాతములన్=గాలియొక్క యతిశయముచేఁ జెదరఁగొట్టఁబడినవి, ద్వేషిఘనములన్ = విరోధు లనెడి మేఘములను.

తాత్పర్యము

దేవతలఁ బాఱఁదఱిమిన నీకుఁ గోఁతులా యెదురు? అసమాన తేజస్సంపద గలవాఁడా? నీ బలమనెడి గాలిచే విరోధులను మేఘము లను నెగురఁగొట్టుము.

—• ౬౩-వ సర్గము. కుంభకర్ణుఁడు రావణు నిందించుట •—

చ. అని యిటు లంగలార్చు నసు • రాధిపుఁ గన్గొని నవ్వ దోఁప ని
ట్లను మును మేము మంత్రసమ • యంబున నెట్టి విపత్తు మూఁడు నీ
కని మది నిశ్చయించితిమొ • యట్టివిపత్తు హితాభిలందు ర
క్తిని గొనవట్టి నీకుఁ గలి • గన్, విపరీతము లేదు దీనిలోన్. ౧౪౧౧

అర్థములు. అంగలార్చు=అంగిలి యెండనేడ్చు, నవ్వదోఁపన్ = అప్పుడు చెప్పిన వినక పోయితివే, యిప్పుడు నెత్తి తగిలినదా యని నవ్వు.

తాత్పర్యము

అని యీ ప్రకార మేడ్చునట్లు మాటలాడు రావణుని జూచి నవ్వి యిట్లనియె. ఆలోచన సమయంబున నీకెట్టి కీడు మూఁడు నని మేము నిశ్చయించితిమో యట్టి కీడే నీ మేలుకోరువారి యందు ప్రేమలేనట్టి నీకు నేఁడు గలిగినది. ఇందు విపరీతము లేదు. ఏమిరా? యుద్ధమని జరిగిన మనవారిలోఁ గొందఱైన జత్తురుగాని చావక యుండరుగదా. ఒక యాఁడుదాని నిమిత్తము నా మేలు కోరిన వారిని నేను జంపుకొన వచ్చునా యను నాలోచన నీకు లేదాయె. చెప్పినను దెలిసికొనక పోయితివి. ఆఁడుదానియందు కామమున్నంత మాత్రము నీ బంధువులందు మిత్రులందు ప్రేమ లేదాయె. దాని ఫల మనుభవించు చున్నావు. అనుకొనిన దానికి విరుద్ధముగా నేదియు జరుగలేదు.

కం. దురితములు సేయువారలు, నిరయంబునఁ గూలునట్లు • నీ చేసిన యా
దురితము తత్ఫలము న్నిను, విరియక చేసేత ననుభ • వింపఁగఁ జేసెన్.

అర్థములు. దురితములు=పాపములు, నిరయము = నరకము, విరియక = చెడిపోక, చేసేతన్ = వెంటనే.

## తాత్పర్యము

పాపము చేసినవారికి నరకానుభవము దప్పనట్లు నీవు చేసిన పాపకార్యమున కు ఫలము వెంటనే కనఁబడెను. దాని ననుభవించు చున్నావు అత్యుత్కట పుణ్యపాపములు త్వరలోనే కదా ఫలము కనఁబఱుచును. ఈ చేతఁ జేసితివి, ఆ చేత ననుభవించుచున్నావు. ఇప్పు డేడ్చి లాభమేమి ?

చం. తొలుతను రాజ! నీ వెవరి • తోడను గర్జముభంగి యోజనం
 జలుపఁగ లేదు, కేవలము • శౌర్యమదంబున భావ్యనర్థముల్
 దలఁపఁగ వైతి, విత్తపుఁడు • దా మును వెన్కలఁ జేయ నర్థమూ
 కెలసము లోలి వెన్క మును • గోరి యొనర్చిన నీతివేత్తయే ? ౧౮౧౩

అర్థములు. కర్జము భంగిన్=కార్యవిధమును, భావ్యనర్థముల్=రాఁబోవు కీడులు, విత్తపుఁడు = ధనము గలవాఁడు, కెలసము = కార్యము, నీతి వేత్తయే= నీతి తెలిసినవాఁడా.

## తాత్పర్యము

రాజా ? నీవు సీతను దెచ్చుటకు ముందుగ రాముఁ డనువాఁడు మన ఖరాదులఁ జంపినాఁడు, దానికిఁ బ్రతిక్రియగా సీతను దేఁదలచినాను, ఇట్లు చేసిన యుద్ధము చేయకయే రాముని జంపవచ్చునని నా యభిప్రాయము, మీ యభిప్రాయ మేమి యని యెవ్వరితో నాలోచింపవైతివి. నేను శౌర్యముగలవాఁడనను మదముచే నేమి కీఁడులు రాఁగలవో యాలోచింపక పోయితివి. ఇది రాజనీతియా? నీతివంతుఁ డిట్లు చేయునా ? ధనముగలవాఁ డొక వ్యాపారమునందు దిగుటకు ముందు రాఁగల లాభ నష్టముల నాలోచించి ధననష్టి కష్టములేని మార్గము చేయవలయునా? కన్నులు మూసికొని ధనముగలవాఁడను నాకేమి లక్ష్య మని కార్యముచేసి నష్టివచ్చినపిమ్మట నేమి చేయవలయునని యాలోచింపవలయునా? ఇది నీతి తెలిసినవాని లక్షణమా ?

సీ. హవిని నపాత్రుల • కర్పించునట్టులు, కాలదేశవిహీన • కార్యతతులు
 విపరీతఫలముల • వెలయించు నుత్తమ, మధ్యమాధమకార్య•మార్గములను
 దేవ! ద్రవ్యం బన • దేశకాలములునా, నాత్మప్రయోజనా•ఖ్యలను బరఁగు
 పంచసంబంధంబు • లంచితగతిఁ గూర్చి, సచివులతోడ యో•జన యొనర్ప

ఆ. ననుభవించుఁ జుమ్మ • యతులనీతిఫలంబు, నీతి విడక కార్య•నిర్ణయంబు
 సచివమిత్రయుక్తిఁ•జలిపెడు నాతండు, కార్యజయముఁ గాంచి•గణన కెక్కు.

అర్థములు. హవిని=హోమము చేయఁగా మిగిలినదానిని, అపాత్రులకు= అయోగ్యులకు, కాలదేశ విహీన=కాలము దేశము నాలోచింపక చేసిన, కార్యతతులు = కార్యసమూహములు, విపరీత ఫలములన్ = చెడు ఫలములను, ఉత్తమము, మధ్యమము, అధమము అను కార్యముచేయు త్రోవలను.

## తాత్పర్యము

మహావిష్ణువు సహస్రాక్షుల కిచ్చిన దోషము వచ్చునట్టులు ఏకాలమున నేకార్యము నెట్లు చేయవలయును. ఏ ప్రదేశమున నేకార్య మెట్లుచేయవలయును? అనుజ్ఞానము లేక యిష్టము వచ్చినట్లు చేసిన, ననుకొన్న ఫలమునకు విరుద్ధమైన ఫలము నిచ్చును. శత్రువులు బలహీనులుగా నుండి తాను బలవంతుఁడుగా నుండునపుడు యుద్ధమునకుఁ బోవుట యుత్తమమార్గము. శత్రువు తనయంత బలముకలవాఁడై సమానుఁడై యుండెనా సంధి చేయవలయును. ఇది మధ్యమమార్గము. శత్రువు బలవంతుఁడై తాను బలహీనుఁడైనపుడు వాని యిష్ట ప్రకారము వానికి నేదైన నిచ్చి వాని నాశ్రయింపవలెను. ఇది యధమమార్గము. రాజా! యిది గాక ద్రవ్యము – దేశము – కాలము – ఆత్మ ప్రయోజన మని యైదు సంబంధములు గలవు. ఈ యైదింటికిఁ దగిన టుత్తమ మధ్యమాధమ కార్యము లెట్లు చేయవలె – ఏది చేయవలె నని మంత్రులతో నాలోచించి చేయవలెను. మంత్రులను వారి నుంచుకొనుటయేల? వారి నాలోచింపక పనిచేయు వానికి మంత్రు లేల? తన యిష్టమువచ్చినట్లు కార్యములుచేసి యవి తప్పివచ్చినపుడు ఏమిచేయవలయు నని యడిగిన మంత్రులేమి చెప్పఁగలరు? ఇట్లు చేయుటకు ఫలము న్యాయ్యమార్గమం దుండుటయే. న్యాయము తప్పక మంత్రులతోను స్నేహితులతోను నాలోచించి వారితోఁ గలిసి కార్యముచేయు విధము నిర్ణయించి చేయువాఁడు కార్యజయము గాంచును. నీతి మంతుఁడని ప్రసిద్ధి కెక్కును.

చ. క్రమముగ ధర్మ మర్థమును ♦ గామము వేఱుగ నైన నన్నియేన్
 గ్రమమతి రెండు రెం డయిన ♦ రాక్షసవల్లభ! నిత్య మర్హ కా
 లముల భజించు పూరుషుఁడు ♦ లక్ష్మికిఁ బట్టగు, నెల్లవేళఁ గా
 మమ కొనియాడువాఁడు నొక ♦ మానవుఁడే? సిరి వాని నొల్లునే? ౧౮౧౧

## తాత్పర్యము

ధర్మము అర్థము కామము వీనిని వేఱు వేఱుగ నొక్కొక్క దానినైనను అన్నిటిని గలిపి యైనను క్రమము దప్పించి రెండు రెండుగ నైనను, అనఁగా ధర్మార్థములుగాని, ధర్మకామములుగాని, అర్థకామములుగాని, ప్రతిదినము దాని దానికి విధించిన కాలమందుఁ జేయవలెను. అనఁగా ప్రాతఃకాలమందు ధర్మము, మధ్యాహ్నమందు అర్థము, సాయంకాలమున కామమునుగుఱించి యాలోచింపవలెను. ఇది వేఱువేఱుగాఁ జేయుపద్ధతి. అటుగాక ప్రాతఃకాలమందు విహితమైన ధర్మము చేసి తరువాత దానికిఁ దోడుగా నర్థము నాలోచింపవచ్చును. మధ్యాహ్నమున విహితమైన అర్థము నాలోచించి యావల దానికి దోడు ధర్మము నాలోచింపవలెను. సాయంకాలమునఁ గామము నాలోచించి యావల దానికిఁ దోడు ధర్మముగాని యధర్మముగాని యాలోచింపవలెను. అంతియె కాని సాయంకాలమందుఁ దప్పఁ

దక్షిణవేళల కామవిచారము నిషిద్ధము. ఇది రెండవ రెండుగాఁ జేయుపద్ధతిఁ సాయంకాలమందు ధర్మార్థ కామములు మూఁడు నాలోచించుట మూఁడవ పద్ధతి. అటుగాక సర్వవేళలఁ గామమునే యాలోచించు వాఁ డొక మనుష్యుఁడా? వాని యొద్ద లక్ష్మి నిలుచునా ?

తే. దానఁ దత్త్రితయమున నుత్తమ మెఱింగి
నృపుఁడో నృపమాత్రుఁడో దాని నిష్ఠఁ దవుల
నొల్లఁడేని వాఁడు గుండెలు వ్రక్కలు మిగులఁ
జదివి యేటికిఁ గేవల శ్రమముచేటు. ౧౪౧౬

అర్థములు. దానన్ = ఆ కారణముచేత - తత్ + త్రితయమునన్=ఆ మూఁటి యందు, ధర్మార్థకామములందు, ఉత్తమము=శ్రేష్ఠమైనది, నృపుఁడో = ప్రజలఁ బాలించు రాజో, నృపమాత్రుఁడో = రాజువంటి గొప్పవాఁడో, నిష్ఠన్ = వ్రతముగా, విడువక తవులఁడేని=అనుష్ఠింపక పోయెనా ?

తాత్పర్యము

ఈ కారణముచేత ధర్మార్థ కామములందు నుత్తమాధమ మధ్యమములందు నేది శ్రేష్ఠమో కేవల ధర్మముగాని, ధర్మముతోడి యర్థకామములఁ గాని తెలిసికొని రాజయిననుగాక యంతటివాఁ డితరుఁడైనను విడువక యనుష్ఠింపఁడేనివాఁడు చదివిన చదువునకు ఫలము గుండెలు వ్రక్కలు చదివి శ్రమపడుట తప్ప వేఱు ఫలము లేదు. వాఁడు చదివిన చదువు వ్యర్థము. నీ చదువు గతి యిట్టిదే యని భావము.

ఉ. సామము దానభేదములు సంహతి గాఁగనో యొక్కొకఁడో
నీమము దోఁప నీతియు ననీతి నెఱుంగుచు ధర్మవిత్తముల్
కామము మంత్రయుక్తుఁ డయి కార్యదృఢీకరణం బొనర్చి ని
ష్ఠామహితాత్ముఁ డైన నరుఁడు సత్యము కీడునఁ గుందఁ డెన్నఁడున్. ౧౪౧౭

అర్థములు. సామము=శత్రువుతో మంచి మాటలాడుచు నుండుట, లోపల విరోధభావ మున్నను పైకి దానిని దెలియనీక మంచిమాటలాడుచు స్నేహితునివలె నుండుట, దానము=శత్రువునకు ధనమిచ్చియో వాని కార్యములందు సహాయపడియో సమరసపడి యుండుట, భేదము=మిత్రునివలె నటించుచు శత్రుపక్షము వారిలో నొకరికి భేదాభిప్రాయములు కలహము పుట్టించుట, సంహతి గాఁగనో= ఇవి యన్నియు నేకకాలమందుఁగాని, నీతి = న్యాయము, వినీతి = అన్యాయము, ధర్మవిత్తముల్=ధర్మము అర్థము, మంత్రయుక్తుఁడయి=ఆలోచనతోఁ గూడిన వాఁడై, కార్యము నిశ్చయము చేసికొని దానిని నియమముగా ననుష్ఠించు గొప్ప మనస్సుగలవాఁ డే నాఁటికిని కీడులపాలు కాఁజాలఁడు. ఇది సత్యము.

తే. అర్థతత్త్వజ్ఞ మగు సచివాళితోడఁ, గార్య మిట్టిది యిట్టి దకార్య మనుచు
యోజనమొనర్చి హితఫల మొసఁగు దానిఁ, జలుపునాతఁడు జీవించు సౌఖ్యముగను.

అర్థములు. అర్థతత్త్వజ్ఞము = నీతి శాస్త్రము ప్రకారము మూఁడు పురుషార్థముల రహస్య మెఱిఁగినది యగు, సచివాళితోడన్ = మంత్రుల సమూహముతో, హితఫలము = మేలగు ఫలము.

తాత్పర్యము

నీతిశాస్త్రప్రకారము ధర్మార్థకామములను పురుషార్థముల యనుష్ఠాన రహస్యము తెలిసికొని యిది చేయఁదగినపని, యిది చేయరాని పని యని యాలోచించి యేది హితము నొసఁగునో దానిని జేయువాఁడు సుఖముగ జీవించును.

చ. తెలియక శాస్త్రమర్మములు • దేఁకువమైఁ బశుబుద్ధులైన జా
ల్ములు సురవైరివర్య! భ్రమ•మోహితచిత్తనృపాలుమంత్రులై
వెలయుచు మంత్రముల్ సలుపు•వేళలఁ గేవల మా ప్రగల్భతన్
బలుకఁగ ముందు నిల్చెదరు • పాటిలుచేటుఁ దలఁప రేమియున్. ౧౮౧

అర్థములు. శాస్త్ర మర్మములు = శాస్త్రార్థ రహస్యములు, తేఁకువమై = సాహసముతో, పశుబుద్ధులైన జాల్ములు = పశువులవలె నాలోచించు జ్ఞానము లేని మూఢులు, 'జ్ఞానేన హీనః పశుభిస్సమానః' జ్ఞానము లేనివాఁడు పశువుతో సమానుఁడు భ్రమమోహిత చిత్త నృపాలు మంత్రులై = కార్య మకార్యమని యకార్యము కార్యమని తలఁచి యజ్ఞానవశమైన మనస్సుగల రాజులకు మంత్రులై, మంత్రముల్ సలుపు వేళలన్ = ఆలోచనములు చేయునపుడు, కేవలమా ప్రగల్భతన్ = మంచి చెడ్డలు తాఁకు దప్పులు నాలోచించు శక్తి లేక తెలిసినవారి వలె వర్తింపవలయు నను డంబముతో.

తాత్పర్యము

యథార్థజ్ఞానము లేమిని సరియైనది తప్పని తప్పొప్పని తలంచు ప్రభువునకు, నీతిశాస్త్ర రహస్యములు తెలియక సాహసముగలవారై పశువులవలె ఆహారనిద్రాభయమైథునంబుల మాత్ర మనుష్ఠించువారు మంత్రులై, కార్యాకార్యము లాలోచించు సమయమునందు నూరకుండిన మూఢులని ప్రభువు దలంచునని యూహాపోహములు లేక, తెలిసిన వారని పించుకొనవలెనను దంబముతో, ఆలోచన చెప్పుటకు ముందు వచ్చెదరు. తాము చెప్పినట్లు చేసిన మేలు గలుగునా కీడు కలుగునా యని యాలోచింపరు. అటువంటి ప్రభువగు నీకు నిటువంటి మంత్రులే దాపరించిరని భావము.

తే. అర్థశాస్త్రానభిజ్ఞులై • యధికలక్ష్మి, నంద నభిలాష పడెడి శా•స్త్రార్థధీవి
హీనుల హితేతరోక్తుల•నించుకేని, పాటిసేయంగఁ దగదు ని•శాటరాజ!

అర్థములు. అర్థశాస్త్రానభిజ్ఞులై = నీతిశాస్త్రము తెలియనివారై, అధికలక్ష్మినందన్ = సంపద విశేషముగ రావలయునని, అభిలాష పడెడి = కోరికగల, శాస్త్రార్థధీ విహీనుల = శాస్త్రార్థ జ్ఞానము లేనివారియొక్క, హితేతరోక్తులను = కీడు కలిగించు మాటలను, ఇంచుకేని = కొంచెమైన, పాటిసేయంగరాదు = ప్రమా

దముగా గ్రహింపరాదు. నిశాటరాజ = రాక్షసరాజ, నిశయందుఁ దిరుగువారు నిశాటులు.

తాత్పర్యము

నీతిశాస్త్రము దెలియనివారై సంపద విశేషముగ రావలయు నని కోరిక మాత్రము గలవారైన శాస్త్రజ్ఞానము లేనివారు చెప్పు కీడు గలిగించు మాటలను రాజగువాఁడు కొంచెమైనఁ బ్రమాణముగ గ్రహింపరాదు.

తే. హితమువలెఁ దోఁచు నహితంబు ♦ ధృష్టు డగుచు
వాఁగు చెఱుపనచేటను ♦ వల నెఱింగి
కార్యములు యోజన యొనర్చు ♦ కాలములను
దవ్వు దవ్వుల నిల్పుటే ♦ తగవు పతికి. ౧౮_౨౧

అర్థములు. ధృష్టుఁడు=దిట్టతనము గలవాఁడు, తెంపరి - వాఁగు=వదరు నట్టి, చెఱుపన చేటను=కార్యనాశము చేయువానిని, వలను=ఉపాయము.

తాత్పర్యము

శాస్త్రజ్ఞానము లేనివాఁడు చెప్పెడు మాటలు వినకుండుటే గాదు, రాజగువాఁడు వానిని మంత్రాలోచన సభకే రానీయరాదను చున్నాఁడు. పైకి హితము వలెఁ గానవచ్చు నహితమైన దానిని ధీరుఁడై వదరునట్టి కార్యనాశకరుని, ఉపాయ మెఱింగి కార్యము లాలోచించుకాలమందు సభకు రానీయక దూరముననే యుంచవలెను.

కం. కర్మజ్ఞులైనపగఱకు, మర్మంబులు చెప్పి యాత్మ♦మహీపునిచే దు
ష్కర్మంబులు చేయించుచు, దుర్మంత్రి విపత్పయోధిఁ ♦ ద్రోయుఁడె తేనిన్.

అర్థములు. కర్మజ్ఞులైన పగఱకున్ = ఏ కార్య మెట్లు చేయవలయునో తెలిసిన పగవారికి, మర్మంబులు=రహస్యములు, దుష్కర్మంబులు = చేయరాని పనులు దుర్మంత్రి = చెడ్డమంత్రి, తేనిన్ = ప్రభువును విపత్పయోధి = ఆపత్సముద్రమునందు, త్రోయఁడె=త్రోయకుండునా? అవశ్యము ద్రోయును.

తాత్పర్యము

ఏయే కార్య మెట్లెట్లు చేయవలయునో తెలిసిన పగవారికిఁ దన ప్రభువు రహస్యంబులు చెప్పి యతనిచేఁ జెడు కార్యములు చేయించు దుర్మంత్రి తన ప్రభువు నాపదలందు ముంచకుండునా! అవశ్యము ముంచును.

కం. మిత్రులవలె వెలితోఁచు, నమిత్రుల మంత్రంబువేళ ♦ మెలపున శాంతిన్
ధాత్రీపతి మెలఁగం దగు, శత్రుహరణ! వారి పలుకు♦సరణి యరయుచున్.

తాత్పర్యము

మిత్రునివలెఁ బైకి కనఁ బడుచు వాస్తవమున మిత్రులుగాని మంత్రులను

రాజగువాఁడు తొందరపడక, మెల్లఁగువతో వారివారి యాలోచనలు చెప్పనపుడు మాటలాడు విధమును బట్టి తెలియవగును.

కం. త్వరపడి పని చేయుచు దు,శ్చరితు సచివుఁ డనుచు నమ్మ • జనపతి మర్మం
బరయుచు లోఁ జొత్తురు పరు, లరిమర్దన! క్రౌంచనగము • హంసలువోలెన్.

తా త్ప ర్య ము

విమర్శింపక తొందరపడి పనిచేయుచుఁ జెడు నడవడి గలవానిని హితుఁడగు మంత్రియని నమ్మినట్టి ప్రభువు మర్మము దెలిసికొని క్రౌంచనగములోని రంధ్రము తెలిసి హంసలు లోపలఁ దూఱినట్లు పగవారు దూఱుదురు.

కం. ఉక్కువు నరి నెఱుఁగక తమ, నక్కఱఁ గాచికొనలేని • యధిపతి కీడుల్
తక్కక పొరయుఁగ సంపద,ప్రక్కలుగాఁ బోలియు నాత్మ•పదవీచ్యుతుఁడై.

అర్థములు. ఉక్కువున్ = కపట స్వభావము గలవానిని, అరిన్ = వాస్తవమున శత్రువు, పైకి మిత్రుఁడు, అక్కఱన్ = పనిపడినవేళ, ఆత్మపదవీచ్యుతుఁడై=తన పదవిని బోగొట్టు కొన్నవాఁడై.

తా త్ప ర్య ము

మిత్రునివలె నటించుచు కపటము గలవాఁడైన శత్రువును దెలిసికొన లేక వాని మాటలు నమ్మి యక్కఱవేళఁ దన్ను రక్షించుకొనలేని ప్రభువు కీడులు తప్పక పొందినవాఁడై తనపదవి పోఁగొట్టుకొని సంపదకూడ నాశముచేసికొనును.

కం. మును నీ కనుజుఁడు చెప్పిన, పని జేయుమ యదియె నీకుఁ•బరమహితం బౌ
దనుజాధిప! నామత మిది, విను మావలఁ జేయుమీ య•భీష్టముపగిదిన్.

అర్థములు. అనుజుఁడు = మన తమ్ముఁడు, విభీషణుఁడు.

తా త్ప ర్య ము స్పష్టము

ప్రహస్తుఁడు కుంభకర్ణుఁడు నేకాభిప్రాయము గలవారు. నీవు క్షుద్రకామమును ప్రధానముగా నెంచి దానికై ధర్మార్థములు నాశము చేసికొనఁ జూచుట నీ మొదటి తప్పు. నీకు వాస్తవము తెలుపక భయముననో దాక్షిణ్యముననో తెలివి తక్కువ తనముచేతనో దుర్బోధములుచేసి నీవు చేసినదే సరియని యిచ్చకములు పలుకు వారలను దూరముగ వెడలఁగొట్టక దగ్గఱ చేర్చుట నీ రెండవతప్పు. నీ మేలుకోరి చెప్పినవానిని విడనాడుకొనుట మూఁడవతప్పు. ఈమూఁడు తప్పులచే నీవు నాశమైపోవుచున్నావు. అనుట కుంభకర్ణుని యుపన్యాసమున సారాంశము.

—• రావణుఁడు కుంభకర్ణుఁ గోపించి పలుకుట •—

తే. ఇట్లు ఘటకర్ణుఁ డెంతయు • హితముఁ బలుక
వింశతిభుజుండు విని రోష • వివశుఁ డగుచుఁ
గనుబొమ లుమ్మడివడఁ గను • ల్గలఁక వాఁఱఁ
గటము లదరంగ సోదరుఁ • గాంచి పలికె. ౧౮.౨౭

అర్థములు. హితము = మేలైనది, రోషవివశుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, కటములు=చెక్కిళ్ళు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. శౌర్యధనాఢ్య ! నీతిగుణ◆శాలియు మాన్యుఁడు నైన దొడ్డ యా
చార్యునిపోల్కి శాసనము ◆ సల్పెద వేలర ? చాలుఁ జాలు, నీ
కార్యము వేళ యుక్తమగు ◆ కార్యము సల్పినఁ దీరుఁగాక యే
పర్యవసాన ముండెడిని ◆ బల్కుము కేవలవాక్ప్రపంచమునన్. ౧౪౨౯

తాత్పర్యము

ఓరీ మహాబలశాలీ! నీతిగుణము గలవాఁడును పూజ్యుఁడునైన పెద్ద యాచార్యునివలె 'నీవు చేసినది తప్పు. ఇట్లు చేయుమని న న్నాజ్ఞాపించెదవేలరా? చాలుఁజాలు. మాటలాడకు. పనిపడిన యప్పుడు పనిచేసినఁ గార్యము చక్క నగును గాని రిత్తమాటలు నోరెండ వదరిన నేమిరా లాభము వచ్చును.

కం. పొరపడియో తెలియమినో, యురుబలవీర్యాశ్రయమున◆నో తప్పి చనన్
గరణీయము మఱిమఱి యది, వరమని భాషింప నేమివచ్చుం జెపుమా ?

తాత్పర్యము

చేయవలసిన కార్యము ప్రమాదముననో అజ్ఞానముచేతనో బలము, శౌర్యము గలదను నమ్మకము చేతనో చేయక తప్పిపోయినది. దానినే మీఁదమీఁద నీవు చేసినది తప్పు. నీవు చేసినది తప్పని మఱియొకటి యొప్పని మాటలాడిన రాఁగల లాభమేమి ?

కం. కడచినదానికి వగతురె?, కడచినదో కడచినదియొ◆కార్యం బిపు డే
వడువునఁ దీర్పఁగ నగు నది, కడఁగు; గత ముపన్యసింప ◆ గార్యము గలదే?

తాత్పర్యము

బుద్ధిమంతులు తము చేయిమించి దాటిపోయిన దానికి పోయెనే పోయెనే యని యేడ్తురా యేమి? పోయినదేమో పోయినది. కార్యము నిప్పు డెట్లు చక్కఁ బెట్టవలయునో దానికిఁ బ్రయత్నింపుము. అంతియకాని కడిచినదాని నుపన్యసింప నేమి కార్యము కాఁగలదు.

ఉ. నాపయి నీకు స్నేహము ఘ◆నం బగు నేనియు, నీ వెఱుంగుదేని
నీ పటుశౌర్య మింతయని ◆ నీ మది, నిప్పటి యెత్తికోల్ నిరా
క్షేపపుఁ గార్యమంచుఁ బరి◆కించెద వేనియు, వేగ మామకీ
నాపనయోద్భవం బగు న◆నర్థము శౌర్యముచేతఁ దీర్పుమీ. ౧౪౩౧

అర్థములు. ఘనంబు = గొప్పది, ఎత్తికోల్ = ప్రయత్నము, యుద్ధ ప్రయత్నము, మామకీన=నాయొక్క, అపనయ = నీతిమాలినతనముచే, ఉద్భవం బగు=కలిగిన, అనర్థము=కీడు, తీర్పుమీ=చక్కఁజేయుము.

### తాత్పర్యము

నామీఁద నీకు విశేషించి ప్రేమ యుండినను నీ బలశౌర్యము లెంత మాత్రమో నీకుఁ దెలిసియుండినను, ఇప్పటి యుద్ధప్రయత్నము నిరాక్షేపకార్య మని నీకుఁ దోఁచినను శీఘ్రముగ నేను నీతిమాలి చేసిన కార్యముచేఁ గలిగిన కీడును నీ శౌర్యముచేతఁ జక్కఁజేయుము.

దీనివలనఁ దాను జేసిన సీతాహరణము నీతిమాలిన పని యని రావణునకుఁ దోఁచిన కాని దురభిమానము అవమానము మౌర్ఖ్యము ఆమెను మరల నిచ్చుటయం దడ్డపడిన వని యేర్పడుచున్నది. ఇప్పుడు సీతను రామచంద్రమూర్తికి సమ ర్పించి సంధి చేసికొనినను, నీ పని యప్పుడే చేయరాదా? ఈమాత్రమున కందఱను జంపవలెనా? పరుల నెందఱనైనఁ జంపనేర్చునుగాని తన ప్రాణముమీఁదికి వచ్చి నపుడు భయపడి సంధిచేసికొనెను అని లోకు లందురే యని విచారము. కావునఁ బ్రతిష్ఠకై చావవలయుననియే వాఁడు నిశ్చయించెను.

కం. ఇడుమఁగొను టెఱిఁగి దీనతఁ, మిడికెడినరుఁ జేరువాఁడె ♦ మిత్రుఁడు జగతిన్

దొడరి యపనీతి దుఃఖము,పడునాతనిఁ గాచువాఁడె♦బంధువు సుమ్మా.౧౮౩౨

అర్థములు. ఇడుమఁగొనుట = ఆపద నొందుట, దీనతన్ = దుఃఖముచే, మిడికెడినరు=ఏమిచేయుటకుఁ దోఁపక బాధపడువానిని, చేరువాఁడె = సహాయ పడువాఁడె, అపనీతి=నీతిమాలినకార్యము చేసి.

### తాత్పర్యము

ఆపద నొందుట తెలిసి దుఃఖపడువానిని జేరుకొని సహాయపడువాఁడే మిత్రుఁడు. నీతిమాలిన పని చేసి దుఃఖపడువానిని రక్షించువాఁడే బంధువు. కాని సహాయము చేయక నీ విట్లు చేసితివే, ఇట్లు చేసితివే యని దెప్పెడివాఁడు బంధువు గాఁడు. మిత్రుఁడు కాఁడు.

—♦ కుంభకర్ణుఁడు రావణుని సమాధానపఱుచుట ♦—

కం. అనిన క్షుభితేంద్రియుని ధీ,రుని దారుణవచను నన్న ♦ రోషవశుంగా

మనమున నెఱింగి మెల్లన, వినయంబున మధురసూక్తి ♦ విజ్ఞాపించెన్.౧౮౩౩

క్షుభితేంద్రియుని = కలఁతజెందిన యింద్రియములు గలవానిని ధీరుని = ధైర్యశాలిని, దారుణవచనున్=పరుషముగా మాటలాడువానిని, రోషవశుంగా= కోపించినవానిఁగా, మధురసూక్తి=తియ్యని మంచిమాటలతో.

### తాత్పర్యము

ఈ ప్రకారము రావణుఁడు చెప్పఁగా తన యన్న కలఁత చెందిన యింద్రి యములు గలవాఁడు కావున నేను జెప్పినది వీని మనస్సునకు రాలేదు, తన పట్టిన పట్టు వదలనివాఁడు కావున మూర్ఖుఁడు. కోపము గలవాఁడు కావున బుద్ధినాశము గలవాఁడు, పరుషముగా పలుకువాఁడని తెలిసికొని, యిట్టివానికి నీతి చెప్పి ప్రయో

జనములేదు. శ్రోతులకు నీతి చెప్పిన సూచీముఖమువలె నగుదును అని మెల్లన నణఁకువతో వానికిఁ దియ్యగాఁ దోఁచు మంచి మాటలతో నిట్లు విన్నవించెను.

ఇట్లు చెప్పుటచే కుంభకర్ణుఁడు చెప్పబోవు మాటలు రావణునకు విన నింపుగా నున్నట్టు లొక యర్థము - వాస్తవమున నతని యభిప్రాయము దెలుపు మఱియొక యర్థము గలవై యున్నవని సూచన.

సీ. చాలు రాక్షసరాజ! ♦ సంతసింపకు మింకఁ, దొలఁచుమీ కినుక స్వ ♦ స్థుండ వగుము
ఏ మనియుండఁగ ♦ నిది మది నిడఁబోకు, మెవ్వానివలన నీ ♦ కింత పుట్టె
వానిని బరిమార్తు ♦ బంధుభావంబున, సోదరస్నేహమ ♦ ర్యాదకతన
నన్ని వేళల హిత ♦ మాడు టావశ్యక, మాట న ట్లాడితిఁ ♦ బాటితెఱఁగు
తే. ప్రేమగల చుట్ట మక్కఱ ♦ వేళఁ జేయు, నర్హమగు శత్రునాశంబు ♦ నసురరాజ!
యసమ మగు మామకీనశౌ ♦ ర్యంబుఁ, జేసి, చూడు నేఁడని నలిపి ♦ నీ ♦ సూడు దీర్తు.

అర్థములు. స్వస్థుండవు = (౧) కుదుటఁబడిన మనస్సుగలవాఁడవు, ఏన్ = నేను, మనియుండఁగన్ = బ్రదికి యుండగా, పాటితెఱఁగు = న్యాయవిధము, శౌర్యంబుఁ జేసి = శౌర్యముచేత, సూడు = పగ, అనినలిపి = యుద్ధము చేసి.

రెండవ యర్థము. చాలు రాక్షసరాజ = నీ రాక్షసరాజత్వము చాలును. అది పోవుకాలము వచ్చినది. ఇంక సంతసింపకుము. అవశ్యంభావి = తప్పక జరుగఁ గలదానికి సంతాప పడి లాభమేమి? తెలివి తక్కువ పనిచేసితినని యిప్పుడేల యేడ్చెదవు? అట్టులే కోపము వదలుము. మరణకాలమం దివి యుండరాదు. నిశ్చింతముగాఁ బ్రాణము విడిచిననే మేలు కావున స్వస్థచిత్తుఁడవు కమ్ము. స్వర్ + స్థితుఁడవు = స్వర్గమం దుండువాఁడవు కమ్ము. ఏ మనియుండఁగ నిది మది నిడఁబోకు = నేను బ్రదికి యుండఁగా నే నిట్లంటినిగదా యని నా మాటలు తల కెక్కనీయకుము, నేను జచ్చిన తరువాత కుంభకర్ణుని మాటలు వినకపోయితిని గదా యని యేడువకుము. ఎవ్వానివలన నీ కింత పుట్టె వానిని పరిమార్తును. బంధుభావంబున = నేను జెప్పిన మాటలవలనఁగదా నీకింత కష్టము మనస్సునకుఁ దోఁచెను. అట్టివన్ను బంధువను నెపమున చంపుదువు, శత్రునాశంబు = శత్రువువలని నాశము, శత్రువగు రామునివలన నాశము నేను జేయించుకొని, నీ సూడున్ = నీయందు నాకుఁ గల కోపమును - తీర్తును, మంచి చెప్పినను నీకింత కోపము వచ్చెనుగదా, నీవు నిష్కారణముగ నామీఁద కోపించినపుడు నీమీఁద నాకుఁ గోపము రాదా? వచ్చినను నిన్ను నేను ప్రత్యక్షముగ నేమియుఁ జేయఁజాలను - నేను జచ్చి రామునిచే నిన్నుఁ జంపించెదను. అప్పటికి నా కోపము చల్లారును, నీసూడు = నేను బ్రదికి యుండు నంతవఱకే కదా నామీఁద నీకుఁ గోపము. నేను జచ్చి నీకోపము చల్లారఁ జేసెదను.

రాక్షసరాజా! చాలును ఇఁక సంతాపపడకుము. కోపమువదలుము. యథాప్రకారము నీ మనస్సు కలఁతలేక యుండనిమ్ము. నేను బ్రతికి యుండఁగా దీనిని మనస్సులో నుంచకుము. ఎవనివలన నీ కింత కష్టము కలిగెనో వానిని చంపెదను. బంధువను తలంపుతోను అన్నవను స్నేహమువలనను, వాస్తవముగ మేలు కోరువాఁడే సందర్భమందె నను హితమే చెప్పవలసి యుండుటచేతను ఆ ప్రకారము న్యాయవిధముఁ జెప్పితిని. అది నీకు రుచించినదికాదు. నా యిష్టప్రకారము నీవు రానపుడు నీ యిష్టప్రకారము నేను రావలయును గావునఁ బ్రేమగల బంధువు లక్కఱ వేళలఁ జేయవలసినది శత్రునాశమును అసమానమైన నా శౌర్యముచేత నేను యుద్ధముచేసి నీ పగ దోలఁగించెదను.

ఉ. చూడుము నన్ని దే సమర ♦ శూరుని రాముని వైరిఁ ద్రుంపఁగాఁ
 బాడుగఁ బాఱుచుండఁ బర ♦ వాహినులం గనులారఁ జూడుమీ
 వేడుక రాము గూల్ప రణ ♦ వీథిని దొర్లు శిరంబుతోడ న
 న్నేడుచుచుండ నిమ్మలమ ♦ హీసుతయుం గరుణార్త చిత్తయై. ౧౪౩౫

అర్థములు. చూడుము నన్నిదే సమరశూరుని రాముని వైరిఁద్రుంపఁగా= (౧) వైరియగు రాముని నేను ద్రుంపఁగా సమర శూరుఁడనైన నన్ను జూడుము. (౨) సమరశూరుని నన్నిదే కడసారిచూడుము. ఆవల నీవు నన్నుఁ జూడఁబోవు. ఏలన, చూడుము రాముని, తన వైరియగు నన్నుఁ ద్రుంపఁగా; రాముని యనునది ప్రథమార్థమున ద్వితీయగానైన గ్రహింపనగు. పాఱుచుండ, బరవాహినులం గనులారఁ జూడుమీ=(౧) నాకు భయపడి పరుగెత్తి పోవుచుండ శత్రుసేనలను గన్నారఁ జూడుము. (౨) నేను జావఁగాఁ బరువెత్తుచుండ నీ శ్రేష్ఠమైన సేనలను అనిగాని, నీ సేనలు పరువెత్తి దూరమున నుండఁగా ననికాని చెప్పనగు 'శ్రేష్ఠాన్యదూర శ్రేష్ఠేషు పరః' అని నానా॥ ర. లేదా; పర=ఓరాక్షసుల పాలికి శత్రువా! అనియైనఁ జెప్పవచ్చును. వేడుకన్ = వినోదముగా, సంతోషముతో, రాము గూల్ప రణవీథిని దొర్లు శిరంబుతోడ. (౧) నేను గూల్పఁగా రణభూమియందు దొరలు శిరంబుతోడ రాముని గనులారఁ జూడుమీ. (౨) భీష్ముఁడోని పోయిన' యన్నట్లు, రాముఁ గూల్పఁగా ననఁగా రాముఁడు గూల్పఁగా దొర్లు శిరంబుతోడ నన్ను నేడుచుచు గనులారఁ జూడుమీ; ఏడుచుచుండ నిమ్మల మహీసుతయున్ గరుణార్తచిత్తయై = (౧) కరుణ + ఆర్త చిత్తయై = శోకమును బొందిన మనస్సుగలదై-జానకి యేడ్చుచుండనిమ్ము-నేను రాముని జంపఁగా నని శేషము. (౨) ఉండనిమ్ము=కరుణా + ఆర్త చిత్తయై=దయగల మనస్సుగలదై జానకి సుఖముగా నుండనిమ్ము—నాకై నీ వేడువకున్నను సీతాదేవి కరుణార్తచిత్త గావున, నా నిమిత్తముగ నిరపరాధి వీఁడు చావవలసి వచ్చెనే యని శోకముతో

గూడిన మనస్సుగలదిగా నుండనిమ్ము. రాముఁగూల్ప ననుచో శ్లేషార్థమున సబింద్వు నిర్బిందుకములకు మేళనము చెప్పఁబడెను.

ఉ. చూతురుగాక యాజిఁ దమ • చుట్టము లీల్గిన సర్వరాక్షసుల్
 ప్రీతి రహింఁ గొనంగ ననుఁ • బ్రేతత గాంచఁగ రాఘవుం గృతాం
 తాతిథులైన బాంధవుల • కై విలపించెడివారి బాష్పముల్
 స్ఫీతజవంబునం దుడుతుఁ • జెచ్చెర వైరివినాశనంబునన్. ౧౮౩౬

అర్థములు. (౧) ఆజిన్ = యుద్ధమందు, తమ చుట్టము లీల్గిన సర్వ రాక్షసులు-ప్రేతత గాంచఁగ రాఘవున్=రాముఁడు చావఁగా, ననున్ = నన్ను, ప్రీతిరహింఁగొనంగఁ జూతురుగాక. (౨) సర్వరాక్షసులు - తమచుట్టము లీల్గఁగా నన్నుఁ బ్రేతతగాంచఁగా-రాఘవునిఁ జూతురుగాక-రహి శబ్దమునకు (౧) ప్రేమ, ఆనందము, రెండవ యర్థమున వ్యర్థము - కాంతిహీనము. 'రతిలేని విభూషణంబు రహి నరసింహా' అని నరసభూపాలీయము.

కృతాంతాతిథులైన = చచ్చిన, వైరివినాశనంబునన్ = శత్రువులను నేను జంపి చచ్చిన బాంధవులకై విలపించెడివారి బాష్పములు దుడుతును. (౨) వైరి యగు రామునివలన నాకుఁ గలిగిన నాశనంబున విలపించెడివారి బాష్పముల్ తుడుతువు. తుడుతున్-నేను తుడుతున్-ఉత్తమ పురుషక్రియగా నొక్క యర్థము నను అర్థ బిందువు లోపించి తుడుతువు. మధ్యమ పురుషముగా నొక యర్థమున గ్రహింపవలెను. శ్లేషే. సఖండ నిర్బిందోర్ద్వయోర్మేళనం క్వచిన్మతమ్. అ॥ కారిక.

## తాత్పర్యము

తమ బంధువులు చచ్చిన సర్వరాక్షసులు రాముఁడు చావఁగా నన్ను బ్రీతితోఁ జూతురుగాక. చచ్చినవారి కన్నులనీళ్ళు వైరిని నాశముచేసి నేను త్వరగాఁ దుడుతును.

రెండవయర్థము- తమ చుట్టములు చావఁగా నేను జావఁగా ప్రీతిలేనివారై భయపడుచు సర్వరాక్షసులు రాముని చూతురుగాక. అప్పుడు వైరియగు రాముని వలన నాకు వచ్చిన వినాశమునకై విలపించెడివారి కన్నీళ్ళు నీవు తుడుతువు.

ఉ. ఏగతిఁ బట్టునో కనుమ • యింతలు నింతలు తునకలై ధరం
 ద్రోగయి వ్రాలి పర్వతని • భుండు ససూర్యవలాహకాభుఁ డా
 రాగమయూఖనందనుఁడు • రామజిఘాంసువు లేను రాక్షసుల్
 రాగము పూని కావ రఘు • రాము సువధ్యుఁడ వాడు వెల్లకో. ౧౮౩౭

అర్థములు. ఇంతలు నింతలు = చిన్నచిన్నవి, పర్వతనిభుండు = పర్వత ముతో సమానుఁడు, ససూర్యవలాహకాభుఁడు = సూర్యునితోఁ గూడిన మేఘము వంటివాఁడు. రాగమయూఖనందనుఁడు=ఎఱ్ఱని కిరణములు గల సూర్యునికొడుకు

రామ జిఘాంసువులు=రాముని జంపఁ గోరికగలవారు, రాగము = అనురాగము, రఘురామసువధ్యుఁడవు=రామునిచేఁ జంపఁబడువాఁడవు.

తాత్పర్యము

(౧) పర్వతముతో సమానుఁడై సూర్యునితోఁ గూడిన మేఘము వంటి వాఁడైన సుగ్రీవుఁడు చిన్న చిన్న తునకలై కుప్పయి నేల వ్రాలి యేగతిఁ బట్టునో చూడుము. రాముని జంపఁగోరిన నేను రాక్షసులు నిన్నుఁ గావఁగా రాముఁడెట్లు నిన్నుఁ జంపఁ గలఁడు ?

(౨) రాముని జంపఁగోరిన నేను రాక్షసులు నిన్నెంత కాచినను రామునకు వధ్యుఁడవే యగుదువు. దానికేమి చేయవచ్చును ?

ససూర్యవలాహకాభుఁడన్నచో = సూర్యుఁడు రాముఁడనియు, వలాహకము=మేఘము సుగ్రీవుఁడనియు నెఱుఁగనగు, సూర్యరశ్మి మేఘము మీఁద బడు చుండువఱకు కాంతిగలదై యుండును. అట్టులే రామానుగ్రహము సుగ్రీవునిపై నుండువఱకు కలనికే లోపము లేదని భావము. రాగమయూఖ నందనుఁడు కావున నందనుపై ప్రేమ తొలఁగదని భావము.

ఉ. రాముఁడు నన్నుఁ దొల్త రణరంగమునన్ వధియించెనా బల
శ్రీమహితుండు నిన్నిహతుఁ జేయక మానఁడు సత్యమేను సం
గ్రామములోన నొందెడఁ బరాభవ మన్న విచార మాత్మ నా
కేమియు లేదు గాన ననునేడ్తఱఁ బంపుము పంప కన్యునిన్. ౧౪౩౭

తాత్పర్యము

రాముఁడు నన్ను మొదట యుద్ధరంగమునఁ జంపెనా నిన్నావలఁ జంపక మానఁడు. ఏలన నతఁడు బలశ్రీమహితుఁడు కావున బలసంపద గలఁడు. బలము లక్ష్మి రెంటిచే గొప్పవాఁడు. లక్ష్మీవంతునకుఁ బరాజయ మెచ్చటిది ? ఇది సత్యము. నేను యుద్ధములో నవమాన పడెద నన్న విచారము నాకు లేదు. నేనే గెల్తునని యొక యర్థము. మరణమునకు వెఱవనని రెండవ యర్థము. కావున నన్నే పంపుము. మఱి యొవనిని బంపవలదు.

రాముఁడు నన్నుఁ దొలుతఁ జంపఁగలిగినఁగదా నిన్నుఁ దరువాతఁ జంపఁ గలఁడు. యుద్ధమునందు నాకుఁ బరాజయము వచ్చునని నేను దలఁపను, కావున నీకును భయము లేదు. ఈ కారణముచే యుద్ధమునకు నన్నే పంపుము.

చ. హరిహయుఁడైన నేమి ప్రళయానలమారుతులైన నేమి కి
న్నరపతియైన నేమి జలనాయకుఁడైనను నేమి శూలమున్
గరమునఁ గీలుకొల్పి గిరికాయుఁడనై శితదంష్ట్రి లొప్పఁగా
దురమునఁ దాకినన్ బెదరి తూలరె వ్రీలరె కూలరే యనుల్. ౧౪౩౮

హరిహయుఁడు = ఇంద్రుఁడు, ప్రలయానల మారుతులు = ప్రలయకాల

మండలి యగ్నియు వాయువు, కిన్నరపతి = కుబేరుఁడు, జలనాయకుఁడు = వరుణుఁడు, గిరికాయుఁడనై =పర్వతమంత దేహముగలవాఁడనై, శితదంష్ట్రిలు = వాఁడికోఱలు, దురమునన్=యుద్ధమందు, అరుల్=శత్రువులు.

## తాత్పర్యము

ఇంద్రుఁడైననేమి ? ప్రలయకాలమందలి యగ్ని వాయువులొక్కటై వచ్చిననేమి? కుబేరుఁడైననేమి? వరుణుఁడైననేమి ? నేను చేతఁ ద్రిశూలము తీసికొని పర్వతమంత దేహముగలవాఁడనై వాఁడి కోఱలతో యుద్ధమున నెదిరింపఁగా శత్రువులు తూలి బెదరి చావరా ?

ఉ. కేవల రిక్తహస్తములఁ • గేలి విరోధుల నల్పివైచుచో
జీవముమీఁద నాశగల• జీవి యెవం డెదిరించి నిల్చు? బా
ణావళి యేల? యేల నిశి•తాసిగదాదులు? నేల శక్తి ? నా
కేవియు నేల? చేతులనె • యింద్రునినైనను ముద్దసేయు నే. ౧౨౨౦

అర్థములు. కేవల రిక్తహస్తములన్ = ఆయుధ మనునది యేదియు లేక, కేరి=విజృంభించి, నిశితాసిగదాదులు=పదునైన కత్తి, గద యీ మొదలైనవేల, శక్తి యేల ?

## తాత్పర్యము

ఏ యాయుధమును గైకొనక యుత్తచేతులతోఁ బోయి విరోధులను నల్పినపుడు ప్రాణముమీఁద నాశగలవాఁడెవఁడు నన్నెదిరించినిలుచును? నాకు బాణము లేల ? కత్తులేల ? గదయేల? శక్తియేల ! ఇవన్ని యెవరికి ? దేహబలము చాలనివారికిఁగాని నా కేల, నే నుత్తచేతులతోనే యింద్రునినైనను ముద్దచేసెదను.

ఉ. నా మహితంపుముష్టిపత•నంబు రఘూత్తముఁ డోర్వఁ గల్గినన్
రాముని బాణజాలములు • రక్తము పానము సేయఁగల్గు నే
లా మనుజాశనేంద్ర! వ్యసనార్తుఁడ వయ్యెద వేను గల్గ? ను
ద్దామజనోద్ధతిం జని మ•దం బడఁగింతు నరాతికోటికిన్. ౧౨౨౧

అర్థములు. మహితంపు ముష్టిపతనంబు = గొప్ప పిడికిటిపోటును, ఓర్వఁ గల్గినన్=సహింపఁగలిగినయెడలఁ గదా, ఓర్వఁగల్గి+నన్=నన్ను.

## తాత్పర్యము

నా పెద్ద పిడికిటిపోటును రాముఁడు సహించి బ్రదికినఁగదా యావల రాముని బాణసమూహములు నా రక్తము పానము సేయఁగలవు. నా గ్రుద్దుతోనే రాముఁడు చచ్చినఁదరువాత నేమిచేయఁగలఁడు? (౨) నాముష్టిపతనంబు రాముఁ డోర్వఁగల్గి, నన్ = నన్ను రాముని బాణజాలములు పానము చేయఁగలుగు. రెండును తప్పవు. నా పిడికిటిపోటు నాయన సహింపఁగలఁడు. ఆయన బాణములు నా రక్తమును పానముచేయఁగలవు. నేను జీవించియుండ రాక్షసరాజా! యేల

దుఃఖించెదవు. (౨) నేను జీవించి యున్నానని యేల యేడ్చెదవు? ఏడువ వలసిన కాలము ముందున్నదని భావము. అణఁపరాని వేగమునఁబోయి శత్రువుల సమూహమునకు గర్వ మణఁగింతును.

సీ. రామలక్ష్మణుల శా♦ఖామృగనేతను, మనలంకఁ గాల్చిన♦హనుమఁ దక్కఁ
గల పెనుమ్రానుమొ♦కంబులఁ గూలు నే, వదలుము రాముని♦వలని భయముఁ
గలిగెడు నీకు ని♦స్తులకీర్తి యిందు నే, నల్లస్వయంభువు ♦ నయిన యింద్రుఁ
నేఁ గోపగించిన♦నిర్జరయూథంబు, చాఁపకట్టుగ నేలఁ ♦ జచ్చి పడదె

తే. శమను శమియింతు సర్వభ♦క్షకు గ్రసింతు
నుడుగణంబులతో నర్కుఁ ♦ బడఁగ నడుతు
జన్యసవపశు వొనరింతు ♦ శతమఖునిని
గ్రోలి వైచెద వరుణుని ♦ కొంపఁ గూల్చి. ౧౪౪౨

అర్థములు. పెనుమ్రానుమొకంబులన్ = పెద్దకోఁతులను, కూల్తునే = (౧) నేను గూల్తును, (౨) కూల్తునే = కూల్పఁగలనా? వదలుము= (౧) రాముని వలని భయము వదలుము. (౨) నేను వానరాములఁ గూల్తునను నాశ వదలుము. సర్వభక్షకున్ = అగ్నిని, ఉడుగణంబుతో = నక్షత్రములతో, అర్కున్ = సూర్యుని, అడుతున్ =కొట్టుదును, జన్యసవపశువు=యుద్ధమనెడి యజ్ఞమునపశువు, శతమఖుని=ఇంద్రుని, వరుణుని కొంప=సముద్రము.

తాత్పర్యము

(౧) రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను దక్కిన పెద్దకోఁతులను నేను జంపుదును. రామునివలన భయము విడువుము. నీకు ననమానమైన కీర్తి కలుగును. ఇంద్రుని బ్రహ్మను నైనఁ జంపుదును. నేను గోపగించిన దేవతాసమూహము నేలతో పాటు చాఁపవలెఁ బడును. యముని జంపెదను. సర్వభక్షకుని భక్షింతును. నక్షత్రములతో సూర్యుని నేలఁబడఁద్రోయుదును. ఇంద్రుని యుద్ధమను యజ్ఞమున పశువునుఁ జేసెదను. వరుణుని కొంప నాశము చేసెదను.

(౨) రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతులను దక్కిన క్రోఁతులను నేను గూల్పఁగలనా? ఆ యాస వదలుము. రామునివలన భయము నీకుఁ గలుగును. అసమాన కీర్తిగల యింద్రుని బ్రహ్మను జంపఁగలను. తక్కినది సమానము. ఇవన్ని చేయఁగలను గాని రామలక్ష్మణుల నేను గెల్వలేను.

ఉ. దంచెదఁ బిండి పిండిగ మ♦దంబునఁ బట్టి కులాచలంబులన్,
జించెదఁ దునకదునకలుగఁ ♦ జేవ వసుంధర, నిన్నినాళ్ళు ని
ద్రించిన కుంభకర్ణు బల ♦ తేజము లివ్యోడఁ జూచుఁ గాక భ
క్షించుచు నుండ దామధురి ♦ గీడ్పడి చేడ్పడి భూతజాలముల్. ౧౪౪౩

అర్థములు. కులాచలంబులన్=కులపర్వతములను, హిమవంతము వింధ్యము లోనైన వానిని, వసుంధరన్=భూమిని.

తాత్పర్యము

బలగర్వముచేఁ బట్టుకొని కులపర్వతములను బిండిపిండిగ దంచెదను. భూమిని తునకలు తునకలుగ జించెదను, ఇన్నినాళ్ళు నిద్రించిన కుంభకర్ణుని బలము తేజములను వానరులను భక్షించుచుండ భూతసమూహము లదరి బాధపడి, మూర్ఛపోయి లేచి చూచునుగాక.

ఉ. హామికఁ మూఁడు లోకముల • నట్టె భుజించినఁ దృప్తి లేదు, శ్రీ
రాముని కారణంబునఁ దిరం బగు సౌఖ్యము నీకుఁ గూర్ప సం
గ్రామ మొనర్తు, రాఘవసు•రక్షిత సర్వకపీశవాహినీ
స్తోమము మ్రింగి తృప్తిఁ గొనుఁ•దున్ దనుజేశ్వర! చింత యేటికిన్. ౧౭౭౭

అర్థములు. హామికఁ = గర్వముతో, శ్రీరాముని+కారణంబునన్=(౧) శ్రీరాముఁడు హేతువున (౨) శ్రీరాము + నికారణంబునన్ = శ్రీరాముని మరణముచే, తిరంబగు సౌఖ్యము=(౧) పరలోకమందు - (౨) ఈ లోకమందు, రాఘవ సురక్షిత = రామలక్ష్మణులచే చక్కఁగా గాపాడఁబడు, సర్వ కపీశ వాహినీ స్తోమము= సమస్త వానర సేనా సమూహము.

తాత్పర్యము

గర్వముచే మూఁడులోకములను భుజించినను సంతుష్టిలేదు. శ్రీరాముని జంపుటచేత నీకు స్థిరమైన సౌఖ్యము గూర్చుటకై నేను యుద్ధము సేయఁబోయెదను. రామలక్ష్మణులు రక్షించు సమస్త వానర సేనను మ్రింగి సంతుష్టి పడెదను. నీవేల విచారపడెదవు?

(౨) నీవు గర్వమెత్తి మూఁడు లోకము లనుభవించినను నీకుఁ దృప్తిలేదు. కావున రాముఁడు కారణంబుగ నీకు స్థిరమైన స్వర్గలోక సుఖము గలిగించుటకై నేను యుద్ధమునకుఁ బోయెదను. అందు నేను జచ్చిన తరువాత నీవు చచ్చి సుఖింతువు. ఏలన రామలక్ష్మణులు రక్షించు వానర సేనను నేను మ్రింగి తృప్తి పడుదునా? అది యేటి మాట? (కాకుస్వరమున నీ యర్థము.)

తే. కోర్కులు భుజింపు మద్యంబు • గ్రోలు కృత్య
మఖిలమును దీర్పు మేఁ బోదు • హేతుఁడు గాఁగ
రామవిభుఁ డక్షయంబుగ • రమణి సీతఁ
బొందఁ గలుగును నీ వెదఁ • బొగుల వలదు. ౧౭౭౫

తాత్పర్యము

నేను యుద్ధమునకుఁ బోయెదను. నీవు చింతవిడిచి కోరికల నన్నిటి ననుభవింపుము, సారాయము ద్రావుము. చేయవలసిన పనులన్నియుఁ జేయుము. రామ

విభుఁడు నాచే హతుఁడు గాఁగా, అక్షయముగ నీకు రమణి సీతను బొందఁగలుగును. ఎదఁ బొగులవలదు. ఏల విచార పడెదవు.

(౨) వేఁబోదు హతుఁడు గాఁగ = నేను జచ్చుటకై పోయెదను. ఈ లోపల నీవు కోరికదీఱ భుజింపుము, సారాయము ద్రాగుము, పనులు దీర్చికొనుము. ఏలన నేను జచ్చువఱకే నీకీ భోగములు. ఆవల నావెంట నీవు రావలసిన వాఁడవే. రామవిభుఁడు అక్షయంబుగ = శాశ్వతముగ, రమణి సీతను బొందఁగలుగును. దానికై నీవు దుఃఖింపకుము.

— ౬౮-వ సర్గము. మహోదరుఁడు కుంభకర్ణమతమును ఖండించుట —

కం. అని యతికాయుండు బలియుఁడు, ఘనబాహుం డైన కుంభకర్ణుఁడు వలుకన్
విని యాతనిఁ గని యీగతి, ననియె మహోదరుఁడు వీత హర్షుం డగుచున్.

అర్థములు. అతికాయుఁడు=పెద్ద దేహము గలవాఁడు, దేహము పెద్దదే కాని దానికిఁ దగిన బుద్ధిలేదని భావము. బలియుఁడు=దేహమునకుఁ దగిన బలము గలవాఁడు, ఘనబాహుఁడు=ఆ బలముపయోగింపఁదగిన పెద్దచేతులు గలవాఁడు. వీతహర్షుండు=సంతోషము లేనివాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము పెద్ద దేహము గలవాఁడు బలవంతుఁడు గొప్ప భుజములు గలవాఁడు నగు కుంభకర్ణుఁడు చెప్పఁగా విని సంతోషింపనివాఁడై మహోదరుఁ డిట్లనియె.

ఉ. పుట్టితి గొప్పవంశమున బుద్ధి యొకింతయు లేదు, గర్వముం
బట్టయి యున్నవాఁడవును ప్రాకృతదర్శన! కార్యమెల్ల లో
పట్టు గనంగఁ జాల విసి బాల్యవశంబున నోటి కొర యె
ట్టులు వచ్చె నట్లు వచి యింపఁగఁ జూచెదు జ్ఞానహీనతన్. ౧౮౮౭

అర్థములు. ప్రాకృతదర్శన = పామరుల యాలోచన కలవాఁడా! బాల్యవశంబునన్=పిల్లతనముచేత, జ్ఞానహీనతన్=జ్ఞానములేని కారణమున.

తాత్పర్యము

నీవు గొప్పవంశమునఁ బుట్టితివి కాని గొప్పవంశమువారి కుండవలసిన బుద్ధి మాత్రము కొంచెమైనలేదు. గర్వముమాత్ర మున్నది. పామరుల యాలోచనగల వాఁడా! పై పైన జూచితివేకాని కార్యము లోపలఁజొచ్చి చూచినవాఁడవుకావు. కావునఁ బిల్లతనంబున నోటికి వచ్చినట్లు జ్ఞానములేక వదరెదవు. (కుంభకర్ణుఁడు దూషించిన మంత్రులలోఁజేరిన వాఁడీ మహోదరుఁడు. వీనికి సంధి యనుమాటయే పనికిరాదు.)

ఉ. రా జెఱు నీత్యనీతులత రంబు లెఱుంగఁడు? స్వాన్యహాని పే
రోజము స్థానముం దెలియు నొప్పఁగ దేశము కాలభంగియున్

యోజనచేసినాఁడు, బల♦యుక్తుఁడు, ప్రాకృత బుద్ధి వృద్ధ సే
వాజడునట్లు సల్పు నొకో ♦ పండితుఁ డెందును గుంభకర్ణుఁడా. ౧౩౩౮

అర్థములు. నీత్యనీతుల తరంబులు=నీతి దుర్నీతి భేదము. స్వాన్యహాని = స్వహాని, అన్యహాని=తనకుఁ గలుగు నష్టి, ఇతరులకుఁ గలుగు నష్టి, హెరోజము = గొప్ప యభివృద్ధివి. స్థానమున్ = సమర్థ్వమును, దెలియును. దేశము = ఎచ్చట నాలోచింపఁదగునో యచ్చటనే యోజించినాఁడు, కాలము భంగి=ఎప్పుడాలోచింప దగునో యప్పుడే యాలోచించినాఁడు.బలయుక్తుఁ డు=తనబలము మాత్రమునాలోచించువాఁడును. ప్రాకృతబుద్ధి=క్షుద్రబుద్ధి కలవాఁడు ఐన, వృద్ధసేవాజడునట్లు= పెద్దలను గొలువనట్టి హీనునివలె,పండితుఁడు=శాస్త్రము చదివినవాఁడు,ఎందును= ఎప్పుడైనను.

తాత్పర్యము

"కేవలము శౌర్యమదంబున భావ్యసర్థముఁల్ దలఁపగవైతివి" అనియు "కెల నములోలి వెన్కముసుగేరి యొనర్చిన నీతివేత్తవే" యని కుంభకర్ణుఁడు రావణు నాక్షేపించెను. మహోదరుఁడు దానికిఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు.నీతికి దుర్నీతికి తారతమ్యము రాజా యెఱుఁగడు? నీకు దెలిసినంత మాత్ర మాయన యెఱుఁగఁడా? తనకు రాఁగల నష్టి-పరులకు రాఁగల నష్టి-గొప్ప వృద్ధి-సమర్థ్వము వీని నెల్లఁ జక్కఁగ రాజెఱింగినవాఁడే. తెలియక చేయలేదు. రాజు దేశకాలము లాలోచింపలేదంటివి. ఆలోచన గే దేశమందుఁ జేయవలెను? అడవిలో నెవరు లేని చోట నొంటరిగఁ జేయవలయునా? తన యూరఁ దన యింటఁ దనకు కావలసిన వారున్నచోటఁ జేయవలయునా? తగిన కాలమందు నాలోచింప లేదంటివి. యుద్ధమునకై శత్రువులుపైబడి వచ్చినపుడు యుద్ధవిషయ మాలోచింపవలయునా? ఎన్నఁడో శత్రువులు రాఁబోయెద రని ముందుగానే యుద్ధ ప్రయత్నము చేయ వలయునా? శత్రువుల జాడయే తెలియనప్పు డెవరితోనైననేమి యాలోచింపవలె? కుంభకర్ణుఁడా? మనరాజు సర్వశాస్త్రములు చదివిన పండితుఁడు.అటువంటివాఁడు కేవలము తన బలమే నమ్మి క్షుద్రబుద్ధివలెఁ బెద్దల సేవ నేయనివానివలెఁ గార్యము చేయునని నీవెట్లు తలంచితివి ?

చ. కనుఁగొన ధర్మ మర్థమును ♦ గామ మొసంగుఁ బృథక్ఫలంబు లం
దును వచియించి, నీ వెఱుఁగు ♦ చొప్పొక టున్నను జెప్ప వయ్య యే
పని నిజమార నే ఫలము ♦ బాయ కొసంగునో? కర్మమే కదా
ఘనబల! యైహికాది ఫల♦కారణ మాఁ దలపోసి చూచినన్. ౧౩౩౯

ధర్మము సుఖకారణము, అధర్మము దుఃఖకారణమని యెంచి "నీచేసిన యా దురితము తత్ఫలము నిను విరియక చేసేత ననుభవింపఁగఁ జేసెన్ "అని రావణుఁడు

సీతాపహార మనెడి పాపము చేయుటచే నిట్టి కష్టము సంభవించెనని యింతకుముందు కుంభకర్ణుఁడు చెప్పినదానిని మహోదరుండు ప్రత్యాఖ్యానము చేయుచున్నాఁడు.

అర్థములు. పృథక్+ఫలంబుల = వేఱు వేఱు ఫలంబులు ఐహికాది= ఐహికము, ఆముష్మికము, కైవల్యము నను, ఫలకారణము=ఫలమునకు హేతువు.

### తాత్పర్యము

ధర్మము, అర్థము, కామము వేఱు వేఱు ఫలము లొసఁగునని నీవు చెప్పితివి కదా! ఏది యే ఫలము తప్పక యిచ్చునని నీవు నిశ్చయించి చెప్పెదవో నీకుఁ దెలిసి యుండినఁ దెలుపుము. ధర్మమే ధర్మఫలము నిచ్చునని నియతి కలదా? అర్థమువలన, కామము వలన ధర్మ ఫలము కలుగరాదా? ధర్మము సుఖమునే యిచ్చునుగాని కష్టము నీయదా? స్వర్గాది సుఖములకై యజ్ఞము చేయునపుడు, యజ్ఞము చేయుటకు ముందు ధనార్జనాదులకు, చేయునపుడు శరీరాయాసమునకు, చేసిన తరువాత నగ్నిసంరక్షణాది కార్యములవలనను కష్టఫలము కలుగుటలేదా? అట్లులే అధర్మమని నీవు చెప్పు జారత్వ చోరత్వములందు సౌఖ్యము లేదా? తన భార్యవలనఁ గలుగు సౌఖ్యము పరుని భార్యవలనఁ గలుగదా? కష్టపడి సంపాదించిన ధనముతోఁ గలుగు సౌఖ్యము దొంగతనముచే సంపాదించిన ధనముతోఁ గలుగదా? కావున ధర్మాధర్మములకు ఫలనియతియం దేలాటి ప్రమాణములేదు. ఐహికాది ఫలములు కావలయు ననిన కర్మమేకదా చేయవలయును, కర్మము చేయకున్న ఫలములేదు. కావున సుఖము కోరినపు డేమి కర్మము చేసిన సుఖము వచ్చునని తోఁచునో యా కర్మము చేయవలయును. తరువాత నాకర్మ మేమి ఫలమీయ వలయునో దానినే యది యిచ్చును. కావున నది చేసిన నిది వచ్చు ననుట యేటిమాట.

ఉ. శ్రేయము పాపశీలురను • జెందఁగఁ జూడమె౦ ధర్మ మార్గమున్
 శ్రేయము గూర్చు నట్లొనరఁ • జేయు నధర్మ మనర్థమున్ శుభం,
 బేయెడనో యఘంబు ఘటి • యించు నధర్మ మనర్థ, మింక నే
 చాయను ధర్మమే నియత • సత్ఫల మందు దృఢీకరించెదో? ౧౪౫౦

ధర్మాధర్మములు నియతఫలములు కావనుటను సమర్థించు చున్నాఁడు.

అర్థములు. శ్రేయము=సుఖము, దృఢీకరించెదో = దృఢముగాఁ జెప్పఁ గలవో.

### తాత్పర్యము

పాపాత్ములు సుఖ మనుభవించుచు మంచి స్థితియం దుండుట మనము చూడ లేదా? ధర్మమునకు నర్థమునకుఁ గారణమైన పుణ్యకర్మము శ్రేయస్సు గలిగించు నట్లు అధర్మము అనర్థమును శుభమును రెంటిని గలిగించుచున్నది. అధర్మము అనర్థమగు పాపమునే ఘటింపఁజేయుట కాకతాళీయముగ నెందో సంభవించు చున్నది. అనుభవ మిట్లుండ నీవేమి యాధారము చేసికొని ధర్మమే సత్ఫలమును నియతముగా నిచ్చునని సిద్ధాంతము చేసెదవు.

ఉ. అచ్చపుఁబుణ్యకర్మముల • నైహికసౌఖ్యపరత్రభోగముల్
హెచ్చుగఁ గూరు నంచు ఘటి • యింతురు లోకులు సాధుకార్యముల్
కచ్చులు దీర స్వైరగతిఁ • గార్యములం బొనరించు వానికే
వచ్చును సంపదల్, సుమతి • వర్య! కతం బది యేమి చెప్పుమా? ౧౪౬౧

అర్థములు. ఐహిక = ఈలోక సంబంధమైనవి, పరత్ర=పరలోకసంబంధమైనవి యగు; భోగముల్=సౌఖ్యములు, కూరునంచున్ =కలుగునని, కచ్చులు = గర్వములు, స్వైరగతి=వారివారి యిష్టప్రకారము. నియమములేక, సుమతివర్య= బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! అనఁగా బుద్ధిహీనుఁడా యని యర్థము. ఇది పరిహాస వచనము, కతంబు=కారణము.

## తాత్పర్యము

పాపసంపర్కము లేని పుణ్యకార్యములను ఈలోకసుఖములును బరలోక భోగములును విశేషముగా లభించునని లోకులు కొందఱు పుణ్యకార్యములే చేయుదురు. వారి గర్వము చక్కఁబడునట్లు కొందఱే నియమములేక తమ యిష్టప్రకారము కార్యముచేయువానికే సంపదలు వచ్చును. ధర్మాధర్మములకు ఫల నియతి గలదేని, యిట్లు జరుగ నేమికారణము? బుద్ధిమంతుఁడా చెప్పుము.

ఫలమునుబట్టి పుణ్యకర్మమని పాపకర్మమని చెప్పుచున్నాము. ఈకర్మమున కీఫలమను నియతి యెప్పుడు లేదో యది పాపకర్మము, ఇది పుణ్యకర్మ మను పేరప్పుడే లేదు. కావున సుఖకరమని తోఁచిన పనిచేయవలసినది. దానిఫల మనుభవింపవలసినది. దొంగతనముగాని అంకుతనము గాని సుఖలాభములు గలవేని యదియే పుణ్యకార్యము. అదియే ధర్మము. ఇది వాస్తవ విషయము. ఇట్లు చెప్పుటచే మహోదరుని వాదమునకు శాస్త్రము ప్రమాణముకాదు. బుద్ధియేప్రమాణము. చార్వాకవాదము.

ఉ. కాము మొకండ కైకొని సు • ఖంపడఁ గోరె విభుండు దోషమా?
మా మది కద్ది సమ్మతము • మాద్విరపట్ల సురారినీత తెం
పేమి యొనర్చెఁ జెప్పఁ గల • వే? యిక నెక్కటి పోరువాఁడ నం
చేము వచించి తద్ది యుచి • తేతర మెట్లనెదో వచించెదన్. ౧౪౬౨

అర్థములు. మాద్విరపట్లన్ = విరోధుల విషయమున, తెంపు = సాహసము, చేయరానిపని, ఎక్కటి=అసహాయుఁడవై, ఉచితేతరము=అనుచితము.

## తాత్పర్యము

ధర్మము వలననే సుఖము, అధర్మాదులవలన సుఖము లేదను నియతిలేదను మతము అనఁగా కర్మములందు ధర్మము అధర్మము అను భేదము లేదు, అను మతము గలవాఁడు రావణుఁడు కావున సీతవలన సుఖపడఁగోరి యామెను హరించి తెచ్చెను. ఇది దోషమా? మా మతమునఁగాదు. రాజట్లుచేసిన మాకు సమ్మతమే.

కావున రాజు న్యాయాన్యాయములు విచారింపక, తెలియక చేసినాఁడనుట సరి గాదు. తెలిసి సరియైన కార్యమే యని చేసెను. ఇఁక శత్రువుల విషయమై రాజేమి సాహసము చేసెను. తన రాష్ట్రములో అడవిలో దిక్కులేక యొంటరిగానున్న స్త్రీని సుఖపెట్టఁగోరి తెచ్చెను గాని యెవరినైన బాధించెనా? కావున రాజు చేయరాని పని యేమిచేసెను? చెప్పఁగలవా? ఇఁక నీవు తోడెవ్వరు లేక యుద్ధమునకుఁ బోయెద నంటివి. ఇది నీవు బలగర్వముచేతఁ జెప్పితివి కాని యౌచిత్య మనుసరించి కాదు. ఎట్లనెదవా? చెప్పెద వినుము.

ఉ. మానవభోజవీరుల న ♦ మానుష శౌర్యధనాఢ్యులన్ జన
స్థానమునందుఁ గ్రుంచిన ప్ర ♦ శస్తపరాక్రముఁ డెవ్వఁ, డేని పే
రానినభీతి నేటికిఁ ద ♦ దాప్తులు లంక స్మరించు చుంద్రు; రా
మానితశౌర్యు రాము నని ♦ మార్కొన నీ వట పోయె దొంటిగన్. ౧౮౹౧౩

అర్థములు. మానవభోజ వీరులన్=రాక్షస వీరులను, అమానుష శౌర్య ధనాఢ్యులన్=మనుష్యులందుఁ గానరాని శౌర్యమే ధనముగాఁగల వారిని, ఖర దూషణాదులను, ఆనిన భీతిన్=పొందిన భయముచే, తదాప్తులు = ఖరాదులకుఁ గావలసినవారు, దీనివలన ఖరాదులు చచ్చిన పిమ్మట వానివారందఱు లంకఁ జేరిరని సూచితము.

తాత్పర్యము

మనుష్యుల భుజించు వీరులను. మనుష్యులందుఁ గానరాని శౌర్య సంపత్తిగల వారిని, జన స్థానమందు సంహరించిన శ్లాఘ్యమైన పరాక్రమము గలవాఁ డెవ్వఁడో, యెవ్వని పేరును నేఁటికిని ఖరదూషణాదుల యాప్తులు భయపడుచు స్మరింతురో యట్టి రాముని గౌరవింపఁబడు శౌర్యముగలవానిని, నీవా యొంటరిగఁ బోయి యెదిరించెదవు.

ఉ. రామునిఁ గ్రుద్ధకేసరిప ♦ రాక్రమధాముని శౌర్యదర్పని
స్సీముని సుప్తసర్ప మవ ♦ శీకృతశేముషి లేకఁ బూను న
శ్లీమని లేపఁ బోయెద? వ ♦ హీనదురాసదరోషు మృత్యువ
ద్భీతునిఁ దేఱి చూచుటకు ♦ ధీరగుణుం డెవఁ డోపు నాజిలోన్. ౧౮౹౧౪

అర్థములు. క్రుద్ధ కేసరి పరాక్రమ ధాముని = కోపించిన సింహము యొక్క పరాక్రమమువంటి పరాక్రమము గలవానిని, శౌర్య దర్ప నిస్సీముని = శౌర్యము వలనఁ గలిగిన గర్వమునకు మేరలేని వానిని, సుప్త సర్పమును = నిద్ర పోవు పామును, అవశీకృత శేముషిన్ = నీ బుద్ధి నీ స్వాధీన మందు లేనివాఁడై, అహీన = గొప్పదగు, అహి+ఇన=సర్పరాజు వంటి, దురాసద=సమీపింపసాధ్య పడని, రోషున్ = కోపముగలవానిని, మృత్యువద్భీముని = మృత్యుదేవతవలె భయంకరుని, తేఱి చూచుటకు = తేరకొని చూచుటకు, చక్కఁగా నిండు దృష్టి చూచుటకు, ధీరగుణుండు=ధైర్యశాలి, ఆజిలోన్=యుద్ధమందు.

### తాత్పర్యము

కోపముగల సింహముయొక్క పరాక్రమమువంటి పరాక్రమమునకు స్థానమైనవానిని, మేరలేని శౌర్యగర్వము గలవానిని, బుద్ధిలేనివాఁడు నిద్రపోవుపామును లేపఁబోవునట్లు రాము నేమని లేపఁబోయెదవు. పెద్ద పామువలె సమీపించుటకును సాధ్యముకాని రోషముగలవానిని, మృత్యుదేవతవలె భయంకరుని నిందుకంటెతోఁ జూచుటకు యుద్ధమునం దేధైర్యశాలి శక్తుఁడగును.

కం. ఇందఱు సేనలతోఁ దుత, నం దరుగఁగఁ జాల రన్న • నసహాయత భూ
నందినివిభుఁ దొడరుట నా, కుం దగవుగఁ దోఁప దయ్యెఁ • గుంభశ్రవసా.

అర్థములు. కుంభశ్రవసా = కుంభకర్ణుఁడా! అందు = ఆ యుద్ధభూమికి, భూనందిని విభున్=భూపుత్రియగు సీతాదేవి భర్తను, తొడరన్ = ఎదిరించుటకు, తగవు=సరియైన కార్యము.

### తాత్పర్యము

ఇచ్చట లంకలో నున్న వారందఱు సేనలతో యుద్ధభూమికిఁ బోవఁ జాలరని తోఁచుచుండఁగా రాముని నెదిరించుటకు నీవొకఁడవే పోయెద ననుట తగిన కార్యముగా నాకుఁ దోఁపలేదు.

కం. హీనార్థుం డెవ్వం డొకొ, ప్రాణంబులయాశ విడిచి • ప్రాకృతునట్టుల్
మానితసమృద్ధబలు నరిఁ బూని వశముఁ జేసికొనఁగఁ • బోవుం జెపుమా.

అర్థములు. హీనార్థుండు=క్షీణించిపోవు బలము గలవాఁడు.

### తాత్పర్యము

తన పక్షబలము క్షీణించి పోవుచుండు వాఁడెవ్వఁడు ప్రాణములమీఁద నాశ వదలి పామరునివలె వృద్ధినొందిన బలము గల శత్రువును దన వశము చేసికొనఁగఁ బోవును.

ఉ. మానవులందు రాముని స • మానులు లే రసురేంద్ర! వజ్రికిన్
భానువకున్ సముండు రఘు • నాయకుఁ, డాతనితోడ నేల క
య్యానకుఁ బోవ నెంచెద? వ • నర్థము చేకుఱ కున్నె? యంచు న
ద్దానవుఁ డా దశాస్యుఁ గని • దర్పరుషా పరిరబ్ధచిత్తుఁ డై. ౧౮౫౭

అర్థములు. వజ్రికిన్ = ఇంద్రునకు, కయ్యానకున్ = యుద్ధమునకు, అనర్థము=కీడు, దర్పరుషా పరిరబ్ధ చిత్తుఁడై = గర్వముతోను రోషముతోను గూడిన మనస్సు గలవాఁడై.

### తాత్పర్యము

మనుష్యులందు రామునితో సమానులు లేరు. ఇంద్రునకు రాముఁడు సమానుఁడు. అతనితో యుద్ధమున కేల పోయెదవు? పోయితివా కీడు కలుగకుండునా? యని యా మహోదరుఁడా రావణునిఁజూచి గర్వము కోపముగలవాఁడై యిట్లనియె

తే. జానకీసతి నీచేతి • లోని యదియు, నేల పదరఁగ దానికై • యింత సేపు
వలతు వెప్పప్పుడే నీకు • వశముపడెడి సందునకు నొక్కయుపమ నే • నందలింతు.

అర్థములు. పదరఁగన్=చలింపఁగ, తొందరపడఁగ, ఉపమ=ఉపాయము.

తాత్పర్యము

జానకి నీ స్వాధీనమందే కదా యున్నది. చేతిలోనుండు దానికై యింత సేపు తొందరపడ నేల? నీ వెప్పు కోరెదవో యప్పుడే నీకు వశపడు నుపాయము చెప్పెదను.

**—• రావణునకు మహోదరుఁ డుపాయముఁ జెప్పుట •—**

సీ. విన సమ్మతం బేని • వివరింతుఁ గుంభకర్ణుండును నే ద్విజి • హ్వుండు మఱి వి
తర్దన సంహ్రాది • దైత్యు లీ యేవురు, రాము వధింప దు • రమున కేగు
వారుగాఁ జాటింపఁ • బంపుమీ పురిలోన, జని మే మెటులైన • శక్తికొలఁది
రామునితోఁ బోరెద • మే మె జయించుట, గలిగనే నుపమ య • క్కఱయ లేదు

తే. మేము దెగి యెంతపోరిన • రామవిభుఁడె
ప్రాణములతోడ నున్నను • పాయ మొండు
నపుడ చేయంగఁదగు దాని • నంత నేను
యోజన మొనర్చి యున్నాఁడ • రాజవర్య! ౧౪౫౯

తాత్పర్యము

వినుటకు నీ కిష్టముండిన వినుము. వివరించెదను కుంభకర్ణుఁడు, నేను, ద్విజిహ్వుఁడు, వితర్దనుండు, సంహ్రాది యీ యేవురు రాక్షసులు రాముని జంప యుద్ధము నకుఁ బోయెదరని యూరిలోఁ జాటింప నాజ్ఞ సేయుము. మే మట్లు లేపోయి మాశక్తి కొలఁది రామునితోఁ బోరెదము. మేమే జయించితిమా యేయుపాయ మక్కఱ లేదు. మేము సాహసించి యెంత యుద్ధము చేసినను రాముఁడే బ్రతికియుండుట గలిగెనా యపుడు చేయఁదగిన యుపాయ మొకటి గలదు. ఇదంతయు నేను ముందే యాలోచించి యున్నాను.

ఉ. బింకముతోడ మేము రణ • వీథిని బోరినయట్లు రామనా
మాంకితశాతబాణముల • నాత్మశరీరము లోలి వ్రచ్చి ఘో
రాంకమునందు రాఘవుని • సానుజుఁ జంపితి మంచుఁ గేరి ని
శ్శంకమహార్భటుల్ చెలఁగ • సన్నిధిఁ జేరి భవత్పదంబులన్. ౧౪౬౦

అర్థములు. రామనామాంకిత = రాముని పేరిచే గుర్తువేయఁబడిన, శాతబాణములన్=పదునైన బాణములచే, ఆత్మశరీరములు=మా దేహములు, వ్రచ్చి= చీల్చుకొని, ఘోరాంకమునందు = ఘోర యుద్ధమునందు, సానుజున్ = తమ్మునితోడఁ గూడినవానిని, కేరి=విజృంభించి, నిశ్శంకమహార్భటుల్ = జంకులేని సింహనాదములు, సన్నిధిన్=నీ సమీపమున, భవత్పదంబులన్=నీ పాదములందు.

### తాత్పర్యము

పౌరుషముతో మేము యుద్ధము చేసినట్లే రాముని పేరు చెక్కఁబడిన బాణములచే మా దేహములు గీచుకొని వచ్చి ఘోరయుద్ధమందు రాముని లక్ష్మణుని జంపితి మని విజృంభించి సింహనాదములు సేయుచు నీయొద్దకు వచ్చి నీపాదము లందు

ఉ. ప్రాలెడువార మో యసుర ♦ వర్య! ముదంబున నీవు కానుకల్
చాలఁగ మాకు నిచ్చియు గ ♦ జంబుశిరంబునఁ జాటఁ బంపుమీ
ప్రోలున రామలక్ష్మణులు ♦ భూరిచమూతతితోడ నాజిలోఁ
గూలి రటంచు వెండియును ♦ గోర్కులు దీరఁగ సేవకాళికిన్. ౧౮౬౧

అర్థములు. ప్రోలునన్ = నగరమందు, భూరి చమూతతి తోడన్ = గొప్ప సేనతో, ఆజిలో=యుద్ధమందు.

### తాత్పర్యము

పడుదుము. నీవు మాకు సంతోషముతో కానుక లిచ్చి యేనుఁగు శిరస్సు మీఁదనుండి రామలక్ష్మణులు గొప్ప సేనతోఁ జచ్చిరని పురమునఁ జాటింపఁ బంపుము. అంతియగాక, సేవకులకు వారి కోరిక దీర,

చ. వివిధపదార్థసంతతులు ♦ ప్రీతి నొసంగుము యోధకోటికిన్
నవవసనానులేపనక ♦ నన్మణిమండనమాల్యపేయముల్
సవరన నిమ్ము, నీవు నరు♦సంబున వారుణిఁ గ్రోలు, మంత రా
ఘవుల వినాశవార్త పురిఁ ♦ గ్రచ్చఱ నల్గడ సుప్రసిద్ధ మౌ. ౧౮౬౨

అర్థములు. వివిధ పదార్థ సంతతులు=అనేక వస్తువుల రాసులను, నవ = క్రొత్తలగు, వసన = వస్త్రములు, అనులేపన = చందనాది పూఁత ద్రవ్యములు, కనత్ =ప్రకాశించు, మణి మండన=రత్నాభరణములు, మాల్య = పూలదండలు, పేయముల్ =సారాయములులోనైనవి, సవరనన్ =చక్కఁగా, అరుసంబున=సంతోష ముతో, వారుణి=సారాయము, క్రోలుము=త్రాగుము, క్రచ్చఱ = శీఘ్రముగా, నల్గడ=నాలుగు దిక్కులందు.

### తాత్పర్యము

యుద్ధభటులకు వారువారు కోరిన నానాపదార్థములు సంతోషముతో నిమ్ము. మఱియుఁ గ్రొత్త వస్త్రములు, చందనాదులు, రత్నాభరణములు, పూలదండలు, పానీయములు చక్కఁగా నిమ్ము. నీవును సారాయము ద్రాగుము. ఇట్లు చేసితివేని రామలక్ష్మణులు చచ్చిన వారన్న వార్త యూరిలో నందఱకు నాలుగు ప్రక్కల ప్రసిద్ధముగాఁ దెలియును.

ఉ. మెల్లగ నీవు సీతఁ గని ♦ మేలిమివాక్కుల నిచ్చకంబులన్
గల్లల ధాన్యవిత్తమణి ♦ కాండము లాసలు గూర్చి జూపి రం

జిల్లఁగఁజేసి యూఱడఁగఁ ♦ జెప్పి వశంపడఁ జేసికొమ్ము నీ
యుల్లము తాపమాఱ నిది ♦ యుక్తిసుమీ భయశోకనష్టికిన్. ౧౪౭౩

### తాత్పర్యము

అప్పుడు నీవు మెల్లగా సీతయొద్దకుఁ బోయి స్తుతివాక్యములచేతను ఇచ్చకంబులను అబద్ధములచేతను ధనధాన్య రత్నములిచ్చెదనని యాశచెప్పియు నామె మనస్సు సంతోషపడఁ జేసి సమాధానపడఁ జెప్పి నీ స్వాధీనము చేసికొమ్ము. నీ హృదయతాపము తీరుటకు భయము శోకము పోవుటకు నిది యుపాయము.

చ. అవనిజ రంజనీయుఁ డగు ♦ నాత్మవిభుండు వినాశ మొందఁగా
నవిరళభోగభాగ్య మహి♦మార్హ సుఖేధిత యాట మున్ను దుః
ఖవికలచిత్త యాస చెడఁ♦గా రమణీచలబుద్ధిఁ జేసి నీ
కు వశపడం దలంచు నెడఁ ♦ గూరిమి లేకయు నీవె దిక్కుగన్. ౧౪౭౪

అర్థములు. అవనిజ=సీత, రంజనీయుఁడు = ఆశపడఁ దగినవాఁడు, ఆత్మవిభుండు=తనమగఁడు, వినాశ మొందఁగాన్ = చావఁగా, మున్ను = పూర్వము, ఆవిరళ=దట్టమైన, విస్తారమైన, భోగభాగ్య మహిమార్హ = గొప్ప భోగ భాగ్యములకుఁ దగిన, అర్హ=యోగ్యమైన, సుఖేధిత=సుఖముతోఁ బెంపబడినది, దుఃఖవికలచిత్త = దుఃఖముచేఁ జెదరిన మనస్సుగలది, ఆశచెడఁగా = రాముని యాశ చెడిపోఁగా, రమణీచల బుద్ధిఁజేసి = స్త్రీలకు స్వభావమైన చపలచిత్తముచేత, వశపడన్=స్వాధీనపడుటకు.

### తాత్పర్యము

సీతాదేవి తాను ప్రేమింపఁదగిన తనమగఁడు చావఁగా పూర్వము విస్తారముగా భోగభాగ్యాతిశయముచే యోగ్యరీతి పెరిఁగినది కావునను, దుఃఖముచే మనస్సు వికలమైనది కావునను మగనియాశ చెడినది కావునను స్త్రీలకు స్వభావమైన చపల బుద్ధిచేత నీమీఁద ప్రేమ లేకున్నను నీవు తప్ప వేఱుగతి లేదని నీకు వశంపడఁ దలఁచును.

సీ. ఇది సుమ్ము నా నిర్ణయించినపద్ధతి. యిది నీకు సుఖ మని♦యేఁ దలంతుఁ
బంక్తిరథాత్మజా♦బారిని బడితివా, సత్య మనర్థంబు♦చాల నోదవు
నింద సుఖంబుగా♦నెలమి నుండుము రణా,వనికిఁ బోవఁగ యత్న♦పడఁగ వలదు
భండనం బొనరింప♦కుండిన సుఖలాభ, మధిప నా వాక్యంబు♦లాదరింపు

ఆ. సూడుబలము జూడ ♦జూడక ప్రాణసం,శయము లేక జేఁడ♦జయము గొనుము
యశముఁ గీర్తిఁ బుణ్య♦మైశ్వర్యమును బొంది, చిరయశంబు నీవు♦చెందఁగలవు.

అర్థములు. సూడుబలము=శత్రుసేన.

### తాత్పర్యము

ఇది నేను నిశ్చయించిన మార్గము. ఇటు చేసితివా నీవు సుఖపడుదు వనియే

తెలంచెదను. అటుగాక రాముని బారిఁబడితివా నీకు గొప్ప కీడు తప్పదు. చత్తువు. కావున నిచ్చటనే సుఖముగా సంతోషముతో నుండుము. యుద్ధభూమికిఁ బోవు యత్నము చేయవలదు. యుద్ధము చేయకుండితివా సుఖము లాభము కలదు. నామాట గౌరవింపుము. శత్రుసేన యే ప్రక్కనున్నదో యాప్రక్కనైన నీవు చూడవలదు. అట్లుచేసి ప్రాణభయములేక జయము గొనుము. యశము, కీర్తి, పుణ్యము, సంపద నీవు పొందగలవు

అట్టి యుపదేశము లిట్టి యుపాయములు చెప్పువారు మంత్రులై నపుడు ఆ ప్రభువు స్మశానమునకుఁ బోవుటకు నడ్డమేమున్నది? తన యుపాయము సఫలమై యుండునవియు నటుచేయక రావణుఁడు చెడెననియు నీ మూఢుని యభిప్రాయము.

—♦ ౬౫-వ సర్గము. కుంభకర్ణుఁడు మహోదరు నిందించుట ♦—

ఉ. చెప్ప మహోదరుం డిటు లి♦సీ యని యాతని నీసడించి పెం
పొప్పఁగఁ గుంభకర్ణుఁ డసు♦రో త్తముఁ గాంచి దురాత్ము రామునిన్
దెప్పున జంపి నీ భయముఁ ♦ దీర్చెద నిష్పరిపంథి వౌచు నీ
వెప్పటియట్ల లెస్స సుఖ♦యింపుము రాక్షసలోకనాయకా! ౧౪౬౬

అర్థములు. ఇసీ = ఛీ, ఈసడించి = నిందించి, నిష్పరిపంథివి = శత్రువు లేనివాఁడవు.

తాత్పర్యము

మహోదరుఁ డిటు చెప్పఁగా ఛీయని యతని నిందించి తన గొప్పతనము దెలియునట్లు కుంభకర్ణుఁడు రావణుఁ జూచి దుర్బుద్ధి యగు రాముని త్వరగాఁ జంపి నీ భయము పోఁగొట్టెదను. శత్రువులు లేనివాఁడవై నీవు మునుపటివలె హాయిగా నుండుము.

కం. నిర్జల మేఘంబులవలె, గర్జింపరు వ్యర్థముగను ♦ గడిమిం గలవా
రూర్జితయశ శత్రువులను, నిర్జించి మొనప్ప గర్జ♦నెఱిఁ గనవన్నా! ౧౪౬౭

అర్థములు. నిర్జల మేఘము=నీళ్ళులేని మేఘము, జలమే లేకున్న మేఘమే లేదు. కావున నిర్జలమనఁగా వర్షముగాఁ గురియునంత విశేషజల మని యర్థము. కడిమిన్=బలమును, ఊర్జితయశ=వృద్ధినొందు కీర్తిగలవాఁడా!

తాత్పర్యము

నీరులేని మేఘమువలె బలముగలవారు వ్యర్థముగ గర్జింపరు. శత్రువులను జయించి నేను చేసెడు సింహనాదము నప్పుడు వినుము.

కం. పరధిక్కృతముల సైఁపరు, చోర రాత్మశ్లాఘలకును♦శూరులు వెలికిన్
వెరవిఁడులట్లుండియు దు,ష్కరముల సాధింత్రు రాక్ష♦సప్రాగ్రసరా! ౧౪౬౮

అర్థములు. పరధిక్కృతములను=ఇతరులుచేయు నవమానమును, సైఁపరు= సహింపరు, ఆత్మశ్లాఘలకును=తమ్ముఁదాము పొగడుకొనుటకు, చోరరు=పూనరు

నెరవిఁడులు = నెఱవు+ఇఁడి = ఉపాయము తెలియనివారు, దుష్కరములన్ = అసాధ్య కార్యములను, రాక్షస ప్రాగ్రసరా = రాక్షస శ్రేష్ఠుఁడా!

తాత్పర్యము

పరుల యవమానమును సహింపరు, తమ్మేదాము పొగడు కొనరు. శూరు లగువారు బయట చూచుటకు నేమియుఁ దెలియనివారివలె నుండియుఁ బనిపడి నపుడు ఇతరులకు సాధ్యముకాని పనులను సాధింతురు.

సీ. ఓరీ మహోదర! ♦ యుద్ధకాపురుషులుఁ, బండితమానులు ♦ బాలిశులును
నిచ్ఛకమారులు ♦ హీనబుద్ధులు నినుఁ,బోలినవారలు ♦ బోద్ధ లగుట
మీ వాక్యము ల్విని ♦ రావణుం డిటు లయ్యెఁ, గార్యఫలం బిట్టి♦గతికి వచ్చె
మిత్రచిహ్నుండు న♦మిత్రకుం డగు రాజు,వెను వెంటఁ దగిలి మీ♦రనవరతముఁ

ఆ. బురము రాజశేష ♦ ముగ నొనరించితి, రెల్లకోశములును, ♦ నెల్లబలము
నుఱువు మాపి యేటి♦యుక్తులు గిక్తులుఁ, జాలుఁ జాలు మున్ను♦సలిపినవియు.

అర్థములు. యుద్ధకాపురుషులు=యుద్ధమునకు భయపడెడువారు, పండితమానులు=తమ్మేదాము పండితుల మని తలఁచువారు, బాలిశులును = మూఢులును, ఇచ్ఛకమారులు=ముఖప్రీతి మాటలు చెప్పువారు, హీనబుద్ధులు = బుద్ధి లేనివారు, నినుఁబోలినవారు = నీవంటివారు, బోద్ధలు = ఆలోచనలు చెప్పువారు, అగుట, మిత్రచిహ్నుఁడు=మిత్రుల కుండ వలసిన చిహ్నములు మాత్రము గలవాఁడు. అమిత్రకుఁడు=వాస్తవమున మిత్రుఁడు గాక శత్రువే యగువాఁడు, అనవరతము = ఎల్లప్పుడు, పురమున్ = లంకానగరమును, రాజశేషముగన్ = రాజు మాత్రము మిగిలిన దానిగా, ఎల్లకోశములును = బొక్కసము లన్నియు, ఎల్ల బలము=సేనయంతయు, ఉఱువుమాపి = రూపము లేకుండఁ జేసి.

తాత్పర్యము

ఓరీ మహోదరా! యుద్ధమనిన భయపడు నీవంటి పిఱికివాండ్రును, పండితుల మని తమ్మేఁ దాము తలఁచువారుఁ మూఢులు, ముఖప్రీతిమాటలు చెప్పువారు, ఆలోచన చేయుశక్తి లేనివారు, నీవంటివారు బోధించువా రగుటచే మీ మాటలు విని రావణుఁ డీ గతిపట్టెను. ఆ కార్యఫల మిట్టి దశకు వచ్చెను. మిత్రుని గుఱుతు మాత్రము గలిగి వాస్తవమున శత్రువగు రాజువెంట మీ రెప్పుడు విడువక యుండి నగరమున రాజు మాత్రము మిగులునట్లు చేసితిరి. ధనకోశములు సేన లన్నియు రూపము లేకుండఁ జేసితిరి. ఇంక నేమియుక్తులు గిక్తులు చెప్పెదరు. ఇది వఱకుఁ జెప్పినవి చేసినవి చాలుఁ జాలును. ఇందు రావణుఁడు మిత్రచిహ్నముగల శత్రువని చెప్పఁబడెను. 'అపకారోరి లక్షణ'మ్మని అపకారము చేయువాఁడే కదా శత్రువు. తన యొక్కని తుచ్ఛకామమునకై యందఱ జంపించువాఁడు శత్రువుగాక మిత్రుఁడగునా? శత్రు వింతకంటె విశేషమేమి చేయఁగలఁడు?

కం. మీ యొనరించిన దుర్ణయ, మా యోధనమునకు నేగి ♦ యనువుపడంగాఁ
జేయుదు నన నవ్వుచు దై, తేయవిభుఁడు కుంభకర్ణు♦ దెసఁ గని పలుకున్.

అర్థములు. దుర్ణయము = కీడు, ఆయోధనమునకు = యుద్ధమునకు, అనువుపడంగాన్=చక్కఁబడఁగా.

తా త్ప ర్య ము

మీరు దుర్నీతి పరులై చేసిన కీడును యుద్ధమునకుఁబోయి చక్కఁజేసెద ననిన రావణుఁడు నవ్వుచు కుంభకర్ణునితో నిట్లనియె.

## —♦ రావణుఁడు కుంభకర్ణుని బ్రశంసించుట ♦—

ఉ. రామునకున్ భయంపడి దు♦రంబు మహోదరుఁ డొల్లఁ డేమియున్
భీమబలంబునన్ మిగులు♦నెయ్యమునందును నాకు నిన్నుఁబో
ధీమహితుండు వేఱెవఁడు ♦ తెప్పున సంగరకేళి కేగుమీ
ప్రామిడి శత్రులం దునిమి ♦ ప్రాణభయంబును బాపు తమ్ముఁడా!   ౧౮౭౧

అర్థములు. దురంబు = యుద్ధము, ధీమహితుండు=బుద్ధిచే గొప్పవాఁడు, ప్రామిడి శత్రులన్ = (౧) క్రూరులైన విరోధులను, (౨) క్రౌర్యముచే విరోధులను.

తా త్ప ర్య ము

రామునకు భయపడి మహోదరుఁడు యుద్ధము చేయ నిచ్చగింపఁడు. అది వాస్తవము. భయంకరమైన బలమునందు అతిశయస్నేహమందు నాకు నిన్నుఁ బోలినవాఁడు బుద్ధిమంతుఁడు మఱియెవఁడు గలఁడు? కావున యుద్ధమునకుఁబొమ్ము. క్రూరముగా పగవారిని జంపి తమ్ముఁడా! నా ప్రాణభయమును బాపుము.

ఉ. నే నలభీతిఁ గాదె నిను ♦ నిద్దుర లేపితి, నాకుఁ గూర్చువా
రానికఁ దోడ్పడంగ సమ♦యం బిదియే, యటుగాన శూలముం
బూనుచుఁ బాశహస్తుఁ డగు♦పూషసుతుంబలె సూర్యతేజులన్
మానవనాథులం గపుల♦మానక యందఱ మ్రింగి వేయుమా!   ౧౮౭౨

అర్థములు. అలభీతిన్=ఆ రామునివలన ప్రాణాపాయము వచ్చునను భయముచే, కూర్చువారు = ప్రేమగలవారు, ఆప్తులు—ఆనికన్ = దృఢముగా, పూషసుతుంబలెన్ = యమునివలె.

తా త్ప ర్య ము

ఆ ప్రాణభయము చేతనేకదా నిన్ను నేను నిద్దుర లేపితిని. నాకు నా ప్తులగువారు పూనికతో సహాయము చేయవలసిన సమయమిదియొకదా? కావున శూలము తీసికొని పాశమును ధరించిన యమునివలె సూర్యకాంతిగల రాజులను కపులను నెవరిని వదలక యందఱను మ్రింగుము.

కం. నీ యాకారముఁ గనిన య, థాయథలై పాఱిపోవె ♦ తరుచరతతు ల
త్యాయతభీతిని రాఘవుఁ, డా యనుజుఁడు గుండె లగల ♦ హతులై పోరే.

అర్థములు. యథాయథలు=చెల్లా చెదరు, అగలన్=పగులఁగా.

తాత్పర్యము

నీ యాకారము చూడఁగానే వానరు లెక్కడివా రక్కడనే చిత్రాతివిరాఁది గ్రచ్ఛకాయలై చెదరిపోరా? మిగుల భయపడి రామలక్ష్మణులు గుండెలు పగిలి చావరా?

ఉ. ఈ తెఱఁ గాడి రాక్షసకు♦లేశ్వరుఁడా ఘటకర్ణు, వాని ప్ర
స్ఫీతభుజాబలంబుఁ బటు♦వీర్య మెఱుంగుటఁ జేసి తన్ బున
ర్జాతునిఁగాఁ దలంచుచు భృ ♦ శ ప్రమదంబునఁ దేలియాడుచున్
శీతమరీచిభంగి వెల ♦ సెం గడు నిర్మలుఁడై సభాస్థలిన్. ౧౪౭౪

అర్థములు. ఈ తెఱఁగాడి = ఈవిధముగాఁజెప్పి, ప్రస్ఫీతభుజాబలంబు= ప్రసిద్ధికెక్కిన భుజబలంబు. పటువీర్యము=దృఢశక్తి, పునర్జాతునిఁగా = మరలఁ దల్లి కడుపులో నుండి పుట్టిన వానిఁగా, భృశప్రమదంబునన్=మిక్కిలి సంతోష ముతో, శీతమరీచి భంగిన్=చంద్రునివలె.

తాత్పర్యము

కుంభకర్ణునితో రావణుఁ డీప్రకారము చెప్పి వాని ప్రసిద్ధబలము శౌర్యము తెలిసిన వాఁడగుటచే మరల జన్మమెత్తిన వానిఁగాఁ దన్నుఁదలంచుచు మిగుల సంతోషమునఁ దేలాడుచు చంద్రునివలె మిగుల నిర్మలుఁడై సభయందు వెలసెను.

—♦ రావణుఁడు కుంభకర్ణునితో నొంటిగ యుద్ధమునకుఁ బోవలదనుట ♦—

సీ. అన్నయానతిమేర ♦ కా కుంభకర్ణుండు, యుద్ధసన్నాహంబు ♦ లొనరఁ జేసి
కాలాయసంబును ♦ గనకభూషితమును, శక్రాశని సమంబు ♦ సాధ్వసదము
దానవదేవగం ♦ ధర్వ సూదనమును, వమదుగ్రపావక♦జ్వాల మసమ
తేజంబు దీప్తంబు ♦ ధృతిరక్తమాల్యంబు, శాత్రవశోణిత♦సంయుతంబు

తే. నగుచు రహిమించు శూలంబు ♦ హస్తమందు
దాల్చి దశకంఠుఁ గనుఁగొని ♦ తరలువాఁడ
నేకతమ యని సేయఁగ ♦ నింద నాదు
బలము లుండెడుఁగాక నా ♦ వచ్చు దాఁక. ౧౪౭౫

అర్థములు. సన్నాహంబులు = ప్రయత్నములు. కాలాయసంబును = ఉక్కుతోఁ జేయఁబడినది, కనకభూషితము=బంగారు నగలచే నలంకరింపఁబడినది. శక్రాశనిసమంబు = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైనది. సాధ్వసదము = భయము కలిగించునది, దానవదేవ గంధర్వ సూదనమును=దానవులను దేవతలను

గంధర్వులను చంపినది, వమత్ = వాంతిచేసికొనుచున్న, ఉగ్రపావకజ్వాలము = భయంకరమైన యగ్నిజ్వాలలు గలది, అసమ తేజంబు = అసమాన కాంతిగలది, దీప్తంబు=మండుచున్నది. ధృత=ధరింపఁబడిన, రక్తమాల్యంబు = ఎఱ్ఱని పూల దండలు గలది, శాత్రవ శోణిత సంయుతంబు=శత్రువుల నెత్తుటితోఁ గూడినది, రహిమించు = ప్రకాశించు, ఏకతమ = ఒంటరిగా, అని సేయఁగన్ = యుద్ధము చేయుటకు.

## తాత్పర్యము

అన్న యాజ్ఞచొప్పున నా కుంభకర్ణుండు యుద్ధప్రయత్నములు చక్కఁగాఁ జేసి, ఉక్కుతోఁ జేయఁబడినదియు, బంగారు నగలచే నలంకరింపఁ బడినదియు, ఇంద్రునివజ్రాయుధముతో సమానమైనదియు, భయముగలిగించునదియు, దేవదానవ గంధర్వులఁ జంపినదియు, అగ్నిజ్వాలలఁ గ్రక్కునదియు, అసమాన తేజస్సు గలదియు, మండుచున్నదియు. ఎఱ్ఱపూలదండలు ధరించినదియు, పగవారి నెత్తుటితోఁ గూడినదియునై ప్రకాశించు శూలంబును జేత ధరించి రావణుని జూచి నేనొంటరిగా యుద్ధమునకుఁ బోయెదను. నేను వచ్చువఱకు నా సేన లిందే యుండనిమ్ము.

చ. తరమిఁడి ద్రుంగువాఁడ వసు◆ధారుహచారుల నన్నఁ బంక్తికం
ధరుఁ డది నీతిగాదు, భయ◆దధ్వజినీచయము ల్భకంప ము
ద్గరముసలాయుధ ల్గొలువ◆గాఁ జనుమీ, కపులన్న శౌర్య ని
ర్భరు లతివేగు లాహవధు◆రంధరులున్ సముదీర్ణసాహసుల్. ౧౮౫౬

అర్థములు. తరమిడి = వరుసపెట్టి, వసుధారుహచారులన్ = వానరులను, భయదధ్వజినీచయముల్=భయంకరమైన సేనాసమూహములు, శౌర్యనిర్భరులు= అధిక శౌర్యముగలవారు, అతివేగులు=మిగుల వేగముగలవారు, ఆహవధురంధరులు=యుద్ధమందు సమర్థులు సముదీర్ణసాహసుల్=మిక్కిలి తెంపుగలవారు.

## తాత్పర్యము

వానరులను వరుసపెట్టి ద్రుంగెదను, అని చెప్పఁగా రావణుఁ డది నీతిగాదు. భయముగలిగించు సేనలు ముద్గరములు రోఁకండ్లు ఆయుధములుగాఁ గలవారు సేవింపఁగా బొమ్ము. వానరులు సామాన్యులుగారు. అధిక శౌర్యముగలవారు. అతి వేగము గలవారు. యుద్ధనిపుణులు, మిక్కిలి సాహసులు.

కం. ఒంటరిఁ బ్రమత్తు నినుఁ గని, కంటునఁ గోఱలను గోళ్ళఁ◆గపి కాండంబుల్
దుంటలుగఁ బెఱికి చంపెదు, నొంటిగఁ జనకన్న! చనుము◆యుగ్రబలముతోన్.

## తాత్పర్యము

ఒంటరివానిని=దేహము తెలియనివానిని నిన్నుఁజూచి పగచే వానరులు కోఱలచే గోళ్ళచేతను కలుగఁబీఁకి చంపెదరు. నాయనా! యొంటరిగఁ బోకుము. గొప్ప సేన తీసికొని పొమ్ము.

చ. మన పగవారినెల్లఁ బరి ♦ మార్పు మటంచును రావణుండు ది
గ్గన తన పీఠముం డిగి ప్ర ♦ కాశధురం బగు రత్నహార మ
య్యనుజుని కంఠసీమ ముద♦మారఁగ వైచి మణీమయోర్మిక
ల్గనకవిభూషణంబులు జ్వల ♦ న్మహితాంగద కుండలంబులున్. ౧౪౭౮

అర్థములు. ప్రకాశధురంబు = అధికప్రకాశము గలది, మణీమయోర్మికల్ = రత్నములు చెక్కిన యుంగరములు, జ్వలత్ = ప్రకాశించు, మహితాంగద కుండలంబులున్ = గొప్ప భుజకీర్తులు చెవులకుండలములు.

తాత్పర్యము

మన విరోధుల నెల్ల (విభీషణునితోడ నని భావము) చంపుము, అని చెప్పి రావణుఁడు తటాలునఁ దాను కూర్చుండిన పీఠము దిగి ప్రకాశము గలది యగు రత్నహారము తమ్మునికంఠసీమయందు వైచి రత్నాలు చెక్కిన యుంగరములు బంగారు సొమ్ములు ప్రకాశించు భుజకీర్తులు, కుండలములు.

ఆ. తాన తొడిగి దివ్య ♦ మానిత పరిమళ, భరితమాల్యదామ ♦ పటలములను
మేననుంప నతఁడు♦మేలిసొమ్ములు దాల్చి, సుహుతమైన యగ్ని♦శోభఁ దనరె.

అర్థములు. దివ్య = దేవతాసంబంధమై, పరిమళ = సువాసనచే, భరిత = నిండిన, మాల్యదామ = పూలహారములయొక్క పటలములను = సమూహములను, సుహుతము = చక్కఁగా హోమముచేయఁబడినది, అగ్నిశోభన్ = అగ్ని కాంతిచే, తనరెన్ = ఒప్పెను.

తాత్పర్యము

తానే ధరింపఁజేసి దేవతలచే గౌరవింపఁబడిన సువాసన గల పూలదండల సమూహములను దేహమునం దుంపఁగా మంచి సొమ్ములు ధరించి చక్కఁగా హోమము చేయఁబడిన యగ్నికాంతివలె నొప్పెను.

కం. మాసరసితేతర శ్రోణీ సూత్రముచేత నతఁడు ♦ నెఱిఁ రాణించెన్
భాసుర సుధాజననమున, నా సర్పానద్ధమంద ♦ రాద్రి విధమునన్. ౧౪౮౦

అర్థములు. మాసర = దీర్ఘమైన, సితేతర = నల్లనైన, శ్రోణీ సూత్రముచే = మొలత్రాటిచే, నెఱిన్ = అందముచే; భాసుర = కాంతితోఁ గూడిన, సుధాజననమునన్ = అమృతము పుట్టెడి కాలమందు, ఆ = ప్రసిద్ధికెక్కిన, సర్పానద్ధ = వాసుకియను పాముచే గట్టఁబడిన, మందరాద్రివిధమునన్ = మందరాద్రివలె.

తాత్పర్యము

దీర్ఘమై నల్లనైన మొలత్రాడు ధరించిన యతఁడు అందముచే సముద్రమథనకాలమున వాసుకిచేఁ జుట్టఁబడిన మందరపర్వతమువలెఁ బ్రకాశించెను.

మానిని. కాంచన భారసహంబు నివాత మ ♦ కాండవిదార్యము వైద్యుత తే
జోంచిత మా కవచంబు ధరించి ♦ మహాత్ముఁడు వీరుఁడు సాంధ్యకభ్ర

త్సంచయ సవృతపర్వత రాజము • చందమునన్ రహించె మఱిన్
జందన సూనవిభూషణ భూషిత • సర్వతనుం డయి శూలియునై. ౧౪౮ ౧

అర్థములు. కాంచన భార సహంబు. కాంచన=బంగారుచే జేయఁబడి నదియు, భారసహంబు=పెక్కు బారువల యెత్తుగలది, (౨) ఎంత గొప్ప బరువు నైన నోర్చునది, ఎన్ని పర్వతములచేఁ గొట్టినను విఱుగదు, నివాతము= =(౧) గాలి దూఱునంత సందుగూడ లేనిది, (౨) శస్త్రములచే భేదింపరానిది. "నివాతా వాశ్రయావాతా శస్త్రాభేద్యంచ కర్మయు" త్తని యమరము. అకాండ విదార్యము = బాణములచేఁ జీల్పుటకు సాధ్యపడనిది. వైద్యుత తేజోంచితంబు= మెఱుపువంటి కాంతితో నొప్పునది, సాంధ్య=సంధ్యాకాలము నందలి, కభృత్ = మేఘములయొక్క, సంచయ, సమూహముచే, సంవృత = క్రమ్ముకొనఁ బడిన, పర్వతరాజము చందమునన్, చందన = గంధముచేతను, సూన =పూల చేతను, విభూషణ=సొమ్ములచేతను, భూషిత=అలంకరింపఁ బడిన, సర్వతనుండై = సర్వ దేహము గలవాఁడై.

### తాత్పర్యము

బంగారుతోఁ జేయఁబడి మిగుల బరువై, బరువును సహింపఁగలదియు, నివాతము=గాలిదూఱుసందు లేనిది, బాణములచేఁ జీల్పరానిది, మెఱుపుతీఁగ వంటి కాంతిగలది, పెద్దదేహము గలవాఁడు, వీరుఁడు నగు కుంభకర్ణుఁడు సంధ్యాకాల మేఘ సమూహముచేఁ గట్టఁబడిన పెద్దపర్వతమువలెఁ బ్రకాశించెను. మఱియును గంధము పూలు సొమ్ములు వీనిచే నలంకరింపఁ బడిన దేహమంతయు గలవాఁడై శూలము ధరించిన వాఁడై.

తే. వీరుఁడ త్రివిక్రమోత్సాహ • వేళ యందుఁ
బెరుఁగు నారాయణునిఁ బోలె • వెలిఁగి యాతఁ
డన్నకును దాఁ బ్రదక్షిణ • మాచరించి
కౌఁగిటను గ్రుచ్చి మ్రొక్కిఁడి • కదలె ననికి. ౧౪౯ ౨

అర్థములు. త్రివిక్రమోత్సాహవేళయందు = మూఁడడుగులు కొలుచుటకై విష్ణువుత్సహించి నపుడు.

### తాత్పర్యము

పూర్వము మూఁడడుగులచేఁ గొలుచుటకై యుత్సహించిన వేళ నారాయణమూర్తి పెరిఁగినట్లు వెలిఁగి యన్నకుఁ బ్రదక్షిణ మాచరించి కౌఁగిలించి, నమస్కరించి యుద్ధమునకై వెడలెను.

### —• కుంభకర్ణుఁడు యుద్ధమునకై వెడలుట •—

సీ. అన్నచే దీవన • లంది యా బలశాలి, యార్భటుల్ నించుచు • నరుగుచుండ
శంఖదుందుభులని • స్స్వనములు శూరుల, గొరుల తురుకుల • భేరిగముల

రవములు నిండారె • రథికులు వెన్నంటి, చనిరి సింహద్విప • సర్పతురగ
మృగఖరోష్ట్రింబులు • నేగ నాతనిబడిఁ, బురజనుల్ చల్లిరి • పుష్పములను
ఆ. భటులు చనిరి శస్త్ర•పాణులై సింహనాదములు దెసల నిండ • దారుణాక్షు
లగుచుఁ గుంభకర్ణుఁ • డతి భీమరూపుఁడై, యస్రగంధమత్తుఁ • డగుచుఁ జనుచు

అర్థములు. గౌరుల = ఏనుఁగుల, తురుకుల = గుఱ్ఱములను, ఏక. తురికి (Turkey) దారుణాక్షులు = క్రూరములైన చూపులు గలవారు, అస్రగంధమత్తుఁడు=నెత్తుటి వాసనచే దేహము తెలియనివాఁడు.

తాత్పర్యము

ఆ బలశాలి యన్నచే నాశీర్వదింపఁబడి సింహనాదములు చేయుచుఁ బోవుచుండఁగా శంఖములయు, నగారాలయు ధ్వనులు, ఏనుఁగుల, గుఱ్ఱముల, రథసమూహముల ధ్వనుల వ్యాపించెను. సింహములు, ఏనుఁగులు, సర్పములు, పాములు, జింకలు, కంచరగాడిదలు, ఒంటెలు వాహనములుగాఁ గలవారును, రథికులును, నతని వెంటఁ బోయిరి. పోవునపుడు పురజనులు వానిమీఁదఁ బుష్పములు చల్లిరి. శస్త్రములు ధరించినవారై సింహనాదములు చేయుచు భటులు పోయిరి. కుంభకర్ణుఁడు భయంకర రూపము గలవాఁడై నెత్తుటి వాసనచే దేహము తెలియక పోవుచు.

సీ. నూఱువిండ్ల వెడలు•నాఱునూఱుల యున్న,తియు రథచక్రముల్•దెగడుకనులు
రౌద్రరూపంబు ప•ర్వతసన్నిభాంగంబు, దగ్ధశైలోపమ•తనువుఁ దాల్చి
గహ్వరాస్యుండు ర•క్కసులఁ గనుంగొని, నగుచు నిట్లను దైత్య•నాథులార!
మిడుతలపైఁ జిచ్చు•పడు వడువునఁ గ్రోఁతి, నెఱసరిమిన్నల•నిగ్రహింతు
తే. నాకు వా రపరాధ మొ•నర్పలేదు, మఱియు మావంటి వారల • మంజులోప
వనులకెల్ల నలంకృతి•ప్రాయు లగుదు, రిట్టు లగుటను వారల•నేల చంప?

అర్థములు. నూఱు విండ్ల వెడల్పు = నూఱు బారల వెడల్పు, పర్వత సన్నిభాంగంబు = పర్వతముతో సమానమైన దేహము, దగ్ధశైలోపమ తనువు = కాలిన కొండతో సమానమైన దేహము, గహ్వరాస్యుండు=గుహవంటి నోరుగల వాఁడు, నెఱసరి మిన్నల=శ్రేష్ఠులగు కోఁతుల, మంజులోపవనులకు = అందమైన యుద్యానవనములకు

తాత్పర్యము

నూఱుబారల వెడల్పు, ఆఱునూఱు బారల పొడుగు, రథచక్రములఁబోలు కన్నులు, భయంకరాకారము, కొండనుబోలు దేహము, కాలిన కొండవంటి దేహము ధరించి గుహవంటి నోరు గలవాఁడై రాక్షసులఁజూచి నవ్వుచు నిట్లనియె. రాక్షసులారా! మిడుతలమీఁద కారుచిచ్చు పడునట్లు కోఁతు లగు వానరులను కాల్చి వేసెదను. కాదు కాదు. వారు నాకేమి యపరాధము చేయలేదు. మఱియు వారు మావంటి వారి యుద్యానవనములకును నలంకారమై యుందురు. కావున వారిని జంప నేల ?

చ. మననగరంబు ముట్టినది ♦ మానవనాథులు రామలక్ష్మణుల్
మును మును వారిఁ జంపిన స♦మూలముగా నశియించు సర్వ మం
చన మదిఁ బొంగి వారలు మ♦హాంబుధి క్షోభిల సింహనాదముల్
నినిచిరి రామలక్ష్మణులు ♦ నేఁటికిఁ దీఱె రటంచు నెంచుచున్. ౧౪౭౫

అర్థములు. ముట్టినది = ముట్టడించినది, క్షోభిలన్ = కలఁత పడునట్లు, నినిచిరి = నించించిరి.

## తాత్పర్యము

మన పట్టనము ముట్టడించినవారు రామలక్ష్మణులు. మునుముందు వారిని జంపిన సర్వము వేరుతోడ నశించును. కొమ్మలు కొట్టుటకంటె వేరు తెగఁగొట్టుట గదా ముఖ్యము. అని చెప్పఁగా వారు అబ్బ రామలక్ష్మణులు నేఁటితోఁ జచ్చిరని సంతోషించి సముద్రము కలఁతపడునట్లు సింహనాదములు చేసిరి.

సీ. కుంభకర్ణుఁడు రణ♦కుతుకంబునను జన, దుశ్శకునంబులు ♦ దోఁచెఁ జాల
నులాఁకలతోడ ♦ నొప్పె మేఘంబులు, గర్దభారుణములై ♦గగనసీమఁ,
గలఁగె సాగరవనుల్♦కంపించె మేదిని, వఱదులు వాపోయె♦జ్వాల లుమిసి
యప్రదక్షిణముగ ♦ నరిగె శకుంతముల్, మాలికనా మీఁద ♦ వ్రాలె గ్రద్ధ
తే. యదరెడాకన్నుఁగేలు, తే♦జాఱె రవికిఁబరుషముగవీవఁదొడఁగెఁబ్ర♦భంజనుండు
వాని నేమియుఁ గైకోక ♦ వాసవారి కాలబలచోదితుం డయి♦కదలె ననికి.

అర్థములు. రణకుతుకంబునను = యుద్ధమందలి యాశచే, ఉల్కాశనులతోడన్ = కొఱవులతోను పిడుగులతోను, గర్దభారుణములై = గాడిదలవలె నెఱ్ఱనై, సాగరవనుల్ = సముద్రము, అడవులు, వఱదులు = నక్కలు, శకుంతముల్ = పక్షులు, మాలిక = సరము, గ్రద్ధ = గ్రద్దలు, జాత్యేకవచనము, డాకన్ను = ఎడమకన్ను, తేజు + ఆఱెన్ + రవికిన్ = సూర్యునకు కాంతి క్షీణించెను. ఇట్లు చెప్పుటచే నిది పగటి యుద్ధమని యేర్పడుచున్నది. ప్రభంజనుండు = వాయువు, కైకోక = లక్ష్యపెట్టక, కాలబలచోదితుండయి = కాలబలముచే ప్రేరితుండై.

## తాత్పర్యము

యుద్ధమందలి యాశచే కుంభకర్ణుఁడు పోవుచుండ పెక్కు చెడ్డ శకునము లయ్యెను. ఆకాశము కొఱవులతోను (కొఱవులవంటి మంటలు) పిడుగులతోను గాడిదలవలె నస్పష్టమైన యెఱ్ఱనికాంతి గలదై మేఘము లొప్పెను. సముద్రము, అడవి మృగములు వ్యాకులపడెను. భూమి వణఁకెను. మంటలు గ్రక్కుచు నక్కలు కూసెను. పక్షు లప్రదక్షిణముగాఁ దిరిగెను. గ్రద్దలు పంక్తిగావచ్చి మీఁద వ్రాలెను. ఎడమకన్ను, ఎడమచేయి యదరెను. సూర్యుని కాంతి క్షీణించెను. వాయువు కఠినముగ వీచెను. వానిని గొంచెమైన లక్ష్యపెట్టక రాక్షసుఁడు కాలబలముచేఁ బ్రేరేపింపఁబడి యుద్ధమునకుఁ బోయెను.

కం. చంగునఁ బ్రాకారంబును, లంగించి యతండు పదము♦లన్ శంబరభృ
ద్భంగి వెలుంగుచు నుండు ప్లవంగమ సైన్యంబుఁ గాంచె ♦ వాలిన కినుకన్.

అర్థములు. లంగించి=దాఁటి, లంఘించి-ప్రకృతి-శంబరభృత్ భంగిన్=మేఘమువలె, వాలినకినుకన్=అతిశయించిన కోపముచే.

తాత్పర్యము

ఏ ద్వారమును దాఁటిపోక కాళ్ళచేతనే చంగునఁ బ్రాకారము నెగిరి దాఁటి, మేఘమువలె వెలుంగుచునుండు వానరసేనను నతిశయించిన కోపముచేఁ జూచెను.

ఉ. వచ్చిన కుంభకర్ణుఁ గని ♦ వానరవాహిని విచ్చి యొగ్గ్లయై
పచ్చముపాడుగాఁ బఱచె ♦ వాతహతాంబుదజాలరీతి ని
ట్లిచ్చినభీతిఁ బాఱెడి క♦పీంద్రులఁ గాంచి ప్రహర్ష వార్ధిలో
ముచ్చమునీఁగి భూరిజల♦ముగ్గతి బొబ్బలు నించె నించినన్. ౧౮౭౭

అర్థములు. విచ్చియొగ్గ్లయై = చెల్లాచెదరై, పచ్చముపాడుగా=మిక్కిలి శూన్యముగా, పఱచెన్=పరువెత్తెను, వాతహత = గాలిచేఁ జెదరఁ గొట్టఁబడిన, అంబుదజాలరీతిన్=మేఘసమూహమువలె, ముచ్చమునీఁగి = మునీఁగి + మునీఁగి= ముచ్చమునీఁగి = పూర్ణముగా మునీఁగి, భూరిజలముగ్ + గతిన్ = పెద్దమేఘము వలె, బొబ్బలు = సింహనాదములు.

తాత్పర్యము

కోటగోడ దాఁకి వచ్చిన కుంభకర్ణునిఁజూచి వానరసేన చెల్లాచెదరై గాలిచే చెదరగొట్టఁబడిన మబ్బువలె సర్వశూన్యముగా నొకఁడైన నిలువక పరువెత్తెను. ఇట్లధికభీతిచేఁ బరువెత్తుచున్న వానరశ్రేష్ఠులఁ జూచి యధిక సంతోష మను సముద్రములోఁ దీరమునీఁగి గొప్పమేఘ మురిమినట్లు సింహనాదములు చేసెను.

కం. బెడిదపుటులివున నడఁబడి దడఁబడి యొదవడి సుడివడి ♦ తరుచరవీరుల్
తొడిఁబడి తొడితొడి బడి బడిఁ, బుడమిఁ బడిరి వేళ్ళు తెగిన♦భూజములనఁగన్.

అర్థములు. బెడిదము + ఉలివున = భయంకర ధ్వనిచే, వడఁబడి=శ్రమపడి, తడఁబడి=తడఁబాటు జెంది, సుడివడి=దిగ్భ్రమఁగొని, తొడిఁబడి = తొట్రుపాటు పడి, తొడితొడి=వరుసలై, బడిబడి = వెంట వెంటఁ ఒకరి వెంట నొకరు, సముచ్చయాలంకారము, భూజములు=చెట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. వారిఁ గని కుంభకర్ణుఁడు, వారక చెలరేఁగి కేలఁ ♦ బరిఘముగొని తాఁ
దోరపుజవమునఁ గవిసెన్, వారిపయిన్ శత్రుభయద♦వర్తనుఁ డగుచున్.

అర్థములు. పరిఘము = ఇనుపకట్ల గుదియ, తోరపు జవమునన్=అధిక వేగమున, శత్రు భయదవర్తనుఁడు = విరోధులకు భయము కలిగించు వ్యాపారము గలవాఁడై. తాత్పర్యము స్పష్టము.

## —• { ౬౬-వ సర్గము. కుంభకర్ణునిఁజూచి పరువిడు క్రోఁతులకు సంగదుఁడు ధైర్యముఁ జెప్పుట. } •—

కం. వరుణయమవాసవులకున్, దురమునఁ బోరిగొనఁగరాని • దోర్బలధుర్యున్
బరభీకరాక్షు గళరవ, పరిదారితశైలు నశని • వర్షాపాదిన్. ౧౪౯౧

అర్థములు. వాసవునకున్ = ఇంద్రునకు, దురమునన్=యుద్ధమునందు, పోరిఁగొనఁగరాని = చంపసాధ్యపడని, దోర్బల ధుర్యున్ = భుజబలాతిశయము గలవానిని, పరభీకరాక్షు = శత్రువులకు భయంకరమైన కన్నులు గలవానిని, గళరవ=కంఠధ్వనిచే పరిదారిత = పూర్ణముగాఁ జీల్పఁబడిన, శైలున్ = కొండలు గల వానిని, అశనివర్షాపాదిన్=పిడుగులవాన గురియించు వానిని.

### తా త్ప ర్య ము

వరుణుఁడు యముఁడు ఇంద్రుఁడు ముగ్వురు గలిసియును యుద్ధమునందుఁ జంప సాధ్యపడని యధికమైన భుజబలము గలవానిని, శత్రువులకు భయంకరమైన కన్నులు గలవానిని, కంఠనాదముచేఁ గొండలు పగులఁజీల్చు వానిని పిడుగులవాన గురియించు వానిని.

చ. కనుఁగొని క్రోఁతిమూఁకలు వి • కావికలై పరిభిన్న దారదం
బనఁ జనె, నంత నీలుని గ • వాక్షు నలుం గుముదున్ సహస్రనే
త్రుని మనుమండు డాసి నుత • దోర్బలధుర్యు లరీరు, మీరలే
చని యెద రెందు? నాత్మకుల • శౌర్యములున్ మఱ పాయెనే మదిన్. ౧౪౯౨

అర్థములు. వికావికలై = చెల్లాచెదరై, పరిభిన్నదారదంబు = చెదిరిన పాదరసము, "దారదో విష పారదా" నానా॰ ర॥ నుతదోర్బల ధుర్యులరు = పొగడఁబడిన భుజబలముయొక్క యాధిక్యము గలవారలు, ఈరు=మీరు.

### తా త్ప ర్య ము

చూచి క్రోఁతిగుంపులు చెల్లాచెదరై చెదరిన పాదరసమువలె పోయెను. ఇట్లు పోవుచున్న నీలుని, గవాక్షుని, నలుని, కుముదుని యంగదుఁడు సమీపించి మీరు మహాబలవంతు లని ప్రసిద్ధికెక్కినవారే. మీరే యెక్కడికి బరువెత్తి పోవుచున్నారు? మీ బలము, మీ శౌర్యముస్వరము మఱచిపోయితిరా?

చ. వెఱ పెపు డభ్యసించితిరి • వీరులు? ప్రాకృతవానరాళి య
త్తెఱఁగున మీరు పాఱుమరె • తేఁకువఁ బ్రాణభయార్తిఁ బాఱినన్
బఱచినచోట మి త్తి కనుఁ • బ్రామఁగ శక్యమె? మేలె వానరో
యఱగొఱలేని కీర్తి హతు • లౌటమొ యాఱడిచావుఁ జచ్చుటో? ౧౪౯౩

అర్థములు. అభ్య సించితిరి = అలవాటు పఱచికొంటిరి, కనుబ్రామఁగ= కన్నులు కప్పఁగ, అఱగొఱలేని = కొంచెమైనను దక్కువగాని, ఆఱడిచావు = వ్యర్థపుఁజావు.

### తాత్పర్యము

వీరులారా! భయపడుటకు నెప్పుడు నేర్చుకొని యలవాటు చేసికొంటిరి. ప్రముక్కిడి క్రోఁతులవలె మీరును పరువెత్తుదురా? ప్రాణము పోవునను భయము వలనఁ గలిగిన దుఃఖముచేఁ బరువెత్తిపోయితిరేని మీరు పోయినచోట మృత్యుదేవత లేదా? మృత్యువును కన్నులుమూసి మోసపుచ్చి పోవ మీకు సాధ్యమా? కీర్తికి నేలోపము లేకుండ వీరులవలెఁ జచ్చుటమేలా? అపకీర్తిపాలై యిండ్లలో రోగాదులచే వ్యర్థపుఁజావు చచ్చుట మేలా? ఆలోచించితిరా?

చ. కటకట ప్రాణవాయువులు • కాచుకొనంగను లేర? రాక్షసుల్
పాటముఁగఁ జేయ భీతి వెఱ•బొమ్మను దెచ్చిరి, పోటు చాల దీ
కుటిలత మీ రెఱింగి పడఁ • గూల్చినఁ దీఱెడిఁ గ్రోఁతులార! రం
డిటు తిరుగుండు దీని వధి•యింతము మింతము నిత్యకీర్తులన్. ౧౧౯౪

### తాత్పర్యము

అయ్యయ్యో వీరులారా! ప్రాణములను కాపాడుకొనుటకై పరుగెత్తి పోవలయునా? ఇందుండియే గాపాడుకొనలేరా? మనకు భయము కలిగింపఁగోరి రాక్షసులు వెఱబొమ్మను దెచ్చిరి. (పక్షులు మృగములు బెదరుటకై చేలలోఁ గట్టెడి బొమ్మను వెఱబొమ్మయని పేరు) ఇది చంపునది కాదు. ఈ కిటుకు మీరు తెలిసికొని పడగొట్టితిరా దీని పని ముగియును. వానరులారా! రండు వెనక కిక్కడికి తిరుగుఁడు. మనమందరము కలిసి దీని జంపుదము. శాశ్వతకీర్తి సంపాదింతము.

### —• వానరులు కుంభకర్ణుతోఁ బోరి యోడి పాఱిపోవుట •—

కం. అనవుడు వారును ధైర్యం,బును గొని సంక్రుద్ధులగుచు • భూరుహముల న
ద్దనుజవరేణ్యుని మోఁదిరి, ఘనమదకలసితంబులైన•గజములమాడ్కిన్.

అర్థములు. సంక్రుద్ధులు = కోపించినవారు, ఘనమదకలసితంబులైన = గొప్ప మదముచేఁ బ్రకాశించు.

### తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వారు ధైర్యముఁ దెచ్చుకొని యీ రాక్షసుఁడు మనల నిష్కారణముగ బెదరించెఁగదా యని కోపించి మదించిన యేనుఁగును గొట్టినట్లు చెట్లతోఁ గుంభకర్ణుని గొట్టిరి.

ఉ. అద్రిచరేంద్రు లొక్కమొగిఁ • బ్రాంశుధరాధరశృంగపాళి భూ
రిద్రుమచక్రవాళముల • రేయుచుఁ దాఁచినఁ గంపమొందఁడు
న్నిద్రమదాతిరేకమున • నిర్జరవైరి, సహస్రధాభిదన్
రౌద్రముగా ధరం దొరఁగె • రాక్షసు సోఁకిన చెట్లు గుట్టలున్. ౧౧౯౬

అర్థములు. ఒక్కమొగిన్ = ఏకముఖముగ, ప్రాంశు = ఎత్తైన, ధరా

ధరశృంగపాళిన్ = పర్వత శిఖరముల వరుసలను, భూరిద్రుమచక్రవాళములన్ = పెద్దచెట్ల సమూహములను, రేయుచున్=విజృంభించుచు, తాఁచినన్ = కొట్టఁగా, ఉన్నిద్ర=హెచ్చరికగల, మదాతిరేకమునన్ = మదముయొక్క యతిశయముతో, సహస్రథాభిదన్=వేయి తునుకలుగా.

### తాత్పర్యము

వానరు లందరును నొక్క మొగమై యెత్తైన పర్వత శిఖరంబులను పెద్ద వృక్షముల సమూహములను వైచి విజృంభించి కొట్టఁగా రాక్షసుఁడు హెచ్చిన మదాతిశయమునఁ జలింపఁడు. వానికిఁ దాకినచెట్లు, గుట్టలు వెయ్యి తునకలయి నేలఁబడెను.

క. ఇద్ధబలుం డాతఁడు సం, క్రుద్ధుం డై వనిని జిచ్చు • కొమరున భుజ శౌ
ర్యోద్ధతి శోభిల నరిమద, వృద్ధిం బోకార్చి కూల్చె • విటతాటముగన్. ౧౮౯౭

అర్థములు. ఇద్ధబలుండు = ప్రసిద్ధమైన బలము గలవాఁడు, శోభిలన్= ప్రకాశింపఁగా, అరి = శత్రువుల, మదవృద్ధిన్ = గర్వాతిశయమును, విటతాటముగన్ = తాఱుమాఱుగ.

### తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన బలముగల వాఁడు కోపించినవాఁడై అడవిని జిచ్చువలె శౌర్యాతిశయము ప్రకాశింపఁగా శత్రువుల గర్వాధిక్యమును బోగొట్టెను. వారిని తాఱుమాఱుగఁ గూల్చెను.

ఉ. నెత్తురు గాఱుమేనుల వ • నేచరయూథము కృత్తరక్తపు
ష్పార్తకుజంబులట్లు సమ • రావని వ్రాలెను గొంత, యాత్మలో
హత్తినభీతిఁ గొందఱు వ • నాటులు పోయినదే పథంబుగాఁ
దత్తఱ వెన్కఁ గన్గొనక • దాఁటులు వైచుచుఁ బాఱి రెల్లెడన్. ౧౮౯౮

అర్థములు. కృత్త = నఱకఁబడిన, రక్తపుష్పార్త = ఎఱ్ఱనిపూలు గల; కుజంబులట్లు = చెట్లవలె, సమరావనిన్ = యుద్ధభూమియందు, పథంబుగా = త్రోవగా, తత్తఱన్=భీతిచే.

### తాత్పర్యము

వానరసమూహము దేహములనుండి నెత్తురు కాఱుచుండఁగా నఱకఁబడిన యెఱ్ఱని పూలచెట్లవలెఁ గొంత నేల వ్రాలెను. కొందఱు వానరులు మనస్సులోఁ గలిగిన భయముచే పోయినదే త్రోవఁగా భయముచే వెనుకఁదిరిగి చూడక దాఁటులు వైచుచు నలుప్రక్కలఁ బఱగెత్తిరి.

సీ. కొందఱు వానరు • ల్గొండలపాటున, జలధిలోఁ జొచ్చిరి • సరభసముగ
సేతువు దాఁటి వ • చ్చినవారు నడిత్రోవ, లోన నీఁగిరి భీత • మానసముల

వెలవెల్లనైన మోములతోడఁ గొందఱు, లాఁగల మిట్టల డాఁగికొనిరి
మొలుఁగుబంటులుకొన్ని యొక్క వృక్షంబులు, కొండలపైఁ బ్రాఁకెఁ గొన్ని వెఱను
ఆ. గుహాలలోనఁ దూఱెఁ గొన్ని జలంబుల, మునిఁగి యుండె దిక్కు మొగములయ్యె
దిక్కు తెలియలేక తికమకపడె నేలఁ, గూలఁబడియె నెలుఁగు గ్రోఁతిగములు.

అర్థములు. కొండలపాటున = కలఁతచే, వీఁగిరి = వెనుకఁ బోయిరి, లాఁగలన్ = పల్లములందు, దిక్కు మొగములు = దిక్కులప్రక్క ముఖము త్రిప్పి పరువెత్తినవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈరీతిఁ బఱచు వానర, వీరులకున్ వాలిసుతుఁడు వెసనడ్డంబై
వారించి నూలుకొల్పి మ, హారవమున నెల్లవారి కను నిబ్భంగిన్. ౧౭౦౦

అర్థములు. వారించి = నిలిపి, నూలుకొల్పి = పురికొల్పి.

తాత్పర్యము

ఈ ప్రకారము పరువెత్తిపోవు వానర వీరులకు నంగదుఁ డడ్డమై నిలిపి పురికొల్పి పెద్దధ్వనితో నందఱు విన నిట్లనియె.

—అంగదుఁడు కపులకు భయముఁ బాపి క్రమ్మఱించుట—

ఉ. పోకుఁడు పోకుఁడీ ప్లవగ పుంగవులార ! నిలుఁడు పోరికిన్
వీకునఁ గ్రమ్మఱుండు పర వీరులు నవ్వఁగఁ బాఱిపోవ న
స్తోకపుఖ్యాతి నీ జగతి సుంతయు లేదు సుఖంబుఁ గీర్తియున్
బోకడఁబెట్టి మాన మిటు పోవఁగఁ బ్రాణము లంత యొక్కుడే. ౧౭౦౧

అర్థములు. పరవీరులు=శత్రువీరులు, వీకున=పరాక్రమముతో.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులారా! పోకుఁడు-పోకుఁడు-నిలుఁడు - యుద్ధముచేయ మరలిరండు. వీరులగు శత్రువులు పరుగెత్తిపోవు మిమ్ముఁ జూచి నవ్వరా? ఇట్లు మీరు పరువెత్తిపోయితిరేని మీకుఁ గొంచెమైనను లోకమునందు సుఖముగాని కీర్తిగాని లేదు. మానము పోఁగొట్టుకొని యిట్లు పోవుటకు మానముకంటెఁ బ్రాణ మంత గొప్పదాయెనా ?

కం. దిగవిడిచి కైదువుల నని, మగతనములు దూలఁ బఱచి మనికికిఁ జన మీ
మగువలె మిముఁగని నగరే?, మగవారల కున్న వేలు మరణం బకటా. ౧౭౦౨

అర్థములు. కైదువులన్ =ఆయుధములను, మనికిన్ = ఇంటికి, మీమగువలె = మీ యాఁడువారే.

తాత్పర్యము

ఆయుధములు వదలి పౌరుషములు చెడిపోవఁ బరుగెత్తి యిండ్లకుఁ బోయితి

లేని మీ యాఁడువారే మిమ్ముఁజూచి నవ్వరా? మగవారి కింతకంటె వేఱు చావున్నదా?

చ. అసమకులంబునన్ జనన•మందితి రందఱు, బక్కఁ గ్రోఁతుల
ట్లసమతి పాఱిపోదురె భ•యంబునఁ? గీర్తియుఁ బౌరుషంబు మీ
రసదుగఁ జేసి పాఱుట న•నార్యుల రీతులు గారె? మున్ను నిం
డుసభ వచించు ప్రగ్గెలు మ•దుల్ దలపోయుఁడి భీతిఁ బాయుఁడీ. ౧౫౦౩

అర్థములు. అసమకులంబు= అసమానమైన వంశము, అసము + అతి = కీర్తిచెడి, అసదుగన్=అల్పముగ, ప్రగ్గెలు=ప్రతిజ్ఞలు, గర్వోక్తులు.

తాత్పర్యము

అసమానమైన గొప్పవంశములందు మీరందఱుఁ బుట్టినవారే, అట్టి మీరు బక్కక్రోఁతులవలె కీర్తి పోఁగొట్టుకొని భయపడి పరుగెత్తుదురా? కీర్తి పౌరుషము నలక్ష్యముచేసి పరువెత్తుటచే మీరనార్యులుగారా? ముందు నిండు సభలో మీరు పల్కిన వీరాలాపములు, మాటలు మనసునకుఁ దెచ్చుకొని భయము వదలుఁడు.

ఆ. మానమెడల వెనుక•మని యుండఁ గల్గినఁ, బిఱికిపంద యనుచుఁ•బిలుచు జనము
హేయమైన బ్రదుక•దేటికి? ధీరులా, సాధుజనులు చనెడి•సరణిఁ బొందుఁ. ౧౫౦౪

అర్థములు. మనియుండఁగల్గినన్=బ్రదికి యుండుటకేర్పడినచో, హేయమైన=నింద్యమైన ధీరులు=ధైర్యముగలవారు, సరణిన్=మార్గమున.

తాత్పర్యము స్పష్టము.

సీ. కొట్టినా యాతఁడు•కొఱయూపిరులతోడఁ, బడియుంద మవనిపైఁ•బ్లవగులార!
చంపెనా యితరదు•ష్ప్రాపంబు బ్రహ్మలో•కంబున సౌఖ్యంబుఁ•గనఁగవచ్చుఁ
జంపితిమా వీని • సాహసంబున నసా•మాన్యశాశ్వతకీర్తి•మనఁగఁ గలుగుఁ
గాదేని క్రయ్యంబు•గాఁ జేసి యసువుల, వీరలోకముఁ గొని • వెలయ రాదె

ఆ. మనుజవిభుఁడు గనిన • దనుక వీనిజవంబు, రాముబారి బడిన • రాక్షసుండు
వహ్ని నులుకు మిడుత•వడువున మాఁడఁడే, ధీరతను గొనుండు•తిరిగి రండు.

అర్థములు. ఇతరదుష్ప్రాపంబు = ఇతర విధముల మనకు లభింపని, ఇతరులకుఁ బొందరాని, అసామాన్య = సాధారణముగాని, మిక్కిలి హెచ్చైన, క్రయ్యంబు=అమ్మదగిన వస్తువుగా, అసువులన్=ప్రాణములను.

తాత్పర్యము

వానరులారా! యేల పరుగెత్తి పోయెదరు? వీఁడు మనలను గొట్టినా కొఱ ప్రాణములతో నేలమీఁదఁ బడియుందము. వీఁడు చంపెనా యితర మార్గముల లభింపని బ్రహ్మలోకమున సౌఖ్యముఁ గందము. అటుగాక మనము వీనిని జంపితిమా యెవరికిని లభింపని శాశ్వత కీర్తితో బ్రదుకవచ్చును, అది గాదనెదరా? మన ప్రాణములను విక్రయించి వీరులు లోకమునకుఁ బోరాదా! వీని వేగ మంతయు రామునకు

వీఁడు కనఁబడు వఱకే గదా. రాముని బారికి వచ్చెనా వీఁడు నిప్పులలోఁ బడిన మిడుతవలె మాడిపోఁడా, కావున నంతవఱకు ధైర్యముతో నుండుఁడు. మరలరండు.

చ. ఒకనిని మించి యింకొకరుఁ ♦ దూరక పిక్కబలంబు జూపినన్
 దికమికఁ బ్రాణరక్షకయి ♦ దేబెలువోలె యశంబు గల్గునే?
 యొకనికి నోడి పాఱెఁ గపి ♦ యోధులయూథ మటన్న నింద తా
 రకలును జంద్రసూర్యులు ధ ♦ రాస్థలి యుండెడిదాఁక నుండదే. ౧౫౦౬

అర్థములు. పిక్కబలంబు = పరుగెత్తుటకు, వేగముగ నడచుటకు, పిక్కలందు బలముండవలెను. దానియం దెంత బలముండిన నంత వేగము పోఁగలఁడు. దేబెలు = దీనులు.

## తాత్పర్యము

దిక్కుమగోని ప్రాణములు రక్షించుకొనుటకై దీనులవలె ఒకరికంటె మఱి యొకరు మీశక్తిని పరువెత్తుటయందుఁ జూపుచున్నారే. దీనివలన వానరులు బాగుగ పరువెత్త గలవారను కీర్తి వచ్చునా? వానర వీరులసేన యంతయు నొకనికి భయపడి పరువెత్తెనను నపకీర్తి నక్షత్రములు సూర్యచంద్రులు భూమి యుండువఱకు నుండదా?

కం. అనవుడు భీమాక్షుం డై, చను దెంచెడి కుంభకర్ణు ♦ చాయం గనుచున్
 వనచరులు చెదరి పఱచుచు, నని రా తారేయుతో భ ♦ యాకులమతులై.

అర్థములు. భీమాక్షుండై = భయంకరమైన చూపులు గలవాఁడై, తారేయుతోన్ = అంగదునితో. భయాకులమతులై = భయముచేఁ గలఁత చెందిన మనస్సు గలవారై.

## తాత్పర్యము స్పష్టము.

ఉ. క్రూరుఁడు రాక్షసుండు బల ♦ కుంఠితగాత్రులఁ జేసె వానితోఁ
 బోరఁగ నెవ్వఁ డోపుఁ బర ♦ పుణ్యజనాళుల యట్టివాఁడు కాఁ
 డూరక చచ్చినంతఁ జల ♦ మో ఫలమో మఱి పేరొ పెంపొ, చాల్
 ధీరత లింకఁ, బ్రాణములు ♦ తీపనఁగా విన లేదె యంగదా! ౧౫౦౮

అర్థములు. బలకుంఠిత గాత్రులన్ = మొక్కపోయిన బలముగల దేహము గలవారిని, పరపుణ్య జనాళుల = ఇతర రాక్షసుల 'యాతుధానః పుణ్యజన' యని యమరము.

## తాత్పర్యము

క్రూరుఁడైన రాక్షసుఁడు బలము చెడిన దేహములు గలవారినిఁగా జేసెను. వీనితో యుద్ధము చేయ నెవ్వనికి సాధ్యము? ఇతర రాక్షసుల వంటివాఁడు వీఁడు కాఁడు. నిష్ప్రయోజనముగఁ జావఁగానే చలము సాధించి నట్లా? ఫలము పొందినట్లా? లేక పేరుగాని గొప్పతనముగానిఁ గలదా? ధైర్యములు చాలును. పదితీపనినఁ బ్రాణము తీపను సామెత నీవు వినలేదా?

కం. అని పరు విడ నడ్డంబుగఁ జని కారణములు వచించి ♦ సాంత్వనపఙ్క్తిన్
మనములు దేర్చిన వారలు, జనితా మోదమున మరలి♦సత్వరు లగుచున్.

అర్థములు. సాంత్వనపఙ్క్తిన్=మంచివిధముగా నూఱడింపుమాటలు చెప్పి, జనిత=పుట్టిన, ఆమోదమునన్=సంతోషముతో, సత్వరులు=త్వరతోఁగూడినవారు.

తాత్పర్యము

అని వారు పరువెత్తఁగా నడ్డముపోయి వారికి మంచిగా సమాధాన వాక్యములు చెప్పి వారి మనస్సుల కలఁత దీర్పఁగా వారు సంతోషించి త్వరతోఁ గూడినవారై.

ఆ. మైంద ధూమ్ర కుముద♦మారుతి రంభ గ,వాక్ష పనస శరభు♦లమిత బలులు
ఋషభ నీల తారు♦లెసఁగి ద్వివిద సుషే,ణులును నెదురు చనిరి కలహవాంఛ

అర్థములు. కలహవాంఛ = యుద్ధమందలి కోరిక.

తాత్పర్యము స్పష్టము

—♦ ౬౭-వ సర్గము. కుంభకర్ణుఁడు వానరసేన హతముఁ జేయుట ♦—

సీ. అంగదు వాక్యంబు ♦ లాలించి యందఱుఁ, బ్రాణంబులందలి ♦ యాస మాని
పేర్వాడి తమతమ♦బిరుదులు పలుకుచుఁ, గపివీరు లని నల్పఁ ♦ గడఁగి రేఁగి
కొండలు గుండులుఁ ♦ గుజములుఁ గైకొని, కుంభకర్ణునిఁ దాఁక ♦ ఘోరభంగి
నాతండుఁ గినిసి యు ♦ ద్యద్గదాహస్తుఁడై, వారల నెల్లర ♦ బారి సమరె

ఆ. ప్రేటునకును నూఱు♦వే లేడు నెనిమిది, వేలు క్రోఁతిగములు ♦ నేలఁ గూలెఁ
బదియు నాలుగురను♦బదిమంది విరువది,మందిఁబట్టి యొక్క ♦ మాఱు మ్రింగు.

అర్థములు. పేరు + పాడి = పేర్వాడి = తమపేరు చెప్పుకొనుచు, కుజములు = చెట్లు, ఉద్యత్ = ఎత్తఁబడిన, గదాహస్తుఁడై = గదగల చేయిగలవాఁడై, బారిసమరె=హింసించెను.

తాత్పర్యము స్పష్టము.

కం. గరుటామంతుఁడు పాముల, సరణిని విదలించి మ్రింగ ♦ శాఖామృగముల్
పురి గొనుచు నెట్ట కేలకు, దుర మొనరించెను సమాహ♦దోహల మగుచున్.

అర్థములు. గరుటామంతుఁడు=గరుత్మంతుఁడు, పురిగొనుచున్ = బలము తెచ్చుకొనుచు, ఎట్టకేలకున్ = అతికష్టము మీఁద, సమాకదోహలము = యుద్ధమునందు కాంక్ష.

తాత్పర్యము

గరుడుఁడు పాములను విదలించి మ్రింగునట్లు వాఁడు వానరులను మ్రింగఁగా నతికష్టముపై నుత్సాహము దెచ్చుకొని వానరసేన యుద్ధాభిలాషచే యుద్ధము చేసెను.

—♦ ద్వివిదుఁడు కుంభకర్ణుతోఁ బోరుట ♦—

చ. ద్వివిదుఁడు కోపఘూర్ణితమ♦తిన్ శిఖరంబు నొకండుఁ బూని పె
న్జవమున గాలికిం జనుఘ♦నంబువలెం జని దానిపైవ దా
నవవిభుఁ డాఁక కయ్యదియు ♦ నద్మ బలంగములోనఁ గూలి సైం
ధవరథదంతి సైన్యముల ♦ నాశము సేసె నిమేష మాత్రలోన్. ౧౯౧౩

అర్థములు. కోపఘూర్ణిత మతిన్=కోపముచేఁ గలఁతపడిన మనస్సుతో, ఘనంబువలెన్=మేఘమువలె.

తాత్పర్యము

ద్వివిదుఁడు కోపముచే కలఁతనొందిన మనస్సుతో నొక శిఖరము పూని మిక్కిలి వేగముతో గాలికి మేఘము పోయినట్లు వేగముగఁబోయి దానిని వైచెను. అది వానిఁ దాఁకక నడుమ సేనలోఁబడి గుఱ్ఱములను రథములను నేనుఁగులను నిమిషమాత్రములో నాశము చేసెను.

సమీపమునకుఁ బోవ భయపడి దూరమునుండి వేసిన కారణమున నది యంతదూరము పోయినది కాదు.

ఉ. వెండియు వానరుండు పృథి♦వీధర మొండు గ్రహించి దోర్బలో
ద్దండతఁ జిమ్మఁగా నదియు ♦ దానవసైన్యము హీతసాది వే
తండహయంబుఁ జేయఁగ మృ♦ధంబు భయంకర మయ్యె భూమియున్
నిండె సురారిరక్తమున ♦ నిర్జరవైరు లుదగ్రమూర్తులై. ౧౯౧౪

అర్థములు. పృథివీధరము = పర్వతము, దోర్బలోద్ధతిన్ = భుజబలము యొక్క యతిశయముచే, హీతసాది వేతండహయంబు = సారథులు, ఏనుఁగులు, గుఱ్ఱములు లేనిదిగా - మృధంబు = యుద్ధము.

తాత్పర్యము

అంతటఁబోక వానరుఁడు మఱియొక కొండదీసికొని రెండు చేతుల బలము కొలఁది వేయఁగా నదియును సేనలోఁ నేపడి, సారథులను గుఱ్ఱములను ఏనుఁగులను జంపెను. యుద్ధము భయంకరమయ్యెను. రాక్షసరక్తముచే నేల నిండెను. అప్పుడు రాక్షసులు భయంకరాకారులై.

శా. చండాంశుప్రతిమానబాణపటలీ ♦ సంభిన్నగాత్రంబుగా
ఖండీభూతశిరంబుగా దళితవ ♦ క్షఃపాలదేశంబుగా
బిండీభూతపలంబుగాఁ ద్రుటితనా ♦ భీశ్రోణిపాదంబుగాఁ
జెండం జొచ్చిరి కీశసైన్యము బల ♦ శ్రీయుక్తదోశ్శక్తులన్. ౧౯౧౫

అర్థములు. చండాంశుప్రతిమాన=సూర్యునితో సమానమైన, బాణపటలి=బాణసమూహముచే, సంభిన్నగాత్రంబుగాన్=నఱకఁబడిన దేహములు గలదిగా, ఖండీభూత శిరంబుగా =నఱకఁబడిన తలలుగలదిగా, దళిత=చీల్పఁబడిన, వక్షః +

ఫాలదేశంబుగాన్ = బొమ్మలు, నొసళ్ళు గలవిగా, పిండీభూత = ముద్దగాఁ జేయఁబడిన, పలంబుగా = మాంసము గలదిగా, త్రుటిత = త్రెంపఁబడిన, నాభీ శ్రోణిపాదంబుగా = బొడ్డులు, పిఱుఁదులు, కాళ్ళు గలదిగా, బలశ్రీయుక్త=బల సంపదతోఁ గూడిన, దోశ్శక్తులన్=భుజబలముచే.

## తాత్పర్యము

బలసంపత్తితోఁ గూడిన భుజశక్తులచే వానరసేనలను సూర్యసమాన బాణములచే దేహములు చీలినవిగా, నఱకఁబడిన తలలు గలవిగా, చీల్పఁబడిన బొమ్మ, నొసలు గలవిగా, మాంసము ముద్ద యగునట్లుగా తెగిన బొడ్డులు, పిరుదులు, కాళ్ళు గలవిగా నఱకఁ బ్రారంభించిరి.

కం. ధీరులు భుజబలసారులు, క్ష్మారుహచారులు కుజాళి•శాత్రవసేనన్
దేరుల గారుల మావుల, వారక నధియించి బడలు•పడఁ జేయునెడన్. ౧౯౧౧

అర్థములు. క్ష్మారుహచారులు = వానరులు, కుజాళిన్ = చెట్లు సమూహముచే, గారుల=ఏనుఁగులను, మావులన్=గుఱ్ఱంబులను, శ్రమపడునట్లు.

## తాత్పర్యము

ధైర్యవంతులు భుజబలవంతులు నగు వానరులు చెట్లచే శత్రువుల సేనయందుఁ దేరులను ఏనుఁగులను గుఱ్ఱములను అడ్డములేక బాధించు సమయంబున.

### —• హనుమంతుఁడు కుంభకర్ణుతోఁ బోరుట •—

ఉ. మారుతి భీమరూపమున • క్ష్మాధరశృంగధరారుహాళి దు
ర్వారజవంబునన్ దనుజ•వల్లభమూర్ధతలంబుపై మహా
సారముఁబోలె నభ్రపథ•సంచరణంబునఁ గ్రాలి వైవఁగా
శూరుఁడు కుంభకర్ణుఁ డది • శూలమునన్ శకలాయితంబుగన్. ౧౯౧౨

అర్థములు. భీమరూపమునన్ = భయంకరాకారమున, క్ష్మాధరశృంగ= పర్వత శిఖరములయు, ధరారుహ = చెట్లయు, ఆళిన్ = వరుసలచే, దుర్వార జవంబునన్=అడ్డగింపరాని వేగముతో, మూర్ధతలంబుపై=తలమీఁద, మహా + ఆసారము = పెద్దజడివానవలె, అభ్రపథసంచరణంబున = ఆకాశమునందుఁ దిరుగుచు, శకలాయితంబుగన్=తునుక లగునట్లు.

## తాత్పర్యము

ఆంజనేయుఁడు భయంకరమూర్తియై కొండశిఖరంబులను చెట్లను మిగుల వేగముగా కుంభకర్ణుని తలపై పెద్ద జడివాన కురిసినట్లు ఆకాశమునఁ దిరుగుచు వేయఁగా శూరుఁడు కుంభకర్ణుఁ డది శూలముచేఁ దునుక లగునట్లుగా.

ఉ. చేసియు నంతఁ బోక కపి•సేనల నుగ్రతఁ దోలి తోలి శూ
లాసమధారఁ ద్రుంపఁ బవ•నాత్మజుఁడున్ గురుశృంగహస్తుఁడై
యా సురవైరి కట్టెదుట • నాటి నిలంబడి వీచి వైవ వాఁ
డాసిగరంబు తాఁకున మ•హావ్యథఁ జెంది భృశాస్రసిక్తుఁడై. ౧౯౧౩

అర్థములు. తోలి = తఱిమి, శూల + అసమధారన్=శూలముయొక్క

యసమానమైన యంచుతో, గురుశృంగహస్తుఁడై = పెద్దశిఖరమును చేతఁదీసికొనినవాఁడై, సిగరంబు=శిఖరము, భృశాస్రసిక్తుఁడై = విశేషముగ నెత్తుటఁ దడిసినవాఁడై.

తా త్ప ర్య ము

చేసియు. యంతతో తృప్తిలేక వానర సైన్యమును శూలధారచే సంహరింప, ఆంజనేయస్వామి పెద్ద కొండశిఖరమును చేతఁదాల్చి దేవతావిరోధి యగు కుంభకర్ణు నెదుట నిలువంబడి యాతనిపై విసరివైవ, గిరిశిఖరము తాకుఁడుటు యాతఁడు మహావ్యథజెంది రక్తముతో తడిసినవాఁడై.

చ. తలఁకి కలంగి శాత్రవ వి॰దారణశీలము శూలమున్ మెఱుం
గుల గొనబారుదాని గురు॰గోత్రముఁ బోలినదాని వైచి య
గ్గలికను గొంచగట్టసిత॰కంఠతురంగుఁడు శక్తిఁబోలె నా
వలిముఖ వీరు వక్షమును ॰ వ్రచ్చె నరాతులు పిచ్చలింపఁగన్. ౧౯.౨౦

అర్థములు. తలఁకి = చలించి, కలఁగి = కలఁతచెంది, శాత్రవ విదారణశీలము = విరోధులఁ జీల్చు స్వభావము గలది, గురుగోత్రమున్=పెద్ద కొండను, అగ్గలికను = ఉత్సాహముతో, కొంచగట్టు = క్రౌంచపర్వతము, అసిత కంఠతురంగుఁడు = నల్లని మెడగల నెమలి వాహనముగాఁ గలవాఁడు, కుమారస్వామి - వ్రచ్చెన్=చీల్చెను, అరాతులు=విరోధులు, పిచ్చలింపఁగన్=భయపడునట్లు.

తా త్ప ర్య ము

చలించి కలఁతబడి శత్రువులఁజీల్చు స్వభావము గలిగి మెఱుఁగులచే నందమై పెద్ద కొండవలెనుండు శూలమునుత్సాహముతో కుమారస్వామి క్రౌంచపర్వతమును శక్తిచేఁ జీల్చినట్లు వానరవీరుని వక్షస్థలమును విరోధులు భయపడునట్లు చీల్చెను.

ఉ. శూలవిభిన్న వక్షుఁ డయి ॰ శోణితపూరము లారఁ గ్రక్కుచున్
వ్రాలి యుగాంత నీరద ర॰వంబును బోనిరవంబు నింప వ
గ్గాలితనూజు పాటుఁ గని ॰ గాఢముదంబున రాక్షసావళుల్
క్ష్వేళల నించె డీలుపడి ॰ బెగ్గిలి పాఱెఁ గపీంద్ర సంఘముల్. ౧౯.౨౧

అర్థములు. శూల విభిన్నవక్షుఁడై = శూలము భేదింపఁబడిన ఱొమ్ము గలవాఁడై, శోణితపూరము = రక్తప్రవాహము, యుగాంత నీరదరవంబున్ = ప్రలయకాలమందలి మేఘధ్వనికి, పోని = సమానమైన, రవంబు=ధ్వని, క్ష్వేళలన్=సింహనాదముల, డీలుపడి=సత్తువచెడి, బెగ్గిలి=భయపడి.

తా త్ప ర్య ము

శూలముచేఁ జీల్పఁబడిన ఱొమ్ము గలవాఁడై విస్తారముగ నెత్తురు ప్రవాహమువలెఁ గ్రక్కుచు ప్రళయకాల మేఘ ముఱిమినట్లు ధ్వనించి నేలఁ బడెను. హనుమంతుఁడు పడుట చూచి రాక్షసులు సింహనాదములు చేసిరి. వానరులు భయపడి సత్తువచెడి పరుగెత్తిరి.

చ. పరువిడువారి నిల్పి కపి♦వర్యుఁడు నీలుఁడు శృంగ మొండు దా
నురవడిఁ గుంభకర్ణుని మ♦దోద్ధతి వైచిన వాఁడు దాని ను
ద్ధురగతి ముష్టిఘాతమునఁ ♦ దూల నడంపఁగ మంటలున్ మిడుం
గురు లురలన్ ధరాస్థలిని ♦ గూటము గూలెను తాలు గుండ్లునై. ౧౯. ౨౧

అర్థములు. ఉరవడిన్ = వేగమున, ముష్టిఘాతమునన్=పిడికిటిపోటుచే, కూటము=శిఖరము.

## తాత్పర్యము

పరువెత్తుచున్న వారినినిల్పి నీలుఁడు శిఖరము నెత్తికొని త్వరగాఁబోయి కుంభకర్ణుని మీఁద వేయఁగా రాక్షసుఁడు దానిని పిడికిటి పోటుచే నేలఁబడ గొట్టఁగా మంటలు మిణుఁగురులు రాల నా శిఖరము తాలు గుండ్లునై నేలఁబడెను.

## —♦ శరభాదులు కుంభకర్ణుతోఁ బోరుట ♦—

సీ. సాహసికాగ్రణుల్ ♦ శరభనీలగవాక్ష, గంధమాదనులు వి♦క్రమధనుండు
ఋషభుఁ డీ యేవురు ♦ వృక్షశైలంబులఁ, గాళ్ళను బిడికిళ్ళఁ ♦ గరతలముల
నలుదెసలం దుండి ♦ చలమున నొప్పింప, నెపఁగు నస్త్యోటుల ♦ నీఁగ వ్రాలి
నట్టుల యైన ర♦క్షోధీశుఁ డది లెక్క, యిడక యా ఋషభుని ♦ నొడిసి పట్టి
తే. రెండుచేతుల నదుమఁ గ♦సుండు నల్లఁ, గ్రక్కపడె గంధమాదనుఁ♦గాలముష్టి
శరభు మోఁకాల నీలుని ♦ గరతలమున, నాగ్రహంబునఁ దాఁచె గ♦వాక్షునసుర.

అర్థములు. సాహసికాగ్రణుల్=సాహసము గలవారిలో శ్రేష్ఠులు, నల్ల=నెత్తురు.

## తాత్పర్యము

సాహసము గలవారిలో శ్రేష్ఠు లయిన శరభుఁడు, నీలుఁడు, గవాక్షుఁడు, గంధమాదనుఁడు, ఋషభుఁడు అను వా రేవురు చెట్లచేతను గొండలచేతను రాళ్ళ చేతను పిడికిళ్ళ చేతను చేతులతోను నాలుగు ప్రక్కలందుండి చలమున బాధింపఁగా నా దెబ్బలు వానికి నీఁగమీఁద వ్రాలినట్లుండెను. దానిని వాఁడు లక్ష్యము సేయక యా ఋషభుని నొడిసి పట్టుకొని రెండుచేతుల నదుమ నొత్తఁగా వానరుఁడు నెత్తురు గ్రక్కపడెను. గంధమాదనుని గాలిచేతను, శరభుని ముష్టిచేతను నీలుని మోఁకాలను, గవాక్షుని చేతితోను గొట్టెను.

కం. దత్తప్రహారులై యిటు, నెత్తురు ముక్కులను నోట ♦ నెఱ గ్రక్కుచు సం
కృత్తపలాశము లట్టులు, హత్తిన వెతఁ బడిరి వనచ♦రాగ్రణు లవనిన్. ౧౯. ౨౩

అర్థములు. దత్తప్రహారులై=దెబ్బకొట్టఁబడినవారై, సంకృత్తపలాశము=నఱకఁబడిన మోదుగులవలె.

## తాత్పర్యము

ఈ ప్రకారము కుంభకర్ణుఁడు కొట్టఁగా ముక్కున నోట నెత్తురు గ్రక్కుచు నఱకఁబడిన మోదుగులవలె వానరులు నేలఁబడిరి.

చ. మేటులు మ్రానిద్రిమ్మరులు • మేదినిఁ గూలినఁ గుంభకర్ణునిన్
గోటి వనేచరుల్ గవిసి • కొండను బ్రాఁకినయట్లు ప్రాఁకి పె
న్గాటులఁ బోటులన్ శితన•ఖంబుల దంష్ట్రిలఁ గేల్వ్రేటులన్
గాటపువీఁక నొవ్వ గొనఁ•గా బ్రహరింపఁగ గుంభకర్ణుఁడున్. ౧౫-౨౮

అర్థములు. మ్రానిద్రిమ్మరులు = క్రోఁతులు.

తాత్పర్యము

వానరులందు శ్రేష్ఠులగువారు నేలపై బడఁగా నొక కోటి వానరులు కుంభకర్ణునిమీఁదికిఁ గొండను బ్రాఁకినట్లు ప్రాఁకి కాటులను, పోటులను, వాఁడి గోళ్ళను, కోఱలను, చేతిదెబ్బలను నొప్పికొనునట్లధిక పరాక్రమముతో కొట్టఁగా కుంభకర్ణుఁడును.

—• కుంభకర్ణుఁడు వానరుల మ్రింగుట •—

కం. ధరణీరుహాపరిశోభిత, ధరణీధర మనఁగ బొల్చి • తరుచరతతులన్
గరములను వారి నెల్లర, గరుడుం డహితతులఁబోలె • గ్రసియింపంగన్.

అర్థములు. ధరణీరుహా = చెట్లచేత, పరిశోభిత = మిగులఁ బ్రకాశించు, ధరణీధరము=పర్వతము, తరుచరతతులన్=వానరసమూహములను = కరములను చేతులచే, గ్రసియింపఁగన్=భక్షింపఁగా.

తాత్పర్యము

వృక్షములచేఁ బ్రకాశించు పర్వతమువలెఁ నొప్పి యతఁడు వానర సమూహములను గరుడుఁడు సర్పములనువలె భక్షింపఁగా.

ఉ. మ్రింగుడుపడ్డ యా ప్లవగ•బృంద మధోభువనోపమానకు
క్షిం గడువేగ చొచ్చియును • జెచ్చెర ముక్కులనుండి వీనులన్
భంగములేక వెల్వడియె • వాఁడును హా యని నోరువిచ్చి పే
రంగదఁ జాలుగా మెసవె • నచ్చటి కీశుల నెల్ల వ్రేల్మిడిన్. ౧౫-౨౯

అర్థములు. అధోభువనోపమాన=పాతాళముతో సమానమైన, కుక్షిన్= కడుపునందు, పేరంగదన్ = పేరాఁకలిచే, చాలుగాన్=వరుసగా, వ్రేల్మిడిన్ = చిటికవ్రేయునంతలో.

తాత్పర్యము

నమలుటకు వానరులు పంటిసందునకును జాలినవారుకారు. కావున వారిని మ్రింగఁగా నా మ్రింగుడు పడినవారు పాతాళలోకమువలెనున్న కడుపులోనికిఁ బోయి ముక్కులలోనుండి చెవులలోనుండి యే కొఱఁతలేక యథాపూర్వముగా వెలువడిరి. వాఁడును హా యని నోరు తెఱచి మిక్కిలి యాఁకలిచే వరుసగా వానరులను చిటిక వ్రేయునంతలో మ్రింగెను.

సీ. వజ్రహస్తుండైన ♦ వాసవుఁ బాశహస్తుం డయి కెరలెడి ♦ దండధరునిఁ
బోలుచు నసురుండు ♦ శూలహస్తుం డయి, తరుచరతతులలోఁ ♦ దిరిగి తిరిగి
కాలాగ్నిభంగిని ♦ గ్రాలుచు వధియింప, క్షితి మాంసశోణిత ♦ క్లేద మయ్యె
వేసంగి నెండిన♦విపినంబు దహనుండు, కాల్చుమాడ్కి దహించెఁ ♦గపిబలంబు
తే. వాని ధాటికి సైఁపక ♦ వనచరాళి, విస్వరంబుగ విలపించె ♦ విగతనాథు
లగుచుఁ దక్కిన వారెల్ల♦నరిగి రాముఁ,శరణుఁజొచ్చిరి దుఃఖంబు♦గరిమఁ గలఁగి.

అర్థములు. వాసవున్=ఇంద్రుని, దండధరుని=యముని, కాలాగ్నిభంగిని=ప్రళయకాలము నందలి యగ్నివలె, మాంసశోణితక్లేదము=మాంసముతోను నెత్తుటితోను దడిసిన బురద యయ్యెను, విపినంబున్=అడవిని, విస్వరంబుగన్=వికారధ్వనులతో, విలపించెన్=ఏడ్చెను, విగతనాథులు=రక్షకులు లేనివారు.

తాత్పర్యము

వజ్రము ధరించిన ఇంద్రుని, పాశము ధరించిన యమునిఁ బోలి కుంభకర్ణుఁడు శూలము ధరించి వానరసమూహములతోఁ దిరిగి తిరిగి ప్రళయకాలాగ్నివలె మండుచుఁ జంపఁగా నేల నెత్తురుమాంసములతోఁ దడిసి బురద యయ్యెను. వాఁడును నెండకాలమందు నెండిన యడవిని కారుచిచ్చు కాల్చునట్లు వానరసేనను దహించెను. వాని ధాటికి సహింపలేక కొందరు రక్షకులు లేక వికారధ్వనులు చేసిరి. తక్కిన వా రందఱు రాము నొద్దకుఁ బోయి శరణు జొచ్చిరి.

## —♦ అంగదుఁడు కుంభకర్ణునితోఁ బోరుట ♦—

ఉ. భగ్నుల వానరావళుల ♦ వాసవపుత్రసుతుండు గాంచి యు
ద్విగ్నుఁడు గాక ఱొప్పుచును ♦ దీవ్రజవంబున శృంగ మొండు భీ
మగ్నముగాఁ బలాశుల స♦మాజము రాక్షసభర్తృమూర్ధసం
లగ్నము గాఁగ వైచిన బ♦లంబుగ నొచ్చి యభగ్నకోపుఁడై. ౫౮.౪౭

అర్థములు. భగ్నులన్=భంగము నొందిన వారిని, వాసవపుత్రసుతుండు=అంగదుఁడు, ఉద్విగ్నుఁడు కాక = భయపడక, భీమగ్నముగా = భయమున మునుఁగునట్లు, పలాశుల=రాక్షసుల యొక్క రాక్షసభర్తృ=కుంభకర్ణుని యొక్క, మూర్ధసంలగ్నము = తలకుఁ దగులునట్లుగ, అభగ్నకోపుఁడై=తీవ్రకోపము గలవాఁడై.

తాత్పర్యము

విఱిఁగిపోయిన వానరులఁ జూచి యంగదుఁడు భయపడక ఱొప్పుచు నతివేగమున శిఖర మొకటి తీసికొని రాక్షసులు భయమున మునుఁగుచుండఁ గుంభకర్ణుని తలపైఁ దగులునట్లు వేయఁగా వాఁడు మిక్కిలి నొచ్చి యధికకోపము గలవాఁడై

ఉ. ఇంద్రజసూనుదర్పము స • హింపక రావణుసోదరుండు ని
స్తంద్రజవంబునన్ బ్లవగ • జాలము బెగ్గిల గర్జ నించుచున్
రుంద్రతరప్రభాకలిత • రూక్షము శూలము బిట్టు వైచె నా
యైంద్రజుమీఁద, సంగరర • హస్యవిదుం డతి లాఘవంబునన్. ౧౫౨౯

అర్థములు. ఇంద్రజసూను దర్పము = అంగదు బలగర్వము, నిస్తంద్ర= హెచ్చరికతోఁ గూడిన, జవంబునన్=వేగముతో, రుంద్రతర=మిగుల దట్టమైన, ప్రభాకలిత=కాంతితోఁ గూడినదియు, రూక్షము = కఠినమైనదియు నగు అంగదు మీఁద, సంగరరహస్య విదుఁడు=యుద్ధమర్మము తెలిసినవాఁడు.

తాత్పర్యము

అంగదుని గర్వము సహింపలేక కుంభకర్ణుఁడు మిగుల వేగముతో వానరులు భయపడునట్లు సింహనాదముచేయుచు విశేషకాంతితోఁగూడి కఠినమైన శూలమును నంగదు మీఁద గట్టిగా వేసెను. యుద్ధరహస్యము తెలిసిన యంగదుఁడు మిగుల లాఘవముతో.

ఉ. శూలముఁ దప్పదాఁటి చని • శూరవరేణ్యుఁడు తారపట్టి యా
భీలతలప్రహారమున • బిట్టుగ నొంచిన నాగ్రహంబునన్
సోలియు లబ్ధసంజ్ఞుఁ డయి • సోఁకుఁడు దాఁ బెడకేలిముష్టిచే
వాలితనూజునిం బొడువ • వ్రాలె నతండు విసంజ్ఞుఁ డై ధరన్. ౧౫౩౦

అర్థములు. తప్పదాఁటి = తప్పునట్లు దాఁటి, ఆభీలతలప్రహారమునన్= భయంకరమైన యఱచేతి దెబ్బచే, బిట్టుగ=గట్టిగ, సోలియు=మూర్ఛనొందియు, లబ్ధసంజ్ఞుఁడయి=స్మృతినొందిన వాఁడై, పెడకేలి=ఎడమచేతి, ముష్టిచేన్=పిడికిట, విసంజ్ఞుఁడై=తెలివి తప్పినవాఁడై.

తాత్పర్యము

శూలము తన్ను దగులకుండునట్లు నావలికి లంఘించి పోయి యంగదుఁడు కోపించి భయంకరమైన చేతి దెబ్బచే గట్టిగ కుంభకర్ణుని గొట్టగాఁ వాఁడు మూర్ఛపోయి స్మృతి తెచ్చుకొని యెడమ చేతి ముష్టిచే నంగదుని గట్టిగాఁ బొడువఁగా నతఁడు స్మృతి తప్పి పడెను.

— • సుగ్రీవుఁడు కుంభకర్ణుతోఁ బోరుట • —

ఉ. అంగదుఁ డిట్లు గూలఁ దన • యాయుధముం గొని సూర్యపుత్రుమీఁ
దం గవియంగ నాతఁడును • దానవనాయకసన్నుతింబుగా
శృంగ మొకండు నెత్తికొని • చేరి ప్లవంగమలోకరక్తసి
క్తాంగు వనాటఘస్మరు భ • యంకరరూపునిఁ గాంచి యిట్లనున్. ౧౫౩౧

అర్థములు. ప్లవంగమలోక = వానరసమూహముయొక్క, రక్త = నెత్తుటచే, సిక్త = తడిసిసిన, అంగున్ = దేహముగలవానిని, వనాటఘస్మరున్ = వానరులను దినువానిని.

తాత్పర్యము

అంగదుఁ డిట్లు పడిపోఁగాఁ దనశూలము తాను దీసికొని కుంభకర్ణుఁడు సుగ్రీవుని మీఁదఁ గవియఁగా నాతఁడును వానరుల రక్తముచేఁ దడిసిన దేహము గల వానిని, వానరుల భక్షించువానిని, భయంకరమైన యాకారము గలవానిని నెదుఁరుగా పర్వత శిఖర మెత్తుకొని పోయి యిట్లనెను.

ఉ. త్రుంచితి కీశవీరులను ♦ దుష్కరకర్మము నాచరించి భ
క్షించితి క్రోఁతి గుంపులనుఁ ♦ జేపడె నీకు యశంబు దీనఁ జా
లించుట మేలు ప్రాకృత వ♦లీ ముఖ మారణకర్మ మిట్టు లే
తెంచి మదీయ పర్వత హ ♦ తిన్ సయిరింపుము రాక్షసోత్తమా! ౧౫౩౨

అర్థములు. దుష్కరకర్మము = అసాధ్యకార్యము, ప్రాకృత వలీముఖ = సామాన్య వానరుల, మారణకర్మము=చంపునట్టి కార్యము, మదీయపర్వతహతిన్ = నాకొండ దెబ్బను.

తాత్పర్యము

వానరవీరులను జంపి యసాధ్యకార్యము చేసితివి. క్రోఁతి గుంపులను భక్షించితివి. దీనిచే నీకు లోకమున దొడ్డకీర్తి లభించెను. ఇఁక సామాన్యపు క్రోఁతులఁ జంపు కార్యము చాలించుట నీకు శ్రేయస్కరము. ఇట్లు వచ్చి నాకొండదెబ్బను సైరింపుము.

చ. అనవుడు సత్త్వధైర్య విభ ♦ వాన్వితమైన హరీంద్రు వాక్యముల్
విని మనుమండ వయ్యు నల ♦ వేధకు, ఋక్షరజస్సుతుండ వై
వినుతబలుండ వయ్యు నిటు ♦ ప్రేలెద వేల ప్లవంగమా! యనన్
ఘనతర పర్వతాగ్రమునఁ ♦ గంజహితాత్మభవుండు రాక్షసున్. ౧౫౩౩

అర్థములు. సత్త్వధైర్య విభవ + అన్వితము = బలధైర్య సంపదతో గూడినది, వేధకు = బ్రహ్మకు-వేధశ్శబ్దమునకుఁ దత్సమ రూపము వేధ వేధసుఁడను రూపము లేదు. వినుతబలుండవు = పొగడఁబడిన బలము గలవాఁడవు. ప్రేలెదవు=పదరెదవు, ఘనతర=మిగుల గొప్పదగు, పర్వతాగ్రమున=శిఖరమున.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా బలము ధైర్యము విని యతిశయముచేఁ గూడిన సుగ్రీవుని వాక్యములు విని సుగ్రీవా! నీవు బ్రహ్మకు మనుమఁడవు. ఋక్షరజస్సునకుఁ బుత్రుఁడవు. బలమునందుఁ బొగడ్త గన్నాఁడవు. ఇంతటి గొప్పవాఁడవయ్యు క్రోఁతీ! యేల పదరెదవు? అనఁగా మిగుల గొప్పదగు కొండ శిఖరంబున సుగ్రీవుఁడు రాక్షసుని,

ఉ. అక్కదరంగ నై చటుయు ♦ నాతని నక్కియు దాఁకి ...
ముక్కలు ముక్కలైన నగ♦ముం గని దైత్యులు సింహనాదముల్
దిక్కుల ముంపఁ జల్ప మల♦ద్రిమ్మరు లెల్ల విషణ్ణచిత్తులై
పోకిరి, కుంభకర్ణుఁడును ♦ భూధరశృంగనిపీడ్యమానుఁ డై. ౧౫౩౪

అర్థములు. అక్క+అదరంగన్=ఱొమ్ము అదరునట్లు, మల ద్రిమ్మరులు = వానరులు, విషణ్ణచిత్తులై = విషాదముతోఁడి మనస్సుగలవారై భూధరశృంగ = పర్వత శిఖరముచే, నిపీడ్యమానుఁడై = మిగుల పీడింపఁబడుచున్నవాఁడై.

తాత్పర్యము

ఱొమ్మదరంగ వేయఁగా నది యతని ఱొమ్ము దాఁకినంతనే ముక్కలై పడిపోయెను. రాక్షసులు సింహనాదములు చేసిరి. వానరులు దుఃఖపడసాగిరి. కుంభకర్ణుఁడును పర్వత శిఖరముచే బాధింపఁబడినవాఁడై.

తే. వివృతవక్త్రుఁడునున్ రోష♦వివశుఁడగుచు, మెఱుఁగులు తుఱంగలించెడి మేటిమూఁడు
మొనలవాలును వానర♦ముఖ్యుఁ జంప, నెంచి పరఁగించె వానరు♦లెల్ల బెగడ.

అర్థములు. వివృతవక్త్రుఁడునున్=నోరు తెఱచికొనినవాఁడు, రోష వివశుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, తుఱంగలించు = ప్రకాశించు, మూఁడు మొనలవాలును=త్రిశూలమును, బెగడన్=భయపడునట్లు.

తాత్పర్యము

నోరు తెఱచికొని కోపముచే దేహము తెలియనివాఁడై మెఱుఁగులు ప్రకాశించు త్రిశూలమును సుగ్రీవుని జంపుటకై వానరులు భయపడుచుండఁ బ్రయోగించెను

ఉ. కాంచనధాతుజుష్ట మయి ♦ క్రక్కుచు నిప్పులు వచ్చు దాని వీ
క్షించి మరుత్తనూభవుఁడు ♦ చిప్పున నడ్డము దూఁకి పట్టి వే
త్రుంచె ఫళుక్కునన్ విఱుగఁ ♦ దోరపుహర్షమునన్ వనౌకసుల్
గాంచి మదించి కేక లిడి ♦ గాడుపుపట్టి నుతించి రెంతయున్. ౧౫౩౬

అర్థములు. కాంచన ధాతు జుష్టము = బంగారు మనెడి లోహముతోఁ గూడినదై, తోరపుహర్షమునన్ = మిగుల సంతోషముతో, వనౌకసుల్=వానరులు, గాడుపుపట్టిని=ఆంజనేయుని.

తాత్పర్యము

బంగారుతోఁ గూడి నిప్పులు గ్రక్కుచు వచ్చుదానిని జూచి యాంజనేయుఁడు తటాలున నడ్డము దూఁకి పట్టుకొని ఫళుక్కున విఱిచెను. వానరు లది చూచి మిగుల హర్షించి, మదించి సింహనాదములు చేసి హనుమంతునిఁ బొగడిరి.

కం. తోరపురూపంబై వెయి, బారువ వ్రేఁ గైన యుక్కు♦పటుశూలంబున్
వీరుఁడు మోఁకాలను రెం,డై రాలఁగ విఱిచి మిగుల♦హర్షం బందెన్. ౧౫౩౭

అర్థములు. ఘోరపు రూపంబై = పెద్ద యాకారము గలదై, వెయిబారువ వ్రేఁగైన = వెయ్యిబారువల బరువుగల.

**తాత్పర్యము**

పెద్ద యాకారము గలదై వెయిబారువల బరువుగలదైన యుక్కుశూలముసు వీరుఁడగు నాంజనేయుఁడు మోఁకాటికిఁ బూన్చి యాకొన ఆకొన రెండు చేతులఁ బట్టుకొని వంచి విఱచి మిగుల సంతోషించెను.

కం. శూలము భగ్నంబై చన, వాలిమ లంకాస్థమలయ॥పర్వతతటమున్
దాలాగి దాన నసురుఁడు, హేళిసుతున్ దాసి యడిచెఁ॥బృథుదోశ్శక్తిన్.

అర్థములు. భగ్నంబై = విఱిగినదై, వాలిమ = శీఘ్రమ, లంకాస్థ = లంక సమీపమందున్న, మలయ పర్వత తటమున్ = మలయపర్వత శిఖరమును, హేళిసుతున్ = సూర్యపుత్రుని, సుగ్రీవుఁ, పృథు = గొప్పదగు, దోశ్శక్తిన్ = భుజబలముచే. ఈమలయము త్రికూట పర్వతములో నొకభాగము. అది కొంచెము దూరమందున్నను వంగి యందుకొనె నని భావము.

**తాత్పర్యము**

తనశూలము విఱిగిపోఁగా వెంటనే లంకసమీపమందున్న మలయుపర్వతము యొక్క శిఖరము నూడఁబెఱికి దానిచే గుంభకర్ణుఁడు సుగ్రీవుని తన భుజబలము కొలఁది కొట్టెను.

**—॥ మూర్ఛిల్లిన సుగ్రీవునిఁ గుంభకర్ణుం డెత్తికొని లంకలోనికిఁ బోవుట ॥—**

సీ. కుధరాగ్రహతిఁ జేసి ॥ కూలె సుగ్రీవుండు, నష్టసంజ్ఞుం డయి ॥ కష్టదశను
నాశ్చర్యఘోరప॥రాక్రముం డినసుతుం, డిటు చేష్టలను మాని ॥ యిలను బడినఁ
గని రాక్షసులు ఘోర॥గర్జల నింపఁగఁ, గుంభకర్ణుఁడు వానిఁ॥గూడ నరిగి
పట్టి యెత్తికొని యభ్రంబును వాయువు, గొనిపోవునట్టులు ॥ కొని యరుగుచు
ఆ. రాత్రిచరుల స్తోత్ర॥రావముల్ విస్మిత, దివిజనాదములను॥దివిజవైరి
వినుచు ఘోరశృంగ॥విలసిత మేరువు, భంగి లంకఁ జొచ్చె॥భయదరీతి. ౧౫౭౩౯

అర్థములు. కుధరాగ్రహతిఁ జేసి = కొండశిఖరము దెబ్బచేత, నష్ట సంజ్ఞుం డయి = స్మృతి దప్పినవాఁడై, అభ్రంబును = మేఘమును, రాత్రి చరుల = రాక్షసుల, విస్మిత = ఆశ్చర్యపడిన, దివిజనాదములను = దేవతల ధ్వనులను, ఘోరశృంగ విలసిత మేరువు = గొప్ప శిఖరముతోఁ గూడిన మేరు పర్వతము.

**తాత్పర్యము**

పర్వతశిఖరము దెబ్బచే సుగ్రీవుఁడు కష్టస్థితిని స్మృతి దప్పిపడెను. ఆశ్చర్యకరమై భయంకరమైన పరాక్రమముగల సుగ్రీవుఁడు కదలక మెదలక నేలఁబడినఁ జూచి రాక్షసులు సింహనాదములఁ జేసిరి. కుంభకర్ణుఁడు పడియున్న సుగ్రీవుకొద్దకు

బోయి వాని నెత్తుకొని వాయువు మేఘమును దీసికొని పోవునట్లు తీసికొని పోవుచు రాక్షసుల స్తోత్రములు. ఆశ్చర్యపడిన దేవతల ధ్వనులు వినుచు శిఖరముతోఁ గూడిన మేరువు వలె లంకఁ జొచ్చెను.

కం. ఇకఁ గూరణిఁ జనుచుఁ దనలోఁ, జిక్కెను బ్లవగప్రభుండు ♦ చిక్కిన యట్లే
తక్కిన రాముబలం బని, పెక్కులు తలపోసికొనుచు ♦ బిఱబిఱ చనఁగన్.

తా త్ప ర్య ము

ఇట్లు పోవుచుఁ దనలో సుగ్రీవుఁడు చిక్కెను. ఎప్పుడు సుగ్రీవుఁడు చిక్కెనో రాముని సేన యంతయుఁ జిక్కినట్లే యని నానావిధముల నాలోచించుచు విసవిస పోయెను.

సీ. చిక్కిన సుగ్రీవుఁ ♦ జెదరి పాఱెడి సేనఁ, గనుఁగొని మారుతి ♦ మనములోన
నేమి చేయఁగ వచ్చు ♦ నిప్పుడు దీనికిఁ, బ్రతివిధానము న్యాయ♦పథము విడక,
చలిపెక నెదియైన ♦ శైలనిభుండనై, మర్దింతునా త్రియా ♦ మాచరేంద్రు ?
వీనిని జంపిన ♦ విడివడు హరిరాజు, ప్లవగు లెల్లను హర్ష ♦ పడెదువారు

తే. విక్రమం బేను జూప ను♦పక్రమింప, నేల? సామాన్యుఁడే వాన♦రేంద్రుఁ డుఱక
విబుధముఖ్యులు పట్టిన♦వీఁక మెఱసి, తాన విడిపించుకొని వచ్చు♦ద్రఢిమఁ గలఁడు.

అర్థములు. ప్రతివిధానము=బదులుపని, ఏమిచేసినయెడల కుంభకర్ణుఁడు సుగ్రీవుని విడుచునో ఆయది, న్యాయ్యపథము = ధర్మమార్గము, త్రియామాచరేంద్రున్=రాక్షస శ్రేష్ఠుని, ఉపక్రమింప నేల=ఏల ప్రారంభింపవలెను, ఉఱక= లక్ష్యము సేయక, ద్రఢిమ=దార్ఢ్యము=సామర్థ్యము.

తా త్ప ర్య ము

కుంభకర్ణుని చేతఁ జిక్కిన సుగ్రీవుని వది చూచి పాఱిపోవుచున్న వానర సేనను జూచి యాంజనేయుఁడు తన మనస్సులో నిట్టు లాలోచించెను. కుంభకర్ణుఁడు చేసినదానికిఁ బ్రతిక్రియ ధర్మము తప్పక యేమి చేయవచ్చును. ఏదియైనఁ జేయవలయును. ఊరకుండ రాదు. ఏమి చేయుదును కొండంత దేహము పెంచి యా రాక్షసుని దన్నుదునా? అటుచేసిన విడుచును. వీనిని జంపినను, సుగ్రీవుని విడిపించినను వానరులందఱు సంతోషింతురు. నిజమే. నేనేల పరాక్రమము చూపవలెను. సుగ్రీవుఁడు తానై విడిపించుకొనలేకుండినఁ గదా నేను విడిపింప యత్నము చేయవలెను. సుగ్రీవుఁడేమి సామాన్యుఁడా వీనికి వశపడియుండుటకు? దేవతా శ్రేష్ఠులు పట్టుకొనినను లక్ష్యము సేయక పరాక్రమించి తానే విడిపించుకొని వచ్చు దార్ఢ్యము గలవాఁడు. అట్లైన నిప్పు డిట్లేలయున్నాఁ డందునా ?

కం. ఈరీతిఁ జిక్కియుండుటకుఁ, గారణ మీాతండు శైల♦ఘాతంబునఁ బ్ర
జ్ఞారహితుఁడు గానోపును, మారుతమునఁ దేఱి తనకు♦మూఁకకు హితమున్.

అర్థములు. శైలఘాతంబున = కొండదెబ్బచే, ప్రజ్ఞారహితుఁడు=స్మృతి

లేనివాఁడు, ముహూర్తమున=అల్పకాలములో, తేఱి=తెప్పతిల్లుకొని, మూఁకకు= వానరసేనకు.

తాత్పర్యము

కొండదెబ్బచే స్మృతితప్పి యుండుటయే యిట్లుచిక్కియుండుటకుఁ గారణమై యుండవలెను. అల్పకాలములో స్మృతివచ్చునా తనకు వానరసేన కేదిమేలో యది యతఁడే.

చ. పౌరుషముఁ గాక నే బలిమిఁ ♦ బూని మహాత్ముని ముక్తుఁ జేసినన్
ఘనతరకీర్తినాశమును ♦ గష్టము సమ్మదహాని గల్గు నీ
యన కిల శాశ్వతం బగుచు ♦ నట్టులు గాన ముహూర్త మోర్చి యీ
వనచరసేన నిర్వ్యథను ♦ బాయమఁ దేర్చెదఁ బ్రోవు గూర్చెదన్. ౧౪౮౩

తాత్పర్యము

చేయునుగాక; నేను నా బలముఁజూపి గొప్పమనస్సుగల యితని విడిపించితినా యీయనకు గొప్పకీర్తి నాశమగును. నీచత్వము కలుగును ఈయనకు సంతోష హానియు నగును. ఇవి యీయనకు శాశ్వతముగఁ గలుగఁజేయుట నాకు దగినదిగాదు. అల్పకాల మోర్చికొనియుండి భయపడిన యీవానరసేనకు భయము పోఁగొట్టి సమాధాన పఱిచి చెదరినవారినెల్ల గుంపుగూర్చెదను.

కం. అని చింతించుచుఁ జెదరిన, వనచరులం గూర్చుచుండ ♦ వడి ఘటకర్ణుం
డును సుగ్రీవుం గొని వడిఁ జనుచుండెను, లంక రాజ♦సరణిని నంతన్. ౧౪౮౪

తాత్పర్యము స్పష్టము.

**-♦ సుగ్రీవుఁడు కుంభకర్ణుని ముక్కు చెవులు కొఱికి శ్రీరామునొద్దకు వచ్చుట ♦-**

సీ. ఇరువంక రాణించు ♦ గృహగోపురవిమాన, చర్యాగ్రవర్తులు ♦ చల్లుచున్న
లాజగంధోదక ♦ రాజుల మెలమెల్లఁ, దడియుట ఘంటాప ♦ థంబు శైత్య
మున నెట్టకేలకు ♦ మూర్ఛదేఱి ససంజ్ఞుఁ డయి రాజమార్గంబు♦నందుఁ జనుట
నొఱఁగి ప్రతిక్రియ♦యేమిచేయుదునిప్డు, నలుపుదుఁ గాక కీ♦శులకుహితము
ఆ. నిష్టమైనకార్య ♦ మిపు డని యోజించి, చంక నుండి దిగువ ♦ జాఱి పరగ
నింతలోన మీఁది♦కెగసి చివాలునఁ, గొఱికె ముక్కు గోళ్ళఁ♦జెఱికెఁ జెవులు

అర్థములు. ఇరువంక = రెండు ప్రక్కల, గృహ = ఇండ్లయందు, గోపుర = ద్వారములందు, విమాన = మేడలయందు, చర్యా=గోపురముల కిరు ప్రక్కల భటులు నిల్వఁగట్టిన కట్టడములందు, అగ్రవర్తులు=పైనుండువారు, లాజ= పేలాలయొక్కయు, గంధోదక=వాసనగల నీళ్ళయొక్కయు, రాజుల = వరుసలచే ఎట్టకేలకు = అతికష్టముపైన, ససంజ్ఞుఁడయి = స్మృతిగూడినవాఁడై, మెలమెల్ల మూర్ఛదేఱి యనుటచే సుగ్రీవుండు మూర్ఛనుండి తేఱుట కుంభకర్ణునకుఁ దెలియ

దని భావము. లంకాపురము రాచబాటలందు నిరుప్రక్కలనున్న యిండ్లమీఁదను గోపురముల మీఁదను మేడల మీఁదను చర్యలమీఁదను నున్నవారు పేలాలు పన్నీరు మొదలగు వాసనగల నీళ్ళు చల్లగా దడిసియుటచే రాజబాట శైత్యమునకు మెల్లమెల్లగా నెట్టటో మూర్ఛ దేఱి స్మృతిగల వాఁడయి లంకలో రాజమార్గ మందు తాను బోవుచుండుట తెలిసికొని, వానరులకు మేలైనది దీనికి బదులేమి సేయుదునా యని యోజించి, చంకనుండి తటాలున దిగువకుజాఱి యంతలోఁ జివాలునఁ బై కెగసి యేకకాలమున నోటితో ముక్కుగొఱికి గోళ్ళతోఁ జెవులు పెఱికెను.

చ. చెవులును ముక్కుఁ బోవ మెయి ♦ సిక్తముగా క్షతజంబునన్ రుషా
  వివశత ప్రామన్మకంపుఁబతి ♦ బిట్టుగఁ బట్టి నలంచి నేలపై
  జవమునఁ గొట్టె, నీ గతిని ♦ సంపరిపిష్టుఁడు నయ్యు మాంసభు
  గ్నివహాసుమర్దితుండు నయి ♦ గీశవిభుండు లఘుత్వ మేర్పడన్. ౧౫౭౬

అర్థములు. మెయి = దేహము, సిక్తముగా = తడియఁగా క్షతజంబునన్ = నెత్తుటిచే, రుషావివశత=కోపముచే దేహము తెలియక, ప్రామన్మకంపుఁబతి = వానరరాజును, నలంచి = నలిపి, సంపరిపిష్టుఁడు = బాగుగ నలుపఁబడినవాఁడు, మాంసభుగ్నివహా = రాక్షస సమూహముచే, సుమర్దితుండు=బాగుగఁ గొట్టఁబడినవాఁడు, ఇట్లు చెప్పుటచే కుంభకర్ణుని వెంటవచ్చిన రాక్షసులుకూడ సుగ్రీవుని గొట్టిరని యేర్పడుచున్నది.

తా త్ప ర్య ము

చెవులు ముక్కుపోఁగా దేహము నెత్తుటిచేఁ దడియఁగా కుంభకర్ణుఁడు సహనము లేనివాఁడై దేహము తెలియక సుగ్రీవుని గట్టిగఁ బట్టుకొని నలిపి నేలపై విసరిగొట్టెను. వానితోడ నుండిన రాక్షసులును గొట్టిరి. ఇట్లు కుంభకర్ణునిచే నలుపఁబడినవాఁడు నయ్యు రాక్షసులచేఁ గొట్టఁబడినవాఁడు నయ్యు సుగ్రీవుఁడు తన లాఘవము తెలియునట్లు.

కం. నింగికిని దాఁటి రాముకు,అంగట నిలఁబడియె నచట ♦ అంపిలు నస్రం
  బంగముఁ దడుపఁగ సెలయేర్లం గొఱలెడి కొండవోలె♦రక్తప్రభుఁడై.

అర్థములు. నింగికిని = ఆకాశమునకు - రాముకుఅంగటన్=రామచంద్ర మూర్తి సమీపమున, అంపిలు + అస్రంబు=విశేషముగాఁ గాఱుచున్న నెత్తురు.

తా త్ప ర్య ము

ఆకాశమున కెగసి రామచంద్రు సమీపమున నిలిచెను. అచట లంకలో కుంభకర్ణుఁడు విశేషముగఁ గాఱు నెత్తుటిచేఁ దడిసి, కొండవంకలచేతఁ గొండవోలె నెఱ్ఱని కాంతి గలవాఁడై.

## —♦ కుంభకర్ణుఁడు మత్తుఁడై వానరాదుల మ్రింగుట ♦—

మ. అమితామర్షమునన్ నిశాచరుఁడు సం♦ధ్యాయుక్త మహానీల మే
ఘమునాఁ బోల్చుచు యుద్ధభూమి కెదురై ♦ కాంతాళిపుంబేర్మి య
స్రములం గ్రక్కుచుఁ బోవుచుం గరమునన్ ♦ శస్త్రంబు లేకుంట రా
ద్రము క్రూరంబగు ముద్గరంబుఁ గొని ప్ర♦ధ్వంసించెఁ బ్రత్యర్థులన్. ౧౫౪౦

అర్థములు. అమితామర్షమునన్=అధికమైన యసహనముతో, మర్షము= సహనము, ఓర్పు, అది కానిది అమర్షము, అమర్షః క్రోధేన జనస్య జంతునా వజాత హార్దేన. అని కిరా. ౩౩. నిశాచరుఁడు = రాక్షసుఁడు, కుంభకర్ణుఁడు, సంధ్యా యుక్తము = సాయంసంధ్యాకాలముతోఁ గూడిన, కాంతాళిపుంబేర్మి = కోపాతి శయముచే, అస్రములన్ = నెత్తురులను, ప్రధ్వంసించెన్ = నాశము చేసెను, ప్రత్య ర్థులన్ = శత్రువులను.

### తాత్పర్యము

కుంభకర్ణుఁడు నెత్తుటఁ దడిసియుటచే సంధ్యాకాల మేఘముబోలి మరల వెనుకకుఁ దిరిగి యుద్ధభూమికిఁబోయి కోపాతిశయమున నెత్తురు గ్రక్కుచుఁ బోవుచుఁ జేత నాయుధము లేకుండుటచే భయంకరమై కఠినమైన రోఁకలివంటిదగు ముద్గరమును దీసికొని శత్రువులను నాశము చేసెను.

ఉ. మత్తమనస్కుఁడున్ క్షతజ♦మాంససుగృధ్నుఁ డెఱుంగలేక తా
నత్తఱి పేరు వారనక ♦ యాశరకీశపిశాచముఖ్యులన్
మిత్తి లయంబునందువలె ♦ మ్రింగ గడంగెను నొక్క కేలఁ జే
హత్తిన యిద్దలిన్ ముసర ♦ నాఁగఁ బెక్కుర వాతఁగూరుచున్. ౧౫౪౧

అర్థములు. మత్తమనస్కుఁడున్ = మదించిన మనస్సుగలవాఁడు, క్షతజ నెత్తుటియందు, మాంస=మాంసమునందు, సుగృధ్నుఁడు=విశేష మాశగలవాఁడు, ఆశర, కీశ, పిశాచముఖ్యులన్ = రాక్షసులందు వానరులందు పిశాచములందు ముఖ్యులగువారిని, రావణునొద్ద పిశాచములు విశేషముగ నుండునట్లు పుష్పక వర్ణనమునందు రావణ యుద్ధమునందు నీ ఘట్టమునందుఁ జెప్పఁబడిన వాక్యములచే నేర్పడుచున్నది. కావుననే రావణుఁడు రుద్రునకుఁ బోల్పఁబడెను. మిత్తి=మృత్యు దేవత, ఒక్క కేలన్=రెండవచేత ముద్గర ముండుటచే నని భావము.

### తాత్పర్యము

మదముచే మనస్సు తన స్వాధీనమందు లేనివాఁడు నెత్తురు మాంసములందు విశేషాశ గలవాఁడు తనవారెవరో పరులెవ్వరో తెలిసికోలేక రాక్షసులను వానరు లను పిశాచములను ప్రలయకాలమందు మృత్యుదేవతవలె నొక్కచేత నత్తి నోర వేసికొని యొకొక్కసారి యిద్దఱను ముగ్గురను పెక్కుమందిని దొరకినవారిని దొరకినట్లు మ్రింగ నారంభించెను.

## —♦ శ్రీరాముఁడు కుంభకర్ణుతో యుద్ధము చేయుట ♦—

సీ. చుట్టును గ్రోఁతులు ♦ బిట్టు చెట్టులఁ గొట్టి, సంపీడితునిఁ జేయ ♦ సరకుఁ గొనక
సెలవుల నెత్తురు ♦ పలలంబు స్రవియింప, నేడ్వుర నూర్వుర ♦ నెనిమిదిగుర
దిగమ్రింగుచును నిచ్చఁ ♦ దిరుగులాడఁగ గపుల్, శరణుఁజొచ్చిరి రామచంద్రుఁ జేరి
యది గని లక్ష్మణుం ♦ డధికకోపంబునఁ, గుంభకర్ణుని నేసు ♦ క్రూరబాణ
తే. ములను గొట్టిన నాతని ♦ వలను గనక, రాముఁ డున్నెడకును బోయె ♦ రౌద్రశరము
వింటసంధించి రాముఁడు ♦ వెడఁదయురముఁ, దాఁక విడుచుటయును వాఁడు ♦ దరలి యదరి.

అర్థములు. సెలవులన్ = పెదవికొనల, పలలంబు = మాంసము, వలను = ప్రక్క, తరలి = చలించి, అదరి = భయపడి.

### తాత్పర్యము

క్రోఁతులు తన్నుఁజుట్టుకొని చెట్లచే గట్టిగాఁ గొట్టినను వాఁడు లక్ష్యము సేయఁడయ్యె! పెదవుల కొనల నెత్తురు మాంసము కాఱఁగ నేడుగుర నెనిమిదిగుర నూర్వుర దిగమ్రింగుచును తన యిష్టముకొలఁది తిరుగఁగా వానరు లేమియుఁ జేయఁజాలక రామచంద్రు శరణుఁబొచ్చిరి. అది చూచి లక్ష్మణుఁడు మిగులఁ గోపించి కుంభకర్ణుని నేసు క్రూరబాణములచేఁ గొట్టెను గాని వాఁడు దానిని లక్ష్యము సేయక రామచంద్రమూర్తి యున్న చోటికిఁ బరువెత్తెను. అప్పుడు రామచంద్రమూర్తి రౌద్రాస్త్రము సంధించి వాని విశాలమైన ఱొమ్ము దాఁకునట్లు వేయఁగా దానిచే వాఁడు చలించి బెదరి.

కం. అంగారమిశ్రకీల ల,భంగురగతి నోరు వెడల ♦ భయదరవంబున్
నింగి పగులంగ నించి ప్ల,వంగులదెస మరలి పేఁక ♦ వారిం దఱిమెన్. ౧౦౪

అర్థములు. అంగారమిశ్రకీలలన్ = నిప్పుతో సమానమైన జ్వాలలు, అభంగురగతిన్ = విస్తారముగా, భయదరవంబున్ = భయంకరధ్వని, నింగి = ఆకాశము.

### తాత్పర్యము

నోటినుండి నిప్పు మంటవంటి మంటలు విస్తారముగ వెడలఁగా భయంకర ధ్వని యాకాశము నిండ నార్చి ముందు రాముని మీఁదికిఁ బోక వెనుకకు మరలి వానరులఁ దఱిమెను.

తే. నెమ్మిఱెక్కలు లగు రాఘవ ♦ నిష్ఠురాశు,గంబు లురమున నాటఁగ ♦ గాటముగను
జేతికైదువు లెల్లను ♦ క్షితితలమున, జాఱి తమయంతఁ బడిన ని ♦ శాచరుండు.

అర్థములు. నెమ్మిఱెక్కలులు = నెమిలి యీఁకలు ఱెక్కలుగాఁగల, నిష్ఠురాశుగంబులు = కఠిన బాణములు, కైదువులు = ఆయుధములు.

### తాత్పర్యము

రామచంద్రమూర్తి వేసిన నెమిలి యీఁకలు ఱెక్కలుగాఁగల కఠిన బాణ

ములు దేహమున దృఢముగ నాటుటచే నా బాధవలన వానిచేతనున్న యాయుధ ములు తమంతటఁ దామే జాఱిపడిపోయెను.

కం. కాలను గేలను యుద్ధం, బోలి నొనర్చుచును నెత్తు ♦ టొడలున రక్షః
పాళులఁ గ్రోఁతుల మ్రింగుచు, హాళిమెయిం దిరిగి యంత ♦ కాకారుం డై.

అర్థములు. నెత్తుటొడలున = నెత్తురు + ఒడలు = నెత్తుటితో నిండిన దేహము, రక్షః పాళుల = రాక్షససమూహముల, అంతకాకారుఁడై = యముని వంటి రూపము గలవాఁడై, హాళిమెయిన్ = సంతోషముతో.

తా త్ప ర్య ము

ఆయుధములు పడుటచే చేతఁగాల యుద్ధముచేయ నారంభించి నెత్తుటి దేహముతో రాక్షసులను వానరులను మ్రింగుచు సంతోషముతోఁ దిరుగుచుయమునివలె;

మ. ధరకూటంబు నొకండుఁ దెచ్చి నడి సీ ♦ తానాథుపై వైవ నం
తరమం దేసుశరంబులం దునిమి య ♦ ద్దానిన్ మఱిన్ శైలము
ఖ్యరఁ గూలన్ ద్విశతంబు మర్కటులు చా ♦ వం గల్గునం చాశుగో
త్కరవర్షంబునఁ జూర్ణముం జలిపె వే ♦ గస్ఫీతుఁడై రాముఁడున్. ౧౧౫ర

అర్థములు. ధరకూటంబు = పర్వత శిఖరము, నడిన్ = వేగముగా, అంతరమందు = నడుమ, ద్విశతంబు = రెండునూర్లు, ఆశుగోత్కర వర్షంబునన్ = బాణ సమూహవర్షముచే, చూర్ణము = పొడి, వేగస్ఫీతుఁడై = వేగముతోఁ గూడినవాఁడై.

తా త్ప ర్య ము

కొండశిఖరము నొకదానిని దెచ్చి వడిగా రాముని మీఁద వైవఁగా నాయన దాని నేసుబాణములచే నడుమనే ఖండించి, యది క్రిందఁ బడెనేని రెండువందల క్రోఁతులు చత్తురని తలఁచి బాణముల వానచే నా తునుకలను పొడిపొడి రాలునట్లు కొట్టెను.

కం. ఈలో నాతనిఁ జంపఁగ, నాలోచనసేయు రాఘ ♦ వా ఘజా షను న
న్నా! లాఁతులఁ దమవారిని, వాలాయము మ్రింగు చున్న ♦ వాఁ డదె కంటే.

అర్థములు. లాఁతులన్ = పరులను, వానరులను, వాలాయము = అడ్డము లేక.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. వనచరుఁ డని నిశిచరుఁ డని, మనమునఁ దెలియంగ లేఁడు ♦ మత్తత రక్తం
బున వాసనచేఁ! గ్రోఁతులు, గొనకొని పై నెక్క రేని ♦ కోటులకోలఁదుల్.

అర్థములు. వనచరుఁడని = వీఁడు కోఁతియని, నిశిచరుఁడు = వీఁడు రాక్షసుఁడని, మత్తతన్ = మదముచే, రక్తంబునవాసనచే = రక్తమునొక్క వాసనచే, సమాసంబున షష్ఠ్యర్థమున నకారాగమము, కొనకొని = ప్రయత్నించి.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. గురుభారపీడితుం డై దురితాత్ముఁడు నలఁగి క్రోఁతి♦తుటుముల నిట్టుల్
పొరిగొన నోపం డన విన, తరుచరసంఘంబు లెక్కె ♦ దానవుమీఁదన్.

అర్థములు. గురుభార పీడితుండై=మిగుల బరువుచే బీడింపఁబడినవాఁడై, దురితాత్ముఁడు = పాపస్వభావము గలవాఁడు, తుటుములన్ = సమూహములను, పొరిగొనన్ = చంపుటకు, ఓపండు=సమర్థుఁడు కాఁడు, తరుచర సంఘంబులు = వానర సమూహములు.

తాత్పర్యము

బరువధిక మగుటచే బాధపడి యీ పాపాత్ముఁడు వానరుల నిట్లు చంపఁ జాలఁడనగా క్రోఁతి గుంపులు రాక్షసునిమీఁద నెక్కెను

ఉ. మావటిఁ గ్రిందఁ ద్రోయఁ జెను ♦ మత్తగజేంద్ర మొదల్ విదుర్చున
ట్లా వరసత్త్వశాలి తన ♦ యంగము లోలి విదిర్చి యెల్లకీ
శావళిఁ గ్రిందఁ ద్రోయ మను ♦ జాధిపుఁ డయ్యది గాంచి వీఁ డహో
కావలుఁ డంచుఁ దీవ్రశర ♦ కార్ముకహస్తుఁడు తోడు తోడుగన్. ౧౫౫౮

అర్థములు. వరసత్త్వశాలి=అధిక బలముగలవాఁడు, కావలుఁడు=దురాత్ముఁడు, తీవ్రశరకార్ముకహస్తుఁడు=తీక్ష్ణములైన బాణములు విల్లు చేతఁగలవాఁడు, తోడుతోడుగన్=వెంట వెంటనే.

తాత్పర్యము

మావటివానిని గ్రిందఁ ద్రోయుటకై మదపుటేనుఁగు దేహమును విదుర్చునట్లు మిగుల బలశాలియగు రాక్షసుఁడు తన యవయవముల విదలించి వానరుల నందఱ నొక్కసారిగఁ గ్రిందఁ ద్రోయఁగా రామచంద్రమూర్తి యదిచూచి వీఁడు దురాత్ముఁడు, సులభముగ బోవువాఁడు కాఁడని తీక్ష్ణబాణములను వింటిని చేతఁ దీసికొని వెంట వెంటనే.

ఉ. వానిభయంబునన్ సురఁగు ♦ వానరు లెల్లరు మోద మంద రో
షానలతామ్రచక్షుఁ డయి ♦ యాతనిఁ జూపులనే దహించుచం
దానను రాక్షసుం దఱిమి ♦ తాన యదల్చుచు నడ్డగించె ర
క్షోనిచయంబు బెగ్గిలఁగఁ ♦ గ్రూరగుణారవపూరితాశుఁ డై. ౧౫౫౯

అర్థములు. సురఁగు=భయపడి చాటునకుఁబోవు, రోషానల తామ్రచక్షుఁడయి = కోపాగ్నిచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడయి, తఱిమి=పాఱద్రోలి, బెగ్గిలఁగన్=భయపడ, క్రూర=కఠోరమైన, గుణారవ=అల్లెత్రాటి మోఁతచే, పూరిత=నిండిన, ఆశుఁడై=దిక్కులు గలవాఁడై.

తాత్పర్యము

వానికి భయపడి దాఁగుకొను నట్టియు పాఱిపోవునట్టియు వానరులు సంతోషింపఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి చూపులచేతనే దహించు విధముగ రాక్షసుని

దఱుముకొనిపోయి వాఁడు పోవు త్రోవ కడ్డమై తానే యదలించి రాక్షసులు భయమంద నల్లెత్రాటి మ్రోఁతచే దిక్కులు నిండఁజేయుచు.

ఉ. నల్లను గ్రక్కుచున్ మరల • నాలుక నాకుచు రోసి క్రోఁతులన్
గొల్లగ మ్రింగి వైచుచును • ఘోరపురూపునఁ గల్పకాలుఁ దా
నుల్లసమాడువానిని స • ముజ్జ్వలితాంగదు స్వర్ణరత్నభూ
షోల్లసితాంగుఁ జేరఁ జన • నుగ్రత వాఁడును రోషదీప్తుఁడై. ౧౯౬౦

అర్థములు. నల్లను = నెత్తుటిని, రోసి = వెదకి, కల్పకాలు = ప్రలయకాల యముని, ఉల్లసమాడువానిని = పరిహసించు వానిని, పోలిన వానిని, సముజ్జ్వలిత=మిగులఁ బ్రకాశించు, అంగదున్=బాహుపురులు గలవానిని స్వర రత్న భూషిత = బంగారు రత్నముల భూషణములచే, ఉల్లసితాంగున్=మిగులఁ బ్రకాశించు నవయవములు గలవానిని.

### తాత్పర్యము

నెత్తురు గ్రక్కుచు మరల దానినే నాకుచు వెదకి వెదకి క్రోఁతుల మ్రింగుచు భయంకరాకారముతో ప్రలయకాల యమునివలె నుండువానిని, ప్రకాశించు బాహుపురులు గలవానిని, బంగారుతోను రత్నములతోను జేయఁబడిన యాభరణములచే ప్రకాశించు దేహము గలవానిని సమీపింపఁగా వాఁడును రోషముచే మండుచున్న వాఁడై.

## —• శ్రీరామ కుంభకర్ణుల సంవాదము •—

ఉ. సమ్ముఖ మేగుదేర రఘు • చంద్రముఁ డిట్లను రాక్షసేంద్ర! రా
రమ్ము విషాద మందకుము • రాముఁడ నే సిదె చాప మూని సి
ద్ధమ్ముగ నున్న వాఁడ నెటఁ • దారెద వింక ముహూర్తమాత్రలో
నమ్ముము కాలువిందుగ నొ • నర్చెద నార్చెద నీ ప్రతాపమున్. ౧౯౬౧

అర్థములు. సమ్ముఖము = ఎదురుగా, తారెదవు = పోయెదవు, కాలువిందుగన్ = యమునికి నతిథిగ.

### తాత్పర్యము

ఎదురుగా రాఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. రాక్షసశ్రేష్ఠుఁడా! రారమ్ము. దుఃఖపడకుము. నేనే రాముఁడను. ఇదిగో విల్లుదీసికొని సిద్ధముగ నున్నాఁడను. ఇంకెక్కడఁ బోఁగలవు? ఇఁక నల్పకాలములో నిన్ను యముని యొద్దకు నతిథిగఁ బంపెదను. నీ ప్రతాపము నాశము చేసెదను.

కం. అనవుడు నాతఁడె రాఘవుఁ, డని యెఱిఁగి సురారి వికృత • హాసరవుం డై
వనచరుల గుండె లగలఁగ, స్తనితార్భటి ననియె రామ • చంద్రునితోడన్.

అర్థములు. వికృతహాసరవుఁడై = వికారపు నవ్వుధ్వనిగలవాఁడై, అగలఁగన్=పగులునట్లు స్తనితార్భటిన్=పిడుగువంటి ధ్వనితో.

తా త్ప ర్య ము

ఇట్లు చెప్పఁగా వీఁడే రాముఁడని యెఱిఁగి రాక్షసుఁడు వికారముగా నవ్వి వానరుల గుండెలు పగులునట్లు పిడుగు పడునపుడు కలుగు ధ్వనివంటి ధ్వనితో— రామచంద్రమూర్తితో నిట్లనియె.

ఉ. కాను జుమీ విరాధుఁడను ♦ గాను కబంధుఁడఁ, గాను వాలి, నేఁ
గాను ఖరుండ, రామ! విను ♦ కానల తాటక పట్టి, వచ్చితిన్
దానవదేవతానికర ♦ దారణకారణభీమ నేతదు
గ్రానలతుల్యముద్గరక ♦ రార్జితవర్ణుఁడఁ గుంభకర్ణుఁడన్. ౧౫౬౩

అర్థములు. తాటకపట్టి = మారీచుండు, దానవదేవతానికర = దానవుల యొక్కయు దేవతలయొక్కయు సమూహములయొక్క, దారణకారణ=చీల్చుట యందుఁ గారణమైన, భీమ = భయంకరమైన, ఏతత్ = ఈ, ఉగ్రానలతుల్య= తీక్ష్ణమైన యగ్నితో సమానమైన, ముద్గరకర=ముద్గరమునుగల చేతితో, ఆర్జిత= సంపాదింపఁబడిన, వర్ణుఁడన్=కీర్తిగలవాఁడను, "వర్ణ స్వర్ణ కథా కుథ నుతి గణ శోభా యశో విశేషేషు" నానా. ర.

తా త్ప ర్య ము

రామచంద్రా! నేను విరాధుఁడను గాను జుమీ. కబంధుఁడను గాను, వాలినిగాను, ఖరుండనుగాను, మారీచుఁడను గాను. దానవ దేవతాసమూహము లను జీల్చుటయందుఁ గారణమై భయంకరమైన యీ తీక్ష్ణమైన యగ్నితో సమానమైన ముద్గరమును గల చేతితో సంపాదించిన కీర్తిగలవాఁడను కుంభకర్ణుఁడను వచ్చితిని.

ప్రతిషేధాలంకారము=ప్రసిద్ధమైన ప్రతిషేధమును మరల నిషేధించుట ప్రతిషేధాలంకారము.

వీఁడు విరాధుఁడు కబంధుఁడు కాఁడనుట ప్రసిద్ధవిషయమే. దానిని మరల నిషేధించుటచేఁ బ్రతిషేధాలంకారము.

చ. చెవులును ముక్కు లేవని హ♦సింపకు నన్నని రామచంద్ర! య
య్యవి తెగిపోకఁ బీడ లవ♦మైనను లేదు, భవద్బలంబు శౌ
ర్యవిభవ మేను గాంచి మఱి ♦ యస్మదనూనపరాక్రమంబు నీ
కవితథభంగిఁ జూపి జవ♦మారఁగఁ బ్రింగెదఁ బెం పెసంగఁగదన్. ౧౫౬౪

అర్థములు. హసింపకు = నవ్వకుము, అస్మత్ = నాయొక్క, అనూన = కొఱఁతలేని, పరాక్రమంబు=శౌర్యము, అవితథభంగిన్ = వ్యర్థముకానిరీతిగ.

తా త్ప ర్య ము

ఎవఁడు వీఁడు ముక్కు సెవులు లేనివాఁడు శూర్పణఖ యన్నగా నున్నాఁడే యని నవ్వకుము. రామచంద్రా! యవి పోవుటచే బాధ కొంచెమైన లేదు. నీ

బలంబు శౌర్య సంపత్తి యేమాత్రమో చూచి తరువాత నా పూర్ణ పరాక్రమము సార్థకముగాఁ గనఁబఱిచి నా గొప్పతనము వృద్ధి యగునట్లు నిన్ను భ్రమింగెదను.

మ. ఘటకర్ణుం డిటు పల్కఁ రాముఁడు సుపుంఖస్ఫారవజ్రద్రుతో
త్కటబాణంబులఁ జిమ్మెఁ దద్ధతిని నాతం డేమి కంపింపమిన్
బటుసాలంబుల వాలినిం దునుము నబ్బాణంబులన్ వైచె న
చ్చటులాస్త్రంబులు నించు కే నతని నేఁచన్ లేవ, యద్దైత్యుఁడున్. ౧౫౬౫

అర్థములు. సుపుంఖ = మంచి పింజలచే, స్ఫార = ప్రకాశించు నవియు, వజ్రద్రుత=వజ్రము యొక్క వేగము గలవియు నగు, ఉత్కటబాణంబులు=తీవ్రములైన బాణములను, తత్ +హతిని = ఆ దెబ్బచే, ఏమి =ఏమియున్ = కొంచెమైనను, కంపింపమిన్ = చలింపక పోవుటచే, పటు = దృఢములైన, సాలంబులను వాలిని, తునుము=పడఁ గొట్టిన బాణంబులన్ = చెట్లద్రుంచిన బాణ మొకటి, వాలిని ద్రుంచిన బాణ మొకటి రెండగుటచే బహువచన ప్రయోగము. ఈ విషయము కిష్కింధా కాండమునఁ జర్చింపఁబడెను, చటులాస్త్రంబులు=తళతళ లాడుటచే చలించు నాయస్త్రంబులు, ఏఁచన్ = బాధపెట్టఁగా, లేవ = సమర్థమైనవి కావు. 'ఏఁచు' నకు రెండు రూపంబులు గలవు. ఏఁచన్, ఏఁపన్.

తాత్పర్యము

కుంభకర్ణుఁ డిట్లు చెప్పఁగా రామచంద్రమూర్తి మంచి పింజలు గలిగి వజ్రముతో సమానమైన వేగముగల విశేష బాణములను చిమ్మెను గాని వాని దెబ్బకు వాఁడు కొంచెమైన చలింప లేదు. ఆవల సాలములను వాలిని ద్రేసిన బాణములు వేసెను. అవియును వానిని బాధించినవి కావు. ఆ రాక్షసుఁడును.

కం. కురిసెడిశరవర్షంబును, శరవర్షమునా గ్రహించి శరవేగము ము
ద్గరవేగంబున నుడుపుచుఁ, దరుచరతతి నెల్లఁ దఱిమెఁ దద్వాతమునన్.

తాత్పర్యము

కురియుచున్న బాణవర్షమును జలవర్షముగా గ్రహించి యా బాణవేగమును ముద్గరవేగంబున నిలుపుచు, ఆ ముద్గరము ద్రిప్పుటవలనఁ గలిగిన వాయువుచే వానరులను దఱిమెను.

## —॰ శ్రీరాముఁడు కుంభకర్ణుని కాలుసేతులు నఱకుట ॰—

మ. అలఁతిం బోయెడువాఁడు గాఁ డనుచు వాయవ్యాస్త్రముం బూని శ్రీ
జలజాక్షుండు సముద్గరం బయిన హస్తం బుర్విఁ గూల్పంగ, నా
పలలాశిప్రవరేణ్యుఁడుం దుములరావం బార సించెన్, శరో
ద్దళితం బైనకరంబు వృక్షచరసంతానాంత మై భూమిపై. ౧౫౬౬

అర్థములు. అలఁతిన్ = అల్పముతో, సముద్గరంబు = ముద్గరముతోఁ గూడినది, పలలాశి ప్రవరేణ్యుఁడున్ = రాక్షస శ్రేష్ఠుఁడు, తుముల రావంబు =

సంకులధ్వని, శరోద్ధళితంబైన కరంబు=బాణముచే ఛేదింపఁబడిన చేయి, వృక్షచర సంతానాంతమై=వానర సమూహములను నాశము చేయునదియై.

తాత్పర్యము

తన బాణములు వానిని గొట్ట సమర్థములు గామిఁ జూచి వీఁడల్ప ప్రయత్నముచే బోయెడివాఁడు గాఁడని వాయవ్యాస్త్రము ప్రయోగించి రామచంద్రమూర్తి ముద్గరముతోడి హస్తమును నేలఁ బడఁగొట్టెను. బాణముచే ఛేదింపఁ బడిన హస్తము వాని చుట్టియున్న వానరులపై పడి వారిని నాశము చేసెను.

మ. పడినన్ భగ్నహతావశేషనికురుం ♦ బం బెల్ల దూరమ్ముగా
కడలం బాఱె విషణ్ణచిత్తమగుచుం ♦ గంపించు దేహంబులన్
గడుఘోరం బగు రామరాక్షసుల సం ♦ గ్రామంబు వీక్షించె న
య్యెడ గుండెల్ దిగు దిగ్గు దిగ్గుమన నం ♦ తే వీతహర్షంబునన్. ౧౨౬

అర్థములు. భగ్న = విఱిగిన వారును, హత = చంపఁబడిన వారును పోఁగా, అవశేష=మిగిలిన, నికురుంబంబు = వానర సమూహము, దూరమ్ముగా= దూరము దూరముగా, కడలన్ బాఱె=దిక్కులవెంటఁ బరువెత్తి, విషణ్ణచిత్తము = విషాదముతోఁ గూడిన మనస్సు గలది, కంపించు = వణఁకు, వీతహర్షంబునన్ = పోయిన సంతోషముతో.

తాత్పర్యము

ఆ హస్త మట్లు భూమిపైఁ బడఁగా దానిచే విఱిగినవారు చచ్చినవారు గాక మిగిలిన వానరుల గుంపు దిక్కులవెంట దూరముగాఁ బరువెత్తి పోయి వణఁకు దేహంబులతో మిగుల భయంకరమైన రామకుంభకర్ణుల యుద్ధము సంతోషము లేని వారై గుండెలు దిగుదిగ్గు మనఁజూచిరి.

ఉ. అంత నికృత్తబాహుఁ డను ♦ రాంతకుఁ డొండొక కేలఁ బీకి త
త్ప్రాంతగతంబు భూరుహము ♦ రామునిఁ గొట్టఁగ వచ్చుచుండ దు
ర్దాంతమహైంద్రబాణమున ♦ రాముఁడు వృక్షముతోడి హస్తమ
భ్రాంతిని ద్రుంచి వైవఁగ ధ ♦ రంబడి కేలు ద్రుమాన్వితంబుగన్. ౧౨౭

అర్థములు. నికృత్తబాహుఁడు=నఱకఁబడిన చేయి గలవాఁడు, తత్ప్రాంతగతంబు = ఆ సమీపమందున్న, భూరుహమున్ = చెట్టును, దుర్దాంత=అణఁప రాని, మహా + ఐంద్రబాణమున=గొప్ప ఐంద్రాస్త్రమున, అభ్రాంతిని=భ్రాంతి లేక, ద్రుమాన్వితంబుగన్= చెట్టుతోడ.

తాత్పర్యము

చేయి నఱకఁబడిన రాక్షసుఁడు వేఱొక చేతను నా సమీపమందున్న చెట్టును బీకి దానితో రామునిఁ గొట్ట రాఁగా భ్రాంతిపడక రామచంద్రమూర్తి యైంద్రాస్త్రము ప్రయోగించి యా హస్తమును నఱకఁగా చెట్టుతోడ నా హస్తము నేలఁబడి

కం. పొరలుచుఁ బొరలుచు శిలలం, దరుచరులన్ భూరుహములఁ♦ దద్దయు మోఁదెన్
  ధర దొరఁగఁ జావ విఱుగన్, గిరినిభుఁడగు రక్కసుండు♦ కెరలుచుఁ గినుకన్.

అర్థములు. గిరినిభుఁడు = పర్వతముతో సమానుఁడు, కెరలుచున్ = విజృంభించుచు.

తాత్పర్యము

పొరలుచు పొరలుచు శిలలు క్రిందఁబడునట్లు వానరులు చచ్చునట్లు చెట్లు విఱుగునట్లు కొట్టెను. అంత పర్వతముతో సమానుఁడైన రాక్షసుఁడు కోపముచే విజృంభించి.

కం. కరములు రెండును లేకయు, కరము భయంకరములైన ♦ గర్జలతోడ
  న్నురవడి రాఁగని యాతని, చరణంబుల నఱకె నర్థ♦చంద్రద్వయిచేన్.

అర్థములు. ఉరవడిన్ = వేగముగ, అర్ధచంద్రద్వయిచేన్ = రెండు అర్ధ చంద్రబాణములచే.

తాత్పర్యము స్పష్టము.

కం. దిక్కుల విదిక్కులం బెను, రక్కసగుమి గిరుల సాగ ♦ రంబున గుహలం
  దొక్క మొగి రవము పుట్టఁగ, నక్కాళులు రెండు మునిసి♦యవనిం బడియెన్.

అర్థములు. దిక్కులందు = తూర్పు దక్షిణము పడమర ఉత్తరము అను దిక్కులందు, ఆగ్నేయము నైఋతిమూల వాయవ్యమూల ఈశాన్యమూల లనెడి విదిక్కులందు, రక్కసగుమిన్ = రాక్షసుల గుంపునందు, సాగరంబున=సముద్రమందు, ఒక్క మొగిన్ =ఒక్కసారిగ.

తాత్పర్యము

దిక్కులందు విదిక్కులందు రాక్షసుల పెద్ద గుంపులందు కొండలందు సముద్రమందు గుహలందు నొక్క విధముగ ధ్వనిపుట్టునట్లు కాళ్లు రెండును మునిఁగి నేలఁబడెను.

రామచంద్రమూర్తి నిరాయుధుఁడని రావణుని క్షమించెగదా, కుంభకర్ణు నేల క్షమింపలేదు? నిరాయుధుఁడనఁగా యుద్ధప్రయత్నము లేనివాఁడని యర్థము. ఆయుధము లేనివానిని గొట్టరాదని వాఁడు గొంతుపిసికిన నూరకుండ వలయు నని యర్థముకాదు. కబంధుఁడు నిరాయుధుఁడు గాఁడా? కుంభకర్ణుఁడు కాలు సేతులు దెగినను యుద్ధప్రయత్నము మానినవాఁడు గాఁడు.

తే. కృత్తబాహుండు మఱి విని♦కృత్తచరణుఁ
  డయ్యు నాతఁడు హో యని ♦ యాస్యగహ్వ
  రంబుఁ దెఱచి ఘోషించుచు ♦ రాముఁ జేర
  వచ్చె శశి మ్రింగ రాహువు ♦ వచ్చుకరణి. ౧౫౭౩

అర్థములు. కృత్తబాహుఁడు=నఱకఁబడిన చేతులు గలవాఁడు, వికృత్త చరణుఁడు=నఱకఁబడిన కాళ్ళుగలవాఁడు, ఆస్యగహ్వరంబు=గుహవంటి నోరు.

తాత్పర్యము

కాళ్ళుచేతులు నఱకఁబడినను వాఁడు నోరు గుహవలెఁ దెఱచికొని హాహా యని ధ్వనించుచు చంద్రుని మ్రింగవచ్చు రాహువువలె రాముని మ్రింగవచ్చెను.

ఉ. విచ్చిననోట రామపృథి ♦ వీధవవర్యుఁడు హేమపుంఖభా
స్వచ్చటులాంబకాళి రభ ♦ సంబుగ నిండఁగ వైచె, నోటిలోఁ
గ్రుచ్చుకొనంగ బాణములు ♦ క్రూరచరిత్రుఁడు మాటలాడలే
కెచ్చుగఁ గూఁత వేసి స్మృతి ♦ హీనత బమ్మెర పోవ నంతయున్. ౧౬౬

అర్థములు. విచ్చిన నోటన్=తెఱచికొనిన నోటియందు, హేమపుంఖ= బంగారు పింజలచే, భాస్వత్=ప్రకాశించు, చటుల=మెఱుఁగులచే చలించుచున్న, అంబకాళిన్ = బాణముల వరుసను, రభసంబుగన్ = త్వరగా, బమ్మెరపోవన్ = భ్రమగొని కదలఁగా.

తాత్పర్యము

తెఱచి కొనిన నోటితో రామచంద్రమూర్తి బంగారు పింజలచేఁ బ్రకాశించు బాణములను నిండఁగ వేయఁగా నవి నోర గ్రుచ్చుకొనుటచే క్రూరపు నడవడిగల వాఁడు మాటలాడలేక పెద్ద కూఁక వేసి స్మృతి చెడి తిరుగఁగా,

## —♦ శ్రీరాముఁడు కుంభకర్ణు శిరంబుఁ దెగవ్రేయుట ♦—

మ. జ్వలదర్క ప్రతిమానమై నిశితమై ♦ సంవర్తకాలాభ మై
ఖలభీదం బయి బ్రహ్మదండనిభ మై ♦ గాంగేయపుంఖంబు నై
బలవిద్విట్పవిమారుతస్యదమునై ♦ భాస్వత్ప్రదీప్తానల
జ్వలనంబై విలసించు నైంద్రశరమున్ ♦ సంధించి శ్రీరాముఁడున్. ౧౬౭

అర్థములు. జ్వలదర్క ప్రతిమానమై = ప్రకాశించు సూర్యునితో సమానమై, నిశితమై = వాఁడియై, సంవర్త కాలాభమై = ప్రలయకాల యమునితో సమానమై ఖలభీదంబు=దుష్టులకు భయంకరమై, బ్రహ్మదండనిభమై=బ్రాహ్మణ శాపముతో సమానమై. (లేక) బ్రహ్మాస్త్రమువంటిదై, గాంగేయ పుంఖంబునై= బంగారు పింజగలదై, బలవిద్విట్ = ఇంద్రుని యొక్కయు, పవి=వజ్రము యొక్కయు, మారుత = వాయువు యొక్కయు, స్యదమునై = వేగముగలదై, భాస్వత్ + ప్రదీప్త + అనల జ్వలనంబై=ప్రకాశించుచున్న, మండుచున్న, అగ్ని యొక్క జ్వాలవంటిదై, విలసించు = ప్రకాశించు.

తాత్పర్యము

ప్రకాశించు సూర్యునితో సమానమై, వాఁడియై ప్రలయకాల యముని వంటిదై, దుష్టులకు భయము కలిగించు నదియై, బ్రహ్మాస్త్రముతో సమానమై

బంగారు పింజగలదై ఇంద్రుని వజ్రాయుధము వాయువు వేగమువంటి వేగము గలదై ప్రకాశించుచు మండుచున్న యగ్నిజ్వాల వంటిదై ప్రకాశించు నైంద్రాస్త్రమును రామచంద్రమూర్తి వింట సంధించి.

శా. ద్రాగాకృష్టగుణంబుగా దశదిశా ♦ క్రాంతైక ఘోషంబుగా
వేగం బార నిశాటుపై విడువఁ ద ♦ ద్దివ్యాస్త్రమున్ ధూమరా
జీగర్భీకృత రోహితాశ్వసమ మై ♦ శ్రీరోచిరుద్దీపితా
శాగోత్రాధరజాలమై పిడుగునో ♦ జం బాతి యాభీలమై. ౧౫౬

అర్థములు. ద్రాక్ = శీఘ్రముగా, స్రాగ్ఝడిత్యంజసాహ్నాయద్రాఙ్మంక్షు సపది ద్రుతే, అనియమరము, ఆకృష్ట = లాగఁబడిన, గుణంబుగా = అల్లెత్రాడు గలదిగా, దశదిశాక్రాంతైక ఘోషంబుగా=పది దిక్కులనాక్రమింపఁబడిన ధ్వని గలదిగా, ధూమరాజీ = పొగ సమూహముచే, గర్భీకృత = గర్భము కలదిగాఁ జేయఁబడిన, రోహితాశ్వ=అగ్నిహోత్రునితో, సమమై=సమానమై, శ్రీరోచిస్+ఉద్దీపిత+ఆశాగోత్రాధరజాలమై=కాంత్యతిశయముచేత, ఉద్దీపిత = ప్రకాశింపఁ జేయఁబడిన, ఆశా=దిక్కులయు, గోత్రాధరజాలము=పర్వత సమూహముగలదై, పిడుగునోజన్=పిడుగువలె, ఆభీలమై=భయంకరమై.

## తాత్పర్యము

శీఘ్రముగా లాగఁబడిన యల్లెత్రాడు గలదిగాఁ బది దిక్కులందు వ్యాపించిన ధ్వని గలదిగా రాక్షసుపై నా భయంకరాస్త్రమును విడువఁగా పొగచేతఁ జుట్టుకొనఁబడిన యగ్నిజ్వాలతో సమానమై కాంత్యతిశయముచేఁ బ్రకాశింపఁ జేయఁబడిన దిక్కులు కొండలు గలదై పిడుగువలెఁ బోయి భయంకరమై.

ఉ. భూరిమహీధరాగ్ర నిభ ♦ మున్ జలచారు సువర్ణ కుండలం
బార వివృత్త దంష్ట్రిమును ♦ నా వసురాధిప మూర్ధమున్ మహా
ఘోరతఁ ద్రుంప బిట్టగసి ♦ కుండల రాజిత తచ్ఛిరంబు పొ
ల్పారెఁ బునర్వసూడుయుగ ♦ ళాంతర చంద్రునిఁ బోలుచు న్నిశన్. ౧౫౭

అర్థములు. భూరి మహీధరాగ్రనిభమై = పెద్ద పర్వతశిఖరమునకు సమానమై, చల=చలించుచున్న, చారు=మనోహరమైన, సువర్ణకుండలంబు = బంగారు చెవుల పోగులు గలది, ఆరన్ = పూర్ణముగా, వివృత్త దంష్ట్రిమును= గుండ్రమైన కోరలు గలది, మూర్ధమున్=శిరస్సును, మహాఘోరతన్ = మిగుల భయంకరముగా, త్రుంపన్=ఖండింపఁగా, బిట్టగసి = తటాలున నెగసి, కుండల రాజిత తచ్ఛిరంబు=కుండలములతోఁ బ్రకాశించు ఆతల సుగ్రీవుఁడు తనకు తటాలున నబ్బిన చెవుల పైభాగములు పెఱికెనే కాని మొదలంటఁ బెఱుక లేదు. కావున కుండలము లున్నవని చెప్పఁబడెను, పునర్వసూడుయుగళ=పునర్వసు రెండు నక్షత్రముల, అంతర చంద్రుని=నడుమనున్న చంద్రుని, నిశన్=రాత్రియందు, యథా

వాచా దిశా నిశా' యని యుండుటచే నిశన్ అని చెప్పఁబడెను. 'నిశా నిశీథినీ రాత్రి' యని యమరము.

తా త్ప ర్య ము

పెద్ద కొండ శిఖరములతో సమానముగ కదలుచున్న మనోహరమైన కుండలములు గలది గుండ్రని కోఱలు గలది యగు రాక్షసుని తలను మిగుల భయంకరముగాఁ ద్రుంపఁగా నది తటాలున పైకెగసి రాత్రివేళ నాకాశమందుఁ బునర్వసు రెండు నక్షత్రముల నడుమనున్న చంద్రునివలెనై.

రెండు నక్షత్రములు కుండలములు, నడుమ ముఖము చంద్రుఁడని యుపమానము.

ఉ. దబ్బున నేలపైఁ బడుచుఁ ♦ దత్పురిఁ గల్గిన గోపురంబులున్
ప్రబ్బినయిండ్లు నున్నతపు ♦ వప్రముఁ జా డొనరించె నాద మా
గుబ్బితిలం గళేబరము ♦ గూల్చుచుఁ గోటివనాటులన్ జలం
బుబ్బఁగఁ గంధిఁ ద్రెళ్ళె భుజ ♦ గోత్కర నక్రఝుషాంతకారియై. ౧౫౬

అర్థములు. ఉన్నతపువప్రము=ఎత్తైన ప్రాకారము, నాదము = ధ్వని, ఆగుబ్బతిలన్=అతిశయింపఁగా, కళేబరము=మొండెము, వబలకభేదము = కళే+అవరము = కళేవరము, కళేబరము "శరీరే జర్ఝరీభూతే వ్యాధిగ్రస్తే కళేవరే, ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః" కోటివనాటులన్=కోటి వానరులను కంధిన్ = సముద్రమందు భుజగోత్కర = పాముల సమూహము యొక్కయు, నక్ర=మొసళ్ళయొక్కయు, ఝుష = చేఁపలయు, అంతకారియై = నాశము చేయునదియై.

తా త్ప ర్య ము

దభాలున నేలపై బడుచు నాపట్టనమందలి గోపురములను, ఇండ్లను ఎత్తైన కోటగోడను నాశముచేసెను, అది పడినచోటనున్న యిండ్లు మొదలైనవినాశమైన వని భావము. మొండె మెగసిపోవుచు కోటి వానరులను చంపుచుఁబోయి నీళ్ళుబ్బ నట్లు సముద్రములో బడఁగా నందలి పాములు మొసళ్ళు చేపలు నాశమయ్యెను. సముద్రము నీళ్ళుపొంగి పొరలివచ్చి యొడ్డుననున్న వానరులఁ జంపెనని భావము.

కం. దేవబ్రాహ్మణశాత్రవుఁ, డీ విధమున జన్యసీమ ♦ నీలుగ వఁడఁకెన్
భూవలయము దివి తుములంబై వెలసెను దేవతాప్రహ♦ర్షారభటిన్. ౧౫౭

అర్థములు. జన్యసీమన్=యుద్ధమందు, ఈలుగన్ = చావఁగా, తుములంబై=సంకులమై, దేవతా ప్రహర్షారభటిన్=దేవతల సంతోషధ్వనులచే.

తా త్ప ర్య ము

దేవతలకు బ్రాహ్మణులకు పగవాఁడగు కుంభకర్ణుఁడు ఈవిధమున యుద్ధమందు చావఁగా భూచక్రము వడఁకెను. ఆకాశము దేవతల సంతోష ధ్వనులచే సంకులమయ్యెను.

ఉ. రామపరాక్రమంబునకు • రంజిలె దేవమహర్షి పన్నగ
స్తోమసురర్షి యక్షతతి • ద్యోచరభూతచయంబు లెల్ల, సం
గ్రామమునన్ సురాహితులు • రాక్షసు లా హరిఁ జూచినట్లు శ్రీ
రామునిఁ జూచి యేడిచిరి • రావణుచుట్టలు పేరెలుంగునన్. ౧౬౨౦

అర్థములు. సురాహితులు=దేవవిరోధులు, హరిన్=విష్ణువును.

తాత్పర్యము

రామచంద్రుని పరాక్రమముచూచి దేవతలు మహర్షులు పన్నగులు దేవర్షులు యక్షులు ఆకాశమునఁ దిరుగు ప్రాణిసమూహము లన్నియు సంతోషించెను. యుద్ధమందు దేవతావిరోధులు శ్రీవిష్ణువునుజూచి యేడ్చినట్లు రావణుని బంధువులు పెద్ద గొంతుతో శ్రీరామునిఁజూచి యేడ్చిరి. చుట్టములు చుట్టలని రెండు రూపములు గలవు.

తే. సైంహికేయవిముక్తభా•స్కరుఁడు దేవ,లోకతిమిరంబు జోపివె•లుంగుమాడ్కి
సంగరంబున ఘటకర్ణు•సంహరించి, రామచంద్రుఁడు వెలిఁగె మ•ర్కటులనడుమ.

అర్థములు. సైంహికేయ=సింహికాపుత్రుఁడైన రాహువుచే, విముక్త=విడువఁబడిన, భాస్కరుఁడు=సూర్యుఁడు, దేవలోకతిమిరంబు=స్వర్గమండలిచీఁకటి, జోపి=నాశముచేసి.

తాత్పర్యము

రాహువుచే విడువఁబడిన సూర్యుఁడు స్వర్గలోకమునఁ జీఁకటి పోఁగొట్టునట్లు యుద్ధమున కుంభకర్ణుని సంహరించి వానరుల నడుమ రామచంద్రమూర్తి వెలిఁగెను.

ఉ. భీమబలున్ దురాసదుని • భీషణకాయునిఁ గుంభకర్ణు దు
ర్దామబలంబునం దునుమ • దాశరథిం గపిసంఘ ముల్లస
త్తామరసాభవక్త్రమయి • తద్దయు హర్షమునన్ నుతింపఁగా
రాముఁడు వృత్రుఁ జంపిన సు•రప్రవరుం డన మోదముం గనెన్. ౧౬౨౧

అర్థములు. దురాసదుని = సమీపింపరాని వానిని, ఉల్లసత్ = సంతోషముచేఁ ప్రకాశించు, తామరసాభవక్త్రము=కమలముతో సమానమైన ముఖము.

తాత్పర్యము

భయంకర బలము గలవానిని, దగ్గఱకైనను బోవ సాధ్యపడనివానిని భయంకర దేహము గలవానిని గుంభకర్ణుని విస్తారబలముచే చంపిన రామచంద్రమూర్తిని జూచి సంతోషముచేఁ ప్రకాశించు ముఖకమలములు గలవారై కపులు మిగుల సంతోషముతో స్తోత్రముచేసిరి. రామచంద్రమూర్తియు వృత్రునిజంపిన యింద్రుని వలె సంతోషించెను.

—♦ ౬౮-వ సర్గము. హతశేషులు రావణునకుఁ గుంభకర్ణ మరణంబు దెలుపుట ♦—

కం. యోధాగ్రేసరుఁ డగు నీ, తాధవుచేఁ గుంభకర్ణ ♦ దనుజేంద్రుం డా
యోధనమునఁ జెల్లుట రక్షోధీశున కిట్లు చెప్పి ♦ రసువరేణ్యుల్. ౧౫౮౩

అర్థములు. యోధాగ్రేసరుఁడు = యుద్ధశూరులందు శ్రేష్ఠుఁడు, ఆయోధనమునన్ = యుద్ధమందు, చెల్లుట = చచ్చుట.

తాత్పర్యము స్పష్టము.

శా. దేవా! తావకసోదరుండు నిజవి ♦ ద్విట్పూగముం బోరిలో
భీవిద్రావిత మాచరించి శుచికిం ♦ బెన్నద్దియై మూర్త మెం
తే విఖ్యాతగతిం బెనంగి కపులన్ ♦ హింసించి యా జానకీ
దేవీవల్లభుచేత సంగరములోఁ ♦ దీటం బ్రశాంతార్చియై. ౧౫౮౪

అర్థములు. తావక సోదరుండు=నీతమ్ముఁడు, నిజ=తనయొక్క, విద్విట్ = విరోధుల, పూగమున్ = సమూహమును, భీవిద్రావిత = భయముచే పరువెత్తి దానిఁగా, శుచికిన్ = అగ్నిహోత్రునకు, పెన్నద్దియై = మిక్కిలి సమానమై మూర్తము = అల్పకాలము, ఎంతే = ఎంతేని = మిక్కిలి, విఖ్యాతగతిన్ = కీర్తికరముగ, ప్రశాంతార్చియై=చల్లఁబడిన జ్వాలలు కలవాఁడై,

తాత్పర్యము

దేవా! నీ తమ్ముఁడు కుంభకర్ణుఁడు తన విరోధుల గుంపులను యుద్ధములో పరువెత్తునట్లుచేసి యగ్నిహోత్రమువలె నల్పకాలము కీర్తికరముగ యుద్ధము చేసి వానరులఁ జంపి రామచంద్రమూర్తిచే యుద్ధమందు చల్లఁబడిన తేజస్సు గలవాఁడయ్యెను.

ఉ. కృత్తకళోరుబాహుఁ డయి ♦ కీర్తితశౌర్యుఁడు నేల నిండఁగా
నెత్తురు గాఱఁ గూలె రజ ♦ నీచరనాథ! తదర్ధదేహ మా
పత్తన మడ్డగించెఁ జుమి ♦ ద్వారమునం బడి, మొండె మంబుధిన్
హత్తిన జీవజంతువుల ♦ కంతముఁ గూర్చుచుఁ గూలె భీమమై. ౧౫౮౫

అర్థములు. కృత్త=నఱకఁబడిన, కళ, ఊరు, బాహుఁడు=కంఠముకాళ్లు చేతులు గలవాఁడై, తదర్ధ దేహము=వాని సగము దేహము, శిరస్సు.

తాత్పర్యము

నఱకఁబడిన చేతులు కాళ్లు తల గలవాఁడై కీర్తింపఁబడిన శౌర్యము గల కుంభకర్ణుఁడు భూమినిండ నెత్తురు గాఱుచుండఁగాఁ జచ్చెను. వానితలగవని వాకిట నడ్డముగాఁ బడియున్నది. మొండెము సముద్రములోని జీవజంతువుల నాశము చేయుచుఁ బడెను.

కం. నీ తమ్ముఁడు సీతావిభు, శాతాశుగపీడితుఁ డయి ♦ చటులానల ద
గ్ధాతతవసుంధరారుహ, భూతుండై మఱి లగండ ♦ భూతుం డయ్యెన్. ౧౫౮౬

అర్థములు. శాతాశుగ=వాఁడి బాణములచే, పీడితుఁడయి=బాధింపఁబడినవాఁడై, చటుల=జ్వాలలచే కదలుచున్న, అనల=అగ్నిచే, దగ్ధ = కాల్పఁబడిన, ఆతత=విస్తారమైన, వసుంధరారుహ భూతుండై = వృక్షమువంటివాఁడై, భూత మనఁగా సమానము, "భూతం న్యాయ్యే సమే ప్రాప్తే" యని నానా ॥ర॥ లగండ భూతుఁడు=ముద్దవలెనైనవాఁడు (౨) కొండ చిలువవలె నైనవాఁడు, అగండ భూతుఁడని పాఠాంతరము. అప్పుడు గుర్తింపరాని వాఁడని యర్థము.

తాత్పర్యము

నీ తమ్ముఁడు రామచంద్రుని వాఁడి బాణములచేఁ బీడితుఁడై యెగురుచున్న జ్వాలలుగల యగ్నిచేఁ గాలిన చెట్టువలెనై ముద్దగా నయ్యెను.

తే. అనుచు హతశేషు లాడిన • నసురభర్త, కుంభకర్ణుండు కలనిలోఁ•గూలుటవిని
తాళరానిభృశార్తిసం•తప్తుఁడగుచు, మూర్ఛయగ్గలముగఁ దన్ను•ముంపఁ బ్రదెళ్లె.

అర్థములు. హతశేషులు=చావఁగామిగిలినవారు, అగ్గలముగన్=అధికముగ.

తాత్పర్యము

అని చావఁగా మిగిలిన రాక్షసులు చెప్పినమాటలు యుద్ధమందుఁ గుంభకర్ణుఁడు చచ్చెనని విని రావణుఁడు సహింపరాని యధికదుఃఖముచే సంతప్తుఁడై గాఢముగ మూర్ఛపోయి నేలఁబడెను.

ఉ. అంతక సన్నిభుండు హతుఁ • డయ్యెఁ బితృవ్యుఁ డటన్న దుఃఖవృ
త్తాంతము నాలకించి పరి•తాపమునం ద్రిశిరోతికాయదే
వాంతకులున్ నరాంతకుఁడు • హా యని యేడ్చిరి విహ్వలాత్ములై
యెంతటి ధైర్యశాలి మఱి•యెంత బలాఢ్యుఁ డటంచు నెన్నుచున్. ౧౨౦౮

అర్థములు. అంతకసన్నిభుండు=యమునితో సమానుఁడు, పితృవ్యుఁడు=పినతండ్రి, విహ్వలాత్ములై = విరవిరఁబోవు మనస్సు గలవారై.

తాత్పర్యము

యమునితో సముఁడైన తమపినతండ్రి చచ్చెనని దుఃఖవార్తవిని త్రిశిరుఁడు, అతికాయుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు వికలమైన మనస్సులతో హాయని యెంతటి ధైర్యశాలి యెంత బలవంతుఁడు అని గుణములు వర్ణించుచు నేడ్చిరి.

తే. రామవిభుచేత ఘోరసం•గ్రామమునను, దమ సహోదరుఁ డీల్గిన • దారుణంపు
వార్త వినుకలిచేమహా•పార్శ్వుఁడడలె, హాయటంచును నేడ్చె మ•హోదరుఁడు.

అర్థములు. వినుకలిచే = వినుటచే.

తాత్పర్యము స్పష్టము.

తే. ఎట్టకేలకు నయ్యసు•రేశ్వరుండు, జాతచైతన్యుఁ డై, యను•జాతుఁ దలఁచి
తలఁచి యాతనిశౌర్యంబు•ధైర్యగరిమ, పరిపరివిధాల నేడిచెఁ • బనవి పనవి.

అర్థములు. జాతచైతన్యుఁడై =స్మృతిగలవాఁడై, అనుజాతున్ =తమ్ముని.

తా త్ప ర్య ము స్పష్టము.

**—♦ కుంభకర్ణు మరణంబునకు రావణుఁడు దుఃఖించుట ♦—**

సీ. హా! రిపుదర్పఘ్న ! ♦ హా వీరరత్నమా! హా, కుంభకర్ణ! మ♦హాబలాఢ్య!
దైవచోదితుఁడవై ♦ తరలితే తమ్ముఁడా!, యగ్రజు నను(బాసి♦యమునిపురికి
బంధువులయు నాదు♦బాధలఁ బాపక,చనునె నీ వాంటిగఁ ♦ జనఁగఁ దండ్రి !
యెవ్వనిప్రాపున♦నింద్రాదులకు నైన, వెఱవక యుందునో ♦ విపులశౌర్య !
తే. యట్టి నాదక్షిణభుజంబు♦హతిముగాఁగ, నింక నే నేమిసేయుదు♦హీనబలుఁడ
నైతిఁ బూర్వాపకారి స♦న్నమరవరులు, చూచి నవ్వరె నే నెందుఁ♦జొత్తునయ్య!

అర్థములు. దైవచోదితుఁడవై=విధిప్రేరితుఁడవై, తరలితే=పోయితివా?, దక్షిణభుజంబు = కుడిచేయి, పూర్వాపకారి = ముందు కీడుచేసిన నన్ను.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. హేలాగతి సురదానవ, జాలస్మయ మణఁచినట్టి ♦ చతురుండవు హా
కాలానలరుద్రాభుఁడ, వాలంబున నీవుఁ దెగితి♦వా రామునిచేన్. ౧౪౯-౨

అర్థములు. హేలాగతిన్=ఆటవలె, సుర = దేవతలయు, దానవ = దానవులయు, జాల=సమూహము యొక్క, స్మయము = గర్వము, కాలానల రుద్రాభుఁడవు=ప్రలయకాలమందలి యగ్నితోను రుద్రునితోను సముఁడవు, ఆలంబునన్ = యుద్ధమందు, నాలుగవ పాదంబున ప్లుతయతి, కాకుస్వరయతి.

తా త్ప ర్య ము

అనాయాసముగా దేవదానవసమూహముల గర్వ మణఁచిన సమర్థుఁడవు. ప్రలయకాలమందలి యగ్నితోను, రుద్రునితోను సమానుఁడవు. అట్టి నీవు యుద్ధంబున నొక్క రామునిచేఁ జచ్చితివా ?

ఉ. ఏమిది శంబసాధను న♦హీనమహాశని నిన్నుఁ దాఁకగా
నేమియు డయ్య వట్టి మహి♦మేడ్యుఁడ వౌర! మనుష్యమాత్రుఁడా
రామవిభుండు వైచిన శ♦రంబుల కోర్వఁగ లేక యాత్రిచే
భూమిని బెద్దనిద్దురను ♦ బొందితివే యిటు లున్న చిత్రముల్. ౧౪౯-౩

అర్థములు. ఏమిది = ఆశ్చర్యము, శంబసాధను = ఇంద్రుని, అహీనమహాశని=వేగాధిక్యముగల గొప్ప వజ్రాయుధము, డయ్యవు = గాసిపడవు, మహిమ+ఈడ్యుఁడవు = గొప్పతనముచే స్తోత్రము చేయఁబడఁదగినవాఁడవు.

తా త్ప ర్య ము

ఏమిది యాశ్చర్యము ! ఇంద్రుఁడు మహావేగముగా వైచిన వజ్రాయుధము నకుఁ గొంచెమైన బాధపడని నీవు సామాన్యమనుష్యుఁడైన రాముఁడు వేసిన బాణంబుల కోర్వలేక చచ్చితివా. ఔరా చిత్రము ?

కం. మునితతి వేల్పులగుంపులు, ననిలో నీ తెగుట గాంచి • యడలు విడిచిఁ లో
బెనఁగొను ముదమునఁ గలకల, మని నవ్వుచుఁ బ్రుబ్లుచున్న • యవి గగనమునన్

అర్థములు. అడలు = భయము.

తాత్పర్యము స్పష్టము.

కం. ధ్రువముగ నిదియే యద నని, ప్లవగులు నిస్తులితహర్ష • పరవశు లగుచున్
జవమున నెక్కెదు రీపురి, గవఁకుల వాకిండ్ల గోట • కడ నల్గడలన్. ౧౫-౧౭

అర్థములు. అదను = సమయము, నిస్తులిత = సమానములేని, హర్ష = సంతోషముచే, పరవశులగుచున్ = స్వాధీనము తప్పినవారై.

తాత్పర్యము

ఇది సత్యము. నీవు చచ్చుట మే మేచ్చుట విని యిదియే సమయ మని వానరులు సంతోషముచే దేహములు తెలియక శీఘ్రముగ నగరి గవఁకు వాకిండ్లను కోటల నల్గడలను ఎక్కెదురు.

ఉ. ఏటికి నాకు రాజ్య? మిఁక • నేటికి నీపురి? యేల సీత? నా
కేటికి జీవితంబు? రుచి • యించునె నా యనుజుండు లేనిచో?
సాటికి భ్రాతృహంత రఘు • చంద్రము నే వధియింప నేని ము
మ్మాటికిఁ జావె మేలు, కొఱ • మాలిన యీ బ్రతు కేల భూమిపై! ౧౮

అర్థములు. భ్రాతృహంతన్ = తమ్ముని జంపిన వానిని, కొఱమాలిన = ప్రయోజనము లేని.

తాత్పర్యము స్పష్టము.

కం. నాయనుజుఁ డుండుచోటికి, నే యరిగెద వాని విడిచి • యే నొక క్షణమేన్
గాయంబు నిలుప నోపను, నేయెడ నే నట్టివాని • నిలపైఁ గందున్. ౧౯

తాత్పర్యము స్పష్టము.

చ. హరిహయుఁ డెత్తిరాఁగ నిఁక • నాతని నెట్లు జయింప నేర్తు? నా
పరమతి యా విభీషణుని • వాక్య మదే ఫలియించి వచ్చెఁగా,
యరయక బుద్ధిమాలి మహి • తాత్ముని యాతనివాక్యమం దనా
దరమతి చేసితిన్, ఫలము • తప్పక తార్కొనె నేమి సేయుదున్. ౨౦

అర్థములు. ఎత్తిరాఁగన్ = దండెత్తిరాఁగా, మహితాత్ముని = గొప్ప మనస్సు గలవానియొక్క, తార్కొనెన్ = ప్రాప్తించెను.

తాత్పర్యము

ఇంద్రుఁడు నాపై దండెత్తివచ్చెనేని నేనిఁక నతని నెట్లు జయింపఁగలను. గొప్ప మనస్సుగల విభీషణుని వాక్యము ఫలియించి వచ్చెఁగదా. ఆలోచింపక బుద్ధి లేని వాఁడనై గొప్ప మనస్సుగల యతఁడు చెప్పినమాట నలక్ష్యపఱిచితిని. దాని ఫల మిపుడు ప్రాప్తించెను. ఏమి చేయఁగలను?

చ. అని మొనఁ గుంభకర్ణుఁడు ప్రహస్తుఁడు గూలినవార్తలన్ వినన్
మనమున నవ్విభీషణుని మాట లహో సరిదాఁకి వచ్చెగా
యని కడులజ్జ యయ్యెఁడు, మహాత్ముని ధర్మరతున్ నిరస్తుఁ జే
సినఘనపాపమే యిటులు చేసెడు, శోకము పేరఁ గోసెడున్. ౧౬౯

అర్థములు. అనిమొనన్ = యుద్ధభూమి మొదట, నిరస్త = వెడలఁగొట్టఁబడినవానిని.

తాత్పర్యము

యుద్ధముఖమున బ్రహస్తుఁడు కుంభకర్ణుఁడు చచ్చిన వార్త వినఁగా విభీషణుఁడు చెప్పినట్టులే జరిగెనుగదా యని సిగ్గగుచున్నది. ధర్మయుక్తమైన గొప్ప మనస్సుగల విభీషణుని వెడలఁగొట్టితిని. ఆ పాపమే యిట్లు చేయుచున్నది. శోకము పేరఁ గోయుచున్నది.

కం. అని యేడ్చుచు బలవించును, ననుజా! యనుఁ గుంభకర్ణుఁడా! యను నయమో
చనితా యను నిఁక నాగతి, ననుమా యను సోలు వ్రాలు నలదురుఁ జెడితిన్.

తాత్పర్యము స్పష్టము.

**—౭౦-వ సర్గము. త్రిశిరుండు రావణునకు దుఃఖశాంతి వాక్యంబులఁ దెలుపుట—**

చ. అని యిటు లేడ్చుచున్న యసురాధిపతిం ద్రిశిరుండు పల్కు నీ
యనుజుఁడు నీవు పల్కుగతి నట్టిఁడ, దైవముచేత నీల్గె, నీ
యనువు పరాక్రమాఢ్యులకు నందఱకున్ సహజంబ కాని న
జ్జనులు భవద్విధంబుగ భృశోకంబుగ నేడ్వరు తండ్రి యెయ్యెడన్. ౧౬౦౧

ఈప్రకార మేడ్చుచున్న రావణునిఁజూచి త్రిశిరుఁడను వాఁడిట్లనియె. తండ్రీ! నీవు చెప్పినట్లు నీ తమ్ముఁడంతటివాఁడే, నిజమే. అయినను దైవవశమున శత్రువులచేతఁ జచ్చెను. ఈ ప్రకారము పరాక్రమవంతులకు యుద్ధమందు మృతి స్వభావసిద్ధమే కావున దానికై బుద్ధిమంతులగువారు నీవలె గోలుగోలున నెవ్వరు నేడువరు.

ఉ. బేలవుపోలె నేడ్వఁ దగనే? భువనంబులు మూఁటినైన నీ
వాలమునన్ జయింపఁగ సమర్థుఁడ వౌదువు, నీకు లేవె స
త్యాలయదత్తసాయక శరాసనశక్తి తనుత్రముల్ పయో
దాళినినాద సన్నిభ సహస్రఖరేద్ధరథం బమోఘమై. ౧౬౦౨

అర్థములు. బేలవుపోలెన్ = మూఢునివలె, ఆలమునన్ = యుద్ధమందు, సత్యాలయ = బ్రహ్మచేత, దత్త = ఈయఁబడిన, సాయక = బాణములు, శరాసన = విల్లు, శక్తి = శక్తియను నాయుధము, తనుత్రముల్ = అభేద్య కవచము, పయోదాళి నినాద సన్నిభ = మేఘ సమూహము ధ్వనివంటి ధ్వనిగల, సహస్రఖరేద్ధ = వేయి కంచరగాడిదలు గట్టు రథము, అమోఘమై = వ్యర్థము గానిదై,

తా త్ప ర్య ము

నీమనివలె నిట్టు లేడ్వవచ్చునా! మూఁడులోకములనైనను నీవు యుద్ధమందు జయింపగల శక్తిగలవాఁడవు. నీకు బ్రహ్మదేవుఁడిచ్చిన బాణములు, విల్లు, శక్తి కవచము, మేఘధ్వని గలిగి వేయి కంచర గాడిదలు కట్టు రథము ఇవియన్నియు నమోఘములై యున్నవిగదా.

ఉ. కేవల రిక్తహస్తముల • గీటణఁగింపవె యెన్నిమార్లొ దే
వావళి దానవాళులఁ? సమస్తవరాయుధయుక్తి నేఁడి నీ
వా విభు బాహుశౌర్యమున • దండితుఁ జేయుము, యంతయేల యి
చ్ఛావిధి నిండ నీవు నిలు • సౌఖ్యముగాఁ బగ నేన తీర్చెదన్. ౧౬-౦౩

అర్థములు. కేవల రిక్తహస్తములు = బొత్తిగ నే యాయుధము లేని చేతులచే, గీటణఁగింపవె=చంపవే, సమస్త వరాయుధయుక్తిన్=అన్ని యాయుధములతోడ, ఇచ్ఛావిధిన్ = ఇష్టము వచ్చిన చొప్పున.

ఈయాయుధములతోడ నీకు నేమిపని, నీవు చేతియందాయుధ మనునది లేకయే యెన్నిమార్లో దేవదానవుల జయింపలేదా. అట్టివాఁడ విప్పుడు సమస్తాయుధములతో నేగి భుజబలముచే రామచంద్రుని దండింపుము. ఇంతయేల? దీనికి నీవు పోవలయునా? నీవు సుఖముగా నీయిష్టప్రకారమిందే యుండుము. నేను బగ దీర్చెదను.

మ. మహితవ్యాలకదంబకంబు గరుటా • మంతుండు వారించున
వ్వహి నీశత్రులఁ జించి చెండెద బల • ప్రత్యర్థి యా శంబరున్
విహగాధీశ్వరసైంధవుండు నరకున్ • భేదించిన ట్లేను దు
స్సహ శాతాశుగపంక్తి రామవిభునిన్ • సంహారముం జేసెదన్. ౧౬-౦౪

అర్థములు. మహితవ్యాల కదంబకంబున్=గొప్ప పాముల సమూహమును అవ్వహిన్=ఆవిధముగ, బలప్రత్యర్థి=ఇంద్రుఁడు, విహగాధీశ్వర సైంధవుండు = పక్షిరాజగు గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁడు, విష్ణువు దుస్సహ=సహింపరాని, శాతాశుగపంక్తిన్=వాఁడి బాణముల వరుసలచే.

తా త్ప ర్య ము

గొప్ప పాముల సమూహమును గరుత్మంతుండు నివారించునట్లు నీ శత్రులను జించి చెండాడెదను. శంబరుని నింద్రుఁడు నరకుని విష్ణువు భేదించినట్లు నేను సహింపరాని వాఁడి బాణముల వరుసచే రామచంద్రుని సంహరించెదను.

ఇందు శంబరుఁడు ఇంద్రునిచేఁ జంపఁబడిన వాఁడని చెప్పుటచే వీఁడు ప్రద్యుమ్నునిచేఁ జచ్చినవాఁడు కాఁడు. నరకుఁడను వాఁడు కృష్ణునిచేఁ జచ్చినవాఁడు

కాఁడు. విప్రచిత్తికి సింహికకుఁ బుట్టినవారిలో నొకఁడు 'వాతాపి ర్నముచిశ్చైవ ఇల్వల స్సృమర స్తథా, అంధకో నరకశ్చైవ కాలనాథ స్తథై వచ'. వి.పు.

కం. అను త్రిశిరునివచనంబుల, విని కాలప్రేరితుండు ♦ వింశతిభుజుఁ డా
త్మను దన్ను ధరఁ బునర్జా,తునిఁగా దలపోసి యలరి ♦ దుఃఖము మానెన్.

అర్థములు. కాలప్రేరితుండు = మృత్యువుచేఁ బ్రేరేపింపఁ బడినవాఁడు, పునర్జాతునిఁగా=మరలఁ బుట్టినవానినిగా, అలరి=సంతోషించి.

తాత్పర్యము

ఈ ప్రకారము త్రిశిరుఁడు చెప్పిన మాటలు విని మృత్యువుచేఁ బ్రేరింపఁబడిన వాఁడై రావణుఁడు తన్ను భూమిమీఁద మరలఁ బుట్టినవానిఁగా దలఁచుచు సంతోషపడి దుఃఖము మానెను.

తే. త్రిశిరువాక్యంబులను విని ♦ తెలిసికొని న,రాంతకుం డతికాయు దే ♦ వాంతకులును
రణసముత్సుకు లగుచు గ ♦ ర్జలను నించి, రహమహమికాప్రకారము ♦ లతిశయిల్ల.

అర్థములు. అహమహమికా = నేను ముందు నేను ముందు అను విధము.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అందఱు నింగిద్రిమ్మరులు ♦ నందఱు మాయలఁ బండితేంద్రు ల
య్యందఱు దేవదర్పవిని ♦ హంతలు నందఱు జన్యదుర్జయుల్
అందఱు శౌర్యధైర్యయుతు ♦ లందఱు విశ్రుతకీర్తిశాలు ల
య్యందఱు యుద్ధకేళి నప ♦ రాజితు లా దశకంఠనందనుల్. ౧౬౦౭

అర్థములు. నింగి ద్రిమ్మరులు = ఆకాశమున సంచరించువారు, జన్యదుర్జయుల్ = యుద్ధమునందు జయింపరానివారు, అపరాజితులు = ఓడిపోనివారు, వీరందఱు రావణు కుమారులు.

తాత్పర్యము

ఆ రావణుని కుమారు లందఱు నాకాశమునఁ దిరుగఁగలవారు. అందఱు మాయలయందుఁ బండితులు. అందఱు దేవతల గర్వ మణంచినవారు. అందఱు యుద్ధమున జయింపరానివారు. అందఱు శౌర్యము ధైర్యము గలవారు. అందఱు ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవారు. అందఱు యుద్ధమునందు పరాజయ మెఱుఁగనివారు.

చ. మాటికి మాటికిన్ భుజగ ♦ మండలిఁ దోలెడిచోట దేవతా
ఘాటము నేఁచుచోట నొక ♦ సారియు వారలు నోడి రన్న య
మ్మాటయు లేని వీరు లతి ♦ మానితబుద్ధులు యుద్ధదుర్మదుల్
సాటులు లేనిపండితులు ♦ లబ్ధవరుల్ దిననాథతేజులున్. ౧౬౦౮

అర్థములు. భుజగమండలిన్ = సర్పసమూహమును, దేవతాఘాటము = దేవతాసమూహము, ఏఁచు=బాధించు, లబ్ధవరుల్ = వరములు సంపాదించినవారు.

### తాత్పర్యము

పలుమాఱు సర్పములను దేవతాసమూహములను తెలియు వేళ బాధించెడి వేళ నొకసారియైనను నోడిరనిన మాటలేని వీరులు, మిగుల గౌరవింపఁబడిన బుద్ధులు గలవారు, యుద్ధమునందు పెద్ద గర్వము గలవారు, పాండిత్యమునం దసమానులు, వరములు సంపాదించినవారు, సూర్యప్రకాశము గలవారు.

## —• { దేవాంతక నరాంతకాతికాయత్రిశిరోమత్త యుద్ధోన్మత్తుల రావణుఁడు యుద్ధమునకుఁ బనుచుట. } •—

ఉ. వారలు గొల్వ దేవవృత • వాసవువట్లయి తేఁడు పుత్రులన్
గారవ మారఁ గుచ్చి బిగి • కౌఁగిట భూషణభూషి తాంగులం
బేరిమిఁ జేసి యందఱకుఁ • మేలిమి దీవన లిచ్చి పుచ్చె సీ
తారమణప్ల వంగమవి • తానముతో సమరంబొనర్పఁగన్. ౧౬-౯

అర్థములు. దేవవృత వాసవువట్లు = దేవతలచేఁ జుట్టఁబడిన యింద్రుని వలెఁ భూషణ భూషితాంగులన్ = ఆభరణములచే నలంకరింపబడినవారిని, సీతారమణ = రామునితోను, ప్లవంగమ వితానముతోన్ = వానరసమూహముతోను, సమరంబు = యుద్ధము.

### తాత్పర్యము

వారలు గొల్చుచుండఁగా దేవతలు చుట్టుకొన్న యింద్రునివలెనై రావణుఁడు కొడుకులను ప్రేమతోఁ గౌఁగిలించుకొని సొమ్ములచే నలంకరించి అందఱను దీవించి రామునితోను వానరులతోను యుద్ధము చేయఁ బంపెను.

కం. తనయులకుం బాసటయై, యొనరఁ జనించె ననికి మత్తుఁ • యుద్ధోన్మత్తున్
మనుజాశివరుల భ్రాతల, వినయంబున వారు ప్రొక్కి • విబుధ ద్వేషిన్. ౧౬-౧౦

అర్థములు. బాసట = సహాయులుగా, మనుజాశివర్యులన్ = రాక్షస శ్రేష్ఠులను.

### తాత్పర్యము స్పష్టము.

మత్తుఁడు యుద్ధోన్మత్తుఁ డనునవి మహోదర మహాపార్శ్వులకు పర్యాయ నామములు.

కం. సర్వౌషధులన్ గంధము, నార్వురు వేత్త్యేఱ పూసి • యంగంబుల దో
ర్గర్వాంధులు రణకాంక్షను, నిర్వక్రజవంబునన్ వ•నేచరతతిపై. ౧౬-౧౧

అర్థములు. సర్వౌషధులన్ = ఆయుధముల వలన దెబ్బ దగులకుండునట్లు చేసెడి మూలికలతోఁ జేయఁబడినవి. అవి దేహమునకుఁ బూసికొనిన కత్తితో నఱికినను గాయము గాదు. ఆర్వురు, త్రిశిరుఁడు, దేవాంతకుఁడు, నరాంతకుఁడు, అతికాయుఁడు మహోదర మహాపార్శ్వులు, దోర్గర్వాంధులు - భుజబల గర్వముచే

కన్నులు గాననివారు, వనేచర తతిపై = వానరసేన మీఁద, సర్వవిక్రమంబునన్ = పూర్ణ వేగంబున.

తా త్ప ర్య ము

సర్వౌషధులనైన గంధమును ఆర్వురు వేలువేలుగాఁ బూసికొని భుజబల గర్వముచేఁ గన్నులు గానక వానరుల మీఁదికి నతి వేగముగా.

"కోష్ఠం మాంసీహరి దేద్వే, మురాశైలేయ చందనం, త్వచా ముస్తక ముస్తాశ్చ సర్వౌషధ్యో దశేస్మృతాః" యని దీనికిఁ బ్రమాణము. మయూరశిఖ యందు నీ గుణము గలదని గ్రంథములం దున్నది.

సీ. వెడలి రా రాక్షసుల్ ♦ విధవశంబునఁ జేసి, దేవాంతకుండును ♦ త్రిశిరసుండు
 నతికాయుఁ డోలి న ♦ రాంతకుండును మహో, దరమహాపార్శ్వులు ♦ దరము లేక
 నీలజీమూతస ♦ న్నిభము నైరావత, వంశజం బైనట్టి ♦ వారణంబు
 కలిత సుదర్శనా ♦ ఖ్యము సమస్తాయుధో, పేతం బుపాసంగ ♦ జాతయుతము
తే. నస్తగిరిభానుఁడుండెడుకు♦ననువుదోఁప నెక్కెనుమహోదరుండు పే♦రుకుఁ మెఱయ
 నైలబిలుమాడ్కిఁగద కేల ♦ గ్రాలభీమ, కాయుఁడైనమహాపార్శ్వ ♦ ఖలుఁడు వెలిఁగె

అర్థములు. దరము = భయము, నీలజీమూతసన్నిభము = నల్లని మేఘముతో సమానము, ఐరావత వంశజంబు = ఐరావత వంశమునఁ బుట్టినది, వారణంబు=ఏనుఁగు, ఉపాసంగజాత=అమ్ముల పొదుల సమూహముతో, యుతము= కూడినది, ఐలబిలుమాడ్కి =కుబేరునివలె.

తా త్ప ర్య ము

దేవాంతకుఁడు త్రిశిరుఁడు అతికాయుఁడు నరాంతకుఁడు మహోదరుఁడు మహాపార్శ్వుఁడు, అను వారు భయములేక విధివశంబునఁ జేసి బయలుదేఱిరి. నల్లమబ్బుతో సమానమై ఐరావత వంశమునఁబుట్టి సుదర్శనమను పేరుగల సమస్తాయుధములతోఁ గూడినది, అమ్ములపొదులు గలది యగు నేనుఁగును మహోదరుఁడు సూర్యుఁ డస్తాద్రి యెక్కిన ట్లెక్కెను.

ఈ యుపమానము వీని వినాశమును సూచించుచున్నది. మహాపార్శ్వుఁ డనువాఁడు చేత గదతీసికొని కుబేరునివలెఁ బ్రకాశించెను.

శా. ఆజానేయ చయాంచితంబు వరశ ♦ స్త్రాస్త్రాన్వితమా తేరిపైఁ
 దేజం బార నవిద్యుదుల్కము సధా ♦ త్రీభృత్ప్రశేషావసం
 బా జీమూతముతోడి కూట మనఁగా ♦ నాభీలకోదండుఁడై
 యోజం దత్త్రిశిరుండు వెల్వడె రణో♦ద్యోగానురక్తాత్ముఁడై. ౧౬౧౩

అర్థములు. ఆజానేయ=ఉత్తమజాతి గుఱ్ఱముల, చయ = సమూహముచే, అంచితము=ఒప్పునది, ఆజానేయః కులీనాస్స్యుః, అని యమరము, వర=శ్రేష్ఠములైన, శస్త్రాస్త్రాన్వితము=శస్త్రములతోఁగూడినది, సవిద్యుత్+ఉల్కము = మెఱుపుతోడి

మేఘములోనుండి వెలువడు క్రొమ్మెఱుగువంటి కాంతిగలది, ఇది యనర్థమున సూచకము. ధాత్రీభృత్పర+ఇష్వాసము=కొండలకు విరోధి యగు నింద్ర ధనుస్సుతోఁగూడిన జీమూతముతోడ=మేఘముతోఁగూడిన. కూటము = శిఖరము, 'రణోద్యోగాను రక్తాత్ముఁడై'=రణకార్యమునం దనురాగము గల మనస్సుగలవాఁడై.

తా త్ప ర్య ము

ఉత్తమజాతి గుఱ్ఱములు గట్టినదియు నన్నివిధములైన యాయుధములతోఁ గూడినదియు నగు నేరిమీఁద మెఱుపుతోఁగూడిన మేఘముగల పర్వత శిఖరము వలె భయంకరమైన విల్లు గలవాఁడై రణమందలి యాసక్తిచేఁ ద్రిశిరుండు వెల్వడెను.

తే. మూఁడుబంగరుశిఖరముల్ • మొనసి వెల్గుమంచుఁగొండనాఁ ద్రిశిరా • మాచరుండు
మకుటములమూఁట రాణించు • మస్తకముల, వెలిఁగె స్యందనమున లోక • భీకరుండు.

అర్థములు. త్రిశిరామాచరుండు=రాక్షసుఁడు.

తా త్ప ర్య ము

మూఁడు బంగారు శిఖరములు గల మంచుఁగొండవలె మూఁడు కిరీటములు ధరించిన మూఁడుతలలతో నా రాక్షసుఁడు రథమునఁ బ్రకాశించెను.

సీ. సర్వధానుష్క-ప్ర • శస్తచారిత్రుండు, కాంచనమకుట స • మంచితుండు
కిరణభాసితమేరు • ధరణీధరం బనఁ, బురుగుక్మభూషణ • భూషితుండు
దృఢరథాంగాక్షంబు • భృశసుసంయుక్తంబు, స్వనుకర్షము,సకూబ • రాన్వితంబు
శరధిబాణాసన • సంప్రదీప్తంబును, ప్రాసాసిపరిఘాది • భాసితంబు

తే. నైనరథసత్తమంబునం • దసురభర్త్ర,నూనుఁడతికాయుఁడెక్కి-తన్ • సూనుఁడమరఁ
బలలభోజుల తుటుములు • బలసి కొలువ,నమరవృతవజ్రపాణియ • ట్లలరెఁ గయి.

అర్థములు. ధానుష్క=విల్లుపట్టెడి వారిలో. కాంచనమకుట = బంగారు కిరీటముచే, సమంచితుఁడు = ప్రకాశించువాఁడు, కిరణభాసిత = కిరణములచే ప్రకాశించు, మేరుధరణీధరంబు = మేరుపర్వతమువలె, పురురుక్మభూషణ భూషితుండు=గొప్ప బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినవాఁడు. దృఢరథాంగాక్షంబు=గట్టి చక్రములు బండికన్నులు గలది. భృశసుసంయుక్తంబు = మిక్కిలి చక్కఁగా సంధింపఁ బడినది, స్వనుకర్షము=సు + అనుకర్షము = చక్కనికోడి పీఁట గలదియు, నొకచివర భాగము భూమిమీఁద నానకయుండునట్లు ఎత్తుగా నొక కొనయుండు నంతన పఱచియుండు ప్రమాణితుండు కోడిపీఁటయనఁబడును. 'అనుకర్షో దార్వధస్థ' యని యమరము. సుకూబరాన్వితంబు=మంచి నొగలు గలది, శరధి= అంబుల పొదిచేతను, బాణాసన+విండ్లచేతను. సంప్రదీప్తంబును =మిగులఁ బ్రకాశించు నదియు, ప్రాస+అసి+పరిఘ+ఆది భాసితంబు = ఈఁటెలచేతను, కత్తుల చేతను, గుదియలచేతను ఈ మొదలయిన వానిచేతఁ బ్రకాశింపజేయఁ బడినది, రథ

సత్తమము=శ్రేష్ఠమైనతేరు, సూరెలంపు = ప్రక్కల, పలల భోజుల తుటుములు= రాక్షసుల గుంపులు, బలసి = చుట్టుకొని, అమరవృత = దేవతలచేఁ జుట్టుకొనఁ బడిన, వజ్రపాణి=ఇంద్రుఁడు.

### తాత్పర్యము

అందఱు విలుకాండ్రచేతఁ బొగడఁబడిన నడవడి గలవాఁడును బంగారు కిరీటము ధరించినవాఁడును,కిరణములచే ప్రకాశించు మేరుపర్వతమువలె విశేషముగ బంగారునగలచే నలంకరింపబడినవాఁడును, దృఢమైన చక్రములు బండికన్నులు గలిగి గట్టిగా జోడింపఁబడి చక్కని కోడి పీట నొగగలదై అమ్ముల పొదులు విండ్లు ఈఁటెలు కత్తులు ఇనుపగుదియలు లోనగు నాయుధములచేఁ బ్రకాశించుచుండు మేలి రథమెక్కిన రావణుకొడుకు అతికాయుఁడు రాక్షసులు తన ప్రక్కల సేవింప దేవతలతోఁగూడిన యింద్రునివలె నతిశయించెను.

కం. శ్వేతము కనకాభరణో, పేతం బుచ్చైశ్శ్రవంబు • పెన్నద్ది జవ
స్ఫీతం బురుకాయం బగు, పీతిపయి నరాంతకుండు • వెలుఁగుచునుండెన్. ౧౬౧౬

అర్థములు. శ్వేతము = తెల్లనిది, కనకాభరణోపేతము = బంగారు సొమ్ములతోఁగూడినది. ఉచ్చైశ్శ్రవంబు పెన్నద్ది = ఉచ్చైశ్శ్రవముతో సమానమైనది. జవస్ఫీతంబు=వేగముచేఁ బ్రకాశించునది, ఉరుకాయంబు=పెద్దదేహము గలది, పీతిపయి=గుఱ్ఱముమీఁద.

### తాత్పర్యము

తెల్లనిదై బంగారాభరణములుగలదై ఉచ్చైశ్శ్రవముతో సమానమైన మిగుల వేగము పెద్ద దేహము గలదైన గుఱ్ఱముపై నరాంతకుఁడు ప్రకాశించెను.

కం. మాసర మగుశక్తి కయిన్, భాసిల రహిమించు కేకి•వాహనుమాడ్కిన్
మీసరమగు నులాకృతి,ప్రాసంబును దాల్చి పొల్చె•రావణుసుతుడున్. ౧౬౧౭

అర్థములు. మాసరము=నిడుపాటిది, కేకివాహనుమాడ్కిన్ = కుమారస్వామివలె, మీసరము = శ్రేష్ఠమైన, ఉలాకృతిప్రాసంబును=ఉల్కతో సమానమైన యీఁటెను.

### తాత్పర్యము

కుమారస్వామి నిడుపాటి శక్తియను నాయుధమును ధరించినట్లు నరాంతకుఁడు శ్రేష్ఠమైన యుల్కవంటి యీఁటెను ధరించెను.

తే. వజ్రచయభూషితంబైన•పరిఘు మొంపు,హస్తమునఁబూనియొప్పె దే•వాంతకుండు
భూధరంబును నిరుగేలఁ•బూనినట్టి, యబ్ధిశయనుని నుల్లసం•భావుభంగి. ౧౬౧౮

అర్థములు. వజ్రచయ భూషితము = వజ్రసమూహముచే నలంకరింపఁబడినది, పరిఘము=ఇనుపకట్ల గుదియను, భూధరంబును = పర్వతంబును, ఇరుకేలన్=రెండు చేతుల, అబ్ధిశయనుని = సముద్ర మథనకాలమున విష్ణువును, ఉల్ల

నంబాడుభంగిన్ = పరిహాసించు వానివలె, పరిఘ మొకచేతితో నెత్తి కత్తివలెఁ గొట్ట సాధ్యపడునది కాదు. రెండు చేతుల నెత్తి కొట్టవలసి యుండును. కావున నీ యుపమానము, కాదేని విష్ణువు రెండు చేతుల నెత్తినంత దాని నేనొక చేతనే యెత్తితి నని పరిహాసించె ననియైనఁ జెప్పవచ్చును.

తాత్పర్యము

వజ్రసమూహములచే నలంకరింపఁబడిన యినుప గుదియఁ దీసికొని దేవాంతకుఁడు సముద్రమథనకాలమున రెండుచేతుల మందర మెత్తిన విష్ణువును బరిహాసించు వానివలె నుండెను.

తే. అమరు లమరావతిని వీడి ♦ సమరమునకుఁ, జనెడిభంగిని వెడలిరి ♦ సైన్యనిచయ
సంయుతంబుగ రథదంతి ♦ సైంధవములు నాయుధోపేతు లగు భటు ♦ లనుగమింప.

అర్థములు. అమరావతిని=ఇంద్రనగరమును.

తాత్పర్యము

దేవత లమరావతిని విడిచి యుద్ధమునకుఁ బోవునట్లు సైన్య సమూహముతో తేర్లు ఏనుఁగులు, గుఱ్ఱములు, ఆయుధములు ధరించిన కాలిబంట్లు తమ వెంట రాఁగా లంక విడిచిపోయిరి.

చ. మకుటమణీప్రభాళు లల ♦ మన్ దిశలన్ గ్రహరాజిఁ బోలుచున్
జకచకపర్వ కాంతులను ♦ సాంద్రము లౌ వరశస్త్రముల్ దివిన్
బ్రకటితశారదాంబుదని ♦ భం బగు నంచలపిండు సాటిగా
మకురునఁ జావొగెల్పొ యొక ♦ మాటయ నిశ్చయ మంచు నెంచుచున్. ౬౯-౨౦

అర్థములు. మకుటమణీ ప్రభాళులు = కిరీటరత్నకాంతులు, అలమన్ = ఆక్రమింపఁగా, ప్రకటిత=స్పష్టమైన, శారదాంబుద నిభంబు = శరత్కాల మేఘముతో సమానము. అంచలపిండు=హంసల సమూహము, మకురున=మూర్ఖతచే, చావొగెల్పొ=చావనైనఁ జావవలె, గెలువనైన గెలువవలె నని - గెలువనైన గెలువవలెఁ జావనైనఁ జావవలె నని వారి నోరరాక చావే ముందు వచ్చెను.

తాత్పర్యము

కిరీటరత్న కాంతులు దిక్కులందు వ్యాపింపఁగా గ్రహసమూహములఁ బోలి కాంతులు దట్టముగా వ్యాపించిన యాయుధములు శరత్కాల మేఘముతో సమానమైన హంసల సమూహముతో సమానమై చావనైనఁజావవలె గెలువనైన గెలువవలె నిది నిశ్చయమని మూర్ఖతచేఁ దలంచుచు.

కం. ఔొప్పుచు వైరులబలముం, దెప్పుచు నార్భటు లెసంగఁ ♦ దీవ్రాయుధముల్
ద్రిప్పుచు గర్వము కన్నుల, గప్పఁగ వెల్వడిరి యుద్ధ ♦ కాంక్ష దలిర్పన్. ౬౯-౨౧

అర్థములు. ఔొప్పుచున్=హుంకరించుచు, దెప్పుచున్=ఆక్షేపించుచు.

తాత్పర్యము స్పష్టము

కం. వారల క్ష్వేళారవముల, వారి భుజాస్ఫాలనముల ♦ వారిపదదభ
కారంబుల గడ గడ మని, ధారిణి వడఁకాడెఁబగిలెఁ♦దారాపథమున్. ॥ ౨౨

అర్థములు. క్ష్వేళారవములన్ = సింహనాదములచే, భుజాస్ఫాలనములన్ = రెట్టలు తట్టుకొనుటచే, పదదభకారంబులన్ = కాళ్ళుదభదభ యని పెట్టుటచే, తారాపథమున్ = ఆకాశమును.

తాత్పర్యము

వారి సింహనాదములు వారిరెట్టలు తట్టుకొనుటలు వారిపాద ఘట్టనలు ఆకాశమును పగులఁజేసెను. భూమిని వణఁకఁజేసెను.

ఉ. ఈగతి నిష్క్రమించి యసు♦రేంద్రు లతంద్రత నుద్యతోరువృ
క్షాగము యుద్ధకాంక్షము మ ♦ హాప్లవగేంద్ర బలంబుఁ గన్గొనన్
నాగరథాశ్వసంకుల ఘ ♦ ణంఘణనాదితచారుకింకిణీ
పూగము యాతుధానబల ♦ ముం దిలకించిరి వానరేంద్రులున్. ॥ ౨౩

అర్థములు. నిష్క్రమించి = వెడలి, అతంద్రతన్ = హెచ్చరికతో, ఉద్యతోరువృక్షాగము = ఎత్తఁబడిన చెట్లు, కొండలుగలది; యుద్ధకాంక్షము = యుద్ధమున కెదురు చూచునది యగు, మహాప్లవగేంద్రబలంబు = గొప్ప సుగ్రీవుని సేనను, నాగరథ అశ్వసంకుల = ఏనుఁగులతో తేర్లతో గుఱ్ఱములతో కలిసినది, కింకిణీ = చిఱుగజ్జెల, పూగము = సమూహము గలది, యాతుధానబలమున్ = రాక్షససేనను, తిలకించిరి = చూచిరి.

తాత్పర్యము

ఇట్లు వెలువడి యా రాక్షసులు హెచ్చరిక గలవారై యుద్ధమున కెదురు చూచుచు నానిమిత్తమై కొండలు చెట్లు చేతఁదీసికొని యున్న వానరసేనను జూచిరి. వానరులును ఏనుగులు రథములు గుఱ్ఱములుగలదియు గణగణ ధ్వనిగల గజ్జెల సమూహముగలదియు నగు రాక్షస సైన్యముఁ జూచిరి.

## —♦ వానర రాక్షససేనల యుద్ధము ♦—

తే. అసితజీమూతనిభము దీ♦ప్తానలార్క, తుల్యము సముద్యతాయుధ♦స్తోమ మగుచు
నైఋతర్షభ వృతముసై♦న్యంబుఁజూచి, యార్భటులు నించిరగచరు♦లగము లెత్తి.

అర్థములు. అసిత జీమూత నిభము = నల్లని మేఘముతో సమానము, దీప్తానలార్కతుల్యము = ప్రకాశించు వహ్ని సూర్యులతో సమానమైనది, సముద్యతాయుధస్తోమము = ఎత్తఁబడిన యుద్ధసాధనముల సమూహము గలది, నైఋతర్షభవృతము = రాక్షసశ్రేష్ఠులచే వ్యాపింపఁబడినది. అర్భటులు = సింహనాదములు, అగములు = పర్వతములు.

తాత్పర్యము

నల్లని మబ్బుతో వెలుఁగుచున్న యగ్ని, యగ్ని సూర్యులతో సమానమై

యెత్తఁబడిన యాయుధము గల రాక్షససేనను జూచి వానరులు కొండలు చెట్లెత్తుకొని కేకలు వేసిరి.

ఉ. ఈసున శత్రుసేవల యహీనసముద్ధతి సైఁప లేక పెన్
రోసముతోడ రాక్షసులు రోదసి వ్రీలఁ బ్రతిధ్వనుల్ మదో
ద్భాసితచిత్తులై కొలుప వానరులున్ నగశృంగహస్తులై
త్రాసవిహీనులై తెగి పరధ్వజినిం జొరఁబాఱి యుగ్రులై. ౧౬. ౨౫

అర్థములు. ఈసునన్ = కోపముచే, అహీనసముద్ధతిన్ = అధికగర్వమును, రోదసి=అంతరాళము, భూమికి నాకాశమునకు నడిమి ప్రదేశము. మదోద్భాసితచిత్తులై = గర్వముచే నొప్పు మనస్సు గలవారై, త్రాసవిహీనులై = భయము లేనివారై, తెగి=తెగించి, పరధ్వజినిన్=శత్రుసేనను.

తాత్పర్యము

కోపముతో వైరుల యధికగర్వమును సహింపలేనివారై రోసముతో రాక్షసులు అంతరాళము పగిలిపోవునట్లు గర్వముచే బ్రతిధ్వనులు చేయఁగా వానరులును పర్వతశృంగము లెత్తికొనిన వారై కుంభకర్ణసముద్రమునే రామానుగ్రహమున దాఁటితిమఁట, ఈ చిఱుకాల్వ లేమి లెక్కయని భయము విడిచిన వారై తెగించి శత్రుసేనలో దూఱిరి.

ఉ. కొండలు మింట నేల మఱికొండలు కొండలు వృక్షహస్తులై
కొండలు శైలపాణు లయి కో యని యార్చుచు భూమిభృచ్ఛిలా
బృందము వర్షముం గురిసి పెంపు రహింపఁగ నంటఁ దాఁక నా
స్పందన మెంతయుం బొలిచె సర్వదిదృక్షుభయప్రదాయి యై. ౧౬. ౨౬

అర్థములు. భూమిభృత్ + శిలాబృందము = కొండఱాల సమూహము, ఆస్పందనము=యుద్ధము, సర్వదిదృక్షుభయ ప్రదాయియై=చూచువారికందఱకు భయము గలిగించునదియై.

తాత్పర్యము

కొండ లాకాశమందుఁ గొండలు నేలమీఁద గొండలు చెట్లను గొండలు గుట్టలను చేతియందుఁ గలవారై కోయని యఱచుచు కొండల ఱాలవాన గురిపించి తమ మహత్త్వమేర్పడునట్లు నెదురొ్కనఁగా చూచువారి కందఱకు భయము గలిగించు నదియై యుద్ధ మొప్పెను.

ఉ. దానికి నోహటింపక బుధప్రతిపక్షులు శాతబాణసం
తాన మవారిగాఁ గురిసి తాఁకెడివారల నిల్వరింపఁగా
వానరు లీడఁబోక జలవాహరవోపమగర్జులై జయా
ధీనమనస్కులై పరులఁ దీర్చిరి పేర్చిరి బాహుసంపదన్. ౨౬. ౨౭

అర్థములు. ఓహటింపక = వెనుదీయక, బుధప్రతిపక్షులు = రాక్షసులు 'బుధ స్సూరా సురే సౌమ్యే' యని నానా॥ర. శాతబాణ సంతానము=పదునైన బాణముల సమూహము, అవారిగా = దండిగా, ఉడుగఁబోక = వెనుకదీయక, జలవాహ = మేఘములయొక్క, రవోపమ గర్జులై = ధ్వనితో సమానమైన ధ్వని గలవారై, జయాధీనమనస్కులై =గెలుపునకు స్వాధీనపడిన మనస్కులై, చావో గెలుపో యనునది రాక్షసుల భావవిధము, గెలుపే యనునది వానరుల భావవిధము పరులన్=శత్రువులను, తీర్చిరి=చంపిరి.

తా త్ప ర్య ము

దానికి రాక్షసులు వెనుదీయక పదునైన బాణముల సమూహములను దండిగాఁ గురియించి తమపై వచ్చు వానరుల నిలుపఁగా వానరులును వెనుకంజ పెట్టక మేఘము లుఱిమినట్లు గర్జించుచు జయము పొంద గల మనస్సు గలవారై శత్రువుల వధించి భుజపరాక్రమముచే విజృంభించిరి

ఉ. నిర్భయవృత్తిఁ గేరి ధ్వజినీయుగళంబు పరాక్రమించి కం
ఠార్భటు లుల్లసిల్లఁ దెగి యాహవకేళుల నోల లాడుచో
నిర్భరదోర్బలంబున వనేచరులున్ నిజబాహునీరదా
విర్భవశైలశృంగకుజవృష్టిని ముంచుచుఁ దెంపుపెంపునన్. ౬౯_౨౭

అర్థములు. నిర్భయవృత్తిన్=భయములేని వ్యాపారముచే, కేరి=విజృంభించి, ధ్వజినీయుగళంబు = రెండు సేనలు, కంఠార్భటులు=కంఠధ్వనులు, ఆహవకేళులన్ = యుద్ధక్రీడల, నిర్భర = అధికమైన, దోర్బలంబునన్ = భుజబలముచే, నిజబాహునీరద = తమ చేతులనెడి మేఘములనుండి, ఆవిర్భవ = పుట్టిన, శైలశృంగ=పర్వతశిఖరములు, కుజ=చెట్లనెడి, వృష్టిని=వర్షముచే.

తా త్ప ర్య ము

దిగులు లేక విజృంభించి రెండుసేనలు పరాక్రమించి కంఠధ్వను లధికముగాఁగా తెగఁబడి యుద్ధక్రీడలఁ దేలాడునపుడు అధికమైన భుజబలముచే వానరులు తమచేతులనెడి మేఘములనుండి కొండశిఖరములు, చెట్లనెడి వర్షము గురియించి ముంచుచు నధిక సాహసమున.

మ. ద్విరదస్యందనసైంధవంబులపయిం దేదీప్యమానాంగు లా
భరణాళీలసితాంగు లా దనుజులం బైదూఁకి వే ఁగ్రుద్దినన్
గిరులన్ మొత్తిన గ్రుళ్లు పెల్లగిలఁగా గీయంచుఁ గూపెట్టుచున్
ధరణిం బ్రాఁకుచు నేల దొర్లుచును దైత్యవ్యూహముల్ సీల్గినన్. ౬౯_౨౮

అర్థములు. ద్విరద=రెండు దంతములు గలవి ద్విరదములు, ఏనుఁగుల మీఁదను, స్యందన=తేర్లమీఁదను, సైంధవంబులపయిన్ = గుఱ్ఱముల మీఁదను, దేదీప్యమానాంగులు = ప్రకాశించు దేహములు గలవారలు, ఆభరణాళీలసితాం

గులు = భూషణములచేఁ బ్రకాశించు నవయవములు గలవారు, నీల్గగన్ = చావఁగా.

తాత్పర్యము

ఏనుఁగుల మీఁదను తేరుల మీఁదను గుఱ్ఱముల మీఁదను ఆభరణముల ధరించిన దేహములతోఁ బ్రకాశించు రాక్షసుల మీఁద దూఁకి గ్రుద్దఁగా కొండలచే మొత్తగా గ్రుడ్లు పెల్లగించుకొని రాఁగా నేయని కూతలు పెట్టుచు నేల మీఁదఁ బొరలాఁడుచు దొర్లుచు రాక్షసులు చావఁగా.

ఉ. చేయఁగలట్టి రాక్షసులు • శీఘ్రము ముద్గరశూలఖడ్గకా
 క్షేయకశక్తి సంఘములఁ • జిమ్ముచు నెమ్ములు ప్రీల గ్రుచ్చుచున్
 గాయములందు నెత్తురులు • గ్రమ్మఁగఁ గ్రుమ్ముచు గెల్వఁ గోరి నా
 నాయుధసాధనంబుల వ • నాటులపోటణఁగించి రుగ్రులై. ౧౬-౩౦

అర్థములు. ఎమ్ములు=ఎముకలు, ప్రీలన్=విఱుగునట్లు, నానా = అనేక విధములైన, ఆయుధసాధనంబులన్ = ఉక్కు ఆయుధములచే, వనాటుల పోటు= వానరుల దెబ్బ.

తాత్పర్యము

సామర్థ్యముగల రాక్షసులు త్వరగా రోకండ్ల వంటి యినుప గుదియలను, శూలములను, బాకులను, పెద్దకత్తులను, శక్తిసంఘములను విసరుచు ఎముకలు విఱుగఁ గ్రుచ్చుచు దేహములందు నెత్తురు గ్రమ్మునట్లు పొడుచుచు జయము గోరినవారై నానావిధములైన యుక్కుటాయుధములచే వానరులవిజృంభణ మణఁగించిరి.

కం. ఇరువాఁ గీగతి బెడిదపు,టురవడిఁ బోరఁగ నొకముహూర్తములో నె
 త్తురు వఱదలుగాఁ బాఱఁగ, ధర కుంకుమ పఱచినట్టిదశ వహియించెన్.

అర్థములు. ఇరువాఁగు = రెండుపక్షములవారు, బెడిదము+ఉరవడిన్= భయంకరమైన వేగమున.

తాత్పర్యము

రెండుపక్షములవా రీ విధముగ నతివేగముగ యుద్ధము చేయఁగ నొక ముహూర్తములో నెత్తురు వఱదలుగాఁ బాఱగా భూమికుంకుమము పఱచినట్లయ్యెను

ఉ. వానరు లాక్రమించి పడ • వైచి ధరిత్రిని వెన్ను సోఁక వ
 త్తానఁ బడంబు లూఁది కర • సాధనముల్ వడి లాగి వైచినన్
 దానవపుంగవాంఘ్రిలను • డా రొగి నోపినయంతఁ బోరుచున్
 మానముమీఁద దృష్టి నిడి • మర్కటులన్ సొలయించి రుద్ధతిన్. ౧౬-౩౧

తాత్పర్యము

వానరులు పై పడి వీఁపులు నేల దగులునట్లు పడవైచి ఱొమ్మును గోళ్ళతో ద్రొక్కి చేతి యాయుధములను నీడ్చి పాఱవైవఁగా రాక్షసులును మానముమీఁద

దృష్టి యుంచినవారై కాళ్ళఁ జేతుల సాధ్యమైనంతవఱకు వానరులను గొట్టి మూర్ఛపోవఁ జేసిరి.

చ. ఫలపలభోజనుల్ సమర ♦ పాటవముల్ పచరించి పోరుచోఁ
జలమునఁ జెంతఁ బోరు సుర ♦ శాత్రవుకాళ్ళు గ్రహించి త్రిప్పఁ దన్
మలికిత మింత లేక తన ♦ మారుతుఁ గీశుఁడు గొట్టఁబోవ నా
ఖలుఁడును నొంకుక్రోఁతిఁ గడ ♦ కాళ్ళను బట్టి విరోధ వైచెడిన్. ౧౬౩౩

అర్థములు. ఫల = పండ్లను, పల = మాంసమును, భోజనుల్ = తిను వారు, ఫలభోజనులు = వానరులు, పలభోజనులు = రాక్షసులు, సమరపాటవముల్ = యుద్ధము నందలి నేర్పులు, పచరించి = ప్రచురించి, మలికితము = సందేహము, మారుతున్=పగవాని, గొట్టఁబోవన్=కొట్టఁబోఁగా.

తాత్పర్యము

వానరులు రాక్షసులు యుద్ధమునందలి తమ తమ నేర్పులు ప్రకాశము లగునట్లు యుద్ధము చేయు సమయంబున చలమునఁ దన సమీపమున నున్న రాక్షసుని కాళ్ళుపట్టుకొనిగిరగిర త్రిప్పి వానితోఁ దనతో యుద్ధము చేయురాక్షసుని కొట్టఁబోఁగా నా దుష్టరాక్షసుఁడును వేఱొక క్రోఁతి కాళ్ళుపట్టుకొని వానరునిపై వైచెను.

కం. వానరులు వేయుశిలలన్, దానవులును నసురు లేయు ♦ దారుణశరసం
తానంబుల వానరులును, మానక వారించు చాజి♦మలసిరి కడిమిన్. ౧౬౩౪

అర్థములు. దారుణ = భయంకరములైన, శరసంతానంబులన్ = బాణ సమూహములచే, ఆజిన్=యుద్ధమందు, మలసిరి=సంచరించిరి.

తాత్పర్యము స్పష్టము.

తే. కొండమనుకుల యేటులఁ గూలిపుడమిఁ, బడినసోఁకుల మూఁకలు♦దొడిగియున్న
బొందళంబుల పగిలిన♦సందులందు, రక్తము స్రవించె ద్రుమములు♦రసమునట్లు.

అర్థములు. కొండ మనుకులు=వానరులు, బొందళంబులన్ = కవచముల యొక్క, ద్రుమముల రసము నట్లు=చెట్లనుండి నీరుగాఱునట్లు.

తాత్పర్యము

వానరుల దెబ్బలకు నేలఁబడిన రాక్షసుల మూఁకలు దొడిగికొని యుండిన కవచములు పగులఁగా వాని సందుల నుండి చెట్లలో నుండి కాఱు నీరువలె రక్తముగాఱెను.

కం. సింధురముల దంతులచే, సైంధవముల హరులచేత ♦ క్ష్మాధరపాళీ
బాంధవరథముల రథములు, బంధురబలులైన ప్లవగ ♦ పతులణఁగింపన్.

అర్థములు. సింధురములన్=ఏనుఁగులను, సైంధవములన్ = గుఱ్ఱములను హరులచే=గుఱ్ఱములచేత, క్ష్మాధరపాళీ బాంధవరథములన్ = కొండలకు చుట్టములైన రథములచే.

## తా త్ప ర్య ము

ఏనుఁగులచేఁ గొట్టి యేనుఁగులను, గుఱ్ఱములచేఁ గొట్టి గుఱ్ఱములను, కొండల వంటి రథములచే రథములను గొట్టి విస్తార బలము గల వానరులు రాక్షసుల బింక మణఁపగా.

చ. తతబహుశాఖ మైన వసు♦ధారుహసంతతిఁ బూని రాక్షస
ప్రతతుల నొంప వానరులు ♦ రాక్షసులున్ విశిఖక్షురప్రభ
ల్లతతులఁ జెట్టులం బ్లవగు♦లన్ వధియింప సముత్సుకాత్ము లై
క్షితిధరచారు లుగ్రగతిఁ ♦ జెండిరి తద్వివిధాస్త్రధారులన్. ౧౬౩

అర్థములు. తతబహు శాఖము=వ్యాపించిన పెక్కు కొమ్మలుగల, వసుధారుహసంతతిన్ = చెట్ల సమూహమును, ప్రతతులన్=సమూహమును, విశిఖ= నేజాలయు, క్షురప్ర = అర్ధచంద్రబాణము, 'అర్ధచంద్రః క్షురప్ర స్స్యాత్' అని హలాయుధుఁడు, భల్ల = బల్లెములయు, తతులన్ = సమూహములచే, క్షితిధర చారులు=వానరులు, తత్ + వివిధాస్త్రధారులన్ = ఆ నానావిధములైన యా యుధముల ధరించిన వారిని.

## తా త్ప ర్య ము

పెక్కు కొమ్మలు గల చెట్లను బూని వానరులు రాక్షసులను బాధింపఁగా రాక్షసులు నేజాలచేతను అర్ధచంద్రబాణములచేతను బల్లెములచేతను చెట్లను వఱికి వానరులఁజంపఁగా నుత్సాహము గలవారై వానరులు ఆనానాశస్త్రములు ధరించిన వారిని చీల్చివైచిరి.

కం. వెండియు శాఖామృగ వే♦తండంబులు సమరభూమిఁ ♦ దలఁగఁగ నెటు రా
కుండఁగ జేసిరి దివిజులు, కొండాడఁగఁ బూర్వదేవ♦కుణపంబులచేన్.

అర్థములు. శాఖామృగవేతండంబులు=వానరశ్రేష్ఠులు, కొండాడఁగన్= స్తోత్రము చేయఁగా, పూర్వదేవ కుణపంబులచేన్=రాక్షస శవములచే, దేవతలకు బూర్వులు కావున రాక్షసులు పూర్వదేవతలు.

## తా త్ప ర్య ము

వానరశ్రేష్ఠులు యుద్ధభూమియం దిటునటు తిరుగ సాధ్యపడనట్లు దేవతలు స్తోత్రము చేయునట్లు రాక్షస శవములచే నేల నిండించిరి.

### —♦ నరాంతకుఁడు కపులఁ దునుమాడుట ♦—

సీ. అంత నరాంతకుం ♦ డంతకాకారుఁడై, బంధురజవనాఢ్య♦గంధవాహ
బాంధవసైంధవం ♦ బారోహణము సేసి, శక్తిధరుం డయి ♦ శక్రశరాట
సైన్యంబు మీనంబు ♦ జలనిధి జొచ్చిన వడువునఁ జొచ్చి పెం♦పున్నాఁచమునను
శాఖామృగంబుల ♦ సప్తశతంబుల, నొక్కక్షణంబున ♦ నుక్కడంచె

తే. నెందుఁజూచిన దానయై♦యేపు మీఱి,యిచ్ఛవిహరించునయ్యసు♦రేంద్రసుతుని
మార్గమంతయు శోణిత♦మాంసకర్దమితము వానరశవచయా♦వృతము నయ్యె.

అర్థములు. అంతకాకారుఁడై = యమునివంటి యాకారము గలవాఁడై బంధురజవనాఢ్య=అధిక వేగసంపత్తి గలదియు, గంధవాహ బాంధవము=గాలికిఁ జుట్టమైనదియు, వేగమునందు వాయువుతో సమానమైనదియు, సైంధవమును= గుఱ్ఱమును, ఆరోహణముచేసి = ఎక్కి, శక్తిధరుఁడయి = శక్తియను నాయుధము ధరించినవాఁ డయి, క్ష్మాధరాట = వానరుల, పెన్ప్రాసమునను = పెద్ద యీఁటెచే, మీఁద శక్తిధరుఁ డని చెప్పి, యిప్పుడుఁ బ్రాసముతో యుద్ధము చేసినట్లు చెప్పుటచే, శక్తిప్రాసములు సమానాకారము లగుట పర్యాయముగ ప్రయోగింపఁబడెను. సప్తశతంబులన్=ఏడునూర్ల, ఉక్కడంచెన్ = బలహీనులఁ జేసెను. చంపెను, శోణిత మాంసకర్దమితము = నెత్తురు మాంసముచే బురదగాఁ జేయఁబడినది, కర్దమితము=తారకాదిగణములోఁ జేరినది.

## తాత్పర్యము

అప్పుడు నరాంతకుఁడు యముని యాకారమువంటి యాకారము గలవాఁడై మిగుల వేగము గలదై, వాయువునకు సమానమైన, గుఱ్ఱము నెక్కి శక్తిని ధరించి వానరసేనయందు సముద్రములోఁ జేఁపజొచ్చినట్లు చొచ్చి పెద్దయీఁటెచేఁ నేడు నూర్ల వానరులను క్షణములోఁ జంపెను. ఎక్కడజూచిన తానేయై యిష్టము వచ్చినట్లు తిరుగుచు నారావణకుమారుఁడుత్రోవయంతయు నెత్తురు మాంసముతో బురద యగునట్లు వానరుల పీనుఁగులతో కప్పబడునట్లు చేసెను.

సీ. తలపడ నెవ్వండు ♦ తలఁచెడు నంతలోఁ, దల పడు నేల న♦బ్బలిముఖునకు
వృక్షంబు శైలంబు ♦ నెత్తెడు నంతలోఁ, దరుచరు మే నిలఁ ♦ బొరలు చుండు
లాఘవంబున మీఁద ♦ లంఘించునంతలో, నూర్ధ్వ కాయంబొండ♦యొద్దఁబడును
దృష్టిని దనవంకఁ ♦ద్రిప్పెడునంతలోఁ, గాలునిదృష్టికిఁ ♦ బాలుపడును

తే. మర్కటుం డెవ్వఁడే; నిట్లు♦మాఱు లేక, ప్రాసకరుఁడయి శాత్రవ♦త్రాసకరుఁడు
నగుచుశుష్కాటవిదహించు♦హవ్యవాహు,భంగిఁగ్రోఁతులసేనల♦పటిమఁజెఱిచె.

అర్థములు. శుష్కాటవి = ఎండిన యడవి, హవ్యవాహు భంగిన్ =అగ్ని వలె, పటిమ=దార్ఢ్యము.

## తాత్పర్యము

ఎవ్వఁడు వాని నెదిరింపఁదలఁచునో యా వానరుని తల యపుడే నేలఁబడి యుండును. చెట్టో గుట్టో తనమీఁద వేయుటకు నెత్తినంతలో వాని దేహము నేలఁ బొరలుచుండును. తనమీఁద నెవ్వఁడైన దుముక యత్నించెనా వాని దేహము యొక్క పైభాగముమాత్రమే వానియొద్దఁబడును. తన్నుఁజూచుటకై తలత్రిప్పెనా యంతలో నతఁడు యముని చూడఁబోయి యుండును. ఈ విధముగ నెదురులేక

నరాంతకుఁడు ఈఁటెచేత విరోధులకు భయంకరుఁడై యెండిన యడవిని గాల్చు నగ్నివలె క్రోఁతుల సేనల బలము నాశము చేసెను.

తే. వానకారున నాలుగు•వంకలందు, విసరి విసరియుఁ బెనుగాలి • వీచునట్లు
దివిజశాత్రవపుత్రనయుండు • తిరిగి తిరిగి, నన్నివంకలఁ గీశుల • హతులఁ జేసె.

తాత్పర్యము స్పష్టము.

చ. నిలువఁగ లేరు, పర్వీడఁగ • నేరరు, నిట్టులు లైన భీతిచే
దలఁగఁగ లేరు, వానరులు • తద్దురవస్థ నరాంతకుం డనిన్
నిలిచినవారలన్ నెగసి • నింగిని బ్రాఁకెడువారిఁ బాఱువా
రల బలదర్ప మేర్పడ న•రాతులఁ ద్రుంచె నొకింతమాత్రలోన్. ౧౬౪౨

అర్థములు. నింగిని=ఆకాశమును, అరాతులన్=విరోధులను.

తాత్పర్యము స్పష్టము.

కం. పిడుగులు పడియెడి వడువునఁ, బడుప్రాసపు టేట్ల నోరు•వం జాలక పె
ల్లడలున మల్లద్రిమ్మరు లయ్యెడ నాక్రోశించి రొక్క•యెలుఁగున భీతిన్.

అర్థములు. వడువునన్ = విధముగా, ప్రాసము+ఏట్లు=ప్రాసపు+ఏట్లు=ప్రాసపుటేట్లు, అడలున = భయముచే, మల్లద్రిమ్మరులు = కొండలందుఁ దిరుగువారు = వానరులు.

తాత్పర్యము

పిడుగులు పడినట్లు పడు ప్రాసము దెబ్బలకు సహింపలేక భయపడి వానరులా సమయమం దొక్కసారిగ యొక్క గొంతుగ దుఃఖించిరి.

## —• అంగద నరాంతకుల యుద్ధము •—

సీ. దంభోళిధారలఁ గుంభినీధరములు, వ్రీలు నవ్వడువున • వృక్షచరులు
గూలుట గనుఁగొని • కుంభకర్ణునిచేతి, బఱపు వీక్షించిన • ప్లవగపతులు
సుగ్రీవు నొద్దన • సుఖముగా నుండిరి, భానుజుండును హరి•సేన చెదరి
పాఱుట సోఁకుడు • మీఱుట గనుఁగొని, జంభవైరి సమాన•శౌర్య ధీరు

తే. నంగదకుమారుఁ గనుఁగొని • హయముమీఁద
నద్దులే కరుదెంచు ద•శాస్య తనయుఁ
జూపి యాతఁడు మనసేన • చూఱ పుచ్చెఁ
దనయ! యాతని వధియింపు • దర్ప మెసఁగ. ౧౬౪౪

అర్థములు. దంభోళిధారలన్ = వజ్రాయుధము వాదరలచేత, కుంభినీధరములు = కొండలు, వ్రీలు = పడు, బఱపు = బలము, సోఁకుడు=రాక్షసుఁడు, మీఱుట=అతిశయించుట, జంభవైరి=ఇంద్రునితో, చూఱపుచ్చెన్=కొల్లపెట్టెను.

తాత్పర్యము

వజ్రాయుధము వాదరలచే కొండలు గూలినట్లు వానరులు పడుట చూచి

కుంభకర్ణుని చేతిబలము ననుభవించిన వానరు లింకను నొప్పులచే బాధపడుచున్న వారగుటచే సుగ్రీవునొద్దనే సుఖముగా నుండిరి. సుగ్రీవుఁడు వానరసేన చెదరుటయు రావణుని కొడు కతిక్రమించి వచ్చుటయుఁజూచి యింద్రునితో సమానమైన శౌర్యవంతుఁడగు నంగదుని చూచి గుఱ్ఱముమీఁద నడ్డము లేక తిరుగు నరాంతకుని జూచి వీఁడు మనసేన కొల్ల పెట్టుచున్నాఁడు. కుమారా! వానిఁ జంపుము.

ఉ. రా జిటు లాడఁగ నతఁడు • ద్రుబ్బులు ద్రీల్చుచుఁ దోఁచు పద్మినీ
రాజువిధంబునం బ్లవగ•రాజులనుండి నిజాంగదద్యుతుల్
రాజిల ధాతుమండితధ•రాధరమో యన నేగుదెంచి యా
రాజకుమారుపైఁ జనె ని•రాయుధుఁ డై నఖమాత్రశస్త్రిఁ డై. ౧౬౭౫

అర్థములు. రాజు=ప్రభువు, అంగదుఁడును దక్కిన వానర శ్రేష్ఠులవలెఁ గుంభకర్ణునిచే దెబ్బలు తినినవాఁడై యలసి యుండినను రాజాజ్ఞ కావున నతిక్రమింపరాదని పోయెనని భావము. పద్మినీరాజు=సూర్యుఁడు, ప్లవగరాజుల నుండి=వానరశ్రేష్ఠులలో నుండి నిజాంగదద్యుతుల్ = తన బాహుపురుల కాంతులు, రాజిలన్ = ప్రకాశించు చుండఁగా, ధాతుమండిత = బంగారులోనగు లోహములచే, మండిత=అలంకరింపఁబడిన, ధరాధరమో = పర్వతమో, నిరాయుధుఁడై = ఆయుధము లేనివాఁడై, నఖమాత్రశస్త్రిఁడై =గోళ్ళు మాత్రమే యాయుధముగాఁ గలవాఁడై.

### తాత్పర్యము

రాజాజ్ఞప్రకార మాజ్ఞ సేయఁగా నతఁడు మబ్బులు చీలఁదీసికొని కానవచ్చు సూర్యునివలె వానరుల నడుమ నుండి తన భుజకీర్తుల కాంతులు ప్రకాశింపఁగా బంగారు మొదలగు లోహములచే నలంకరింపఁబడిన పర్వతమువలె నిరాయుధుఁడై గోళ్ళు మాత్రమే యాయుధముగాఁ గలవాఁడై రాక్షసరాజు కొడుకు మీఁదికిఁ బోయెను.

ఉ. వానికి నిట్లనున్ దనుజ•వీర్యుఁడ! ప్రాకృతకీశపాళులన్
మానక తున్మినంత బల•మా యశమా ఫలమా యెదీ భవ
న్మానిత మైనప్రాసమును • నాదు నురంబున వైపుమీ యనన్
దానవుఁ డాతనిం గని ని•తాంతరుషాపరిదగ్ధచిత్తుఁ డై. ౧౬౭౬

అర్థములు. నితాంతరుషాపరిదగ్ధ చిత్తుఁడై =మిగులఁ గోపముచేఁ గాలిన మనస్సు గలవాఁడై.

### తాత్పర్యము

ఇట్లుపోయి వానితో నిట్లనియె. రాక్షసశ్రేష్ఠుఁడా! సామాన్యమైన కోఁతిగుంపు నేలరా చంపెదవు? దానివలన నీకు బలమెచ్చెనా? కీర్తివచ్చెనా? ఫలమేదైన లభించెనా? ఏదీచూతము? నీవు గొప్పగాఁదలఁచి యుండు నీయీఁటెను నాఱొమ్మున

మీఁద వేయుము. అని చెప్పఁగా రాక్షసుఁడు మిగుల కోపముచే మండుచున్న మనస్సు గలవాఁడై.

కం. రదములఁ బెదవులు గొఱుకుచు, మదమున రోఁజుచును ద్రాఁచు ♦ మాడ్కిని దారా
మదవర్ధను వక్షంబున, నదటున నడరించెఁ బ్రాస ♦ మతిదృఢశక్తిన్. ౧౬౪౭

అర్థములు. రదములన్ = పండ్లచే, త్రాఁచుమాడ్కిని = త్రాఁచుపాము వలె, తారామదవర్ధను = తారకు సంతోషము వృద్ధిచేయువానిని, గజదానం గర్వాహర్ష రేతో మృగమదా మదాః ॥నానా॥ర. అదటున=మదముచే.

తాత్పర్యము

దంతములచేఁ బెదవులు గొఱుకుచు నాఁగుఁబాము వలె బుసలు గొట్టుచు నంగదుని ఱొమ్మున వాఁడు తన బలము కొలఁది నీఁటెను ప్రయోగించెను.

చ. అదియును వాలిపుత్రకులి ♦ శాభమహోరముఁ దాఁకి తునుకలై
చెదరి ధరం బొరంగెఁ, గపి ♦ సింహము దానిని గాంచి మీఁదికిన్
గొదుకక దూఁకి గుఱ్ఱమును ♦ గ్రుద్దిన నద్ది నిమగ్నతాలువై
చిదికిన గ్రుడ్లతోఁ దెగిన ♦ జిహ్వికతోడ విశీర్ణమూర్ధమై. ౧౬౪౮

అర్థములు. కులిశాభ = వజ్రముతో సమానమైన, మహోరము=పెద్ద ఱొమ్ము, నిమగ్నతాలువై = లోపలి కీడ్చుకొని పోయిన దవడలు గలదై, విశీర్ణమూర్ధమై=పిచ్చలైన తల కలదై.

తాత్పర్యము

ఆ యీఁటె వజ్రాయుధమువలె గట్టియైన యంగదు ఱొమ్ముఁదాఁకి తునకలై చెదరి భూమిమీఁదఁ బడెను. అది చూచి వానరశ్రేష్ఠుఁడు సందేహింపక వాని మీఁద దూఁకి గుఱ్ఱమును నొక్క గ్రుద్దును గ్రుద్దఁగా నది దవడలు లోపలి కీడ్చుకొని పోయినదై గ్రుడ్లు చిదికినదై, నాలుక దెగినదై, తల పిచ్చలై.

కం. కొండవలెఁ గూలి తత్తడి, గండడఁగినఁ జూచి క్రోధ ♦ కలుషితమతి నా
ఖండలసుతసుతుతల పోఁ,కుంకును బిడికింట నొక్క ♦ గ్రుద్దుం గ్రుద్దెన్. ౧౬౪౯

అర్థములు. తత్తడి=గుఱ్ఱము, క్రోధకలుషితమతిన్ = కోపముచేఁ గలఁకఁ బాఱిన మనస్సుతో, ఆఖండల=ఇంద్రుని

తాత్పర్యము

కొండవలెఁబడి గుఱ్ఱము చావఁగాఁ జూచి కోపించి యా రాక్షసుఁడు వాలి కొడుకు తలమీఁద నొక్క గ్రుద్దు గ్రుద్దెను.

ఉ. ముష్టివిభిన్న మూర్ధుఁడుఁగ ♦ ముమ్మరమై బహులోష్ణరక్తముల్
దృష్టులు పాఱకుండ దొర ♦ లెం, బెలుమూర్ఛ మునింగి కీశుఁడున్
గష్టముమీఁదఁ దెల్వి గొని ♦ కానొక్కను కిన్కను మండుచుం బరో
త్కృష్టపరాక్రమంబునకు ♦ డెందము విస్మితమూచు నుండఁగన్. ౧౬౫౦

అర్థములు. ముష్టి=పిడికిటి దెబ్బచే, విభిన్న=పగిలిన, మూర్ధుఁడుగన్ = తలగలవాఁడుగ, ముమ్మరమై = అధికమై, బహుళి=విశేషముగ, ఉష్ణరక్తముల్= వేఁడినెత్తురులు, కారోఁడను = దట్టమైన-అధికమైన, పరోత్కృష్ట పరాక్రమంబు నకున్=పగవాని పరాక్రమమునకు బలమునకు, డెందము=మనస్సు.

తాత్పర్యము

పిడికిటి దెబ్బచేఁ దలపగిలి విశేషముగ వేఁడినెత్తురు గాఱఁగాఁ గన్నులు తెఱచి చూచుటకు లేక మూర్ఛపోయి వానరుఁడు నేలఁబడి కష్టముమీఁద స్మృతి తెచ్చుకొని బలమైన కోపముతో మండుచు పగవాని యధికపరాక్రమమునకు మనస్సు ఆశ్చర్యపడుచుండఁగా.

ఉ. చివ్వున లేచి భూమిధర • శృంగనిభం బగు ముష్టిఁబూని తా
నవ్విబుధారిఱొమ్ము నలి • యం బొడిచెన్ రుధిరంబు కండలున్
గ్రొవ్వును మేన నిండె ధరఁ • గూలె నతండును దూలి దవ్వుగా
నవ్విబుధేంద్రువజ్రహతి • నై విధురం బగు క్ష్మాధరం బనన్. ౧౬౫౧

అర్థములు. భూమిధరశృంగనిభంబు=కొండశిఖరము వంటిది, నలియన్= నలుగునట్లు, విధురము=పగిలినది, క్ష్మాధరము=పర్వతము.

తాత్పర్యము

చివాలున లేచి కొండ శిఖరమువలె దృఢమైన పిడికిలిచే రాక్షసుని ఱొమ్ము నలిగిపోవునట్లు పొడువఁగా నెత్తురు కండలు క్రొవ్వు వాని దేహమంతయు నిండెను. వాఁడును ఆ దెబ్బకు దూరముగాఁ గొట్టుకొని పోయి ఇంద్రుని వజ్రము దెబ్బచేఁ బడు కొండవలెఁ బడెను.

కం. వానరపతితనయునిచే, దానవపతితనయుఁ డిట్లు • తనువు దొఱంగన్
వానరులరవము దివి దితి,జానీకరవంబు బెరసి•యవఘుళి మ్రొయ్యెన్. ౧౬౫౨

అర్థములు. అవఘుళిము=హెచ్చు, దివిజానీకరవంబు = దేవతాసమూహ ముల ధ్వని.

తాత్పర్యము స్పష్టము.

కం. దుష్కర మగు తత్కృతిఁ గని పుష్కరజేక్షణుఁడు రామ•భూవరుఁడును శో
చిష్కేశతేజు నంగదుఁ, బుష్కలహర్షమున మెచ్చి•పొరి మన్నించెన్. ౧౬౫౩

అర్థములు. దుష్కరము=చేయఁగష్టమైనది, పుష్కరజేక్షణుఁడు=కమల ములవంటి కన్నులు గలవాఁడు, శోచిష్కేశతేజున్=అగ్నివంటి తేజస్సుగలవానిని, పుష్కలహర్షమునన్ = నిండుసంతోషముతో, పొరిన్=మిక్కిలి, మన్నించెన్= గౌరవించెను.

తాత్పర్యము స్పష్టము.

**-♦ ౭౦-వ సర్గము. అంగదుఁడు దేవాంతకమహోదర త్రిశిరులతోఁ బోరుట ♦-**

సీ. త్రిశిరోమహోదరుల్ ♦ దేవాంతకుండును, వగచి నరాంతకు♦పాటు గాంచి
యభ్రసంకాశగ♦జాధిరూఢుం డయి, యుగ్రపుఁగినుక మ♦హోదరుండు
పరిఘహస్తుం డయి ♦ గురురథస్థితుఁ డయి, దేవాంతకుండును♦ద్రిశిరుఁ డొక్క
మొగి వాలితనయునిఁ♦దెగి తాఁకి నొప్పింప,నతఁడొక ద్రుమము దే♦వాంతకాఖ్యు
తే. మీఁద నైవ దాని ♦ మేలిశరంబుల, విశసనం బొనర్చెఁ ♦ద్రిశిరుఁ డలుక
వెండి వృక్షశైల♦వృష్టిని గురియింప, వానిఁ ద్రుంచె నతఁ డ♦వార్యబలుఁడు.

అర్థములు. వగచి=వ్యసనపడి, అభ్రసంకాశ గజాధిరూఢుండయి=మేఘముతో సమానమైన యేనుఁగు నెక్కినవాఁడై, పరిఘహస్తుండయి=గుదియ చేత ధరించినవాఁడై, గురురథస్థితుఁడయి=పెద్ద తేరియందున్నవాఁడై, తెగి=సాహసించి, ఒక మొగిన్=ఏకముఖముగా, అందఱు కలసి యొకటిగ, విశసనంబు=ఖండితము, అవార్యబలుఁడు=వారింపరాని బలము గలవాఁడు.

నరాంతకు పాటుగాంచి వగచి, ఇది పూర్ణవాక్యము గాకున్నను వేఱువాక్యమునకు జనకస్థానం బగుచున్నది. వగచిరి, అందు నని యన్వయింపవలెను.

భూతార్థకాసమాపకక్రియ వలయుచో వాక్యాంతరజనకస్థానం బగు, అగుచోఁ గర్త తత్కర్త లందలిదియ యొద్దియే నొండగు ప్రౌ. వ్యా. వాక్య. ౧౬ "దేవ లోకంబునకుఁ బోవువా రెదుర ద్వాపరంబుతో వచ్చు కలింగని శక్రుం డిది యేమి నొంకులకుఁ బోయెద వని యడిగిన, న య్యింద్రునకుఁ గలి యిట్లనియె" భార. అరణ్య. ౨ ఆ.

తాత్పర్యము

నరాంతకుఁడు చచ్చుట చూచి త్రిశిరుఁడు మహోదరుఁడు దేవాంతకుఁడు వ్యసనపడి అందు మబ్బువంటి యేనుఁగు నెక్కినవాఁడై మహాకోపముతో మహోదరుండును, గుదియ చేతఁదీసికొని దేవాంతకుండును,పెద్ద రథ మెక్కి త్రిశిరుండును, ఒక్కసారిగ సాహసించి యంగదుని దాఁకి బాధింపఁగా నతఁ డొక చెట్టును దేవాంతకునిమీఁద వేయఁగా దాని గొప్ప బాణములచే త్రిశిరుఁడు ఖండించెను. కోపించి యంగదుఁడు మరల చెట్లవాన గురియింపఁగా వాఁడు దానిని ద్రుంచెను.

ఉ. త్రుంచియు దృప్తి లేక రణ♦దోహలియై త్రిశిరుండు కీశుని
న్ముంచుచు ములుకులం దఱుము ♦ నూలొకొని యల్ల మహోదరుండు క్రో
ధాంచితవృత్తిఁ దోమరసు♦తాడితుఁ జేసెను, నున్నవాఁడు మ
ర్దించి దృఢంబుగాఁ గుదియఁ ♦ దెప్పున దవ్వుగ దాఁటి పోయినన్. ౧౬-౧౧

అర్థములు. రణదోహలి = యుద్ధకాంక్షగలవాఁడై, నూలొకొని = పురిగొని, తోమరసుతాడితున్ = చిల్లకోలతోఁ గొట్టఁబడిన వానిని, ఉన్నవాఁడు = తక్కినవాఁడు, దేవాంతకుఁడు.

## తాత్పర్యము

ఇట్లు వానిని ఖండించియుఁ దృప్తి లేక యుద్ధకాంక్ష గలవాఁడై త్రిశిరుఁడు అంగదుని బాణములచే ముంచుచు తఱుమఁగా మహోదరుం డుత్సాహము గలవాఁడై కోపించి చిల్లకోలతోఁ గొట్టెను. తక్కిన దేవాంతకుఁడు గుదియతో గట్టిగాఁగొట్టి దూరముగ దాఁటిపోయెను.

ఉ. ముగ్గురు తన్ను నీగతిని ♦ ముట్టిన వాలితనూజుఁ డేమియున్
బెగ్గిల కాత్మ నొవ్వక యతి♦వేగయుతుండు మహాజవాఢ్యుఁడై
యుగ్గజముం దలంబున శి♦రోగ్రమునం బ్రహరింప నేలపై
మ్రొగ్గుచు ఘీంకరించెఁ గను♦గ్రుడ్డులు రాలఁగ మిట్టిపాటునన్. ౧౬౫

అర్థములు. ముట్టినన్ = చుట్టుముట్టుకొనఁగా, బెగ్గిలక = భయపడక, తలంబునన్ = అరచేత, శిరోగ్రమునన్ = నెత్తిమీఁదఁ, ప్రహరింపన్=కొట్టఁగా, అతివేగయుతుండు = స్వభావముగనే వేగముతోఁ గూడినవాఁడు, మహాజవాఢ్యుఁడు=ఇప్పుడు విశేష వేగము గలవాఁడు.

## తాత్పర్యము

ఈ విధముగ ముగ్గురు తన్నుఁ జుట్టుకొనిన యంగదుఁడు భయపడక మనస్సులో నొప్పి చెందక, ఏనుఁగు తలమీఁద నఱచేతితోఁ గొట్టఁగా నది నేలపై మోకరించి కనుగ్రుడ్లు రాలిపోఁగా మిట్టిపడి ఘీంకారము చేసెను.

ఉ. దంతివిషాణముం దివిచి ♦ దానన వాలిసుతుండు మోఁదె దే
వాంతకు, వాఁడు దద్ధతిని ♦ నాశుగధూతకుజంబుమాడ్కి నా
ద్యంతము మే న్వణంక బహు♦శోణ్రము గ్రక్కుచు నేల వ్రాలి తా
నెంతయు గాసిఁ దేలి ప్లవ♦గేంద్రసుతుం బరిఘాన వ్రేసినన్. ౧౬౬

అర్థములు. దంతి విషాణమున్ = ఏనుఁగు కొమ్మును, తత్ + హతిని= ఆ దెబ్బచే, ఆశుగధూతకుజంబుమాడ్కిన్ = గాలిచే నూఁచఁబడినఁ జెట్టువలె, ఆద్యంతము = తల మొదలు కాలి వఱకు, బహుశోణ్రము=విశేషముగ నెత్తురు, పరిఘానన్ = గుదియతో.

## తాత్పర్యము

ఏనుఁగు దంతము పీకి దానితోనే దేవాంతకుని కొట్టెను. వాఁ డా దెబ్బతిని గాలికి వణఁకు చెట్టువలె తల మొదలు కాళ్ళ వఱకు దేహమంతయు వణఁకఁగా విశేషముగ నెత్తురు గ్రక్కుచు నేలమీఁదఁ బడి మిగులఁ గష్టము మీఁదఁ దెప్పతిల్లుకొని యంగదుని గుదియతోఁ గొట్టెను.

కం. పటు వడి మోఁకతిల్లియుఁ, బాటవమున లేచు నతని♦ఫాలమునందున్
గాటముగ నాటఁగ నిరా ఘాటతఁ ద్రిశిరుండు వైచెఁ గాండచయంబున్.

అర్థములు. మోఁకరిల్లియు=మోఁకాళ్ళమీఁద మ్రొగ్గి, పాటవమునన్= నేర్పున, బలమున, నిరాఘాటతన్ = అడ్డము లేక, కాండచయంబున్ = బాణ సమూహమును.

తాత్పర్యము

దెబ్బదిని ముందటికి మోఁకాళ్ళపై మ్రొగ్గి నేర్పున లేచు నతని నొసటి యందు గట్టిగ నాటుకొనునట్లు త్రిశిరుండు బాణముల వైచెను.

**—♦ హనుమంతునిచే దేవాంతకుఁడు నీలునిచే మహోదరుఁడు చచ్చుట ♦—**

సీ. మువ్వురు రాక్షస♦ముఖ్యు లిట్లు కుమారు, నంగదుఁ దాఁకిన♦యనువెఱింగి
హనుమంతుఁడును నీలుఁ♦డచటికి నరుదెంచి, రందు నీలుండు శై♦లాగ్ర మొకటి
త్రిశిరునిపై వైవ ♦ దివ్యశరంబుల, భేదించె నతఁడు దృ♦గ్భీకరముగ
హర్షించి రేఁగి దే♦వాంతకుండును గేలఁ, బరిఘంబు గైకొని ♦ పావమాని
ఆ. పైపడంగ రాఁగఁ ♦ బవికల్ప ముష్టిని, బొడిచెఁ గీశవరుఁడు ♦ నడిశిరమున
దానఁ గూఁతలిడుచు♦దంతముల్ వెలిరాఁగ, జిహ్వ వ్రేల మెదడు♦చెదరఁ జచ్చె.

అర్థములు. అనువు=విధము, దృక్ + భీకరముగన్=చూచుటకు భయంకరముగ, హర్షించి = సంతోషించి, రేఁగి = విజృంభించి, పావమానిన్ = హనుమంతుని, పవికల్పముష్టిని=వజ్రాయుధముతో సమానమైన పిడికిట.

తాత్పర్యము

ముగ్గురు రాక్షసులు బాలుఁడైన యంగదుని దాఁకిన విధము దెలిసికొని హనుమంతుఁడును నీలుఁడు నచ్చటికి వచ్చిరి. అందు నీలుఁడు కొండశిఖర మొకటి పెఱికి త్రిశిరునిమీఁద వేయఁగా దానిని వాఁడు దివ్యబాణములచే భేదించెను. దానికి దేవాంతకుఁడు సంతోషించి చేత గుదియఁ దీసికొని హనుమంతునిమీఁదఁ బడరాఁగా వజ్రమువంటి పిడికిట నడినెత్తిమీఁద, హనుమంతుఁడు పొడిచెను. ఆ దెబ్బదిని వాఁడు కూఁతలు పెట్టుచు పండ్లు బయటికి రాఁగా నాలుక వ్రేలాడఁగా మెదడు చెదరఁగా జచ్చెను.

సీ. దేవాంతకుం డిటు ♦ దేవలోకముఁ జేరఁ, ద్రిశిరుండు నీలుపై ♦ నిశితబాణ
వర్షంబుఁ గురియింప♦వసి మహోదరుఁడును, నుగ్రశరంబుల♦నురముఁ గ్రుచ్చె
వారల శరవృష్టి ♦ వదలఁగ సందులు, సోలి ససంజ్ఞుఁడై ♦ లీల లేచి
కుజషండమండిత♦కుధరంబుఁ గొని మహో,దరు నైన నాతఁడు ♦ ధరణిఁ గూలె
ఆ. వజ్రనిహతమైన ♦ వసుమతీధర మనఁ, బిన్నతండ్రి యిట్లు ♦ ప్రేతమైన
నంజనాతనూజు ♦ నిం జటులాస్త్రాళిఁ, గప్పెఁ ద్రిశిరుఁ డధిక ♦ గర్వ మెసఁగ.

అర్థములు. సందులు=కీళ్ళు, సోలి=మూర్ఛపోయి, ససంజ్ఞుఁడై = స్మృతి గలవాఁడై, కుజషండమండిత=చెట్లసమూహముచే నలంకరింపఁబడిన, కుధరంబు= పర్వతము.

## తాత్పర్యము

దేవాంతకుఁడు చావఁగా త్రిశిరుఁడు నీలునిపై వాఁడి బాణముల వాన గురియింపఁగా వేగముగ మహోదరుఁడు తీవ్రబాణముల నురమునందు నాటుకొన నైచెను. వారల బాణవర్షముచే కీళ్ళు సళ్ళుపాఱఁగా స్మృతి తప్పి మరల దెలివి రాఁగా నవలీలగా లేచి చెట్లతోఁ గూడిన పర్వతము తీసికొని మహోదరునిపై వైవఁగా దానిచే వాఁడు వజ్రము తాఁకిన పర్వతమన నేలఁబడెను. పిన్నతండ్రి యిట్లు చావఁగా త్రిశిరుఁడు గర్వించి హనుమంతుని తళతళ చలించుచున్న బాణములచేఁ గప్పెను.

## —♦ హనుమంతునిచేఁ ద్రిశిరుండు చచ్చుట ♦—

చ. గిరిశిఖరంబు నొండు గొని ♦ కేసరిసూనుఁడు వానిపైవ నా
శరుఁడు సుతీక్ష్ణబాణముల ♦ సత్వరుఁడై పొడిచేసె దాని, నీ
కరణిని వ్యర్థమైన గిరిఁ ♦ గాంచి ధరాజమహావృష్టి కొండద్రి
మ్మరి యొకిమీఁడు ముంచె నది♦మధ్యమునన్ హరియించె నాతఁడున్. ౧౬౬౧

అర్థములు. కొండ ద్రిమ్మరి యొకిమీఁడు=వానర శ్రేష్ఠుఁడు.

## తాత్పర్యము

కొండ శిఖర మొకఁ దానిని దీసికొని హనుమంతుఁడు వేయఁగా రాక్షసుఁడు దాని మిగుల వాఁడియగు బాణములచే వేగముగఁ బొడిసేసెను. ఈవిధముగ వ్యర్థమై పోయిన కొండను జూచి వానర శ్రేష్ఠుఁడు చెట్లు వాన గురియింపఁగా దానిని వాఁడు ఖండించెను.

సీ. చిద్రుపలుగాఁ జేసి సింహనాద మొనర్ప, నంజనాసంభవుం ♦ డాగ్రహమునఁ
దెప్పున లంఘించి ♦ దితిజారిహయములఁ, గేసరి కరి ద్రచ్చు ♦ క్రీడ గోఁప
నఖములఁ జీల్చిన♦నక్తంచరుండును, గాలరాత్రిని గూల్చు♦కాలుమాడ్కి
శక్తిని మారుతి ♦ సంభవు నైచిన, నతఁడు దానిని బట్టి ♦ హతముఁ జేసె
ఆ. ఘోరశక్తి నిట్లు ♦ గూల్చిన హనుమని, మేలటంచుఁ గపులు♦మెచ్చిపొగడఁ
ద్రిశిరుఁ డధికరోష ♦ దీప్తుఁడై ఖడ్గ మంకించి వైచెఁ దాఁకఁ♦గీశునురము.

అర్థములు. చిద్రుపలు=తునుకలు, ఇందు 'చి' గురువుకాదు. కేసరి=సింహము ద్రచ్చు = చీల్చు, కాలరాత్రి = భయంకరమైన యొకానొక యాయుధమును, నిగుడ్చు = ప్రయోగించు, కాలుమాడ్కిన్ = మృత్యుదేవతవలె.

## తాత్పర్యము

తునుకలుగాఁ జీల్చి సింహనాదము చేయఁగా హనుమంతుఁడు కోపించి తటాలున దూఁకి యా రాక్షసుని గుఱ్ఱములను సింహ మేనుఁగును జీల్చినట్లు గోళ్ళచే జీల్చఁగా నా రాక్షసుఁడు కాలుఁడు ప్రయోగించు కాలరాత్రివలె శక్తి యను నాయుధమును వేయఁగా హనుమంతుఁడు దానిని బట్టుకొని విఱిచివేసెను. భయంకరమైన శక్తిని బడఁగొట్టిన హనుమంతుని మేలు మేలని కపులు మెచ్చుకొని పొగడు

చుండఁగా త్రిశిరుఁడు కోపముచే మండిపడుచు కత్తి తీసికొని హనుమంతు వక్షము దాఁక వైచెను.

కం. కరి నడచిన సింహంబన, దశరథతనయాగ్రగణ్యు•దాసుం డటుచేఁ
త్రిశిరునురంబునఁ దాఁప స్వ,వశతచెడి విసంజ్ఞుఁ డగుచుఁ•వ్రాలె ధరిత్రిన్.

అర్థములు. కరిన్=ఏనుగును, అడచిన=కొట్టిన, తాఁపన్=కొట్టఁగా, స్వవశత=స్వాధీనము, విసంజ్ఞుఁడు=స్మృతి తప్పిన వాఁడు.

తా త్ప ర్య ము

ఏనుఁగుచేఁ గొట్టిన సింహమో యనునట్లు రామదాసుఁ డగు హనుమంతుఁడు అటుచేతఁ ద్రిశిరుని గొట్టఁగా వాఁడు స్వాధీనము తప్పి నేలఁబడెను.

ఉ. వ్రాలెడివానిఖడ్గమును • వాయుతనూజుఁడు గుంజి యార్చె దై
త్యాళి భయాతురత్వమునఁ • నారట మొందగఁ దన్నినాదముం
దాళక మిట్టిపాటున వ•నాటు నురంబునఁ దాఁప ముష్టిచేఁ
గేలను దత్కిరీటమును • గేలియపోలె గ్రహించి క్రుద్ధుఁడై ౧౬౬౮

అర్థములు. భయాతురత్వమునన్ = భయము వలని బాధచే, గుంజి= లాగి, తాళక = సహింపలేక, మిట్టిపాటునన్=ఎగిరి పడుటచే.

తా త్ప ర్య ము

నేలఁ బడఁబోవువాని చేతి కత్తిని లాగి హనుమంతుఁడు రాక్షసులు భయముచే బాధపడఁగా సింహనాదము చేసెను. దానిని సహింపలేక రాక్షసుఁ డెగిరి పడి హనుమంతు ఱొమ్మును ముష్టిచే గొట్టఁగాఁ జేతితో వాని కిరీటము నాటవలెఁ బట్టుకొని కోపించినవాఁడై.

చ. గురుమకుటాంచితంబును స•కుండల మైన శిరస్త్రయంబు భా
స్వరకరవాలధారను ప్ర•భంజనపుత్రుఁడు పాకదైత్యసం
హరణుఁడు విశ్వరూపుఁ దుతు•మాడినభంగిని ద్రుంచి వైచినన్
ధరణిఁ దొరంగె నవ్వి జ్వల•నప్రతిమాయతనేత్రపంక్తితోన్. ౧౬౬౯

అర్థములు. గురుమకుటాంచితము = పెద్ద కిరీటముచేఁ బ్రకాశించునది సకుండలము = చెవులపోగులతో గూడినది, శిరస్త్రయంబు = మూఁడు తలలు, భాస్వర కరవాల ధారను = ధగధగ మను కత్తివాదరచే, ప్రభంజనపుత్రుఁడు= హనుమంతుఁడు, పాకదైత్యసంహరుఁడు=పాకుఁడను రాక్షసునిఁజంపిన యింద్రుడు, విశ్వరూపున్ = విశ్వకర్మ కుమారుఁడైన మూఁడు తలల విశ్వరూపుని. అవ్వి=ఆ తలలు, జ్వలన ప్రతిమ = అగ్నితో సమానమైన, ఆయత=దీర్ఘములైన, నేత్ర పంక్తితోన్ = కన్నుల వరుసతో.

తా త్ప ర్య ము

పెద్ద కిరీటముతోఁ బ్రకాశించునవియుఁ గుండలములతోఁ గూడినవియునగు

మూఁడుతలలను హనుమంతుఁ డింద్రుఁడు మూఁడుతలల విశ్వరూపుని సంహరించి నట్లు ప్రకాశించు కత్తిచే నఱికి వేయఁగా నవి నిప్పువంటివియు దీర్ఘములు నైన కన్నులుతోడ నేలఁబడెను.

తే. సుకృతఫలసంక్షయంబున • సూర్యమార్గ, మునను ధర వ్రాలువానిని • బోలియసుర
నేల వ్రాలిన శాఖామృ • గాళులెల్లఁ, బగఱు వఱువెత్త నార్భటుల్ • పరఁగఁ జేసె.

అర్థములు. సుకృతఫలసంక్షయంబున = ఈ లోకమున చేసిన పుణ్యముల ఫలము స్వర్గలోకములో ననుభవించిన పిదప మరల భూమిమీఁదఁ బుట్టుటకై జీవుఁడు కొన్ని దినాలు సూర్యకిరణములలో నుండి తరువాత భూమిని జేరును, ఆ విధముగ; పగఱు = శత్రువులు, ఆర్భటుల్ = పెద్దధ్వనులు.

తాత్పర్యము స్పష్టము.

## —• ఋషభునిచే మత్తుండు చచ్చుట •—

సీ. దేవాంతకుండును • త్రిశిరసుండును నరాం, తక మహోదరులు యు • ద్ధప్రచండు
లరులచే హతులైన • యధికాగ్రహంబున, మత్తుండు శాత్రవ • మాంసరక్త
ఫేనిలంబును భృశ • బీభత్సమును హేమ, పట్టాన్వితము మహా • పద్మసార్వ
భౌమశక్రేభ భీ • ప్రదము సురక్తమా, ల్యాలంకృతంబు దీ • ప్తాగ్ర మైన
ఆ. గద ధరించి కల్ప • కాలసప్తార్చినాఁ, గఫుల నెగచు చుండఁ • గనలి ఋషభుఁ
డెగిరి ముందు నిలువ • నిద్ధతేజుఁడు, నిశా, చారుఁ డతని మొత్తె • భూరిగదను.

అర్థములు. మత్తుఁడు = వీఁడే మహాపార్శ్వుఁడు, శాత్రవమాంసరక్త ఫేనిలంబును = మాంసము నెత్తురు నురుగు గలది, భృశబీభత్సము = మిగుల భయంకర మైనది, హేమపట్టాన్వితము = బంగారు పట్టతోఁ గూడినది, మహాపద్మ = పుండరీక మను దిగ్గజమునకు నామాంతరము మహాపద్మము, సార్వభౌమము = ఒకానొక దిగ్గజము, శక్రేభ = ఇంద్రుని గజము ఐరావతము, వీనికిని, భీప్రదము = భయము గలిగించునది, సురక్త = మిగుల నెఱ్ఱ నగు, సుమాల్య = మంచి పూలహారములచే, అలంకృతము = అలంకరింపఁబడినది, దీప్తాగ్రము = జ్వలించు మొనగలది, కల్పకాల సప్తార్చి = ప్రలయకాలమందలి యగ్నిహోత్రుఁడు, ఎగచుచున్ = పాఱఁదోలుచు, కనలి = కోపించి.

తాత్పర్యము

దేవాంతక నరాంతక మహోదర త్రిశిరసులు యుద్ధమున నసాధ్యులు, శత్రువులచేఁ జావఁగా మిగులఁ గోపంబున మహాపార్శ్వుండు శత్రువుల మాంసము రక్తపు నురుగు గలదియు మిగుల భయంకర మైనదియు, బంగారు పట్టెలతోఁ కట్టులతోఁ గూడినదియు, మహాపద్మము సార్వభౌమము ఐరావత మను దిగ్గజములకు భయంకర మైనదియు, ఎఱ్ఱని పూలదండలచే నలంకరింప బడినదియు, మండుచున్న కొనగల

దియు నగు గదను ధరించి ప్రలయ కాలాగ్నివలె నై కపులను బాఱఁదోలుచుండ ఋషభుఁడు కోపించి యెగిరిపోయి వాని ముందు నిలువఁగా ప్రసిద్ధమైన తేజస్సు గల యారాక్షసుఁ డతని పెద్ద గదచే కొట్టెను.

చ. బలితపుఁదద్గదాహతిని • వానరనాథుఁడు భిన్నవక్షుఁడై
దెలివి దొఱంగి నేలపయిఁ • ద్రెళ్ళి స్రవింపఁగ నోటనెత్తురుల్
బలియుఁడు మీఁద దూఁకి ప్రస•భంబునఁ జేతిగదన్ హరించి య
చ్చలమునఁ ద్రిప్పిత్రిప్పి వడి • శాత్రవుమూర్ధముమీఁదఁ గొట్టినన్. ౧౬౬౯

అర్థములు. బలితపు = బలముగల, భిన్నవక్షుఁడై=పగిలిన ఱొమ్ముగల వాఁడై, ప్రసభంబునన్=బలాత్కారముగ, మూర్ధము మీఁదన్=తలమీఁద.

తాత్పర్యము

బలిష్ఠమైన యా గద దెబ్బచేత కపీశ్వరుఁడు ఱొమ్ము పగిలినవాఁడై స్మృతి తప్పి నేల వ్రాలి నోట నెత్తురు కాఱఁగా మరల లేచి బలవంతుఁడు రాక్షసు మీఁద దూఁకి బలవంతముగ వానిచేత గదను గుంజుకొని, కోపముతో గిరగిర త్రిప్పిత్రిప్పి వేగముగా విరోధి తలమీఁదఁ గొట్టఁగా.

కం. తనగదచేఁ దా హతుఁ డై, ఘనశైలము వజ్రహతిని • గండడఁగు క్రియన్
దనుజుఁడు విశీర్ణరదలో,చనుఁడై వీతాసు వగుచుఁ • జనె యమపురికిన్.

అర్థములు. విశీర్ణరదలోచనుఁడై=పండ్లు కన్నులు చెదరినవాఁడై, వీతాసువు=ప్రాణము పోయినవాఁడు.

తాత్పర్యము

తన గదచేతనే తాను జచ్చి, వజ్రము దెబ్బచే పెద్ద పర్వతము పడినట్లు, దనుజుఁడు పండ్లు కన్నులు చెదరినవాఁడై ప్రాణముపోయి చచ్చెను.

కం. ఆతండు పడినతోడనె, చేతోగతిఁ బల్లటిల్లి • చెల్లాచెదరై
భీతిగొని యారిశాటుల వ్రాతంబు పలాయనాతి•పటుతం జూపెన్. ౧౬౭౦

అర్థములు. పల్లటిల్లి = దుఃఖముచేఁ దాఱుమాఱై, పలాయన = పరువెత్తుటయందు, అతిపటుతన్=విశేష సామర్థ్యమును.

తాత్పర్యము

వాఁడుపడిన వెంటనే రాక్షసులకు మనస్సులు దుఃఖభయములచే వ్యత్యస్తముకాఁగా వారు చెదరి వానరులకు భయపడి తమ సామర్థ్య మంతయుఁ బరువెత్తుటయందుఁ జూపిరి.

## —• ౭౧-వ సర్గము. అతికాయుఁడు కపులఁ బాఱఁదోలుట •—

సీ. తనతోడఁబుట్టులుఁ • బినతండ్రులును దెగ, బ్రహ్మదత్తవరుండు • పర్వతాభ
కాయుండు దేవతా•కాంక్షభయాపాది, యతికాయుఁ డర్క స•హస్రసన్నిభము

రథ మధిరోహించి • రథసంబునను జాప,విస్ఫార మొప్పఁగఁ • బేరువాడి
గర్జల వానరో • త్కర మదలించుచుఁ, దఱుమఁ జొచ్చినఁ జూచి•తరుచరాళి
తే. యసురవీరుని దేహమా•హాత్మ్య మట్టి, చూచి మఱి కుంభకర్ణుఁడే•లేచి వచ్చె
నో త్రివిక్రముఁడే యగు•నో యటంచు, మూఁకలుగఁ దీరెఁ బోరెడి•వీఁకదఱఁగి.

అర్థములు. పర్వతాభకాయుఁడు=కొండతో సమానమైన దేహము గలవాఁడు, బ్రహ్మదత్తవరుండు = బ్రహ్మచే వరము లీయఁబడినవాఁడు, దేవతాకాండ = దేవతా సమూహమునకు, భయావాది = భయము కలిగించువాఁడు, అర్కసహస్రనిభము — వేయిసూర్యులతో సమానము, రభసంబునను=త్వరగా, చాపవిస్ఫారము = వింటిధ్వని, పేరువాడి=పేరుచెప్పి, వానరోత్కరము = వానర సమూహమును, ద్వితీయార్థంబునఁ బ్రథమ - మూఁకలుగ = గుంపులుగ.

తాత్పర్యము

తనతోడఁ బుట్టినవారు పినతండ్రులును జావఁగా బ్రహ్మచేత వరములఁ బొందిన వాఁడును, కొండతో సమానమైన దేహము గలవాఁడును, దేవతలకు భయము గలిగించు వాఁడును నగు నతికాయుఁడు వేయిసూర్యులతో సమానమైన తేరిని నెక్కినవాఁడై శీఘ్రముగ వింటి ధ్వని యతిశయింపఁ బేరుచెప్పి గర్జించుచు వానరుల నదలించుచుఁ దఱుమ నారంభింపఁగా వానరు లా వీరుని పెద్దదేహముఁ జూచి కుంభకర్ణుఁడు మరల వచ్చెనేమో, త్రివిక్రముఁడే వచ్చెనో యని యచ్చటచ్చట గుంపులు గుంపులుగ నిలఁబడిరి. కాని పరాక్రమించిన వారుగారు.

చ. పరమగు సాధ్వసంబునను • బ్రజ్ఞ చెడం జని లక్ష్మణాగ్రజున్
శరణముఁ జొచ్చినన్ నృపతి•చంద్రముఁ డా రథికున్ ధరోపమున్
గురుతరచాపహస్తుఁ గని • కూరినవిస్మయపాటుతో వనే
చరులభయంబు దీర్చి హిత•సత్తము నిట్లను నవ్విభీషణున్. ౧౬౨

అర్థములు. పరము=గొప్పది, సాధ్వసంబునను=భయముచేత, ధర+ఉపమున్=పర్వతముతో సమానుని, లక్ష్మణాగ్రజున్=అనుటచే లక్ష్మణు పురుషకారము సూచితము. శరణు చొచ్చినన్ అనుటచే శరణాగతికి నార్తి యొక్కటియే ముఖ్యముగాని తక్కిన దేశకాలాదివిచారములు లేవనియు, వారల భయంబు దీర్చి యనుటచే ఆర్తప్రపత్తికి వెంటనే ఫలము గలుగుననియు సూచితము. సాధ్వసము నను ప్రజ్ఞ చెడి ననునది స్వరక్షణోపాయ విచారహీనత, నిర్భరత్వమును తెలిపెడిని.

తాత్పర్యము

మిగుల భయముచే ప్రజ్ఞ చెడఁగాఁ బోయి లక్ష్మణు నన్నయగు శ్రీరామచంద్రమూర్తిని శరణు చొరఁగా రామచంద్రమూర్తి పర్వతమువలెనుండి రథముపై గూర్చుండి పెద్ద విల్లు చేతఁ బట్టుకొని యున్నవానిని జూచి యాశ్చర్యపడి వానరు

లతో మీరు భయపడవల దని చెప్పి హితులందు శ్రేష్ఠుఁడగు విభీషణునితో నిట్లనియె.

—• శ్రీరాముఁడు విభీషణు నతికాయుఁ గూర్చి యడుగుట •—

సీ. ఏఁడెవ్వఁ డయ్య పృ•థ్వీధరకాయుండు, హరిలోచనుండు చా • పాయుధుండు
హయసహస్రక మైన•స్యందనంబునఁ బ్రాస, శూలతోమర సురో•చులు రహింప
భూతవృతుండైన • భూతేశ్వరునిఁ బోలి, శంపాసమంచిత • జలద మనఁగఁ
గాలజిహ్వాభ మై • శ్రీలు శక్తి ధరించి, నాఁడు కాంచనపృష్ఠ • నవ్యచాప
ఆ. సమితి శక్రచాప • సమ మయి తేరికి, శోభ గూర్చుచున్న • సొబగు గంటె
రాహుకెక్కియంబు•రవిరశ్మినిభశర, పంక్తి దెసలకెల్లఁ • బ్రభలు గూర్చె.

అర్థములు. పృథ్వీధరకాయుఁడు = పర్వతమునంత దేహము గలవాఁడు, హరిలోచనుండు=సింహము కన్నులవంటి కన్నులు గలవాఁడు, చాపాయుధుండు= విల్లాయుధముగాఁ గలవాఁడు, హయసహస్రకము = వేయి గుఱ్ఱములు గట్టినది, స్యందనంబునన్=తేరియందు, ప్రాస=ఈఁటెలయు, తోమర=చిల్లకోలలయు,సురోచులు=గొప్ప కాంతులు, భూతవృతుండు=పిశాచములచే లేక ప్రమథ గణములచేఁ జుట్టఁబడిన, భూతేశ్వరుని=శివుని, 'భూతేశః ఖండపరశు ర్గిరీశో గిరిశోమృడ' యని యమరము, శంపాసమంచిత = మెఱుపుతో నొప్పుచున్న, జలదము = మేఘము. కాలజిహ్వాభమై = మృత్యుదేవత నాలుకతో సమానమై, కాంచన పృష్ఠ = బంగారుతేప పొదిగిన, చాపసమితి = విండ్లసమూహము, శక్రచాప సమము=ఇంద్రధనుస్సుతో సమానము, రవిరశ్మినిభ=సూర్యకిరణములతో సమానమైన, శరపంక్తి=బాణసమూహము, ప్రభలు=కాంతులు.

తాత్పర్యము

విభీషణా! ఏఁడెవ్వఁడు! కొండంత దేహము గలవాఁడు. సింహము కన్నుల వంటి కన్నులు గలవాఁడు, విల్లు ఆయుధముగాఁ గలవాఁడు. (తక్కిన వారివలె గాదనుట) వేయి గుఱ్ఱములు కట్టిన తేరిమీఁద నీఁటెలు శూలములు చిల్లకోలలు ప్రకాశింప (తక్కిన వారివలె, దీనిచే నన్ని యాయుధముల ప్రయోగమందుఁ బ్రవీణుఁడని సూచితము) పిశాచములతోఁ గూడిన శివునిబోలి, మెఱుపులతోడి మేఘమనఁగ (దేహము మేఘము, ఆయుధకాంతి మెఱుపులు) యముని నాలుక వంటిదైన (సర్వమును సంహరించునది) శక్తిని ధరించినాఁడు. బంగారుతేకు పొదిగినవిండ్లు ఇంద్రచాపమువలెఁ దేరికి కాంతి కలిగించుచున్నవి. ధ్వజముపై రాహువు లిఖింపఁబడియున్నది. (రాహువు సూర్య చంద్రుల మ్రింగునట్లు తాను శత్రువుల మ్రింగువాఁడని సూచన) బాణసమూహము సూర్యకిరణముల కాంతి గలవై దిక్కులకు కాంతి గలిగించుచున్నవి.

సీ. చాపంబు త్రిణతంబు ♦ జలదనిర్హ్రాదంబు, కాంచనపృష్ఠంబు ♦ ప్రాంచితంబు
రథము సధ్వజము సా ♦ రథి చతుష్కము సప, తాకానుకర్షంబు ♦ తతరవంబు
పదియు నెన్మిది యిరు ♦ వది తూణులును భీమ, కార్ముకంబులు మఱి ♦ కనకవర్ణ
గుణములు శోభిల్లె ♦ గోమరుగ నిరువంక, నాయతి పదిమూర ♦ లగుచు నాల్గు
ఆ. మూరలైన పిడులు ♦ మొనయు ఖడ్గంబులు, గ్రాలె ధీరవరుఁడు ♦ రక్తపుష్ప
గళుఁడు కాలముఖుఁడు ♦ కాలుఁడు మేఘస్థ, దినకరాభుఁ డెవఁడు ♦ ధీరవర్య!

అర్థములు. త్రిణతంబు = మూఁడు వంపులుగలది. ఇట్టి విల్లు ధరించుట బలాతిశయము సూచించును. సామాన్యములైన విండ్లెక్కిడించి నపుడు చక్కఁగాఁ గట్టెలవలె నుండును. ఇవి మువ్వంపు గలవై యుండును. జలద నిర్హ్రాదంబు=మేఘ ధ్వనిగలది, సారథి చతుష్కము = నలువురు సారథులు గలది, సపతాక + అను కర్షంబు = ధ్వజముతోను కోడిపీఁటతోను గూడినది, తతరవంబు = విస్తారధ్వని గలది, తూణులు = అమ్ముల పొదులు, కార్ముకంబులు=విండ్లు, మునుపు చెప్పిన వానికంటె నివి వేఱు విధమైనవి, కనక వర్ణగుణములు=బంగారు వన్నెగల యల్లె త్రాడులు, ఆయతి = పొడవునందు పదిమూరలు రక్త పుష్పగళుఁడు = ఎఱ్ఱని పూవులదండ కంఠమున ధరించినవాఁడు, కాల ముఖుఁడు=యమునివంటి ముఖము గలవాఁడు, కాలుఁడు = నల్లటివాఁడు, మేఘస్థ = మేఘమునందుండు, దినకరా భుఁడు=సూర్యునితో సమానుఁడు, మబ్బులోని సూర్యుఁ డనుట కాలవశమున గలి గిన కాంతిహీనత సూచించుచున్నది.

తా త్ప ర్య ము

విల్లు మూఁడువంపులుగలది. రథము మేఘధ్వనిగలదై, బంగారు రేకు పొదిగి నదై ప్రకాశముగలదై ధ్వజముకు పతాకములు కోడిపీఁట నలువురు సారథులు గలదై యున్నది. అంబులపొదులు పదునెనిమిది యిరువదియున్నవి. భయంకరము లైన విండ్లు బంగారు అల్లెత్రాడులుగలవు. రెండు ప్రక్కల బది మూరల పొడుగు నాలుగు మూరల పిడులు గల కత్తులు గలవు. మహాధైర్యశాలి ఎఱ్ఱని పుష్ప మాల కంఠమున ధరించినాఁడు యమునివలె భయంకరమైన ముఖముగలవాఁడు. నల్లనివాఁడు. మబ్బుమాటున నున్న సూర్యునివలె నున్నాఁడు.

తే. హాటకాంగదనద్ధభు ♦ జాళి నితఁడు, తుంగశృంగోద్ధహిమవంతు ♦ దోయివాఁడు
కుండలంబులచే నొప్పు ♦ కొమరు మోము, రాజిలెఁ బునర్వసువునడి ♦ రాజువోలె.

అర్థములు. హాటకాంగదనద్ధ=బంగారు భుజకీర్తులచేఁ గట్టఁబడిన భుజములతో నితఁడు, తుంగశృంగోద్ధ = ఎత్తైన శిఖరములచేఁ బ్రకాశించు, హిమవంతుదోయి వాఁడు=హిమవంతునకు సమానుఁడు, పునర్వసువు నడిరాజు=పునర్వసువు రెండు నక్షత్రములకు నడుమనున్న చంద్రునివలె.

బంగారు భుజకీర్తులుగల భుజములతో వీఁడు ఎత్తైన శిఖరములు గల హిమవంతునితో సమునిడై యున్నాఁడు. కుండలములచే నందమైన వీని ముఖము పునర్వసుపునడిమి చంద్రునివలె నున్నది. వీఁ డెవ్వఁడు ?

కం. ప్లవగులు వీనిం గని భీ,వివశత గొని పఱచి రిట్టి•వీరుఁ డెవఁడో
జవము బలం బేమాత్రమొ, వివరింపు మటన్న నా వి•భీషణుఁ డనియెన్.

అర్థములు. భీవశతన్=భయముచేఁ బారవశ్యమున.

తాత్పర్యము స్పష్టము.

సీ. రాజేంద్ర యితఁడు • రావణాసురునకు, ధాన్యమాలినికిని • దనయుఁ డయ్యె
రావణప్రతిముండు • రణమున శూరుండు వృద్ధసేవియు నస్త్ర•వి త్తముండు
దారుణకృతి మహో•త్సాహుండు శ్రుతిధరుం, డశ్వపృష్ఠమున శా•తాంగమందు
నేనుఁగుపై నుండి • యేపున వింటను, ఖడ్గంబులను బోరఁ • గడు వలంతి

తే. నయమునందును సామదా•నంబులందు, భేదమున మంత్రములను బ్ర•వీణుఁ డితఁడు
వీనిభుజబలమున లంక•విగతభీతి, నతిశయిల్లెడి నతికాయుఁ•డండ్రు పేర.

అర్థములు. రావణప్రతిముండు=రావణుతో సమానుఁడు, వృద్ధసేవియు=పెద్దల సేవ చేసినవాఁడు, అస్త్రవిత్తముండు=అస్త్రము లెఱిఁగినవారిలో శ్రేష్ఠుఁడు, దారుణకృతి=భయంకర కార్యములు చేయువాఁడు, శ్రుతిధరుండు = వేద మభ్యసించినవాఁడు, అశ్వపృష్ఠమున=గుఱ్ఱము వీఁపుమీఁద, శతాంగమందున్ = తేరియందు, వలంతి=సమర్థుఁడు, నయమునందు=నీతివిద్యయందు.

తాత్పర్యము

రామచంద్రా! యితఁడు రావణునకు ధాన్యమాలినియందు జనించినవాఁడు. రావణుతో సమానుఁడు. యుద్ధమందు శూరుఁడు. నీతి ధర్మజ్ఞానాభివృద్ధికై పెద్దల సేవ చేసినాఁడు. అస్త్రముల బాగుగ నెఱిఁగినవాఁడు. భయంకరములైన కార్యములు చేయువాఁడు. మిగుల నుత్సాహము గలవాఁడు. వేదాధ్యయనము చేసినవాఁడు. గుఱ్ఱము ఏనుఁగు రథము వీనిపైనుండి కాని విల్లు ఖడ్గము వీనితోఁగాని యుద్ధము చేయుటయందు మిగుల సమర్థుఁడు. నీతిశాస్త్రమందు సామదాన భేదోపాయములందు ఆలోచనలందు మిగుల నేర్పరి. వీని భుజబలముచేతనే లంక నిర్భయముగా నున్నది. వీనిపే రతికాయుఁడు.

సీ. తపమున బ్రహ్మకుఁ•దనివిఁ గూర్చినవాఁడు, క్రూరాస్త్రములను గై•కొనినవాఁడు
నమరాదిచే నవ•ధ్యత్వ మందినవాఁడు, నీ దివ్యకవచంబు • నీ శతాంగ
మజునిచే గొన్నాఁడు•యక్షదానవ నిర్జ,రులఁ దోలి యసురులఁ•బ్రోచినాఁడు
పటుశరంబులఁ బాకి•పాశంబుఁ బర్వత,భేదివజ్రంబు స్తం•భించినాఁడు

తే. రాక్షసులకెల్ల మేటిధీరతుఁడు బలియుఁ, బురుష పుంగవ వానిచే దురములోన
భూజచరసేన హతమయి పోకమున్న, యతనివధియింప సమకట్టు మనెదు లోన.

అర్థములు. అమరాదిచే = దేవతలు మొదలగువారిచే. అవధ్యత్వము = చావులేమి, అజునిచే=బ్రహ్మచే, పాశిపాశంబు=వరుణుని పాశంబు, పర్వతభేది = ఇంద్రుని, స్తంభించినాఁడు = కదలకుండ నిలిపినాఁడు, సమకట్టుము = ప్రయత్నింపుము.

తాత్పర్యము

తపముచే బ్రహ్మను సంతోషపఱిచి యాయనవలనఁ గ్రూరకార్యములు చేయఁగల యస్త్రములను దేవతలు లోనగువారిచేఁ జావులేని వరములను అభేద్య కవచము ఈ రథము సంపాదించినాఁడు యక్షులను దానవులను దేవతలను దఱుమఁ గొట్టి రాక్షసుల రక్షించినాఁడు. తన గట్టి బాణములచే వరుణుని పాశమును ఇంద్రుని వజ్రమును నిలిపినాఁడు. రాక్షసులలో మిగుల బుద్ధిమంతుఁడు. బలవంతుఁడు. వీనిచేవానరులు చావకముందే వీనిని జంప యత్నింపుము. వీఁడు వానరులచేఁ జచ్చువాఁడు కాఁడు. ఇట్లు చెప్పుచుండఁగా నింతలో.

శా. జ్యాఘోషం బతిభీషణంబుగ ధరా చక్రంబు కంపింప ని
ర్వ్యాఘాతాద్భుత వేగుఁడై ప్లవగ సై న్యాబ్ధిన్ రణక్రీడనో
ల్లాఘత్వంబునఁ జొచ్చి మందరము లీలన్ హల్లకల్లోల మై
మోఘప్రాణము నై కలంగఁ, దిరుగం బూనెన్ సురారాతియున్. ౧౬౭౯

అర్థములు. జ్యాఘోషంబు = అల్లెత్రాటి మ్రోఁత, నిర్వ్యాఘాత = అడ్డములేని, అద్భుత వేగుఁడై =ఆశ్చర్యకరమైన వేగముగలవాఁడై, రణక్రీడనోల్లాఘత్వంబునన్ = యుద్ధక్రీడయందలి పటుత్వముచేత, "ఉల్లాఘో నిర్గతోగదాత్" అమరము. హల్లకల్లోలము = అల్లకల్లోలము, మోఘప్రాణము = వ్యర్థమైన శక్తి గలదై.

తాత్పర్యము

మహాభయంకరముగా నల్లెత్రాడు మ్రోయుగా భూచక్రము వణకఁగా నడ్డములేని వేగముగలవాఁడై వానరసేన యనెడి సముద్రమును మందరమువలె బ్రవేశించి యుద్ధకేళీసామర్థ్యంబున నల్లకల్లోలముచేసి యది శక్తిహీనమై కలఁత చెంద రాక్షసుఁడు తిరుగఁబూనెను. "దేహాంతరానిలే ప్రాణో జీవాత్మ పరమాత్మనోః ఆయురింద్రియ సత్వేషు ప్రణవే కార్యమర్మణి" నానా. ర.

చ. వడిఁ గుముదుండు నీలశర భద్వివిదుల్ సహమైంద తారుఁ బె
న్బిడుగులువోలె తాల నవ నీజములన్ గిరిశృంగకోటి దం
దడిఁ బయి వైవ బాణముల దానవనాథతనూజుఁ డన్నిటిన్
బొడి పొడి చేసి తత్కపుల భూరిశరంబులఁ గ్రుచ్చి నొంచినన్. ౧౬౮౦

అర్థములు. అవనీజములన్ = చెట్లను, దండడిన్ = విస్తారముగ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఓరువరానినొవ్వడర • నొం డెది సేయఁగ లేక విచ్చి య
వ్వీరులు పాసి పోవఁ గని • వింశతిబాహుసుతుండు వారిఁ గం
ఠీరవ మోలి జింకల వ•నిన్ బెదరించెడి మాడ్కిఁ దోలుచున్
జేరఁగ వచ్చి భానుకుల•శేఖరు నిట్లను గర్వ మేర్పడన్. ౧౬-౪౧

అర్థములు. విచ్చి=చెదరిపోయి, కంఠీరవము=సింహము, వనిన్=అడవియందు.

తాత్పర్యము

సహింపరాని బాధచే వా రెచ్చటి వా రచ్చటనే చెదరిపోఁగా నతికాయుఁడు సింహ మడవిలో జింకల బెదరించినట్లు తఱుముచు రామచంద్రునియొద్దకు వచ్చి గర్వముతో నిట్లనెను.

—• అతికాయుఁడు లక్ష్మణుఁ దూలనాడుట •—

ఉ. వచ్చినవాఁడఁ జాపశర•పాణిని నై, బలవిక్రమంబులన్
హెచ్చినవాఁడఁ, బ్రాకృతుల • నేయనివాఁడ, రథస్థితుండ, నీ
యిచ్చటి సేనలోన నని•సేయ సమర్థుఁడు గల్గె నేని తా
వచ్చును గాక ముంగలికి • వైరి మటన్న సుమిత్రపుత్రుఁడున్. ౧౬-౪౨

అర్థములు. ప్రాకృతులన్=సామాన్యులను, పామరులను.

తాత్పర్యము

రామా! విల్లు బాణములు ధరించి వచ్చినాఁడను. బలపరాక్రమములచే నతిశయించిన వాఁడను. సామాన్యులపై బాణము ప్రయోగింపని వాఁడను. కావుననే వానరుల బాధింపక నీ మీఁదికి వచ్చితిని. రథమునందున్న వాఁడను. ఇచ్చట నుండు నీ సేనలో నెవఁడైన నాతో యుద్ధము సేయ సమర్థుఁడు గల్గెనేని ముందరికి రానిమ్ము అనిన లక్ష్మణుఁడు.

చ. చంగున దాఁటి శాతశర•చాపములం గొని మున్ను నిల్చి మా
తంగకరాభ హస్తమున • ధారిణిశైల దిశాబ్ధిదేవతా
ధ్వాంగణ పూరణంబుగను • జ్యారవమున్ ఘటియింప భీతమై
పొం గణఁగన్ నిజానుచర•పూగము రావణనందనుండునున్. ౧౬-౪౩

అర్థములు. మాతంగ కరాభహస్తమున = ఏనుఁగు తొండము వంటి చేతితో, ధారిణి = భూమి, శైల = పర్వతము, దిశా = దిక్కులు, అబ్ధి = సముద్రము, దేవతాధ్వాంగణ = ఆకాశ ప్రదేశము, పూరణంబుగన్ = నిండునట్లు, జ్యారవము=నారిధ్వని,నిజానుచరపూగము=తన నెంటవచ్చిన భటుల సమూహము.

తాత్పర్యము

ఆమాట వాఁడనఁగానే లక్ష్మణుఁడు చివాలున వాని ముందరకు దాఁటి నిలఁ

బడి వాఁడి బాణములను వింటిని దీసికొని యేనుఁగు తొండమువంటి చేతులతో భూమి కొండలు దిక్కులు సముద్రము ఆకాశము నిండునట్టు లల్లెత్రాడు మీటి ధ్వని కలిగింపఁగా భయపడి తనవెంట వచ్చిన భటుల గర్వమణఁగఁగా నతికాయుఁడు.

ఉ. దానికి విస్మయంబుపడి • దర్పమదాంధుఁడు గాన నిట్లనున్
మానవ! బాలకుండవు సు•మా రణమం దవిచక్షణుండవున్
మానుము పొమ్ము కాలనిభు • నన్నెటు తాఁకెడివాఁడ వీవు సుం
తేని పరాత్మశౌర్యవిధ • మెంచ వదెంతటి బాలిశుండవో. ౧౬౪౮

అర్థములు. దర్పమదాంధుఁడు=బలమదముచేఁ గన్నులు తెలియనివాఁడు, అవిచక్షణుండవు = అసమర్థుఁడవు, మానవ = మనుష్యుఁడా! ఇది యసామర్థ్యమును దెలుపఁ జెప్పఁబడెను. సుంతేని=కొంచెమైన, పర + ఆత్మ శౌర్యవిధము= ఇతరుల యొక్కయుఁ దనయొక్కయు శౌర్యవిధము, బాలిశుండవో=మూఢుఁడవో.

తా త్ప ర్య ము

ఆధ్వని విని యాశ్చర్యపడి బలమదముచేఁ గన్నులుగానక యిట్లనెను. ఓరీ మనుష్యుఁడా! నీకు పుట్టువుచేతనే మనుష్యుల కును మాతో యుద్ధముచేయు యోగ్యతలేదు. అందుఁ బిల్లవాఁడవు. అందు యుద్ధమునందు నేర్పుచాలనివాఁడవు. ఇట్టి నీవా నాతో యుద్ధముచేయ వచ్చితివి. పోపో మృత్యువువంటి నన్ను నీవా యెదిరించి నిల్చెడివాఁడవు. నీవెంతటి మూఢుడవో యెదిరి బలము నీబలము నాలోచింప లేకున్నావే.

ఉ. మామక హస్తముక్త శిత•మార్గణ పంక్తి వడిన్ సహింపఁగా
హైమమహీధరంబు గగ•నావను లైనను నేర వన్న నీ
వేమిటి లెక్క, లేవు తలఁ•పేటికి నిద్రితకాలవహ్నిఁ, బో
పో మహి విల్లువైచి చెడి•పోవకు చావకు మగ్గతుండవై. ౧౬౪౯

అర్థములు. మామక=నాయొక్క, హస్త=చేతివలన, ముక్త = విడువఁబడిన శితమార్గణ పంక్తిన్ = పదునైన బాణముల వరుస, వడిన్ = వేగముగా, నిద్రిత=నిద్ర చెందిన, కాలవహ్నిన్=ప్రలయ కాలాగ్నిని, మగ్గతుండవై = నన్నుఁ బొందిన వాఁడవై.

తా త్ప ర్య ము

నా హస్తములచే విడువఁబడిన బాణముల వేగమును సహించుటకు మేరు పర్వతమైనను సమర్థముగాదు. ఆకాశము భూమియుఁ జాలవు అనిన నీవేమి లెక్క? చల్లారిన ప్రలయకాలవహ్నిని నేల మరలఁ బురికొల్పెదవు? విల్లు పాఱవైచి పో పొమ్ము. నాయెదుటఁబడి చావకుము.

ఉ. పో నని కండకావరము • పొంగున నిల్చెద వేని యిప్పుడే
ప్రాణములు త్యజించి యమ•పట్టణముం జనువాఁడ వోనరా!

యీ నిశితాశుగోత్కరము • హేమపరిష్కృత మా త్రిశూలముం
బోనిది ధ్వస్త శాత్రవస•మూహమదంబును లెస్స చూడుమీ. ౧౬౮౬

అర్థములు. నిశితాశుగోత్కరము=పదునుగల బాణసమూహము, హేమపరిష్కృతము = బంగారుచే నలంకరింపఁబడినది, ఆ త్రిశూలమున్=ఆ శివునిచేతి త్రిశూలమును, ధ్వస్త = నాశముచేయఁబడిన, శాత్రవసమూహ = విరోధుల గుంపుల, మదంబును=గర్వము గలది.

తాత్పర్యము

నేను బోనని కండపొగరుచే నిలిచితివా, యిప్పుడే ప్రాణముల వదలి యమపురికిఁ బోవుదువు. ఓ మనుష్యుఁడా! బంగారు రేకులచే నలంకరింపఁబడిన ఈవాఁడి బాణ సమూహము ప్రసిద్ధికెక్కిన శివుని త్రిశూలముతో సమానమైనది. శత్రువుల మదమును నాశము చేయునది. చక్కఁగా జూడుము.

కం. ఆశీవిషములఁ బోలు మ, దాశుగములు నీదు రక్త • మాస్వాదించున్
దాశరథి క్రుద్ధ కేసరి, యాశమెయిన్ నాగరాజు • నస్రము బోలెన్. ౧౬౮౭

అర్థములు. ఆశీవిషములన్=పాములను, ఆస్వాదించున్=త్రాగును, నాగరాజు నస్రము=ఏనుఁగు నెత్తురు.

తాత్పర్యము

సర్పముల వంటి నా బాణములు నీ రక్తమును ఏనుఁగు నెత్తురు సింహము త్రావినట్లు త్రావును.

—• లక్ష్మణుఁ డతికాయు ధిక్కరించి పలుకుట •—

మ. అని నారాచము వింటఁ గూర్చఁగ సగ•ర్వాత్యుగ్రరోషోక్తులన్
విని వహ్నిప్రసవేక్షణుం డయి మహా•వీర్యుండు సౌమిత్రి యి
ట్లను వాఙ్మాత్రమునం బ్రధానుఁడవు దై•త్యా! కావు, స్వశ్లాఘ న
జ్జనుఁ డన్ ఖ్యాతియు రా దిటేటికి వృథా•జల్పంబు లీ వాడఁగన్. ౧౬౮౮

అర్థములు. నారాచము=బాణము, వహ్నిప్రసవేక్షణుం డయి=నిప్పులు వెలువరించు కన్నులుగలవాఁడై, వాఙ్మాత్రమునన్=ఉత్తమాటలచేతనే, ప్రధానుఁడవు = గొప్పవాఁడవు, స్వశ్లాఘన్ = తన్నుఁ దాను బొగడుటచే, ఖ్యాతియు = కీర్తియు, వృథాజల్పంబులు=వ్యర్థపు మాటలు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి వాఁడు బాణమును వింట సంధింపఁగా, గర్వము రోషముతోఁ గూడిన యామాటలు విని కన్నుల నిప్పులు గ్రక్కుచు మహాబలశాలి లక్ష్మణుఁడు ఓరీ! రాక్షసుఁడా! మాటలు చెప్పుటచేతనే నీవు గొప్పవాడవు కాబోవు. తన్నుఁ దాను బొగడుటచేఁ గీర్తియు రాదు. ఏల వృథా వదరెదవు?

కం. శరములు శరాసనంబును, గరములఁ గొని నిల్చినాఁడఁ • గదనము సేయన్
బిరుదంబు లాడ నేటికి?, దురితాత్మా! చూపు నీదు•దోర్బల మెల్లన్.

అర్థములు. శరాసనము = విల్లు, కదనము = యుద్ధము, బిరుదంబులు = పౌరుషపు మాటలు, దోర్బలము=భుజబలము.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఊరక పొగడుకొనంగాఁ, గారియమే? చూపు నీకుఁ • గల శక్తిఁ గ్రియన్
బౌరుషయుక్తుం డగు న,ప్పూరుషుఁడే శూరుఁ డనఁగ • భువి నెన్నఁబడున్.

అర్థములు. కారియమే=కార్యమా, ప్రయోజనము గలదా?

తా త్ప ర్య ము

ఊరక నిన్ను నీవు పొగడుకొనిన యెడల లాభ మేమి? మాటలు కార్యములు చేయునా? నీకుఁగల శక్తి చూపుము. కార్యములు చేయుటయందుఁ బౌరుషము చూపువాఁడే పురుషుఁడనఁబడును.

ఉ. పోఁడిమి సర్వశస్త్రములు • పూనినవాఁడవు, తేరిమీఁద ను
న్నాఁడవు, కేలఁ జాపము ఘు•నంబుగఁ బట్టిన వాఁడ, వింక నీ
వేఁడిమియుం బరాక్రమము • విశ్రుతభంగిని జూపరాదె క్రొ
వ్వాఁడిలకోర్ల నేని మఱి • వాలిన యస్త్రములాళి నేనియున్. ౧౬-౭౧

అర్థములు. పోఁడిమిన్ = అందముగాఁ విశ్రుతభంగిని = ప్రసిద్ధమగు రీతిగా, క్రొవ్వాఁడి=క్రొత్త+వాఁడి=క్రొవ్వాఁడి, క్రొత్త పదునుగల, క్రొత్తగాఁ బదును పెట్టబడిన, లకోర్ల = బాణముల—'నచ దేశ్యపదే' దేశ్యపదముల దీర్ఘాంతములు హ్రస్వములు గావను సూత్రమునకు నవలా నేజా లకోరీలు దృష్టాంతములుగా నీయఁబడినవి కాని కొన్ని శబ్దములు దీర్ఘాంతములు గాను హ్రస్వములు గాను గవులు ప్రయోగించి యున్నారు. 'హెచ్చిన బొమ్మిరిండ్లఁ గడియించిన చూపు లకోరి కోలలన్ – చంద్రా – ౧ ఆ. ఇట్టులే పల్లకీ – పల్లకీలు–పల్లకులు. 'అన్నవలముద్దు మోమును' విక్ర – ౫ ఆ– అనుఁగుఁ జుట్టంబైన యలవసంతుని రాక విరజాజిబలు నేజ విఱుగఁజూచి – చంద్ర – ౩ ఆ.

తా త్ప ర్య ము

ఓరీ రాక్షసుఁడా! యలంకారముగ సర్వశస్త్రములు దేహమునిండ ధరించితివి. నా కొక్క విల్లు తప్ప వే ఱాయుధము లేదు. నీవు తేరి మీఁద నున్నాఁడవు నేను నేలమీఁద రెండుకాళ్ళ నిలఁబడినాను. శస్త్రములే గాక చేత విల్లుకూడఁ బట్టినావు. నీ బాణములు క్రొత్తగా పదును పెట్టఁబడినవి. నావి ప్రాతవి. ఇంత యానుకూల్యము నీ కుండియూ నీ తీవ్రత యెంతో పరాక్రమ మెంతో నలుగురు మెచ్చునట్లు బాణములచే నైనను అస్త్రములచే నైనను జూపరాదా! వ్యర్థముగా నేల వదరెదవు?

కం. ఖండనమున నీకుంగల, గండెల్ల నెఱింగి పిదప • క్రన్నఁగూల్చెద నీ
కాండంబుల నీశిరముం, బండిన పెనుఁదాటిపండుఁ•బవనుఁడువోలెన్. ౧౬౯౨

అర్థములు. గండు = మగతనము.

తాత్పర్యము స్పష్టము.

యుద్ధమునందు నీ వెంత మగతనము గలవాఁడవో తెలిసికొని యా పిదప గాలి తాటిపండును నేలఁ బడఁగొట్టినట్లు నా బాణములచే నీ తలఁ బడఁగొట్టెదను.

కం. కనియెదవు గాక మామక, సునిశితశరపాళి స్వర్ణ•సుందరము భవ
త్తనుగతరుధిరము శరశ,ల్యనిచయకృత మార్గములన•నాస్వాదింపన్. ౧౬౯౩

అర్థములు. మామక సునిశిత శరపాళి=నా పదునైన బాణసమూహము. స్వర్ణసుందరము=బంగారుచే నందమైనది, భవత్ = నీయొక్క, తనుగత = దేహమునం దుండు, రుధిరము = నెత్తురు, శరశల్య = బాణముల ములుకుల సమూహములచే, కృత = చేయఁబడిన, మార్గములను = త్రోవల, ఆస్వాదింపన్ = త్రావఁగా.

తాత్పర్యము

బంగారుచే నందమైన నా పదునుగల బాణములు ఇనుప కొనల ములుకులచేఁ జేయఁబడిన మార్గములలోఁ బోయి నీ దేహమందలి నెత్తురు త్రావఁగా నీవే చూడఁగలవు.

ఉ. బాలుఁడవంచు నన్నసుర•వర్యుఁడ! హేళన మేల సేయ? నే
బాలుఁడనో జరుండనో ప్రధ•నం బిది నమ్ముము నీకు మృత్యువన్
బాలుఁడు గాడె వామనుఁడు • బాలిశ! మూఁడు జగంబు లోలిఁ దా
హాళిఁ ద్రివిక్రమక్రమత • నాఁచి కొనండె జగం బెఱుంగఁగన్. ౧౬౯౪

అర్థములు. హేళనము = పరిహాసము, జరుండనో = ముసలివాఁడనో. త్రివిక్రమక్రమత=మూఁడడుగులుంచు క్రమముచేత, క్రమము = అడుగులు పెట్టు, "శక్తౌ చరణవిక్షేపే పరిపాట్యామపి క్రమమ్ ॥నానా॥ ర.

నేను బాలుఁడనని నన్నేల పరిహాసించెదవు? నేను బాలుఁడనో వృద్ధుఁడనో యొవఁడనైన నగుదునుగాక! నీకేమో మృత్యువనే. మూఢుఁడా! వామనుండు బాలుఁడు గాఁడా! ప్రపంచమునంతయు మూఁడడుగులకు లోపఱుచుకొనలేదా? వయసుగాదు ప్రధానము. కొండ యెంతది? పిడుగెంతది?

## —• లక్ష్మణాతికాయుల యుద్ధము •—

సీ. అని పలికి నతికాయుఁ•డతిరోషవశుఁ డయి, తీవ్రాశుగము సం•ధించె వింట
వారల యుద్ధంబుఁ • బరికింప నింటను, ఖచరదేవర్షులు • గములుగట్టి
రసురుండు లక్ష్మణు•నాశీవిషోపమాం,బకమున దివి ద్రిమ్మంగు • భంగిన్నై చెం
సౌమిత్రియును నర్ధ•చంద్రశరంబుల, ఖండించి నై చెం ద•తాకుండవరము

ఆ. కృత్తభోగఫణి స♦దృక్షబాణముఁ గాంచి, పంచవిశిఖములను ♦ బరఁగఁ జేసె
    నసురభర్త్రతనయుఁ ♦ డవియెల్ల రామానుజుండు చేరకుండఁ ♦ జెండి వైచె.

అర్థములు. ఆశీవిషోపమానాంబకమునన్=పాముతో సమానమైన బాణముచే, కృత్తభోగ = నఱకఁబడిన దేహముగల, ఫణిసదృక్ష=పాముతో సమానమైన, బాణమున్=బాణమును.

తాత్పర్యము

లక్ష్మణుఁ డీ ప్రకారము చెప్పఁగా నతికాయుఁడు మిగులఁ గోపించి తీక్ష్ణబాణమును వింట సంధించి వైచెను. వారి యుద్ధము చూచుటకు ఖచరులు దేవర్షులు మింట గుంపులు గట్టిరి. అతికాయుఁడు లక్ష్మణుని సర్పముతో సమానమైన బాణమును వైవఁగా నది యాకాశమును మ్రింగు విధమున రాఁగా దానిని లక్ష్మణుఁ డర్ధచంద్ర బాణమున ఖండించెను. దేహము పోయిన పామువంటి బాణమును జూచి మరల నైదు బాణములను ప్రయోగించెను. లక్ష్మణుఁడు వానినెల్ల ఖండించెను.

ఉ. అంతటఁ బోక హేతిసహి♦తానలతుల్యపృషత్క మొండు క
    ర్ణాంతము సోఁక లాగి యమ♦రాహితుఫాలముఁ గాఁడ వైవఁగా
    నెంతయు నెత్తుటం దడిసి ♦ యేర్పడి యా శర మొప్పె భూరిశై
    లాంతగతోరగం బనఁగ ♦ నాతని మోమునఁ జిత్రభంగిగన్. ౧౬౯

అర్థములు. హేతిసహిత=జ్వాలతోఁ గూడిన, అనల=అగ్నితో, తుల్య=సమానమైన, పృషత్కము = బాణము, కర్ణాంతము = చెవికొన, అమరాహితుఫాలము = రాక్షసుని నొసలు, భూరిశైలాంత గతోరగంబు = పెద్ద పర్వతము కొనను (శిఖరమును) పొందిన పాము.

తాత్పర్యము

అతికాయుని బాణములు ఖండించుటయేగాక జ్వాలతోఁ గూడిన యగ్నివంటి బాణ మొకటి చెవికొనవఱకు లాగి రాక్షసుని నొసట నాటునట్లు వేయఁగా నది పెద్ద కొండశిఖరమందున్న పామువలె నతని ముఖమునందు నొప్పెను.

కం. ఆ శరము తాఁకుపెట్టున, కాశరముఖ్యుండు సైఁప ♦ కాకంపించెన్
    శ్రీశంకరశరహతకీ, నాశపురద్వార మనఁగ ♦ నాకులు పొంగన్. ౧౭౦

అర్థములు. ఆ శరము తాఁకుపెట్టునకు=ఆ బాణముతగిలిన దెబ్బకు, ఆశరముఖ్యుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, ఆకంపించెన్=దేహమంతయు వణఁకెను, శ్రీశంకర శరహత=శ్రీ శివుని బాణముచేఁ గొట్టఁబడిన, కీనాశ పురద్వారము = రాక్షస పురములద్వారము, నాకులు = దేవతలు.

తాత్పర్యము

ఆ బాణము తగిలిన దెబ్బకు ఆ రాక్షసుఁడు సహింపలేక త్రిపురాసుర సంహార

సమయమున శివుని బాణము దెబ్బకు రాక్షసుల పురద్వారమువలె దేవతలు సంతో
షింపగా వణఁకెను.

సీ. ఆ యేటు వడి యసు•రాధిపపుత్రుండు, చింతించి తన్నాశ్వ•సించి కొనుచుఁ
గర్తవ్యము విమర్శ•గావించి లక్ష్మణుఁ, గాంచి యిట్లాడు న•క్కడిమికాఁడు
మేలు నా యరివైన • మెచ్చితి నీ బాణ,శక్తి లాఘవము రా•జన్యతనయ
యని శిరంబును వంచి•హస్తంబులను గ్రింద, మోపి రథస్థుఁడై•యేపు మెఱసి
తే. యిచ్చకొలఁదిని సమరోర్వి • హెచ్చి తిరుగు
నొకటి మూఁడైదు నేడును • నుగ్రశరము
లెసఁగి గైకొని సంధించి • యీడ్చి వైచెఁ
బుంఖహాటకకాంతులు • పుడమి నిండ.

అర్థములు. కర్తవ్యము=చేయవలసిన కార్యము, విమర్శగావించి = ఆలోచించి, కడిమికాఁడు = బలవంతుఁడు, అరివైనన్ = శత్రువైనను, పుంఖహాటక కాంతులు = పింజల బంగారు కాంతులు.

### తాత్పర్యము

ఆ దెబ్బదిని యతికాయుఁడు తనలో విచారపడి మరల సమాధానపఱచి కొని చేయవలసినపని యాలోచించి లక్ష్మణుఁజూచి యా బలశాలి యిట్లనియె. లక్ష్మణా! నీవు నా పగవాఁడవైనను నీ బాణశక్తియు ప్రయోగించు వేగమును మెచ్చుకొంటిని యని తలవంచి చేతులుమోపి మరల వానిని స్వాధీనమునకుఁ దెచ్చుకొని రథము మీఁదనుండి తన యిష్టము వచ్చినట్లు లొకచోట నిలువక తిరుగుచు నొకటి-మూఁడు-నైదు-ఏడుగా బాణములను సంధించి యీడ్చివేయఁగా వాని పింజల బంగారుకాంతులు దెసల నిండెను.

ఉ. ఒక్కటి దక్క కుండ న్నృప•లోత్తముఁ డన్నిటిఁ జెండివైచెఁ దాఁ
జెక్కుశరంబు లొక్క మొగిఁ • జేరలుక న్నిగిడించి యేమియున్
స్రుక్కక సంభ్రమంపడక • సూరకులాగ్రణి యిట్లు మీఱిచన్
గ్రక్కుచు నిప్పులయ్యసుర•కాండ మొకండు స్తనాంతరంబునన్. ౧౬౯

అర్థములు. ఒక్కటి దక్కకుండన్ = ఒక్కటియైనను తప్పిపోకుండ, సూరకులాగ్రణి = సూర్యవంశము వారిలో శ్రేష్ఠుఁడు, స్తనాంతరంబునన్ = రొమ్మున.

### తాత్పర్యము

వాఁడు వేసిన వానిలో నొక్కటియైనను వదలిపెట్టక యా రాజశేఖరుఁ డన్నిటిని ఖండించెను. తా ననేక బాణములు ప్రయోగించినను కొంచెమైన నొప్పి చెందక తొట్రుపడక లక్ష్మణుఁడు విజృంభింపఁగా జూచి నిప్పులు గ్రక్కుచు నా రాక్షసుఁ డొక్క బాణము రొమ్మున.

తే. కీలుకొల్పిన నెత్తురుల్•జాలువాఱె, మత్తదంతావళి విముక్త • మదజల మన
లక్ష్మణవిభుండు దద్వ్యథ•లక్ష్య మిడక, శాతనారాచ మొక్కటి•సంగ్రహించి.

అర్థములు. కీలుకొల్పినన్=నాటవేయఁగా, మత్తదంతావళి విముక్తమద జలమనన్=మదించిన యేనుఁగు విడిచిన మదపునీటివలె, శాతనారాచము = పదునైన బాణము, సంగ్రహించి=తీసికొని.

తాత్పర్యము

నాటవేయఁగా మదపుటేనుఁగు నుండి మదజలము కాఱునట్లు నెత్తురు కాలువఁగా బాఱెను. లక్ష్మణుఁడు దానిని లక్ష్యపెట్టక పదునైన బాణ మొకటి తీసికొని.

సీ. పావకమంత్రానఁ•బ్రజ్వలింపఁగఁ జేసి, గుణమునఁ గూర్పఁగఁ•గుటిలచరితుఁ
డధిక వేగమున సౌరాస్త్రము సంధించె, నిరువురుఁ దెగఁదీసి•యేయుటయును
నవి దాఁకి యొండొంటి • నంబరంబునఁ గ్రుద్ధ, భూరిభోగులభంగి•బోరి పోరి
యొక్కటి నొక్కటి • నురువు లేకుండఁగ, భస్మీకృతంబులై • పడియె నేలఁ

ఆ. దనమహాస్త్ర మిట్లు • దగ్ధమై పోవనై, షీకమెత్తి యసుర • చిమ్మటయును
నంబుజాప్తవంశ్యుఁ • డైంద్రబాణంబున, దాని హతముఁ జేసె•దర్ప మెసఁగ.

అర్థములు. గుణమునన్=అల్లెత్రాటియందు, కుటిలచరితుఁడు=మోసపు నడవడి గలవాఁడు, భూరిభోగులభంగిన్=పెద్ద పాములవలె, ఉరువు = రూపము, భస్మీకృతంబులై=భస్మము చేయఁబడినవై.

తాత్పర్యము

ఆగ్నేయమంత్రమున మండునట్లుచేసి యల్లెత్రాటఁ గూర్పఁగా మోసపు నడవడిగల రాక్షసుఁడు సౌరాస్త్రము సంధించెను. ఇద్దఱు నారిలాగి విడిచిరి. అవి యొకటొకటి యాకాశమునఁ జెనుబాములవలె కొట్లాడి కొట్లాడి తుదకు భస్మమై రూపుమాసిపోయెను. తన మహాస్త్ర మిట్లు దగ్ధమైపోవఁగా నతికాయుఁడు ఐషీక బాణమును వైచెను. దానిని లక్ష్మణుఁ డైంద్రాస్త్రమున ఖండించెను.

కం. ఐషీకం బీగతి, నిశ్శేషంబుగ, జెడిన దనుజ • శేఖరుఁడు మహా
రోషంబున యామ్యాస్త్రము, భీషణముగ వైచె నసుర•భీకరువిూఁదన్.

తాత్పర్యము

ఐషీకాస్త్రము నిశ్శేషముగఁ జెడిపోఁగా నతికాయుఁడు మిగుల రోషంబున యామ్యాస్త్రము ప్రయోగించెను.

కం ఆ యామ్యశరవిజృంభణ, వాయుశరంబున సుమిత్ర • పట్టియుఁ దఱుఁగన్
జేయుచు శరవర్షం బతి,కాయునిపైఁ గురిసెఁ దెఱపి•గానకయుండన్. ౧౨౦౩

తాత్పర్యము

ఆ యామ్యబాణము నుద్రేకమును లక్ష్మణుఁడు వాయవ్యబాణమునఁ జెఱచుచు బాణవర్షంబును దెఱపిలేకుండ నతికాయునిపైఁ గురిసెను.

ఉ. ఆమహాశుగోత్కరము ◆ లాతనిఁ దాఁకుచు మిట్టిపాటునన్
భూమిని వ్యర్థమై తొరఁగ ◆ భూవరపుత్రకుఁ డుగ్రమూర్తియై
యేమియుఁ దీవ్రతన్ విడక ◆ యేసె మహాంబకముల్ సహస్రముల్
భూమిదొరంగె నవ్వియును ◆ బోల్పతి ద్రుంప కవధ్యవర్మునిన్. ౧౭౪౮

అర్థములు. మహాశుగోత్కరము = గొప్ప బాణముల సమూహము, మిట్టిపాటునన్ = ఎగసిపడుటచే, అవధ్యవర్మునిన్ = భేదింపరాని కవచము గల వానిని.

## తాత్పర్యము

ఆయన వేసిన మహాబాణము లన్నియు నతికాయుని దాఁకి యెగిరి యావలఁ బడెనే కాని యొకటియైన దేహమున నాటలేదు. ఇట్లు తన బాణములు వ్యర్థమై నేలఁబడినను విడువక భయంకరాకారుఁడై వేగమును గొంచెమైనఁ దగ్గింపక వేల కొలఁది గొప్ప బాణములు వైచెను. అవి యభేద్యకవచము గల యతనిని చంపక వ్యర్థమై పడెను.

## —◆ లక్ష్మణుచే అతికాయుండు చచ్చుట ◆—

సీ. బాణమొక్కండైనఁ ◆ బలలాశు బాధింపఁ జాలక, యున్న లక్ష్మణునిఁ జేరి
పవనుఁ డిట్లను వీఁ డవధ్యతనుత్రాణుఁ, డజునివరం బది ◆ యణఁపరాదు
బ్రహ్మాస్త్రమున వీఁడు ◆ వధ్యుండు తక్కిన, యే విశిఖంబునఁ ◆ జావఁ డాజి
వరలబ్ధకవచుండు ◆ పరమాస్త్రసంవేది, బలియుఁ డీతం డిటు ◆ లలఁతిఁ బోఁడ
ఆ. టన్న లక్ష్మణుండు ◆ నసమానవీర్యుండు, శ్వసనుమాటఁ బట్టి ◆ చాపమునను
బ్రహ్మశరముఁ గూర్చ ◆ భాస్కరచంద్రగ్రహోర్వి దిఙ్నభంబు ◆ లుదిలగొనియె.

అర్థములు. పలలాశున్ = రాక్షసుని, పవనుఁడు = వాయుదేవుఁడు, అవధ్యతనుత్రాణుఁడు = భేదింపరాని కవచము గలవాఁడు, వధ్యుండు = చంపఁబడువాఁడు, వరలబ్ధకవచుండు = వరముచే సంపాదించిన కవచము కలవాఁడు, పరమాస్త్రసంవేది = గొప్ప యస్త్రములన్నియుఁ దెలిసినవాఁడు, బలియుఁడు = బలవంతుఁడు, అలఁతిబోఁడు = కొంచెములోఁ బోవువాఁడు కాఁడు, శ్వసను = వాయువుయొక్క, భాస్కర = సూర్యుఁడు, చంద్ర = చంద్రుఁడు, ఉర్వి=భూమి, దిక్=దిక్కులు, నభంబు=ఆకాశము, ఉదిలఁగొనియె=పరితపించెను.

## తాత్పర్యము

ఒక్క బాణమైనను రాక్షసుని బాధింపలేకుంటఁ జూచి వాయుదేవుఁడు లక్ష్మణు సమీపించి యిట్లనియె. వీఁ డభేద్యకవచుఁడు, అది బ్రహ్మవరము తప్పదు. వీఁడు బ్రహ్మాస్త్రమునఁ జచ్చును. తక్కిన యే బాణము వీనిని జంపఁజాలదు. ఏలన వీని కవచము వరముచే సంపాదింపఁబడినది. అది బాణములచేఁ దెగదు. ఇఁక నస్త్రము లందమా? అన్ని మహాస్త్రములు వీఁ డెఱుఁగును. నీవే యస్త్రము వేసి

నను బదులస్త్రము వేయును. బలవంతుఁడు కావున నల్పప్రయత్నముతోఁ బోవు వాఁడు కాఁడు, అని చెప్పఁగా అసమానబలము గల లక్ష్మణుఁడు వాయుదేవుని మాట గ్రహించి వింట బ్రహ్మాస్త్రమును సంధింపఁగా సూర్యచంద్రగ్రహాభూములు దిక్కులు ఆకాశము పరితపించెను. 'జ్యాపాస్త్రాస్వ'యని,'ఉర్వి' ప్రాస్వాంతముగాఁ బ్రయోగింపఁ బడెను.

కం. యమకింకరసన్నిభమై, యమలసుపుంఖంబు నైన యా శరము నమో
ఘమహావేగము నైచెను, విమతునిపై నదరు లుమియ వీరుండలుకన్.

అర్థములు. యమకింకర సన్నిభము = ప్రాణము తీయుటయందు యమ కింకరులతో సమానము, అమల = నిర్మలమైన, సుపుంఖము = మంచి పింజగలది, అమోఘమై=వ్యర్థముగానిదియు, మహావేగము=మిగుల వేగముగలది, విశేషణో గాయపదము, విమతునిపై=విరోధిమీఁద, అదరులు=మిణుఁగురులు.

యమకింకరులవలెఁ బ్రాణము తీయునదియై నిర్మలమైన మంచిపింజ గలదై వ్యర్థము గానిదై, మిగుల వేగము గలదగు నా శరము నిప్పులు గ్రక్కుచుండఁగా శత్రువుమీఁద వీరుఁడగు లక్ష్మణుఁడు కోపముతో వైచెను.

సీ. దానివచ్చుటఁ గాంచి దారుణశరములఁ, బెక్కిట నతికాయుఁ డుక్కు మిగిలి
పరఁగింప వానిని భస్మీకరించుచుఁ, దనుఁ జేరశక్తిగ దాకుఠార
శూలహులాదుల సూరుండు తాఁచిన, నాఁ డుకళ యుద్వాని యుదుటు మాన్పి
మణికిరీట ప్రభామండిత శిరమును, సశిరస్త్రముగఁ గాలె క్ష్మాతలమున
ఆ. హిమధరాధరంబు శృంగంబువడువున, వతని శిరము ధరణి బతిత మైన
నిహతశేషులైన నిశిచరుల్ దీనులై, యెప్పమాము లొప్ప నెల్లవారు. ౧౦౪

అర్థములు. దానివచ్చుట = అదివచ్చుట, "ధాతుజ విశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠియగు," ప్రౌ. వ్యా. కారక. సూ. ౧౫. భస్మీకరించుచున్ = బూడిదగాఁ జేయుచు, హుళా దులన్ = హుళము = కొనలు తీరిన రెండేసి కత్తులు కొనలందుఁ గల యాయుధ విశేషము; 'హుళిం ద్విపల పత్రాగ్ర' మ్మని వైజయంతి, తాఁచినన్=కొట్టినను, ఉదుటు=గర్వము, మణికిరీట ప్రభామండిత శిరమును = రత్నమును చెక్కిన కిరీట కాంతులచే నలంకరింపఁబడిన తలను, సశిరస్త్రముగన్=తలకు దెబ్బ తగులకుండ రక్షించు తలకవచము(టోపీవంటిది)హిమధరాధరంబు=హిమవత్పర్వతముయొక్క, శృంగంబు=శిఖరము, నిహతశేషులు=చావఁగా మిగిలినవారు.

## తాత్పర్యము

అదివచ్చుట చూచి యతికాయుఁడు భయంకరములైన యనేక బాణములచే బలముకొలఁది ప్రయోగింపఁగా వానినెల్ల కాల్చివైచుచుఁ దనమీఁదికి రాఁగా శక్తి

గద, గొడ్డలి శూలము హలము మొదలగు నాయుధములచే నాశూరుండు కొట్టి నను నది వాని శిరస్సును తల కవచముతోడ నేలఁగూల్చెను. హిమవత్పర్వత శిఖరము వలె నతని తల నేలఁబడఁగా చావఁగా మిగిలిన రాక్షసులెల్ల వారు దుఃఖితులై యేడ్పుముఖములతో.

కం. అమితప్రహారజనిత, శ్రములై వాపోవుచుం బురంబు ముఖముగా
సమరాభిలాష వీడి భ,యమునం బరువిడిరి క్రోఁతు లతిమెడి ననుచున్.

అర్థములు. అమిత ప్రహార జనితశ్రములై = మితి మీఱిన దెబ్బలవలన కలిగిన బడలిక గలవారై, వాపోవుచున్ = ఏడ్చుచు, సమరాభిలాష = యుద్ధమం దలి కోరిక, అతిమెడిని=పైబడునని.

తాత్పర్యము

వానరులు కొట్టిన మితిలేని దెబ్బలచే గాసిపడి యేడ్చుచు యుద్ధమందలి కోరిక వదలి యింక నిందుండిన వానరులు పైబడి చంపుదు రని భయపడి యూరి ముఖముగాఁ బరువెత్తిరి.

కం. వికచాననులగుచుం ద్వర,నకలవనేచరులు వచ్చి సౌమిత్రిని హ
ర్షకలితహృదయంబులతోఁ, బ్రకటగతిం బూజ చేసి ప్రణుతించి రటన్.

అర్థములు. వికచానను లగుచున్ = సంతోషముచే వికాసమొందిన ముఖముగల వారై, ఇట్లు చెప్పుటచే నీ రాక్షసుఁ డసాధ్యుఁడుగా నున్నాఁడే యుద్ధ పర్యవసాన మెట్లగునో యని సందిగ్ధ మనస్కులై యుండిరని భావము. హర్ష కలిత హృదయంబులతోన్ = సంతోషముతోఁ గూడిన మనస్సులతోఁ, ప్రణుతించిరి = స్తోత్రము చేసిరి.

తాత్పర్యము

వానరు లందఱు వికసించిన మోములు గలవార లగుచు శీఘ్రముగ సంతోషము గల మనస్సులతో వచ్చి లక్ష్మణుని గౌరవించి స్తుతించిరి.

**—౭౨-వ సర్గము. అతికాయాదులమృతి విని రావణుఁడు దుఃఖించుట—**

కం. అహితాంతకుఁ డగులక్ష్మణు, మహితశరంబులను బేరు మాయఁగ సంయ
న్మహి నతికాయునిమృతి విని, బహుళవ్యథ రావణుండు పనవుచు ననియెన్.

అర్థములు. అహితాంతకుఁడు = శత్రుసంహారము చేసినవాఁడు, మహిత శరంబుల = గొప్ప బాణములచే, సంయత్ + మహిన్ = యుద్ధభూమియందు, పనవుచున్ = ఏడ్చుచు.

తాత్పర్యము

శత్రుసంహారకుఁడగు లక్ష్మణుని గొప్ప బాణంబులచే నతికాయుఁడు యుద్ధ భూమియందుఁ జచ్చెనని రావణుఁడు విని మిగుల దుఃఖముచే నేడ్చుచు నిట్లనెను.

సీ. ధానుష్కరత్నంబు•దారుణకోపుండు, ధూమ్రాక్షుఁ డక్కటా•తూలి పోయె
నిస్తులవీర్య ప్ర•శస్త ప్రహస్తుండు, కాలునివాకడి•కండయయ్యె
సముదీర్ణ భుజపరా•క్రమ సువిదీర్ణ ది,గ్గజకుంభుఁ డల కుంభ•కర్ణుఁ డేఁడి ?
హాతుఁ డయ్యెనే దేవ•తాసుర సైన్యావి, కంపనుం డైన య•కంపనుఁడు
తే. వీరలెల్ల రసామాన్య•వీర్యయుతులు, దోర్బలాఢ్యులు నాహవ•దోహలులును
శత్రుసైన్యప్రధర్షణుల్•సాహసికులు, కటకటా కూలిరే రాము•కాండములను.

అర్థములు. ధానుష్కరత్నంబు = ధనుస్సు పట్టెడి వారిలో శ్రేష్ఠుఁడు, దారుణకోపుండు=శత్రువులయందు భయంకర కోపము గలవాఁడు, నిస్తులవీర్య ప్రశస్త ప్రహస్తుండు = అసమానమైన బలముచేఁ బొగడ్త గనిన ప్రహస్తుఁడు, కాలుని=యముని, వా=నోటి, కడికండ=అన్నపుముద్ద, సముదీర్ణ = మిగుల నధికమైన, భుజపరాక్రమ = బాహుపరాక్రమముచే, సువిదీర్ణ=చక్కఁగాఁ జీల్చబడిన దిగ్గజ = దిక్కులయందలి యేనుఁగుల, కుంభుఁడు = కుంభస్థలములు గలవాఁడు, దేవతాసురసైన్య = దేవతలయు అసురులయు సైన్యములచే, అవికంపనుఁడు = కదలింపఁబడనివాఁడు, దోర్బలాఢ్యులు = భుజబలసంపత్తి గలవారు, ఆహవ దోహలులు=యుద్ధమనిన సంతోషపడువారు, శత్రుసైన్య ప్రధర్షణుల్= విరోధుల సేనల నణఁచువారు, రాము కాండములను = రాముని బాణములచే, ఇందుఁ బేర్కొనఁ బడిన వారిలోఁ గుంభకర్ణుఁడు తప్పఁ దక్కినవారు రామునిచేఁ జచ్చినవారు కారు. కాకున్నను భటులు చేసిన కార్యము ప్రభువు చేసినట్లు చెప్పఁబడును గావున నిట్లు చెప్పఁబడెను రా జింటనుండి భటులు దూరదేశమున శత్రువుల జయించినను ప్రభువు జయించినట్లే చెప్పఁబడును. శరీరము చేయు కార్యములు ఆత్మ చేసినట్లు కదా చెప్పుదురు.

## తాత్పర్యము

విల్లుపట్టెడి వారిలో శ్రేష్ఠుఁడును తీవ్రకోపముగలవాఁడు నగు ధూమ్రాక్షుఁడును, అసమాన బలముచే కీర్తి గన్న ప్రహస్తుఁడును, భుజబలముచే దిగ్గజముల కుంభస్థలములఁ బగులఁగొట్టు కుంభకర్ణుఁడును, దేవతలకు అసురులకు యుద్ధమునఁ గదలింపరాని యకంపనుఁడు వీరందఱు నత్యధిక శూరులు, భుజబలవంతులు, యుద్ధాసక్తిగలవారు, విరోధుల నణఁచువారు, తెంపుగలవారు, అయ్యో ! యిట్టి వారు రాము బాణములచేఁ జచ్చిరికదా !

ఉ. వారును వీరటంచు నుడు•వం బని యేటికి నెల్ల వారలున్
ధీరులు భూరికాయులు సు•ధీయుతులుం బరమాస్త్రశస్త్ర వి
ద్యారతులున్ మహాత్ములు ప•రాజితులుం బరచిత్త శల్యముల్
శూరులు దేవదానవని•షూదను లయ్యురయొ కూలిపోయిరే. ౧౭౧౨

అర్థములు. నుడువన్=చెప్పఁగా, ఎల్లవారలున్=యుద్ధమునకు బోయిన

వారందఱు, ధీరులు=ధైర్యవంతులు, భూరికాయులు = పెద్ద దేహము గలవారు, సుధీయుక్తులున్=మంచిబుద్ధి గలవారు, పరమాస్త్రశస్త్రవిద్యారతులున్=గొప్ప యస్త్రములు శస్త్రములు ప్రయోగించు విద్యయందు ప్రీతిగలవారు, మహోత్కటులు=గొప్ప ప్రయత్నము గలవారు, అపరాజితులు = ఓడిపోవనివారు, పరచిత్తశల్యముల్=శత్రువుల హృదయమున గాలమువంటివారు, దేవదానవ నిషూదనులు=దేవతల దానవులఁ జంపినవారు.

## తాత్పర్యము

వీఁడు గొప్ప, వాఁడు గొప్పయని చెప్పనేల? యుద్ధమునకుఁబోయిన వారందఱు ధైర్యవంతులు. పిఱికులుగారు. అందఱు దేహపుష్టి గలవారు. బక్కవారుగారు. మంచిబుద్ధి, బలముగలవారు, గొప్ప యస్త్రశస్త్రములఁ బ్రయోగించు విధము దెలిసినవారు. గొప్ప ప్రయత్నములు చేయువారు. యుద్ధములం దెన్నఁడు నోడిపోయిన వారుగారు. శత్రువులకు గుండెగాలములైనవారు, శూరులు, దేవదానవులఁ జంపినవారు. అయ్యో! యిట్టివారుకూడఁ జచ్చిరి కదా.

సీ. ప్రఖ్యాతవిక్రమ ♦ ప్రణుతుండు నాపట్టి, యింద్రజి ద్భండన ♦ పృథ్వియందు
 వరలబ్ధశరముల ♦ భ్రాతల బంధించె, వానిని విడిపింప ♦ వశముగాదు
 యక్షగంధర్వ దే♦వాదుల కేనియు, నట్టిచో రామరా♦మానుజాతు
 లక్కటా విడివడి ♦ రదియేమి మాయయో, వారిప్రభావంబొ ♦ వంచనంబొ
ఆ. యెఱుఁగ రాదు నాకు ♦ నే మనవచ్చును, నేను బొమ్మటన్న ♦ నిశచరేంద్రు
 లట్టె పోక కాని♦యరుదేర రెవ్వరు, క్రమ్మఱంగఁ గపుల♦కడిమి జిక్కి.

అర్థములు. ప్రఖ్యాత విక్రమ ప్రణుతుండు=ప్రసిద్ధమైన పరాక్రమము చేత స్తోత్రము చేయఁబడిన వాఁడు, నాపట్టి=నాకుమారుఁడు, వరలబ్ధశరములన్ = వరముచే సంపాదింపఁబడిన బాణములచే, విడివడిరి=విడిపించి కొనిరి.

## తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన పరాక్రమవంతుఁడని స్తోత్రము చేయఁబడినవాఁడు నాకొడుకు ఇంద్రజిత్తు యుద్ధభూమియందు బ్రహ్మవరముచే లభించిన శరముల నన్నదమ్ములను గట్టివైచెను. దానిని విడిపింప యక్షులు గంధర్వులు దేవతలు మొదలగు వారికిని సాధ్యముగాదు. అట్టిచోట రాముఁడు ఆయన తమ్ముఁడు కూడ విడిపించు కొనిరి. ఇదియేమి మాయయూ? వారిమహిమయూ? లేక బ్రహ్మయే మోసగించెనా, లేక మాకుఁదెలియని మంత్రతంత్రములు వారికిఁ దెలిసి బంధింపఁ బడిన వారివలెఁ గొంచెము సేపుండి, వాఁడీవల రాఁగానే వారు లేచి కూర్చుండిరా? ఏదైనది తెలియలేదు. నే నేమనుకొందును? నేను బొమ్మని చెప్పిన రాక్షసులు వానరులు బలమునకు లోబడి చచ్చుటయే కాని మరల వచ్చుట లేదు గదా!

కం. ఈపీట నింక నా సీ, తావిభునిన్ సానుజాతుఁ ♦ దతసైన్యుని సు
గ్రీవు విభీషణు గెలువం,గా వలఁతిన్ వెదకియైనఁ ♦ గనలే నొకనిన్. ౧౭౧౪

అర్థములు. ఈ పీటన్ = ఈ పట్టన మందు, సానుజాతున్=తమ్మునితోఁ గూడిన వానిని, తత సైన్యునిన్=మన సేనకంటె విస్తారసేన కలవానిని, వలఁతిన్= సమర్థుఁడగు వానిని.

తా త్ప ర్య ము

తమ్ముని సాహాయ్యముగల రామచంద్రుని, విస్తార సేనగల సుగ్రీవుని తనకు వారు వారికిఁ దాను సహాయముగా నుండు విభీషణు గెలువ సమర్థుఁ డగు వాఁడు ఈ లంకాపట్టణమందు వెదకినను నొక్కఁడైన లేఁడే.

రామునకుఁ దమ్ముని తోడుపాటు గలదు. నా తమ్ములందరు చచ్చిరి. ఒక్కఁడైన లేఁడు. వానర సాహాయ్యము కొఱఁత లేక యున్నది. నాకు రాక్షస సాహాయ్యము చాల క్షీణించినది. మన మర్మము వారికిఁ జెప్ప విభీషణుఁ డా ప్రక్క నున్నాఁడు. వారి మర్మము చెప్పఁగలవాఁడు మన ప్రక్క లేఁడు. సందర్భము లిట్లుండఁగా వారిని గెలువఁగలవాఁ డెవ్వఁడు గలఁడు ?

ఇంద్రజిత్తుండఁగా రావణుఁ డిట్లు చెప్పఁ గారణ మేమి? ఇంద్రజిత్తు చేయఁగలిగిన గొప్ప కార్యము మాయచే నాగపాశబంధనము. అది వ్యర్థమై పోయెను. ఇఁక మాయ చాలించి యెదుటఁబడి యుద్ధము చేయఁబూనిన నెట్లగునో? ప్రత్యక్ష యుద్ధమునఁ జచ్చిన యతికాయుం డింద్రజిత్తు కన్న బలవంతుఁడే కదా. కావున నింద్రజిత్తు ఇందఱి జయింపఁ గలఁడనుట సందిగ్ధ కార్యమే యని వాని యభిప్రాయము. అదియును గాక యొక్కఁ డెందఱితో నెంతకాలమని పోరాడఁగలఁడు ?

కం. ఏమీ రాముపరాక్రమ, మేమీ యా యస్త్రబలము♦హింసితులై నా
నామర విరోధిముఖ్యులు, భూమిని బేరైన లేక ♦ పొలిసిరికలనన్. ౧౭౧౫

అర్థములు. హింసితులై = చంపఁబడినవారై, నానా = అనేక, విరోధిముఖ్యులు=రాక్షసశ్రేష్ఠులు, పొలిసిరి=చచ్చిరి, కలనన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము

ఆహా ! యేమి రాముని పరాక్రమము, ఏమి యాయస్త్రబలము, రాక్షసశ్రేష్ఠులందఱు నాయనచేఁ జంపఁబడి పేరైనలేక యుద్ధమందుఁ జచ్చిరి కదా.

తే. యోధవరులు నిశాటు లా♦యోధనమున, నెవనిశక్తిని యమపురి ♦ కేగి రట్టి
వీరు రాము ననామయు♦విష్ణుమూర్తి,నాదినారాయణునిగ నే♦నాత్మఁదలఁతు.

అర్థములు. యోధవరులు=యుద్ధవీరులలో శ్రేష్ఠులు, ఇందు ప్రథమాక్షరము గాయత్రిలోనిది, నిశాటులు = రాక్షసులు, ఆయోధనమునన్ = యుద్ధమందు, అనామయున్=రోగరహితుని, రోగరహితుఁ డనఁగా నెట్టి క్లేశములు లేని వానిని, ఇందు 'అపహతపాప్మా విజరో విమృత్యు'రిత్యాది శ్రుతి'స్మరించునది. విష్ణు

మూర్తి = (౧) సర్వత్ర వ్యాపించియుండువాఁడు. (౨) జీవప్రకృతులందన్నిట నను ప్రవేశము చేసియుండువాఁడు, కావున విష్ణు వనఁబడును. ఆదినారాయణు నిగ = ఎవ్వనిచే జనించు జగమన్నట్లు సర్వమునకు నాదియైన నారాయణుని, నాదినారాయణుని, ఆదిలేని నారాయణుని, (న+ఆది=నాది).

### తాత్పర్యము

యుద్ధవీరులలో శ్రేష్ఠులైన రాక్షసులు యుద్ధమునం దెవ్వనిశక్తిచే యమ పురికిఁ బోయిరో యట్టి వీరుని రాముని సర్వక్లేశరహితుని విష్ణుమూర్తియగు నాదినారాయణునిఁగ నేను దలంచెదను. ఆయనగాక మఱియొకఁడును అంతకుఁ దక్కువవాఁ డింతటి కార్యము చేయఁజాలఁడు.

దీనివలన వానికి రామపర్వత జ్ఞాన ముదయించెనా యని సందేహము. ఇది నిశ్చయ జ్ఞానముగాదు. ఊహమాత్రమే.

ఆ. అతనిభీతిఁ గాదె • యకట యంతర్బహి,ర్ద్వారతతులు మూయ•వలసి వచ్చె
లంక నన్నిచోట్ల • హెచ్చరికను, గావవలయు మీరు • కడిమి మెఱసి.

అర్థములు. అంతర్బహిర్ద్వారతతులు=లోపలి వాకిండ్లు, బయటి వాకిండ్లు, ఇండ్ల వాకిండ్లు—కోటగవనిల వాకిండ్లు, కడిమి=బలము.

### తాత్పర్యము

అతనికి భయపడిగదా లంకాపురమున లోపలి ద్వారములు వెలుపలి ద్వార ములు మూయవలసి వచ్చెను. లంకయం దన్నిచోట్ల నింక హెచ్చరికతో మీరు బలము ప్రకటిత మగునట్లు కావలయును.

### —• రావణుఁడు లంకయం దంతటఁ గాపుంచుట •—

కం. నా ముదలలేక కశోకా,రామమునకు నందు సీత•రహిఁ యి
నీమము నవరేనియుఁ జన,గా మఱి వెలి రాఁగఁ దగని కార్యము వినుఁడీ.

అర్థములు. నా ముదల=నాయాజ్ఞ.

నా యాజ్ఞ లేక యెవ్వరైనను అశోకవనమునకు నందు సీత యుండెడి చోటికిఁ బోను గూడదు. అందుండు వారు వెలికి రాను గూడదు.

సీతకీ క్షోభ తెలియఁ గూడ దని రావణుని యభిప్రాయము.

సీ. సైన్యముల్ నిలిచిన•స్థలముల నెల్లను, బలములతోఁ గావ•వలయు మీరు
కాఁదారి మాఁదారిఁ • గడసంజ నైనను, దెల్ల వారెడివేళ•నెల్లయపుడుఁ
బ్లవగులత్రోవలు • పరికింపుఁడీ మీరు, కారా దలక్ష్యంబు•కఫులబట్ల
నహితు లుద్యుక్తులో•యరుదెంచుచున్నారో,యూరక నిలిచియే•యున్నవారొ
ఆ. యనుచు నెఱుఁగ వలయు • ననవరతంబును, జనుఁ డటన్న రా•క్షసవ్రజంబు
లేగి యట్లు చేసె•నిట్టులాజ్ఞాపించి, దైన్యతప్తుఁ డగుచు•దశముఖుండు. ౧౭౮౯

అర్థములు. కాఁదారి మాఁదారిన్=అర్థరాత్రమందు, కడసంజ =సాయం సంధ్యాకాలము, అహితులు = విరోధులు, ఉద్యుక్తులో = ఏదైనఁ బ్రయత్నము చేయుచున్నారా? అనవరతంబును=ఎల్లవేళల, వ్రజంబు = సమూహము, దైన్యతప్తుఁడు=శోకముచేఁ దపించినవాఁడు.

### తాత్పర్యము

ఇంతవఱకు సైన్యములు విడిసియుండిన గుల్మములందు మీరు సేనలతోఁ గాచియుండవలయును. నడిరేయి కాని సాయమునందుఁ గాని, తేపటివేళఁ గాని తక్కిన కాలములందుఁ గాని మీరు ప్లవగుల మార్గములు పరీక్షించుచుండుఁడు. ఉపేక్ష సేయవలదు. ఏమి పరీక్షింపవలయు నందురా? వారేదైన యుద్ధప్రయత్నము చేయుచున్నారా? లేక లంకలోఁ దూఱవచ్చుచున్నారా? లేక యేమి చేయక యెవరైన వచ్చిన యుద్ధము చేయుదము లేకున్న నూరకుందమని నిలిచియున్నారా? ఇది మీరు సర్వదా కనిపెట్టి తెలిసికొని నాకుఁ జెప్పవలసిన విషయము పొండని చెప్పఁగా రాక్షస సమూహ మట్టులే చేసెను. ఇట్టు లాజ్ఞాపించి శోకముచేఁ దపించుచు రావణుఁడు.

కం. తనమందిరమునకుం జని, ఘనరోషానలము పేర్మి ♦ గ్రాఁగుచు నతికా
యునిఁదలఁచి తలఁచి పొక్కుచు, మనమున చింతించి మాటిమాటికి నూర్చెన్.

అర్థములు. గ్రాఁగుచున్=కాలుచు, ఊర్చెన్=నిట్టూర్పు విడిచెను.

### తాత్పర్యము

సభవిడిచి తన యింటికిఁబోయి మిక్కుటమైన కోపాగ్నిచేఁ గాలుచు నతికాయుఁడు లోనగు కొడుకులఁ దలఁచి తలఁచి దుఃఖించుచు మనస్సులో నిఁక నేమి చేయుదమా యని యాలోచించుచు నేమియుఁ దోఁపమిని నిట్టూర్పులు విడుచుచుండెను.

## —♦ ౨౩-వ సర్గము. ఇంద్రజిత్తు రావణు నూరార్చుట ♦—

చం. తనయులుఁ దమ్ములుం దెగిన ♦ దారుణ శోక భరంబునన్ దశా
ననుఁడు విమోహితాత్ముఁ డయి♦నం గని యింద్రజి చేరి పల్కె నీ
తనయుఁడు శక్రజిత్తు సురదానవ దర్పనిహంత లెస్సయై
మని యిట నుండ నేమిటికి ♦ మన్కితముం గొన రాక్షసేశ్వరా? ౧౭౨౧

అర్థములు. విమోహితాత్ముఁడయి = ఏమి చేయుటకుఁ దోఁపనివాఁడై, సురదానవదర్ప నిహంత = దేవదానవుల గర్వ మణఁచినవాఁడు, మని = జీవించి, మన్కితము=దుఃఖము, మనికితము.

### తాత్పర్యము

కొడుకులు తమ్ములుఁ జచ్చుటచే తీవ్రమైన శోకాతిశయంబున రావణుఁడు ఏమిచేయుటకుఁ దోఁపనివాఁడై పడియుండఁగాఁజూచి యింద్రజిత్తు సమీపించి యిట్లు

నియె. నీకొడుకు దేవదానవులగర్వ మణఁచిన యింద్రజిత్తు బ్రదికి యిందే యుండఁగా నేల దుఃఖ పడెదవు ?

ఉ. ఇంద్రజిబాణపాతముల • నెవ్వఁ డోర్కొ సయిరించువాఁడు ని
స్తంద్రత మేను గాచికొనఁ • జాలెడి వాఁ డది యేల యిప్పు మ
త్సాంద్ర శరోగ్రవృష్టి సువి•దారితభిన్న శరీర భూమిభృ
చ్చంద్రుల రామలక్ష్మణుల•క్ష్మాలుఠదంగులఁ జూచె దియ్యెడన్. ౧౨౨

అర్థములు. నిస్తంద్రతన్ = హెచ్చరికతో, మేను = దేహము, మత్ = నాయొక్క, సాంద్ర=కట్టమైన, శర=బాణముల యొక్క, వృష్టిన్ = వర్షముచే, సువిదారిత = చక్కఁగాఁ జీల్పఁబడిన, భిన్న=భేదింపఁబడిన, శరీర = దేహములు గల, భూమిభృచ్చంద్రులన్ = రాజశ్రేష్ఠులను, క్ష్మాలుఠదంగులన్ = భూమియందుఁ బొరలుచున్న దేహములు గలవారిని, భిన్నభిన్న గాత్రులని వాని నోర వచ్చెనే కాని మృతయని వానినోర రాలేదు. తనబాణముచే వారు చావరని వానికిని దెలియును.

### తాత్పర్యము

ఇంద్రజిత్తు వేయు బాణముల దెబ్బను సహింపఁ గలవాఁ డెవ్వఁడు గలఁడు? హెచ్చరికతోఁ దన దేహము రక్షించుకొనగలవాఁ డెవ్వఁడు కలఁడు? ఆపౌరుషోక్తు లిప్పుడేల కాని యిప్పు నా బాణముల వర్షముచే భిన్నము భిన్నమునైన దేహములు గల రాజులను రామలక్ష్మణులను నేలఁబడి పొరలుచుండఁ జూడఁగలవు.

మ. వినుమీ పౌరుషదైవ యుక్తమగు నీ•వృత్రాహితారిప్రతి
జ్ఞను రక్షోధిప! రామలక్ష్మణులఁ జం•చద్భీషణామోఘకాం
డనికాయంబుల సంగరక్షితిని సం•తర్పింతు; విష్ణ్వింద్రులున్
దినానాథాశ్వికృశాను చంద్రయములున్•వీక్షించి నా యుద్ధతిన్. ౧౨౩

అర్థములు. పౌరుషదైవయుక్తము = పురుష ప్రయత్నము, దైవసాహాయ్యము, పురుష ప్రయత్నము యుద్ధముచేయుట, దైవయుక్తము యజ్ఞమున నగ్ని నారాధించి యాయన యనుగ్రహమున యుద్ధపరికరములు సంపాదించుకొనుట, ఇట్లు దైవము పౌరుషము రెండు కలియుటచే కార్యసిద్ధి నిశ్చయ మని భావము. ఇదివఱకు యుద్ధమునకుఁ బోయినవారు కేవల పౌరుషము నాశ్రయించిన వారు కావున వారోడిపోయిరని భావము. వృత్రాహిత + అరి = ఇంద్రవిరోధి, వృత్రాసురుని జయించినవాని జయించినవాఁడు కావునఁ దాను వృత్రునికంటె బలవంతుఁడ నని భావము. ప్రతిజ్ఞను = ప్రమాణ వాక్యమును, చంచత్ = జలిపించుటచేఁ జలించు భీషణ=భయంకరమైన, అమోఘ = వ్యర్థముగాని, కాండనికాయంబులన్ = బాణసమూహములచే, సంగరక్షితిని = యుద్ధభూమిని, రామలక్ష్మణులను సంతర్పింతును = తృప్తిపడఁజేయుదును, రామలక్ష్మణులచే భూమి

తృప్తిపడఁ జేయుదునని వాని భావము. యుద్ధభూమియందు రామలక్ష్మణులను దృప్తిపఱుతుననియు మఱియొక యర్థము, విష్ణువు=ఉపేంద్రుఁడు

తాత్పర్యము

రాక్షసేశ్వరా! దైవము పౌరుషముతోఁ గూడిన యీ యింద్రజిత్తు ప్రతిజ్ఞ వినుము. రామలక్ష్మణులను భయంకరములైన నా బాణసమూహములచే యుద్ధభూమి తృప్తిపడఁజేసెదను. ఉపేంద్రుఁడు-ఇంద్రుఁడు-రామలక్ష్మణులన్ - పంచమ్యర్థమున ద్వితీయ-ఉపేంద్రుఁడు ఇంద్రుఁడు సూర్యుఁడు అశ్వులు అగ్ని చంద్రుఁడు యముఁడు వీరు నా బలోద్రేకమును జూచి.

చ. బలిసవనాలయంబునను ♦ వర్ధిలు విష్ణువొకో యటంచు లోఁ
దలఁపఁగ జేయువాఁడ నని ♦ తండ్రి యనుజ్ఞను గాంచి వాయువే
గలలితరాసభాన్విత సు♦కాంతరథంబునఁ జాపపాణియై
చెలువుగ నెక్కి తోడ హయ♦సింధురరోహకు లార్భటింపఁగన్. ౧౭.౨౮

అర్థములు. బలిసవనాలయంబునను = బలియజ్ఞప్రదేశమందు, వర్ధిలు= పెరిగిన, వాయువేగలలిత=వాయువేగముచే మనోహరమైన, రాసభ+అన్విత = గాడిదలతోఁ గూడిన, సుకాంత=మిగుల మనోహరమైన,హయసింధురరోహకులు= గుఱ్ఱములను ఏనుఁగులను ఎక్కినవారు, ఆర్భటింపఁగన్=ధ్వనులు చేయుచుండఁగా.

తాత్పర్యము

బలియజ్ఞవాటమునందుఁ బెరిగిన విష్ణువో వీఁడని తలఁచునట్లు చేయువాఁడనని తండ్రి యనుజ్ఞ తీసికొని వాయువేగము గల గాడిదలఁ గట్టిన మనోహరమైన రథంబునందు విల్లు ధరించినవాఁడై యెక్కి, తనతోడ గుఱ్ఱముల నెక్కినవారు ఏనుఁగుల నెక్కినవారు గర్జింపఁగా.

## —♦ ఇంద్రజిత్తు మొదటిసారి యుద్ధమునకు వెడలుట ♦—

శా. భేరీనిస్స్వనశంఖరావములు వి♦న్వీధిం దలంబారఁ, భా
పూరంబుల్ ప్రసవించు ముద్గరగదా♦పూగంబులుం బ్రాసముల్
నారాచంబులు మండలాగ్రములు నా♦నాశస్త్రముల్ దాల్చి పెం
పారన్ రాక్షసు లేగుదేర స్తుతివా♦క్యావాలవక్త్రిల్ వెసన్. ౧౭.౨౯

అర్థములు. దలంబారన్ = దట్టము కాఁగా, భాపూరంబుల్ = కాంతి ప్రవాహములు, ప్రాసముల్ = ఈఁటెలు, మండలాగ్రములు = కత్తులు, స్తుతి వాక్య=పొగడ్తమాటలకు, ఆవాల=పాడైన, వక్త్రిల్=నోళ్ళుగలవారు.

తాత్పర్యము

నగారాల ధ్వనులు, శంఖనాదములు, ఆకాశమందు దట్టముగ వ్యాపింపఁగా కాంతి ప్రవాహముల వ్యాపింపఁజేయు ముద్గరములయు గదలయు సమూహములను

ఈఁటెలు బాణములు కత్తులు నానాశస్త్రములు ధరించినవారై స్తోత్రములు చేయుచు రాక్షసులు రాఁగా.

తే. శంఖశశివర్ణ రాజితచ్ఛత్రకలన, నందగించెను రావణ నందనుండు
శారదాపూర్ణ నీరేజ వైరిచేత, భాసురం బయి యొప్పు న భంబు వోలె.

అర్థములు. శంఖశశివర్ణ = శంఖము యొక్కయుఁ జంద్రుని యొక్కయు వన్నెగల, రాజితచ్ఛత్రకలన=వెండిగొడుగుతోఁ గూడి, శారద=శరత్కాలమందలి, ఆపూర్ణ=పరిపూర్ణుఁడైన, నీరేజవైరిచేత = చంద్రునిచే, భాసురంబయి = ప్రకాశించునదియై, నభంబు=ఆకాశము.

తాత్పర్యము

శంఖము యొక్కయు చంద్రుని యొక్కయు తెల్లని కాంతిగల వెండి గొడుగులతోఁ గూడినవాఁడై యింద్రజిత్తు శరత్కాలమందు పూర్ణచంద్రునితోఁ గూడిన యాకాశమువలె నొప్పెను.

తే. విల్లు పట్టెడివారల కెల్ల మేటి, యైన మందోదరీతన యాగ్రణికిని
జాళువాపిడు లొప్పారు చామరములు, వైచిరిరుగడ రాక్షస వర్యులపుడు.

అర్థములు. జాళువా పిడులు=బంగారు పిడులు.

తాత్పర్యము స్పష్టము.

తే. ఖరమయూఖునిచేతఁ బుష్కరము వోలె, భానుసన్నిభ తేజుఁ డప్రతిబలుండు
నైన దశకంఠ సుతునిచే నల్లలంక, యధికశోభ వహించె నత్యద్భుతముగ.

అర్థములు. ఖర మయూఖుని చేతన్=సూర్యునిచే, పుష్కరము=కమలము, భానుసన్నిభ తేజుండు = సూర్యునితో సమానమైన తేజస్సు గలవాఁడు అప్రతిబలుండు=సమానములేని బలము గలవాఁడు.

తాత్పర్యము

సూర్యునిచేఁ గమలము ప్రకాశించునట్లు సూర్యకాంతి గలిగి యెదురులేని బలముగల యింద్రజిత్తుచే లంక యాశ్చర్యకరముగ మిగుల కాంతి గలదయ్యెను.

కం. సమరాంగణమునకుం జని, యమరాహితుఁ డాత్మ రథము నన్ని దెసల ద
ట్టముగఁ బలాశులఁ గాపుగ, నమరిచి వేలుఁపగ దొడఁగె నగ్నులలోనన్.

అర్థములు. సమరాంగణమునకున్ = యుద్ధభూమికిని, అమరాహితుఁడు=దేవవిరోధి, పలాశులన్=రాక్షసులను, వేలువఁగన్=హోమము చేయఁగ, దొడఁగెన్=ప్రారంభించెను. మారణాత్మకమైన యా క్రూర యజ్ఞము నగరము నందుఁ జేయరాదు. యుద్ధభూమియందుఁ జేయవలయును. ఇది నిర్విఘ్నముగ నెఱవేఱెనా. వీనికి జయము. విఘ్నము కలిగెనా మరణము. మొదటిదిన యుద్ధమున నీ యజ్ఞము చేసియే రామలక్ష్మణుల నాగాస్త్రముల బంధించెను. అప్పు డెవరికి వీఁడేమి చేయునది తెలిసినదికాదు. ఇప్పుడును వీఁడందఱివలె యుద్ధమునకై పోవువానివలెఁ బోలేదు.

రాక్షసులను ముందు సాధారణముగ నున్నట్లే గుంపుగ యుద్ధముచేయ నిలువఁబెట్టి దొంగతనముగా విభీషణాదులు లేని ప్రక్కగా నిది చేసెను. విభీషణుఁడు వీఁడు యుద్ధమునకు వచ్చుట యెఱుఁగఁడు. దానివలన వీని యజ్ఞము నిర్విఘ్నముగ నెఱవేఱెను.

సీ. లాజల గంధమా♦ల్యంబులచే నొప్ప, హవిచేత నర్చించె ♦ నగ్నిహోత్రు
శరపత్రములు గాఁగ♦శస్త్రముల్ ఘటియించి, తాండ్రశాఖల సమి♦ధలుగఁ జేసి
యెఱ్ఱవస్త్రము లూని ♦ యినుపస్రువముఁ బూని, శరపత్రమధ్యదే♦శంబునందుఁ
మిమ్మటంబుగ నల్ల♦మేఁకను బలి యీయఁ,బొగ లేనిమంటలఁ♦బొలుపుమీఱి

ఆ. విజయలక్షణముల ♦ వెలికి సూచించుచు, నప్రదక్షిణముగ♦జ్వాల లెగయఁ
బసిఁడినగలు దాల్చి♦ప్రత్యక్షముగ రోహి, తాశ్వుఁ డెగయుదెంచి♦హవిగ్రహించె.

అర్థములు. లాజలన్=పేలాల చేతను, హవిచేతను = హోమద్రవ్యముచే, శస్త్రములను = ఆయుధములను, శరపత్రములుగా = తెల్లు ఆస్తరణముగా, 'శరమయం బర్హిస్స్తృణాతి' యని శ్రుతివాక్య ప్రమాణము. అభిచారహోమమందు తెల్లు కసవుచే ఆస్తరణములు వేయవలయును. ఇందు తెల్లునకు బదులు శస్త్రములే ఆస్తరణములుగా నుంచెను. శరపత్రములు = తెల్లుపోఁచలు, సమిధలు = హోమమునకుఁ గావలసిన కట్టెపుల్లలు, స్రువము=నెయ్యి హోమముచేయు మిళ్ళి వంటిది, మిమ్మటంబుగన్ = అధికముగ, రోహితాశ్వుఁడు = అగ్నిహోత్రుఁడు, ఎగయుతెంచి=పైకి లేచివచ్చి.

## తాత్పర్యము

పేలాలచేతను గంధము పూలదండలచేతను నొప్ప హవిస్సుచే నగ్నిని బూజించెను. శస్త్రములను తెల్లు పోఁచలకు బదులుగా వైచి తాండ్రకొమ్మలను సమిధలుచేసి యెఱ్ఱవస్త్రము కట్టుకొని యినుపమిళ్ళి తీసికొని తెల్లుపోఁచల మధ్య ప్రదేశంబునందు నధికముగ నల్లమేఁకను బలి యీయఁగాఁ బొగలేని మంటలతో విజయచిహ్నములు వెలికిఁ గానవచ్చునట్లు సూచించుచు ప్రదక్షిణముగ జ్వాల లెగురఁగా బంగారునగలు ధరించి తన యాకారముతో నగ్నిహోత్రుఁడు పైకి లేచి వచ్చి హవిస్సు గ్రహించెను.

రామచంద్రమూర్తికి విరోధముగ అగ్నిహోత్రుఁడు ఇంద్రజిత్తునకు సహాయుఁడుగా వచ్చునా? 'మంత్రాధీనంతు దైవత'మ్మని శాస్త్రము. బ్రహ్మరుద్రాదులైనను మంత్రములకు లోఁబడవలసినవారే. ఆ ప్రకారము మంత్రవంతముగఁ బనిచేయువారి కోరికలు దీర్పవలసినది వారికి విధి. మంత్రముచే నాహూతుఁడైన యే దేవతగాని నేను రాను, వరమీయనను స్వాతంత్ర్యము లేదు. మంత్రమేపోయి యాయా దేవత యెందున్నను గట్టియీడ్చుకొనివచ్చును. సర్పయాగమపుడు 'సేంద్రతక్షకాయ' యని చెప్పినప్పటికి నింద్రుఁడు తక్షకుఁడుకూడ లేచి నిప్పులలోఁబడుటకు రాలేదా? కావున దేవతలు మంత్రాధీనులే కాని స్వతంత్రులుగారు. క్షుద్రమాంత్రికులకు క్షుద్రదేవ

తలు ప్రత్యక్షమై క్షుద్రఫలములే యిత్తురు. మహామంత్రములకు మహాదేవతలే ప్రత్యక్ష మగుదురు. కావుననే ముముక్షువులు భగవన్మంత్రముదప్ప దక్కిన దానిని స్మరింపరాదు, జపింపరాదు.

కం. తనరథమును దనచాపము, తన బ్రహ్మాస్త్రింబు మఱియు • దార్థము లెల్లన్
దనుజుఁడు మంత్రయుతంబుగ, ననలునిలో వేల్చె నిశ్చ•లాత్ముం డగుచున్.

తాత్పర్యము స్పష్టము.

కం. సేందుగ్రహనక్షత్రము, బృందారకపథము వణఁకె • భీతి మయసుతా
నందనుఁ డిటు బ్రహ్మాస్త్రము, మందమతిన్ వేల్వ నగ్ని•మధ్యమునందున్.

అర్థములు. సేందుగ్రహ నక్షత్రము = చంద్రునితోను గ్రహములతోను నక్షత్రములతోను గూడియున్నది. బృందారకపథము=దేవతల మార్గము. ఆకాశము, మయసుతానందనుఁడు = మండోదరీ కుమారుఁడు, ఇట్లు చెప్పుటచే నిది రాత్రి యుద్ధమని యేర్పడుచున్నది. చూ. ౧౭౧౮. ప.

తాత్పర్యము

చంద్రగ్రహ నక్షత్రములతోఁ గూడిన యాకాశమార్గము ఇంద్రజిత్తు అగ్నిమధ్యమునందు బ్రహ్మాస్త్రమును హోమము చేయఁగా భయముచే వణకెను.

బృందారక పథము వణఁకవలె నన నందున్న చంద్రాదులు వణఁకిరని భావము. లక్షణ.

చ. పవనసఖాభ తేజుఁడగు • పంక్తిముఖాత్మజుఁ డగ్నిదత్త సైం
ధనవరచాపమార్గణర•థంబులు సూతుఁడు నై యదృశ్యుఁడై
దివికిని నుద్గమించి తన•దిక్కు సురారుల నూఁకొల్పినన్
బవరము సెల్లె నా యుభయ•పక్షము వారికి రోమహర్షమై. ౧౭౩౩

అర్థములు. పవనసఖాభ తేజుఁడు=వాయుమిత్రుఁడగు నగ్నితో సమానమైన తేజస్సుగలవాఁడు, అగ్నిదత్త=అగ్నిహోత్రుని చేసీయఁబడిన, సైంధవ=గుఱ్ఱములు, వరచాప=శ్రేష్ఠమైన విల్లు, మార్గణ=బాణములు, రథంబు = తేరు, సూతుఁడు= సారథి, ఐ=కలవాఁడై; అదృశ్యుఁడై=కానరానివాఁడై, దివికిని = ఆకాశమునకు, ఉద్గమించి=ఎగిరి, నూఁకొల్పినన్=పురికొల్పఁగా, బవరము = యుద్ధము, రోమహర్షమై=గగుర్పాటుగలదై.

తాత్పర్యము

అగ్ని తేజుఁడైన యింద్రజిత్తు అగ్నిదత్తమైన గుఱ్ఱములు, విల్లు, బాణములు సూతుఁడు గల రథమెక్కి కానరానివాఁడై యాకాశమున కెగసి యుద్ధము చేయుఁడని తనప్రక్క రాక్షసుల ప్రేరింపఁగా నుభయపక్షములవారికి గగుర్పాటు గలుగ యుద్ధము జరిగెను.

## —♦ ఇంద్రజిత్తు మాయాబలంబునఁ గపిసేనల నణుమాడుట ♦—

చ. భరముగఁ బోరు చున్న తన♦వారిఁ గనుంగొని నేను గల్గఁ గా
తరపడ నేల మీకు నని ♦ దానవులార! వధింపుఁ డీ వనే
చరులను నెల్ల వారల ని♦జం బగు మీకు జయంబు నా నిశా
చరులను గేరి తాఁకి యని ♦ సల్పిరి పీఁక జయాభిలాషులై. ౧౭౩౪

అర్థములు. భరముగ=విశేష కష్టముతో, కాతరపడ నేల=భయపడ నేల, అనిన్=యుద్ధమందు.

ఇట్లు చెప్పి పురికొల్పినను వారతి కష్టమున యుద్ధము చేయుచుండుట చూచి రాక్షసులారా! నేనుండఁగా మీరేల భయపడెదరు? ఈ వానరుల నెల్లఁ జంపుఁడు. మీకు జయము నిజము. అని చెప్పఁగా వారును ధైర్యము తెచ్చుకొని జయముఁగోరి పరాక్రమించి యుద్ధము చేసిరి.

ఉ. మించి దశాస్యనందనుఁడు ♦ మేలిశరంబులఁ గీశసేనల
న్మించి పరాక్రమించుచు న♦నూనగదాముసలాయుధాళిచే,
జించుచు శత్రుదేహములఁ ♦ జీల్చుచుఁ గూల్చు చొకొక్కముల్కిచే
సంచుగఁ బంచసప్తనవ♦సంఖ్యులఁ గీశులఁద్రుంచె వ్రేల్మిడిన్. ౧౭౩౫

అర్థములు. ముల్కిచేన్ = బాణముచే, పంచసప్త నవసంఖ్యులన్=ఐదుగురు, ఏడుగురు, తొమ్మండుగురు వానరులను, వ్రేల్మిడిన్=చిటికె వ్రేయునంతలో.

### తాత్పర్యము

ఇంద్రజిత్తు అందఱిమించి వానరులను శ్రేష్ఠములైన బాణముల మించి పరాక్రమించుచు దండిగ గదలయు, రోఁకండ్లయు, ఆయుధములయు పంక్తిచేఁ జించుచు విరోధుల దేహములఁ జీల్చుచు, నేలఁబడఁద్రోయుచు, నొక్కొక్క బాణముచే నేవురను, నేడ్వురను, తొమ్మండుగురను క్రోఁతులఁ జిటికె వ్రేయునంత కాలములోఁ జంపెను.

ఉ. ఆతని పీఁకఁ గన్గొని య♦గాయుధపాణులు కీశముఖ్యులున్
స్ఫీతజవంబుమై నెదుర ♦ సింగముభంగిని లొంగి గ్రీష్మఖ
ద్యోతునిఁబోలి తేజి కన ♦ దుష్కరమై రవితుల్య మార్గణ
వ్రాత విభిన్న కాయులుఁగ ♦ వారల నెల్ల నొనర్చె నీసునన్. ౧౭౩౬

అర్థములు. పీఁక = పరాక్రమము, అగాయుధ పాణులు=చెట్లు, పర్వతములు, వను నాయుధములు చేతియందుఁ గలవారు, అగ=(౧)చెట్లు,(౨)కొండలు, అగో నగశ్చ భుజగే నాథా భూరుహభూధరే, నానా, ర. గ్రీష్మఖద్యోతునిన్ = ఎండకాలపు సూర్యుని, రవితుల్య = సూర్యునితో సమానమైన, మార్గణవ్రాత = బాణసమూహములచే, విభిన్నకాయులన్=భేదింపఁ బడిన దేహము గలవారినిఁగా; ఈసునన్ = కోపముచే.

### తాత్పర్యము

వాని పరాక్రమముఁజూచి చెట్లు, కొండలు, ఆయుధములుగాఁ జేతఁ దీసికొని వానరులు మిగుల వేగముగా నెదిరింపఁగా సింహములవలెఁ బొంగి యెండకాలపు సూర్యునివలెఁ దేఱి చూడరాక సూర్యసమానములైన బాణసమూహములచే వారల నెల్లఁ గోపముతోఁ జీల్చెను.

కం. అంగములు నలఁగినం బ్రథమాంగంబులు పగిలినన్ ద్రుమ•మాటులు ధృతిమై
సంగరము సలిపి రా సీ, తాంగనపతికొఱకునై చ్యు•తాయువులగుచున్.

అర్థములు. ప్రథమాంగంబులు = తలలు, ద్రుమమాటులు = వానరులు, ధృతిమై = ధైర్యముచే, సీతాంగనపతి—ఇతితత్సమశబ్దముల సమాసము, చ్యుతాయువులు = ప్రాణముల మీఁది యాశ వదలినవారై.

### తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి నిమిత్తము ప్రాణముల మీఁది యాశ వదలి దేహములు నలిగినను తలలు పగిలినను వానరులు యుద్ధముచేసిరి. వానరు లిట్లు జటాయువువలె కైంకర్యము చేసిరి. కావుననే వీరందఱకు మోక్షము ప్రాప్తించెను. ఈవిధముగ భగవత్సేవ చేయువారి కిహపరములు రెండును ఫలించును.

ఉ. రావణిఁ జుట్టుముట్టి నగ•రాజచరుల్ జడివానపోలెఁ బెన్
గ్రావములున్ శిలాగిరి ని•కాయములుం గురిపింప వాఁడునున్
గేవలశౌర్యధైర్యపరి•కీర్తిత చాపకళావిలాసముల్
చేవగొనన్ నిమేషమునఁ • జేసెను నన్నిటిఁ దుండెతుండెముల్. ౧౭౩౪

అర్థములు. గ్రావములున్ = పెద్దబండలు, శిలా = ఱాలు, గిరి నికాయములు=కొండల సమూహములు, కేవల = విశేషముగ, శౌర్యధైర్య పరికీర్తిత చాపకళా విలాసముల్=శౌర్యము చేతను, ధైర్యము చేతను బొగడఁబడిన విలువిద్యయొక్క నేర్పులు, చేవగొన్నన్=బలము గాఁగా.

### తాత్పర్యము

ఇంద్రజిత్తుచుట్టు వానరులుచుట్టుకొని జడివానవలె బండలు, గుండ్రాలు, కొండలు కురియఁగా వాఁడును శౌర్యధైర్యములచేఁ బొగడ్తగన్న విలువిద్యాపాండితి ధృఢపడఁగా నిమిషములో వానినన్నిటిని తుంటలు తుంటలుగాఁ జేసెను.

సీ. వెండియు నతఁడు దో•శ్చండిమ గంధమా,దనుఁ బదునెనిమిది•ఘనశరముల
దూరస్థుఁ డౌ నలుఁ • దొమ్మిదిఖగముల, మైందుని నొక యే•డు•మార్గణముల
గజు నైదుములుకు-ల • ఘను జాంబవంతుని, బదిట నీలాఖ్యు ము•ప్పదిట నేసి
సుగ్రీవునిన్ వాలి•సూనుని ఋషభుని, ద్వివిదుని వరలబ్ధ•తీవ్రబాణ

తే. సంఘముల నేలఁబడఁగ ని•ష్ప్రాణు లగుచుఁ
గ్రూరుఁడై నొంచి తక్కి-న•క్రోతి గములఁ

గాలపావకుఁ డన బహు ♦ కాండ హేతి
మాలికల నిర్దహించెను ♦ మాఱు లేక ౧౭౩౯

అర్థములు. దోశ్చండిమ = భుజబలాతిశయముచే, నిష్ప్రాణులు = బల ముడిగినవారు, కాలపావకుఁడు = ప్రలయ కాలాగ్ని, బహు = అనేకములయిన, కాండ హేతి=బాణములను జ్వాలల, మాలికలచేఁ = వరుసలచేత, నిర్దహించెను= దగ్ధమైన దానివలెఁ జేసెను.

తాత్పర్యము

మఱియును వాఁడు భుజబల తీవ్రతచే గంధమాదను బదునెనిమిది బాణముల చేతను, దూరముగానున్న నలుని తొమ్మిది బాణముల చేతను, మైందు నేడుబాణముల చేతను, గజునైదుబాణముల చేతను, జాంబవంతుని బదింటను, నీలుని ముప్పదింటను సుగ్రీవుని నంగదుని ఋషభుని ద్వివిదుని వరముచే లభించిన తీవ్రబాణ సంఘములచే బలహీనులై నేలఁబడ నొప్పించి తక్కిన వానర సమూహముల కాలాగ్నివలె బహు బాణజ్వాలలచే నెదురులేక దహించెను.

కం. ఖరకరనిభ విశిఖపరం,పరలన్, నిస్తులిత ఘన జ♦వంబుల భూభృ
చ్చరవాహిని వధియించె న,మరపతి విద్వేషి జాత♦మన్యుం డగుచున్. ౧౭౪౦

అర్థములు. ఖరకరనిభ=సూర్యునితో సమానమైన, విశిఖపరంపరలన్= బాణసమూహములచే, నిస్తులిత=అసమానమైన, ఘనజవంబులన్=గొప్ప వేగము గలవానిచే, భూభృచ్చరవాహినిన్=వానరసేనను, అమరపతివిద్వేషి=ఇంద్రజిత్తు, జాతమన్యుఁడు=పుట్టిన క్రోధము గలవాఁడు.

తాత్పర్యము

అసమాన వేగము గల సూర్యునితో సమానములైన బాణపరంపరలచే, వానరసేనను కోపముగలవాఁడై యింద్రజిత్తు అల్లకల్లోల పఱిచెను.

ఉ. దారుణ బాణమోహిత ని♦తాంత సమాకులవైరి సేనలన్
వీరుఁడు గాంచి పొంగుచును ♦ వెండియు మింట నదృశ్యగాత్రుఁడై
ఘోరశరంబులం గురిసి♦క్రోఁతుల చేతులు మూఁతు లంగముల్
తీరు చెడంగఁ జేసె నవ♦ధీరితనిర్జరుఁ డుగ్రమూర్తియై. ౧౭౪౧

అర్థములు. దారుణబాణమోహిత = భయంకర బాణములచే మూర్ఛ పోయిన నితాంతసమాకుల = మిక్కిలి కలఁత చెందిన, వైరిసేనలన్ = విరోధి సైన్యములను, అవధీరిత నిర్జరుఁడు=అవమాన పెట్టఁబడిన దేవతలు గలవాఁడు.

తాత్పర్యము

భయంకర బాణములచే మూర్ఛపోయినట్టియు మిగులఁ గలఁత చెందినట్టియు విరోధి సేనలనుజూచి సంతోషపడుచు నంతటఁ దృప్తిపడక యదృశ్యుఁడై యాకాశ మునుండి క్రూరములైన బాణములుగురిసి క్రోఁతులు చేతులుమూఁతులు అంగము

లున్న విధము మాఱిపోవునట్లు దేవతల జయించిన యింద్రజిత్తు భయంకరా కారుఁడై చేసెను.

చ. పవిహతశైల రాజముల♦భంగిఁ బ్లవంగమ పుంగవుల్ ధరన్
జవమఱి కూలుటన్ నిశిత♦సాధనముల్ పరసేనమీఁద ను
ద్దవిడిని జోరునం బడుట ♦ తెక్కఁ గనుంగొన నేర రైరి యా
బవరమునన్ క్షపాచరుల♦వర్గములున్ గపియోధవీరులున్. ౧౨౪౨

అర్థములు. పవిహత = వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన, శైలరాజముల భంగిన్=పెద్ద కొండలవలె, జవమఱి=వేగముచెడి, ఉద్దవిడిన్=మిగుల వేగమున, బవరమునన్=యుద్ధమునందు, క్షపాచరవర్గములున్=రాక్షసమూహములును.

తాత్పర్యము

వజ్రాయుధముచేతఁ గొట్టఁబడిన పెద్ద కొండలవలె వేగము చెడి వానర శ్రేష్ఠులు నేలఁ బడుటయు మిగుల వేగముగ వాఁడి యాయుధములు శత్రుసేన మీఁద జడివానవలెఁ బడుటయుఁ దప్ప మఱి దేనిని గాని రాక్షసులు గాని వానరులు గాని చూడఁ జాలరైరి. వానరులు నేలఁబడుట బాణవర్షము పడుట యని చెప్పుటచే వానరులు నేలఁబడిన తరువాత బాణములు గానవచ్చు చుండెను గాని యవి తగులకముందు గాన రావయ్యెనని భావము.

కం. అని తనివి లేక రావణి, సునిశితనిస్త్రింశ పరిఘ♦శూలాదికముల్
ఘనవిస్ఫులింగసంజ్వల, దనలాభంబులను గురిసె♦నద్రిచరులపై. ౧౨౪౩

అర్థములు. అనితనివి = యుద్ధమందుఁ దృప్తి, సునిశిత = మిగులఁ బదునైన, నిస్త్రింశ=ఖడ్గములు, పరిఘ = గుదియలు, శూలాదికములు = శూలములు మొదలైనవి, ఘనవిస్ఫులింగ=పెద్దమిణుగురులుగల, జ్వలత్=మండుచున్న, అనలాభంబులను=అగ్నిహోత్రములతో సమానములైన వానిని, అద్రిచరులపై = వానరుల మీఁద.

తాత్పర్యము

యుద్ధమందలి తృప్తిలేక యింద్రజిత్తు జ్వాలలతో మండుచున్న యగ్నితో సమానములైన వాఁడిగల కత్తులను గుదియలను శూలములను వానరులపైఁ గురియించెను.

కం. ఆయంపవెల్లి తాఁకున, నా యగచరవార మెల్ల ♦ నలరులతోఁ గెం
జాయ వహించిన మోదుగు, చాయలు గొని విస్వరముగ♦నలిపెను రొదలన్.

అర్థములు. ఆయంప వెల్లి = ఆ బాణప్రవాహము, అలరులతో=పూవులతో, విస్వరముగన్=వికారధ్వనులతో, రొదలన్=ధ్వనులను.

తాత్పర్యము

ఆ బాణప్రవాహము దెబ్బవలన నా వానరసమూహ మంతయు పూలతో నెఱ్ఱని కాంతిగల మోదుఁగులవలెనై వికారస్వరములతో ధ్వనించెను.

సీ. కన్నెత్తి చూచెనా • కలుగు బాణమ్ములు, రెండుకన్నులలోన • నిండియుండుఁ
దల వంచి తిరిగెనా • తరమిఁడికోలలు, నడినెత్తి బ్రద్దలై • పుడమిఁ దొరఁగు
డాలు చేపూనెనా • కేలుదోయి విఖండితంబయి పోఁగాదు • ధరణిమీఁద
ధరముఁ బైకెత్తెనా • దానిక్రిందనె వాఁడు, నజగుజలై పడి • నలఁగిపోవు
తే. నార్భటింపఁగ వావిచ్చు • నంతలోన, నోరునిండఁగ బాణముల్ • కూరుకొనెడిఁ
గ్రోఁతియగు నాతఁ; డౌర యా • క్రూరచరితు, చాపపాండితి నేమని • సంస్తుతింప.

అర్థములు. తరమిఁడి-సమానము లేని, వావిచ్చు=నోరు తెఱచు.

తాత్పర్యము స్పష్టము.

సీ. హనుమంతు సుగ్రీవు • నంగదు గంధమాదను జాంబవంతు మైంద • ద్వివిదుల
హరిలోమ నీల గ • వాక్ష గోముఖ వేగదర్శి సుషేణుల • దధిముఖు గజు
జ్యోతిర్ముఖాఖ్యుని • సూర్యాననుని వహ్నినయనుని గేసరి • నలుని గవయుదు
మంత్రసహితతీవ్ర • మార్గణప్రాసగ, దాశూలముఖ్య సా • ధనవితాన
తే. ములను మర్దించి వారల • బలువు చెఱిచి, తరణిరశ్మిసమేషు క • దంబకముల
రామలక్ష్మణులను ముంచి • రహి వహించి, విక్రమించెడి రావణి • విధముఁ గాంచి.

అర్థములు. తరణి రశ్మిసమ = సూర్యకిరణములతో సమానమైన, ఇషు కదంబకములన్ = బాణసమూహములచే, రహి = కాంతి.

తాత్పర్యము

హనుమంతుని సుగ్రీవుని అంగదుని గంధమాదనుని జాంబవంతుని మైంద ద్వివిదులను హరిలోమ నీలగవాక్ష గోముఖ వేగదర్శి సుషేణ దధిముఖగజులను, జ్యోతిర్ముఖుని, సూర్యాననుని, వహ్నినయనుని గేసరిని నలుని గవయుని మంత్రములచే మంత్రింపఁబడిన తీక్ష్ణములైన యీఁటెలు గదలు శూలములు మొదలగు ముఖ్యాయుధసమూహములచేఁ గొట్టి వారల బలము చెఱిచి సూర్యకిరణ సమములైన బాణసమూహములచేఁ రామలక్ష్మణులను ముంచి కాంతి వహించి విక్రమించుచున్న యింద్రజిత్తు విధముఁ జూచి.

## శ్రీరాముఁడు లక్ష్మణునకు బ్రహ్మవరంబు మన్నించి యోర్చుకొనుమని చెప్పుట

కం. పరమాద్భుత ధైర్యశ్రీ, నిరతుఁడు రాముండు బాణ • నికరాసారం
బరవాయి లేక బిందూ, త్కరమువలె సహించి పలుకు • దమ్మునితోడన్.

అర్థములు. పరమాద్భుత=మిగుల నద్భుతమైన, ధైర్యశ్రీనిరతుఁడు=ధైర్యలక్ష్మియందు నాసక్తి గలవాఁడు, బాణనికరాసారంబు=బాణముల సమూహముల వాన, అరవాయిలేక=అధైర్యపడక, బిందూత్కరమువలె=జలబిందువులవలె.

తాత్పర్యము

మిగుల నాశ్చర్యకరమైన ధైర్యాతిశయమునఁ బ్రీతిగలవాఁడు గనుకనే రామ

చంద్రమూర్తి బాణసమూహముల వానకు సహైర్యపడక దానిని జలబిందు వర్షము వలె సహించి తమ్మునితో నిట్లనియె.

సీ. అన్న లక్ష్మణ! దనుజాధినేత్రాత్మజుం, డతుల మా బ్రహ్మాస్త్ర మాశ్రయించి
హరిసైన్యముల నెల్ల నవనిపాలొనరించి, మనలఁ బీడించెడి మాఱు లేక
బ్రహ్మదత్తవరంబు బలమున నభమున, మఱఁగి యస్త్రంబుల మాఱుకొనెడిఁ
గలన వీని వధింపఁ గల మెట్లు? స్వభు వగు, భగవంతుఁ డగు నజు బాణమిదియు

ఆ. నిది యచింత్య మహిమ నెసఁగెడి బాణావ,పాతి మీవు నాదు భంగి ధైర్య
పరత నోర్చికొనుము సురవైరి దిక్కుల,నెల్లఁ గప్పె నిశిత భల్లములను. ౧౭౮౮

అర్థములు. బాణావపాతము = బాణములు పడుట.

తాత్పర్యము

అన్నా లక్ష్మణా! రావణుని కుమారుఁడు నసమానమైన బ్రహ్మాస్త్రము నాశ్రయించి వానరసేనల నెల్ల నేలపాలు చేసి మనల నెదురులేక బాధించు చున్నాఁడు. బ్రహ్మ యిచ్చిన వరము బలమున నాకాశమున దాఁగి యస్త్రంబుల చేతఁ గొట్టుచున్నాఁడు. వీనిని మన మెట్లు జయింపఁగలము. ఇది స్వయంభువు భగవంతుఁడగు బ్రహ్మదేవుని బాణము. ఇది చింతించి తెలిసికొనరాని మహిమ గలది. కావున నీవును నావలె బాణపాతమును ధైర్యముతో నోర్చికొనుము. రాక్షసుఁడు దిక్కులనెల్ల బాణములచేఁ గప్పెను.

కం. ఆవీరుని విక్రమమునఁ, జేవ చెడెం గీశసేన స్మృతి చెడి యత్నా
భావము గల మనలం గని, పోవున్ జయలక్ష్మిఁ గొనుచుఁ బురి కసురుండున్

అర్థములు. చేవచెడెన్=నిస్సారమయ్యెను.

తాత్పర్యము

ఆ వీరుని పరాక్రమముచేఁ గపిసేన నిస్సారమయ్యెను. స్మృతితప్పి యత్నము చేయక యుండుటను జూచి జయలక్ష్మిని గ్రహించి తన నగరమునకుఁ బోవునుగాక.

కం. అనుచుండ బాణవర్షము, ఘనమై దుస్సహము నైనఁ గాకుత్స్థులు మూ
ర్ఛను గూరిరి రావణియును, మనుజేంద్రులపాటు గాంచి మది హర్షమునన్

తాత్పర్యము

ఇట్లు చెప్పుచుండు సమయమున బాణవర్షమధికమై సహింపరానిదైన దగుటచే రామలక్ష్మణులు మూర్ఛపోయిరి, రావణి వారు మూర్ఛపోయి పడుటచూచి మనస్సు సంతోషముచే.

కం. పొంగఁగ హర్షారవము చె,లంగఁగ నిటు కీశసేన లన్ రఘువరులన్
జెంగించి భంగపఱిచి యు,భంగపరాక్రముఁడు తనదు పత్తన మరిగెన్. ౧౭౯౧

అర్థములు. పొంగఁగన్ = ఉబ్బఁగా, హర్షారవము = సంతోషధ్వని,

చెంగించి = ఓడించి, భంగపఱిచి = అవమానపఱిచి, అభంగపరాక్రముఁడు = చెడని పరాక్రమము గలవాఁడు.

తా త్ప ర్య ము

సంతోషముచే మనస్సు పొంగఁగా సంతోషధ్వని చేయఁగా నీ ప్రకారము వానరసేనల రఘువరుల నోడించి యవమానించి పరాక్రమశాలి తన నగరమునకుఁ బోయెను.

## —♦ ౭౪—వ సర్గము. విభీషణాంజనేయులు జాంబవంతుని వెదకుట ♦—

సీ. రావణి యేటుల ♦ రహి చెడి సుగ్రీవ, జాంబవదంగద♦సైన్యనాథు
లేమియుఁ దోఁపక ♦ యెదవడి యుండ వి,భీషణుం డడలు క♦పిప్రముఖులఁ
గనుఁగొని కపులార ! కార్యమా దుఃఖింప, రాఘవు లవశులై♦ బ్రాలి రనుచుఁ
గాదిది దుఃఖింపఁ ♦ గాలంబు నృపతులు, కంజజు వాక్యంబు ♦ గారవింప
ఆ. మదిఁ దలంచి యసుర♦మార్గణములఁ జిక్కి, యున్నవారు నీర♦జోదరాస్త్ర
మత్యమోఘవేగ♦మగుటను దాని స,మ్మానదృష్టిఁ గనిరి♦మాన్యులార !౧౭౪౨

అర్థములు. రహిచెడి = కాంతిచెడి, ఎదవడి = భయపడి, అడలు = దుఃఖించు, అవశులై = స్వాధీనముఁ దప్పినవారై.

తా త్ప ర్య ము

ఇంద్రజిత్తు దెబ్బలచే కాంతిచెడి సుగ్రీవుఁడు జాంబవంతుఁడు అంగదుఁడు నీలుఁడు ఏమిచేయుటకుఁ దోఁపక భయపడియుండఁగా దుఃఖించుచున్న వానరవీరులఁ జూచి విభీషణుఁడు కపులారా ! రామలక్ష్మణులు పరవశులై పడి రని దుఃఖించిన లాభమేమి ? ఇది దుఃఖింపఁదగినకాలముకాదు, రాజకుమారులు బ్రహ్మవాక్యము గారవింపఁదలఁచి రాక్షసుని బాణములఁ జిక్కినారు గాని పరాక్రమహీనులై కాదు. బ్రహ్మాస్త్రము వ్యర్థముగాని వేగము గలదగుటచే దానిని సగౌరవదృష్టిఁ జూచి.

కం. ఏలా వగచెద రని మృదు,లాలాపంబులను వారి ♦ నాశ్వాసించెన్
జాలఁగ నయ్యస్త్రము వా,తూలసుతుఁడు గౌరవించి ♦ తోరపుభక్తిన్. ౧౭౪౩

తా త్ప ర్య ము స్పష్టము.

చ. అనియె విభీషణుం గని మ♦హాత్మక యీ మనసేనలోని నిం
కను మనియున్న వారలను ♦ గన్గొని యూఱడఁ బల్కఁ బోడి యీ
వన వతె డట్ల యీ నసఁగ ♦ హస్తములం గొఱవుల్ ధరించి చ
య్యన హతశేషవానరుల ♦ నయ్యనఘాత్ములు రోసి రానిసిన్. ౧౭౪౪

తా త్ప ర్య ము

విభీషణుని జూచి యిట్లనియె. మహాత్మా ! యీ మన సేనలో నింక నెవ్వ రెవ్వరు ప్రాణముతో నున్నారో వెదకి చూచి యూరడించుట న్యాయ్యముగదా

యున నతఁ డవ్వనన నిరువురు చేతులందుఁ గొఱవులు ధరించి యా పుణ్యాత్ములా రాత్రికాలమందు చావఁగా మిగిలిన వానరులను వెదకిరి.

సీ. భిన్నలాంగూలురు • భిన్న బాహూశయుల్, కృత్తాంగుళులు ని • కృత్త పదులు
ఖండిత శీర్షులై • క్షతజముల్ దొరఁగంగఁ, గొండలవలెఁ బడి • యుండు కపుల
శస్త్రముల్ భేదింప • నస్త్రముల్ బాధింప, నొడళులు ఛేదింపఁ • బడిన వారి
గంధమాదనుని నం • గదు నీలు సుగ్రీవు, ద్వివిద సుషేణుల • వేగదర్శి
తే. నళునిఁ బనసు జ్యోతిర్ముఖు • నాము మైందు
నాహుకు గవాక్షునిం దక్క • నద్రిచరుల
వీతచేష్టుల నిహతుల • వీరవరులఁ
గాంచి రెంతయు మదిలోనఁ • గలఁక దొడర. ౧౭౫౫

అర్థములు. భిన్నలాంగూలురు = తునిఁగిన తోఁకలు గలవారు, భిన్న బాహూశయులు = తునిఁగిన చేతులు బాహువులు గలవారు, కృత్త = నఱకఁబడిన అంగుళులు = వ్రేళ్ళు గలవారు, నికృత్తపదులు = నఱకఁబడిన కాళ్ళు గలవారు, ఖండితశీర్షులై = నరకఁబడినతలలుగలవారై, క్షతజముల్ = నెత్తురులు, దొరఁగంగన్ = కాఱఁగా, ఒడళులు = దేహములు. వీతచేష్టులన్ = చేష్టలు విడిచినవారిని, నిహతులన్ = చంపఁబడినవారిని.

తాత్పర్యము

తోఁకను తెగినవారిని, బాహువులు తెగినవారిని, చేతులు తెగినవారిని, వ్రేళ్ళు నఱకఁబడినవారిని, కాళ్ళు నఱకఁబడిన వారిని, తలలు తెగి నెత్తురు గాఱఁ గొండలవలెఁ బడియుండు కపులను శస్త్రములు నఱకఁగా, అస్త్రములు బాధింపఁగా దేహములు చీల్పఁబడఁగా బడిన వారిని, గంధమాదనుని నంగదు నీలుని సుగ్రీవుని ద్వివిద సుషేణులను వేగదర్శిని నలుని పనసుని జ్యోతిర్ముఖుని మైందుని ఆహుకుని గవాక్షుని తక్కిన క్రోఁతులను కాలుసేతులు కదలింపలేని వారిని జచ్చినవారిని వీరులను మనస్సు కలఁతపడఁగాఁ జూచిరి.

చ. అఱువదియేడుకోటుల వ • నాటులు భీమతరస్విలిట్టు లు
క్కాఱి దినపంచమాంశమున • నబ్జజు ప్రీతికిఁ బాత్రుఁడైన యా
కఱకుసురారిచేఁ దెగిరి • కంధినిభంబగు కీశసేన యొ
క్కాఱ నిటు రూపు మాఱుడును • కేసరిపుత్రసురారిసత్తముల్. ౧౭౫౬

అర్థములు. భీమతరస్విలు = భయంకరమైన వేగముగలవారు, ఉక్కాఱి = బలము క్షీణించి, దినపంచమాంశమున = దినమునొక్క యైదవభాగమున, దీనికి సంస్కృతమున అహ్నః పంచమశేషేణ అని యున్నది. దీనికి పగటియందలి యైదవ భాగ మనియు ప్రాతస్సంగవమధ్యాహ్నపరాహ్ణసాయాహ్నము లను నైదు పగటిభాగములలో నైదవది యగు సాయాహ్న మాఱుగడియ లిచ్చటఁ జెప్పఁ

బడెననియు పూర్వవ్యాఖ్యాతలు వ్రాసియున్నారు. విమర్శకులు దీని నాక్షేపింపక మానరు. "ఉల్కాహస్తౌ తదా రాత్రౌ రణశీర్షే విచేరతుః" "కొఱవుల్ ధరించిరో సిరానిశిన్" అని చెప్పఁబడెను. సూర్యాస్తమునకు ముందటి కాలమునకు నిశయని చెప్పవచ్చునా? అప్పుడు కొఱవులు తీసికొని తిరుగనేల? యనునది సందేహము. సమాధానము; ఇచట సంస్కృత శబ్దమైన అహ్నమునకును తెనుఁగున వ్రాయఁబడిన దినశబ్దమునకు రాత్రిపగలు కలిసిన కాలమనియే గ్రహింపవలెను. అహస్సనుటకు రాత్రి పగలు కలసిన దినమను నర్థమున మనుస్మృతి ౫-౭౪ నందు 'నవర్థయే దఘాహాని ప్రత్యూహే న్నాన్నిషు క్రియా' యని ప్రయోగింపఁబడెను. "అర్ధమాసైస్తాసాంత్సంపాద్యాహరుత్సృజంత్యర్ధమాసైర్హిమాసాంత్సంపశ్యంతి షడహైర్మాసాంత్సంపాద్యాహ రుత్సృజంతి షడహైర్హిమాసాంత్సంపశ్యంతి"-శ్రుతి-ఇందు 'షడహై' యనుటకు రాత్రి పగలు కలసిన దినమని యర్థమే కాని కేవలము పగలు రాత్రియే కాదు-షడహాత్మకోపి మాసోస్తి, త్రింశద్దినాత్మకో మాస ఏవాత్ర కథ్యత ఇతి.

"దినేదినే సా పరివర్ధమానా" కుమార-౧-౨౫, "సప్త వ్యతీయుస్త్రిగుణాని తస్య దినాని." రఘు. ౨-౨౫ ఉదయాదుదయము దినము. ముప్పది దినము లొక నెల. మున్నూటఱువది దినము లొక సంవత్సరము. "వాఁడు మూఁడు దినములుగా నుపవాసము" అను ప్రయోగమును బట్టియు అహశ్శబ్దము దిన శబ్దము రాత్రి పగలు కలసిన కాలమునకును నుపయోగించుట కలదు. ఇచ్చట నా యర్థమునే గ్రహించి దినపంచమభాగ మనఁగా దినమును ఎనిమిది జాములుగా లెక్కించి యందు నైదవ భాగము సూర్యాస్తమయ మైన తర్వాత జామని చెప్పనగును. మఱియు రాత్రికి త్రియామ యనియే పేరు. అనఁగా మూఁడు జాములు గలది యని యర్థము కావున పగ లయిదుజాములు గలదని యెంచి యందలి కడభాగ మనియైనఁ జెప్ప వచ్చును. ఇట్లు చెప్పిన నిది మునిమాపును దెలుపును కొఱవులు పట్టుకొని వెదకి రనుట సమంజస మగును. అదియునుగాక ఇంద్రజిత్తు హోమవర్ణనమందు 'సేందుగ్రహనక్షత్ర' మని చెప్పఁబడెను. ఇదియును రాత్రినే తెలుపుచున్నది. రాత్రికాలము గనుకనే యుద్ధరంగమందు వాఁడు హోమము చేసినను చీఁకటివలన వానరులు తెలిసికొన లేకపోయిరి ఇది దశమినాఁటి రాత్రిచర్య. ఒక విధముగ సామరస్యము గుదుర్పవచ్చును, ఇంద్రజిత్తు చేసిన కార్యము సూర్యాస్తమానములో ముగిసిన దనియు సూర్యాస్తమానానంతరము కొఱవులు దీసికొని హనుమద్విభీషణులు తిరిగిరని చెప్పవచ్చును. ఇదియే సరియైన యర్థమని తోఁచెడిని, కంఫినిభంబు=సముద్రములో సమానమైన, విస్తీర్ణమందు నని భావము. ఒక్కఱొన్=భయంకరముగ, ఉగ్రశబ్ద భవము.

## తాత్పర్యము

భయంకర వేగము, బలము గల అఱువది యేడువేల కోట్ల వానరులు పగటి

వైదవ భాగమున బ్రహ్మనయకుఁ బాత్రుఁడైన యింద్రజిత్తుచే చచ్చిరి. సముద్రమువలె విరివిగల వానరసేన యిట్లు భయంకరముగ నశింపఁగా హనుమంతుఁడు విభీషణుఁడును.

ఉ. ఎక్కడ నున్నవాఁడొకొ దె ♦ ఋక్షవిభుం డని రోయు చేగి తా
రొక్కెడ శాంతహవ్యవహుఁ ♦ డోయన మేన ననేకబాణముల్
చిక్కఁగ నాటినన్ మిగులఁ ♦ జేడ్పడి యున్న స్వభావవార్ధకు
న్మిక్కిలి వృద్ధు ధాతృసుతు ♦ నిం గని రావణితమ్ముఁ డిట్లనున్. ౧౭ ౫౬

అర్థములు, ఋక్షవిభుండు = జాంబవంతుఁడు, రోయుచున్ = వెదకుచు, శాంతహవ్యవహుఁడో = చల్లారిన యగ్నిహోత్రుఁడా! స్వభావ వార్ధకున్=సహజముగ వచ్చిన ముసలితనముగలవానిని, ధాతృసుతునిన్=బ్రహ్మకొడుకును, ఏఁబది యైదు సంవత్సరములు దాఁటినవాఁడు వృద్ధుఁడనియే పేరు. అటయినచో ఏఁబది యాఱు సంవత్సరములవాఁడు వృద్ధుఁడు, తొంబది సంవత్సరములకుఁ పైపడినవాఁడతివృద్ధుఁడేకదా.

—♦ జాంబవంతుఁడు హనుమంతు కుశలమును విభీషణు నడుగుట ♦—

ఉ. ఓయతులప్రభావ! విశి ♦ ఖోత్కరముల్ నినుఁ బ్రాణహీనుఁగాఁ
జేయఁగ లేదుగా? యనినఁ ♦ జేవ శ్రమంబునఁ దెచ్చుకొంచుఁ దా
వా నొకయింత విచ్చి యిటు ♦ పల్కె మహాబల! రాక్షసేంద్ర! నీ
చాయ స్వరంబుఁ బట్టి యెఱి ♦ చక్కె నెఱింగితిఁ జూడ లేకయున్. ౧౭ ౫౪

అర్థములు. అతుల ప్రభావ=అసమాన మహిమగలవాఁడా, విశిఖోత్కరముల్ = బాణసమూహములు, ప్రాణహీనుఁగా = ప్రాణము లేనివానిఁగా, చేవ=సత్తువ, శ్రమంబునన్=కష్టముమీఁద, వా=నోరు, ఒకయింత=కొంచెము, స్వరంబుఁబట్టి=కంఠధ్వనిఁబట్టి, లేకయున్ = లేకపోయినను, అర్థవిశేషంబున సముచ్చయము. నీచాయ=నీవుండు ప్రదేశము. "ఒకచాయ ననపాయపికగేయసముదాయ" మని రామరాజభూషణుఁడు.

తాత్పర్యము

ఓ గొప్ప మహిమగలవాఁడా! బాణసమూహములు నిన్నుఁ బ్రాణహీనుఁగాఁ జేయలేదు గదా యని యడుగఁగా కష్టముమీఁద మాటలాడుటకు సత్తువ తెచ్చుకొని కొంచెముగా నోరు దెఱచి యిట్లనియె. మహాబలుఁడవైన రాక్షసరాజా! నీ వెందుండునది నేను జూడలేక పోయినను నీ మాట ధ్వనిఁ బట్టి తెలిసికొంటిని.

కం. సునిశితశరములు నాటుటఁ, గను లేమియుఁ గాన రావు ♦ గావున పుసతుఁ డం
జనగాదిలిబిడ్డం డా, హనుమంతుం డున్నవాఁడె ♦ ప్రాణముతోడన్? ౧౭ ౫౮

అర్థములు. సునిశిత శరములు=వాఁడి బాణములు, ఏమియున్=కొంచెమైనను

తాత్పర్యము

వాఁడి బాణములు నాటుటచే నాకుఁ గన్నులు బొత్తిగాఁ గానరాకున్నవి. అయ్యా! విభీషణా! అంజనాదేవి ముద్దుబిడ్డఁడు వాయుపుత్త్రుఁడు హనుమంతుఁడు ప్రాణములతో నున్నాఁడా!

చ. పలుకఁగదయ్య యన్న రఘు♦వర్యులసేమము ప్రశ్న సేయకో
యలఘుమతీ! మరుత్తనయు ♦ నాదటఁ బ్రశ్నము సేయ నేల? యా
బలియుఁవిమీఁద ప్రేమ నృప♦వర్యులమీఁదను వాలిపుత్త్రుపై
జలరుహమిత్త్రసూనుపయి ♦ సత్యము నీ వెదఁ బూన వేలొకో! ౧౭౬౦

తాత్పర్యము

అయ్యా! చెప్పుము అని యడుగఁగా విభీషణుఁ డిట్లనియె. గొప్ప మనస్సు గలవాఁడా! రామలక్ష్మణులు క్షేమముగా నున్నారా యని యడుగక హనుమంతుఁడు బాగున్నాఁడా యనెదవేల? వాస్తవమున నీకు హనుమంతుని మీఁద నున్న ప్రేమ రాజకుమారు లందుఁగాని బాలుఁడగు నంగదు మీఁదఁ గాని ప్రభువగు సుగ్రీవుని మీఁదఁ గాని లేదు. ఏమి కారణము?

కం. అనుచు విభీషణుఁ డాడిన, విని భల్లూకేశ్వరుండు ♦ వినుమీ వినుతున్
దనుజేశ్వర! నే మారుతతనయునిఁ బ్రశ్నించుటకు ని♦దానముఁ దెలియన్.

అర్థములు. నిదానము = మూలకారణము.

తాత్పర్యము స్పష్టము.

కం. హనుమంతుఁడు జీవించిన, మనసేనలు హతము లయ్యు ♦ మనియున్న వగున్
హనుమంతుండు లేకుండిన, మన మెల్లను బ్రతికియున్న ♦ మ్రందిన యట్లౌ.

అర్థములు. మని యున్నవి=బ్రతికి యున్నవి, మ్రందినయట్లు=చచ్చినట్లు.

తాత్పర్యము స్పష్టము.

కం. నుతమతి వాయుజుఁడు సదా,గతికిన్ సరి గమనమునను ♦ ఘనవీర్యమునన్
హుతవహతుల్యుఁడు గావునఁ, బ్రతుకుదుఁ గా కనుచు నాశ ♦ బాధించె ననున్.

అర్థములు. నుతమతి = స్తోత్రముచేయఁబడిన మనస్సు గలవాఁడు, సదాగతికిన్=వాయువునకు, హుతవహతుల్యుఁడు=అగ్నితో సమానుఁడు.

తాత్పర్యము

పొగడఁబడు మనస్సు గల హనుమంతుఁడు గమనమున వాయుదేవునితోడను, వీర్యాతిశయమున నగ్నిదేవుని తోడను సమానుఁడు. కావున నింకను బ్రదుకుదును గాక యను నాశ నన్ను బాధించెను. దీనివలన నెట్టికష్టదశయందైనను నెట్టివానికైనను ఇంకను జీవింపవలయు నను నాశ జీవునకు స్వభావమని యేర్పడుచున్నది.

చ. అన హనుమంతుఁ డయ్యనఘు♦సంఘ్రుల వాలి మహాత్మ! యే మరు
త్తనయుఁడ వచ్చినాఁడ ననఁ ♦ దల్లపితంబుల నాలకించియున్

మనమునఁ గుంది వెండి నిజ ♦ మాౖతుదరంబునఁ బుట్టినట్టు ల
వ్వనజజసంభవుం డలరి ♦ వాయుతనూజునితోడ నిట్లనున్.

అర్థములు. అంఘ్రులన్ = పాదములందు, మరుత్తనయుఁడన్ = వాయుపుత్రుఁడను, తల్లపితంబులు = ఆ మాటలు, మాతృ + ఉదరంబునన్ = తల్లిగర్భమున, వనజజ సంభవుండు=బ్రహ్మకొడుకు జాంబవంతుఁడు, అలరి=సంతోషించి.

తాత్పర్యము

అని చెప్పఁగా హనుమంతుఁ డా పుణ్యాత్ముపాదముల వ్రాలి మరుత్తనయుఁడ వచ్చినాఁడ నని యభివాదనముచేసి చెప్పఁగా నా మాటలువినియునుబాణవేదనచే మనస్సున సంకటపడి మరలఁ దన తల్లికడుపునఁ దాను బుట్టినట్లుగా నెంచుకొని యా జాంబవంతుఁడు సంతోషించి హనుమంతునితో నిట్లనియె.

—♦ జాంబవంతుఁడు హనుమంతుని సంజీవకరణిఁ దేర నియోగించుట ♦—

కం. రమ్మా హరిశార్దూలా! యిమ్మర్కటబలముఁ గావ ♦ నీవే గతి శౌ
ర్యమ్మున నీసరు లేరీ, సమ్మతి మాకెల్లఁ బరమ ♦ సఖుఁడవు గావే. ౧౭౬౫

తాత్పర్యము స్పష్టము

ఉ. అన్న! భవత్సమానబలు ♦ నన్యుని నారసి కాన నెందు లో
కోన్నత శౌర్యశాలివి త్వ ♦ దుగ్రపరాక్రమ మెల్లఁ జూపఁగాఁ
జెన్నగువేళ యియ్యదియ ♦ చేకుఱెఁ గీశులు భల్లుకంబులున్
సన్నుతరామలక్ష్మణులు ♦ సంతస మొంద నొనర్పుమీ వెసన్. ౧౭౬౬

తాత్పర్యము

అన్నా యాంజనేయా? నీతో సమానుఁడగు బలవంతుని నేనెందు వెదకినను లేఁడు. నీవు లోకోన్నతశౌర్యశాలివి. లోకమున నందఱికంటె నీవు గొప్ప బలవంతుఁడవు. నీ యధికపరాక్రమ మంతయుఁ జూపఁదగిన సమయమిపుడేలభించినది. వానరులను, భల్లుకములను, రామలక్ష్మణులను వేగ సంతోషింపఁజేయుము.

సీ. అంజనాతనయ! నీ ♦ వంబుధిఁ ధరియించి, యెంతయు దూరంబు ♦ నేగి శీత
శైలంబుఁ గని వెండి ♦ స్వర్ణమయం బగు, ఋషభశైలాన మ ♦ హీధరములఁ
గనుఁగొని తన్మధ్య ♦ మున ఘనప్రభ మయి, సర్వౌషధులచే ♦ జానుమీఱు
నోషధిగిరిఁ గాంచు ♦ ముర్వీధరాగ్రంబు, నం దమదీప్తి న ♦ మందముగను

తే. దెసల వెలిఁగించునోషధుల్ ♦ పొసఁగునాల్గు, వానికాంతులచే వాని ♦ వలనెఱింగి
నీవు వే మృతసంజీవ ♦ నిని విశల్య,కరణి సావర్ణ్యసంధాన ♦ కరణు లనఁగ. ౧౭౬౭

అర్థములు. సర్వౌషధులచే = అన్ని విధములయిన మూలికలచే (౨) సర్వౌషధ మూలికలచే, జానుమీఱు=అందమైన, ఓషధిగిరి = మూలికలకొండ,

### తాత్పర్యము

నీవు సముద్రము దాఁటి చాల దూరము పోయి హిమవత్పర్వతముఁ జూచి అందు ఋషభశైలము కైలాసమను పర్వతములఁ జూచి వాని నడుమ మిక్కిలి కాంతిగలదై సర్వౌషధులు గలిగి యందమైన మూలికల కొండఁ జూచి యా పర్వతము కొన యందు నధికమైన తమ కాంతిచే దిక్కుల వెలిగించు మూలికల నాల్గింటిఁ జూడుము వాని కాంతుల చేతనే వానిని నీవు గుర్తింపఁ గలవు. అందు మృతసంజీవని (చచ్చిన వారిని బ్రదికించునది) విశల్యకరణి (దేహమున నాటిన యితర పదార్థములను బాణముల ములుకులు మొదలైన వానిని నూడఁదీయునది) సావర్ణ్యకరణి (గాయములచే వన్నె మారినచోట మరల వన్నె వచ్చునట్లు చేయునది) సంధానకరణి (విఱిగిన యెముకలను అవయవములను మరలఁ గలియుకొనునట్లు చేయునది) ఇవి నాలుగు మూలికలు.

తే. పరఁగు వానిని గొని జగ॥త్ప్రాణతనయ, వచ్చి యీకీశసేనకుఁ ॥ బ్రాణ మిమ్ము
పొమ్ము నీకు శుభంబగు ॥ రమ్ము వేగ, యనిన నాతఁడు సంతోష॥మతిశయిల్ల.

తాత్పర్యము స్పష్టము.

### —॥ హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుటకై పోవుట ॥—

కం. అర్ణవము జలంబులచేఁ, బూర్ణం బగుభంగి దేహ॥మును బెంచి బలో
దీర్ణుండై గిరిశిఖరముఁ, దూర్ణము తనపాదములను ॥ దొడిఁబడఁ జేసెన్. ౧౭౬౯

అర్థములు. అర్ణవము=సముద్రము, బలోదీర్ణుండై = బలముచే గొప్పవాఁడై, గొప్ప బలముగలవాఁడై, గిరిశిఖరము=త్రికూటపర్వత శిఖరము, తొడిఁబడన్ = వణఁకునట్లు.

తాత్పర్యము స్పష్టము.

సీ. రెండవకొండనా ॥ గంబు నిగిడిన మారు, తాత్మజాతుని పాద॥హతులకోర్వఁ
జాలక కంపించె ॥ శైలంబు శృంగముల్, కుజములు ధరణిపైఁ ॥ గూలఁబడియె
నా నగంబునఁ బ్లవ॥గావళి లే, కడలున గడగడ ॥ లాడె నపుడు
ఘూర్ణితద్వారమై ॥ కుంఠితగేహమై, భగ్నగోపుర మయి॥పట్టణంబు
తే. సాధ్వసాకుల మయి గొండ్లి॥సలుపునట్లు, లయ్యెనారాత్రి నీరీతి ॥ హాటకాద్రి
మందరనగోపమాన మా ॥ మలయగిరిని, నాకులప్రస్రవణము సు॥రాన్వితంబు.

అర్థములు. పాదహతులకున్ =కాలి దెబ్బలకు, అడలున=భయముచే, ఘూర్ణితద్వారమై = శిథిలమైన వాకిండ్లు గలది, కుంఠితగేహము = విఱుగఁబడిన యిండ్లు గలది, భగ్నగోపురము = విఱిగిన గోపురములు గలదై, సాధ్వసాకులమయి = భయముచేఁ గలఁత నొందినదై, గొండ్లి = నర్తనము, హాటకాద్రి = బంగారు కొండ, మేరువు, మందరనగ = మందర పర్వతము, వీనితో — ఉపమాన=సమాన

మైన—మలయగిరిని = మలయపర్వతమును, ఇది లంకయందలి మలయము, ఆకుల = కలఁతపడిన ప్రస్రవణము = కొండవంకలు గలది, సురాన్వితంబు=దేవతలతోఁ గూడినది.

తా త్ప ర్య ము

రెండవ కొండవలె నతిశయించిన హనుమంతుని కాలిదెబ్బలకు సహింపలేక పర్వతము శిఖరములు వణఁకెను. అందలి చెట్లు నేలఁబడెను. ఆ కొండమీఁద వానరులు నిలువలేక భయముచే గడగడ వణఁకిరి. ఆ రాత్రివేళ ద్వారములు శిథిలములయ్యెను. ఇండ్లు విఱుగఁబడెను. గోపురములు విఱిగెను. పట్టనము భయముచే నృత్యము సలిపినట్టు లయ్యెను. ఈ విధముగ మేరుమందర సమానమైన మలయ పర్వతము, కలఁతపడిన సెలయేళ్ళు గలదానిని, దేవతలతోఁగూడినదానిని.

కం. నానాలతాద్రుమకీర్ణము, నానావికసితకువాల ♦ నళినచయంబున్
నానామృగసంకీర్ణము, నానాకందరము మౌని♦నాథాంచితమున్. ౧౭౭౧

అర్థములు. నానాలతాద్రుమకీర్ణము = అనేక విధములైన తీఁగలతోను చెట్లతోను వ్యాపింపఁబడినది, నానావికసిత కువాలనళినీ చయమున్=అనేకవిధములైన వికసించిన కలువలు తామరలు గలది, నానామృగ=పెక్కు తెగల మృగములచే, సంకీర్ణము = వ్యాపించినది, నానాకందరము = అనేక గుహలుకలది, మౌనినాథ + అంచితము = గొప్ప ఋషులచే నొప్పుచున్నదానిని.

తా త్ప ర్య ము

నానావిధములయిన తీఁగలతోను చెట్లతోను వ్యాపించినది, అనేక విధములైన వికసించిన కలువలను కమలములను గలది. అనేక మృగములచే నిండినది, అనేక గుహలు కలది, ఋషీశ్వరులచే నొప్పునది.

తే. అంఘ్రులను ద్రొక్కి బడబాము♦ఖాభముఖము, విచ్చి గర్జించె భూతాళి♦వీనులగల
నద్భుతారవమాలించి ♦ యసురులెల్లఁ, గదలకిట్టలుండిరి ♦ కడుభయమున. ౧౭౭౨

అర్థములు. అంఘ్రులను = కాళ్ళచే, బడబాముఖాభముఖము = బడబానలము నోటితో సమానమైన నోరు, విచ్చి = తెఱచి, అగలన్=పగులునట్లు.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. భీమపరాక్రముండు హరి♦వీరుఁడు భక్తిని రామచంద్రునిన్
దా మనసార మ్రొక్కి లిడి ♦ దాశరథి ప్రియకార్యకర్మఠుం
డై ముఖ మొప్ప విచ్చి మహి♦తాహినిభం బగు తోఁక నెత్తి సం
స్థామతి వీఁపు వంచి శ్రవ♦ణంబులు గుంచి ప్రచండ వేగుఁడై. ౧౭౭౩

అర్థములు. మనసారన్ = నిండుమనస్సుతో, దాశరథి ప్రియకార్య కర్మఠుండై = రామచంద్రమూర్తికిఁ బ్రియమైన కార్యమును జేయువాఁడై, దీనివలన నే కార్యము చేసినను ముందు భగవంతునికి నమస్కరించి భగవత్ప్రీతికరమైన

కార్యము చేయవలసినదని తెలియునది. ఇచ్చటభగవద్గీత ౧౨వ యధ్యాయమందలి ౧౦వ శ్లోకము.

'అభ్యాసే ప్యసమర్థోసి, మత్కర్మ పరమోభవ
మదర్థమపి కర్మాణి, కుర్వన్ సిద్ధి మవాప్స్యసి'

అభ్యాసమందు నీవసమర్థుఁడ వైతివా నా కార్యములు చేయుము. నన్నుద్దేశించి నీవు కార్యములు చేసినను మోక్షము గందువు.

"జీవన్ముక్తః స్థితప్రజ్ఞో విష్ణుభక్తశ్చ కథ్యతే" విద్యారణ్యులు.

విష్ణుభక్తుఁడే జీవన్ముక్తుఁ డని స్థితప్రజ్ఞుఁ డని చెప్పఁబడు చున్నాఁడు.

మహితాహినిభంబు=పెద్దపాముతో సమానమైనది, సంస్థాపిత=చక్కఁగా నిలుపఁబడిన మనస్సు గలవాఁడై, ఏకాగ్రచిత్తుఁడై; ప్రచండ వేగుఁడై = తీవ్ర వేగము గలవాఁడై. ప్రొక్కులిడి యనుటచే ఒంటిదండము నిషిద్ధ మని సూచన.

## తాత్పర్యము

భయంకరమైన పరాక్రమము గలవాఁడయ్యు నాంజనేయుఁడు తన స్వశక్తిపై నాధారపడక పూనిన కార్యము నిర్విఘ్నముగ నెఱవేఱుటకై భక్తితో రామచంద్ర మూర్తికి నిండు మనస్సుతో నమస్కారములు చేసి రామచంద్రమూర్తికిఁ బ్రియమైన కార్యము చేయు నిష్ఠగలవాఁడై యుత్సాహసూచకముగ ముఖము వికసింపఁ జేసి తోఁకపై కెత్తి మనస్సు నేకాగ్రముగఁ జేసి నిట్ట నిలువున నెగురుటకు సాధ్యపడదు కావున పీఁపువంచి బలము విజృంభించుటచే చెవులు గుంచి తీవ్ర వేగము గలవాఁడై.

సీ. కుప్పించి యెగిరినఁ గుధరస్థశిలలును, వృక్షషండంబులు ♦ వెంటఁ బాఱి
యావేగ మణఁగిన ♦ నంబుధిలోఁ బడె, గరుడ వేగుం డయి ♦ యురగయుగముఁ
బోలు చేతులు సాఁచి ♦ పోఁబోరి దిక్కులు, కంపింప విష్ణు♦కరవిముక్త
చక్రం బనఁగ బాఱె ♦ సంఘూర్ణితతరంగ, జాలము భ్రామిత♦సర్వసత్త్వ

తే. మైన వననిధిఁ గాంచుచు ♦ నరిగి యరిగి, మార్గమందు నదీనద♦మహిజషండ
హారిపురముఁ గనుచు నీ♦హారనగముఁ, గాంచి విధిసుతునుడుల స్మ♦రించి యేగి.

అర్థములు. కుధరస్థశిలలు = పర్వతమునందున్న ఱాలు, వృక్షషండంబు= చెట్లగుంపులు, ఉరగయుగము = పాములజంట, విష్ణుకర విముక్త చక్రము = విష్ణుదేవునిచే విడువఁబడిన చక్రము, ఇది వేగమును అప్రతిహతత్వమును సూచించును, సంఘూర్ణిత తరంగజాలము = తిరుగుడు పడిన అలల సమూహముగలది, భ్రామిత= భ్రమచెందిన, సర్వసత్త్వము = సమస్త జంతువులు గలది, వననిధిన్ = సముద్రమును, నదీనద మహిజషండహారిపురములన్ =నదులను నదములను చెట్లతోఁపులను మనోహరములైన పురములను, నీహారనగము=హిమవంతము, విధిసుతు = జాంబవంతుని యొక్క, నుడులన్ = మాటలను, స్మరించి = జ్ఞప్తికిఁ దెచ్చుకొని.

### తాత్పర్యము

కుప్పించి యెగయఁగాఁ గొండయందున్న తాలు చెట్లసమూహములు వెంటఁ బరువెత్తి వేగము తగ్గఁగానే సముద్రములోఁ బడెను. గరుడుని వేగము గలవాఁడై పాముల జంటవలెఁ జేతులుచాఁచి దిక్కులు వణకఁగా విష్ణువువిడిచిన చక్రమువలెఁ బరువునఁ బోయెను. ఆ వేగమునకు సముద్రమున నలలు తిరుగుడు పడెను. సమస్త జంతువులు భ్రమగొనెను. ఇట్టి సముద్రమును జూచుచుఁబోయి పోయి త్రోవలో నదులను నదములను తోఁటలను తోఁపులను పురములను జూచుచు మంచుఁగొండ చేరి జాంబవంతుని మాటలు జ్ఞప్తికిఁ దెచ్చుకొని పోయి.

కం. బహుకందరనిర్ఝరమై బహుళ ప్రస్రవణయుక్తిఁ ♦ బరఁగుచు నానా
మహిజగుహాన్వితంబై, మహితసితాభ్రాభశృంగ ♦ మంజుల మగుచున్. ౧౭౭౫

అర్థములు. బహుకందర నిర్ఝరమై = అనేక గుహలు సెలయేఁళ్ళు గలదై, బహుళ ప్రస్రవణ యుక్తిన్=అనేకజలపాతములతోఁ గూడి (Water falls) నానా మహిజగుహాన్వితంబై = అనేకములయిన చెట్లు గుహలు గలదై. మహిత=గొప్పదగు, సితాభ్రాభ = తెల్లమేఘము వంటి, శృంగములు = శిఖరముగలదై, మంజులము = మనోహరము.

### తాత్పర్యము

అనేక గుహలలోనుండి వెడలు సెలయేఁళ్ళు గలదై అనేక జలపాతములు ఆకాశగంగవలె నీళ్ళు దూఁకుటలు గలదై అనేక చెట్లతో గుహలు గలదై తెల్లని పెద్ద మేఘముతో సమానమై మనోహరమై.

అహ మభ్యసించి దేహమునుండి జీవుని వెలికిదీయఁగలవారు నొక్కొక్క వేళ జీవుని గమనము వేగము స్మరించిరేని హనుమంతుని గమనవేగ మెట్టిదై నదికొంతకుఁ గొంత యూహింపఁగలరు. తక్కినవారి కిట్టి వేగము నూహింప నసాధ్యమనియే తోఁచును. ఎద్దు బండిలో ప్రయాణము చేయు గ్రామ్యుఁడు విమ్యచ్ఛకటము వేగమును నూహింపఁగలఁడా? చెప్పిన నమ్మునా? చెప్పుటెట్లు?

సీ. తనరారు హిమగిరిఁ ♦ దటియఁగ నేగి ప్ర వృద్ధఘోరోత్తమ ♦ శృంగతలము
పుణ్యాశ్రమంబులు ♦ మునిజనయుతములు, పరమమతిం గని ♦ బ్రహ్మకోశ
మలరజతాద్రిని ♦ హరిహయాలయమును, నుగ్రబాణప్రమో ♦ క్షోరుతలము
హయముఖు సందీప్త ♦ మగుబ్రహ్మశిరమును, యముని కింకరుల వ♦జ్రాలయంబు
తే. నబ్జహిత తేజ మగుధన ♦ దాలయంబు, నర్కబంధనతలము బ్ర ♦ హ్మాసనంబు
వసుమతీనాథ! కైలాస♦పరిసరమున, నొప్పు హిమవచ్ఛిలను బుష♦భోగ్రధరము

అర్థములు. తటియఁగనేగి = సమీపించి, ప్రవృద్ధ = ఎత్తుగాఁ బెరఁగిన, ఘోర=భయంకరమైన, ఉత్తమ శృంగతలము=శ్రేష్ఠమైనశిఖర ప్రదేశము, బ్రహ్మ, కోశము=బ్రహ్మతపస్సుచేసిన స్థలము, ఇందుకోశమనఁగా గృహమనియర్థము. 'కోశో గృహే దేహే' యని నానా.ర. రజతాద్రిని=కైలాసమును, హరిహయాలయమును=

ఇంద్రుని వాసస్థానమును, ఉగ్ర = శివుని యొక్క - బాణప్రమోక్షోరతలము = బాణములు విడుచు గొప్పప్రదేశమును, హయముఖు = హయగ్రీవుని, సందీప్త మగు = ఆరాధించిన స్థలము, బ్రహ్మశిరము = రుద్రుడు భేదించిన బ్రహ్మశిరః కపాలము బ్రహ్మహత్యయై ఆయన చేతిలో నంటుకొనియుండి యచ్చట లక్ష్మీదేవి కపాలమందు భిక్ష వేయఁగా నది దిగువఁబడి పోయినచోటు, వజ్రాలయము = బ్రహ్మ యింద్రునికి వజ్రమిచ్చిన స్థలము, అర్క-బంధనతలము = విశ్వకర్మ ఛాయాదేవి ప్రీత్యర్థమై సూర్యుని కాంతి తగ్గించుటకు సూర్యుని సానపెట్టిన స్థలము, బ్రహ్మ సనము = దేవతలకు వరము లిచ్చుటకై బ్రహ్మ కూర్చుండుస్థలము, వసుమతీ నాభి = పాతాళమునఁ బ్రవేశించుటకైన భూరంధ్రము, హిమనచ్ఛిలను = కైలాస సమీపమున హిమవచ్ఛిలయని యొకశిల గలదు. ఋషభ + ఉగ్రధరము = ఋషభ మను పేరు గల భయంకరపర్వతము. ఓషధులు దీని యందుండును.

తాత్పర్యము

ఒప్పుచున్న హిమవత్పర్వతము సమీపించి మిగులనున్నతమైన భయంకర మైన శ్రేష్ఠమైన శిఖర ప్రదేశము మునిజను లుండు పుణ్యాశ్రమములు మిగుల భక్తి శ్రద్ధలతో జూచి బ్రహ్మకోశము, కైలాసము, హరిహయగృహము, రుద్రుఁడుబాణ ములనువినోదమునకై వేయుస్థలము, హయగ్రీవునినర్చించిన బ్రహ్మశిరము, యమకింక రులయు వజ్రము నాలయము, సూర్యకాంతిగల కుబేరు గృహము, సూర్యుని సానకుఁ గట్టిన స్థలము, బ్రహ్మసనము, భూనాభి, కైలాన ప్రాంతముననుండు హిమవచ్ఛిలను ఋషభపర్వతమును.

కం. సర్వౌషధి సందీప్తము, సర్వౌషధినగము సూర్య • సన్నిభమును మే
ఘూర్వనిమాతాత్మభవుఁ డ, ఖర్వాశ్చర్యైకమతిని•గనుఁగొని నచటన్. ౧౨౨౨

సర్వౌషధి సందీప్తము = సర్వౌషధులచే ప్రకాశించునది, సూర్యసన్నిభము రాత్రివేళ నివి ప్రకాశించుటచే సూర్యుఁడు ప్రకాశించినట్లు యుండెనని భావము. మేఘూర్వనిమాత = వాయువుయొక్క, ఇంద్రుఁడు మేఘవాహనుఁడు, మేఘము లను నోలువాఁడు వాయువు, కావున వాయువు ఇంద్రమాత యనఁబడెను. శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక కాలమున నింద్రప్రేరితుఁడై వాయువు శ్రీరామునకు హార మర్పించెను. అదియును వాయు వింద్రమాత యనుట బల పఱుచు చున్నది, అఖర్వ = విస్తారమైన, ఆశ్చర్యైకమతిని = ఆశ్చర్యము విశేష ముగఁ గల మనస్సుతో.

—• హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చుట •—

చ. వనచరభర్త యోషధుల • వారక రోయుచు నొక్క వేయి యో
జనములు సంచరింప నిజ • సంగ్రహణార్థము వచ్చె నవ్వఁడో

యని తలపోసి యోషధిచయంబులు వే మఱఁగెం, గపీంద్రుఁడున్
గినుకను దామ్రచక్షుఁ డయి కేరి మహోర్భటిఁ బల్కెఁ దద్గిరిన్. ౧౭౭౮

అర్థములు. నిజసంగ్రహణార్థము = తమ్ము హరించుకొని పోవుటచే, మఱఁగెన్ = దాఁగుకొనెను, కానరాక పోయెను.

### తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు మూలికలకై వేయి యోజనములస్థలము వెదకెను. ఆ మూలికలు తమ్మెవఁడో తీసికొని పోవుటకై వచ్చినాఁడని తెలిసికొని కానరాక పోయెను. అవి కానరాక పోఁగా హనుమంతుఁడు కన్నులెఱ్ఱచేసి పెద్ద ధ్వనితో నా కొండతో నిట్లనియె.

ఉ. ఏమి నగోత్తమా ! కరుణయింతయు లేదుగ రామచంద్రుపై ?
నేమని యోషధిప్రతతి నిట్టు లణంచితి లోనఁ? నిద్దియే
నీ మది నిశ్చితంబ యగునేని మదీయభుజాభిభూత వై
యే మయి పోదువో యెఱుఁగుదే? యిదిగో నినుఁ బిండిగొట్టెదన్. ౧౭౭౯

అర్థములు. మదీయభుజాభిభూతవై = నా చేతులచే నవమానింపఁ బడినవాఁడవై.

### తాత్పర్యము

ఏమి పర్వతోత్తమా ! రామచంద్రమూర్తి మీఁద నీకుఁ గొంచెమైన దయ లేదాయెఁగదా, ఏమని నీవోషధుల దాఁచిపెట్టితివి ? రామచంద్రమూర్తికి సహాయము చేయఁగూడదనియా? నాయందు లక్ష్యభావము లేకయా? ఓషధులు నాకు లభింపనీయరాదనియే నీ నిశ్చయాభిప్రాయమేని నాచే నెట్లు పరాభవింపఁబడుదువో యది నీ వెఱుంగుదువా ? ఇదిగో నిన్నిప్పుడే పిండిగొట్టెదను.

చ. అనుచు సకాంచనంబును సనాగము ధాతుసహస్రజుష్టమున్
ఘనతరశృంగమున్ రవినికాశము శైలముఁ దోడఁ బాఁతుతో
ననఘుఁడు పెల్లగించి జలదాధ్వముమీఁదికి నుద్గమించి చ
య్యనఁ జనుదెంచె ఖేచరులహో యనుచున్ స్తుతియించుచుండఁగన్. ౧౭౮౦

అర్థములు. సకాంచనము = బంగారు గనులతోఁ గూడినది, సనాగము = సర్పములతోఁ గూడినది, "నాగ స్సర్పే గజే మేఘే పున్నాగే నాగకేసరే" నానా॥ర. ధాతుసహస్రజుష్టము=అనేక గైరిక ధాతువులతోఁ గూడినది, ఘనతర శృంగమున్= మిగుల గొప్పదగు శిఖరము గలది, రవినికాశము = సూర్యప్రకాశము గలది, పాఁతుతోన్ = అనుగుతో, జలదాధ్వము మీఁదికిన్ = ఆకాశము మీఁదికి, ఉద్గమించి=ఎగిరి, ఖేచరులు=ఆకాశమున సంచరించు దేవతలు మొదలగువారు.

### తాత్పర్యము

అని చెప్పి బంగారుగనులతో సర్పములతో నానాధాతువులతో గూడినదియు, గొప్ప శిఖరము గలదియు, సూర్యునితోఁ సమానమైన కాంతిగలదియునగు

శైలమును హాతుతోఁ బెల్లగించి యాకాశమున కెగిరి దేవతలు మెచ్చుకొనుచుండ శీఘ్రముగా వచ్చెను.

కం. భాస్కరమార్గగుఁ డై యా, భాస్కర శిష్యుండు దాల్చి ♦ భాస్కరనిభమున్
భాస్కరసమీపగునిఁ బ్రతి, భాస్కరునింబోలెఁ దీవ్ర♦భాస్కరుఁ డగుచున్.

అర్థములు. భాస్కరమార్గగుఁడై = సూర్యుని మార్గము, ఆకాశమును బొందినవాఁడై, భాస్కర శిష్యుండు=హనుమంతుఁడు, భాస్కరనిభమున్=సూర్యునితో సమానమైన కాంతిగలదానిని, భాస్కర సమీపగుని = సూర్యుని సమీపమందుండువానిని, ప్రతిభాస్కరునిన్ = రెండవ సూర్యుని, తీవ్రభాస్ + కరుఁడు = అతిశయించిన కాంతి గలిగించువాఁడు.

తా త్ప ర్య ము

సూర్యకాంతి గల యాపర్వతమును హనుమంతుఁడు చేత ధరించి యాకాశ మార్గముఁబట్టి మిగులఁ గాంతి గలిగించువాఁడగుచు సూర్యుని సమీపమున నున్న రెండవ సూర్యునివలె నుండెను. సూర్యునియొద్ద రెండవ సూర్యుఁ డనుటచే సూర్యోదయ మని చెప్పరాదు. ఏలన నీ రాత్రికాలమందే లంకాదహనము చెప్పఁబడఁ గలదు. ఓషధులచే వెలుగు పర్వత మొక సూర్యుఁడనియు సహజ కాంతిగల హనుమంతుఁడు రెండవ సూర్యుఁడనియు గ్రహింపవలెను. అప్పుడే సమీపమునను న్నయను విశేషణము సార్థకమగును. ఆకాశమున నుండువానికి భూమిమీఁద నుండువాఁడు సమీపస్థుఁ డెట్లు కాఁగలఁడు.

కం. శైలధరుఁడు పావని యు,త్తాలాభీలము సహస్ర♦ధారము చక్రం
బోలి ధరించిన విష్ణువు, పోలెన్ రాజిల్లెఁ బగఱు ♦ పారి భీతిల్లన్. ౧౭౦ ౹

అర్థములు. శైలధరుఁడు = పర్వతమును ధరించినవాఁడు, పావని = హనుమంతుఁడు, ఉత్తాలాభీలము = విశేష భయంకరమైనది, సహస్రధారము = వేయి యంచులు గలది, చక్రము = సుదర్శన మను చక్రము, పగఱు=పగవారు, ఉత్తాలాభీలము, చక్రము ధరించిన విష్ణువనుటచే చక్రధరుఁడైన విష్ణు వెట్లు రాక్షసులకు భయంకరుఁడో, ఆశ్రితులకు నానందకరుఁడో యట్లు పర్వతధరుఁ డగు హనుమంతుఁడు రాక్షసులకు భయంకరుఁడు, వానరులకు నానందకరుఁ డని భావము.

తా త్ప ర్య ము

శైలమును ధరించిన హనుమంతుఁడు మిగుల భయంకరమై వేయిధారలు గల సుదర్శన చక్రమును ధరించిన విష్ణువువలె పగవారు మిగుల భయపడునట్లు ప్రకాశించెను.

—♦ సంజీవనిచే వానరాదులు జీవించుట ♦—

ఉ. వాయుసుతుండు దూరమున ♦ వచ్చుచు నుండఁగ నోషధీలతా
వాయువు సోఁకి వానరులు ♦ ప్రాణములం గని యెల్లవారు న

చ్ఛాయను జూచి కేక లిడ • సమ్మద మారఁగ బావమాని క
ర్జాయతి మాటలుం గిడియె • నాశరులున్ వెఱ బొబ్బరింపఁగన్. ౧౭౩

అర్థములు. ఓషధీలతావాయువు = మూలికల తీఁగల మీఁదనుండివచ్చిన గాలి, అచ్ఛాయను = హనుమంతుఁడు వచ్చు దిక్కును, గర్జాయతి = పెద్దగర్జచే, వెఱన్=భయముచే, బొబ్బరింపఁగన్=బొబ్బలు పెట్టఁగా, పెద్దగాఁగూయఁగా.

## తాత్పర్యము

హనుమంతుఁడు దూరమున వచ్చుచుండఁగనే మూలికలమీఁదనుండివచ్చిన గాలి సోఁకుటచేతనే వానరు లందఱుఁ బ్రాణములఁ గనిరి. ఇట్లు ప్రాణములు వచ్చినవారై హనుమంతుఁడు వచ్చు దిక్కునుజూచి నిండు సంతోషముతోఁ గేకలు వేసిరి. హనుమంతుఁడు రాక్షసులు భయముచే బా-బా యని యఱచుచుండఁగ పెద్ద ప్రతిధ్వని యిచ్చెను.

కం. ఈనెఱి దించి గిరిం దద్వానరమధ్యమునఁ బెద్ద • వారికి మ్రొక్కెన్
మానుగఁ గౌఁగిటఁ జేర్చెను, దానవవిభుఁ గంధవాహ•తనయుఁడు ప్రీతిన్. ౧౭౪

## తాత్పర్యము

ఈ విధముగఁ గొండను వానరుల నడుమ దించి పెద్దవారలగు జాంబవత్సుగ్రీవాములకునమస్కరించెను. విభీషణుని ప్రేమతోఁ గౌఁగిలించెను.(సమానుఁడగుటచే)

చ. వలనుగ నమ్మహౌషధుల • వాసన మూర్కొని రామలక్ష్మణుల్
తెలివి వహించి లేచి కడు • దేఱిరి, చచ్చిన క్రోఁతిమూఁకలున్
బలితపునిద్ర నుండి తెల•వాఱిన మేల్కను భంగి లేచి క్రొం
జెలువు వహించె; రాక్షసుల • జీవితుఁ డొక్కఁడుగాఁడ దేలనన్. ౧౭౫

అర్థములు. వలనుగన్ = తక్కినవిధముగ, మూర్కొని = వాసనచూచి.

## తాత్పర్యము

తగినవిధముగ నా మహామూలికల వాసన చూచి రామలక్ష్మణులు స్మృతి గలవారై లేచి మిగుల తెప్పఱిల్లుకొనిరి. చచ్చిన వానరుల గుంపులు గాఢనిద్రనుండి మేలుకొనినవారివలె లేచి క్రొత్తకాంతి వహించెను. వానరు లందఱు బ్రదికిరిగాని రాక్షసులం దొకఁడైన బ్రదికినవాఁడు లేడు. ఏలన,

కం. పోరు మొదల నాశరులు కపి,వీరులచేఁ జచ్చు నసుర•వీరుల నపుడే
నీరనిధిఁ ద్రోయుచుండిరి, గౌరవహేతువునఁ బంక్తి•కంఠునియాజ్ఞన్. ౧౭౬

## తాత్పర్యము

యుద్ధము ప్రారంభమైనది మొదలు వానరులచేఁ జచ్చిన రాక్షసుల నప్పుడపుడే రావణుని యాజ్ఞప్రకారము చచ్చినను శత్రువులకుఁ జిక్కుట యగౌరవమను కారణమున బ్రదికినవారు సముద్రములోఁ బాఱవేయుచుండిరి.

కం. కార్యంబు దీర మహితా,హార్యంబును గొంచు మరల • నరిగి త్వర హతా
నార్యుం డెప్పటి స్థితి నిడి, యార్య రఘూత్తమునిఁ జేర • నరుదేరంగన్. ౧౭౮౭

అర్థములు. మహితాహార్యంబును=గొప్పకొండను, హత = చంపబడిన, అనార్యుండు = దుష్టులు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము

**—• ౭౫-వ సర్గము. సుగ్రీవుఁడు లంకఁ గాల్పఁ గపుల నాజ్ఞాపించుట •—**

ఉ. వానరవల్లభుండు హరి • వైరినికారసముద్భవాగ్రహా
నూనపరీతచిత్తుఁ డయి • యుక్తవిధంబునఁ బల్కె నా హనూ
మానునితోడఁ దమ్ములుఁ గు • మారులు చచ్చుట శోకతప్తుఁడై
దానవవల్లభుం డనికిఁ • దా నరుదేరఁడు కాన మీరలున్. ౧౭౮౮

అర్థములు. హరివైరి = ఇంద్రజిత్తుయొక్క, నికార = అపకారముచే, వంచనచే, సముద్భవ = పుట్టిన, ఆగ్రహ = కోపముచే, అనూన = పూర్ణముగా, పరీతచిత్తుఁడయి=చుట్టఁబడిన మనస్సుగలవాఁడై, యుక్తవిధంబునన్=తగినరీతిగా.

తాత్పర్యము

సుగ్రీవుఁ డింద్రజిత్తు మోసవిధముగఁ జేసిన యపకారమువలనఁ గోపించిన మనస్సు గలవాఁడై తగిన విధంబుగ హనుమంతుని తోడ నిట్లనియె. రావణుఁడు తన తమ్ములు కొడుకులు చచ్చుటచే శోకముచేఁ దపించినవాఁడై యుద్ధమునకు రాక యున్నాఁడు, వాడు రాకుండిన మన మేల యూరకుండవలె మీరు.

కం. నెఱసరులును లాఘవయుతు, లఱుకొఱ లేకెల్లవార • లరిది జవమునన్
గొఱవులఁ గొని లంకాపురిఁ జుఱుపుచ్చుఁ డటన్న నెల్ల • శూరవరేణ్యుల్. ౧౭౮౯

అర్థములు. నెఱసరులు=శూరులు, అఱుకొఱలేక = సంకోచింపక, కొఱత లేక – చుఱుపుచ్చుఁడు=కొల్లగొట్టుఁడు.

తాత్పర్యము స్పష్టము.

శా. రౌద్రం బైన నిశాముఖంబున రుషా•రంభుల్ ప్లవంగేంద్రులా
క్రమాసంభవు లట్టు లూర్చుచును న•ల్కాహస్తులై లంకన
త్యుద్రాటోపముతోడఁ జొచ్చి పురర•క్షుల్ రాక్షసుల్ భీతిమైఁ
బ్రద్రావోన్ముఖులైన సంతసమునం • బ్రాసాదగేహాళులన్. ౧౭౯౦

అర్థములు. రౌద్రంబైన = గాఢాంధకారముచే భయంకరమైన, నిశాముఖంబునన్ = రాత్రి ప్రారంభ వేళ, సూర్యాస్తమానమైన యరజామునకుఁగాని రాత్రి ప్రారంభము కాదు. అంతవఱకు సంధి వేళయే ప్రదోష వేళయే. సూర్యాస్తమానానంతరము హనుమద్విభీషణులు జాంబవంతుని జూచుట హనుమంతుఁడు సంజీవని తెచ్చుట యంతయు నెనిమిది యెనిమిదిన్నర గంటల లోపల ముగిసెను. ఇప్పుడు తొమ్మిదిగంటలకాలము కావున నిది నిశకుఁ బ్రారంభకాలమే యగుచున్నది.

కావుననే రౌద్రము, రుషారంభుల్=కోపముయొక్క ఆరంభము గలవారు. కోపించినవారు, చేయఁదగిన కార్యము చేయఁబూనినవారు, కద్రూసంభవులు = సర్పములు, ఉల్కాహస్తులై = చేతులందుఁ గొఱవులు తీసికొనినవారై, అక్షుద్ర= కొంచెము గానట్టి, ఆటోపముతోడన్=వేగిరపాటుతో, ప్రద్రావోన్ముఖులైనన్ = పరువెత్తిపోఁగా, ప్రాసాదగేహాళులన్ = మేడలను మిద్దెలను.

తాత్పర్యము

గాఢాంధకార మగుటచే భయంకరమైన యారాత్రిప్రారంభ కాలమందు రోషారంభముగల వానరశ్రేష్ఠులు రోషముచే సర్పములవలె బుసలుగొట్టుచు చేతులలోఁ గొఱవులు దీసికొని మిక్కిలి వేగిరపాటుతో గవనుల కావలియున్న రాక్షసులు భయపడి పరువెత్తఁగా సంతోషించి లంకలోఁ బ్రవేశించి మేడలు మిద్దెలు.

తే. గోపురాట్టప్రతోళులఁ గూటములను, నగ్నిసంతర్పణముఁ జేసి రార్పు లెసఁగఁ
గొండలన నుండు ప్రాసాద కాండములును, దబ్బుదబ్బున నులివుల ధరణిఁ గూలె.

అర్థములు. గోపుర = గవనులు, అట్ట = బురుజులు, ప్రతోళులు=వీధి కూటములు, కూటములు = చావళ్ళు, ప్రాసాద=మేడలయిండ్లు, కాండములు = సమూహములు (ధనికుల యిండ్లు) ఉలివులన్=ధ్వనులతో, కూలెన్=పడెను.

## — కపులు లంకఁ గాల్చుట —

సీ. అగరు చెక్కలు మేలి హరిచందనంబులు, మండుచు మేల్ పరిమళము లీనె
మౌక్తికంబులు వజ్రమణులు ప్రవాళముల్, శంఖసంఘములు భస్మంబులయ్యెఁ
గౌశేయరాసులు క్షౌమసంతానముల్, మడతలు మడతలు మాయమయ్యెఁ
గంబళంబులు రమ్య కాంచనభాండంబు, లాజభాండపరిచ్ఛదాళి చెడియెఁ
తే. గరులసొమ్ములు రథభాండ పరికరములు, కవచములు గజరాజులఁ గప్పుచేల
లతులఖడ్గధనుర్జ్యాస్వ లాయుధములు, శూలములు శక్తులును గాలి చూర్ణమయ్యె

అర్థములు. అగరు = అగరు, మేలి = శ్రేష్ఠమైన వాసనగల హరిచందనంబులు=గంధపుఁ జెక్కలు, పరిమళములు=సువాసనలు, ప్రవాళములున్=పగడములు, కౌశేయరాసులు = పట్టువస్త్రములు, క్షౌమ సంతానముల్ = తెల్లని పట్టువస్త్రములు—ఇది వేఱుగాఁ జెప్పుటచేఁ గౌశేయ శబ్దమునకు నితర వర్ణముల పట్టువస్త్రములని యర్థము గ్రహింపవలెను. మడచిపెట్టఁబడినది. మడఁత, కాంచనభాండంబులు = బంగారు సొమ్ములు, పరిచ్ఛదాళి = పరికరముల సమూహములు, భాండంతు మార్జనే, వణిఙ్మూలధనే పాత్రే భూషణేచాశ్వభూషణే॥ నానా॥ర. ఆజభాండ=మేకలకు వేయు సొమ్ములు, పరిచ్ఛదము=కప్పుడు వస్త్రములు, ఆళి= పంక్తులు, భాండము లనుటచేతనే సర్వాభరణములు చెప్పఁబడినను మరల ఆజభాండము లనువాని వానికిఁ దగినసొమ్ములని తెలుపుటకై యని గ్రహింపవలయును.

### తాత్పర్యము

అగరుచెక్కలు గంధపుఁ జెక్కలు గాలి మంచివాసనలు గలిగించుచుండెను. ముత్యములు వజ్రములు పగడములు శంఖములు గాలి భస్మములయ్యెను. రంగుల పట్టు వస్త్రములు తెల్లపట్టు వస్త్రములు మడఁతలు మడఁతలుగానే కానరాక పోయెను. కంబళ్ళు మనోహరములైన బంగారు నగలు మేఁకలు సొమ్ములు కప్పు వస్త్రములు చెడిపోయెను. ఏనుఁగుల సొమ్ములు తేరి యలంకారములు పరికరములు కవచములు ఏనుఁగులకు గుఱ్ఱములకుఁ గప్పు వస్త్రములు ఖడ్గములు విండ్లు అల్లెత్రాడులు ఆయుధములు శూలములు శక్తులు కాలి చూర్ణమయ్యెను.

సీ. వాలజరోమజ ♦ వ్యాఘ్రచర్మములు, బహుళాండజంబులు ♦ పాడులయ్యె
ముక్తామణివిచిత్ర ♦ ములు పెనుమేడలు, వస్త్రమందిరములు ♦ నణఁగి పోయె
వేనవేలసురుల ♦ వీడులు బూదయ్యె, రాజత్వరతను ♦ త్రాణధరులు
దామహారాంబర ♦ ధారులు మధుపాన, చంచలనేత్రులు ♦ జాతరుషులు
తే. వల్లభలతోడ నిద్రించు♦వారు త్రాగు వారు తినువారు భీతిల్లు♦వారు పరుగు
పాఱువారును నాయుధ♦పాణులైన, వారలెల్లరుఁ బావకు♦వాతఁబడిరి.

అర్థములు. వాలజ = తోఁకల వలనఁ గలిగిన చామరములు లోనైనవి, రోమజ = వెండ్రుకల వలనఁ గలిగిన కంబళ్ళు తివాచులు లోనైనవి, వ్యాఘ్రచర్మజములు = పులితోళ్ళతోఁ జేయఁబడినవి, బహుళ = అనేకములైన, అండజములు = గ్రుడ్లవలననైనవి, రాజత్ = ప్రకాశించు, వర = శ్రేష్ఠములైన, తనుత్రాణధరులు = కవచముల ధరించినవారు, దామహారాంబరధారులు = సరములు ముత్యాలదండలు మంచివస్త్రములు ధరించినవారు, మధుపాన = సారాయము త్రాగుటచే, చంచల = కదలుచున్న, నేత్రులు = కన్నులు గలవారు, జాతరుషులు = పుట్టినకోపము గలవారు, వల్లభలతోడన్ = భార్యలతో, పావకువాతన్ = అగ్నినోట.

### తాత్పర్యము

తోఁకలవలనఁగలిగిన చామరములు వెండ్రుకలవలనఁ గలిగిన కంబళ్లు తివాచులు, పులితోళ్ళవలనఁ గలిగినవి, గ్రుడ్లవలనఁ గలిగినవి, ముత్యములచే నలంకరింపఁబడినవి, పెద్దమేడలు, అస్త్రములుంచిన యిండ్లుఅన్నియు నాశనమయ్యెను. వేలకొలఁది రాక్షసులయిండ్లుబూడిదయ్యెను. కవచములుధరించినవారు, మాల్యములు ముత్యాలసరములు మంచివస్త్రములు ధరించినవారు, సారాయముత్రాగికన్నులు తిరుగువారు కోపించినవారు భార్యలతో నిద్రించువారు త్రాగువారు తినువారు భయపడువారు పరువెత్తువారు ఆయుధములు ధరించినవారు అందఱు కాలిపోయిరి.

సీ. భార్యలు తమకొంగు ♦ పట్టఁబాఱెడివారు, పొగ నేదితోఁపక ♦ పొగులువారు
చంక బిడ్డలతోడ ♦ జలదరించెడివారు పరువిడుచో నేలఁ ♦ బడెడివారు

తమవారికై యేగి ♦ తాముఁ గాలెడివారు, తొలఁగినవారిని ♦ బిలుచువారు
కొడుకా! యటంచును♦గోడలా! యంచును, గూఁతురా! యని బిగ్గ♦కూయువారు
తే. స్వర్ణచంద్రార్ధచంద్రరూ♦పములుగలుగు, చంద్రశాలలు మణిగవా♦క్షములురత్న
విద్రుమాంచితములు చారు♦వివిధపక్షి, మందిరంబులు నగ్నుల♦మాఁడుటయ్యె.

అర్థములు. జలదరించెడివారు=వణకువారు, స్వర్ణ=బంగారు మయములై, చంద్ర=పూర్ణ చంద్రుని యొక్కయు, అర్ధచంద్ర=అర్ధచంద్రుని యొక్కయు, రూపములు=ఆకారములు, చంద్రశాలలు = పైమేడలు, రత్నవిద్రుమాంచితములు = రత్నముల చేతను, పగడముల చేతను, అంచితములు=ప్రకాశించునవి.

తాత్పర్యము స్పష్టము.

చ. జ్వలనపరీతగేహములు ♦ వార్షికవేళలఁ జంచలాలతా
కలితపయోదసంఘముల♦కైవడి నొప్పఁగఁ గాలి కూలుశా
లలు కులిశాహతిం బడు ని♦లాధర శృంగము లట్లు దోఁచెద
త్కలితమహానినాదములు ♦ గ్రమ్మి చెవు డ్పడఁ జేయఁ బౌరులన్. ౧౭౯౫

అర్థములు. జ్వలనపరీత గేహములు=అగ్నిచేత చుట్టుకొనఁబడినయిండ్లు, వార్షికవేళల = వానల కాలమున, చంచలాలతా = మెఱపుఁ దీఁగలతో, కలిత= కూడిన, పయోద సంఘముల కైవడిన్=మేఘముల గుంపులవలె, శాలలు=ఇండ్లు, కులిశాహతిన్=వజ్రాయుధము దెబ్బచే, ఇలాధర శృంగములు=పర్వతశిఖరములు, తత్కలిత=దానివలనఁ గలిగిన, మహానినాదములు=గొప్పధ్వనులు, చెవుడ్పడన్ = చెవుడు వచ్చిన వారినిఁగా.

తాత్పర్యము

నలువైపుల మంటలు క్రమ్ముకొన్న యిండ్లు వానకాలమందు మెఱుపులతోఁగూడిన మేఘములవలె నుండఁగాఁ గాలి నేలఁబడు నిండ్లు వజ్రము దాఁకున నేలఁబడు పర్వతశిఖరములవలెఁ గానవచ్చెను. అవి పడు చప్పుడులు పౌరులను చెవిటివాండ్రఁ జేసెను.

కం. మిద్దెల మేడల మీఁదను, నిద్దుర గొను ముద్దరాండ్రను♦నెగయఁగ మంటల్
గ్రద్దన యూడిచి భూషలు, హద్దఱి పలవించి రపుడు ♦ హాహా యనుచున్.

అర్థములు. హద్దఱి = మేరలేక, విస్తారముగ, ముద్ద+ఆలు=ముద్దరాలు, ముగ్ధయైన స్త్రీ యని యర్థము. కర్మధారయమున రేఫాగమము, ఆలు శబ్దము స్త్రీ మాత్ర పరము.

తాత్పర్యము స్పష్టము.

కం. జ్వాలాపంక్తులతో హ, ర్మ్యాళి రహిన్ మీఱె దీపి♦తౌషధివనికా
జాలాంచిత మగు మిహికా, శైలశిఖర మనఁగ దూర♦జనదృష్టులకున్. ౧౭౯౬

అర్థములు. జ్వాలాపంక్తులతోన్=అగ్నిజ్వాలల వరుసలతో, హర్మ్యాళి=

మేడలవరుసలు, రశ్మిన్ మిాతె=కాంతిచేఁ బ్రకాశించెను, దీపిత=వెలుఁగుచున్న, ఓషధి=మూలికలుగల, వనరాజాల = అడవుల సమూహములతో, అంచితము = ఒప్పినది, హిమశైలశిఖరము=మంచుగొండ శృంగము, దూరజనదృష్టులకున్= దూరమున నుండి చూచువారి కన్నులకు.

తా త్ప ర్య ము

దూరమునుండి చూచువారికి మంటలతోడి మేడలు ఓషధులచేఁ బ్రకాశించు నడవులు గల హిమవత్పర్వత శిఖరమువలె నుండెను.

తే. జ్వాలికాపంక్తు లెగురంగ•సౌధశిఖర, తలములందు నిశావేళఁ•దత్పురంబు
నిండఁబూచిన మోదుగు•పిండువోలెఁ,దవ్వుచూడ్కికిఁదోఁచెఁద•త్సమయమునను

అర్థములు. జ్వాలికాపంక్తులు = మంటల వరుసలు, సౌధశిఖరములందు= మేడల పై భాగములందు.

తా త్ప ర్య ము

మేడలపై కొనలందు మంట లా రాత్రివేళ యెగురుట దూరమున నుండి చూచువారికి ఆ పురము నిండఁబూచిన మోదుగుచెట్ల సమూహమువలె నుండెను.

తే. కట్లు విడిచినఁ జరియించు•కరులతతులు, వారువంబులు నై•లంక పరఁగె నపుడు
విలయసమయసముద్భ్రాంత•వివిధనక్ర,యుక్తఘనరసనిధికిఁ బె•న్నుద్దియగుచు.

అర్థములు. కట్లు=కట్టియుండిన త్రాళ్ళు, గొలుసులు; ఐ=కలిగి, విలయ సమయ = ప్రలయకాలమందు, సముద్భ్రాంత=అల్లకల్లోలపడిన, వివిధ = అనేక విధములయిన, నక్రయుక్త=మొసళ్ళతోఁగూడిన, ఘనరసనిధికి=జలనిధికి, సముద్రమునకు, పెన్నుద్ది=సమానము.

తా త్ప ర్య ము

కట్టిన పగ్గములు గొలుసులు విడుచుటచేత నేనుఁగులు గుఱ్ఱములు తిరుగుచుండు లంక ప్రలయకాలమందు నల్లకల్లోలమై నానావిధములైన మొసళ్ళుగోనగు జలచరములు గల సముద్రమువలె నుండెను.

తే. బెదరిపరుగెత్తుగుఱ్ఱంబు•విధముఁగాంచి,తొలఁగిపోయెనో కొక్కొ-చో•దొడ్డగజము
భీతిఁ బఱచెడి యేనుఁగు•రీతిఁగాంచి,యొండుగడ సైంధవంబు దా•నోదిగిచనియె.

తా త్ప ర్య ము స్పష్టము.

తే.అసురనగరంబుఁగాలు•యించు•హవ్యవాహు,మించుకాంతులతో నీరు•మిశ్రమగుచు
నంబునిధి యప్డు చూపట్టె•నద్భుతముగ,లోహితోదంబునాఁగ స•మూహ సేయ.

తా త్ప ర్య ము

రాక్షసనగరమును గాల్చుచున్న యగ్నికాంతులు సముద్రజలమునందుఁ బ్రతిఫలింపఁగా నప్పుడు సముద్రము రక్తసముద్రమువలె నూహింపఁదగి యుండెను.

తే. చెట్లు ద్రిమ్మరు లెల్లెడఁ•జిచ్చునిడఁగ, నొప్పెఁదత్పత్తనంబుము•హార్తమునను
నర్వలోకాంతకరమైన•సమయమునను,మండుచుండెడుధాత్రికి•మాఱ్ఱియగుచు.

అర్థములు. సర్వలోకాంతకరము = సర్వప్రపంచమును నాశముచేయు, మాద్రి=మాదిరి, సమానము.

తాత్పర్యము స్పష్టము.

కం. ధూమము కన్నులఁ దట్టఁగ, నేమియుఁ దోఁపకయు మేననెగయఁగ మంటల్
భీమముగఁ గూఁక లిడిరెడి, భామలరావము లెసంగెఁబదియోజనముల్.

అర్థములు. మేన=దేహములందు, భామలరావము=స్త్రీలయేడుపుధ్వని.

తాత్పర్యము స్పష్టము.

కం. తనువులుఁ గాలఁగ వెలువలికిని వచ్చెడివారితోడఁ గీశులు పెనఁగన్
దనుజుల క్రోఁతుల భీకర,నినదంబులు దివియు భువియునిండెం బెలుచన్.

తాత్పర్యము

ఇండ్లలో నుండఁగా మంటలచే దేహములు గాలఁగా దప్పించుకొని బయటికి వచ్చువారితో వానరులు యుద్ధము చేయఁగా రాక్షసులయు వానరులయు భయంకర ధ్వనులు భూమి యాకాశము నిండెను.

సీ. తోలఁగ వేదనమహాత్ములు రామలక్ష్మణుల్, సంభ్రాంతరహితులై చాపములను
గైకొని మౌర్వీటంకారంబుఁ గావింపఁ, గలగుండు కొనిరి రాక్షసులు భీతి
వేదమయం బైన విశ్రుత మౌర్విని, మీటెడి నాకాశజూటుభంగి
శ్రీరామవిభుఁడు సారించుచు గుణమును, నాశబ్ద మొక్కటియగ చరులయు
ఆ. రాక్షసులయు నులివు గ్రక్కున క్రమ్మింగెను, గీశయూథతతుల క్ష్వేళ లసుర
సంఘరవము రామచంద్రుని జ్యాలతానిస్స్వనంబు దెసలనిండె బెరసి.౧౮౦౧

అర్థములు. కలగుండుగొనిరి = కలఁకపడిరి, వేదమయంబు = వేదమున చెప్పఁబడిన విశ్రుతమౌర్విని= పసిద్ధికెక్కిన యల్లెత్రాటిని, 'కృత్తివాసాః పినాకీ' యని వేదప్రసిద్ధమైన మహత్త్వముగల యల్లెత్రాటిని, మీటెడి = లాగి విడుచుటచే ధ్వనింపఁజేసెడి, ఆకాశజూటుభంగి=శివునివలె, శివుఁడు వ్యోమకేశుఁడుగదా, సారించుచున్ = లాగివిడువఁగా, ఉలివు = ధ్వని, క్ష్వేళలు = సింహనాదములు, జ్యాలతానిస్స్వనంబు=అల్లెత్రాటిధ్వని, బెరసి=కలసి.

తాత్పర్యము

బాణములబాధ తోలఁగఁగానే మహాప్రభావము గల రామలక్ష్మణులు మనసునఁ గలఁకలేక విండ్లను దీసికొని యల్లెత్రాడు మీటి టంటమ్మను ధ్వని కలిగింపఁగా రాక్షసులు భయమున కలఁక చెందిరి వేదమునఁ జెప్పఁబడిన గుణము గల ప్రసిద్ధమైన యల్లెత్రాటిని శివుఁడు మీటినట్లు శ్రీరామచంద్రమూర్తి యల్లెత్రాడు సారింపఁగా నాశబ్ద మొక్కటియే రాక్షసుల వానరుల ధ్వనిని క్రమ్మింగివేసెను. దిక్కులందు వానరుల సింహనాదములు రాక్షసుల యఱపులు రామచంద్రమూర్తి యల్లెత్రాటి మ్రోఁత కలసి వ్యాపించెను.

ఉ. రామధనుర్విముక్తశర♦రాజి నిశాటపురాట్టగోపుర
స్తోమములం బడల్పడఁగఁ ♦ ద్రోచె నిజాస్థలి దాని కుల్కి ప్రో
ద్దామజవంబునన్ సురల♦దాయులు సంకులయుద్ధయత్నులై
ధీమస మూర వెల్వడిరి ♦ దిక్కులు పిక్కటిలన్ రవంబులన్. ౧౪౦౬

అర్థములు. రామ ధనుర్విముక్త శరరాజి=రాముని వింటిచే విడువఁబడిన బాణసమూహము, నిశాటపుర=రాక్షసనగరముయొక్క, అట్ట = బురుజులయు, గోపుర = గోపురములయు, స్తోమములను = సమూహములను, బడల్పడఁగన్= శిథిలమగునట్లు, ఇలాస్థలిన్=భూమియందు, ఉల్కి=భయపడి ఉద్దామ జవంబునన్= మిగుల వేగముతో, సురలదాయులు=దేవవిరోధులు = రాక్షసులు, సంకుల యుద్ధయత్నులై=ఒకఁడొకఁడేపోయి యుద్ధము చేయువాఁడు లేకుండుటచే, దొమ్మి యుద్ధముచేయ యత్నించినవారై, ధీమసము ఆరన్ = ధైర్య మతిశయింపఁగా, పిక్కటిలన్=క్రిక్కిఱియునట్లు నిండఁగా.

తాత్పర్యము

రామచంద్రమూర్తి వింటినుండి వెలువడిన బాణముల పరంపరలు లంక యందలి యెత్తైన బురుజులను గోపురములను శిథిలములై పడునట్లు నేలఁద్రోచెను. దానికి భయపడి రాక్షసులు మిగుల వేగముతో దొమ్మి యుద్ధముచేయ యత్నించి తమధ్వనులు దిక్కులందు నిండఁగా ధైర్యముతో వెల్వడిరి. రాజాజ్ఞలేక యున్నను రాక్షసులు తమ ప్రాణసంరక్షణార్థము తాముయుద్ధము చేయవలసినంత స్థితివచ్చెను.

తే. యుద్ధసన్నాహమున రాక్ష♦సోత్కరములు, సింహనాదంబులొక్కటఁ ♦ జెలఁగ ననికి
బయలువెడలఁగ నపుడు క్ష♦పాసమయము, రౌద్రమయ్యెను భాస్కర
♦ ప్రభవుఁడపుడు.

అర్థములు. యుద్ధ సన్నాహమునన్ = యుద్ధ ప్రయత్నముచే, రాక్షసోత్కరములు = రాక్షస సమూహములు, క్షపాసమయము=రాత్రివేళ, రౌద్రము= మిగుల భయంకరము, భాస్కర ప్రభవుండు=సుగ్రీవుఁడు

తాత్పర్యము స్పష్టము.

కం. ఆసన్నద్వారంబును, డాసి కపుల్ ముట్టడింపుఁ♦డా సోమరియై
యోసరిలునట్టి భూమిప, శాసనదూషకునిఁ బట్టి ♦ శాసింతుఁ జుఁడీ. ౧౪౦౮

అర్థములు. ఆసన్నద్వారంబును = సమీపమందుండు ద్వారము, వీరికి సమీపమున నుండునది యెదురుగ రావణుఁడుండు నుత్తర ద్వారమే. ఓసరిలు = తొలఁగిపోవునట్టి, భూప శాసన దూషకుని=రాజాజ్ఞ నతిక్రమించిన వానిని, శాసింతున్=దండింతును, కపుల్=కపులారా, రెండవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

సమీపమందున్న ద్వారంబును కపులారా! ముట్టడింపుఁడు. సోమరి తనమున నెవ్వఁడేని తొలఁగిపోయెనా యట్టి రాజాజ్ఞనుల్లంఘించిన వానిని దండింతును.

సీ. అనవుడు వానరుల్ హస్తతలంబుల, మండెడుకొఱవులు మెండుకొనఁగ
నికటంబునం దున్న నిశిచరనాథుని, ద్వారంబు నాఁకట్ట దశగళుండు
నాగ్రహోదగ్రన మ్ముగ్రరూక్షనేత్రుఁడై, రూపంబుఁ గైకొన్న రుద్రకోప
మనఁగ మండుచుఁ దన యఱుతనున్నసురారు, లాకులపాటొంద నట్టె లేచి
తే. కుంభకర్ణునిసుతుల నికుంభకుంభు, లనెడివారల మఱియు యూపాక్షశోణి
తాక్షకంపనులను బ్రజంఘాఖ్యుఁ బనిచెఁ, జటుల సేనాచయంబుతో జన్యమునకు.

అర్థములు. నికటంబునందున్న = సమీపమందున్న, నిశిచరనాథుని = రాక్షస రాజగు రావణుని, ఆఁకట్టన్ = అడ్డగింపఁగా, దశగళుండు=పదిమెడలు గల రావణుఁడు, ఆగ్రహోదగ్ర = కోపముచే నతిశయించిన (ఉత్ + అగ్ర = కొనపైకి వచ్చిన) సమ్యక్ + రూక్ష, నేత్రుఁడై=మిక్కిలి యెఱ్ఱని కన్నులు గల వాఁడై, అఱుతన్ = సమీపమందు, ఆకులపాటు = కలఁత, జన్యమునకున్ = యుద్ధమునకు.

## తాత్పర్యము

అని యాజ్ఞాపింపఁగా వానరులు చేతులందు మండుచున్న కొఱవులు దండిగాఁ దీసికొని సమీపమందున్న రావణుఁడు గాచు ద్వారంబును నడ్డగించిరి. దానికి రావణుఁడు మిగులఁ గోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి ఆకారము గొన్న రుద్రకోపము వలె మండుచుఁ దనకు సమీప మందున్న వారు కలఁత చెందఁగా చివాలునలేచి కుంభకర్ణుని కొడుకులను కుంభుఁడు నికుంభుఁ డనెడి వారిని మఱియు యూపాక్ష, శోణితాక్ష, కంపను లనియెడి వారిని ప్రజంఘుఁ డనియెడి వానిని సేనతోడ యుద్ధమునకుఁ బంపెను.

## —కుంభనికుంభులు యుద్ధమునకు వెడలుట—

చ. వెడలిరి కౌంభకర్ణు లతి వేగమునన్ సహసైన్యులై భయం
బడర నరాతిసేనకు జయధ్వను లొక్కటఁ బర్వ జాళువా
యొడుముల కాంతిపూరములు నుగ్రతరోజ్జ్వలసాధన ప్రభల్
కడుకొని చంద్రకాంతు లధికంబుగఁ బర్వె నభస్తలంబునన్. ౯౮౧౦

అర్థములు. కౌంభకర్ణులు = కుంభకర్ణునికొడుకులు, అపత్యార్థకతద్ధితము. జాళువా యొడుముల = బంగారు సొమ్ముల, చంద్రోదయ మిప్పుడు చెప్పఁబడెను. నేఁడు దశమి కావున నిరువది గడియలకు చంద్రోదయము, రెండు గంటలప్పుడు.

## తాత్పర్యము

కుంభకర్ణుని కొడుకులు సేనతోడ మిగుల వేగముగ శత్రుసేనకు భయపడక జయజయధ్వనులు వ్యాపింపఁగా వెడలిరి. అప్పుడు వారుధరించిన సొమ్ముల కాంతులు ఆయుధముల కాంతులు, చంద్రకాంతులు ఆకాశమునందు నధికముగ వ్యాపించెను

కం. వానరులు రగులఁ జేయు కృ,శానునిరోచులును రాక్షసప్లవగతతుల్
మేన ధరించిన భూషా,నానద్యుతు లాకసమున◆కొకరుచిఁ గూర్చెన్. ౧౨౧౧

అర్థములు. కృశానుని రోచులును=అగ్ని కాంతులును, మేనన్=దేహము నందు, భూషానానద్యుతులు = సొమ్ముల యధిక కాంతులు, ఒకరుచి=ఒకవిధమైన కాంతి.

తాత్పర్యము

వానరులు మండఁజేయు నగ్నిహోత్రుని కాంతులు రాక్షసులు దేహము నందు ధరించిన సొమ్ముల కాంతులు కలసి యాకాశమున కొక విధమైన కాంతి కలిగించెను.

కం. శీతకరకిరణకాంతి ప్ర,భూతాలంకారశోభి◆ పురగృహహుతభు
గ్హేతిద్యుతి యుభయధ్వజి,నీతతి వెలుగంగఁ జేసె◆ నెఱి నవ్వేళన్. ౧౨౧౩

అర్థములు. శీతకర = చంద్రునియొక్క, కిరణకాంతి=కిరణముల కాంతి, ప్రభూత = విస్తారమైన, అలంకారశోభ = భూషణముల కాంతిగల, పురగృహ= పట్టణముల యిండ్లయందలి, హుతభుక్ = అగ్నియొక్క, హేతిద్యుతి = జ్వాలల కాంతి, ఉభయధ్వజినీతతిన్=రెండు సేనాసమూహములను.

తాత్పర్యము

చంద్రకిరణముల కాంతియు మిగుల నలంకరింపఁబడిన లంకయందలి గృహములను గాల్చుచున్న యగ్నికాంతియు రెండుసేనల వారికి చక్కఁగా వెలుతురు కలుగఁజేసెను.

కం. ఇండులపై భాగంబుల, మండెడిమంటలు సముద్ర◆ మధ్యములోనన్
నిండారఁగఁ జలమూర్ముల, కాండంబులు వింతకాంతి◆గైకొని వెలిఁగెన్.

తాత్పర్యము

ఇండ్ల పై భాగంబుల మండెడి మంటలు సముద్రమధ్యమున ప్రతిఫలింపఁగా నా నీటి యులలు క్రొత్తకాంతి కలవై ప్రకాశించెను.

సీ. అశ్వమాతంగశ◆తాంగసంయుతమును, భటనికరంబసం◆బాధితంబు
ప్రజ్వలత్తోమర◆ప్రాసకార్ముకగదా, శూలఖడ్గాది సం◆శోభితంబు
జ్వలితవర్మము హేమ◆జాలాంచితభుజంబు, కింకిణీశతరవ◆సంకులంబు
బాణసంసక్త చా◆పంబు వ్యాఘూర్ణిత, బంధురశస్త్రంబు◆గంధమాల్య
తే. మధుసముత్సేక మోదిత◆మారుతంబు, జలధరరవంబు శూరసం◆చయగతంబు
నగుచునచ్చెడి యసురసై◆న్యంబుఁ గాంచి, యార్భటులనించి శాఖామృ◆గాళిసేన.

అర్థములు. అశ్వ = గుఱ్ఱములతోను, మాతంగ = ఏనుఁగులతోను శతాంగ = రథములతోను, సంయుతంబును = కూడినది, భటనికరంబ = భట సమూహముతో, సంబాధితంబు=నిండినది, ప్రజ్వలత్=ప్రకాశించుచున్న, తోమర= చిల్లకోలలు, ప్రాస = ఈఁటెలు, కార్ముక = విండ్లు, వీనిచే సంశోభితంబు =

ప్రకాశించునది, జ్వలితవర్మము = వెలుఁగుచున్న కవచముగలది, హేమజాల = బంగారుసొమ్ములచే, అంచిత = ప్రకాశించుచున్న, భుజంబు = భుజములు గలది, కింకిణీశతరవ సంకులంబు=పెక్కు మువ్వలచే నిండినది, బాణసంసక్త చాపంబు = బాణముతోఁగూడిన విల్లుగలది, వ్యాఘూర్ణిత = క్రిందుమీఁదయిన, బంధుర = అనేకములైన, శస్త్రంబు = ఆయుధము గలది, గంధమాల్య = గంధము చేతను పూలదండలచేతను, మధు=సారాయముచేతను, సముత్సేక=మిక్కిలి, మోదిత = వాసన గలదిగాఁ జేయఁబడిన, మారుతంబు=గాలిగలది, జలధరరవము = మేఘ ధ్వని గలది, శూరసంచయ గతంబు = శూరుల మొత్తమును పొంది యుండునది, ఆర్భటులు = పెద్ద ధ్వనులు.

## తాత్పర్యము

గుఱ్ఱములతోను ఏనుఁగులతోను రథములతోను గూడినదియు, భటసమూహములతో నిండినదియు తళతళలాడుచున్న చిల్లకోలలు ఈఁటెలు విండ్లు గదలు శూలములు కత్తులు మొదలగు వానిచే ప్రకాశించునదియు మండుచున్నట్లుండు కవచములు గలదియు బంగారు సొమ్ముల సమూహముచే నొప్పు భుజములు గలదియు, పెక్కులగు చిన్న గజ్జెలధ్వని నిండినదియు బాణము సంధింపఁ బడిన విండ్లు గలదియు వ్యాఘూర్ణిత బంధుర శస్త్రంబులు = తాఱుమాఱయిన విశేష శస్త్రములు గలదియు గంధములయు పూలదండలయు సారాయము యొక్కయు నతిశయముచే వాసనగలదిగాఁ జేయఁబడిన గాలికలదియు మేఘధ్వని గలదియు శూరులు గుంపులుగాఁ గలదియు నయి వచ్చుచున్న రాక్షససేనను గాంచి వానర సేన సింహనాదములు చేసెను.

కం. మిడుతలు పావకకీలలఁ, బడు తెఱఁగునఁ దరులు గిరులు ♦ బలువడిఁ గొని పై
పడి పో రొనరించిన వా, రసిదంబుల నఱికి వైచి ♦ రగచరులతలల్. ౧౭౧౫

అర్థములు. పావకకీలలన్ = అగ్నిజ్వాలలయందు, తరులు = చెట్లు, అసిదంబులన్=కత్తులచే, అగచరుల=వానరుల.

## తాత్పర్యము

మిడుతలు నిప్పుమంటలలోఁబడు విధమున చెట్లు కొండలు తీసికొని వచ్చి పైపడి యుద్ధము చేయఁగా రాక్షసులు వానరుల తలలను కత్తులతో నఱికిరి.

ఉ. మాదము పేర్మి వేఁదుఱుల ♦ మాడ్కి వెసం బఱతెంచి పంసులన్
ఛేద మొనర్చి కర్ణములఁ ♦ జేకొలఁదిం బిడికిళ్ళ శీర్షముల్
ఛేదిలఁ గొట్టి పెన్ సిలల ♦ ప్రేటుల నంగము ముద్దఁ జేసి సొం
పేదఁగ శత్రుసైన్యముల ♦ నేడ్తెఱఁ జేసిరి కీశవల్లభుల్. ౧౭౧౬

అర్థములు. మాదము = మదము యొక్క, 'మాదో మదే' యని యమరము - పేర్మి = అతిశయముచే, వేఁదుఱుల మాడ్కిన్ = వెఱ్ఱివాండ్రవలె, ఏడ్తెఱన్=విజృంభణముచే, కీశవల్లభుల్=వానర నాయకులు.

తాత్పర్యము

అతిశయించిన మదముచే వెఱ్ఱివాండ్రవలె దేహములు తెలియక త్వరగాఁ బరువెత్తివచ్చి వానరులు రాక్షసులను దంతములచే చెవులుచీల్చి చేతికోలఁది పిడికిళ్ళచేతఁ దలలు పగులఁగొట్టి పెద్ద శిలల దెబ్బలచే దేహములు ముద్దచేసి శత్రుసేనలు సొంపు చెడునట్లు విజృంభించిరి.

కం. ఆయిరువాఁగున మిక్కిలి, చేయంగలవారు శత్రు♦సేనా భటులన్
జేయని యాస్పదుఁ గూల్చి ర, మేయపరాక్రములు నుదురు♦మిడుకులు పోరన్.

అర్థములు. మిక్కిలి చేయంగలవారు = విశేష సమర్థులు, ఇరువాఁగున = రెండుపక్షముల, ఉదురుమిడుకులు = గరిష్ఠులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కొట్టఁబోయెడువానిఁ♦గొట్టిపోయె నొకండు, త్రోయువానిని బడఁ♦ద్రోసె నొకఁడు
చంపఁ బూనెడువానిఁ ♦ జంపెవేరొకరుండు, కోఁతికెడువానిని♦గోఁతికె నొరుఁడు
తిట్టెడువానినిఁ ♦ దిట్టె వేఱొక్కండు, గ్రుద్దెడువానినిఁ ♦ గ్రుద్దె నొకఁడు
నీచేతిబలువును ♦ జూచెద రార నా, నిదిగో వచ్చితి నంచు ♦ నెదురు నొకఁడు
ఆ. బక్కవానిమీఁదఁ♦బౌరుషమూ నిలు, మిటులు ర మ్మటంచు ♦ నిట్లు లొకరి
నొకరు గదిరి పలికి ♦ యుద్ధభూమిని దను, భుజబలంబుకోలఁది ♦ బోరుచుండ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఒల్లియ జాఱ సాధనము ♦ లూడఁ దనుత్రము లుర్వి పాలుగా
నొళ్ళు నెఱుంగ కయ్యసుర ♦ యూథము లుద్యతశూలయష్టులన్
బెల్లుగ మోఁది కీశులను ♦ బెల్కుఱఁ జేయఁగ వారు నీరసం
బుల్లము నిండఁ బోరఁగ మ♦హోగ్రగతిన్ దుర మొప్పె నయ్యెడన్. ౧౮౧౯

అర్థములు. ఒల్లియ = వస్త్రము, తనుత్రములు = కవచములు, ఒళ్ళు = దేహములు, ఏ - ఒడలు, ఉద్యత = ఎత్తఁబడిన, శూలయష్టులన్ = శూలముల చేతను కట్టెలచేతను, పెల్కుఱన్ = కలవరపడునట్లు, ఈరసంబు = ఈర్ష్య, ఉల్లము = హృదయము, దురము = యుద్ధము.

తాత్పర్యము

వస్త్రము జారిపోవుచుండ ఆయుధములు పడిపోవుచుండ, కవచములు నేలపాలుగాఁగా దేహములు తెలియక రాక్షససేనలు శూలములు కట్టెలు ఎత్తి వానరులను గొట్టి వ్యాకులపడఁ జేయఁగా వారు నీర్ష్యచే నిండినవారై యుద్ధము చేయఁగా నా యుద్ధము మిగుల భయంకరమయ్యెను.

కం. పదువుర నేడ్వురఁ గపులను, విదళింపఁగ నసురవరులు ♦ వివిధాస్త్రములన్
బదునేడ్వురుగాఁ జంపిరి, వదలక వానరులు దైత్య ♦ వర్యుల నపుడే. ౧౯౨౦

తాత్పర్యము

రాక్షసులు పదుగురనొకసారి యేడ్వుర నొకసారిగా వానరులను జంపఁగా వానరులు పదునేడుగురు రాక్షసుల నొక్కసారిగఁ జంపిరి.

కం. విరితలలు జాఱుచేలలు, చిరిగిన టెక్కెములు మేలి♦జీరాలును నై
పరుగిడురక్కసులను దరుచరు లుద్ధతిఁ జుట్టుముట్టి♦చంపుచు నుండన్. ౧౨౨౧

అర్థములు. విరితలలు = వెంట్రుకలు విరియఁబోసికొనిన తలలు,జీరాలు= కవచములు.

తాత్పర్యము

తలలు విరియఁబోసికొని గుడ్డలు జాఱిపోవుచుండ టెక్కెములు కవచములు చినిఁగిపోఁగా బరువెత్తుచున్న రాక్షసులను వానరులు చుట్టుముట్టుకొని పోనీక చంపుచుండిరి.

— ♦ ౭౬-వ సర్గము. అంగదుఁడు కంపను వధించుట ♦—

ఉ. వీరజనక్షయంబుగఁ బ్ర♦వృత్తము నా తుములాహవంబునన్
ధీరవరేణ్యుఁ డంగదుఁడు ♦ తెంపరి యై సమరోత్సుకత్వ మే
పారఁగఁ గంపనుం దొడర ♦ నాతఁడు రా యిటు రమ్మటంచుఁ గ్రో
ధారుణితాక్షుఁడై యడిచె ♦ హస్తగతం బగు పెన్గదన్ వడిన్. ౧౨౨౨

అర్థములు. వీరజనక్షయంబుగన్=వీరులగువారికి వినాశకరముగ, ప్రవృత్తము=జరగునది, తుములాహవంబునన్=దొమ్మియుద్ధమునందు, తొడరన్=ఎదిరింపఁగా.

తాత్పర్యము

వీరులగువారు నశించునట్లు జరుగుచున్న యీ దొమ్మియుద్ధమునందు ధీరులందు శ్రేష్ఠుఁడైన యంగదుఁడు సాహసించి యుద్ధకాంక్ష యతిశయింపఁగా కంపనుఁ డనువాని నెదిరింపఁగా నతఁడు రారా యిటు రమ్మని క్రోధముచేఁ గన్నులెఱ్ఱచేసి చేతనున్న గదతోఁ గొట్టెను.

ఉ. అంగదుఁ డా గదం బెఱికి ♦ యాతని దానన కొట్టెఁ గొట్ట స
ర్వాంగములుం జలింప జడు♦నట్లయి తెప్పిఱి మూఱుతాఁచినన్
శృంగ మొకండు నయ్యసుర♦శీర్షమునం బడ నేయ దానితో
సంగరభూమిఁ ద్రెళ్ళె హత♦సత్త్వుఁడు ప్రాణము లెప్డొ పాయఁగన్. ౧౨౨౩

తాత్పర్యము

అంగదుఁ డా గదనే లాగుకొని దానిచేతనే వానిని గొట్టఁగా వాఁడు దేహమంతయు వణఁక యచేతనమునట్లయి తెప్పఱిల్లుకొని బరులు కొట్టెను. అంగదుఁడు పర్వతశిఖరము నొకదానిని వాని తలపైఁ బడవేయఁగా వాఁడు దానితో బలము పోయినవాఁడై ప్రాణము లెప్పుడో వెడలిపోఁగా యుద్ధభూమియందుఁ బడెను.

ఉ. గండఱి పీనుఁగై పడిన • కంపనుఁ గన్గొని వేగ శోణితా
క్షుండు శరంబులం గురియుచు • న్హరిమన్మని నొంప వాఁడు ను
ద్దండతఁ జాపసైంధవర • థంబుల నుగ్గొనరింప ఖేటముం
జండతరాసిఁ గొంచు రభ • సంబున మింటికి నుద్గమించినన్. ౧౭ ౩౮

అర్థములు. గండఱి = బలము చెడి, హరిమన్మని = ఇంద్రుని మనుమని, నుగ్గు = చూర్ణము, ఖేటము = డాలు, చండతరాసిన్ = తీక్ష్ణమైన కత్తి, రభసంబునన్ = వేగముగ, ఉద్గమించినన్ = ఎగురఁగా.

తాత్పర్యము

బలము చెడి పీనుఁగై పడిన కంపనుఁజూచి శోణితాక్షుఁడు బాణముల గురియించుచు నంగదుని నొప్పింపఁగా, ఉద్దండతన్ = బలాధిక్యముచే, చాపసైంధవరథంబులన్=విల్లు గుఱ్ఱములు రథములను చూర్ణము చేయఁగా డాలు తరవారి తీసికొని వాఁడు ఆకాశమున కెగసెను.

తే. తోడనే వాలిసూనుఁడు • కూడ నెగిరి, కరమునందున్న యసిబలా • త్కారముగను
గుంజుకొని యంసఫలకంబు • నంజరాన, నఱికె జందెము వట్టు మై • పఱియ వాయ.

అర్థములు. అంసఫలకంబు=బల్లవలె విశాలమైన భుజమును. మై-పఱియ వాయన్ =చీలునట్లుగా.

తాత్పర్యము

వానితోడ నంగదుఁడు నెగిరి వాని చేతి కత్తిని బలవంతముగా గుంజుకొని విశాలమైన భుజమున (కవచము మీఁదనే) దేహమున జందెము వేసికొన్న విధముగ కవచమును నఱికెను.

సీ. ఆ ఖడ్గమును గొని • యరుల నొంచఁగ శోణి, తాక్షుండు నాయసం • బైన గదను
గైకొని తాఁకెనొ • క్కట ప్రజంఘుండు యూ, పాక్షుండు గలసిరా • యగచరేంద్రు,
డిరుకెంక రక్కసు • లెసఁగ విశాఖ నడిమి పూర్ణచంద్రుడు చం • దము వహించె
నాతని రక్షింప • నరిగి మైందద్వివి, దులు సరభసముగఁ • దోడుపడిన

ఆ. ముగురు రాక్షసులకు • ముగురు వానరులకుఁ, బోరు ఘోర మయ్యె • భూజచరులు
వైచు వృక్షములను • వారక ఖండించె, నసిఁ బ్రజంఘుఁ డనెడి • యసురవరుఁడు.

అర్థములు. ఆయసము = ఇనుముతోఁ జేయఁబడినది, సరభసముగన్= వేగముగ.

తాత్పర్యము

అంగదుఁ డా ఖడ్గమును గొని వైరుల నొప్పింపఁగా శోణితాక్షుండు ఇనుప గదను గైకొని తాఁకెను. ప్రజంఘుఁడు యూపాక్షుఁడనువా రా శోణితాక్షుఁ గలిసికొనిరి. అప్పు డంగదుఁడు తనకు రెండుప్రక్కల రాక్షసు లుండఁగా విశాఖ నడిమి పూర్ణ చంద్రునివలె నుండెను. అతని రక్షణమునకై మైంద ద్వివిదులు త్వరగాఁ

బోయిరి. అప్పుడు ముగ్గురు రాక్షసులకు ముగ్గురు వానరులకు యుద్ధము ఘోరముగ జరిగెను. వానరులు చెట్లు వేయఁగా కత్తిచే వానిని ప్రజంఘుఁడను రాక్షసుఁడు నఱికెను.

కం. శరముల యూపాక్షుఁడు త, త్తరువుల ఖండించె ద్వివిదు♦తరువుల ధరణిం
దొరఁగించె శోణితాక్షుఁడు గురుగదచే నంత మిగులఁ ♦ గుపితుం డగుచున్.

అర్థములు. తత్తరువులన్ = ఆ చెట్లను, కుపితుండు=కోపించినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. పరమర్మనికృంతనమును, గరము భయంకరము నైన♦ఖడ్గో త్తంసం
బిరుగేలఁ గొని ప్రజంఘుఁడు పరభసముగఁ గవిసె వాలి♦సంభవుమీఁదన్.

అర్థములు. పరమర్మ నికృంతమును=శత్రువుల నాయువుపట్టుల ఛేదించు నది, ఖడ్గో త్తంసంబు = శ్రేష్ఠమైన ఖడ్గమును.

తాత్పర్యము

పరుల యాయువు పట్టులను ఛేదించు మిగుల భయంకరమైన ఖడ్గమును రెండు చేతులఁ దీసికొని ప్రజంఘుఁడు శీఘ్రముగ వాలికొడుకు నెదిరించెను.

## —♦ అంగదుఁడు ప్రజంఘుఁ జంపుట ♦—

సీ. అభ్యాసగతుఁడైన♦యసురఁ డారాసుతుం, డశ్వకర్ణద్రుమా♦హతునిఁ జేయ
నాదెబ్బవడికిఁ జే♦యసిదంబు జాఱినఁ, బిడికిట నొసటను ♦ బొడిచెఁ గపిని
నంగదుండును మూర్త ♦ యూవంత కంపించి, తేఱి కరామారిఁ♦దెగఁగ వ్రేసె
నా ప్రజంఘునితల ♦ హతుఁడైన పినతండ్రిఁ, గనుసీరు గాఱఁగఁ♦గాంచి బాణ
తే. హీనుఁడొటను దరవారి ♦ నెత్తికొంచుఁ
బఱచె యూపాక్షుఁ డంగదు ♦ పైకె నింత
లోన ద్వివిదుండు దొడరి యు♦వ్వాని ఱొమ్ము
పగుల వెస గ్రుద్ది బంధించె ♦ బాహుయుగళి ౧౨ ౨౯

అర్థములు. అభ్యాసగతుఁడు=సమీపమందున్నవాఁడు, అశ్వకర్ణద్రుమాహతుని = ఇనుమద్దిమ్రానిచేఁ గొట్టఁబడిన వానిని, చేయుసిదంబు = చేతికత్తి, కరామారిన్=కత్తిచే, తరవారిన్=కత్తిని, తొడరి=ఎదిరించి.

తాత్పర్యము

సమీపమందున్న రాక్షసుని నంగదుఁ డినుమద్దిచెట్టుచేఁ గొట్టఁగా నాదెబ్బకు జేతికత్తి జాఱిపోవ నా రాక్షసుఁ డంగదుని ముష్టిచే నొసటఁ బొడిచెను. అంగదుఁ డాదెబ్బకుఁ గొంచెము వణఁకి తెప్పఱిల్లి కత్తితో నా ప్రజంఘుని తలనఱికెను. చచ్చిన పిన్నతండ్రిని కన్నీరుగార్చుచుఁ జూచి బాణములులేనివాఁ డొటచేఁ గత్తితీసికొని యూపాక్షుఁ డంగదుని మీఁదికి బరువెత్తఁగా నింతలో ద్వివిదుండువచ్చి యెదిరించి యా యూపాక్షుని ఱొమ్ము పగులగ్రుద్ది రెండుచేతుల గట్టిగ బంధించెను.

తే. చిక్కువడి యున్న సోదరుఁ • జేర నరిగి, శోణితాక్షుండు ద్వివిదుండు • సొక్కఁ గదను
నురముపై మోఁద నాతండు • త్వరగ లేచి, యసురవీరుని చేగద • నపహరించె.

తాత్పర్యము

తన సోదరుఁడగు యూపాక్షుఁడు చిక్కువడి యుండుటచూచి శోణితాక్షుఁడు గదచే ద్వివిదుఁడు సొక్కునట్లు రొమ్ముపైఁ గ్రుద్దఁగా నతఁడు త్వరగాలేచి రాక్షసుని చేతిగద నపహరించెను.

కం. ఋక్షబలుఁడు మైందుఁడు యూ, పాక్షునురముఁ గేల నడిచె • నటు క్రోఁతులకున్
రాక్షసునకుఁ బోరయ్యెను, జక్షూరమ్యంబు హృదయ • సంభ్రమ కరమై.

అర్థములు. చక్షూరమ్యంబు=చూచువారి కన్నులకు మనోహరమై.

తాత్పర్యము స్పష్టము.

చ. ద్వివిదుఁడు శోణితాక్షుఁ బృథి • విం బడఁ ద్రోచి యురంబు ద్రొక్కి రో
షవివశుఁడై నఖాళి సుర • శాత్రవు నాస్యముఁ బీఁకి కుత్తుకం
దవులఁగ నొత్తి నుల్మి నిధ • నం బొనగూరిచె నంతలోనఁ గీ
శవిభుఁడు మైందుఁడున్ గెడపె • సత్వరుఁ డౌచును యూపనేత్రునిన్. ౧౫౩౨

అర్థములు. రోషవివశుఁడై=కోపముచే దేహము తెలియనివాఁడై, నఖాళిన్ = గోళ్ళవరుసలచే, ఆస్యము = ముఖము, నుల్మి = నలిపి, నిధనంబు=మృతి, కెడపెన్ = చంపెను.

తాత్పర్యము

ద్వివిదుఁడు శోణితాక్షుని నేలఁ బడఁద్రోచి రొమ్ముపై గాలూఁది త్రొక్కి కోపముచేఁ బరవశుఁడై గోళ్ళచే రాక్షసుని ముఖము పీఁకి గొంతు గట్టిగా బిగఁబట్టి నలిపి చంపెను. ఇంతలో మైందుఁడు యూపాక్షునిఁ జంపెను.

## — కుంభుఁడు వానరవీరుల నొప్పించుట —

సీ. హతవీర మైనసై • న్యంబు వెల్వలఁ బోయి, కుంభుఁ జేరఁగఁ బోవఁ • గ్రోధమూర్తి
యయి యాతఁ డుగ్రత • జ్యాలతానాదంబు, దిక్కులఁ బర్వఁగ • నుక్కుమిగిలి
హ్రాదినీసంయుతై • రావతాఖ్యనగారి, చాపంబుఁ దలపింపఁ • జాపమూని
యాశీవిషోపమా • నాశుగంబులఁ గపి, ప్రాణాశుగంబుల • నాహరింప
తే. ద్వివిదు నాశ్రవణాకృష్ట • విశిఖములను, వేయ నాతండు తద్ధతి • విహ్వలించి
కొండయనఁగూలె నిట్లుత • మ్ముండుపడినఁ, బెద్దశిలఁ గుంభు మైందుండు • విసరివైచె.

అర్థములు. జ్యాలతానాదంబు = తీఁగవంటి యల్లెత్రాటిధ్వని, హ్రాదినీసంయుత=మెఱుపుతోఁగూడిన, ఐరావతాఖ్య=ఐరావత మను పేరుగల ఐరావతోభ్రమాతంగేలికుచేనాగరంగకే, ఋజుదీర్ఘేంద్రచాపేతు"నానా.ర. ఋజువుదీర్ఘము నైన యింద్రధనుస్సునకు నైరావతమని పేరు, నగారిచాపంబు=ఇంద్రధనుస్సును, తలఁపింపన్=తలంపునకుఁ దేఁగా, ఆశీవిషోపమాన=పాములవంటి, ఆశుగంబులన్=

బాణములచే, ప్రాణాశుగంబులన్ = ప్రాణవాయువులను, సర్పములకు వాయు వాహారము, ఆహరింపన్ = హరించుటకై, ఆశ్రవణాకృష్ట విశిఖములను=చెవికొన వఱకు లాగఁబడిన బాణములను, తద్ధతిన్=ఆ దెబ్బచే, విహ్వాలించి=విలవిలఁబోయి.

తాత్పర్యము

వీరులు చావఁగా మిగిలిన సైన్యము వెలవెలఁబోయి కుంభునొద్దకుఁ బోఁగా వాఁడు కోపించి భయంకరముగా నల్లెత్రాటిని మీటుచు నా ధ్వని దిక్కులవ్యాపింపఁజేసి మెఱుపులతోడి యైరావతమును నింద్రధనుస్సువంటి చాపము దీసికొని పాములవంటి బాణములను కపిప్రాణవాయువుల నపహరించుటకై యాకర్ణాంతము లాగి విడువఁగా వాని దెబ్బకు ద్వివిదుఁడు వెలవెలఁబోయి కొండవలెఁ బడెను. తమ్ముఁ డిట్లు పడఁగా మైందుఁడు కుంభునిపై పెద్ద బండనొకదాని విసరివైచెను.

ఉ. పైఁ బడవచ్చు తచ్ఛిలను • బాణములేనిటఁ దున్ని దందశూ
కోపమ బాణమేయఁ బడె • నుర్విని మైందుఁడు సైఁపలేక తా
నేపఱి, మేనమామ లిటు • పృథ్విఁ బడం గని యంగదుండు సా
టోపుఁడు కుంభుఁ దాఁకెను బ•టుప్రతిహీనబలైకధుర్యుఁడై. ౧౪౩౪

అర్థములు. దందశూక+ఉపమ=పాముతో సమానమైన, ఏపఱి=బలము చెడి, సాటోపుఁడు = వేగిరపాటుతోఁ గూడినవాఁడు, పటు = సామర్థ్యముతోఁ గూడిన, ప్రతిహీన=ఎదురులేని, బలైకధుర్యుఁడై = విశేష బలమే ప్రధానముగాఁ గలవాఁడై.

తాత్పర్యము

పైఁబడ వచ్చుచున్న యా రాతిని నైదు బాణములచే ఖండించి పామువంటి బాణమేయఁగా మైందుఁడు బాణవేదన సహింపలేక నేలఁ బడెను. మేనమామ లిరువు రిటు నేలఁబడుట చూచి యంగదుఁడు వేగిరపాటు గలవాఁడై యసమాన బలాతిశయమున కుంభుని నెదిరించెను.

—• అంగదుఁడు కుంభుచే నొచ్చి పడుట •—

ఉ. వచ్చెడు వాలిపుత్త్రు శర•పంచకమున్ మఱిమూఁటి జెక్కుటిన్
జిచ్చులఁబోనివాని వెసఁ • జిమ్మె నమోఘములైన ములుకులన్
హెచ్చిన తెంపునం గపియు • నేమియు స్రుక్కక యొచ్చి నిల్చి పై
పెచ్చుగ తాలవాన యొక•వించెను గుంభునిపై రయోద్ధతిన్. ౧౪౩౫

అర్థములు. చిచ్చులు = నిప్పులతో, పోనివాని = సమానమైనవాని అమోఘములు = వ్యర్థము కానివి.

తాత్పర్యము

తనమీఁదికి వచ్చుచున్న యంగదునిమీఁదఁ గుంభుండు నిప్పులవంటివానిని, వ్యర్థముపోనివాని నైదింటిని, మఱి మూఁడింటిని అనేకములను బాణములను వేసెను

అతి సాహసముచే నంగదుఁడు వానికిఁ గొంచెమైనను బ్రక్కకు దొర్చి నిల్చి యంతతో నుండక కుంభునిమీఁద ఆలవాన నతివేగముగఁ గురియించెను.

ఉ. అతఁడు దానినెల్లఁ దుము • రై పడఁ జేసియు మీఁదవచ్చు తా
రాతనయున్ భ్రువుల్ దగుల • రాజితపుంఖశరాళి నుల్కసం
ఘాతముచేఁ గరింబలె ది • గాల్పడఁ గొట్టిన నెత్రు కాఱఁగా
జేతను మూసి నేత్రములు • చేయలఁతిం గల భూరివృక్షమున్. ॥౮౯

అర్థములు. తుమురు = చూర్ణము, భ్రువుల్ = కనుబొమ్మలు, రాజిత పుంఖశరాళిన్=బంగారు పింజలుగల బాణముల గుంపుచే, ఉల్కసంఘాతంబు = కొఱవుల సమూహ మని సాధ్యసమానము చేసియైనఁ జెప్పవచ్చును. (౨) ఉల్క యొక్క గట్టిదెబ్బయనియైనఁ జెప్పవచ్చును. దిగాల్పడన్=దిగులుపడునట్లు, నెత్రు= నెత్తురు, సంయుక్తమగునపుడు ద్విత్వమునకు లోపము, చేయలఁతిన్=సమీపమందు.

తాత్పర్యము

కుంభుఁడా ఆలవానను జూర్ణమై పడఁగొట్టి తన మీఁదికి వచ్చుచున్న యంగదుని కనుబొమ్మలు తగులునట్లు బంగారు పింజలుగల బాణములచే కొఱవులచే నేనుఁగు దిగుల్పడఁగొట్టునట్లు కొట్టఁగా నెత్తురు కాఱఁగా గన్నులు చేత మూసికొని సమీపమందుఁగల పెద్దచెట్టును.

కం. రెండవకరమున యామొ,క్కండు నెసం బట్టి బోరఁ • గదలిచి మొదలున్
గండున గజ మనఁ బెకలిచి, చండోద్ధతి వైచె నసుర•సత్తముమీఁదన్.

అర్థములు. మొక్కండు=బలిష్ఠుఁడు, బోరన్=ఱొమ్ముచే.

తాత్పర్యము

ఒకచేతఁ గన్నులు మూసికొని రెండవచేత చెట్టును ఱొమ్మున కానించుకొని పీకిఁ మిగుల వేగముతో రాక్షసోత్తముమీఁద వైచెను.

ఉ. మందరసన్నిభంబు శత • మన్యు ధను, ప్రతిమంబు వృక్షమున్
జిందఱ చేసి యుద్ధనుజ • శేఖరుఁ డంగవిభేదనంబు ల
స్యందజవంబులైన దృఢ శాతశరంబుల మేను వ్రచ్చినన్
గొందలపాటుతోడ ధరఁ • గూలె సహింపఁగ రానివేదనన్. ॥౯౦

అర్థములు. మదరసన్నిభంబున్ = మందర పర్వతముతో సమానమైనదియు, శతమన్యు ధనుః ప్రతిమంబు = ఇంద్రుని వింటితో సమానమైనదియు, చింతఱ = తునియలుగా, అంగవిభేదనంబులు = అవయవముల చీల్పునట్టివి, అస్యందజవంబులు = తక్కువగాని వేగము గలవి, దృఢ = అనేకములైన, శాత శరంబులన్=వాఁడి బాణములచే, మేను=దేహము, వ్రచ్చినన్=చీల్పగా, కొందల పాటుతోడ = క్షోభముతో.

### తాత్పర్యము

మందరపర్వతముతోను ఇంద్రధనుస్సుతోను సమానమైన యా చెట్టును తునుకలుగాఁ జేసి యా రాక్షసుఁడు అవయవములఁ జీల్చునట్టివియు,మిగుల వేగము గలవియునగు పెక్కులు గట్టి వాఁడిబాణములచే దేహముఁ జీల్పఁగా కలఁతచెంది యంగదుఁడు బాధసహింపలేక నేలఁబడెను.

తే. అఱచి వేదన మూర్ఛపా•లై సముద్ర, తీరమునఁ గూలియున్న యా•ధీరవరుని
పాటు కొండలుకీశులు • పలుక రామ, చంద్రుఁ డనిచెను దోడ్పడ•జాంబవంతు

తాత్పర్యము స్పష్టము.

కం. తక్కిన వీరులఁ గొందఱు, నెక్కుడు కోపమున వారు • వృక్షశిలాదుల్
మిక్కిలిగఁ గొనుచుఁ గుంభుని గ్రక్కునఁ దాఁకిరి కుమార•రక్షణపరులై.

అర్థములు. కుమారరక్షణపరులై = బాలుఁడగు నంగదుని రక్షించు నాసక్తితో.

తాత్పర్యము స్పష్టము.

సీ. వేగదర్శి సుషేణ•విధిసుతుల్ క్రుద్ధులై, తనమీఁద వచ్చు చం•డంబుఁ గాంచి
స్రోతస్సు వేగంబు•ద్రుమ నగాదులచేత, నరికట్టుగతి మార్గ•ణౌఘములను
వారి నాఁకట్టెఁ ద • ద్బాణ పరంపరఁ గంధి వేలనుబోలెఁ • గడవలేక
చిక్కువడం గని • యెక్కుడుకోపాన, భాస్కరపుత్రుండు • భ్రాతృతనయు
ఆ. వెనుక వేసికొనుచు•వనగజంబును వెలి, బొబ్బ మెకము తఱుము•పోల్కిఁ దఱిమి,
యశ్వకర్ణ ధవ ము•ఖావనీరుహముల, చాలు గురియఁ జేసెఁ•జదలు నిండ.

అర్థములు. విధిసుతుఁడు = జాంబవంతుఁడు, క్రుద్ధులై=కోపించినవారై, స్రోతస్సు = ప్రవాహము యొక్క, ద్రుమనగాదులచేత = చెట్లచేఁ గొండలచే, అరికట్టు=అడ్డగించు, గతిన్=విధముగ, మార్గణౌఘములను = బాణసమూహములచే, ఆఁకట్టెన్=అడ్డగించెను, కంధిన్=సముద్రమును, వేలనుబోలెన్ = చెలియలికట్టవలె, కడవలేక=మీఱిపోలేక, భ్రాతృతనయు వెనుక వేసికొనుచు-ఇట్లు చెప్పుటచే నంగదుఁడు మరల యుద్ధమునకు సిద్ధపడెఁగాని వానిని వారించి సుగ్రీవుఁడు ముందు దుమికెనని భావము. వెలిబొబ్బ మెకము=తెల్లని సింహము, వనగజంబున్= అడవి యేనుఁగు, ఊరి యేనుఁగులకన్న నడవియేనుఁగులు బలిష్ఠములు. 'గిరిచర ఇవనాగః ప్రాణసారం బిభర్తి' అని కాళిదాసుఁడు అశ్వకర్ణము=ఇనుమద్ది, ధవ= చంద్ర, ముఖ=మొదలైన,అవనీరుహములచాలు=చెట్లవరుసలు,చదలు=ఆకాశము.

### తాత్పర్యము

వేగదర్శి, సుషేణుఁడు, జాంబవంతుఁడు కోపించినవారై తన మీఁద వచ్చు విధముఁ జూచి ప్రవాహవేగమును ఆలచేఁ జెట్లచే నడ్డగించునట్లు బాణపరంపరచే వారి నడ్డగించెను. సముద్రము చెలియలికట్టను దాటిపోవలేనట్లు వారా బాణపరంప

రను మీఱిపోలేక చిక్కువడిరి. అదిచూచి మిగులఁ గోపించి సుగ్రీవుఁడు అంగదుని వెనుక వేసికొని యడవి గజంబును సింహము తఱుమునట్లు కుంభుని దఱిమి ఇనుమద్దిచంద్ర మొదలగు చెట్లను వారిమీఁద వర్షమువలెఁ గురియించెను.

## —• సుగ్రీవుఁడు కుంభు నుపాలంభించుట •—

ఉ. ఈసునఁ గౌంభకర్ణియు న•నేకశరంబుల వానినెల్లఁ బోఁ
  ద్రోసిన నవ్వి శంకుచిత•రూక్షశతఘ్నులుపోలె నొప్పఁగా
  భాసుర తేజుఁ డర్కజుఁడు • పైపయి రాలెడి బాణజాలము
  న్వీసరపోని ధీరత గ•ణింపక పైపడి దూకి చాపమున్. ౧౨౮౨

అర్థములు. ఈసునన్=కోపముతో, కౌంభకర్ణి=కుంభకర్ణుని కుమారుఁడు, కుంభుఁడు, శంకుచితరూక్షశతఘ్నులఁ బోలెన్=మేకులతోఁ గూడిన కఠినములైన శతఘ్నులవలె, వీసరపోని=వెలితిపడని, ధీరతన్=ధైర్యముతో.

### తా త్ప ర్య ము

కోపముచే గుంభుఁడు పెక్కుబాణంబుల వానినెల్ల బోవఁ గొట్టఁగా నవి మేకులతోఁగూడిన కఠినములైన శతఘ్నులవలె నొప్పెను. సుగ్రీవుఁడును మీఁద మీఁద విరామములేకవచ్చి తనపైఁబడుచున్న బాణసమూహమును నిండుధైర్యముతో లక్ష్యపెట్టక వానిమీఁద దూఁకి వాని వింటిని.

చ. విఱిచి సుదుష్కరంపుఁగృతి•చే ఘటియించియుఁ గిక్కు దంతముల్
  విఱిగిన మత్తకుంజరము•లీల వహించిన కుంభు నిట్లనున్
  వెఱఁ గొనరించె నీ విశిఖ•వేగము కుంభుఁడ! నీదుశౌర్య మ
  ట్లుఱవగు సన్నతిన్ బలిమి•నుద్దివి నీ పెదతండ్రి కెంతయున్. ౧౨౮౩

అర్థములు. సుదుష్కరంపుఁగృతి = మిక్కిలి కష్టసాధ్యమైన కార్యము వెఱఁగు=ఆశ్చర్యము, ఉఱవగు, సన్నతిన్ = (౧) అధికమగు వినయము చేతను, (౨) రాక్షసులం దధిక ప్రేమచేతను, కంపనాదుల వధించిన యంగదాదుల నిరసించి రాక్షసులందుఁ దనకుఁగల ప్రేమను గనఁబఱిచెఁగదా, ఉద్దివి=సమానుఁడవు, పెదతండ్రికిన్=రావణునకు.

### తా త్ప ర్య ము

విఱిచి మిగులఁ గష్టసాధ్యమైన పనిచేసియు, గోపముచే దంతములు విఱిఁగిన యేనుఁగువలె నున్న కుంభునితో నిట్లనియె. కుంభుఁడా! నీ బాణవేగము ఆశ్చర్యకరము, నీ శౌర్యమో రాక్షసులం దధికప్రేమ గలది. బలమునందు నీ పెద్ద తండ్రికి సముఁడవు.

సుగ్రీవుని వాక్యములు గౌరవరూపకహేళనము లని ౧౨౮౭ వ పద్యంబున నుండుటచే దీనికి రెండవ యర్థము గ్రహింపవలసి యున్నది. వెఱఁగొనరించె

నీ విశిఖవేగము—మరియొకని నెవనినైన నెట్టివానినైనను సమీపమునకు రానిచ్చ నట్లు బాణములు వేయువాఁడవు నీవేమి విలుకాఁడవు.

ఉఱవగు సన్నతిన్ = సాధువుల నమస్కారముచే గొప్పది. నీ శౌర్యము సాధువులు మెచ్చఁదగినదిగాని శూరులు మెచ్చఁ దగినదిగాదు.

బలిమి నీ పెద్దతండ్రి కుద్దివి, యుద్ధమున విల్లు తానై పాఱవైచి ప్రాణ భయమునఁ దల విరియఁబోసికొని శత్రువులకు వెన్నిచ్చి పరుగెత్తిన నీ పెద్ద తండ్రికి సముఁడవు.

సీ. బలపరఃప్రహ్లాద ♦ బలినికషాత్మజ, వైశ్రవణుల కెత్తు♦వత్తు వీవు
నీతండ్రిసముఁడవు ♦ నీ వొక్కఁడవె సుమ్మ, నైజదేహబలంబు♦తేజమునను
నిను మీఱ నేరరు ♦ నిర్జరులైనను, విజితేంద్రియుని నాధి♦బృంద మనఁగఁ
బ్రాజ్ఞుఁడా! నీయెల్ల♦బలము నేఁ జూడఁగఁ, గోరెదఁ జూపుమీ ♦ కొంకు లేక

ఆ. నీదు పెద్దతండ్రి ♦ నిరుపమవరశక్తి, సహజశక్తి నీదు♦జనకుఁ డమర
చయము నేఁచి రీవు♦చాపంబునను శక్ర, వైరి బలిమిఁ బంక్తి♦వదనుమాద్రి.

చ. బలమునఁ బేర్కొనం దగిన♦వాఁడవు నీ వొకరుండు రాక్షసా
వళులను నాదు నీ పెనకు♦వన్ హరిశంబరజన్యభంగి నీ
కలిగినభూతసంతతులు ♦ కాంచెడిఁ గాక, దృఢాస్త్రచాపకౌ
శలమున గీశవీరులను ♦ జంపితి వెంతటి శౌర్యశాలివో. ౧౪౪౫

అర్థములు. బలపర = బలుఁడగు వానికి శత్రువు, ఇంద్రుఁడు, నికషాత్మ జుఁడు = నైరృతి, వైశ్రవణుఁడు = కుబేరునకు (౨) బలపరుఁడు = బలవిరోధి, అనఁగా బలహీనుఁడు ప్రహ్లాదుఁడు ఎప్పుడు సంతోషముతో నుండువాఁడేకాని రోషము లేనివాఁడు, బలి=వటుఁడు, నెత్తిపైఁ గాలుపెట్టి త్రొక్కఁగా బాతాళము నకుఁ బోయినవాఁడు, నికషాత్మజ = మూలలలోనుండువాఁడు, వైశ్రవణుండు = విశ్రవుఁడు, చెవులులేనివాఁడు. వాని కొడుకు వైశ్రవుఁడు. ఒక కన్ను లొట్ట, ఇటు వంటివారికి నీవు సమానుఁడవు, ప్రాజ్ఞుఁడా=బుద్ధిమంతుఁడా, (౨) ప్ర+అజ్ఞుఁడా= బుద్ధిలేని వారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

నీవు బలవైరికి ప్రహ్లాదునికి నైరృతికి కుబేరునకు సమానుఁడవు. స్వభావమగు దేహమున తేజమునను నీ తండ్రికి సముఁడవు నీవే. నిజముగా నీ యబ్బకు నీవు పుట్టిన వాఁడవే. ఇంద్రియములు గెలిచిన వానిని మనోవేదనల సమూహమువలె నిన్ను దేవతలైనను మీఱనేరరు. నిర్జరులు=నిర్గతమైన జర గలవారు. జర (ముసలి తనము)కు ఆవలి యవస్థ మరణమే. చచ్చువారుకూడ నిన్ను మీరలే అనిన అంత కంటెఁ జచ్చుపీనుఁగ వని భావము. ప్రాజ్ఞుఁడా! నీ బల మెంత మాత్రమో యంత బలముఁ జూపుము. భయపడకుము. నీ పెద్దతండ్రి వరబలముచేతను, నీ తండ్రి కండ

శావరముచేతను జగముల బాధించిరి. నీవు విలువిద్యయందు చాటుగనుండి కొట్టుట యందు నింద్రజిత్తును బలమునందు రావణుని పోలుదువు. నాదు నీ పెనపువన్ = నా నీ యుద్ధమందు, హరి=ఇంద్రుని, శంబర=శంబరుని, జన్యభంగి = యుద్ధవిధము, క్రమాలంకారము, ఇట్లు చెప్పుటచే నాచేత నీవు చచ్చుట నిజమని భావము. ఈ యుండెడు సకల ప్రాణులు చూచునుగాక, దృఢాస్త్రచాపకౌశలమునన్ = అనేకములైన యస్త్రములను వింటియందలి నేర్పుచే క్రోఁతులను జంపితివి. ఎంతటి శౌర్యవంతుఁడవురా? ముప్పదియేండ్లు సాము చేసి ముసలదానిని బడ మొత్తె నన్నట్లు గదా యున్నది నీ క్రోఁతులను జంపిన ఆ నీ శౌర్యము.

కం. అపవాదభయంబున ని, న్నిపుడే వధియింప నొల్ల ♦ నీక నాయాసం
  బపనీతముగాఁ దొడరుమ, యపు డీవు మదీయబలము♦సంతయుఁ గనుమా.

అర్థములు. అపవాదభయంబున=బడలిన వానిని జంపినాఁడని యపకీర్తి వచ్చునను భయముచే, అపనీతము గాన్=తొలఁగిపోఁగా, తొడరుము=ఎదిరింపుము.

తాత్పర్యము

అపకీర్తి వచ్చునను భయముచే నిన్నిపుడే చంపనిష్టపడను. నీవు యుద్ధము చేసి యలసి యున్నాఁడవు నీవు బడలిక పోఁగొట్టుకొని యుద్ధమున నెదిరింపుము అప్పుడు నా బలమంతయు నీవు చూడఁగలవు.

కం. అని గౌరవరూపకవా,క్యనిచయముల హేళనంబు ♦ గావింపఁగ న
  య్యనతనయునిఁ బట్టుకొనెన్, ఘనమదబలయుతుఁడు కుంభ♦కర్ణసుతుండున్.

అర్థములు. గౌరవరూప వాక్య నిచయములన్=రూపమున గొప్పతనము తెలుపు మాటల సమూహములు, వాస్తవమున హేళనము=పరిహాసము, ఘన మదబలయుతుఁడు=గొప్పమదముతోను బలముతోను గూడినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

## —♦ సుగ్రీవుఁడు కుంభుని వధించుట ♦—

ఉ. వానిని వీడఁ దన్నికొని ♦ వానరనాథుఁడు వెండి దండిచం
  దానను బైపడంగ నిటు♦దానవవానరవీరు లుద్ధతిన్
  బూనిన రోషవేగములఁ ♦ బోనిమదంబులఁ గొంచెమేనియున్
  న్యూనత లేని బింకముల ♦ నుద్ధతిఁ బోరిరి దంతులో యనన్. ౧౨౮౨

అర్థములు. దండిచందానను = యమునివలె, దంతులో=ఏనుఁగులో.

తాత్పర్యము

కుంభుఁడు పట్టిన పట్టూడఁదన్నికొని సుగ్రీవుఁడు యమునివలె మీఁదఁ బడఁగా నీ ప్రకారము రాక్షస వానర వీరులు గర్వమున నతిశయ కోపమున మదము వదలక కొంచెమైనను గొఱఁతలేని పౌరుషముల నొకరి నొకరు కొట్టుకొనుచు నేనుఁగులవలె యుద్ధము చేసిరి.

ఉ. మాటికి మాటి కూర్చుచును • మార్కొని యొండొరులతోఁ బెనంగుచున్
బాటిగఁ బేనినట్లు తను•వల్లరు లొప్పఁగఁ గ్రిందఁ బొర్లుచున్
వ్రేటుల నొంచుచుం బరశ•రీరము నీడ్చుచు గాసి ఱోలుచున్
నోట సధూమకీలల న•నూనముగా వెడలించు చిర్వురున్. ౧౮౮౯

అర్థములు. తను వల్లరులు=తీఁగవంటి దేహములు, ఱోలుచున్=బాధచే నలచుచు, సధూమ కీలలన్=పొగతోఁ గూడిన జ్వాలలను, అనూనముగా = విస్తారముగా.

తాత్పర్యము

పలుమాఱు శ్వాసములు విడుచుచు నొకరితో నొకరు పెనఁగులాడుచు చక్కఁగాఁ బేని నట్లు దేహములను తీఁగ లొప్పఁగా క్రిందఁబడి పొర్లుచు దెబ్బలు కొట్టి నొప్పించుచు, ఎదుటివాని శరీరము నేలవేసి యీడ్చుచు గాసిచే విలపించుచు నోటినుండి పొగతోఁ గూడిన జ్వాలలు దండిగా నిర్వురు వెడలించుచు.

మ. పదఘాతంబుల వార్ధిఘూర్ణిల్లఁగ దు•ర్వారంబుగాఁ బోరుచో
నదనైనన్ వెసఁ గుంభుఁ బట్టికొని పా•రావారమధ్యంబునన్
మదమారన్ రవిసూనుఁ డేసినను విం•ధ్య గ్రావతుల్యంబుగా
నుదధిన్ నీరము లేని యొడ్డతిమె, శౌ•ర్యోదగ్రుఁ డై కుంభుఁడున్. ౧౮౯౦

అర్థములు. పదఘాతంబులన్=కాలి త్రొక్కుడులచే, వార్ధి=సముద్రము, ఘూర్ణిల్లఁగన్=కలఁత చెందఁగా, అదను=సమయము, పారావార మధ్యంబునన్=సముద్రమునడుమ, వింధ్యగ్రావ తుల్యంబుగాన్ = వింధ్య పర్వముతో సమానముగా, అతిమెన్=ఆక్రమించెను, ఉదధిన్=ఉదధియును=సముద్రమును.

తాత్పర్యము

పాదఘట్టనములచే సముద్రము కలఁత చెందఁగా నడ్డము లేక పోరుచోఁ గొంచెము సమయము లభింపఁగాఁ గుంభునిఁ బట్టుకొని సుగ్రీవుఁడెత్తి సముద్రములోఁ బాఱవైచెను. అప్పుడు వింధ్యపర్వతము నీళ్ళలోఁబడినట్లుగా వాఁడు పడఁగా సముద్రముపొంగి నీళ్ళులేనిస్థలమును గట్టుమీఁద నాక్రమించెను. అప్పుడు కుంభుఁడు శౌర్యముచే భయంకరుఁడై.

ఉ. కోపము రూపముం గొనిన•కోపున వారిధి నుద్గమించి పె
ల్లేపున దాపునం దుమికి యింద్రపవిస్ఫుట వేగముష్టి సా
టోపత గ్రుద్దినన్ మెయి క•డుంగడుఁ జీలి స్రవించె రక్తజా
లాపగ తత్ప్రహారమును•నాఁచెఁ దదంగగతాస్థిసంతతుల్. ౧౮౯౧

అర్థములు. కోపునన్ = విధముగా, వారిధిన్ = సముద్రమునుండి, ఉద్గమించి = ఎగిరి, దాపునన్ = సుగ్రీవుని సమీపమందు, ఇంద్రపవిస్ఫుట=ఇంద్రుని వజ్రాయుధమువలె విశదమైన, వేగ = వేగముగల, ముష్టిన్ = పిడికిట, సాటో

పతిన్ = వేగిర పాటుతో, రక్త + జాల + ఆపగ = రక్త సమూహానది, తత్ప్రహారము = ఆ దెబ్బను, తదంగగత = అతని దేహమునందున్న, అస్థిసంతతుల్ = ఎముకల గుంపులు.

తాత్పర్యము

కోప మాకారము వహించిన విధముగ సముద్రమునుండి లేచి మిగుల బలముతో సుగ్రీవు సమీపమందు దుమికి యింద్రుని వజ్రాయుధము యొక్క విశద వేగముగల ముష్టిచే వేగిరపాటుతో గ్రుద్దఁగా దేహము మిక్కిలి చీలి వానినుండి నెత్తుటి వంక స్రవించెను. ఆ దెబ్బను ఆ దేహము నందున్న యెముక లాఁపెను. లేనియెడల ప్రాణములు పోయి యుండునని భావము.

తే. దివిజపతి మేరుపక్షముల్ ద్రెంచునపుడు, వజ్రనిష్పేష సంజాత వహ్ని యనఁగఁ
బిడుగునకు నద్దిరైన యా వ్రేటువలన, వింతరుచి దోఁచె నాహరి కాంతుమేన.

అర్థములు. మేరుపక్షముల్ = మేరుపర్వతముయొక్క ఱెక్కలు, వజ్రనిష్పేష = వజ్రముయొక్క తాఁపుచే, సంజాత = పుట్టిన, వహ్ని = అగ్ని, వింతరుచి = క్రొత్తకాంతి.

తాత్పర్యము

ఇంద్రుఁడు మేరుపర్వతము ఱెక్కలు నఱకునపుడా వజ్రముయొక్క రాపిడిచే పుట్టిన వహ్నివలెఁ బిడుగునకు సమానమైన యా దెబ్బలవలన సుగ్రీవుని దేహమునందు క్రొత్త కాంతి కానవచ్చెను.

ఉ. హుమ్మని వానరేంద్రుఁడు సముజ్జ్వలహేతిసహస్రభాసురం
బమ్మిహికారి మండలము నట్టి దృఢంబును శక్రవజ్రక
ల్పమ్మును నైన ముష్టి బిగఁ బట్టి తదాశరపక్షు ముద్ధతిన్
గ్రుమ్మినఁ దత్ప్రహారమునఁ గూలెను గుంభుఁడు విహ్వలాత్ముఁడై ౯౫౩

అర్థములు. సముజ్జ్వల = మిక్కిలి ప్రకాశించు, హేతిసహస్ర = వేయి కిరణములచే, భాసురంబు = ప్రకాశించునదియు, మిహికారి మండలము = సూర్యమండలము, అట్టి = అటువంటి, దృఢంబును = గట్టిదియు, శక్రవజ్రకల్పమ్మును = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన, ఆశరపక్షము = రాక్షసు ఱొమ్ము, ఉద్ధతిన్ = పెద్దదెబ్బచేఁ గ్రుమ్మినన్ = పొడవఁగా, తత్ + ప్రహారమునన్ = ఆ దెబ్బచే, విహ్వలాత్ముఁడై = చలించిన ప్రాణముగలవాఁడై, కూలెను = పడెను.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేయి కిరణములచేఁ బ్రకాశించు సూర్యమండలమువలె దృఢమైనదియు, ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైనదియు నగు పిడికిలిని బిగఁబట్టి హుమ్మని గ్రుమ్మఁగా నా దెబ్బకు విరవిరపోవు ప్రాణములు గలవాఁడై కుంభుఁడు నేలఁబడెను.

కం. శూలితిరస్కృతఖరకర,మాలి యనం బ్లవగనాథ♦మర్దితుఁడై తా
 నేలఁబడి తన్నికొని వి,జ్వాలం బగు వహ్నివోలెఁ ♦ బలలాదుండున్. ౧౨౫౪

అర్థములు. శూలితిరస్కృత=శూలిచే ధిక్కరింపఁబడిన, ఖరకరమాలి = సూర్యుఁడు, ప్లవగనాథమర్దితుఁడై = సుగ్రీవునిచేఁ గొట్టఁబడినవాఁడై, విజ్వాలంబు=జ్వాలలు చల్లారిన, పలలాదుఁడు=రాక్షసుఁడు.

తాత్పర్యము

దక్షయాగకాలమున శివునిచే ధిక్కరింపఁబడిన సూర్యునివలె వానరపతిచేఁ గొట్టఁబడి యీ రాక్షసుఁడు నేలఁబడి తన్నికొని జ్వాలలు చల్లారిన యగ్నివలె.

కం. దివినుండి లోహితాంగుఁడు, భువిఁ గూలిన యట్లు ప్లవగ ♦ పుంగవహతుఁడై
 భువిఁ గుంభుఁడు పడ వడఁకెన్, సవనాద్రిధరిత్రియసుర♦సంతతి బెగడెన్.

అర్థములు. లోహితాంగుఁడు = ఎఱ్ఱని దేహము గలవాఁడు, అంగారకుఁడు. "అంగారకః కుజో భౌమో లోహితాంగో మహీసుతః" అమరము. సూర్యుఁడు నెఱ్ఱనివాఁడే కావున సూర్యుఁడని చెప్పినను జెప్పవచ్చును ప్లవంగ పుంగవహతుఁడై = వానరశ్రేష్ఠునిచేఁ జంపఁబడినవాఁడై, సవనాద్రి ధరిత్రి = వనములతో కొండలతోఁ గూడిన భూమి, బెగడెన్ = భయపడెను.

తాత్పర్యము

ఆకాశమునుండి యంగారకుఁడు నేలఁ గూలినట్లు వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవునిచేఁ జంపఁబడి నేలమీఁదఁ గుంభుఁడు పడఁగా వనములతోఁ గొండలతోఁగూడిన భూమి గడగడ వడఁకెను. రాక్షస సమూహము భయపడెను.

**—♦ ౭౭-వ సర్గము. నికుంభుఁడు కపులఁ బాఱఁదోలుట ♦—**

ఉ. కుంభు నిజాగ్రజుం బ్లవగ♦కుంజరుఁ డీట్లు వధింప రోషసం
 రంభవిజృంభితుం డగుచు ♦ మంటలు గ్రమ్మెడిచూడ్కిచేత సం
 స్తంభితుఁ జేయున ట్లడరి ♦ స్రక్కనకాంబరభూషితంబు ను
 త్తంభితశృంగసన్నిభము ♦ దత్తకరాంగుళిపంచకంబునున్. ౧౨౫౬

అర్థములు. నిజాగ్రజున్ = తన యన్నను, రోషసంరంభ విజృంభితుండు= రోషముచేతను తత్తఱపాటుచేతను విజృంభించినవాఁడు, సంస్తంభితున్=నిశ్చలునిఁగా, అడరి = ఎదిరించి, స్రక్+కనకాంబర భూషితంబు=పూలహారములచేతను, బంగారు సొమ్ములచేతను నలంకరింపఁబడినది, ఉత్తంభిత శృంగసన్నిభము = పైకెత్తుటచే పొడుగుగాఁ జేయఁబడిన, ఉత్ + స్తంభిత, ఉత్తంభిత, దత్త=సమర్పింపఁబడిన, అంగుళి పంచకము=ఐదువ్రేళ్ళుగలది, కుంకుమ చందనాదులందు చేతులద్దియట్టి యైదువ్రేళ్ళేర్పడునట్లుగా నద్దఁబడినది. ముందు పద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము

తన యన్నయగు కుంభుని సుగ్రీవుఁ డిట్లు వధింపగా రోషముతోను తత్తర పాటుతోను విజృంభించి మంటలు గ్రమ్ముచున్నచూపు చేతనే యతని మొద్దుపాఱు నట్లు చేయువానివలె నెదిరించి పూలహారములచేతను, బంగారు సొమ్ములచేతను నలంకరింపఁబడినదియు, ఎత్తగు శిఖరముతో సమానమైనదియు, ఐదుబ్రేళ్ళు గుర్తుగలదియు.

సీ. యమదండతుల్యంబు ♦ నఖిలరాక్షసలోక, భయనాశకం బైన ♦ పరిఘ మెత్తె
నల నికుంభుఁడు వత్స♦తలగతనిష్కంబు, లంగదంబులు మెఱుఁ♦గారు చుండఁ
గుండలంబులు కాంతి♦మండలంబుల నీనఁ, బరిఘంబుతో వాఁడు♦ప్రజ్వలించె
శంపాలతాయుత ♦ జలదంబుమాడ్కిని, దాని త్రిప్పునఁ బుట్టు ♦ దారుణాగ్ని
తే. చే మహావాయువులు మండు ♦ చెలువుఁ జూపె,
నలక గ్రహతారకలును మ ♦ హాగ్రహాళి
చందురుండును భువనంబు ♦ సకల మింద్ర
పురముతోఁ గూడ భ్రమియించు ♦ కరణి నుండె. ౧౪౫౭

అర్థములు. యమదండతుల్యంబు=యముని దండముతో సమానమైనది, అఖిలరాక్షస లోక భయ నాశకంబు = సమస్త రాక్షస సమూహముల భయము నాశము చేయునదియు, పరిఘము=ఇనుపకట్టు గుదియ, వత్సతల గతనిష్కంబులు= ఱొమ్మున నుండు పతకములు, అంగదంబులు=భుజకీర్తులు, శంపాలతాయుత జలదంబు=మెఱపుతీఁగలతోఁ గూడిన మేఘమువలె, అలక = కుబేరపట్టనము, భ్రమియించు = గిరగిర తిరుగు.

తా త్ప ర్య ము

యమ దండముతో సమానమైనది సర్వరాక్షస భయము పోఁగొట్టునది యగు నినుపకట్ల గుదియనెత్తి యీ కుంభుండు ఱొమ్మున నుండు పతకంబులు భుజకీర్తులు మెఱుఁగు లీనుచుండ, చెవులయందలి పోగులు కాంతిసమూహములు గల్పించుచుండఁ, బరిఘంబులతో వాఁడు మెఱుపుఁదీగెలతోఁగూడిన మేఘమువలె వెలిఁగెను. అది త్రిప్పుటచేఁ బుట్టు భయంకరాగ్నిచే, ఆవహ ప్రవహ నివహ ప్రవహాది మహావాయువులు మండునట్లుండెను. అలకాపురము బుధుఁడు లోనగు గ్రహములు అశ్విని మొదలగు నక్షత్రములు మహాగ్రహములు శుక్రుఁడు మొదలగునవి – రాత్రివేళ కావున సూర్యుఁడు చెప్పఁబడఁడు. చంద్రుఁడు ఇంద్రఁబట్టనముతోడ సకల ప్రపంచము తిరుగు నట్లుండెను.

కం. పరిఘాభరణప్రభలం, బరఁగి, నికుంభాగ్ని కీశ ♦ వరులకుఁ గల్పో
ద్ధురవహ్నివోలె సైఁపం, దర మేమియుఁ గామి మిగులఁ♦దరలిరి భీతిన్.

అర్థములు. పరిఘ ఆభరణప్రభలన్ = గుదియకు వేసిన భూషణముల కాంతులచే. పరఁగి = వ్యాపించి, నికుంభాగ్ని = నికుంభుఁ డను నగ్ని, కల్పోద్ధుర వహ్నివోలె=ప్రలయకాలమందలి యధికమైన యగ్నివలె, తరలిరి=పఱచిరి.

తాత్పర్యము

గుదియను వేసిన సొమ్ముల కాంతులను జ్వాలలచే వ్యాపించి నికుంభుఁ డను నగ్ని వానరశ్రేష్ఠులకు ప్రలయకాలమందలి యధికమైన యగ్నివలె కొంచెమైన సహింపరాకుండుటచే భయపడి వణఁకిరి.

కం. కదలక మెదలక యేమియుఁ, బెదవులఁ దడి లేక యొసఁగు • వెఱపున నసురల్
మద మఱి కీశులు నిలఁబడి, యెదవడ కొక్కఁడు హనుమ • యెదురన్ నిలిచెన్.

అర్థములు. ఎదవడక = భయపడక.

తాత్పర్యము స్పష్టము.

## — • హనుమంతుఁడు నికుంభు వధించుట • —

చ. నిలిచిన వాయుపుత్త్రుఁ గని • నిష్ఠురవృత్తి నురంబుఁ జూచి య
బ్బలియుఁడు దాని వైవ నది • పావనిఁ దాఁకిన యంతఁ దునక్కలై
పొలుపఱి పెక్కులుల్కలన • భూమిని వ్రాలె దదాహతిన్ ధరా
చలనమునందు శైల మనఁ • జంచలతం గని పావమానియున్. ౧౨౬౦

అర్థములు. నిష్ఠురవృత్తిన్=కఠినమైన చలనముచే, పొలుపఱి = అందము చెడి, ఉల్కలు = కొఱవులు, తదాహతిన్ = ఆ దెబ్బచే, ధరాచలమునందు = భూకంపమందు, చంచలతంగని=వణఁకి, పావమాని=హనుమంతుఁడు.

తాత్పర్యము

నిలువఁబడిన హనుమంతునిఁజూచి కఠినవర్తనముచే నతనియురంబు గుఱి చూచి యబ్బలశాలి దానిని వేయఁగా నది హనుమంతుని ఱొమ్ము దాఁకినంతనే తునకలై యందము చెడి యనేకములగు కొఱవులవలె నేలమీఁదఁ బడెను. ఆదెబ్బచేత హనుమంతుఁడు భూకంపమందు పర్వతమువలె వణఁకెను.

కం. ఉడుగక వెంటనె బెడిదపుఁ, బిడికిటిపోటున నికుంభు • వే తాఁచిన వాఁ
డడలియు దెప్పిరి కపిపైఁ, బడిపట్టెన్ దనుజు లార్వఁ • బ్రముదితు లగుచున్.

అర్థములు. తాఁచినన్ = కొట్టఁగా, తెప్పిరి = తెప్పరిల్లుకొని, ప్రముదితులు = సంతోషించినవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. పట్టువడియుండి గాడుపు, పట్టియు దృఢముష్టిఁ బొడిచి • పగతుని బలిమిన్
బట్టు విడఁగొట్టికొని మఱి, కొట్టెం గడు హెచ్చరికను • గూలఁగ ధరణిన్.

తాత్పర్యము స్పష్టము.

తే. పృథివిఁ బడఁదన్ని యతనిపై • కెగిరి వేగ, చక్కఁబిగఁబట్టి మెడఁద్రిప్పి • శాత్రవుండు
గర్జిలుచునున్న వికువక • కాలనులిమి, మృత్యువునుగూర్చె యొక్కసి • మేవమునను.

అర్థములు. గర్జిలుచునున్న = కూఁతలు పెట్టుచున్నను, నులిమి=నలిపి.

తాత్పర్యము స్పష్టము.

ఇంద్రవంశము. కుంభానుజన్ముండిటు ♦ గూల నేలపై, గంభీర రావంబున ♦
తూ్మ్రధరాటులున్
శుంభద్గతిన్ సమ్మద♦శుద్ధచిత్తులై, జృంభించి గర్జించిరి♦పృథ్వియాడఁగన్.

అర్థములు. కుంభానుజన్ముండు = కుంభుని తమ్ముఁడు, రావము = ధ్వని, శాఖాధరాటులు=వానరులు, శుంభద్గతిన్ = ప్రకాశించు విధముగా, సమ్మద శుద్ధ చిత్తులై =సంతోషముతోఁ గూడిన నిర్మలమైన మనస్సుగలవారై, ఇంద్రవంశము. తతజర గణంబులు, ఎనిమిదింట యతి.

తాత్పర్యము స్పష్టము.

యుద్ధదినముల లెక్క రెండు విధము లని ముందు చెప్పఁబడెను. అందు మొదటి పక్షము ప్రకారము కుంభాదుల వధము నవమినాఁడు. రాత్రి మకరాక్ష వధము, దశమి యుదయాన జరిగినదని యెఱుఁగునది. ఈపక్షమున నాక్షేపణీయములు పెక్కులున్నవి. రెండవ పక్షమున అకంపనవధ, ప్రహస్తవధ, రావణమకుట భంగము, కుంభకర్ణవధ, దశమి యుదయాదిగా జరిగినవి, బ్రహ్మాస్త్రబంధము దశమి సాయంకాలము. ఆ మునిజామున బ్రహ్మాస్త్ర మోక్ష లంకాదాహ కుంభ నికుంభ యూపాక్ష శోణితాక్ష ప్రజంఘ కంపనమకరాక్షులవధ యని యెఱుఁగునది నరాంతకాది యుద్ధమునందుఁగాని కంపనాది యుద్ధమందుఁగాని యొకరు చచ్చువఱకు మఱి యొకరు కాచి వేడుక చూచుచుండి రని తలఁపరాదు. నలుపురు నేక కాలమందే యుద్ధము చేసినను నట్లు చెప్పుట సాధ్యముకాదు. కావున వారివారి యుద్ధము వేఱు వేఱుగఁ జెప్పఁబడెను. కావున నించుమించుగ నందఱు నేక కాలమునఁ జచ్చినవారే.

## —♦ ౭౮-వ సర్గము. మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట ♦—

సీ. కుంభనికుంభులు♦కుంభిని పాలౌట, విని రావణుఁడు రోష♦వివశుఁడగుచుఁ
క్రోధశోకంబుల ♦ బాధితుండై మండి, పడి మూర్ఛితుం డయి ♦ ప్రకటబలుని
ఖరపుత్రు మకరాక్షుఁ♦గనిపలుకఁబుత్రకా!, నాయాజ్ఞఁ బ్రబలసే♦నలు భజింపఁ
జని వానరుల రామ♦చంద్రుని లక్ష్మణు, హతులఁ గావింపు నా♦యన!యటన్న
తే. నట్లె యనుచును వలగొని♦పంక్తివదను, వందనము సల్పి యిల్వెడి♦బయటవచ్చి
సైన్యనాథునితోడనా♦స్యందనంబుఁ, దెమ్ము సైన్యంబుఁ గూర్పుమా♦ త్వరముగాను.

అర్థములు. వలగొని=ప్రదక్షిణించి, స్యందనము=తేరు.

తాత్పర్యము

కుంభనికుంభులు నేలపాలౌట విని రావణుఁడు రోషముచేఁ బరవశుఁడై క్రోధము చేతను శోకము చేతను బీడింపఁ బడినవాఁడై మండిపడి మూర్ఛపోయి లేచి ప్రసిద్ధబలుఁడును ఖరునిపుత్రుఁడు నగు మకరాక్షుఁ జూచి కుమారా! నా యాజ్ఞచే ప్రబలమైన సేనలు కొలువఁగాఁ బోయి వానరులను రామలక్ష్మణులను చంపుము అని చెప్పఁగా, అట్టులే చేసెద నని చెప్పి ప్రదక్షిణనమస్కారములు చేసి

యిల్లు వదలి వెలుపల వచ్చి సేనానాయకునితో నాతేరు తెమ్ము. శీఘ్రముగ నావెంట వచ్చు సేన గూర్పుము అని చెప్పఁగా.

చ. అనవుడు నట్లు గూరుప శ•తాంగము ముంగలఁ దాఁ బ్రదక్షిణం
బొనరిచి యెక్కి సూతుఁడ ? స•ముగ్రజవంబునఁ దోలుమీ యటం
చని నిశిచారులార! రభ•సంబున మీరలు మత్పురస్థులై
యని నొనరింపుఁ డేనును ద•శాస్యునియానతి మేర నుద్ధతిన్. ౧౦౬

అర్థములు. శతాంగము ముంగల = తేరికి ముందు భాగమున, సముగ్ర జవంబునన్ = అతివేగమున, రభసంబునన్ = త్వరగా, మత్పురస్థులై = నాకు ముందున్నవారై, అని = యుద్ధము, ఉద్ధతిన్ = గర్వముతో.

తాత్పర్యము

ఆ ప్రకారమే యతఁడు సేనగూర్చియీయఁగా తేరి ముందు ప్రదక్షిణము చేసి యెక్కి సారథీ! యతివేగంబునఁ దేరిని తోలుము అని చెప్పి రాక్షసులారా! మీరు వేగముగ నాకు ముందున్నవారై యుద్ధముచేయుఁడు. నేను రావణునియాజ్ఞ ప్రకారము.

తే. రామలక్ష్మణులను గపి•రాజుఁ దక్కఁ,గల వనేచరసంఘంబు•ఖడ్గబాణ
శూలవహ్నుల దావాగ్ని•శుష్కవనము, చందముగ నిర్దహింతు న•మందగతిని.

అర్థములు. దావాగ్ని = కార్చిచ్చు, శుష్కవనము = ఎండినయడవి నిర్దహింతును=కాల్చివేయుదును, అమందగతిని= వేగముగ.

తాత్పర్యము స్పష్టము.

కం. అనవుడు రాక్షసవీరులు, సునిశితనానాయుధముల•శోభలు నిండన్
ఘనకరులన గర్జించుచు, మొన నిల్చిరి కామరూప•ములఁ దాల్చి వెసన్.

అర్థములు. సునిశిత=పదునుగల, శోభలు=కాంతులు, ఘనకరులనన్= పెద్దయేనుఁగులో యనునట్లు, కామరూపములన్ = వారువారు కోరిన యాకారమును, మొనన్ = సేనయందు.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా రాక్షస వీరులు వాఁడిగల పలుతెగలగు నాయుధముల కాంతులు నిండునట్లు చూడఁగా పెద్ద యేనుఁగులవలె గర్జించుచు కోరిన రూపములు ధరించిన సేన యందు నిల్చిరి.

తే. శంఖభేరీసహస్రని•స్స్వనములను, క్ష్వేళితాస్ఫోటితంబుల•వికటరవము
చాపగుణటంకరణములు•సంకులముగఁ, బర్వనడచిరి మకరాక్షు•బలసి యనికి.

అర్థములు. శంఖభేరీ సహస్ర నిస్స్వనములను=వేలకొలఁదులగు శంఖములయు, నగారాలయు ధ్వనులును, క్ష్వేళితాస్ఫోటితంబుల=అఱపులయు సింహనాదములయు, వికటరవము =భయంకర ధ్వనులును, చాపగుణ టంకరణము = వింట

యల్లెత్రాటి టంటమ్మను ధ్వనులు, సంకులముగన్=ఒక్కటిగఁ గలసినవై, పర్వ=వ్యాపింపఁగా, బలిసి=చుట్టుకొని, అనికిన్=యుద్ధమునకు.

తాత్పర్యము స్పష్టము.

చ. అరుగు ఖరాత్మజాతుని రథాగ్రగతంబు ధ్వజంబు నేలపైఁ
దొరఁగెను, సూతు చేచబుకుదూలె, హయంబులు గాళ్ళుత్రొట్టిలన్
గురువులు వాఱ కశ్రులను గార్చె నదైన్యములై, సపాంసులై
పొరిఁ బ్రతికూలవాయువులు భోరున వీచెను దారుణంబుగన్. ౧౮౭౦

అర్థములు. రథాగ్రగతంబు = తేరిపైభాగమున నుండునది, చేచబుకు = చేతికొరడా, దూలెన్ = పడిపోయెను, త్రొట్టిలన్ = తడఁబడఁగా, గురువులు వాఱక=వేగముగఁ బరువెత్తక, అశ్రువులను=కన్నీటిని, సపాంసులై = ధూళితోఁ గూడినవై.

తాత్పర్యము

పోవుచున్న ఖరుని కుమారుని రథము కొననున్న ధ్వజము నేలపై బడెను. సారథిచేతి కొరడా జాఱిపడెను. గుఱ్ఱములు కాళ్లు తడఁబడఁగా త్వరగా పరువెత్తక దుఃఖముతోఁ గన్నీళ్లు కార్చెను. దుమ్ముతోడ నెదురుగాలి భయంకరముగ వీచెను.

కం. బహుదుశ్శకునము లైనను, సహియించి గజాహి మేఘసమవర్ణులు దా
రహమిక నసురులు దుస్సహతేజుని రామచంద్రు చక్కటి కరుగన్. ౧౮౭౧

అర్థములు. గజ, అహి, మేఘసమవర్ణులు=ఏనుఁగుల, పాముల, మబ్బుల వన్నె గలవారు, అహమహమిక = నేను ముందనిన నేను ముందనుచు, దుస్సహతేజుని=సహింపరాని తేజస్సుగల, చక్కటికి=ఉన్నప్రదేశమునకు సరిగా.

తాత్పర్యము

అనేకములు దుశ్శకునములైనను నోర్చుకొని ఏనుఁగు, పాము, మేఘము వీనితో సమానకాంతి గల రాక్షసులు నేను ముందు పోయెద ననిన నేను ముందు పోయెద నని సహింపరాని తేజస్సుగల రామచంద్రమూర్తియున్న చోటుకు సరిగా బోయిరి.

## —♦ ౭౯-వ సర్గము. మకరాక్షుఁడు శ్రీరాముఁ దూలనాడుట ♦—

చ. ప్లవగుల నంటఁ దాఁకుటయు వారల కద్భుతరోమహర్షణం
బవు సమరంబు చెల్లఁ బరిఘాయుధశూలనిహంత లుర్వీభృ
న్నివహకుజాళిమారకులు నిష్ఠురముష్టికలంబ తాడితుల్
వివిధగదాసికుంతశర వృక్షశిలాచయభిన్నగాత్రులున్. ౧౮౭౨

అర్థములు. అద్భుత రోమ హర్షణంబు = ఆశ్చర్యకరము, గగ్గురుపాటు గలిగించునది, సమరంబు=యుద్ధము, నిహంతలు = చంపఁ బడ్డవారు, ఉర్వీభృన్నివహ = పర్వతముల గుంపుల చేతను, కుజాళీ = చెట్లగుంపుల చేతను, మారకులు =

చంపువారు, నిష్ఠుర ముష్టికలంబతాడితుల్ = కఠినములైన పిడికిళ్ళచేతను, బాణములచేతను, గొట్టఁబడినవారు, వివిధ=అనేకవిధములైన, గద=గదలచేతను, అసి=కత్తులచేతను, కుంత = ఈఁటెలచేతను, శర = బాణములచేతను, వృక్ష = చెట్లచేతను, శిలాచయ = రాళ్ల సమూహముచేతను, భిన్నగాత్రులన్ = విఱుగఁగొట్టబడిన దేహములు గలవారు, రాక్షసు లాయుధములతోఁ గొట్టిన వానరులు రాలు చెట్లు పిడికిళ్ళతో గొట్టిరని భావము.

తాత్పర్యము

వానరులను సమీపించి రాఁకుటయు, వానర రాక్షసులకు నాశ్చర్యకరమై, గగుర్పాటు గలిగించు యుద్ధము జరిగెను. అందు గుదియలచేతను శూలములచేత జంపినవారును కొండలచేత, వృక్షములచేతఁ జంపినవారును, కఠినములగు పిడికిళ్ళచేత బాణములచేతఁ గొట్టఁబడినవారును నానావిధములైన గదలచేతను కత్తులచేతను ఈఁటెలచేతను బాణములచేతను చెట్లచేతను రాలసమూహములచేతను భేదింపఁబడిన దేహములు గలవారును,

చ. అయి సమరంబు చెల్ల మకరాక్షుని వేఁడిమి కంప వెల్లికిన్
  భయమున నెల్ల వానరులు పాఱఁగ వెన్కొని రాక్షసావళుల్
  రయమునఁ దోలఁ గోపమున రాముఁడు వారల నిల్వరించె దు
  ర్జయపరసంఘభీతికర శాతమహాశుగతీవ్రవృష్టిచేన్. ౧౮౭౩

అర్థములు. సమరంబు = యుద్ధము, వేఁడిమికిన్ = ప్రతాపమునకు, అంప వెల్లికిన్ = బాణముల ప్రవాహమునకు, తోలన్=తఱుమఁగా, దుర్జయ=జయింపరాని, పర = శత్రువుల, సంఘ=సమూహమునకు, భీతికర = భయము కలిగించు, శాత=వాఁడియైన, మహా=గొప్పదగు, ఆశుగ=బాణముల, తీవ్రవృష్టిచేన్ =అధికమైన వానచే.

తాత్పర్యము

కలదై యుద్ధము జరుగఁగా మకరాక్షుని ప్రతాపమునకు వాని బాణముల ప్రవాహమునకు భయపడి వానరులందఱు తమ్ము రాక్షసులు తఱుముకొని రాఁగా బరువెత్తిరి. ఇట్లు వానరులనుఁ దఱుము రాక్షసులను జూచి కోపించి రామచంద్రమూర్తి జయింపరానట్టివియు శత్రువులకు భయంకరము లయినట్టివియు నగు వాఁడి బాణముల మహావర్షముచే వారిని పైపడి రాకుండ నిలువరించెను.

కం. వారితదనుజుల శరసంవారము గురియించు రామభద్రునిఁ గని రో
  షారంభుఁడు మకరాక్షుఁడు, ధీరత నిట్లనియె రామ దేవునితోడన్. ౧౮౭౪

అర్థములు. వారిత = నివారింపఁబడిన, దనుజులన్ = రాక్షసులను, శర సంవారము=బాణసమూహము, రోషారంభుఁడు=రోషముతోఁ గూడిన త్వరగలవాఁడు, ధీరతన్=ధైర్యముతో.

తాత్పర్యము

ఆడగింపఁ బడిన రాక్షసులను బాణసమూహములను గురియించు రామచంద్రమూర్తిని జూచి రోషముతోడి త్వరగల మకరాక్షుఁడు ధైర్యముతో రామదేవునితో నిట్లనియె.

చ. నిలు నిలు రామ ! యేమిటికి ♦ నిక్కెదు? నే నిదె యున్నవాఁడ, నీ
జలువును జూడ వచ్చితిని ♦ ద్వంద్వరణంబున నీదు ప్రాణముల్
బలియిడువాఁడ మేదినికిఁ ♦ బాఱకు, నా చనుదేనిచోట నీ
వలవున నాదు తండ్రి ఖరు ♦ నంతకుఁ గూర్చితి దండకాటవిన్. ౧౪౭౫

అర్థములు. బలువు=బలము, మేదినికిన్ = భూమికి, పాఱకు = పరువెత్తిపోకుము, నాచనుదేనిచోట=నేనురానిచోట, అలవునన్ = పరాక్రమముచే, అంతకున్=యముని, తేతేరులు తెచ్చునకగు. సం. వ్యా. క్రియ ౧౦౪ సూ. చనుదెంచు-చనుదేరు - చనుదే యునియగు.

తాత్పర్యము

నిలు నిలు రామా! ఏల గర్వించి మిడిసిపడెదవు ? ఇదిగో నేనున్నాఁడను. నీ బల మేమాత్రమో చూడవచ్చితిని. ద్వంద్వయుద్ధమునందు నీప్రాణములను భూమికి బలియిచ్చెదను. పరువెత్తిపోకుము. నేను రానిచోట నాతండ్రిని పరాక్రమించి నీవు దండకారణ్యమునఁ జంపితివి.

ఉ. నా యెదుటం బరాక్రమము ♦ నన్ విలసిల్లెడి నిన్నుఁ జూచినం
గాయము మండెడిన్ ఖలుఁడ ♦ కాలము నా కనుకూల మాటచే
సాయము చేసె దైవమును ♦ స్వల్పమృగంబు క్షుధార్త సింహ సం
స్థాయముఁ గూర్చినట్లు నిను ♦ నాదట నిల్పె మదీయసన్నిధిన్. ౧౪౭౬

అర్థములు. ఖలుఁడ = దుష్టుఁడ, కాయము = దేహము, సాయము = సాహాయ్యము, తోడుపాటు, క్షుధార్త=ఆకలిచే బాధపడు, సింహ = సింహముయొక్క, సంస్థాయము=గృహమును, వాసస్థానమును, ఆదటన్=ప్రేమచే.

తాత్పర్యము

నాయెదుటఁ బరాక్రమముఁ జూపు నిన్నుఁ జూడఁగా దుష్టుఁడా! దేహము మండుచున్నది. కాలము నా కనుకూలించుటచే దైవము నాకుఁ దోడుపడెను. ఏమి చేసెనందువా? ఆఁకలిగొన్న సింహముండు గుహయొద్దకు స్వల్ప మృగమును దెచ్చి నిల్పినట్లు నా యొద్దకు నిన్నుఁ దెచ్చిపెట్టెను. నేను నిన్ను వెదకికొనుచు వచ్చు శ్రమము దప్పినది. ఇది సాహాయ్యము కాదా !

కం. నాచే నని నిహతింగని, వే చని సూర్యాత్మజాతు ♦ వీటికి నట మున్
నీచేఁ ఇచ్చిన వీరని, శాచరులున్ నీవు క్రీడ ♦ నల్పుఁడు చెలిమిన్. ౧౪౭౭

అర్థములు. అనిన్ = యుద్ధమందు, నిహతింగని = చచ్చి, వే = త్వరగా సూర్యాత్మజాతు = యమునియొక్క, పీటికిన్ = పురమునకు, అటన్=ఆ ప్రదేశమందు, చెలిమిన్=స్నేహముతో.

నీవు నాచే జచ్చి త్వరగా యమపురమునకుఁబోయి యచ్చటఁ బూర్వము నీచే జచ్చిన రాక్షసులు నీవు స్నేహభావము గలవారై క్రీడింపుఁడు.

ఉ. ఏటికిఁ బెక్కుమాటలు నరేశ్వర! యెల్లరుఁ జూచువారు నీ
యేటును నాదుపోటు, నిపుడే గదనో యిత రాస్త్రశస్త్రముల్
కోటినొ రిత్తచేతులనొ కోరెద వెయ్యది కొందు నీవు మేల్
పోటరి వద్ది యర్థిఁగొని పోరికి రమ్మన మందహాసియై. ౧౮౭౯

అర్థములు. ఎల్లరు = ఎల్లవారు, సమస్త జనులు, ఇపుడే = ఈ గడియయందే, శస్త్రములన్ + కోటినొ=శస్త్రముల యొక్క కోటినో, పోటరివి=శూరుఁడవో, అర్థిఁగొని=కోరికొని, మందహాసియై=చిఱునవ్వు గలవాఁడై.

తాత్పర్యము

రాజా! యేల! యొక్కువమాటలు చెప్పవలెను. నీదెబ్బ నా ప్రతాపము నీ గడియయందే సమస్తజనులు చూచువారు. నీవు గదాయుద్ధమందే సమర్థుఁడవో, అస్త్రయుద్ధమందే సమర్థుఁడవో, శస్త్రయుద్ధమందే సమర్థుఁడవో లేక రిత్త చేతుల మల్లయుద్ధమందే సమర్థుఁడవో, దేనియందు నీకు విశేషసామర్థ్యము గలదో దానినే కోరికొని యుద్ధమునకు రమ్ము. అనిన రామచంద్రమూర్తి చిఱునవ్వు నవ్వె.

కం. ఏటికి వికత్థనములు ని, శాటుఁడ! యేమే మొ ప్రేల వ్యర్థముగ ననిన్
బోటరితనమునఁ గాకిటు, మాటలబలమునను జయము మసఁగునె యెందున్.

అర్థములు. వికత్థనములు = ఆత్మస్తుతులు, తన్నుఁ దాను బొగడుకొను మాటలు, పోటరితనమునన్=శౌర్యమున, మసఁగునె=ప్రాప్తించునా?

తాత్పర్యము

ఓరీ రాక్షసుఁడా! నిన్ను నీవే పొగడుకొనుచు నేమేమో నిష్ప్రయోజనముగ వదరెదవేల? యుద్ధమునందు జయము శౌర్యమున వచ్చునుగాని మాటల బలమున వచ్చునా?

ఉ. ఆలములోఁ జతుర్దశసహస్రనిశాటము సేన దండకన్
బాలిశ! దూషణుం ద్రిశిరుఁ ద్వత్పిత నేఁ బొరిగొంట యెఱుంగవా?
హాళిని దీక్ష్ణతుండనఖ రాంకురగృధ్రసృగాలమాకళుల్
చాలఁగఁ ద్వచ్ఛరీర తర సంబు భుజించుత ముక్కబంటిగన్. ౧౮౮౦

అర్థములు. చతుర్దశసహస్ర నిశాటము=పదునాలుగువేల రాక్షసులఁగలది,

బాలిశ=మూఢుఁడ, హేళిని=ఆసక్తితో, తీక్ష్ణ = కూచియగు మొనగల, తుండ= ముక్కు, నఖరాంకుర=మొలకలవంటి గోళ్ళుగల, గృధ్ర = గ్రద్దలు, సృగాల = నక్కలు, వాకశుల్ = కాకులు, త్వత్ = నీయొక్క, శరీరతరసంబు = దేహము నందలి మాంసమును, ముక్కులంటిగన్ = ముక్కులవఱకు వచ్చువఱకు, భుజింపు తన్ = తినును కాక.

### తాత్పర్యము

యుద్ధమునందు దూషణుని త్రిశిరుని, నీతండ్రిని బదునాలుగు వేల రాక్షసులను జంపినవాఁడను నేనని నొఱుంగవా? వాఁడియగు ముక్కులు గోళ్ళుగల గ్రద్దలు, నక్కలు, కాకులు నాసక్తితోఁ గడుపులునిండ ముక్కుమునుఁగ నీదేహము నందలి మాంసమును దినును గాక.

### —♦ శ్రీరాముఁడు మకరాక్షు వధించుట ♦—

చ. అనవుడు రామచంద్రుని శ ♦ రాధిక వృష్టిని ముంచె దైత్యుఁ డా
ఘనశరపాళినెల్ల నిజ ♦ కాండములన్ హరియించె రాముఁడున్
దనుజనరేంద్రు లీగతి మ ♦ దంబు జవంబు బలంబుఁ జూపుచున్
బెనఁగిరి జ్యారవంబులు ది ♦ విన్ ఘనఘర్షణ సన్నికాశమై. ౧౨౨౧

అర్థములు. శరాధిక వృష్టిని=బాణముల పెద్దవానచే, మదంబు=గర్వము, జవంబు = వేగము, జ్యారవంబులు = అల్లెత్రాటి ధ్వనులు, ఘనఘర్షణ సన్నికాశమై=మేఘధ్వనితో సమానమై.

### తాత్పర్యము

అని చెప్పఁగా మకరాక్షుఁడు శ్రీరామచంద్రమూర్తిని అధికమైనబాణవర్షముచే ముంచెను. రామచంద్రమూర్తి యా బాణ సమూహములనెల్ల తన బాణములచే ఖండించెను. దనుజశ్రేష్ఠుఁడు మనుజశ్రేష్ఠుఁడు నీవిధముగ గర్వము, వేగము, బలము చూపుచునల్లెత్రాటిమ్రోఁతలు మేఘధ్వనితో సమానమగునట్లుగ యుద్ధము చేసిరి.

చ. పరఁగఁగ మౌని దానవ సు ♦ పర్వమహోరగులుం దదీయసం
గరమును జెప్పవా టిడక ♦ ఖస్థలి నిల్చి కనుంగొనం బర
స్పరకరముక్తబాణముల ♦ భంగ మొనర్చుచు నంత కంతకుం
బెరుఁగుబలంబుతో నలఘు ♦ వీర్యము ధైర్యము శౌర్య మేర్పడన్. ౧౨౨౨

అర్థములు. ఖస్థలిన్ = ఆకాశ ప్రదేశమందు, పరస్పర = అన్యోన్యము, కరముక్త=చేతులతో విడువఁబడిన, భంగ మొనర్చుచున్=విఱుచుచు.

### తాత్పర్యము

మునులు దానవులు దేవతలు సర్పములు నా యుద్ధమును జెప్ప వాల్పక యాకాశము నందుండి చూచుచుండిరి. రామ మకరాక్షులొకరు వేసిన బాణముల నొకరు ఖండించుచు క్రమక్రమముగాఁ బెరుగుచున్న బలముతో గొప్పవీర్యము ధైర్యము శౌర్యము స్పష్టపడఁగా.

ఉ. రాముఁడు వైచుబాణముల • రాక్షసవీరుఁడు నేలఁ గూల్పఁగా
రాముఁడు రాక్షసాశుగప•రంపరలన్ శతధావిభిన్నమై
భూమిని వ్రాలఁ జేసె, నిరు•వు ర్నిగిడించుఖగాళి దిగ్విది
క్స్తోమము నిండె, నెద్దియును • దోఁపక యుండె రణాజిరంబునన్. ౧౨౨౩

అర్థములు. శతధా విభిన్నమై = నూఱుగా విఱిగినవై, ఖగాళి = బాణ సమూహము, దిక్ + విదిక్ + స్తోమము = అష్టదిక్కులను, (నాలుగు పెద్దవి నాలుగుమూలలు), రణాజిరంబునన్ = యుద్ధరంగమందు.

తాత్పర్యము

రాముఁడు వేసిన బాణములను మకరాక్షుఁడు, మకరాక్షుఁడు వేసినవానిని నూఱుతునుకలుగ రామచంద్రమూర్తి ఖండింపఁగా వారు వేయు బాణము లెనిమిది దిక్కులు నిండెను. ఆ రణరంగమం దేదియుఁ గానవచ్చినదికాదు.

మ. తనతో సాటిగఁ బోరు రాక్షసుని చం•దం బంత వీక్షించి చ
య్యన రాముండు ధనుస్సుఁ ద్రుంచి వసుసం•ఖ్యాకేషులన్ సారథిన్
దునిమెన్, వాజులఁ ద్రుంచెఁ, దద్రథము నిర్ఘాతంబుఁ గావించె, నం
త నిశాటుండు ధరాస్థలిన్ దుమికెఁ జే•తన్ శూలమున్ గ్రాలఁగన్. ౧౨౨౪

అర్థములు. వసు సంఖ్యాక + ఇషులన్ = ఎనిమిది బాణములను, వసువు లెనమండ్రు, వాజులన్=గుఱ్ఱములను, నిర్ఘాతంబు=ఎగురఁగొట్టఁబడినది.

తాత్పర్యము

అప్పుడు రామచంద్రమూర్తి తనతో సమముగ యుద్ధముసేయు రాక్షసుని విధముఁజూచి యేమిరా! వీఁడు నాతో సమముగఁ బోరాడుచున్నాఁడని శీఘ్రముగ వాని ధనుస్సు దెగవ్రేసి యెనిమిది బాణములచే సారథిని జంపి గుఱ్ఱముల ఖండించి రథ మెగిరిపోవు నటులు గొట్టఁగా వాఁడు చేత శూలముఁ దీసికొని నేల మీఁదికి దుమికెను.

కం. లోకభయంకరశూలము, భీకరగతిఁ ద్రిప్పి విసరి•వేసెన్ రామున్
గాకుత్స్థవరుఁడు దానిని, నాకసమం దొక శరత్ర•యంబునఁ ద్రుంచెన్.

అర్థములు. శరత్రయంబునన్ = మూఁడు బాణములచే.

తాత్పర్యము

కం. మిణుఁగురులు సెదర శూలము, పొడిపొడియై ధరణిఁబడిన • భూతములెల్లన్
బుడమిసుతవిభునిఁ బొగడెను, గడుమేల్ మేల్ మే లటంచుఁ•గగనము నిండన్.

తాత్పర్యము స్పష్టము.

ఉ. శూలము భగ్నమై చెడిన • శూరవరుండు క్షపాచరుండు దాఁ
గేలిన ముష్టి గూర్చి రఘు•కేసరి! నిల్నిలు మంచు బైపడన్

రా లలితాల్పహాసవద ♦ నద్విజరాజు క్షమాత్మజామనో
జాళి గుణంబుఁ గూరిచి భ ♦ యంకరపావక బాణ ముగ్రుఁడై. ౧౨౮౭

అర్థములు. భగ్నమై = విఱిగి, క్షపాచరుండు = రాక్షసుఁడు, లలిత = అందమైన, అల్పహాస=చిఱునవ్వుఁగల, వదనద్విజరాజు=ముఖచంద్రుఁడు, క్షమాత్మజా = భూపుత్రియగు సీతయొక్క, మనోజ్ఞ=మనస్సనెడి కమలమునకు, అళి = తుమ్మెదయగువాఁడు, పావకబాణము = ఆగ్నేయాస్త్రము, గుణంబుఁ గూరిచి = నారికి సంధించి, ఉగ్రుఁడై=భయంకరాకారుఁడై.

## తాత్పర్యము

శూలము విఱిగి పోఁగా శూరుఁడగు రాక్షసుఁడు చేతఁ బిడికిలి పట్టుకొని రామా నిలునిలుమని పైపడరాఁగా రామచంద్రమూర్తి చిఱునవ్వునవ్వి యాగ్నేయాస్త్రంబు వింట సంధించి భయంకరుఁడై.

కం. చిమ్మిన నా యమ్మును వేఁ,గమ్మునఁ జని యసురురమ్ము ♦ గాఁడిన క్షణమా
త్రమ్మున ధరణిం బడి కా,యమ్మును విడి యమునియాల ♦ యమ్మున కలిగెన్.

అర్థములు. ఆ యమ్ము = ఆ బాణము, ఉరమ్ము=ఉరమ్మునందు, సప్తమ్యర్థమునఁబ్రథమ, గాఁడినన్ =నాటఁగా, కాయమ్ము= దేహము,ఆలయమ్ము=ఇల్లు.

## తాత్పర్యము స్పష్టము.

తే. రామచంద్రునిచే నిట్లు ♦ రాక్షసుండు, పడినఁ జెలరేఁగి పొంగెఁ బ్లవంగతతులు
దశరథాత్మజబాణపా ♦ తంబుభీతి, యలమఁ బఱచెను హతశేష ♦ మసురసేన.

అర్థములు. దశరథాత్మజ = రామచంద్రమూర్తియొక్క, బాణపాతము= బాణములు పడుటవలన, బాణములు తమమీఁదఁ బడునను, భీతి = భయము, అలమన్ = ఆక్రమింపఁగా, పఱచెను = పరువెత్తెను, హతశేషము = చావఁగా మిగిలినది.

## —♦ ౮౦-వ సర్గము. ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధమునకుఁ బోవుట ♦—

కం. పటుబలుఁ డగు మకరాక్షుం, డిటు హతుఁ డగు టాలకించి ♦ యింద్రారి క్రుధన్
బటపట రదములు కొఱుకుచుఁ, గుటిలచరిత్రునకుఁ దనదు ♦ కొడుకున కనియెన్.

అర్థములు. పటుబలుఁడు=దృఢమైన పరాక్రమముగలవాఁడు, ఇంద్రారి= రావణుఁడు, కుటిల చరిత్రునకున్ = మోసపు నడవడిగల వానికి, దీనివలన నీకఁ గేవల ధర్మప్రధానమైన యుద్ధమందు జయము రాదని నిశ్చయించుకొనెనని భావము. రదములు=దంతములు.

## తాత్పర్యము స్పష్టము.

ఉ. వీరుఁడ యింద్రజీ! యధిక ♦ వీరుల రాము సుమిత్రపుత్రకున్
బోర వధింపు మెట్లయినఁ ♦ బొంచియొ తోఁచియొ మాయ మించియో

ధారయ నీవె యింతకు స♦మర్థుఁడవుం బ్రబలుండ వల్లబృం
దారకనాయకున్ సమర♦ధాత్రిజయింపవె వాల్మగండ వై. ౧౮౯౧

అర్థములు. బృందారక నాయకున్ = దేవతాపతిని, వాల్మగండవై = శూరుఁడవై, వీరుఁడా, అధిక వీరుల రామలక్ష్మణులన్—అనుటచే నీకంటె వారు వీరులని సూచన.

తాత్పర్యము

వీరా! యింద్రజిత్తా! మిగుల వీరులగు రామలక్ష్మణులను యుద్ధమునందు నే విధముగనైన సరియు చంపుము. ఎదురుగా నిలువఁబడి యుద్ధము చేయుటకు నీకంటె వా రధికవీరులు. కావునఁ బొంచియైనను, కానవచ్చియైనను, మాయ ప్రయోగించియైనను జంపుము. ఇంత కార్యముచేయుటకు నీవే సమర్థుఁడవు, బలముగలవాఁడవు నీవేకదా! శూరుఁడవై యింద్రుని రణమునఁ జయించితివి.

కం. మానవు లన లెక్కయె పు,త్రా! నీ మహిమంబునకును ♦ దరలు మటన్నన్
గా నిమ్మని సెలవుం గొని, తా నేగెన్ యజ్ఞభూమి ♦ దహనున్ వేల్వన్.

అర్థములు. తరలుము=పొమ్ము, కానిమ్ము=అట్టులే చేసెదను మానవులు నీకు లక్ష్యమా? చూచినంత మాత్రముననే జయింపఁ గలవు.

తాత్పర్యము స్పష్టము.

తే. అరుణవర్ణంబు లైన మూ♦ర్ధాంబరములు, చేతఁ దాలిచి భయమున♦శీఘ్రగతిని
బాఱుదెంచిరి రాక్షస♦వనిత లపుడు, దేవపతిశాత్రవుఁడు వేల్పు♦దేశమునకు.

అర్థములు. అరుణవర్ణంబులు = ఎఱ్ఱని రంగుగలవి, మూర్ధాంబరములు= తలగుడ్డలు — ఋత్విజుఁడగు నింద్రజిత్తు ధరించుటకు, వేల్పు = హోమముచేయు, దీనివలన యజ్ఞముచేయు ప్రదేశమునకుఁబోయి యచ్చుండి యింటికిఁ జెప్పిపంపఁగా నాఁడువారు వస్త్రములు దెచ్చిరని భావము. భయమునన్ = సమయము మించి పోవునేమో యను భయముచే, 'లోహితోష్ణీషా ఋత్విజః ప్రచరంతి' యని శ్రుతి. అభిచారహోమముచేయువా రెఱ్ఱని తలపాగలు ధరింపవలయును.

సీ. లాజలు గంధమా♦ల్యంబులచే నొప్ప, హవిచేత నర్చించి ♦ యగ్నిహోత్రు
శరపత్రములుగాఁగ♦శస్త్రముల్ ఘటియించి, తాండ్రశాఖల సమి♦ధలుగఁ జేసి
యెఱ్ఱవస్త్రము లూని♦యినుపస్రువముఁ బూని, శరపత్రమధ్య దే♦శంబునందు
మిమ్మటంబుగ నల్ల♦మేఁకను బలియీయఁ, బొగలేనిమంటలఁ♦బొలుపుమీఱి
ఆ. విజయలక్షణముల ♦ వెలికి సూచించుచు, సప్రదక్షిణముగ ♦ జ్వాల లెగయఁ
బసిఁడినగలుదాల్చి♦ప్రత్యక్షముగరోహి,తాశ్వుఁడెగయుఁదెంచి♦హవిగ్రహించె.

అర్థములు. శరపత్రములు=గుండ్రజాతి దర్భ, 'గుంద్రస్తే జనకః శరః' అమరము. కాకివెదురుకనుము. (చూడు ౧౭౬౦ వ పద్యము)

సీ. దశకంఠసూనుఁ డంతర్ధానగతమును, వాజిచతుష్టయీ • రాజితంబుఁ
గనకపరిచ్ఛదం • బనలతేజంబును, జంద్రార్ధచంద్ర ని • శాతవిశిఖ
సంపూర్ణమును మృగ • సంయుతంబును నగు,రథ మధిరోహించి • రమ్యశాత
కుంభకంబువు నయి • జృంభితపావక, తులిత మై వైడూర్య • కలిత మైన
తే. ధ్వజము మెఱయంగ సూర్యక • ల్పంబు బ్రహ్మ,శరము రక్షింప
దుస్సాధ • సత్త్వుఁ డగుచు
బురము వెలువడి రాక్షస • పూగములకుఁ,బలుకుచిట్లనినిజబాహు • కటము తెలియ.

అర్థములు. అంతర్ధానగతము = కానరాక పోవునది, వాజి చతుష్టయీ రాజితంబు=నాలుగు గుఱ్ఱములచేఁ బ్రకాశించునది, కనకపరిచ్ఛదంబు=బంగారు కప్పును వస్త్రము గలది, అనలతేజంబును=అగ్నిహోత్రునివంటి కాంతిగల,చంద్ర=పూర్ణచంద్రుని, అర్ధచంద్ర=సగము చంద్రునివంటి, నిశాత = పదునైన, విశిఖ = బాణములచే, సంపూర్ణము=నిండినది, మృగసంయుతంబును=మృగాకారము గల ప్రతిమలు గలది, అధిరోహించి = ఎక్కి, రమ్య=మనోహరమైన, శాతకుంభ = బంగారు, కంబువు=వలయము,'కంబుర్నా వలయే శంఖే'అమరము. వలయము=కడియము, జృంభిత=విజృంభించిన, అనఁగా చక్కఁగా మండుచున్న,పావకతులితమై=అగ్నిహోత్రముతో సమానమై, వైడూర్యకలితము=వైడూర్యముతోఁ గూడినది, సూర్యకల్పంబు=సూర్యునితో సమానమైనది, దుస్సాధ సత్త్వుఁడు=జయింపరాని బలము గలవాఁడు, పూగములకున్=సమూహమునకు

### తాత్పర్యము

ఇంద్రజిత్తు అదృశ్యముకాఁగల శక్తిగలదియు నాలుగు గుఱ్ఱములు గలదియు బంగారు కప్పు వస్త్రము గలదియు అగ్నివలెఁ బ్రకాశించునదియు చంద్రునివంటి అర్ధచంద్రునివంటి బాణములచే నిండినదియు మృగముల యాకారముగల ప్రతిమలు గలదియునగు తేరెక్కి అందమైన బంగారు వలయములు గలిగి, మండుచున్న యగ్నిహోత్రునితో సమానమైన వైడూర్యములతోఁ గూడిన ధ్వజము మెఱయఁగా సూర్యునితో సమానమైన బ్రహ్మశరము తన్ను రక్షింపఁగా జయింపరాని బలము గలవాఁడై లంకవిడిచి రాక్షససమూహములకు తన భుజబలము తెలియునట్లు లిట్లుల పలికెను.

## —• ఇంద్రజి త్తదృశ్యుండై కపిసేనల రామలక్ష్మణుల నొప్పించుట •—

చ. అనృతమునీంద్ర వేషకుల • నాజి వధించి జయం బొసంగెదన్
జనకునకున్, ధరాతలము • సత్యము నేఁడ యరామలక్ష్మణం
బును నకపిప్రకాండ మగుఁ • బూర్ణముదంబు సురారినేతకున్
బొనరు నటంచు దదృశ్యుఁ డయి • పోరికి నేగె జయాభిలాషి యై. ౧౮౯

అర్థములు. అనృతమునీంద్ర వేషకులన్ = అసత్యపు మునుల వేషము వేసిన వారిని, ఇతరులను మోసము చేయుటకై మునుల వేషము వేసిరికాని వీరు

నిజమైన మునులుగారు, నిజమైన మునులైన నిల్లు యుద్ధముచేయుదురా? ఇంతటఁ జంపుదురా? జయంబు = ప్రాణముతో మరల లంకఁ ప్రవేశించుటే జయము. అరామలక్ష్మణము = రామలక్ష్మణులు లేనిది, అకపిప్రకాండము=వానర వీరులు లేనిది. వత్ సమానము, అదృశ్యుఁడయి=కానరానివాఁడై, జయాభిలాషియై= జయమందుఁ గోరిక గలవాఁడై.

## తాత్పర్యము

జనముల మోసగింప మునుల వేషములు ధరించిన వారిని రామలక్ష్మణులను యుద్ధమందుఁ జంపి తండ్రికి జయము గలిగించెదను. ఈ దినము భూమియందు రామలక్ష్మణు లనువారు కపివీరు లనువారు లేకుండఁ జేసెదను. రాక్షసరాజునకు నిండు సంతోషము కలిగించెదను, అని చెప్పి కానరానివాఁడై యుద్ధమునకు జయకాంక్షతోఁ బోయెను.

చ. దశముఖచోదితుం డతుల•దారుణరోషుఁడు దివ్యచాపస
 ద్విశిఖధరుండు గాంచె నవ•ధీరితనై ఋతయోధులన్ రుషా
 వశులఁ ద్రిశీర్ష పన్నగవి•భాప్రవిభాసులఁ గాంచి వీరహో
 దశరథపుత్రకుల్ ప్లవగ•దండసమావృతు లంచు నెంచుచున్. ౧౮౯౭

అర్థములు. దశముఖ చోదితుఁడు=రావణునిచే నాజ్ఞాపింపఁ బడినవాఁడు, దారుణరోషుఁడు=భయంకరమైనకోపము గలవాఁడు, దివ్యచాపసద్విశిఖధరుఁడు= దేవదత్తమగు విల్లు బాణము ధరించినవాఁడు, అవధీరతనై ఋతయోధులన్=తిరస్కరింపఁబడిన రాక్షసయుద్ధభటులు గలవారిని,రుషావశులన్=కోపముచే దేహము తెలియని వారిని, కోపము గలవారిని, త్రిశీర్ష పన్నగ = మూఁడు తలల పాముల యొక్క, విభా=కాంతిచే, ప్రవిభాసులన్=మిగులఁ బ్రకాశించు వారిని, అహో = ఆశ్చర్యార్థకము, ప్లవగదండ=వానరసేనతో, దండో స్త్రీ దమ హింసా సేనా లగు డేషు శాసనేరాజ్ఞాం దండే మానవి శేషే. వ్యూహే రవిపారిపార్శ్వగే పుంసి॥నానా॥ర. దండశబ్దభవము దండు. దండశబ్దమునకు సమూహ మనియు నర్థము గలదు. దండోప దండ మనుదానినే యపశబ్దముగ తండోపతండము లని కొందఱనెదరు.

## తాత్పర్యము

రావణుచే నాజ్ఞాపింపఁబడినవాఁడు మిగుల భయంకరమైన కోపము గల వాఁడు దేవతాసంబంధమైన విల్లు బాణములు గలవాఁడు రాక్షస భటులను తిరస్కరించిన వారును కోపము గలవారును రెండంబుల పొదు లుండుటచే మూఁడు తలల పాములవలె నుండువారును నగువారిని జూచి, వానరసేనతో నుండువీరే కదా రామలక్ష్మణులని తలఁచినవాఁడై.

ఉ. చాపము నెక్కు వెట్టి శర•సంతతి వారలమీఁద ఘోరధా
 రాపతనంబుభంగిని బ•రంపరగాఁ గురియింప బ్రాతలున్

రోషపరీతగాత్రు లయి ♦ రోషమునన్ వినువీధి మార్గణ
వ్యాపితముం బొనర్ప నొక ♦ బాణమ యేనియుఁ దాఁక దింద్రజిన్. ౧౮౯౮

అర్థములు. ఘోరధారా పతనంబు భంగిని=భయంకరమైన వర్షధారలు పడుటవలె, పరంపరగా=ఒకదాని వెంట నొకటి విరామము లేకుండ, రోష పరీత గాత్రులయి=కోపముచేఁ జుట్టఁబడిన దేహముగలవారై, మార్గణ వ్యాపితమున్=బాణములచే వ్యాపింపఁబడినది.

తాత్పర్యము

విల్లెక్కుపెట్టి బాణసమూహమును జడివాన కురిసినట్లు లొక్కధారగా తెఱపి లేకుండ వేయఁగా రామలక్ష్మణులు కోపించి బాణములచే నాకాశము నించిరిగాని యొక బాణమైనను నింద్రజిత్తునకుఁ దగులలేదు.

సీ. ధూమాంధకారంబు ♦ భీమంబుగాఁ జేసి, యభ్రంబు మూడమం ♦ చలమినట్టు
లొనరించి శరవర్ష ♦ ముగ్రతఁ గురియంగ, గుణలతాఘోషంబొ ♦ ఖురరవంబొ
నేమిధ్వనియొ మఱి ♦ యేమియు వినరాదు, బాణపాతం బొండ ♦ ప్రబలుచుండె
రావణి యెమకరేగి ♦ రామలక్ష్మణుల మేనులు ముంచె నారాచ ♦ ములను వారు
తే. హన్యమానశరీరులై ♦ యధికవృష్టిఁ, దాడితంబైన గిరులచం ♦ దంబు దాల్చి
వానిశరములు వచ్చెడి ♦ వలను చూచి, కఱకుములుకులు చిమ్మిరి ♦ కడఁక మెఱసి.

అర్థములు. రామలక్ష్మణుల బాణములు వానికిఁ దవులక పోవుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు. ధూమాంధకారంబు=ధూమమువలనఁ గలిగిన చీఁకటి. వాఁడు తన మాయాశక్తి వలనఁ బొగ దట్టముగాఁ గ్రమ్ముకొనఁజేయుటచేఁ జీఁకటిలో నుండువాఁడు వెలుతురులో నుండువానికిఁ గానరానట్టు లింద్రజిత్తు రామలక్ష్మణులకుఁ గానరాకుండెను. చీఁకటిలో నుండువానికి వెలుతురులో నుండువాఁడు కానవచ్చునుగదా. అట్టులే రామలక్ష్మణు లింద్రజిత్తునకుఁ గానవచ్చుచుండిరి. అభ్రంబు=ఆకాశము, మూడమంచు = దట్టమైన మంచు, శరవర్షము=బాణములవాన, గుణలతాఘోషంబొ = తీఁగవంటి యల్లెత్రాటిధ్వనిగాని, ఖురరవంబొ=గుఱ్ఱముల గిట్టలధ్వనిగాని, నేమిస్వనమొ=రథచక్రముల ధ్వనిగాని, నారాచములను=బాణములచే, హన్యమాన శరీరులై = కొట్టఁబడుచున్న దేహములు గలవారై.

తాత్పర్యము

పొగగ్రమ్మినట్లు గాఢాంధకారంబు కల్పించి యాకాశము దట్టపుమంచు గ్రమ్మినట్లుచేసి బాణవర్షము గురియింపఁగా నల్లెత్రాటి మ్రోఁతగాని గుఱ్ఱముల గిట్టలధ్వనిగాని రథచక్రముల ధ్వనికాని యేదియు చప్పుడు వినరాదయ్యెను. చప్పుడు వినవచ్చెనేని శబ్దవేధులచే వానిని రామలక్ష్మణు లప్పుడే పడఁగొట్టి యుందురు. బాణములు పడుటమాత్రమే తెలియుచుండెను. రామలక్ష్మణులకు నెమునుగాఁబోయి

వారి దేహములను బాణములచే ముంచెను. వారిట్లు కొట్టఁబడిన వారయ్యు వానచేఁ గొట్టఁబడిన కొండలవలెనై దానిని సహించి చలింపక వాని బాణములు వచ్చు మార్గమునుబట్టి వాని యునికి యూహించి వాఁడి బాణములు చిమ్మిరి.

మ. అతఁ డా బాణపరంపరం దరలి బా • ధాయుక్తుఁడై బాణసం
తతులం బైఁ గురియుంగ దాశరథులు • న్వానిన్ మహాస్త్రంబులన్
శతధాభిన్నముఁ జేయుచుం బెనఁగ ర • క్షస్సత్తముం డుద్ధతిన్
శితనారాచము లుగ్రవేగమున వై • చెన్ దేహముల్ ప్రీలఁగన్. ౧౯౦౦

అర్థములు. తరలి = కంపించి, శతధాభిన్నమున్ = నూఱు తునుకలుగా, ప్రీలఁగన్ = చీలిపోవునట్లు.

తాత్పర్యము

వాఁ డా బాణపరంపరలకు నణఁకి బాధగలవాఁడై బాణముల సమూహములను మీఁదఁ గురియింపఁగా రామలక్ష్మణులు వానిని మహాస్త్రములచే నూఱు తునుకలు చేయుచు యుద్ధము చేయఁగా నింద్రజిత్తు వాఁడిములుకులను వారి దేహము చీలునట్లు వేసెను.

ఉ. పూచిన కింశుకంబు లనఁ • బొల్చుచు రాఘవు లుండ నేరి కా
నీచుని రూపమో ధనువో • నిల్చిన పోయెడు నట్టి చొప్పొ నా
రాచములో కనుంగొనఁ ద • రంబె టుగా, దిటు వాఁడు మాయచే
నేచిన నూర్లు వేలుగ మ • హిం బడె వానరసంఘ మెల్లెడన్. ౧౯౦౧

అర్థములు. కింశుకంబులు = మోదుగుచెట్లు, తరము = సాధ్యము, ఏచినన్ = విజృంభింపఁగా.

తాత్పర్యము

పూచిన మోదుగులవలెనై రామలక్ష్మణు లుండఁగా నా నీచుని రూపము గాని విల్లుగాని వాఁడు పోవు మార్గముగాని బాణములు విడుచుటగాని చూడ నెవరికి సాధ్యముగాలేదు. ఇట్లు వాఁడు తనశక్తిచే విజృంభింపఁగా వానరులు నూర్లు వేలుగ నేలఁబడిరి.

ఉ. ఆకుటిలాత్మచందమున • కాగ్రహ మూని సుమిత్రపట్టి సీ
తాకమనున్ వచించె విధి • దారుణబాణముచే నరాక్షసా
నీకముఁ జేసెదన్ జగము • నీకడి సమ్మతి మేని యన్న న
స్తోకదయాపరుండు పరి • శుద్ధమనస్కుఁడు తమ్ము నిట్లనున్. ౧౯౦౨

అర్థములు. కుటిలాత్మచందమునకున్ = వంచనతోఁ గూడిన మనస్సుగల వాని విధమునకు, సీతాకమనున్ = శ్రీరాముని, విధి = బ్రహ్మకు సంబంధించిన, అరాక్షసానీకమున్ = రాక్షస సమూహ మనునది లేకుండ, అస్తోకదయాపరుండు = విశేష దయగలవాఁడు, విశుద్ధమనస్కుఁడు = నిర్మలమైన మనస్సు గలవాఁడు.

### తాత్పర్యము

ఆ వంచకుని విధముఁ జూచి లక్ష్మణుఁడు కోపించి అన్నా! నీవు సమ్మతించెద వేని బ్రహ్మాస్త్రము వేసి ప్రపంచమున రాక్షసు లనువారు లేకుండఁ జేసెద ననిన విశేషదయ గలవాఁడును నిర్మలమైన మనస్సు గలవాఁ డగుటచే రామచంద్ర మూర్తి తమ్మునితో నిట్లనియె.

ఉ. ఒక్కని కారణంబునను ♦ నుర్విఁ గలట్టి సమస్త దైత్యులన్
ప్రసుప్తుఁగఁ జేత ధర్మ మొకో ♦ సాక్కినవాని నయుధ్యమానిఁ దా
నుక్కటిపాఱువానిఁ గర ♦ యుగ్మము మోడ్చిన దాఁగి యున్న నా
దిక్కుఁక నీవ యన్నను వ ♦ ధింపఁగ ధర్మముగాదు శాత్రవున్. ౧౯౦౩

అర్థములు. ప్రసుప్తనవానిన్ = ప్రమత్తుని, దేహముమీఁద స్మృతి లేని వానిని, అయుధ్యమానిన్ = యుద్ధము చేయని వానిని, ఉక్కటి = బలము చెడి, పాఱువానిని = పరువెత్తువానిని, కరయుగ్మము మోడ్చిన వానిని = రెండు చేతులు జోడించి నమస్కరించిన వానిని, దాఁగియున్నన్ = చాటుగ నున్నను, నా దిక్కుఁక నీవయన్నన్ = శరణాగతుని, శాత్రవున్ = పగవానిని.

### తాత్పర్యము

లక్ష్మణా! యెవఁడో యొక్కఁడు మన కపరాధము చేసెనని నిరపరాధులుగా నుండు రాక్షసుల నెల్లఁ జంపుట ధర్మమా? ప్రమత్తుని, యుద్ధప్రయత్నమందు లేని వానిని, బలము చెడి పరుగెత్తి పోవువానిని, నమస్కరించినవానిని, నీవే నాకు దిక్కని శరణాగతుఁడైన వానిని శత్రువునైనను జంపరాదు. నీవు బ్రహ్మాస్త్రము సర్వరాక్షసుల నుద్దేశించి ప్రయోగించితి వేని శత్రువులుగాని రాక్షసులను, బాలురను, వృద్ధులను, నిద్దురపోవువారిని, త్రావి మత్తెక్కియున్నవారిని, ఊరక యిండ్లయం దున్నవారిని నెందఱినో వధించునుగదా. అది ధర్మమా? కావున నట్లు చేయకుము.

ఉ. వీని వధించు నవ్వెరవు ♦ వేగ ఘటింతము, వీఁడు మాయచేఁ
గానఁగరాఁ డదెట్లయినఁ ♦ గానఁగఁ జేసిన యంతలోననే
వానరులే వధించెదరు ♦ వాఁడు రసాతల మేగినన్ దివం
బేని గమించినన్ దునుమ ♦ నే నిదె పూనెదఁ జక్కఁ జూడుమీ. ౧౯౦౪

అర్థములు. వెరవు = ఉపాయము, దివము = స్వర్గము.

### తాత్పర్యము

సర్వసంహార కార్యమునకుఁబూనక వీని మాత్రము చంపు నుపాయము చేయుదము. వీఁడు మాయచేఁగదా నింతకార్యము చేయుచున్నాఁడు. మన మా మాయను చెడఁగొట్టితిమేని తరువాత మనతోఁబని లేక వానరులే వీనిని జంపఁగలరు. అంతమాత్రముకూడఁ బనిలేదు. వీఁ డధోలోకములలోఁ బాతాళమునకు బోయినను

నెగసి యూర్ధ్వలోకములందు స్వర్గమేగినను వీనిని జంపెదను. నీవు చూచుచుండుము. సహింపవలయునని సహించితిమి కావున వీఁడిన్ని యాటలాడఁ గలిగెను. ఇఁకఁ జూడుము.

కం. మామకశరదగ్ధుండై, భూమిం బడుఁ జూడు మంచుఁ ♦ బురుషోత్తముఁ డు
ద్దామరుషామతి వికసిత, తామరసేక్షణుఁడు చూచెఁ ♦ దారాపథమున్.

అర్థములు. మామక శరదగ్ధుండై = నా బాణములచేఁ గాలినవాఁడై, ఉద్దామ రుషామతి= అధికమైన కోపముగల మనస్సుగలవాఁడు, వికసిత తామర సేక్షణుఁడు = వికసించిన కమలములవంటి కన్నులు గలవాఁడు. ఇట్లు చెప్పుటచేఁ గోపముచేఁ గన్నులు పూర్ణముగా పెద్దవి చేసెనని భావము. తారాపథమున్ = ఆకాశమార్గమును.

## తాత్పర్యము

వీఁడు నా బాణములచేఁ గాలి నేలఁబడును జూడుము అని పురుషశ్రేష్ఠుఁడు రామచంద్రమూర్తి కోపముచే వికసించిన తామరలవలెఁ గన్నులు పెద్దవిచేసి యాకాశమును జూచెను.

## —♦ { ౮౧-వ సర్గము· ఇంద్రజిత్తు మాయాసీతతో హనుమంతుఁ డున్న దిక్కున కేగుట } ♦—

కం. యోద్ధమణి యైనరఘుపతి, బుద్ధి యెఱిఁగి పంక్తికంఠు ♦ పుత్త్రుఁడు మరలెన్
యుద్ధంబుమాని పురికిని, గ్రుద్ధుఁడు రాఘవుఁడటంచుఁ గోఁ అలెడికీలితిన్. ౧౯౦౬

అర్థములు. యోద్ధమణి = యోద్ధలందు శ్రేష్ఠుఁడు, రూ - యోధ.

## తాత్పర్యము స్పష్టము.

కం. తనవారల మరణంబును, మనమునఁ దలపోసి పోసి ♦ మండుచుఁ గినుకన్
గనుఁగవ నిప్పుక లురలఁగ, మనుజాదుఁడు వచ్చెఁ బశ్చి♦మద్వారమునన్.

## తాత్పర్యము

తన పినతండ్రులు, తమ్ములు, చుట్టములు, మిత్రులు అందఱు చచ్చిన విషయము మనమునఁ దలఁచి తలఁచి కోపముచే మండుచు కన్నులందు నిప్పులు రాలఁగా రాక్షసుఁడు పశ్చిమద్వారమున వచ్చెను.

తాను యుద్ధము మానిన రామచంద్రమూర్తియు యుద్ధము మానుననియు, పశ్చిమద్వారము రామునకు దూరమగుటచేఁ దాను గానరాక యుండుననియు, సీతను జూచినవాఁడు హనుమంతుఁ డొక్కఁడే కావున నతఁడుండు పశ్చిమద్వారమున బయలుదేఱి వచ్చెను. రాముని యెదుటఁ జేసినా యచ్చటనే బలిపెట్టును. మఱి యెచ్చట నైనఁజేసిన తక్కిన వానరు లెవ్వరైనో చంపినాఁడని తలఁచి రామునకుఁజెప్పక యూరకుందురు కావున హనుమంతుఁడున్న ద్వారము నొద్దకువచ్చెను.

ఉ. వచ్చి సుయుద్ధ్యమానరఘు ♦ వర్యులపొం గణఁగింప నెంచి రూ
పచ్చుపడంగ మాయజన ♦ కాత్మజఁ గల్పన చేసి తేరిపై

ముచ్చిరుదాని నిల్పి పెను • మోహమునం గపిసేన ముంపఁగాఁ
త్రచ్చఱ వారికట్టెదురు • గాఁ జనియెన్ సతిఁ ద్రుంపఁ గోరుచున్. ౧౯౦౮

అర్థములు. సుయుధ్యమాన=చక్కఁగా యుద్ధము చేయుచున్న, పొంగు = ఉద్రేకము, ముచ్చిరుదానిన్=శోకించు దానిని, త్రచ్చఱన్=శీఘ్రముగా.

తాత్పర్యము

ఇట్లు వచ్చి చక్కఁగా యుద్ధప్రయత్నము నందున్న రామలక్ష్మణుల యుద్రేకమణఁచి యుద్ధము చేయుకుండునట్లు చేయనెంచి సీత యేవిధముగ నున్నదో యట్టిదే యగు సీతరూపమును తన శక్తిచేఁ గల్పించి యేడ్చుచున్న యా రూపమును తన తేరిమీఁద నుంచుకొని కపిసేనలను విస్తారమోహములో ముంచుటకై శీఘ్రముగ వానరుల కట్టెదురుగా సీతను జంపఁగోరి పోయెను.

కం. పురనిర్గతుఁ గని కానన, చరు లందరు నొక్కపెట్ట • సాలధరాంచ
త్కరులై వాయుభవపుర, స్సరులై పడిఁ జనిరి వాని • జంపెడియాసన్.

అర్థములు. పురనిర్గతున్=పురమునుండి బయలు వెడలిన వానిని, కాననచరులు = వానరులు, ఒక్కపెట్ట = ఒక్కసారిగ, సాలధరాంచత్కరులై = చెట్లు కొండలు వీనిచే నొప్పు చేతులు గలవారై, వాయుభవపురస్సరులై=హనుమంతుని ముందుగా నుంచుకొన్నవారై.

తాత్పర్యము

వాఁడు పురము వెడలి రాఁగనే వానరులందఱొకసారిగ జేతులందు, జెట్లు కొండలు తీసికొనినవారై హనుమంతు ముందుగా నుంచుకొని వానిని జంపు కోరికతో శీఘ్రముగాఁ బోయిరి

చ. హనుమయుఁ గేలఁ బ్రాల మహి • తాద్రి యొకం డెదురేగి స్యందనం
బునఁ గనె మాసియున్న యొక • పుట్టముతోఁ బెనఁగొన్న వేణితోఁ
గనఁగవఁ గాఱు నశ్రువుల • కాల్వలతో నుపవాసకారణం
బునఁ గృశియించి యున్న మెయి•పోణిమితో గతభూషణాళితోన్. ౧౯౧౦

తాత్పర్యము

హనుమంతుఁడు చేత నొక పెద్ద పర్వతము తీసికొని యెదురుగాఁబోయి తేరియందు మాసిన యొంటి చీరతో పెనవేసికొన్న జడతో నీళ్ళు కాలువలుగాఁ గాఱు కన్నులతో పస్తులుండుటచే చిక్కిన దేహముతో వదలినయాభరణములతో.

కం. దీన యయి ధూళి గ్రుంగిన, మేనం జెలు వేదియున్న • మెలఁతుకను మరు
త్సూనుఁడు మూర్తము గనుఁగొని, జానకియే యీమె యనుచు•సంతాపించెన్.

అర్థములు. గ్రుంగిన = మునిఁగిన చెలువేది = సౌందర్యము తొలఁగి మూర్తము=కొంచెము సేపు.

తా త్ప ర్య ము

దుఃఖించుచు నేల దుమ్ముతో మునిఁగిన దేహముతో నందము చెడి యున్న స్త్రీని హనుమంతుఁడు కొంచెము సేపు చూచి యామె సీతయే యని సంకటపడెను.

కం. కొన్ని దినంబులముందఱ, గన్నాతఁడుగాన సీత • గా నెఱుఁగుట నా
పన్న యయి వానిరథమున, నున్నం గని హనుమహృదయ•ముల్లల నుడికెన్.

అర్థములు. కన్నాతఁడు = చూచినవాఁడు, ఆపన్నయయి = కీడు దశ నొందినదై, ఉల్లలనుడికెన్=నీళ్లుకుతకుతగా నున్నప్పుడు కళపళ ధ్వనితో నుడికి నట్లు లుడికెను.

తా త్ప ర్య ము స్పష్టము.

—• ఇంద్రజిత్తు మాయసీతఁ జంపఁ బూనుట •—

ఉ. ఏమి యొనర్చునొక్కొ యితఁ • డీసతి నీ మెయిఁ బట్టి తేరఁగా
నేమికొ హేతు వంచుఁ బ్లవ • గేంద్రుఁడు వానరసైన్య యుక్తుఁడై
భీమజవంబునం బఱవ • వీరుఁడు శక్రజి వారిఁ గాంచి దు
ర్దామరుషావశాత్ముఁ డయి • గ్రచ్చఱ ఖడ్గము దూసి యెత్తుచున్. ౯౧౩

అర్థములు. దుర్దామ రుషావశాత్ముఁడు = వారింపరాని కోపముచే బర వశమైన మనస్సు గలవాఁడై, గ్రచ్చఱన్=శీఘ్రముగ.

తా త్ప ర్య ము

వీఁ డీమెను నేమి చేయునో, ఏల వీఁ డీమె నిచ్చటికి బట్టి తెచ్చెనో యని హనుమంతుఁడు సేనాసమేతుఁడై యేది యైనఁ గీడు చేయుటకు ముందే యీ యామెను రక్షింప వలయునని త్వరగా రాక్షసుని మీఁదికిఁ బోఁగా వీరుఁ డగు నింద్రజిత్తు వారు వచ్చుట చూచి మిగులఁ గోపముచేఁ బరవశుఁ డయి తటాలున ఖడ్గము దూసి పైకెత్తి.

కం. చేతఁ గొని ఖలుఁడు మాయా, సీతాకేశములు రామ • శ్రీరామా! యం
చా తరుణి యేడ్వ శిరమున్, వే తఱుగఁగనున్న దైత్య • వీరునితోడన్.

అర్థములు. కేశములు = తల వెండ్రుకలు, తఱుగఁగ=ఖండింప, ఉన్న= పూనిన, మాయ=పరులను వ్యామోహింపఁ జేయు శక్తికి మాయ యని పేరు.

తా త్ప ర్య ము

ఆ మాయా సీతాదేవి తల వెండ్రుకలు పట్టుకొని ఆమె రామా రామా యని యఱచు చుండఁగా శీఘ్రముగా తల నఱకుటకుఁ బ్రయత్నించు చున్న రాక్షసునితో.

చ. కనుఁగవ బాష్పపూరములు • గ్రమ్మఁగఁ జారుశరీర రామచం
ద్రుని ప్రియురాలు దేవెరి మ • నోజ్ఞ చరిత్రను గాంచు చిట్లనుం

గినుకను మూర్ఖ! యవ్వసతి • కేశకలాపము నాత్మనాశమున్
గన నిటు లేని పట్టితివి • కావలుఁడా! దురితాత్మ! శుంఠుఁడా! ౧౯౧౫

అర్థములు. కేశకలాపము = తల వెండ్రుకల సమూహము.

తాత్పర్యము

రెండు కన్నులనుండి నీళ్ళు కాఱుచుండఁగా నందమైన శరీరము గలదియు రామచంద్రమూర్తికిఁ బ్రియురాలై నదియు పట్టపురాణి యైనదియు, మనోహరమైన నడవడి గలదియు నగు దానిని జూచి కోపముతో హనుమంతుఁ డిట్లనెను. ఓరీ! పాపకార్యములు చేయువాఁడా! పాపపు మనస్సు గలవాఁడా! శుంఠా! బుద్ధిలేనివాఁడా! ఏలరా నీవు నాశమై పోవుటకు పరస్త్రీ తల వెండ్రుకలు పట్టితివి.

ఉ. మానితమైన బ్రహ్మఋషి • మండనవంశమునందు రాక్షసీ
యోనిని సంభవించితివి • రోరి దురాత్మకుఁడ! కాన నీవు పా
పీ! నిరయాధ్వగామి యగు • నిట్టిమహాకలుష ప్రవర్తనం
బూనితి క్షుద్రశీల! ఖల! యుగ్రచరిత్ర! దయావిహీనుఁడా! ౧౯౧౬

తాత్పర్యము

ఓరీ! నీ తండ్రివంశము గౌరవింపఁ దగిన బ్రహ్మఋషి వంశమైనను నీవు రాక్షసస్త్రీ యోనియందు జన్మించితివి కావున క్షేత్రమాహాత్మ్యమువలన నీకట్టి గుణములే పట్టుపడెను. కావుననే యోరి పాపాత్ముఁడా! నరకమార్గమునకుఁ దీసికొనిపోవు నిట్టి మహాపాపకార్యము చేయఁ బూనితివి. నీచస్వభావుఁడా! దుష్టుఁడా! క్రూరచరిత్రుఁడా! దయలేనివాఁడా!

ఉ. ఏమిర నీమదిం గరుణ • యేని జుగుప్సయేని దోఁపదా
భామినిఁ జంపఁ బూనెదవు • పాపము! రాజ్యము నిల్లు వాకిలిన్
రామునిసన్నిధిన్ విడిచి • రాడ్పడు చీయెడ నేమితప్పు రా
యీ మిథిలేంద్రుకన్య ఘటి • యించెను నీ కిటు నామెఁ ద్రుంపఁగన్. ౧౯౧౭

అర్థములు. జుగుప్స = రోఁత రాడ్పడు = బాధపడు.

తాత్పర్యము

ఏమిరా, అయ్యో పాపము, ఆఁడుదే. ఎట్లు చంపుదునని దయదోఁప లేదుగా, దయ లేకున్నఁబోనీ, ప్రతిక్రియ చేసితన్నుఁ దాను రక్షించుకొనఁజాలని యాఁడుదానిని జంపుట నీచమని లోకమంతయు భావించియుండగా నలువురు ఛీకొట్టు నింతటి రోఁత కార్యము నెట్లు చేయుదునని యైన నీకుఁ దోప లేదు గదా! ఈమె నాకపరాధము చేసినది దానివలనఁ జంపెద నందువా! రాజ్యము వదలినది. దానివలన రాజ్యములోని ప్రజల వలన నీకు అపరాధము కలిగించినది కాదు. ఇల్లు వాకిలి వదలినది. దానివలన బంధువులచే నీకు నపకారము కలిగించినది కాదు. రాముని సన్నిధిని విడచినది. ఈమె చెప్పి రామునిచే నీకపరాధము చేయవలెను. ఆమెను మీఁరే సకల బాధలు పెట్టుచుండ

సహించిపడియున్నది. పరమయోగిజ్ఞానియని పేరెన్నికగన్న మహాత్మునికూఁతురు. ఇట్టి గొప్ప వంశమునఁ బుట్టినది. అపరాధ మనునది యెట్టిదో యీమె యెఱుఁగనే యెఱుఁగదు. అట్టిది నీ కేమి తప్పు చేసెనని యీమెను జంపఁ బూనితివిరా!

కం. నీవే సతిఁ జంపితివా, జీవింపవు సుమ్ము నిజము • చిరముగ నిను నే
విధమున నేన్ ద్రుంచెద, రావణి! నాచేతఁ జిక్కి • క్రమ్మఱి చనుదే! ౧౯౧౮

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఓ లోకవధ్య! జడుఁడా!, స్త్రీలను వధియించు పాప • శీలురలోకం
బోలిఁ గనె దీవు సుమి ని, ర్మూలితకాయుండ వగుచు • రూక్షమనస్కా! ౧౯౧౯

అర్థములు. లోకవధ్య=జనులకందఱకు వధ్యుఁడవే యగువాఁడా! నిర్మూలితకాయుఁడవు = నాశముచేయఁబడిన దేహము గలవాఁడవు, రూక్షమనస్కా = కఠినమనస్సు గలవాఁడా.

తా త్ప ర్య ము

ఓరీ! జారుని చోరుని లోకములో నెవ్వరైనఁ జంపవచ్చును. అది పాప కార్యముకాదు. నీవో స్త్రీవధము చేయువాఁడవు. కావున వారికంటెఁ బాపుఁడవు. కావున నిన్ను విశేషించి యెవరైనఁ జంపవచ్చును. బుద్ధిలేనివాఁడా! యీ కార్యమువలనఁ బుణ్యము వచ్చునా? పాపము వచ్చునా? కీర్తివచ్చునా? అపకీర్తి వచ్చునా యని యాలోచించు బుద్ధిబలము లేనివాఁడవు కదా. పరుషమైన మనస్సు గల నీవు నాచే చంపఁబడి స్త్రీవధముచేయు పాపాత్ముల లోకమునకుఁ బోదువు గాని వీర స్వర్గమునకుఁ బోవు.

— • ఇంద్రజిత్తు మాయాసీతను వధించుట • —

చ. అని తనమీఁదవచ్చు నని • లాత్మజు సేనను గాంచి దాని నె
ల్లను శరవృష్టి ముంచుచుఁ బ • లాయితముం బొనరించి వాయు
పుత్రుని కిట్లు లాడు నీవు నల • తో యజమిత్రసుతుండు రాముఁ, డే
వనితకు నింత వచ్చితిరొ • వాయుజ! తత్సతి నీవ చూడఁగన్. ౧౯౨౦

అర్థములు. పలాయితమున్ = పరువెత్తిన దానిని.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పుచుఁ దనమీఁద వచ్చు హనుమంతుని సేనను గాంచి యీ సేనను బాణవర్షముచే ముంచి పరువెత్తి పోవునట్లుచేసి పోక నిలఁబడిన హనుమంతునితో నిట్లనియె. నీవు సుగ్రీవుఁడు రాముఁడు నే స్త్రీ నిమిత్త మిచ్చటికి వచ్చితిరో హనుమంతా యీ స్త్రీని నీ కన్నుల యెదుట నీవు చూచుచుండఁగనే.

చ. తునిమి, మఱిన్ రఘూత్తముల • ద్రుంచెద, నిన్ను దినేశపుత్రు నా
యనుచిత మార్గవర్తి ఖలుఁ • డైన విభీషణుఁ జెండి వైచెదన్

వనితను జంపరా దనుచు ♦ వానర! పల్కితి, శత్రుకోటికిన్
మనసులు నొచ్చు కార్యములు ♦ మానక చేత సమర్థమే యగున్. ౯౯. ౨౧

అర్థములు. అనుచిత మార్గవర్తి = స్వపక్షమువారిని విడిచి శత్రుపక్షము వారిలోఁ జేరుటచే నుచితముగాని నడవడిగల దుష్టుని, విభీషణుని, మఱిన్=ఆవల.

తాత్పర్యము

నఱికి యావల రామలక్ష్మణులను నిన్ను సుగ్రీవుని ననుచితమార్గమందు నడచు దుష్టుని విభీషణుని ఖండించెదను. ఓరి వానరుఁడా! యాఁడుదానిని జంపరా దంటివి. శత్రువులకు మనస్సులు నొచ్చుకార్య మేదైనను పాపాత్మకమైనను జేయుట తగిన పనియే యనుట యెఱుఁగవా?

కం. అని మాయామయి సీతను, దనచేతి కృపాణధారఁ ♦ దఱిగెను నది రో
దన మొనరింపఁగ జన్నిద,మున చొప్పున దాని తుండె♦ములు ధరఁ దొరఁగన్.

అర్థములు. మాయామయిని = వంచన శక్తిచేఁ జేయఁబడిన దానిని, జన్నిదమునచొప్పునన్=జందెము వేసికొను విధముగ, ఎడమ భుజముమీఁద నుండి కుడిప్రక్కగా నడుమువఱకు వచ్చునట్లు, తుండెములు=తునకలు.

తాత్పర్యము

అని పరులను మోహింపఁజేయు శక్తిచేఁ గల్పింపఁబడిన సీతను తన చేతి కత్తిచే జందెము వేసికొను మార్గమున నది యేడ్చుచుండఁగా నఱకెను. అది రెండు తునకలయి నేలఁబడెను.

ఉ. ఈవిధిఁ ద్రుంచి రామునయి ♦ నెత్తిన కోపము పేర్మి నీ ధరి
త్రీవరకన్యకం దునిమి♦తిన్ వృథమయ్యెను గాదె మీ శ్రమం
బో వనచారి! యంచు దివి ♦ నొత్తురవంబున నార్భటించినన్
లావఱి పాఱెఁ గ్రోఁతులబ♦లంబు ప్రహృష్టుని వైరిఁ జూచుచున్. ౯౯. ౨౩

అర్థములు. దివినొత్తు = ఆకాశమును దగులు, లావఱి = బలము చెడి, ప్రహృష్టుని = సంతోషించినవానిని.

తాత్పర్యము

ఈ ప్రకారము ఖండించి యోరీ యడవి ద్రిమ్మరీ? రాముని మీఁది కోపముచే నీ సీతను జంపితిని. మీ కష్టమంతయు వ్యర్థమయ్యెనుగదా యని యాకాశము తగులునట్లు గట్టిగా నఱవఁగా క్రోఁతులసేన బలము చెడి సంతోషించిన శత్రువును జూచుచుఁ బరువెత్తెను.

## —♦ ౮౨-వ సర్గము. హనుమంతుఁ డింద్రజిత్తుతోఁ బోరుట ♦—

కం. చెదరిన పాదరసం బన, నదరున నాస్యములు వెల్ల♦నై పఱచెడి యా
మొదకలఁ గని యిట్లనియె, న్మృదులోక్తుల వాయుపుత్రుఁ♦డెల్లరు వినఁగన్.

అర్థములు. అదరున = భయముచే, వెల్లనై = తెల్లనయి, మెదకలన్ = మందులను, మృదుశబ్ద భవము, మృదులోక్తులన్=మెత్తని మాటలతో.

తా త్ప ర్య ము

భయముచే ముఖములు తెల్లనై చెదరిన పాదరసమువలె నలుదిక్కులకు బరువెత్తుచున్న మందులఁజూచి యందఱు వినునట్లు మెత్తని మాటలతో నిట్లనియె.

ఉ. సాహసచిత్తులార! రణ•సంభ్రమతత్పరులార! సంగరో
త్సాహము నీటఁ బుచ్చి దృఢ•ధైర్యరమం బెనువెల్లిఁ గల్పి వీ
రాహవముం దొఱంగి పరు•లందఱు ఫక్కున నవ్వ దుర్యశం
బూహ యొనర్పలేక యిటు•లొప్పునె కాలికి బుద్ధిజెప్పఁగన్? ౧౯-౨౫

అర్థములు. రణసంభ్రమ తత్పరులార = యుద్ధమునందు వేగిరపాటుతోఁ బని చేయుటయందు నాశక్తిగలవారలారా! నీటఁబుచ్చి = వ్యర్థముచేసి, ధైర్యరమన్ = ధైర్యలక్ష్మిని, పెనువెల్లిన్ = పెద్ద యేటిలో, వీరాహవమున్=వీరుల యుద్ధమును, పరులు=శత్రువులు, దుర్యశంబు=అపకీర్తి, కాలికి బుద్ధిచెప్పఁగన్ = (ఇది లోకోక్తి) పరువెత్తఁగా, ఒప్పునె=తగునా?

తా త్ప ర్య ము

ఓ వానరులారా! మీ రింతవఱకు నెంతో తెంపుగల మనస్సు గలవారు. యుద్ధ మనిన వేగముగఁ బని చేయుటయందు నాసక్తి గలవారు. ఇట్టి మీరు యుద్ధమందలి యుత్సాహము వ్యర్థపఱచి అధికమైన ధైర్య సంపదను బెద్ద యేటిలో (సముద్రములో) కలిపి, వీరులకు యోగ్యమగు యుద్ధమును వదలి శత్రువులు పకాలున నవ్వ రాగలయపకీర్తి యాలోచింప లేక యీ ప్రకారము కాలి కొలఁది పరువెత్తుట తగునా?

ఉ. శూరిత యెందుఁ బోయె? మగ•చొప్పది మిమ్మెడఁబాసి పోయెనే?
భీరుత యెంచ నేర్చితిరి• పెంపుతలంపును లేక పోయెనే
కారియ మాని మార్మొగము•గైకొని పాఱఁగ? నంతభీతియే?
వీరవరేణ్యులార! నను•వెన్కొనుఁ డేఁ జనువాఁడ ముంగలన్. ౧౯-౨౬

అర్థములు. మగచొప్పు = మగవారి విధము, పురుషత్వము, భీరుత = పిఱికితనము, పెంపుతలంపును=గౌరవమను నాలోచనయు, మార్మొగము= వెనుక ముఖము, కారియము = తగినపని, వెనుకొనుఁడు = వెనుకరండు, ముంగలన్ = ముందుగా.

తా త్ప ర్య ము

మీ శౌర్య మెందుఁబోయెను? మీరు మగవారను నభిప్రాయము కూడ మిమ్ము వదలిపోయెనా? ఈ పిఱికితన మెచ్చట నేర్చితిరి? గౌరవ మనునది యొకటి కలదనునది మీ యాలోచనకే రాదాయెనా? శత్రువుల కెదురుగనున్న ముఖమును

వెనుకఁ ద్రిప్పుకొని పరువెత్తుట తగినపనియా? అంతభయమా? వీరశ్రేష్ఠులారా! మీకంత ప్రాణభయముండెనేని నేను ముందు పోయెదను నావెనుకనైనమీరురండు.

సీ. అనవుడు వారెల్ల • నద్రుల ద్రుమములఁ, గైకొని తనుఁ జుట్టి • కదలిరాఁగ
వనమానవేగాఢ్యుఁ • డాశుగనందనుం, డరివాహినులఁ బ్రళ•యాగ్నివోలె
నిర్దహింపఁగ జొచ్చె • నెఱకింక చూకురు, పెనఁగొన మనమునఁ • భీమగతిని
నొండు విశాల మా•బండను రావణి,రథమున వైవ సా•రథియు మిగుల

ఆ. నొడికమునను దేరి•నడగాఁగఁ గొనిపోయె, నదియు నచట నున్న•యసురతతుల
నలియఁ జేసికొనుచు • నిలయు బ్రద్దలువాఱ, ధరణిఁ జొచ్చెఁ బరులు•తల్లడిల్ల.

అర్థములు. ఆశుగనందనుఁడు = వాయుపుత్రుఁడు, అరివాహినులన్ = శత్రుసేనలను, నెఱకింక = నిండుకోపమున, చూకురు = శోకము, ఒడికమునను = నేర్పుతో.

## తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా వారందఱు కొండలను చెట్లను దీసికొని తన్నుఁ జుట్టుకొని రాఁగా మిగుల వేగసంపత్తిగల హనుమంతుఁడు శత్రుసేనలను బ్రళయాగ్నివలెఁ గాల్పఁ బ్రారంభించెను. సీతను జంపెఁగదా యని కోపము, సీతాదేవి మరణించెఁ గదా యని శోకము, మనస్సును పెనుగొనుచుండఁగా భయంకరమైన విధమున నొక వెడలుపాటి బండనెత్తి యింద్రజిత్తు రథముపై వైచెను. సారథియు మిగుల చమత్కారముగ నది తప్పిపోవునట్లు తేరిని దూరముగఁ దోలికొని పోయెను. అది నచట నున్న రాక్షస సమూహమును నలియఁజేయుచు నేల పగుల్చుపాఱ శత్రువులు తత్తఱలాడ భూమిలోఁ బ్రవేశించెను.

ఉ. వానరు లంతలోఁ గలసి • వాసవవైరిని సాంద్రభూజసం
తానశిలాప్రహారములఁ • దద్దయు నొంచుచు వానిఁ గాచు నా
సేనను బీన్గు పెంటలుగఁ • జేయఁగ నింద్రజి తీవ్రబాణసం
దానితమార్విమై ప్లవగ•నాథులఁ దాఁకి తెరల్చె వారలన్. ౧౫-౧౬

అర్థములు. వాసవవైరిని = ఇంద్రజిత్తును, సాంద్ర = దట్టమైన, భూజ సంతాన = చెట్ల సమూహములయొక్కయు, శిలా = ఱాలయొక్కయు, ప్రహార ములన్ = దెబ్బలచే, తీవ్రబాణ=తీక్ష్ణ బాణములచే, సందానిత = కూర్పఁబడిన, మార్విమై = అల్లెత్రాడు గలవాఁడై, తెరల్చెన్=తొలఁగిపోవునట్లు చేసెను.

## తాత్పర్యము

ఇంతలో వెనుకనున్న వానరులు హనుమంతుని గలిసికొని దట్టమైన చెట్ల సమూహము యొక్కయు, ఱాలయొక్కయు దెబ్బలచే వానిని మిక్కిలి నొప్పించుచు వానిని రక్షించుచున్న యాసేనను పీనుఁగు పెంటలుగాఁ జేయఁగా నింద్రజిత్తు వింటఁ దీవ్రబాణములు సంధించివైచి వారినెల్లఁ దొలఁగిపోవఁ గొట్టెను.

ఉ. ఏలినవాని విక్రమ మ•హీనవిజృంభముఁ జూచి మత్తులై
శూలపరశ్వధాసులను • సోఁకులమూఁకలు కీశపాళులన్
గూలుచు చున్నఁ జూచి కపి•కుంజరుఁ డుగ్రమహోగ్రరోషణా
భీలుఁడు వారి నాఁగి కపి•వీరులతోడ వచించె నీగతిన్. ౧౯౨౯

అర్థములు. ఏలినవాని = ప్రభువుయొక్క, అహీన విజృంభము=ఎక్కువ వికాసము, మత్తులై = మదించినవారై, ఉగ్ర + మహోగ్ర + రోషణాభీలుఁడు= అంతకంతకు హెచ్చిన కోపముచే భయంకరుఁడు, ఆఁగి=అడ్డగించి.

తాత్పర్యము

తమ ప్రభువుయొక్క పరాక్రమము వికాసముచూచి మదించినవారై యిఁక మనకేమి భయమని శూలములు గండ్రగొడ్డండ్లు తీసికొని రాక్షసుల గుంపులు వానరుల గుంపును జంపుచుండుట చూచి వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు మిక్కిలి కోపము గలవాఁడై వారి నడ్డగించి కపివీరులతో నిట్లనియె.

—• హనుమంతుఁడు రణంబు చాలించి శ్రీరాముఁ జూడఁబోవుట •—

ఉ. వానరవీరులార! పర•వాహిని నంతయుఁ ద్రుంచి వైచినన్
దాన లభించుమేలు గల•దా రఘురామునిమిత్తమై కదా
ప్రాణము లాస మాని బహు•భంగులఁ బోరుట, యట్టిరాము న
జ్ఞానన యుద్ధహేతువు ధ•రాత్మజయే హత యయ్యె వైరిచేన్. ౧౯౩౦

అర్థములు. పరవాహిని = శత్రుసేన.

తాత్పర్యము

వానరవీరులారా! మనము శత్రుసేన నంతయుఁ జంపినను రాఁగల లాభమేమి? మనము రామచంద్రమూర్తినిమిత్తమై ప్రాణముల యాస వదలి యుద్ధము చేయుచున్నాము ఆయన సీతాదేవి నిమిత్తమై పాటుపడుచున్నాఁడు. ఆయన, మనము యుద్ధముచేయుటకు కారణము సీతయే. అట్టి సీత శత్రువుచేఁ జంపఁబడెను.

ఉ. ఈవిధ మంతయున్ దశర•థేశ్వరుపట్టికిఁ గీశనేత సు
గ్రీవునకున్ వచించి యెది•రీతిగ వారు దలంత్రు తద్విధిన్
బోవుట మేలటంచు హరి•పుంగవులన్ మరలించి మెల్ల నీ
తావిభుఁ జూడఁ బోయెఁ గపి•దండముతో నిట శక్రవైరియున్. ౧౯౩౧

తాత్పర్యము

ఇది యిట్లు జరిగినదని మనము పోయి రామచంద్రమూర్తికి సుగ్రీవునకుఁ జెప్పుదము. వారెట్లు చేసిన మేలని తలంతురో మన మట్లు చేయుట బాగు. అని హనుమంతుఁడు వానరుల నెల్ల మెల్ల మెల్లగా వెనుకకు మరలించి కపులగుంపుతో రామచంద్రమూర్తిని జూడఁబోయెను. ఇచ్చట నింద్రజిత్తు.

చ. అనిపని వీడి రాముఁ గన ♦ నంజనపట్టి చనంగఁ బొంగి పె
ల్చన విధివత్ప్రకారముగఁ♦జైత్యము నందలి యా నికుంభిలన్
ఘనతరహోమముం జలుపఁ♦గాఁ గడఁగెం బలలాస్రయుక్తమై
యనలము హేతిమంత మయి ♦ యస్తమయార్కరుచిన్ వెలుంగఁగన్.

అర్థములు. అనిపని = యుద్ధకార్యము, విధివత్ప్రకారముగన్ = శాస్త్రములోఁ జెప్పఁబడిన రీతిగ, చైత్యము నందల = రచ్చమ్రానియందున్న, నికుంభిలన్=నికుంభిలా దేవాలయము, నికుంభిల యనునది శక్తిపేరు.

తాత్పర్యము

యుద్ధముఁబని వదలిపెట్టి యాంజనేయుఁడు పోఁగా నింద్రజిత్తు తన యుద్దేశము ఫలించెనని సంతోషించి వెంటనే శాస్త్రప్రకారము రచ్చమ్రాని యొద్దనున్న నికుంభిల యను దేవి యుండు నాలయమందు గొప్ప హోమము చేయ నారంభించెను. మాంసము నెత్తురు తోడఁగూడి యగ్ని జ్వాలలతోఁగూడి సాయంకాల సూర్యుని కాంతిచే వెలిఁగెను.

కం. రాక్షసులశుభము పొందెను, రాక్షసపతిసుతుఁడు కడువ♦రం బగుహోమం
బా క్షణము సలుపఁ గడఁగెను, రక్షింప నయానయజ్ఞ ♦ రాక్షసవర్యుల్.

అర్థములు. శుభముపొందెను = శుభముకొఱకు, నయానయజ్ఞ=శాస్త్రప్రకార మిది చేయవచ్చును, ఇది చేయరాదను విషయము తెలిసినవారు.

తాత్పర్యము

రాక్షసులకు మేలు కలుగుకొఱకు నింద్రజిత్తు మిగుల శ్రేష్ఠమైన యభిచార హోమము చేయ శాస్త్రప్రకారము కృత్యాకృత్యములు తెలిసిన రాక్షస శ్రేష్ఠులు రక్షింపఁగా నారంభించెను.

## —♦ {౮౩-వ సర్గము. హనుమంతుఁడు శ్రీరామునకు నింద్రజిత్తు సీతాదేవిని వధించె నని తెలుపుట.} ♦—

కం. అక్కడ రాముఁడు వాయుజు, డిక్కునఁ గోలాహలంబు♦దివి కెగయుడుఁ బో
రెక్కడని తలఁచి విధిసుతు, నిక్కరణిం బలికె వింటి♦వే యా రవముల్.

అర్థములు. కోలాహలంబు = కలకలధ్వని, దివికిన్ = ఆకాశమునకు, విధిసుతున్=జాంబవంతుని, పోరు=యుద్ధము, రవముల్ =ధ్వనులు.

చ. వినవిన భీమ మయ్యెఁ బర♦వీరుల యాయుధనిస్స్వనంబు, లా
హనుమకుఁ బోరు భార మయి♦వట్టులు దోఁచెడి నీవు బాసటై
చను మన నాత్మసేనఁ గొని ♦ చయ్యన నాతఁడు పోవుచున్ మరు
త్తనయుని దీర్ఘనిశ్వసను ♦ దారితవైరిఁ గపీంద్రసంవృతున్.

అర్థములు. వినవినన్=వినుకొలఁది, శానసై = తోడై, దీర్ఘవిశ్వాసుని = నిట్టూర్పులు విడుచువాని, దారితవైరి=శత్రువులఁ జీల్చిన వానిని, కపీంద్ర సంవృతున్ =కపిశ్రేష్ఠులతోఁ జుట్టఁబడినవాని.

తా త్ప ర్య ము

వినుకొలఁది క్రమక్రమముగ శత్రువీరుల యాయుధముల ధ్వని యెక్కుడగుచున్నది. ఆ హనుమంతునకు శక్తికి మించిన గొప్ప యుద్ధము తటస్థించినట్లున్నది. నీ వాయువకుఁ దోడుపడఁ బొమ్మనఁగా నతఁడు తన సేన దీసికొని వేగముగఁబోవుచు నిట్టూర్పులు పుచ్చువానిని,శత్రువులఁ జీల్చినవానిని కపిశ్రేష్ఠులచేఁజుట్టఁబడినవానిని.

కం. తన కెదురై వచ్చెడివా, నిని ద్రోవం గనుడు నతఁడు ♦ నిలువఁగ నిలిచెన్
హనుమయు రామునిఁ జేరం, జని భృశదుఃఖమున భూప♦చంద్రునిఁ బలుకున్.

తా త్ప ర్య ము

తన కెదురుగా వచ్చువానిని హనుమంతునిఁ జూచి యతఁడు తన స్థానమున నిలువఁగా నిలిచెను. హనుమంతుఁడును రాముని సమీపించి మిక్కిలి దుఃఖమున రామునితో నిట్లనియె.

చం. అరిబలమర్దనా ! కడుభ ♦ యంకరవృత్తిని మేము పోరుచో
దురితరతుండు రావణియుఁ ♦ దొయ్యలి సీతను నేడ్చుదానిఁ దాఁ
బొరిగొనె మా సమక్షమునఁ ♦ బొక్కఁగఁ జిత్తము తత్తఱింపఁగా
నరగున వచ్చినార మది ♦ సర్వము నీ కెఱిఁగించువారమై. ౧౯౩౭

అర్థములు. అరిబల మర్దనా !=శత్రు సైన్యముల మర్దించువాఁడా.

తా త్ప ర్య ము

శత్రుసైన్య సంహారకా ! మిగుల భయము కలిగించు విధముగా మేము యుద్ధము చేయునపుడు పాపాసక్తుఁడు ఇంద్రజిత్తు మేమందఱము చూచుచుండఁగా నేడ్చుచున్న సీతను జంపెను. వ్యసనముచే మనస్సు తత్తఱపడుచుండ సర్వము నీ కెఱిఁగింపవలయునని శీఘ్రముగ వచ్చితిమి.

చం. అనవుడు భిన్నమూలకుజ ♦ మై రఘురాముఁడు మూర్ఛ దన్నుఁ ద్రె
క్కొనఁ ధర వ్రాలె శోకమునఁ ♦ గూరినవంతఁ గపీంద్రులెల్లఁ బ్ర
కృనఁ బ్రదహద్దురాసదశి ♦ ఖంబగు వహ్నినిబోలెఁ జల్లి రొ
య్యనఁ గువపద్మినీపరిమ ♦ ళామలనీరము దాపశాంతికై. ౧౯౩౮

అర్థములు. భిన్నమూలకుజము = వేఱుతెగిన చెట్టు, త్రెక్కొనన్ = ముంపఁగా, ప్రదహత్ =మిగుల దహించునట్టి, దురాసద=సహింపరాని, శిఖంబు= జ్వాలలుగలది, కువ = కలువయు, "కువాలయం కువలయం కువాలం కువలం కువ" మ్మని ద్విరూప కోశము. పద్మిని = తామరల, పరిమళ=సువాసనగల, అమల = నిర్మలమైన, నీరము=నీళ్ళు.

### తా త్ప ర్య ము

ఇట్లు చెప్పఁగా వేఱు నఱకఁబడిన చెట్టు పడునట్లు రామచంద్రమూర్తి మూర్ఛ తన్ను ముంపఁగా శోకమున గలిగిన బాధచే నేల వ్రాలెను. మిగుల దహించు దగ్గఱకుఁ జేరరాని శిఖలు గల యగ్నిమీఁద నీళ్ళు చల్లినట్లు వానరులు కలువల తామరల సువాసనగల నీళ్ళు తాపము చల్లారుటకై చల్లిరి.

## —♦ లక్ష్మణుఁడు శ్రీరామునితో ధర్మంబు నిరర్థకం బని చెప్పుట ♦—

కం. శోకావేశభరంబునఁ, జూకురుపడి తమ్ముఁ డగ్ర ♦ జుం గ్రుచ్చి యనున్
ప్రాకట హేత్వర్థయుతం,బై కొఱలిన వాక్యములను ♦ నస్వస్థునకున్. ౧౯ ౩౯

అర్థములు. శోకావేశ భరంబునన్ = అధికమైన శోక మావేశించుటచే, చూకురుపడి = దుఃఖపడి, ప్రాకట=స్పష్టమైన, హేత్వర్థ యుతంబు= హేతురూప మైన ప్రయోజనముతోఁ గూడినది, అనఁగా యుక్తియుక్తమైనది, అస్వస్థునకున్= మనస్సు స్వస్థముగా లేనివానికి, లక్ష్మణుఁడు చెప్పఁబోవు మాటలు శోకావేశము చేతను ఇంద్రజిత్తుమీఁద నేను బ్రహ్మాస్త్రము ప్రయోగించెద ననిన వలదనెనే, దానిని బ్రయోగించి యుండినచో నిప్పుడీ యనర్థము కలిగియుండదుగదా యను విచారము చేతను జెప్పఁబడినవి కాని పరమార్థములు గావనియు నవి రామచంద్రమూర్తి మనస్సుస్వస్థముగా లేనికారణమున వినిపించుకొనినవాఁడుగాఁడనియుఁ గ్రహింపనగు.

### తా త్ప ర్య ము

అతిశయమైన శోకావేశముచే దుఃఖపడుచు లక్ష్మణుఁడు అన్నను కౌఁగిలించి కొని యుక్తియుక్తమైన మాటలను మనస్సు స్వస్థముగా లేనివానికిఁ జెప్పెను.

కం. కేవల ధర్మరతాత్ముఁడ, వీవు జితేంద్రియుఁడ వెంతో ♦ హితకారివి నిన్
గావ దనర్థమువలనం, గావున ధర్మము నిరర్థ ♦ కంబు మహాత్మా. ౧౯ ౪౦

అర్థములు. కేవల ధర్మరతాత్ముఁడవు = ఒక్క ధర్మమునందే ప్రీతిగల మనస్సు గలవాఁడవు. కావున నేకదా.

"అతివ ధనార్జనంబ పరమార్థముగాఁగఁ దలంపఁబోను......యతులిత సత్య ధర్మనియమైకరతిం జరియించు సంయమి ప్రతతులతోడ సాటి"ననికదా చెప్పితివి. (అయోధ్య ౧౩౩)

అట్లు చెప్పి పితృవాక్య పరిపాలన ధర్మమందె నిలిచి చేతికి వచ్చిన రాజ్యమును వదలితివి. జితేంద్రియుఁడవు=ఇంద్రియములు జయించిన వాఁడవు. కనుకనే న్యాయప్రకారము నీకు రావలసిన రాజ్యము రాకుండఁ జేసిన కైకయీ దశరథులపై మనఃకాలుష్యము లేనివాఁడవు. హితకారివి = ఇతరులకు మేలే చేయు వాఁడవు. రావణాసురుని కిరీట మెగురఁ గొట్టుటకు మాఱుగఁ దల యెగురఁ గొట్టి

యుండిన నిట్టి కీడు కలిగి యుండదుకదా. వాని కింకనైన బుద్ధి వచ్చును. రక్షింతమను నభిప్రాయముతోఁ గదా వదలితివి. నిరర్థకంబు=నిష్ప్రయోజనము.

తాత్పర్యము

అర్థము కామము వదలియైన ధర్మమునందే నిలువవలయు నని ధర్మమునందుఁ బ్రీతి గలవాఁడవు. ఇంద్రియముల జయించినవాఁడవు. మిక్కిలి లోకహితమునే చేయువాఁడవు. ఇట్టి నిన్ను ధర్మము నీకుఁ గీడు రాకుండఁ గాపాడఁజాలదయ్యె. కావున ధర్మము నిష్ప్రయోజనము. 'ధర్మో రక్షతి రక్షితః' తన్ను రక్షించువానిని ధర్మము తాను రక్షించుననుట వ్యర్థవాక్యము.

ఉ. స్థావరజంగమంబుల విధంబున లోకములోని వారి కే
లా విశదంబుగా దది తలంపుము ధర్మ మొకండు గల్గినన్?
వావిరి తత్ఫలంబు లయినం బొడకట్టవె స్థావరాదు ల
ట్లో విపులేశ ధర్మమొకఁ డుంకుట కల్లని నేఁ దలంచెదన్. ౧౯౮౧

అర్థములు. స్థావరము = చరము కానిది, కదలక యుండునది - పర్వతాదులు - జంగమము=కదలునది, పశు మనుష్య పక్షులవంటిది, ధర్మము ధర్మమనదవే యది కలదనుటకు నేమి ప్రమాణము? ప్రత్యక్షమా? అనుమానమా? అని వికల్పించుకొని రెంటివలనను ధర్మముకలదని స్థాపింప సాధ్యపడదనుచున్నాఁడు.

తాత్పర్యము

ధర్మమనునది లోకములో నొక పదార్థముండెనేని యది కదలని పర్వతాదులవలెఁగాని కదలు పశుమనుష్య పక్షులవలెఁగాని యేలఁగానరాదు. కానరాకుండినఁ బోనిమ్ము. చెట్లు మొదలైనవానివలననో పశుపక్ష్యాదులవలననో మనకొక ఫలము గానవచ్చుచున్నది. అట్టి ఫలముఁ గూడ ధర్మమువలన నేల గానరాదు. పర్వతములవలెఁ జెట్లవలె మృగాదులవలె ధర్మము కానరాకున్నది. కావునఁ బ్రత్యక్ష ప్రమాణముచే ధర్మమున్నదని స్థాపింప సాధ్యపడదు. చెట్టును మనము చూడకపోయినను ఫలమును జూచితిమేని యా ఫలమునకుఁ గారణమైనది చెట్టొకటి యుండవలెనని యూహింతుము. అట్లూహించుటకు ధర్మమువలనఁ గలుగు ఫలము కానరాకున్నది. కావున ననుమానప్రమాణముచేతను ధర్మము కలదని చెప్ప సాధ్యపడదు.

కం. కలదేని యధర్మము గన,వలయున్ బహుదుఃఖములను బంకి ముఖుండున్
గలదేని ధర్మమీగతిఁ, గలుగక యుండంగ వలయుఁ గద నీకు వెతల్. ౧౯౮౨

తాత్పర్యము

అతీంద్రియములైనవి లోకమున నెన్నిలేవు. అట్టులే ధర్మాధర్మము లందువా? అధర్మమనునది యొకటి యుండెనా రావణాసురుఁడు విశేష దుఃఖములచే యనుభవించుచుండవలయును. ధర్మమనునది యొకటి యుండెనా నీకు నిటువంటి దుఃఖములు కలుగకయే యుండవలయు. వాఁడు సుఖపడుచున్నాఁడు. నీవు దుఃఖపడు

చున్నావు. ధర్మమువలనఁ గలుగు ఫలమేది? ఫలనియమము లేదాయెఁగదా. ధర్మాధర్మములు ఫలశూన్యములు.

ఉ. కావలుఁడైన రావణుఁడు ♦ కష్టము గానమి నిత్యధర్మస
ద్భావుఁడ వీవు దుఃఖముల ♦ పాలగు చుంట నధర్మధర్మముల్
త్రోవఁ దగాఁ బరస్పరవి ♦ రుద్ధఫలప్రదముల్ దలంపఁగా
బ్రోవఁగఁ గీడు ధర్మమునఁ ♦ బొల్పగు సౌఖ్య మధర్మసంగతిన్. ౧౯౪౩

అర్థములు. కావలుఁడు=దుష్టుఁడు.

తాత్పర్యము

నిత్యధర్మ సద్భావుఁడవు, సర్వదా ధర్మమందే యుండవలయు నను మంచి యభిప్రాయము గలవాఁడవు నీవు. ఇట్లుండఁ గ్రమమార్గము తప్పి ధర్మాధర్మములు పరస్పర విరుద్ధ ఫలము లిచ్చుచున్నవి. నీవు దుఃఖపడుచున్నావు. వాఁడు సుఖపడుచున్నాఁడు. కావున ధర్మము కష్టమునకు, అధర్మము సుఖమునకుఁ గారణమైనపుడు ధర్మము కలదని దానివలన మేలిఫలమే కలదని యెట్లు చెప్పనగును? కావున ధర్మములేదు. దానికి ఫలములేదు.

సీ. ధర్మప్రవర్తన ♦ శర్మంబు ఘటియిల్లు, ధర్మహీనత దుఃఖ ♦ తతులు గలుగు
నని తలపోసెదే ♦ యన్నయా! యది కల్ల, ధర్మంబు సౌఖ్యప్ర ♦ దంబ యేని
ధర్మాత్ము లగు వారు ♦ ధర్మమందె చరింపఁ, దద్ధర్మఫలములు ♦ దలఁగ కుండ
వలదె జగంబునఁ ♦ గలవె యా భంగులు, తలపోయుమా యింత ♦ ధర్మశీల!

తే. పాపు లగువారు సౌఖ్యముల్ ♦ పడయు చుండఁ
దలఁగకుండును గష్టముల్ ♦ ధార్మికులను
దానఁ జేసియె ధర్మం బ ♦ ధర్మ మనెడి
రెండును నిరర్థకములు భూ ♦ మండలమున. ౧౯౪౪

తాత్పర్యము

అన్నా! ధర్మప్రకారము నడచుకొనిన శుభము కలుగును, ధర్మము విడిచిన దుఃఖములు కలుగును, అని యాలోచించెదవా? ఆ యూహ సత్యమైనది కాదు. ఏలందువా? ధర్మము సౌఖ్యమునే యిచ్చునేని ధర్మాత్ములగువారు ధర్మమునందే వర్తించుచుండ వారికి ధర్మఫలములే తొలఁగిపోక యుండవలయునుగదా. లోకమున నట్లు ధర్మాత్ములు సుఖమునే యనుభవించు చున్నారా? లేదుగదా. ధర్మాత్ముఁడా! దీని నీవాలోచింపుమా? అధర్మముకష్టములనే కలిగించునేని పాపులుకష్టములనేకదా యనుభవింపవలెను. లోకమున నట్లు జరుగుచున్నదా? అదియు నాలోచింపుము. లోకమునందు పాపులు సుఖము లనుభవించు చున్నారు. ధర్మాత్ములు కష్టము లనుభవించుచున్నారు. ఆ కారణమున ధర్మ మధర్మమనునవి రెండును నిరర్థకములు. ఫలమును బట్టి చెట్టున్నదని యూహించునట్లు సుఖదుఃఖ

రూపక ఫలములఁబట్టి ధర్మమున్నదని అధర్మమున్నదని యనుమాన ప్రమాణముచే సిద్ధాంతముచేయ సాధ్యపడదు.

తే. పాపరతుల నధర్మంబు • బాధపఱిచె, నేమియుఁ గ్రియాత్మకం బయి • యిట్టిబాధఁ
గూర్చెడియధర్మ మొకక్షణ • గూడఁ బిదపఁ, దాను జెడి వేఱకవలబా • ధలఘటించు!

తాత్పర్యము

ఇట్లు ప్రత్యక్షానుమాన ప్రమాణములచే ధర్మాధర్మముల యునికి ఖండించి యిఁక శబ్దప్రమాణమును ఖండించుచున్నాఁడు. రామచంద్రా! పాపాత్ములను క్రియారూపమైన యధర్మము (పాపకర్మము) బాధించు నందువా, యిట్టి బాధఁ గూర్చెడి యధర్మము మూఁడు క్షణములు మాత్రమే యుండునని శాస్త్రములు చెప్పుచున్నవి గదా అప్పుడు మూఁడు క్షణములు మాత్ర ముండి నాలుగవ క్షణమున నశించు నధర్మము తాను నశించి కాలాంతరమున నెట్లు దుఃఖఫలమునెవనికైన కలిగింపఁగలదు? ఇది యసంగతముగదా. కాఁబట్టి యీ యధర్మకర్మముదుఃఖమిచ్చునని యు నా దుఃఖమునుఁబట్టి యధర్మ మొకటి యున్నదనియు వేదాదు లూహింపుమనుట నీళ్ళమీఁదఱాలు తేలునట్లసంగతము. శబ్దము బుద్ధి-కర్మము మూఁడు క్షణములే యుండునని శాస్త్రము. కావున నివి క్షణికములు. అట్లులే ధర్మరూపమైన కర్మము సుఖమిచ్చునందువా? అదియును మూఁడు క్షణములే యుండి నశించునది కావునఁ దాను నశించి కాలాంతరమున నెట్లు ఫలమీయఁ గలదు? ఇట్లు కర్మములు క్షణికములని చెప్పునవి కాలాంతరమున ఫల మిచ్చునని చెప్పు వేదవాక్యములు ఱాలు నీళ్ళకంటె బరువని చెప్పుచు ఱాలునీళ్ళపైఁ దేలునని చెప్పుటవంటిది.

సీ. కర్మంబు చెడినను • గర్మాధిదేవత, ఫలము గూర్పెడి యని • పలికితేని
దైవ మెప్పుడు ధర్మ • తత్పరు బాధించుఁ, గాదేనియును గర్మ • కారుఁ డన్య
జనుని బాధించును • సత్య మిట్లైనచోఁ, బాపకర్మంబుల • ఫలము దుఃఖ
మది దైవమునె చెందు • నందదు కర్మము, ధర్మంబుచందంబు • తప్ప కిట్లె
ఆ. కానరాదు రూపు • కడఁగి చిహ్నములచే,నైనఁ దెలియఁబడదు • మానవీయ
యాల యసత్స్వరూప • మగు ధర్మ మేరీతి, బరమఫల మొసంగు • భ్రాంతి గాక.

తాత్పర్యము

ఓయీ కర్మము మూఁడు క్షణములలోఁ జెడినఁ జెడనిమ్ము. దానిచే నారాధింపఁబడిన దేవత చెడదుగదా! ఆ దేవతయే యీ ఫలము నిచ్చునందువా? అదియు సరిగాదు. ఎట్లన — పురుషుఁడు తాను—నధర్మముచేసి బాధపడుటకుఁగాని, యితరుల బాధించుటకుఁగాని దైవమే కారణము. ఆ దైవమే పురుషునిచేత ధర్మరూపకర్మము చేయించి సంతోషించి దానికి సుఖఫల మిచ్చి, యధర్మ కర్మము చేయించి యసంతుష్టుఁడై, దుఃఖఫలము నిచ్చునేని, అప్పుడు రెంటికిని ప్రయోజకకర్త దైవమేకదా యగును. అప్పుడా ధర్మాధర్మములవలనఁ గలుగు ఫలము

సుఖము దుఃఖము ప్రయోజకకర్తకుఁ జెందునుగాని ప్రయోజ్యకర్తకుఁ జెందదు గదా. రాజాజ్ఞప్రకార మొకఁడొక కార్యము చేసిన దానిఫలము రాజనుభవించునుగాని భటుఁ డనుభవింపఁడుగదా కావున దైవమే తాను ధర్మముగాను నధర్మముగానునై సుఖఫలము నిచ్చు ననుట సరిగాదు.

ఓయీ నీవు చెప్పునది సరిగాదు. అచేతన కర్మము ఫల మీయఁజాలదు. దైవము ప్రయోజకకర్తయై యొకపురుషునిచే నొకకర్మము చేయించి దానికిఁదగిన ఫలమిచ్చుటయు లేదు రాజశాసనమువంటిది దైవశాసనము. రాజ్యపరిపాలనము చక్కఁగా జరుగుటకై ప్రజలక్షేమమునకై రాజు కొన్ని శాసనము లేర్పఱిచెను. ఈ కార్యములిట్లు చేసినవానికి మేలు. ఈ కార్యమిట్లు చేసినవానికి గీడని శాసించెను. ఆ ప్రకారము జరుపుటకు దగినయేర్పాటులు చేసెను. ఒకఁడు దొంగతనము చేసెనేని రాజభటులు వానినిదండింతురు. ఇందు రాజు చేయునదియేదియు లేదు. రాజు వానిని దొంగతనము చేయుమని ప్రేరింపలేదు. కావున రాజు ప్రయోజకకర్త గాఁడు. అట్లులే దైవము. దైవము ఇది పాపమని ఇది పుణ్యమని శాసనములు చేయఁ గారణమేమి? స్వలాభముగోరియా? పరులనిమిత్తమా? దైవము అవాప్తసమస్తకాముఁడు. ఆయన క్రొత్తగా సంపాదించుకొనవలసినది యేదియు లేదు. కావున స్వార్థముగ ధర్మాధర్మము లేర్పాటుచేసె ననుట సరిగాదు. పరార్థమందువా? ఒకనిని దరిద్రునిగాఁ జేయుటచేఁగదా వాఁడు దొంగతనముచేసెను. అందఱను భాగ్యవంతులుగాఁ జేసినయెడల లోకమున దొంగతన మనునది లేకపోవుఁగదా! ఒకనిని దరిద్రునిఁగ నొకనిని ధనికునిఁగఁ జేయుటచే నిర్ఘృణత్వము పక్షపాతము కలవాఁడయ్యెనుగదా యందు వేని, ఒకనిని దరిద్రునిఁగా మఱియొకని ధనికునిఁగా దైవముచేయలేదు. వాని వాని పూర్వకర్మము చేసినది. ఒక కర్మమునకు నొకఫల మనివార్యముగా నంటియుండును. ఆ కర్మము చేయఁగానే దాని ఫల మదృష్ట మనుపేర నొక శక్తియు నుత్పన్నమగును. కర్మము చెడినను అదృష్టము ఫలానుభవపర్యంతము చెడదు. ఒకఁడొక యపథ్య వస్తువు దినెను. తినుట యను కర్మము క్షణములో ముగిసెను. కాని యాపదార్థమందుండు శక్తి దాని ఫలమును వ్యాధిరూపముగ బాధించి గాని క్షయింపదు. అటులే పురుషుండు ధర్మముగాని, యధర్మముగాని చేసెనేని దానివలన జనించిన యదృష్టశక్తి కాలాంతరమున ఫలమిచ్చునుగాని ఫలమిచ్చునది దైవము గాదు, కర్మముగాదు. ఆ యదృష్టమును ననుభవించుటకుఁ దగిన సందర్భములను దైవము కలిగించుచున్నాఁడందు వేని ఒకఁడు పాపకర్మల ననుభవించుటకుఁ బాపపు సందర్భము లేకదా దైవము కలిగించును దానివలన నదృష్ట మనుభవించుటకు మరలఁ బాపకార్యము లేకదా చేయును. దానివలన మరల పాపరూపమైన యదృష్టమేకదా జనించును. ఇట్లైనచో ననాదిప్రవాహరూపముకదా కర్మము. ఒకసారి పాపము చేసిన పురుషుఁడు కలకాలము పాపము నేకదా చేయుచుండును. ఒక

సారి పుణ్యముచేసిన పురుషుఁడు పుణ్యము నేకదా చేయుచుండును. అప్పుడొకఁడు నిత్యదుఃఖి, మఱియొకఁడు నిత్యసుఖి కదా యగును. లోకమునందట్టి నియమము కనఁబడుటలేదు. కావున ఫలదాత దైవముకాఁడు. అదృష్టమే యందువా? అదియు సరిగాదు. ఏలన—నీవు చెప్పెడి యపూర్వ మనునది ప్రత్యక్షముగఁ గానవచ్చునది కాదు. లక్షణములచేత నూహింప శక్యమగునదికాదు. ఇంద్రాదులవలె సర్వవాద వాక్యములచేఁ దెలియ నచ్చునదికాదు. కావున సత్తుగాదు. సత్తుకానిది అసత్తే. అనఁగా లేనిదే. అభావమైన దెట్లు ఫలమీయఁ గలదు.

కం. ధర్మం బొకఁ డుండినచో, ధార్మికమణి వైన నీకుఁ ♦ దగులునె కీడుల్ ?
మర్మచ్ఛేదనదుఃఖము, లర్మిటచే ధర్మముంట♦యనృతము సుమ్మీ. ౧౯౮౭

తాత్పర్యము

ధర్మమసత్తుగాదు. సత్తే. దానికి ఫలముగలదందువా? అట్లగునేని ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడగు నీకుఁ గీడెట్లు కలిగెను? ప్రాణముదీయు నంతటి దుఃఖము నీకుఁగలిగెను గదా. ఇది యసత్యమనఁ జాలవుగదా. ఇట్టిదుఃఖము కలిగించు నధర్మము నీయందు లేదాయెగదా. ఈ దుఃఖ మెట్లువచ్చెను? కావున ధర్మమున్న దనుట యసత్యము.

తే. క్లీబమును దుర్బలంబు తే♦రిఁగించి చూడఁ,బౌరుషము ననువర్తించి♦వ్యవహరించు
ధర్మ మట్లౌట ఫలములు♦తనకుఁ దాన, యీయ నేరని ధర్మంబు♦నేల నలుప.

తాత్పర్యము

ఓయీ నీవు చెప్పునది సరిగాదు. కన్నులకుఁ గానరాక పోయినంతమాత్రమున చేతనే యొక వస్తువు లేదన రాదు. మన యింద్రియములకు గోచరింపనివి యెన్నియో యున్నవి. ఇంద్రియగోచరములు గాని వన్నియు నసత్యములే యను నెడల వీనినెల్ల నిరాకరింపవలసి వచ్చును. అది సరిగాదుకదా. అదియును గాక యొకొక్క కార్యమునకు సహకారి యుండుట గలదు. కుమ్మరివాఁడు కుండలు చేయుటకు చక్రము కట్టె యున్నట్లు, చక్రము కట్టె లేదేని కుమ్మరివాఁడు కుండలు చేయలేఁడు. అట్లులే దైవమునకు పౌరుషము(పురుష ప్రయత్నము)సహకారి. అట్టి సహకారి లేమిని ధర్మము వ్యర్థమైన దందువా? అట్లనిననేమి? ధర్మము స్వతంత్ర శక్తికలదికాదు. పౌరుష సాహాయ్యము లేక యది కార్యము చేయఁజాలదనియె కదా యర్థము అట్టి స్వతంత్రశక్తి లేని దుర్బలము క్లీబమైన ధర్మమునే ప్రధాన ముగా నెంచి యర్థకామముల వదలుట సరిగాదని నా యభిప్రాయము.

చ. కనుఁగొన ధర్మమే పురుష♦కారవిశేష ణభూత మైనచోఁ
బనిగల దొక్క ధర్మమని ♦ బాధలు వొందఁగ ? దాని వీడి యిం
దనుకను ధర్మముం గొలుచు♦తప్పిదిఁ బౌరుషమున్ భజింపుమీ
జనవర ! యన్ని కార్యములు ♦ చక్కఁబడున్ నను విశ్వసింపుమీ. ౧౯౮౯

తాత్పర్యము

ఎప్పుడు ధర్మము పురుషకార సాహాయ్యము లేక కార్యము చేయఁజాలదో యప్పుడు ధర్మము విశేష మగుచున్నది. ముఖ్యమైనది పురుషకార మగుచున్నది. (కుమ్మరి యప్రధానమై చక్రము, కట్టె ప్రధానమని చెప్పిన ట్లయినది. ఇదియె యీ వాద దౌర్బల్యమును జూపుచున్నది) కావున అప్రధానమగు ధర్మమునకై బాధలు పడనేల? కావున దానిని వదలి యింతవఱకు ధర్మమే ప్రధానమని దానిని రక్షించు నిమిత్తమై యెట్లు శ్రమించితివో యట్లిక పురుషకారమునకై శ్రమింపుము. అట్లు చేసితివేని సర్వకార్యములు ఫలవంతములగును. నామాట నమ్ముము.

సీ. సత్యభాషణము శ్రే♦ష్ఠం బైనధర్మము, య్యది నల్పువాఁడ నం ♦ చనెదు గాని
యదియు నీచే సమ్య♦గాచరితము గాదు, సభలోన నెల్లరు ♦ చకక వినఁగ
నీకు రాజ్యం బీయ ♦ నీకొని నిర్దయుం, డై తండ్రి నిన్నిట్టు ♦ లడవి కనిచె
నతని దండింపవ ♦ యాతని రెండవ, నుడి నల్పనే మని ♦ కడఁగి తీవు

తే. ధర్మ మొండెను నొండె న♦ధర్మ మొకటి, పరఁగ నరుఁ డాచరింప ని♦ర్బంధమేని
దేవపతి యేల మాని వ♦ధింపకుండ, యజ్ఞ మొనరింపఁ డయ్యెనో♦యార్యవర్య!

తాత్పర్యము

సత్యము చెప్పుట శ్రేష్ఠమైన ధర్మము, దానిని నేనాచరించు వాఁడ ననె దవు కాని దానినైన నీవు చక్కఁగా రక్షించిన వాఁడవు కావు. ఎట్లన సభలో లోకులెల్ల వినఁగా నీకు రాజ్యం బీయ నంగీకరించియు దయ లేనివాఁడై తండ్రి నిన్నిట్టు లడవుల పాలు చేసెను. ఆయన మొదటఁ జెప్పిన యసత్యమునకాయనను దండించిన వాఁడవు కావు. మొదటఁ జెప్పిన సత్యమును పాటింపక రెండవ సారి చెప్పినదానిని నీ వేమని యంగీకరించితివి? ధర్మాధర్మములందు మనుష్యుఁ డేదో యొకటియే చేయవలయును. రెండును జేయరాదందువేని, మనవలెనే క్షత్రియుఁ డగు నింద్రుఁడు ముని యగు విశ్వరూపుని జంపక యేల యజ్ఞము చేయలేదు? ధర్మ మొకదానినే యనుష్ఠింపవలసి యుండిన యెడల నింద్రుఁడు యజ్ఞములను మాత్రమే చేసి యుండవలెను. విశ్వరూపుని చంపియుండరాదు. విశ్వరూపుని చంపుట యను నధర్మమునే యనుష్ఠించెనేని యజ్ఞములు మానవలసి యుండెను. ఆ సమయమున కది చేసెను. ఈ సమయమున కిది చేసెను. అట్టులే మనము సమ యోచితముగఁ బ్రవర్తింప వలయును గాని యొక ధర్మమునే నిర్బంధముగ నుంచు కొనరాదు. "యాన్యేతాని దేవక్షత్రాణీంద్రో వరుణః పర్జన్యో యమ ఈశానః" ఇంద్రుఁడు వరుణుఁడు పర్జన్యుఁడు యముఁడు ఈశానుఁడు వీరు క్షత్రియులు అని శ్రుతి.

కం. కేవల మధర్మ మేనియుఁ, గేవల ధర్మంబ యేని ♦ కీ డొసఁగుఁ జుమీ
యే వేళకుఁ దగినటు లది, భావించుట మేలు సౌఖ్య ♦ పదకాములకున్.

తా త్ప ర్య ము

కేవల మధర్మముగాని, కేవల ధర్మముగాని రెంటిలో నొకటి మాత్రమే యనుష్ఠించు కర్తకుఁ గీడుగలుగును. కావున నే వేళకు నేది తగునో యా వేళకు నది చేయుట సౌఖ్యము పడఁగోరు వారికిఁ దగిన కార్యము.

## —• లక్ష్మణుఁడు శ్రీరాముతో ధనంబు సర్వార్థసాధకం బని చెప్పుట •—

సీ. నామతం బిది తండ్రి! న్యాయంబుగా నీకు, లభియించు ధర్మమూ•లంబు రాజ్య
రమ వీడి క్షేమమూ•లము పాడుచేసితి, ధర్మమెట్టులు నిన్నుఁ•దలఁగకుండు ?
నర్థమూలము ధర్మ•మది జనదత్తమా, కరములచే వృద్ధిఁ • గాంచు చుండ
శైలజాతంబు లౌ•శైవలినులఁ బోలు, నద్దాన ధర్మకా•ర్యములు జరుగుఁ
ఆ. గాన సకలకార్య•కాండంబులకు నెల్ల, ధన మొకండె కడు ప్ర•ధాన మట్టి
ధనముఁ గరగతంబుఁ•దలఁగంగ నెట్టు స్వ, కార్యఘాతుకునకుఁ • గలదె మేలు.

అర్థములు. జనదత్తము=ప్రజలచే నీయఁబడినది, కరములు = పన్నులు, కరగతంబు=చేతికి దొరకినది, స్వకార్యఘాతుకునకు=తన కార్యము పాడుచేసికొను వానికి.

తా త్ప ర్య ము

తండ్రీ! యిది నా యభిప్రాయము. న్యాయముగా నీకు రావలసినదై ధర్మము చేయుటకు నాధారమైన రాజ్యసంపదల వదలి పెట్టితివి. దానిచేత నీవు క్షేమమునకు నాధారమైన దానిని పాడుచేసికొంటివి. ఇట్టి నిన్ను ధర్మము మాత్రము వదలి పెట్టకుండునా? ధర్మ వృక్షమునకు నర్థము వేరు. వేరుచెడిన చెట్టుచెడు టరుదా ? వేరుతో నాకుఁ బనిలేదు. చెట్టుమాత్రము కావలయు నంటివి. అట్టిచెట్టు ఎన్నాళ్లు నిలుచును ? అర్థసహాయము లేక ధర్మమెట్లుచేయ సాధ్యమగును? అర్థమనునది జనులిచ్చు పన్నులచే వృద్ధిఁగనును. జనములిచ్చు పన్నులు కొండ యూఁటల యేళ్ళవంటివి. ఆ నీళ్ళ నేళ్ళకుఁ బాఱిన నాచెట్లు ఫలించును. అట్లు జనులిచ్చు ధనముచే ధర్మకార్యములు జరుగును. కావున సకల కార్యసమూహములకు ధన మొక్కటే మిగులఁ బ్రధానమైనది. అట్టి ధనము చేతికి దొరకిన దానిని దొలఁగఁ ద్రోచి తన కార్యము నాశము చేసికొనిన వానికి యెప్పటికైన మేలుగలదా ?

కం. ధనహీనుఁడె బలహీనుఁడు, ధనహీనుని విడుతు రన్న•దమ్ముల రేనిన్
ధనహీనుఁడు తలపెట్టిన, పని వేసవియేటి నీటి•పగిది నశించున్. ౧౯౩

తా త్ప ర్య ము

ధనము లేనివాఁడు బలము లేనివాఁడు. ధనము లేనివాని నన్నదమ్ము లైనను వదలి పెట్టుదురు. ధనము లేనివాఁడు తలఁచినపని యెండకాలమున నేటినీళ్ళ వలె నశించును. దేహబలము లేనివాఁడు ధనబలము గలవాఁడయ్యేనేని బహుజనులు

వాని నాశ్రయించి వాఁడు చెప్పినట్లు చేయుచుందురు గాన వాఁడు బలవంతుఁడే యగును. ధనము గలవానికి నందఱు బంధువులే. ధనము గలవాఁడు తలఁచిన పని యెంతటి యసాధ్యమైన దైనను సులువుగ నెఱవేఱును.

తే. సౌఖ్యపరుఁ డాత్మధనము వె•చ్చంబొనర్చి, క్రమ్మఱసుఖార్థియై తద•ర్థంబుధనము
సేకరింపఁగ బాపముల్ • సేయుచుండు, దానఁ గల్మషవర్తియై•తా నశించు.

అర్థములు. సౌఖ్యపరుఁడు = సౌఖ్యము మరగిన వాఁడు, తదర్థంబు = ఆ సుఖము కొఱకై, సేకరింపఁగ = సమకూర్పఁగ, కల్మషవర్తియై=పాపవర్తనము కలవాఁడై.

తాత్పర్యము

ధనహీనుని గతి యింత మాత్రమే కాదు. ధనము గలవాఁడు సుఖములు మరగినవాఁడై వాని నిమిత్తము కలధనము వెచ్చించి పేదవడఁగా సుఖముల ననుభవించు చుండినవాఁడు కావున ధనముతోడ నవియు పోవుటచూచి ధనము వచ్చిన మరల సుఖములు వచ్చునని ధనార్జనమునకై దొంగతనము లోనగు పాపకార్యములు చేయును— ఆ కారణముచేఁ బాప చరిత్రుఁడై నశించును నిఱుపేద యగు వాఁడును ధనికులు సౌఖ్యపడుట చూచి సుఖాభిలాష ధన మార్జింపఁగోరి న్యాయ మార్గమున సంపాదింప సమర్థుఁడుగాక యధర్మమార్గమున సంపాదింపఁబూని చెడును. కావున ధనములేమి యన్నివిధముల ననర్థకరమే.

*కం. కలవాఁడే మిత్రంబులు, గలవాఁడును బంధుజనులు • గలవాఁడు సుమీ
కలవాఁడే పురుషుం డిలఁ, గలవాఁడే సర్వశాస్త్ర•గణపండితుఁడున్.

తాత్పర్యము

ధనము గలవాఁడే మిత్రులు గలవాఁడు మిత్రులు గలవాఁడు ధనవంతుఁడు కాఁడేని యా మిత్రులు దీర్ఘకాలము నిలువరు. ధనము గలవాఁడే బంధుజనులు గల వాఁడు. బంధుజనులు పెక్కురున్నను ధనము లేనివానిని వా రాదరింపరు. తమ వానిఁగా నెంచరు. కలవాఁడే మగవాఁడు. మగవాఁడైనను ధనము లేనివానిని స్త్రీ కంటె నికృష్టముగఁ జూతురు. స్త్రీలు స్త్రీకృత్యమునకైనఁ బనికి వత్తురు. వీఁడు దానికిని బనికిరాఁడు. కలవాఁడే సమస్త శాస్త్రములందుఁ బండితుఁడు. వాఁడు చెప్పినది యసత్యమైనను దానిని వేదవాక్యముగ లోకులు గ్రహింతురు. ధనము లేనివాఁడు వేదవాక్యమును జెప్పినను లోకులు దానిని లక్ష్యపెట్టరు.

---

*[Kautilya supports Lakshmana. Quote slokas here and explain Remind me if I live till you copy this. అని శ్రీ వాసుదాస స్వామివారు వ్రాసినారు. ఏమి చెప్పెడివారో.]

'యస్యార్థా స్తస్య మిత్రాణి యస్యార్థా స్తస్య బాంధవాః —
యస్యార్థాః సపుమాన్ లోకే యస్యార్థః సచ పండితః' — కౌటిల్యుఁడు.

ఎవరికి ధనము గలదో వారికే మిత్రులు గలరు. ఎవరికి ధనము గలదో వారికే బంధువులు గలరు. ఎవరికి ధనము గలదో వారే లోకములో పురుషులు ఎవనికి ధనము గలదో వాఁడే పండితుఁడు.

లక్ష్మణుని యొక్క పై అభిప్రాయముచే కౌటిల్యుఁడుకూడ బలపఱచు చున్నాఁడు.

కం. ధనవంతుఁడె బలవంతుఁడు, ధనవంతుండె ధీయుతుండు • ధర్మాత్ముండున్
ధనికుండె మహాభాగియు, ధనికుండె మహాగుణుండు• ధైర్యరతుండున్. ౯౯౬

అర్థములు. ధీయుతుండు=బుద్ధిమంతుఁడు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అర్థము లేమిఁ గల్గెడు న•నర్థములన్ మును పల్కినాఁడ నే
యర్థముఁ గోరి రాజ్యమును • వ్యక్తము చేసితో నె నెఱుంగఁ, దా
నర్థము సర్థకామముల•కై వ్యయపెట్టెడు వాని కేదియున్
వ్యర్థముపోదు, నిర్ధనుఁ డ•నర్థముఁ గూడు ధనాభిలాషి యై. ౯౯౭

అర్థములు. వ్యక్తము చేసితో=వదలితివో.

తాత్పర్యము

ధనము లేకుండినఁ గలుగు కీడులను ముందు చెప్పితిని ఏ ప్రయోజనముఁ గోరి రాజ్యమును నీవు వదలితివో నాకుఁ దెలియదు. ఎవనికైనను అర్థము కామము నిమిత్తమై ధనము వెచ్చపెట్టెడి వానికి నే కార్యమైనను వ్యర్థముపోదు. సర్వ మను కూలించి వచ్చును. ధనము లేనివాఁడు ధనముఁ గోరి కీడుల పాలగును.

కం. శమమున్ హర్షము కామము, దమముం గ్రోధంబు దర్ప•ధర్మంబులు స
ర్వము నివి ధనమ్ముచే భూ,రమణా! వర్తించు నిలుచు • రహిఁ గాంచు ధరన్.

అర్థములు. శమమున్=అంతరింద్రియ నిగ్రహము, హర్షము=సంతోషము, దమము=బాహ్యేంద్రియ నిగ్రహము, రహిగాంచును = ప్రకాశించును, ధరన్ = ఈలోకమందు, ధరన్, అనుటచేఁ బరలోక సుఖము గోరువాఁడు ధనము లేకున్నను దానిని సంపాదింపవచ్చును. అంతియకాదు. ముముక్షువున కది ప్రతిబంధకముగ నగును అని భావము. మనము క్షత్రియులము. భూమి పాలించుట మనకు స్వధర్మము. దానిని వదలి సర్వత్యాగము చేసిన సన్న్యాసుల ధర్మము ననుష్ఠించుట తగదు. మనస్వధర్మ నిర్వాహణమునకు ధనమావశ్యకము. మనకైనను ముసలి వారమై వానప్రస్థుల మైనపుడు ధనముతోఁ బనిలేదు కాని గృహస్థులమై క్షత్రియులమై యుండి యాశ్రమాంతర వర్ణాంతర ధర్మముల ననుసరింపరాదు, పరధర్మము భయావహము. స్వధర్మము శ్రేయస్కరము అని భావము.

ఉ. ధర్మము ధర్మమంచు నొక • ధర్మమునే శరణొందు వారికిన్
శర్మ మిహంబునం గలుగఁ•జాలదు, మేఘము లావరించినన్
ఘర్మసమాంశుముఖ్యఖగ•పాళులు దోఁపనిభంగి, సర్వస
చ్ఛర్మనిదాన విత్తములు • చారుగుణా ! విను నీకు లేవుగా. ౧౯౫

అర్థములు. శర్మము = సుఖము, ఇహంబునన్ = ఈలోకమందు, ఇట్లను టచే ధర్మమునే శరణొందువారికిఁ బరలోకమందు సుఖము గలదని భావము. ఘర్మ సమాంశు ముఖ్య = బంగారు కాంతిగల కిరణములు గల సూర్యుఁడు మొదలగు, ఖగపాళులు = గ్రహములు, తోఁపనిభంగిన్=కానరాని విధమున, సర్వ+సత్+ శర్మ = సమస్తములైన మంచి సుఖములకు, నిదానము = మూలకారణ మగు, విత్తములు=ధనములు, చారుగుణా=మనోహర గుణములు గలవాఁడా !

తాత్పర్యము

ధర్మము ధర్మమని తక్కిన యర్థకామములను వదలి ధర్మమే రక్షకమని తలఁచువారికి మేఘములు క్రమ్మిన సూర్యాది గ్రహములు కానరాని విధముగ నీ లోకమున సుఖములు లేవు. సమస్త సుఖములకు ప్రధాన కారణమైన ధనము నీకు లేదుగదా. నీ వర్థకాంక్ష గలిగి రాజవై యుంటివేని యీ సీతాహరణము వలనఁ గలిగిన యీ కష్టములం దొకటయైన నీకు లేక సుఖించుచుందువు గదా.

చ. జనకుని సత్యభాషణునిఁ • జల్పగఁ బూనితి, తత్ఫలం బిదే
కనితివె ? నీకుఁ బ్రాణముల•కన్నఁ బ్రియన్ భవదీయపత్నినిన్
దనుజుఁడు మ్రుచ్చిలించెను, గ•తం బది యేటికి ? నింద్రజిత్కృతం
బునకుఁ బ్రతిన్ ఘటింతు రఘు•పుంగవ లెమ్ము యనుజ్ఞ యిమ్మిఁకన్. ౧౯౬

అర్థములు. గతంబు = మించిపోయినది, ఇంద్రజిత్ + కృతంబునకున్ = ఇంద్రజిత్తు చేసినదానికి, ప్రతిన్=మాఱు.

తాత్పర్యము

అసత్యమాడిన తండ్రిని సత్యవంతుని జేయవలయునని నీ సుఖము నీవు చూచుకొనక ప్రయత్నించితివి. దాని ఫలముఁ జూచితివా, ఎట్లు లభించెనో? నీ ప్రాణములకంటెఁ బ్రియురాలిని నీ భార్యను రాక్షసుఁడు దొంగిలించెను. నీవు సుఖ ముగా నింటనుండిన నీకీ కష్టము ప్రాప్తించి యుండదుగదా. అయినదేమో యైనది. మించినదానికిఁ జింతించి యేమిలాభము? ప్రకృత మనుసరింతము. ఇంద్రజిత్తు చేసిన కార్యమునకుఁ బ్రతీకారము చేసెదను. లెమ్ము. నాకనుజ్ఞయిమ్ము. నీయాజ్ఞలేక నే నేదియుఁ జేయఁజాలకున్నాను.

తే. పార్థివోత్తమ! యాజానుబాహుయుగళ!, నియమసద్వ్రత! లే లెమ్ము•నినుమహాత్ముఁ
డైన యాత్మని నెఱుఁగ లే•కకట! నీవ, యిట్లు తపియింపఁ జేయ నే•నేమి నేర్తు?

అర్థములు. మహాత్మన్=గొప్ప యత్నము కలవాఁడవు, గొప్ప ధైర్యము గలవాఁడవు. గొప్ప మనస్సు గలవాఁడవు, గొప్ప స్వభావము గలవాఁడవు, గొప్ప బుద్ధిగలవాఁడవు, ఇంతయేల 'మహతో మహీయాన్' అన్నట్లు గొప్పయని చెప్పఁబడు వాని కన్నిటికంటె గొప్పవాఁడవు, ఆత్మను=పరమాత్మను; విష్ణువును.

తాత్పర్యము

రాజశ్రేష్ఠుఁడా! మోఁకాళు లంటు బాహువులు గలవాఁడా! నియమముగా మంచి వ్రతముల ననుష్ఠించువాఁడా! లేలెమ్ము. మహాత్ముఁడవు, ఆత్మవు నగు నిన్ను నీవు తెలియని వానివలె వ్యసనపడితివేని నీదాసుఁడనైన నేనేమి చేయనేర్తును.

ఉ. నీకుఁ బ్రియంబు సేయఁ గ జ • నించిన వాఁడ భవత్ప్రియావధం
బాకట వింట రోషకలు • షాత్ముఁడ నయ్యెను దేవ! లంక న
స్తోకరథాశ్వసింధురముఁ • దూర్ణమ రాక్షసనాథ యుక్తమున్
బ్రాకటమత్కరోజ్ఝితశ • రప్రకరంబులఁ గూల్చి వైచెదన్. ౧౯౬.౨

అర్థములు. భవత్ప్రియావధంబు=నీప్రియురాలు చంపఁబడుట, ఆకట = అయ్యో! హా కష్టమ్ యొక్క తద్భవము. వింటన్ = వినుటచే, రోషకలుషాత్ముఁడు = కోపముచేఁ గలఁక బాఱిన మనస్సు గలవాఁడనయ్యెను, దేవ= నా పాలిక నీవు దేవుఁడవనియే నా భావము, అస్తోక = అధికముగా, రథ - అశ్వ - సింధురము=తేరులు గుఱ్ఱములు ఏనుఁగులు కలదియగు లంకను, మత్కరోజ్ఝిత శరప్రకరంబులన్=నా చేత నున్న వింటినుండి విడువఁబడిన బాణసమూహములచే.

తాత్పర్యము

రామచంద్రా! నీవు దేవుఁడ వనియే నా యభిప్రాయము. అట్లైన నేల యిన్ని యసత్యవ్యస్తపు మాటలాడితి వందువా? నేను నీకుఁ బ్రియము చేయఁబుట్టిన వాఁడను. అట్టి ప్రయత్నమందే యుండువాఁడను. నీ ప్రియముగోరు నేను నీకు నీ ప్రాణములకంటెఁ బ్రియురాలగు నీ భార్య యితరులచే సంహరింపఁబడిన దని విన్నప్పుడు నా మన స్సెట్టులుండవలెనో యాలోచింపుము. నీ ప్రియురాలిని నీతోడఁ జేర్చి నీకుఁ బ్రియము కలిగింప యత్నించు నాకు నది విఘ్నమై పోవుటచే కోపమున కలఁకబాఱిన మనస్సు గలవాఁడనై తాఱుమాఱుగఁ బలికితిని. క్షమింపుము. అట్లైన నిప్పు డేమి చేసెదమందువా? లంకను రావణాసురునితో నేనుఁగులు గుఱ్ఱములు తేర్లతో నా బాణములచే నాశము చేసెదను.

వాల్మీకి లక్ష్మణుచే నీతి వాక్యములు పలికించుట నీతికంటె ధర్మముఁ శ్రేష్ఠమని స్థాపించుటకే. కావడి యెన్ని వంకరలు పోయినను ఇల్లు వచ్చి చేరుట ప్రధానమైనట్టు కేవల ధర్మ పక్షమున నిలచి రామచంద్రమూర్తి యెన్ని కష్టములు పడినను దుదకు ధర్మమే జయించునని యనుష్ఠానముచేఁ జూపెను.

అర్థోధర్మః కామ ఇత్యర్థే త్రివర్గః। తస్యపూర్వః పూర్వః శ్రేయాన్ సను సంప్రాప్తుమ్॥ కౌటిల్య. ఇందు ధర్మమునకంటె నర్థము ప్రధానముగాఁ జెప్పఁబడెను. రాజునకుఁ బ్రజాపాలనకర్మము ధర్మము. ధనములేక ప్రజాపాలనము జరుగదు. కావున నర్థసంగ్రహము ప్రథమము. కనుకనే కౌటిల్యుఁడు "అర్థ ఏవ ప్రధానః అర్థమూలౌహి అర్థకామావితి'అని చెప్పెను. ఈనీతి ననుసరించినవాఁడు లక్ష్మణుఁడు. నీకు న్యాయముగా రావలసిన దేల పోఁగొట్టుకొంటివని లక్ష్మణుఁడు చెప్పెను గాని యన్యాయముచేసి ధన మార్జింపుమని చెప్పలేదు.

"ధర్మాదర్థశ్చ కామశ్చ"అని వ్యాసమతము. భారత సావిత్రి. ఈ ధర్మము ననుసరించినవాఁడు రామచంద్రమూర్తి. ఇది యయోధ్యాకాండమునఁ జెప్పెను. అయినను వాలివధమందు ధర్మవిరుద్ధము కాని నీతి ననుసరించెనని తోఁచెడిని.

## —♦{ ౮౫-వ సర్గము. విభీషణుఁ డింద్రజిత్తుమాయోపాయంబు శ్రీరామునకుఁ దెలుపుట }♦—

సీ. అని భ్రాతృవత్సలుం ♦ డగు లక్ష్మణుం డన్న, నూరార్చుచుండఁగ♦నుచితరీతి
గుల్మముల్ దీరిచి ♦ కుంజర సేవిత, యూథపభంగిని ♦ నుగ్రులైన
సచివులు గొల్వ నా ♦ స్థానంబునకు విభీ,షణుఁ డరుదెంచి బా♦ష్పములు రాల
వగచు లక్ష్మణు నున్న♦వానరులను లక్ష్మ,ణాంకాశ్రితుని వ్యస♦నార్తు రాముఁ
ఆ. గాంచి వగచి యేమి♦కతము దీనికి నన, గనుల మిగుల నీరు ♦ కార్చికొనుచు
నతనిఁ గపుల భాస్క♦రాత్మజుఁ జూచుచు, లక్ష్మణుండు పలికె♦సూక్ష్మఫణితి.

అర్థములు. భ్రాతృవత్సలుఁడు = అన్నమీఁదఁ బ్రేమ గలవాఁడు, అన్న కష్టబడు చున్నాఁడే యని పరితాపపడి యెట్లులైన సుఖము కలిగింపఁ గోరి మీఁది వాక్యము లుచ్చరించెనని యెఱుఁగనగు. వైద్యులు తమ బిడ్డలకు రోగమువచ్చి నపుడు కఠిన పథ్యము పెట్టినను వాత్సల్యాతిశయంబున నట్టి పథ్యము పెట్టలేక యెట్లులైన నింత యన్నము లోపలికిఁ బోవును గాక యని యపథ్య వస్తువులు పెట్టెడి తల్లు లెందరోగలరు. అట్టివారిలోఁ జేరినవాఁడు లక్ష్మణుఁడు, గుల్మముల్ = సేనా సన్నివేశములు, కుంజర సేవిత = ఏనుఁగులచేఁ గూడిన, యూథప భంగిని = పరికాని వలె, ఏనుఁగుల గుంపులో ముఖ్యమైన యేనుఁగునకు పరికాఁడని పేరు. ఉన్న వానరులను = తక్కిన క్రోఁతులను, లక్ష్మణాంకాశ్రితుని = లక్ష్మణు తొడఁమీఁదఁ బండుకొనిన వానిని, కతము = కారణము, సూక్ష్మఫణితి = మెల్లగా.

### తాత్పర్యము

ఈ ప్రకార మన్న యందుఁ బ్రేమగల లక్ష్మణుఁ డూరార్చుచుండగాఁ సేనా సన్నివేశములు చక్కఁజేసి యేనుఁగులతోఁ గూడ పరికానివలె భయంకరుఁడైన తన నలువురు మంత్రులతోఁ గూడి రామలక్ష్మణులున్న ప్రదేశమునకు విభీషణుఁడు

వచ్చి కన్నులనీరు గాఱ దుఃఖించు లక్ష్మణునిఁ దక్కిన వానరులను జూచి యేల యిట్లున్నారని యడుగఁగా మిక్కిలి కన్నీరు కార్చుచు నతని, సుగ్రీవుని, వానరులను జూచుచు లక్ష్మణుఁడు హీనస్వరమున నిట్లనియె.

కం. హాత యయ్యె నిపుడు ధరణీసుత యింద్రజిచే నటన్న ♦ సుద్దులను మరు
 త్సుతుఁడు వచించిన రాఘవుఁ, డతిదుఃఖముచేత మూర్ఛ♦నందె మహాత్మా!

తా త్ప ర్య ము స్పష్టము.

చ. అని వచియించు లక్ష్మణుని ♦ నాఁగి విభీషణుఁ డిట్లు పల్కె నో
 యనఘ! మరుత్తనూజునుడి ♦ యంబుధి యింకె నటన్న రీతిగా
 మనమున నమ్మరాదు, సుర ♦ మర్దనుచిత్తము నే నెఱుంగుదున్
 జనకజపట్ల, నత్తరుణిఁ ♦ జంపఁడు నొంపఁడు నమ్ము రాఘవా! ౧౯౬౫

అర్థములు. ఆఁగి = అడ్డగించి, అంతయు నాకుఁ దెలియును. నీవు చెప్ప వలసిన పనిలేదని, సురమర్దను=రావణాసురుని.

తా త్ప ర్య ము

అని యింకను నేమేమో చెప్పఁబోవు లక్ష్మణుని నిలిపి రామచంద్రుని జూచి యిట్లనియె. పుణ్యాత్ముఁడా! సముద్ర మింకిపోయిన దని యెవరైన జెప్పిన నది యెంత నిజమో హనుమంతుఁడు చెప్పినది యంత నిజమే. నమ్మఁదగినదిగాదు. ఏల యందువా? సీతావిషయమున రావణుని చిత్తవృత్తి నే నెఱుంగుదును. ఆమెను వాఁడు చంపను జంపఁడు. మఱి యేవిధముగను బాధింపఁడు. నామాట నమ్ముము. ఆమెకు భయము లేదు.

ఉ. ఎంతయు వేఁడినాఁడ మను ♦ జేశ్వర! యాతనిమేలు గోరి భూ
 కాంతతనూజ వీడు మని ♦ కర్ణము లీయఁడు నా హితోక్తికిన్
 శాంతము దానభేదములు ♦ జాలము దండము వీన నేరికిన్
 బొంతను బోయి చూచుటకుఁ ♦ బోలదు పో జనకాత్మసంభవన్. ౧౯౬౬

అర్థములు. జాలము = ఇంద్రజాలము. మోసము.

తా త్ప ర్య ము

రామచంద్రా! సీతాదేవిని వదలిపెట్టుము, లంకలో నీ స్వాధీనమందుంచుకొనకుమని, నేనెంతయో చెప్పితిని. నా హితసూక్తి వాఁడు విన్నవాఁడు కాఁడు. సామదాన భేదములచేఁగాని, మాయాదండములచేఁగాని సీతాదేవి సమీపమునకైనఁ బోవుటకు నెవ్వరికి సాధ్యపడదు. కావున నింద్రజిత్తు సీతాదేవిని లాగి తెచ్చుట సంహరించుట యివి కొంచెమైన సత్యమని యనుమానింపనైనరాదు.

## —• { ఇంద్రజిత్తు నికుంభిల యాగముఁ జేయువార్త విభీషణుఁడు శ్రీరామునకుఁ దెలుపుట. } •—

సీ. ఏన నీకృతిచేత • నగులాభ మే మన్న, మోహపఱచి కపి•వ్యూహములను
గ్రూరుఁడై చైత్యని•కుంభిల రావణి, హోమంబుఁ జేయుచ • నున్నవాఁడు
అది పూర్ణమైనచో • నమరాదులకు నైనఁ, గలన నజయ్యుండు • కావ వాని
విక్రమక్రమమును • విఘ్నముఁ గావింప, వానరవర్యులఁ • బంపవలయు
ఆ మాయఁ బన్నినాఁడు•మనుజేంద్ర! సత్యంబు, వేల్మి ముగియుమున్న•వీరవరులఁ
గపులఁ బంపు మందుఁ•గారణ హీనమౌ, వగపు మాను రామ•భద్ర లెమ్ము.

అర్థములు. కృతిచేతన్ = ఇప్పుడు వాఁడుచేసిన కార్యముచేత, చైత్యనికుంభిలన్=నికుంభిల యను పేరుగల చైత్యమునందు, రాతికట్టడమునకు చైత్యమని పేరు. నికుంభిల దేవతపేరనియు ఆమెకు రాతితో నాలయము కట్టియున్నారనియు అందు మఱ్ఱిచెట్టు కలదనియు ఆ చెట్టుక్రింద నింద్రజిత్తు హోమము చేయుచున్నాఁడనియు నెఱుఁగనగు. చేయుచు నున్నవాఁడని వర్తమానార్థకమునఁ జెప్పుటచే వాఁడు నికుంభిల యొద్దకుఁ బోయినవార్త తన మంత్రులవలనఁ దెలిసికొనియే విభీషణుఁడు రామలక్ష్మణులఁ జూడవచ్చెనని భావము. అజయ్యుండు = జయింపసాధ్యముకానివాఁడు.

### తాత్పర్యము

నీవు చెప్పినది నిజమైన మొదల వాఁడీ ప్రకారము చేయనేల ? నిష్ప్రయోజనముగ వాఁ డిట్టి కార్యము చేయునా యందువేమో ? ఇంతవఱకు లంకలో యోధులగు వీరు లిచ్చట యుద్ధము చేయుచుండఁగా వాని యిష్టము వచ్చినట్లు వాఁడు హోమములుచేసి వచ్చుచుండెను.ఇప్పుడు లంకలో వాఁడు తప్ప నిచ్చటికి వచ్చి మనకుఁ బని కల్పింపఁ దగినవాఁడు లేఁడు.ఊరక హోమము చేయుచుండిన వానరులు లోపలఁ బ్రవేశించి లంక ధ్వంసముచేసి యజ్ఞమునకు విఘ్నమొనర్తురు. ఎవడు యజ్ఞము విఘ్నముచేయునో వానిచేతనే వాఁడు చచ్చునట్లు బ్రహ్మవరము గలదు, ఆ కారణముచే వానరులు గాని మీరుగాని యీ ప్రక్కరాకుండుటకై మన కిక్కడ నేడ్చుచుండు పని కల్పించి వాఁడు హోమము చేయుచున్నాఁడు. అది పూర్ణముగ నెఱవేఱెనా దేవతలైనను వానిని జయింపలేరు. కావున వాని పరాక్రమము విఘ్నము చేయ వానరులను బంపవలెను. వాఁడు మిమ్ముల నందఱ మోసగించినాఁడు. ఇది వాస్తవము. కావున వాని యజ్ఞము పూర్తికాకముందే వానరులఁ బంపుము. నిష్కారణమైన యేడుపు మానుము. లెమ్ము.

జం. వ్యసనమున మునుఁగు నిన్గని, పసచెడె సైన్యంబు శోక•భరమున మాతో
వెన సౌమిత్రిని బంపుము. కసి తీరఁగ నీతఁ డతని • గండడఁగించున్. ౧౯-౨౦

తాత్పర్యము

దుఃఖపడుచుండు నిన్నుఁజూచి సేనగూడ నిస్సారమై యున్నది. నీవు లేచి ధైర్య మవలంబించితివేని వానరులును బురికొందురు.ఆలస్యము చేయక మా వెంట లక్ష్మణుఁబంపుము. పగతీరగ నీయన యతనిఁ జంపును.

ఉ. శూరుఁడు లక్ష్మణుండు బల • సూదనవైరిసవంబుఁ దొల్త దు
ర్వారశరంబులం జెఱిచి • వాని వధించును వెండి శత్రుసం
హారమునం దుపేక్ష దగ • దానతి యిమ్ము సుమిత్రపట్టికిన్
వైరి సమాప్తకర్ముఁ డయి • నన్ విబుధాళికి నే నసాధ్యుఁ డౌ. ౧౯-౨౦

అర్థములు. బలసూదనవైరి సవంబు=ఇంద్రజిత్తు చేయు యజ్ఞము,సమాప్త కర్ముఁడు=యజ్ఞము పూర్తి చేసినవాఁడు.

తాత్పర్యము

అచ్చటికిఁబోయి చేయవలసిన దేమందురా? లక్ష్మణుఁడు ముందుగ నింద్ర జిత్తు యజ్ఞమును బాణములచే గొట్టి చెఱుపవలెను. ఆవల వానిని వధింపవలెను. ఈశత్రువును జంపుట యందుపేక్ష సేయరాదు. లక్ష్మణున కాజ్ఞ యిమ్ము.యజ్ఞము పూర్తియాయెనా దేవతలయినను వాని జయింప లేరు.

కం. సవమారఁ దీరెనేనియు, దివిజారిసుతుండు దివి న • దృశ్యుం డగుడున్
బవర మొనరించుఁ బదపడి, యవనీశ్వర ! యతని గెల్వ • నమరుల వశమే.

అర్థములు. సవము=యజ్ఞము, ఆరన్=పూర్ణముగ, తీరెనేని = చక్కఁగా నెఱవేఱెనేని, అదృశ్యుండు=కానరానివాఁడు, బవరము = యుద్ధము, పదపడి = ఆపిమ్మట.

తాత్పర్యము

యజ్ఞము పూర్తిగా నెఱవేర్చెనా యింద్రజిత్తు కానరాకుండ యుద్ధము చేయును. ఆవల వానిని గెల్వ దేవతలకు సాధ్యము గాదు.

## ౮౫-వ సర్గము. ఇంద్రజిత్తును జంప లక్ష్మణుఁ బంపుమని విభీషణుఁడు శ్రీరాము వేఁడుట

చ. అనవుడు దుఃఖతప్తమతి • యా నరపాలవరేణ్యుఁ డానుడుల్
వినియు గ్రహింపలేక ధృతి • వెండియుఁ గైకొని లేచి యిట్లనున్
విన మదిఁ గోరెదన్ దనుజ • వీర ! వచింపుము క్రమ్మఱంగ నీ
వనిన హితోక్తులన్న మహి • తాత్మకుఁడా యసురేంద్రుఁ డిట్లనున్. ౧౯౭౧

అర్థములు. దుఃఖతప్తమతి = దుఃఖముచేఁ దపించిన మనస్సు గలవాఁడు.

తాత్పర్యము

ఇట్లు విభీషణుఁడు చెప్పఁగా దుఃఖముచేఁ దపించిన మనస్సుగల రామచంద్ర మూర్తి యామాటలు వినియు గ్రహింపలేక ధైర్యము తెచ్చుకొని లేచి మరల

నిట్లనెను. రాక్షసవీరా! నీవు చెప్పిన హితములైన మాటలు మరలఁ జెప్పుము విన గోరెదను, అనిన విభీషణుఁ డిట్లనియె.

కం. నీయానతిఁ గొని చని యా, యా యెడలన్ నిలిపి సేన • లన్నియును యథా
న్యాయంబుగ విభజించితిఁ, జేయంగలయంతవట్టు • చేసితి నధిపా! ౧౯౨౨

తాత్పర్యము

నీ యాజ్ఞ తీసికొని పోయి యే యే యెడల నే యే సేనల నిలుపవలయునో యాయాచోటుల నాయాసేనల క్రమముగ నిలిపి సేనలను విభాగించి యెంతవఱకు భద్రపఱుప వలయునో యంతయుఁ జేసితిని. ఆ విచారము నీకక్కఱ లేదు.

ఉ. నా మన వాలకింపుమి మ•నంబున హేతువు లేని యార్తి మీ
రీ మెయి సంతపింప నన • నేటికి మా దురవస్థ దేవ! మా
యామయశోకమున్ విముత•హర్షకరంబును వీడి సమ్మద
స్థాయిఁ బరాక్రమంబుఁ గొని • శాత్రవులం బరిమార్పఁ జూడుమా. ౧౯౨౩

తాత్పర్యము

నేను జేయు మనవి వినుము, కారణము లేని దుఃఖముచే మీరీ ప్రకారము సంతాపపడఁగా మా దురవస్థ నేనేమని చెప్పుదును? దేవా! శత్రువుల సంతోష కరమగు మాయచేఁ గలిగిన శోకము వదలి సంతోషము నిలుకడగఁ గల పరాక్రమమును గ్రహించి శత్రువును వధింపుము.

ఉ. జానకిఁ గ్రమ్మఱం గొనఁగ • స్వాంతమునం గలదేనిఁ ద్రుంపుమీ
దానవపాళి నెల్ల, నల•దానికి నే నుపమన్ వచించెదన్,
వానరసేనతోడ రఘు•వర్య! నికుంభిల కిప్డు పంపుమీ
యీ నెఱబంటు లక్ష్మణుని • నీయన రావణిఁ ద్రుంచుఁ బోరిలోన్. ౧౯౨౪

అర్థములు. స్వాంతమునన్ = మనస్సునందు, ఉపమ = ఉపాయము, నెఱబంటు=మిగుల శూరుని.

తాత్పర్యము

నీకు జానకిని మఱల గ్రహింపవలయునని కోరిక యుండెనా రాక్షసులనెల్లఁ జంపుము. అంతవఱకు నీ కోరిక నెఱవేఱదు. ఆ కార్యము సాధించు నుపాయము నేను జెప్పెదను. వానరసేనతోడ నికుంభిలకు నీ శూరాగ్రేసరు లక్ష్మణుఁ బంపుము. ఈయన యింద్రజిత్తును వధించును.

తే. మండలీకృతభీమకో•దండుఁ డగుచు, భండనంబున నీతఁ డు•ద్దండవృత్తి
గండడంచును నిజభుజా•చండిమమునఁ, గాండకాండప్రయుక్తి నా•ఖండలారి.

అర్థములు. మండలీకృత = గుండ్రముగాఁ జేయఁబడిన, భీమ=భయంకర మైన, కోదండుఁడు = విల్లుగలవాఁడు, భండనంబునన్ = యుద్ధమందు, ఉద్దండ వృత్తిన్ = పరాక్రమముచే నధికమైన వ్యాపారముతో, నిజ=తనయొక్క, భుజా=

భుజబలమురెయొక్క, చండిమమునన్ = వాఁడిమిచేత, కాండ = బాణములయొక్క, కాండ=సమూహముయొక్క, ప్రయుక్తిన్ = ప్రయోగముచే, ఆఖండలారిన్ = ఇంద్రజిత్తును.

తా త్ప ర్య ము

లక్ష్మణుఁడు వానిని జంపఁగలఁడా యని సందేహింప వలదు, వింటిని గుండ్రముగా వంచి యుద్ధమున భుజబలము వాఁడిమి చేత బాణసమూహములఁ బ్రయోగించి యింద్రజిత్తును జంపగలఁడు.

చ. దశముఖనందనుండు మహితం బగు ఘోరతపం బొనర్చి బ్ర
హ్మశిరమునస్త్ర మభ్రచర • మైన తురంగతతిన్ వరంబుగా
దశరథనందనా! పడసెఁ • దామరసోదరుచేత, దాన నా
నిశిచరుఁ డేగినాఁడు క్రతు•నిర్వహణైకమనస్కుఁడై నృపా! ౧౪౭౬

అర్థములు. అభ్రచరము = ఆకాశమున సంచరించునది, తామరసోదరుచేతన్ = బ్రహ్మచే, క్రతునిర్వహణైకమనస్కుఁడై = యజ్ఞము పూర్తి చేయుటయందే మనస్సంతయు నుంచినవాఁడై.

తా త్ప ర్య ము

ఏమి ధైర్యముతో లక్ష్మణుఁ డితని జంపఁగలఁడని యడిగెదవేని వినుము. ఇంద్రజిత్తు ఘోర తపస్సుచేసి బ్రహ్మచేత బ్రహ్మశిర మను నస్త్రము ఆకాశసంచారము చేయు గుఱ్ఱములను దేరిని వరముగాఁ గోరి తీసికొనెను. ఆకారణము చేత వాఁడు యజ్ఞపూర్తియందే మనస్సంతయు నిల్పినవాఁడై పోయెను.

చ. బలగము చుట్టునుం బలియ • వాఁడు నికుంభిల కేగినాఁడు, వాఁ
డలసవమున్ ఘటించి యని•కై యరుదెంచిన మమ్ము నెల్లరం
దలఁపుము చచ్చినా రని, పి•తామహుఁ డుం గ్రతువిఘ్నకర్తయే
బలరిపువైరినిం దునుము•వాఁ డని చెప్పె వరంబు నిచ్చుచోన్. ౧౪౭౭

అర్థములు. బలము = సేన, బలియన్ = చుట్టుకొనఁగా, అల = ఆ, సవమున్ = యజ్ఞమును, క్రతువిఘ్నకర్తయే=యజ్ఞమునకు విఘ్నము చేసినవాఁడే, బలరిపు వైరినిన్=ఇంద్రజిత్తును.

తా త్ప ర్య ము

సేన తన్నుఁ జుట్టుకొని రాఁగా వారి నడుమఁ దాను గానరాకుండ నికుంభిలకుఁ బోయినాఁడు. ఆ యజ్ఞము వాఁడు పూర్తి చేసెనా మేమందఱము వానిచేతఁ జచ్చినార మనియే నమ్ముము. బ్రహ్మదేవుఁ డా వరమిచ్చువేళ నీయజ్ఞము నెవఁడు విఘ్నపఱచునో వానిచే నీవు చచ్చెదవని చెప్పెను. కావున లక్ష్మణుండు పోయి యజ్ఞమును విఘ్నపఱచెనా, లక్ష్మణుని చేతిలో వాఁడు తప్పక చచ్చును.

కం. కావున వానిం దునుమఁగ, నీ వనుమతి యిమ్ము జాన ♦ కీశ్వర! కలవన్
రావణి తెగ హితకలితో, రావణుఁడుం జచ్చినట్ల ♦ రామా! యనుచున్ ౧౯౭౮

తాత్పర్యము స్పష్టము.

చ. తెలియనివాఁడఁ గాను సుమ ♦ తిప్రవరా! యలవానిమాయలున్
బలము జవంబు, వాఁడు కడుఁ ♦ బ్రాజ్ఞుఁడు, బ్రహ్మశరంబెఱుంగు, వే
ల్పుల జలధీశు నైనఁ బోరి ♦ పుచ్చఁగనేర్చు రథస్థుఁడై, దివిన్
జలధరసంప్లవార్కు గతిఁ ♦ జక్షురగోచరుఁడై చరించెడిన్. ౧౯౭౯

అర్థములు. సుమతిప్రవరా = బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! జలధర = మేఘములచే, సంప్లవార్కు గతిన్ = కప్పబడిన సూర్యునివలె, చక్షురగోచరుఁడు = కన్నులకుఁ గానని వాఁడు.

## తాత్పర్యము

బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! యింద్రజిత్తు చేయు మాయలు, వాని బలము, వాని వేగము నేను దెలియని వాఁడఁగాను. వాఁడు మిగుల బుద్ధిమంతుఁడు. బ్రహ్మశరము తెలిసినవాఁడు. రథమునందున్న వాఁడై దేవతలను వరుణునైనఁ జంపఁగలఁడు. ఆకాశమందు మబ్బు మాటు సూర్యునివలె నెవ్వరికిఁ గానరాక తిరుగఁగలఁడు.

**—♦ ఇంద్రజిత్తును జంప శ్రీరాముఁడు లక్ష్మణుని నికుంభిలకుఁ బంపుట. ♦—**

సీ. అన దురాత్ముండైన ♦ యసురేంద్రనందను, బలమెంచి యనుజుతోఁ ♦ బలికె నిట్టు
లన్న! సుగ్రీవుని ♦ యఖిలసైన్యముతోడఁ, బవనజముఖ యూథ ♦ పతులతోడఁ
జాంబవంతునితోడఁ ♦ జని జాపిరము లేక, మడియింపవయ్య యా ♦ మాయలాని
నరుదెంచు నీమహి ♦ తాత్ముఁడు మంత్రుల, తో విభీషణుఁడును ♦ దోడుగాఁగ

ఆ. నతనిసవనతలము ♦ నితఁడు చూపునటన్న, నద్భుతోరువిక్ర ♦ మాఢ్యుఁడైన
లక్ష్మణుండు హేమ ♦ లసితచాపముఁ గేలఁ, గొన విభీషణుండు ♦ గొని మెనొండు.

అర్థములు. జాపిరము = జాగు, మాయలానిన్ = మాయల వానిన్, మాయలాఁడు ప్రథమ - సవనతలము = యజ్ఞప్రదేశము, అద్భుతోరు విక్రమాఢ్యుఁడు = ఆశ్చర్యకరమైన గొప్పదైన విక్రమ సంపద గలవాఁడు, ఇంతవఱకు విభీషణుఁడు గద ధరించియే యుండెను. ఇప్పుడు వింటితోను బనిపడునని తానొక్క వింటిని దీసికొనెను.

## తాత్పర్యము

ఈప్రకారము విభీషణుఁడు చెప్పఁగా దుష్టమనస్సు గల యింద్రజిత్తు బలమాలోచించి సులభసాధ్యుఁడు గాఁడని తలఁచి తమ్మునితో నిట్లనియె. అన్నా! సుగ్రీవుని సమస్తసైన్యముతోడ హనుమంతుఁడు మొదలగు యూథనాయకులతోడ జాంబవంతునితోడఁ బోయి ఆలస్యము లేక యా మాయలమారిని

జంపుము. ఈగొప్ప మనస్సు గల విభీషణుడు మంత్రులతో నీవెంట వచ్చి యజ్ఞవాటము చూపును. అని చెప్పఁగా నాశ్చర్యకరమై గొప్పది యగు పరాక్రమ సంపత్తి గల లక్ష్మణుఁడు బంగారుచేఁ బ్రకాశించు చాపముఁ జేతఁ దీసికొనెను. విభీషణుఁడును నొక విల్లు దీసికొనెను.

కం. సన్నద్ధుం డై కవచం,బు న్ని శితతరాసిబాణ♦ములు గైకొని తా
సన్నపదంబుల వ్రాలి ముదున్నతి వచియించి నిజమ♦హోద్యమవిధమున్.

అర్థములు. సన్నద్ధుండై = యుద్ధమునకు సిద్ధపడినవాఁడై, నిశిత తర= మిగుల వాఁడి యగు, అసి=కత్తి, బాణములు, ముదున్నతిన్ = సంతోషాతిశయముచే, నిజ = తన, మహోద్యమ విధమున్=గొప్ప ప్రయత్న విధమును.

తా త్ప ర్య ము

యుద్ధమునకు సిద్ధపడిన వాఁడై కవచంబు తొడిగికొని మిగుల పదునైన కత్తి బాణములు దీసికొని యన్న పాదముల వ్రాలి నమస్కరించి సంతోషాతిశయంబునఁ దన గొప్ప ప్రయత్న విధమును జెప్పెను.

ఉ. ఇప్పుడు మత్కరోజ్ఝిత శి♦తేషువు లా దశకంఠపుత్రుమే
నొప్పుగఁ దూఱి పుష్కరి♦ణి వ్యూహములై చొరఁబాఱు సంచలై
తొప్పలుదోరలై పడెడిఁ ♦ దూర్ణము లంకపయిన్ మహాత్మ ! వాఁ
డిప్పుడు మచ్ఛరాహతి మ♦హిం బడు దారితసర్వగాత్రుఁడై. ౧౯౨౨

అర్థములు. మత్ =నాయొక్క, కర = చేతులచే, ఉజ్ఝిత = చిమ్మఁబడిన, శిత=పదునైన, ఇషువులు = బాణములు,పుష్కరిణిన్ = సరస్సునందు, తొప్పలుదోరలై =గుంపులు గుంపులై,మత్+శరాహతిన్ = బాణముల దెబ్బచే,దారిత= చీల్పఁబడిన, సర్వగాత్రుఁడై = దేహమంతయు గలవాఁడై.

తా త్ప ర్య ము

ఇప్పుడు నాచే విడువఁబడిన బాణము లాయింద్రజిత్తు దేహమునందుఁ దూఱి సరస్సునందు గుంపులుగ వ్రాలు హంసలవలె లంకపై శీఘ్రముగ గుంపులు గుంపులుగాఁ బడును. ఇప్పుడు వాఁడు నాబాణములచేఁ జీల్పఁబడిన దేహము గల వాఁడై నేలఁబడును.

చ. అని వచియించి రావణివ♦ధాభిరతిన్ వలగొంచు భక్తి రా
మునిచరణాంబుజంబులకు ♦ మ్రొక్కి విభీషణుతోడ సంజనా
తనయునితోఁ బ్లవంగమని♦ కాయముతోఁ జనువాఁడు జాంబవం
తునిబలఁగంబుఁ గాంచి పడి♦త్రోవను దానిని గొంచు నేగుచున్. ౧౯౨౩

అర్థములు. వధాభిరతిన్ = చంపుట యందలి ప్రీతిచే, వలగొంచున్ = ప్రదక్షిణము చేసి.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పి యింద్రజిత్తును జంపు కాంక్షచే రామచంద్రమూర్తికిఁ బ్రదక్షిణించి యాయన పాదపద్మములకు నమస్కరించి విభీషణాంజనేయులతోను, వానరసేనతోడను బోవుచు నందుత్రోవలో జాంబవంతుఁడు కనబడఁగా నతని సేనను దీసికొని పోవుచు.

చ. చని చని దూరమందుఁ గనె ♦ శస్త్రభయంకర మై విశాల మై
ఘనతరకేతనోగ్ర మయి ♦ గాఢజవం బయి దీప్తిమంత మై
కనుఁగొనఁ గారుమబ్బునకు ♦ గాదిలిచుట్టము నై రహించు నా
దనుజవరేణ్యుసేనఁ, గని ♦ దారుణకార్ముకదండహస్తుఁడై. ౧౯౨౨

అర్థములు. శస్త్రభయంకరమై = ఆయుధముల వలన భయము గలిగించునదియై, ఘనతర=మిగుల గొప్పదగు, కేతన+ఉగ్రమై=ధ్వజముచే భయంకరమై, గాఢజవంబయి = మిగుల వేగము గలదై, దీప్తిమంతమై = ప్రకాశించునదియై, కారుమబ్బునకున్ = వానకాలపు మేఘమునకు, గాదిలిచుట్టమునై = ప్రియమైన బంధువై, అనఁగా సమానమై, దారుణ = భయంకరమైన, కార్ముకదండ=దండము వంటి వింటిని, హస్తుఁడై=చేతఁగలవాఁడై.

తాత్పర్యము

ఇట్లు పోయిపోయి దూరమందు శస్త్రములచే భయంకరమై విస్తారమై గొప్ప ధ్వజము కలదై, మిగుల వేగము గలదై ప్రకాశమానమై వానకాలపు మబ్బునకు సమానమై యొప్పు నా రాక్షసశ్రేష్ఠుని సేనలఁ జూచెను. చూచి భయంకరమైన వింటిని చేతఁదీసికొనినవాఁడై.

తే. పవనతనయునితోడను ♦ వాలితనయు,తో విభీషణుతోడ న♦ద్దుష్టు యజ్ఞ
మబ్జజునివాక్యవిధమున ♦ హతము సేయ,సిద్ధపడి యుండె నప్పుడా♦సేనఁజూపి.

తాత్పర్యము

హనుమంతునితోడ నంగదునితోడ విభీషణుతోడ నాదుష్టుని యజ్ఞమును బ్రహ్మవాక్యము ప్రకారము నాశముచేయ సిద్ధపడి యుండెను. అప్పుడా సేనను జూపి.

## ౨౬-వ సర్గము. విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తుండు చోటు చూపుట.

కం. బాధక మరులకు నై హిత, సాధక మారీతిఁ బలికె ♦ సౌమిత్రి ! ద్విష
ద్యోధులయూథముఁ గనుము ప,యోధరనీలంబు దాని♦నుగ్రశరములన్. ౧౯౨౬

అర్థములు. అరులకున్ = శత్రువులకు, బాధకము = బాధ కలిగించునది, హిత సాధకము=మేలు సమకూర్చునది, ద్విషత్ యోధుల యూథము = విరోధి వీరుల సమూహము, పయోధర నీలంబు=మేఘములవలె నల్లనిది.

### తాత్పర్యము

శత్రువులకు బాధ కలిగించునది, మిత్రులకుఁ గార్యము సాధించునది యగు రీతి విభీషణుఁ డిట్లనియె. లక్ష్మణా! విరోధులగు యుద్ధవీరుల సమూహము మబ్బువలె నల్లగాఁ గానవచ్చుచున్నది చూడుము. దానిని భయంకర బాణములచే.

ఉ. పాయలు పాయఁ గొట్టు మది ♦ పాసినయంతనె తోఁచువాఁడు దై
తేయధవాత్మనందనుఁడు ♦ ధీరుఁడు క్రూరుఁడు వంచకుండు దు
ర్జేయపరాక్రముండు ఖల♦శీలుఁడు సర్వజగద్భయంకరుం
డా యధముండు సేన నడు♦మంతరమందు సవంబు సల్పెడిన్. ౧౯౨౭

అర్థములు. పాయలుపాయన్ = చీలికలుగా విచ్చునట్లు, అది = ఆ సేన, నడుమంతిరమందు=నడుమ.

### తాత్పర్యము

దానిని జీలికలై పోవునట్లు గొట్టుము. ఆ సేన తొలఁగి పోయెనా ధైర్యశాలియు, క్రూరుఁడు, మోసగాఁడు, తెలియఁ గష్టమైన పరాక్రమము గలవాఁడు, దుష్టస్వభావము గలవాఁడు. ప్రపంచమున కంతయు భయము కలిగించువాఁడు, నీచుఁడునగు రావణకుమారుఁడు దానినడుమ యజ్ఞము సేయువాఁడు కానవచ్చును.

కం. అనవుడుఁ బిడుగులఁబోలిన, ఘనశరముల లక్ష్మణుండు ♦ కడిమిం గురిసెన్
వనచర భల్లుక సంఘము, చని గవిసెన్ శైలభూజ♦సాధన మగుచున్. ౧౯౨౮

అర్థములు. కడిమిన్=బలము కొలఁది.

### తాత్పర్యము

విభీషణుఁ డిట్లు చెప్పఁగాఁ బిడుగులవంటి బాణములను లక్ష్మణుఁడు బలము కొలఁది గురియించెను. కోఁతుల యెలుఁగుల సంఘము చెట్లు కొండలు నాయుధములుగాఁ దీసికొనిపోయి యా సేనపైఁ బడెను.

—♦ కపు లింద్రజిత్సేనలతోఁ బోరుట ♦—

చ. కలఁగక రాక్షసుల్ ముసల♦ఖడ్గపరశ్వధతోమరాదులన్
బలిముఖసేనఁ దాఁకుటయు ♦ వారికి వీరికిఁ బోరు ఘోరమై
యులివె పురంబు నల్గడల ♦ నుద్ధవిడిం గలసెన్, సభంబు సం
కుల మయి తోఁచె నుద్యదసి♦కుంత శరాద్రిమహీజపూర్ణమై. ౧౯౨౯

అర్థములు. ఉలివె=ధ్వనియొ, ఉద్ధవిడిన్ = మిగుల వేగముతో, ఉద్యత్= ఎత్తఁబడిన, అసి=కత్తులచేతను, కుంత = ఈటల చేతను, శర=బాణములచేతను, అద్రి=కొండలచేతను, మహీజ=చెట్ల చేతను, పూర్ణమై=నిండినదై.

### తాత్పర్యము

రాక్షసులును గలఁత చెందక రోకండ్లతోను, కత్తులతోను, గండ్రగొడ్డండ్లతోను, చిల్లకోలలతోను వానరసేనను దాఁకఁగా వారికి వీరికి యుద్ధము ఘోరము

కాఁగా నాధ్వని లంకాపురము నలుప్రక్కల నిండెను. వారిచే నెత్తఁబడిన కత్తుల తోను, ఈటెలతోను, బాణములతోను, కొండలతోను, చెట్లతోను నిండినదై యాకా శము వ్యాపించినదై కానవచ్చెను.

మ. తమపై భీకరశస్త్రముల్ గురియుచున్ ♦ దర్పించు కీనాశసం
ఘములం గీశులు వృక్షభూమిధరసం ♦ ఘాతంబులం గూల్చి దు
ర్దమదోశ్చండిమ చాటుచున్ శలభవా♦రంబో యనన్ మూఁగి సం
తమసాకారచమూసమూహముల ఛి ♦ న్నంబై చెడం గూల్చినన్. ౧౯౯౦

అర్థములు. కీనాశ=రాక్షసులయొక్క, దుర్దమ = అణఁపరాని, దోశ్చండి మన్ = భుజబలముయొక్క వాఁడిమిచే, శలభవారంబో=మిడుతల సమూహమో, సంతమస+ఆకార = గాఢాంధకారమువలెనున్న. చమూసమూహములన్=సేనల గుంపును, ఛిన్నంబై =చీలినదై.

తాత్పర్యము

తమమీఁద భయంకరములైన యాయుధములువైచి గర్వించు రాక్షస సమూహములకు వానరులు చెట్లయుఁ, గొండలయు సమూహములచే పడఁగొట్టి యణఁపరాని భుజబలాతిశయము ప్రకటించుచు, మిడుతల సమూహమువలె మునరి గాఢాంధకారమువంటి సేనాసమూహమును చీలిచెడునట్లు కొట్టఁగా.

కం. వారల మునుమున నిలువఁగ, నేరక రాక్షసులు చెదర ♦ నిజసైన్యము దై
న్యారంభముఁ గని వేలిమి,కారియమున్ విడిచి లేచి♦కనలున వచ్చెన్. ౧౯౯౧

అర్థములు. మునుమునన్ = ముందు, వేలిమి కారియమున్ = యజ్ఞకార్య మును, కనలున = కోపముతో, కర్త ప్రకరణమును బట్టి యింద్రజిత్తు అనుపద మధ్యాహారము.

తాత్పర్యము

వారల ముందు నిలువలేక రాక్షసులు చెదరిపోఁగా తన సేనయొక్క దీన స్థితిఁ జూచి హోమము చేయుట విడిచి కోపించి యింద్రజిత్తు వచ్చెను.

సీ. వృక్షాంధకారంబు ♦ విడిచి వెల్వల వచ్చి, మహితరోషంబున ♦ మండిపడుచుఁ
బూర్వకల్పితరథ♦మును నధిరోహించి, కాలాభ్రనిభుఁ డుగ్ర ♦ కార్ముకంబుఁ
గొనుచు రక్తాక్షుఁడై ♦ క్రుద్ధాంతకునిఁ బోలి, తరలిన లక్ష్మణుఁ♦దాఁక నున్న
బలము లాతనితేరు ♦ బలసి నిల్చుండిన, నీ లోన రావణి ♦ యెఱుక వడమి

ఆ. మారుతాత్మజుండు ♦ మందరతుల్యుండు,కల్పవహ్నిఁ బోలి ♦ కాల్పఁ జొచ్చె
వృక్షహస్తుఁ డగుచు ♦ నెగచి, యరాతుల, రూపుమాపె ననమ♦రాక్షవృత్తి.

అర్థములు. వృక్షాంధకారంబు=చెట్టు చీఁకటి, ఆ మఱ్ఱిచెట్టునీడ చీఁకట్లు క్రమ్మినట్లున్నదని భావము, పూర్వకల్పితరథమును = ముందు కల్పించుకొని

యుండిన తేరిని, అధిరోహించి = ఎక్కి, కాలాభ్రనిభుఁడు = నల్లని మేఘముతో సమానుఁడు, క్రుద్ధాంతకుని=కోపించిన యముని.

### తా త్ప ర్య ము

ఇంద్రజిత్తు యజ్ఞము చేయుచున్న చెట్టుయొక్క చీకటివంటి నీడలోనుండి వెలుపల వచ్చి మిక్కిలి కోపమున మండిపడుచు ముందే గుఱ్ఱములుకట్టి సిద్ధముగా నుండిన తేరెక్కి నల్లని మబ్బువంటివాఁడు భయంకరమైన విల్లుచేసికొని కోపముచే నెఱ్ఱనగు కన్నులు గలవాఁడై కోపించిన యమునిబోలి పయనింపఁగా లక్ష్మణుని దాఁకనున్న సేనలు వాని తేరిని జుట్టుకొని నిలుచుండెను. ఈలోపల నింద్రజిత్తు కానరాలేదేయని హనుమంతుఁడు మందరపర్వతమువలె దేహమును బెంచినవాఁడై ప్రళయకాలాగ్నివలె రాక్షసులను కాల్ప నారంభించెను. చెట్టు చేతఁ బూనికొని రాక్షసులఁ దఱిమి మిగుల కఠినుఁడై వ్యూహపనాశము గావించెను.

### —♦ హనుమంతుఁడు రాక్షసుల నాశ మొనర్చుట ♦—

సీ. జవనాధికుండగు ♦ పవమానసుతుఁ దాఁకె, బలలాశిసంఘముల్ ♦ భయదభంగి
శితశూలపాణులు ♦ శితశూలధారలఁ, గరవాలహస్తులు ♦ ఖడ్గములను
బట్టిసాయుధకరుల్ ♦ పట్టిసాయుధముల, శక్తిప్రయుక్తుల ♦ శస్త్రధరులు
పరిఘముద్గరగదా♦పరశుశతఘ్నుల, భిండిపాలంబుల ♦ భీమభంగిఁ

తే. దలములను ముష్టులను రేఁగి♦ తాఁచుచుండ
నరకు గొనకేమియును వాని ♦ జదును చేసి
పీన్గపెంటలు గావించె ♦ భీషణాహి
తాహితార్క్ష్యుండు గంధవ♦హాత్మజుండు. ౧-౯౩

అర్థములు. జవనాధికుండు = వేగముచే నధికుఁడు, అధిక వేగము గలవాఁడు, తలములను=అఱచేతులను, చదునుచేసి = నేలతో సమముగఁ జేసి, భీషణాహిత = భయంకరశత్రువు లనెడి, అహి = సర్పములకు, తార్క్ష్యుండు=గరుత్మంతుఁడు, గంధవహాత్మజుండు=వాయుపుత్రుఁడు.

### తా త్ప ర్య ము

అధిక వేగము గల హనుమంతుని రాక్షససమూహములు భయంకరరీతి మార్కొనెను. వాఁడిగల శూలములు చేత ధరించినవారు శితశూలధారల చేతను, కత్తులు చేతధరించినవారు కత్తుల చేతను, అడ్డ కత్తులవారడ్డకత్తులతోను, శక్తులఁ బ్రయోగించువారు శక్తులతోను, గండ్రగొడ్డండ్లుగుదియలు గదలు ఇనుప గుదియలు శతఘ్నులు విసిచివాటుగుదియలు వీని చేతను, అరచేతుల చేతను, పిడికిళ్ళను విజృంభించి కొట్టుచుండ వానిని లక్ష్యము సేయక భయంకరశత్రువులను పాములకు గరుత్మంతుని వంటివాఁడగు హనుమంతుఁడు పీనుగు పెంటలు చేసెను.

చ. ఎదిరెడు రాక్షసోత్కరము • లేయు శరంబుల లోఁగ కేమియున్
గదనము సేయుచున్న బలి • గాడుపుపట్టిని జూచి సారథీ
పదిలముగాఁగ బోరు నల • వానరుపై మన తేరు పోవ ని
మ్మెదర కుపేక్షచేయ బల • మెల్లను ద్రుంచు నతండు సుమ్మనన్. ౧౯౯౪

## తాత్పర్యము

తన్నెదిరించి రాక్షస సమూహములు వేయు బాణములకు లోఁబడక యుద్ధము చేయుచున్న బలవంతు వాయుపుత్రునిజూచి సారథీ! యదిగో దిట్టముగ యుద్ధము చేయు నా వానరు మీఁదికి మన తేరిని పోనిమ్ము.ఇప్పుడు మన ముపేక్ష చేసితిమా సేన నంతయు నతఁడు ధ్వంసము చేయును.

## —• ఇంద్రజిత్తు హనుమంతు నెదుర్చుట. •—

ఉ. సారథి యట్లసేయుటయు • సాయక సంహతి ఖడ్గవృష్టులన్
దారుణ పట్టిసంబుల ని • తాంత జవంబున శూలకోటులన్
మారుతి ముంచెఁ, గేసరి కు • మారుఁడు వానిని బాయఁ దట్టి యా
క్రూరునితోడ ని ట్లనియె • రోషము వేషముఁ గొన్న కైవడిన్. ౧౯౯౫

అర్థములు. సాయకసంహతిన్=బాణసమూహములచేతను, ఖడ్గవృష్టులన్=కత్తుల వర్షము చేతను, భయంకరములైన యడ్డకత్తులచేతను శూలముల కోటుల చేతను మిగుల వేగముగా హనుమంతుని ముంచెను. హనుమంతుఁడును వానినెల్లఁ దోలఁగఁ దన్ని రోషము రూపము గొన్నయట్టులా క్రూరునితోడ నిట్లనియె.

శా. ఓరీ దుష్టనిశాట! దుర్మతి! రణో • ద్యోగంబునన్ నీవునన్
శూరుం డేనియు రమ్ము యుద్ధమునకుం • జొక్కంపురీతిన్ బలో
దారున్ మారుతిఁ దాకి ప్రాణములతో • దైత్యేంద్రపుత్రా! మఱిం
బోరా దెట్లు నియుద్ధకేళికిని రా • పో చూచెదన్ నీ గతిన్. ౧౯౯౬

## తాత్పర్యము

ఓరీ దుష్ట రాక్షసుఁడా! దుర్బుద్ధీ! యుద్ధకార్యమునందు నీవు కూడ నొక శూరుఁడవేని చక్కని రీతి వంచనలేక యుద్ధమునకు రమ్ము. బలాతిశయము గల హనుమంతు నెదిరించి ప్రాణములతో నీవా పోఁగలవు.ద్వంద్వయుద్ధమునకు రమ్ము. నీగతి చూచెదను.

చ. ఎసఁగిన నాదుపోటు సహి • యించినచోఁ గద నీవ! యింట వం
చనమున ధిక్కరించు పవ • నాత్మజు నేయ శరాసనంబుఁ దా
మసలక యెత్తుచుండ శత • మన్యుజితుండు సురారి వాఁడె యా
రెసఁ గను మంచుఁ జూపె నిని • ద్రిమ్మరిఱేఁడు సుమిత్రపట్టికిన్. ౧౯౯౭

### తాత్పర్యము

దృఢత్వముచే నతిశయించిన నాచేతి పోటు నీవు సహించినఁగదా నీవుఁడా నీవు శూరుఁడవు. అని గర్వించి ధిక్కరించు హనుమంతునిపై బాణములు వేయుటకు విల్లెత్తుచున్నవాని నింద్రజిత్తుఁ జూచి విభీషణుండు లక్ష్మణా! యదిగోఁ జూడుము. వాఁడే యింద్రజిత్తని లక్ష్మణునకుఁ జూపెను.

కం. కవిసినవాఁ డనుమపయిన్, జవమునఁ జని నీదుతీవ్ర•శరముల వానిన్
భువిఁ గూల్పు మంచు గర్జా,రవు ధరనిభు భీమబలుని•రావణిఁ జూపెన్. ౧౯౯౮

### తాత్పర్యము

హనుమంతుని మీఁదఁగవిసెను. త్వరగాఁబోయి నీ బాణములచే వాని నేలఁ బడఁగొట్టుమని పర్వతమువంటి వానిని గర్జించువానిని భయంకరబలుని నింద్రజిత్తును జూపెను.

—• { ౮౭-వ సర్గము. విభీషణుఁడు లక్ష్మణునకు నింద్రజిత్తు యజ్ఞము చేయు న్యగ్రోధముఁ జూపుట. } •—

ఆ. చూపి యిట్లు ముదము•సుబ్బఁగ లక్ష్మణుఁ దోడుకొంచుఁ బోయి•తూర్ణగతిని
నవతిదూర మొండు•వనముఁ బ్రవేశించి యందుఁ గానిపించె • యజ్ఞవిధము.

అర్థములు. సుబ్బఁగన్=బయలుపడఁగా, అనతిదూరము=కొంచెముదూరము.

### తాత్పర్యము

ఈప్రకారము చూపి యజ్ఞము విడిచి వచ్చినాఁడుగదా యను సంతోషము బయలుపడుచుండ లక్ష్మణుని పిలుచుకొనిపోయి సమీపమందున్న యొక్క వనము ప్రవేశించి యం దింద్రజిత్తు చేయు యజ్ఞము విధమును జూపెను.

సీ. సౌమిత్రి మేచక•జలదసంకాశంబు, ఘోరరూపంబు న్య•గ్రోధ మిదియె
దైతేయసుతుఁ డిందు • భూతబలుల్ దీర్చి, హోమంబు సాగించి•యుద్ధమునకు
వచ్చు వచ్చినను నే•వారి కదృశ్యుఁడై, సంగ్రామ మొనరించుఁ•జలుల బలుఁడు
వధియించుఁ గొండఱ • బంధించుఁ గొందఱఁ, జిత్రవధము సల్పు•శత్రువరుల

ఆ. మరల నింద్రజిత్తు • మఱ్ఱి డాయఁగ నీక, వేరితోడ నాశ్వ•సారథిగను
బిలుకుమార్పు మన్న•నలరుచు లక్ష్మణుం,డల్లె యనుచు మీఁకు•నసమగుణము.

అర్థములు. మేచక జలదసంకాశంబు=నల్లని మేఘముతో సమానము, ఘోరరూపంబు=భయంకర స్వరూపము గలది, న్యగ్రోధము=మఱ్ఱి, పిలుకుమార్పుము=చంపుము, గుణము=అల్లెత్రాడు.

### తాత్పర్యము

లక్ష్మణా! నల్లని మేఘముతో సమానమై భయంకరాకారమైన మఱ్ఱి యిదియే, ఇచ్చట నింద్రజిత్తు భూతములకు బలులిచ్చి హోమంబు పూర్తిచేసి

యుద్ధమునకు వచ్చును. వచ్చినా యెవ్వరికిఁ గానరాక యుద్ధము చేయును, శత్రువుల కొందఱఁ జంపును. కొందఱఁ గట్టివేయును.కొందఱను చిత్రవధము చేయును. మరల నింద్రజిత్తు మఱ్ఱి దగ్గఱకు రాకుండునట్లు తేరితో గుఱ్ఱములతో సారథితోఁ జంపుము.అనిన లక్ష్మణుండునంతోషించి యట్లు లేచే సెదనని యల్లిత్రాడు మీఱెను.

ఆ. అగ్నివర్ణమైన • యరదంబుపై నెక్కి, కవచి ధన్వి ధ్వజియు • ఖడ్గియగుచు
రావణాత్మజుండు•గ్రక్కున నటకు రాఁ జండకోపి లక్ష్మ•ణుండు పలుకు. ౨౦౦౧

అర్థములు. కవచి = కవచము దొడిగికొనిన వాఁడు, ధన్వి = ధనుస్సు బట్టినవాఁడు, ధ్వజి = ధ్వజము గలవాఁడు, ఖడ్గి = కత్తిగలవాఁడు,యజ్ఞము చేయు ఋత్విజుని వేషము వదలి దాని యాశ మానుకొని యుద్ధవీరుని వేషము వేసెనని దీని భావము.

తాత్పర్యము

అగ్నికాంతిగల తేరెక్కి కవచము తొడిగికొని విల్లు తీసికొని ధ్వజము గలవాఁడై ఖడ్గము ధరించి హనుమంతునితో యుద్ధము చేయుచున్న యింద్రజిత్తు మఱ్ఱియొద్దనున్న లక్ష్మణు నొద్దకు రాఁగా మిగుల కోపించి లక్ష్మణుఁ డిట్లనియె.

కం. వచ్చితి వెదకుచు నీకై, యిచ్చటికి రణాతిథేయ • మిమ్మా నిను నే
నిచ్ఛగఁ బిలిచెద రమ్మా,కుచ్ఛితుఁడా! నీదు మాయ•కొనసాగ దికన్. ౨౦౦౨

అర్థములు. రణాతిథేయము=యుద్ధమనెడి యతిథిభిక్ష, ఇచ్ఛగన్ = నిండు మనస్సుతో, కుచ్ఛితుఁడా=మోసగాఁడా.

తాత్పర్యము

నిన్ను వెదకుకొనుచు వచ్చితిని, యుద్ధభిక్ష పెట్టుము. మనసారఁ బిలుచు చున్నాను. వంచకుఁడా ! నీ మాయ లిఁక సాగవు.

—• ఇంద్రజిత్తు విభీషణు నధిక్షేపించుట. •—

కం. అనఁ దత్పరిసరవర్తిని, బినతండ్రి విభీషణాఖ్యు • వీక్షించి యనున్
మన మెరియఁగ గోపంబునఁ,గనుఁగవ నిప్పుకలు రాల•గర్వం బెసఁగన్. ౨౦౦౩

అర్థములు. తత్ పరిసరవర్తిని = ఆయనకుఁ బ్రక్కనున్న వానిని, ఎరియఁగన్=మండఁగ.

తాత్పర్యము

లక్ష్మణుఁ డిట్లు చెప్పఁగా నాయన ప్రక్కన నుండిన తన పినతండ్రిని విభీషణుని జూచి కోపముచే మనస్సు మండుచుండఁగా రెండు కన్నుల నిప్పులు రాలుచుండ గర్వముతో నిట్లనియె.

కం. రాక్షస! యిటఁ బుట్టి పెరిఁగితి, సాక్షాదనుజుఁడవు నాదు • జనకునకును నో
రాక్షస! పినతండ్రివి ప్రత్యక్షపుద్రోహంబు తగునె•తనయుని పట్లన్? ౨౦౦౪

అర్థములు. రూక్ష=కఠిన చిత్తుఁడా!, ఇలన్ = ఈ కులము నందు, సాక్షా దనుజుఁడవు=సొంత తమ్ముఁడవు.

తాత్పర్యము

కఠిన చిత్తుఁడా! యీ కులమునందు ఈ వంశమందు పుట్టితివి. పెరిఁగితివి. నా తండ్రి నీవొక తల్లిబిడ్డలు. కావున నీవు నాకుఁ బినతండ్రివి అయ్యు కొడుకు విషయమున నన్నుఁ జంపింప వలయు నను నిటువంటి ప్రత్యక్షద్రోహము తగునా?

ఉ. చుట్ట మటన్న మాట యది • సున్న, స్వజాత్యభిమాన మేని క
న్పట్టదు, స్నేహభావ మొ య•భావము, లేదు ప్రమాణబుద్ధియేన్
గట్టఁడి! ధర్మచింతనము • కానఁగ రాదుగ, దుష్టబుద్ధి! తోఁ
బుట్టినవాఁడ టన్నమతి • పుట్టునె నీకును ధర్మదూషణా! ౨౦౦౫

అర్థములు. కట్టఁడి = నియమహీనుఁడా, ధర్మదూషణా = ధర్మమును దూషించువాఁడా.

తాత్పర్యము

ధర్మద్రోహీ! దుష్టబుద్ధీ! నీయందు చుట్టము నను మాటయు లేదు. నేను నీకుఁ జుట్టమని వైనఁ దోఁచి యుండిన నీవిట్టి పని చేయుదువా? చుట్టమను నభిప్రాయము లేకుండిన మన జాతివాఁడు కదా యని తోఁచినను నీవిట్లు చేయుదువా? జాత్యభిమానము లేకున్నఁబోనీ, ఇంతకాలము కూడి యుంటమే యను స్నేహభావ ముండిన నిట్లు చేయుదువా? అది లేకుండినఁ బోనీ, మర్యాదానియామకమైన గలదా? అది లేకుండిన ధర్మవిచారమైనఁ గలదా? ఇట్టిది యేదియు లేని నీకు నీకఁ దోడబుట్టినవాఁడు, వీనికి ద్రోహము చేయరాదన్న బుద్ధి కూడఁ బుట్టునా?

కం. తనవారి విడిచి పగులన్, బనివాఁ డయి కొలుచు నీయ•వస్థం గని స
జ్జననిందనీయ! నీయెడ, మన మతిదుఃఖంబుచేత • మఱిఁగెడుఁ గుమతీ! ౨౦౦౬

అర్థములు. పనివాఁడు=సేవకుఁడు, మఱిఁగెడున్=సంతాప పడుచున్నది.

తాత్పర్యము స్పష్టము.

కం. ఎక్కడి స్వజనావాసం, బెక్కడి పరజనులసేవ • యీమాత్రము నీ
కక్కట భేదము, దోఁపద, చక్కఁగ నీచులకు బుద్ధి•చతురత గలదే? ౨౦౦౭

అర్థములు, స్వజనావాసము=తనవారిలో వసించుట.

తాత్పర్యము

తన బంధువులలోఁ గలసి మెలసి సమానబుద్ధితో నుండు టెక్కడ? ఇతరుల యొద్ద సేవచేయుచుఁ బడియుండు టెక్కడ? ఈమాత్రము నీకు భేదము తెలియ దాయెఁగదా. నీచులకు బుద్ధి నేర్పు గలదా?

కం. తనవార లగుణు లేనియు, ఘనగుణములచేతఁ బరులు • ప్రాలిర యేనిన్
గన నుత్తము లగుణులె యగు, తనవారలె, పరులు పరులె•తథ్యము కుమతీ!

అర్థములు. కుమతీ=కుచ్ఛితపుబుద్ధి గలవాఁడా! అగుణులు = గుణము లేనివారు, "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్, స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" యను భ. గీ. శ్లోక మిట ననుసంధింపవగు. గుణవంతు లాశ్రయింపఁ దగినవారు, తనవారు గుణవంతులు కానపుడు వారినెట్లు ఆశ్రయింప నగు నందు వేమో!

### తాత్పర్యము

తనవారు గుణహీనులైనను ఇతరులు గొప్ప గుణములు గలవారైనను గుణములు లేని తనవారే యుత్తములు గాని పరులెన్నఁటికైనను బరులే. ఇది నిజము.

కం. తమవారి విడిచి పరపక్షముఁ గోల్చెడివారు స్వజన♦సంఘము నిర్మూ
లము గాఁగ బిదపఁ దాముసు, విమతులచేఁ జెడుట నిజము ♦ వెంగలివిత్తా,

అర్థములు. వెంగలివిత్తా = బుద్ధిహీనుఁడా !, పరపక్షము = శత్రువుల పక్షము, విమతులచేన్=విరోధులచే.

### తాత్పర్యము

తన బంధువుల వదలి శత్రువుల నాశ్రయించి వారికి సాహాయ్యము చేయువాఁడు తనవారందఱు నిర్మూలమైన పిదప నా శత్రు పక్షము వారిచేతనే తానును జెడును. శత్రువులు వీని సాహాయ్యముచే వీనివారిని వధియించి తరువాత శత్రుశేష ముండనీయరాదని వీనినే వధింతురు (మనదేశపు రాజులు నాశమైనదీవిధముగనే)

కం. దయ యన్న మాట లేకిటు, నయహీనా! తెగితె యింత ♦ నాశపుఁ బనికిఁ
క్రియ ఘోరకృతికి నెవ్వఁడు, మెయికొనఁ జుట్టమవు నీవు ♦ మిగిలినఁ దండ్రీ!

అర్థములు. నయహీనా = నీతిమాలినవాఁడా! ఇటు = ఈప్రకారము, నేను చేయు హోమము విఘ్నము చేయింప లక్ష్మణుని బిలుచుకొని వచ్చునంతటి పనికి. తెగితె = సాహసించితివా, ఘోరకృతికిన్=క్రూరమైన కార్యము చేయుటకు, మెయికొనున్=అంగీకరించును.

### తాత్పర్యము

దయ యను మాటయైన లేక నీతిమాలిన వాఁడా! యిటువంటి కొడుకును జంపించు ఘోరకార్యముచేయ తండ్రీని చుట్టమవైన నీవు తప్ప మఱియొకఁడు సాహసించునా?

### —♦ విభీషణుఁ డింద్రజిత్తునకు సమాధానముఁ జెప్పుట ♦—

తే. అనుడు నాయన్నకొమరున♦కని విభీష,ణుండు రాక్షసనాథసు♦తుండ! యనయ
శీల! నాశీల మెఱుఁగని♦లీల నేల,వదర? గౌరవవశమునఁ♦బదర వలదు. ౨౦౧౧

అర్థములు. గౌరవవశమునన్ = పినతండ్రి నను గౌరవముచేత, పదర వలదు=తొందరపడి మాటలాడవలదు, రాక్షసనాథ సుతుఁడ ననుటచే, ఆ తండ్రికిఁ దగిన కొడుకవే నీవు, అనయశీల=దుర్నీతియే స్వభావముగాఁ గలవాఁడా.

### తాత్పర్యము

అని యిట్లు తన్ను దూషించు నన్నకొడుకునకు విభీషణుఁ డిట్లనెను. రాక్షస రాజకుమారుఁడా! నీ వా తండ్రికిఁ దగిన కుమారుఁడవే. నన్ను నీవు నయహీనుఁడ నంటివి. కాని నీవలె నేను అనయవంతుఁడనుగాను. ఏలన నా స్వభావము నడవడి నీ వెఱుఁగనిదికాదు. నే నేనాఁడైన నీతికి విరుద్ధమైనకార్యము చేసితినా? ఏల యిట్లు వదరెదవు? నేను నీకుఁ బినతండ్రినని నాయందు నీకు గౌరవము కలదా నేను నీవు అన్న కొడుకని తలంచుటకు? నీకు నేను బిన్నతండ్రియను గౌరవబుద్ధియుండెనేని యిప్పు డిట్లు మాటలాడుదువా? ఆనాఁడు సభలో "నీదు తమ్ముఁడె విభీషణుఁ డొకఁడె సుమ్ము తండ్రి యీ, యార్యకులంబునం బ్రభవ మందెను దుర్యశమ్ముం గడింపఁగన్" అని మాటలాడుదువా? నన్ను నీవు సభలో నింత చులకనగా మాటలాడినపుడు నీయందు నా కెట్లు వాత్సల్య ముండఁగలదు? ఆనాఁడు నీవు మాటలాడినవి పిన్నతండ్రి ననవలసిన మాటలా? ఈ బంధుత్వము ఈ గౌరవము నేఁడే కనఁబడు చున్నది కాబోలు.

కం. జననము క్రూరాసురకుల, మున నైనను నేమి? గుణమె • ముఖ్యము గాదా
జనులకుఁ? గావున గుణమున, వినరా రాక్షసుఁడఁగాను • వేమాఱులకున్. ౨౦౧-౨

### తాత్పర్యము

ఓరీ నీవు చెప్పినట్లు నేను రాక్షసులలోఁ బుట్టితిని, రాక్షసులలోఁ బెరిగితిని. కాదనను. కులము ప్రధానమా, గుణము ప్రధానమా? గుణము ప్రధాన మగు నేని నేను రాక్షసుఁడఁగానని వేయిమార్లు చెప్పెదను.

కం. రుచియింపవు దారుణములు, రుచియింప దధర్మ మెపుడు • క్రూరుఁడ! నాకున్
గుచరిత్రుఁ డన్న యెవ్వఁడు, వచియించుఁ బోకాలు మనుచు • భ్రాతన్ సభలోన్?

అర్థములు. దారుణములు = క్రూరకార్యములు, పోకాలు = ఛీపో.

### తాత్పర్యము

మీరు చేయు క్రూరకార్యములు నా కెన్నఁడు రుచించినవికావు. వానిని నే నామోదించిన వాఁడనుగాను. ఏనాఁడైన నే కార్యమందైన మీతోఁడఁగలసివచ్చి పనిచేసితినా? మీకు నేను సహాయము పడితినా? అధర్మము నాకు రుచించినదికాదు క్రూరుఁడా! అన్నను విడనాడితి నంటివి. ఎంతటి నీచపు నడవడి కలవాఁడైనను తా నన్నయని నేను తమ్ముఁడనని తలంపుఁ గలవాఁడు నిండుసభలో ఛీపో నాయొద్ద నుండకు మని విడనాడునా? నా మాటలు తన కిష్టము లేకున్న వినియూరకుండ రాదా? నీ యాలోచన నాకు సరిపడలేదనరాదా? తమ్ముని సభలో నవమానించుట, చంపుటకాదా? నిష్కారణముగ నాశ్రితుని వెడలఁగొట్టుట చంపుట కాదా? అన్నదమ్ముల వావి నేఁడే తెలిసెను కాఁబోలు.

కం. ధర్మవిహీనునిఁ గల్మష,కర్ముని గరగతముఁ బాము♦కరణిని విడి స
త్కర్ముం డిహమునఁ బరమున, శర్మంబుల ననుభవించు ♦ జాల్మా వింటే.

అర్థములు. జాల్మా = బుద్ధి లేనివాఁడా ! ధర్మము విడిచిన వానిని, నంతతోఁబోక పాపకర్మములు చేయువానిని చేత దొరకిన పామును వదలినట్లు వదలి పుణ్యకార్యములు చేయువాఁడు ఇహమందుఁ బరమందుఁ గూడ సుఖముల ననుభవించును. ఇంటి దీపమని యెవ్వఁడైన ముద్దుపెట్టుకొనునా ? పాము చేతికి దొరకినదని దానితో నెవ్వఁడైన నాడుకొనునా ? కావున నైనవారినైనను ధర్మవిహీనుల వదలవలయును. ధర్మగుణము లేనివారినే వదలవలసి యుండఁగా బాప కార్యములు కూడఁ జేయువారిని వదలుట చెప్పనేల ?

కం. పరధనములఁ బరదారల, హరియించుట హింస యీ దు♦రాచారంబుల్
పురుషుఁడు మండెడుగేహము, కరణిన్ విడనాడవలయుఁ ♦ గలుషాత్మకుఁడా !

తాత్పర్యము

పాపపు మనస్సు, పాప స్వభావము గలవాఁడా ! పరుల ధనములను పరుల భార్యలను హరించుట హింస గావించుటయను నీ దుష్టపు నడవడులను మండు చున్న యింటిని వదలినట్లు పురుషుఁడు వదలవలయును. ఇది నా యిల్లెయని యభిమానము వహించి కాలెడి యింటిలో నుండిన నెట్లు చచ్చునో పరస్త్రీలను పరధనములను హరించు వానితోను, క్రూరునితోను బంధువుగదా యని కలిసియుండిన వానితోడ వీఁడును జచ్చుట నిజము.

కం. పరవిత్త మపహరించుట, పరదారలఁ గోరుచుంట ♦ స్వసుహృత్తతి ని
ర్భరసంశయ మీ మూఁడును, దురితాత్మ ! వినాశ హేతు♦దోషంబు లగున్.

తాత్పర్యము

పరుల ధనము నపహరించుట పరులభార్యల కాశపడుట తన మేలు కోరువారి యందు సందేహబుద్ధి-యీ మూఁడును వినాశకారణములు. ఈ దుర్గుణము లన్నియు నీ తండ్రియందు దున్నవి. తన మేలుగోరి నేను జెప్పఁగా నన్ను శత్రుపక్షమునఁ జేరిన వాఁడనని తనకీడు కోరుచున్నాననికదా నీ తండ్రి నన్ను సందేహించెను. నాయందు వానికి శత్రుబుద్ధి యున్నప్పుడు నేనందుండిన మాత్రము వాఁడు నన్ను మిత్రుఁడని భావించునా? నీవు నాకుఁ బ్రత్యక్షశత్రువని సభలోఁ జెప్పిన తరువాతఁ గూడ నే నందుంటి నేని నేనేదో కీడుచేయుట కున్నాననియేకదా వాఁడు తలంచును. అట్టిహాత్మునితో నేనెట్లు బ్రతుకఁగలను ?

చ. వినుము మునికోటిహింసనము ♦ వేల్పులతో నెడలేని పోరులున్
గనలుచు బద్ధవైరమును ♦ గర్వము నన్యులమేలు సైపమిన్
మనుగడ సర్వసంపదలు ♦ మాన్పెడి దోషము లివ్వి యున్న యం
దనయము నిల్చి డాఁచె సుగుణావళిఁ గొండను మేఘము ల్వలెన్. ౨౧౭

### తాత్పర్యము

ఓరీ! నాతండ్రియందు సుగుణములు లేవా, దుర్గుణములే చెప్పెదవే యందు వేమో! నే నా మాట చెప్పలేదు. నీతండ్రియందు సుగుణములు కలవుకాని,మును లను హింసించుట, దేవతలతో విడువని కలహము, మిగులఁ గోపము, పగకు కంక ణము కట్టుకొనుట, పొగరు, ఇతరుల మేలు చూసి సహింపలేకుండుట, ఇవి జీవిత మును సర్వసంపదలు నాశము చేయుగుణములు. దుర్గుణము లన్నయందుండి కొం డను మేఘములు క్రమ్మి కొండ కానరాకుండఁ జేసినట్లు వాని మంచి గుణములను మఱుగుపఱిచెను. అయిన నీవు గుణములే గ్రహింపరాదా? దుర్గుణముల నేల గ్రహింపవలె నందువేమో? విషము కలిపిన యన్నమును తేనెను పూర్ణముగఁ బరిహరింపక స్వీకరించు టెట్లు?

కం. ఈ దోషము లుండుటచేఁ, గాదే నాయన్న నీదు ♦ కన్నయ్యను నే మోదమున విడుచు టిలపై, లే దీపురి నీవు లేవు ♦ లేఁడు జనకుఁడున్. -౨౦౧౮

### తాత్పర్యము

ఈ దోషము లుండుటచేఁ గదా నా కన్నయు, నీకు దండ్రియు నగు వానిని సంతోషముతో వదలి వచ్చితిని. ఇఁక భూమిమీఁద నీ లంక లేనిదే. నీవు లేని వాఁడవే. నీ తండ్రి లేనివాఁడే. మీ రందఱు నాశమైతి రని నమ్ముము.

కం. అతిమానివి బాలుఁడవు, స్మృతిహీనుఁడ వెఱుఁగ వీ వ ♦ ణంకువ నైవ స్వతపాశబద్ధుఁడవు నీ,నుతిఁ దోచినదెల్ల వదరు ♦ మూ వైధేయా! -౨౦౧౯

అర్థములు. వైధేయా = మూఢుఁడా, అతిమానివి = మిగుల గర్విష్ఠుఁ డవు, వైవస్వత పాశబద్ధుఁడవు = యమపాశములచేఁ గట్టఁబడిన వాఁడవు.

### తాత్పర్యము

నేనే బలవంతుఁడను,బ్రహ్మవరములు గలవాడను,నాకెవ్వ రెదురను గర్వము నీయందు విస్తారముగఁ గలదు. దానికిఁదోడు పిల్లవాఁడవు. తాఁకు దప్పులు తెలి యని వాఁడవు. బాలుఁడైనను మంచిచెడ్డ యాలోచించు శక్తియు లేనివాఁడవు. వినయ మనునది యెట్టిదో నీ వెఱుఁగవు. యముని పాశములచేఁ గట్టఁబడి చావ సిద్ధపడి యున్నావు. కావున నోరి మూఢుఁడా! నీ నోటికి వచ్చినదెల్ల వదరుము.

ఉ. చేటు ఘటిల్లె నీకిపుడు ♦ చేసెడి దే మిఁక నీవు? రిత్త వా కాటులతోడ నే మగును ♦ గ్రమ్మఱ మట్టిని జేర లేవు, సం స్ఫోటమునందు రాఘవుల ♦ ముంగల జీవము నిల్ప లేవు, నీ కూటరణంబు చెల్ల దిఁకఁ ♦ గూల్చును లక్ష్మణుఁ డిప్డు నిన్ననిన్. -౨౦౨౦

అర్థములు. వాకాటులు = వాగ్వాదములు, సంస్ఫోటమునందు=యుద్ధము నందు, కూటరణంబు = మోసయుద్ధము.

### తాత్పర్యము

ఓరీ! నీ కేమో కీడుమూడినది. ఇప్పుడు నీవు చేయఁగల దేమున్నది? ఉత్తవాక్కలహముతో నీవు నన్నని, నేను, నిన్నని వాదించిన రాఁగల లాభ మేమి? నీవు మరల మఱ్ఱిమొద్దకుఁ బోలేవు. హోమము చేయలేవు. ప్రత్యక్ష యుద్ధమందా నీవు లక్ష్మణు నెదుట బ్రదుకలేవు. ఇదివఱకుఁ జేసిన మాయాయుద్ధము లింక సాగవు. యుద్ధమందు లక్ష్మణుఁడు నిన్నిప్పుడే చంపును.

చ. చని యొనరింపుమీ యముని ♦ సంయమినిన్ నిజదేవతార్చనన్
దనుబల మంతయున్ సకల ♦ దారుణశస్త్రములున్ వ్యయంబుగాఁ
బొనరుపుమీ, సుమిత్రసుతు ♦ భూరిశరాళికి గోచరుండవై
చనుటయ కల్ల యిమ్మెయిని ♦ సైన్యము నీవును లంకలోనికిన్. ౨౦. ౨౧

### తాత్పర్యము

నీ విచ్చటఁ జేయఁదలచిన దేవతార్చనము యముని సంయమనిపురమునకుఁ బోయి యచ్చటఁ జేయుము. నీ దేహబలము శస్త్రబలము అస్త్రబలము సర్వ మిచ్చటనే వ్యయము చేయుము. లక్ష్మణు బాణములకు గోచరించి నీవు బ్రతుకుట యబద్ధము. ఈ దేహముతో సేనతోడ నీవు లంకకుఁ బోఁజాలవు.

## —♦ ౮౮-వ సర్గము. ఇంద్రజిల్లక్ష్మణుల సంభాషణము ♦—

సీ. అనవుడు నామాట♦లాలించి కోపించి, యుద్యతాయుధుఁ డయి♦యుగ్రవృత్తిఁ
బ్రళయాంతకునిఁబోలి ♦ భయదచాపం బెత్తి, కఱకు బాణంబులు♦కాంతు లీన
దృఢరథస్థితుఁ డయి ♦ తేజుచే దీపించు, నుదయాద్రిగతభాను ♦ నొప్పు గలిగి
హనుమంతుమూఁపుపై ♦ నాసీనుఁ డగువాని, సౌమిత్రి శత్రుహిం♦సనసమర్థుఁ
ఆ. గాంచి యను మదీయ♦కార్ముక ప్రవిముక్త, ఘోరదుస్సహాశు ♦ గోరువృష్టి
మింట నుండి కురియ♦మిసికెక రేగతిఁ, జూడు నీవు నీదు♦తోడివారు. ౩౦ ౨ ౨

అర్థములు. ఉద్యతాయుధుఁడు=ఎత్తఁబడిన యాయుధము గలవాఁడు. ఉదయాద్రిగతభానున్=తూర్పుకొండపై నున్న సూర్యుని, శత్రుహింసన సమర్థున్=విరోధులఁ జంపుటయందు శక్తి గలవాని, మదీయ=నాయొక్క, కార్ముక=వింటినుండి, ప్రవిముక్త=విడువఁబడిన, ఘోర=భయంకరమైన, దుస్సహ=సహింపరాని, ఆశుగ=బాణముల, ఉరువృష్టిన్=గొప్పవాన, చూడు అను క్రియకు నీవు నీ తోడివారు అనునవి కర్తృపదములు. "ఒకానొకచో నహార్థంబున యుష్మదస్మదర్థంబు లభిహితంబు లగునపుడు క్రియలు తత్కర్తృకంబులు విభావనగు. ప్రౌ. వ్యా. క్రియ. ౨౬. 'మహద్బహుళకర్తృకక్రియకు నేకవచనంబు విభావ నగు' ప్రౌ. వ్యా. క్రియ. ౬. నీ తోడివారి తోడ నీవు చూడు మని యన్వయము.

### తాత్పర్యము

విభీషణుఁ డిట్లు చెప్పఁగా విని కోపించి యాయుధ మెత్తినవాఁడయి విల్లు తీసికొని ప్రలయాంతకునివలెనై వాఁడి బాణంబులు మెఱయుచుండఁగా గట్టి రథమందుండి తూర్పుకొండమీఁద ప్రకాశించు సూర్యునివలె హనుమంతు మూఁపుమీఁద నున్నవాని శత్రువుల సంహరించుటయందు సమర్థుఁ డగువాని లక్ష్మణుఁ జూచి యిట్లనియె. నా వింటనుండి బయలువెడలు ఘోరమై సహింపరానిదైన బాణముల జడివానవలన నీ తోడివారితోడ నీ వెట్లు దుఃఖించెదవో చూడుము.

ఉ. ఇప్పుడు నిన్ను నీ బలము♦నెల్లను మత్కరముక్తబాణముల్
గప్పి దహించుఁ దూలికలఁ♦ గాల్చెడు నగ్నినిబోలి లక్ష్మణా!
యిప్పుడె మీర లందఱును♦ నేఁగెద రొక్కటఁ గాలుప్రోలికిన్
దప్పక మల్లఘుప్రదర♦ దారుణవృష్టుల నోర్చు నెవ్వఁడో. ౨౦.౨౩

అర్థములు. తూలికల = ఏకుల, ప్రదర = బాణముల, దారుణవృష్టి = భయంకర వర్షము.

### తాత్పర్యము

ఇప్పుడు నిన్ను, నీ సేనను నేను ప్రయోగించు బాణములు నిప్పులు దూదేకులఁ గాల్చునట్లు దహించును. లక్ష్మణా! యిప్పుడె మీరందఱు యమపురికిఁ దప్పక పోవుదురు. ఎవరు నా బాణవర్షమును సహింపఁగలరు?

చ. మఱచితి వేమొ లక్ష్మణుఁడ♦ మత్పవితుల్యకలంబధారలన్
గొఱకొఱ యార్పుతోఁ దెలివి♦ గోల్పడి ధారిణిఁ ద్రెళ్ళి యుండుటన్
మఱవక యున్నచో యముని♦మందిరముం జనఁ గోరి వచ్చితో
కఱకరి సర్పముం జెనయఁ♦గా నిట వచ్చితి వేమొ బేలవై. ౨౦.౨౪

అర్థములు. మత్ = నాయొక్క, పవితుల్య = వజ్రాయుధముతో సమానములైన, కలంబధారలన్ = బాణముల వర్షధారలచే, కఱకరి = క్రూరమైన, బేలవై = మూఢుఁడవై.

### తాత్పర్యము

లక్ష్మణా! వజ్రముతో సమానమైన నా బాణముల ధారలచే తెలివి తప్పి భూమిమీఁద కొనయూపిరితోఁ బడియుండుట మఱచితివా? అది మఱవలేని యముని యింటికిఁ బోదమని వచ్చితివా? క్రూరసర్పమును జెనకుటకై తెలివి మాలినవాఁడవై యిచ్చటికి వచ్చితివేమి?

కం. అనవుడు నభీతవదనుం,డును క్రోధియు నగుచు లక్ష్మ♦ణుఁడు పలికెను జే
తనుగాని పగ్గెలాడితి, వని దీర్చి వచించువాఁడు♦ ప్రాజ్ఞుం డెందున్. ౨౦.౨౫

అర్థములు. అభీతవదనుఁడు = భయపడని ముఖము గలవాఁడు, క్రోధియున్ = కోపము గలవాఁడు, పగ్గెలు = పౌరుషవాక్యములు - ప్రజ్ఞలు.

### తాత్పర్యము

అని చెప్పఁగా ముఖమున భయచిహ్నములు లేక కోపచిహ్నములు గలఁ వాఁడై లక్ష్మణుఁ డిట్లనెను. చేతగాని ప్రతిజ్ఞ లేల పలికెదవు? పనిచేసి చెప్పు వాఁడుగదా బుద్ధిమంతుఁడు.

ఆ. పనికిరానికొన్ని • పలుకులు పలుకుచు, నేరి కలవిపడని•కారియములఁ
జలిపినట్లు చెప్పి • సంతోష పడియెదు, ధన్యతముఁడ వనుచు • దాశకంఠి!

తాత్పర్యము స్పష్టము.

కం. పరికిని గోచరింపక, యారే యుద్ధమున మఱఁగి • యటు లోనరింపన్
బౌరుష మెచ్చనె? యదియును, జోరునిమార్గంబు గాక • శూరుని విధమే?

అర్థములు. రే=రాత్రి, మఱఁగి=చాటుగనుండి, పౌరుషము=మగతనము.

తాత్పర్యము స్పష్టము.

కం. నీశరపథమున నిల్చితి, నాశరవర! నీవు దొల్లి • యగపఱిచిన బా
హాశక్తిఁ జూపుమీ కన, నాసించితి ఫలము గలదె•వ్యర్థోక్తులచేన్. ౨౦ ౨౮

అర్థములు. శరపథమునన్ = బాణముల మార్గమున, ఆశరవర=రాక్షస శ్రేష్ఠుఁడా!, బాహాశక్తి=భుజబలము.

తాత్పర్యము స్పష్టము.

### — • ఇంద్రజిల్లక్ష్మణయుద్ధ ప్రారంభము • —

ఉ. నావుడుఁ గోపఘూర్ణనయ•నద్వయుఁ డై నిశితాశుగంబు లెం
తేవడిఁ బైపయిం దెఱపి • నింతయు నీక మహోద్ధతంబుగా
రావణి వైచె, వైచిన శ•రప్రకరంబులచే విధూమ మౌ
పావక మో యనం బొలిచెఁ•బార్థివుఁడున్ క్షతజార్ద్రగాత్రుఁ డై. ౨౦ ౨౯

అర్థములు. కోపఘూర్ణనయనద్వయుఁడై = కోపముచే కలఁతచెందిన రెండు కన్నులు గలవాఁడై, నిశిత ఆశుగంబులు=పదునైన బాణములు, విధూమము=పొగలేనిది, పావకము = అగ్ని, క్షతజార్ద్రగాత్రుఁడై=నెత్తుటిచేఁ దడిసిన దేహము గలవాఁడై.

### తాత్పర్యము

అని చెప్పఁగా నింద్రజిత్తు కోపముచేఁ దిరుగుచున్న కన్నులు గల వాఁడై పదునగు బాణములు మిగుల వేగముగ మీఁద మీఁద సందులేక ప్రయోగించెను. అట్లు వాఁడు వేసిన బాణముల సమూహములచే లక్ష్మణుఁడు నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడై పొగలేని యగ్నివలెఁ గనఁబడెను.

ఉ. దానవ పొంగి తీర్చితిఁ గదా కెలసం బని రాక్షసుండు గ
ర్జానినదార్భటిన్ నభము • వ్రయ్యఁగఁ జేయుచుఁ బల్కె లక్ష్మణా?

మానితమద్ధనుర్గళిత ♦ మార్గణ కుండలి మండలంబు నీ
ప్రాణసమీరణంబుల దు ♦ రంబున నిప్పుడు గ్రోలుఁ జూడుమీ. ౨౦౩౦

అర్థములు. దానన = దానిచేతనే, కెలసము = కార్యము, గర్జానిన దార్భటిన్ = మేఘ ధ్వనివంటి ధ్వనితో, మానిత=గౌరవింపఁబడిన, మత్ = నా యొక్క, ధనుర్గళిత = వింటినుండి బయలువెడలిన, మార్గణ = బాణములను, కుండలి = పాముల, మండలంబు = సమూహము, నీ ప్రాణసమీరణంబుల = నీ ప్రాణవాయువులను, దురంబునన్=యుద్ధమందు, గ్రోలున్=త్రాగును.

తాత్పర్యము

తన బాణముల నివారింపలేక గాయపడెను గదా, యింకఁ గార్యము చక్కఁ జేసితినని పొంగి యింద్రజిత్తు మేఘధ్వనివలె గర్జించి యాకాశము వగులఁజేయుచు నిట్లనెను. లక్ష్మణా! పూజ్యములైన నా బాణములను సర్పములు నీ ప్రాణవాయువుల నిపుడే త్రాగును చూడుము.

కం. నక్కలు డేగలు గ్రద్దలు, గ్రిక్కిఱియుచు వ్రాలి నా వ ♦ రిష్ఠశరములన్
దిక్కఱి కూలిన నిన్నుం, బొక్కలి పొడుచుచును దినుతఁ♦బోరుచుఁ దమలోన్.

తాత్పర్యము స్పష్టము.

చ. కవచము తునకలై ధనువు ♦ ఖండితమై పరిధూతశీర్షమై
తెవి పడియున్న దుష్టుని న ♦ ధీరుని భక్తవరేణ్యు క్షత్రబం
ధువు నినుఁ జూచుఁ బో పరమ ♦ దుర్మతి రాముఁ డటంచుఁ బల్క నా
పావరుఁ దుటారపున్నడికి ♦ భూవరుఁ డాడు సహేతుకోక్తులన్. ౨౦౩౨

అర్థములు. పరిధూతశీర్షము = ఎగురఁ గొట్టఁబడినతల, ఐ = కలిగి, తెవి = తెగి, అధీరుని = పిఱికిని, క్షత్రబంధువు = నీచక్షత్రుని, తుటారము = పరుషము.

తాత్పర్యము

నీవు తొడిగిన కవచము తునకలై, విల్లు విఱువఁబడినదై, తల యెగురఁ గొట్టబడినదై చచ్చి పడియున్న నిన్ను దుష్టుని పిఱికిని తన భక్తుని నీచ క్షత్రియుని పరమదుష్ట మనస్సుగల రాముఁడు చూచును గాక యని పలుకఁగా నా పొగరుతోఁ గూడిన పరుషపుమాటకు సకారణములైన మాటల లక్ష్మణుఁ డిట్లనియె

కం. పలువా! వాగ్బల మేలా, పలికితి వెది నీవు సలుపు ♦ వాఁడ వటంచున్
సలువుగ నది దీరిచి కీ, ర్తులఁ బొందఁగ రాదె రిత్త ♦ దూషణ మగునే? ౨౦౩౩

అర్థములు. పలువా = పలు+వాయి=అనేక విధములుగ వదరువాఁడు, బహుభాషి, రిత్తదూషణము=వ్యర్థముగ నిందించుట.

తాత్పర్యము స్పష్టము.

కం. అగ్గించుకొనెదు దేనిని, నిగ్గింపక యున్న నీవ • నిష్ఠురచరితా
యెగ్గింపుము నీ పల్కిన, పగ్గెలు నెఱవేర్చి నన్ను • వాఁడను నేనున్. ౨౦౩౪

అర్థములు. అగ్గించుకొనెదు = నిన్ను నీవే పొగడుకొనెదవు, నిగ్గింపక = నిర్వహింపక, ఎగ్గింపుము = నిందింపుము.

తాత్పర్యము

నీవేపనియుఁ జేయకముందే నిన్ను నీవే పొగడుకొనుచున్నావు. కఠినశీలుఁడా! నీవు పలికిన పౌరుషములు నెఱవేర్చి నన్ను నిందింపుము. నేను నమ్మెదను.

కం. కఱకులు ప్రేలక యేనియుఁ, గొఱఁతల నిడఁబోక పొగడు • కొనకే నిపుడీ
కఱకుశరంబుల నీ తల, నొఱగించెద నేల నాదు • నొఱపు రహింపన్. ౨౦౩౫

అర్థములు. ఒఱపు = ప్రతాపము, రహింపన్ = ప్రకాశింపఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. అని యాకర్ణాపూరిత, సునిశితశరపంచకంబుఁ • జొప్పించెను న
ద్దనుజుని యురమున నవి వెలిఁ, గెను ఱొమ్మునఁ దీవ్రకరుని • కిరణము లనఁగన్.

అర్థములు. ఆకర్ణాపూరిత = చెవివఱకు నిండ లాగఁబడిన, సునిశిత = పదునైన, శరపంచకంబు = ఐదు బాణములు, తీవ్రకరుని = సూర్యుని.

తాత్పర్యము

చెవి వఱకుఁ బూర్ణముగా లాగఁబడిన పదునైన బాణములైదు ఆ రాక్షసుని ఱొమ్మున నాటింపఁగా నవి వాని ఱొమ్మున సూర్యుని కిరణముల వలె వెలిఁగెను.

తే. దాన రావణినొచ్చి ని • తాంతరోష, కలితుఁడై వైచె మూఁడుమా • ర్గణములుఱక
రాముతమ్మునిమీఁదఁ బరస్ప • రజయ, వాంఛలను బోరి రిద్ద ఱ • వారితముగ.

అర్థములు. నితాంతరోష కలితుఁడై = మిగులఁ గోపము కలవాఁడై, ఉఱక = లక్ష్యము లేక, అవారితముగ = అడ్డము లేక.

తాత్పర్యము

అట్లు బాణములు నాటుటచే నింద్రజిత్తు నొచ్చినవాఁడై మిగులఁ గోపించి లక్ష్యము సేయక మూఁడు బాణములు లక్ష్మణుపై ప్రయోగించెను. ఇట్లిద్దఱు జయము గోరి యడ్డము లేక పోరిరి.

ఉ. ఇద్దఱు విక్రమాన్వితులు • నిద్దఱు భూరిభుజాబలాఢ్యు లా
యిద్దఱు సుప్రసిద్ధులును • నిద్దఱు శస్త్రవరాస్త్రకోవిదుల్
తద్దయు దుర్జయుల్ హరిప • దంబునఁ బోరు గ్రహంబు లట్లిరై
యుద్ధిగఁ జెంగిపోక రణ • ముగ్రతఁ జల్పిరి దుష్ప్రధర్షణుల్. ౨౦౩౭

అర్థములు. విక్రమాన్వితులు = పరాక్రమముతోఁ గూడినవారు, భూరి భుజబలాఢ్యులు = గొప్పభుజబలము గలవారు, సుప్రసిద్ధులు = మిగుల ప్రసిద్ధి గాంచినవారు, శస్త్రవరాస్త్రకోవిదులు = శ్రేష్ఠములగు నస్త్రశస్త్ర విద్యయందుఁ

బంధితులు, తద్దయున్ = మిక్కిలి, దుర్జయుల్ = జయింపరానివారు,హరిపదంబు
నన్=ఆకాశమందు, అట్టిరు = అట్టివారు, ఉద్దిగన్ = సమానముగ, చెంగిపోక =
వీడిపోక, దుష్ప్రధర్షణుల్=తిరస్కరింపరానివారు.

తాత్పర్యము స్పష్టము.

కం. సింగము సింగముఁ దాఁకిన, భంగిని బెనఁగిరి నితాంత • పౌరుషయుతులై
లొంగక సడలక నిర్జర, పుంగవవృత్రులన మనుజ•పుంగవ దనుజుల్, ౨౦౩౯

అర్థములు. నితాంత = అధికమైన, పౌరుషయుతులై = పౌరుషముతోఁ
గూడినవారై, లొంగక=లోబడక, సడలక = వదలక, నిర్జరపుంగవ వృత్రులు=
ఇంద్రుఁడు, వృత్రుఁడు, మనుజపుంగవ దనుజుల్=నరశ్రేష్ఠుఁడు, రాక్షసుఁడు.

తాత్పర్యము

సింహము సింహము నెదిరించిన విధముగా మిగులఁ బౌరుషము గలవారై
యొకరి కొకరు లోబడక వదలక, యింద్రుఁడు వృత్రుఁడు యుద్ధము చేసినట్లు
లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు యుద్ధము చేసిరి.

ఉ. ఒండొరు మీఱు సంతసము • నొండొరు మీఱెడి సాహసంబు దా
రొండొరు మీఱు శౌర్యమును • నొండరు మీఱు రణాభిలాష ము
ద్దండధనుఃకళానిపుణ • తల్ శరవేగము మీఱు చుండఁగా
నొండొరు ముంచి రుగ్రమహి • తోగ్రకలంబకదంబకంబులన్. ౨౦౪౦

అర్థములు. రణాభిలాష = యుద్ధకాంక్ష, ఉద్దండ=వాఁడిమి గల, ధనుః
కళానిపుణతల్ = ధనుర్విద్యయందలి చమత్కారము, కలంబకదంబకంబులన్ =
బాణసమూహముచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఒక్కరుఁ డేయుమార్గణము • లొండొకరుం డెడఁ ద్రుంచి వైచు వే
ఱొక్కఁడు వేయులోన మతి • యొక్కఁడు ముంచు శరాళి నిట్లు దా
రెక్కువ తక్కువల్ తోఁడర • కేడ్తెఱ శంబరవాసవాభులై
మిక్కిలి తెంపు పెంపునను • మేటిలి పోరిరి జల్లజంపులై. ౨౦౪౧

అర్థములు. ఎడన్ = నడుమనే, ఏడ్తెఱన్ = పరాక్రమముతోఁ, శంబర
వాసవాభులై=శంబరుతోను ఇంద్రునితోను సమానులై,జల్లజంపులు=సాహసులు.

తాత్పర్యము స్పష్టము.

—• ౮౯-వ సర్గము. ఇంద్రజిత్తు లక్ష్మణబాణంబులచే నొప్పుట •—

సీ. శ్రవణావతంసిత • జ్యాలతికుం డయి, సౌమిత్రి క్రుద్ధుఁ డై • జంగ మనఁగ
నిట్టూర్పుచును గడు•బెట్టిదంబుగ నొక్క, దొడ్డనారసమును • దొడిగి యేయఁ

దద్గుణటంకృతి♦ధ్వానసమాకర్ణనంబున మోము తే♦జంబు వాయ
వెల్ల వెల్లనయి♦జిల్లపాటున శక్ర, వైరి లక్ష్మణు మోము ♦ వంకఁ గనిన
ఆ. వానివిధ మెఱింగి ♦ ప్రధనసంయుక్తుఁ బ్రఖ్యాతలేంద్రజుని వి♦భీషణుండు
చేరి వైరియందుఁ♦జిహ్నముల్ గన వాఁడు, చెడుట నిజము త్వరయుఁ♦జేయవయ్య.

అర్థములు. శ్రవణావతంసిత జ్యా లతికుండయి=చెవియందలి పుష్పముగాఁ జేయఁబడిన తీఁగవంటి యల్లెత్రాడు గలవాఁడై, క్రుద్ధభుజంగము = కోపించిన పాము, తొడిగి = సంధించి, తత్, గుణటంకృతి = అల్లెత్రాటి టమ్మనునట్టి, ధ్వాన=ధ్వనియొక్క, సమాకర్ణనంబునన్ = వినుటచే, ప్రధన సంయుక్తున్ = యుద్ధకార్యమునందుఁ గూడిన వానిని, అనఁగా బాణములు వేయుటయందే మన స్సుంచినాఁడే కాని లక్ష్మణుఁడు వైరిస్థితి చూచినవాఁడు కాఁడనుట.

తాత్పర్యము

లక్ష్మణుఁడు చెవి వఱకు వచ్చునట్టు లల్లెత్రాడీడ్చి కోపించిన పామువలె నిట్టూర్పు విడుచుచు మిగులఁ గ్రూరమగు నొక గొప్ప బాణము సంధించి వేయఁగా నా నారిధ్వని వినుటచేతనే ముఖమునఁ గాంతి చెడి తెల్లపాఱి సత్త్వము చెడి యింద్రజిత్తు లక్ష్మణు మోము చూడఁగా వాని తీరు చూచి యుద్ధమందే మనస్సు నిలిపిన లక్ష్మణుని సమీపించి విభీషణుఁడు వైరి యందలి లక్షణములు చూడఁగా వాఁడు చెడుట నిజము. నీవు త్వర చేయుము.

ఆ. అనుడు నగ్నిశిఖల ♦ కనుగుఁదోఁబుట్టు లౌ, వాలురంపగములఁ ♦ బాఁపపిండు
పుట్టలోనఁ దూఱు ♦ పోలుపున నాతని, మేను దూఱ నేసె ♦ మెత్తఁబడక.

అర్థములు. అగ్నిశిఖలకు = అగ్నిజ్వాలలకు, అనుగుఁ దోఁబుట్టువులు సమానములు, వాలు + అంపగములన్=నిడుపాటి బాణసమూహములను, పాఁప పిండు=పాముల సమూహము.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా మెత్తఁబడకయ యగ్నిజ్వాలలవంటి బాణసమూహములను పాములు పుట్టలోఁ దూఱునట్లు వాని దేహమునఁ దూఱనేసెను.

మ. బలభిత్సాధనతుల్యబాణచయసం♦స్పర్శంబునన్ వాఁడు వ్యా
కులసర్వేంద్రియుఁడై జడుండయి వ్యథా♦కుంభీభవత్కార్యుఁడై
కలనన్ మేడ్పడి యుండి తెప్పఱిలి నీ♦షత్కంపప్రభావాఢ్యు ను
జ్జ్వలతేజున్ నృపసూతిఁ గాంచి యనె వా♦చాగర్వ మేపారఁగన్. ౨౦

అర్థములు. బలభిత్+సాధన+తుల్య = ఇంద్రుని యాయుధమగు వజ్రముతో సమానమైన, బాణచయ=బాణసమూహముయొక్క, సంస్పర్శంబునన్ = తాఁకుటచే, వ్యాకుల = కలఁతగల, సర్వేంద్రియుఁడై=సమస్తములైన యింద్రియములు గలవాఁడై, జడుండయి = నిశ్చేష్టుఁడై, వ్యథా=బాధచే, కుంభీభవత్ =

మొక్కపోయిన, కార్యుఁడై=పనిగలవాఁడై, కలనన్ = యుద్ధమందు, మేద్పడి = తెలివి తప్పి, నిష్కంప ప్రభావాఢ్యున్ = చలింపని ప్రభావసంపన్నుని, ఉజ్జ్వల తేజన్=మిగుల జ్వలించు తేజస్సుగలవాని, వాచాగర్వము=నోటి పొగరు.

వజ్రమువంటి బాణముల తాఁకున వాఁడు సర్వేంద్రియములు కలఁతపడఁగా మొద్దుపాటి బాధచే నే కార్యము చేయలేనివాఁడై యుద్ధమందు తెలివి తప్పిన యట్లుండి మరలఁ దెలివి తెచ్చుకొని తెప్పతిల్లి, చలింపని ప్రభావము గలవానిని, ప్రకాశించు తేజస్సు గలవానిని లక్ష్మణుఁ జూచి నోటి పొగ రతిశయింపఁగా నిట్లులనెను.

చ. తొలిదివసంబు యుద్ధమున ♦ ధూళిని ద్రుంగుచు నేలఁ బొర్లఁగా
బలితపుశస్త్రపాశముల ♦ భ్రాతల మిమ్మటు కట్టినైచుటల్
తలఁపున లేదె? లేమిఁ గద ♦ దార్కొన వచ్చితి నన్నుఁ బోరిలోఁ,
బిలుచుచు నున్నదో యముని♦వీడటుగా కిటు వచ్చువాఁడవే. -౨౦౮౫

అర్థములు. ద్రుంగుచున్=మునుఁగుచు, తార్కొనన్=ఎదిరింపఁగా.

తాత్పర్యము

మొదటిదినము యుద్ధమందుఁ నేలఁబడి దుమ్ములోఁ బొర్లునట్లు బలిష్ఠములైన శస్త్రపాశముల మిమ్మిద్దఱ నన్నదమ్ములను కట్టివేయుటయు మఱచితివా? అది నీకు మనస్సునందు లేనందుటచేతనే నన్ను యుద్ధమున నెదిరింప వచ్చితివి. అటుగాక జ్ఞప్తియందుండియు యమపురము పిలుచుచున్న కారణముచేత వచ్చితివో? అటుగాకుండిన వత్తువా?

కం. ప్రథమదినంబున జరిగిన, ప్రధనంబున నాబలంబుఁ ♦ బరికింపవిచోఁ
బ్రథితంబుగఁజూపెద ని,ర్మథితుని నినుఁ జేసి నిమిష♦మాత్రము నిలువుమీ.

అర్థములు. ప్రథమదినంబునన్ = మొదటి దినమందు, దినమనఁగా రాత్రి పగలు కలిసిన కాలమని యర్థము. దినదినప్రవర్ధమానమై యిత్యాదులయందీ యర్థము గనఁదగు, ప్రధనంబునన్ = యుద్ధమందు, ప్రథితంబుగన్ = ప్రసిద్ధిగ, నిర్మథితుని = చంపఁబడినవానిని.

తాత్పర్యము

మొదటి దినము జరిగిన యుద్ధమున నా బలము నీవు చూడనియెడల నిన్నుఁ జంపి నేఁడు స్పష్టముగాఁ జూపెదను. అల్పకాలము నిలువుము.

చ. అని శరసప్తకంబున నృ♦పాత్మజునిం బడిటన్ మరుత్సుతున్
జెనఁగినుకన్ విభీషణుని♦భీషణబాణశతంబునన్ దశా
స్యునితనయుండు నైచుటయుఁ ♦ జూచి సుమిత్రసుతుండు చీరికిన్
గొనక కవి నవ్వ చివ్వియ యొ♦కో యరులం బడ దూలఁ జేసెడిన్. -౨౦౮౬

అర్థములు. శరసప్తకంబునన్ = ఏడు బాణములచే, పదిటన్ = పది బాణములచే, భీషణబాణ శతంబునన్=భయంకరములైన నూఱు బాణములచే.

### తాత్పర్యము

అని యేడు బాణముల లక్ష్మణుని పది బాణముల నాంజనేయుని మిక్కిలి కోపముతో నూఱు బాణముల విభీషణుని నింద్రజిత్తు వేయఁగా నవి సరకు గొనక లక్ష్మణుఁడు ఇట్టి బాణములచేతనా నీవు శత్రువులను జెఱుపఁ గల వాఁడవు.

ఉ. లెక్కయె హాస్యటంచు నవ•లీల శరంబులఁ గ్రుమ్మ నాతఁడున్
జిక్కఁగ నేయు బాణములు • చిందఱవందఱ సేయు చిట్లనున్
రక్కసుఁడా! భవచ్ఛిత శ•రంబు లొకో యివి యిట్టివానిఁ దా
నుక్కరిశత్రువున్ వయిచు•నో యెవఁ డేనియు గెల్వఁ గోరినన్. ౨౦౮౩

అర్థములు. ఉక్కరి = బలము గలవాఁడగు.

### తాత్పర్యము

ఛీ ఛీ యివి బాణములని లెక్కింపవలయునా యని యవలీలగా బాణము॥ చిమ్మఁగా నింద్రజిత్తు సందు లేకుండ నేయు బాణములను చెదరగొట్టియు నిట్లనియె. రాక్షసుఁడా! ఇవా నీ పదునైన బాణములు, ఇట్టి వానినా గెల్వఁగోరినవాఁడు బలవంతుఁడగు విరోధి మీఁద వేయవలసినవి?

తే. లఘువులును నల్పవీర్యముల్ రా•క్షసుండ!
త్వచ్ఛరంబులు వ్యథ లేదు • తగులు చున్న
నిట్టి వానిని నేయునే • దిట్టబంట
టంచుఁ గవచంబు వ్రయ్య శ•రాళిఁ గురిసె. ౨౦౮౪

అర్థములు. లఘువులు=బెండువలెఁ దేలికయైనవి, అల్పవీర్యముల్=బలము లేనివి, త్వచ్ఛరంబులు = నీ బాణములు, దిట్టబంటు = బలముగల శూరుఁడు, వ్రయ్యన్ = చీలిపోవునట్లు.

### తాత్పర్యము

ఓరీ నీ బాణములు తేలికయైనవి, నిస్సారములైనవి, అవి తగులుచున్నను బాధలేదు. గట్టిశూరుఁ డిట్టి బాణముల వేయునా, యని వాని కవచంబు చీలునట్లు గొట్టెను.

## —• ఇంద్రజిత్తు లక్ష్మణులు ఘోరంబుగఁ బోరుట •—

ఉ. ఆవిశిఖోగ్రవృష్టికిని • హాటక భూషితవర్మ మంతయున్
వావిరి తునకతునక లయి • వ్రాలె రథంబున మింటనుండి వే
వే వసుధం దొరంగు నుడు•బృందములో యనఁ గృత్తవర్ముఁడై
రావణి బాణవిద్ధుఁ డయి • రాజిలె నప్డు ప్రరూఢశైల మై. ౨౦౮౫

అర్థములు. విశిఖోగ్రవృష్టికి = బాణముల బలమైన వర్షముచేత, హాటక భూషితవర్మము=బంగారు నగలచే నలంకరింపఁ బడిన కవచము, ఉడుబృందములు= నక్షత్ర సమూహములు, కృత్తవర్ముఁడై = ఖండింపఁబడిన కవచము గలవాఁడై, బాణవిద్ధుఁడయి=బాణములచే బెజ్జములు గొట్టఁబడినవాఁడై, ప్రరూఢశైలమై = చెట్లచేఁ బెద్దదైన కొండయై.

## తాత్పర్యము

తీవ్రమైన యా బాణవర్షము వలన బంగారుచే నలంకరింపఁ బడిన కవచ మంతయు నాకాశమున నుండి నక్షత్రములు గుంపులై నేల రాలినట్లు తునుకలు తునుకలై రథమునందుఁ బడెను. ఈ ప్రకారము ఖండింపఁబడిన కవచము బాణములు గ్రుచ్చుకొనిన దేహము గలవాఁడై చెట్లచే వృద్ధినొందిన పర్వతమువలె నింద్రజిత్తుండెను.

ఉ. అంతఁ బరస్సహస్రభయ ♦ దాంబకవృష్టి సుమిత్రపట్టి మే
నంతయుఁ గప్పి నిస్తులిత ♦ మైన తనుత్రముఁ ద్రుంచి వైచి య
త్యంతకభీకరుండు కృతి ♦ కష్టప్రతిన్ ఘటియించె, నిట్టు ల
త్యంతరుషావశాత్ములయి ♦ యన్నిఁబజోదులు సాటిదీటుగన్. ౨౦౯౧

అర్థములు. పరస్సహస్ర = వేయికి మించిన, భయద = భయము కలిగించు, అంబకవృష్టిచేన్ = బాణవర్షముచే, నిస్తులితమైన = అసమానమైన, తనుత్రము = కవచము, అత్యంతక భీకరుఁడు = యమునికంటె మిగుల భయంకరుఁడు, అత్యంతరుషావశాత్ములయి = మిగులఁ గోపమునకు వశపడిన మనస్సులు గలవారు, నిఁబజోదులు = అధిక శూరులు, సాటిదీటుగన్=సరిసమానముగ.

## తాత్పర్యము

అంతట వేయికి మించిన భయంకరములైన బాణముల వర్షముచే లక్ష్మణుని దేహము గప్పి యాయన తొడిగికొని యుండిన యసమానకవచమును ఖండించి యమునికంటెఁ భయంకరుఁడైన యా రాక్షసుఁడు లక్ష్మణుఁడు చేసిన దానికి బదులప్పుడే చేసెను. ఈవిధముగ నిరువురు మిక్కిలి కోపవశులై సరిసమానముగ యుద్ధము చేయుచుండిరి.

కం. పోరుచు నన్యోన్యాశుగ, దారిత సర్వాంగు లగుచుఁ ♦ దమిఁయక జయముం
గోరుచు నెత్తురు గార్చుచుఁ, గారణ నూర్చుచును దీర్ఘ♦కాలము పోరన్. ౨౦౯౨

అర్థములు. అన్యోన్యాశుగ = ఒకరు వేసిన బాణములచే మఱియొకరు, దారిత = చీల్పఁబడిన, సర్వాంగులు=అన్ని యవయవములు గలవారు కారణ = తీవ్రవేదనచే; "కారణాతు యాతనా తీవ్రవేదనా" అమరము ఊర్చుచును=శ్వాసములు పుచ్చుచు.

తా త్ప ర్య ము

యుద్ధము చేయుచు నొకరు వేసిన బాణములచే మఱియొకరు చీల్పఁబడిన దేహము గలవారగుచు జయము రావలయునని కోరుచు నెత్తురు కార్చుచు మిగుల బాధచే నూర్పులు పుచ్చుచు నిట్లు చాలఁగాలము యుద్ధము చేయఁగా.

చ. తనువుల నూటకాల్వల వి ♦ ధంబున నెత్తురు గాఱ గర్జలన్
నినుచుచు ఘోరరూపముగ ♦ నింగి పయోధరసంచయంబు మా
డ్కిని శరవృష్టులం గురిసి ♦ కీడ్పడ కేమియు గాసి లేక య
ద్దనుజనరేంద్రపుంగవులు ♦ ధైర్యము శౌర్యము తుల్యరూప మై. ౨౦౫౩

అర్థములు. నింగి = ఆకాశము, పయోధర సంచయము = మేఘముల గుంపు, కీడ్పడక=కీడు పొందక.

తా త్ప ర్య ము

దేహమునందు నూటకాల్వలవలె నెత్తురుగాఱగా సింహనాదములు చేయుచు ఆకాశమునందలి మేఘములగుంపువలె బాణవర్షములను గురియించుచు కొంచె మైనను బాధగాని, యలసటగాని లేక యా మనుజ దనుజశ్రేష్ఠులు ధైర్యము శౌర్యము సమానముగా.

కం. దీపింపఁగఁ బోరుచు దృఢ,చాపంబులు గుడుసువడఁగ ♦ శస్త్రాస్త్రంబుల్
పై పయిఁ గురియుచు విశిఖ,వ్యాపారముచేత మింటి♦బంధించి రొగిన్. ౨౦౫౪

అర్థములు. దీపింపఁగన్ = ప్రకాశింపఁగా, గుడుసువడఁగన్ = గుండ్రముగఁ గాఁగా.

తా త్ప ర్య ము

ప్రకాశింపఁగా యుద్ధము చేయుచు బలముగల విండ్లు గుండ్రము లగునట్లు శస్త్రముల నస్త్రముల మీఁద మీఁదఁ గురియుచు బాణములచేత నాకాశమును బంధించిరి.

చ. ప్రిదులని బాణవేగములు ♦ పీడని చిత్రపరాక్రమంబులున్
వదలని లాఘవంబులును ♦ ప్రాలని చాపకళాచమత్కృతుల్
పొదలినరోషము ల్వెలయఁ ♦ బోరిరి వారి తలప్రహారముల్
పదములు వజ్రఘోషము ల ♦ నన్ విన నయ్యెను వేఱు వేఱుగన్. ౨౦౫౫

అర్థములు. ప్రిదులని = తగ్గని, ప్రాలని = పడిపోని, పొదలిన = వృద్ధి నొందిన, తలప్రహారముల్ = అఱచేతి దెబ్బలు.

తా త్ప ర్య ము

బాణవేగములు తగ్గనీయక, చిత్రముగాఁ బరాక్రమించుటలు వదలక, లాఘవంబులు విడువక, విలువిద్య నేర్పులు పడిపోనీయక రోషములు వృద్ధి చెందఁగా యుద్ధము చేసిరి. వారి చేతిదెబ్బలు, ధ్వనులు, పిడుగుచప్పుడు లన వేఱువేఱుగా వినవచ్చు చుండెను.

సీ. జనములు కంపించు • చటుల గర్జారభటుల్, శరముల తాఁకుల • చప్పుడులును
బధిరతాపాదు లౌ • భయదగుణధ్వను, లాశుగంబుల హతి • నైన యులివు
లేకంబుగాఁ దప్త • హేమపుంఖాంకిత, బాణంబులను మేన • వ్రణము లెసఁగఁ
గాఱెడి నెత్తుటి • కాల్వలతోడను, బుష్పితాశోకముల్ • పోలుపు దాల్చి
తే. యని యొనర్పఁగ వారి శ • రాళి తనులు
గాఁడిపాఱి వసుంధరా • గర్భసీమఁ
దూఱె నొకకొన్ని నభమున • ద్రుంగిపోయె
మఱియు నొక కొన్ని యెదిరియం • బకము లణఁచె. ౨౦౫౬

అర్థములు. గర్జారభటుల్=సింహనాదధ్వనులు, బధిరతాపాదులు=చెవుడు గలిగించునవి యగు, భయద = భయము గలిగించు, గుణధ్వనులు = అల్లెత్రాటి చప్పుడులు, ఆశుగంబుల = బాణముల, హతిన్=ఒకదాని నొకటి కొట్టుటచేఁ గలిగిన, ఉలివులు = ధ్వనులు, ఏకంబుగాన్=ఒక్కటిగాఁగా, తప్తహేమపుంఖాంకిత= పుటము వేసిన బంగారుపింజలు గల, వ్రణములు = గాయములు, పుష్పితాశోకమున్ = పూచిన యశోక వృక్షముల యొక్క, తనులు=దేహములు.

తాత్పర్యము

జనులను వణఁకఁజేయు మేఘధ్వనులవంటి యఱపులు, బాణములు తాకుచు చప్పుడులు, చెవుడు కలిగించు నల్లెధ్వనులు, బాణములు తాఁకుడుల ధ్వనులు నన్నియు నొక్కటిగాఁ గలయఁగా బంగారు పింజలు గల బాణములచే దేహమున గాయము లేర్పడఁ గాఱుచున్న రక్తప్రవాహములతో పూచిన యశోకముల చందము గలిగి వారు యుద్ధము చేయఁగా వారి బాణములు కొన్ని దేహములలోఁ దూఱిపోయి భూమియందుఁ బ్రవేశించెను. కొన్ని యాకాశమున బోయెను. కొన్ని యెదుటివారి బాణముల నణఁచెను.

ఆ. వెలుఁగు నగ్నియుగము • కలిమి దర్భమయంబు, క్రతు వనంగ దాశ • కంఠి దాశ
రథుల రణము వెలిఁగె • బ్రకటమార్గణమయము, మగుచు విబుధలోక • హర్షదముయి.

తాత్పర్యము

వెలుఁగుచున్న రెండగ్నులు కలిగి దర్భలవిశేషముగఁ గల యజ్ఞమువలె లక్ష్మణేంద్రజిత్తుల యుద్ధము విస్తారముగ బాణములచే నిండినదై దేవతాసమూహములకు సంతోషప్రద మయ్యెను. లక్ష్మణేంద్రజిత్తులు రెండగ్నులనియు, బాణములు దర్భలనియు, విబుధహర్షము రెంట సమాన మనియు నెఱుఁగునది.

ఉ. రావణి లక్ష్మణుల్ దెగి ప • రస్పర సంజ్ఞపనాభిలాషులై
కేవల రౌద్రమూర్తు లయి • భిన్నత నొందక యీడఁబోక తెం
పావహిలంగఁ బ్రాణముల • నాశ వహింపక మిన్ను మన్ను బా
ణావృతముం బొనర్చిరి ర • వంతయు స్రుక్కక పెద్దకాలమున్. ౨౦౫౮

అర్థములు. పరస్పరసంజ్ఞపనాభిలాషులై = ఒకరి నొకరు సంహరించు కోరిక గలవారై, ఉడుఁబోక = వెనుదీయక.

తాత్పర్యము

ఇంద్రజిత్తు లక్ష్మణుఁ డిరువురు సాహసించి యొకరి నొకరు చంపు కోరిక గలవారై, కేవలము భయంకరాకారము గలవారై ఖేదపడక వెనుదీయక సాహసము గలవారై ప్రాణములమీఁది యాశవదలి కొంచెమైనను దగ్గక దీర్ఘకాలము భూమి, ఆకాశము బాణములచేఁ గప్పిరి.

కం. ఆకొక్కటియును లేక, స్తోకం బలరులఁ జెలంగి • సాబగగు రక్తా
శోకంబులు బూచుగు లనఁ, శాకారిజితుండు రాము•భ్రాత వెలుంగన్. -౨౦౫౯

తాత్పర్యము

ఆకు అనునది యొక్కటియైన లేక విశేషముగఁ బూలు గలిగి యందమైన యెఱ్ఱని యశోకము బూచుగులవలె నింద్రజిత్తు లక్ష్మణుఁడు వెలిఁగిరి. ఒక్కాకైన లేని దనుటచే గాయము తగులని నెత్తురు క్రమ్మని భాగము వారి దేహములందు లేదయ్యెనని భావము.

కం. కలహపరిశ్రమ నింద్రజిఁ, బొలియింప విభీషణుండు • పౌరిఁ బ్రియహితమున్
గలిగింపఁగ నపరాజిత,బలుఁడగు లక్ష్మణున కతని•పజ్జ నయుండెన్. -౨౦౬౦

అర్థములు. కలహపరిశ్రమున్ = యుద్ధము నందవలసిన, ఇట్లనుటచే నీ యుద్ధమందు లక్ష్మణుకంటె నింద్రజిత్తు మిక్కిలి బడలెనని గ్రాహ్యము. పౌరిన్ = మిక్కిలి, ప్రియ = ప్రియుఁడైన లక్ష్మణునకు, హితమున్ = మేలును, అపరాజిత బలుఁడు = ఓటమిలేని బలముగలవాఁడు. దీనిచే లక్ష్మణుఁడు బడలక పైచేయిగానే యున్నాఁడని భావము.

తాత్పర్యము

యుద్ధమునం దలసిన యింద్రజిత్తును జంపుటకుఁ దన ప్రియుఁడగు లక్ష్మణునకు మేలు గలిగించుటకు విభీషణుండు పరాజయ మెఱుఁగని బలముగల లక్ష్మణునకుఁ బ్రక్కనే యుండెను. ఈ యుద్ధమందు విభీషణుఁ డెక్కువ శ్రద్ధ వహించి పనిచేయు చున్నాఁడు. తక్కినయందఱొక్కయెత్తు వీఁడొకయెత్తు, కనుఱెప్పపాటు ఏమఱిన నేదైన మాయచేయును. ఆకారణముచే నతని విభీషణుఁడు కనిపెట్టియే యుండెను. అదియునుగాక రావణుఁడుతప్పఁ దక్కినవారిలో మిగిలినవాఁడు వీఁ డొక్కఁడే. వీఁడు చచ్చెనా రావణుఁడు చచ్చినవాఁడే. కర్ణునితో భారతయుద్ధము, ఇంద్రజిత్తుతో రామాయణయుద్ధము ముగింపనియే చెప్పనగును.

## —• ౯౦-వ సర్గము. విభీషణుఁడు కపులఁ బ్రోత్సాహపఱుచుట •—

శా. అన్యోన్య ప్రతిఘాత నైపుణులమ•ర్త్యద్వేషి మిత్రాన్వయుల్
జన్యాటోపము మీఱ గర్జితవచ•స్తంబేరమవ్యందసా

మాన్యంబుం దలఁపించుచుం బెనఁగుచో • రక్షోనాథపుత్రుండు వ
ర్జన్యారాతిపయి న్నిగిడ్చె శితధా•రాఘోరనారాచముల్. ౨౦౬౧

అర్థములు. అన్యోన్య ప్రతిఘాత నైషణులు = ఒకరినొకరు చంపఁ గోరిక గలవారు, ప్రతిఘాతన + ఏషణ = ప్రతిఘాతనైషణ, ప్రమాపణం నిబర్హణం, నికారణమ్ విశారణం ప్రవాసనం పరాసనం నిషూదనం నిహింసనమ్ నిర్వాపణం సంజ్ఞపనం నిర్గ్రంథన మపాసనమ్ నిస్తర్హణం, నిహననం, క్షణనం పరివర్జనమ్ నిర్వాసనం విశసనం, మారణం ప్రతిఘాతనమ్ ఉద్వాసన ప్రమథన క్రథనోజ్జాసనానిచ ఆలంభ పింజ విశర ఘాతోన్మాథ వధా అపి॥ అమరము—ఇవి యన్నియుఁ జంపుటకుఁ బేర్లు, అమర్త్యద్వేషి మిత్రాన్వయుల్ = రాక్షసవంశమున సూర్యవంశమునఁ బుట్టినవారు, జన్యాటోపము = యుద్ధమందలి వేగిరపాటు, గర్జిత = ఘీంకరించు, వనస్తంబేరమన్వంద్వసామాన్యంబున్ = అడవియేనుఁగుల జంటతోడి సమత్వమును, తలఁపించుచున్ = జ్ఞప్తికిఁ దెచ్చుచు, పర్జన్యారాతిపయిన్ = ఇంద్రవిరోధి యగు నింద్రజిత్తుమీఁద, శితధారా = వాఁడి వాదరగల, ఘోర = భయంకరమైన, నారాచముల్ = బాణములు.

## తాత్పర్యము

ఒకరి నొకరు చంపుకోరిక గలవారును రాక్షస వంశమున సూర్యవంశమునఁ బుట్టిన వారును నగు నింద్రజిల్లక్ష్మణులు యుద్ధసంభ్రమ మతిశయింప గర్జించు అడవి యేనుఁగుల జంటవలె యుద్ధము చేయునపుడు లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు మీఁద వాఁడి వాదరగల క్రూరబాణములను వైచెను.

కం. బర్హిశ్శుష్మనిభేషులు, బర్హిర్ముఖవైరిసేనఁ • బడి ప్రతిభట ని
స్తర్హణ మొనరించెఁ బాకని,బర్హణుకులిశంబు శైల•వారముఁ బోలెన్.

అర్థములు. బర్హిశ్శుష్మ = అగ్నిహోత్రునితో, నిభ = సమానమైన, ఇషులు = బాణములు 'బర్హిషో దర్భాః శుష్మ బల మస్యేతి బర్హిశ్శుష్మేత్యేకంవా పదం' దర్భలు బలముగాఁ గలవాఁడు. గు — బా — ప్ర. బర్హిర్ముఖవైరిసేన = దేవవిరోధియగు రాక్షసుని సేనయందు, ప్రతిభట నిస్తర్హణము = విరోధి వధము, పాకనిబర్హణు = ఇంద్రుని యొక్క, కులిశంబు = వజ్రము, శైలవారమున్ = పర్వతసమూహమును, దుష్కరప్రాసము.

## తాత్పర్యము

అగ్నితో సమానములైన బాణములు రాక్షస సేనమీఁదఁబడి యింద్రుని వజ్రాయుధము పర్వతముల నాశము చేసినట్లు నాశము చేసెను.

తే. భీషణబలాఢ్యులైన వి•భీషణాను, చరులు శూలాసిపట్టిస•సాయకముల
గుములు గుములుగ రాక్షస•కోటిఁ గూల,వైచిరప్పుడు తమ కేలి•వాఁడి మెఱసి

అర్థములు. భీషణ బలాఢ్యులు=భయంకర బలసంపత్తి గలవారు, విభీషణానుచరులు=విభీషణుని వెంటనుండు వారు, నలువురు మంత్రులు, వాఁడి=తీక్ష్ణత.

తా త్ప ర్య ము

భయంకర సంపన్నులగు విభీషణుని మంత్రులు శూలములచేతను పట్టిసముల చేతను బాణముల చేతను రాక్షసులను తమ చేతి బలాతిశయమున గుంపులు గుంపులుగఁ బడఁగొట్టిరి.

కం. గున్నేనుంగుల నడుమం, దున్నమదగజంబుమాడ్కి • నొప్పెడి దృఢ శౌ
ర్యోన్నతుఁ డైన విభీషణు, డన్నగచరకోటి కనియె • హర్షము గదురన్.

అర్థములు. గున్నేనుఁగులు=పొట్టి యేనుఁగులు, అగచరకోటికిన్=వానర సమూహమునకు.

తా త్ప ర్య ము స్పష్టము

ఉ. ఎక్కటి బంటులార! వినుఁడీ దశకంఠున కీతఁ డొక్కఁడున్
జిక్కిన యీబలంగ మిది • శేషము, వీఁ డిటఁ ద్రెళ్ళ నేనియున్
దక్కిసు లెల్లనుం దెగిర • రావణుఁ డొక్కఁడు దక్కుఁ, గాన మీ
యుక్కు జవంబునున్ మెరసి • యుగ్రతఁ జంపుఁడు వీరి నందఱన్. ౨౦౬౫

అర్థములు. ఎక్కటి బంటులార=అసహాయ శూరులార.

తా త్ప ర్య ము

అసహాయ శూరులారా! నామాట వినుఁడు. దశకంఠునకు యుద్ధవీరులలో మిగిలినవాఁ డీ యింద్రజిత్తొక్కఁడే. ఇక్కడనుండు నీ సేన మిగిలెను. తక్కినయందఱు చచ్చిరి. ఇక్కడ వీఁడు చచ్చెనా రావణుఁడుతప్పఁ దక్కిన యందఱు చచ్చినవారే, కావున బలము వేగము ప్రకాశింపఁజేసి వీరి నందఱఁ జంపుఁడు.

సీ. కుంభకర్ణుండును • గుంభనికుంభ ప్రహస్తసుప్తఘ్న ధూమ్రాక్ష వికట
సంహ్రాది దుర్ధర • జంబుమాలులు వజ్రదంష్ట్రిమహామాలి • తపనదములు
నశనిప్రభుండును • యజ్ఞకోపుండును, బ్రఘసప్రఘాసులు • రశ్మికేతు
వగ్ని కేతుండును • సర్యశత్రుండును, జంఘప్రజంఘులు • చక్రమాలి

తే. కంపనుండు ద్విజిహ్వుఁ డ • కంపనుండు, తీక్ష్ణవేగసుపార్శ్వులు • ధీరనిఘ్నుఁ
డల్ల దేవాంతక నరాంత • కాదు లెల్ల బవరమునఁ గూలి రీతఁ డే • పాటి మీకు.

తా త్ప ర్య ము

కుంభకర్ణుఁడు, కుంభుఁడు, నికుంభుఁడు, ప్రహస్తుఁడు, సుప్తఘ్నుఁడు, ధూమ్రాక్షుఁడు, వికటుఁడు, సంహ్రాది, దుర్ధరుఁడు, జంబుమాలి, వజ్రదంష్ట్రుఁడు, మహామాలి, తపనదములు, అశనిప్రభుండు, యజ్ఞకోపుఁడు, ప్రఘసుఁడు, ప్రఘాసుఁడు, రశ్మికేతువు, అగ్నికేతువు, సూర్యశత్రుఁడు, జంఘప్రజంఘులు, చక్రమాలి, కంపనుఁడు, ద్విజిహ్వుఁడు, అకంపనుఁడు, తీక్ష్ణవేగుఁడు, సుపా

ర్శ్వుఁడు, ధీరనిఘ్నుఁడు, దేవాంతక నరాంతకులు మొదలగు వారందఱు యుద్ధము నందుఁ జచ్చిరి. వీఁ డొక్కఁడు మీ కేమాత్రము ?

కం. వారల నెల్ల వధించిన, వీరుల రీయసురఁ ద్రుంప • వింతయె పారా
వారముఁ గరముల నీదిన, యీరలు గోష్పదము నీఁది • యెసఁగుఁడు కీర్తిన్.

తా త్ప ర్య ము

మీరు వారినందరఁ జంపిన వీరులు. ఈ యొక్క రాక్షసుని ద్రుంచుట యాశ్చర్యమా? సముద్రమును జేతులతో నీదిన మీరీ గోష్పాదమంత యీఁది కీర్తిని సంపాదింపుఁడు.

కం. మీ రింకఁ జేయ మిగిలిన, కారియ మీసేన యము న • గారంబునకున్
వారక పనుచుట ట్రొవ్విన, వారెల్లరుఁ జనిరి మున్నె•వరుసలు గొనుచున్.

తా త్ప ర్య ము

మీ రింకఁ జేయుటకు మిగిలిన కార్య మీ సేననంతయుఁ జంపుటే. తక్కిన వారందఱు ముందే వరుసగాఁ జచ్చిరి.

ఉ. నాసుతు నేన చంపుట యు•సంగ నయుక్తపుఁగార్య మైననున్
వాసిగ రామహేతువునఁ • బాసి దయన్ వధియింపవచ్చు నే
దోసము లేదు పో యితనిఁ • ద్రుంపఁగ నాస వహించు నా కనుల్
మాసరబాష్పపూరములు • మాటికి మాటికి నప్పళించెడిన్. ౨౦౬౯

అర్థములు. అప్పళించు=కప్పు, మాసర=దీర్ఘములు, విశేషముగ.

తా త్ప ర్య ము

నా కొడుకును నేనే చంపుట యనునది యుచితమైన పనిగాదు. అయినను రాము నిమిత్తమై దయవదలి చంపవచ్చును. దానివలన నే పాపమురాదు. నిశ్చయము. కావున నా కా పాపభయము లేదు. కాని వీనిని జంప నాశవహించుట నా కన్నులను దీర్ఘముగఁ గన్నీరు కాల్వలుగాఁ మీఁదమీఁద గప్పుచున్నవి. నేను గన్నీళ్ళు తుడుచుకొందునా? వీనితో యుద్ధము చేయుదునా ?

దీనివలన స్వార్థపరత్వమునఁగాక భగవత్ప్రీత్యర్థమై యేకార్యము చేసినను దోషములేదని భావము.

ఉ. కావున వీని లక్ష్మణుఁడె • గం డడంచుం గపులార ! మీరు నే
లా వితయూరకుండ లివ • లావు వెలుంగఁగ నింద్రజిత్సమీ
పావనిసేనఁ ద్రుంప దగ•వన్నఁ గపుల్ చెలరేగి శత్రు సే
నావళి డాసి పోరిరి య•పారభుజావిభవంబు లేర్పడన్. ౨౦౭౦

అర్థములు. గండడంచున్ = చంపును, వితర = వ్యర్థముగా, లివ = లాఘవము, లావు = బలము, ఇంద్రజిత్ సమీపావని సేనన్=ఇంద్రజిత్తునకు సమీపమందున్న సేనను.

### తాత్పర్యము

కావున వీనిని లక్ష్మణుఁడే చంపఁగలఁడు. కపులారా! మీరేల వ్యర్థముగా నూరకున్నారు. మీ లాఘవము బలము దెలియునట్లు యింద్రజిత్తునకు సమీపమందున్న సేనను వధింపుఁడనఁగా వానరులు చెలరేఁగి శత్రుసేనల సమీపించి యపరిమితమైన భుజబలసంపదచేత యుద్ధము చేసిరి.

తే. కారుమబ్బులఁ గాంచి మ◆యూరసమితి, యుబ్బి కేకలువైచెడి◆యొప్పు దోఁప
యామినీచరసైన్యంబు◆నారఁగాంచి, గర్జల నొనర్చె శాఖామృ◆గములపిండు.

అర్థములు. కారుమబ్బులన్=వర్షాకాల మేఘములను, మయూరసమితి= నెమిళ్ళగుంపు, యామినీచర = రాక్షసుల, శాఖామృగముల పిండు = వానరుల సమూహము.

### తాత్పర్యము

వానమబ్బులను జూచి సంతోషించి నెమిళ్ళు కేకలు వేయునట్లు రాక్షసుల సేనలఁజూచి వానరసమూహము సింహనాదములఁ జేసెను.

సీ. వారిలోపల జాంబ◆వంతుండు నిజయూథ,వృతుఁడయి రాక్షస◆వితతిమీఁదఁ
గవిసి పోరొనరింపఁ◆గలఁక లేకసురులు, చుట్టుముట్టిరి వాని◆మట్టుమీఱి
శిరములఁ బట్టిస◆పరశు తోమరముల, భల్లూకపతిమీఁద◆జల్లువోలెఁ
గురిసె నొప్పించిన◆నరకుసేయ కతఁడు, పోర భీభత్సమై◆ఘోరమయ్యె
తే. దేవతాసురయుద్ధంబు◆తెరువు దోఁప, వల్లభీమస్వనంబులు◆పెల్లగయఁగ
గాడ్పుపట్టియుఁ గ్రుద్ధుఁడై◆క్ష్మారుహమున, నేటువకు వేవురిలఁ గూల◆నెగసిచంపె.

అర్థములు. జల్లు = వాన, గాడ్పుపట్టి = హనుమంతుఁడు, వేవురు = వేయిమంది, లక్ష్మణునితో యుద్ధము చేయుచుండిన యింద్రజిత్తు లక్ష్మణుని విడిచి విభీషణుని జంపవలెనని యతనితో యుద్ధము నారంభించెను. అప్పుడు హనుమంతుఁ డూరకుండనేల యని లక్ష్మణుడించి రాక్షసులపై పడెను.

తాత్పర్యము స్పష్టము.

చ. తన పినతండ్రితోఁ బెనఁగి◆దానవనాథసుతుండు వెండియున్
దనుజనికారణున్ దశర◆థప్రభుపుత్రకుఁ గిట్టి తాఁకినన్
హనుమయు లక్ష్మణుం గొలిచె◆నంతట వారికిఁ బోరు చెల్లె భూ
తనివహహృత్ప్రకంపనని◆దానము నిర్జరరోమహర్షమై. ౨౦౨౩

### తాత్పర్యము

అర్థములు. పెనఁగి = యుద్ధముచేసి, దనుజనికారణున్ = రాక్షసులఁ జంపువానిని, కిట్టి = సమీపించి, భూతనివహ = ప్రాణుల సమూహముయొక్క, హృత్=హృదయముల, కంపన నిదానము = అదరుటకుఁ గారణము, నిర్జరరోమ హర్షము= దేవతలకు గగ్గురుపాటు కలిగించునది.

తాత్పర్యము

ఇంద్రజిత్తు తాను విభీషణునితో యుద్ధము చేయుచుండ లక్ష్మణుఁడు రాక్షస సేనను ధ్వంసము చేయుచుండుట చూచి విభీషణునితో యుద్ధము చాలించి మరల లక్ష్మణునిపైఁ గవిసెను. ఆంజనేయుఁడును రాక్షసవధ చాలించి మరల లక్ష్మణునకు వాహనమయ్యెను. అప్పుడు లక్ష్మణేంద్రజిత్తులకు ప్రాణికోటుల గుండెలదరఁ జేయునదియు దేవతలకు గగ్గురుపాటు గలిగించునదియు నగు యుద్ధము జరిగెను.

—♦ ఇంద్రజిల్లక్ష్మణులు ఘోరఁబుగఁ బోరుట ♦—

కం. ప్రావృట్కాలంబున, రవి, జైవాతృక బింబయుగము ♦ శరధరసంఘా
 తావృత మగుచందంబున, నా వీరయుగంబు మఱిఁగె ♦ నాశుగతతులన్.

అర్థములు. ప్రావృట్ + కాలంబునన్=వానకాలమున, రవిజైవాతృక బింబయుగము=సూర్యచంద్రబింబముల జత, శరధర=మేఘముల, సంఘ = సమూహముచే, ఆవృతము=ఆవరింపఁబడినది, మఱిఁగెన్ = చాటయ్యెను, ఆశుగ తతులన్ = బాణ సమూహములచే.

తాత్పర్యము

వర్షాకాలమున మేఘములచే మఱుఁగుపడిన సూర్యచంద్రుల బింబములవలె బాణసమూహములచే నా వీరు లిరువురు మఱుఁగుపడి కానరాక పోయిరి.

కం. తీయుట తొడుగుట దిగియుట యేయుటకై మార్చు లక్ష్య♦మీక్షించుటయున్
 బాయుట డాయుట దురమున, లాయుట గనరాదు వారి ♦ లాఘవగరిమన్.

అర్థములు. లాయుట = విజృంభించుట.

తాత్పర్యము

అంబులపొదినుండి బాణము దీయుటగాని వింట సంధించుటగాని అల్లెత్రాడు లాగుటగాని బాణమును విడుచుటగాని గుఱిచూచుటగాని, ఎదిరి బాణములు తప్పించుకొనఁ దొలఁగి పోవుటగాని ఎదిరిని సమీపించుటగాని యుద్ధమున విజృంభించుటగాని వారి లాఘవాతిశయమున నేదియుఁ గానవచ్చినది కాదు.

తే. చాపవేగవినిర్ముక్త ♦ శరవితాన, ములను నద్దియుఁ దోఁప దే♦తలమునందు
 నెందుఁ జూచినఁ బఱచెడి♦క్రిందఁబడెడి, తాఁకుచుండెడి బాణసం♦తాన మేచె.

అర్థములు. చాపవేగ=వింటి వేగముచే, వినిర్ముక్త=విడువఁబడిన, శరవితానములను=బాణసమూహములచే, తోఁపదు = కానరాదు, ఏచెన్ = అతిశయించెను.

తాత్పర్యము

అతివేగముగ బాణములను వింటినుండి విడుచుటచేత నేస్థలమందైనను ఏపదార్థమైనను నగపడలేదు. ఎక్కడఁజూచినను వేగముగఁ బోవుచున్న బాణములు క్రిందఁ

బడుచున్న బాణములు ఒక దానితో నొకటి కొట్టుకొనుచున్న బాణములే యతిశ యించెను.

తే. ఒండొరులమీఁద వారలు • గ్దండవృత్తిఁ, జిమ్ము కాండంబు లభ్రపథమ్మునందుఁ బందిరి ఘటించినట్లు క • న్పట్టుచుండెఁ జిమ్మచీఁకట్లు ధరణిని • ముమ్మరముగ.

అర్థములు. కాండంబులు = బాణములు, అభ్రపథమ్మునందు = ఆకాశ మందు, ముమ్మరముగన్=అధికముగ.

తా త్ప ర్య ము

ఒకరిపై నొకరతివేగముగ వేయు బాణము లాకాశమునఁ బందిరి పెట్టినట్లుం డెను. ఆ కారణముచే భూమిమీఁద గాఢాంధకారము వ్యాపించెను.

ఉ. వారలబాణవేగములు • వారలశౌర్యవిజృంభణంబులున్
వారలహస్తలాఘవము • వారల తెంపును బెంపుఁ జూడఁగా
నేరికొ గెల్పు వీరి కిద • మిత్థ మటంచు వచింపరాక పెం
పారుచు నుండె నా కదన • మబ్బురపోవుచుఁ జూడ ఖేచరుల్. ౨౦౭

అర్థములు. ఇదమిత్థమ్ = ఇది యిట్లు యగును అనఁగా లక్ష్మణుఁడే జయించునని కాని, యింద్రజిత్తే యోడిపోవు నని కాని చెప్ప సాధ్యపడినదికాదు.

తా త్ప ర్య ము స్పష్టము

కం. దెసలును మూలలు బాణ ప్రసరంబులచేత నిండ రవి లేనియెడన్
ముసరెడి పెంజీఁకటినా, నెసఁగెను సంతమస మపుడు • దృగ్భీకరమై. ౨౦౮

అర్థములు. ప్రసరంబుల చేతన్=సమూహములచేత, ముసరెడి=క్రమ్ము కొను, సంతమసము=గాఢాంధకారము, దృక్ + భీకరమై=చూడ్కికి భయంకరమై.

తా త్ప ర్య ము

నాలుగు దిక్కులు నాలుగు మూలలు అష్టదిక్కులు బాణ సమూహముల చేత నిండఁగా సూర్యుఁడు లేనప్పుడు క్రమ్మెడి గాఢాంధకారమువలె చూడ్కికి భయంకరమై కాఱుచీఁకటి వ్యాపించెను.

సీ. నెత్తురు టేరులు • మొత్తంబులై పాఱెఁ, గ్రవ్యాదములు నించెఁ • గఠినరుతము
లనలుండు జ్వలియింపఁ • డనిలుండు వీవఁడు, స్వస్తిలోకేభ్య యఁ • టంచుఁ బలికె
ఋషిసంచయంబులు • బృందముల్ గట్టి, వీక్షించు గంధర్వాది • ఖేచరతతి
సాధ్వసంబునసహా • చారణమై దవ్వుఁ, చని నిల్చికనియె నా • సమయమునను

ఆ. సుకృతహస్తుఁ డైన • సౌరుండు లక్ష్మణుం, డసురసింహు హాట • కాంచితముల
నీలసైంధవముల • నాలుగింటిని నాల్గు, వాలురమ్ము లేసి • పటిమ మాన్చి

అర్థములు. క్రవ్యాదములు = మాంసము దిను జంతువులు, తోడేళ్ళు నక్కలు మొదలైనవి, కఠినరుతములు = పరుషధ్వనులు, అనలుండు = అగ్ని హోత్రుఁడు, అనిలుండు = వాయువు, స్వస్తిలోకేభ్యః = ప్రపంచమునకు మేలు

కలుగునుగాక, అనుకరణము పరమగుటచే విసర్గమునకు లోపము, బృందముల్ = గుంపులు, ఖేచరతతి=ఆకాశమున సంచరించు వారి సమూహము, సాధ్వసంబునన్ =బాణములు తమకుఁ దగులు నను భయముచే, సుకృతహస్తుఁడు = గురితప్పక కొట్టువాఁడు, "కృతహస్తస్సుప్రయోవిశిఖః కృతపుంఖవత్" అమరము. హాటకాంచితములన్=బంగారు పగలచే నొప్పువానిని, నీలసైంధవములన్=నల్లని గుఱ్ఱములను, వాలురమ్ములు = వాలు+అమ్ములు = నిడుపాటి బాణములు, పటిమ = దృఢశక్తి, మాన్పి = తగ్గునట్లు చేసి.

### తాత్పర్యము

నెత్తురులు వెల్లువలై పాఱెను. మాంసముదిను జంతువులు పరువముగా నఱచుచుండెను. అగ్ని మండదయ్యెను. గాలి వీవదయ్యెను. ఋషులు లోకమునకు మేలు కలుగుఁగాక యనుచుండిరి. ఆకాశమున గుంపులుగట్టి తిరుగుచుండు గంధర్వాదులు చారణులతో తమకు బాణములు తగులు నను భయముచే దూరముగాఁ బోయి చూచుచుండిరి. ఆ సమయమున గురి సూటిగాఁ గొట్టఁగల లక్ష్మణుఁడు నాలుగు నిడివి బాణములచే నింద్రజిత్తు నాలుగు నల్లగుఱ్ఱముల బలము దగ్గునట్లు కొట్టెను.

## —♦ లక్ష్మణుఁ డింద్రజిత్తుసారథిని జంపుట ♦—

కం. వేఁడిమిఁ బిడుగుల కెనయై, వాఁడి మిగిలి మేలిగఱుల ♦ వఱలుచు డాలుం
బోఁడిమిగలయమ్మున న,వ్వాఁడిమగనిసూతు శిరము ♦ వసుధం గూల్చెన్.

అర్థములు. ఎనయై=పోలికయై, వాఁడి=పదును, మేలిగఱుల=శ్రేష్ఠములైన ఱెక్కలచే, డాలుంబోఁడిమి=కాంతిచే నందము, వాఁడిమగని = శూరునియొక్క, సూతుశిరము=సారథితల.

### తాత్పర్యము

వేఁడిమియందుఁ బిడుగుతో సమానమై పదును గలదై మంచి ఱెక్కలచేఁ బ్రకాశించుచు కాంతిసంపద గల బాణముచే శూరుఁడైన యింద్రజిత్తు నొక్క సారథి శిరస్సు లక్ష్మణుఁడు నేలఁబడ గొట్టెను.

ఉ. సారథిఁ జంపి తత్క్షణమ ♦ చాపముఁ ద్రుంచిన దాశకంఠియున్
దేరిని దాన తోలుచును ♦ దేఁకువఁ గార్ముక మొండు పూని య
వ్వీరుఁడు పోరుట ల్మిగుల ♦ వింతలు గొల్పెను, సూతకృత్యమున్
దీరుచువేళ లక్ష్మణుఁ డు♦దీర్ణరయంబునఁ ద్రుంచి వింటినిన్. ౨౦౪

అర్థములు. దాశకంఠి = ఇంద్రజిత్తు, తేఁకువన్ = ధైర్యముతో, ఉదీర్ణరయంబునన్ = మిగుల వేగముచే.

### తాత్పర్యము

సారథిని జంపి వెంటనే విల్లు ఖండింపఁగా నింద్రజిత్తు రథమును దానే నడుపుచు ధైర్యమున వేఱొకవిల్లు తీసికొని వాఁడు యుద్ధముచేయుట మిగుల నాశ్చర్యకరముగ నుండెను. వాఁడు సారథిచేయు కార్యము చేయువేళ వింటిని ఖండించి.

ఉ. చాపమొకండు పుచ్చుకొని♦సంయమున వాజుల నొంచె నొంపఁ దా
నేపు దొలంగ కా యసురుఁ ♦ డెంతయు ధీరతఁ దాను సైచు బ
ల్తూపులలోన మార్కొలయఁ ♦ దూర్ణము బాణపరంపరాహతిన్
జోపు గొనంగఁ జేయఁ దన♦సూతునిచావున కంగలార్చుచున్. ౨౦౮౩

అర్థములు. వాజులన్=గుఱ్ఱములను, ఏపు=పరాక్రమము, తొలంగక = వదలక, ధీరతన్=ధైర్యముతో, తూపులలోనన్=బాణములలో, మార్కొలయన్= ఎదురు దిరుగఁగా, తూర్ణము = త్వరగా, చోపు = కలఁత, అంగలార్చుచున్= వ్యసనపడుచు.

### తాత్పర్యము

వేఱొక విల్లుపుచ్చుకొని వడిమి కాలములో గుఱ్ఱముల నొప్పించెను. ఇట్లు నొప్పించినను పరాక్రమము విడువక యారాక్షసుఁడు ధైర్యముతో లక్ష్మణుఁడు వేయు బాణములలోనే యెదురు తిరుగుచుండుట చూచి వేగముగ బాణపరంపరల దెబ్బలచేఁ కలఁత పడునట్లు కొట్టఁగా తన సారథి చచ్చెనని వాఁడు దుఃఖపడుచు.

ఉ. తేజు దొలంగియున్న పర♦దేవవిరోధిముఖంబుఁ గాంచుచున్
భూజచరావళుల్ పొగడ ♦ భూధవపుత్రకు సాధువాక్కులన్
వాజులపేర్మి నాతఁ డని ♦ వారణశక్తిఁ జరించుచుంటచే
యోజనచేసి శౌర్యమద♦యుక్తులు నల్వురు వానరేశ్వరుల్. ౨౦౮౪

అర్థములు. తేజు = ముఖకాంతి, భూజచరావళుల్ = వానరుల సమూహములు, వాజులపేర్మిన్ = గుఱ్ఱముల వేగాతిశయముచే, అనివారణ శక్తిన్ = నివారింపరాని శక్తిచే.

### తాత్పర్యము

కాంతి మాసియున్న యింద్రజిత్తు ముఖముఁజూచి వానరులు మేలుమేలని లక్ష్మణుఁబొగడిరి. తోలెడివాఁడు లేకపోయినను గుఱ్ఱములు తమంతఁదామే గుఱికిఁ జిక్కక తిరుగుచుండుటచూచి శౌర్యముగల నలుగురు వానరు లాలోచించి.

చ శరభుఁడు గంధమాదనుఁడు ♦ సారబలుల్ రభసప్రమాథు లు
ద్ధురగతిఁ జివ్వున న్నెగసి ♦ దూఁకి హయంబుల నాలుగింటినిన్
ధరణిని గూల్చి రావణి ర♦థంబును ముక్కలు చేసి వెండి ని
ల్చిరి త్రుటిలోన లక్ష్మణుని♦చెంతఁ గపీంద్రులు తమ్ము మెచ్చఁగన్. ౨౦౮౫

### తాత్పర్యము

శరభుఁడు గంధమాదనుఁడు రభసప్రమాథు లను వారు మిగుల వేగముగఁ జివాలున నెగసి దూఁకి నాలుగు గుఱ్ఱముల జంపి తేరువిఱిచి కుప్పపెట్టి నిమిషములో మరలివచ్చి లక్ష్మణు ప్రక్క కపులు తమ్ము మెచ్చుచుండఁగా నెప్పటివలె నిలిచిరి.

కం. హతతురగుఁడు హతసారథి, హతనిర్జరరాజుఁ డపుడు ♦ క్షితి నిలఁబడి క్ష్మా
పతిసుతు నెదిరిన నాతఁడు, శితశరముల నతనియుదుటు ♦ చెఱిచెం ద్రుటిలోన్.

అర్థములు. హతనిర్జరరాజుఁడు = కొట్టఁబడిన యింద్రుఁడు గలవాఁడు. బహువ్రీహి సమాసమున రాజు రాజుఁడని యగును. హతతురగుఁడు=గుఱ్ఱములు చంపఁబడినవాఁడు, హతసారథి=సూతుఁడు చంపఁబడినవాఁడు, ఉదుటు=గర్వము.

తా త్ప ర్య ము

గుఱ్ఱములు సారథి చావఁగా నింద్రజిత్తు నేల నిలువఁబడి లక్ష్మణు నెదిరింపఁగా బాణపరంపరలచే నతని బలగర్వమును నిమిషములో నాయన చెఱిచెను.

## —♦ { ౯౧-వ సర్గము. ఇంద్రజిత్తు కపుల వంచించి లంకకుఁ బోయి రథికుఁడై వచ్చుట } ♦—

ఉ. మానక కాండములు గురియు ♦ మానవనాథసుతున్ సురారి నా
నానిశితాస్త్రసంతతు ల ♦ నంతముగాఁ గురియింప నిర్మరున్
మానము మచ్చరంబు విసు ♦ మానముగాఁ బెరుఁగంగఁ బోరుచో
వానరరాక్షసావళులు ♦ వారల ప్రాపున వైరిసంఘముల్. ౩౦౮౭

అర్థములు. విసుమానము=ఆశ్చర్యము. విస్మయశబ్దభవము.

తా త్ప ర్య ము

అంతతో వదలక బాణములు గురియఁగా లక్ష్మణుని నుద్దేశించి పెక్కులు పదునైన బాణసమూహములు అంతము లేకుండఁ గురియింపఁగా నిర్వురకు అభిమానము మాత్సర్యము ఆశ్చర్యకరముగా వృద్ధిచెందఁగా యుద్ధము చేయుచుండ వారి సాహాయ్యమున వానరులు రాక్షసులు తమ విరోధుల గుంపులు.

కం. కుతిలపడఁ బెనఁగుచుం దమ, పతులన్ రక్షించుకొనుచుఁ ♦ బలువిధముల ను
ద్ధతిఁ జూపఁగ నపు డాహరి,జితుఁ డసురుల మెచ్చి పొగడి ♦ చేరి యిటులనున్.

అర్థములు. కుతిలపడన్ = బాధపడునట్లు, పెనఁగుచున్ = యుద్ధము చేయుచు, ఉద్ధతి=గర్వము, హరిజితుఁడు=ఇంద్రజితుఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. సకలకకుప్పుల ♦ సంతమసం బతి,గాఢమై పర్వెరా ♦ కాసులార!
మనవారిఁ బెఱవారి ♦ గనిపింపఁగారాదు, పలుపంగఁ దగు నొండు ♦ సాహసంబు
తెలిపినింతయు నీక ♦ తికమిక గొనఁగపుల్, మసరిపోరుఁడు వారు ♦ మోహపడఁగ
క్షణములో నరుదెంతు ♦ స్యందనస్థితుఁడనై, యంకిలి లేక నే ♦ లంక కరిగి

తే. వారు లెఱిఁగిన నడ్డము ♦ వచ్చువారు, వారలను మోసగింపఁగ ♦ వలయుమీరు
శక్తిసామర్థ్యముల కిది ♦ సమయ మన్న, వారు వల్లె యటంచును ♦ బోరుచుండ.

అర్థములు. సకలకకుప్పులన్ = అన్నిదిశల, సంతమసము = గాఢాంధకారము, అతిగాఢమై = మిగుల దట్టమై, తెఱపి = సందు, విరామము — స్యందనస్థితుఁడనై=రథమందున్నవాఁడనై, అంకిలి లేక=అడ్డము లేక.

తా త్ప ర్య ము

రాక్షసులారా! యన్ని దిక్కులయందుఁ జీఁకట్లు మిగుల దట్టముగ వ్యాపించి యున్నవి. మనవారెవరో పరులెవ్వరో తెలిసికొనఁగూడ లేరు. ఇప్పుడొక సాహస కార్యము చేయవలసియున్నది. మీరు కొంచెమైన నెడమీయక వానరులు తికమికలాడునట్లు గుంపులై క్రమ్ముకొని యుద్ధము చేయుఁడు. వారు నేనిందున్నానని తలపోయవలయును. అట్లు మీరు చేసితిరేని నడ్డము వచ్చువారు లేక నేను లంకకుఁ బోయి వేఱొక రథమును దీసికొని క్షణములో వచ్చెదను. ఈ వార్త వానరులెఱిఁగిరా నాకడ్డము వత్తురు. ఊరిలోకిఁ బోనీయరు. వారిని మీరు మోసగింపవలెను. మీరు మీ శక్తిసామర్థ్యములు చూప నిదియే సమయము అని చెప్పఁగా వా రామాట నంగీకరించి యుద్ధము చేయుచుండఁగా.

కం. పురికిం జని కనకాలంకరణోపేతంబు రథము ♦ ఘన ముసల గదా
 కరవాలపూర్ణ ముత్తమ,తురగము హితసారథికముఁ♦దొరఁ సమకూర్చెన్.

అర్థములు. కనకాలంకరణోపేతంబు = బంగారు సొమ్ములతోఁ గూడినది, ఘన = గొప్పదగు, ముసల = రోకండ్లచేతను. గదా = గదలచేతను, కరవాల = కత్తులచేతను, పూర్ణము=నిండినది, ఉత్తమతురగము=శ్రేష్ఠతములైన గుఱ్ఱములు గలది, హితసారథికము=హితుఁడైన సూతుఁడు గలది, తొరన్=శీఘ్రముగ.

తా త్ప ర్య ము

ఊరిలోనికిఁబోయి బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి రోఁకండ్లు గదలు కత్తులు వీనితో నిండి మేలి గుఱ్ఱములు కట్టఁబడి హితుఁడైన సారథిగల రథమును త్వరగా సమకూర్చెను.

ఉ. పూని రథస్థుఁడై భటుల ♦ పుంజము వెంబడి రాఁగ వాఁడు లం
 కానగరంబు వెల్వడియెఁ ♦ గాలుఁడు దన్ బెరరేప వచ్చి రా
 మానుజు నివ్విభీషణుని ♦ నద్రిచరావళి శాతబాణ ధా
 రానికరంబులం బొదివె ♦ రాక్షసు లందఱు మేలు మే లనన్. ౨౦౯౧

అర్థములు. పెరరేపన్ = ప్రేరేపింపఁగా, శాతబాణధారానికరంబులన్ = వాఁడియైన బాణవర్ష ధారల సమూహములచే.

తా త్ప ర్య ము

రథము నందున్నవాఁడై యుద్ధభటుల సమూహము తన వెంబడి రాఁగా లంక విడిచివచ్చి యముఁడు తన్నుఁ బ్రేరేపింపఁగా లక్ష్మణుని విభీషణుని, వానరుల గుంపును వాఁడిబాణముల వర్షముచే రాక్షసు లందఱు మేలుమేలనుచుండఁ గప్పెను.

కం. ఆతనిజవలాఘవముల, కాతతవిస్మయము గాంచి ♦ రగచరులు సుమి
త్రాతనయవిభీషణులును, జేతంబున నితఁడె యోధ ♦ శేఖరుఁ డనుచున్.

అర్థములు. జవము = వేగము, లాఘవము = లగువు, చులుకుగాఁ బని చేయు తనము, ఆతత విస్మయము=మిక్కిలి యాశ్చర్యము, చేతంబునన్=మనస్సునందు, యోధశేఖరుఁడు=యోధులందు శ్రేష్ఠుఁడు.

తా త్ప ర్య ము

వాని వేగమునకుఁ జులుకఁదనమునకు లక్ష్మణవిభీషణులు వానరులు మిక్కిలి యాశ్చర్యపడి యోధ యనిన వీఁడే యోధ యని మిగుల నాశ్చర్యపడిరి.

—♦ లక్ష్మణుఁ డింద్రజిత్తు నొప్పించుట ♦—

ఉ. రక్కను క్రోధమూర్ఛఁ గపి♦రాజుల రావణి నూర్లు వేలుగన్
జక్కఁగ సాల్పడన్ నిశిత♦సాయకము ల్నిగిడింపఁ దక్క వా
రుక్కఱి రాఘవానుజుని ♦ యోలముఁ జేర సురారిచాపమున్
ముక్కలు ముక్కలై విఱుగ ♦ ముల్కి నిగిడ్చె సుమిత్రపట్టియున్. ౨౯౩

అర్థములు. రక్కను = వర్ధిల్లు, రూ — రెక్కను సాల్పడన్ = సాలు పడన్=వరుసగాఁ బడఁగా, ఉక్కఱి=బలము చెడి, ఓలము=మాటు.

తా త్ప ర్య ము

వృద్ధియగుచున్న క్రోధముచే దేహము తెలియక రావణి వానరసమూహములను నూర్లువేలుగ బాణములు వేసి వారు చాలుగా నేలఁ బడఁ జేయఁగాఁ దక్కిన వానరులు లక్ష్మణుని మఱుఁగునకుఁబోయిరి. అప్పుడు లక్ష్మణుఁడు ఇంద్రజిత్తు విల్లు తునుకలు తునుకలై పడ నొక బాణము వేసెను.

చ. సరభసవృత్తి నయ్యసుర ♦ చాప మొకొండు గుణంబుఁ గూర్చుచోఁ
ద్వరపడి మూఁడు బాణముల ♦ దానిని ద్రుంచి సపక్షపన్నగో
త్కరములఁ బోలు నైనవిశి♦ఖంబుల వక్షముఁ దూఱ నేయఁగా
నురవడి నవ్విమే న్వెడలి ♦ యుర్విని రక్తభుజంగమ క్రియన్. ౨౯౪

అర్థములు. సరభసవృత్తిన్ = త్వరతోఁగూడిన వ్యాపారముతో, సపక్షపన్నగోత్కరములన్=ఱెక్కలతోఁగూడిన పాముల సమూహములను, రక్తభుజంగమ క్రియన్=ఎఱ్ఱని పాములవలె.

తా త్ప ర్య ము

ఆ రాక్షసుఁడు త్వరపడి మఱియొక విల్లెత్తి యెక్కుపెట్టునపుడు వేగముగ మూఁడు బాణముల దానిని ఖండించి ఱెక్కలు గల పాములవంటి యైనబాణములు వానిఱొమ్మునమూసిపోవునట్లు వేయఁగా నవి త్వరగా దూసిపోయి యెఱ్ఱపాములవలె.

ఉ. వ్రాలఁగ భిన్నవర్ముఁ డయి ♦ రక్తముఁ గ్రక్కుచు గాఢసారమూ
వాలు శరాసనంబుఁ గొని ♦ పార్థివనందను నప్పురందరుం

బోలి శరోగ్రవృష్టులను ♦ ముంచిన సంభ్రమ మింత లేక య
య్యాలరిఁ బాఱఁ జూచె నృపుఁ ♦ డద్భుతమున్ ఘటియించెఁ జూపఱన్.

అర్థములు. భిన్నవర్ముఁడయి=భేదింపఁబడిన కవచముగలవాఁడయి, వాలు=దీర్ఘమైన, పురందరుంబోని=ఇంద్రునివలె, శరోగ్రవృష్టులను=ఉగ్రశరవృష్టులను=భయంకరమైన బాణవర్షములచే, సంభ్రమము=తొట్రుపాటు, ఆలరిన్=దుష్టుని.

తాత్పర్యము

నేలఁ బడగా కవచము తునుగఁగా నెత్తురు గ్రక్కుచు మిక్కిలి బలముగల నిడుపాటి విల్లెత్తుకొని యింద్రునివలె లక్ష్మణుని బాణవర్షముచే ముంపగా లక్ష్మణుఁడు తొట్రుపాటులేక యా దుష్టుని బాఱఁజూచెను. అది చూచువారికి నాశ్చర్యము కలిగించెను.

ఉ. అంతట లక్ష్మణుండు విల ♦ యాంతకు కైవడి రేఁగి విద్విష
త్సంతతి నొక్క నొక్కనిని ♦ దప్పక యేసియు మూఁడు మూఁడు జీ
వాంతక భల్లకంబు లసు ♦ రారి ధవాత్మజు ముంచె భీమ వి
క్రాంతి యెసంగఁగా బహుళ ♦ కాండములం గనువారు బెగ్గిలన్. ౨౦౯౬

అర్థములు. విద్విషత్సంతతిన్ = శత్రుసమూహమునందు, జీవాంతక = ప్రాణములు దీయు, భల్లకంబులన్=బాణములచే, బెగ్గిలన్=భయపడఁగ.

తాత్పర్యము

అంతట లక్ష్మణుండు ప్రలయకాల యమునివలె విజృంభించి శత్రువుల సమూహమందు నొక్కొక్కనిని దప్పక తగులునట్లు ప్రాణములు తీయఁజాలు బాణంబుల నేసియు నింద్రజిత్తును భయంకరపరాక్రమ మతిశయింపఁగా జూచువారు భయపడునట్లు అనేకబాణములచే ముంచెను.

ఉ. వాఁడును నీడఁబోక కర ♦ వాఁడి లకోరులఁ దీవ్రవేగుఁడై
వేఁడిమి చూప వాని నడు ♦ పీడిని దునకలు చేసి యొండు క్రొ
వ్వాడిశరంబునం దునిమెఁ ♦ బాతకి సూతుశిరంబు శిక్షచే
నాఁడెము లైన మావులు పె ♦ నంగక సారథి లేక యుండియున్. ౨౦౯౭

అర్థములు. ఈడఁబోక = వెనుదీయక, కరవాఁడిలకోరులన్ = మిక్కిలి పదునైన బాణములచే.

తాత్పర్యము

వాఁడును వెనుదీయక మిగుల పదునైన బాణములచే మిక్కిలి వేగము గలవాఁడై వేఁడిమి చూపఁగా వానిని లక్ష్మణుఁడు నడుమనే ఖండించి మఱియొక క్రొత్త పదును గల బాణము తీసికొని పాపాత్ముఁడైన వాని సారథి శిరస్సును ఖండించెను. ఆ గుఱ్ఱములు చక్కఁగా నేర్పఁబడినవి గావున సారథి లేక యున్నను పెనఁగులాడక.

కం. మండలవిభ్రమణంబులఁ, గండడఁగక తిరుగ వింత ♦ గలిగించె; మహా
కాండంబుల సౌమిత్రియు, గుండె లదరఁగొట్టె వానిఁ ♦ గ్రూరుం డగుచున్.

అర్థములు. మండల విభ్రమణములన్=గుండ్రముగా తిరుగుటచే, గండడఁగక=బలము చెడక.

తాత్పర్యము

బలము చెడక యవి గుండ్రముగా దిరుగుచుండఁగా చూచినవా రాశ్చర్య పడిరి. లక్ష్మణుఁడును దయ వదలినవాఁడై గొప్ప బాణములచే వాని గుండె లదరఁ గొట్టెను.

ఉ. ఆతనియేపు సైఁపక మ ♦ హాంబకముల్ కులిశాభము ల్జవ
స్ఫీతము లా సుమిత్రసుతుఁ జిమ్మిన నయ్యవి జోడు దాఁకి యు
ర్వీతలమందు వ్రాలఁగ న ♦ భేద్యతనుత్ర మటంచు నెంచి తా
శాతశరత్రికంబుఁ దొడి ♦ సత్వరుఁడై నొస లంట నేసినన్. ౨౦౯౯

అర్థములు. కులిశాభముల్ = వజ్రాయుధముతో సమానమైనవి, జవస్ఫీతములు = వేగమునకుఁ బేరైనవి, జోడు = కవచమును, అభేద్యతనుత్రము = భేదింపరాని కవచము, ఇది యభేద్యకవచ మనుటచే ముందు కవచము చెడిన పిమ్మట నీ కవచము దొడిగికొనె నని యూహింపవలయును, శాతశరత్రికంబు=పదునైన మూఁడు బాణములు, తొడి=సంధించి.

తాత్పర్యము

లక్ష్మణుని పరాక్రమము సహింపలేక వజ్రమువంటి గొప్ప బాణములు మిగుల వేగము గలవి లక్ష్మణుని వేయఁగా నవి యాయన కవచము దాఁకి నేలఁ బడెను. అభేద్యకవచ మని తలఁచి మూఁడు వాఁడిబాణములను నొసలుదాఁక నేసెను.

కం. కరలాఘవమును నెఱపుచుఁ బరఁగించిన తచ్ఛరాళి ♦ ఫాలమునందున్
గరమరుదుగ మెఱయఁగ నెఱ,సరి లక్ష్మణుఁడుం ద్రిశృంగ♦శైలం బనఁగన్.

అర్థములు. నెఱసరి=శూరుఁడు, త్రిశృంగశైలము = మూఁడు శిఖరములుగల పర్వతము, తచ్ఛరాళి=ఆ బాణములు.

తాత్పర్యము స్పష్టము

చ. వెలయుచు రోషసంక్షుభిత ♦ వీక్షణుఁడై వడి నైదునారసం
బులఁ దొడి వైరిఫాలమున ♦ భూరిబలుండు నిగిడ్చె నిట్టు లా
యరఘుపరాక్రముల్ మదుల ♦ నాఱని యాసువ నొండొకళ్ళ మే
నులు దలుపింప జల్లెడల ♦ నూల్కొని పోరిరి గెల్పుఁగోరుచున్. ౨౧౦౧

అర్థములు. రోషసంక్షుభిత వీక్షణుఁడై = కోపముచే కలఁత చెందిన చూపులు గలవాఁడై, వడిన్=వేగముగ, ఆఱని యాసువన్=వదలని యార్తిచే,

తాత్పర్యము

ఒప్పుచుఁ గోపముచేఁ గలఁతచెందిన చూపుగలవాఁడై వేగముగ నైదు బాణముల సంధించి విరోధి నొసటఁ దగుల లక్ష్మణుఁడు వేసెను. ఇట్టులా విస్తార పరాక్రమము గల వా రిరువురు మనస్సులందు శమింపని యీర్ష్యచే నొకరి దేహముల నొకరు జల్లెడలను స్మరింపఁజేయునట్లు గొట్టుచు యుద్ధము చేసిరి.

మ. అతులామర్షణుఁ డా దశాస్యతనయుం ♦ డాకర్ణపూర్ణేషు ల
ద్భుత వేగంబున నవ్విభీషణునొసల్ ♦ దూఱంగ మూఁ డేసి తా
నితరోర్వీధరచారులం దవుల నే ♦ కైకాశుగం బేసినన్
తతరోషుండు విభీషణుండు గదచేఁ ♦ దద్వాజులం గూల్చినన్. ౨౧౦౨

అర్థములు. అతులామర్షణుఁడు = అసమాన కోపముగలవాఁడు, ఆకర్ణపూర్ణేషులు=చెవిదాఁక నించిన బాణములను, ఇతర ఉర్వీధర చారులన్ = ఇతర వానరులను, ఏకైకాశుగంబు=ఒక్కొక్క బాణము, తతరోషుఁడు = విస్తారకోపము గలవాఁడు, తత్ వాజులన్=ఆ గుఱ్ఱములను.

తాత్పర్యము

అసమానకోపముగల యింద్రజిత్తు బాణము లాకర్ణాంతములాగి యాశ్చర్యకరమైన వేగమున విభీషణు నొసలుదాఁక మూఁడేసి యితర వానరులఁ దవుల నొక్కొక బాణమేయఁగా నే నూరకున్నను వీఁడు నన్నుఁ గొట్టుచున్నాఁడుగదా యని మిగులఁ గోపించి విభీషణుఁడు వాని గుఱ్ఱములను గదచేఁ గొట్టి చంపెను.

—♦ ఇంద్రజిల్లక్ష్మణులు దివ్యాస్త్రంబులఁ బోరుట ♦—

చ. తురగము లీల్గినన్ ధరణిఁ ♦ దూఁకి బలారివిరోధి శక్తిచేఁ
ద్వరితగతిన్ విభీషణుని ♦ వారక వైవ సుమిత్రపట్టి భీ
కర శరము ల్పదిం దొడిగి ♦ క్ష్మాస్థలిఁ ద్రెళ్ళఁగ దాని నేసినన్
హరిహయసాధనాభ భయ ♦ దాశుగముల్ దన యన్న పుత్రుపై. ౨౧౦౩

అర్థములు. బలారివిరోధి = ఇంద్రజిత్తు, హరిహయసాధనాభ = ఇంద్రుని యాయుధ మగు వజ్రముతో సమానమయిన బాణములు.

తాత్పర్యము

గుఱ్ఱములు చావఁగా నేలమీఁద దూఁకి యింద్రజిత్తు విభీషణుని శక్తిచేఁ గొట్టెను. అది వచ్చుట చూచి లక్ష్మణుఁడు పదిబాణములచే దానిని నేలఁ బడ గొట్టెను. విభీషణుఁడు వజ్రములవంటి బాణములను తన యన్నకొడుకు మీఁద.

ఉ. ప్రేసె వెసన్ విభీషణుఁడు ♦ ప్రీలఁగ ఱొమ్మువి దూసి పాఱినన్
రోసముతోఁ బితృవ్యుపయిఁ ♦ గ్రూరచరిత్రుఁడు కాలదత్తమై
భాసిలు భీషణాస్త్రమును ♦ వైచిన స్వప్న కుబేరదత్తది
వ్యాసమ దుర్నివహ్యాపర ♦ మాస్త్రము లక్ష్మణుఁ డాని వైచినన్. ౨౧౦౪

అర్థములు. పితృవ్యపయిన్ = పినతండ్రిపై, కాలదత్తమై = యమునిచే నీయఁబడిన, స్వప్న=నిద్రయందు, కుబేరదత్త = కుబేరునిచే నీయఁబడిన, దివ్య = దేవసంబంధమైన, అసమ = అసమానమైన, దుర్విషహ్య=సహింపరాని, పరమాస్త్రము = గొప్ప యస్త్రము.

తా త్ప ర్య ము

వేసెను అవి యింద్రజిత్తు అమ్ములోనుండి దూఁటిపోఁగా రోషించి పినతండ్రిపై యముఁడు తన కిచ్చిన భయంకరాస్త్రమును వేయఁగా లక్ష్మణుఁడు తనకుఁ గుబేరుఁడు స్వప్నమందిచ్చిన సహింపరాని యసమానమైన మహాస్త్రమును పూనివేసెను.

కం. బలవంతులు బలవద్ధను,వుల బలవంతముగఁ దిగిచి ♦ పుచ్చిన జ్యావ
ల్లులు క్రౌంచంబుల పోలిక, వెలయించెను ధ్వనులు సురలు ♦ వెఱఁగొందంగన్.

అర్థములు. బలవత్ ధనువులన్ = బలముగల విండ్లను, బలవంతముగ = శక్తికొలఁది, తిగిచి = లాగి, పుచ్చినన్ = వేయఁగా, జ్యావల్లులు = తీఁగవంటి యల్లెత్రాడులు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. ఆ యస్త్రములు రెండు♦ననలంబుఁ గ్రక్కుచుఁ, బిడుగులమాడ్కి-ని♦వడిగఁ బాఱి
చదల నొండొంటిని ♦ సరగ ఢీకొను, ఢీకొట్టుకొనుచు న♦స్తోకధూమ
విస్ఫులింగంబులు విన్నెల్ల నఱుమంగ, భూరిగ్రహము లట్లు ♦ పోరి పోరి
శతధాచ్ఛిదంబు లై♦త్క్ష్మస్థలి వ్రాలిన, సౌమిత్రియును శక్ర♦శాత్రవుండు
ఆ. సిగ్గురోసములను ♦ జిడిముడి పడి రంత, వారుణాస్త్రమును న్పృ♦పాలసుతుఁడు
వైవ రౌద్రశరము ♦ వైచి రావణుపట్టి, దాని బిగువు నమ్ఘటముగ నణఁచె.

అర్థములు. అనలంబున్ = నిప్పును, చదలన్ = ఆకాశమందు, విస్ఫులింగంబులు=మిణుఁగురులు, మిన్ను = ఆకాశము, అఱుమంగన్=ఆక్రమింపఁగా, శతధాచ్ఛిదంబులై = నూఱుగాఁ జీలినవై, చిడిముడిపడిరి = తొట్రుపడిరి, సిగ్గురోసములను=తన యస్త్రము భగ్నమాయెనని యింద్రజిత్తు సిగ్గుపడెను. ఆయస్త్రమును సంహరించుటయేగాక తాను దలఁచినట్లు రావణిని దన యస్త్రము చంపఁజాలదయ్యెఁగదా యని లక్ష్మణుఁడు సిగ్గుపడెను......రామునితో సముఁడని తానెంచియున్న విభీషణుఁ గొట్టెఁగదాయని లక్ష్మణునకుఁ గోపము. తాను వేసినదానిని లక్ష్మణుఁడు కొట్టెనేయని యింద్రజిత్తునకుఁ గోపము.

తా త్ప ర్య ము

ఆ రెండస్త్రములు నిప్పులుగ్రక్కుచు బిడుగులవలెఁ ద్వరగాఁబోయి యాకాశమందు నొకదాని నొకటి ఢీకొని ఢీకొట్టి యధికమైన పొగచేతను మిణుఁగురుల చేతనునాకాశమంతయునాక్రమించిపెద్దగ్రహములవలెఁగలహించికలహించి నూఱు

తునకలై నేలఁబడఁగా ఇంద్రజిల్లక్ష్మణులు సిగ్గుచేతను రోషముచేతను దొట్రు పడిరి. అంత లక్ష్మణుఁడు ఇంద్రజిత్తుపై వారుణాస్త్రము ప్రయోగించెను. ఇంద్రజిత్తు రౌద్రాస్త్రము వేసి దానిబలము చెఱిచి ఖండించెను.

చ. ఉడుగక యంతలోనఁ గడుఁ•నుగ్రత లోకములెల్లఁ గాల్చున
 వ్వడువునఁ బావకాస్త్రమును • వాసవవైరి గుణంబుఁ గూర్చి నె
 వ్వడి రఘురాము తమ్మునపయి • వైచిన నాతఁడు సౌరబాణముం
 దొడిగి యణంచె దాని మదిఁ • దొట్రిల శత్రువరుండు వెండియున్. ౬౧౭

అర్థములు. వడువునన్ = విధముగ, పావకాస్త్రమును = ఆగ్నేయాస్త్రమును, నెవ్వడిన్=నెఱి+వడి = నిండు వేగముతో, సౌరబాణము = సూర్యసంబంధబాణము, సూర్యతిష్యాగస్త్యాదులందు యలోపము:—"సూరసూర్యార్యమా"యని యమరము.

తాత్పర్యము

వదలిపెట్టక యంతలోనే లోకమువంతయుఁ గాల్చువానివలె నాగ్నేయాస్త్రమును లక్ష్మణునిపై మిగుల వేగముగాఁ బ్రయోగించెను. ఆయన సౌరాస్త్రము వేసి శత్రువు తొట్రుపడుచుండ దాని నణఁచెను.

కం. ఆసురబాణము వైచిన, భాసురముద్గరముసుంఠి•పరిఘగదాసుల్
 రాసులుగ వెడలి రాఁ గని, వేసెన్ లక్ష్మణుఁడు రౌద్ర•విశిఖము సరగన్.

అర్థములు. ముద్గర=ఇనుపరోఁకలి, ముసుంఠి = కొయ్యరోఁకలి, ముద్గరముసుంఠి=ద్వంద్వసమాసము- "ద్వంద్వశ్చప్రాణి తూర్య సేనాంగానామ్" 'జాతిరప్రాణినామ్' అను సూత్రములచే నేకవచనము, పరిఘగదాసుల్=ఇనుపకట్ల గుదియలు, గదలు కత్తులు, ఆంధ్రమున నేకవద్భావము విభాష గావున నిచట బహువచన రూపము. ముసుంఠీ శబ్దము ఈకారాంతము గావున రెండుగా విభజింపఁబడును. ముసుంఠికి ముసుండి యనియు రూపాంతరముగలదు. సరగన్=శీఘ్రముగ.

తాత్పర్యము

ఇంద్రజిత్తు ఆసురాస్త్రము వేయఁగా దానినుండి యినుప రోఁకండ్లు కొయ్యరోఁకండ్లు ఇనుప గుదియలు గదలు కత్తులు గుంపులుగ వెడలి రాఁగా లక్ష్మణుఁడు రౌద్రాస్త్రము దానిపై వేసెను.

మ. అనివార్యంబు సమస్త శత్రుహననో•దారంబు రౌద్రాస్త్ర మా
 దనుజాస్త్రంబును నాఁగినన్ గగనభూ•త వ్రాతముల్ క్షుబ్ధమై
 మనుజేంద్రాత్మజుఁ జుట్టియుండె, నసుర•క్ష్మానాథ యుద్ధంబు స
 ర్వజనతాశ్చర్య నిదానమై భయదమై • సంభ్రాంతిదంబై కడున్. ౬౧౮

అర్థములు. అనివార్యంబు = వారింపరానిది, సమస్త శత్రు హననోదారంబు = సమస్త శత్రువులను జంపుటయందు గొప్పది, ఆఁగినన్=అడ్డగింపఁగా,

క్షుబ్ధమైన=క్షోభ చెందినదై, స్వర్గవతా=దేవతల సమూహమునకు,ఆశ్చర్య నిదానమై=ఆశ్చర్యకారణమై, భయదమై = భయము గలిగించునదియై, సంభ్రాంతిదంబై =తొట్రుపాటు గలిగించునదియై.

తాత్పర్యము

వారింపరానిదై యెట్టి శత్రువునైనఁ జంపఁగలదైన రౌద్రాస్త్రము ఆ యాసురాస్త్రమును సడ్డగింపఁగా నాకాశమండలి ప్రాణిసంఘములు క్షోభ చెంది లక్ష్మణుని జుట్టుకొని యుండెను. రాక్షస రాజకుమార యుద్ధము దేవతలకు నాశ్చర్యకరమై భయంకరమై తొట్రుపాటు గలిగించునదియై.

ఆ. వర్తిలంగ ఋషి సు♦పర్వగంధర్వాహి, గరుడతతులు గూడి ♦ హరిహయుండు
మున్నుగాఁగఁ గలన ♦ సన్నుతశీలు లక్ష్మణుని హెచ్చరికను ♦ గాచుచుండ.

తాత్పర్యము

ఉండఁగా ఋషులు, దేవతలు, గంధర్వులు,పన్నగులు,గరుడులు వీరందఱుఁ గూడి యింద్రుని మున్నుగా నుంచుకొని సాధువులచే స్తోత్రము చేయఁబడు స్వభావము గల లక్ష్మణుని హెచ్చరికతోఁ గాచుచుండఁగా.

—♦ లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించుట ♦—

సీ. అలఁతులఁ బోఁడు స♦ర్వాస్త్రవేది యితండ,టంచు రోషించి రా♦మానుజుండు
మును సురాసుర యుద్ధ♦మున హరి యొద్దానఁ, గీనాశసంఘంబు ♦ గీ టణంచె
నట్టి వహ్నిస్పర్శ ♦ మసమసుపర్వంబు, సారపత్రంబు సు♦సంస్థితంబు
హాటకవికృతంబు ♦ నరినాశనకరంబు, దుర్నివారంబును ♦ దుస్సహంబు
ఆ. విబుధపూజితంబు ♦ విషధరప్రఖ్యంబు, నింద్రదేవతాక ♦ మైంద్రశరముఁ
గార్ముకోత్తమమునఁ ♦ గాండోత్తమంబును, బూరుషోత్తముండు♦పూని తిగిచి.

అర్థములు. అలఁతులన్ = అల్పముతో, సర్వాస్త్రవేది = అన్ని యస్త్రములు తెలిసినవాఁడు, హరి = ఇంద్రుఁడు, కీనాశసంఘంబున్ = రాక్షస సమూహమును, గీటణంచెన్ =చంపెను, వహ్నిస్పర్శము=అగ్నివలెఁ దాఁకునది, తాఁకినఁ గాల్చునది, అసమ=అసమానమైన, సుపర్వంబు = మంచి కణుపులు గలది, సారపత్రంబు = బలముగల తెక్కలు గలది, సుసంస్థితంబు = చక్కని సంస్థానము గలది, హాటకవికృతంబు = బంగారుచేఁ జిత్రింపఁబడినది, అరినాశనకరంబు=శత్రువుల నాశనము చేయునది, దుర్నివారంబును = నివారింపరానిది, దుస్సహంబు = సహింపరానిది, విబుధపూజితంబు = దేవతలచేఁ బూజింపఁ బడినది, విషధర ప్రఖ్యంబు = పాముతో సమానమయినది, ఈ ప్రఖ్యశబ్దము త్తరపద మయినపుడు సమానమను నర్థము గలదగును. ఇంద్రదేవతాకము=ఇంద్రుఁడు అధిష్ఠాన దేవత గాఁగలది, కావుననే ఐంద్రశరమను పేరు గలది, తిగిచి = లాగి.

## తాత్పర్యము

తాను వేసిన రౌద్రాస్త్రముకూడ నాసురాస్త్రము నణచుటతో నిలిచి వానిని జంపజాలకుండుటచే వీఁడు కొంచెముతోఁ జచ్చువాఁడు కాఁడు. ఏలన నన్నియస్త్రములకుఁ బ్రతియస్త్రముల నెఱుంగును. బ్రహ్మాస్త్రమేసినను బ్రహ్మాస్త్రము బ్రయోగించునని యాలోచించి కోపించి లక్ష్మణుఁడు పూర్వము దేవాసురయుద్ధమున నింద్రుఁడు అసురుల దేనితో వధించెనో యాయస్త్రమును, డాఁకిన నిప్పువలెఁ గాల్చుదానిని, మంచి రెక్కలు గణుపులు గలదానిని, బలమయిన రెక్కలు గలదానిని, మంచి సంస్థానము గలదానిని (సన్నివేశము గలదానిని) బంగారుతోఁ జిత్రింపఁబడిన దానిని, శత్రువుల నాశము చేయుదానిని, నివారింపరానిదానిని, సహింపరానిదానిని, దేవతలచేఁ బూజింపఁబడినదానిని, పాముతో సమానమైనదానిని, ఇంద్రసంబంధ మంత్రముచేఁ నభిమంత్రింపఁబడినదానిని ఐంద్రాస్త్రమును ఉత్తమమైనవింట నుత్తమమైన బాణమున నుత్తమ పూరుషుఁడు సంధించి లాగి.

తే. సారధర్మాత్ముఁడును సత్య•సంధుఁ డేని, రామచంద్రుండు దశరథ•రాజసుతుఁడు
పౌరుషమునను నప్రతి•ద్వంద్వుఁ డేని, శరమ! యీ రావణాత్మజు•సంహరింపు.

## తాత్పర్యము

దశరథరాజకుమారుఁ డైన రామచంద్రమూర్తి మిక్కిలి ధర్మాత్ముఁడును సత్యము దప్పనివాఁడును పౌరుషమున నసమానుఁడును నగునేని యో యస్త్రమా యీ యింద్రజిత్తును సంహరింపుము. దీనికి మూలమైన సంస్కృతశ్లోకమును శ్రీమద్రామాయణమునకు మూలమంత్రముగఁ బెద్ద లనుగ్రహించి యున్నారు. దీనికి ఋషి, ఛందస్సు, అంగన్యాస కరన్యాసాదులు కలవు. అవి సదాచార్యముఖమున గ్రహింపనగు. ఆ వివరము పత్రపాఠమున నసర్థక మగునని వ్రాయలేదు. ఇది యథావిధి జపించు నిష్ఠాపరులకు నెట్టి శత్రువులవలనను, ఎట్టి క్షుద్ర ప్రయోగముల వలనను భయములేదు. తానే యెట్టి శత్రువునైన జయింపగలవాఁ డగును. ఇంద్రజిత్తు బ్రహ్మశిరోనామకాస్త్రముకూడ నెఱిఁగినవాఁడగుటచే నే యస్త్రము వేసినను బదులస్త్రము వేయును. దానివలన ఫలము లేదని తలఁచి యస్త్రమునకు బలిష్ఠమై యనివార్యమైన శక్తి గలిగింప దీనిని వచించెను. అటుగాకున్న నైంద్రాస్త్రము బ్రహ్మాస్త్రముచే హతము కావలసినదే. అట్లు లన్యోనా రాముఁ డధర్మాత్ముఁడు, అసత్యసంధుఁడు నగును. అది సత్యమునకు విరోధము. ఆ కారణముచే నాయస్త్రమునకు సహజశక్తి గాక అభేద్యమైన విశేషశక్తి గలిగెను. దానివలన నది యేమైనది యింద్రజిత్తునకుఁ దెలిసినది కాదు. అతికాయునివలె దీనిని వారించుట కేదైనఁ బ్రయత్నమైనఁ జేసియుండును. కాని బ్రహ్మశాపమువలన నదియు తోఁచినది కాదు. నీ యజ్ఞము నాశము చేసినవాఁడు నిన్నుఁ జంపునని బ్రహ్మ చెప్పియుండెను గదా.

చ. అని నిజకార్యసాధక య♦థార్థ సుభాషణము ల్వచించి చ
 య్యన దృఢముష్టి దృష్టిలఘు♦తాతిరయంబులు దోఁపగా దశా
 స్యసుతుపై నిగుడ్చ నది ♦ సూర్యనిభప్రభ మై మహోద్ధతిం
 జని సశిరస్త్రకుండలము ♦ శాత్రవు మూర్ధముఁ ద్రుంచె వ్రేల్మిడిన్. ౨౧౧౩

అర్థములు. నిజకార్యసాధక = తన కార్యమును సాధింపఁగల, యథార్థ సుభాషణముల్ = సత్యమైన మాటలను, ఇట్లు చెప్పుటచే రామచంద్రమూర్తి వాలి వధమందుఁ గాని మఱి యే విషయమందుఁ గాని యధర్మముగా వర్తింప లేదనియు అసత్యము పలుక లేదనియు సిద్ధాంత మగుచున్నది. దృఢ = గట్టియైన, ముష్టి = పిడికిలి, దృష్టి = చూపు, లఘుతా = లాఘవము, అతిరయము = మిగుల వేగము, సూర్యనిభప్రభమై = సూర్యునితో సమానమైన కాంతి గలదై, సశిరస్త్రకుండలము = శిరస్త్రాణముతోను కుండలములతోను గూడినది, శాత్రవుమూర్ధము = విరోధి తల, వ్రేల్మిడిన్ = చిటికె వేయు నంతలో, త్రుంచెన్ = ఖండించెను.

### తాత్పర్యము

ఈ ప్రకారము తనకార్యము సాధించునట్టి సత్యమైన వాక్యములు చెప్పి వేగముగ దృఢమైన ముష్టితో బాణము సంధించి యింద్రజిత్తుపై చూపు దృఢముగా నిలిపి లాఘవముతోను వేగముతోను నింద్రజిత్తుపై వేయఁగా నది సూర్యుని కాంతి గలదై, మిగుల బలముగఁ జని శిరస్త్రాణముతోను, కుండలములతోను గూడిన తలను చిటిక వేయునంతలో ఖండించెను.

చ. తెగిన శిరంబు హేమరుచి♦దీపిత మై రుధిరోక్షితంబు నై
 బిగిచెడ కుర్విఁ గానఁబడె ♦ భిన్నశరాసము భిన్నవర్మమున్
 నొగిలిన శీర్షకం బయి త♦నూగిరి ద్రెళ్ళ విభీషణుండునున్
 నగచరులెల్ల వృత్రవధ ♦ నాఁటి దివౌకసు లట్లు మోదిలన్. ౨౧౧౪

అర్థములు. హేమరుచి దీపితమై = బంగారు కాంతిగలదై, రుధిరోక్షితంబునై = నెత్తుటితోఁ గూడినదై, బిగి = బిగువు, భిన్నశరాసము = విఱిగిన విల్లు, భిన్నవర్మము = చినిఁగిన కవచము, నొగిలిన = వికలమైన, శీర్షకము = తల కలదై, తనూగిరి = దేహమను పర్వతము, దివౌకసులు = దేవతలు, మోదిలన్ = సంతోషింపఁగా.

### తాత్పర్యము

తెగినతల బంగారు కాంతి గలదై నెత్తుట దడిసినదయ్యు బిగువు చెడక నేలఁ గానఁబడెను. విఱిగినవిల్లు చినిగిన కవచము వికలమైన తలగలదై పర్వతము వంటి దేహము పడఁగా విభీషణుఁడును వానరులును వృత్రవధనాఁడు దేవతలు సంతోషించినట్లు సంతోషింపఁగా.

—• ఇంద్రజిత్తు మరణంబునకు లోకంబులు సంతోషించుట •—

కం. మింటను వేలుపులున్ వా, ల్గంటులు ఋషివరులు యక్ష•గంధర్వులు లో
నంటిన సంతసమున రవ, గెంటింపక యుల్లసిలిరి • కేకలతోడన్. ౨౧౧౫

అర్థములు. వాల్గంటులు = స్త్రీలు, రవ = కొంచెమైన, గెంటింపక = చలనము లేక. తాత్పర్యము స్పష్టము.

ఉ. ఏలిచావుఁ జూచి తము • వృక్షచరుల్ దఱుమంగ రాక్షసుల్
రాలఁగ జేతికైదువులు • లంకకుఁ బాఱిం గాందిశీకులై
వేలకొలఁది దిక్కులకు • భీతిలి పాఱిరి చొచ్చి రంబుధిన్
శైలము లెక్కి రొల్లియలు • జాఱఁగఁ ద్రేలఁగఁ గేశబంధముల్. ౨౧౧౬

అర్థములు. ఏలిక=ఏలువాఁడు, ప్రభువు. కాందిశీకులై = కలఁత చెందినవారై, దిక్కు తెలియని వారై.

తాత్పర్యము

తమ ప్రభువు చచ్చుట చూచి వానరులు తమ్ముఁ దఱుముకొని రాఁగా రాక్షసులు చేతి యాయుధములు నేలఁ బడఁగా కలఁత చెంది కొందఱు లంకకుఁ బరువెత్తిరి. వేలకొలఁదులు భయపడి దిక్కుల వెంటఁ బరువెత్తిరి. కొందఱు సముద్రములో దూఁకిరి. కొందఱు కట్టు వస్త్రములు జాఱఁగా తలవెండ్రుకలు ముడులూడఁగాఁ గొండలెక్కిరి. ఒల్లియలు జాఱుట, వెండ్రుకలు వ్రేలాడుట యందు నందఱు రాక్షసులకు సమానము.

చ. జలజహితుండు గ్రుంకఁ గర•సంతతి యాతని వెంటఁ బోవు న
చ్చెలువునఁ గూలియున్న హరి•జిత్తును గాంచి సురారికోటిలో
నిలువఁడ యొక్కఁడే నచట • నిర్వృతపావకుఁడో ప్రశాంత ర
శ్మిల దినహాథుఁడో యనఁగ • శూరవరుం డతఁ డొప్పె నయ్యెడన్. ౨౧౧౭

అర్థములు. జలజహితుండు = సూర్యుఁడు, కరసంతతి=కిరణముల సమూహము, హరిజిత్తును = ఇంద్రజిత్తును, నిర్వృతపావకుఁడో = చల్లారిన యగ్నియో, ప్రశాంత రశ్మిల = వేఁడిమి తగ్గిన కిరణములు గల సూర్యుఁడో.

తాత్పర్యము

సూర్యుఁడు గ్రుంకఁగా గిరణము లతని వెంటనె పోవునట్లు చచ్చిన యింద్రజిత్తును జూచి రాక్షసుల గుంపులో నొకఁడైన నచట నిలిచిన వాఁడు లేఁడు. నేలఁ బడిన యింద్రజిత్తు చల్లారిన యగ్నియో, కిరణముల వేఁడిమి చెడిన సూర్యుఁడో యన్నట్లుండెను.

కం. దేవతలతోడ సంగ్రా, మావనికిన్ వచ్చి శక్రుఁ • డసురఁ గని హ
ర్షావేశంబునఁ బొంగెను, ద్యోవీథిని మ్రోఁగె దేవ•దుందుభి రవముల్. ౨౧౧౮

అర్థములు. సంగ్రామావనికిన్ = యుద్ధభూమికి, సరిగా నాకాశమునకు,

శక్రుఁడు=ఇంద్రుఁడు, ద్యోవీథిని=ఆకాశమున, దేవదుందుభి రవముల్ = దేవతల నగారాధ్వనులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. భాసురతేజుఁ డై ♦ భాస్కరుం డలరారె, శాంతదుఃఖము లయ్యె♦జగము లెల్ల
నాపదలను బాసి ♦ దీపించె లోకంబు, పాడిరి గంధర్వ ♦ వరులు మింట
నటియించి రప్సరో ♦ నాళీక వదనలు, కురిసెను బుష్పముల్ ♦ సురలగములు
నీరనిధానముల్ ♦ నిర్మలాకృతు లయ్యె, దెసలెల్ల నచ్చపుఁ ♦ దెలివిఁ దాల్చె
తే. సర్వలోకభయంకర ♦ శక్రవైరి, గూలిన యుదంతమును విని ♦ గుములు గట్టి
చూచి లక్ష్మణు శ్లాఘించి ♦ శుద్ధపణితి, దీవన లొసంగె దనుజర్షి♦దేవవితతి.

అర్థములు. భాసురతేజుఁడై=ప్రకాశించు తేజము గలవాఁడై, భాస్కరుఁడు = సూర్యుఁడు, ఇంతవఱకు నిర్భయముగా సూర్యుఁడు ప్రకాశింప లేదని భావము, శాంతదుఃఖములు = శమించిన దుఃఖములు గలవి, అప్సరో నాళీక వదనలు=అప్సర స్త్రీలు, నీరనిధానములు = సరస్సులు, ఉదంతము=వార్త.

తాత్పర్యము

సూర్యుఁడు నిర్మల కాంతితోఁ బ్రకాశించెను. జగముల దుఃఖము శమించెను. లోకము లాపద భయము లేనివయ్యెను. గంధర్వులు భయమువిడిచి యాకాశమున బాడిరి. అచ్చర లాడిరి. దేవతలు పూవులు గురియించిరి. సరస్సులులోనైనవి నిర్మలము లయ్యెను. దిక్కులు కాంతి గలవయ్యెను. అన్నిలోకములకు భయము కలిగించు నింద్రజిత్తు చచ్చె నన్న వార్త విని గుంపులు గట్టివచ్చి చూచి దనుజర్షులు దేవతలు లక్ష్మణు శ్లాఘించిరి.

కం. కలఁకయుఁ బరితాపము లే, కిల ధరణీనిర్జరాళి ♦ యిఁక నిర్భయులై
మెలఁగెడి నను మ ముదంబునఁ, బలికె సుపర్వోత్కరంబు ♦ బ్రహ్మర్షితతుల్.

అర్థములు. కలఁక = కొతుకు, భయము, ధరణీనిర్జరాళి = బ్రాహ్మణ సమూహము, నిర్భయులై=దిగులు లేక, సుపర్వోత్కరంబు=దేవతల సమూహము, బ్రహ్మర్షితతుల్ = బ్రహ్మర్షుల సమూహములు.

తాత్పర్యము

ఏ హోమము చేసిన నే రాక్షసుఁడు వచ్చి ధ్వంసము చేయునోయని కలంకముగాని, చేసిన పిమ్మటఁ జెడిపోయెనే యని పరితాపముగాని లేక యిఁక బ్రాహ్మణులు నిర్భయముగా సంచరింతు రని దేవతలు, బ్రహ్మర్షులు పలికిరి.

ఉ. పొంగుచు జాంబవత్ప్లవన ♦ పుత్రవిభీషణు లోలి నమ్మహా
భంగపరాక్రముం దివిజ ♦ పల్లభజైత్రు నధించి మించు రా
సింగముఁ జేరి సంస్తుతులఁ ♦ జేయుచుఁ దద్విజయంబు మెచ్చి వే
భంగులఁ దద్రణంబు నభి ♦ వర్ణన సల్పిరి శ్రద్ధధాను లై. ౨౧ ౨౧

అర్థములు. దితిజ వల్లభ జైత్రున్=రాక్షస శ్రేష్ఠుఁడైన యింద్రజిత్తును జయించిన వానిని, రాసింగము=రాజసింహము, శ్రద్ధధానులై = శ్రద్ధగలవారై, ఇఁక రావణు చావు నిజమని నమ్మినవారై.

తాత్పర్యము

సంతోషముచే నుప్పొంగుచు జాంబవంతుఁడు హనుమంతుఁడు విభీషణుఁడు ఎదురులేని పరాక్రమము గలట్టియు, నింద్రజిత్తును జయించినట్టియు, సింద్రజిత్తును జయించి యతిశయించు రాజసింహము లక్ష్మణుని జేరి యాయన గెలుపును మెచ్చుకొనుచు నాయనను స్తోత్రముఁ జేయుచు నా యుద్ధమును విశేషముగ వర్ణించిరి.

కం. అఱచుచు లాంగూలంబులఁ, జఱచుచు మముకుచును లంక • నంక్షోభింపన్
బఱచుచు మెఱయుచు లక్ష్మణు, నెఱి మెచ్చుచు నతనిఁ జుట్టి•నిలిచిరి కీశుల్.

అర్థములు. చఱచుచున్=కొట్టుచు, పఱచుచున్=పరువెత్తుచు.

తాత్పర్యము స్పష్టము.

కం. జే లక్ష్మణ జే లక్ష్మణ, జే లక్ష్మణ యనుచుఁ బ్లవగ•శేఖరు లన్యో
న్యాలింగనరతి రణకథ, లోలిన్ వినిపించికొనుచు • నుండిరి వేడ్కన్. ౨౧ ౨౩

అర్థములు. అన్యోన్యాలింగన రతి=ఒకరి నొకరు ప్రీతితోఁ గౌఁగిలించుకొనినవారై.

కం. విని ప్రియసుహృదుఁడు లక్ష్మణుఁ, డొనరించిన యసుకరంబు•నొగి నమ్మక తా
రనిభూమికిఁ జని కనుఁగొని, మనముల నుప్పొంగి చని ర•మర్త్యులు ప్రీతిన్.

అర్థములు. అసుకరంబు = సుకరము కానిది, అసు+కరంబు = ప్రాణములు కలిగించునది, ఇంద్రజిత్తు ప్రాణముతో నుండువఱకు దేవతలు ప్రాణము లుండియు లేనివారే.

తాత్పర్యము

లక్ష్మణుఁ డింద్రజిత్తును జంపినాఁడనిన ప్రాణదాయకమైన వార్త వినియును నమ్మఁజాలక యుద్ధభూమికి వచ్చి పీనుఁగును జూచి దేవతలు మనస్సులందు సంతోషించి పోయిరి.

## ౯౨ సర్గము. ఇంద్రజిత్తు వధ విని శ్రీరాముఁడు లక్ష్మణుఁ గొండాడుట.

సీ. ఇంద్రజిత్తు వధించి • సాంద్రముదం బొంది, తోఁగుచు నెత్తుట•ద్రుమచయులను
జాంబవంతుని వాయు•సంభవునిం జేరి, సుగ్రీవరాములఁ • జూడ మనము
పోదము పదుఁడని • పూని విభీషణు, మారుతికేలు ల•క్ష్మణుఁడు వేగ
మమరేంద్రుఁ జేరు బృ•హస్పతివిధమున, రామచంద్రుని డాసి • ప్రణతిఁ జేసి
తే. పలికెఁ దిన్నగ సంకోచ•పడుచు నింద్ర, జిద్వధంబును రాక్షస•శేఖరుండు
మనముపొంగఁగ సర్వంబు•వినిచె రామ,చంద్రుఁడలరారితత్కథా•శ్రవణమునను.

అర్థములు. తోఁగుచున్=స్నానము చేయుచు, ద్రుమచరులను=వానరులను.

తాత్పర్యము

ఇంద్రజిత్తును జంపి మిగుల సంతోషించి నెత్తుట స్నానము చేయుచు వానరులను జాంబవంతుని హనుమంతుని బిలిచి మనము రామసుగ్రీవులఁ జూడఁబోదమని యొకచేత విభీషణు చేయి మఱియొకచేత హనుమంతుచేయి పట్టుకొని లక్ష్మణుఁడు వేగముగ బృహస్పతి యొద్దకుఁబోవు నింద్రునివలె రామచంద్రమూర్తిని సమీపించి నమస్కరించి హనుమంతుని యెదుట కుప్పిగంతు లన్నట్లు రామచంద్రమూర్తితో నేనేమి గొప్ప కార్యము చేసితి నని యింద్రజిత్తును జంపినవార్త చెప్పుదునా యని సంకోచపడుచు చెప్పక తప్పదు కావున మెల్లగ నింద్రజిత్తు చచ్చెనని చెప్పెను. విభీషణుఁడు యుద్ధవిధ మంతయు వినిపించెను. అది విని రామచంద్రమూర్తి మిగుల సంతోషించెను.

శా. మేల్మేల్ లక్ష్మణ! నిన్ను మెచ్చితి బలే • మేల్చేసితి వింక నా
జాల్మం డీల్గుట సర్వకార్యములు లె•స్సల్ చుమ్మటం చాతనిన్
మేల్మిం బల్కుచు లజ్జమాను నతనిన్ • నిల్పె న్నిజాంకంబునన్
బల్మిన్ శీర్షము మూర్కొనెన్ దృఢపరి•ష్వంగంబునం గ్రుచ్చుచున్. ౨౧౨౬

అర్థములు. జాల్ముఁడు=మూఢుఁడు, లజ్జమానున్ = సిగ్గుపడు వానిని, తానెంత ఘనకార్యము చేసినను పెద్దలయొద్ద చెప్పుకొనుటకుఁ గాని యది యితరులు తన యెదుటఁ జెప్పినపుడుగాని శ్రేయస్కాముఁడు సిగ్గుపడ వలయును. అహంకార పడరాదు. నిజాంకంబునన్=తనతొడ యందు, దృఢపరిష్వంగంబునన్=గట్టిగా గౌఁగిలించుట చేత.

తాత్పర్యము

లక్ష్మణా! బలేబలే. ఎంతమేలు చేసితివి? నిన్ను మెచ్చుకొంటిని ఆ మూఢుఁడు చచ్చుటచే నింక సర్వకార్యములు చక్కనైనవే సుమా, అని మెచ్చుకోలుమాటలాడి తొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని బలవంతముగ నతని తల వాసన చూచి గట్టిగాఁ గౌఁగిలించెను.

కం. తనువెల్ల నిమురుచుం ద,మ్ముని మఱి మఱి చూచి దేహ•మున శల్యసుసా
ధనకృతవ్రణముల రోఁజఁగ, మనమున వగచుచును దాను•మాటికి నూర్చెన్.

అర్థములు. తనువెల్లన్ = దేహమంతయు, నిమురుచున్ = తడుముచు, శల్యసుసాధన కృతవ్రణములన్=ఇనుప ములుకులు గల యాయుధములచేఁ జేయబడిన పుండులచే, రోఁజఁగ = దీర్ఘమైన నిట్టూర్పులు విడువఁగా, కృతవ్రణముల —నిందుతకారము గురువు గాదు.

తాత్పర్యము

దేహమంతయుఁ జేతితోఁ దడవి తమ్ముని మఱి మఱి చూచి దేహమున

నిసుప ములుకులు గల యాయుధములతోనైన ప్రణములచే నూర్పుచ్చుచుండఁగా మనస్సులో విచారపడి దాను గూడఁ దమ్ముని కింత కష్టము వచ్చెఁగదా యని నిట్టూర్పులు విడిచెను.

కం. తడవును శిరమున్ మూర్కొను, నొడువును ననునయములన్ మ♦నోరుజ దీఱన్
గడుసరి వాఁ డెంతగ నిను, గడగండ్లం బెట్టె ననుచుఁ♦గళవళమందున్. ౨౧ ౨౨

అర్థములు. అనునయములన్=ఓదార్పుమాటలను, మనోరుజ=మనస్సున గల బాధ, గడుసరి=కఠినుఁడు, కడగండ్లన్=బాధలను, కళవళమందున్ = సంతాపించును.

తాత్పర్యము

దేహము తడవును, శిరస్సు వాసన చూచును, మనోబాధ క్షయించు నట్లూరార్పు మాటలఁ బలుకును. కఠినుఁడు నిన్నెంత కష్టపెట్టె నని సంతాపపడును.

కం. అన్నా! నీ వొనరించిన, యిన్నితి దుష్కరము పో య♦దెవ్వరికేనిన్
జెన్నారె శుభము లిఁక మన, కన్నిచుఁడు రావణుండు♦హతుఁ డాత్మజుతోన్.

అర్థములు. ఇన్నితి = ఈ పరాక్రమము, దుష్కరముపో = నిజముగా మహాకష్టసాధ్యమైనది- ఇతరులకు సాధ్యముకానిది, పొమ్ము నిశ్చయార్థంబునం దగు ప్రౌ. వ్యా. వాక్య. సూ. ౨౨. రావణుండు హతుఁడాత్మజుతోన్=కొడుకుతోడ రావణుఁడు చచ్చినవాఁడే. కొన్నియెడలఁ ద్వరితార్థసూచకంబయి భావిని భూతంబు చూపట్టెను- ప్రౌ. వ్యా. క్రియ. ౭.

తాత్పర్యము

అన్నా! నీవు చేసిన యీ పరాక్రమ మెవ్వరికైనను చేయ సాధ్యము కానిదే సుమా. మనకింక శుభము లతిశయించెను. ఇంకను ప్రధాన శత్రువు రావణుఁడున్నాడుకదా యందువేమో. ఎప్పుడు కొడుకు చచ్చెనో యప్పుడే తండ్రియుఁ జచ్చినవాఁడే. ఇఁకఁ జచ్చిన వానిని జంపు టెంతటి కార్యము.

సీ. రావణునకు నెపు ♦ రావణియే సుమ్ము, దక్షిణబాహువు ♦ తండ్రి! కలన
నట్టిపాలసుని నీ♦వంతంబు నొందింప, నిపుడుగా నేను జ♦యించినాఁడ
నెన్నఁగా శక్యమే ♦ యీవిభీషణవాయు, నంభవుల్ సలిపిన ♦ సాహసంబు
మూఁడహోరాత్రముల్♦వేఁడిమి మై పోరి, చచ్చెఁగా యెల్లిట్లొ♦శక్రజితుఁడు
ఆ. ఆత్మతనయు మరణ ♦ మాలకించిన యంతఁ, గలబలంబుతోడఁ♦గదలి వచ్చు
నసురవరుఁడు సంగ♦రాతిథ్య మిఁక నిచ్చు, నన్న! నాదుబలిమి♦నతఁడు చచ్చు.

అర్థములు. పాలసుని = దుష్టుని, మూఁడహోరాత్రముల్ = మూఁడు పగళ్ళు మూఁడు రాత్రులు, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, తిథులు- ఎల్లిట్లొ = అతికష్టముమీఁద.

## తాత్పర్యము

రావణునంత చులుకనగాఁ జెప్పెదవేమి యనెదవా ? యుద్ధమందు రావణునకు నింద్రజిత్తే కుడిచేయి. కుడిచేయి పోయిన వానిని యుద్ధములో జయించుట కష్టకార్యమా? రావణాసురునికి నన్నివిధముల సాహాయ్య పడుచుండిన వానిని నీవు చంపితివి. ఇప్పుడుకదా నేను నిజముగా జయించిన వాఁడను. వాఁడున్నంతవఱకు నాకు జయము సందేహమే యనితలఁచుచుంటిని. ఈయుద్ధమందు నీ విభీషణుఁడు, ఈయాంజనేయుఁడు చేసిన సాహస కార్యములు చెప్పశక్యమా? వారిరువురు లేకుండిన మనము వానిని జంపి యుండఁ జాలము. మూఁడుపగళ్ళు మూఁడు రాత్రులు విడువక యుద్ధముచేసి యింద్రజిత్తు ఎట్లెట్లో చచ్చెఁగదా. ఇఁక దన కొడుకుచావు వినినంతనే రావణుఁడు మిగిలిన సేనతోడఁ గదలి వచ్చును. యుద్ధభిక్ష నిచ్చును. నాచేతఁజచ్చును.

కం. నా కిట దిక్కై యి నీ వా, నాకపతివిరోధిఁ ద్రుంచి ♦ సంగద నేనా
త్మాకన్యను రాజ్యంబును, జేకొనఁగాఁ గలిగితిన్ వి♦శిష్ట చరిత్రా. ౨౧౩౧

అర్థములు. ఇట = ఈయుద్ధమందు, ఈ లంకలో, ఈ కష్టదశయందు, దిక్కై యి=రక్షకుఁడవయి, త్రుంచినంగద=త్రుంచుట చేతఁగదా, నేనాత్మాకన్యను రాజ్యంబును జేకొనఁ గలిగితిని, అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు, సు. వ్యా. వాక్య. ౪౧.

## తాత్పర్యము

సాధుశీలా! నా కిచ్చట నీ సమయంబున రక్షకుఁడవై యింద్రజిత్తును జంపుటచేఁ గదా నా కా సీత లభించును. రాజ్యము లభించును. నీ వా పని చేయకుండిన నా కా రెండును లేనివే కదా. తన నిమిత్తముగాఁ గాని లోకక్షేమమునకుఁ గాని గొక్కరు గొప్ప కార్యము చేసినపుడు తగిన రీతి వారిని బహూకరింప వలయునని దీనిచే సూచితము లక్ష్మణుఁడు చంపకుండిన రాముఁ డింద్రజిత్తును జంపలేఁడా యేమి ? అది కాదు లెక్కింపవలసినది. చేసిన పనిని శ్లాఘింపవలెనుగాని యితరులా పని చేయఁగలవా రున్నంత మాత్రమునఁ జేసిన వారిని బహూకరింపక మానరాదు. పనిచేయుట గొప్పగాని, చేయఁగలుగుట మాత్రము గొప్ప గాదు.

చ. అని యిటు లాశ్వసించి బిగి ♦ యారఁగఁ గ్రుచ్చి సుషేణుఁ బిల్చి యీ
యనఘుని మిత్రవత్సలు మ ♦ హామతి స్వస్థునిఁ జేయ వయ్య యీ
యన మెయి నాటియున్నయవి ♦ యమ్ములములుక్కులకే విభీషణున్
వనచరఋక్షశూరులను ♦ స్వస్థులఁ జేయుము క్షిప్రకారివై. ౨౧౩౨

అర్థములు. ఆశ్వసించి = ఊరార్చి, స్వస్థుని = ఆరోగ్యవంతుని, క్షిప్రకారివై=త్వరఁగా బనిచేయు వాఁడవై.

## తాత్పర్యము

అని యూఁరార్చిఁ గట్టిగఁ గౌగిలించుకొని సుషేణుఁ బిల్చి యీ దోష రహి

తుని, మిత్రులందుఁ బ్రేమగలవానిని, గొప్ప మనస్సు గలవానిని,నారోగ్యవంతునిఁ జేయుము. ఈయన దేహమునందు నినుప ములుకులు నాటుకొని యున్నవి. వాని నెల్ల వెలికిఁ దీయుము. ఆప్రకారమే విభీషణుని వానర భల్లూక శూరులను శీఘ్రముగ నారోగ్యవంతులఁ జేయుము.

ఉ. వారును వీరు నేల మన♦వారుగ సంగరకేళి నొచ్చిన
వ్వారలకెల్ల వేగముగ ♦ బాధఁ దొలంపు మటన్న నాతఁడున్
సారతరౌషధిన్ నృపతి♦చంద్రున కిచ్చెను, దాని మూర్కొనన్
గూరె సుఖంబు దక్షిణమ♦కూలెను ములుకుల్ మానె గాయముల్. ౨౧౩౩

అర్థములు. మనవారుగ = మనపక్షమువారుగ.

తాత్పర్యము

వారు వీరని పేరు చెప్పనేల? మనపక్షమునఁ బోయి యుద్ధమం దెవరెవరు గాయపడిరో వారికందఱకు వెంటనే చికిత్సచేయుము. బాధ నివారింపుము, అని చెప్పఁగా నాతఁడును లక్ష్మణునకు సారవంతమైన యొక మూలిక వాసన చూడుమని యిచ్చెను. అది వాసన చూడఁగానే దేహములో నాటిన ములుకులన్నియుఁ బడిపోయి గాయములన్నియు మానెను. సుఖము కలిగెను.

తే. మఱివిభీషణునకుఁ,దక్కు♦మర్కటులకుఁ,జలిపెను జికిత్స రాముని♦శాసనమునఁ
దక్షిణంబున లక్ష్మణ♦తరుచరేంద్రు,లెల్లరును వీతబాధులై♦యుల్లసిలిరి. ౨౧౩౪

అర్థములు. మఱి=ఆపిమ్మట, వీతబాధులై=బాధ తొలఁగినవారై.

తాత్పర్యము స్పష్టము.

తే. రామచంద్రానుజుండు ని♦రామయుండు, గాఁగ వానరభల్లూక♦కాండపతులు
నవ్విభీషణుఁడును జాల♦హర్ష మంది,రనుజు వెండియు మెచ్చె నీ♦తాత్మవిభుఁడు. ౨౧౩౫

అర్థములు. నిరామయుండు=బాధతొలఁగినవాఁడు, సుఖము గలిగినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

## —♦ ౯౩-వ సర్గము. ఇంద్రజిత్తు మరణమునకు రావణుఁడు విలపించుట ♦—

చ. తరుచరవర్యు లిందుఁ బ్రమదంబునఁ దేలఁగ నందు రాక్షసే
శ్వరునచివుల్ బలారిజితు♦వార్త వినిన్ సువినిశ్చితాత్ములై
యురలఁగ బాష్పవారి యసు♦కోత్తమ నీయనుజుండు తోడ్పడం
బోరిగొనెనంట లక్ష్మణుఁడు ♦ పోర భవత్సుతు నింద్రజిత్తునిన్. ౨౧౩౬

అర్థములు. ఇందు = వానరసేనా సన్నివేశమందు, రామచంద్రమూర్తి యున్నచోట - అందు = లంకయందు - రావణుఁడున్నచోట - వినిన్ = విని యును నమ్మఁజాలక,దృఢపఱచుకొనక రావణునకుఁ జెప్ప ధైర్యము లేక,సువినిశ్చితాత్ములై = మిక్కిలి విశేషముగ నిశ్చయించుకొన్నవారై, అనఁగా ఇంద్రజిత్తు పడినచోటికిఁబోయి శవమునుజూచి ప్రాణము పోయినదని నిశ్చయించుకొన్నవారై,

ఉరలఁగన్=కాలఁగా, పోరిగొనెనంట=పోరిగొనెనని చెప్పుటకు ధైర్యము చాలక యిట్లు చెప్పిరి.

తాత్పర్యము

వానరశ్రేష్ఠు లిచ్చట నీవిధముగ సంతోషమున నుబ్బితబ్బిబ్బులగుచుండఁగా నచ్చట లంకలోఁ రావణుని మంత్రులు ఇంద్రజిత్తు చచ్చినవార్త వినియును,నమ్మఁ జాలక సమక్షము పోయి చూచి నిశ్చయించుకొని కన్నీరు కాఱుచుండఁగా రాజా! నీ తమ్ముఁడు సహాయపడఁగా లక్ష్మణుని చేత నీ కొడు కింద్రజిత్తు యుద్ధములో చచ్చెనని యీ రాక్షసులు చెప్పుచున్నారని చెప్పిరి.

ఉ. శూరవరుండు జన్యమున ♦ స్రుక్కక యుండఁగఁడు, శక్రజైత్రుఁడై
ధారిణిఁ గీర్తి కెక్కె, బల♦ధాముఁడు నీసుతుఁ డట్టివాఁడు నీ
తారమణానుజుం డొడరి ♦ తద్దయు హావడి పుట్టఁ జేసి దు
ర్వారశరాళి వీరజన♦భావితలోకము జేరెనం చనన్. ౨౧౬౭

అర్థములు. జన్యమునన్=యుద్ధమందు, హావడి=ఉపద్రవము, దుర్వార శరాళిన్ = వారింపరాని బాణ సమూహముల చే,వీరజనభావిత లోకము=వీరుల చే గౌరవింపఁబడు లోకము.

తాత్పర్యము

శూరులందు శ్రేష్ఠుఁడు. యుద్ధమున నింతవఱకు బాధ నెట్టిదో నెఱుఁగఁడు. ఇంద్రుని జయించి కీర్తి కెక్కెను. బలమునకు స్థానమైన వాఁడు ఇటువంటి వాఁడు నీ తాపతి తమ్ముని నెదిర్చి మిగుల నుపద్రవము కలిగించి వారింపరాని బాణములచే వీరులగు వారికిఁ బొంద యోగ్యమైన లోకము జేరెనని చెప్పఁగా.

ఉ. దారుణహృద్విదారణ సు♦తప్రలయంబును విన్నమాత్రలో
ఘోరపుమూర్ఛ ద్రెక్కొనఁగఁ ♦ గుంభిని ద్రెళ్ళి విసంజ్ఞుఁ డౌచు లం
కారమణుండు దీర్ఘతర♦కాలమునం దెలివొంది క్రమ్మఱన్
వారని పుత్రశోకమున ♦ వ్యాకులుఁ డై పలవించె దీనుఁడై. ౨౧౬౮

అర్థములు. దారుణ = తీక్ష్ణమైనది, హృత్+విదారణ=గుండెలు పగులఁ దీయునది యగు, సుతప్రలయంబును = కొడుకు చావును, కుంభిని=భూమిమీఁద, విసంజ్ఞుఁడు=స్మృతి తప్పినవాఁడు, దీర్ఘతర కాలమునన్=చాలకాలమునకు.

తాత్పర్యము

మిగుల భయంకరమై గుండెలు పగులఁ జీల్చునది యగు కొడుకు చచ్చిన వార్త విన్నయంతనే గొప్పమూర్ఛ తన్ను క్రమ్మఁగా నేలపైఁబడి స్మృతి దప్పిన వాఁడై రావణుఁడు చాలకాలము వఱకుండి మరల తెలివి వచ్చినవాఁడై ,అంతము లేని పుత్రశోకమున మనస్సు కలఁత చెందినవాఁడై , దుఃఖితుఁడై యేడ్చెను.

సీ. హా పుత్రరత్నమా! హా మహారథవర్య!, హా రాక్షసవ్యూహ♦వీరముఖ్య
నా పెన్నిధానంబ! నా పాలిభాగ్యమా!, నను బాయ నీ కెట్లు ♦ మనసు వచ్చె
వాసవు నంతటి♦వాని జయించియు, సౌమిత్రిచే నెట్లు ♦ సమసితయ్య ?
కాలాంతకుని నైన♦గాలుఁ గూర్చెడు నీదు,నాశుగశక్తి యే♦మయ్యెఁ దండ్రి!
తే. మందరము శృంగములనెల్ల ♦ మహిని ద్రోయఁ
జాలు దోశ్శక్తి యెట్టులు ♦ సమసెఁ బుత్ర
యట్టి నీ శౌర్య మా సుమి♦త్రాత్మజాతు
వణఁపఁజాలని దయ్యెనా ♦ హా కుమార ! ౨౧౩౯

అర్థములు. ఆశుగశక్తి=బాణశక్తి, దోశ్శక్తి=భుజబలము.

తాత్పర్యము స్పష్టము.

కం. కాలుండు నాకుఁ బూజ్యుఁడు, వాలాయము నేఁడు నిన్ను♦వంటి బలాఢ్యున్
గాలగతిఁ గూర్చె నౌరా!, కాలముగతి నెవ్వఁ డెఱుఁగఁ♦గాఁగలఁ డెందున్.

అర్థములు. కాలుండు=యముఁడు, పూజ్యుఁడు = గౌరవింపఁదగినవాఁడు, వాలాయము=నిర్బంధముగా, కాలగతిన్=మృతి.

తాత్పర్యము

నేఁడు యముఁడు నాకు బలవంతముగా నైనఁ బూజ్యుఁడు. ఏలన నీవంటి బలవంతుని చంపెనుగదా. ఔరా! కాలగతి నెందైన నెవ్వఁ డెఱుఁగును.

శా. అన్నా! నాసుతరత్నమా! యిదియ పో ♦ యక్షీణపుమార్గంబు శౌ
ర్యోన్నత్యంబునఁ గ్రాలువారికి సమ♦స్తామర్త్యమర్త్యాళి క
సన్నస్థైర్యుల కాత్మభర్తకయి త్య♦క్తప్రాణు లౌవారి, కా
త్మ న్నాదుస్థితి దిక్కులేనివిధముం ♦ దర్శించి దుఃఖించెదన్. ౨౧౪౧

అర్థములు. ఇదియపో = ఇదియే, శౌర్యోన్నత్యంబునన్ = అధిక శౌర్యముచే, సమస్త అమర్త్య మర్త్యాళికి= దేవతలకైనను, మనుష్యులకైనను అందఱకు, అసన్నస్థైర్యులకున్ = తగ్గిపోని నిలుకడ గలవారికి,ఆత్మ భర్తకయి=తమ ప్రభువుల నిమిత్తమై, త్యక్తప్రాణులు=ప్రాణములు వదలిన వారికి.

తాత్పర్యము

అన్నా ! కుమారరత్నమా ! మనుష్యులకైనను దేవతలకైనను అతిశయ శౌర్యముగల వారికి,చెడని స్థైర్యము గలవారికి, తమ భర్తలకయి ప్రాణములు విడుచు వారికి నిదియే మార్గము. కావున నీవంటివాఁ డేమార్గమునఁ బోవలెనో యా మార్గముననే నీవు పోయితివి.కావున నీకై నేను దుఃఖింపను గాని యొక్కఁడైన బంధు వనువాఁడు లేకపోయిన నాదుస్థితి తలంచి నావాఁడని నేను జెప్పఁ గలవాఁడు లేఁడాయెఁ గదా యని నాదీనదశకై నే నేడ్చెదను.

కం. ఎన్నండు నన్నుఁ బాయవు, కన్నాకై నన్ను బలముఁ • గాచెద వీఁక నా
కున్నారె దిక్కు నీకుం, జన్నె నను నొంటి విడిచి•జముపురి కరుగన్. ౧౮౨

అర్థములు. కన్నాకై = కంటికి తెప్పవలె రక్షకుఁడవై, జముపురికి = యముని పట్నమునకు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఇప్పుడు పో యమరులును గ,కుప్పపతులు ఋషులు నీదు•కూలుట వినుటన్
మప్పితము లేనిముదము, జిప్పిల్లఁగ నాద మఱచి • నిద్రింత్రు సుఖా. ౧౮౩

అర్థములు. కకుప్పపతులు = దిక్పాలకులు, మప్పితము = మితము, ఆద మఱచి నిద్రింతు రనఁగా నిర్భయముగా సుఖింతురని యర్థము. దేవత లస్వప్నులు కావున మనుష్యులవలె నిద్రింతురని చెప్పరాదు. ఆదమఱచి నిద్రించుట యనునది లోకోక్తి, చిప్పిల్లఁగన్=ఉబుకు.

తాత్పర్యము

దేవతలు, దిక్పాలకులు, ఋషులు నీవు చచ్చినవార్త విని అమిత సంతోషము లోపలనుండి యుబికి పైకిరాఁగా హాయిగా సుఖింతురు.

ఆ. పురము నగరు లున్న•భూమి యాకస మున్న,వనములున్న శైల•వరము లున్న
జీవరత్న మింద్ర•జితుఁడొక్కరుఁడు లేమి,సర్వశూన్య మగుచు•జగముదోఁచె.

అర్థములు. జీవరత్నము = ప్రాణమిచ్చు రత్నము, సర్వశూన్యము = ఏమియు లేనిది, పాడుపడినది.

తాత్పర్యము స్పష్టము.

కం. అక్కట యంతఃపురముల, రక్కసకన్నియల దుఃఖ•రవములు గుహాలన్
దిక్కేది యఱచు కరిణుల, వెక్కసపుం ధ్వనులు వోలె • విన నయ్యో నయో.

అర్థములు. దిక్కేది = దిక్కులేక, కరిణుల=ఆఁడేనుఁగుల.

తాత్పర్యము

అయ్యో! అంతఃపురము లందుండు రాక్షస స్త్రీల యేడ్పు ధ్వనులు దిక్కులేక గుహాలం దేడ్చు నాఁడేనుఁగుల ధ్వనులవలె వినవచ్చుచున్నవి.

ఉ. నన్నును యౌవరాజ్యమును • నాయన! లంకను రాక్షసాళి నీ
యన్నులమిన్ననున్ జనని • నందఱ వీడి యొకండ పోవఁగాఁ
జన్నె కుమార! నీవు కద • నల్పఁగ నర్హము ప్రేతకార్యముల్
మున్నుగఁ జన్న నాకు, విధి•మోసమునన్ విపరీత మై చనెన్. ౧౮౬

అర్థములు. అన్నుల మిన్ననున్ = స్త్రీలయందు శ్రేష్ఠురాలు, నీభార్యను.

తాత్పర్యము

తండ్రియగు నన్ను యౌవరాజ్యమును, లంకను, రాక్షస సమూహములను నీ భార్యను నీతల్లిని నందఱ వదలి నీ వొకండవే నాయనా! పోవుట ధర్మమా

ముందు నేను బోయిన నాకు నీవుకదా ప్రేతకార్యములు చేయ వలయును. అటు వంటిది దైవము మోసగించుటచే నేను నీకుఁ జేయవలసి వచ్చెను.

ఉ. రాముఁడు లక్ష్మణుండు కపి ♦ రాజును బ్రాణముతోడ నుండఁగా
నామనమందు గాటముగ ♦ నాటిన శల్యము లట్ల యుండఁగా
నే మని తీవ్రవేదనల ♦ కీగతిఁ బాలొనరించి నన్ను బు
త్రా! మహితోర్ధ్వలోక సుఖ ♦ రాజికి నాస యొనర్చి తక్కటా. ౧౨౨

తాత్పర్యము

రాముఁడు లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు ప్రాణముతో నుండఁగా నిచ్చట నా హృదయమున నాటుకొసన ములుకు లట్లే యుండఁగా వారిని జంపక నాకు సుఖము గలిగింపక యన్ని విధముగఁ దీవ్ర దుఃఖముల పాలొనరించి నాయనా! నీవు మాత్ర మూర్ధ్వలోక సుఖము లంద నే మని పోయితివి.

ఉ. నాయనురక్తి మర్వ నగు ♦ నా యను నిర్జితనిర్జరాళినే
నా యను బాహువీర్యనద ♦ నా యను సీతలిదుఃఖ మార్పరా
దా యను జాయఁ దేర్పఁ గద ♦ దా యను నీచల మేల? మేఘనా
దా యను నీవె దిక్కువు గ ♦ దా యను నా తనుజాతరత్నమా! ౧౨౩

తాత్పర్యము స్పష్టము.

**—♦ రావణుఁడు రాక్షసులతోఁ దన పరాక్రమంబు దెలుపుట ♦—**

చ. అని విలపించు చున్న సహ ♦ జాధికకోపనుఁడైన రాక్షసేం
ద్రునకు సుతార్తిసంభవము ♦ రోషము భీషణమై మనంబునకె
జననము నొంద వేసఁగిని ♦ సంజ్వలదర్చులు రశ్మిమాలికిన్,
ఘనతరతీక్ష్ణతం గొలుపు ♦ కైవడి నైన నతండు మండుచున్. ౧౨౪

అర్థములు. సహజాధికకోపనుఁడై = స్వభావము చేతనే మిగులఁ గోప గుణము గలవాఁడు, సుతార్తిసంభవము = పుత్రశోకమువలనఁ గలిగినది, వేసఁగిన = ఎండకాలమందు, సంజ్వలదర్చులు = మండుచున్న కిరణములు, రశ్మిమాలికిన్=సూర్యునికి, ఘనతర తీక్ష్ణతన్=మిగుల నధికమైన వేఁడిమి.

తాత్పర్యము

ఇట్లేడ్చుచున్న స్వభావము చేతనే కోపగుణము గల రావణాసురునకు పుత్ర శోకము వలన స్వభావము చేతనే వేఁడి కిరణములు గల సూర్యునకు నెండకాల మందుఁ గిరణములు మిగుల వేఁడియైనట్లు కోప మతిశయింపఁగా నతండు మండుచు.

సీ. సహనక్రకల్లోల ♦ సాగరుం డన నొప్పెఁ, గుటిలభ్రుకుటిలతా ♦ నటనయుక్త
ముఖుఁడు కోపవిజృంభ♦ మునవాని వక్త్రింబు, పింగలంబులఁ గ్రక్కు♦వృత్రునోరు
దలపించె సహజర♦క్తంబులు నేత్రముల్, క్రోధాగ్ని వెండియు♦రూక్ష మయ్యె
బ్రకృతిఘోరం బగు♦వపువు కింకను రేఁగ, రుద్రరూపముతోడ♦మాద్రియయ్యె

ఆ. మండువత్తి నుండి • మండు నూనియబొట్లు, పోలెఁ గనులనుండి • రాలె నీటి
విప్రుషములు, దనుజ • వేష్ట్యమానసహిత, యంత్రరవముఁబోలె • నసురవిభుఁడు.

అర్థములు. సహనక్రకల్లోల సాగరుఁడు = మొసళ్ళతోను పెద్ద యలలతోను గూడిన సముద్రుఁడు, కుటిలభ్రుకుటి లతానటన యుక్త ముఖుఁడు=వంకరయైన తీఁగవంటి కనుబొమల ముడియొక్క చలనముతోఁ గూడిన ముఖము గలవాఁడు, కోపవిజృంభణంబునన్ = కోపాతిశయముచే, వాని వక్త్రింబు = వాని ముఖము, ఇంగలంబులు = నిప్పులు, సహజరక్తంబు=పుట్టుకతోనే యెఱ్ఱనైనవి, క్రోధాగ్నిన్=కోపమనెడియగ్నిచే, రూక్షము=పరుషము, ప్రకృతిఘోరంబు=స్వభావముచేతనే భయంకరము, వపువు=దేహము, కింకను = కోపముచే, రేఁగి = అతిశయించి, విప్రుషములు=బిందువులు, వేష్ట్యమాన=త్రిప్పఁబడుచున్న.

తాత్పర్యము

వంకరయై తీఁగవంటిదైన కనుబొమలముడి యదరుటచేత కోపాతిశయము గల వాని ముఖము మొసళ్ళతోను, పెద్ద యలలతోను గూడిన సముద్రమువలె నుండెను. కోపాతిశయమున వాని నోరు నిప్పులు గ్రక్కుచున్న వృత్రునోటిని స్మృతికిఁ దెచ్చెను. సహజముగ నెఱ్ఱనగు కన్నులు కోపాగ్నిచేత మఱింత పరుషమయ్యెను. స్వభావముగ భయంకరమైన వాని దేహము కోపముచే విజృంభించి రుద్రుని రూపముతో సమాన మయ్యెను. రుద్రుఁడు తామసదేవత కావున నీ యుపమానము. సంహారకర్తకు సాత్త్వికశాంతి యెట్లుండగలదు? మండుచున్న వత్తినుండి మండుచుఁ బడుచున్న నూనెబొట్లవిధమునఁ గన్నులనుండి వేఁడి బాష్పజలబిందువులు రాలెను.

రాక్షసులచేఁ ద్రిప్పఁబడిన పెద్దగానుగ యంత్రధ్వని వలెనని పై పద్యముతో నన్వయము.

కం. దంతములు కొఱుకు చప్పుడు, లంతకుగతి నతని చూపు • లడరిన యాయా
ప్రాంతముల నసురవీరులు, స్వాంతంబులు చెదర భీతిఁ • బఱచిరి గుములై.

అర్థములు. అంతకుగతిన్=యముని వంటి.

తాత్పర్యము

రావణుఁడు పండ్లు గొఱికిన చప్పుడులు బోలియుండెను. యముని చూపుల వలె నతని చూపులు వ్యాపింపఁగా నాచూపులు పడిన ప్రదేశముల నుండు రాక్షసులు మనస్సులు చెదరి భయపడి గుంపులు గట్టి పరువెత్తిరి.

తే. అపుడు తనవారికెల్ల భ • యంబు దీఱ, దిటము కలుగంగ నిట్లనుఁ • బటపటంచుఁ
బండ్లు కొఱుకు రాక్షస • వర్యులార?, వినుఁడు నాశక్తి యొఱఁగింతు • విశదముగను.

తాత్పర్యము

అపుడు ఇంద్రజిత్తుకూడఁ జచ్చెనే, యిఁక నీలంకను గాపాడు వారెవరు? లంకలోఁ బ్రవేశించి వానరు లేమి చేయుదురో యనియు, నింతకోపము గలవాఁ

డెవ్వరినేమి చేయునో యనియు భయపడినవారి భయము తీఱునట్లును వారికి ధైర్యము వచ్చునట్లును రోషముచేఁ బటపటపండ్లు గొఱుకుచు నిట్లనెను. రాక్షస శ్రేష్ఠులారా! మీరేల భయపడెదరు? నాశక్తి విశదముగఁ జెప్పెద వినుఁడు.

సీ. వర్షసహస్రముల్ ♦ పరమతపం బుండి, విధి నప్పుడపుడు మె ♦ ప్పించినాఁడఁ
దపము బలంబున ♦ ధాతవరంబున, లేఖాసురభయంబు ♦ లేనివాఁడ
భిదురంబుచేనైన ♦ భేదింపఁగారాని, కవచంబు బ్రహ్మచేఁ ♦ గాంచినాఁడ
నట్టి చాపముఁ బూని ♦ స్యందన స్థితుఁడనై, మాఱెందు లేకుర్వి ♦ మలయువాఁడ
ఆ. కంజజాతదత్త ♦ కార్ముకశరములఁ, బూని నిలువ యుద్ధ ♦ భూమి నల్ల
యింద్రుఁ డేని నన్ను ♦ నెదిరింప నేర్చునే, రామలక్ష్మణాదు ♦ లేమి లెక్క.

అర్థములు. లేఖాసుర భయంబు = దేవతల వలన నసురుల వలన చావు, భిదురంబు = వజ్రము, స్యందన స్థితుఁడనై =రథమందున్న వాఁడనై, కంజజాత దత్త=బ్రహ్మచే నీయఁబడిన, కార్ముక శరముల = విల్లు బాణములను.

## తాత్పర్యము

వేలకొలఁది సంవత్సరములు గొప్పతపస్సు అప్పుడప్పుడు చేసి బ్రహ్మదేవుని మెప్పించి నాఁడను. దీనివలన నీనికి లభించిన యభేద్య కవచము లోనైనవి మొదటి సారి తపంబున లభించినవి కావు. నదుమ నదుమఁ దపస్సు చేసి సంపాదించుకొన్న వే యని యేర్పడు చున్నది. ఆ తపము బలము దేవాసురులచేఁ జావులేకుండ బ్రహ్మచే వరములు పొందినాఁడను. అంతియ కాదు, వజ్రముచేనైన భేదింపరాని కవచము బ్రహ్మచేతనే పొందినాఁడను. అట్టి చాపము చేతఁదీసికొని రథమందుండి యెదు రెవ్వరులేక రణభూమిఁ దిరుగువాఁడను. బ్రహ్మచే నీయఁబడిన విల్లు బాణములు ధరించి యుద్ధభూమి యందు నిలువఁబడితి నేని యింద్రుఁడైన నన్ను నెదిరింప నేర్చునా? ఇంక రామలక్ష్మణులు నాకు లక్ష్యమా.

కం. తెండీ తూర్యశతంబుల, నిండారురవంబుతోడ ♦ నిస్తులధనువున్
జెండెద రాముని లక్ష్మణుఁ, జండాంశుసమాన శాత ♦ సాయకతతులన్. ౨౧౫౮

అర్థములు. తూర్యశతంబుల = అనేక వాద్యముల యొక్క, చండాంశు సమాన = సూర్యునితో సమానమైన, శాత = పదునైన, సాయకతతులన్ = బాణ సమూహములచే.

## తాత్పర్యము

అనేక వాద్యధ్వనులు విస్తరింపఁగా నా విల్లు తీసికొని రండు. సూర్యునితో సమానములైన బాణ సమూహములచే రామలక్ష్మణులను నఱికివైచెదను.

## —♦ రావణుఁడు సీతను జంపఁ బోవుట ♦—

కం. అని సుతవధసంతప్తుఁడ, తనురోషవశంగతుండు ♦ దశవదనుఁడు తా
జనకజఁ జంపఁగ నెంచుచు, ననియెన్ దీనస్వరమున ♦ నసురావళికిన్. ౨౧౫౫

తా త్ప ర్య ము

కోపముతో నిట్లు మాటలాడియు మరల కొడుకు స్మరణమునకు రాఁగా నతఁడు చచ్చెనే యని సంతాపపడుచు మిగులఁ గోపము గలవాఁడై సీతను జంప నాలోచించి దీనస్వరమున రాక్షసులతో నిట్లనియెను.

ఉ. నాతనయుండు సంతురతి♦నంబు వనేచరవంచనార్థమై
సీతయనంగ నొక్క తెను ♦ సృష్టి యొనర్చి వధించె దాని, నే
నాతరళాక్షి క్షత్రియకు♦ లాధమరక్త విదేహకన్య నే
వే తెగవ్రేయుదుం గనుఁడు ♦ పీడ తెగున్ మన కా మృగాక్షితోన్. ౨౧౯౬

అర్థములు. సంతురతినంబు = కొడుకులలో మణి వంటి వాఁడు. సంతాన భవము సంతు. వనేచర వంచనార్థమై=వానరులను మోసగించుకొఱకు, క్షత్రియ కులాధమరక్తను=క్షత్రియకులమందు నధముఁడగు వానియందు ప్రేమ గలది.

తా త్ప ర్య ము

పుత్రరత్నమగు నా కొడుకు వానరుల వంచించుటకై సీత యను దాని సృష్టి చేసి దానిని వధించెను. నేనో యీ వాస్తవ సీతనే, క్షత్రియాధమునందుఁ బ్రేమ గల దానినే, జనకరాజు పుత్రికనే యిదిగో నిప్పుడే తెగవ్రేసెదను. దానితో మన పీడ తెగిపోవును.

చ. అని విమలాంబరద్యుతిస♦మంచితమై సుమహార యుక్తమై
గొన బగు చంద్రహాసమును ♦ గొబ్బునఁ గైకొని పుత్రశోక సం
జనితభృశార్తిఁ జిత్త మవ ♦ శంబుగ జానకి యున్నచాయకై
చనియె జవంబునం దనదు ♦ జాయలు మంత్రులు వెన్నడింపఁగన్. ౨౧౯౭

అర్థములు. విమలాంబరద్యుతిసమంచితమై = నిర్మలమైన ఆకాశము కాంతితో నొప్పినదై, కత్తులు నలుపని కవి సమయము — పుత్రశోక సంజనిత భృశార్తిన్ = పుత్రుని మరణము వలనఁ గలిగిన శోకమువలన జనించిన గొప్ప వ్యసనముచే, అవశంబుగన్=స్వాధీనము తప్పిపోఁగా, జాయలు= భార్యలు, వెన్నడింపఁగన్ = వెంటరాఁగా, ఇట్లు చెప్పుటచే పీడేడ్చుచోటికి భార్యలుకూడ వచ్చి యుండిరని సూచన.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పి నిర్మలమగు నాకాశకాంతితో నందమై పూలదండలు గలదై ప్రకాశించు చంద్రహాసమును దటాలునఁ దీసికొని పుత్రశోకమువలనఁ గలిగిన మహావ్యథచే మనస్సు స్వాధీనముతప్పి యిది చేయవచ్చును, ఇది చేయరాదను తెలివి తప్పిపోఁగా సీత యున్నచోటికి తన్ను భార్యలు మంత్రులు వెంబడించి రాఁగా త్వరగాఁ బోయెను.

సీ. చను రాక్షసేంద్రునిఁ♦గని ఘోష లిడుచు నొం,డొరులతో నని రందు♦నున్నవారు
సామాన్యుఁడా వీఁడు ♦ సకలదిక్పాలుర, నాహవంబునఁ దోలి ♦ నట్టివాఁడు
ఇట్టి వీనిని గని ♦ పృథ్వీశనందను, లేగతిఁ బోదురో ♦ యెవ్వఁ డెఱుఁగు
దేవాసులను గెల్చి ♦ త్రిభువనరత్నాళిఁ, దివిరి బలాత్కృతిఁ ♦ దెచ్చినాఁడు
తే. విక్రమంబున బలమున ♦వీనిసాటి, యెవని, జెప్పంగ నీరేడు♦భువనముల న
టంచు భాషించుచుండ నా♦యసురవరుఁడు, చని యెను నశోకవనమున♦చాయఁబట్టి.

అర్థములు. ఘోషలు=ధ్వనులు, త్రిభువన రత్నాళి = మూఁడులోకము లందలి శ్రేష్ఠ పదార్థములను– 'రత్నం స్వజాతి శ్రేష్ఠేపి' అమరము. బలాత్కృతి= బలవంతముగా, ఈరేడు=ఇరు+ఏడు = పదునాలుగు, వనమున చాయ = వనము యొక్క చాయ; షష్ఠ్యర్థమున నకారాగమము.

తాత్పర్యము

ఇట్లు పోవుచున్న రావణాసురునితోడ ధ్వనులు చేయుచుఁ గొంద అం దున్నవా రిట్లనుకొనిరి. వీఁడేమి సామాన్యుఁడా? దిక్పాలకుల నందఱ యుద్ధమునఁ దఱిమి కొట్టినవాఁడు, ఇట్టి వాని బారిఁ బడి రాజకుమారు లేమగుదురో యెవ్వఁ డెఱుఁగు? దేవాదులను గెల్చి వారి యొద్దనున్న యమూల్య వస్తువుల నెల్ల బలాత్కారముగఁ దెచ్చినాఁడు. ఈ పదునాలుగు లోకములలో వీనికి సమానుఁ డని యెవనిఁ జెప్పవచ్చును? అని మాటలాడు చుండ రావణుఁ డశోకవనమున దిక్కుగాఁ బోయెను.

చ. వల దని మంత్రు లాడినను ♦ బంధువు లందఱు నడ్డగించినన్
జెలిమరు లాఁకఁగొన్నను వి♦శిష్టమతుల్ దగ దంచు జెప్పినన్
నిలువక రోహిణిం బఱచు ♦ నిష్ఠురదుష్టఖగంబువోలెఁ దాఁ
బెలుచన సీతపైఁ బఱచె ♦ భీమగతిం గనువారు బెగ్గిలన్. ౪౧-౪౪

అర్థములు. చెలిమరులు = చెలిమి+అరులు=మిత్రులు, ఆఁకఁగొన్నను = అడ్డగించినను, విశిష్టమతుల్ = గొప్ప మనస్సు గలవారు, నిష్ఠుర = క్రూరమైన, దుష్ట=చెడ్డ, ఖగంబు=గ్రహము, అంగారకుఁడు, బెగ్గిలన్=భయపడునట్లు.

తాత్పర్యము

సీతను జంపవలదని మంత్రులు చెప్పినను,బంధువు లందఱు నడ్డము వచ్చినను, మిత్రులు నివారించినను, పెద్దవారు దగదని చెప్పినను నిలువక, రోహిణి మీఁదికిఁ బోవు నంగారక క్రూరగ్రహమునలెఁ గోపముతోఁ జూచువారు భయపడునట్లు సీతను జంపఁ బరువెత్తెను.

## —♦ రావణునిఁ జూచి సీతాదేవి దుఃఖించుట. ♦—

ఉ. వచ్చెడువానిఁ, గేలఁ గర ♦ వాలముఁ దాల్చినవానిఁ, గిన్కచే
హెచ్చినవాని, స్నిగ్ధజన ♦ బృందము లడ్డము వచ్చువాని, నా

సచ్చరితాగ్రగణ్య రఘు♦చంద్రముతో యల్లి గాంచి యయ్యో యీ
వచ్చెడిజాడఁ జూడఁగ న♦వశ్యము నన్ను వధింప గోరెడిన్. ౨౧౬౦

అర్థములు. కరవాలము = కత్తి, స్నిగ్ధజనబృందములు = స్నేహితుల సమూహములు.

తాత్పర్యము

చేతఁ గత్తితీసికొని కోపముచే వచ్చుచున్నవానిని స్నేహితు లడ్డగించినను నిలువనివానిని పతివ్రత యగు రాముని దేవి సీత చూచి యయ్యో వీఁడు వచ్చెడి విధముఁ జూడ నన్నుఁ జంపఁగోరి యున్నాఁడు.

కం. దిక్కులకు నెల్లఁ దానే, దిక్కయిన మహావ్రతుండు ♦ దిక్కుగఁ గల న
న్నక్కట, యనాథవలె నీ ♦ ముక్కిడిరక్కసుఁడు నేఁడు ♦ ద్రుంపఁగ దలఁచెన్.

అర్థములు. దిక్కులకు నెల్ల = అన్ని దిక్కులకు, ప్రపంచము నంతయు, (అ) రక్షకులని చెప్పఁబడువారి కందఱకు, దిక్కు=రక్షకుఁడు, మహావ్రతుఁడు = అట్టి సర్వరక్షణమే వ్రతముగాఁ గలవాఁడు, దిక్కుగ=రక్షకుఁడుగ, అనాథవలెన్= దిక్కులేనిదానివలె, ముక్కిడి=నీచుఁడు, అల్పుఁడు.

తాత్పర్యము

సమస్త ప్రపంచమునకు రక్షకు లనఁబడువారికెల్ల రక్షకుఁడై, యట్లు రక్షించుటే మహావ్రతముగాఁ గలవానిని రక్షకునిఁగా గల నన్ను అయ్యో! యీ నీచ రాక్షసుఁడు నేఁడు చంపఁదలఁచెను గదా.

సీ. పతిదేవతను నన్నుఁ ♦ బలుమాఱు లీ పాపి, భయనయంబులఁ దన♦పత్నిగాఁగ
బతిమాలి ఛీకొట్టఁ♦బడి నిరాశుండయి, వేసరిమోహంబు ♦ రోస మాత్మఁ
బెనఁగొన నను ద్రుంపఁ♦జను దెంచు చున్నాఁడు, సత్యంబు లే దిందు♦సందియంబు
అటుగాక నాకొఱ♦కమ్మహానుభావుల♦, జంపెనో రామల♦క్ష్మణుల వీఁడు

తే. ఇప్పి నీ మన్నిమిత్తంబు♦నృపతనూజు, లంత మొందిరో దైవమా!♦యెంతపుట్టెఁ
గాక యీ పాపిపుత్రశో♦కమున వారిఁ, జంప లేకిటు వచ్చె నన్♦ద్రుంపఁగోరి.

తాత్పర్యము

భర్తయే దైవమని నమ్మియుండు నన్ను నీ పాపాత్ముఁడు మంచి మాటల చేత, బెదరింపులచేత బలుమాఱు తన భార్యగమ్మని ప్రార్థించి నేను ఛీ కొట్టఁగా నిఁక నిది లోపడ దని నా యాశ వదలి విసిఁగి మోహము రోషము మనస్సున బెనఁగులాడ నన్నుఁ జంపుటకు వచ్చుచున్నాఁడు. ఇది నిజము సందేహము లేదు. నన్నుఁ జంపవచ్చుటకిది యొక కారణమై యుండవచ్చును. లేదా మహానుభావులైన రామలక్ష్మణులవీఁడు చంపి యట్టులేయిచ్చటికివచ్చుచున్నాఁడేమో! అయ్యయ్యో! నానిమిత్తము రాజకుమారులు మరణించిరేమో! దైవమా! యెంత పుట్టెను?

అదియును గాదని తోఁచుచున్నది. ఈ పాపాత్ముఁడు కొడుకులు చచ్చెనన్న దుఃఖముచే రామలక్ష్మణులను జంపలేక నన్నుఁ జంపవచ్చుచున్నాఁడేమో?

దీనివలన సీతాదేవికి యుద్ధవార్త యేదియుఁ దెలియరాదని యేర్పాటులు చేసినను, సరమాదేవివలనఁ దెలియుచుండెనని యేర్పడుచున్నది.

ఉ. ఎంతటిబుద్ధిహీన హిత ♦ మెంచిన సన్మతిమంతుఁడౌ హనూ
మంతునిమాటలం గొనక ♦ మాలితి, నాతనిమాటఁ బట్టి ని
శ్చింతత వీఁపు నెక్కి చనఁ ♦ జిక్కొకటేనియు లేక హాయి నే
నింతకు నాథునంకమున ♦ నిమ్ముగ నుండనె యిట్టు లేడ్తునే? ౨౮౬౩

తాత్పర్యము

నేను మిక్కిలి బుద్ధిలేని దానను నా మేలుగోరి మతిమంతుఁడైన హనుమంతుఁడు చెప్పినమాట వినినదానఁగాను. ఆయన చెప్పినట్లు విని వీఁపెక్కిపోయి యుండినచో వారికిఁగాని నాకుఁగాని యే చిక్కులేక యిప్పటికి హాయిగా నాభర్త తొడమీఁదఁ గూర్చుండి యుందునుగదా. ఇట్లు లిచ్చట నేడ్చుచుందునా?

సీ. ఎంతశోకించునో ♦ యేకపుత్త్రిక సాధ్వి, కౌసల్య కొమరుండు ♦ కదనసీమ
హతుఁడైన నుడి విని ♦ యార్యపుత్త్రునిఁ దాను, గానక కానక ♦ కన్నవిధము
బాల్యసంక్రీడలఁ ♦ బ్రజ ముద్దుబిడ్డఁడై, ముద్దులసుద్దుల ♦ మురిప మిడుట
యౌవనమందుఁ దా ♦ నర్మిలిఁ దనయెడఁ జూపెడిభక్తియు ♦ శుద్ధచరిత
తే. ధర్మకార్యానురూపతఁ♦దలఁచితలఁచి,గుండెలవియఁగ నిఁక నేటి♦కొడుకటంచు
నాసలను మాని శ్రాద్ధకా♦ర్యములఁదీర్చి తానుజితియందొ సీటియం♦దో నశించు.

అర్థములు. ఏకపుత్త్రిక = ఒంటికొడుకును గలది, కదనసీమ=యుద్ధభూమియందు, హతుఁడు=చంపఁబడినవాఁడు, ఆర్యపుత్త్రుని=నామగనిని.

తాత్పర్యము

ఒంటికొడుకునుగలది, సాధ్వి, కౌసల్యాదేవి, తన కుమారుఁడు యుద్ధమందుఁ జచ్చెనన్న మాటవిని యెంత శోకించునో కదా. లేక లేక యెంతో వ్రతానుష్ఠానములచే శ్రమపడి నా భర్తను గనిన విధము, బాల్యమందాయన యాడుకొను చుండిన విధము, ప్రజల కందఱకు వారి వారి ముద్దుబిడ్డలవంటివాఁడై యద్దుముద్దు సుద్దుల ప్రేమకలిగించు చుండినవిధము, వయస్సువచ్చిన పిమ్మట ప్రేమతో నాయన తన్ను భక్తితోఁ బూజించుచుండిన విధము, శుద్ధమైన నడవడి, ధర్మకార్యములందు తగిన విధముగా వర్తించుట తలఁచితలఁచి గుండెలు పగులఁగా నిఁక నా కెక్కడి కొడుకని యాసలుమాని శ్రాద్ధకార్యములు దీరఁగానే తాను అగ్నియందో సీటియందో పడి నశించును. అటుచేయకున్న నీ దుఃఖమెట్లు సహింపగలదు? ఎంతకాలమని సహింపఁ గలదు?

కం. ఇంతకు మూలం బౌజగ, జంత యసతి కుబ్జ దుష్ట • చరితయ యిస్సీ
యెంతటిదుఃఖం బా సు, స్వాంతకుఁ గౌసల్య కొదవె•నా మంథరచేన్.

అర్థములు. జగజంత = పెద్దమూర్త్రాలు, అసతి = లంజియ, దుష్టచరితయ=చెడునడవడిగలది, సుస్వాంతకు=మంచి మనస్సు గలదానికి.

తాత్పర్యము

ఇంత యనర్థమునకు మూలము ఆ పెద్ద ధూర్తలంజ, పొట్టిది, చెడునడవడి గల దాసిగదా. ఛీ. ఆ మంథరచే మంచి మనస్సుగల కౌసల్యకు నెంత దుఃఖము సంభవించెను. తనకుఁ గలిగిన దుఃఖము కంటెఁ గౌసల్యాదేవికిఁ గలిగిన దుఃఖమునకై పలుమారు విశేషించి సీతాదేవి దుఃఖించుటచే నామెకు నత్తగారియం దెంత ప్రేమయో యీ కాలపుఁ గోడండ్రు ఆలోచించి యనువర్తింతురు గాక. ఇది యార్య స్త్రీల లక్షణము.

—• సుపార్శ్వుఁడు రావణునకు నీతిఁ దెలిపి మరలించుట •—

చ. అని యిటు భర్తృహీన యయి • యల్లగ్రహంబున బారిఁబడ్డ చం
ద్రునిసతిఁబోలి యేడ్చు నృప • తోయజలోచనఁ గాంచి ధీయుతుం
డును శుచి యాసుపార్శ్వుఁడు న•నుత్తమమంత్రి హితావళీనిరు
ద్ధుని దశకంధరుం గదిసి • తూర్ణముపల్కె మనంబు దాఁకఁగన్. ౧౧౬౬

అర్థములు. భర్తృహీన = సమీపమందు భర్తలేనిది, అల్లగ్రహంబున బారిన్=ఆ క్రూరగ్రహమైన యంగారకుని యొక్క బారి, షష్ఠ్యర్థమున సకారాగమము. అనుత్తమ మంత్రి=మంత్రులయందు మిక్కిలి యుత్తముఁడు, హితావళీ నిరుద్ధుని = హితుల గుంపులచే నడ్డగింపఁబడిన వానిని, దశకంధరున్ = పదితలల వానిని ఇప్పుడు వీఁడు పదితలలతో నున్నాఁడు కనుక నే ౧౧౪౯ వ పద్యంబున భ్రుకుటి యనునది సంస్కృతమున బహువచనమునఁ బ్రయోగింపఁబడెను. మనంబు దాఁకఁగన్=మనస్సునకుఁ దగులునట్లు.

తాత్పర్యము

ఈ ప్రకారము భర్త యొద్ద లేనిదై యంగారకుని బారిఁబడ్డ రోహిణివలె యేడ్చు రాచకన్నియను జూచి బుద్ధిమంతుఁడును, పవిత్రగుణము గలవాఁడు నగు సుపార్శ్వుఁడను గొప్ప మంత్రిసత్తముడు హితులచే నివారింపఁబడిన రావణుని యొద్దకు త్వరగాఁబోయి వానికి మనస్సునకుఁ దగులునట్లు ఇట్లు చెప్పెను.

ఉ. ఓర! దశాస్య! బ్రహ్మకుల • మందు జనించి, కుబేరుతమ్ముఁడై,
పారము ముట్ట వేదములు • వల్లియ వైచి, వ్రతంబు లన్నియుం
దీరిచి, స్నాతకుండ వయి • నిత్యవిజోచితకర్మశీలి వై
నీరజనేత్రనా తునుమ • నీవు తెగించితి? వీరసత్తమా! ౧౧౬౭

### తాత్పర్యము

ఓరా పదితలలవాఁడా! బ్రహ్మవంశమందుఁ బుట్టి, కుబేరు నంతటి వానికిఁ దమ్ముఁడవై వేదము లన్నియుఁ దుదముట్ట నధ్యయనముచేసి వ్రతము లన్నియుఁ దీర్చి స్నాతకుండవై ప్రతిదినము చేయవలసి నీ కుచితమైన కర్మములు చేయుచున్న వాఁడవై కడపట నాఁడుదానినా చంపఁదెగించితివి? ఎంతటి పిఱికివి!

కం. కోపంబుచేత నెంతటి, పాపం బొడిగట్ట వలసెఁ ♦ బరికింపవుగా
యేపగిది ధర్మమంచును, నీ పాపం జంపఁబూని ♦ తి వసురేంద్రా!

### తాత్పర్యము

కోపముచేత నెంతపాపము సంపాదింప నెంచితివో నీవాలోచింప వైతివిగదా. ఈ స్త్రీని జంపుట ధర్మమని యేవిధముగా నాలోచించితివో చెప్పుము.

ఉ. మానవతీ సురూపమహి♦మంబును జూడుమ, యెట్లు లోకొకఁ నీ
కీ నవలా వధింపఁ జేయి ♦ యెత్తఁగఁ జిత్తము వచ్చె? రాక్షసే
శా! నెఱశూరు లైన మము ♦ సాయముగాఁ గొని రామచంద్రుపై
మానితభంగి నీవు మెద ♦ మండెడు కోపము, మెచ్చు లోకముల్. ౨౧౬౯

అర్థములు. మానవతీసురూప మహిమంబును = ఈ స్త్రీ సౌందర్యము యొక్క యతిశయమును, నవలాన్ = ఆఁడుదానిని, నెఱశూరులు = మిక్కిలిశూరులు.

### తాత్పర్యము

ఈమె యెంతటి సౌందర్యవతియో యదియైనఁ జూడుము. ఇట్టి దానిని జంపుటకై చేయి యెత్త నీకు మనస్సెట్లు వచ్చెను? గౌరవింప వలసిన పదార్థమును హింసింప వచ్చునా? రాక్షసరాజా! మిక్కిలి శూరులైన మమ్ము సహాయులుగాఁ దీసికొని నీలో మండుచున్న కోపమును రామచంద్రునిపై వదలితివేని లోకము నిన్ను శూరుఁడని మెచ్చునుగాని నీ కేయపరాధము చేయని, నీపై యుద్ధమునకు రాని, నీ కేకీడు చేయని యాఁడుదానిని జంపిన నిన్ను మగవాఁడని పౌరుషశాలి వని శూరుఁడ వని లోకము దలఁచునా?

తే. కృష్ణపక్షచతుర్దశి ♦ నిపుడు లేచి
యభ్యమిత్రుండ వగుచుఁ బ్ర♦యాణసన్న
హన మొనర్చి యమావాస్య ♦ యగుట రేప
బలఁగములతోడ వని కేగి ♦ గెలువుఁ గొనుము.

### తాత్పర్యము

ఈ దినము కృష్ణపక్ష చతుర్దశి, ఇపుడు లేచి శత్రువుపై దండువెడలు ప్రయాణ సన్నాహముచేసి రేపు అమావాస్య గావున సేనతోడఁబోయి యుద్ధము చేసి జయింపుము.

"యో గచ్ఛత్యలం విద్విషతః ప్రతిసోఽభ్యమిత్రో ఽభ్యమిత్రీయో ఽభ్యమిత్ర్యమి

త్రీణ ఇత్యపి," అమరము. శత్రువుల కెదురుగాఁ బోవువాఁడు అభ్యమిత్రుఁడు, అభ్యమిత్రీయుఁడు, అభ్యమిత్రీణుఁ డనఁబడును.

ఒక మతమున పున్నమనాఁడు సువేలారోహణము. కృష్ణపక్ష ప్రథమయందు యుద్ధారంభము. ఆ రాత్రి నాగపాశబంధము. విమోచనము. ద్వితీయ యందు ధూమ్రాక్ష వధ. తృతీయయందు వజ్రదంష్ట్రి వధ. చతుర్థియం దకంపన వధ. పంచమియందుఁ బ్రహస్త వధ. షష్ఠిని రావణ మకుటభంగము. సప్తమి కుంభకర్ణ వధ. అష్టమి అతికాయాదుల వధ. నవమి నింద్రజిత్తు యుద్ధము. ఆ రాత్రి కుంభ నికుంభ వధ. దశమి మకరాక్షవధ. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి ఇంద్రజిత్తు యుద్ధము అని కొందఱు,

నవమినాఁడు యుద్ధారంభము. రెండు దినములలో రావణేంద్రజిత్తులు మూలబలము తప్పఁ దక్కినవా రందఱు చచ్చుట. ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి ఇంద్రజిత్తు యుద్ధము, వధ. చతుర్దశి, మూలబల యుద్ధము. తాను స్వయముగ వచ్చెద నని రావణుఁడు చెప్పుట. ఈ విషయము ముందు చర్చింపఁబడినది.

కం. శూరుండవు, ధీరుండవు, సారతరకృపాణి వీవు • స్యందనగుఁడవున్
ధీరతుఁడవు రథి వై చని, శ్రీరాముని఼ జంపి సీతఁ • జేకొను మధిపా! ౨౧౭౧

అర్థములు. సారతరకృపాణివి = మిక్కిలి బలముగల కత్తిగలవాఁడవు. ఇది కైలాసము పెల్లగించినపుడు శివుఁడిచ్చినది. చూ. ఉత్తర. ౩౮౦ ప. స్యందన గుఁడవున్=బ్రహ్మ యిచ్చిన రథముగలవాఁడవు, ఇట్టినీవు – ధీరతుఁడవు అయి = బుద్ధిమంతుఁడవై, ఇట్లు చెప్పుటచే నీ విప్పుడు చేయఁబూనినది బుద్ధిలేని కార్యమని భావము. నీవు సీతను గ్రహింపఁ దెచ్చితివా? ఆమెను జంపఁ దెచ్చితివా? ఆమెను జంపుట నీ యుద్దేశమేని నానాఁడే యచ్చటనే చంపియుండ వచ్చును. అటుగాక గ్రహింపనెంచితివా? ఇప్పుడు చంపిన నీ కోరిక యెట్లు నెఱవేఱును. నీ కోరిక నెఱవేఱవలసి యుండిన రాముని఼ జంపవలెను. ఇప్పుడు నీవు ఈమెను జంపినఁజచ్చిన నీ కొడుకులు లేచివత్తురా? రామునితో యుద్ధము తప్పునా? ఆయన మఱింత కోపముతో లంకను నిన్ను మమ్మునందఱను నాశము చేయునుగాని మానఁడు. కావున నీకు యుద్ధమెట్లును దప్పదు. అట్లు తప్పనప్పుడు నీవే శూరుఁడవై ధీరుఁడవై సాయుధుఁడవై పోయి యుద్ధము చేయుము జయింపుము. నీ కోరిక నెఱవేఱును. సీత నీకు స్వాధీనపడును మార్గమది గాని యిది గాదు. సీతను జంపిన మనపీడ పోవునంటివి. అది యెట్లుపోవును? నీ వా నాఁడే చంపియుండిన యెడల లంకానాశము గాకుండును. నీ బంధువులు చావక యుందురు. అప్పుడేదియుఁ జేయక యంతయు మించిన తరువాత నిట్టి నీచకార్యము తలపెట్టిన నీ వేమి బుద్ధిమంతుఁడవు? కావున బ్రహ్మ యిచ్చిన రథము మీఁదఁబోయి రాముని఼జంపి సీతను గ్రహించి నీ యిష్టము దీర్చుకొనుము

రామునిమీఁదికి యుద్ధమునకుఁబోయిన జయింపలేనుజుత్తునని నిశ్చయించుకొంటివా? అట్లయినను సీతను జంపిన రాఁగల లాభమేమి? ఇప్పుడు నీవు సీతను జంపితి వనుకో యుద్ధమున నీవు జయించితి వనుకో, అప్పుడు సీత యెందుండి వచ్చును ?

తే. అనిన దుష్టాత్ముఁ డా ధర్మ్య◆మైనపలుకు, లాలకించి గృహంబున◆కరిగి యిష్ట
సచివజనసంయుతుండయి◆సభను దీరి, కేసరి యనంగ నూర్పుచ్చె◆రోసమునను.

అర్థములు. దుష్టాత్ముండు=దుష్టమైన మనస్సుగలవాఁడైనను, ధర్మ్యము=ధర్మయుక్తము, ఇష్టసచివజనసంయుతుండయి = ఇష్టులతోను, మంత్రులతోను స్నేహితులతోను గూడిన వాఁడై.

తాత్పర్యము

అని చెప్పఁగాఁ జెడుమనస్సు గలవాఁడైనను ధర్మములోఁ గూడిన యా మాటలు విని యింటికిఁబోయి ఇష్టులతో మంత్రులతోఁ గూడి సభతీరి రోసముచే సింహమువలె శ్వాసములు పుచ్చుచుండెను.

## —◆ ౯౫-వ సర్గము మూలబల యుద్ధము. ◆—

సీ. పరమదుఃఖితుఁ డయి◆బహుళదైన్యంబున, బలముఖ్యవర్యులఁ◆బాఱఁ జూచి
కడుపుదుఃఖముదన్నుఁ◆గాల్పఁగఁ జేమోడ్పు, ఘటియించియనుఁగార్య◆ఘటకులార !
హస్త్యశ్వయుక్తంబు◆స్యందనభటరాజి,తం బగు సేనతో◆దాడి వెడలి
రాము నొక్కనిఁ జుట్టి◆ప్రావృడబ్దములన, శరవర్షముల ముంచి◆చంపుఁ డీరు
ఆ. రేపు నేను మీకుఁ◆బ్రాపుగఁ జనుదెంచి
జానకీశుఁ ద్రుంచి◆జగ మెఱుంగ
జయముఁ గాంచి◆మిమ్ము సత్కరించెద నన్న
వారు నల్లె యనుచు◆బయలు వెడలి ౨౧౭౩

అర్థములు. బలముఖ్యవర్యులన్ = బలాధిపతులను, ముఖ్యనాయకులు ప్రహస్తాదులు చచ్చిరి. బలనాయకులు మిగిలినవారు, చేమోడ్పు ఘటియించి = నమస్కరించి, దీనికిఁగారణము శోకవేదన, తిరస్కారభయము, కార్యఘటకులార= కార్యమును సాధించువారలార, హస్తి, అశ్వ, యుక్తంబు=ఏనుఁగులతోను గుఱ్ఱములతోనుగూడినది, స్యందనభటరాజితంబు = తేర్లచే భటులచే ప్రకాశించునది, దాడి=ధాటి శబ్దభవము, ప్రావృడబ్దములు = వానకాల మేఘములు రేపు నేను మీకుఁ బ్రాపుగఁ జనుదెంతుననుటచే, ఈదినమంతయు రామునకు వీరితో యుద్ధము చేయుటతో సరిపోవునని రావణుని యభిప్రాయము, గాని మూఁడుమూర్కాలు గడియలలో వీరందఱు చచ్చిరి.

తాత్పర్యము

అయిన వారందఱు చచ్చిరే యని మిగుల దుఃఖము గలవాఁడై మిక్కిలి

దీనుఁడై బలాధ్యక్షులను జూచి పుత్రశోకము దన్నుఁ గాల్పఁగ వారికి నమస్కరించి యిట్లనెను. కార్యసాధకులారా! మీరు చతురంగసేనతో దండు వెడలి పోయి వానరులతోఁ బెనఁగులాడక యొక్క రాముని మాత్రము చుట్టుకొని వర్షాకాలమేఘమువలె శరవర్షములచే ముంచి చంపుఁడు. చంపఁజాలరేని గాయములు పడి యలయునట్లు గొట్టుఁడు. నేను వచ్చునప్పటికతఁ డలసి యుండిన నదియు నాకు సాహాయ్యమే. రేపు నేను మీకు సహాయుఁడనై వచ్చి రాముని జంపి జగత్ప్రసిద్ధముగ జయముగొని మీ కందఱకుఁ దగిన బహుమానము లిచ్చెదను. అనిన వారు నంగీకరించి బయలు వెడలి.

కం. నానానీకంబులతో, సేనాపతులెల్ల వెడలి ♦ సితపట్టిససం
తానంబులఁ బరిఘంబుల, వానరవీరులను వైచి ♦ బవరము సేయన్. ౨౧౭౮

అర్థములు. నానా+అనీకంబులతోన్=పెక్కు సేనలతో, శిత=పదునైన, పట్టిస=అడ్డకత్తుల, సంతానంబులన్ = సమూహమును, పరిఘంబులన్ = గుదియలను, బవరము=యుద్ధము.

తాత్పర్యము

ఆబలాధ్యక్షు లందఱు నానాసేనలతో బయలుదేఱి వాఁడి యగు నడ్డకత్తులను గుదియలను వానరుల మీఁద వేసి యుద్ధము చేయఁగా.

సీ. భాస్కరోదయవేళఁ ♦ బ్రధనకేళికి నయి, దశకంఠుబలములు ♦ దాఁకుటయును
వానరవీరులు ♦ వసుధారుహంబుల, వసుధాధరంబుల ♦ వైచి వైచి
పోరొనరింపఁగ ♦ ఘోరఖడ్గాదుల, గదల రాక్షసకోటి ♦ కసిమసంగి
చంప నిట్లని పచి ♦ యింప రాకుండ సం,గ్రామ మవ్వేళ సు ♦ భీమ మయ్యె

తే. జరణవిహతిసముద్భూత♦ధరణిరజము, క్షతజకూలంకషలచేత ♦ శాంత మయ్యె
రక్తనదులందు నౌకలై♦రథములమరెఁ, గీశరాక్షస సంగ్రామ ♦ ఖేలనమున.

అర్థములు. భాస్కరోదయవేళ = సూర్యోదయ సమయమున, చతుర్దశి నాఁడు, ప్రధనకేళికి = యుద్ధక్రీడకు, వసుధారుహంబులన్ = చెట్లను, వసుధాధరంబులన్ =పర్వతములను, కసిమసంగి = విజృంభించి, చరణవిహతి = కాలిదెబ్బలచే, సముద్భూత=పుట్టిన, ధరణిరజము=నేలదుమ్ము, క్షతజ = నెత్తుటి, కూలంకషల చేతన్ = నదులచే, శాంతమయ్యెన్ = అణఁగెను, రక్తనదులందు=నెత్తుటియేళ్ళయందు, నౌకలై = నావలై, ఖేలనమునన్ = ఆటయందు.

తాత్పర్యము

సూర్యోదయవేళ యుద్ధక్రీడకై రావణుసేనలు దాఁకఁగా వానరవీరులు చెట్లు గుట్టలు వేసివేసి యుద్ధము చేయగా రాక్షసులు విజృంభించి కత్తులచేతను గదలచేతను జంపఁగా యుద్ధమిట్లుజరిగెనని చెప్పశక్యపడనివిధముగ మహాభయంకరమయ్యెను. వారల కాలిదెబ్బలచే లేచినదుమ్ము నెత్తురు వెల్లువలచే శమించెను. వానర రాక్షస యుద్ధమను నుత్సవమున నెత్తుటి యేళ్ళయందు రథములు నావలై యొప్పెను.

కం. కరిరథచయకూలంబులు, తురగఝుషంబులు శరీర♦తుంగోడుపముల్
గురుకేతనభూరుహములు, పరఁగెన్ రుధిరాపగానివహములు దళచై. ౧౬౮

అర్థములు. కరిరథచయ కూలంబులు = ఏనుఁగుల తేరుల సమూహము లనెడి యొడ్డులు, తురగఝుషంబులు=గుఱ్ఱములను చేఁపలు, శరీరతుంగోడుపముల్= కళేబరము లను నెత్తైన పడవలు, గురుకేతనభూరుహములు = పెద్ద ధ్వజము లను చెట్లునగు, రుధిరాపగా=నెత్తురు టేర్లు, నివహములు=సమూహములు, తళచై = విశేషించి.

తా త్ప ర్య ము

ఏనుఁగులు రథ సమూహము లొడ్డులుగను, గుఱ్ఱములు చేఁపలుగను, శరీరములు నెత్తేయిన పడవలు గను, పెద్దచెట్లు ధ్వజములుగను నెత్తుటి యేళ్ళ సమూహములు విశేషించి పాఱెను.

కం. నెత్తురులఁ దోఁగుచుం బెను, హత్తుల ఘోటులను ధ్వజచ♦యంబులఁ బైపై
మొత్తముగ నెగిరి యెగిరి ప్ర,మత్తత దొరఁగించిరిలను♦మర్కట వీరుల్. ౧౬౯

అర్థములు. తోఁగుచున్=స్నానము చేయుచు, మునుఁగుచు, హత్తులన్= ఏనుఁగులను, ఘోటులను=గుఱ్ఱములను, ధ్వజచయంబులన్ = టెక్కెముల సమూహములను, ప్రమత్తతన్=మిగుల మత్తుచేత.

తా త్ప ర్య ము

వానరులు నెత్తుటిలో మునుఁగుచు పైపై కెగిరి యెగిరి యేనుఁగులను, గుఱ్ఱములను, ధ్వజములను, నేలఁబడఁద్రోచిరి.

తే. జానుగుల నాసికలను నో♦సళ్ళ వెంౘ్రు
కలను గోళ్ళను రదముల ♦ బలము మెఱయ
బెఱుకుచును గొఱుకుచుఁ దెగ ♦ నఱకు చిట్టు
లసురవర్యుల వేధించె ♦ నగచరాళి. ౧౭౦

అర్థములు. జానుగులన్ = చెవులను, రదములన్ = పండ్లచేతను, వేధించెను = బాధించెను.

తా త్ప ర్య ము

చెవులను ముక్కులను నొసళ్ళను వెంౘ్రుకలను గోళ్ళచేతను దంతముల చేతను దమ బలము ప్రకాశించునట్లు పెఱుకుచుఁ గొఱుకుచు నఱకుచు నీప్రకారము రాక్షసులను వానర సమూహము బాధించెను,

కం. పండినవృక్షములకు ఖగ, కాండంబులు పఱచునట్లు ♦ కపు లొక్కొకమా
ర్తుం డగు నసురకుఁ గవిసిరి, దండిమగలు నూర్లకొలఁది♦దర్పము మెఱయన్.

అర్థములు. ఖగకాండంబులు = పక్షుల గుంపులు, పఱచునట్లు = పరు వెత్తునట్లు, మార్తుండు = విరోధి.

తాత్పర్యము

పండిన వృక్షమునకై పక్షులు పాఱునట్టు లొక్కొక్క రాక్షసుని మీఁదికి శూరులైన వానరులు నూర్లకొలఁది కవిసిరి.

చ. ప్రతిభటు లోహటింపక ప • రశ్వధశూల కృపాణవల్లరీ
శితపరిఘాశుగంబులను • జీల్చిరి కూల్చిరి నొంచి త్రుంచి వే
కుతిలపడంగ డీలుపడఁ • గొందల మందఁగఁ దల్లడిల్ల లో
వెతగొనఁ బాఱఁదోలిరి కపి • ప్రవరధ్వజినీచయంబులన్. ౨౧౮౦

ప్రతిభటులు = విరోధులు, ఓహటింపక = వెనుదీయక, పరశ్వధ=గండ్రగొడ్డండ్ల చేతను, కృపాణవల్లరీ=తీఁగలవంటి కత్తుల చేతను, కపిప్రవరధ్వజినీ చయంబులన్=వానరవీరుల సేనాసమూహములను, కుతిలపడంగన్=బాధపడ, డీలుపడన్=డిల్లఁబోవఁగ, కొందల మందఁగన్ = క్షోభిల్లఁగా, తల్లడిల్లన్=తత్తఱపడఁగా.

తాత్పర్యము

విరోధులగు రాక్షసులు వెనుదీయక గండ్రగొడ్డండ్ల చేతను, శూలముల చేతను, తీఁగలవలె సోఁగలైన కత్తుల చేతను, పదునుగల గుదియలు బాణముల చేతను, వానర వీరుల సేనాసమూహములను బాధపడునట్లు, డిల్లఁబోవునట్లు, కలఁత పడునట్లు, తత్తఱలాడునట్లు చీల్చిరి, నేలఁ బడఁగొట్టిరి నొప్పించిరి, ఖండించిరి, పాఱఁదోలిరి.

కం. సురవైరిచయము లెగవఁగ, హరులెల్లరు విఱిగి దశర • థాత్మజు రామున్
బరమార్తశరణ్యునిఁ గని, శరణంబును జొరఁగ రామచంద్రుం డలుకన్.

అర్థములు. ఎగవఁగన్ = తఱుమఁగా, హరులు = వానరులు, విఱిగి= చెదరి, పరమార్త శరణ్యునిన్=ఆర్తుల రక్షించువారిలో నుత్తముని.

తాత్పర్యము స్పష్టము.

—• శ్రీరాముఁడు మూలబలంబు నంహరించుట. •—

చ. పరమశరాసనంబుఁ గొని • పార్థివవర్యుఁడు శత్రుకోటిలోఁ
జొరఁబడి బాణవర్షమున • జోరున ముంపఁగ సూర్య మేఘముల్
దరిఁ జనలేని చందమున • దావమహాగ్నిని డాయ రాని య
క్కరణిని నొక్కఁడేని కనఁ • గానఁడు డాయుట చెప్పనేటికిన్. ౨౧౮౨

అర్థములు. పరమశరాసనంబునన్=శ్రేష్ఠమైన వింటిని. దరిన్ = సమీపమందు, దావమహాగ్నిని=పెద్దకాఱు చిచ్చును, డాయరాని = సమీపింపరాని, కనఁగానఁడు=చూచుటకు శక్తిగలవాఁడు గాఁడు.

తాత్పర్యము

ఉత్తమమగు విల్లు తీసికొని రామచంద్రమూర్తి శత్రు సమూహములోఁ బ్రవేశించి జోరుమని బాణవర్షముచే ముంపఁగా సూర్యుని మేఘములు సమీపింప

లేనట్లు కాలు చిచ్చు నొద్దకుఁబోవ సాధ్యపడునట్లు లాయన నొకఁడైనఁ గన్నులఁ జూడఁ గలిగినవాఁడు కాఁడు ఇఁక సమీపింప లేదని చెప్పనేల?

చ. శిఖిశిఖ లొక్కటం గవియు ♦ చెల్వునఁ గ్రక్కుచు నిప్పు సర్వతో
ముఖ మయి రాము బాణముల ♦ ముమ్మర మై పఱవంగ నమ్మహా
ప్రఖరశితేషువుల్ దగిలి ♦ వ్రయ్యఁగ మేనులు సోఁకులున్ మరు
త్సఖపరిదగ్ధ మా మిడుత ♦ దండులఁబోలి రొకింతసేపులోన్. ౨౧౪౩

అర్థములు. శిఖిశిఖలు = అగ్నిజ్వాలలు, ఒక్కటన్ = ఒక్కసారిగ, సర్వతోముఖము = అన్నిప్రక్కల ముఖముగలది, అన్నిదిక్కులఁ బోవునది, ముమ్మరమై = విశేషముగ సందు లేకుండ, ప్రఖర=మిగులఁ గఠినములైన, శితేషువుల్=పదునైన బాణములు, వ్రయ్యగన్=చీలఁగా, సోఁకులున్ = రాక్షసులు, మరుత్సఖ=అగ్నిచే, పరిదగ్ధమా=బాగుగఁ గాలిన.

తాత్పర్యము

ఒక్కసారిగ నగ్నిజ్వాలలు మీఁదఁ బడినట్లు నిప్పులు గ్రక్కుచు రాముని బాణములు దట్టముగ నన్ని దిశలఁ బాఱఁగాఁ గఠినములైన యా బాణములు దవిలి దేహములు చీలఁగా రాక్షసులు గాలిసహాయముగాఁ గల యగ్నిచే మిడుతల దండువలెఁ గాలిరి.

ఉ. ఇట్టి దటంచు నేరు వచి ♦ యింపఁగరాని జవంబునన్ నృపా
లేట్టు చలద్విరోధిబలుఁ ♦ డేస యొసంగ మహారథావలిన్
దిట్టినఁ గూలునట్లు కడుఁ ♦ దీవ్రతఁ ద్రుంప నరణ్యవీథులన్
గొట్టు మహాశుగంబుఁ గనఁ ♦ గూడనిభంగిగ నయ్యె వారికిన్. ౨౧౪౪

అర్థములు. నృపాలేట్టు = రాజశ్రేష్ఠుఁడు, చలత్ + విరోధి బలుఁడు= చలించుచున్న శత్రుసేన గలవాఁడు, ఏస=విజృంభణము, మహాశుగంబు = పెద్ద గాలి, కనఁగూడని భంగిగన్=చూడలేని విధముగ.

తాత్పర్యము

ఇంతటి వేగమని చెప్ప సాధ్యపడని వేగముతో రాజశ్రేష్ఠుఁడు, తన బాణముల తాఁకునఁ జలించుశత్రుసేనలు గలవాఁడు నగు రామచంద్రమూర్తి విజృంభింపఁగా మహారథుల గుంపులును శపింపఁగా వెంటనే నేలఁబడినట్లు మిగుల వేగముతో ఖండింపఁగా నడవులందు తీవ్రన వీచుగాలిని జూడ సాధ్యముగాని విధమున నయ్యెను.

ఇచ్చట నోరుగాలి యని యుపమించుటచే గాలి కానరానట్లు రామచంద్రమూర్తియు వేగాతిశయమునఁ గానరాలేదనియు, వీచుటచే చెట్లు పడుటచే గాలి యున్నదని యూహించునట్లు రాక్షసులు చచ్చుటచేత బాణములు తగులుట చేత రామచంద్రమూర్తి యునికి ననుమానింప వలసి యుండెననియు భావము. హస్త

లాఘవముచే బాణములు విడుచుట కానరాకుండుటయే కాదు. దేహలాఘవముచే గమనవేగముచే రామచంద్రమూర్తియుఁ గానరాఁడయ్యెను. దూరమున నుండి బాణములు ప్రయోగించుచుండిన ముందున్నవారికి మాత్రమే తగులును. ఆప్రకారము పడఁగొట్టఁ బూనిన నింతసేనను జంపుటకు నెంతో కాలము పట్టును. కావున నా మార్గము వదలి తానే సేనలోఁ జొరఁబడి నాలుగు ప్రక్కల దిరిగి ధ్వంసము చేయ నారంభించెను.

కం. ఛిన్నము భిన్నము విభవ,స్కన్నము సన్నఁబు నగుడు ♦ సైన్యము శవసం
ఛన్నం బయ్యె మహీస్థలి, కన్నులు కడు గోరగింపఁ♦గాఁ జూపఱకున్.

అర్థములు. ఛిన్నము=ఖండింపఁబడినది, భిన్నము = చీల్పఁబడినది, విభవస్కన్నము = స్కన్నవిభవము = కాంతి సంపద చెడినది, సన్నము = క్రమక్రమముగా పలుచఁ బాఱినది, శవసంఛన్నము=పీనుఁగులచేఁ గప్పఁబడినది.

తాత్పర్యము

చీలి తునకలై కాంతిచెడి క్షీణించి యా సైన్యము భూమిని పీనుఁగులచేఁ గప్పినదిగ చేయఁగా చూచువారికిఁ గన్నులు గోరగించుచుండెను.

కం. కూలెడితల, తూలెడితల ప్రేలెడితల దగ్ధభగ్న ♦ పీడితతనువుల్
చాల నెటుచూడఁ దోఁచెన్, జాలమువలెఁ గానరాఁడు ♦ జనపతి యొచటన్.

అర్థములు. తూలెడితల = సగము తెగుటచే కదలుచుండు తల, దగ్ధ = కాలినది, భగ్న = విఱిగినది, పీడిత = బాధింపఁబడినది, తనువుల్ = శరీరములు, జాలము = ఇంద్రజాలము చేసినట్లు.

తాత్పర్యము

ఏప్రక్క చూచినను నేలఁబడిన తలలు, కదలుచుండుతలలు, ప్రేలాడుతలలు, కాలినదేహములు, విఱిగిన దేహములు, బాధపడుదేహములు, కానవచ్చుచుండెను. కాని ఇంద్రజాలము చేయువాఁడు గానరానట్టు రామచంద్రమూర్తి కానరాకుండెను.

ఉ. ఆ వ్వని నచ్చి బాణములు ♦ అొమ్మున నాటుట తోఁచు గాని యా
చివ్వను క్షిప్రకారి రఘు ♦ శేఖరుఁ డెందును గానరాఁడుగా
యవ్విధి యింద్రియార్థముల ♦ కై మెయి నిల్చిన యాత్మఁబోలె; నా
నెవ్వఁడిఁ దత్ప్రచారముల ♦ నేర్పును జెప్పఁగ నెట్లు శక్యమా. ౨౧౮౭

అర్థములు. చివ్వను=యుద్ధమందు, క్షిప్రకారి=త్వరగా పనిచేయువాఁడు, ఇంద్రియార్థములకై=ఇంద్రియార్థముల విషయముల ననుభవించుటకై, మెయిన్=దేహమందు, ఆత్మ=జీవాత్మవలె, విషయములను నింద్రియముల మూలమున ననుభవించుటచే జీవాత్మ యున్నాఁడని మన మూహించుచున్నామే కాని జీవాత్మను జూచికాదు. అట్టులే కార్యములచే రాముఁ డున్నాఁడని చేయుచున్నాఁడని

యూహింపవలసి యుండెను. కాని రాముని జూచికాదు, నెవ్వడి = నెఱవడి = పూర్ణ వేగము, తత్ = ఆయన యొక్క, ప్రచారముల నేర్పు = సంచార సామర్థ్యము.

తాత్పర్యము

ఆ యుద్ధమునందు ఉవ్వెనివచ్చి బాణములు తమ తొమ్మిన నాటుట మాత్రము తెలియుచుండెనే కాని యతి వేగముగ సంచరించి పనిచేయు రామచంద్ర మూర్తి కానరాఁడయ్యెను. ఎట్లన దేహమునందుండి యింద్రియముల మూలమున విషయముల ననుభవించుటచే జీవాత్మఁ డున్నాఁడని యూహించుచున్నాము గాని ప్రత్యక్షముగఁ గాదుగదా అట్లులే బాణములు తమ్మొఁదగులుటచే రామచంద్ర మూర్తి యున్నాఁడని యూహింపవలసియుండెను. ఇట్లుండుటచే నా వేగము ఆసంచారవిధము నెట్లు చెప్ప సాధ్యపడును?

మ. నరచూడామణి రామభూవిభుఁడు గాంధర్వంబునన్ మాన్పుచోఁ
బరసేనాతతి మోహితాత్మ మయి దిగ్భ్రాంతిం గొనెన్ వే పర
స్పరమున్ రాముఁడు కాఁ దలంచుచును దత్సాదృశ్యముం దోఁపఁగాఁ
బోరి సన్యోన్యము క్రుద్ధచిత్తులగుచుం బోకార్చి రా రాక్షసుల్. ౨౧౩౪

అర్థములు. నరచూడామణి = మనుజశ్రేష్ఠుఁడు, గాంధర్వంబునన్ = గంధర్వాస్త్రముచే, మోహితాత్మమయి = మోహము చెందిన మనస్సు గలదై, దిగ్భ్రాంతిన్ = దిగ్భ్రమను = దిక్కు తెలియక పోవుటను పరస్పరమున్ = రాక్షసులే యొకని మఱియొకఁడు, రాముఁడు కా = రాముఁడేయని, తత్ + సాదృశ్యమున్ = సమత్వము, పోకార్చిరి = చంపిరి.

తాత్పర్యము

నరోత్తముఁడగు రామచంద్రమూర్తి గంధర్వాస్త్రము ప్రయోగించి శత్రువు లను గాల్పఁగా శత్రుసేనాసమూహము ఏదియుఁ దెలిసికొనఁజాలక దిగ్భ్రమ గొనెను. వారిలో వారొకరి నొకరు రాముఁడని తలంచుచు ఆ సమత్వము కన బడఁగాఁ గోపించి యొకరి నొకరు చంపిరి.

ఈ యుద్ధమందు వాస్తవ రాముఁడు కానరాలేదనియు గాంధర్వాస్త్ర బల ముచే నొక్కొక్క రాక్షసునకు నొక్క రాముఁడు కానవచ్చె ననియుఁ జెప్పఁబడెను గదా. ఆ కారణముచే పరసేనాతతి మోహితాత్మ మయ్యెనని చెప్పఁబడెను గదా! ఇది యింద్రజిత్తు చేసిన మాయాయుద్ధము వంటిదగునా కాదా యని సందేహము.

ఇంద్రజిత్తు అతివేగముగ సంచరించెననుట సత్యమే కాని యిది వాని స్వశక్తిచే నైనదికాదు. స్వశక్తిచేతనే సంచరింపఁగలిగినవాఁడయ్యెనేని లక్ష్మణునితో యుద్ధము చేసినప్పు డాశక్తి కనఁబఱిచియే యుండును. వాని యాశక్తి యభిచార హోమము వలన లభించిన రథరథ్యాదు లందుఁగలదు. కాని వానియందు లేదు. అట్లు వేగముగ సంచరించినను వాఁడు కానరాకుండినది గమనవేగముచేఁగాదు. మాయాశక్తిచేఁ బొగ గల్పించుకొని అది మబ్బువలె నడ్డముండఁగా దాని చాటుననుండి కొట్టెను.

రామచంద్రమూర్తి గమన బలముచేఁ గానరాఁడయ్యెఁగాని యస్త్రబలమునఁగాదు. రామచంద్రమూర్తి గానరాక పోయినదిలేదు కానవచ్చుచుండెను. కాని లక్ష్యమునకు నిలిచినవాఁడు కాఁడు. కొఱవిని మన మతివేగముగ గుండ్రముగఁ ద్రిప్పితిమేని నిప్పు కానరాకపోదు. కానవచ్చుచునే యుండునుగాని ఆ నిప్పెందు స్థలము మనము నిర్దేశింపలేము. ఏల? అతివేగ గమనముచే మనము చెప్పవాల్చునపు డెందుండునో తెలియునప్పటి కది యందుండదు. అది యొక ప్రదేశమునుండి మఱియొక ప్రదేశమున కెంత వేగముగఁ బోవునో యంత వేగముగ మన దృష్టులు దానియందుఁ బడఁజాలవు. అతివేగముగఁ దిరుగు చక్రమునం దొక చుక్కయుంచి యా చుక్కను మనము బాణముతోనో తుపాకి గుండుతోనో కొట్ట యత్నించితిమేని గుండు తుపాకిని విడిచి చక్రము నొద్దకుఁ బోవులోపల ఆ చుక్క స్థలముమాఱి యుండును గావున ఆ చుక్కకు దెబ్బతగులక మఱియెందో తగులును గాని తెల్లగా నా చుక్క సర్వత్ర కానవచ్చుచునే యుండును. ఆ చుక్క స్థలము మనము తెలిసికొనలేకపోవుట మన దృష్టిదౌర్బల్యము చేతనేకాని చుక్క చేసిన యింద్రజాల మహేంద్రజాలముల చేగాదు. ఆ చుక్కకుఁ బ్రాణముండి మరలఁ మనలఁ గొట్టెనేని మనకా దెబ్బ తగులునుగాని మన దెబ్బ దానికిఁదగులదు. కాఁబట్టి యీ చక్రవేగ మెట్టిదో రామచంద్రమూర్తి గమనవేగ మట్టిదే. అందు నింద్రజాలాదులు లేవు. ఒక రాక్షసునిముందు రామచంద్రమూర్తి యాకారము కానరాఁగా నామూర్తి నుద్దేశించి కొట్టఁగా దెబ్బపడులోపల రామచంద్రమూర్తి మఱియొక చోట నుండిన కారణముచే నా దెబ్బ యెదురుగ నుండిన రాక్షసునకుఁ దగులుచుండెను. ఆ కారణముచే రాక్షసు లొకరి నొకరు కొట్టుకొనిరిగాని రాక్షసులు రామమూర్తులుగాఁ గానరాలేదు.

గాంధర్వాస్త్రముచేఁ బెక్కురూపులు కానవచ్చెననుట సరిగాదు. అట్లు వాల్మీకి చెప్పలేదు. గాంధర్వాస్త్రముచే రాక్షసులను మాడ్చెనని చెప్పెను అనఁగా నట్లు సంచరించునపుడు రిత్తచేతుల సంచరింపక గంధర్వాస్త్రము సాధనముగఁ దీసికొని దానిచే రాక్షసులను సంహరించెను. ఒక యూకాశబాణము చివ్వవిడిచిన నది పైకి బోయి యచ్చట బగులఁగా నందుండి నానాబాణము లెట్లు పుట్టునో యట్లే కొన్ని మహాస్త్రములందుండి నానాయుధములు నానాస్త్రములుఁ గూడఁ బుట్టును. ఇంద్రజిత్తు వేసిన అసురాస్త్రమునందుఁ గొన్ని శస్త్రములు పుట్టెఁగదా అట్టులేయిది యును. చూ. ౨౪౯౧-౨౪౯౮ పద్యములు. అది చేయఁగల కార్యమంతయే కాని తన్నుఁ బ్రయోగించిన వానికిఁ బెక్కుమూర్తులు గలిగించు శక్తి దానికిలేదు. భారతాదులందీ యస్త్రప్రయోగము చెప్పఁబడినచోట నిట్టిశక్తి చెప్పఁబడలేదు. ఒకచోటనుండి రామచంద్రమూర్తి యీ యస్త్రము ప్రయోగించియుండిన నది స్పష్టమై యుండును. కాలవిలంబనము సహింపలేక సంచారము చేయుచు దానిని

నలుముఖములఁ బ్రయోగించెను. ఈయస్త్రమునే రావణుఁడు శ్రీరామచంద్రుపైఁ బ్రయోగించెను. అప్పుడిట్టి మహిమము రావణునందుఁగాని రామునందుఁగాని యున్నట్లు చెప్పబడలేదు. చూ. ౨౬౦౦-౨౬౪౯ ప. ఇట్టి శక్తి తన యందును జగత్సర్వ సంహార సమయమున రుద్రునందుఁ గల దని రామమూర్తి చెప్పెను. జనస్థాన యుద్ధమందు (అరణ్యకాండమున) ౮౮౮-౩౯౯ పద్యము చూచునది. కావున జనస్థాన వధమందును మూలబలవధమందును రామ గమనవేగ మభివర్ణితముగాని యింద్రజాలము గాదు.

సీ. ఈరేనుఁగుల ద్రుంచు • నితఁడే శ్రీరాముఁ, డీహయంబులఁ గూల్చు • నితఁడె రాముఁ
డీరథికులఁ దీర్చు • నితఁడే రఘురాముఁ, డీపదాతుల మాడ్చు • నితఁడె రాముఁ
డీశరంబులఁ జిమ్ము • నితఁడె సీతారాముఁ, డీ పటఁ తెంచెడి • యితఁడె రాముఁ
డీవన్నెఁ జూచెడి • యితఁడె కోసలరాముఁ, డిదొ కత్తి రొత్తిన • యితఁడె రాముఁ
తే. డంచు జగమెల్ల రామమ • యంబుగాఁగ
నీవ రాముఁడు రాముఁడ • వీవ యనుచు
నొండొరులఁ దాఁకి రాక్షసుల్ • దండిశస్త్ర
సంహతులఁ గూలి మడసిరి • సంఘములుగ, ౨౧౮౯

మీఁద సంగ్రహముగఁ జెప్పినదే యిందు వివరింపఁ బడెను.

తాత్పర్యము స్పష్టము

కం. ఒక్కనికిం బెక్కురుగను, బెక్కుర కొక్కండు గాఁగ • భీమశరాసం
బక్కజము కొఱవిఁ ద్రిప్పిన, యక్కరణిం ద్రిప్పఁ గోటి • యగపడెడి బలే.

అర్థములు. భీమ శరాసంబు = భయంకరమైన విల్లు, కోటి=వింటికొన, అక్కజము = ఆశ్చర్యము, కొఱవిఁద్రిప్పిన యక్కరణిన్, అను నీ యుపమాన, మాయన గమనవేగమును సూచించుచున్నది. కొఱవి త్రిప్పినపుడు నిప్పు చక్రము గాన వచ్చుట త్రిప్పెడివాని వేగశక్తి చేతనే కాని యింద్రజాలముచేఁ గానట్టులు రామచంద్రమూర్తియు వింటిని ద్రిప్పి వేగముచే నొక్కనికిఁ బెక్కురుగను పెక్కుర కొక్కఁడుగను గానవచ్చు చుండెను.

తాత్పర్యము స్పష్టము.

సీ. అంగనాభియును స • త్త్వార్చి శరారంబు, నేమిచాపంబు జ్యా • నిస్వనార
వంబు తేజోబుద్ధి • వరగుణాజ్వాలంబు, దివ్యాస్త్రధారంబు • దీపితంబు
రాక్షసాంతకరంబు • రామచక్రంబును, గాలచక్రమువోలెఁ • గనిరి ప్రజలు
పదివే లనీకముల్ • పవనవేగంబులు, పెనురథంబులు పదు • నెనిమిదియును
తే. వేలదంతు లనీకముల్ • వీతిచయము, గ్రాల సాదులు పదునాల్గు • వే లనీక
ములు పదాతులు రాక్షసుల్ • పూర్ణ శతస, హస్రయుగ్మంబనీకంబు • లపుడెకూలె,

అర్థములు. ఈ పద్యమున రామచంద్రమూర్తి సుదర్శనచక్రమునకుఁ

బోలుపఁబడుచున్నాఁడు. అంగమను దేహామే - నాభి=చక్రమునకు నడుమనుండు మిట్టప్రదేశము. రామదేహామే నాభి. సత్త్వార్చి, సత్త్వము=బలమే, అర్చి=జ్వాల 'వహ్నేర్ద్వయో ర్జ్వాలకీలా వర్చిర్హేతి శ్శిఖా స్త్రియామ్'అమరము సత్త్వము పర సంతాపకారణమగుటచే జ్వాలగాఁ జెప్పఁబడెను. శరారంబు, శర=బాణములనెడి, అరంబు = ఆకులు గలది, సుదర్శనము సహస్రారము = వేయి యాకులు గలది, "స్ఫురత్సహస్రార శిఖాతితీవ్ర" మ్మని సుదర్శనస్తోత్రము. బాణములు ఆకులుగా చెప్పుటచే ఆకుల నడుమనుండి నానాముఖములుగా అంచునకుఁ బోవునట్లు బాణములు వింటినుండి వేలకొలఁదులు నానా ముఖముగాఁ బోయె నని గ్రాహ్యము. నేమి = చక్రము, కడకమ్మి చాపంబు = గుండ్రముగాఁ జేయఁబడిన విల్లు, ఈ విల్లు నేమిగాఁగలది నేమిచాపము. ఈ చక్రమునకు రామశరీరము నాభియని, నేమి చక్రమని- చెప్పుటచే వింటిని మండలముగా నీడ్చినప్పుడు రామునకంటె ధనుస్సు మహోన్నతమైన దని సూచితము. నడుమనున్న చంద్రునికంటెఁ బరివేషము గొప్పదిగదా. జ్యానిస్వనారవంబు=జ్యానిస్వన=అల్లెత్రాటి మ్రోతయే,ఆరవంబు= సుదర్శనచక్రము యొక్క జ్వాలల మ్రోఁత,సుదర్శనము జ్వాలామాల చేత విడువని ధ్వనిగలది కావున నిట ఘోషము చెప్పఁబడెను. తేజోబుద్ధి=తేజస్సు, పరాక్రమమే బుద్ధి, ఇచ్చట బుద్ధియనఁగా అక్షము = బండికన్ను. బుద్ధియనఁగా బండికన్నని యెట్లు చెప్పవచ్చుననిన "ప్లవగసైన్య ములూకజితా జితమ్"=వానరసేన ఉలూక (గూబ) జిత్తుచే జయింపఁబడెను, అనుచోట ఇంద్రజిత్తు ఉలూకజిత్తుఁడని చెప్పఁ బడెను. కౌశిక శబ్దమునకు ఉలూకము (గూబ) ఇంద్రుఁడని రెండర్థములు గలవు. కావున ఉలూక శబ్దము లక్షణచే కౌశికశబ్దమును లక్షించి యింద్రుఁడని చెప్పఁ బడి ఉలూకజిత్తుఁడనఁగా నింద్రజిత్తని చెప్పఁబడినట్లు ఇచ్చట బుద్ధిశబ్దము బుద్ధి జనకమైన అక్షలక్షణచే అక్షప్రదేశమని చెప్పఁబడెను. వరగుణజ్వాలంబు=గుణము శరీరకాంతి, అదియే జ్వాల=ప్రభ, దివ్యాస్త్రధారంబు=దివ్యాస్త్రములే ధారగాఁ గలది, ధార = వాదర, ఖండించునదియే కదా. కాలచక్రము = జ్యోతిశ్చక్రము, "యత్ర కాలచక్రం ప్రతిష్ఠితమ్" అని విష్ణుపురాణము. రామచంద్రమూర్తి చేఁ జచ్చినసేన సంఖ్య చెప్పఁబడుచున్నది, రథములు పదివేల యనీకములు. అనఁగా నేడుకోట్లు,ఇరువదితొమ్మిదిలక్షలు పదునెనిమిది వేలు;ఏనుఁగులు పదునెనిమిది వేల యనీకములు అనఁగా పదుమూడుకోట్లు, పండ్రెండులక్షలు, ఇరువది వేలు. హీతి చయము=గుఱ్ఱములసమూహము,సాదులు=రౌతులు పదునాలుగు వేల యనీకములు. పదికోట్లు ఇరువది లక్షలు అఱువది వేలు, రాక్షసభటులు పూర్ణముగ నూట నలుబదియైదుకోట్లు ఎనుబదిలక్షలు, కూలెన్ = చచ్చెను.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి ధనుస్సనెడి సుదర్శనచక్రమునకు రాము దేహామే

నడిమి మిట్ట ప్రదేశము. బలమే జ్వాల. బాణములే ఆకులు, నేమియే చాపము, అల్లెత్రాటి మ్రోఁతయే జ్వాలల ధ్వని, తేజస్సే కన్ను, శరీరకాంతియే ప్రభ, దివ్యాస్త్రములే ధార, ఈవిధముగఁ బ్రకాశించుచు రాక్షసుల నాశము చేయు రామ చక్రమును జ్యోతిశ్చక్రమువలెఁ బ్రజలు చూచిరి. ఈ యుద్ధమందుఁ—

రథములు — ౭_౨౯౧౮౦౦౦ = ౨౯౧౬౭౨౦౦౦
గజములు — ౧౩౧౨_౨౦౦౦౦ = ౨౬_౨౪౪౦౦౦౦
తురగములు — ౧౦ ౨౦౬౦౦౦౦ = ౧౦ ౨౦౬౦౦౦౦
పదాతులు — ౧౪౫౮౦౦౦౦౦౦ = ౧౪౫౮౦౦౦౦౦౦

రథములు గజములు అని చెప్పుటచే రథమునకు ఒక రథికుఁడు ఒక సారథి, ఇరువురు చక్రరక్షకులైన నుందురు. ఇవిగాక గుఱ్ఱము లుండును. గజము లన్నప్పుడు మావటివాఁ డొకఁడు. యోధ యొకఁడిద్దఱైన నుందురు. పవనవేగములని చెప్పుటచే అల్పవేగముగలవి మఱియెన్నో తెలియదు, ఇంతసేన హతమయ్యెను. ఈ సందర్భమున నీ శ్లోకము ననుసంధింపఁదగు, 'నాగానా మయుతం తురంగనియుతం, సార్థం రథానాం శతం, పాదాతం శతకోటికర్తనవిధా వేకః కబంధో రణే, ఏవం కోటికబంధవర్తన విధౌ కిఞ్చిద్ధ్వనిః కింకిణీ, ర్యామార్ధం పరమాత్మనో రఘుపతే కోదండ ఘంటారవమ్' ఏనుఁగులు అయుతము (పదివేలు), గుఱ్ఱములు నియుతము (లక్ష), రథములు నూటయేఁబది లక్షలు, పదాతులు నూఱుకోట్లు ఇది యొక కబంధము, ఇట్టి కబంధములు కోటి చచ్చిన రామచంద్రమూర్తి వింటి గజ్జియలు క్షణమాత్రము మ్రోగును. అటువంటి గజ్జెలు మూలబలము చచ్చినపుడు సగము జాము, ఒక్కటిన్నర గంట వికువక మ్రోఁగెను.

తే. మూఁడుముక్కాలుగడియలో ♦ వేడిమిగల, వాఁడిముఁలుకుల రాముండు ♦ పాదచారి
నిస్సహాయుఁడునై యిట్లు ♦ నేలపాలు, సలిపె స్వచ్ఛందరూపుల ♦ శాత్రవులను.

తాత్పర్యము

ఇంతసేనను రామచంద్రమూర్తి కాలినడకతో సహాయుఁడు లేక యొంటరిగా మూఁడుముక్కాలు గడియలలో (ఒకటిన్నర గంటలో) కామరూపులైన రాక్షసుల నేలపాలు చేసెను.

కం. హతరథులును హతతురగులు, హతకేతను లగుచుఁ గొంద ♦ ఱరిగిరి పురికై
హతశేషులు హతగజహరి, తతిభటసముదాయు లగుచు ♦ దైన్యము గొనుచున్.

అర్థములు. హతరథులు = రథికులు చచ్చినవారు, హతతురగుల = గుఱ్ఱములు చచ్చినవారు, హతకేతనులు = ధ్వజములు విఱిగినవారు, హతశేషులు = చావఁగా మిగిలినవారు, హత = చంపఁబడిన, గజ = ఏనుఁగుల హరి=గుఱ్ఱముల, తతి = సమూహములు, భటసముదాయులు = భటుల గుంపులు గలవారై, దైన్యముగొనుచు=దుఃఖించుచు.

తా త్ప ర్య ము

కొందఱు రథికులు లేక సారథులు తేర్లు మిగిలినవారు కొందఱు, గుఱ్ఱములు చావఁగా సారథులు మిగిలినవారు కొందఱు, ధ్వజములు విఱుగఁగా నూరక మిగిలినవారునై చావఁగా మిగిలినవారు ఏనుఁగులు గుఱ్ఱములు భటులు చచ్చినవారై దుఃఖించుచు లంకకుఁ బోయిరి.

కం. క్రుద్ధుం డగుఫాలాక్షు స, మిద్ధాక్రీడం బనంగ ♦ నెసఁగెన్ ధరయున్
శుద్ధ పరాక్రము రాముని, సిద్ధులు మే లటంచుఁ ♦ జేసిరి వినుతుల్. ౨౯౭౮

అర్థములు. క్రుద్ధుండు = కోపించినవాఁడు, ఫాలాక్షు = రుద్రునియొక్క, సమిద్ధ=ప్రసిద్ధికెక్కిన, ఆక్రీడనము=క్రీడాస్థానము, స్మశానము.

తా త్ప ర్య ము

కోపించిన రుద్రునియొక్క క్రీడాస్థాన మగు స్మశానమో యన భూమి యొప్పుచుండెను. శుద్ధమైన పరాక్రమముగల రామచంద్రుని సిద్ధులు ఋషులు మేలు మేలని శ్లాఘించిరి.

ఉ. అంతయుఁ దీఱ నంతఁ బ్లవ ♦ గాధిపు రాక్షసనాథునిన్ హనూ
మంతుని బ్రహ్మజన్ ద్వివిద ♦ మైందులఁ దక్కిన కీశవీరులన్
జెంతకుఁ జీరి మీఱకనిన ♦ భూరితరాస్త్రజవంబు శక్తి క
ల్పాంతకుఁ డౌ త్రిలోచనుని♦యందును నా యెడఁ గాన నయ్యెడిన్. ౨౯౭౯

అర్థములు. అంతయుఁదీఱన్ = శత్రుసేన యంతయు హతమైపోఁగా, జెంతకున్ = సమీపమునకు, చీరి=పిలిచి, మీఱకనిన=మీరుచూచిన, భూరితర= మిగుల గొప్పదగు,అస్త్రజవంబు=అస్త్రము వేగముగ ప్రయోగించు శక్తి, కల్పాంతకుఁడై=ప్రలయకాలమందు లోకము నాశముచేయు, త్రిలోచనునియందును = రుద్రుని యందును, నాయెడన్=నాయందును, కానవయ్యెడిన్=చూడఁబడును.

తా త్ప ర్య ము

రాక్షససైన్యమంతయు నాశము కాఁగా సుగ్రీవుని విభీషణుని హనుమంతుని జాంబవంతుని మైందద్వివిదులను తక్కిన వానర నాయకులను బిలిచి తా నేదైన మాయ చేసితినని వారు తలంతురేమో యని యాశ్చర్యపడుచున్న వారికి నీ యస్త్రమును నింత వేగముగఁ బ్రయోగించు శక్తి యెప్పుడు దలఁచిన నప్పుడు నాయందును లోకముల నన్నిటిని ధ్వంసము చేయు ఫాలనేత్రుని యందును ప్రలయకాలమందు కాన నగును. మఱి యెవ రీ యస్త్రము గలవారైనను నింత వేగముగఁ దిరుగ లేరు.

కం. అన విని కూలిన రాక్షస, జనముం గని యబ్రపడుచు ♦ సమ్మదమున నిం
తోనరించి గాసిఁగాననిని, మనుజేంద్రుఁ గృతాస్త్రుఁ ♦ దేవమండలి పొగడున్.

౨౯౮౦

అర్థములు. పొగడున్=పొగడుచున్నారనుటచే నిప్పటికిని దలఁచుకొని పొగడుదు రని భావము.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా విని వచ్చిన రాక్షస జనముఁ జూచి యాశ్చర్యపడి సంతోషించి, యింత చేసియు గాసి యెట్టిదో యెఱుఁగని రామచంద్రుని, అస్త్రవేత్తను దేవతలు పొగడుచున్నారు.

## —• ౯౪–వ సర్గము. రాక్షసస్త్రీ విలాపము •—

ఉ. రావణ సంప్రయుక్త మసు•రధ్వజినీనిచయుంబు రాము బా
   ణావళి మూలముట్టుగ స•నాగము సాశ్వము సధ్వజంబుగాఁ
   జేవ యడంగిపోక హత•శేషులు చెప్పిన రాక్షసాంగనల్
   ప్రోవులు గట్టి హా యనుచుఁ • బోకిఁరి యేడ్చుచు వాడవాడలన్. ౨౧౯౭

అర్థములు. రావణసంప్రయుక్తము = రావణుచేఁ బంపఁబడినది. అసుర ధ్వజినీ నిచయుంబు = రాక్షస సేనాసమూహము, సనాగము=ఏనుఁగులతోఁ గూడినది, సాశ్వము = గుఱ్ఱములతోఁ గూడినది, సధ్వజంబుగాన్ = ధ్వజములతో గూడినదిగ.

తా త్ప ర్య ము

రావణుఁడు పంపిన సేనయంతయు రామబాణములచే సమూలముగ నేనుఁగులు, గుఱ్ఱాలు, ధ్వజములతోడ నాశముచెడి చచ్చెనని, చావఁగా మిగిలినవారు చెప్పఁగా విని రాక్షసస్త్రీలు గుంపులు గట్టి హా యని వీథివీథి నేడువ సాగిరి.

కం. హతపతులున్ హతసుతలున్, హతబాంధవ లైన రాక్ష•సాంగన లెల్లన్
   క్షితిఁ బడి పొరలుచు నేడ్చుచు, వెతఁ దలతలఁ గొట్టుకొనుచుఁ•బెద్దరవములన్.

అర్థములు. హతపతులున్=భర్తలు చచ్చినవారు, హతసుతులున్=కొడుకులు చచ్చినవారు, హత బాంధవలు=చుట్టములు చచ్చినవారు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. ఏమిటి కేగనో • యీ ముసలిపక్కి, మిట్టపండ్లది ప్రేలు•పొట్టతోడఁ
   జేటంత గోళ్ళతోఁ • జంపిరి తలతోడ, నేనుంగుఁ జెవులతో • గూనితోడ
   మిడిమిడిగ్రుడ్లతో•మిడిమేలముగఁ బోయి,యడవిలో నెచటనో•యడఁగియున్న
   కందర్పసుందరుఁ • గసుకుమారుని, శృంగారసదనుఁ బూ•ర్ణేందువదను
ఆ. భూరిశక్తి సకల•భూతహితాసక్తు, లోకనింద్య సర్వ•లోకవంద్యు
   సర్వసుగుణహీన • సర్వగుణాఢ్యుని, జెనకి గాదె యింత•చేటు దెచ్చె. ౨౧౯౯

అర్థములు. సకలభూతహితాసక్తు = అన్ని ప్రాణులకు మేలుచేయుటయందాసక్తిగలవాఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. తా నేడ నిండారుఁ ♦ దళుల మోముకురూప, యతఁ డేడ రాకాసు ♦ ధాంశుముఖుఁడు
తా నేడ నంసిన ♦ తలవెంట్రుకలసోకు, యతఁ డేడ నిందింది ♦ రాలకుండు
తా నేడ నవగుణ ♦ తతులకుఁ బుట్టిల్లు, యతఁ డేడ సుగుణర ♦ త్నాంబురాశి
తా నేడ నుత్తాల ♦ తాలభీకరహస్త, యతఁ డేడ నాగక ♦ రాభబాహు
తే. తనకుఁ దనరూపమునకును ♦ దగినవాఁడు
రాముఁ డా తోఁచె ? నయ్యయో ♦ ప్రజలు విన్న
నవ్వరా ? తిట్టరా భూజ ♦ నంబు ? లిట్టి
యాగడంబులు ♦ వింటిమే ♦ యనని నెందు. ౨ ౨౦౦

అర్థములు. తళుల మోము = ముసుతిలుగల ముఖము, ఈ యర్థమున నిది బహువచనమందే ప్రయోగము. రాకాసుధాంశుముఖుఁడు = పదాఱు కళలతోడి చంద్రునితో సరియగు ముఖము గలవాఁడు ఇందిందిరాలకుండు=తుమ్మెదలవంటి ముంగురులు గలవాఁడు, అవగుణతతులకు=దుష్టచేష్టలకు, సుగుణరత్నాంబురాశి= సద్గుణములనెడి రత్నములకు సముద్రుఁడు, ఉత్తాల = ఎత్తైన, తాల=త్రాటిచెట్టు వంటి, భీకర = భయంకరములైన, హస్త = చేతులుగలది, నాగకరాభబాహు= ఏనుఁగు తొండములవంటి చేతులు గలవాఁడు, ఆగడంబులు=అకార్యములు, దీని వలన లంక పాడగుటకు మూలకారణము శూర్పణఖయని యందఱకుఁ దెలిసినట్టు తేర్పడుచున్నది. ఈ వార్త సీతాదేవివలనఁ దెలిసి యుండవలెను. ఆమె త్రిజటా సరమ లోనగు వారికి చెప్పియుండును. వారు లంకలో నందఱకుఁ గ్రమక్రమముగఁ జెప్పఁగా వ్యాపించి యుండును. అంతుతేనము దొంగతనము దాఁగదు. మనుష్యులలో నా కాలమున దశరథు కంటెను, రాక్షసులలో రావణు కంటెను గొప్పవారు లేరు. ఇద్దఱు నాశమగుటకు స్త్రీలే మూలకారణము. కాముకుఁడై ముద్దుల పెండ్లామని నమ్మి దశరథుఁడు చచ్చెను. అంకుముండ చెల్లెలిమాట విని రావణుఁడు సమూలము నాశమయ్యెను. 'స్త్రీబుద్ధిః ప్రళయంకరీ' యనుట సత్యమయ్యెను. రాముఁడు గాక మఱియొకఁడై యుండినఁ గైకకోరిక సఫలమై సూర్యవంశము ధ్వంసమై యుండును. ఇట్టి యాఁడువారు, అట్టి మగవారు నేఁటికిని గలరు. ఆఁడువారి మూలమున నాశమైన గొప్ప కుటుంబము లెన్నియో గలవు. కనుకనే గొప్ప విషయము లం దాఁడువారితో నాలోచింపరాదు. వారు చెప్పినంత మాత్రమున స్వయముగ నాలోచింపక గొప్ప కార్యములు చేయరాదు. వా రెప్పటికి స్వార్థపరలే.

తాత్పర్యము స్పష్టము.

కం. వనమున ఖరదూషణులకుఁ, బెనుమిత్తిగ నయ్యెఁ దాన ♦ వేరముఁ బెంచెన్
మనుజాసుర నాథులకును, మనదురదృష్టం బదిట్లు ♦ మల్లడి పెట్టన్. ౨ ౨౦౧

అర్థములు. పెనుమిత్తిగన్ = పెద్ద మృత్యుదేవత, వేరము = విరోధము, మల్లడిపెట్టన్=బాధింపఁగా, పరితాప పెట్టఁగా.

తాను జేసిన దుష్టచేష్ట దాఁచిపెట్టి యడవియందు ఖరదూషణులకు మృత్యు దేవత యయ్యెను. ఆ కారణముచే రామ రావణులకు విరోధము పెంచెను. ఇంతకు నిర్భాగ్యదశ మనలను బాధింపఁగా నింతయుఁ దటస్థించెను. వారి కట్టి బుద్ధులు పుట్టుటకు మన దురదృష్టమే కారణము.

చ. నిజగళకాలపాశ మన•సీసుతఁ దాఁ గొనివచ్చెఁ గాని భూ
మిజ నతఁ డేమి పొందుటది • మిథ్య. వృథాబలవద్విరోధము
ర్విజపతితోఁ ఘటిల్లెఁ బృథి•వీజను గోర, విరాధుఁ డమ్మహా
భుజబలిమిన్ గతించె నదె•పో తగినంత నిదర్శనం బిటన్. ౨౨౦౨

అర్థములు. నిజగళకాలపాశము = తనమెడకు యముని పాశము వంటిది. మిథ్య = అసత్యము, వృథా=వ్యర్థముగ, బలవద్విరోధము=బలవంతులతోఁ బగ, ఉర్విజపతితో = రామచంద్రమూర్తితో.

తాత్పర్యము

తన పాలిటి యమపాశము దెచ్చుకొన్నట్లు సీతాదేవిని దెచ్చెఁగాని రావణుఁడు వానికోర్కి తీర్చుకొనుట యసత్యము. వాఁడు చచ్చునే కాని వాని కోరిక నెఱవేఱదు. ఇకఁ గలిగిన ఫల మేమనఁగా సీతను గోరుటచే రామునితో బలవద్విరోధము ప్రాప్తించెను. బలవద్విరోధ మని ముందుగా నెట్లు తెలియుననిన రావణుతో సమానమైన బలశాలి విరాధుఁడు రామునిచేఁ జచ్చెను. అదియే దీనికిఁ జాలినంత నిదర్శనము.

చ. పదియును నాల్గువేలు బల•వంతులు రాక్షసు లొక్క పెట్ట పె
న్నుదుటున రామునిం దొడరి • యొక్కఁడు చిక్కక కూలి రా మదా
స్పదులు ఖరుండు దూషణుఁడు • సత్త్వధనుం డగు నా త్రిశీర్షుఁడున్
బొదివిరి చచ్చి రల్ల యది•పో తగినంత నిదర్శనం బిటన్. ౨౨౦౩

అర్థములు. బలవంతునితో విరోధ మనుటకు మఱియొక నిదర్శనము చెప్పుచున్నారు. పెన్నుదుటున=మిగుల బలగర్వముతో, తొడరి = ఎదిరించి.

తాత్పర్యము

పదునాలుగువేల రాక్షసు లొకసారిగ, బలగర్వమున రాము నెదిరించి యొక్కఁడైన మిగులక యుండఁ జచ్చిరి. మదమునకు స్థానభూతు లగు ఖరుఁడు, దూషణుఁడు బలశాలి త్రిశీర్షుఁడు నెదిరించిరి, చచ్చిరి.

ఇదియే బలవద్విరోధ మనుటకుఁ జాలినంత నిదర్శనము.

కం. యోజనబాహుఁడు శోణిత, భోజనుఁడు కబంధుఁ డతుల•భూరిబలుం డం
భోజాక్షునిచేఁ జచ్చెను, యోజింప నిదర్శనం బిఁకొండును వలెనే. ౨౨౦౪

మఱియొక నిదర్శనము చెప్పుచున్నారు.

అర్థములు. యోజనబాహుఁడు=యోజనము పొడవుగల చేతులుగలవాఁడు, శోణిత భోజనుఁడు = నెత్తురు ఆహారముగఁ గలవాఁడు, అతుల భూరిబలుండు = అసమానమైన గొప్ప బలముగలవాఁడు.

తా త్ప ర్య ము

ఆమడ పొడవు చేతులు గలిగి మాంసము నెత్తురు నాహారముగాఁ గలిగిన మహాబలశాలి కబంధుఁడు రామచంద్రునిచేఁ జచ్చెను. రాముఁడు బలవంతుఁ డను టకు నింతకంటె నిదర్శనము కావలెనా ?

కం. మేరునిభసారు బలిఁ బా, కారితనూజాతు వాలి ♦ నాశుగ మొకటన్
ధారిణిం గూల్చిన రాముని, వీరతకు నిదర్శనంబు ♦ వేఱొం డేలా ? ౨.౨౦౫

అర్థములు. మేరునిభసారున్ = మేరుపర్వతముతో సమానమైన బలము గలవానిని, పాకారితనూజాతున్=ఇంద్రుని కుమారుని, వాలిని,ఆశుగ మొకటన్= ఒకబాణముతో.

తా త్ప ర్య ము

మేరు పర్వతము నంతబలము గలవానిని, ఇంద్రుని కుమారుని వాలిని నొక్క బాణముతోఁ జంపెను. రాముఁడు రావణునికంటె బలవంతుఁ డనుటకు నీ యొక నిదర్శనము చాలదా?

కం. దీనుఁ డయి యాస చెడి తన,ప్రాణమునకు ఋశ్యమూక♦మందు నవయు నా
భానుజు రాజొనరించిన, జానకిపతి బలిమి కొండు♦సాక్ష్యం బేలా? ౨.౨౦౬

తా త్ప ర్య ము

దుఃఖపడుచు బ్రదుకు మీఁది యాశ చెడి ఋశ్యమూకమందుఁ గృశించుచున్న సుగ్రీవుని రాజుగఁ జేసెను. అట్టి రామచంద్రుబలమునకు వేఱొక సాక్ష్యము కావలయునా ?

ఇన్ని కారణములచేత రామచంద్రమూర్తి బలవంతుఁ డని తెలియదా ? తెలియదని చెప్పరాదు, ఏలన.

చ. తలఁగక సర్వరాక్షసహి♦తప్రదదక్షము నర్థధర్మసం
కలితము నైన నీతులు దె♦గంబడి నీవుల నిల్లు కట్టుకొం
చలఘుగుణాఢ్యుఁ డా సుమతి ♦ యాడె విభీషణుఁ డీ దశాస్యుతో
బలితపుమోహపాశముల ♦ బద్ధుఁడు గాన రుచింప వా నుడుల్. ౨.౨౦౭

అర్థములు. సర్వరాక్షస హితప్రద దక్షము = సర్వరాక్షసులకు మేలు కలిగించుట యందు సామర్థ్యము గలది, అర్థధర్మ సంకలితము = అర్థముతోను ధర్మముతోను కూడినది, తెగంబడి=రావణునకుఁ దక్కిన వారివలె భయపడక యేమైనఁ జేయునిమ్మని సాహసించి, అలఘుగుణాఢ్యుఁడు = గొప్ప గుణములచే సంపన్నుఁడు, సుమతి=బుద్ధిమంతుఁడు.

తాత్పర్యము

తనమాట యొకటి రెండు సార్లు చెప్పిన వినకున్నను, వదలిపెట్టక సమస్త రాక్షసులకు మేలైనవియు ధర్మార్థములతోఁ గూడినవి యగు నీతులు ప్రాణము నకుఁ దెగించి చెవిలోఁ గాఁపురము చేసి యా గొప్పసుగుణసంపత్తి మంచిబుద్ధిగల విభీషణుఁడు ఇవి యన్నియు రావణునితోఁ జెప్పెను గదా! కావున వానికిఁ దెలియదని చెప్పరాదు. అట్లైన నేల యీపని జేసెనందురా బలమైన కామపాశ ములఁ గట్టుపడినవాఁడు కావున 'కామాంధోపి న పశ్యతి' కాముకులగు వారికెందుఁ గన్నులుగలవే' యన్నట్లు వానికా మాటలు రుచించినవి కావు. రావణుఁడు కేవల కామమోహితుఁడు కావున ధర్మార్థములు వానికి రుచింపలేదు.

ఉ. అనుడు లాలకించి ధన • దానుజుఁ డప్పుడు సీత నీయ లం
కానగరం బిదేటి కిటు • కష్టదశం గని వల్లకాఁ డగున్ ?
మానవనివంతసందరము • నన్ జన మేటికి మున్గి చచ్చు? న
య్యో నెఱిమాల ఱేఁ డదియు • నూరక పోవునె? గాసి పెట్టదే? ౨౨౦

అర్థములు. వల్లకాఁడు = స్మశానము, వంతసందరమునన్=దుఃఖసముద్ర మందు, నెఱి మాలన్ + ఱేఁడు=ఱేఁడు నెఱిమాలినన్=రాజు నీతి మాలినవాఁ డైనపుడు, మాల ఱేఁడు=మాలప్రభువు.

తాత్పర్యము

ఆ విభీషణుఁడు చెప్పిన మాటలు విని సీతను- రావణుఁడు మరల రామున కిచ్చియుండిన యెడల లంక యేల యిట్లు స్మశానమై నిచదకేకు వచ్చును. జనము వినువని దుఃఖ సముద్రమున నేల మునిఁగి చచ్చును? రాజు నీతిమాలినవాఁ డైనచోఁ బ్రజలకుఁ గీడు తప్పునా?

ఉ. రాముని చేత నిస్తుల ప•రాక్రముఁ డా ఘటకర్ణుఁ డీల్గుటల్
రాముని తమ్ముచేఁ బరదు • రాసదుఁ డా యతికాయు పాటునున్
భీమజవుండు శక్రజితు • బిద్దుట యిన్నియుఁ జూచి యైన నా
రా మతి యింతయుం గొనఁడు • రావణుఁ డయ్యయొ యెంతమూర్ఖుఁడో.

అర్థములు. నిస్తుల పరాక్రముఁడు=అసమాన పరాక్రమము గలవాఁడు, ఈల్గుట = చచ్చుట, పరదురాసదుఁడు = శత్రువులకు సమీపింప రానివాఁడు, భీమజవుండు = భయంకర వేగము గలవాఁడు, బిద్దుట=చచ్చుట.

తాత్పర్యము

రామునిచేఁ బరాక్రమమం దసమానుఁడైన కుంభకర్ణుఁడు చచ్చెను. రాముని తమ్మునిచే యుద్ధమునందు శత్రువులకు సమీపింపఁగానైన సాధ్యపడని యతికాయుఁడు, మిగుల వేగముగల యింద్రజిత్తు చచ్చిరి. ఇన్నియుఁ గన్నులారఁ జూచి యైన రావణుఁడు సంధిచేయ మనస్సున నెంచినవాఁడుకాఁడు. అయ్యో! యెంత మూర్ఖుఁడోకదా.

కం. నా తనయుఁడ! నా యన్నా!, నా తమ్ముఁడ! తండ్రి! ప్రాణ♦నాథా! యని యా
ర్తాతతరవములె వినఁబడె, నేతట్టును జూడఁ బురిని ♦ నింటింటికడన్. ౨౨౧౦

తాత్పర్యము స్పష్టము.

సీ. రథముల వాజివా♦రణముల సేనల, లక్షలకోలఁదిని ♦ రాక్షసులను
నొక్క-రాముఁడ వింట♦నుగ్రుఁడై వధియించె, విష్ణువో రుద్రుఁడో♦విబుధవరుఁడో
శ్రీరామరూపంబుఁ ♦ జేకొని త్రుంచె స్వ,యమ్ముగా వచ్చెనో♦యంతకుండు
పోటుబంటులు గూలి ♦ రేటిజీవిత మిఁక, నాపద తొలఁగెడి♦యునువు లేదు
ఆ. దిక్కు-మాలి మనము ♦ దేవురించుచు నుండ, రామువలనఁ దనకు ♦ రాఁగలట్టి
ముప్పు గాన లేఁడు♦ మొప్పె దశాస్యుండు, కలవు వరము లనుచు♦గర్వపడెను.

అర్థములు. వాజివారణములను=గుఱ్ఱములను ఏనుఁగులను, విబుధవరుఁడో= ఇంద్రుఁడో, అంతకుండు=యముఁడు, పోటుబంటులు = శూరులు, అనువు=ఉపాయము, దిక్కు-మాలి = దిక్కు- లేక, దేవురించుచు=దైన్యము నొందుచు- దుఃఖించుచు, ముప్పు=కీడు, మొప్పె=మూర్ఖుఁడు.

తాత్పర్యము

రథములను గుఱ్ఱములను ఏనుఁగులను లక్షలకొలఁది రాక్షసులను నొక్క-రాముఁడు ఒక్క-వింట,భయంకరముగ వధించెను. ఇట్లు చేయుటకు నీయన సామాన్య మనుష్యుఁడా ? కాఁడు. విష్ణువో రుద్రుఁడో ఇంద్రుఁడో శ్రీరాముని రూపము గ్రహించి వచ్చెను. కాదేని యంతకుఁడే స్వయముగ వచ్చెనో, శూరులందఱుఁ జచ్చిరి. ఇఁక మన మెట్లు బ్రదుకఁగలము? ఈ యాపదతొలఁగు నుపాయముకూడఁ గానరాలేదు. ఏలన మనము దిక్కు-లేక యిట్లు లేడ్చుచుండఁగా రావణుఁడు తన చావు సిద్ధముగుట తెలియక తనకు వరములు గలవని గర్వపడుచున్నాఁడు. ఆ వరములు వాని నేమి కాపాడఁగలవు ? చచ్చిన వారిలో వరములు లేనివారెవరు ? రావణుఁడుకూడ రామునిచేఁ జచ్చునని యెట్లు చెప్పఁగల రందురా ?

కం. శ్రీరాముశారిఁ జిక్కి-న, వారిన్ రక్షింప లేరు ♦ వసురాక్షసబ్బృం
దారక గంధర్వులిఁ కే, తీరున దశముఖుఁడు బ్రదుకు♦ తెరువుంగనునో. ౨౨౧౨

తాత్పర్యము

శ్రీరాముని యెదుటబడిన వారిని రాక్షసులును గంధర్వులును దేవతలైనను గాపాడలేరు. వీనికి వారి సాహాయ్యమును లేదు ఇఁక వీఁడెట్లు బ్రదుకఁ గలఁడు?

తే. రావణుఁ డొనర్చుచున్నట్టి♦ప్రతిరణంబు,లోనను త్పాతములు పెక్కు-♦గానవచ్చె
రావణుఁడు సంగరంబున♦రాము చేతఁ, జచ్చునని వానఁ దోఁచెడి♦సత్యముగను.

తాత్పర్యము

సహాయసంపత్తి లేకపోవుట, యున్నదేమో నాశమగుట, గాక రావణుఁడు చేయు ప్రతి యుద్ధమందు రాక్షసులకు నవశకునములే కానవచ్చుచున్నవి. ఒకటి

నైన శుభశకునము లేదు. ఆ శకునముల ఫలము చూచుచున్నాము. వానిని బట్టి చూడఁగా రావణుఁడు కూడ రాముచేఁ జచ్చుట నిజము అని తోఁచుచున్నది.

చ. కమలజు నీ దశాననుఁడు ♦ గాటపు రక్తి వరంబు వేఁడుచో
సమరఖగాహిరాక్షసచ ♦ యాదుల మృత్యువు లేమిఁ గోరి గ
ర్వము మెయి మర్త్యులన్ విడిచె ♦ వారక తత్ఫల మిప్పు డిట్లు ప్రా
ణముఁ గొన వచ్చె, రక్కసుల ♦ నాశము సిద్ధము పంక్తికంఠుతోన్. ౨౬

అర్థములు. కమలజున్ = బ్రహ్మను, అమరులయు, ఖగ=గరుడాది పక్షులయు, అహి=సర్పములయు, రాక్షస=రాక్షసులయు, చయ = సమూహములు, ఆదులన్=మొదలగు వారిచే, మర్త్యులన్=మనుష్యులను.

తాత్పర్యము

ఈ రావణుఁడు బ్రహ్మదేవుని వరములు గోరునపుడు దేవ పన్నగ గరుడ రాక్షసాదులచేఁ జావు లేకుండ వరము గోరి మనుష్యులు నన్నేమి చేయఁ గలరను గర్వముతో వారిచేఁ జావులేకుండ వరము గోరినవాఁడు కాఁడు. దాని ఫలమిప్పుడిట్లు ప్రాణాంతకమై వచ్చెను. ఇది రావణాసురునితోఁ బోవునది కాదు. వానితోపాటు సర్వరాక్షసులు నాశము కావలసిన వారే.

సీ. వరదానమదమునఁ ♦ బంక్తికంఠుండు పెట్టు,హావడి కోర్వక ♦ యమరవరులు
ధాతతో మొఱవెట్ట♦దానవరాక్షసు, లిది మొదల్ భయమున ♦ మెదలువారు
జగముల బొం డన,శంకరుఁ బురహరు, వృషభధ్వజునిఁ జేరి ♦ వేఁడికొనిన
సుప్రసన్నుం డయి♦సురలార ! మీమేలు,కై పుట్టు నొకయింతి♦యసురహంత్రి
ఆ. దానవులకు మున్ను ♦ దాపరించిన క్షుత్తు,పోలె రాక్షసులను♦బొలియఁ జేయు
ననుచుఁ జెప్పె సీత♦యాయింతి రావణు, నసురకులము ద్రుంగ♦నరుఁగుదెంచె. ౨౭

అర్థములు. వరదాన మదమునన్=బ్రహ్మదేవుఁడు తనకు వరమిచ్చెనను గర్వముచే, హావడి = బాధ, అసురహంత్రి = రాక్షసులఁ జంపునది, క్షుత్తు = ఆఁకలి. దేవతలకు అమృతము పంచిన తరువాత, దానవరాక్షసుల్ = మందోదరీ మయాదులు దానవులు, ఈమెకు సంబంధించినవారు కొందఱు లంకయందుఁ గలరని గ్రాహ్యము. రావణాది పౌలస్త్యులు రాక్షసులు.

తాత్పర్యము

బ్రహ్మవరము వలని గర్వముచే రావణుఁడు పెట్టు నుపద్రవమునకు సహింపలేక దేవతలు బ్రహ్మదేవునితో మొఱలు పెట్టుకొనఁగా నాయన ప్రతివిధానము చెప్పిన రాక్షసులు దానవులది మొదలు భయముతో వర్తింతురు పొండని చెప్పెను. అంతటవారు శివుని యొద్దకుబోయి వేడుకొనఁగా నాయన యనుగ్రహించి దేవతలారా ! మీమేలుకై రాక్షసులఁజంపు స్త్రీ యొకతె పుట్టును. ఆమె దానవులను ఆఁకలి చంపినట్లు రాక్షసకులమును నాశము చేయఁగలదని చెప్పెను.ఆమెయే సీత.

రావణుని రాక్షస వంశమును నాశము చేయవచ్చినది.

ఆ. కుటిలబుద్ధి కెల్వి ♦ గోరంతయును లేదు, నీతిపొంతఁ బోని ♦ పాతకుండు
పంక్తిముఖుఁడు వీని♦పాపంబుచేఁ బురి, పాడుపడియె దుఃఖ♦పాటు గలిగె.

అర్థములు. కుటిలబుద్ధి=వంచన బుద్ధి గలవాఁడు.

తాత్పర్యము

రావణుఁడు నీతిమంతుఁ డైనచో రాక్షసుల కీ గతి యేల వచ్చును? వాఁడు వంచన బుద్ధి గలవాఁడే కాని ఋజువర్తనము గలవాఁడు కాఁడు. కొంచెమైన నిది కాఁకు ఇది తప్పు అను వివేకము లేనివాఁడు. నీతిసమీపమునకైన పోని పాపాత్ముఁడు. ఇట్టి వీఁడు చేసిన పాపముచే లంక పాడుపడెను.మన కిటువంటి దుఃఖము ప్రాప్తించెను.

కం. లయకాలయమునిపోలిక, భయమున్ ఘటియించు రామ♦భద్రునివలనన్
భయ ముడిపి కావ భువన, త్రయి నెవ్వరు లేరు మనకుఁ♦దథ్యము సుండీ.

తాత్పర్యము

ప్రలయకాల యముని వలె మనకు భయము గలిగించు చున్న రామభద్రుని వలన మనకు భయములేకుండ రక్షింపఁ గలవాఁడు మూఁడు లోకముల నెవ్వఁడు లేఁడు. ఇది సత్యము.

కం. వనదహన వేష్టితం బగు, వనకరిణీయూథ మనఁగ ♦ వనరుచు నుండన్
గనుఁగొని శరణ్యుఁ డగు నా, ఘనుఁ డెవ్వఁడు దిక్కు-మాలి♦కాలెడి మనకున్.

అర్థములు. వనదహన వేష్టితంబు = కాఱుచిచ్చుచేఁ జుట్టుకొనఁ బడినది, వనకరిణీ యూథము=అడవి యందలి యాఁడేనుఁగుల గుంపు.

తాత్పర్యము

కాఱుచిచ్చు చుట్టుకొనఁగా నాఁడేనుఁగులవలె దుఃఖించుచు దిక్కు-లేక కాలు చుండెడి మనకు రక్షింపఁదగు గొప్ప వాఁడెవ్వఁడు గలఁడు ?

తే. విమలనీతిరతుండు వి♦వేకశాలి
యవ్విభీషణుఁ డర్హంబు ♦ నాచరించెఁ
గలిగె భయ మెందు నద్దానిఁ ♦ దెలిసి యాతఁ
డందుఁ జని యాశ్రయించి భ♦యంబు వాసె. ౨ ౩౮౯

అర్థములు. విమల నీతిరతుండు=శుద్ధమైన నీతియందుఁ బ్రీతిగలవాఁడు, వివేకశాలి = ఇది తప్పని ఇది యొప్పని తెలిసిన వాఁడు.

తాత్పర్యము

పరిశుద్ధమైన నీతి తెలిసినవాఁడు వివేకముగలవాఁడు నగు విభీషణుఁడు యోగ్యమైన పనిచేసెను. ఎవరి వలన భయము గలుగు నని తోఁచెనో వారినే యాశ్రయించి నిర్భయుఁడయ్యెను.

కం. అని రజనీచరతరుణులు, పనవుచు నొండొరులఁ గ్రుచ్చి•కలవించుచు హా
యని యేడ్చిరి దివి ముట్టసి, పెనురవముల మాఱుమ్రోయ•విదిశలు దిశలున్.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుకొనుచు రాక్షసస్త్రీ లొకరి నొకరు పట్టుకొని దుఃఖ పడుచు హా యని గొంతెత్తి బిగ్గఱగా నేడ్చిరి. వారి యీ ధ్వనికి దిక్కులు విదిక్కులు మాఱుమ్రోసెను

**—• ౯౬-వ సర్గము. రావణుఁడు పౌరుషోక్తులు పలుకుట •—**

ఉ. ఈవిధి నింట నింట జని•యించు మహార్తిరవంబు ఘోరమై
రావణుచీనులం బడ భ•రంబుగ నూర్చుచు ధ్యానయుక్తుఁడై
రేచి మహారుషం గనులు • ద్రిప్పుచు భూతభయంకరాస్యుఁడై
యావిలయాగ్నివోలె పసు•రాళికి నేఁయు దుర్నిరీక్ష్యుఁడై. ౨.౨.౨౧

అర్థములు. రేచి = రేఁగి = విజృంభించి, దుర్నిరీక్ష్యుఁడు = చూడఁ గష్టమైన వాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారమింటింటఁ బుట్టుచున్న యేడుపు ధ్వని మహాఘోరమై రావణు చెవులలోఁబడఁగా విశేషముగ నూర్పుచ్చుచు నేమి చేయుదునా యని యాలోచించి మిగులఁ గోపముచే విజృంభించి గ్రుడ్లు ద్రిప్పుచుఁ జూచువారికి భయంకరమైన ముఖము గలవాఁడై ఆ ప్రలయాగ్ని వలె వాడుకగాఁ జూచు రాక్షసులకు గూడఁ జూడరానివాఁడై.

కం. కటకట రదములు కొఱుకుచుఁ, బుటపుట రక్తంబు మోవి•బొడమఁగొఱుకుచున్
మటమట లాడుచు భీత్య,స్ఫుటవచనుం డనియె దాపు•సోఁకులగమికిన్. ౨.౨.౨.౨

అర్థములు. మోవిన్ = పెదవియందు, భీత్యస్ఫుటవచనుఁడు=భయముచే స్పష్టముగాని మాట గలవాఁడు, అంత సేన యొకటిన్నర గంటలోఁ జచ్చె ననిన నెవఁడు భయపడకుండును.

తాత్పర్యము

పటపటపండ్లు కొఱుకుచు పెదవి కొఱుకుటచే నెత్తురు పుటపుట పుటకరింపగా గోపముచే మటమట లాడుచు భయముచే స్పష్టముగాఁ దెలియని మాటలచే దగ్గఱ నున్న రాక్షసులతో నిట్లనియె.

సీ. మాయాజ్ఞ మేరకు•మహితసైన్యముతోడ, హాపార్శ్వుఁడును విరూ•పాక్షుడును మ
హోదరుండును వేగ•యుద్ధమునకుఁ బోవఁ, బయనింపుఁడీ యని•పలుకుఁ డనిన
వారట్ల తమరాజు • పనుపున నొనరించి, దళవాయి లఖిలంబు • దండు దీర్చి
భయమున దరిఁ జేరి•ప్రాంజలు లగుచును,నృపుజయంబును గోరి•నిలిచి యుండ

తే. నవ్విరూపాక్షుఁ డాదియా•నసురవరులఁ, జూచి యిట్లను సంవర్త•సూర్యకల్ప
మార్గణంబుల రామల•క్ష్మణులఁ దొలుత, జెంపి తైచెద మద్బాహు•చండిమమున.

అర్థములు. మా యాజ్ఞ మేరకు = ఇచ్చట బహువచనము ఆత్మగౌరవ ద్యోతకము, దళవాయులు = సేనాపతులు, సంవర్త = ప్రళయ మందలి, సూర్య కల్ప = సూర్యునితో సమానమైన, మార్గణంబులన్=బాణముల చేత, మద్బాహు చండిమమునన్=నా భుజ బలము వేడిచేత.

## తాత్పర్యము

మహాపార్శ్వుఁడు విరూపాక్షుఁడు మహోదరుఁడు యుద్ధమునకుఁ బోవఁ బ్రయాణము గండని నేరాజ్ఞాపించితి నని చెప్పుఁడు. అనిన వారు తమరాజు నాజ్ఞా ప్రకారము పోయిచెప్పిరి. సేనాపతులు దండు పర్వము ప్రోగు చేసిభయముతో సమీపించి చేతులు గట్టుకొని నిలిచి యుండఁగా నా విరూపాక్షుఁడు లోనగు వారిని జూచి రావణుఁ డిట్లనియె. ప్రళయకాల సూర్యునితో సమములైన బాణములచే నా భుజబలము వేడిమి చేత మొట్టమొదట రామలక్ష్మణులను నఱికి వైచెదను.

చ. ఖరహరిజిత్ప్రహస్తఘట•కర్ణులకున్ ఋణ మేను దీర్చెదన్
వరుసగ రామలక్ష్మణుల•వానరనాథుల నెల్లఁ ద్రుంచి మ
ద్గురుతర బాణవారిధర•కోటుల దుర్దినమున్ ఘటించి సా
గరగగనక్షమాధరని•కాయము లేర్పడకుండఁ జేసెదన్. ౨౨౮

అర్థములు. గురుతర=మిగుల గొప్పవగు, బాణవారిధరకోటులన్=బాణము లను మేఘములచే, దుర్దినమున్ = సూర్యుఁడు కానరాని దినముగా, సాగరగగన క్షమాధర నికాయములు=ఇది సముద్రము ఇది ఆకాశము ఇది భూమి ఇవి కొండలు అని.

## తాత్పర్యము

ఖరునకు, ఇంద్రజిత్తునకు, ప్రహస్తునకు, కుంభకర్ణునకు - వారు నాకై చచ్చిరి. కావున నేను వారికి నప్పుపడి యున్నాను. దానిని రామలక్ష్మణులఁ జంపి తీర్చె దను. వరుసగ రాముని లక్ష్మణుని వానరసమూహములను నందఱును సంహరించి నాగొప్ప బాణములను మేఘములచే సూర్యుఁడు కానరాకుండఁ జేసి భూమి ఆకా శము కొండలు గుర్తింప రాకుండఁ జేసెదను. భయశోకములచే మనస్సు స్వస్థత చెడుటచే తాఱుమాఱుగఁ బలుకుచున్నాఁడని గ్రహింపవలెను.

సీ. కండలు కండలు•తుండెముల్ మొండెముల్, తుంటలు తుంటలు•దుమ్ముదుమ్ము
తుండెలుతుండెలు•తునుకలు తునుకలు, ప్రుక్కలు ప్రుక్కలు•వ్రక్కవ్రక్క
బ్రద్దలు బ్రద్దలు•పఱియలు పఱియలు, వ్రయ్యలు వ్రయ్యలు•వ్రప్పవ్రప్ప
తుంకలుతుంకలు•ఖండముల్ ఖండముల్, తునియలుతునియలు•తుఱుముతుఱుము

ఆ. పాఱ దోఁకినట్టు • బాడిసఁ జెక్కిన, కోమరు అంపమునను • గ్రోఁత వండఁ
దఱిగినట్లు దోఁపఁ • దరుచరవితతుల, నఱుకువాఁడ మీఁద•నఱుకువాఁడ.

అర్థములు. తరుచరవితతులన్ = వానర సమూహములను, క్రోధావేశ ముచే నొకసారిచెప్పినఁ దృప్తిలేక చెప్పినదానినే పలువిధములఁ జెప్పుచున్నాఁడు.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఇప్పుడు వానరసేనలఁ, గప్పెద ధనురుదధిజనిత•కాండోర్మలచేఁ
దెప్పిఱిలలేక కుప్పలు, కుప్పలుగా వారు నేలఁ • గూలంబడఁగన్. ౨ ౨ ౨౬

అర్థములు. ధనురుదధి జనిత = ధనుస్సనెడి సముద్రమునందుఁ బుట్టిన, కాండోర్మలచే=బాణములనెడి యలలచే.

తా త్ప ర్య ము

ఇప్పుడు నా విల్లనెడి సముద్రమునందుఁ బుట్టిన బాణము లనెడి యలలచే వానరు లూపిరాడక కుప్పలు కుప్పలుగాఁ బడునట్లు కప్పెదను.

కం. కేసరవర్ణము నీరజ, భాసురకాంతియును నైన•ప్లవగేశ్వరయూ
థాసమసరసుల గజమన, వాసి చెడం గలఁచువాఁడఁ • బరమాస్త్రములన్.

అర్థములు. కేసరవర్ణము = అకరుపులవన్నె, నీరజ భాసురకాంతి = కమలములు ప్రకాశించు కాంతి, ఐన = కల, ప్లవగేశ్వరయూథ=వానరశ్రేష్ఠుల సేనలను, అసమసరసులన్=పెద్దకొలఁకులను, గజమనఁగన్=ఏనుఁగో యనునట్లు.

తా త్ప ర్య ము

అకరుల వన్నె పద్మముల కాంతిగల వానరుల సేనను కొలఁకులను నేనుఁగు వలె నా పరమాస్త్రములచేఁ గలఁత నొందించెదను.

కం. కాఁడఁగ శరములు మోమున, వాఁడిమి చెడి నేలఁ బడిన•వానరుల తలల్
తూఁడులతోఁ గమలము లనఁ, బోఁడిమి గలిగించు సమర•భూతలమునకున్.

తా త్ప ర్య ము

ముఖములందు బాణములు నాటుకొనఁగా బలము చెడి నేలఁబడిన వానరుల తలలును తూండ్లతోఁ గూడిన తామరపూవులవలె యుద్ధభూమిని నలంకరించును.

కం. ఒక్కొక్కశరముచేతనె, తకటక వందలకొలంది • తరుచరవరులన్
జెక్కులు చెక్కులుగా ధర, నొక్కఱ నొఱగింతుఁ ద్రుంతు•నుదుటు న్మాన్తున్.

అర్థములు. ఒక్కఱన్ = ఉగ్రముగా, ఉగ్రశబ్దభవము, ఉదుటున్ = గర్వమును.

తా త్ప ర్య ము

ఒక్కొక్క బాణముచేతనే నూర్లకొలఁది వానరులను చెక్కులు చెక్కులుగా నఱకి యుగ్రముగా నేలపడఁద్రోయుదును. వారి గర్వము మానుతును.

కం. ఎవ్వరిపతు లెవ్వరిసుతు, లెవ్వరిసోదరులు కలన ♦ నీల్గిరి యిపుడే
నవ్వారికనులసీటిన్, నెవ్వగఁ జన దుడుతు నరుల ♦ నిర్జించి యనిన్. ౨.౨౩౦

తాత్పర్యము స్పష్టము.

కం. చండభుజదండ ధృతకో, దండగళితనిశితకాండ ♦ దండంబులచే
భండనకుంభినిఁ జూపఱ,గుండెలు పగులంగఁ ద్రుంతుఁ ♦ ద్రోఁతుల దండున్.

అర్థములు. చండ=భయంకరమైన, భుజదండ=దండముల వంటి భుజములచే, ధృత = ధరింపఁబడిన, కోదండ = వింటినుండి, గళిత = జాఱిన, బయలు వెడలిన, నిశిత = పదునైన, కాండ=బాణములయొక్క, దండంబులచేన్=సమూహముల చేత, భండనకుంభినిన్=యుద్ధభూమిని.

తాత్పర్యము

భయంకరమైన నా భుజదండములచే ధరింపఁబడిన కోదండముల నుండి వెడలుచున్న బాణ సమూహములచే యుద్ధభూమి చూచువారి గుండెలు పగులు నట్లు వానరుల దండును సంహరించెదను.

కం. గండడచి రిపులమేనులఁ, గండలు తెగఁ గోసి శాత♦కాండంబులచే
మెండగు నక్కలు గ్రద్దలు, దండిగఁ దిన నిత్తుఁ గడుపు♦దనియఁగ నిపుడే.

తాత్పర్యము స్పష్టము

## —♦ రావణుఁడు యుద్ధమునకు వెడలుట ♦—

ఆ. సన్నహము రథంబు♦వరచాపమును దెమ్ము,యిపుడ మిగిలియున్న♦యెల్ల యసుర
లరుగు దేరవలయు♦నాహవంబునకు నా,వెంట ననిన(బలుకు♦వెంటనపుడ. ౨ ౨౩౩

అర్థములు. సన్నహము = సిద్ధము సేయుము, ఆహవంబునకున్=యుద్ధమునకు, పలుకు వెంట=చెప్పిన తత్క్షణమే.

తాత్పర్యము స్పష్టము.

కం. దళవాయులార! యందఱు, వెలలుఁడు సంగ్రామమునకు♦వేగమ యనుచున్
బలుక మహాపార్శ్వుడు వా, రలసత లేకింటి కింటి ♦ కరుగుచుఁ బిలువన్.

అర్థములు. దళవాయులార = సేనాపతులార, వెలలుఁడు = వెడలుఁడు, లడలక భేదము, అలసత=సోమరి తనము చేత, సేనాభటులుగా నున్న వారందఱు చచ్చుట చేతను,కొందఱు గాయములుపడి యుద్ధమునకుఁబనికిరాని వారగుటచేతను ఇంటింటికిఁ బోయి నీవురా నీవురా యని సేనానాయకులు రాక్షసులఁ బిలచిరి.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఒక ముహూర్తములోన ♦ సుగ్రదర్శనులైన, రాక్షసు లాయుధ ♦ రాజితోడ
నడ్డకత్తులతోడ ♦ దుడ్డుకట్టెలతోడ, బడితెలతోడను ♦ బలకతోడ
బాగుదారులతోడ ♦ వాయిదారులతోడఁ, గత్తులతోడ రోఁకండ్ల తోడఁ
గండ్రగొడ్డండ్లతోఁ ♦ గరవాలములతోడఁ, జబురుజంగులతో జ♦జాలతోడఁ

తే. దళుకుఁగలశస్త్రములతోడఁ • దరలి రాఁగ, దీప్యమానంబు భీమంబు • దేరి చెక్కు-
సత్త్వగాంభీర్యముల కల్మి • క్ష్మాతలంబు, గ్రీల దశకంఠుఁ డనికయి • వెడలె నపుడు.

అర్థములు. ఉగ్రదర్శనులు=చూడ భయంకరమైనవారు, బాగుదారులు= చిన్నకత్తులు, వాయిదారులు = వంకలుగల కత్తులు, జబురుజంగులు = చిన్న ఫిరంగులు, జజాలతో=ఇదియొక దినుసు ఫిరంగి, సత్త్వగాంభీర్యముల కల్మి = బలాతిశయ సంపదచే.

తాత్పర్యము స్పష్టము.

సీ. అధిపునానతి విరూ • పాక్ష మహాపార్శ్వులును మహోదరుఁడును • ఘనబలాఢ్యు
లాత్మశతాంగంబు • లధిరోహణ మొనర్చి, యూర్పులు పెడబొబ్బ • లతిశయిల్ల
మేదిని భేదిల్ల • మేదురారవములు, నించుచు జయకాంక్ష • నిర్గమింప
నంతకుభంగి ను • ద్యత కార్ముకుం డయి, జవనాశ్వయుక్తమై • దివసకరుని
తే. భాతి వెలుఁగొందు రథమునఁ • బంక్తిముఖుఁడు
మహితజవమున రామల • క్ష్మణులు మెలఁగు
చక్కటికి నల్లద్వారంబు • చాయఁ గదలి
కర్కశాసురసేనతోఁ • గదలి రాఁగ. ౩౨

అర్థములు. మహోదర మహాపార్శ్వులు=వీరు మంత్రులు, ఇది వఱకుఁ జచ్చివారు యుద్ధోన్మత్త మత్తులను నామాంతరము గలవారు తమ్ములు; ఆత్మశతాంగంబులు=తమ రథములు, అధిరోహణ మొనర్చి = ఎక్కి, మేదురారవములు = దట్టమైన ధ్వనులు, నిర్గమింపన్=బయలు వెడలఁగా, ఉద్యత = ఎత్తఁబడిన, కార్ముకుఁడు=విల్లుగలవాఁడు, జవనాశ్వయుక్తము=వేగముగఁబోవు గుఱ్ఱములతోఁ గూడినది, దివసకరుని భాతిన్=సూర్యునివలె, అల్లద్వారంబు = ఉత్తర ద్వారము, కర్కశ = కఠినులైన, అసురసేనతో = రాక్షసుల దండుతో.

తాత్పర్యము

రాజాజ్ఞ చొప్పున విరూపాక్షుఁడు మహోదర మహాపార్శ్వులు నను మహాబలవంతులు తమ తమ రథములెక్కి యూర్పులు పెడబొబ్బలు మిక్కుటముగాఁగా భూమి పగులునట్లు ధ్వనులు దట్టముగా నించుచు జయముగోరి బయలు దేఱఁగా రావణుఁడు విల్లెత్తికొని వేగవంతములైన గుఱ్ఱములుకట్టిన సూర్యునివలె వెలుఁగు రథమెక్కి రామలక్ష్మణు లున్న యుత్తర ద్వారము వైపుగ వేగముగ క్రూరులైన రాక్షసుల సేనలతో రాఁగా

మూలబలము సూర్యోదయమున యుద్ధము ప్రారంభముచేసి యొకటిన్నర గంటలో (7-30) హతమయ్యెను. కావున నిప్పుడు ఎనిమిది ఎనిమిదిన్నర గంటలై యుండవలెను. చతుర్దశి తిథి, మూలబల యుద్ధ మొకనాఁడంతయు జరుగునని తలఁచి యమావాస్యనాఁడు తాను బయలుదేఱ నాలోచించెను గాని మూలబల మప్పుడే హత మగుటచే వెంటనే వాఁడును బయలుదేఱవలసి వచ్చెను.

## —♦ రావణున కపశకునంబు లగుట ♦—

ఉ. మాసె సరోజబంధు నతి♦మాత్రపుఁజీఁకటు లెల్లదిక్కులన్
రేసె వణంకె నెంతయు ధ♦రిత్రి పలాశశకుంతసంతతుల్
గూసె మహాస్రవృష్టి వడెఁ ♦ గుంపులు గట్టి సృగాలజాలముల్
చేసె శుభేతరారవముఁ ♦ జేరి ధ్వజంబున వ్రాలె గృధ్రముల్. ॥ ౩౭

అర్థములు. సరోజబంధువు = సూర్యుఁడు, అతిమాత్రపు = విస్తారమైన, రేసెన్ = అతిశయించెను, పలాశ = మాంసము దిను, శకుంతసంతతుల్ = పక్షి సమూహములు, మహాస్రవృష్టి=పెద్ద నెత్తురు వాన, సృగాల జాలముల్ = నక్కల గుంపులు, శుభేతర=కీడు తెలుపు, ఆరవము=ధ్వని, గృధ్రముల్=గ్రద్దలు.

### తాత్పర్యము

సూర్యకాంతి మాసెను. దట్టపుఁ జీఁకట్లు క్రమ్మెను. భూమి వణఁకెను. మాంసము దిను పక్షులు కూసెను. నెత్తురు వర్షము గురిసెను. నక్కలు పరుషముగఁ గూసెను. ధ్వజముపై గ్రద్దలు వ్రాలెను.

ఉ. వాజులు కాళ్ళు జాఱిపడెఁ ♦ వామభుజేక్షణముల్ చలించె స
త్తేజము మాసె మోమునకు ♦ దీనత నొందె గళస్వరంబు స్వా
రాజవిరోధికిం, బిడుగు ♦ రాలెడిభంగిని నుల్కరాలె, న
య్యాజిని జేటు దెల్పుచు శి♦వాళులు కాకులు గూసెఁ జుట్టుచున్. ॥ ౩౮

అర్థములు. వాజులు=గుఱ్ఱములు, వామభుజేక్షణముల్ = ఎడమభుజము, ఎడమకన్ను, గళస్వరంబు = కంఠధ్వని, ఉల్క = కొఱవి, శివాళులు=నక్కల గుంపులు, చుట్టుచున్=చుట్టు తిరుగుచు.

### తాత్పర్యము

గుఱ్ఱములు కాళ్ళుజాఱి పడెను. ఎడభుజము ఎడమకన్నుకదలెను. మొగమున కాంతి తొలఁగెను. రావణునకు కంఠస్వరమున హైన్య మావేశించెను. పిడుగుల వలెఁ గొఱవులుపడెను. ఆ యుద్ధమందు వానికిఁ గీడు తెలుపుచు నక్కలు కాకులు వానిచుట్టు తిరిగెను.

కం. ఘోరోత్పాతము లీగతి, దారుణముగఁ దోఁచు చున్న ♦ దశముఖుఁ డాత్మన్
జేరంగనీక కాల, ప్రేరితుఁడై మోహమునను ♦ వేగమ చనియెన్. ॥ ౩౯

అర్థములు. ఘోరోత్పాతములు = భయంకరములైన యపశకునములు, కాలప్రేరితుఁడై =మృత్యువుచేఁ బ్రేరింపఁ బడినవాఁడై, మోహమునను=జయము గలుగు నను నజ్ఞానముచే.

### తాత్పర్యము స్పష్టము.

ఉ. వారి శతాంగఘోషముల ♦ వారల యార్పుల నాలకించి తెం
పార వనేచరుల్ మిగుల ♦ నాహవదోహలు లై యెదిర్చినన్

వారికి వీరికిన్ రణము ♦ వారక చెల్లె భయంకరంబుగా
వారల నెల్ల మీఱి దశ ♦ వక్త్రుఁడు చాపగుణంబు మీటుచున్. ౨ ౨౭౦

అర్థములు. శతాంగఘోషములన్ = రథముల ధ్వనులను, తెంపారన్= సాహస మతిశయింపఁగా, ఆహవదోహలులై=యుద్ధమం దాసక్తి గలవారై.

తాత్పర్యము

వారల రథధ్వనులు వారల యఱపులు విని వానరులు మిగుల సాహస వంతులై యుద్ధాసక్తులై వారి నెదిరింపఁగా వారికి వీరికి భయంకరమైన యుద్ధము జరిగెను. అప్పుడు రావణుఁడు వారినందఱ దాఁటిపోయి యల్లెత్రాడు మీటుచు,

—♦ రావణుఁడు కపిసేన నుఱుమాడుట ♦—

సీ. కాంచనమండిత ♦ కాండప్రకాండంబు, లొండొండ మెండుగ ♦ నుద్ధవిడిని
బఱప శిరంబులు ♦ పగిలినవారును, గుండెలు దబ్బులై ♦ కూలువారుఁ
జెవులు దెగినవారుఁ ♦ జెంప చీలినవారుఁ, బ్రక్కలు డొక్కలు ♦ పగులువారు
ముక్కులు తోఁకలు ♦ మొక్కవోయినవారు, నూపిరి తిరుగక ♦ యొరలువారుఁ
ఆ. గనులు లేనివారుఁ ♦ గాళ్ళు దెగినవారు, మెడలు దెగినవారు ♦ మిడుకువారు
నైరి కీశవర్యు ♦ లాతని రథమెందుఁ, బఱచె నందు సేన ♦ పాఱుపడియె. ౨ ౨౭౧

అర్థములు. కాంచన=బంగారుచే, మండిత=అలంకరింపఁబడిన, కాండ = బాణముల, ప్రకాండములు=సమూహములు, ఉద్ధవిడిని=మిగుల వేగముతో.

తాత్పర్యము స్పష్టము

సీ. కత్తుల వఱికిన ♦ యత్తెరఁ గొప్పార, భాసిఁప జెక్కిన ♦ పగిదిగాఁగ
అంపానఁ గోసిన ♦ సొంపు సంపాదింపఁ, ద్రోపుడు పట్టిన ♦ త్రోవఁ జ్ఞదవర
నులులను మలచిన ♦ చెలువు దీపింపఁగఁ, దఱిమెన బెట్టు చం ♦ దంబు దోఁపఁ
దుఱిమినచాడ్పునఁ ♦ దఱిగిన భంగిని, గొఱపులఁ జూఁడిన ♦ తెఱఁగు వెలయు
ఆ. గారుచిచ్చు గవిసి ♦ కాల్చినమాడ్కిని, నేపు మెఱసి పరుల ♦ నూపు మాఁపెఁ
జండదీర్ఘబాహు ♦ తాండవితశరాస, రాజదండుఁ డైన రావణుండు. ౨ ౨౭౨

అర్థములు. చూఁడిన=కాల్చిన, చండ=వాఁడిమిగల, దీర్ఘబాహు=నిడుపాటి చేతులచే, తాండవిత=నాట్యమాడు, శరాసరాజదండుఁడు=దండము వంటి శ్రేష్ఠమైన విల్లు గలవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఎందును దానయై ♦ యేపారి తెంపారఁ, బిడుగులు గురియించు ♦ నెడము లేక
యేచాయఁ దానయై ♦ రోచులు గ్రక్కు బా ణాళులఁ జించి చెం ♦ డాడుచుండు
నేవంకఁ దానయై ♦ యేవంకయును లేని, ములుకుల హోవళి ♦ గలుగఁ జేయు
నేమూలఁ దానయై ♦ యామూల మరుల సైన్యంబులు పఱవఁ జీకాకు సేయుఁ

ఆ. జక్కసూటి పోవ • బ్రక్కప్రక్కలు నొక్కఁ, గోణసీమలందు • రాణ మెరయఁ
జిత్రమండలములఁ • జిందువం దొనరించు, నరిదివిల్లుకాఁడు • సురలసూడు.

అర్థములు. ఎడములేక = సందులేకుండునట్లు, ఏ వంక = ఏ లోపము, హావళి = ఉపద్రవము, ఆమూలము = మొదలుముట్ట, కోణసీమలందున్ = మూల ప్రదేశములందు, చిందువందు = చెదరినది, అరిది = ఆశ్చర్యకరమైన, సురలసూడు = దేవతల విరోధి, రావణుఁడు.

తాత్పర్యము స్పష్టము.

## ౯౮-వ సర్గము.

కం. ఆశరనాథకరోర్జిత, మాశరవారంబు దాఁక • నగచరసైన్యం
బాశుగసఖసంప్రోషిత, మా శలభవ్రాత రీతి • నాకృతి మాలెన్. ౨-౨౭౭

అర్థములు. ఆశరనాథ = రాక్షస ప్రభువుయొక్క, కరోర్జిత = చేతులచేఁ జిమ్మఁబడిన, ఆ = ప్రసిద్ధమైన, శరవారంబు = బాణముల సమూహము, ఆశుగసఖ = అగ్నిచే, సంప్రోషిత = కాల్పఁబడినది, శలభవ్రాతము = మిడుతల గుంపు, ఆకృతి = ఆకారము. తాత్పర్యము

రావణాసురునిచే విడువఁబడిన బాణములు దాకి వానరసేన యగ్నిచేఁ గాలిన మిడుతల సమూహమువలె నాకారము మాలినదయ్యెను.

ఉ. మారుతధూత మేఘముల • మాడ్కి దవానలదహ్యమానకాం
తారగజంబుల ట్లసుర • నాథశరార్దిత మర్కటాగ్రణుల్
పోరు దొలంగి పోయినదె • పోకగఁ బాఱిరి కాందిశీకులై.
యారవపూరితాశు లయి • యాపద నొంది నలంగి దీనులై. ౨-౨౭౮

అర్థములు. మారుత = గాలిచే, ధూత = ఎగురఁగొట్టఁబడిన, దవానల = కాఱుచిచ్చుచే, దహ్యమాన = కాల్పఁబడుచున్న, కాంతారగజంబులట్లు = అడవి యేనుఁగులవలె, అసురనాథ = రాక్షసరాజుయొక్క, శర = బాణములచే, అర్దిత = పీడింపఁబడిన, మర్కటాగ్రణుల్ = వానర ప్రముఖులు, కాందిశీకులై = దిగ్భ్రమ చెందినవారై, ఆరవ = ధ్వనిచే, పూరిత = నిండింపఁబడిన, ఆశులై = దిక్కులుగలవారై.

తాత్పర్యము

గాలిచే నెగురఁగొట్టఁబడిన మబ్బులవలె, కాఱుచిచ్చుచేఁ గాల్పఁబడుచున్న యడవి యేనుఁగులవలె రావణబాణములచేఁ బీడింపఁబడిన వానరశ్రేష్ఠులు కలత చెందినవారై యుద్ధము వదలి దిక్కులు నిండ ధ్వనించుచు నలఁగి దుఃఖితులై పోయినవారు పోయినట్లే పోయిరి.

### —• సుగ్రీవుఁడు రాక్షసుల వధించుట •—

చ. ప్లవగులు మూల కొక్కఁడుగఁ • బాఱ రఘూద్వహుపై శరాంగమున్
జవమునఁ దోలఁ బంచెఁ దన • సారథి నయ్యెడ సూర్యనందనుం

డవిరళకీశసైన్య మిటు ♦ లాఁడిపోవఁ దనంతవానిఁ గీ
శవిభు సుషేణు గుల్మమున ♦ స్థాపితుఁ జేసి రయంబు బెలర్చెఁగన్. ౨౨౮౬

అర్థములు. అవిరళకీశసైన్యము = దట్టముగ నుండిన వానరసేన, ఆఁడి పోవన్ = వ్యర్థమై పోఁగా, తనంతవాని = తనతో సమానుఁ డగువాని, గుల్మమున = సేనాసన్నివేశమందు.

తాత్పర్యము

మూలకొక్కఁడుగ వానరులు పరువెత్తఁగా రావణుఁడు తన తేరిని రామచంద్రుఁపైఁ దోలించెను. ఆ సమయంబున వానరులు వ్యర్థులై పోవుటచూచి గుల్మమునఁ దన స్థానంబునం దనంతసామర్థ్యము గలవాని సుషేణుని నిల్పి శీఘ్రముగ.

ఉ. శూరులు యూథనాయకులు ♦ సూకెల రా ద్రుమశైలపాణులై
పేరిమిమీఱి రాక్షసుల ♦ పీఁచ మడంపఁ దొడంగి శైలముల్
భూరుహముల్ మహోగ్రగతి ♦ బోరున మేఘము కానలో శిలా
సారము పుల్గులం గురియు ♦ చందమునం గురియించె నీసునన్. ౨౨౮౭

అర్థములు. సూకెలన్=ప్రక్కల, పీచము=మదము, రూ. పించము.

తాత్పర్యము

శూరులగు యూథపతులు తన ప్రక్కలఁ దన కండిచ్చుటకై చెట్లను కొండలను చేతులఁ దీసికొనిరాఁగా పరాక్రమించి రాక్షసుల గర్వ మడఁగింపఁగోరి యడవిలో మేఘములు పక్షులమీఁద జాలవాన గురియునట్లు రాక్షసులమీఁద కొండలు చెట్లు గురియించెను.

కం. లయసమయజనితపవనో, చ్చయనిహతిం ద్రెళ్ళు భూజ ♦ సముదయ మనఁ ద
ద్రయమునకుఁ దెరలి రాక్షస, చయములు సాల్పడియె నేల♦సత్త్వము దూలన్.

అర్థములు. లయసమయ = ప్రలయకాలమందు, జనిత = పుట్టిన, పవనోచ్చయ నిహతిన్=పెద్దగాలిదెబ్బచేత, భూజసముదయము చెట్లగుంపు, తత్ + రయమునకున్=ఆ వేగమునకు, సాల్పడియెన్=చాలుగాఁ బడెను.

తాత్పర్యము

ప్రలయకాలమందు మహావాయువు దెబ్బకు నేలఁబడు చెట్లగుంపు వలె, ఆ వేగమునకు రాక్షసుల గుంపు బలముచెడి చలించి నేలమీఁదఁ జాపపఱచినట్లు పడెను.

చ. అగచరనాథముక్తవివి ♦ ధాశ్మచయాహతిఁ జేసి శీర్షముల్
పగుల నరంబులుం దెగ మె ♦ లల్ విఱుగం గరపాదజాలముల్
నొగులఁగ నెత్తు గ్రక్కుచును ♦ లోఁగుచు విచ్చుచు క్షీయమాణమై
మొగి నసురేంద్రశూరతతి ♦ మోడుపడెన్ మొగతప్ప బెగ్గిలన్. ౨౨౮౯

అర్థములు. అగచరనాథ=వానరరాజుచే, ముక్త=విడువఁబడిన, వివిధ =

నానావిధము లయిన, అశ్మచయ = తాలసమూహముల, ఆహతిన్ = దెబ్బచే, క్షీయమాణమై = నశించు చున్నదై, మోడుపడెన్ = మొద్దువలె నయ్యెను. ఖండిత మయ్యెను, మొగలప్పెన్=ముఖము తప్పించెను, బెగ్గిలెన్=భయపడెను.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేసిన తాలసమూహముచేత తలలు పగులఁగా నరములు తెగఁగా నడుములు విఱుగఁగా కాళ్ళుచేతులు బాధపడఁగా నెత్తురు గ్రక్కుచు లోపడుచు చెదరిపోవుచు క్షయించు చున్నదై రాక్షసశూరసమూహము కొమ్మలు పోయిన చెట్లమోడులవలె నయ్యెను. ముఖము తప్పించెను. భయపడెను.

—• సుగ్రీవుఁడు విరూపాక్షు వధించుట •—

ఉ. శిక్షితరాక్షసుండు హరి• శేఖరుఁ డీగతి మీఱితివన్ విరూ
పాక్షుఁడు పేరు వాడుచు శ•తాంగము డిగ్గి గజంబు నెక్కి ప్ర
త్యక్షలయాంతకుం డన వ•నాటుల మార్కొని భానుసూనుపై
రాక్షసు లెల్ల మోదమున• రాజిల నైచెఁ గలంబసంతతుల్. ౨౨౫౦

అర్థములు. శిక్షితరాక్షసుండు = దండింపఁ బడిన రాక్షసుఁ డగువాఁడు, హరిశేఖరుఁడు = వానరశ్రేష్ఠుఁడు, పేరువాడుచున్ = తనపేరు చెప్పుచు, శతాంగము = తేరు, ప్రత్యక్షలయాంతకుం డనఁగన్ = కంటికి గోచరించు ప్రలయకాలయముఁడో యనునట్లు వనాటులన్ = వానరులను, కలంబసంతతుల్ = బాణసమూహములు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు రాక్షసుల నీ ప్రకారము దండించుచు విజృంభింపఁగా విరూపాక్షుఁడు తనపేరు చెప్పుచు తేరు దిగి యేనుఁగు నెక్కి ప్రలయకాలయముఁడు ప్రత్యక్షమయినాఁడా యన్నట్లు వానరుల మార్కొని రాక్షసులు సంతోషింప సుగ్రీవుని మీఁద బాణసమూహము నైచెను.

ఆ. వాని బాణవృష్టి• వనచరపతి నొచ్చి, రూపు గొనిన యేపు•కోప మనఁగఁ
గుజ మొకండు ద్రిప్పి•కుప్పించి యెగిరితద్గజముముఖముమీఁదఁ•దాఁచుటయును.

తాత్పర్యము

ఆ బాణవర్షముచేత సుగ్రీవుఁడు నొచ్చినవాఁడై పరాక్రమము కోపము రూపముగొనె నన్నట్లు చెట్టు నొకటి దీసికొని త్రిప్పి కుప్పించి యెగిరి యేనుఁగు ముఖము మీఁదఁ గొట్టఁగా.

చ. కరివర మా ప్రహారమునఁ• గంపిలి యొక్క ధనుఃప్రమాణమున్
సురిఁగి పిఱిందికిన్ ధరణి•పోలె రవాన్వితమై సురారియున్
గరి విడనాడి ఖేటకము• ఖడ్గమునుం గొని ధీరవర్యుఁ డా
హరిపతిమీఁదికిం బఱవ•నాతఁడు నైచెను బ్రస్తరంబునన్. ౨౨౫౨

## తాత్పర్యము

ఆ దెబ్బచే నాయుత్తమగజము వణఁకి యొక్క బారెఁడు దూరము వెనుకకు వెనుకకుఁబోయి ధ్వనించుచు నేలఁబడెను. ఆ రాక్షసుఁడా యేనుఁగును వదలి డాలు తరవారి తీసికొని ధైర్యశాలియగు సుగ్రీవునిమీఁదికిఁ బరువెత్తఁగా నతఁడు రాతితోఁ గొట్టెను.

ఉ. రాతిని తప్పఁదాఁటి యల♦రాక్షసుఁ డా యినసూతిఁ గత్తిచేఁ
జేతికొలంది మోదఁ ♦ జిక్కని ముష్టి నురంబు నొంపఁగా
వే తరవారి మైమఱువు ♦ వ్రీలఁగఁ జేసియుఁ గాలఁ దన్నినన్. ౨.౨౫౩

అర్థములు. చేడ్పడి = బాధపడి, తేఱి = తెప్పఱిల్లుకొని లేచి, జాతరుషాతిరేకమున = పుట్టిన కోపాతిశయమున, తరవారి = కత్తి, మైమఱువు = కవచము, వ్రీలఁగన్ = పగిలి పడిపోవునట్లు.

## తాత్పర్యము

విరూపాక్షుఁడు రాతిదెబ్బ తప్పునట్లు లెగిరి యావలదూఁకి సుగ్రీవుని కత్తిచేఁ జేతిబలముకొలఁది కొట్టఁగా నతఁడు బాధపడిమూర్ఛపోయి లేచి కలిగిన కోపాతిశయముచే గట్టి పిడికిట వాని ఱొమ్ముమీఁద గ్రుద్దెను వాఁడును వేగముగ కత్తితో సుగ్రీవుని కవచము చీలునట్లు చేసి కాలితోఁ దన్నెను.

ఉ. ధారిణిఁ ద్రెళ్ళి లేచి తల♦తాడితుఁ జేసిన రాక్షసుండు త
ద్ఘోరతరప్రహారమును ♦ ద్రోపుడు పుచ్చి యురంబు మోదినన్
వీరుఁడు సూర్యసూతి తన♦ ప్రే టటు తప్పిన నందు వేచి యా
వైరిలలాటదేశమున ♦ బాఢదృఢోగ్రసుముష్టి గ్రుద్దినన్. ౨.౨౫౪

అర్థములు. తలతాడితున్ = అఱచేతితోఁ గొట్టఁబడినవానిని, ఘోరతరప్రహారమును = భయంకరమైన దెబ్బను, త్రోపుడుపుచ్చి = తొలఁగి పోవునట్లు చేసి, బాఢ, దృఢోగ్రసుముష్టిన్ = మిక్కిలి దృఢమైన మంచి పిడికిట.

## తాత్పర్యము

ఆ దెబ్బవలన నేలఁబడి లేచి యఱచేతితో సుగ్రీవుఁడు రాక్షసునిఁ గొట్టఁగా రాక్షసుఁడా దెబ్బను చమత్కారముగఁ దప్పించుకొని ఱొమ్మున గ్రుద్దెను. వీరుఁడు సుగ్రీవుఁడు తన ప్రేటు తప్పిపోవుటచే సమయము కనిపెట్టి యా విరూపాక్షుని నొసట గట్టి పిడికిట గ్రుద్దెను.

కం. నెత్తురు గ్రక్కుచు దేహము, నెత్తుటఁ దడియంగ వికృత♦నేత్రుం డగుచున్
గుత్తుక మెదలఁగ నూపిరి హత్తినవేదనను ఱొలి♦యవనిం ద్రెళ్ళెన్. ౨.౨౫౫

అర్థములు. వికృతనేత్రుఁడు = వికారములైన కన్నులు గలవాఁడు, ఱొలి = విలపించి.

తాత్పర్యము

నెత్తురు గ్రక్కుచు దేహము నెత్తుటఁ దడియఁగా వికారపుఁజూపులు గల వాఁడై యూపిరి కంఠమున నుండఁగా బాధచేఁ జావుకేక వైచి నేలపై బడెను.

కం. ఇలఁ బడి ప్రక్కలఁ బొరలుచు, విలవిల మని తన్నికొనుచు • వికృతరవంబుల్
బలియించు చెగిరిపడుచో, బలియు విరూపాక్షుఁ బ్లవగ•వర్గము చూచెన్.

అర్థములు. విలవిల మని = ధ్వన్యనుకరణశబ్దములకు వనుధాతువు పరం బగుచో గొన్ని యెడల ముగాగమంబగు. ప్రౌ. వ్యా. సంధి-౯౯ సూ. విలవిల తన్నికొనుచు ననియుఁ జెప్పనగు.

తాత్పర్యము

నేలఁబడి యీప్రక్కకు నాప్రక్కకుఁ బొరలుచు కాళ్ళుచేతులు విలవిల తన్నుకొనుచు వికారధ్వనులు చేయుచు నెగిరిపడుచు నుండఁగా బలవంతుఁ డగు విరూపాక్షుని వానరులు చూచిరి.

కం. ఇత్తెఱఁగున నయ్యసురుఁడు, హత్తిన్ మిత్తిన్ నిశాటు • లగచారులు ను
న్మత్తసురవాహినీగతి, నత్తఱి గనరయ్యె శోక•హర్షాధికతన్. ౨౭౩౬

అర్థములు. మిత్తిన్ హత్తన్=చావఁగా, ఉన్మత్తసురవాహినీ గతిన్ = పిచ్చిపట్టిన గంగవలె, అనఁగా బదరీనారాయణమునకు హరిద్వారమునకు నడుమఁ గొన్నిచోట్ల గంగ దూఁకుచు సుడి దిరుగును. అప్పుడు పిచ్చిపట్టినవాఁడు దేహము తెలియక యెట్టి వికారపుఁ జేష్టలు చేయునో యిట్లు గానవచ్చును. పాఱుడు నీళ్ళు, సుడినీళ్ళు, ఎదురుతన్ను నీళ్ళు అన్ని యొక్కచో గందరగోళముగా నుండును. శోకహర్షాధికతన్=క్రమాలంకారము, నిశాటులు=రాక్షసులు శోకాధికత, వానరులు హర్షాధికత గనరయ్యెను.

తాత్పర్యము

ఈ విధముగ విరూపాక్షుఁడు చావఁగా రాక్షసులు శోకాధిక్యము చేతను వానరు లతి సంతోషముచేతను పిచ్చి గంగవలెఁ గందరగోళపడిరి.

—• ౯౭-వ సర్గము. సుగ్రీవుఁడు మహోదరుఁ జంపుట •—

ఉ. ఈసున రెండుసైన్యములు నేడెఱఁ దాఁకి మహానిదాఘవే
ళాసరసీజలంబు లన•లావు దొఱంగి నశింప, నందు నా
త్మాసురసైన్యదుస్థితి బ•లాఢ్యవిరూపవిలోచనుండు స్వ
ర్వాసము బొంద గాంచి దశ•వక్త్రుఁడు కోపము ముబ్బడింపఁగన్. ౨౭౩౭

అర్థములు. ఈసునన్ = కోపముచే, ఏడ్తెఱన్=పరాక్రమమున, మహానిదాఘవేళా=గొప్ప యెండకాలమందలి, సరసీజలంబులు=కొలనియందలి నీళ్ళు, ఆత్మాసుర సైన్య దుస్థితి = తన రాక్షససేన కష్టదశ, బలాఢ్య = బలసంపన్నుఁ

డగు, విరూప విలోచనుండు = విరూపాక్షుఁడు, వ్యర్వ్యాసముఁబోక = చచ్చుట, ముబ్బడింపఁగన్=మూఁడంతలు కాఁగా.

తాత్పర్యము

కోపముచే రెండు సేనలు పరాక్రమించి యెదురుకొనఁగా మంచి యెండ కాలమందలి కొలని నీటివలె బలము తొలఁగి నశింపఁగా దన సైన్యము యొక్క కష్టస్థితి, వానరుల యుబ్బు, విరూపాక్షుఁడు చచ్చుట చూచి రావణుఁడు కోపము మూఁడంతలు కాఁగా.

కం. గ్రావాలయు లఱుముటయును, దేవారులు విఱుగుటయును ♦ దేఁకువఁ గని చే
తో వేదన గొని వగచెన్, దైవవిపర్యాస మిట్లు♦తనరు ని యనుచున్. ౨౨౫౯

అర్థములు. గ్రావాలయులు=కొండలే యిండ్లు గాఁగలవారు, క్రోఁతులు, విపర్యాసము=వ్యత్యాసము, తలక్రిందగుట.

తాత్పర్యము

కొండలలోఁబడి యుండువారు పైపడి వచ్చుట, దేవతల జయించినవారు చెదరి పోవుట చూచి భయపడి రావణుఁడు ఆహా! దైవమింత దలక్రిందగునా యని మనస్సులో వేదన గొని దుఃఖించెను.

చ. వరబలుఁ డంతఁ జేయలఁతి ♦ వానరముఖ్యులఁ ద్రుంచు నమ్మహో
దరుఁ గని పల్కె నోయలఘు ♦ దర్పనిధీ! విను మజ్జయాశ త్వ
త్కరగత మయ్యె నీబలము ♦ గాఢపరాక్రమ మెల్లఁ జూపి యీ
పరుల వధింపు, వేళ యిది ♦ స్వామిఋణం బఖిలంబు దీర్పఁగన్. ౨౨౬౦

అర్థములు. చేయలఁతిన్ = సమీపమందు, మజ్జయాశ = నేను జయింతు నను నాశ, త్వత్ కరగతమయ్యెన్=నీ చేతిలోనున్నది, పరులన్=శత్రువులను.

తాత్పర్యము

ఉత్తమబలముగల రావణుఁడు సమీపమందు యుద్ధముచేసి వానరముఖ్యులఁ జంపుచున్న మహోదరునిఁజూచి యిట్లనియె. ఓ గొప్ప బలగర్వమునకు స్థానమైనవాఁడా! నేను జయింతు ననునాశ నీ చేతియందున్నది. నీ బలముపరాక్రమము నంతయుఁజూపి యీ శత్రువుల వధింపుము. ఇన్నిదినాలు నా సొమ్ముతినిన యప్పును దీర్చుకొను సమయ మి దే. దీనికే కదా యిన్నిదినాలు మిమ్ముఁ బోషించితిని.

చ. అనవుడు వల్లె యంచు నతఁ ♦ డగ్నిఁ బతంగమువోలె శత్రువా
హినిఁ జొరఁబాఱి జేసినుడు ♦ లెంతయుఁ దోడ్పడ నాత్మశక్తికిన్
వనచరనాథయూథమును ♦ వారక కిట్టి వధింప మర్కటుల్
ఘనకుజశైలసంతతుల ♦ గాటముగాఁ బ్రహరించి రాతనిన్. ౨౨౬౧

అర్థములు. పతంగము = పక్షి.

### తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా నతఁ డట్టులే చేసెదనని యంగీకరించి మిడుత యగ్నిలో బడునట్లు శత్రుసేనయందుఁదూఱి తన శక్తికి రాజవాక్యములు తోడుపడఁగా వానరసేనను సమీపించి చంపఁగా క్రోఁతులు పెద్దచెట్లు కొండలగుంపులచే వానిని చక్కఁగాఁ గొట్టిరి.

సీ. అమ్మహోదరుఁడు రో ♦ షావేశమునఁ దీవ్ర, శరవారముల శై ల ♦ చరుల నెల్ల
భిన్నపాదులుగ సం ♦ భిన్నపాణులుగ ని, కృత్తోరువులుగను ♦ నుత్తరింప
వెఱచి క్రోఁతులు పాఱ ♦ వెఱవకుఁ డంచు సు, గ్రీవుండు వాని భం ♦ గింప నొక్క
విపులపాషాణంబు ♦ విసరివైచిన దానిఁ, దుత్తుమురుగఁ జేయు ♦ తూర్ణముగను
ఆ. గృధ్రచక్ర మనఁగ ♦ గిరగిర దిరుగుచు, ధరణిఁ ద్రెళ్ళఁ గాంచి ♦ తరణిసుతుఁడు
సాల మొండు ద్రిప్పి ♦ చావుము రాక్షసా!, యనుచు వైవ దానిఁ ♦ దునిమె నతఁడు.

అర్థములు. భిన్నపాదులుగన్=విరిగినకాళ్ళుగలవారిగ, సంభిన్నపాణులుగన్ = పఱకఁబడిన చేతులు గలవారిగ, నికృత్తోరువులుగను = కత్తిరింపఁబడిన తొడలు గలవారుగ, ఉత్తరింపన్=ఖండింపఁగా విపుల = వెడల్పైన, పాషాణంబు = ఱాయి, తుత్తుమురు - తుమురు + తుమురు = తుత్తుమురు, మిక్కిలి చూర్ణము, తూర్ణముగను=శీఘ్రముగ, గృధ్రచక్రము=గ్రద్దల సమూహము.

### తాత్పర్యము

ఆ మహోదరుఁడు కోపావేశమున పదునైన బాణసమూహములచే వానరుల నెల్ల కాళ్ళు చేతులు తొడలు విఱిగినవారిగా ఖండింపఁగా వానరులు భయపడి పరువెత్తఁగా భయపడవలదని వారికి ధైర్యము చెప్పి వాని చంప నొక్క పెద్ద బండను విసరివేయఁగా వాఁడు దానిని పొడిపొడిగఁ జేసెను. అది గ్రద్దల సమూహామువలె గిరగిర తిరిగి నేలఁబడగాఁ జూచి సుగ్రీవుఁడు మఱియొక చెట్టు ద్రిప్పి రాక్షసా! చావుమని విసరి వైచెను. దానిని వాఁడు ఖండించెను.

చ. హరిపతి నేల నున్న పరిఘాయుధముం గొని త్రిప్పి యమ్మహో
దరురథసైంధవావళులఁ ♦ దాఁచిన నయ్యవి నేలఁ గూలె వాఁ
డురవడి నేల దూఁకి యొక ♦ యుక్కుగదం గొని, వీరు లిద్దఱుం
బరిఘగదాధరుల్ గెరలి ♦ మార్కొని కోడెలువోలె ఱొప్పుచున్. ౨౨౬౩

అర్థములు. హరిపతి = సుగ్రీవుఁడు, పరిఘాయుధమున్ = ఇనుపకట్ల గుదియను, తాఁచినన్=కొట్టఁగా, ఉరవడి=మిగుల వేగముతో.

### తాత్పర్యము

సుగ్రీవుఁడు నేలపైఁబడియున్న యొక్క యినుపగుదియను దీసికొని మహోదరుని తేరిని, గుఱ్ఱములను గొట్టఁగా నవి నేలఁబడెను. వాఁడు వేగముగా నేల దూఁకి

గొక యుక్కు-గదను దీసికొనెను. ఆ యిరువురు వీరు లొకరు గదను మఱియొకరు గుదియను దీసికొని యెదిరించి హుంకరించుచు.

చ. పెనఁగఁగ నమ్మహోదరుఁడు ♦ భీమగతిన్ గదఁ ద్రిప్పి వైచినన్
దినకరనందనుండు కడుఁ ♦ దీవ్రత నా పరిఘంబు వైచె ని
ట్లనుపమసాధనద్వయము ♦ లాహవభూమిఁ బరస్పరాహతిన్
దునిఁగి ధరాస్థలిం బడినఁ ♦ దూర్ణమ వానరలోకనాథుఁడున్. ౨౨౮

తాత్పర్యము

యుద్ధము చేయుఁగా నా మహోదరుఁడు గదను గిరగిర ద్రిప్పి సుగ్రీవునిపై వేసెను. సుగ్రీవుఁడు పరిఘమును వేసెను. ఆ రెండాయుధము లొకదాని నొకటి కొట్టుకొని విఱిగి నేలఁ బడఁగా వెంటనే సుగ్రీవుఁడు.

సీ. ముసలంబుఁ గాంచన ♦ లసితంబుఁ గైకొని, విసరి వైచిన వాఁడు ♦ వేఱొకండు
గద దాని నడిచిన♦ట్లా రెండునున్ వ్రాలె, నాయుధంబులు వ్యర్థ♦మగుటఁ జేసి
ముష్టియుద్ధమునకు ♦ మొనసి యయ్యిరువురు, మండెదునగ్నుల♦మాడ్కిఁ దనరి
బిగిఁ గిలారించుచు ♦ మొగిని గర్జించి ముష్టిముష్టి కదనంబు ♦ సేయుచుండ

ఆ. నలఘుసారుఁడైన ♦ యసురాధినాయకుం, డనతిదూరవర్తు ♦ లైన ఖడ్గ
ఖేటకములఁ గొన వ♦నాటేశుఁ డట్టుల, వేఱొక త్రిడాలు♦వే గ్రహించె. ౨౨౯

అర్థములు. కాంచన లసితంబు=బంగారుచేఁ బ్రకాశించునది, ముసలంబు= రోఁకలి, కిలారించుచున్ = కేకలు వేయుచు, ముష్టిముష్టి కదనంబు = పిడికిళ్ళ యుద్ధము, ముష్టి ముష్టి=ఒకఁడు ముష్టితోఁ గొట్టిన మఱియొకఁడు ముష్టితోఁ గొట్టి చేయు యుద్ధము - వ్యధికరణబహువ్రీహి; దీనినిగుఱించి ఇదివరకే వ్రాయబడెను. అలఘుసారుఁడు = గొప్ప బలము గలవాడు, అనతిదూరవర్తులు = సమీపమునం దుండునవి, ఖడ్గఖేటకములన్ =తరవారిని డాలును, వనాటేశుఁడు=సుగ్రీవుఁడు - వానరరాజు.

తాత్పర్యము

బంగారుచేఁ బ్రకాశించు రోఁకలి గైకొని విసరివేయుఁగా వాఁడు గదతో దానిని గొట్టెను. అవి రెండు నేలఁబడెను. ఇట్లాయుధములు వ్యర్థములగుటఁ జూచి ముష్టియుద్ధము చేయువారై కిలకిల మని కేకలు వేయుచు మండెడు నగ్నులవలె నొకరినొక నెదిరించి పిడిగ్రుద్దులతోఁ గొట్టుచుండ మిగుల బలవంతుఁడైన రాక్షసుఁడు సమీపమందుఁ బడియుండిన డాలు తరవారులఁ దీసికొనెను. సుగ్రీవుఁడును వెంటనే వేఱొకడాలు తరవారిఁ దీసికొనెను.

మ. కడు విక్రాంతులు కీశరాక్షసులు ఖ ♦ డ్గాఖడ్గి పాటించుచో
గుడిగా మండలచారణంబులను సం ♦ కోచంబు లేకేమియున్

వడిగాఁ జుట్టుచుఁ దాఁకుచున్ మరలుచున్ • శౌర్యంబుమైఁ బోరుచోఁ
జెడుగం డా యసురుండు ఖడ్గమున వై•చెం జర్మమున్ నాటఁగన్. ౨ ౨౬౮

అర్థములు. విక్రాంతులు = పరాక్రమము గలవారు, ఖడ్గాఖడ్గి = ఖడ్గముతోఁ గొట్టఁగా మఱియొకరు ఖడ్గముతోఁ గొట్టుచు యుద్ధము చేయుచో, గుడిగాన్ = గుండ్రముగా, చెడుగండు=దుష్టుఁడు. చర్మమున్ =తోలుతోఁ జేయఁబడినడాలును.

తాత్పర్యము

మిక్కిలి పరాక్రమవంతు లిరువురు కత్తులతో యుద్ధము చేయు సమయంబున గుండ్రముగా మండల ప్రచారములు చేయుచుఁ గొంచెమైన జంకక వేగముగా నొకరి నొకరు చుట్టి తిరుగుచుఁ దాఁకుచు, వెనుకకుఁబోవుచు యుద్ధము చేయుచుండ దుష్టరాక్షసుఁడు డాలునందు నాటుకొనునట్లు తన కత్తితోఁ గొట్టెను.

ఉ. నాటినకత్తి దీయ నద•నంబుగ రాక్షసుఁ డూన నంతలో
హాటకరత్నకుండలస•మంచితమౌ సశిరస్త్రమూర్ధమున్
మీటె దివాకరాత్మజుఁడు • నిస్తులశాతకృపాణధార న
ప్పాట సురారిపాటుఁ గని • పాఱిరి తక్కిన రాక్షసాధముల్. ౨ ౨౬౯

అర్థములు. అదనంబుగ = మిక్కిలి, ఊనన్ = ప్రయత్నము చేయఁగా, హాటక రత్నకుండల సమంచితము = బంగారు, రత్నములు - వీనిచే ప్రకాశించు నదియై, సశిరస్త్ర=తల కవచముతోఁ గూడిన, మూర్ధమున్=తలను, నిస్తుల శాత కృపాణధార=అసమానముగ పదునుగల ఖడ్గముధారచే.

తాత్పర్యము

డాలునం దిఱికికొన్న కత్తిని నూడఁబీకి మిక్కిలి ప్రయత్నము చేయుచుండఁగా నంతలో బంగారు రత్నములుగల కుండలములతోను శిరస్త్రాణముతోను గూడిన తలను దనచేతి కత్తితో సుగ్రీవుఁ డెగురఁగొట్టెను. అప్పుడు రాక్షసుని పాటు చూచి తక్కిన రాక్షసులు పరువెత్తిరి.

కం. ఖరకరసుతుఁ డరిఁ గూలిచి, ఖరకరుఁడు స్వకాంతి వెలుఁగు•కరణి వెలుంగన్
సురయక్షసిద్ధసాధ్యులు, ధరణీభూతంబు లతనిఁ • దద్దయుఁ బొగడెన్.

అర్థములు. ఖరకరసుతుఁడు = సూర్యపుత్రుఁడు, అరిన్ = శత్రువును, ఖరకరుఁడు=వేఁడి కిరణములు గలవాఁడు — సుగ్రీవుఁడు.

తాత్పర్యము స్పష్టము.

## —• ౯౯-వ సర్గము. మహాపార్శ్వుఁ డంగదుచే హతుఁ డగుట •—

సీ. దురమునవిటుమహో•దరుఁడు సుగ్రీవుచే,హతుఁడౌటగనిమహా•ప్రతిఘుఁడయిమ
హాపార్శ్వుఁ డుగ్రసా•యకవితానంబులఁ,గనుపు గొట్టెను వాలి•తనయు బలిమి
బెడిదపుగాలిని•దోడిమి లూడిన రాలు, ఫలములునా నేలఁ • దలలు దొరలెఁ
గొందఱికరములు•గొందఱచరణముల్, కొందఱపార్శ్వముల్ • గూల్చి వైచ

ఆ. వాని తీవ్రబాణ•వర్షంబు నోపక, విముఖ మగుచు శిరము • వ్రేలవైచి
విచ్చె బలఁగమెల్ల • వీరుఁడు తారాసుతుండు చూచి సమర•దోహలమున.

అర్థములు. దుకమునన్ = యుద్ధమునందు, మహాప్రతిఘుఁడు = మిక్కిలి కోపించినవాఁడై, కనుపు గొట్టెను=భంగపఱిచెను, విముఖము=వెనుక ముఖము, సమరదోహలమునన్=యుద్ధకాంక్షచే.

తా త్ప ర్య ము

యుద్ధమందు సుగ్రీవుచే మహోదరుఁడు చావఁగా మహాపార్శ్వుఁడు మిగులఁ గోపించి భయంకర బాణసమూహములచే నంగదుని భంగించెను. మఱియు నోరు గాలికిఁ దోఁడిమ ఊడిపడు పండ్లవలె తలలు నేలఁ దొరలెను. కొందఱ కాళ్ళు కొందఱచేతులు కొందఱప్రక్కలు చీల్చెను. వాని బాణవర్షము సహింపలేక వానరులు మాఱు మొగము పెట్టి తలల వ్రేలవైచి చెదరిపోయిరి. అప్పు డంగదుండు యుద్ధకాంక్షచే.

ఉ. పున్నమవార్ధివోలె మెయి • పొంగఁగఁ బట్టె మొకండు సూర్యతే
జున్నగుదానిఁ ద్రిప్పి సుర•సూదను పైనఁగ వాఁడు సూతుతోఁ
గ్రన్నన నష్టసంజ్ఞుఁ డయి • క్ష్మాస్థలి దొర్లిన జాంబవంతుఁడున్
బన్నగ భీకరాశ్మమున • వానిశతాంగము నుగ్గు సేయుచున్. ౨౨౦

అర్థములు. పట్టెము = కత్తి, సురసూదనున్ = రాక్షసుని, నష్టసంజ్ఞుఁ డయి=మూర్ఛపోయి, భీకరాశ్మమునన్=భయంకరమైన ఱాతిచే, శతాంగము=తేరు.

తా త్ప ర్య ము

పున్నమనాఁటి చంద్రునిబోలె దేహముప్పొంగఁగాఁ సూర్యకాంతిగల కత్తి నొకఁటి దీసికొని త్రిప్పి రాక్షసుమీఁద వేయఁగా వాఁడు సారథితోడ మూర్ఛ పోయి పడెను. ఇంతలో జాంబవంతుఁడు పెద్దఱాతితోఁ గొట్టి తేరిని నుగ్గు చేయుచు.

తే. వాజులను గూల్పఁగా మహా•పార్శ్వుఁ డింత,లోనఁ దెప్పిరి శక్రజ•సూనుమేను
బాణవిద్ధంబుఁ గావించి•బ్రహ్మసుతుని,ఱొమ్ము మూఁడుశరమ్ములఁ•గ్రుమ్మి
మఱియు.

అర్థములు. వాజులను = గుఱ్ఱములను, శక్రజసూనుమేను = అంగదుని దేహము, విద్ధంబు=బాధింపఁబడినది.

తా త్ప ర్య ము

గుఱ్ఱములను జంపఁగా నింతలో మహాపార్శ్వుఁడు తెలివి తెచ్చుకొన్నవాఁడై యంగదుని దేహము బాణములచే బాధించి జాంబవంతుని ఱొమ్ము మూఁడు బాణములచేఁ బొడిచి.

కం. ఋక్షచయనాయకునిని గ,వాక్షుని బహుళాంబకముల • వ్యథపెట్ట సహా
స్రాక్షుని మనుమఁడు క్రుధర,క్తాక్షుండై పరిఘ మొకటి•యలవునఁగొనుచున్.

అర్థములు. ఋక్షచయ నాయకుని = భల్లూకపతి యగు జాంబవంతుని,

బహుళాంకములన్ = అనేక బాణములచే, క్రుధన్ = కోపముచే, రక్తాక్షుండయి = ఎఱ్ఱని కన్నులు గలవాఁడై, పరిఘము = ఇనుపకట్ల గుదియ, అలవునన్ = బలమున, పరిఘ మొకటి గొనుచు, అలవున త్రిప్పి త్రిప్పియని మీఁది పద్యముతో నన్వయము.

తాత్పర్యము

జాంబవంతుని గవాక్షుని ననేక బాణములచే బాధపెట్టఁగా అంగదుఁడు కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి గుదియ యొక్కటి తీసికొని బలముకొలఁది.

ఉ. రక్కసు నుక్కడంపఁగఁ గ•రంబుల రెంటను ద్రిప్పి త్రిప్పి యీ
సెక్కఁగ వైవఁ దద్ధతి మ•హిం బడె బాణముతోడి చాపమున్
జిక్కని తచ్ఛిరస్త్రమును • జేతిశరాసన మూడ వెంటనే
కుక్కడఁగ గ్రుద్దెఁ జెవి•గూ బదరం దల దిమ్ముపట్టఁగన్. ౨.౨౭౩

అర్థములు. ఉక్కడంపఁగన్ = చంపఁగా, తద్ధతిన్ = ఆ దెబ్బచే, శిరస్త్రము = తల కవచము - పాగా, కుక్కడఁగన్ = గుంతపడునట్లు.

తాత్పర్యము

రాక్షసుని జంపు నిమిత్తమై రెండు చేతుల బలముకొలఁది త్రిప్పి త్రిప్పి కోప మతిశయింపఁగా వేయఁగా, నా దెబ్బచే నతఁడు పట్టుకొనిన బాణముతోడి విల్లు దట్టమైన తలజీరా నేలఁ బడెను. చేతివిల్లు నేలఁ బడఁగానే యంగదుఁడు వానిని చెవిగూబ యదరునట్లు తల దిమ్మపట్టునట్లు గ్రుద్దెను.

ఉ. దాన సురారి రోసపడి • దారుణమా పెనుగండ్రగొడ్డలిన్
సూనె మెఱుంగు లీనుచు మ•నోభయదం బగు దాని శైలముం
బోనిబలంబు దానిఁ గయిఁ • బూని వెసం గపివామజత్రుదే
శాన రయోద్ధతిన్ వయివ • శక్రసుతాత్మభవుండు నేర్పునన్. ౨.౨౭౪

అర్థములు. మనోభయదంబు = మనస్సునకు భయము గలిగించునది, శైలముంబోని = పర్వతమువంటి, వామ = ఎడమ, జత్రు = మూపునందలి సంధి యెముక.

తాత్పర్యము

దానిచే రాక్షసుఁడు కోపించి భయంకరమై నిత్యము సూనె రాచుటచే మెఱుఁగులు గలదైన పెద్ద గండ్రగొడ్డలిని, భయంకరమై కొండవంటి బలముగల దానిని చేతఁ బట్టుకొని యంగదు నెడమభుజము సంధియెముక మీఁద మిగుల వేగముగ వేయఁగా నంగదుఁడు దానిని చమత్కారముగ.

తే. తొలఁగ దాఁటుచుఁ బితృతుల్య•బలుఁడు మర్మ
విదుఁడు తారేయుఁ డాగ్రహా•వేశమునను
గట్టిపిడికిలి వజ్రంబు • నట్టిదానిఁ
బూని హృదయంబునను దాఁచెఁ • బూర్వలేఖు. ౨.౨౭౫

అర్థములు. తొలఁగ దాటుచు=తప్పించుకొన నావలికి దాఁటి, పితృతుల్యబలుఁడు = తండ్రితో సమానమైన బలము గలవాఁడు, మర్మవిదుఁడు = యుద్ధ రహస్యము-ఎక్కడఁ గొట్టిన శత్రువు చచ్చునో యా రహస్యము తెలిసినవాఁడు, పూర్వలేఖున్ = రాక్షసుని.

తాత్పర్యము

తప్పించుకొన నావల దూఁకి బలమునందుఁ దండ్రితో సమానుఁడైన యంగదుఁడు యుద్ధమర్మము ఆయువుపట్టులు తెలిసినవాఁడై మిగులఁ గోపించి వజ్రము వంటి గట్టి పిడికిలి పట్టి రాక్షసుని హృదయమున గ్రుద్దెను.

కం. పోటున వసుముఁడు హృదయ,స్ఫోటముగఁ బరాసు వగుచు ♦ భువిఁ గూలఁ ద్రియా
మాటుల సేనలు కళవళ, పాటున సంక్షోభమంది ♦ పాఱం దొడఁగెన్.

అర్థములు. హృదయస్ఫోటముగన్ = గుండెలు పగులఁగా, పరాసువు= ప్రాణము పోయినవాఁడు, త్రియామాటులు=రాక్షసులు.

తాత్పర్యము

ఆ దెబ్బచే గుండెలు పగిలి రాక్షసుఁడు ప్రాణములు పోయి నేలఁ బడఁగా రాత్రించరుల సేనలు కళవళించి క్షోభ చెంది పరువెత్త నారంభించెను.

కం. వానరగర్జలచే లం,కానగరము సాట్టవప్ర ♦ ఘనసౌధం బై
మానక వణంకె ద్రీలెడు. నో నావపు డొప్పె రాక్ష♦సోత్కర మడలన్.

అర్థములు. సాట్టవప్రఘనసౌధంబై=బురుజులతో కోట గోడలతో పెద్ద మేడలతో. అడలన్=ఏడువగా.

తాత్పర్యము

యుద్ధమునకు వచ్చిన ముఖ్యయోధులు నలువురిలో రావణుఁడు తప్పఁ దక్కిన ముప్వురు చచ్చుట చూచి వానరులు సింహనాదములు చేయఁగా నాధ్వనికి బురుజులతో ప్రాకారములతో పెద్దమేడలతో లంకానగరము కూలునో యని రాక్షసు లేడ్చుచుండఁగా గడగడ వడఁకెను.

కం. నాకౌకోనాదములు వ,నౌకోగర్జలను జెరయ ♦ నుత్కటరోష
వ్యాకులుఁ డయి వింశతిభుజుఁ, డేకోద్యముఁ డగుచు నడచె♦వృక్షాటుల పై.

అర్థములు. నాకౌకోనాదములు=ఆకాశమున దేవతల ధ్వనులు, వనౌకోధ్వనులు=భూమియందు వానరుల ధ్వనులు, ఉత్కట రోషవ్యాకులుఁడై = అధిక రోషముచే గలఁత చెందినవాఁడై, వింశతిభుజుఁడు=ఇరువది చేతులు గలవాఁడు-ఏకోద్యముఁడు = ఒకటే ప్రయత్నము గలవాఁడు, వృక్షాటులపైన్ = వానరుల మీఁద, వనౌక శ్శబ్దము నిత్యసమాసము, వన + ఓకస్ - కావున నిందలి ఓకారమునకు ఉత్కటశబ్దములోని ఉకారమునకు యతి-నిత్యసమాసము లుభయ యతులలోఁ జేరినవి.

[కం. లోకంబునఁ గర్ణాట వ, నౌకో ద్వీపాంత దీప ♦ నాస్తి పదార్థా
న్యేకా న్యోన్యజనార్దన, నాకాదులు నిత్యసమస♦నము లంద్రు బుధుల్-అప్పకవి]

తాత్పర్యము

ఆకాశమున దేవతల సంతోష ధ్వనులు, భూమియందు వానరుల సింహ నాదములు కలిసికొనఁగా(అనఁగా వీరి ధ్వనులు వారికి వారిధ్వనులు వీరికి, వినవచ్చె నని భావము) మిగుల రోషముచే రావణుఁడు కలఁత నొందిన మనస్సు గలవాఁడై వానరులమీఁదికిఁ బోయెను.

## —♦ ౧౦౦-వ సర్గము. రావణుఁడు కపులఁ బొలియించుట ♦—

సీ. ప్రబలశౌర్యులు మహా♦పార్శ్వమహోదరు, లతులధీరుఁడు విరూ♦పాక్షుఁ డట్లు
హతులైన దుర్విష♦హ్యాగ్రహంబున రథ, చోదకు నిట్లను ♦ శూరులైన
మంత్రులు చచ్చిన ♦ మహితదుఃఖంబును, రుద్ధపురార్తియు ♦ యుద్ధభూమి
మడియించి రామల♦క్ష్మణులఁ బోకార్చెదఁ, దోలుమీ రథమతి♦తూర్ణముగను
ఆ. హరిజవిధిజకుముద♦హనుమన్నలాంగద, ద్వివిదమైందముఖ్య ♦ వృక్షచారు
లనెడుకొమ్మలమరు♦నవనిజాసుమఫల,ప్రదము రామకుజముఁ♦బడఁగ నడుతు.

అర్థములు. దుర్విషహ్య=సహింపరాని, అగ్రహంబున=కోపముచే, రథ చోదకున్=సారథిని, రుద్ధపురార్తియు = అడ్డగింపఁ బడిన పురమువలనఁ గలిగిన వ్యసనము, హరిజ = సుగ్రీవుఁడు, విధిజ = జాంబవంతుఁడు, అవనిజా సుమ ఫల ప్రదము=సీత యనెడి పూలు పండ్లు గలది, రామకుజము=రాముఁ డనెడి చెట్టు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు జాంబవంతుఁడు కుముదుఁడు హనుమంతుఁడు నలుఁడు నీలుఁడు అంగదుఁడు మైందద్వివిదులు వీరు మొదలుగాఁగల వానరవీరు లనెడి కొమ్మలు గలిగి, సీతయనెడి పువ్వు పండ్లుగల రాముఁ డనెడి చెట్టును నేలఁ బడఁగొట్టెదను. సావయవరూపకము

ఉ. సారథియున్ రథంబు రథ♦సంబునఁ దోలె రథాంగనిస్స్వనం
బారదశాసమూహముల♦యందుఁ బ్రతిధ్వను లుబ్బుచుండఁ గాం
తారనదీమహీధరక♦దంబసమేతవసుంధరాతలం
బారవపూర్ణమై వణఁకె ♦ నంబుధి వేల నతిక్రమింపఁగన్ ౨౨౮౧

అర్థములు. రథసంబుగన్ = వేగముగ, రథాంగనిస్స్వనంబు=చక్రముల ధ్వని, ఆరన్=నిండఁగా, కాంతార = అడవులతోను, నదీ = నదులతోను, మహీధర=కొండలయొక్క, కదంబ=సమూహముతోను, సమేత = కూడిన, వసుంధరాతలంబు=భూప్రదేశము, ఆరవపూర్ణమై=ధ్వనిచే నిండినదై, అంబుధి=సముద్రము, వేలన్=చెలియలికట్టను.

తాత్పర్యము

సారథియుఁ దేరిని శీఘ్రముగఁ దోలెను ఆ చక్రముల ధ్వని దిశలందుఁ బ్రతిధ్వను లిచ్చుచుండెను. అడవులతోను నదులతోను కొండలతోను గూడి భూమి వణఁకెను. సముద్రము చెలియలికట్ట దాఁటి భూమిమీఁదఁ బొరలెను.

కం. తామసుఁ డగు దశవక్త్రుఁడు, తామసపడ కా ప్లవంగ ♦ తతిపై నేసెన్
దామసబాణవరంబును, దా మసిఁ జేయంగఁ బూని♦తత్సైన్యంబున్. ౨౨౮౧

అర్థములు. తామసుఁడు = తమోగుణము ప్రధానముగాఁ గలవాఁడు, తామస పడక = ఆలస్యము లేక, తామస బాణవరంబును=తామసమను పేరుగల యస్త్రమును, మసి = బూది.

తాత్పర్యము

తమోగుణము ప్రధానముగాఁగల రావణుఁడు వానరసైన్యము దగ్ధముచేసి బూడిద చేయఁదలచి యాలసింపక తామసాస్త్రమును వానరసేనమీఁదఁ బ్రయోగించెను.

ఉ. ధాతృవినిర్మితం బయిన ♦ దారుణమార్గణ మాఁగరాక త
ద్భీతికరార్చులం బ్లవక ♦ వీరతతిన్ దహియింపఁగా సమి
ద్భూతలముం దొఱంగి కపి ♦ పుంగవు లొక్కటఁ బాఱఁ దద్రజో
వ్రాతము కప్పెఁ జీఁకటులు ♦ పర్వ నిరంతర మక్షిరోధమై. ౨౨౮౨

అర్థములు. ధాతృ వినిర్మితంబు=బ్రహ్మచే నిర్మింపఁబడినది, ఆఁగరాక = అడ్డగింప సాధ్యపడక, తద్భీతికరార్చులన్ = ఆ భయంకర జ్వాలలచే, సమిత్ + భూతలము = యుద్ధభూమి ప్రదేశమును, తొఱంగి = విడిచిపోయి, తద్రజో వ్రాతము=ఆ దుమ్ము సమూహము, అక్షిరోధమై=కన్నుల నడ్డగించినదై.

తాత్పర్యము

బ్రహ్మ కల్పించిన యా యస్త్రము నివారింపరానిదై భయంకర జ్వాలలచేత వానర సేనను కాల్పఁగా వానరులు యుద్ధభూమి విడిచి పరువెత్తఁగా నా దుమ్ముచేఁ జీఁకటులు వ్యాపించి కన్నులు కానరాకుండఁ జేసెను.

కం. దానవుఁ డస్త్రమున ననే, కానీకములన్ దహించి ♦ యవనిం గలుపన్
గానీరా యని మహిజా,జాని శరాసనము గ్రహించె ♦ సంగరకాంక్షన్. ౨౨౮౩

అర్థములు. అనేకానీకములన్=అనేకములగు ననీకసంఖ్యగల వానరులను.

తాత్పర్యము

రావణాసురుఁ డస్త్రముచే ననేకములైన యనీకసంఖ్యగల సేనలను కాల్చి నేలపాలు చేయఁగా శ్రీరామచంద్రమూర్తి కానీరా యని యుద్ధకాంక్షచేత విల్లందుకొనెను.

## —• శ్రీరామ రావణ యుద్ధము •—

సీ. ఈలోన నసురుఁ డు•పేంద్రయుతుం డైన, శక్రునిఁ బోలి ల•క్ష్మణునితోడ
నిలిచి కేలను మహా•నిరుపమధను వూని, మింటను లిఖయించు • దంటవోలెఁ
దనరారు నీరేజ•దళవిశాలాక్షుని, నాజానుబాహుఁ గా•లాంతకాభుఁ
గదియ రాముండును•గపిసంఘములచేతఁ, బంక్తివక్త్రుఁడు వచ్చు•భంగిఁ గాంచి
ఆ. కుంది ముదము నొంది • కోపరక్తాక్షుఁ డై
చాప మెత్తి భూమి • శకలములుగ
గుణము మీటుటయును • గోఁతులు రక్కసుల్
గుములు గుములు గాఁగఁ • గూలి రపని. ౨౩౮

అర్థములు. నీరేజదళ విశాలాక్షుని = కమలము రేకులవలె విశాలము లైన కన్నులు గలవాని. ఆజానుబాహున్ = మోఁకాటినంటు చేతులుగలవానిని, ఈ యుద్ధసమయమున నీ సౌందర్యవర్ణన మప్రస్తుతమని తలంపగాదు. ఇంతటి సౌందర్యము గలవానిని జూచినంతనే సాష్టాంగపడి సేవించి బాగుపడుటకు మాఱు యుద్ధము చేయవచ్చెనే రావణుఁ డెంత నిర్భాగ్యుఁడని తెలుపుటకై యీ వర్ణనము చేయఁబడెను. కాలాంతకాభున్ = ప్రలయకాలమందలి యమునితో సమానుని, తక్కిన కాలములందు యముని రావణుఁడు గెల్చినవాఁడే, శివుని గెల్చినవాఁడే. ప్రలయకాలమం దట్లు జయింప సాధ్యపడదు. అట్టివానితో సమానుఁడు. కావున ఆ పరాక్రమము తలంచియైన రావణుఁడు రామచంద్రుని సేవించి యుండవచ్చును. అట్లును జేసినవాఁడు కాఁడు. శకలములుగన్=తునుక లగునట్లు, గుణము=అల్లెత్రాడు

### తాత్పర్యము

ఇంతలో రావణుఁడు విష్ణువుతోఁ గూడిన యింద్రునివలె లక్ష్మణునితోఁ గూడి యసమానమై గొప్పదై యాకాశమంటు వింటిని జేత ధరించి యొప్పుచున్న తామర రేకులవంటి విశాలమైన కన్నులు గలవానిని, మోఁకాళ్ళనంటు చేతులు గలవానిని, ప్రలయకాల యమునివంటి వానిని సమీపింపఁగా వానరుల చేతు, రావణుఁడు పడెడిపాటు, వాఁడు వచ్చిన తీరు చూచి వానరులకై దుఃఖించి యున్నాళ్ళకు రావణుఁ డెదురుపడెఁగదా యని సంతోషించి కోపముచేఁ గన్ను లెఱ్ఱజేసి విల్లెత్తి భూమి తునుక లగునట్లు అల్లెత్రాడు మీటఁగా వానరులు రాక్షసులు గుంపులు గుంపులుగా నేలమీఁదఁ బడిరి.

కం. ఆ రాజశేఖరాత్మజు, నా రాచపథంబుఁ దఱిసి • నాళీకాప్తా
బ్జారుల డాసిన రాహువు, నా రజనీచారలోక•నాథుం డుండెన్. ౨౩౯

అర్థములు. ఆ రాజశేఖరాత్మజు = రాజశేఖరుని కుమారుఁ డగు రాముని తఱిసి=సమీపించి, నాళీకాప్త = సూర్యుని, అబ్జారులన్ = చంద్రుని, డాసిన =

సమీపించిన, రజనీచారలోకనాథుఁడు = రాత్రించరులైన రాక్షసుల సమూహము నకు ప్రభువు, సూర్యచంద్రుల సమీపించిన రాహువు అనుటచే కొంచెము కాలము రామలక్ష్మణులకుఁ గష్టము కలిగినను జయము వారికే యని భావము.

తాత్పర్యము

ఆ రాముని సమీపించి రావణుఁడు సూర్యచంద్రుల సమీపించిన రాహువు వలె నుండెను.

చ. తొలుత రణంబు సేయుతమిఁ ♦ దూర్ణము లక్ష్మణుఁ డా నిశాటుపై
జ్వలదనలాభ శాతశర♦జాలముఁ గప్పిన వాని నన్నిటిన్
బలియుఁడు రావణుండు కర♦పాటవ మేర్పడ నొంటి నొంట మూఁ
డలుగుల మూఁటిచేఁ బదిట ♦ నన్నిశరంబులఁ ద్రుంచె వ్రేల్మిడిన్. ౨.౨౧౬

అర్థములు. తమిన్=కోరికతో, జ్వలత్ = మండుచున్న, అనలాభ = అగ్నితో సమానమైన, శాతశరజాలము = వాఁడిగల బాణసమూహము, కరపాటవము = చేతిసామర్థ్యము, వ్రేల్మిడిన్=అల్పకాలములో.

తాత్పర్యము

మొదటఁ దాను యుద్ధముచేయు కోరికతో వేగముగ లక్ష్మణుఁ డా రాక్షసునిమీఁద అగ్నివలె మండుచున్న బాణములు వేయఁగా బలవంతుఁ డగు రావణుఁడు హస్తలాఘవమున నొక బాణమును నొక బాణముతో, మూఁటిని మూఁటితోఁ, బదిని పదింటితోఁ ద్రుంచెను.

చం. అతని నతిక్రమించి గిరి♦యట్ల చలింపకయున్న రాముపై
శితవిశిఖోత్కరంబులను ♦ జెచ్చెర వైచిన భల్లమూని త్క్ష్మా
పతితనయుండు సర్వశర ♦ వార మణంచి నిశాచరేంద్రుపై
శతములు నారసంబులు ప్ర♦శస్తగతిం బరఁగించె నేర్పునన్. ౨.౨౧౭

తాత్పర్యము

ఇట్లు లక్ష్మణు బాణములు ఖండించి యాయనను దాఁటుకొని కొండవలెఁ గదలకయున్న రాముమీఁద వాఁడి బాణసమూహములను వేగముగ వేయఁగా రామచంద్రభూపాలుఁ డొక్క బాణముచే వాని నణంచి రావణుమీఁద నూర్లు కొలఁది బాణముల వైచెను.

శా. కాండీరద్వయ మద్వయాద్భుతలస♦త్కాండప్రకాండంబు కో
దండారావవిభిన్నదిక్తటముగా ♦ దర్పించి వైవంగ బ్ర
హ్మాండాంతర్గతభూతసంచయము హా♦హాకారపూర్ణాస్యమై
మెండౌ క్రోశ మొనర్చె గుండె లదరన్♦మేడ్పాటు గాంచెం ద్రుటిన్. ౨.౨౧౮

అర్థములు. కాండీరద్వయము=ఆ బాణముల పట్టినవారి జంట, అద్వయ= అసమానమైన, అద్భుత=ఆశ్చర్యకరమైన, లసత్ = ప్రకాశించు, కాండ=బాణ

ముల, ప్రకాండంబు=సమూహము, కోదండారావ=వింటిధ్వనిచే, విభిన్న = పగిలిన, దిక్తటముగాన్ = దిక్కుల ప్రదేశములు గలదిగా, బ్రహ్మాండాంతర్గత = బ్రహ్మాండము లోపలనుండు భూతసంచయము=ప్రాణి సమూహము హాహాకారపూర్ణాస్యమై=హాహాకారములతో నిండిన నోళ్ళుగలదై, ఆక్రోశ మొనర్చెన్ = ఏడ్చెను, మేడ్పాటు=స్మృతి తప్పుట.

### తాత్పర్యము

ఆప్రకాండిరువురు ననమానమై యద్భుతమై ప్రకాశించు బాణ సమూహమును వింటి ధ్వనిచే దిక్కులు పగిలిపోవునట్లు వేయఁగా బ్రహ్మాండములో నుండు జీవకోటులు హాహా యనుచు నేమ్చుచు నేమియుఁ జేయుటకుఁ దోఁపక యుండెను.

ఉ. సంతతసంప్రయుక్తశర ♦ జాల మఖర్వగతిన్ నభస్స్థలిన్
బంతులు గట్టి పాఱఁగను ♦ వార్షిక వారిధరాళి చంచలా
సంతతిదీప్తమై పఱచు ♦ చందమువీాతె గవాక్షముల్ దివిన్
దొంతర గూడెనో యనఁగఁ ♦ నోఁచె శిలీముఖపంక్తు లయ్యెడన్. ౨౨౯

అర్థములు. సంతత = ఎడఁ దెగక, సంప్రయుక్త=ప్రయోగింపఁ బడిన, శరజాలము=బాణసమూహము, అఖర్వగతిన్ = మిగుల వేగముగ, నభస్ + స్థలిన్=ఆకాశ ప్రదేశమందు, వార్షిక వారధరాళి= వర్షాకాల మేఘములవరుస, చంచలా=మెఱుపుల యొక్క, సంతతిన్=సమూహముచే, దీప్తమై = వెలుఁగుచున్నదై, గవాక్షముల్=కిటికీలు, దొంతరగూడెనో=వరుసగాఁ గూడెనో, శిలీముఖపంక్తులు=బాణముల వరుసలు.

### తాత్పర్యము

విడువక విరామము లేక వారు ప్రయోగించు బాణసమూహములు ఆకాశమందు బారులు గట్టి పాఱఁగా మెఱుపులతోడ వానమబ్బులు పోవునట్లుండెను. ఆ బాణముల నడిమి సందులు ఆకాశమున కిటికీ లేర్పఱచినట్లుండెను.

చ. అతులజవంబులై శితము ♦ లై మఱి గ్రద్దఱెకల్ చెలంగు నా
యతిరథముక్తనాయక చ ♦ యంబులు పర్వఁగఁ బ్రొద్దు గ్రుంకినన్
దత మగుమబ్బు గ్రమ్మినను ♦ దట్టపుఁజీఁకటి వ్యాప్త మానటుల్
క్షితి పొలుపారె, విరజన ♦ శేఖరు లిద్దఱు నప్పు డుగ్రులై. ౨౩౦

అర్థములు. అతులజవంబులై = అసమానవేగము గలవై, శితములై = వాఁడులై, గ్రద్దఱెకల్=గ్రద్దయీఁకెలు ఱెక్కలుగాఁ గలవై, అతిరథ=అతిరథులచే, ముక్త=విడువఁబడిన, నాయకచయంబులు=బాణసమూహములు.

### తాత్పర్యము

మిగుల వేగము వాఁడిమి గ్రద్ద ఱెక్కలుగలవై యా యతిరథులచేత విడువఁబడిన బాణములు సూర్యుఁడస్తమింపఁగా మేఘములు దంటిగ నావరింపఁగా కాఱు

చీఁకట్లు గ్రమ్మినట్లు భూమి యయ్యెను. అప్పుడు వీరశ్రేష్ఠు లిరువురు నుగ్రులై—పెక్కు విలుకాండ్రతోఁ బోరు వీఁడు అతిరథుఁ డనఁబడును.

చ. కదిసి పరస్పరక్షణన • కాంక్ష బలారియు వృత్రదైత్యుఁడున్
గదనము సేయుభంగిఁ గర•కౌశల మొప్ప నచింత్యమున్ దురా
సదముగ నస్త్రశస్త్రసువి•శారదు లుగ్రశరాసనుల్ భయ
ప్రదబలధుర్యవర్యులు దు•రం బొనరించిరి రామరావణుల్. —౩౧

అర్థములు. పరస్పర క్షణన కాంక్షన్ = ఒకరి నొకరు చంపు కోరికతో, అచింత్యము=ఊహింపరానిది, దురాసదము=పొందరానిది, భయప్రద=భయము కలిగించు, బలధుర్యవర్యులు = మహాబలవంతులలో శ్రేష్ఠులు.

తాత్పర్యము

ఒకరి నొకరు చంపవలయునని రామరావణులు ఇంద్రవృత్రులవలెయుద్ధము సేయువిధము వారి కరలాఘవము చూడ నిట్లగునని యూహింపరాకుండెను. ఇంతవఱ కిట్లు యుద్ధము చేసినవారు లేకుండిరి. ఇరువురు నస్త్రశస్త్ర ప్రయోగములఁ దెలిసినవారు. ఇరువురు భయంకరములైన విండ్లు ధరించినవారు. ఇరువురు భయంకరమైన మహాబలము గలవారు.

కం. వాతహతిఁ గంధిభంగ, వ్రాతం బుప్పొంగురీతి • వారలశరసం
ఘాతంబు వారు చనియెడు, నా తెరువుల వరుస వరుస • లై ప్రసరించెన్.

అర్థములు. వాతహతిన్ = గాలిదెబ్బచే, కంధిభంగ వ్రాతము = సముద్రమునందలి యలలసమూహము.

తాత్పర్యము

తుపాను గాలిదెబ్బచే సముద్రమునందలి యల లుప్పొంగునట్లు వారి బాణముల సమూహములు వారు పోయెడి మార్గముల వరుసలు వరుసలై వ్యాపించెను. ఇరువురు పోయెడు తెరువు లనుటచే రామచంద్రమూర్తి పాదచారియైనను నొక్కచోటనే నిలఁబడి యుండలేదనియు వాఁడు రథమునఁ దిరిగినట్లే తానును వేగముగ మండలాకారముగఁ దిరుగుచుండెననియు గ్రాహ్యము.

ఉ. రక్కసమూఁకఱేఁడు నిజ•రౌద్రశరాసనముక్త బాణముల్
చక్కని రేంద్రఫాలతల•సంధిని లీలఁగవైవ నించుకేన్
లెక్కగొనండు రాముఁడు స•వీలవినీలకువాలపంక్తినా
స్రుక్కక తాల్చె రోషమున • రుద్రమనూజ్జ్వల బాణసంతతుల్. —౩౩

అర్థములు. నిజ = తన, రౌద్రశరాసన ముక్త బాణముల్ = రౌద్రాస్త్రముతోఁ గూడిన వింటినుండి విడువఁబడిన బాణములు, అనఁగా రౌద్ర మంత్రములచే మంత్రించి విడువఁబడిన బాణములు, సలీల = అందముతోఁ గూడిన,

వినీల = నల్లని, కువాల=కలువల, పంక్తినాన్=వరుసయో యన్నట్లు,రుద్రమను=రుద్రమంత్రముచే, ఉజ్జ్వల=ప్రకాశించు, బాణసంతతుల్=బాణసమూహములు.

తాత్పర్యము

రాక్షసరాజు రౌద్రమంత్రముచే మంత్రింపఁబడిన బాణములను రామచంద్రుని కనుబొమలనడుమ నాటునట్లు ప్రయోగింపఁగా రామచంద్రమూర్తి వానిని లక్ష్యముసేయక వానిని నల్లకలువల వరుసలవలె ధరించి రోషించి రుద్రమంత్రముచే నభిమంత్రింపఁబడిన బాణములను.

చ. ధనపతితమ్ము నేయుటయుఁ ♦ దద్విశిఖంబు లవధ్యవర్మమున్
జెనకి వృథా మహిం బడిన ♦ శీఘ్రకరుం డఖలాస్త్రవేది యా
దనుజులలాట దేశము వి ♦ దారితమై గొనబేద నేసె ధా
రణిపుతనాథుఁ డేను ప్రద ♦ రంబులఁ బంచముఖాహు లట్లుగన్. ౨౨౯౪

అర్థములు. ధనపతి తమ్మున్ = కుబేరుని తమ్ముని, అవధ్యవర్మమున్ = అభేద్యకవచమును, గొనబేదన్=అందము చెడునట్లు, ఏను ప్రదరంబులన్ = ఐదు బాణములను, పంచముఖాహులట్లు=ఐదు తలల పాములవలె.

తాత్పర్యము

రావణుపై నేయఁగా నా బాణము లభేద్యకవచమును దాఁకి వ్యర్థములై క్రిందఁబడగా చుఱుకుగఁ బనిచేయఁ గలట్టియు సర్వాస్త్రముల నెఱిఁగిన రామచంద్రమూర్తి యా రాక్షసునినొసలు చీలి కాంతి మాయునట్లు ఐదుతలలపాముల వలె నైదు బాణములను వేసెను.

కం. వెండియు శర మేసిన సుర,ఖండనుఁ డది త్రుంచి వైచి ♦ కలుషాత్మకుఁ డై
చండాసురాస్త్ర మేసెను, దండిజవంబునను రోష ♦ తామ్రాక్షుండై. ౨౨౯౫

తాత్పర్యము

మఱియు నొక బాణము వేయఁగా దానిని రావణుఁడు కొట్టి యా పాపాత్ముఁడు కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై మిగుల వేగముగ నాసురాస్త్రము వైచెను.

సీ. పంచాస్య శార్దూల ♦ వాయసదక్షాయ్య, ఖరగృధ్రపోత్రిసృ ♦ గాలపంచ
వదనభుజంగమ ♦ వదనబాణంబులు, సింహమృగాస్యముల్ ♦ వృశ్చికాండ
జాతకుక్కుటనక్ర ♦ సారమేయముఖంబు, లగు పెక్కుబాణంబు ♦ లసురుఁ డేయ
వచ్చెడు నసురాస్త్ర ♦ వరముఁ గనుంగొని, రాముండు వహ్నిశ ♦ రంబు వైవ

ఆ. నగ్నిదీప్తముఖము ♦ లర్కముఖంబులు, నర్ధచంద్రశీత ♦ లాంశుముఖము
లుడుమృగాస్యములును ♦ నుల్కాముఖంబులు, కేతువక్త్రిములును ♦ నాతతముగ.

అర్థములు. పంచాస్య=సింహము, శార్దూల = పులి, వాయస = కాకి, దక్షాయ్య=రాపులుఁగు, ఖర = గాడిద, గృధ్ర=గ్రద్ద, పోత్రి=పంది, సృగాల=

నక్క, పంచవదన భుజంగమ=ఐదు తలల పాములు, వదన బాణంబులు = వీని ముఖములు గల బాణములు, ఈహామృగాస్యముల్=తోడేళ్ళ ముఖముగల బాణములు, వృశ్చిక=తేళ్ళు, అండజాత = పాములు (ఒంటితలవి), నక్ర = మొసలి, సారమేయ=కుక్క, ముఖంబులు = వీని ముఖము గలవి, అసురాస్త్రమునం దివి యన్నియుఁ బుట్టినవని భావము. వహ్నిశరంబు = ఆగ్నేయాస్త్రము, అగ్నిదీప్త ముఖములు = అగ్నివలె మండుచున్న ముఖములు గలవి, అర్క-ముఖంబులు = సూర్యునివంటి ముఖములు గలవి, అర్ధచంద్రముఖములు, శీతలాంశుముఖములు = పూర్ణచంద్రముఖములు, ఉడు = నక్షత్రములు, ఖగ=గ్రహములు, ఆస్యములు = అటువంటి ముఖము గలవి ఉల్కా-ముఖంబులు = కొఱవివంటి ముఖములు గలవి, కేతువక్త్రములును=కేతువువంటి ముఖములు గలవి.

## తాత్పర్యము

రావణుఁడు అసురాస్త్రము వేయఁగా సింహము పులి మొదలైన జంతువుల ముఖములుగల బాణములు దానిలోనుండి వెలువడి రాఁగా రామచంద్రమూర్తి యాగ్నేయాస్త్రము ప్రయోగింపఁగా దానినుండి సూర్యచంద్రాగ్ని గ్రహాదుల ముఖములుగల బాణములు.

కం. జనియించి వానినన్నిటి,వినువీధి హరింప నంద • విలయం బొందెన్
వనచరులు పొంగి యార్వఁగ,వనచరనాథాదు లధిపు•బలసి భజింపన్. ౨ ౪౮

అర్థములు. జనియించి=పుట్టి, వినువీధిన్ = ఆకాశమందు, వనచరనాథాదులు=సుగ్రీవుఁడు మొదలగువారు, బలసి=చుట్టుకొని.

## తాత్పర్యము

పుట్టి వాని నన్నిటిని నాకాశమందే నాశము చేసెను. వానరులు సంతోషించి యార్చిరి.సుగ్రీవుఁడు లోనగువారు రామచంద్రమూర్తిని జుట్టి సేవించుచుండిరి.

కం. రావణముక్తశరంబును, భూవిభుఁ డిటు లణఁగఁ జేసి • ముదమున వఱలెన్
రావణుఁడును దనయస్త్రం,బీవిధిహతమైనఁ గోప•మినుమడిగాఁగన్ ౨ ౪౯

అర్థములు. రావణముక్త శరంబును = రావణుచే విడువఁబడిన బాణము, ఈవిధిన్=ఈవిధమున, హతమైనన్=నాశము కాఁగా, ఇనుమడి=రెండంతలు.

## తాత్పర్యము స్పష్టము

## —• ౧౦౧-వ సర్గము. శ్రీరామ రావణులు దివ్యాస్త్రంబులఁ బోరుట •—

చ. మయవిహితంబు రౌద్రమగుమార్గణ • మొండు గుణంబు గూర్చి దు
ర్జయుఁ డగురాముపైఁ బఱపఁ • గ్రచ్చఱ శూలగదాముసుంఠులా
లయసమయప్రవాతముల•లాగున ముద్గరకూటపాశసం
చయములతోడ వెల్వడును • సర్వమహాస్త్రవిదుండు రాముఁడున్. ౨ ౫౦

అర్థములు. మయవిహితంబు = మయునిచే నేర్పాటు చేయఁబడినది. రౌద్రము=రుద్ర దేవతాకము, గుణంబున్ =అల్లెత్రాటియందు, దుర్జయుఁడు= జయింపరానివాఁడు, ముసుంఠి = కొయ్యగుదియ, లయసమయ ప్రవాతముల = ప్రలయకాల మందలి మహావాయువుల, ముద్గర = ఇనుపగుదియలు, కూట = మోసపు, పాశసంచయము=పాశముల సమూహము.

తాత్పర్యము

మయుఁడు నిర్మించిన భయంకరమైన రౌద్రాస్త్రమును వింట సంధించి జయింపరాని రామచంద్రునిపై వేయఁగా దానినుండి శూలములు గదలు కొయ్య గుదియలు ప్రలయకాల మహావాయువులవలె బయలుదేఱి రాఁగా సమస్తాస్త్రములు దెలిసిన రామచంద్రమూర్తి.

కం. బంధురజవసంయుతుఁడై, గాంధర్వాస్త్రంబుఁ దనదు•కార్ముకమందున్
సంధించి వైచి దాని సు,ధాంధసు లచ్చెరువఁ ద్రుంచె•నాక్షణమందున్. ౨౬౦౦

అర్థములు. బంధుర జవసంయుతుఁడై = విశేష వేగముతోఁ గూడినవాఁడై, సుధాంధసులు=దేవతలు. అమృత మాహారముగాఁ గలవారు.

తాత్పర్యము

మిగుల వేగముగ గాంధర్వాస్త్రము ప్రయోగించి దేవత లాశ్చర్యపడునట్లు దాని నఱఁచెను.

మూల బలమును ఖరాసురాదులను నాశము చేసినపుడు గంధర్వాస్త్రము ప్రయోగించినట్లు చెప్పఁబడెను. దీనివలన ననేకరాములు రావణునకుఁ దోచినట్లు చెప్పబడలేదు. కావున మూలబలవధ మందును బెక్కు-రాములు గానవచ్చుట గమనవేగముననే కాని యస్త్రబలము చేతఁ గాదు. ఇంద్రజాలము చేత గాదు.

సీ. ప్రతిహతం బగుడు న•స్త్రం బౌదు గఱచుచు, శూరాస్త్రమేసె దా•శరథివీరుఁడఁ
జక్రసంతతులతోఁ • జనుదెంచు నద్దాని, దివి యెల్ల వెలిఁగించు • తేజుదానిఁ
బుష్పవంతులఁబోలి•పొలుపు దాల్చినదాని, రాముండు శరపాళి•నాము మఱఁచె
నదియును వాత మైనఁ•బడిబాణముల రాము, మర్మముల్ నొప్పింప•ధర్మశీలుఁ
తే. డించుకేనియు సుక్క-క•యిషునికాయ ములను రావణు నొప్పించె•నలవుమెఱసి
యంతలోలక్ష్మణుఁడు తన•యన్న తోడ,సరిగఁబోరెడి యసురేంద్రు•చండమరసి.

అర్థములు. ప్రతిహతంబు = కొట్టఁబడినది, బౌదు = పెదవి, చక్రసంతతులతో = చక్రసమూహములతో, పుష్పవంతులన్ = సూర్యచంద్రులను, 'ఏకయోక్త్యా పుష్పవంతౌ దివాకరనిశాకరౌ'- అమరము, శరపాళిన్=బాణ సమూహముల చే, మర్మముల్=ఆయువుపట్టులు, ఇషునికాయములను = బాణ సమూహములను, అలవు = బలము, అంతలో = ఇట్లు నొప్పించి శ్రమము తీర్చుకొనునంతలో- ఈ విరామకాలములో- రామచంద్రమూర్తి అలసట తీర్చుకొనుటకై

యూరకొన్న సమయమున నని యర్థము. అటుగాక రామునితోడ లక్ష్మణుఁడును కలసి యుద్ధము చేసియుండెనేని యీ నడుమనని చెప్పఁ గారణము లేదు. ఇట్లు వ్యాఖ్యానింపకుండిన ఒకనితో యుద్ధము చేయునపుడు వేఱొకఁ డెట్లు నడుమఁదూఱి కొట్టెనని దోష మారోపింపవలసివచ్చును. ఇరువురు కలిసి యొకనిఁ గొట్టుట దోషము కదా. అదియునుగాక లక్ష్మణుఁడు ముందు యుద్ధము చేయుచుండెను. తటాలున నాయన నతిక్రమించి రావణుఁడు రామచంద్రుమీఁదికిఁ బోయెను. మరల సందు దొరకునా యని లక్ష్మణుఁడు కాచియుండి కొంచెము విరామము దొరకఁగానే మరలఁ దాను యుద్ధముసేయ నుపక్రమించెను. కావుననే రాముఁడు యుద్ధము చాలించి యూరక చూచుచుండెను. హనుమంతుఁ డిట్లు లేకదా చేసెను.

### తాత్పర్యము

తన యస్త్రము హతమైపోఁగా రావణుఁడు పెదవి గొఱికి రామచంద్రమూర్తి మీఁద సౌరాస్త్రమేసెను. అది యాకాశమంతయు వెలిఁగించుచు చక్రసమూహములతో రాఁగా సూర్యచంద్రులవలె వచ్చు దానిని బాణములచేతనే నాశము చేసెను. అదియును హతమైపోఁగా రావణుఁడు పదిబాణముల రాముని యాయువుపట్టుల నొప్పింపఁగా ధర్మస్వభావుఁడైన రామచంద్రమూర్తి కొంచెమైనను నొప్పి చెందక బాణసమూహములచేఁ దన బలము ప్రకాశము ప్రకాశింపఁజేసి రావణు నొప్పించెను. ఇంతలో తన యన్నతోడ సమానముగా యుద్ధముచేయు రావణుని జూచి సహింపక లక్ష్మణుఁడు.

### —• రావణ లక్ష్మణ యుద్ధము •—

చ. కనలి రథస్థుఁడై యితఁడు • కాల్నడ నిల్చిన యన్నతోడఁ దా
బెనఁగెడి నింతదవ్వనుచు • వీఁడు బాణము లేదు పూని కే
తనము మనుష్యశీర్షకము • ధాత్రిఁ దొరంగఁగ నేసి యొంటఁ జ
య్యన మణికుండలాంచితని•యంతృ శిరంబు నొకంటఁ ద్రుంచుచున్. ౧౩౦

అర్థములు. కనలి=కోపించి, రథస్థుఁడు = రథమునం దున్నవాఁ డగుట పెనఁగెడిన్=యుద్ధము చేయుచున్నవాఁడు, మనుష్య శీర్షకము = మనుష్యుని తల గలది, మణికుండలాంచిత = రత్నకుండలములతో నొప్పుచున్న, నియంతృ శిరంబు=సారథితల, ద్వంద్వయుద్ధమందు రథస్థుఁడగువాఁడు పదస్థుఁ డగువానిని గొట్టుట ధర్మముగాదు. రామచంద్రమూర్తికి రథము వచ్చు మార్గము లేదు. కావున రావణుని పదస్థుని చేయవలయునని లక్ష్మణు నుద్దేశ్యము. ఈ విషయముననే కర్ణుఁడర్జునునితో ఈవు రథస్థుండవు. నేను భూమిస్థుఁడను. కావున నీవు నన్ను వేయుట ధర్మము గాదు. నేను దేరిని జక్కఁజేసికొనువఱకు నీవు నన్ను వేయుటుడుగుమని చెప్పెను. "ఏను భూమిస్థుండ నీవు రథస్థుండ వ్యోఁ దగ

వగు నేయునునికి" భా-కర్ణ-౩-౩౯౦ ప. తరువాత వారివారి శక్తికొలఁది యెటు లైనను ప్రారంభమున ద్వంద్వమున నిరువురు సమాన దశయందుండవలెను.

తాత్పర్యము

కోపించి వీఁడు రథమునం దుండుటచేఁ గదా యింతకాలము కాల్నడ నున్న మాయన్నతో యుద్ధము చేయఁగలిగెనని యొక్క బాణముతో మనుష్యుని తల చిత్రింబడిన కేతనమును,మఱియొక్క బాణముతో రత్నకుండలములతో మెఱయు సారథి తలను ద్రుంచుచు.

కం. తక్కనశరపంచకమున, దిక్కరికరతుల్య మైన ♦ దృఢచాపంబున్

బెక్కులు దునియలుగాఁ గెం, పెక్క కనుంగవను ద్రుంచె♦నేడ్తెఱ నాలోన్.

అర్థములు. శరపంచకమునన్ = ఐదు బాణములచే దిక్కరికరతుల్య = దిగ్గజముల తొండములతో సమానమైన,దృఢచాపంబున్=గట్టి వింటిని, కెంపెక్క కనుంగవను = ఎఱ్ఱని కాంతి యతిశయించిన రెండు కన్నులతో.

తాత్పర్యము

మిగిలిన యైదు బాణములచే దిగ్గజముల తొండములతో సమానమైన వింటిని పెక్కు తుంటలుగా కన్నులు రెండు నెఱ్ఱనఁ గాఁగా కోపించి పరాక్రమించి ఖండించెను.

తే. కాలమేఘనిభంబులు♦శైలధరాధ,ములును నగు తేరిగుఱ్ఱాల♦బలియుఁ డౌ వి

భీషణుం డొక్కదూఁకున♦భీమగదను, మొత్తివధియించె నన్నింటిఁ♦దత్తఱిలక.

అర్థములు. కాలమేఘ నిభంబులు = నల్లని మబ్బుతో సమానములు. శైలధరాధములు=పర్వతములతో సమానమైనవి.

తాత్పర్యము

కాఱుమబ్బులవలెఁ బర్వతములవలె నుండు తేరి గుఱ్ఱాలనిమీఁద విభీషణుఁ డొక్క దూఁకు దూఁకి చేతిగదచే వానిని మొత్తి చంపెను.

కం. హయములు గూలినయంతన, రయమున భూస్థలికి దాఁటి ♦ రథగతశక్తిన్

భయదాకృతిఁ గొని తమ్మునిఁ,లయముం బొందింపఁజూడుక♦లన్ సెగలెగయన్.

అర్థములు. రథగతశక్తిన్=రథమునం దున్న శక్తిచే.

తాత్పర్యము

గుఱ్ఱములు చావఁగానే తటాలున భూమిమీఁదికి దాఁటి రథమునం దున్న శక్తియను నాయుధమును దీసికొని భయంకరాకారుఁడై తమ్మునిఁజంప కన్ను లందు సెగ లెగయుచుండఁగా.

ఉ. హుమ్మని వేయ వద్ది పిడు♦గో యన వెల్వడునంతలోన బా

ణమ్ములు మూఁడిటం దొడిగి ♦ నాశము చేసె సుమిత్రపట్టి యు

ఉగ్రమ్మగుశక్తి తునకలయి ♦ కాంచనమాలికతోడ రాలెన
భ్రమ్మునఁ దోఁకచుక్కనఁ బ్ల♦వంగమహాసైన్యము లుబ్బి యార్వఁగన్. ౨౩౦౬

తాత్పర్యము

హనుమ్మని వేయఁగా నది పిడుగువలె వచ్చుచుండుట చూచి యది సమీపమునకు వచ్చులోపలనే మూఁడు బాణములచే దానిని లక్ష్మణుఁడు నాశము చేసెను. ఆ భయంకరశక్తి తునుకలయి బంగారు మాలికతోడ వానరులందఱు సంతోషమున నఱవఁగా నాకాశమునుండి తోఁకచుక్క పడినట్లు పడెను.

చ. తన యసమానశక్తి యిటు ♦ దారితమాటయు మండుఁగన్నులన్
దనుజవరేణ్యుఁ డుగ్రతర♦దండధరాప్రతికార నైజకాం
తినిచయదీప్తమైన యొక ♦ దివ్యతరాశనితుల్యహవ్యవా
హనసఖశక్తిఁ గేలఁ గొను♦నంతటిలో రఘురాముతమ్ముఁడున్. ౨౩౦౭

అర్థములు. ఉగ్రతర=మిగుల భయంకరమైన, దండధర+అప్రతికార = యమునికైనను బదులుచేయరానిదై, నైజకాంతి నిచయ=స్వభావసిద్ధమైన కాంతి సమూహముచే, దీప్తమైన=మండుచున్న, అశనితుల్య=పిడుగుతో సమానమైన, హవ్యవాహనసఖ=అగ్నిహోత్రునితో సమానమైన, శక్తిన్=శక్తిని.

తాత్పర్యము

అసమానమైన తనశక్తి యీప్రకారము తునుకలు చేయఁబడఁగా మండుచున్న కన్నులతో, మిగుల భయంకరమై, యమునికైనను నిరాకరింపరానిదై స్వభావకాంతిచే వెలుఁగుచు వజ్రమువంటి వేగము గలదై, యగ్నివలెఁ గాల్చునది యగు శక్తిని చేతఁ దీసికొనునంతలో లక్ష్మణుఁడును.

ఉ. జడ్డొకయింత లేక యసు♦సంశయదుస్థితు నవ్విభీషణున్
జడ్డన వెన్క వేసికొని ♦ సాయకవర్షము వైరిమీఁద ము
జ్జడ్డుగ ముమ్మరమ్ముగను ♦ చేడ్పడఁ దిక్కటమక్కటం గొనన్
వడ్డొకయింతఁ జేయ కతి♦సాహసవృత్తిని ముంచి వైచినన్. ౨౩౦౮

అర్థములు. జడ్డు=ఆలస్యము, జడను - రూ. అసుసంశయదుస్థితున్ = చచ్చుననుసందేహస్థితియందున్నవానిని, ఆశక్తితగిలినవిభీషణుఁడు బ్రదుకుటదుర్లభమని భావము. జడ్డన = తటాలున, ముజ్జడ్డుగ = మూఁడుచమురులు గలసినట్లుగ, మిక్కిలి జడ్డుగ=దట్టముగ, ముమ్మరమ్ముగను=విశేషముగను, చేడ్పడన్ = బాధపడునట్లు, తిక్కటమక్కటం గొనన్=దిగ్భ్రమ గొనునట్లు, వడ్డు=లక్ష్యము.

తాత్పర్యము

రావణుఁ డాశక్తిని బ్రయోగించినయెడల విభీషణుఁడు బ్రదుకుట సందేహమని తలంచి లక్ష్మణుఁడు శరణాగతుఁడైన విభీషణునకు నన్న యభయహస్తమిచ్చెను గావున నతనిని దన ప్రాణమిచ్చియైన రక్షించి యన్నవ్రతము సఫలము

చేయఁగోరి యాలస్యముచేయక విభీషణుని తన వెనుక వేసికొని యాయనకు ముందు తాను దూఁకి రావణునిమీఁద మిక్కిలి దట్టముగాను విశేషముగాను బాధపడు నట్లు దిగ్భ్రమ చెందునట్లు లక్ష్యములేక బాణవర్షము గురియించుచు మిగుల తెంపుచేసి వానిని గొట్టఁగా.

ఉ. అడ్డము దూఁకి యిట్లు వసు•ధాధిపుసూతి నిజానుజాతు పె
రెడ్డమిఁ బాప వైచిన శి • తేషువులన్ నిజశౌర్య మంతయున్
జడ్డుపడంగఁ దమ్ము నిటు • చావునకుం దొలగించి యున్న యా
దొడ్డబలిష్ఠు లక్ష్మణుని • దుష్టచరిత్రుఁడు రావణుం డనున్. ౨౩౦౯

అర్థములు. నిజానుజాతు = తన తమ్మునియొక్క, పెరెడ్డమిన్ = మహాపదను, శితేషువులన్=వాఁడి బాణములచే, జడ్డుపడంగన్=తగ్గిపోఁగా, తమ్మున్= తన తమ్ముని విభీషణుని.

తాత్పర్యము

లక్ష్మణుఁడు విభీషణున కడ్డము దూఁకి యతని మహాపదనుండి తప్పింపఁ గోరి వేసిన వాఁడి బాణములచేఁ దన శౌర్యము స్తబ్ధము కాఁగాఁ దన తమ్మునిఁ జావునుండి తప్పించిన మహాబలశాలి లక్ష్మణుని జూచి దుష్టప్రవర్తనము గల రావణుఁ డిట్లనియె.

చ తవిలి విభీషణున్ మృతికిఁ • దప్పఁగఁ జేసిన శౌర్యసార! నీ
యవితథవిక్రమంబునకు • నచ్చెరు వయ్యెడు మెచ్చితిం జుమీ
సవరన నిల్వు లక్ష్మణుఁడ! • చావక తప్పెను రాక్షసుండు నీ
పొవ రడఁగింతు నీ హృదయ•మున్ వెసఁ జీల్చి హరింతుఁ బ్రాణముల్. ౨౩౧౦

అర్థములు. అవితథ విక్రమంబునకున్=వ్యర్థము గాని శక్తికి, సవరన = చక్కఁగా, పొవరు=మదము.

తాత్పర్యము

నీవు పని పూని లక్ష్మణా! విభీషణుని జావకుండఁ దప్పించితివి. నీ శౌర్యమునకు నమోఘపరాక్రమమునకు మెచ్చితిని. నీవు చక్కఁగా నిలువుము. రాక్షసుఁడు చావక తప్పించుకొనెను. నీ గుండెలు పగులఁజీల్చి నీ ప్రాణములు హరించి నీ మదం బడఁగింతును.

— లక్ష్మణుఁడు రావణశక్తిచే మూర్ఛపోవుట —

ఉ. తాళు మంటమ రావణుఁడు • దారుణరావము భీషణాష్టఘం
టాలసితం బమోఘ మరి • నాశకమున్ మయదైత్యశాంబరీ
జాలసుకల్పితంబు నగు • శక్తి దురాత్ముఁడు రాముతమ్ముని
ద్వేలజవాన్వితంబుగను • వ్రేసిన వచ్చెడు శక్తిఁ గాంచుచున్. ౨౩౧౧

అర్థములు. దారుణరావము=భయంకర ధ్వని. భీషణ = భయంకరమైన, అష్టఘంటాలసితంబు=ఎనిమిది ఘంటలచే ప్రకాశించునది, అమోఘము=వ్యర్థము పోనిది, అరినాశకము=శత్రువుల సంహరించునది, ఇట్లు చెప్పుటచే దీనిచే నిదివఱ కెందఱనో వధించెనని భావము, మయదైత్య శాంబరీజాల = మయుని మాయా శక్తిచేత, సుకల్పితంబు = చక్కఁగాఁ గల్పింపఁబడినది. ఉద్వేల = అమితమైన, జవాన్వితంబుగను = వేగముతోఁ గూడినట్లుగ.

## తాత్పర్యము

ఏల తొందరపడెదవు? నిదానింపు మని రావణుఁడు భయంకరధ్వనియు, దిగులు పుట్టించు నెనిమిది గంటలు గలదై, వ్యర్థము పోనిదై, మయుఁడు తన శక్తిచేఁ గల్పించినదైన శక్తిని దుష్టచిత్తుఁడగు రావణుఁడు రామునితమ్మునిమీఁద మిగులఁ వేగముతో వేయఁగా వచ్చుచున్న శక్తినిఁజూచి, ఈ శక్తినే మందోదరీ వివాహకాలమున మయుఁడు రావణున కిచ్చెను. చూ. ఉత్తర-౨౫౭ పద్యము.)

ఇటువంటి యమోఘశక్తి రామచంద్రమూర్తిపై వైవక లక్ష్మణుపై నేల రావణుఁడు వైచెను? రామచంద్రమూర్తి చచ్చినఁగదా తన యన్ని కార్యములు నెఱవేఱును. లక్ష్మణుఁడు పోయినను రాముఁడు సీతకై తన్నుఁజంపక మానునా?

విభీషణుఁడు రామచంద్రమూర్తి రావణునకు సమాన శత్రువులు. ఇంద్రజిత్తు లోనగువారివధకు విభీషణుఁడే మూలకారణ మని వాని యభిప్రాయము. అంతియగాక యిప్పుడు ప్రత్యక్షముగ రామకైంకర్యము నిర్వ్యాజముగఁ జేయఁ గోరి తన పుత్త్రములనే చంపెను. ఇది తన్నుఁ జంపింపఁజేసిన కార్యమేకదా యని యతఁడు తలఁచి యతనిఁ జంపఁగోరి యీ శక్తి యెత్తెను. కాని లక్ష్మణుఁ డడ్డపడుటచే నతనిఁ జంపఁజాలఁడయ్యెను. ఎత్తిన యాయుధము క్రిందఁబెట్టి వేఱొకటి తీసికొనుట, యొక బాణమును రెండుమార్లు సంధించుట యుత్తమవీరుని లక్షణము గాదు. రాముఁడో యుద్ధము చాలించి మారమందున్నాఁడు. ఇప్పుడు లక్ష్మణు చేతిలోఁ దన చావు దప్పినఁగదా వెనుకఁ దాను శ్రీరాము జయించుట కావున లక్ష్మణుపైఁ బ్రయోగింపవలసి వచ్చెను.

ఇది కర్ణుని ఘంటాశక్తివలె నయ్యెనని యెంచఁదగు.

ఉ. స్వస్తి సుమిత్రపట్టికిని ♦ వ్యర్థము గమ్ము శరమ్మ! యంచు భూ
శస్తుఁడు రామభద్రుఁడు ప్ర ♦ శాంతికరోక్తులు పల్క భీతిస
న్న్యస్తుని లక్ష్మణుం గదిసి ♦ వ్యాళవరేణ్యము జిహ్వవోలె వి
ధ్వస్తభుజాంతరుండుగను ♦ వైశమ వక్షము నాటె భీమమై. ౨౩౧౨

అర్థములు. వ్యర్థము గమ్ము = భస్మీకరించు నీ శక్తి వ్యర్థమై పోవును గాక, ఇది తపః కల్పితమైనదివ్యశక్తి యమోఘమైనది కావున మొదలంట మాపు మాప సాధ్యము కాదు. కొంతయైన దాని కార్య మది చేయవలసి యుండును.

గావున నీ యందలి హననశక్తి వ్యర్థమై పోవును గాక యనియే చెప్పెను. ప్రశాంతికరోక్తులు = దాని శక్తి యణఁగు మాటలు, భీతి సన్న్యస్తుని = సన్న్యస్తభీతిని = భయము వదలిన వానిని, వ్యాళవరేణ్యము = శ్రేష్ఠమైన పాముయొక్క, జిహ్వా = కోఱ, విధ్వస్త = చీల్పఁబడిన, భుజాంతరంగుఁడు = ఱొమ్ముగలవాఁడు, వైళము = త్వరగా.

### తాత్పర్యము

లక్ష్మణునకు మేలగును గాక, బాణమా! భస్మముచేయు నీ శక్తి వ్యర్థమగును గాక! యని ప్రపంచముచే స్తోత్రము చేయఁబడు శ్రీరామచంద్రమూర్తి మిక్కిలి శాంతిని గలిగించు మాటలు పల్కఁగా నిర్భయుఁడుగా నుండు లక్ష్మణుని శ్రేష్ఠమైన సర్పముయొక్క కోఱవలె భయంకరమై ఱొమ్ము చీలునట్లు వక్షమున నాటెను.

ఉ. గాటముగాఁగ శక్తి మెయిఁ • గాఁడిన మూర్ఛ మునింగి లక్ష్మణుం
డోటఱి నేల వ్రాలుడు స • హోదరు దుస్థితిఁ జూచి వేదనా
స్ఫోటితచిత్తుఁడై మనుజపుంగవు డించుక పల్లటిల్లి యా
మేటిబలాఢ్యుఁ జూచుచును • మేడ్పడి కన్నుల నీరు నించుచున్. -౩౧౩

అర్థములు. మెయిగాఁడినన్ = దేహమున నాటుకొనగాఁ, ఓటఱి = బలహీనుఁడై, వేదనాస్ఫోటిత చిత్తుఁడై = దుఃఖముచే చీల్పఁబడిన హృదయము గలవాఁడై, పల్లటిల్లి = చలించి, మేడ్పడి అజ్ఞతనొంది.

### తాత్పర్యము

దేహమునందు దృఢముగా శక్తి నాటుకొనఁగా లక్ష్మణుఁడు మూర్ఛపోయి నేలవ్రాలఁగ తమ్ముని దురవస్థఁ జూచి వేదనచేఁ జీలిన హృదయము గలవాఁడై రామచంద్రమూర్తి కొంచెము కంపించి యా మహాబలశాలిని జూచుచు పరవశుఁడై కన్నుల నీరు నించుచు.

కం. కాల మిది గాదు వగవఁగ, నాలమునకు సమయ మనుచు • నాగ్రహవశుఁడై
చాలించి వగపు వింటిని, గేలఁ గొని దశాస్యుఁ జంపఁ • గృతయత్నుండై.

అర్థములు. ఆలమునకున్ = యుద్ధమునకు, ఆగ్రహవశుఁడై = కోపము తెచ్చుకొన్నవాఁడై, వింటిని—కేలఁగొని—ఇట్లు చెప్పుటచే లక్ష్మణుని యుద్ధకాలమున విల్లు విడిచియుండెనని భావము. కృతయత్నుండై = చేయఁబడిన యత్నముగలవాఁడై.

### తాత్పర్యము

ఇది శోకింప సమయము గాదు. యుద్ధమున కిది సమయమని కోపము దెచ్చుకొన్న వాఁడై వ్యసనము చాలించి వింటిని దీసికొని రావణుఁ జంపఁ బ్రయత్నించిన వాఁడై

## —♦ శ్రీరాముఁడు లక్ష్మణునిఁ గవుల కప్పగించుట. ♦—

సీ. తివిరి రక్షోవిభుఁ ♦ డవిరళశరవృష్టి, తనమీఁదఁ గురియింప ♦ దైన్యపడక
ప్లవగనాయకు లెల్లఁ ♦ బాపజాలని శక్తి, నవలీలఁ బెఱికి తు♦న్మాడి వైచె
నదె సమయం బని ♦ యసురేంద్రుఁ డాతని, మర్మదారణశీల ♦ మార్గణముల
వైవ గణింపక ♦ భ్రాతఁ గౌఁగిటఁ గ్రుచ్చి, సూర్యప్రభంజన ♦ సుతులతోడ
ఆ. ననియె వీరులార! ♦ యప్రమత్తుల రయి, బలసి నాదు తమ్ము ♦ నిలుపరయ్య
యెంతకాలముగనొ♦యెదురుచూచుచునున్న, కాల మొదవె నింతె♦కాలమునకు.

అర్థములు. అవిరళ శరవృష్టి=దట్టమైన బాణవర్షము, మర్మదారణశీల = ఆయువుపట్టులను భేదించు స్వభావముగల, మార్గణములన్=బాణములను, సూర్య ప్రభంజన సుతులతోడన్ = సూర్యసుతునితోడ ప్రభంజనసుతునితోడ, ద్వంద్వ సమాసంబునఁ గడపటిపదము పూర్వపదముల యన్నిటితో సమసించును. సుగ్రీవాంజనేయాదులతోడ - అప్రమత్తుల రయి = ప్రమాదము లేక, బలసి = చుట్టుకొని.

### తాత్పర్యము

తాను బాణములు వేయక యూరకున్నను రావణుఁడు వదలక బాణపరంపరలు తనపై దట్టముగ వేయుచున్నను భయపడక దుఃఖింపక వానరులందఱుఁ గలసియు దీయఁజాలక యుండ లక్ష్మణుఁ బొమ్మున దూసి భూమిలో నాటుకొన్న రావణశక్తిని నవలీలగాఁ బెఱికి తునకలుగా విఱిచెను. ఇట్లాయన కార్యాంతరాసక్తుఁడై యుండఁగా నిదే సమయమని రావణుఁడు ఆయనను మర్మములు చీల్చు బాణముల వైవ వానిని లక్ష్యపెట్టక తమ్ముని గౌఁగిలించుకొని సుగ్రీవాంజనేయులఁజూచి వీరులారా! మీరు నా తమ్ముని జుట్టుకొని హెచ్చరికగఁ గాచుచుండుఁడు. (పూర్వమువలె రావణుఁడు తీసికొనిపోవ యత్నించునేమో యని యీ హెచ్చరిక) ఎప్పుడు రావణునితో యుద్ధము లభించునా యెప్పుడు వానిని జంపుదునా యని యెంత కాలముగనో యెదురు చూచుచుండఁగా నిప్పటికి లభించెను. దీనిని దప్పఁ గొట్టరాదు.

మొదటి యుద్ధమువలన రావణుఁ డలసినాఁడని రామచంద్రమూర్తి కొట్టక విడిచెను. రామచంద్రమూర్తి కేల విల్లులేక కార్యాంతరాసక్తుడైన సమయంబున నిదేసమయమని రావణుఁడుకొట్టెను. ధర్మాత్ములకునధర్మాత్ముల కిదియే నిదర్శనము.

శా. ఆసాసం గొని వేచి మిన్ను గను సా ♦ రంగంబు ఘర్మాంతవే
ళాసంలక్షిత వారిదంబుఁ గను లీ ♦ లం గంటి సంగ్రామఖే
లాసంరబ్ధు దశాస్యు నేను జిరకా ♦ లం బెంతయున్ వేచి యే
లా సందేహము వీనిఁ దున్మెదను స ♦ త్యం బింతయున్ నమ్ముఁడీ. ౪౩౦౬

అర్థములు. ఆసాంసగొని = మిగుల నాశపడి, వేచి = ఎదురుచూచి, మిన్నుగను = ఆకాశమును జూచు; సారంగంబు=చాతకము, 'చాతకేహరిణేపుంసి

సారంగ శ్చబలే త్రిషు' అమరము. ఘర్మాంత వేళా=ఎండాకాలము కడపటి సమయమున, సంలక్షిత = కానఁబడు, వారిదంబున్=మేఘమును, కనులీలన్ = చూచు విధముగా, సంగ్రామ ఖేలా సంరబ్ధున్=యుద్ధక్రీడయందు వేగిరపాటు గలవానిని.

తాత్పర్యము

ఎప్పుడు మేఘమువచ్చునా యెప్పుడు చినుకులుపడునా యెప్పుడు దప్పి తీర్చుకొందునా యని యెంతో యాసపడి యాకాశము చూచుచున్న చాతకము ఎండకాలము తుద మేఘములఁజూచినట్టు లిన్నాళ్ళు కాచియుండి యిప్పుడు యుద్ధ సన్నద్ధుఁడై వచ్చిన రావణుఁ జూడఁగంటిని. ఇంక సందేహ మేల? వీనిని సంహరించెదను సత్యము నమ్ముఁడు.

కం. నావచనము వినుఁడీ నే,రావణు నీ క్షణము వేగ ♦ రణమునఁ ద్రుంతున్
రావణుఁడో రాముఁడో కా, కీవసుమతి నిద్ద ఱుంట ♦ యిది మిథ్య యిఁకన్.

తాత్పర్యము స్పష్టము

ఉ. లచ్చిని గోలుపోక, వను♦లం జరియించుట, దండకాటవిన్
ముచ్చిరుచుంట, జానకిని ♦ మూర్ఖుఁడు ముట్టుట, సోకుమూఁకతో
హెచ్చినపోరు, ఘోర నగు ♦ నీనిరయోపమదుఃఖ, మిన్నియున్
గ్రచ్చఱఁ బాయువాఁడ దశ♦కంఠు రణావనిఁ దున్మి యాత్రుటిన్. ౨౬౧౭

అర్థములు. లచ్చిని గోలుపోక=రాజ్యసంపద పోఁగొట్టుకొనుట, ముచ్చిరుచుంట=శోకించుచుండుట, సోఁకుమూఁకతో=రాక్షస సమూహముతో, ఈ నిరయోపమ దుఃఖము = లక్ష్మణుఁడు పడుటవలనఁ గలిగిన నరకబాధవంటి బాధ, క్రచ్చరన్=శీఘ్రముగ.

తాత్పర్యము

రాజ్యలక్ష్మిని పోఁగొట్టుకొనుట, అడవులఁ దిరుగుట, దండకలో దుఃఖించుట, మూర్ఖుఁడు రావణుఁడు సీతను దాఁకుట, రాక్షసులతో ఘోరయుద్ధము, నరక వేదనతో సమానమైన లక్ష్మణమూర్ఛచే గలిగిన యీ దుఃఖము- వీని నన్నిటిని నీ క్షణమందు రావణుని జంపి వదలువాఁడను.

ఉ. ఏమినిమిత్త మేను వధి♦యించితి వాలిని, భానుసూను శా
ఖామృగరాజుఁ జేసి కపి♦కాండము నెల్లను గూర్పఁగంటి నే
నేమిటి కబ్ధిఁ గట్టి తరి♦యించితి, నింతకు మూల మైన నీ
చీమనుజాశనుండు ప్లవ♦గేశ్వరులార! యిదే కనంబడెన్. ౨౬౧౮

అర్థములు. నీచు + ఈ మనుజాశనుండు = నీచుఁడగు నీ రాక్షసుఁడు. నీచశబ్దము వృద్ధాదులలోఁ జేరినది కావున డుట్ లేకయు ప్రయోగము గలదు. "చొచ్చిన చోటఁ జొచ్చి తెగఁజూచెద నంచుఁ దలంచు గాని నన్నెచ్చఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁడు" తిక్కన = ఉద్యో.

తాత్పర్యము

దేనికై వాలిని జంపితినో దేనికై సుగ్రీవుని వానరరాజు జేసితినో దేనికై యీ వానరుల నెల్ల గుంపు చేర్చితినో దేనికై సముద్రమున సేతువు కట్టి దాటి వచ్చితినో వీని కన్నిటికిని కారణమైన యీ నీచుఁడు రావణాసురుఁడు వానరులార! యిదిగోఁ గానవచ్చెను.

కం. చూపులవిష ముండెడిఫణి, చూపులపాల్పడినవాని ♦ చొప్పున నేఁ డీ
పాపి యని నాదృష్టికిఁ, జేపడియును బ్రదికిపోవఁ ♦ జెల్లదు సుండీ. ౨౩౨౦

అర్థములు. చేపడి = లభించి, ఇది లోవడి, పైవడి శబ్దములవంటిది.

తాత్పర్యము

చూపులలో విషమున్న పాముయొక్క దృష్టికిఁ గనఁబడినవాని విధమున నేఁడీ పాపాత్ముఁడు నాకుఁ గనబడియు బ్రదికిపోవరాదు.

ఉ. నెమ్మది నిమ్మళంబుగ వ♦నేచరులార! సమీపధారిణీ
ధ్రమ్మునఁ గూరుచుండి ఖలు♦రావణు నాదు దురంబు జూడుఁడీ
యిమ్ముగ మూఁడులోకములు ♦ నెల్ల నిలింపులు నింద్రమౌనియు
క్రమ్ముగ జూచువారలు ప్ర♦కాశముగా రఘురాము రామతన్. ౨౩౨౧

అర్థములు. సమీప ధారిణీధ్రమ్మునన్ = దగ్గఱ నుండు కొండమీఁద, యుద్ధము దూరమునుండి చూచిననే నిరపాయము, రమ్యము-రఘురాము = రఘు వంశమునఁ బుట్టిన రామునియొక్క, రామతన్ = రామత్వమును— (౧) రామ నామ సార్థక్యమును, (౨) రామావతారప్రయోజనమును, (౩) జగదేకవీరత్వ మును, (౪) పరాక్రమసమయమందును - రమయిత్రుత్వము, (౫) సత్య ధర్మ శౌర్యములచే మూఁడులోకములను రమింపఁజేయుటయు.

తాత్పర్యము

నిండు మనస్సుతో స్వస్థచిత్తులరై వానరులారా! దగ్గఱనుండు కొండమీఁదఁ గూర్చుండి రావణుతో నేను జేయు యుద్ధము చూడుఁడు. నేఁడు దేవతలతో నింద్రునితో మునులతోఁ గూడిన మూడు లోకములు నేఁడు రఘురాముఁడు నిజ ముగా నన్ని వేళల నన్నివిధముల నన్ని దేశముల రాముఁడే యగుటను జూచును గాక

కం. నాకులు సచరాచర మగు, లోకంబులు గుములు గట్టి ♦ శ్లోకయుతముగా
నాకదనమువిధ మెప్పుడు వాకొననొనరింతు భూమి♦వలెలెడిదాఁకన్. ౨౩౨౨

అర్థములు. నాకులు = దేవతలు, గుములు=గుంపులు, శ్లోకయుతముగా- (౧) పద్యరూపముగా, (౨) కీర్తితోఁ గూడినట్లుగా, 'శ్లోకః పద్యేయశస్యపి' నానా॥ర॥ కదనము = యుద్ధము, వాకొనన్ = చెప్పుచుండునట్లు.

తాత్పర్యము

దేవతలు జంగమస్థావరాత్మక మగు లోకమ్ములు గుంపులై పద్యరూపమున

భూమి యుండువఱకు నా యుద్ధ విధము చెప్పుచుండు నట్లు చేసెదను. (ఈ మాట సత్యమగు చున్నదిగదా! బ్రహ్మవాక్య మిదియేకదా. కావున నెన్ని మహాయుగ ములు మాఱినను రామాయణమునకు హాని లేదు. రామచరిత్ర మన్ని మతముల వా రన్ని భాషలలో వ్రాసికొనినారు.

## —• రావణుఁడు పరాజితుండై లంకకుఁ బరువెత్తుట •—

చ. అనుచు సువర్ణభూషణస•మంచితశాతశరాళి పంక్తివ
 క్త్రనిమెయిఁ గాఁడ సేయుటయుఁ • గ్రూరత నాతఁడు దీప్తబాణముల్
 పెనుముసలంబులున్ ముదిర•బృందము నీరన రాముమీఁదనో
 యనఁ గురియింప వానిని ర•యంబునఁ దునుకలు జేసె రాముఁడున్. ౨౩౨౩

అర్థములు. సువర్ణభూషణ సమంచిత = బంగారు సొమ్ములచేఁ బ్రకాశించు, శాతశరాళి=వాఁడిబాణములపంక్తి, ముసలంబులన్ = రోఁకండ్లు, ముదిర బృందము=మేఘసమూహము, నీరు + అనన్ = నీళ్ళనువలె, నీయన = చూచు వారు హోహోయనునట్లు, ఇది ఒయ్యన శబ్దముగా భ్రమింపరాదు. అర్థము పొసగదు.

### తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచు బంగారు తీఁగలచే నలంకరింపఁబడిన వాఁడి బాణములను రావణు దేహమునందుఁ గ్రుచ్చుకొనునట్లు వేయఁగా నాతఁడును ప్రకాశించు బాణములను పెద్ద రోఁకండ్లను మేఘము నీళ్ళు గురిసినట్లు చూచువారు హోహో యనునట్లు గురియింపఁగా వాని నన్నిటిని రామచంద్రమూర్తి తునుకలు చేసెను.

చ. ప్రకటబలప్రతాపనర•వల్లభరాక్షసరాజముక్తసా
 యకనిచయంబు లుప్పరమ•నంద నొకొంటిని దాఁకుచప్పుడుల్
 సకలదిశాంతవీథుల న•సహ్యము లై పరఁగెన్ ధరాస్థలిన్
 శకలము లౌచు రాలి పృథు•శైలవితానములట్లు లొప్పఁగన్. ౨౩౨౪

అర్థములు. ప్రకట = ప్రసిద్ధమైన, బలప్రతాప = బలము ప్రతాపము గల నరవల్లభ = రామచంద్రమూర్తి చేతను, రాక్షసరాజు = రావణు చేతను ముక్త=విడువఁబడిన, సాయక నిచయంబు = బాణసమూహము, ఉప్పరమునంద= ఆకాశమునందే సకల దిశాంత వీథులన్= సమస్త దిక్కుల కడపటి ప్రదేశముల, అసహ్యములై=సహింపరానివై, పృథుధు = గొప్పవగు, శైల వితానములట్లు = కొండల సమూహములవలె.

### తాత్పర్యము

ప్రసిద్ధబలపరాక్రమము గల రామరావణులు ప్రయోగించు బాణములు ఆకాశమునందె యొకదాని నొకటి కొట్టు ధ్వనులు దిక్కులందుండు వారికి విన

సహింపరానివై యుండెను. అవి తునకలై రాలి నేల మీఁదఁ గొండలవలెఁ బడి యుండెను.

ఉ. ఏమిర ! యింతదాఁక దెగి ♦ యీతఁడు పోరెడునంచు నల్కమై
 రాముఁడు నిప్పు గ్రక్కెడి శ♦రంబులఁ గోటుల లస్తకంబునన్
 స్తోమముగాఁగ నీనుగతిఁ ♦ దొప్పలు దోరలు పర్వఁజేసినన్
 ధీమన మేది రావణుఁడు ♦ దీనతఁ బాఱెఁ బురంబులోనికిన్. ౨౩౨౫

అర్థములు. కోటులన్=వింటి కొప్పులందు, లస్తకంబునన్ = విల్లు పట్టు కొనెడి నడిమిచోటు, పిడికట్టు, తొప్పలు దోరలు=కోటానఁ గోటులు, ధీమసమేది= ధైర్యముచెడి, దీనతన్=దుఃఖముతో, పాఱెన్=పరువెత్తెను.

తాత్పర్యము

ఏమిది, ఇంతసేపు వీఁడా నాయెదుటఁ దెగించి నిలిచి యుద్ధము చేయువాఁడని కోపించి రామచంద్రమూర్తి నిప్పులు గ్రక్కు బాణంబులను వింటి కొనల నడుమ గుంపులుగా గనుచున్నవా యన్నట్లు కోటానఁ గోటులు వేయగాఁ ధైర్యము చెడి యిఁక నుండినఁ జచ్చుట సిద్ధమని రావణుఁడు లంకలోనికిఁ బాఱి పోయెను.

## —♦ ౧౦౨-వ సర్గము. మూర్ఛిల్లిన లక్ష్మణుఁ జూచి శ్రీరాముఁడు దుఃఖించుట ♦—

ఉ. రావణుతోడఁ బోరుచునె ♦ రామవిభుం డొకకంట రక్తసి
 క్తావయవున్ నిజానుజుని ♦ నార్తిని గాంచు చనెన్ సుషేణుతో
 హా! వరవిక్రముండు సుగు♦ణాంబుధి ప్రాణముకన్న మిన్న యీ
 ధీవిభవుండు తమ్ముఁడు క్షి♦తిం బొరలాడెడిఁ బాముకైవడిన్. ౨౩౨౬

అర్థములు. రక్తసిక్తావయవున్ = నెత్తుటఁ దడిసిన యవయవములఁ గల వానిని, నిజానుజునిన్=తన తమ్ముని.

తాత్పర్యము

ఒక కంట రావణాసురునిఁ జూచుచు యుద్ధము చేయుచు నొక కంట నెత్తుటఁ దడిసిన దేహముగల లక్ష్మణుఁ జూచుచు సుషేణుతో నిట్లనెను. అయ్యో! ఉత్తమమైన పరాక్రమము గలవాఁడు, మంచి గుణములకు సముద్రుఁడు, నాకుఁ బ్రాణముల కంటె శ్రేష్ఠుఁడు, బుద్ధిసంపదగలవాఁడు, నా తమ్ముఁడు పామువలెఁ నేలఁ బొరలు చున్నాఁడు.

ఉ. ఈతనిపాటుఁ గన్న మన ♦ మెంతయు నారటమందఁ జొచ్చెడిన్
 నాతర మౌనె యింకఁ గద♦నం బొనరింపఁగ ? శౌర్యశాలి నా
 భ్రాత ప్రశస్తలక్షణవి♦రాజితమూర్తి సుమిత్రపట్టి య
 య్యో! తెగ నేని నే బ్రదికి♦యుండుట యేటికి? సౌఖ్య మేటికిన్. ౨౩౨౭

అర్థములు. ప్రశస్త లక్షణ విరాజితమూర్తి = పొగడఁబడిన శుభ చిహ్నములచేఁ బ్రకాశించు నాకారము గలవాఁడు.

తాత్పర్యము

ఈతనిస్థితి చూచిన మనస్సున కెంతయు సంకటము గలుగుచున్నది. ఇఁక యుద్ధముచేయ నాకు సాధ్యమా? శూరుఁడు నా తమ్ముఁడు ప్రశస్త శుభ చిహ్నములు గలవాఁడు, సుమిత్రకొడుకు కయ్యో! మరణించెనా నేనుబ్రదికి యేమి ప్రయోజనము? ఇఁక సౌఖ్య మనుమాట యేల?

ఉ. జాఱెడిఁ జాపదండ, మవ ♦ శం బయి పోయె మనంబు బాణముల్
పాఱెడి నెల్లెటో గుఱిని ♦ బాసి, యయో కనులందు బాష్పముల్
మీఱెడి దృష్టి నాఁగుచును ♦ మేను ధరింపఁగ నాశలన్నియుం
దీఱె, విషాద మెచ్చెడిని ♦ దీనతఁ దమ్ముని పాటుఁ జూచినన్. ౨౩౨౮

తాత్పర్యము

తమ్ముఁడుండు స్థితిని జూడఁగా దుఃఖముచేఁ జేతినుండి విల్లు పడిపోవుచున్నది. మనస్సు స్వాధీనము తప్పినది. బాణములు గుఱి తగులక యెల్లెట్లో పోవుచున్నవి. ఏల యనిన కన్నుల నీళ్లూరి దృష్టిని నడ్డగించుచున్నవి. ఏయాశచే దేహము నిలుపఁ దలఁచితినో యా యాశ లన్నియు నాశమయ్యెను. దుఃఖము హెచ్చుచున్నది. (ఇవి యుద్ధము చేయుచుఁ జెప్పిన మాటలు)

ఆ. స్వప్నయానమందు♦జనులకుఁబోలె నా, యంగకములు సడలి♦యవనిఁ గ్రుంగఁ
బడుచు నున్న వయ్య♦పటిమ లే దొడలను, సడలి డీలు పడియె♦సంధులెల్ల.

అర్థములు. స్వప్నయానమందు = నిద్రలోఁ బ్రయాణము సందువలె, అంగకములు = అవయవములు, సడలి = బిగువుదప్పి, పటిమ = పటుత్వము, దార్ఢ్యము - బడలిన దేహమందు - సంధులు=కీళ్ళు, సడలి=శిథిలములై.

తాత్పర్యము

నిద్రలోఁ బ్రయాణము చేయువానికివలె నా యవయవములు బిగువుదప్పి భూమిపైఁ గూలఁబడుచున్నవి. దేహమునందు దార్ఢ్యము లేదు. కీళ్ళు వదులైనవి.

కం. నా కనులఁ బ్రోలఁ దమ్ముం, డీకరణి గరాసుచేత ♦ మృతి గన నిస్సీ
నాకడిమిఁ దలఁప సిగ్గా, నా కెక్కడిబల? మిఁ కేల ♦ నాకీ ధనువున్. ౨౩౩౦

అర్థములు. గరాసు=దుష్టుఁడు, కడిమి=బలము.

తాత్పర్యము

నా కన్నులయెదుట నా తమ్ముఁడు దుష్టునిచే నీ విధముగా మరణించిన నా బలమేమి బలము. నా కీ విల్లేల? ఇది యెవరి నుద్ధరింపఁగలవు.

చ. అని వ్యసనాబ్ధి పీడితు శ ♦ రాభిహతాంగు వినష్టవంతుఁ ద
మ్ముని వెలిప్రాణమై తనరు ♦ మోహనగాత్రునిఁ జూచి చూచి తాఁ

గనులను నీరు గార్చుచును ♦ గాఢతరార్తిపరాయణుండును నై
మన మురియంగ మిక్కిలి క్షు♦మాతనయారమణుండు దీనుఁడై. ౨౩౩౧

అర్థములు. వ్యసనాభిపీడితున్=దుఃఖముచే మిగులఁ బీడింపఁబడిన వానిని, శరాభిహతాంగున్ = బాణములచేఁ గొట్టఁబడినవానిని, వినష్టవంతున్ = నిశ్వాసములు పుచ్చుచున్నవానిని, గాఢతర=మిక్కిలి యధికమైన, ఆర్తిపరాయణుండు= బాధ గలవాఁడు, ఉరియంగన్=పరితపింపఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దుఃఖముచే మిగుల బీడింపఁబడినవానిని బాణములచే బాగుగా గొట్టబడినవానిని, ఊర్పులు పుచ్చుచున్నవానిని, తనకు వెలుపలి ప్రాణమైన వానిని, అందముగల దేహముగలవానిని దమ్ముని జూచి చూచి కన్నీరు గార్చుచు మిగుల బాధపడుచు మనస్సు సంతాపపడుచుండఁగా దీనుఁడై రామచంద్రమూర్తి.

కం. ఏలా నా కీ యుద్ధం? బేలా ప్రాణంబు? సీత ♦ యేలా యింకన్ ?
లాలితగుణుఁడగు తమ్ముం, డీలీలన్ ధూళి బ్రుంగి♦యిలఁ బడియుండన్.

అర్థములు. బ్రుంగి = మునిఁగి.

తాత్పర్యము స్పష్టము.

కం. నాముద్దుఁదమ్ముఁ డీతఁడు, భూమి నిహతుఁ డైనయేని ♦ భోగము రాజ్యం
బేమిటికి? బ్రదికి యేటికి?, నేమి ప్రయోజనము గలిచి♦యేనియు ననిలోన్.

అర్థములు. నిహతుఁడు = మరణించినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఊరూరఁ గళత్రంబులు, నూరూరన్ బాంధవులును ♦ నొదవెద రకటా!
యారయ భ్రాత సహోదరుఁ, డారఁగ లభియించు దేశ♦మవనిం గలదే ?

అర్థములు. కళత్రంబులు = భార్యలు, భ్రాత = సహోదరుఁడని రెండు శబ్దములు చెప్పఁబడెను. భ్రాతృశబ్ద మొక్కటియే చెప్పిన నా శబ్దము నానార్థములు గలది యగును. భ్రాతృశబ్దమునకు (౧) తోడఁ బుట్టినవాఁడు, (౨) ఆప్తుఁడైన స్నేహితుఁడు, (౩) ఆప్తుఁడైన చుట్టము, సమీప బంధువు, (౪) సామాన్యముగ మిత్రుఁడు, 'భ్రాతః కష్ట మహో' అని భర్తృహరి. 'తత్త్వం చింతయ తదిహ భ్రాతః' మోహముద్గర పాఠము. ఈ కారణముచే భ్రాతృశబ్దమునం దిష్టార్థ సౌష్ఠవము లేదు. కావున సోదర శబ్దము చేర్పఁబడెను. సహోదర శబ్దము ఒక తల్లి గర్భమున జనించినవారికే యన్వయించును. రామలక్ష్మణు లొక తల్లి బిడ్డలు గారు. కావున కేవల సోదరశబ్దము సరిగాదు. కావున భ్రాత సహోదరుఁ డనుటచే భిన్నోదరు లైనను నొక తల్లిబిడ్డలవలె నుండువారని యర్థము.

తాత్పర్యము

కావలయునని కోరువారికి నూరూర పల్లెపల్లెయందు భార్యలు దొరకుదురు.

ఊరూర భార్యల వెంట బంధువులు దొరకుదురు. కాని సవతి తల్లి కొడుకయ్యు నేకోదరుఁడగు తమ్మునివలె సేవించువాఁడే దేశమందును దొరకును.

తల్లి కని పెంచుచుండినదియైనను జాతిణి యైనను ఏకోదరులు లభింపవచ్చును గాని యిట్టి వారు లభింపరు. పాండవులందు ముగ్గురు కుంతికొడుకులే. తక్కిన యిరువుర నామెయే పెంచెను. కావున నా సోదరభావ మిట్టిదిగాదు.

## —♦ సుషేణుఁడు శ్రీరాము నూరార్చుట ♦—

తే. అనుచు నిట్లార్పు విగిడించు♦నవని బొరలుఁ గన్నులను నీరునించు శో♦కంబు నొందుఁ
బనవుఁ బలవించు నట్టున్న♦ రఘు నఘుఁ గాంచి, చేరి యూరార్చి పలుకును♦షేణుఁ డపుడు.

తాత్పర్యము స్పష్టము.

కం. లక్ష్మీవర్ధనుఁ డగు మన, లక్ష్మణుఁడు మృతుండుగాఁడు ♦ శ్లాఘితచరితా!
లక్ష్మణములఁ గనుఁగొనుమీ, సూక్ష్మమతీ! నీకు నిట్లు ♦ స్రుక్కఁగ నేలా!

అర్థములు. లక్ష్మీవర్ధనుఁడు=కాంతిచే వృద్ధినొందినవాఁడు, 'లక్ష్మీస్సంపచ్ఛ్రమాశోభా' నా. నా. ర. లక్ష్మణములన్ = చిహ్నములను, "చిహ్ననామ్నో సలక్ష్మీకే సౌమిత్రౌ సారసస్త్రియాం" నా.నా.ర.

తాత్పర్యము

రామచంద్రా! లక్ష్మణుఁడు మృతుఁడేమో యని నీవు దుఃఖించుచున్నావు. ఆయన మృతుఁడుగాఁడు. ఏలన కాంతి వృద్ధియై యున్నదిగాని క్షీణింపలేదు. నీవు సూక్ష్మవిషయముల గ్రహింపఁగల మనస్సు గలవాఁడవు. మృతుని చిహ్నము లీయన యందుఁ గలవేమో చూడుము.

తే. కాంతి దొలఁగదు నీలంబు♦గాదు మొఱఁ, పాటునొందదు వదనంబు♦పార్థివేంద్ర
సుప్రభంబు ప్రసన్నంబు♦ బాగుగ గలదు, పాణులును రక్తనీరజ♦ప్రభలనొప్పె.

తాత్పర్యము

రామచంద్రా! లక్ష్మణుఁడు మృతుఁడని నీ వెట్లు తలంచితివి ముఖమునందుఁ గాంతి తొలఁగిలేదు. నల్లబాఱినదికాదు. మొఱఁబడినదిగాదు. మరణించినవానియందుండవలసిన యీ గుణము లున్నవా? ఇవి లేకుండుటేగాక ముఖము మంచి కాంతి గలదై ప్రసన్నమై యందమైయున్నది. అఱచేతులు ఎఱ్ఱకమలముల వంటి కాంతిగలవై యున్నవి.

కం. కనులందుఁ దేజ మాఱదు, మనుజేంద్రా! యిట్టికాంతి ♦ మహిమయుఁ గలదే
వినశించినవారికి? నీ,తనిముఖ మెఱఁగించు దీర్ఘ♦తరజీవితమున్. ౨౩౩౮

తాత్పర్యము

కనులందుఁ గాంతి మాఱినదిగాదు. రాజేంద్రా! మరణించిన వారియందీ చిహ్నము లుండునా? ఈయన ముఖముచూడ నీయన దీర్ఘాయుష్మంతుఁడని తెలియుచున్నది.

ఉ. కాన మృతుండు గాఁడు సుమి • గాదిలితమ్ముఁడు భద్రమూర్తి స
ప్రాణుఁడు దుఃఖ మొందకుము • రాజవరా! యదె మాటిమాటికిన్
గానఁగనయ్యెడిన్ హృదయ•కంపన ముచ్ఛ్వసనంబు చూడుమీ
మానుము విషాద మంచు హను•మంతునిఁ జూచి వచించె నీగతిన్. ౨౩౯

తాత్పర్యము

రాజేంద్రా! లక్ష్మణుఁడు మూర్ఛితుఁడే కాని మృతుఁడు కాఁడనుటకు మఱి కొన్ని కారణములు గలవు. గుండెలు కొట్టుకొనుచున్నవి. శ్వాస వచ్చుచున్నది. తొమ్ముక్రిందికిఁ బైకిఁ జలించుచున్నది. కావున లక్ష్మణుఁడు మృతుఁడుగాఁడు. ప్రాణముతో నున్నాఁడు. కావున దుఃఖింపకుము అని చెప్పి హనుమంతునితో నిట్లనియె.

—• హనుమంతుఁడు సంజీవనిపర్వతంబు దెచ్చుట •—

కం. హనుమా! మందులమలకై, చనుమా వేగంబ మున్ను • చతురాస్యసుతుం
డనిన పథంబున నగ్గిరి,గొనబారెడి దక్షిణంపుఁ•గూటమునందున్ ౨౪౦

అర్థములు. చతురాస్యసుతుండు=బ్రహ్మకొడుకు, జాంబవంతుఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కలదు సుమ్ము విశల్య•కరణి యైన విశల్య,కరణి శ్రేయస•కారి యగుచుఁ
గల దందున సవర్ణ•కరణి సంజీవని, సంధానకరణియు • శస్త్రవేగ!
కొని తెమ్ము లక్ష్మణు•మనుదల గూర్పఁగఁ, బొమ్ము వీరుఁడ! వేగ•రమ్ము టన్నఁ
జివ్వనఁ జని యటఁ • జేరి మహౌషధి, నెల వెఱుంగఁగ లేక • నెమకి తలఁచె
తే. నేల యీయాలసము గిరిని స•మూలముగను, బెఱికికొనిపోదు మందులు•వఱలు నిందు
నట్లు చెప్పె సుషేణుండు•నౌషధంబు, గొనక మసలిన నెంతయుఁ•గూడుఁ గీడు.

అర్థములు. విశల్యకరణి = శల్యములను (మేకులను చీలలను) ఊడఁదీయునది యగుటచే విశల్యకరణి యని పేరొందినది, శ్రేయసకారి=శుభము కలిగించునది, అందున=అందే, దక్షిణశిఖరమునందే, మనుదల=జీవితము, నెమకి=వెదకి.

తాత్పర్యము

దేహమున నాఁటిన ములుకులు లోనైనవానిని నూడఁదీయు విశల్య కరణియు, ఆ దక్షిణకూటమునందే సవర్ణకరణి, సంజీవని, సంధానకరణిగలవు. లక్ష్మణు జీవింపఁ జేయుటకై వానిని వేగ తెమ్ము, వేగరమ్ము, అని చెప్పఁగాఁ జివ్వనపోయి కొండఁజేరి ఓషధులున్న స్థలము నెఱుఁగలేక వెదకి యీ యాలస్య మేల? మరలఁ బోయి సుషేణు నరియుగు స్థల మడుగుదమా యనిన నాలస్య మగు నని తలఁచి కొండనే పీకికొని పోదును ఇందు నెందో మందులుండును గాని లేకపోవు. సుషేణుఁ డిందు గలవని చెప్పెఁగదా. ఆలోచనలతో నాలస్యముచేసిన గీడు కలుగును.

కం. పౌరుషహానియు నా కని, వీరుఁడు చింతించి యెల్ల•పృథివీధరమున్
వారక ముమ్మాఱూఁచెను, జారుతరోత్ఫుల్లభూజ•సంతతితోడన్. ౨౪౧

అర్థములు. చారుతర=మిగుల నందమైన, ఉత్ఫుల్ల = వికసించిన పూలు గల; భూజసంతతితోడన్=చెట్ల సమూహముతో.

తాత్పర్యము

అదియును గాక నాకు పౌరుషహానియుఁ గలుగును. అని యాలోచించి పర్వతమును మూఁడుమూర్లాఁచి పూచిన చెట్లతోడ నా కొండను

సీ. పెకలించి పైకెత్తి • వినువీధికిని దాఁటి, పుట్టచెండును బోలె • భూమిధరము
నెగవైచి పట్టుచు • జిగి జలపూర్ణ మే, చకఘన మగుదాని • సరగఁ దెచ్చి
వనచరావళిమధ్య•మున డించి యుంచుక, గాసి దీఱ సుషేణుఁ • గాంచి పలికె
నిందలి మందుల • నెఱుఁగఁజాలక కొండఁ, బెకలించి తెచ్చితి • వీరవర్య !
ఆ. యనిన మెచ్చుకొనుచు•నతని సుషేణుండు, దీసె నోషధులను • దీవరముగఁ
బావమానికృతికి • వానరరాక్షస, చయము లబ్బపడె న•సాధ్య మనుచు.

అర్థములు. జిగిన్ = కాంతియందు, జలపూర్ణ = నీటనిండిన, మేచక ఘనము = నల్లమబ్బు.

తాత్పర్యము

పెళ్ళగించి మీఁదికెత్తి యాకాశమున కెగిరి చెండువలె దాని నెగురవేసి పట్టుకొనుచు నీటితో నిండిన నల్లమబ్బు కాంతిగల యాపర్వతమును త్వరగాఁ దెచ్చి వానరుల నడుమనుంచి గాసి కొంచెము దీరఁగా సుషేణుఁజూచి యిట్లనియె. సుషేణా! యిందు మందులతీఁగ లేవియో నాకుఁ దెలియలేదు. కావునఁ గొండనే పెకలించి తెచ్చితిని అనిన మెచ్చుకొనుచు సుషేణుఁ డా మందుల తీఁగలను దీసెను. ఆంజనేయుఁడు చేసినపనికి వానరులు రాక్షసులు ఇది యసాధ్యకార్యమని యాశ్చర్యపడిరి.

—• లక్ష్మణుఁడు మూర్ఛ దేఱుట •—

ఉ. అంత సుషేణుఁడుం బతి మ • హౌషధి మూర్కొనఁ జేసినంతలో
నెంతయుఁ దేజ మీఁతి వ్యథ • యేమియు లేక విశల్యుఁ డై వెసన్
సంతస మార లేచెఁ, గపి • సంఘము లా కపివర్యు శక్తి క
త్యంతము మెచ్చి మే లనుచు • నశ్లాఘతిం గొనియాడె నాతనిన్. ౨౩౮౮

అర్థములు. మూర్కొనన్ = వాసనచూడ, విశల్యుఁడై = ములుకు లూడినవాఁడై.

తాత్పర్యము

అంత సుషేణుఁ డా యోషధులఁ దీసి వాసనచూసి నంతలో లక్ష్మణుఁడు మిక్కిలి కాంతిగలవాఁడై బాధయనునది లేక ములుకులూడి సంతోషముతో లేచెను. ఆ సుషేణుశక్తికి వానరు లందఱు మిగుల మెచ్చిరి.

ఈ ఘట్టమునఁ గాననేమి కథ కల్పితమనుటకుఁ గారణములు కొన్ని పూర్వపీఠికయందు వ్రాయఁబడెను.

౧. లక్ష్మణమూర్ఛ పగటి చర్యయేకాని రాత్రిచర్య గాదు.

౨. హనుమంతుఁడు సంజీవనికిఁ బోయిన సమయమున ధాన్యమాలిని రావణు నింట నున్నది కాని మొసలియై యుండలేదు.

౩. సంజీవనిని దెచ్చు హనుమంతుని చూచి సూర్యోదయ మగుచున్నదని రామచంద్రమూర్తి భ్రమించెనఁట.

హనుమంతు డుత్తరమునుండి దక్షిణమునకు వచ్చుచున్నవాఁడు. ఉత్తరమున సూర్యుఁడుదయించెనని రామచంద్రమూర్తి తలఁచెనట! ఇంతకంటెఁ దెలివిమాలిన వ్రాతయు, దీనిని సత్యమని తలఁచువారికంటెఁ దెలివిమాలినవారు లోకమునఁ గలరా?

ఆలోనఁ గమలాప్తుఁడని చూచి విభుఁడు

కాలకాలోదగ్రగతి నాడ నుండ – కపికులాధీశులఁ గలయ వీక్షించి
కపులార సూర్యునిఁ గంటిరే యింటఁ – జేకొని బహుపుణ్య శీలంబులందు
మాకులంబుల కెల్ల మహిఁ గర్తయైన – యంధకారారాతి యకట యీ పద్మ
బంధుండు నేఁడు నా పగవానిఁ గూడి – యుదయించుచున్నవాఁ డుగ్రత మిగిలి."

[ద్విపద రంగనాథరామాయణము.]

ఇచ్చట గోవిందరాజీయ వ్యాఖ్యానమం దొకటి శంకింపఁ బడినది. అది యేదన:—

౧. ఇంద్రజిత్తుచే గాయపడిన లక్ష్మణాదులకు సుషేణుఁడు పరమౌషధిచే విశల్యులఁ జేసెనని ముందు చెప్పఁబడెను. కావున సుషేణుఁ డీ యౌషధిని సంగ్రహించికొని యుండవలెను. కావున నిప్పుడు హనుమంతుని మరల నా యౌషధులఁ దెమ్మనుట యనుపపన్నము.

౨. విభీషణ లక్ష్మణ వానరాదులకుఁ జికిత్స చేయుటయం దా మూలికలన్నియు వ్యయపడిన వన్న పరిహారము చెప్పఁ గూడినను మఱచిపెట్టినో యేమోఁ గని హనుమంతుఁడు అచిరకాలమునకుముందు తానే యుంచిన పర్వతవిషయమూహించి తెలిసికొనెననుటయు మూఁడు మూర్ఛఁచెననుటయు విరుద్ధమని తోఁచుచున్నది. దీనికిఁ బరిహారము విద్వాంసు లాలోచింపవలయు నని యున్నది.

ఈ మందర వ్యాఖ్యాత విద్వాంసుఁడు కానున్నను తనకుఁ దోఁచినది వ్రాసి పండితవిమర్శకై విడుచుచున్నాఁడు.

౧. విశల్యకరణి, సంధానకరణి తెలిసినవారు చెంచులలో నేనాదులలోఁ దదితరులలో నేఁటికిని గలరు. ఇది ప్రత్యక్షానుభవసిద్ధము. ఊహ కాదు. వీరు హిమవంతమునకుఁ బోయినవారు కారు. మన యడవులందే యివి దొరకుచున్నవి. సుషేణుఁడు వీనిని దనతోడఁ దెచ్చికొని యుండవచ్చును.

౨. అటు కాదేని కౌసల్యాదేవి రామచంద్రమూర్తికి విశల్యకరణి రక్షకట్టెఁ గదా, (అయోధ్య. ౭౫౦ ప.) అది యేమై కెక్కడిది?

౩. హనుమంతుఁడు మొదటిసారి సంజీవని తేకముందు గాయపడిన వానరులకుఁ జికిత్స చేసెనా లేదా? అప్పుడు దేనితోఁ జేసెను.

౪. ఋషభపర్వతమునుండి సుషేణుఁడు మూలికల సంగ్రహించెనని వాల్మీకి చెప్పకున్నను నూహింపవచ్చునుగాని యిన్నికోట్ల వానరులకుఁ జికిత్స చేయుటకు పిడికెడు దోసెఁడు వేరులు చాలవు గదా. ఒకగుట్టెఁడైనఁ గావలయును గదా. ఈ గుట్టెఁడు మూలికలు సేనామధ్యమున నుండెనేని వాని వాసనకుఁ జచ్చిన రాక్షసులు కూడ బ్రదికియుండవలెఁ గదా. అట్లు చెప్పఁబడలేదే.

౫. జాంబవంతుఁడు చెప్పినప్పుడు ఋషభపర్వతమని చెప్పెనుగాని దక్షిణకూటమని యుత్తరకూటమని చెప్పలేదు. కావున హనుమంతుఁడు ఆ పర్వతమునే పెకలించి తెచ్చెను. ఆ పర్వతమందలి తక్కిన కూటములందలి మూలికలు వ్యయమగుటచేఁ గాఁబోలు దక్షిణకూటమని నిర్దేశించెను. అప్పుడు మొదటిసారి రాత్రివేళ కావున లతలు మెఱయుచుండెనని చెప్పఁబడెను. ఇది పగటివేళ. రాత్రి గాదు. మూర్ఛదేఱిన లక్ష్మణుఁడు ఈ సూర్యుఁ డస్తమింపకముందే రావణు సంహరింపుమని రామచంద్రమూర్తితోఁ జెప్పఁగలఁడు. పగటిపూఁట నోషధులు ప్రకాశింపవు. ప్రకాశించినను సూర్యరశ్మివలనఁ దెలియరాదు. కావున నోషధుల వలన నిది యని గుర్తించుట సాధ్యముకాదు. మునుపు తెచ్చినది పర్వతము. ఇప్పుడు దాని యందలి శిఖరము మాత్రమే. కావున కొంచెము కాలమునకు ముందుంచఁబడిన దానిని ముమ్మాఱాచనేల యని సందేహింపఁ గారణములేదు. “హనుమాన్ శిఖరంగిరేః” “సన్న్యస్య శిఖరంగిరౌ” “తదిదం శిఖరం కృత్స్నం గిరేస్తస్యాహృతం మయా” యని శిఖరమును మాత్రమె తెచ్చెను గావున ఊఁచి పెకలించి తెచ్చినాఁ డనుటయందు విరుద్ధవిషయము కానరాదు. (పూర్వము ‘సతేన శైలేన భృశం విరాజ’-‘శైలోత్తమే వానరసేనమధ్యే - తమోషధీశైల ముదగ్రవీర్యః’ అని పర్వతమునే తెచ్చినట్లు చెప్పఁబడెను.)

సుషేణుఁడు మూలికల సేకరించి యుంచుకొనెనని యనుకొనినను నవి వ్యయపడి పోయెనని మొదటి సందేహమునకుఁ బరిహారము. కాలభేదముచే వస్తుభేదముచే గుర్తింపరాక తర్కింపవలసివచ్చెననియు అప్పుడు తెచ్చినదిగాక యిప్పుడు వేఱుగఁ దెచ్చుటచే కొంచెము శ్రమింపవలసివచ్చెననియు రెండవసందేహమునకుఁ బరిహారము.

కం. రా రమ్మా లక్ష్మణ! యని, గారామునఁ దమ్ము నపుడు కౌఁగిటఁ గ్రుచ్చెన్
శ్రీరాముఁడు కనుఁగవలన్, నీరము దొరలఁ గాడనిండు నెయ్యము పేర్మిన్. ౨౩౮౫

తాత్పర్యము స్పష్టము.

కం. అన్నా! లక్ష్మణ! యెంతటి, పున్నెంబో నిన్ను మరలఁ బొడగనఁగలిగెన్
జెన్నఱి యముబారిం బడి, క్రన్నన చనుదెంచి తీవు గాదిలియనుజా! ౨౩౮౬

అర్థములు. పున్నెంబో=పుణ్యమో, నే నెంత పుణ్యము చేసితినో యనుట, చెన్నఱి=కాంతిచెడి, క్రన్నన=త్వరగా.

తాత్పర్యము స్పష్టము.

కం. నీవు మరణింప నాకిల, జీవితమున నేమిఫలము ♦ సీతయు నేలా ?
రావణునిఁ జంపి జయమున, నే వఱలఁగ నేల? చెప్పు♦వే సౌమిత్రీ! ౨౩౪౭

అర్థములు. నాలవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము స్పష్టము.

—♦ లక్ష్మణుఁడు శ్రీరాముని రణంబునకుఁ బ్రోత్సాహపఱుచుట ♦—

కం. అనవుడుఁ బలుకులు తడఁబడ, మనమున నెగులూని యనియె♦మహితబలాఢ్యా?
తునుముదు రావణు రాజ్యం, బనఘ! విభీషణున కిత్తు♦నన వే చెపుమా. ౨౩౪౮

అర్థములు. నెగులు=దుఃఖరూపమైన విచారము.

తాత్పర్యము

అని చెప్పఁగా మాట తడఁబడ మనసున దుఃఖముతోడి విచారముగలవాఁడై యిట్లనియెను. మహాబలశాలీ! "నేను రావణుని జంపుదును, రాజ్యము విభీషణున కిత్తు"నని రెండు ప్రతిజ్ఞలు నీవు చేయలేదా ?

కం. పలికినబాస మహాత్మకు, లలఘుమతీ! తప్పిపోదు♦రా యెపుడేనిన్ ?
బలికినబాసనుదీర్పుటె, యలఘుగుణాఢ్యులకుఁ జిహ్న♦మతిబలధుర్యా! ౨౩౪౯

అర్థములు. బాస=మాట, భాషాశబ్ద భవము, ప్రతిజ్ఞ=ప్రమాణము.

తాత్పర్యము స్పష్టము.

కం. బలవంతుఁడ వీ వయ్యును, బలహీనునిమాడ్కి, బేద♦పలుకులు తగునే ?
వలవదు నాకై కార్యము, నిలుపఁగ రావణు వధించి ♦ నెఱపుము ప్రతినన్.

తాత్పర్యము

నీ వెంతో బలవంతుఁడ వయ్యును బలహీనునివలెఁ బేదపలుకులు పలుకుచున్నావు. ఇది సరిగాదు. నే నుండనీ పోనీ, నాకై కార్యము నీవు నిలుపవలదు. నీవు చేయఁబూనిన కార్యము చేయుము. రావణుఁ జంపెద నంటివి, చంపుము. నీ ప్రతిజ్ఞ నెఱవేర్పుము నీవు ప్రతిజ్ఞ చేసినపుడు, లక్ష్మణుఁడు జీవించి యుండిననే రావణుఁ జంపుదును, లేకున్న లేదని వ్యవస్థ పలుకలేదుగదా.

కం. ఖరదంతం బతిశాతన,ఖరమయి గర్జిలు మృగేంద్రు♦కనులం బడినన్
గరి యురుగలేనిగతిఁ ద్వ,చ్ఛరపథగతుఁ డసుర బ్రదికి♦చనలేఁడన్నా. ౨౩౫౧

అర్థములు. ఖరదంతంబు=కఠినమైన పండ్లుగలది, అతిశాతనఖరము=మిగుల వాఁడియగు గోళ్ళు గలది, గర్జిలు=బొబ్బరించు, మృగేంద్రు = సింహముయొక్క, కరి=ఏనుఁగు; త్వత్ =నీయొక్క, శరపథగతుఁడు=బాణమార్గమును పొందినవాఁడు

### తా త్ప ర్య ము

అన్నా! కఠిన దంతములు కరవాఁడిగోళ్ళు గలిగి బొబ్బలు పెట్టుసింహమునకుఁ గనఁబడి బ్రదికి పోలేని యేనుఁగువలె నీ బాణములబారిఁ బడి రావణుఁ డూపిరితోఁ బోలేఁడు.

చ. అరుణమయూఖుఁ డీత డిఁక ♦ న స్తముఁ జెందక మున్న పం క్తికం
ధరుఁ దునుమాడు మాతనివ♦ధం బభివాంఛిత మేని, త్వద్వచః
కరణము కార్య మేని, యిది ♦ కైకొన నీ కభిలాష మేని, యో
నరవర ! యిష్ట శీఘ్రముగ ♦ నావచనం బొనరింపు మర్మిలిన్. ౨౬౫౨

అర్థములు. అరుణమయూఖుఁడు = ఎఱ్ఱని కిరణములు గలవాఁడు — సూర్యుఁడు, అ స్తము చెందకమున్న = అస్తమింపకముందే, ఈ సూర్యుఁ డస్తమించుటకు ముందే యనుటచే లక్ష్మణమూర్ఛ పగట జరిగిన కార్యమనియు కాలనేమిని హనుమంతుఁడు చంపుటలోనైన కథలు మిథ్యాకల్పితములనియు గ్రాహ్యము ఈ విషయమిదివఱకే చర్చింపఁబడినది. ఇది బహుళ చతుర్థశిసాయంకాలసమయము

### తా త్ప ర్య ము

నీవు రావణుని జంపు కోరిక గలవాఁడవైతివేని నీ మాటప్రకారము నీవు నడచుకొనువాఁడవేని, నామాట నీ వంగీకరింప నిష్టమేని నీ సూర్యుఁ డస్తమింపక ముందే రావణుని వధింపుము. శీఘ్రముగ నామాటప్రకారము చేయుము.

## —♦ { ౧౦౩-వ సర్గము. శ్రీరామరావణుల కడపటి యుద్ధము ప్రారంభము. } ♦—

చ. అనవుడు రామచంద్రుఁడు ని♦జానుజ వాక్యము లాత్మ నుంచి వే
ధనువుఁ గొనెన్, దశాననుఁడు ♦ దా నొక స్యందన మెక్కి వేగిరై
దినకరుపైఁ దమోగ్రహము ♦ తీవ్రత వచ్చెకిమాడ్కి వచ్చి యా
మనుజవరేణ్యు వజ్రమయ♦మార్గణతాడితుఁ జేసెఁ గ్రూరతన్. ౨౬౫౩

అర్థములు. నిజానుజవాక్యములు=తన తమ్మునిమాటలు, తమోగ్రహము= రాహువు. వజ్రమయ=వజ్రములచే నిండిన, మార్గణ=బాణములచే, తాడితున్ = కొట్టఁబడినవానిగా.

### తా త్ప ర్య ము

ఈ ప్రకారము లక్ష్మణుఁడు చెప్పఁగా నతనివాక్యములు మనస్సునందుంచినవాఁడై శీఘ్రముగ ధనుస్సును గ్రహించెను. ఈ లోపల లంకకుఁ బరుగెత్తిన రావణాసురుఁడు తేరొకటి సిద్ధము చేసికొని శీఘ్రముగ సూర్యునిమీఁదికి రాహువు వచ్చునట్లువచ్చి రామచంద్రమూర్తిని వజ్రములచే నిండిన బాణములచేఁ గ్రూరుఁడై కొట్టెను. దీనివలన రావణాసురుఁడు లంకకుఁబోయి యలసటతీర్చుకొని

రథము సిద్ధముచేసి సన్నాహియై వచ్చునప్పటికి లక్ష్మణుఁడు మూర్ఛతేఱెనని యేర్పడుచున్నది.

ఇచ్చట రంగనాథ రామాయణమున లక్ష్మణుఁడు మూర్ఛతేఱిన తరువాత రావణుఁడు—

"అంత నా వృత్తాంత మంతయు నెఱిఁగి, యెంతయుఁ జింతించి యిచ్చలోఁ గలఁగి విక్రమక్రమశక్తి విడిచి రావణుఁడు, శుక్రుసన్నిధి కేగి" యతఁడు బోధింపఁగా పాతాళహోమము చేసినట్టు చెప్పఁబడెను.

వాల్మీకి రామాయణ ప్రకారముగ నిదియు విశ్వసింపరాదు. i. లక్ష్మణుఁడు లేచు నప్పటికి రావణుఁడు యుద్ధసన్నద్ధుఁడై వచ్చెను. ii. ఇంద్రజిత్తు యజ్ఞము చేసి వరములు పొందెనని శుక్రుఁడు చెప్పఁగా "దీనను మేలులేదు మనద్వేషుల నింద్రముఖామరాదులన్, మానితరీతి భక్తిని సమంచిత వస్తువులన్ భజింతురే" యని రావణుఁ డాక్షేపించెను. అట్టివాఁడు తాను యజ్ఞము చేసెననుట యెట్టిదో? iii. కపులు సమస్త యజ్ఞసామగ్రి ధ్వంసము చేసి స్రుక్స్రువముల నూడఁ బెఱికిన పిమ్మట వాఁడు చేసిన యజ్ఞ మేమిటో మండోదరి నేల లేవలసివచ్చెనో తెలియదు. యజ్ఞము యోగసమాధిగాదు పై మఱచియుండుటకు.

ఇట్టి యనుపపత్తులున్నను 'దశగ్రీవస్తతో హోమ మారేభే జయకాంక్షయా, ధ్వంసితం వానరేంద్రైస్తై రభిచారాత్మకం రిపో"' యని పాద్మ మందును, 'రావణుండు హోమాది విఘాతంబునంగాదె రాముచేత సమయింపఁబడె" శల్య. ౫౩ నందును జెప్పఁబడెను.

ఇందేగాక యితర విషయములఁ గొన్నిట కుంభకర్ణుని లక్ష్మణుఁడు జంపెనని లోనగు వ్యత్యాసములు గానవచ్చుచున్నవి. కావున నీ విషయముల నేరాముని గుఱించి వాల్మీకి రామాయణము వ్రాసెనో యా యుగమునాఁటి రామునిగుఱించి కాదని గ్రహింపనగు. స్కాందమునం దీసమాధానమే చెప్పఁబడెను.

కం. సీతాపతి పావకనిభ, శాతాశుగపంక్తి తప్త • జాంబూనదభూ
షాతతభూషితముం గొని, యాతని తను వెల్లవ్రణమ•యుంబుగఁ జేసెన్.

అర్థములు. పావకనిభ=అగ్నితో సమానమైన శాతాశుగపంక్తి=వాఁడి బాణముల వరుసను, తప్త=పుటము వేసిన, జాంబూనద = బంగారుతోఁ జేయఁబడిన, భూషా = ఆభరణములచే, తతభూషితమున్ = విస్తారముగ నలంకరింపఁబడిన దానిని.

తాత్పర్యము

రామచంద్రమూర్తి పుటము వేసిన బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి యగ్నిసమానములైన వాఁడిబాణములవరుసను గ్రహించి రావణుని దేహము వ్రణములలో నిండినదానిని జేసెను.

సీ. దేవగంధర్వాది ♦ దివిజు లప్పుడు చూచి; భూమిస్థితుండు శ్రీ ♦ రామవిభుఁడు
రథికుండు రావణ ♦ రాక్షసుం డిది సమ, యుద్ధంబు గా దంచు ♦ నుగ్గడింపఁ
గాంచనరుచిరంబు ♦ ఘంటికాశతభూషి, తము తరుణార్కని ♦ భము వినూర
భవకూబరంబును ♦ భర్మపరిష్కార,మును సితచామరం ♦ బును బలాశ
ఆ. కాంతి గలిగి రవిని ♦ కాశ మా హరితతి, గ్రాల రుక్మవేణు ♦ కలిత మైన
ధ్వజము మెఱయ తనర♦థంబును శక్రుండు, పంపె నపుడు రామ♦భద్రుకడకు.

అర్థములు. భూమిస్థితుండు=నేలమీఁద నిలువఁబడినవాఁడు, రథికుండు = రథమునం దున్నవాఁడు, ఉగ్గడింపన్=చెప్పఁగా, కాంచనరుచిరంబు = బంగారువలె మనోహరమైనది, ఘంటికాశతభూషితము=నూఱు ఘంటలచే నలంకరింపఁబడినది. తరుణార్కనిభము=యౌవనవంతుఁడైన(మధ్యాహ్న)సూర్యునితో సమానమైనది. వినూరభవకూబరము = వైడూర్యములతో చేయఁబడిన, కూబరంబును = నొగ గలదియు, భర్మపరిష్కారమును=బంగారు సొమ్ములుగలదియు, సితచామరంబును= తెల్లని గొడుగు గలదియు, పలాశకాంతి=ఆకుపచ్చ కాంతిగలదై, రవినికాశమా= సూర్యునితో సమానమైన, హరితతి=గుఱ్ఱముల సమూహము, రుక్మవేణుకలితము= బంగారు తొడుపువేసిన వెదురుగల.

తాత్పర్యము

దేవతలు గంధర్వులు లోనగువారు చూచి రామచంద్రమూర్తి నేలఁ నిలఁ బడినవాఁడు, రావణరాక్షసుఁడు రథమునం దున్నవాఁడు ఇది సమయుద్ధము గాదని చెప్పఁగా నింద్రుఁడు బంగారువలె మనోహరమై నూఱు గంటలు గలదై మధ్యాహ్నసూర్యుని బోలినదై వైడూర్యమయమైన నొగ గలదై బంగారు సొమ్ములు తెల్లగొడుగు గలదై ఆకుపచ్చవన్నె గలిగి సూర్యునితో సమానము లైన గుఱ్ఱములు గట్టిన బంగారు వెదురు దండము గల ఛత్రము మెఱయఁగా తన రథంబును రామచంద్రు నొద్దకుఁ బంపెను.

**—♦ మాతలి శ్రీరాముకడకు నింద్రుపనుపున రథంబుఁ దెచ్చుట ♦—**

కం. ప్రీతిని హరిహయుపనుపున, మాతలి స్యందనముఁ గొనుచు♦నుహీకిం డిగి శ్రీ
సీతాపతికిన్ మ్రొక్కెను, జేతన కశ యుండ దిగక ♦ స్వీయరథంబునన్.

అర్థములు. హరిహయుపనుపున = ఇంద్రుని యాజ్ఞ ప్రకారము, కశ = కొఱడా, దేవతలు నేల తాఁకరు గనుక మాతలి రథమందే యుండెను.

తాత్పర్యము స్పష్టము.

శా. దేవా! నీ విజయంబుఁ గోరి పనిచెన్ ♦ దేవేంద్రుఁ డీ స్యందనం
బీ వృత్రాసహనుఁతోడ నెక్కు కొనుమీ ♦ యీ యైంద్ర కాండాసనం
బీ వైశ్వానరతుల్యవర్మము దినా ♦ ధీశాభ బాణోత్కరం
బీ విస్ఫూర్జథశక్తియున్ రఘుపతీ! ♦ యీ వైరినాశార్థమై ౨౬౫౭

అర్థములు. ఐంద్రకాండాసనంబున్ = ఇంద్రసంబంధమైన వింటిని, వైశ్వానరతుల్య వర్మము = అగ్నిహోత్రముతో సమానమైన కవచము, దినాధీశాభ = సూర్యునితో సమానమైన, బాణోత్కరంబు = బాణముల సమూహము, ఈ విద్యున్నిభ = మెఱుపుతో సమానమైన, శక్తియున్ = శక్తియను నాయుధము, ఈ వైరి నాశార్థమై = ఈ విరోధిని జంపుటకై.

తాత్పర్యము

దేవా! నీ గెలుపు గోరి యింద్రుఁడు ఈ తేరిని పంపెను, దీనిపై నెక్కుము. ఇదియె గాక యీ వైరిని జంపుటకై యైంద్రధనుస్సును, అగ్నితో సమానమైన కాంతిగల కవచము, సూర్యకాంతిగలబాణ సమూహము, ఈ మెఱుపువంటి శక్తిని గ్రహింపుము.

కం. సారథినై యే నుండ బలారి దనుజసమితి మున్ను ♦ హరియించినటుల్
సారథి నై యే నుండఁగ, నీ రావణుఁ ద్రుంపు మిప్పు ♦ డీవు మహాత్మా.

అర్థములు. బలారి = ఇంద్రుఁడు.

తాత్పర్యము స్పష్టము.

సీ. అనవుడు వలగొని ♦ యభివాదనము సల్పి, భువనముల్ లక్ష్మిచేఁ ♦ బూరటిల్ల
రాముఁడు రథ మెక్కి ♦ రణ మొనరింపఁగ, రోమహర్షణము సం♦గ్రామమయ్యె
రాముఁడు రథికుఁడై ♦ రాణించుటను గాంచి దశకంఠుఁ డాగ్రహో♦దగ్రుఁడగుచు
గాంధర్వశర మేయ ♦ గాంధర్వశరమున, దైవశరం బేయ ♦ దైవమునను

ఆ. రాముఁ డడఁచి వైవ ♦ రాక్షసనాథుఁడు, పరమరోషుఁ డగుచుఁ ♦ బటుమహోగ్ర
రాక్షసాస్త్ర మేయ ♦ రాజితభూషణ, ఫణులు గవిసె రామ ♦ భద్రుమీఁద.

అర్థములు. వలగొని = ప్రదక్షిణముచేసి, అభివాదనము = నమస్కారము, పూరటిల్లన్ = నిండఁగా, రోమహర్షణము = గగ్గురుపాటుగలది, ఆగ్రహోదగ్రుఁడు = అతిశయించిన కోపముగలవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పఁగా రామచంద్రమూర్తి రథమునకుఁ బ్రదక్షిణము చేసి లోకములు కాంతిచే నిండఁగా రథ మెక్కి యుద్ధము చేయఁగా గగ్గురుపాటు గలిగించు యుద్ధము జరిగెను. రామచంద్రమూర్తి రథమునం దున్నవాఁ డగుట చూచి కోపాతిశయమున రావణుఁడు గాంధర్వాస్త్రము వేయఁగా గాంధర్వ బాణమునను, దైవాస్త్ర మేయఁగా దైవాస్త్రమునను గొట్టివేయఁగా రావణుఁడు మిగులఁ గోపించి భయంకరమైన రాక్షసాస్త్ర మేయఁగా దానినుండి బంగారు భూషణములు గల పాములు రామచంద్రమూర్తిపైఁ గవిసెను.

ఉ. మంటలు గ్రక్కుచున్ మిగుల ♦ మండెడు మోములతోడ వాసుకిన్
బంటగఁ జెప్ప నర్హమయి ♦ సర్వదిశల్ వెస నాక్రమించుచున్

కంటకవృశ్చిక సంబులు ప్ర • కాశసముజ్జ్వల దీర్ఘభోగముల్
మంటలమారులై కవియు • మార్గణముల్గని నిర్వికారుఁడై. ౨౬౦

అర్థములు. మంటల మారులు=మండు స్వభావము గలవై, మారియనునది దాని స్వభావము దెలుపు ప్రత్యయము, జగడాలమారి, కొట్లమారి మొదలైనవి, నిర్వికారుఁడై=వికారము లేనివాఁడై.

తాత్పర్యము

మంటలు గ్రక్కుచు మండుచున్న ముఖములతో వాసుకితో సమానములయి యన్నిదిక్కు లాక్రమించి బాధాకరములైన విషములు, ప్రకాశముచే వెలుఁగుచున్న పెద్ద పడగలు, మండు స్వభావములుగల బాణములు మీఁదికి రాఁగా వానిని జూచి భయపడక.

కం. గరుడాస్త్రమేయఁ గార్త, స్వర తార్క్ష్యాకారములను • సాయకచయముల్
సరభసగతిఁ జని కాకో, దరనికరముఁ ద్రుంచి వైచెఁ • దత్క్షణమందున్.

అర్థములు. కార్తస్వర తార్క్ష్యాకారములను=బంగారు గరుత్మంతులరూపములను, కాకోదర నికరమున్=పాముల సమూహమును.

తాత్పర్యము

గరుడాస్త్రము వేయఁగా దానినుండి బంగారు కాంతిగల గరుత్మంతుని యాకారములతో బాణములు బయలుదేఱి యా పాముల బాణముల నిమిషమందే సంహరించెను.

మ. తన సర్వాస్త్రము లిట్లు వ్యర్థ మగుటన్ • దర్పించి సంరంభియై
ఘనదుర్వారశరోగ్రవృష్టి పఱపెం • గాకుత్స్థుపై సూతుపైఁ
దనువుల్ నాటఁగ నొండు బాణమున దో • ర్దర్పంబు నిండారఁ గాం
చనకేతుం బడవైచి యశ్వములపైఁ • జం బార్చె నంతేవడిన్. ౨౬౨

అర్థములు. సంరంభియై = వేగిరపాటు గలవాఁడై, ఘన = గొప్పదై, దుర్వార=అణఁపరానిదైన, శరోగ్రవృష్టి=భయంకరమైన బాణవర్షము.

తాత్పర్యము

ఇట్లు తన యస్త్రము లన్నియు వ్యర్థములుగాఁగా గర్వించి వేగిరపాటు గలవాఁడై వారింపరాని బాణములను వర్షమువలె రామచంద్రమూర్తి మీఁదను మాతలి మీఁదను గురియించి వారి దేహములు నాటఁజేసి మఱియొక బాణమున బంగారు కేతువుఁ బడఁగొట్టి తేరి గుఱ్ఱముల గర్వం బణఁచెను.

ఉ. వాని యసాధ్య కార్యమును • వాని విజృంభణ రామచంద్రు పై
న్దీనతఁ గాంచి సిద్ధముని • దేవనభశ్చరచారణాదులున్
వానరులున్ విభీషణుఁడు • వానిరి గుందిరి దుఃఖితప్తులై
మానవభోజియే గెలిచి • మాన్పె నొకో జగ మంచు నెంచుచున్. ౨౬౩

## తాత్పర్యము

రావణుఁడు చేసిన యసాధ్యకార్యము వాని యుద్రేకము రామచంద్రమూర్తి దైన్యము చూచి సిద్ధులు, మునులు, దేవతలు ఆకాశసంచారులు చారణులు లోనగువారును వానరులు విభీషణుండును మిగుల దుఃఖించి రావణుఁడే గెల్చి లోకమును భస్మము చేయునేమో యని తలఁచుచు.

సీ. రామసుధాంశుండు ♦ రావణరాహుచే, సంగ్రస్తుఁడైన న♦క్షత్రమునంద
శశికిఁ బ్రియంబు ప్రాజా♦పత్య మగు రోహి,ణిని నాక్రమించె నిం♦దుని సుతుండు
ప్రజ కరిష్టంబుగఁ ♦ బ్రజ్వలితాంబుధి, ధూమవృతోర్మికా ♦ స్తోమ మగుచు
గ్రహరాజు నంటెడి♦గతి నుబ్బె సూర్యుండు, నీలవర్ణుండును ♦ నిష్ఠురుండు
తే. ద్యుతివిహీనుండు భీకర♦ధూమకేతు, సక్తుఁడు కబంధలక్షణ♦సంయుతుండు
నగుచుఁ దోఁచెను రావణుఁ♦డాక్రమింప, బాణసంధానశక్తి గీ♦డ్పడియెఁ బతికి.

అర్థములు. రామసుధాంశుఁడు = రాముఁ డను చంద్రుఁడు, ఇందుని సుతుఁడు=బుధుఁడు, ప్రాజాపత్యము=ప్రజాపతి దేవతాకము, అరిష్టంబుగన్ = కీడుగా, ప్రజ్వలితాంబుధి=మండుచున్న సముద్రము,ధూమవృతోర్మికాస్తోమము= పొగచేఁ గూడిన యలల సమూహముగలది, గ్రహరాజున్ = సూర్యుని, ద్యుతిహీనుఁడు=కాంతివిహీనుఁడు, భీకర=భయంకరమైన, ధూమకేతుసక్తుఁడు=ధూమకేతులతోఁ గూడినవాఁడు, కబంధలక్షణ సంయుతుఁడు = కబంధ చిహ్నముఁ గలవాఁడు, బాణసంధానశక్తి = బాణము వింట సంధించు బలము, కీడ్పడియెన్ = చెడెను.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి యను చంద్రుని రావణుఁ డను రాహువు పట్టఁగా, చంద్రునికిఁ బ్రియమై ప్రజాపతి దేవతగాఁగల రోహిణిని ప్రజలకుఁ గీడుగ బుధుఁ డాక్రమించెను. సముద్రము సలసల గ్రాఁగు నీళ్ళుగలదై పొగలు వెడలు అలలు గలదై సూర్యునిఁ దాఁకునట్లు పొంగెను. సూర్యుఁడు నీలవర్ణుఁడు, కఠినుఁడు, కాంతిహీనుఁడు, ధూమకేతువుతోఁ గూడినవాఁడు, కబంధ లక్షణము గలవాఁడునై తోఁచెను. రావణుఁడు పరాక్రమింపఁగా రామచంద్రమూర్తి బాణము సంధించుటకు శక్తిగలవాఁడు కాఁడయ్యెను.

తే. కోసలేంద్రులకులతార♦వాసవాగ్ని, దైవతంబు విశాఖను ♦ ధరణితనయుఁ
డణఁచె వింశతిభుజుఁడు శ♦రాసకరుఁడు, పంక్తివదనుండు మైనాకు♦పగిది నిలిచె.

## తాత్పర్యము

ఇక్ష్వాకుల కులతారయు ఇంద్రాగ్ని దైవతమైన విశాఖను అంగారకుఁ డాక్రమించెను, రావణుఁడు విల్లు చేతగలవాఁడై మైనాకునివలె స్థిరుఁడై నిలిచెను.

—• శ్రీరాముఁడు విజృంభించి రావణుశూలంబుఁ దునియలు చేయుట •—

ఉ. వాని కడిందిపీఁక తన•వారల వెల్వెలఁబోక గాంచి భూ
జాని సురక్తనేత్రుఁడు రు•షామతియుం భ్రుకుటీద్ధఫాలుఁడై
వానిని దృష్టిమాత్రమున • భస్మము చేయువిధానఁ జూడఁ గ్రో
ధానను రాముఁజూచి భయ • మందె సమస్తములైన భూతముల్. ౨౩౬౬

అర్థములు. కడిందిపీఁక = అసాధ్య పరాక్రమము, భూజాని=రామచంద్రమూర్తి, సురక్తనేత్రుఁడు=మిగుల నెఱ్ఱనైన కన్నులుగలవాఁడు, రుషామతిన్ = కోపముతోడి మనస్సుతో, భ్రుకుటీద్ధఫాలుఁడు=బొమముడిగల నొసలు గలవాఁడు, దృష్టిమాత్రమునన్=చూపులచేతనే.

తాత్పర్యము

రావణుని పరాక్రమము, తనవారి విన్నఁదనము చూచి రామచంద్రమూర్తి కోపముచే నెఱ్ఱని కన్నులు గలవాఁడై కనుబొమలు ముడివడఁ జూపులచేతనే వానిని భస్మముచేయుఁనట్లు చూడఁగా, కోపముతోడి ముఖముగల రామచంద్రుని జూచి సమస్తప్రాణులు భయపడెను.

౧౦౮-వ సర్గము.

చ. పుడమి వడంకె, సత్త్వయుత • భూధరముల్ ధరణీరుహాళితో
గడగడలాడె, సాగరుఁడు • గాకుపడెన్, ఖగజాతి మింటిపైఁ
గడుఁ బరుషధ్వనుల్ నెఱపెఁ • గర్కశరావము నించె మేఘముల్
పిడుగులు రాలె, రావణుఁడు • భీతిలెఁ దద్భయదాకృతిం గనన్. ౨౩౬౭

అర్థములు. సత్త్వయుత=జంతువులతోఁగూడిన, భూధరముల్=కొండలు, ధరణీరుహాళితోన్ = చెట్లతో, కాకుపడెన్ = కలఁతచెందెను, కర్కశరావము= కఠోరధ్వని, తత్ భయదాకృతిన్=ఆభయంకరాకారమును, కనన్=చూడఁగా.

తాత్పర్యము

భూమి వడఁకెను. మృగములతోఁ జెట్లతో కొండలు గడగడలాడెను. సముద్రము కలఁతచెందెను. పక్షులాకాశమునఁ గఠినధ్వనులు నించెను. మేఘములు కఠోరముగ నఱచెను. పిడుగులు పడెను. ఆ భయంకరాకారముఁ జూచి రావణుఁడు భయపడెను.

శా. కల్పాంతప్రతిమాన భీమతరసం•గ్రామంబుఁ జూడన్ దివిన్
వేల్పుల్ దానవదైత్యసిద్ధఋషులున్ • విద్యాధరుల్ గూడుచో
స్వల్పాన్యప్రియతన్ రఘూత్తముఁడు గె•ల్వం గోర బృందారకుల్
జల్పింతుర్ దశకంఠుఁడే గెలువ ను•త్సాహంబుమై నాశరుల్. ౨౩౬౮

అర్థములు. కల్పాంత ప్రతిమాన = ప్రలయకాలముతో సమానమైన, భీమతర = మిగుల భయంకరమైన, సంగ్రామంబున్=యుద్ధమును, దివిన్=ఆకాశ

మందు, స్వల్పాన్య=హెచ్చైన; ప్రియతన్ = ప్రీతిచే, బృందారకుల్ = దేవతలు, ఆశరుల్ = రాక్షసులు.

తా త్ప ర్య ము

ప్రలయ కాలమువలె భయంకరమైన యుద్ధముఁ జూడ నాకాశమందు గుంపుగూడిన దానవులు దైత్యులు ఋషులు విద్యాధరులు-వీరిలో దేవతలు-వారి పక్షము వా రత్యంత ప్రీతితో రామచంద్రమూర్తి జయింపవలెనని కోరఁగా, రాక్షసులు- ఆ పక్షమువారు రావణుఁడు జయించును గాక యనుచుండిరి.

సీ. ఈలోన రావణుం ♦ డెనఁగెడి కోపాగ్ని,జానకీవల్లభు ♦ సంహరింప
వజ్రసారము సర్వ♦వైరినిబర్హణం, బతులనాదము పర్వ♦తాగ్రతుల్య
కూటచితంబును ♦ క్రూరంబు దృష్టిభ, యావహంబును సుతీ♦క్ష్ణాగ్ర మధిక
రౌద్రం బనాసాద్య ♦ మద్రిదారణమును, శూలంబు నొక్కటిఁ ♦ గేల బూని

ఆ. మండిపడుచు నార్తి ♦ చండరవంబున, గర్జ సలిపెఁ బృథివి ♦ గగనతలము
దిశలుఁ గోణములును ♦ దిర్దిర దిరుగంగ, జలధి క్షోభ మొంద♦జగము లదర.

అర్థములు. ఎనఁగెడి = అధికమగుచున్న, వజ్రసారము = వజ్రమువంటి సత్త్వగలది, సర్వవైరి నిబర్హణంబు=సమస్త శత్రువుల సంహరించునది. అతుల నాదము=అసమానమైన ధ్వని గలది. పర్వతాగ్రతుల్య = శిఖరముతో సమాన మైన, కూటచితము = మేకులతోఁ గూడినది, దృష్టిభయావహంబు = చూచు టకు భయంకరమైనది, సుతీక్ష్ణాగ్రము = మిగుల వాఁడియైన కొనగలది, అనా సాద్యము=పొంద రానిది, అద్రిదారణమును=కొండలనైనఁ జీల్చునది.

తా త్ప ర్య ము

ఈలోపల రావణుఁడు కోపాతిశయమున రామచంద్రుని జంపుటకై వజ్రము వలె దృఢమై సర్వశత్రువులసంహరింపఁగలదై, గొప్పధ్వనిగలదై, శిఖరముతో సమా నమైన మేకులుగలదై, క్రూరమై, చూచుటకు భయంకరమై మిగులఁ బదునైన కొన గలదై, మిగుల రౌద్రమై, ప్రాపింపరానిదై, కొండలనైనఁ జీల్చునదియైన యొక శూలమును గట్టిగా ధ్వనించుచుఁ జేతఁదీసికొని మండిపడుచు భూమి ఆకాశము దిక్కులు మూలలు దిర్దిర దిరుగఁగ సముద్రము కలఁతపడ సింహనాదము చేసి.

చ. కరమునఁ బూని రాక్షసని♦కాయము లుబ్బఁగ రామచంద్రునిన్
బరుషవచస్కుఁడై యనియెఁ ♦ బార్థివనందన! వజ్రసారమై
పరఁగెడిసాధనం బిదియు ♦ భ్రాతృసహాయుని నిన్నుఁ ద్రుంచి సం
గరహతరాక్షసావళులఁ ♦ గానఁగఁ బంచెడిఁ దోడుగూడఁగన్. ౨౩౭౦

తా త్ప ర్య ము

చేతధరించి రాక్షససమూహములు సంతోషించుచుండఁగా రామచంద్ర మూర్తిని జూచి కఠినవాక్కుల నిట్లనియె. రాజకుమారా ! వజ్రమువలె దృఢమై

రొప్పుచున్న యీ యాయుధము తమ్ముఁడు తోడుగాఁగల నిన్నుఁజంపి యుద్ధమందు చచ్చిన రాక్షసులకుఁ దోడుగాఁ బంపఁగలదు.

చ. నిలు నిలుమీ నిమేష మిఁక ♦ నీల్గితి వంచును వీచి వైచినన్
గలితమహాష్టఘంట మయి ♦ క్రాయుచుఁ జంచల లభ్రవీథి రా
జలజవిలోచనుండు దృఢ ♦ సారశరంబులఁ గల్పవహ్ని పై
జలములు చల్లినట్లు రభ ♦ సంబున వైచిన వాని నన్నిటిన్. ౨౩౮౧

అర్థములు. కలితమహాష్టఘంటము = ఎనిమిది ఘంటలతోఁ గూడినది, చంచలలు = మెఱుపులు, అభ్రవీథిన్ = ఆకాశమందు, క్రాయు = ఉమియు, కల్పవహ్నిపైన్=ప్రలయకాలాగ్నిమీఁద.

తా త్ప ర్య ము

ఒక్క నిమిషము నిలుము చచ్చెదవని త్రిప్పివేయఁగా యెనిమిది గంటలు గలదై మెఱుఁగులు గ్రక్కుచు నాకాశమునరాఁగా రామచంద్రమూర్తి బలమైన బాణములను వేయఁగా నవి ప్రలయకాలాగ్నిమీఁద నీళ్ళు ప్రోక్షించి నట్లులై వాని నన్నిటిని.

కం. దహనుఁడు మిడుతలపింఛము,దహియించినమాడ్కిఁ గాల్చి♦తనపై రాఁగన్
మహిపతితనయుఁడు గని దు, స్సహశక్రప్రేషితోరు♦శక్తిన్ వైచెన్. ౨౩౮౨

అర్థములు. దుస్సహ = సహింపరాని, శక్రప్రేషిత = ఇంద్రునిచేఁ బంపఁబడిన, ఉరుశక్తిన్ = గొప్ప శక్తిని.

తా త్ప ర్య ము

అగ్ని మిడుతలగుంపుల గాల్చినట్లు గాలిచి మీఁదికిరాఁగా నింద్రుఁడు పంపిన శక్తిని దానిపై వైచెను.

ఉ. మాతలి తెచ్చినట్టి బల ♦ మర్దనశక్తియు ఘంటికారవం
బాతతభంగిఁ బర్వఁ జని ♦ యాశరుశక్తిని దాఁక నద్దియున్
ధ్మాతలమందుఁ గూలె జవ ♦ సత్త్వ మఱన్ శకలీకృతంబు నై
భూతము లార్వ వానరులు ♦ బొబ్బలు పెట్టఁగ వేల్పు లుబ్బఁగన్. ౨౩౮౩

తా త్ప ర్య ము

మాతలి తెచ్చిన యింద్రశక్తియు ఘంటలధ్వనితోడఁ బోయి రాక్షసశక్తిని దాఁకఁగా నది జవబలములు క్షీణించి నేలఁగూలెను. ప్రాణు లఱచెను. వానరులు బొబ్బలు పెట్టిరి. దేవతలు సంతోషించిరి.

ఉ. రాఘవుఁ డంతఁ బోక ఖల ♦ రావణు తేరిగుఱ్ఱాలఁ దీక్ష్ణ భా
శౌఘములన్ జవం బడఁగ ♦ నాశుగతిన్ ఘటియించి నిస్తులా
మోఘశరాళి దైత్యునుర ♦ ముం బగిలించి ఖగత్రికంబునన్
లాఘవ మొప్ప నాతని ల ♦ లాటము బ్రద్దలు వాఱఁ జేసినన్. ౨౩౮౪

అర్థములు. ఖగత్రికంబునన్=మూఁడు బాణములచే.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యంతతో వదలక రావణునితేరి గుఱ్ఱములను వాని వేగమడఁగునట్లు బాణములచేఁ గొట్టి, యమోఘ బాణములచే రావణు వక్షము పగిలించి మూఁడు బాణములచే వాని నొసలు బ్రద్దలగునట్లు కొట్టెను.

తే. భిన్నగాత్రుండు రక్తసం♦క్లిన్నతనుఁడు,నగుచుఁబూచు నశోకంబు♦జిగివహించి
బాణవేదన సైరింప♦వశము గాక, దుఃఖసంతప్తుఁడై కుందె ♦ దురమునందు.

అర్థములు. భిన్నగాత్రుఁడు=భేదింపఁబడిన దేహము గలవాఁడు. రక్తసంక్లిన్నతనుఁడు = నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడు, జిగి = కాంతి, దురమునందు=యుద్ధమందు.

తాత్పర్యము

చీల్పఁబడి నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడై పూచిన యశోకము కాంతి గలవాఁడై బాణములవలని బాధ సహింపలేక యుద్ధభూమియందు మిగుల దుఃఖముచే సంతపించెను.

## —♦ ౧౦౯-వ సర్గము. శ్రీరాముఁడు రావణు నిందించుట ♦—

కం. ముచ్చిరి వెంటనె రోషము, హెచ్చఁగ దశకంధరుం డ♦హీనజవుం డై
చిచ్చుఱములుకుల రఘుపతిఁ,జుచ్చుఱుకున మొగులుకొలఁకు♦సాబగున నించెన్.

అర్థములు. ముచ్చిరి=శోకించి, అహీనజవుండై = మిగుల వేగము గలవాఁడై, చిచ్చుఱములుకులన్ = అగ్నిని లక్ష్యము సేయని బాణముల, చిచ్చుఱ, చిచ్చుఱ, చుచ్చుఱుకున = మిగుల చుఱుకున, చుఱుకు+చుఱుకు, చుచ్చుఱుకు, మొగులు=మేఘము, కొలఁకు సాబగునన్=కొలని వలె.

తాత్పర్యము

ఈప్రకారము శోకించి వెంటనే రోషము హెచ్చఁగఁ దెచ్చుకొని మిగుల వేగముతో రావణుఁడు అగ్నివంటి బాణములచే రాముని కొలనిని మేఘమువలె నించెను.

చ. ఘనశరపూరితాంగుఁ డయి ♦ కంపము నొందక తచ్ఛరంబులన్
దినకరభానుతుల్యముల ♦ దేవపథంబునయంద త్రుంచుచున్
బెనఁగుచు దద్విముక్తశిత ♦ భీకరకాండపరంపరాహతిం
దను వెఱవాఱ రాజిలి వ ♦ నస్థితపుష్పితకింశుకం బనన్. ౨౩౬౭

అర్థములు. ఘనశరపూరితాంగుఁడయి = గొప్ప బాణములచే నిండిన దేహము గలవాఁడై,దినకరభాను తుల్యములన్=సూర్యకిరణములకు సమానమైన వానిని, దేవపథంబున యంద = ఆకాశమునందే, తత్=రావణునిచే, విముక్త =

విడువఁబడిన, శిత=వాఁడియగు, భీకర=భయంకరమైన, కాండపరంపరాహతిన్ = బాణపరంపరల దెబ్బచే, తనువు = దేహము, ఎఱవాఱ=ఎఱ్ఱనగాఁగా, వనస్థిత= అడవియందుండు, పుష్పిత=పూచిన, కింశుకము=మోదుగుచెట్టు.

తాత్పర్యము

గొప్పబాణములచే నిండిన దేహము గలవాఁడై రామచంద్రమూర్తి చలింపక సూర్యకిరణములవంటి యా బాణములను ఆకాశమందే ఖండించుచు యుద్ధము చేయుచు వాఁడు వేసిన బాణపరంపరలదెబ్బచే దేహము అడవియందలి పూచిన మోదుగువలె నెఱ్ఱనై.

మ. ప్రళయాదిత్యునిఁ బోలి రాఘవుఁడు క్రూ♦రసాస్ఫారనారాచధా
రల రక్షోవిభుబింక మాఱ భుజశౌ♦ర్యస్థైర్యముల్ మాన్పినన్
బలియుం డాఖలుఁ డీడఁబోక కురిసెన్♦ బాణాళి నన్యోన్యచా
పలతాముక్తకలంబసంతతికృత♦ ధ్వాంతంబు నీరంధ్రమై ౨౩౭౮

అర్థములు. ఈడఁబోక = వెనుదీయక, అన్యోన్య = పరస్పరము, చాపలతా=తీఁగవంటి వింటి యస్త్రాటిచే, ముక్త = విడువఁబడిన, కలంబ సంతతిన్= బాణ సమూహముచే, కృత = చేయఁబడిన, ధ్వాంతంబు = చీఁకటి, నీరంధ్రమై= ఎడము లేనిదై, నీరంధ్రమై ధ్వాంతము కనులం గప్పిన నని యన్వయక్రమము, నిర్ + రంధ్రము=రంధ్రము లేనిది.

తాత్పర్యము

ప్రళయకాలమందలి సూర్యునివలె రామచంద్రమూర్తి క్రూరములైన బాణములధారలచే రావణుని పౌరుషము చెడునట్లు భుజబలము శౌర్యము స్థైర్యము మానునట్లుగా బలవంతుఁడగు నా దుష్టుఁడు వెనుదీయక బాణములు కురిసెను. సందు లేకుండున ట్లొకరిపై నొకరు వేసిన బాణసమూహములచేఁ గలిగిన చీఁకట్లు.

మ. కనులం గప్పినఁ దోఁపరై రెవరికి♦ కాఁలంబునన్ రాముఁ డి
ట్లనుఁ జిర్నవ్వున రోషవాక్యముల శుం♦ఠా! నీవు నాలేనిచో
మును నా భార్యను బాలికన్ వివశనున్♦ మూఢాత్ముఁడా! యాగతిం
గొని తెచ్చిన్ మది నిక్క పొంగెద వినీ♦ కూళుండ వీరుండవే? ౨౩౭౯

అర్థములు. తోఁపరైరి = రామరావణులు కనఁబడరైరి.

తాత్పర్యము స్పష్టము.

కం. క్రూరా! మద్విరహిత వెతఁ, గూరవనీస్థలిని సీతఁ♦ గోమలిని బలా
త్కారంబున హరియించియు, వీరుఁడ ననుకొనియెదే వి♦వేకవిహీనా! ౨౩౮౦

అర్థములు. మద్విరహిత = నేను వదలియుండిన దానిని.

తాత్పర్యము స్పష్టము.

కం. శూరుఁడ వనాథసతులన్, ధీరత ప్రముచ్చిల్లఁ బరస•తీకాముకుఁడా!
చోరునిగతిఁ గృతి సల్పియు, వీరుఁడ ననుకొనెదవా వి•వేకవిహీనా! -౩౮౧

అర్థములు. అనాథసతులన్=రక్షకులు లేని స్త్రీలను, ప్రముచ్చిల్లన్=దొంగిలింప, పరసతీకాముకుఁడా=ఇతరుల భార్యలయందు కామము గలవాఁడా!

తాత్పర్యము స్పష్టము.

కం. దూరీకృతమర్యాదా, హ్రీరహితా! సాధుమార్గ•హీనా! బలిమిన్
జేరిచి చేరువ మృత్యువు, వీరుఁడ ననుకొనెదవా వి•వేకవిహీనా! ౩౮౨

అర్థములు. దూరీకృత మర్యాదా=దూరముగాఁ జేయఁబడిన మర్యాద గలవాఁడా!- మర్యాదాహీనుఁడా!, హ్రీరహితా = సిగ్గులేనివాఁడా, చేరువన్= సమీపమందు.

తాత్పర్యము స్పష్టము.

కం. పుట్టి కుబేరునకు దోఁ,బుట్టువ వై బలము గలిగి • పోటుమగఁడ వై
దిట్టా! జగములు మెచ్చెడు, నట్టిమహాకృతిని జల్పి•తివు దురాత్మా! ౩౮౩

అర్థములు. పోటుమగఁడవై=శూరుఁడవై.

తాత్పర్యము స్పష్టము.

కం. అడిగొట్ట వగుచు లోకము, చెడఁదిట్టెడి నీచకృతిని • జేసితి విస్సీ
కుసుమము తత్ఫల మిప్పుడు, వెడఁగా! దురితంబు సేఁత•వృథగా జనునే? ౩౮౪

అర్థములు. అడిగొట్టు=కుత్సితుఁడు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. సిగ్గును నీకు లే దటర • సీతను జోరునిఁబోలె దుర్మతీ
యగ్గహనంబునన్ బలిమి • నట్లు హరించియు నీవె శూరుఁడం
చెగ్గతి నెంచెదో? యపుడ • యే నట నుండఁగ సీతఁ దాఁకినన్
నిగ్గులు దేఱుబాణముల • నీ యనుజున్ ఖరుఁ గూర్పనే నినున్. ౩౮౫

అర్థములు. అగ్గహనంబునన్=ఆ యడవియందు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఎంతటిభాగ్యమో చెనఁటి • యిన్నిదినాలకు నిన్నుఁ గంటి ని
న్నంతకుఁ జేరఁ బుత్తు నిఁక•మా యిపుడే మణికుండలప్రభా
వంతము శీర్షముం బలల•భక్షకపక్షులు లాగి లాగి యిం
తింతలు చేసి మెక్కుఁ బరి•హృష్టము లై తనివార నిమ్మెడన్. ౩౮౬

అర్థములు. చెనఁటి = దుష్టుఁడా, అంతకున్ = యముని. పలలభక్షకపక్షులు = మాంసముతిను పక్షులు, పరిహృష్టములై = మిగుల సంతోషించినవై, తనివారన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. నేలపయి నానావిధముల, ఱ్రీలిపడిన నీ యురంబు ♦ గృధ్రంబులు చం
చ్వాళిం జీల్చుచు క్షతజము, హాళిం బానంబు సేయు ♦ నాపోకచనన్. ౨౩౮౭

అర్థములు. చంచు+ఆళిన్ = ముక్కుల వరుసలచే, క్షతజము = నెత్తురు, ఆ[పో]కచనన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము స్పష్టము.

కం. మన్నిశితకాండచయుని, ర్భిన్నాంత్రంబులఁ బతంగ ♦ బృందము లిపుడే
పన్నగుల వైనతేయుని, చెన్నునఁ బడవైచు ప్రదుకఁ♦జెల్లదు నీకున్. ౨౩౮౮

అర్థములు. మత్ =నాయొక్క, నిశిత = పదునైన, కాండచయ = బాణ సమూహములచే, నిర్భిన్న = భేదింపఁబడిన, అంత్రంబులన్ = ప్రేగులను, పతంగ బృందములు=పక్షుల గుంపులు, పన్నగులన్=పాములను, వైనతేయుని చెన్నున= గరుడునివలె.

తాత్పర్యము

నా వాఁడి బాణములచేఁ జీల్పఁబడిన ప్రేగులను పక్షు లిప్పుడే పాములను గరుత్మంతుఁడువలెఁ బడవైచును. ఇఁక నీవు ప్రతుకఁదగవు.

## —♦ రావణు రథంబును సారథి మరలించుట —♦

చ. అని ప్రతిపక్షఘాతమున ♦ కై ద్విగుణీకృతవీర్యముద్బలుం
డును బరమాస్త్రశక్తియును ♦ నూత్నసముత్సుకుఁడై సమస్తసా
ధనముల లోఁ దలంచుటయుఁ ♦ దక్షిణ మస్త్రము లన్ని ప్రోలని
ల్చినఁ గని తీవ్రవేగుఁడయి ♦ చిత్తమునన్ శుభచిహ్న లన్నియున్. ౨౩౮౯

అర్థములు. ప్రతిపక్షఘాతమునకై = విరోధిని జంపుటకై, ద్విగుణీకృత= రెండంతలుగా చేయఁబడిన, వీర్య + ముత్ +బలుండు = వీర్యము, సంతోషము, బలము గలవాఁడై, పరమాస్త్రశక్తియును = గొప్ప యస్త్రముల శక్తియు గలవాఁడై, నూత్నసముత్సుకుఁడై =క్రొత్త ప్రయత్నము గలవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి రావణుఁ జంపుటకై రెట్టించిన వీర్యము, సంతోషము, బలము, మహాస్త్రశక్తి, నూతనప్రయత్నము గలవాఁడై, అన్ని యస్త్రంబులను మనస్సులోఁ దలఁపఁగా నన్నియు వచ్చి యెదుట నిలువఁగా తీవ్రవేగము గలవాఁడై శుభచిహ్నములు.

చ. గెలు పెఱిఁగింపఁ బొంగుచుఁ బ్ర ♦ కృష్టశరంబుల నొంప వాఁడు కీ
శుల యుపలంబులున్ మనుజ ♦ శూరుశరంబులు దాఁకి గుండియల్
గులగులగాఁగ నోటఱియె ♦ గ్రుక్కలు ప్రింగ నలంగెఁ దేజమున్
గళవళపాటు చెందె మదిఁ ♦ గాతరతన్ వహియించె డీల్పడెన్. ౨౩౯౦

అర్థములు. ప్రకృష్ట శరంబులన్=శ్రేష్టములైన బాణములచే, నొంపన్ = నొప్పింపఁగా, ఉపలంబులు = ఱాలు, ఇదివఱకే వానరులు ఱాలదెబ్బలచే నలఁగిన గుండెలు రామబాణములచే గులగుల యయ్యెనని భావము ఇట్లు రెం డిచ్చటఁ జెప్పుటచే నిప్పుడు వానరులు కొట్టిరని తలఁపరాదు, గులగుల గాఁగన్=చూర్ణము గాఁగ, ఓటఱియెన్ = బలహీనుఁ డయ్యెను. తేజఱన్ = కాంతి మాయఁగా, కాతరతన్=భయమును, డీల్పడెన్=డిల్లపోయెను.

తాత్పర్యము

జయము దెలుపఁగాఁ బొంగుచు శ్రేష్ఠము లయిన బాణములచే నొప్పింపఁగా వాఁడు ఇంతకుముందు తగిలిన వానరుల ఱాల దెబ్బలచేతను ఇప్పుడు దాఁకు రామ బాణములచేతను గుండెలు పొడిపొడి గాఁగా బలహీనుఁడై, గుటకలు మ్రింగుచు నలఁగి కాంతి మాసి కలఁతచెంది భయపడి డిల్లపోయెను.

ఉ. చాపముఁ బట్టలేఁడు శర•సంతతిఁ గూర్పఁగ లేఁడు జ్యాలతన్
గోపునఁ గట్టలేఁడు ప్రతి•కూలశరంబులఁ ద్రుంపలేఁడు వే
పైపయి దూఁకు బాణముల•పై నిగిడించుపృషత్కసంఘ మే
దో పెరమార్గముం గొనెడిఁ • దోఁప దొకింతయు దేహవిస్మృతిన్. ౨౩౯౧

అర్థములు. కోపున = కొప్పున, వింటికొనయందు, ప్రతికూలశరంబులన్= ఎదురువచ్చు బాణములకు, పృషత్కసంఘము= బాణసమూహము, పరమార్గము= వేఱుమార్గము, దేహవిస్మృతిన్ = మైమఱపుచే.

తాత్పర్యము

చేత విల్లు గట్టిగాఁ బట్టలేఁడు. ఎట్లెట్లో పట్టుకొనినను బాణములు సంధింప లేఁడు. అల్లెత్రాఁ డెక్కుపెట్టలేఁడు. ఎదురుగా వచ్చు బాణములను గొట్టలేఁడు. మీఁదమీఁద దూఁకుచున్న బాణములపైఁ దాను వేయు బాణములు తానొక్క ప్రక్కగా వేసిన నవి వేఱొక మార్గమునఁ బోవుచుండెను. మైమఱపుచే వాని కేదియుఁ దోఁచినదికాదు.

తే. కాలునకు గోచరించిన • కరణి నున్న, రథికుగతిఁ జూచి సారథి • రణధరిత్రి
దైత్యవరుఁడున్నఁ జచ్చుట•సత్యమనుచు, నెందివెల్లఁగనిఁదోలఁ•గించెరథము

అర్థములు. కాలునకున్ = మృత్యుదేవతకు, గోచరించినకరణిన్ = కనఁబడినట్లు.

తాత్పర్యము

మృత్యుదేవతకుఁ గనఁబడి చావ సిద్ధముగా నున్న వానివలె నుండు రథికుఁ డగు రావణుస్థితిఁ జూచి వీఁ డిప్పు డీ యుద్ధభూమియం దుండినఁ జచ్చుట నిజమని దూరముగా రథమును దీసికొనిపోయెను.

## —• ౧౦౬-వ సర్గము. రావణుఁడు సారథిని దూషించుట •—

చ. అనికిఁ దొలంగ దవ్వుగ శ•తాంగముఁ దెచ్చినసూతుఁ జూచి యి
ట్లనియెఁ గృతాంతచోదితసు•రాహితుఁ డాగ్రహరక్తనేత్రుఁడై
వినర యశక్తునట్లు బల•విక్రమపౌరుషహీనుమాడ్కి భీ
రునిగతి మానహీనువలె • రోషవివర్జితుపోల్కి దుర్మతీ ! ౨౩౯౩

అర్థములు. అనికిన్ = యుద్ధమునుండి, పంచమ్యర్థమున షష్ఠి — కృతాంతచోదిత = యమునిచేఁ బ్రేరేపింపఁబడిన, సురాహితుఁడు = రాక్షసుఁడు, ఆగ్రహరక్తనేత్రుఁడై = కోపముచే నెఱ్ఱవాఱిన కన్నులుగలవాఁడై, భీరునిగతిన్ = పిఱికివానివలె, రోషవివర్జితుపోల్కిన్ = రోషముచే విడువఁబడినవానివలె.

### తాత్పర్యము

యుద్ధభూమినుండి తొలగించి దూరముగ రథమును దోలికొని వచ్చిన సారథిని జూచి రావణుఁడు మృత్యుప్రేరితుఁడై కన్నులెఱ్ఱజేసి కోపించి యిట్లనియె. ఏమిర శక్తిలేనివానివలె, బలము పరాక్రమము పౌరుషము లేనివానివలె, పిఱికివానివలె, మానహీనువలె, రోషము లేనివానివలె, బుద్ధి లేనివాఁడా !

ఉ. ఏమిటి కీ రథంబు నిపు • డీడకుఁ దెచ్చితి శత్రుసన్నిధిన్
నామదిచొప్పెఱుంగక య•నాదరబుద్ధిని నిచ్చవచ్చిన
ట్లేమయి పోయె నస్త్రతతు • లేమయిపోయెర నాదుమాయ లి
స్సీ మరియాద దప్పి చెనఁ•టీ పరువంతయుఁ బాడుచేసితే. ౨౩౯౪

### తాత్పర్యము

నా మనస్సినతి యెఱుంగక నాయం దాదరబుద్ధి లేక నీయిష్టము వచ్చినట్లు ఏల యీ రథము నిప్పు డిచ్చటికి శత్రువు చూచుచుండఁగాఁ దెచ్చితివి? నేనిట్లు వచ్చునంత గతి యేమిరా? వచ్చెను. యుద్ధముచేయుటకు నా యస్త్రములన్నియు నేమైపోయెనురా? నామాయ లేమాయెనురా? దుష్టుఁడా! మరియాదదప్పి నాగౌరవము నాశము చేసితివా ?

కం. చిరకాల సమార్జిత మై, పరఁగిన నా యశము తేజ • బలమును నీచా !
దురమున వెనుదీయం డా, శరపతి యను నమ్మకంబు•పస సెనునీచేన్ ౨౩౯౫

అర్థములు. చిరకాల సమార్జితమై = ఎంతో దీర్ఘ కాలముగ నేను సంపాదించిన.

### తాత్పర్యము

ఎంతకాలముగానో నేను సంపాదించిన కీర్తి తేజస్సు బలము యుద్ధమునందు రావణుఁడు వెనుదీయఁడను పేరు నీచుఁడా ! నీచే నాశమయ్యెను.

కం. భువనప్రసిద్ధవీర్యం, డవిరళబలరంజనీయుఁ • డరి కనుచుండన్
బవరమున కాసపడు నా,బవి సార్చితె దేబెథంగిఁ • బాపాత్మకుఁడా! ౨౩౯౬

అర్థములు. అవిరళబలరంజనీయుఁడు = అధిక మగు బలముచే రంజింపఁ జేయఁదగినవాఁడు, అరి=పగవాఁడు, బవరమునకు = యుద్ధమునకు, బవిసి + ఆర్చితే=సిగ్గుదీసితివికదా, దేబెభంగి=దీనునివలె.

### తాత్పర్యము

జగత్ప్రసిద్ధమైన వీర్యము కలవాఁడు అధికబలముచే సంతోషింపఁజేయఁదగినవాఁడు నగు శత్రువు చూచుచుండఁగా యుద్ధమునం దాసక్తిగల నాసిగ్గును దీనునివలె నాశము చేసితివిగదా. ఒకసారి వరువెత్తి చాటుగవచ్చి మరల నే నేమి శూరుఁడనని నాయన కెదురుగఁ బోదును. చూచినవారైన నవ్వరా ?

సీ. పరుని పై రథమును ♦ బఱపక మూలకు, నిటు తెచ్చితివి దేహ♦మెఱుఁగ లేక
నామేలు కోరెడు♦నా సుహృదుం డిటు, సలుపునా యెపుడైనఁ♦బలువ కూళ?
పగతుండు సలుపంగఁ ♦ దగుకార్య మిదిగాక, నీయట్టివానికి ♦ నీతి యగునె?
నీ విట్లు సేయుట ♦ నిక్కంబు పరులచే, నేదియో మే లొంది ♦ తీవు దుష్ట
ఆ. నాదుసొమ్ము బహుది♦నంబుల నుండియుఁ, దినుట మఱవ వేని ♦ దీర్ఘకాల
మీవు నన్నుఁగొలిచి♦యొసఁగుట తలఁతేని,రథముఁ బఱపు మతఁడు♦రాకమున్న.

అర్థములు. సుహృదుఁడు=మిత్రుఁడు, పగతుఁడు = విరోధి.

### తాత్పర్యము

యుద్ధము చేయునపుడు పగవాని మీఁదికి రథముఁ దోలుటకు మాఱుగ నీకు దేహము తెలియక మదించి యీ మూలకుఁ దెత్తువా ? ఇక్కడ నేమున్నదని తెచ్చితివి? నా మేలుకోరు నా మిత్రుఁ డెపుడైన నీచుఁడా! యిట్లు చేయునా?నీవు చేసినపని శత్రువు చేయఁదగినది కాని నీవంటి వానికి నీతియైనదా ? అయినను దుష్టా! నీవిట్లు చేయుటచేఁ బగవానిచేత నేదో లాభము పొంది యుండవలెను.నీవు నా సొమ్మనేక దినములుగ దినుట మఱచినవాఁడవు కావేని, చిరకాలముగ నీవు నా కొలువునందుండి వృద్ధికి వచ్చుట తలఁచెద వేని శత్రు విచ్చటికిఁ దఱుముకొని రాకముందే యతని యెదుటికిఁ దేరు పోనిమ్ము.

### — ♦ సారథి రావణునకు సమాధానము చెప్పుట ♦ —

కం. మతిమాలిన యసురేశుఁడు, హితమతి యగు తనదుసూతు ♦ నిటు నిష్ఠురభా
షితముల నన నాతఁడు కడు,హితముగ సానునయసూక్తి♦నీగతిఁబలికెన్. ౨౩౯

అర్థములు. మతిమాలిన=బుద్ధిలేని, నిష్ఠురభాషితములన్ = పరుషవాక్యముల, సానునయసూక్తి=ఓదార్పుతోఁ గూడిన మంచి మాటలచే.

### తాత్పర్యము

సారథి తనకు మేలుచేసెనా కీడుచేసెనా యని యాలోచించు శక్తియు లేని రావణుఁడు తనమేలుగోరు తనసారథి నట్లు పరుషముగఁ బలుకఁగా నా సారథి మిగుల హితముగ నూరార్చు మాటలచే నిట్లు చెప్పెను.

చ. వెఱచినవాఁడఁ గాను, మఱి • వెంబరవిత్తను గాను, మూర్తుచే
నెఱి చెడి కానుక ల్గొనిన•నీతివిహీనుఁడఁ గాను నేను మై
మఱచినవాఁడఁ గాను, గొఱ•మాలినవాఁడను గాను, నీదు మేల్
మఱచినవాఁడఁ గాను, విను•మా చెలికారము మాన నే నెదన్. ౨౩౯

అర్థములు. వెంబరవిత్తను=దుష్టాగ్రేసరుఁడను, మూర్తు = శత్రునిచేత, నెఱి చెడి=నీతి మాలి, కొఱమాలిన వాఁడను=ప్రయోజన హీనుఁడను, చెలికారము = స్నేహము.

తాత్పర్యము

నేను భయపడినవాఁడనుగాను. దుష్టాగ్రేసరుఁడనుగాను. పగవానిచే లంచము గొన్న నీతిమాలిన నీచుఁడనుగాను. నేను దేహమును మఱచినవాఁడనుగాను. నిష్ప్రయోజకుఁడనుగాను. నీవు చేసిన మేలు మఱచినవాఁడనుగాను. నీయందు స్నేహ భావము వదలినవాఁడఁగాను.

కం. నీ కల్యాణమె కోరుచు, నీకీర్తిం గాచువాఁడ • స్నేహవశమునన్
నీ కేను బ్రియము సేయఁగ, నీకది యప్రియము దోఁచె•నే నేమందున్. ౨౪౦

తాత్పర్యము

నీ శుభముఁగోరి నీ కీర్తి రక్షించువాఁడను. స్నేహకారణమున నీకు నేను మేలు చేయఁగా నీకది కీడుగాఁ దోఁచెను. దానికి నే నేమి చెప్పఁగలను ?

సీ. ఈవిషయంబున • దేవ! నానుడి విను, తావకప్రియహితా•త్మకుఁడ నేను
నేదియో కులమునఁ • బ్రాదుర్భవించిన,యులుచయేతరిపోలెఁ • దలఁప వలదు
నన్ను నున్నతభూమి • నున్నవాహినిఁ గ్రిందఁ, దెచ్చినగతి నీదు•తేరి నిష్ప
డనిలోన మరలించి•పట్టివిఘంబును, సర్వంబు వినిపింతుఁ • జక్క విను ము
ఆ. బవరమునను మిగుల•బడలిక గని తని, గలివి లేమి మోము•తెలివి లేమిఁ
దలఁచినాఁడ గుఱ్ఱ•ములు సుడివడి డస్సి, డీలువడుచుఁ జెమట • జాలువాఱ.

అర్థములు. తావకప్రియహితాత్మకుఁడను = నీకుఁ బ్రియము హితము చేయవలయునను మనస్సు గలవాఁడను, ఏదియో కులమున=పేరు చెప్పరాని నీచ కులమున. ప్రాదుర్భవించిన = పుట్టిన, ఉలుచయేతరి పోలెన్ = చపలచిత్తుఁ డగు దుర్నీతిపరునివలె, గలివి=తేట.

తాత్పర్యము

ఏల నేను దేరి నిచ్చటికిఁ దెచ్చితినో యా విషయము చెప్పెదను. నా మాటలు వినుము. నేను నీ మేలు సంతోషము కోరువాఁడను. నేను ఏదియో నీచ కులమం దెవఁడకో పుట్టిన చపలచిత్తుఁ డగు నీతిమాలినవాఁ డని తలఁప వలదు. మిట్టనున్న నీళ్ళు పల్లమునకుఁ దెచ్చినట్లు నీ రథమును నేనేల తెచ్చితినో యా కారణము పూర్ణముగఁ జెప్పెద వినుము. నీ ముఖము తేటగా లేనిదయ్యెను. నీ దేహ మే

నీకుఁ దెలియదయ్యెను. నీ ప్రాణము లెట్లు పోవుచుండెనో నీకుఁ దెలియలేదు. ఈ కారణములచే నీవు యుద్ధమునఁ జాల బడలినాఁడ వని తలఁచితిని. నీ గతి యట్లుండ గుఱ్ఱములు డస్సి కలవరపడి డిల్లపోయి చెమటలు గాఱుచుండఁగా.

తే. అధికవృష్టిని మేడ్పడు • నాలవంగఁ, దోఁచె; నెన్నియొ శకునముల్ • దుష్టఫలము
లన్ని యగపడె; నిట్టిచో • నసురనాథ!, సూతునకు నర్హకృత్యంబు • రీతి వినుము.

అర్థములు. అధికవృష్టిని = పెద్ద జడివానచే, మేడ్పడు = అజ్ఞతనొందిన, ఆలు = గోవులు.

## తాత్పర్యము

జడివానకు గోవులు దిగ్భ్రమ గొనునట్టులయ్యెను. ఇదియును గాక నీకుఁ గీడు తెలుపు చెడు శకునములు గానవచ్చెను. ఇట్టి సందర్భములందు సారథి చేయఁదగిన కార్యము చెప్పెద వినుము.

సీ. దేశకాలంబుల • తెఱఁగు లెఱుంగుచు, నశుభశుభాంకంబు • లరసి కొనుచు
రథికునిముఖమునఁ • గ్రాలెడి దైన్యంబు, ఖేదంబు తెంపును • మోద మెఱఁగి
రాజబలాబల • తేజంబు లరయుచుఁ, బల్లంబు మిట్టల • భంగిఁ గనుచు
సమవిషమస్థలీ • క్రమము లూహించుచు, సమరకాలంబును • జక్కఁ దెలిసి

తే. పగలరంధ్రంబు వెదకుచుఁ • బగతునకును, బ్రక్కనెదురుగఁ బిఱుఁదికిఁ • బఱచు వేళ
లిన్ని కనిపెట్టి రథికున • కే విపత్తు, రాకయుండఁగఁ జేత సా • రథికిఁ దగవు.

అర్థములు అశుభశుభాంకంబులు = కీడు మేలు దెలుపు చిహ్నములు, సమ = చదరము, విషమ = గుంత మిట్టగానుండు, స్థలీక్రమము = నేల విధము, రంధ్రంబులు=దోషములు.

## తాత్పర్యము

సారథి యగువాఁడు యుద్ధప్రదేశము ప్రతికూలమైనదా యనుకూలమైనదా? కాలము నిట్టులే యెఱుఁగవలెను. శకునము లనుకూలములా ప్రతికూలములా? రథికుని ముఖ ముత్సాహము లేక దుఃఖవంతమై యున్నదా లేక సంతోషము తెంపుగలదై యున్నదా? రాజు బలవంతుఁడై యున్నాఁడా, బలహీనుఁడై యున్నాఁడా? తేజమెట్టు లున్నది విచారింపవలెను. రథము దోలునపుడు గుంతలు మిట్టలు చూచి తోలవలెను యుద్ధభూమి చరముగా నున్నదా హెచ్చుతగ్గులుగా నున్నదా, కాలము నట్లే యుద్ధమునకుఁ దగినది యగునా కాదా తెలియవలెను. గట్టిగాఁ గొట్టుటకై శత్రువు లందు లోపము లేవియున్నవో వెదకవలయును. శత్రువునకుఁ దే రెప్పు డెదురుగా సమీపమునకుఁ బోనీయవలె, ఎప్పుడు ప్రక్కగాఁ బోనీయవలె, ఎప్పుడు దూరముగ వెనుకకుఁ బోవలె? ఇవి యన్నియుఁ గనిపెట్టి రథికునకు తన లోపమువలన నే విపత్తు రాకయుండఁ జూడవలయును. ఇది సారథి కృత్యము.

ఉ. వాజుల గాసి దీఱఁగ, భ♦వద్రథము దొలఁగింప, నీదు ని
స్తేజత ఖేదముం దొలఁగఁ♦ జేసితిఁ గాని స్వతంత్రవృత్తి నో
రాజ! యొనర్ప లేదు, పతి♦ రాగపరీతుఁడ, నమ్ము మింక నే
యోజ నొనర్పు మన్న నటు♦లొప్పఁగఁ జేసెద రాక్షసేశ్వరా! ౨౩౦౩

తా త్ప ర్య ము

గుఱ్ఱముల బడలిక దీరుటకును నీగాసి తొలఁగుటకును నీ ఖేదము, కాంతి హీనత మానుపుటకును నేను దే రిచ్చటికిఁ దెచ్చితినిగాని నా యిష్టము వచ్చినట్లు స్వతంత్రించి నిష్కారణముగఁ దెచ్చినవాఁడఁ గాను. రాజా! ప్రభువునం దను రాగము గలవాఁడను. నా మాట నమ్ముము. ఇఁక నీ వెట్లు చేయుమనిన నట్లు చేసెదను.

కం. లీరుపఁగా నీదుఋణం, బేరీతి ఘటింపు మన్న♦ నే గడఁగెద నా
సారథివాక్యంబుల వే,సారులు మెచ్చుచును రాక్షస♦ప్రభు వనియెన్. ౨౩౦౪

తా త్ప ర్య ము స్పష్టము.

కం. పోనిమ్ము స్యందనము నీ, తానాథుని కభిముఖముగఁ♦గడయకుమీ ర
క్షోనాథుఁ డహితునుసుఱున్, మానుపకే దవ్వునుండి♦మరలఁడు వింటే. ౨౩౦౫

తా త్ప ర్య ము స్పష్టము.

కం. అని సంతసించి రావణుఁ, డనుపమహస్తాభరణము♦ నాతని కీయన్
దనుజేంద్రుముదల స్యందన,మును సారథి పఱపె రామ♦భూవరుమీఁదన్. ౨౩౦౬

అర్థములు. అనుపమ=అసమానమైన, హస్తాభరణము = చేతిభూషణము, ముదలన్=ఆజ్ఞాప్రకారము.

తా త్ప ర్య ము స్పష్టము.

## ఆదిత్య హృదయము

**-♦ ౧౦౭-వ సర్గము. అగస్త్యుఁడు శ్రీరామున కాదిత్యహృదయం బుపదేశించుట ♦-**

కం. అంతట సంగ్రామపరి, శ్రాంతునిఁ జింతాకులాత్ము♦ రక్షఃపతిసిన్
భ్రాంతంబునఁగని రణవి,క్రాంతికి మును నిలిచియున్న♦రఘురామవిభున్. ౨౩౦౭

అర్థములు. అంతటన్=సూర్యోదయానంతరము, లక్ష్మణ మూర్ఛతేలు నప్పటికి సూర్యాస్తమానము సమీపించినట్లు చెప్పఁబడెను.

ఇచ్చట నీతండె యీతండె యని వ్రేలఁ జూపి చెప్పుటచే సూర్యబింబమును జూపి చెప్పినట్లులయ్యెను. కావున నిది యమావాస్యయుదయమని గ్రహింపవలెను. ఇది వఱకు జరిగిన యుద్ధము రాత్రియుద్ధము, అంతటన్=రావణుని తేరిని సారథి తొలఁగఁ దీసికొనిపోయిన పిమ్మట, సంగ్రామ పరిశ్రాంతున్=యుద్ధమం దలసినవానిని, అనఁగా విరామము లేక యుద్ధముచేసి విసిఁగినవాని నని గ్రహింపవలెను. రావణాసురుని వలె

బడలిన వాని నని చెప్పరాదు. రావణుని స్థితియందే రామచంద్రమూర్తియు నున్న యెడల రావణుఁడుచచ్చునని భయపడి యతనిసారథి రథము దొలఁగింపఁ గారణము లేదు. చింతాకులాత్మన్ = (౧) భుజబలము అస్త్ర శస్త్రబలముగల వీనిని ఎట్లు చంపుదునాయని వ్యాకులపడిన మనస్సు గలవానిని,(౨)పరత్వము ప్రకటింపక యే కేవల మనుష్యవిధముగానే వీనిని జంపు టెట్లని యాలోచించు వానిని, (3) వీఁడు యుద్ధమున నిలువక తప్పించుకొని పోయెనే, ఇఁక నే నేమి చేయుదునా? ఊరిలోకిఁ బోవునేమో మరల రాఁడేమో ? నే నూరిలోకిఁ బోవుటకు లేదు. వాఁడా సంధికి రాక యుద్ధమునకు రాకయుండిన నేమిచేయవచ్చునని యాలోచించువానిని, ప్రాంతమున=ఎదుట, సమీపమందు, రణవిక్రాంతికి=యుద్ధమున విక్రమించుటకు, మును= ముందుగా, మరల యుద్ధమునకు వచ్చెఁగదా యని సంతోషించి త్వరపడి చంపుటకై ముందుగా నున్నవానిని, రఘురామవిభున్=రాముని, మఱియొక యోజన :- సంగ్రామ పరిశ్రాంతుని=రామబాణములచే మిగుల గాసిపడినవానిని, చింతాకులాత్మన్ = ఆ కారణముచేతనే రాముఁడు బలవంతుఁడుగా నున్నాఁడే, నన్నుఁ జంపునేమో నేనెట్లు గెల్తునా యని చింతించు వానిని, రక్షఃపతినిన్=ఇట్టి రావణుని అనియు నన్వయింపవచ్చును. ఈ యర్థము సరసముగా నున్నది. 'యుద్ధపరిశ్రాంతం, చింతయాస్థితం,' అను విశేషణములను బ్రక్కనున్న రావణ శబ్దముతో నన్వయింపక రెండవ శ్లోకములోఁ గడపటనున్న రామశబ్దముతో నన్వయించుటచేఁ బ్రాప్తించు దూరాన్వయదోషమీ యన్వయంబున లేదు. ప్రకరణానుసారముగను నన్వయసౌకర్యము నర్థసౌలభ్యము గలదై యున్నది. రామచంద్రమూర్తి బడలినాఁడని, ఎట్లు చంపుదునా యని యాలోచించుచున్నాఁడనియుఁ జెప్పవలసిన యవసరము లేదు. దీనివలనఁ బరత్వ ప్రకటన ప్రశంసయు లేదు. ఆదిత్యహృదయోపదేశమునకుఁ గారణము లేదు. గోవిందరాజీయ వ్యాఖ్యయందు కొన్ని గ్రంథములం దీ సర్గము లేదు. ఉదారి వ్యాఖ్యానింపను లేదు. అని యిది ప్రక్షిప్త సర్గమని వ్రాయఁబడియున్నది. గ్రిఫిత్ రామాయణమున నిట్లు వ్రాయఁబడినది. పుట 587.

"This canto does not appear in the Bengali recension. It comes in awkwardly and may, I think, be considered as an interpolation but I paraphrase a portion of it as a relief after so much fighting and carnage and as an interesting glimpse of the monotheistic ideas which underlie the Hindu religion." అనఁగా ఈసర్గము మన దేశప్రతులందు లేదు. ఇది వికారముగ నడుమ వచ్చినది. ఇది ప్రక్షిప్తమని నా యభిప్రాయము. అయినను నింత యుద్ధము, రక్తస్రావమయిన పిమ్మట కొంత విశ్రాంతిగ నుండు ననియు నిది హిందూమతమున వినోదకరమైన యద్వైతాభిప్రాయముల చూచాయలిందుఁ గాన వచ్చుచున్నవి గనుకను దీనిలో కొంత

దండాన్వయముగ వ్రాసితిని. ఇది గోవిందరాజీయము చూడక స్వతంత్రాభిప్రాయముగ వ్రాయఁబడినది.

శ్రీరామచంద్రమూర్తి సూర్యుని ధ్యానించుటచే నాయనకు రాఁగల పరత్వహాని యేమియు లేదు. దినదినము పూఁటపూఁట సంధ్యావందనంబునఁ జేయునది సూర్యోపాసనముగాదా. లోకసంగ్రహార్థమై నయోధ్యాపురాధిదేవతకు లోనగు వారికి నమస్కరించినవాఁడు, తా నున్న గుడిసెలో దేవాలయము చిన్నది నిర్మించుకొని నిత్యారాధన చేయుచుండినవాఁడు తన వంశమున కాదిపురుషుఁడైన సూర్యుని ధ్యానించుటచే నాయనకు వచ్చిన లోటేమియు లేదు. ప్రకరణమునుబట్టి యిది బుభుక్షువులకు నుద్దేశింపఁబడెను గాని ముముక్షువులకుఁ గాదు 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛే' త్తని లోకులు దీనిని ధ్యానింపవచ్చును. కావున రామచంద్రమూర్తి చేసినది కార్యమా యకార్యమా యనునది విచార్యముగాదు. వాల్మీకి దీనిని జెప్పెనా, మఱి యెవరైన దీని నిందు దూర్చిరా యను విషయమున నిది ప్రక్షిప్త మని కొందఱ యభిప్రాయమని తెలుప నిది వ్రాయవలసి వచ్చెను. రామచంద్రమూర్తి దీనిని ధ్యానించినను ధ్యానింపకున్నను స్తోత్రము సారవంతమైనది కావున సర్వజన సేవ్యము. కావున నాంధ్రీకరింపఁబడెను.

ఈ గ్రంథకర్త బాల్యమున గవ్వలు చదరంగ మాడునపుడు దీనిని ముమ్మాఱు పఠించుచుండెను.

కం. వ్యోమంబున వారల సంగ్రామంబును జూడఁ గోరి గమి గొనిన దివౌ
కోమండలితో నుండెడి, శ్రీమహితుఁ డగస్తి రాముఁ జేరి వచించెన్. ౨౮౦౯

అర్థములు. వ్యోమంబునన్ = ఆకాశమందు, గమిగొనిన = గుంపుగాఁ జేరిన, దివౌకోమండలిలో = దేవతా సమూహములో, అగస్తి = అగస్త్యుఁడు, అగస్త్యాగస్తీ రేవచ॥ద్వి॥కో॥

తాత్పర్యము స్పష్టము.

కం. శ్రీరామ రామ! విను శ్రద్ధారతి గుహ్యంబు మఱి సనాతన మిది నీ
వైరుల నెల్లర సంగర, ధారిణి నిద్దాన గెలిచెదవు దీర్ఘభుజా! ౨౮౧౦

అర్థములు. శ్రీరామ రామ = (౧) రామచంద్రమూర్తి చింతాపరుఁడై యుండుట చేతను,(౨) ఆదరాతిశయము వలనను,(౩) కార్యము తొందరఁబట్టియు రెండు మార్లు సంబోధనము, శ్రద్ధారతి = శ్రద్ధతోను భక్తితోను, రతి భక్తికిఁ బూర్వాంగమైనను నిచట భక్తి పర్యాయముగనే చెప్పఁబడెను. శ్రద్ధాభక్తులు లేవేని సర్వము వ్యర్థము. శ్రద్ధ = దృఢమైన విశ్వాసము. దీనివలన నీ ఫలము గలుగునను నమ్మకము. ఇది యుండినను భక్తి యుండవలెను. భక్తిలేని శ్రద్ధపూర్ణ ఫల మీయఁజాలదు. గుహ్యంబు=రహస్యమైనది. మంత్రము నెప్పటికి రహస్యముగ నుంచిననే ఫలవంత మగును. దానిని వెలిగాఁ జెప్పరాదు. గురువుపేరు దాఁపరాదు. గురువు పేరు దాఁచినను మంత్రమును దాఁచకపోయినను సంపద ఆయువు క్షీణించును.

"గుహ్యం ప్రకాశయేత్ ధీమాన్, మంత్రం యత్నేన గోపయేత్
అప్రకాశ ప్రకాశాభ్యాం క్షీయతే సంపదాయుషీ".

సదాతనము=సనాతనము, 'శాశ్వతస్తు ధ్రువో నిత్య సదాతన సనాతనాః' అమరము. వేదమువలె నాశములేక యెల్లప్పుడు నుండునది. దీర్ఘభుజా = ఇది పూర్వకృత పరాక్రమమును బ్రకటించుచున్నది. నీవు మహాభుజబలపరాక్రమమును గలవాఁడ వైనను శత్రుసంహారమందు నీకిది తోడుపడఁగలదు. నీ వైరుల నిది సంహరించు నని ఫలశ్రుతి చెప్పుటచే నిది కామ్యమని గ్రాహ్యము. 'రోచనార్థా ఫలశ్రుతి' యనునట్లు ఫలశ్రుతి చెప్పుట దానియందు రుచి పుట్టించుటకుఁ గావున ఫలశ్రుతి ముందుగాఁ జెప్పుచున్నాఁడు.

సీ. ఆదిత్యహృదయంబు ♦ శ్రీదంబు పుణ్యంబు, నఖిలవిరోధిసం♦హారకంబు
పరమశివంబును ♦ భద్రకారణమును, నిత్య మక్షయ్యంబు ♦ నిఖిలపాప
విదళనక్షమమును ♦ విజయకారణమును, శోకచింతాదిని♦షూదనంబు
నుత్తమమంత్ర మా♦యుర్వర్ధనము సర్వ, మంగళమాంగల్య♦మహితయశము
తే. భక్తి జపియింపఁ, దన్మనూ♦పాస్యమాను, రశ్మిమంతు సముద్యతు♦రవిసురాసు
రాదివందితు భాస్కరు♦నఖిలలోక, వల్లభునిఁ గొల్వుమీ వివ♦స్వంతుఁ దండ్రి.

అర్థములు. ఆదిత్యహృదయంబు = సూర్యునకుఁ బ్రీతికరమై యాదిత్య హృదయ మను పేరు గలది, శ్రీదంబు = సంపత్కరమైనది, పుణ్యంబు = పాఠకులకు పుణ్యఫలము నిచ్చునట్టిది, పుణ్యస్వరూపమైనది, అఖిల విరోధి సంహారకంబు= సమస్త విరోధుల సంహరించునది, పరమశివంబును = గొప్ప మేలిచ్చునది, భద్ర కారణము=క్షేమమునకుఁ గారణమైనది, నిత్యము=శాశ్వతమైనది. అక్షయ్యంబు= క్షయింపని ఫలము గలది, నిఖిలపాపవిదళనక్షమము=సమస్త పాపములనుచీల్చుట యందు సామర్థ్యము గలది, విజయకారణము = గెలుపొసంగునది, శోకచింతాది నిషూదనంబు = శోకము చింత లోనగు మనఃక్లేశములను చంపునది, ఉత్తమ మంత్రము=ధ్యానించువారిని రక్షించుటయం దుత్తమమైనది, ఆయుర్వర్ధనము = ఆయుస్సును వృద్ధి చేయునది, సర్వమంగళ మాంగల్యము = సర్వమంగళకరము లలో మంగళకరమైనది, మంగళకరము లగు వానికిని మాంగల్యము కలిగించునది, మహితయశము=మిగులఁ గీర్తికరమైనది, తన్మను = ఆ యాదిత్య హృదయ మను మంత్రముచే, ఉపాస్యమానున్=ఉపాసింపఁబడుచున్న వానిని, ఉపాసన మనఁగా ధ్యానము, రశ్మిమంతున్ = కిరణములు గలవానిని, సూర్యుని - సముద్యతున్ = ఉదయించుచున్న వానిని, రవిన్ = సూర్యుని, సుర+అసుర+ఆది = దేవతలు రాక్షసులు మొదలగు వారిచే, మనుష్యులచే - వందితున్ = నమస్కరింపఁబడిన వానిని, భాస్కరున్ = కాంతి గలిగించు వానిని, అఖిలలోక వల్లభునిన్ = ప్రాకృత

మండలమందలి సర్వలోకములకుఁ బ్రియుఁడైన వానిని, వివస్వంతున్ = సూర్యుని తండ్రీ = ప్రేమను దెలుపు పదము.

ఆదిత్య హృదయము = ఇచ్చట ఆదిత్య శబ్దముచే నాదిత్యమండలము చెప్పఁబడెను, హృదయము = లోపలి భాగము, ఆత్మయుండునది హృదయమందేకదా.

'అణో రణీయాన్ మహతో మహీయాన్, నాత్మాస్య జంతోర్నిహితంగుహాయామ్' అని కదా శ్రుతి చెప్పుచున్నది. కావున నాదిత్యహృదయ మనఁగా సూర్య మండల హృదయస్థానమున నుండు పరమాత్మకుఁ బ్రీతికరమైనదని యర్థము. ఆదిత్య మండలాంతర్వర్తియగువాఁడు శ్రీమన్నారాయణుఁడే. "య ఏషోంతరాదిత్యేహిరణ్మయః పురుషో దృశ్యతే" యనికదా శ్రుతి చెప్పుచున్నది. 'ధ్యేయ స్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః సరసిజాసన సన్నివిష్టః, కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ, హారీహిరణ్మయవ పుర్ధృతశంఖచక్రః" సూర్యమండలమధ్యమున శంఖచక్రములు కిరీటము హారములు భుజకీర్తులు మకరకుండలములు బంగారుఛాయగల దేహముగలవాఁడై కమలాసన మందుండు నారాయణుఁడు సర్వదాధ్యానింపఁదగినవాఁడు అని కదా ప్రసిద్ధి :—

బృహదారణ్యకము 3-7-3-అంతర్యామి బ్రాహ్మణమందు—

య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యా దంతరోఽయ మాదిత్యో న వేద యస్యాదిత్యశ్శరీరం య ఆదిత్య మంతరో యమయ త్యేష త ఆత్మాంతర్యా మ్యమృతః॥

ఎవఁడు ఆదిత్యునం దున్నాఁడో తనయందున్న యెవనిని ఆదిత్యుఁ డెఱుఁగఁడో, యెవని కాదిత్యుఁడు శరీరమో, యెవఁడాదిత్యునందుండి ఆదిత్యుని ప్రవృత్తి నివృత్తిలక్షణ నియమములు చేయుచున్నాఁడో. వాఁడు అంతర్యామి, యమృతుఁడు నగు నీ యాత్మ; అనఁగా నిరుపాధికామృతత్వశాలి యగు నాత్మ యని యర్థము. జీవాత్మ నిరుపాధికామృతత్వశాలి కాఁడు గనుక పరమాత్మకే యా విశేషము చెల్లుచున్నది.

ఆదిత్యశబ్దము కేవల మాదిత్య స్థూలదేహమున కన్వయింపదనియు దాని నధిష్ఠించియుండు దేవత కన్వయించుననియుఁ దదంతర్యామి యనినపుడా దేవత కంతర్యామి యగు పరమాత్మ యనియు గ్రహింపవలయును. కావున ఆదిత్యుఁ డన్నప్పుడు స్థూలదేహవిశిష్టుఁడై యాదిత్యుఁ డను పేరుగల జీవాత్మ యనియే గ్రహింపవలయును, దేవదత్తుఁడు శ్యాముఁ డన్నట్లు ఈ యంతర్యామి యగు దేవత నారాయణుఁడే యని శంకరాచార్యులవారు భాష్యమున వ్రాసియున్నారు. యఈదృగీశ్వరో నారాయణాఖ్యః పృథివీం = పృథివీదేవతాం, యమయతి = నియమయతి,

కావున నీ యాదిత్యహృదయ మనునది శ్రీమన్నారాయణప్రీతికరమైన స్తోత్రమని యెఱుఁగనగు.

'రశ్మిమంతున్ =రస్మి రశ్మీనాం మధ్యే తపంతమ్' అని సుపర్ణఘర్మాను

వాకోక్తి కలదు. ఇందు రశ్ములననుమఁ బ్రకాశించు రశ్మి యని పరమాంతరంగ భక్తుల విషయమున రశ్మిశబ్దము ప్రయోగింపఁబడినది. కావున రశ్మిమంతుఁడనఁగా అంతరంగభక్తులతో నిత్యసంయోగము గలవాఁడు.

సముద్యతున్ = ఉదయ మనునది లేనివాఁడయ్యు నున్న వానివలెఁ గానవచ్చువాఁడు. సూర్యోదయము సూర్యాస్తమానము చూచువారికే కాని సూర్యునకు లేవు కదా ! అట్లులే భగవంతునకు నవతారములు.

'యః పూర్వ్యాయ వేధసే నవీయసే' అను శ్రుతి క్రొత్తక్రొత్తగానుదయించునట్లు కనఁబడువాఁడు.

'రవిః=రూయతే స్తూయతే ఇతి రవిః, స్తోత్రము చేయఁబడువాఁడు.

సురాసురాదినందితున్='దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవతమ్" అని జితంతా స్తోత్రములోఁ జెప్పినట్లు దేవతలకు రాక్షసులకుఁగూడ సమానుఁడైన దేవుఁడు. వారిచే నమస్కరింపఁబడువాఁడు.

భాస్కరున్ = భాస్కరుఁడు = భాస్+కరుఁడు = (౧) కాంతిని గలిగించువాఁడు. (౨) పరులను పరిభవించు ప్రభావము గలవాఁడు, (3) భాస్ అనఁగా చక్రము. దానిని జేతియందుఁ గలవాఁడు భాస్కరుఁడు. ప్రకాశవంతులని చెప్పఁబడు సూర్యచంద్రాగ్నులకుఁ గూడఁ బ్రకాశము గలిగించువాఁడు, "న తత్ర సూర్యో భాతి నచంద్రతారకమ్, నేమావిద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః, తమేవ భాంత మనుభాతి సర్వం, తస్య భాసా సర్వ మిదం విభాతి" — శ్రుతి.

అచ్చట నీ సూర్యచంద్రులు నక్షత్రములు లేరు. ఇఁక నగ్ని యెక్కడిది ? ఆయన ప్రకాశ మనుసరించి యన్నియుఁ బ్రకాశించుచున్నవి. ఆయన కాంతిచే నన్నియుఁ బ్రకాశించుచున్నవి.

"That there are other worlds admit of little doubt — Our Sun is only a private in the host of heaven The lustre of Arcturus is one hundred times greater than that of our Sun The two components of Mizar, it is said have a mass not less than forty times that of our Sun Beta Cygni consists of a pair of Suns, one of its colour of topaz, the other of an emarald and the Galaxy contains a host of Suns Sir Robert Ball has good reasons for holding that the millions of stars which we actually see are simlpy the conspicuous members of a vastly more numerous hosts, of whose existance we are almost entirely ignorant, save for such glimqses of knowledge as the theory of possibilities can afford." Leasts of God by Zero. Page 55.

"ఇతర ప్రపంచములు గలవనుట సందేహము లేని విషయము. ఆకాశమున గానవచ్చు (నక్షత్ర) సేనా సమూహమందు మన సూర్యుఁడొక భటుఁడుమాత్రమే మన సూర్యుని తేజస్సుకంటె ఆర్కటరస్ కాంతి నూఱంతలు గొప్పది. మిజార్

లోని రెండు భాగములు మన సూర్యునికంటె నలువదంతలకుఁ దక్కువ గాని గొప్పవై యున్నవి. బేటసిగ్నియందు నిరువురు సూర్యులు గలరు. అందొకటి గోమేధికవర్ణము గలది. రెండవది మరకతవర్ణము గలది. గాలాక్సియందుసూర్యుల గుంపు గలదు. సర్ రాబర్ట్సు బాల్ అను వాఁడు మనకుఁ గానవచ్చు లక్షల కొలఁది నక్షత్రములు ఇంతకంటెఁ జాల గొప్పవనియు ననేకములు నగు వాని గుంపులొగొప్ప వనియు (నన్నవి మనకుఁ గానరావు) వానిని గుఱించి యూహచేఁ దెలిసికొనఁదగి నంత జ్ఞానలేశమును విడిచితిమేని మన కేమియుఁ దెలియదనియు వ్రాసెను."

మనకుఁ గానవచ్చు సూర్యునికంటె గొప్ప సూర్యుఁ డున్నప్పు డాయనను ప్రార్థింపక యీ సూర్యుని ప్రార్థింపనేల యని ప్రశ్నింపరాదు. అట్లు మన మూహించి గొప్ప సూర్యుని నర్చింపఁదలఁచితిమేని మన ప్రయత్నము వ్యర్థమగును వలన భూగోళమందు నొక కొండకంటె మఱియొక కొండ, దానికంటె మఱియొక కొండ, దానికంటెఁ బెద్దపర్వతము లెట్లున్నవో, యట్లేఖగోళమందు నొకసూర్యుని మించిన మఱియొక సూర్యుఁడు, అంతకు మించిన మఱియొక సూర్యుఁడు, అంతకు మించిన సూర్యుఁ డిట్లు లెక్కలేక కలరు. అన్నిటికంటె గొప్పసూర్యుని మనము కనుఁగొనుటెట్లు? పూజించు టెట్లు? కావున నే సూర్యుని మన మర్చించినను ఆ సూర్యమండల మందుండు భగవంతుని, శ్రీమన్నారాయణమూర్తిని మనము పూజించు వారమై యున్నాము. ఆ మాత్రమునకు చిన్న సూర్యునందుఁ బూజించిననేమి ? పెద్దసూర్యునందు బూజించిననేమి? అందు నిందు సర్వత్ర నుండు వాఁడొక్కఁ భగవంతుఁడే. గడ్డిపోఁచయందుఁగల భగవంతుఁడే బ్రహ్మరుద్రేంద్రాదులందుఁగలఁడు. మనము భక్తితోఁ శ్రద్ధతోఁ బూజించితిమేని మనకు భగవంతుఁ డాగడ్డిపోఁచయందే కానవచ్చును. రాతి స్తంభమునందు ప్రహ్లాదునకుఁ గానరాలేదా? కావున మనకు నేది సులభసాధ్యమో, మన మనస్సును నేది యాకర్షింపఁగలదో, దేనియందు మనకుఁ బ్రీతి విశ్వాసములు గలుగునో దానిని మనము పూజించిన నిష్టార్థసిద్ధి గల్గును. మనకు ప్రాణశక్తి సూర్యునినుండి విశేషమువచ్చుచున్నది. కావునఁ గానరాని సూర్యులకై మనము కడగండ్లు పడక యీ సూర్యునినే భగవచ్ఛరీరమని తలఁచి యందుండు భగవంతుని మన మర్చింప వలయును. విగ్రహారాధనార్థ మిదియే. సగుణోపాస్తి యిదియే. దీని వలననే మన కైహికాముష్మికఫలము లన్నియు లభించును. అనివార్యఫలదము. సమాన ఫలదము - శీఘ్ర ఫలదము - కావున దీనినే శ్రేష్ఠముగ భగవంతుఁ డర్జునున కుపదేశించెను కానరాని సూర్యు నుపాసించువారి నుపాసింపనిండు. దానికై కన్న కడగండ్లు పడనిండు. సగుణోపాసకుల కంటె వారి కెక్కువ ఫలమురాదు. శ్రమము మాత్రమే యెక్కువ.

వివస్వంతమ్ = వివస్తే ప్రభయా ఆచ్ఛాదయతీతి వివస్వాన్, వస-ఆచ్ఛాదనే, కాంతిచేత నన్నిటిని గప్పెడువాఁడు.

## తా త్ప ర్య ము

ఆదిత్యహృదయము సంపత్కరమైనది. పుణ్యదమైనది. సకలబాహ్యాభ్యంతరశత్రువుల నాశము చేయునది. మిక్కిలి శుభకరమైనది. క్షేమమునకు హేతువైనది. శాశ్వతఫల మిచ్చునది. క్షయము కానిది. పూర్వోత్తర పాపముల నెల్ల నాశముచేయునది గెలుపు గలిగించునది. దేహబాధ, మనోవేదన తొలఁగించునది. మంత్రములం దుత్తమమైనది. విహితమైన యాయువుకంటె నెక్కువ యాయువు కలిగించునది సమస్త మంగళములందు మంగళమైనది. జపించు వారికి గొప్ప కీర్తిని కలిగించునది. కావున నా మంత్రముచే రశ్మిమంతుఁడై యుదయించు సూర్యుని దేవతలచే రాక్షసులచే మనుష్యులచే నమస్కరింపఁబడు సూర్యుని, సమస్త లోకములకుఁ బ్రియుఁడైనవానిని నాయనా! యిఁక వివస్వంతుని గొల్వుము.

సీ. ఈతండె తేజస్వి ♦ యీతండు సర్వదే, వస్వరూపుఁడు రశ్మి ♦ భావనుండు
ఈతండ సుమి సర్వ ♦ బృందారకాసుర, గణము జగం బోముఁ ♦ గరచయముల
నీతండె బ్రహ్మయు ♦ నీతండె విష్ణువు, స్కందుండు శివుఁడు ప్ర ♦ జాపతియును
నితఁడెమహేంద్రుఁడు♦నీతండెధనదుండు,యముఁడుకాలుఁడుసోముఁ♦డప్పతియును

తే. నితఁడె పితరులు వసువులు ♦ నీతఁ డితఁడ,
మరుతులును సాధ్యు లశ్వులు ♦ మనువు నితఁడె
వాయువును వహ్నియును బ్రజా ♦ ప్రాణ మితఁడె
భద్రగుణ! ఋతుకర్త ప్ర ♦ భాకరుండు. -౨౪౧-

అర్థములు. తేజస్వి = గొప్ప తేజస్సుగలవాఁడు, పరులచు దనకు లోపఱచుకొనుశక్తి తేజస్సనఁబడును. సర్వదేవస్వరూపుఁడు = సమస్త దేవతల స్వరూపములు ధరించి యుండువాఁడు, అన్నిరూపులు తన రూపమైనవాఁడు భగవంతుఁడు తానే పెక్కు రూపములు ధరించెద నని సంకల్పించిసాలెపురుగు తన దేహమందున్న దానినే పోగులుగాఁదీసి పెద్ద గూడుకట్టినట్లు తన శరీరమైన ప్రకృతితోఁ దానే యుపాదానకారణమైనానారూపములు సృష్టించి వానిలో నేయే జీవున కేయే రూపము కర్మఫలానుభవమునకుఁ దగియుండునో దానిలో నా యా జీవుని బ్రవేశపెట్టి ఆ రెంటికి నియామకుఁడుగఁ దానందుఁ బ్రవేశించెను. జీవుఁడు,ప్రకృతి, ఆయన శరీరములే కావున వారిశోనైన రూపము లన్నియు నాయన రూపములే. దీనినే 'య స్సర్వేషు దేవేషు తిష్ఠన్' అను శ్రుతియు; జెప్పుచున్నది. రశ్మిభావనుండు= రశ్ములనఁగా పరమాంతరంగభక్తు లని ముందు వ్రాయఁబడెను. వీరే నిత్యులు ముక్తులు ననువారు. వీరిని భావింపఁజేయువాఁడు. భావమనఁగా సత్త-(ఉనికి)వారు భగవదిచ్ఛకులోనై నిత్యులు ముక్తులు నయి యుందురు. కావున వారి యా యునికి భగవదధీనము.

కరచయములన్=కిరణసమూహములచే, సర్వబృందారకాసురగణమున్ =

సమస్త దేవతలయు రాక్షసులయు సమూహమును, ఇగము = ప్రపంచములను, ఓమున్ =రక్షించును, 'యాభి రాదిత్య స్తపతి. రశ్మిభి స్తాభిః పర్జన్యో వర్షతి' అనఁగా సూర్యుఁడు తన కిరణములచే లోకమునందలి నీటిని నావిరిగా గ్రహించి దానిని మరల వర్షముగాఁ గురియించి దానివలన నన్నము గలిగించి సర్వప్రాణులను రక్షించునని భావము.

'అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్యగాదిత్య ముపతిష్ఠతే,ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నంతతఃప్రజా' అగ్నియందు వేల్వఁబడిన యాహుతి సూర్యుని బొందును. ఆ సూర్యునివలన వర్షము,వర్షమువలన నన్నము, దానివలనఁ బ్రజలు కలుగుదురు.

'దేవాన్ భావయతానేన తే దేవా భావయంతి వః' యజ్ఞాదులచే దేవతలు పూజింపఁబడుదురేని వారు వర్షముచేఁ బ్రజల రక్షింతురు.

'య ఏషోంత రాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' యని యోగుల సాక్షాత్కారమందుఁ జెప్పఁబడుటచే దాని ననుసరించి యందును నట్లే యతఁ డితఁడని చెప్పఁబడెను.

బ్రహ్మ = నాలుగు ముఖముల బ్రహ్మ తనకు శరీరముగాఁ గలవాఁడు, బ్రహ్మపదవికి రాఁదగిన జీవాత్మయందు భగవంతుఁడు ప్రవేశించి యతనిచే సృష్టి కార్యములు చేయించును."తవచాంతరాత్మా మమచయే చాన్యే దేహిసంజ్ఞితాః" అని బ్రహ్మ శివునకు నీకు నాకు దేహముగల యందఱకు నాత్మ విష్ణువే యని చెప్పి నట్లు విష్ణుపురాణంబునఁ గలదు. విష్ణువు=ఉపేంద్రావతారమూర్తి, స్కందుఁడు= 'స్కందిర్ గతి శోషణయో' యను ధాతువును బట్టి శత్రువులను శోషింపఁ జేయువాఁడు. కుమారశరీరకుఁడు. శివుఁడు=శివశరీరకుఁడు = 'స బ్రహ్మ సశివ స్సేంద్ర' యని శ్రుతి. ప్రజాపతియు - ప్రజాపతి శ్చరతి గర్భే అంతః - అన్నట్లు ప్రజలను బాలించువాఁడు. ప్రజాపతిశబ్దవాచ్యుఁడు, మహేంద్రుఁడు = స్వరూపైశ్వర్యములచేఁ దనకంటె గొప్పవాఁడు లేనివాఁడు,'ఇంద్ర విచిక్యుః పరమే వ్యోమన్ ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" అని శ్రుతి– ఇది=పరమైశ్వర్యే, ఇందతీతీంద్రః= పరమైశ్వర్య యుక్తుఁడు,అట్టివారిలో గొప్పవాఁడు,మహేంద్రుఁడు–సర్వతో ముఖం ప్రసృతత్వేన పూర్ణ మైశ్వర్యతయా మహాం శ్చాసా వింద్రశ్చ = అన్ని దిక్కుల వ్యాపించి యుండుటచే పూర్ణమైన యైశ్వర్యము గలవాఁడు కావున మహేంద్రుఁడు.

ధనదుండు = లఘుభ్యో ధనాయదోభ్య ధనం దదాతీతి ధనదః, అన్నాదో వసుదానః=ప్రసిద్ధుఁడైన సర్వఫలప్రదుఁడు (బృహ.౬౪–౫.౪)యముఁడు–యమయతి, శిక్షయతి– దండించువాఁడు–యః పృథివీ మంతరో యమయతి–భూమిలోపల నుండి శిక్షించువాఁడు–అకంటకం చానుకూలం యచ్ఛతీ త్యఖిలంయమః–'యమో వైవస్వతో రాజా యస్తవైష హృది స్థితః తేన చేదవివాదస్తే మాం గంగాం మా కురూం గమ'=నీహృదయమందుండి నిన్ను శిక్షించు రాజుతో నీకు వివాదము లేక

యాయన చెప్పినట్లు నీవు వర్తించితి వేని నీవు గంగకుఁ గురుక్షేత్రములకుఁ బోవల సిన పనిలేదు. అంతర్యచ్ఛతీతి యమః - జీవుల మనమును నిలుపువాఁడు - యమా దీన్ యచ్ఛతి యమః తత్తత్ఫల నియామకాన్- ఆయా ఫలనియామకములైన యమాదులం దధిష్ఠించి యిచ్చువాఁడు - యోగమున కంగము లగు యమ నియ మము లయినవాఁడు.

కాలుఁడు=ఆత్మని చరాచర సంకలనాత్ కాలః=చిదచిత్తులను దనయందుఁ గలుపుకొనువాఁడు కావునఁ గాలుఁడు. చరాచరం కలతే సంకలితం భవత్యస్మిన్ ఇతి కాలః, కాలః కలయతా మహమ్, భ. గీ. ౭-౧౦-౩౦. అంతటిని నెంచు వాఁడు కాలుఁడు. కాలాయ మహాగ్రాసాయవై నమః, అత్తా చరాచర గ్రహణాత్, శ్రుతి. అనాది ర్భగవాన్ కాలః, వి॥ పురా॥ జగత్సంహారకుఁడు, కలయతి ధర్మా ధర్మాసా మాయుషోవా సంఖ్యానం కరోతీతి కాలః = ధర్మాధర్మముల నైనను ఆయువునైనను లెక్కించువాఁడు కాలుఁడు.

సోముఁడు=సోమశబ్ద మమృత వాచి, తృతీయస్యామితో దివి సోమ ఆసీత్, అష్ట. ౩-౧-న ఖల్వమృతోపమః, అమృతిస్యేవ నాతృప్యన్ ప్రేక్షమాణా జనార్ద నమ్- శాంతి నమృద మమృతమ్ (తై-ఉ-శి-౬-౨) సోమః సుధాయమాన త్వాత్ ముక్తానాం పరికీర్తితః=ముక్తులకు నమృతమువంటివాఁడు, సూతేఅమృత మితి సోమః=అమృతమును బుట్టించినవాఁడు, "సోమః' పవతే జనతా మతీనాం జనితాదివ" ఇట్లు సకల కారణ సోమ శబ్దవాచ్యుఁడు, సోమరూపీశౌషధీఃపోష యన్ సోమః, చంద్రరూపమున నోషధులఁ బోషించువాఁడు.

అప్పతి=అప్పులను బాలించువాఁడు, ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపోవై నర సూనవః తా యద స్యాయనం పూర్వం తేన నారాయణస్స్మృతః—మను. అప్పు లనఁగా నారములు, భూతములు, వానికిఁ బతియైనవాఁ డప్పతి... పితరులు=అగ్ని ష్వాత్తు మొదలగువారు, వసువులు "సదా వసంతీతి వసవః"=ఎప్పుడు నుండువారు ఆహత్య వసంతీతి వసవః=కూడుకొని యుండువారు. వసనివాసే, వీరు ఆపుఁడు ధ్రువుఁడు సోముఁడు అధర్వుఁడు అనిలుఁడు ప్రత్యూషుఁడు అనలుఁడు ప్రభా సుఁడు. దీనికి కొంచెము పాఠభేదము కానవచ్చెడి. "ధ్రువో ధర సథా పోమ సోమ ఆపో వై శ్వానరోనిలః। ప్రత్యూషశ్చ ప్రభావశ్చ వసనో సాప్రకీర్తితాః".

అగ్నిశ్చ పృథివీచ వాయుశ్చాంతరిక్షంచ ఆదిత్యశ్చ ద్యౌశ్చచంద్రమాశ్చ నక్షత్రాణి చేతేవై వసవః. వీరు శ్రుత్యుక్త వసువులు. మరుతులు = కుపితేన అనేన మ్రియతే లోక ఇతి మరు. కుపితుఁడైన యితనిచేత లోకము మృతి పొందింపఁబడును. మ్రియంతే నకదాచి దితి మరుతః=ఎన్నఁడు మరణింపనివారు. వీరు శుక్ర జ్యోతి ప్రభృతులు, నలువది తొమ్మండ్రు. సాధ్యులు = సాధ్యంతే- ఆరాధ్యంత ఇతి సాధ్యాః=ఆరాధింపఁబడువారు. సాధ్యం సిద్ధి ర్యేషా మస్తీతివాః=

సిద్ధిగలవారు. రాధ సాధ సంసిద్ధౌ. మనుఁడు, హనుమంతుఁడు, విష్ణువు,ధర్ముఁడు, నారాయణుఁడు మొదలగువారు. ఏనమంద్రు.

బ్రహ్మణో వై ముఖాత్సృష్టా యేతు దేవా ప్రజేప్సయా, సాధ్యా మంత్ర శరీరాస్తే స్థితా మన్వంత రేష్వపి,ధర్మపుత్రా మహాభాగా విజ్ఞేయా ద్వాదశా మరాః, మనుర్మంత్రః ప్రాణదశ్చ చేతయానశ్చ వీర్యవాన్ విత్తిర్దయో నయ శ్చైవ హంసో నారాయణస్తథా, ప్రభవోథ విభుశ్చైవ,సాధ్యా ద్వాదశ జజ్ఞిరే (వాయు పురాణము.)

మనువు="నాన్యతో స్తిమంతా" ఇతని కంటె మననము చేయువాఁడితరుఁడు లేఁడు. శ్రుతి. సృష్టికి పూర్వము ప్రపంచవిషయక మగు మననము గలవాఁడు, మను ఆలోచనే, మనజ్ఞానే.

వాయువు=వా గతిగంధనయోః=సమస్తము వాసన గలదిగాఁ జేయువాఁడు భక్తుల యొద్దకుఁ దాని పోవువాఁడు, వాతి గంధం కరోతీతి వాయుః, పుణ్యో గంధః పృథివ్యాంచ, (భ - గీ. ౧౦.౩౦-)

'సర్వకర్మా సర్వకామ స్సర్వగంధ స్సర్వరసః' శ్రుతి.వహ్ని=హవ్యమును దేవతలకుఁ గొనిపోవువాఁడు. ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య నాభి, తదేవాగ్ని స్తద్వాయు స్తత్సూర్య స్తదు చంద్రమాః" శ్రుతి. ఏది భువనమునకు నాభియై పుట్టినది, పుట్టుచున్నదియు నగు సమస్తము నిష్టాపూర్తము భరించుచున్నదో యదియే యగ్ని- అదియే వాయువు- అదియే సూర్యుఁడు- అదియే చంద్రుఁడు- ప్రజాప్రాణము - 'ప్రాణా ద్వాయు రజాయత' ప్రాణము నుండి వాయువు పుట్టెను.

కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో నస్యాత్ - ఆనంద రూపమయినయాకాశము(బ్రహ్మము)లేనియెడల నెవఁడు ప్రాణముగలవాఁడగును?

ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా. త మ్మా మాయు రమృతమి త్యుపాస్స్వ- అమృతం దేవానాం-ఆయుః ప్రజానామ్ - ప్రాణ స్తథానుగమాత్ బ్ర॥ ౧-౧-౨౮.

"పుంసాం జీవిత రూపత్వాత్ ప్రాణ ఇత్యభిధీయతే. 'ప్రాణయతి సర్వాణి భూతాని' అనగా సమస్తభూతములయొక్క ప్రాణన వ్యాపారమును జేయించునది అను శబ్ద వ్యుత్పత్తినిబట్టి యిచ్చటఁ బ్రాణశబ్దము పరమాత్మపరము" - ఆంధ్ర శ్రీభాష్యము. ప్రజలను బ్రదుకఁజేయువాఁడు. ప్రజాప్రాణుఁడు.

ఋతువు = ఋ గతిప్రాపణయోః, ధాతువు - గమ్యస్థాన మైనవాఁడు- పొందఁబడువాఁడు- ఋతువు-ఋతు స్సుదర్శనః కాలః అని సహస్రనామ స్తోత్రము ఋచ్ఛతీతి ఋతు ప్రోక్తః - సర్వోల్లాసకరైర్గుణైః = అందఱకు నుల్లాసకరమగు గుణములచేఁ బొందఁబడునది.

కర్త=చేయువాఁడు - 'కర్తా స్వతంత్రః పరికీర్తితః' తేన వినా తృణాగ్ర

మపి నచలతి - ఆయన యాజ్ఞ లేక గడ్డిపోచయుఁ గదలదు- కావున ప్రతివస్తువు నందు లోపలఁజొచ్చి కార్యము చేయువాఁడు, అంతః ప్రవిష్టః కర్తార మేతం- లోపలఁ బ్రవేశించి కార్యములు చేయువాఁడు అథ రథాన్ రథాయోగాన్ పథ స్సృజతే సహికర్తా - సర్వకర్మా-మఱియు రథములను రథములు పోవు మార్గము లను స్వప్నములందు సృజించువాఁడు - అతఁడు కదా కర్త.

ప్రభాకరుఁడు = వెలుతురు-జ్ఞానము-దానిని గలిగించువాఁడు. ప్ర+భా+ కరుఁడు, ప్రకృష్టజ్ఞానము గలిగించువాఁడు. తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్, దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాంతి తే॥ భ. గీ. ప్రీతితో భజించు నా భక్తులు నన్నుఁ బొందుటకు గావలసిన బుద్ధియోగమును నేనె యిచ్చుచున్నాను.

## తాత్పర్యము

ఇతఁడే మిగులఁ దేజస్సు గలవాఁడు. సర్వదేవస్వరూపుఁ డితఁడె. కాంతులు గలవాఁ డితఁడె తన కిరణములచే సమస్త దేవతలయు నసురులయు సమూహ మును బ్రపంచమును రక్షించువాఁడు. ఇతఁడె బ్రహ్మ ఇతఁడె విష్ణువు, ఇతఁడె స్కందుఁడు. ఇతఁడె శివుఁడు, ఇతఁడే ప్రజాపతి. ఇతఁడె మహేంద్రుఁడు ఇతఁడె కుబేరుఁడు. ఇతఁడె యముఁడు. ఇతఁడె కాలుఁడు. సోముఁడు. వరుణుఁడు పితరులు వసువులు మరుత్తు లితఁడె. సాధ్యులు అశ్వులు మనువు వాయువు వహ్నియు ప్రజల ప్రాణము ఋతుకర్త. ప్రభాకరుఁ డితఁడె.

సీ. నీవె యాదిత్యుఁడ • నీవె సవిత్రుఁడవు, నీవె సూర్యుండవు • నీవె ఖగుఁడ
నీవె పూషుండవు • నీవె గభస్తిమం. తుండవు హేమరే • తుండ నీవె
భానుండు తపన ది • వాకరులును నీవె, నీవె సువర్ణుండ • నీవె త్వష్ట
హరిదశ్వుఁడవు సహ • స్రార్చియు మరీచి, మంతుండవును నంశు • మంతుఁడవును
తే. సప్తసప్తివి తిమిరారి • శంభు నీవ, నీవ మార్తాండుఁడవు రవి • నీవ యగ్ని
గర్భుఁడవు శంఖుఁడవును భా • స్కరుఁడ నీవ, శిశిరనాశనతపనులు • శిశిర మీవ.

అర్థములు. ఇఁక స్తోత్రము ప్రారంభింపఁబడు చున్నది. పూర్వ మర్థము వ్రాయబడిన పదముల కర్థము మఱల వ్రాయఁబడదు. సవిత్రుఁడవు = సువతి సమస్తం ప్రేరయతి, షూ ప్రేరణే, ప్రేరించువాఁడు. ప్రేరితారంచ మత్వా, అని శ్వేతాశ్వ జీవుల కంతర్యామిగా నుండి కర్మములు చేయఁ బ్రేరించువాఁడు. సూర్యద్వారా వృష్టి సస్యాదికం సూతే ఇతి సవితా, సూర్యుని మూలమున వర్షము పైరు ప్రసవించువాఁడు. 'ప్రజానాంతు ప్రసవనాత్ సవితేతి నిగద్యతే' సకల జనులఁ బుట్టించువాఁడు. విష్ణుధర్మోత్తరము. సూర్యుండవు = అంతః ప్రవిష్టశ్శాస్తా జనానాం సర్వాత్మా యస్సర్వాణిభూతాన్యంతరో యమయతి॥ శ్రుతి, చరాచరాత్మక ప్రపంచమునకు నంతర్యామియై యుండువాఁడు. వాయున్సరతి

యస్మాద్ధి తస్మాత్ సూర్యః షడక్షరః॥ ఏవని వలన వాయువు చలించుచున్నదో వాఁడు సూర్యుఁడు,సంపద నొసంగువాఁడు,ఖగుఁడవు=లోకోపకారార్థము ఆకాశమున సంచరించువాఁడు, పరమాకాశమున నుండువాఁడు, పూషుండవు = వర్షేణ పుష్ణాతి జగదితి పూషా=వర్షముచే ప్రపంచమును బోషించువాఁడు.

గభస్తిమంతుఁడవు=గోక్షేయవర్గః, తం భస్తీతి గభస్తిః=వస్తువులను జూపునది.అట్టి దానిని గలవాఁడు గభస్తి మంతుఁడు 'గాం దిశం వ్యాప్య భాస్తి ప్రకాశయతీతి గభస్తిః దిక్కుల నన్నిట వ్యాపించి ప్రకాశింపఁజేయునది.కావున గభస్తి యనఁగా సర్వవ్యాపిని లక్ష్మి.ఆమెతో నిత్య సంయోగము గలవాఁడు గభస్తిమంతుఁడు. యథాసర్వగతో విష్ణుః తథై వేయం ద్విజోత్తమ=ఎట్లు విష్ణువు సర్వము నందు వ్యాపించి యున్నాఁడో యట్లులే యీమెయు వ్యాపించియున్నది. – వి.పు.

యథా మయా జగద్వ్యాప్తం స్వరూపేణ స్వభావతః।తయా వ్యాప్తమిదం విశ్వం నియంత్రీచ తథేశ్వరీ— నేను స్వరూప స్వభావములచే నెట్లు లోకమంతయు వ్యాపించి యున్నానో యట్లులే యీమెయు వ్యాపించి యున్నది. ఈమె లోకేశ్వరి=లోకనియంత్రి.

హేమరేతుండవు=బంగారు రేతస్సుగా గలవాఁడవు,'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖ' మ్మన్నట్లు హేమము ప్రపంచము.దానిని రేతస్సుగాఁ గలవాఁడు. అనఁగా సృష్టించు శక్తి గలవాఁడు.

"అపఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్, తదండ మభవ ద్ధైమం సహస్రాంశు సమప్రభమ్." మనుస్మృతి.

భానుఁడు=భాతీతి భానుః, ప్రకాశించువాడు. "భాను స్సర్వస్య భాతీతి నిర్మాణే వ్యవికారతః తమేవ భాంత మనుభాతి సర్వమ్" శ్రుతి. లోకమును దపింపఁ జేయువాఁడు, దివాకరుఁడు=అజ్ఞాన మను చీఁకటిని బోఁగొట్టి జ్ఞాన మను పగలు కలిగించువాఁడు.

సుపర్ణుండవు=ద్వాసుపర్ణా సయుజా 'సఖయా' అని శ్రుతి– అనఁగా పరమాత్మ, త్వష్టవు=త్వక్ష్ణోతి, త్రిస్సప్త కృత్వః సక్షత్రియాం భూమి మితి త్వష్టా, ముయ్యేడు (ఇరువది యొకటి) మార్లు రాజులతోడి భూమిని సన్నగింపజేసినవాడు. వడ్రంగి కొయ్యలు చెక్కునట్లు చెక్కువాఁడు – తక్షతే–త్వక్ష్యతేస్మ తష్టః త్వష్టః తక్షం త్వక్షూ తనూకరణే– ఇది పరశురామావతారమును సూచించును. సర్వాణి రూపాణి తక్షతి తనూకరోతి=సర్వరూపములు సన్నవిగాఁ జేయువాఁడు– సర్వము సంహరించువాఁడు – హరిదశ్వుఁడవు– హరతి మనఇతి హరిత్=మనస్సును హరించునది హరిత్ – దానిని అశ్వముగా ననఁగా వాహనముగాఁ గలవాఁడు – గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁ డని యర్థము.

సహస్రార్చివి – వేయికిరణములు గలవాఁడవు, అర్చ్యతే ఇతి అర్చిః=అర్చి

శబ్దము అర్చింప యోగ్యము లగువానిని దెలుపును. అర్చింప యోగ్యత గలవి-కల్యాణ గుణములు కావున అనంత కల్యాణగుణములు గలవాఁడ వని భావము.

మరీచిమంతుఁడవు=మరీచులు = కాంతులు, మరీచిమంతుఁడు = కాంతులు గలవాఁడు మ్రియంతే శత్రవో అనేన మరీచి=దేనిచే శత్రువులు చత్తురో యది మరీచి, సుదర్శన చక్రము - దానిని ధరించువాఁడు మరీచిమంతుఁడు.

అంశుమంతుఁడవు-సర్వపదార్థములందు లోపల వెలుపల వ్యాపించియుండు వాఁడు, అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థ్సితః॥ శ్రుతి. సప్తసప్తివి-సప్తయనెడి గుఱ్ఱము గలవాఁడు. ఏకో అశ్వో వహతి సప్తనామ - శ్రుతి ఇది కల్క్యవతారము సూచించుచున్నది. కల్కిమూర్తికి గుఱ్ఱమే వాహనము.

తిమిరారి=తిమిరము - అజ్ఞానము, దీనిని నాశము చేయువాఁడు. ఎక్కడ భగవచ్చింతనము గలదో యచ్చట నజ్ఞానము రూపుమాయును. 'ఉద్యంతస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్" అని స్మృతి.

శంభువు - శం=సుఖం, భవత్యస్మాత్ శంభుః=శమ్మనఁగా సుఖము. అది యీయనవలనఁ గలుగును, గావున శంభువు.

సౌందర్యాది గుణానాం యో హ్యవిష్కా- రేణ శం సుఖమ్, పుంసాం సమ్యక్ భావయతి స శంభుః పరికీర్త్యతే. తన స్వసౌందర్య సౌశీల్యాది కల్యాణ గుణావిష్కరణముచే సుఖము గలిగించువాఁడు.

మార్తండుఁడవు=మృతం బ్రహ్మాండం జీవయతీతి మార్తండః, నశించిన బ్రహ్మాండమును మరల బ్రతికించువాఁడు, జీవా జీవతు జీవయత్, శ్రీ భాగవతము. మృతే అండే జాతో మార్తండః. మృతమయిన యండమందుఁ బుట్టినవాఁడు. సమస్తము సంహారము చేసి దానిని సృజించుటకు మరల దానియందుఁబుట్టినవాఁడు.

రవివి = రూపయతే స్తూయత ఇతి రవిః = స్తోత్రము చేయఁబడువాఁడు, 'యశ్చిత్తరాయణద్వారా రూయతేత్ర ప్రకాశ్యతే, సవై రవిః సమాఖ్యాతః ప్రాశస్త్యఫలదోమనుః" అగ్నిగర్భుఁడవు=పగటివేళ నగ్నిని గర్భమునందుఁ గలవాఁడు. ఉద్యంతం వాదిత్య మగ్ని రనుసమారోహతి. పగటివేళ నగ్ని సూర్యుని యందుఁ బ్రవేశించును గనుక సూర్యకిరణములు వేఁడిగా నుండును. రాత్రివేళ సూర్యుఁ డగ్నిని బ్రవేశించుఁ గావున నగ్ని వెలుతురు గలదై యుండును.

శంఖుఁడవు, శమేః ఖః=సాయంతనంబునందు దానే శమించువాఁడు.

శిశిర నాశనుండవు=శిశిరమును - మంచును నాశము చేయువాఁడు.

తపనుఁడు=ఆశ్రిత విరోధులను దపింపఁ జేయువాఁడు.

శిశిరుఁడు = చల్లనివాఁడు. సంసారమునఁ దాపములచేఁ దప్తులైన వారికి విశ్రమస్థాన మైనవాఁడు.

## తాత్పర్యము

అఖండభూమండలమునకుఁ బతియగువాఁడును లేక పరమాకాశమునకుఁ బతియగువాఁడు. సర్వమును బ్రేరించువాఁడవు. వర్షము గురియించి పైరులు పండఁజేయువాఁడవు. పరమాకాశమం దుండువాఁడవు. పోషించువాఁడవు.లక్ష్మీదేవితో నిత్య సంయోగము గలవాఁడవు. ప్రపంచము సృష్టికిఁ గారణమైన సాధనము గలవాఁడవు. ప్రకాశించు సర్వవస్తువులకుఁ బ్రకాశము నిచ్చువాఁడవు. సూర్యచంద్రాగ్ని యమాదులను నాజ్ఞచేఁ దపింపఁ జేయువాఁడవు. ఆశ్రితులకు జ్ఞానము గలిగించు వాఁడవు. నీవు జీవకోటుల హృదయములం దుండువాఁడవు, లోకమును సన్నగింపఁ జేయువాఁడవు. గరుత్మంతుని వాహనముగాఁ గలవాఁడవు. అనంత కల్యాణగుణములు గలవాఁడవు, సుదర్శనమును ధరించినవాఁడవు. సమస్త పదార్థముల లోపల వెలుపల వ్యాపించి యుండువాఁడవు.కల్క్యవతారమందు గుఱ్ఱము వాహనముగాఁ గలవాఁడవు. అజ్ఞాననాశకుఁడవు. సౌందర్య సౌశీల్యాదుల సుఖము కలిగించు వాఁడవు. నష్టమైన ప్రపంచమును మరల జీవింపఁజేయ నుత్పత్తి యగు వాఁడవు. స్తోత్రము చేయఁబడు వాఁడవు. అగ్నిని నీయందు గలవాఁడవు. సాయంకాలమున శమించువాఁడవు. ప్రలయవేళ వ్యాపార రహితుఁడై యుండువాఁడవు. చక్రాయుధుఁడవు. తాపత్రయ బాధితులకు తాపమార్చుకొన చల్లని యాశ్రయమైన వాఁడవు. నిజభక్త విరోధులఁ దపింపఁ జేయువాఁడవు. మంచును నాశము చేయువాఁడవు నీవే.

ఉ. నీవె హిరణ్యగర్భుఁడవు ♦ నీ వదితిప్రియపుత్రుఁడున్ సువ
ర్షావహుఁడున్ సభోధవుఁడ ♦ వప్పులమిత్రము భక్తహృత్తమో
భావవిభేదివిన్ నిగమ ♦ పారగుఁడుం గవిరాజు విండ్యవీ
థీవరవర్తనీ ప్లవగ ♦ దేవసమస్తభవోద్భవుండవున్. ౧౭౧౮

అర్థములు. హిరణ్యగర్భుఁడవు=బంగారు బీజము గర్భమునఁ గలవాఁడు,

అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్, తదండ మభవద్ధైమం సహస్రాంశు సమప్రభమ్. మను. ౧-౮.

తొలుత నీటినిసృజించి దానియందు స్వశక్తియగు బీజము నుంచెను. ఆబీజము సూర్యునితో సమానమగు కాంతి గలదై బంగారువన్నె గల యండ మయ్యెను.

హిరణ్య మనఁగా సకలజగత్తును త్పాదిల్లఁ జేయు సమష్టిజీవసమూహము. దానిని దన గర్భమునందుఁ గలవాఁడు హిరణ్యగర్భుఁడు.

'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే'యనియు హిరణ్యగర్భోభూగర్భ'యనియుశ్రుతి.

నీ వదితి ప్రియపుత్రుఁడున్=ఇది వామనావతారమును సూచించును.

సువర్షావహుఁడు-సు = గొప్పయగు, వర్ష = కర్మిసుల కర్మములకు ఫలమును

దండిగఁ గలిగించువాఁడు, కర్మఫలదాతయని భావము. 'అహంహి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ॥ భ.గీ. యజ్ఞఫలమఁడు- సర్వఫలప్రదాతయును సర్వేశ్వరుఁడు- శ్రీ భాగవతము.

నభోధవుఁడవు = పరమాకాశనాథుఁడవు. ఆకాశమును దననుండి (అహంకార రూపమున) సృజించినవాఁడు. ఆత్మన ఆకాశస్సంభూతః॥ శ్రుతి- అప్పుల మిత్రము = ప్రలయవేళ సముద్రమున శయనించువాఁడు, 'అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్య గాదిత్యముపతిష్ఠతే, ఆదిత్యాజ్జాయతే వృష్టిః వృష్టే రన్నం తతః ప్రజాః' శ్రుతి. అగ్నియందు వేల్చినది సూర్యుని బొందును.సూర్యునివలన వర్షము, వర్షము వలన నన్నము గలుగును. దానివలనఁ బ్రజలు గలుగుదురు. కావున నప్పుల మిత్రుఁడు- అప్పు లనగా జలము.

భక్త = భక్తుల, హృత్ - హృదయమండలి, తమోభావ=అజ్ఞానమనెడి చీఁకటి భావమును, విభేదివిన్ = భేదించువాఁడవు.

నిగమపారగుఁడున్ = ఋక్కు, యజుర్వేదము సామవేదమునందుఁ దుద నొందినవాఁడవు.

ఋగ్భిః పూర్వాహ్ణే దివిదేవ ఈయతే యజుర్వేదే తిష్ఠతి మధ్యాహ్నే సామవేదే నాస్తమయే మహీయతే వేదై రశూన్యస్త్రిభిరేతి సూర్యః. శ్రుతి.

సమస్తవేదములకుఁ బర్యవసానభూమి యగువాఁడు. వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః, యేచ వేదవిదో విప్రా, యేచాధ్యాత్మవిదో జనాః తే వదంతి మహాత్మానం, కృష్ణం ధర్మం సనాతనమ్

కవిరాజ=వేద్యములనెల్లఁ దెలిసినవాఁడు య స్సర్వ స్సర్వవిత్॥ శ్రుతి— కవు లనఁబడు వారిలో శ్రేష్ఠుఁడు.

వింధ్యవీథీ వరవర్తనీ ప్లవగ=ఆకాశవీథి యను గొప్పమార్గమందు త్వరగాఁ బోవువాఁడు, వింధ్యపర్వతమువలె పోవుటకుఁ గష్టమైన మార్గమందు అనఁగా సుషుమ్నానాడియందు ప్లవం+గ = శీఘ్రముగా పొందించుచున్నాఁడు. ముక్తులను సుషుమ్నానాడియందు బ్రవేశపెట్టుచున్నాఁడని భావము.

సమస్త భవోద్భవుండవు = అన్ని విధములైన, భవ=కార్యసమూహమునకు,ఉద్భవ=కారణమైన వాఁడవు,సర్వమునకు నుత్పత్తికారణమైనవాఁడ వనుట.

భవము=సంసారము, సమస్త జనుల సంసారమునకుఁ బుట్టుచోటు, ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్॥ భ. గీ॥

## తాత్పర్యము

దేవా! నీవే హిరణ్యగర్భుఁడవు. నీవే వామనావతారమూర్తివి. నీవే కర్మకుల కర్మఫలముల నవారిగా నిచ్చువాఁడవు నీవే పరమాకాశనాథుఁడవు.ఉదకములకు మిత్రుఁడు నీవే. భక్తుల హృదయమందలి చీఁకటి పోఁగొట్టువాఁడవు నీవే.

వేదముల యంతమును బొందినవాఁడవు నీవే. కవిరాజు నీవే. ముక్తులనుసుషుమ్నా నాడియందుఁ బ్రవేశపెట్టువాఁడవు నీవే.

తే. పింగళుండవు మృత్యువు • విశ్వ మీవుఁ నాతపివి మండలివియు స•మస్తతాప
సుండు రక్తుండుభూరితే•జుండువిశ్వ, భావనుఁడుఖగ తారోడు•పతివినీవు ౨౪౧౫

అర్థములు. పింగళుండవు = పింగ వేశనే, తా నెంత గొప్పవాఁడైనను దక్కువ వారితోఁ గలిసి మెలసి యుండువాఁడు సుశీలుఁడు. ఆ విధముగఁ గలసి యుండువాఁడని భావము. ఉదయసమయమునపింగళవర్ణముగలవాఁడు,మృత్యువు= విరోధుల నివర్తించువాఁడు. మృత్యువు ప్రకృతి, ప్రకృతి శరీరముగాఁగలవాఁడవు. 'యస్య మత్యు శ్శరీరమ్' శ్రుతి—విశ్వము = ప్రపంచస్వరూపుఁడవు, సమస్తము నిర్వహించువాఁడు.

విశ్వము—(౧) జగత్తు — దీనికిఁ గారణమైనవాఁడగుటచేఁగార్యకారణముల కభేదము కావున విశ్వమని భగవంతుఁడే చెప్పఁబడెను. 'బ్రహ్మైవేదం విశ్వమ్' పురుష ఏవైదం విశ్వమ్ విశ్వమేవేదమ్......(౨) విశతీతి విశ్వం బ్రహ్మ, 'తత్ సృష్ట్వా తదేవానుప్రావిశత్' ప్రపంచము సృష్టించి దానియందుఁ బ్రవేశించు వాఁడు (౩) సంహరింపఁబడిన ప్రపంచ మెవనియందుఁ బ్రవేశించునో వాఁడు విశ్వము, 'యత్ప్రయం త్యభిసంవిశంతి' శ్రుతి.

'విశ్వనా ద్విశ్వ మిత్యాహు ర్లోకానాం కాశిసత్తమ లోకాంశ్చ విశ్వమేవేతి ప్రవదంతి నరాధిప' మోక్షధర్మ.

“విశ్వం సర్వత్ర పూర్ణత్వాత్ స్వరూపగుణవైభవైః'—నిరుక్తి. స్వరూప గుణ వైభవములచే సర్వత్ర పూర్ణుఁడు కావున విశ్వము.

ఆతపివి, ఆ = అంతటను, తపః = జగన్నిర్మాణవిషయమైన యాలోచన గలవాఁడు, ఎండ గలవాఁడు.

మండలివి=మండ్యతే అనేనేతి మండలి, మండల మనఁగా నలంకారములు కౌస్తుభాదులచే నలంకరింపఁబడువాఁడు కావున మండలి.

సమస్త తాపనుఁడు=సమస్తప్రపంచము నొక్కసారిగఁ దపింపజేయువాఁడు

రక్తుండు = భక్తులను రంజింపజేయువాఁడు, సర్వరంజకుఁడు.

భూరితేజుండు = ఇతరులను లోపఱుచుకొను గొప్ప తేజస్సు గలవాఁడు.

విశ్వభావనుఁడు = సమస్తమును స్థాపించువాఁడు-ఖగతారోడుపతివి=గ్రహములకు తారలకు నక్షత్రములకు నధిపతివి - వీనియం దంతర్యామియై శాసించువాఁడు. విశ్వస్థితికి హేతువగువాఁడు. ద్యౌ స్సచంద్రార్క నక్షత్రం ఖం దిశో భూర్మహోదధిః, వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః” భారతము.

యశ్చంద్రతారక మంతరో యమయతి — శ్రుతి.

తాత్పర్యము

సుశీలుఁడవు. ప్రకృతిశరీరముగాఁ గలవాఁడవు. స్వరూపగుణ విభవములచేఁ బూర్ణుఁడవు. ప్రపంచనిర్మాణవిషయమైన సంకల్పము గలవాఁడవు. కౌస్తుభాద్యలంకారములు గలవాఁడవు. ప్రపంచమంతయు నొక్కసారిగఁ దపింపజేయువాఁడవు. సర్వభూతకోటులఁ రంజింపఁజేయువాఁడవు. ఎట్టివారికైన లోపఱచుకొను గొప్పశక్తి గలవాఁడవు. సమస్తము వానివాని స్థానములందు స్థాపించువాఁడవు. గ్రహనక్షత్రాదులకు నంతర్యామివై వానిని శాసించువాఁడవు.

కం. తేజస్వులలో మిక్కిలి, తేజస్వివి ద్వాదశాత్మ ॥ దినవాయక దే
వా జయభద్రా జయ యంభోజభవా నీకివే న॥మోవాకంబుల్. ౩౨౧౬

అర్థములు. తేజస్సులలోఁదేజస్వివి = కాంతిగల యగ్నిహోత్రాదులలోఁ దేజస్సుగలవాఁడవు. "యేన సూర్యస్తపతి తేజసేద్ధః" శ్రుతి. సూర్యస్యాపి భవేత్సూర్యః, ద్వాదశాత్మ=పండ్రెండు నెలలకుఁ బండ్రెండుమూర్తులు గలవాఁడు. "ఇంద్రో ధాతా భగః పూషా మిత్రోథవరుణోర్యమాః, అర్చిర్వివస్వాన్త్వష్టాచ సవితా విష్ణురేవచ" అని ద్వాదశమూర్తులు. దినవాయక=దినమున కధిపతియగువాఁడు. ద్యతి అంధకార మితి దినం=అంధకారమును ఖండించునది దినము, అజ్ఞానాంధకారమును ఖండించునది జ్ఞానము. కావున దినసంజ్ఞ. అట్టి జ్ఞానము ఎవనికి శరీరము, గుణమైనదో యతఁడు దినవాయకుఁడు, 'చైతన్యవపుషేనమ" యని విష్ణుపురాణము. దేవా = ప్రకాశించువాఁడా.

జయభద్ర=జయమును క్షేమమును కలిగించువానికి.

జయా=భక్తులకు జయము కలిగించు వానికి. 'యత్ర రామో భయం నాత్ర నాస్తి తత్ర పరాభవః, అంభోజభవా = అంభోజము = పద్మము, పద్మము ఇచ్చట లక్ష్మీదేవి కర్థము, కావున లక్ష్మీవల్లభుఁడని యర్థము. కమలానాయకుఁడు, కమల నాయకుఁడు, సాధ్యసమాసము కావున హ్రస్వము. నమోవాకంబుల్ = నమస్కారవాక్యములు.

తాత్పర్యము

తేజోవంతులలోఁ దేజోవంతుఁడవైన వాఁడా! పండ్రెండుమూర్తులుగలవాఁడా! దినాధిపతీ! ప్రకాశించువాఁడా! భక్తులకు జయము క్షేమము గలిగించువాఁడా! జయస్వరూపుఁడా, కమలనాయకా! నీకు నమస్కారములు.

కం. మ్రొక్కెదఁ బ్రాక్శైలమునకు, మ్రొక్కెదఁజరమాచలంబు॥ మ్రొక్కు గ్రునకున్
మ్రొక్కెద జ్యోతిర్గణపతి, మ్రొక్కెద హార్యశ్వనకుచు॥ మ్రొక్కెదజయునిన్

అర్థములు. ప్రాక్శైలము = తూర్పుకొండ, చరమాచలంబు = పడమటికొండ, ఉగ్రునకున్ = భక్తులుగాని వారికి భయంకరుఁడు, జ్యోతిర్గణపతి=జ్యోతిర్మండలమున నుండువాని కన్నిటికిన నధిపతికి, జ్యోతిర్గణములు=ముక్తులు, వారికి

అధిపతి - సూర్యపర్యాయ నామము లన్నియు తదంతర్యామియైన భగవంతునకు శరీర శరీరి భావమున నన్వయించును.

## తాత్పర్యము

ఉదయపర్వతమునకుఁ బశ్చిమపర్వతమునకు పాపాత్ములకు భయంకరుఁడైన వానికి ముక్తుల కధిపతి యగువానికి హర్యశ్వునకు జయునకు మ్రొక్కెదను. స్తుతియందు వచ్చినమాట మరల వచ్చుట దోషముగాదు.

సీ. మ్రొక్కెద నాదిత్యు ♦ మ్రొక్కెద వేవెల్గు, మ్రొక్కెద సారంగ ♦ మూర్తివీరు
మ్రొక్కెదనమూర్తంకు ♦ మ్రొక్కెద బ్రహ్మేశ్వ, రామ్యతునాదితే, ♦ యార్చిసూర్య
భాస్వంతుని సమస్త ♦ భక్షు రౌద్రాకారు, విశ్వకర్మఁదమోఘ్ను ♦ విశ్వసాక్షి
నమితాత్మ శత్రుఘ్ను ♦ హిమవైరిని దమోభి నిఘ్నుఁ దప్తస్వర్ణ ♦ నిభునివహ్ని
తే. గ్రహపతిని కృతఘ్నఘ్ను నిఁ ♦ గంజహితుని
మ్రొక్కెద నమస్కరించెద ♦ మోడ్పుఁ గేలు
గూర్తు నంజలి ఘటియింతు ♦ గొణిగ లోలిఁ
జిన్నిపూల్నతు లిచ్చుచు ♦ సన్నుతింతు. ౨౭౧౪

అర్థములు. సారంగమూర్తి- సారం+గ = శీఘ్రం గచ్ఛతి = సారంగః= మిగులవేగముగఁ బోవువానికి, గజరాజమోక్షణ మందు గరుడుని వేగము చాలక తన వేగముచే గరుడునిగూడ నీడ్చుకొని పోయెను. సారఁగాహి యగువాని = హంసావతారుఁ డగువానిని, వీరున్ = వివిధ మీరయతి - ప్రేరయతి=పలువిధము లుగా ప్రాణులను ప్రేరించి వారిచేఁ గార్యములఁ జేయించువానిని, బ్రహ్మేశ్వరా చ్యుతున్ = సృష్టిస్థితి సంహారకర్తలగు బ్రహ్మ విష్ణు శివులగువానికి, 'సృష్టిస్థిత్యంత కరిణీం బ్రహ్మవిష్ణు శివాత్మికామ్‌। సంజ్ఞాం నయాతి భగవా నేక ఏవజనార్దనః.వి.పు.

ఇచ్చటఁ బరబ్రహ్మ స్వరూపముగా స్తుతి, అనావాదిత్యో బ్రహ్మ యనుట ననుసంధింపనది. బ్రహ్మేశ్వరాచ్యుతున్ = బ్రహ్మేశ్వరులను వదలి యుండని వానిని. అంతర్యామియై వారిచే సృష్టిసంహార కార్యములు చేయించువానిని, వేదాప హారము బ్రహ్మహత్య నృకాసురబాధ లోనైనవి తొలఁగించి కాపాడువానిని, అదితేయార్చి = ఆదిత్యరూపమగు కాంతిగలవానిని, సమస్త భక్షు=సర్వ సంహారకుఁ డగు వానిని, సర్వయజ్ఞభోక్తను; రౌద్రాకారున్ = అసురులయందు భయంకర మైన యాకారము గలవానిని, నృసింహావతారము సూచితము. విశ్వకర్మన్=సమస ప్రపంచము సృష్టించు వానిని, తమోఘ్నున్ = చీఁకటి పోఁగొట్టు వానిని, విశ్వ సాక్షిన్=ప్రాణు లన్నియుఁ జేయు కార్యములు తటస్థుఁడై చూచుచుండు వానిని, అమితాత్మన్ = అపరిచ్ఛిన్న స్వరూపుని, శత్రుఘ్నున్ =ఆశ్రితుల శత్రువులను దన శత్రువులుగా నెంచి చంపువానిని, హిమవైరిని=మంచును బోఁగొట్టువానిని, తమోభినిఘ్నున్ = చీఁకటినిఁ బోఁగొట్టు వానిని, తప్తస్వర్ణనిభునిన్ = పుటము

వేసిన బంగారుచాయగల వానిని, వహ్నిన్ = అగ్నిరూపమున సర్వము వహించు వానిని, కృతఘ్నుని = మేలు మఱచిన వారిని జంపువానిని, కంజహితుని = కమలహితుని, ప్రపంచమునకు హితుఁ డగువానిని, ప్రపంచమునకు కమలము సంకేతము.

"One of the symbolical figures for the Dual creative power in nature (matter and force on the material plane) is Padma, the water-lily of India. The Lotus is the product of heat (fire) and water (Vapour of Ether) Fire stands in every philosophical and religious system as a representation of the spirit of Deity. the active, male, generative principle, and Ether or the Soul of matter, the light of the fire, for the passive female principle from which everything in the universe amanated. Here Ether or water is the Mother and fire is the Father. The Lotus is, moreover, a very ancient and favourite simile for the Cosmos itself and also for man Its root sunk in the mud represents material life, thestalk passing up through thewater typitiesexistencein the astral world, and the flowerfloating on the waterandopening to the sky is emblematical of spiritual being "*Evolution Page, 15*

గోణిగెలు=నమస్కారములు, చిన్నిపూలు=నమస్కారములు, నతులు=నమస్కారములు.

తాత్పర్యము స్పష్టము.

కం. భూతములఁ ద్రుంచి మఱి త, ద్వ్రాతముల సృజించి మనుచు॥ప్రభు వీతండే
యాతఁడె తపియింపించును, నీతండె కరాళిచేత ॥ వృష్టిం గురియున్ ౨౮౯

అర్థములు. తద్వ్రాతములన్ = భూతముల సమూహములను, సృజించి= తనలోనుండి విడిచి, మనచు = రక్షించు, వృష్టి = వర్షము.

తాత్పర్యము

ప్రాణికోటులను సంహరించి మరల సృజించి రక్షించు ప్రభు వీయనయే-తపియింపఁజేయువాఁ డీయనయే-మరల వర్షము గురియించి యీ తాప మణఁచువాఁ డీయనయే.

చ. భువనము నిద్రపోవుతఱిఁ ॥ బోల్పగ నీతఁడె జాగరూకుఁ డౌఁ
దనగఁ సమస్త భూతములఁ ॥ దాఁ బరినిష్ఠితుఁ డీతఁడే శ్రుతుల్
సవములు నగ్నిహోత్రులఫ॥లంబు క్రతుల్ ఫల మగ్నిహోత్రు డిం
కెవి భువిఁ గృత్యముల్ సకల ॥ మీరవియే ప్రభు డెల్ల వానికిన్. ౨౮౨౦

అర్థములు. జాగరూకుఁడు=మేలుకొనియుండువాఁడు, తవగన్=తగఁగన్= తగినరీతి, పరినిష్ఠితుఁడు=శాశ్వతముగ నుండువాఁడు, శ్రుతుల్=వేదములు, సవములు=యజ్ఞములు, క్రతుల్ ఫలము = యజ్ఞముల ఫలము.

తాత్పర్యము స్పష్టము.

శ్రీరామచంద్రమూర్తి! నీవే, బ్రహ్మరుద్రేంద్రాదులు నారాయణుఁడవు దేవుఁడ వని స్తోత్రముచేసి శ్రీరామచంద్రమూర్తియే యందఱికంటెఁ బరుఁడని చెప్పఁబడును. ఇట్లుండ నిచట సూర్యుఁడు పరాత్పరుఁడని యెట్లు చెప్పఁబడెను? మధువిద్యయందు నాదిత్యుఁడే పరుఁడని ప్రతిపాదించినచోట నంతర్యామియగు పరమాత్మయం దన్వయింపఁబడెను. అట్టులే యిచ్చట గ్రహించునది. ఒక మట్టిబొమ్మనైనను నేకలవ్యునివలె భక్తితో సేవించితిమేని దానియందే భగవంతుఁ డావేశించి భక్తులకోరికల నెఱవేర్చును. ప్రతి పరమాణువునందు భగవంతుఁడు కలఁడుకదా. అట్లుండ దివ్యతేజోరాశి యగు సూర్యునియందలి భగవంతుని మనమర్చించితి మేని ఫల మేల లేకపోవును? సూర్యుఁ డని యర్చించితిమా సూర్యుఁ డీయఁగల ఫలము మాత్రమే యిచ్చును. భగవంతుఁ డని యర్చించితిమా యెంతఫలమైన నెట్టిదైన నిచ్చును. ఈ కారణముచేతనే సూర్యుఁడు దేవతామధ్యమున నిలిచి రావణవధ మంకుఁ ద్వరపడుమని శ్రీరామచంద్రమూర్తికిఁ జెప్పెను. ౨౪౨౦ ప. చూడు.

కం. అను నీమంత్రం బాపదలను గష్టములందు వనములను భయవేళన్
జననాథ! నరుఁడు కీర్తించిన దుఃఖపడం డెందు నిజము సీతానాథా! ౨౪౨౧

తాత్పర్యము స్పష్టము.

కం. ఏకాగ్రమనస్కుఁడ వై, లోకపతిన్ దేవదేవు లోకేక్షణునిన్
బ్రాఁటకమతిఁ బూజింపుము, శ్రీకర ముమ్మాఱు చదువ సిద్ధము జయమౌ.

అర్థములు. ఏకాగ్రమనస్కుఁడవు = ఒక్క కొనయే గల మనస్సు గలవాఁడవు - చలింపని మనస్సు గలవాఁడవు, లోకేక్షణునిన్ = లోకమునకుఁ గన్నగు వానిని, సూర్యకాంతి లేకున్న జనులు కన్ను లుండియు గ్రుడ్డివారే కదా.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈ నిమిషమునన్ రావణు, మానితభుజశౌర్య నీవు మ్రందింతు వటం
చీనెఱి వచించి యంతర్ధానంబును జెందిముని యథామతి నరిగెన్. ౨౪౨౩

తాత్పర్యము స్పష్టము.

చ. ఇది విని దివ్యతేజుఁడు మహిష్ఠముదంబున మంత్ర మూని నె
మ్మది వ్యసనంబు మాని రవిమండలముం గనుచున్ జపించి హృ
త్పదవిఁ ద్రివారముల్ శుచిత వార్చి శరాసముఁ బూని రావణుం
గదనములోనఁ జంప మతి గైకొని యుద్ధము సేయఁబూనఁగన్. ౨౪౨౪

అర్థములు. మహిష్ఠముదంబునన్ = మిగుల గొప్పదగు సంతోషముతో, వ్యసనంబు = విచారము, హృత్పదవిన్ = హృదయస్థానమందు, త్రివారముల్ = ముమ్మాఱు, శుచితన్ = పరిశుద్ధుఁడై, శరాసము = విల్లు, బాణములఁ జిమ్మునది.

తాత్పర్యము స్పష్టము.

కం. రామునిజపమున రవియును, సామోదహృదబ్జుఁ డగుచు ♦ నసురపతివధన్
దా మతి ననుగ్రహించుచు, నామరగణమధ్యగుఁడు ర♦యంపడు మనిమెన్.

అర్థములు. సామోద=సంతోషముతోఁ గూడిన, హృదబ్జుఁడు=హృదయకమలము గలవాఁడు,ఆమరగణ మధ్యగుఁడు=దేవతల సమూహములమధ్య నుండువాఁడు, రయపడుము=త్వరచేయుము.

ఈ యాదిత్యహృదయ మంత్రమునకు నంగన్యాస కరన్యాసము లిట్లు తిలక వ్యాఖ్యానంబున వ్రాయఁబడి యున్నవి.

"అత్ర స్తోత్ర స్యాగస్త్యఋషిః - అనుష్టుప్ ఛందః - ఆదిత్య హృదయ భూతో భగవాన్ దేవతా, నిరస్తాశేషవిఘ్నతయా బ్రహ్మవిద్యాసిద్ధౌ సర్వత్ర జయసిద్ధౌచ వినియోగః । అస్య షడంగం ప్రణవేన - రశ్మి మతే నమ ఇత్యనేన వా - గాయత్ర్యా షడంగ మిత్యన్యే.

## —♦ { ౧౦౭-వ సర్గము. రావణుఁడు మరల శ్రీరామునిమీఁదికి యుద్ధమునకు వచ్చుట } ♦—

సీ. శాత్రవవాహినీ ♦ సంప్రధర్షణమును, గంధర్వనగరని♦కాశమూర్తి
యున్నతధ్వజము సం♦పన్నజాంబూనద, హారవిరాజిత♦హయయుతంబు
యుద్ధోపకరణస♦మిద్ధంబు నై మిన్ను, ప్రమింగెడినో యన ♦ రంగుమీఱి
యవని వణంకఁగ ♦ నహితులు గ్రుంగఁగఁ, దనసైన్యములు పొంగ♦దనరుదాని

తే. రావణురథంబు నడపె సా♦రథినితాంతహృష్టుఁడై శీఘ్రముగ నిట్టు♦లేగుదెంచు
ప్రబలనిస్స్వనమును గృష్ణవాజియుతముఁ,జంచలాధ్వజగహనంబు ♦ సారతరము.

అర్థములు. కథాసందర్భమునకు ౪రంచె వ పద్యమునకుఁ దరువాత నీ పద్యము చదువవలెను.

శాత్రవవాహినీ సంప్రధర్షణమును = శత్రుసేనలఁ దిరస్కరించునదియు, గంధర్వనగరనికాశమూర్తి=గంధర్వనగరముతో సమానమైన యాకారముగలది, ఆకాశమున నగరమువలెఁ గానవచ్చు మేఘములచిత్రవిన్యాసము గంధర్వనగరము.

'చిత్రవర్ణం చిత్రరూప ప్రాకారగృహ గోపురమ్,అలంకృత మనేకాభిర్వితాన ధ్వజతోరణైః।గంధర్వనగరం దంతి నృవాజిక్షయయుద్ధకృత్, దృశ్యతే చేన్మహ ద్యుద్ధమన్యోన్యం ధరణీభుజామ్' ఇది కానవచ్చెనేని రాజులలో గొప్ప యుద్ధము సంభవించును. ఉన్నతధ్వజము=ఎత్తైన టెక్కెము గలది, సంపన్న=సమృద్ధితోఁ గూడిన, జాంబూనదహార = బంగారు దండలచే, విరాజిత = ప్రకాశించు, హయయుతంబు = గుఱ్ఱములతోఁ గూడినది, యుద్ధోపకరణసమిద్ధంబు = విల్లు కవచములు లోనగు యుద్ధసాధనములచేఁ బ్రకాశించునది,మిన్ను=ఆకాశమును,నితాంత హృష్టుఁడై =మిక్కిలి సంతోషించినవాఁడై, ప్రబల నిస్స్వనమును = బలిష్ఠమైన ధ్వనిగలది, కృష్ణవాజియుతము = నల్లని గుఱ్ఱములతోఁ గూడినది, చంచలాధ్వజ

గహనంబు=మెఱుపులవంటి ధ్వజములు వనము గలది — పెక్కుధ్వజములు గలదని భావము - సారతరము = మిగుల దృఢమైనది.

తాత్పర్యము

పగవారి సేనలఁ దిరస్కరించునదియు గంధర్వనగరమువలె మిగుల నాశ్చర్యకరమైన యాకారము గలదియు, ఎత్తైన ధ్వజము గలదియు, సమృద్ధిగ బంగారు సరములతో నలంకరింపఁబడిన గుఱ్ఱములుగలదియు, విండ్లు కవచములులోనైన యుద్ధసాధనములు గలదియు,ఆకాశమును మ్రింగెడి దానివలెనుండునదియు,భూమి గడగడ లాడ శత్రువులు క్రుంగి పోవఁ దన సైన్యములు పొంగఁగా నొప్పు దాని రావణు రథమును సారథి మిగుల సంతోషించినవాఁడై త్వరగాఁ దోలెను. ఇట్లు నల్లని గుఱ్ఱములు గలదై మహాధ్వనితో మెఱుపువలె మెఱయు ననేకధ్వజముల తోడ వచ్చుచున్న మిగుల బలిష్ఠమై.

కం. ఇంద్రాయుధోపమాయుధ, సాంద్రంబును రౌద్రకాంతి•సంకలితము ని
స్తంద్రాంబుదధారోపమ, రుంద్రశరాసారపతన•రూక్షరథంబున్. ౨౮-౨౭

అర్థములు. ఇంద్రాయుధ=ఇంద్రుని యాయుధములతో, ఉపమాయుధ= సమానమైనయాయుధములుగలది,(౨)ఇంద్రచాపమువంటివిల్లుగలది,రౌద్రకాంతి సంకలితము = భయంకర కాంతి గలది, నిస్తంద్ర = హెచ్చరికతోఁ గూడిన, అంబుదధారోపమ=మేఘముల వర్షాధారలతో సమానమైన, రుంద్ర = దట్టమైన, శరాసార=బాణవర్షముయొక్క, పతన=పడుటచే, రూక్షంబున్ = దయ లేనిది, దయ యనునది లేక బాణవర్షము గురియించునది యగు, రథంబున్=తేరిని.

తాత్పర్యము

ఇంద్రాయుధములతో సమానములైన యాయుధము లనేకములు గలదియు, భయంకరమైన కాంతి గలదియు, మేఘములు వర్షధారలవలె బాణవర్షమును నిర్దయముగాఁ గురియునదియు నగు తేరిని.

దీనిచే రావణుఁడు దూరమునుండియే బాణములు వేయుచు వచ్చుచున్నాఁ డని భావము.

—• శ్రీరాముఁడు మాతలిని హెచ్చరికగ నుండఁజెప్పుట. •—

చ. కనుఁగొని బాలచంద్రనత•కార్ముకముం గులిశాభిమృష్టమై
తునియలువాఱు శైలతతి•తోరపుమ్రోఁతఁ జెలంగుదానిఁ గై
కొని సురనాథుసారథిని • గూర్మి వచించెను గంటె మాతలీ !
మనపగవాని తేరి నస•మానజవంబున వచ్చువైఖరిన్. ౨౮-౨౮

అర్థములు. బాలచంద్రనత కార్ముకమున్ = బాలచంద్రునివలె వంపఁబడిన వింటిని, కులిశాభిమృష్టమై=వజ్రాయుధముచేఁ గొట్టఁబడి.

తా త్ప ర్య ము

చూచి యర్ధచంద్రునివలె వంపుగలదై వజ్రముచేఁ గొట్టఁబడి తునుకలగు కొండల విశేషధ్వనివంటి ధ్వనిగలదానిని, విరామకాలమునఁ గ్రింద నుంచినదానిని గైకొని ప్రేమతో మాతలితో రామచంద్రమూర్తి యిట్లనియె. మాతలీ! చూచితివా, మన పగవాని తే రెంత వేగముతో వచ్చుచున్నదో.

ఉ. చావఁగఁగోరి తాన యప • సవ్యముగాఁ జనుదెంచుచున్న వాఁ
డీవును నిండు హెచ్చరిక • నేగు మెదురొ్కని మారుతుండు ప్రో
ద్భావఘనంబునుం జెదరఁ • దాఁచు విధంబున రూపుమాపెదన్
రావణు, నేఁ దదేకమతిఁ • గ్రాలెద వాలెద విక్రమంబునన్. ౪౮౯

అర్థములు. అపసవ్యముగా=అప్రదక్షిణముగా, అప్రదక్షిణముగాఁ దిరుగుట యనిష్టసూచకము. ప్రేతకార్యములందుఁ దప్ప దక్షిణవేళల దేనికి నప్రదక్షిణముగఁ దిరుగరాదు. తిరిగినవానికిఁ గీడుగలదు. మారుతుండు = వాయువు, ప్రోద్భావఘనంబునున్ = పెద్ద మేఘమును, తాఁచు విధంబునన్ = కొట్టునట్లు, తదేకమతిన్=ఆయొక్క మనస్సుతో, వాలెదన్=విజృంభించెదను.

తా త్ప ర్య ము

రావణుఁడు తనకు చావు సిద్ధమగుటచేఁ గాఁబోలు మన కప్రదక్షిణముగ వచ్చుచున్నాఁడు. నీవు మిక్కిలి హెచ్చరిక గలిగి వాని తే రప్రదక్షిణముగా వచ్చునట్టులే యెదురుగఁ బొమ్ము. వాయువు పెద్ద మేఘమును జెదరఁగొట్టునట్లు రావణుని నాశము చేసెదను. నా మనస్సంతయు నా కార్యమందే యుంచి పరాక్రమించెదను.

ఆ. దృష్టి చెదరనీక • హృదయ మేకాగ్రత, నిలిపి డీలుపడక • కలఁగిపోక
భ్రాంతమతివిగాక • పగ్గముల్ విడుచుచో, లాగుచోట నెఱపు • లాఘవంబు.

తా త్ప ర్య ము

పగవానిమీఁద నుంచిన దృష్టిని నిటునటు చెదరనీకుము. మనస్సు కూడ 'యత్రదృష్టి స్తత్ర మన' యన్నట్టు దృష్టి యెందున్నదో మన స్సందే యుండనిమ్ము. డిల్లఁబోకుము. ప్రమాదము చెందకుము. ఒకదానిని మఱియొకవిధముగా భ్రమింపకుము. పగ్గములు వదలుగా విడుమనపుడు బిఱ్ఱుగా బిగఁబట్టి లాగునపుడు నీ హస్త లాఘవమును బ్రకటింపుము.

చ. అఱగొఱలేక వాసవు శ • తాంగము దిద్దెదునంత వానికిన్
గఱదలు నేను జెప్పెదును • కార్యభరంబునఁ జిత్త మంతయున్
గుఱికొని యుద్ధమంద యిడి • కొందును గావున హెచ్చరించితిన్
గఱపుట కాదటన్న గిరి • ఖండనుసారథి ప్రీతచిత్తుఁడై. ౪౯౧

అర్థములు. అఱగొఱలేక = ఇంకు గొంకులేక, కఱదలు=బుద్ధులు, కఱ

పుటకాదు = నీకు నేర్పలేదు. గిరిఖండను సారథి = ఇంద్రుని సారథి - మాతలి. ప్రీతచిత్తుఁడై = సంతోషించినవాఁడై, మొదట నేమిరా యీయన నాకు సారథ్యము నేర్పుచున్నాఁడే యనుకొన్నవాఁడు నేర్పుట కాదన్న మీఁదట సంతోషించిన వాఁ డయ్యెనని భావము. రథికసారథులు పరస్పరము హెచ్చరించుట ధర్మమే కదా.

## తా త్ప ర్య ము

ఇంద్రు నంతటివానికి జంకు గొంకు లేక రథముఁ గడపు నీయంతవానికి నేను బుద్ధులు చెప్పుదునా? నేను కార్యభారము నాలోచించి నా మనస్సంతయు యుద్ధమందే యుంచియుందును. ఇతరకార్యములు హెచ్చరింప నా కవకాశ ముండదు. కావున నిప్పుడే హెచ్చరించితినిగాని నీకు నేర్పలేదు, అనిన మాతలి సంతోషించినవాఁడై.

తే. అసురపతిరథ మపసవ్య • మగువిధాన, ధరణిరజ మరిఁ గప్పర • థంబుఁబఱప
 రావణుఁడుకింక నెదురేఁగి • రాము నేసెఁ, గాండకాండముల్ దండోప • దండములుగ

అర్థములు. అసురపతి రథము = రావణునితేరు, అపసవ్యము = అప్రదక్షిణము, ధరణి రజము = నేలదుమ్ము, కాండముల్ = బాణ సమూహములు, దండోప దండములుగ = గుంపులు గుంపులుగ, తండోపతండము లనునది యపశబ్దము

## —• రావణుమరణంబుఁ దెలుపు విహ్నంబు లగపడుట •—

తే. ధర్షణామర్షితుండు నీ • తావిభుండు, రోషభీషణుఁ డయి ధైర్య • భూషణుండు
 వజ్రిచాపంబుఁ గొని యేసె • భానురశ్మి, సమమహాప్రభముల శాత • సాయకముల.

అర్థములు. ధర్షణామర్షితుండు = తిరస్కారముచేఁ గోపించినవాఁడు, రోషభీషణుఁడయి = కోపముచే భయంకరుఁడై, ధైర్యభూషణుండు = ధైర్యమే యలంకారముగాఁ గలవాఁడు, వజ్రిచాపంబు = ఇంద్రుఁడు పంపిన వింటిని, భానురశ్మి = సూర్యకిరణములతో, సమ = సమానములైన, మహాప్రభములన్ = గొప్పకాంతి గల వానిని, శాతసాయకములన్ = వాఁడి బాణములను.

## తా త్ప ర్య ము

తిరస్కారముచేఁ గోపించిన రామచంద్రమూర్తి కోపముచే భయంకర మూర్తియై యింద్రుఁడు పంపినవిల్లు దీసికొని సూర్యకాంతితో సమానమైన కాంతి గల వాఁడిబాణముల రావణాసురు వేసెను.

ఉ. రావణరామచంద్రములు ప • రస్పరనిర్మథనాభిలాషులై
 చేవ దలిర్ప మత్తవన • సింహయుగంబులపోల్కిఁ బోరుచో
 దేవత లభ్రవీథి గుమి • గూరి మహారథయుగ్మయుద్ధ మా
 పోవక చూచి రెప్డు హరి • పోవునొ రావణుఁ డంచుఁ గోరుచున్. ౨౪౩౪

అర్థములు. పరస్పర నిర్మథనాభిలాషులై = ఒకరినొకరు చంపఁ గోరిక

గలవారై, మత్త=మదించిన, వనసింహ యుగంబుల పోల్కి = అడవిసింహముల జంటవలె, ఆపోవక=తృప్తిలేక, పొరిపోవునో=చచ్చునో.

తాత్పర్యము

రావణుఁడు రామచంద్రమూర్తి యొకరి నొకరు చంపు కోరికతో బలాతిశయమున మదించిన యడవి సింహములవలె యుద్ధము చేయఁగా దేవతలాకాశమున గుంపులై రావణుఁ డెప్పుడు చచ్చునా యని యా మహావీరుల నిద్దఱఁజూచుచుండిరి.

కం. రావణునాశము ధరణిసు, తావిభువిజయంబుఁ దెలుప•దారుణమయి మేన్
వావిరి గగ్గురుపొడువఁగ, నా వేళను లక్షణంబు•లగపడఁ జొచ్చెన్. ౨౪॥

తాత్పర్యము స్పష్టము.

సీ. రావణురథముపై•రక్తవర్షము వ్రాలె, సుడిగాలి డాచుట్లు•చుట్టి విసరెఁ
వానికతాంగము • బడిఁ జెను గ్రద్దలు, గుములుగ మింటను • గూడి యాడె
దాసనపుంబువ్వు • తెర మైన డాలున, సంధ్య లంకాపురి • సవదరించె
దినమయ్యుఁ దత్కాంతిఁ • దేజరిల్లె ధరిత్రి, మండెడుభంగి భీ•మంబుగాఁగఁ
ఆ. దోఁకచుక్కలురలెఁ • దోరంపుఁబిడుగులు, పడియె నసురచయము•పల్లటిల్ల
పోఁకు లనిని గపులఁ•దాఁకుచో వారి హ, స్తంబు లెవరొ బిగియు•చందమయ్యె.

అర్థములు. డాచుట్లు=ఎడమవైపుగా. అప్రదక్షిణముగ, బడి = వెంబడి, సవదరించెన్ = తాల్చెను, గ్రద్దలు సమీపమునఁజుట్టి తిరుగుట ఆసన్నమరణత్వమును దెలుపును. 'ఆసన్నమృత్యో ర్నికటే చరంతి గృధ్రాదయో మూర్ధ్ని గృహోర్ధ్వభాగే' శకునార్ణవము. ఎవని యింటిమీఁదఁగాని తలమీఁదఁగాని గ్రద్దలు మొదలైనవి తిరుగునో వానికి మృత్యువు సమీపించినది.

తాత్పర్యము

రావణాసురుని తేరి మీఁద నెత్తురువాన గురిసెను. సుడిగాలి యెడమవైపుగఁ జుట్టి విసరెను. వాని రథము వెంట గ్రద్దలు గుంపులై యాకాశమునఁ గూడి తిరిగెను. సంధ్య లంకయందు దాసనపుష్పమువంటి కాంతినిఁ గల దయ్యెను. పగటి వేళ యయ్యు నాకాంతికి భూమి మండుచున్నట్లు కానవచ్చెను. తోఁకచుక్కలు రాలెను. పిడుగులు విస్తారముగఁ బడెను. రాక్షసులు కలఁతచెందిరి. రాక్షసులు వానరులఁ గొట్టఁబోవునపుడు వారిచేతుల నెవరో బిగఁబట్టిన ట్లుండెను.

కం. రావణునితేరు చనియెడి, చో వసుధ వణంకుచుండె • సూర్యమరీచుల్
రావణునంగముపైఁ బడెఁ,గాని పసిమి తెల్ల కటియ•కాంతులతోడన్. ౨౫॥

తాత్పర్యము

రావణు తేరు పోవుచోట నేల యదరుచుండెను. సూర్యకాంతులు రావణు మీఁదఁ బడెను గాని, యవి ఎఱుపు, పసుపు, తెలుపు, నలుపు వన్నెలు కలవై యుండెను.

కం. వెంబడి వచ్చెడిపెనుగృ, ధ్రంబులు ముఖములను మంట ♦ గ్రక్కుచుఁ దద్వ
క్త్రాంబును గని యశివనినా,దంబులు గావించె దెసల♦దళ మయ్యె నిరుల్.

అర్థములు. అశివనినాదంబులు = అశుభము దెలుపు ధ్వనులు, ఇరుల్ = చీఁకటులు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. ప్రతికూలవాయువుల్ ♦ పాంసుజాలంబుతో, రావణాసురు దృష్టి♦ద్రఢిమఁ జెఱిచె
నుఱుములు లేకయే♦యురలె నింద్రాశను, లందందు సైన్యంబు♦నందుఁగలయఁ
బాంసువర్షంబునఁ ♦ బరికింపరా దయ్యె, జలధరమార్గంబు ♦ సైన్యములకు
శారికాకోటులు♦జగడంబు లాడుచుఁ, బరుషధ్వనులతోడఁ ♦ బడియె దేరఁ
తే. గటుల జనియించె విస్ఫులిం♦గములు కనుల,నూరె నీరంబు బాబాల♦కొక్కసారి
యిట్టియుత్పాతములు రాక్ష♦సేంద్రుకీడు,పలువిధంబులఁ దెలిపెను♦భండనమున.

అర్థములు. పాంసుజాలంబుతో = విస్తారపు దుమ్ముతో, ద్రఢిమ = పటుత్వము, ఉరలెన్=రాలెను, ఇంద్రాశనులు = పిడుగులు, పాంసువర్షంబున= దుమ్మువానచే, జలధర మార్గంబు=మేఘమార్గము, ఆకాశము,శారికాకోటులు = గోరువంకల గుంపులు, బాబాలకు=గుఱ్ఱములకు, కటులన్=చెక్కిళ్ళయందు, విస్ఫులింగములు=మిణుఁగురులు, భండనమునన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము

ఎదురుగాలి దుమ్ముతోడ పీది రావణుని దృష్టిపటుత్వము చెఱిచెను. ఉఱుము లేకయే సైన్యమున పిడుగులు పడెను. ధూళివర్షముచేత నాకాశము కానరాదయ్యెను. గోరువంకలు కలహించుచు పరుషముగఁ గూయుచు తేరియందుఁ బడెను. గుఱ్ఱములకుఁ జెక్కిళ్ళయందు మిణుఁగురు కన్నుల నీరు కలిగెను. రావణుని కీడు తెలుపుచు నిట్టి యపశకునము లనేకములు గానవచ్చెను.

కం. రామునకును సౌమ్యంబులు, క్షేమావహములును నైన ♦ చిహ్నము లయ్యెన్
రాముఁడు వానిని గని మది, నామోదం బొందెఁ జెచ్చె ♦ నసురుం డనుచున్.

అర్థములు. క్షేమావహములు=మేలు కలిగించునవి.

తా త్ప ర్య ము స్పష్టము.

## —♦ {౧౦౮-వ సర్గము. వానరరాక్షసులు శ్రీరామరావణ యుద్ధంబు దిగ్భ్రమగొని చూచుట} ♦—

శా. హర్షోల్లాసవికాసభాసురముఖుం♦డై రామచంద్రుండు జ్యా
కర్షారావము ఘోరమై పరఁగ వీఁ♦కం బాణ పాతంబులన్
ధర్షించెన్ సురవైరి వాఁడును రణో♦త్కంఠన్ మహాశస్త్రముల్
వర్షించెం ద్రిజగద్భయానకముగా ♦ వర్తిల్లెఁ దజ్జన్యమున్. ౨౭౭౧

అర్థములు. హర్షోల్లాస వికాస భాసుర ముఖుండై=పులకలచేతను సంతో

షము చేతను గలిగిన వికాసము చేతఁ బ్రకాశించు ముఖము గలవాఁడై, జ్యాకర్షా రావము = అల్లెత్రాటిని లాగుధ్వని, రణోత్కంఠన్ = యుద్ధమందలి తహ తహ పాటుచే, జన్యము = యుద్ధము.

తాత్పర్యము

పులకలచేతను సంతోషముచేతను గలిగిన వికాసమువలన ప్రకాశించు ముఖము గలవాఁడై రామచంద్రమూర్తి యల్లెత్రాడు లాగి విడుచుటవలన గలుగు ధ్వని భయంకరముగా వ్యాపింపఁగా బాణములు వేయుటచే రావణుని మోదెను. వాఁడును యుద్ధమందలి యతికాంక్షచే మహాశస్త్రములను వర్షించెను. ఈ ప్రకారము యుద్ధము భయంకరమయ్యెను.

ఉ. మర్కటసైన్యముల్ దనుజ♦మండలియున్ రణకాంక్ష గల్గియున్
  గర్కశసాధనావళులు ♦ గ్రాలుకరంబులతోడి రాక్షసే
  శార్కకులీనభండనము ♦ నక్కటఁ జూచుచుఁ జేష్ట లేది సం
  తర్కముతోఁ దదేకమతిఁ ♦ దప్పనిచూడ్కులఁ జూచె నెంతయున్. ౨౮౮౨

అర్థములు. కర్కశ = కఠినములైన, రాక్షసేశ = రావణుని యొక్కయు, అర్కకులీన = రామచంద్రుని యొక్కయు, భండనము = యుద్ధము, చేష్టలేది = ఏకార్యము చేయక, కదలక మెదలక - సంతర్కముతో = ఎవరు గెలుతురోయను నూహలతో, తదేకమతిన్ = మనస్సంతయు దానియందే యుంచి, తప్పని చూడ్కులన్ = దానిని విడిచి మఱియొకదానిమీఁదఁ బోవని దృష్టులచే.

తాత్పర్యము

వానరసేనలు రాక్షససేనలు యుద్ధము చేయఁ గోరిక గలిగియు, కావలసిన సాధనములు చేతులఁ బట్టుకొన్న వాఁడయ్యు రామ రావణుల యుద్ధమును జూచు నాశచే కదలక మెదలక తదేకధ్యానముతో నెవరు గెలుతురో యెవరి కే క్షణ మున నేమగునో యని తెప్పలు వ్రాల్పక చూచుచుండెను.

కం. అబ్బురపడు మనములతో, నిబ్బరపడి నిలిచి డాయు ♦ నిజశత్రులపై
  దెబ్బయిడి దీయ రిరుదెస, నబ్బలియులపోరు చూచు♦నభిలాషమునన్ ౨౮౮౩

తాత్పర్యము

రామరావణులయుద్ధము చూచు కోరికతో నాశ్చర్యపడు మనస్సులతో నిబ్బరముగ నిలిచి శత్రులు తమపై పడివచ్చుచున్నను వారిని గొట్టక నిలిచియుండిరి.

కం. రావణుఁ గను నసురులు నీ, తావిభుఁ గను వానరులును ♦ దతవిస్మయపు
  ల్లావిఘ్నాలోకనముల, వా విచ్చి రహింత్రు సాల♦భంజిక లట్లై. ౨౮౮౪

అర్థములు. తతవిస్మయ = విస్తారమైన యాశ్చర్యముచే, ఫుల్ల = విచ్చిన, అవిఘ్న = విఘ్నములేని, ఆలోకనములన్ = చూపులచే, వా విచ్చి = నోరు తెఱచి కొని, సాలభంజికలట్లై = బొమ్మలవలె.

తా త్ప ర్య ము

రావణునిఁ జూచి రాక్షసులు, రామునిఁ జూచు వానరులు ఆశ్చర్యముచే తెప్పపాటులేని కన్నులచే నోరు తెఱచికొని, బొమ్మలవలెనై చూచు చుండిరి.

—♦ శ్రీరాముఁడు రావణు ధ్వజంబు నఱకుట ♦—

శా. అంతన్ రావణరాఘవుల్ నిజనిమి♦త్తాలీసమీక్షాదృఢ
స్వాంతుల్ లేశము నీసు డింపక భయం ♦ బావంతయున్ లేక దు
ర్దాంతప్రౌఢిమఁ బోరుచో నసుర మ ♦ ర్తవ్యం బటంచున్ ధరా
కాంతుండున్ విజిగీష స్వస్వబలవి♦క్రాంతుల్ సమగ్రంబుగన్. ౨౮౮౫

అర్థములు. నిజ నిమిత్తాళి సమీక్షా దృఢస్వాంతుల్ = తమకుఁ గలిగిన శకునము చూచుటచే దృఢపడిన మనస్సులు గలవారు, రావణుఁడు తనకుఁ గలిగిన యపశకునములఁ జూచి తనకుఁ జావు తప్పదని తలఁచెను. రామచంద్రమూర్తి శుభ శకునములఁ జూచి జయము తప్పదని నిశ్చయించెను. మర్తవ్యం మరణం అవశ్యం భావతిమర్తవ్యం, అవశ్యకత్యార్థేతవ్యః-మరణమవశ్యముకలుగుననిరావణాసురుఁడు ఈమాటకు మృత్యురూప శత్రువును చంపవలయునని యర్థమని కతకుఁడు, విజిగీష= జయించు కోరికతో, స్వస్వబల విక్రాంతుల్ = తన తన బలము పరాక్రమము, సమగ్రంబునన్ = పూర్ణముగ.

తా త్ప ర్య ము

ఇట్లు శకునములు కలుగఁగా రావణుఁడు రామచంద్రమూర్తియుఁ దనకుఁ దనకుఁ గలిగిన శకునములఁ జూచి మనస్సులు నిశ్చయము చేసికొనియు కొంచెమైనను కోపము వదలక, కొంచెమైన భయపడక, మిక్కిలి నేర్పుతో యుద్ధము చేయునపుడు అపశకునములు గానవచ్చుటచేఁ దనచావు తప్పదని రావణుఁడును, శుభశకునములు గానవచ్చుటచే తనకు జయము తప్పదని రామచంద్రమూర్తియు తలఁచి తమబల పరాక్రమములు పూర్ణముగ.

శా. హోరాహోరి పెనంగుచో సురపరుం♦డుగ్రోగ్రదుర్వారస
న్నారాచోత్కరముల్ నిగిడ్చి ధరణీ♦నాథధ్వజం బంటఁ ద
న్నారాచంబులు దానిఁ దాఁకక ధరన్ ♦ వ్యర్థంబులై రాలుడున్
శ్రీరాముండు ప్రతిక్రియం జలుప నెం♦చెన్ వంచె వి ల్లుద్ధతిన్. ౨౮౮౬

అర్థములు. సురపరుండు = దేవద్వేషి, రావణుఁడు, ఉగ్రోగ్ర = మిగుల నుగ్రములైన దుర్వార = వారింపరాని, సత్+నారాచ+ఉత్కరముల్ = మంచి బాణ సమూహములు, ధరణీనాథధ్వజం బంటన్ = రామచంద్రుని ధ్వజము దాఁకునట్లు, హోరాహోరిన్ = విరామము లేక.

తా త్ప ర్య ము

కొంచెమైనఁ దెఱపి లేక యుద్ధము చేయునపుడు రావణుఁడుమిగులనుగ్రము

లైన నివారింపరాని బాణములను రామచంద్రమూర్తి ధ్వజమును దాఁక వలయు నని వేసెను గాని యవి దానిని దగులకయే వ్యర్థముగా నేల రాలెను. అప్పుడు రామచంద్రమూర్తి వాఁడు చేసిన దానికి బదులు చేయఁ దలఁచి బలాధిక్యము కొలఁది విల్లు వంచెను.

కం. తెగ నిండఁ దిగిచి యొక్కటి, ఖగముం బరఁగింపఁ ద్రుంచి ♦ క్రవ్యాదు ధ్వజం
బొగి మహిఁ జొచ్చెను వేగము, బిగిచెడి యది యురలె వాని ♦ బీరముపోలెన్.

అర్థములు. తెగ=అల్లెత్రాడు, నిండన్ = పూర్ణముగా, ఎంతవఱకు, లాగ సాధ్యమో యంతవఱకు, క్రవ్యాదు=రాక్షసునియొక్క, ఉరలెన్=ఫ్రొల్లెను.

తాత్పర్యము

అల్లెత్రాడు పూర్ణముగ లాగి యొక్క బాణమును బ్రయోగింపఁగా నది రావణుని ధ్వజమును ఖండించి భూమిలోఁ బ్రవేశించెను. ఆ ధ్వజము రావణుని పరాక్రమమువలెనే బిగువుచెడి నేలదొరలెను. ఉపమానము బిగువు చెడుట యుండేయని గ్రహింపవలెను.

చ. ధ్వజ మిటు గూల రావణుఁడు ♦ దారుణరోషపరీతచిత్తుఁ డై
భుజబల మెల్లఁ జూపి రఘు ♦ భూవరువాజుల ముంచె నమ్ములన్
గజిబిజిలేక తామరస ♦ కాండహతంబులు వోలె సైంధవ
వ్రజములు స్వస్థతన్ వెలసె ♦ వానిని జూచి సురారి నొండియున్. ౨౮౮౮

అర్థములు. దారుణరోషపరీతచిత్తుఁడై = భయంకరమైన రోషముచేఁ గూడిన మనస్సు గలవాఁడై, తామరసకాండ=తామర తూఁడులచే, హతంబులు= కొట్టఁబడినవి, సైంధవ వ్రజములు=గుఱ్ఱముల సమూహములు, స్వస్థతన్=యథా ప్రకారముగ, సుఖముగ.

తాత్పర్యము

తన ధ్వజము నేలఁబడఁగా రావణుఁడు మిగులఁ గోపించినవాఁడై తన భుజ బలమంతయుఁ జూపి రాముని గుఱ్ఱముల బాణములచే ముంచెను. ఆ గుఱ్ఱములు కొంచెమైనఁ గలఁతచెందక తామరకాండలచేఁ గొట్టఁబడినవానివలెనై యథా ప్రకారము సుఖముగ నుండెను. రావణుఁడు మఱియును.

కం. మాయా విహితశరంబుల,నాయసపరిఘముల గదల ♦ నతిభీకరచ
క్రాయతశూలపరశ్వథ, సాయక గిరిశృంగవృష్టి ♦ సాధ్వసదముగన్. ౨౮౮౯

అర్థములు. మాయావిహిత శరంబులన్=మాయచేఁ గల్పింపఁబడిన శర ములచే, ఆయస పరిఘములన్ = ఇనుప గుదియలచే, అతిభీకర = మిగుల భయం కరమైన, చక్ర = చక్రములచేతను, ఆయతశూల = నిడుపాటి శూలములచేతను, పరశ్వథ=గండ్ర గొడ్డండ్ల చేతను, సాయక=బాణములచేతను, గిరిశృంగవృష్టిన్ = పర్వతశిఖరముల వానచేతను, సాధ్వసదముగన్=భయము కలిగించునట్లుగ.

### తాత్పర్యము

సామాన్య బాణములు పనిచేయకుండుటచేత మాయచేఁ గల్పింపఁబడిన బాణములచేతను ఇనుపగుదియలచేతను గదలచేతను భయంకరములైన చక్రములచేతను నిడుపాటి శూలములచేతను గండ్రగొడ్డండ్లచేతను బాణములచేతను శిఖర వర్షముచేతను భయము కలుగునట్లు.

కం. ఆకసము భూమినిండ న,నేకంబులు శస్త్రసమితు • లెల్లెడఁ బఱపెన్
గాకుత్థ్సరథము దక్క న,నీకమ్ము నిరంతరముగ • నిండెన్ వానన్.

### తాత్పర్యము

భూమి ఆకాశము నిండునట్లు శస్త్ర సమూహములను నలువైపులఁ బరగించెను. రామచంద్రమూర్తి రథము తప్పఁ దక్కిన సేనయంతయు వానిచే నిండెను.

ఇందు మాయాశరములనఁగా మిథ్యాశరములు గావు. మిథ్యలను నేమని రావణుఁడు ప్రయోగించియుండును. కావున మాయాకల్పితము లనఁగా అద్భుత శక్తిచేఁ గల్పింపఁబడినవనియే యర్థము. ఇట్లె ప్రహ్లాదునిమీఁద శంబరుఁడు మాయా యుధముల ప్రయోగింప సుదర్శనము వానిని ఖండించెను. విష్ణుపురాణమున నిట్లు చెప్పఁబడెను.

'తేన మాయాసహస్రం త చ్ఛంబర స్యాశుగామినా, బాలస్య రక్షితా దేహ మేకైకంచ నిషూదితమ్'. హుళక్కి బాణములు హుళక్కి కార్యములు చేయునే కాని కార్యసాధకము లెట్లు కాఁగలవు. అవి ఖండింపఁబడు టెట్లు? కాన మాయ యనఁగా మిథ్యగాదు. అనీకము=సమూహము.

శా. ఏకోద్యోగ విజృంభమాణుఁ డయి దై • త్యేశుండు నశ్రాంత మ
వ్యాకీర్ణం బగు చిత్తవృత్తి శరసా•హస్రంబు కీశావళిన్
చీకాకుం గొన నేసె నేయుటయు శ్రీ•సీతేశుఁడున్ సుస్మిత
వ్యాకోచాననుఁడై నిజాస్త్రసమితిన్ • వైశంబ పైవైచినన్. ౨౧౬౧

అర్థములు. ఏకోద్యోగ విజృంభమాణుఁడయి = ఒక్క ప్రయత్నముచే విజృంభించినవాఁడై, అశ్రాంతము=విడువక, అవ్యాకీర్ణము = కలఁత చెందనిది. సుస్మిత=చిఱునవ్వుచే, వ్యాకోచాననుఁడై=వికసించిన ముఖము గలవాఁడై.

### తాత్పర్యము

రావణాసురుఁ డేకవిధమైన సంకల్పము గలవాఁడయి విరామము లేక కలఁత చెందని మనస్సుతో నేమైనఁ గానిమ్మని వేలకొలఁది బాణములను వానరులు చీకాకుపడ వేసెను. అది చూచి రామచంద్రమూర్తి వీఁ డీ యాటలకు మరగినాఁడా యని నవ్వుచు, తన యస్త్రసమూహములను వానిమీఁద వేయఁగా.

చ. వడిగొని నూర్లు వేలుగను • వచ్చెడి రాముశరాళిఁ గాంచి తా
నుడుగక యట్ల పైపయి స•ముగ్రత వైచె సురారినాథుఁడున్

గడుకొని వారి బాణముల ♦ ఖస్థలి సాయకబద్ధ మైనకై
పడెఁ బోలుపారి రెండవ న ♦ భం బనఁ బందిరి వైచినట్టు లై. ౨౮౫౨

తాత్పర్యము

మిగుల వేగముగ రామచంద్రమూర్తి బాణములు నూర్లు వేలుగఁ దన మీఁదికి రాఁగా రావణుఁడును నట్టులే తానును వైచెను. వారి యిరువురబాణములచే నాకాశము బద్ధమైనట్లు పందిరి వేసినట్టులై యది రెండవ యాకాశమువలెఁ గాన నయ్యెను.

కం. గుఱి తప్పదు వ్యర్థం బై, పఱి వోవద యెదిరిఁ బఱియ ♦ వాపకపో ది
ద్దఱశరములనొకఁ డొనియు, బిఱుసేదదు వాఁడిచెడదు♦పిఱువోదనిలోన్ ౨౮౫౩

అర్థములు. పఱివోవదు = నశింపదు, పఱియవాపక = చీల్పక, బిఱుసేదదు = బిఱుసు లేనిదికాదు, పిఱువోదు = వెనుకఁబడదు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఒండొరుబాణంబు ♦ లొండొంటి ఢీకొని, తుత్తుమురై నేలఁ ♦ దూలిపడఁగ
సవ్యాపసవ్య సం♦చారభేదంబుల. నెఱపుచు విశిఖముల్ ♦ పఱపి పఱపి
రావణుహయముల ♦ రాముండు రాముని, హయముల రావణుం♦డడిచియడిచి
కృతికిని బ్రతికృతి♦ద్రుతగతిఁ జలుపుచు, నొక్కమూర్తం బిట్టు ♦ లుక్కు మెఱసి
ఆ. యీడఁబోక యుద్ధ ♦ మేటాడుచుండఁగ, సకలభూతములును ♦ సంభ్రమమున
వెఱగుపాటుతోడ ♦ వీక్షించుచుండెను, గాన మెన్నఁడిట్టి ♦ కల నటంచు

అర్థములు. సవ్యాపసవ్య సంచారభేదంబులన్ = ఎడమ కుడిగాఁ దిరుగు భేదములచే, అడిచి = కొట్టి, ద్రుతగతిన్ = శీఘ్రముగ, ఏటాడుచు = కొట్టుకొనుచు, కలన = యుద్ధము.

తాత్పర్యము

ఒకరు వేసిన బాణములు మఱియొకరు వేసిన బాణములతో ఢీకొట్టి రెండును పొడిపొడియై నేలరాలఁగ ఎడమకుడి, కుడియెడమలుగఁ దిరుగుచు బాణములు వేసి వేసి రాముని గుఱ్ఱములను రావణుఁడు, రావణుని గుఱ్ఱములను రాముఁడు కొట్టి కొట్టి యొకరు చేసినదానికి వెంటనే బదులు మఱియొకరు చేయుచు కొంచెము కాలమట్టులు పరాక్రమించి వెనుదీయక యుద్ధము కొట్టుకొనుచుండ సమస్తప్రాణులు భ్రాంతిపడి నివ్వెరగొని యిట్టి యుద్ధ మెన్నఁడు చూడలేదని యనుకొనుచుండిరి.

**—♦ ౧౧౦-వ సర్గము. రావణుఁడు భీమఁబుగ శ్రీరాముతోఁ బోరుట ♦—**

సీ. దాయుచుఁ బాయుచుఁ♦దద్దయుఁ గదియుచు, నన్యోన్యము వధింప♦యత్నపడుచు
నొండొంటిఁ జుట్టుచు ♦ నొరయు నల్లరుగుచు, నిండారుతేజున ♦ మండిపడుచు
విచ్చుచు జవమున ♦ హెచ్చుచుఁ బగడీలు, పుచ్చుచు నెదురు త♦ప్పులనుగనుచు
సారథిసారథ్య♦సామర్థ్యమునఁ జేసి, చిత్రయానంబులఁ ♦ జెలువు మెఱసి

ఆ. రథయుగంబు వఫ్లు రావణ రాఘవుల్ దాయుచోట మరలఁ బాయుచోట
గమనజవము వెలయఁ గాండము ల్గురియింప, వారివాహయుగము భాతి దనరె.

అర్థములు. పగ=శత్రువును, డీలుపుచ్చుచు = డీలుపడఁజేయుచు, వారివాహయుగముభాతి = రెండు మేఘములవలె.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఏపును నేపుమన్ మెఱయ నీగతి నిద్దఱుఁ జిత్రభంగి సా
టోపగతిం జరించుచుఁ గడు న్వడి నెట్టెదు రాచు వర్థిలం
గోపము కాఁడికాఁడియును గుఱ్ఱము మూఁతియు మూఁతి డీకొనన్
చేపడి ఢీకొనం బఱవఁ జేసిరి వారి శతాంగ రాజముల్. ౩౮౫౬

అర్థములు. ఏపు = పరాక్రమము, నేపు=నేరుపు, ఆటోపగతిన్ = వేగముతోఁ గూడిన గమనముతో, ఎట్టెదురు=ఎదురు+ఎదురు=ఎట్టెదురు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అట్టియెడన్ రఘుప్రవరుఁ డాశరనాయకు నాల్గువాజులన్
గొట్టెను నాల్గుబాణములఁ గ్రూరతఁ దత్తడు లోసరిల్లినన్
నెట్టన దీర్ఘరోషి రజనీచరసార్వ్యఁడు రామచంద్రుపై
గుట్టలు గొట్టుశస్త్రమునకుం దులదూఁగెడిములుకుల్ లేసినన్. ౩౮౫౭

అర్థములు. తత్తడులు = గుఱ్ఱములు, ఓసరిల్లినన్=తొలఁగినన్, అడ్డముగా నిద్వఁగా, గుట్టలుగొట్టు శస్త్రమునకున్ = వజ్రాయుధమునకు, తులఁదూఁగెడి=సమానమగు.

తాత్పర్యము

ఆ సమయమందు రామచంద్రమూర్తి రాక్షసరాజు నాలుగు గుఱ్ఱములను క్రూరుఁడై నాలుగు బాణములచేఁ గొట్టెను. ఆ దెబ్బలుపడి గుఱ్ఱములు త్రోవ తొలఁగిపోఁగా దీర్ఘకోపి యగు రావణుఁడు వజ్రాయుధముతో సమానములైన బాణములను రామచంద్రుపై వేసెను

తే॥ బంతితేరుల రాయఁడయని పట్టి వాని, తాఁకునను నొప్పు గొనక నితాంతశాత
సాధనము లేసె దాని కా శక్రవైరి, సారథిని నేసె నిరుపమ సాయకముల. ౩౮౫౮

అర్థములు. నొప్పు = నొప్పి, నితాంత = మిక్కిలి, శాత = పదునైన, సాధనములు = బాణములు, శక్రవైరి = రావణుఁడు, నిరుపమ సాయకములన్ = అసమాన బాణములను, బంతితేరుల రాయఁడయని=పంక్తిరథుని - దశరథుని, పట్టి= కుమారుఁడు.

తాత్పర్యము

అవి తగిలినను రామచంద్రమూర్తి నొప్పిపడక మిగుల వాఁడిగల బాణముల నేసెను. దానికి రావణుఁ డసమానబాణముల సారథిని వేసెను.

కం. మాతలియును దద్విశిఖా, పాతంబులఁ జీమకఱచు ♦ పాటియు నొవ్వేన్
భీతియు మోహము గానక, ప్రీతుఁగఁ యుండె నసుర ♦ శేఖరుఁ డిట్టుల్. ౨౮౫౯

అర్థములు. తద్విశిఖాపాతంబులన్ = ఆ బాణములు మీఁదఁబడుటచే.

**తాత్పర్యము**

ఆ బాణములు తనకుఁ దగిలినను మాతలి చీమ కఱచిన మాత్రము నొప్పినైనను భయమైనను భ్రమయైనను బొందినవాఁడు కాఁడు. కాంతియుఁ దగ్గినది కాదు.

కం. తనసారథి నొప్పించినఁ, దను నొంచినఁ గనలవట్టి ♦ ధైర్యనిధి రుషాఽ
తనురక్తాననుఁడై యసు, రుని విముఖుని జేసె బహుశి ♦ రూక్షేషువులన్. ౨౮౬౦

అర్థములు. రుషా+అతనురక్త+ఆననుఁడై = కోపముచే మిక్కిలి యెఱ్ఱనైన ముఖముగలవాఁడై, విముఖుని = మాఱు మొగము గలవానిఁగా.

**తాత్పర్యము**

తన్నుఁ గొట్టినను గోపింపని రామచంద్రమూర్తి తన సారథిని రావణుఁడు గొట్టఁగా మిగులఁ గోపించి కఱకుబాణములచే వాఁడు ముఖము త్రిప్పుకొని పోవునట్లు కొట్టెను.

చ. ఇరువది ముప్పదిన్ నలువఁ ♦ దేఁబది యర్వది నూఱు వేలు భీ
కరశరవార మొక్కుమొగి ♦ గాత్రము తూఁటులు వోవ నేయుడున్
సురపరిపంథి శాతతర ♦ శూలగదాపరిఘాదిసాధనో
త్కరముల నేసెఁ బెన్రవము ♦ దద్దయు దిక్కులఁ బిక్కటిల్లఁగన్. ౨౮౬౧

అర్థములు. సురపరిపంథి = దేవవిరోధి, రావణుఁడు, పెన్రవము = పెద్దధ్వని. పిక్కటిల్లఁగన్ = క్రిక్కిఱియఁగా.

**తాత్పర్యము**

రామచంద్రమూర్తి యిరువది, ముప్పది, నలువది, యేఁబది, యఱువది, నూఱువేల బాణములు దేహము దూఱిపోవునట్లు వేయఁగా రావణుఁడు పదును గల శూలములు గదలు పరిఘములు లోనగు నాయుధములను పెద్ద ధ్వనులు దిక్కులు నిండ నేసెను.

శా. నారాచంబులు చొచ్చు రాయిడికి నా ♦ నాథంగి క్షోభిల్లెఁ గూ
పారంబుల్, సుతలాలయుల్ విషధర ♦ ప్రాగ్వ్యల్ మహావేదనన్
గూరం జొచ్చిరి, దానవుల్ బెగడి గ ♦ గ్గోలొంది రెంతేని, కాం
తారక్ష్మాధరయుక్త భూవలయ మా ♦ త్రం బయ్యెఁ గంపించుచున్. ౨౮౬౨

అర్థములు. రాయిడికిన్ = ఉపద్రవమువలన, పంచమ్యర్థమున షష్ఠి, కూపారంబుల్ = సముద్రములు, సుతల+ఆలయుల్ = సుతలలోకమున నున్నవారు, విషధరప్రాగ్వ్యల్ = సర్పశ్రేష్ఠములు, గగ్గోలొందిరి = క్షోభపడిరి, కాంతార =

అడవులతోను, భూధర=పర్వతములతోను, యుక్త = కూడిన, భూవలయము = భూచక్రము, ఆర్తంబయ్యెన్=బాధచెందిన దయ్యెను.

తాత్పర్యము

బాణములు తమలోఁ బ్రవేశించు నుపద్రవమువలన సముద్రములు కలఁత చెందెను. పాతాళవాసులైన సర్పశ్రేష్ఠములు మహాబాధ పడఁజొచ్చెను. దానవులు భయపడి మిగులఁ గలఁత చెందిరి. అడవులతోఁ గొండలతో భూచక్రము వడఁకుచు బాధపడెను.

తే. కాంతిఁ గోల్పడెఁ బద్మినీ♦కాంతుఁ డపుడు
గతులు చెడి భ్రమానుపడె సదా♦గతియు సిద్ధ
విబుధ గంధర్వపరమర్షి♦బృంద మెల్ల
దిక్కుగానక చింతచే♦దీన మయ్యె, ౨౪౬౩

అర్థములు. పద్మినీకాంతుఁడు = సూర్యుఁడు, ఇట్లు చెప్పుటచే నింకను సూర్యాస్తమానము కాలేదని యేర్పడు చున్నది. సదాగతి=వాయువు.

తాత్పర్యము

సూర్యుఁడు కాంతిహీనుఁ డయ్యె, వాయువు మార్గముచెడి మొద్దు పాటెను. దేవగంధర్వులయు ఋషులయు సమూహము దిక్కుతెలియక చింతచే శోకించెను.

సీ. స్వస్తిగోబ్రాహ్మణే♦భ్యోస్తు లోకా స్సమా, శ్శాశ్వతా స్తిష్ఠన్తు♦♦చణ్డసమితి
విజయతాం రాఘవో♦విశ్వవిద్వేషిణం, రాక్షసనాయకం♦రావణంచ
యని జపించుచు నాత్మ♦లను నిరీక్షింపగ, రోమహర్షణ మైన♦భీమజన్య
మమరులు గంధర్వు♦లసమానతత్సంప్ర,హారంబుఁ గనుఁగొని♦యుబ్బపడుచు
ఆ. నభ్రమునకు నభ్ర♦మంబుధి కంబుధి, రామరావణోగ్ర♦రణమునకును
రామరావణోగ్ర♦రణమె సమం బని, చూచు చుండి రపుడు♦శుద్ధమతుల.

అర్థములు. గోబ్రాహ్మణేభ్యః స్వస్తి అస్తు = గోవులకు బ్రాహ్మణులకు మేలు కలుగును గాక. బ్రాహ్మణునకు సమానమైనది గోవుమాత్రమే. సమస్త భూచక్రమైనను బ్రాహ్మణునకు సమముగాదు. గోవులవలన బ్రాహ్మణుల వలన లోకమునకు మేలుగలదు,కీడు లేదు. బ్రాహ్మణుఁడు గోవుచెడిన తలలేని మొండెము వలె దేశమే చెడును. వీరు క్షేమముగా నుండినఁ బ్రపంచము క్షేమపడును. ఇది సద్బ్రాహ్మణ విషయము. బ్రహ్మబంధువుల విషయము గాదు, 'లోకాః సమాః శాశ్వతాః తిష్ఠంతు=లోకములు శాశ్వత వత్సరము లుండునుగాక, చండసమితి = భయంకరయుద్ధమునందు, రాఘవః=రామచంద్రుఁడు,విశ్వవిద్వేషిణం=ప్రపంచము నకు విరోధి యగు, రాక్షసనాయకం=రాక్షసరాజు నగు, రావణం = రావణుని, విజయతాం=జయించునుగాక, ఇదిచెప్పినవారు దేవర్షులు గావున వారిభాషయందు వారు మాటలాడిరని గ్రహింపనగు, జపించుచు=పలుకుచు, భీమజన్యము=భయం

కర యుద్ధము, అసమాన తత్సంప్రహారంబు = వారల అసమానమైన యుద్ధము, అభ్రమునకు=ఆకాశమునకు, అంబుధికి=సముద్రమునకు, రామరావణ = రాము నకు రావణునకు సంబంధించిన, ఉగ్రరణమునకును = భయంకర యుద్ధమునకు, అభ్రమున కభ్రము, అంబుధికంబుధి, రామరావణ యుద్ధమునకు రామరావణ యుద్ధము సమాన మనుటచే వీనికి సమముగా నుపమింపఁ దగినవి యివిగాక వేఱు లేకుండుటచే అనన్వయాలంకారము.ఒకవస్తువే యుపమానము ఉపమేయమునైన యెడల ననన్వయాలంకారము.

## తాత్పర్యము

గోవులకు బ్రాహ్మణులకు క్షేమముగలుగునుగాక!లోకములు జనులు శాశ్వత సంవత్సరము లుండునుగాక! యుద్ధమందు లోకద్వేషియు రాక్షసరాజు నగు రావ ణుని రాముఁడు జయించునుగాక! యనుచు భయంకరమై గగ్గురుపాటు గలిగించు నా యుద్ధమును దేవతలు,ఋషులు చూచుచుండిరి. వారు ఆకాశమునకు ఆకాశమే సమానము, సముద్రమునకు సముద్రమే సాటి, రామరావణ యుద్ధమునకు రామ రావణయుద్ధమే యీడని నిర్మలమనస్సులతో నాశ్చర్యపడుచుండిరి.

## —♦ శ్రీరాముఁడు రావణు శిరంబు నఱకుట ♦—

శా. చండామర్ష విభీషణుండు రఘువం ♦ శక్షీరవారాశిచం
ద్రుం డాశీవిషతుల్యసత్క్షురముఁ దో ♦ డ్తోఁ బూని రత్నోజ్జ్వల
చ్చండాంశూపమకుండలాంచితము శీ ♦ ర్షం బంత ఛేదించె బ్ర
హ్మాండం బంతయుఁ జూచె రావణుప్రధా ♦ నాంగంబు నేలం బడన్. ౨౫-౨౬

అర్థములు. చండామర్ష విభీషణుండు=తీక్ష్ణమైన కోపముచే భయంకరుఁడు, రఘువంశ=రఘువంశమనెడి, క్షీరవారాశి = పాలసముద్రమునకు, చంద్రుఁడు = చంద్రుని వంటివాఁడు, ఆశీవిషతుల్య=పాముతో సమానమైన, సత్ + క్షురము = మంచి క్షురము వంటి బాణమును, తోడ్తోన్ = వెంటనే, రత్న - ఉజ్జ్వలత్ = రత్నములచే ప్రకాశించునవియు, చండాంశూపమ=సూర్యునితో సమానములైనవి యగు, కుండల = కుండలములచే, అంచితము = ఒప్పుచున్నది, శీర్షంబు=తలను, ఛేదించెన్=నఱికెను, రావణు ప్రధానాంగంబు=రావణు శిరస్సు.

## తాత్పర్యము

తీవ్రకోపముచే భయంకరుఁడై రఘువంశమను పాలసముద్రమునకుఁ జంద్రుని వంటివాఁడగు రామచంద్రమూర్తి సర్పముతో సమానమైన మంగలకత్తివంటి బాణమును వెంటనే సంధించి రత్నములచే ప్రకాశించునవియు సూర్యునివంటి కాంతిగలవియు నగు కుండలములచే నొప్పు రావణు శిరస్సును నఱికెను. అది నేలఁ బడఁగా ప్రపంచ మంతయుఁ జూచెను.

ఉ. ఆతల యట్టిదే మొలచె • నచ్చటనే యపుడే నృపోత్తముం
డాతతవేగహస్తుఁ డయి • యద్ది హరింపఁగ వెండి మొల్చె నీ
తాతరుణీవిభుం డదియుఁ దప్పక ద్రుంపఁగ వెండి మొల్చె నా
త్మాతలభర్త నూఱు నొక•మాఱును ద్రుంచె సురారిమూర్ధముల్. ౨౮౬౬

తా త్ప ర్య ము స్పష్టము.

పై పద్యమునందు నీ పద్యమునందు నొక శిరస్సు మాత్రమే ఛేదింపఁ బడెనని చెప్పఁబడెను. దీనివలన నిప్పుడు రావణుఁ డేక శిరస్కుఁడై యుండెనని గోవిందరాజీయము. దీని కాధారము ౨౮౮౦ వ పద్యము. ఇచ్చట శిరస్సనునది జాత్యేక వచనముగా గ్రహింపవలెను. ఏలన—ముందు ౨౮౬౭ వ పద్యమున వింశతి భుజుఁడు-పంక్తివదనుఁడు మైనాకుపగిది నిలిచె నని పదితలలు, ఇరువది చేతు లున్నట్లు చెప్పఁబడెను. ఇచ్చట నఱకఁబడినది యొక శిరస్సే కావున నొక శిరస్సనియే చెప్పఁబడెనని తీర్థీయము. ౨౬౧౧ వ ఉద్ధృత్యచ భుజౌ కాచిదంకే శిరః కృత్వా రురోద- ఈవిధముగ మరణానంతర మొంటితల రెండుచేతులే యున్నట్లు చెప్పఁబడెను. దీనికి సమాధానము తీర్థీయమందు లేదు.

సారథి తేరు మరలించు నఱకు పదితలలతో నుండెననియు తల లెక్కువగు కొలఁది లక్ష్యము విశాల మగుటచే దెబ్బ లెక్కువ కావున మరలి వచ్చునపుడు ఒంటితలతో రెండుచేతులతోనే వచ్చెననియు సామరస్యము కుదుర్ప వచ్చును. రావణుఁడు కామరూపిగదా. తెగిన శిరస్సు మరల మొలచినట్లు చెప్పఁబడెను.ఇది యెట్లు? బ్రహ్మ యిచ్చిన వరము లందు నిది చెప్పఁబడలేదు.వరకాలమున వాఁడు నఱికి హోమము చేసిన తొమ్మిది తలలు మఱల వచ్చునట్లు బ్రహ్మయనుగ్రహించెను గాని యెప్పటి కట్లే యగునని చెప్పలేదు.

దశగ్రీవస్య చిచ్ఛేద శిరాంసి రఘునందనః,సముత్థితాని బహుశో వరదానాత్కపర్దినః—పద్మ. పురా.

అని యిది శివునివర మని చెప్పఁబడెను. ఉత్తరకాండమున నిదియుఁ జెప్పఁబడలేదు. నూటొక్కమాఱు రాముఁడు రావణుతల నఱకెనుగదా. ఆ నేలఁ బడిన తలలేవి? నేలమీఁద నున్నట్లు చెప్పఁబడలేదు. ఈవిషయమై యరణ్యకాండమున జటాయురావణయుద్ధఘట్టమునఁ జూచునది.

కం. ద్రుంచినవెంటనె తల మొల, తెంచెడినే కాని వాఁడు • తెగియెడిభంగుల్
గొంచెము దోఁపమికిం జిం,తించెం జిత్రం బటంచు • నృపతిలకుండున్. ౨౮౬౭

తా త్ప ర్య ము

తల నఱకఁగానే తల మొలచుచుండెను గాని వాఁడు చచ్చు విధము కనఁబడలేదు.ఇది యేమి చిత్రమని రామచంద్రమూర్తి యాలోచించెను.పడిన తలయే మఱలఁ గఱచుకొను చుండె ననుట మీఁది యాక్షేపమునకు సమాధానము.

సీ. మారీచుఁ జంపితి ♦ మడియించితిని ఖరు, దూషణుఁ ద్రుటిలోనఁ ♦ ద్రుంపఁగంటి
గ్రౌంచవనస్థు వి♦రాధు మ్రందించితి, దండకను గబంధు ♦ దారితాంగుఁ
జేసితి నెప్పుడు ♦ వీసరవోవవ, యస్మదస్త్రములు ప్ర♦త్యాయికములు
నేఁ డేల వడిచెడి♦వాఁడి వాసినయవి, కా నిట్టు లది యేమి♦కారణంబొ
తే. యనుచుఁ జింతాపరుండయి♦యునము డింప, కప్రమత్తత వెందియు♦నతులబాణ
వృష్టి వక్షంబుఁ జించిన♦వెగడుపడక, యసురవర్యుండు ముసలగ♦దాది వైచె.

అర్థములు. ప్రత్యాయికములు=నమ్మికమైనవి.

తాత్పర్యము

మారీచుని, ఖరుని, దూషణుని, క్రౌంచవనమున విరాధుని, కబంధుని జంపితిని. ఎన్నఁడు నా బాణములు వ్యర్థములైనవి కావు. నమ్మికమైనవి. నేఁడేల యిట్టులయ్యెను ? వేగము తగ్గుటకు వాఁడిచెడుటకు నేమి కారణము అని యాలోచించుచు రోసము వదలక హెచ్చరికతో బాణవర్షముచే వక్షము చింపఁగా రావణుఁడు భయపడక ముసలము గద లోనైనవి వేసెను.

తే. వారు రథవేగగరిమ న ♦ భంబునందు
భూతలంబునఁ దద్గిరి ♦ మూర్ధమునను
నిశయు దినమును మూర్తంబు ♦ నిమిషమేని
నిలుపకయె సర్వరాత్రంబు ♦ కలను సలుప. ౨౮౬౯

అర్థములు. రథవేగగరిమన్ = అతిశయించిన రథవేగముచే, నభంబునందున్ = ఆకాశమందు, భూతలంబున = భూమియందు, తద్గిరిమూర్ధమునను = ఆ త్రికూటపర్వతశిఖరమునందు, ఇట్లు చెప్పుటచే కొంతసేపు భూమియందు, ఆవల నాకాశమందు, ఆవల త్రికూటశిఖరమందు - ఈ మూఁడు ప్రదేశములందు ననుకూలపడినట్లు ఒకటిమార్చి యొకటి రణభూమిగాఁ జేసిరని భావము. ఈ కారణము చేతనే వానరులను రాముఁడు సమీప పర్వతములందుఁ గూర్చుండుఁ డని చెప్పెను. సర్వరాత్రంబు=రాత్రియుఁ బగలు, చతుర్దశినాఁటి రాత్రి అమావాస్య నాఁటి పగలు రాత్రి.

మండోదరీ విలాపమందు సూర్యరశ్ములు లంకాపురిఁ బ్రసరించె ననుటచే అమావాస్య శేషముగల పాడ్యమినాఁటి యుదయము రావణ వధమనియుఁ జెప్ప వచ్చును.

సర్వరాత్ర మనుటకు సప్తరాత్ర మనునది యపపాఠమనియు రామరావణులకు నేఁడుదినముల యుద్ధము రామాయణమున వినఁబడదనియు తీర్థీయము. సప్త రాత్రమనునది యపపాఠము. ఏఁడుదినములు రామరావణయుద్ధమే యైనయెడల నవమినాఁడే యీ యుద్ధము ప్రారంభమయి యుండవలెను. అష్టమినాఁడే మూలబలము హతమైయుండవలెను. పంచమి, షష్ఠి, సప్తమి, ఇంద్రజిత్తు యుద్ధము. ఈ

ప్రకారము చూచిన నిది యేలెక్కకు సరిపోదు.కావున సప్తరాత్ర మనునది యప పాఠము. అటుగాక సప్తరాత్ర మనునది సరియైన పాఠమందు రేని నవమినాఁడు యుద్ధారంభము కావున నేఁడు అమావాస్య కావున నేఁడుదినము లగుచున్నది. కావున యుద్ధమంతయుఁ గలసి ఏఁడు దినములని చెప్పవచ్చును.

ఈ విషయము ముందే చర్చింపఁ బడెను. యుద్ధారంభము దినము మొదలు రావణాసురుఁడు చచ్చువఱకు దినసంఖ్య యేఁడుగా నుండవలయును గాని దానికి మించరాదు.రామనామము మొదలు రామాయణ మంతయు నేఁడు సంఖ్యమీఁద నాధారపడి యున్నది.రామ=ఏఁడు, కాండము లేఁడు, యుద్ధదినము లేఁడు మొదలైనవి.(దీనిని జూచియే వ్యాసమహర్షి భారతమునకు 'జయ' మని పేరు పెట్టెను. జయ=౧౮; భారత పర్వములు ౧౮;యుద్ధదినములు ౧౮;భగవద్గీత ౧౮ అధ్యాయములు. ఈప్రకారము భారతము పదునెనిమిదిపై నాధారపడఁ జేసెను.సప్తసంఖ్య మహిమ తత్త్వశాస్త్రములందు విశేషించి చెప్పఁబడెను. భాగింప సాధ్యము కాని సంఖ్యలలో ఏడు కడపటిది.గొప్పది, ౧-౨-౩-౫-౭ ఇవి భాగింప సాధ్యపడదు. ఇవి యన్నియుఁ గలిపిన ౧౮ యగును. ఈవిషయము ముందే వ్రాయఁబడెను. చర్విత చర్వణ మేల ? కావున యుద్ధదినము లన్నియుఁ గలిసి యేఁడనియు, నందు రామ రావణయుద్ధ మొక్కదిన మనియు గ్రహింపనగు.

తాత్పర్యము

వారు భూమి ఆకాశము త్రికూటశిఖరము మూఁటిని యుద్ధరంగముగఁ జేసి యానుకూల్యముకొలఁది యీ మూఁడు ప్రదేశములందుఁ దిరుగుచు యుద్ధము చేసిరి. వారు రాత్రి పగలు ముహూర్తమైన నిమిషమైన నిలువక సర్వరాత్రిము యుద్ధము చేసిరి.

తే. వారిరణమున విజయంబు♦వారిజాక్షు,వంశ్యున కటంచు నిశ్చయిం♦పఁగను లేక
యతులమతిశాలిమాతలి♦యూహవైక,హృదయుఁడగు రామవిభుతోడ♦నిట్టులనియె

తాత్పర్యము

వారి యుద్ధమందు రామచంద్రమూర్తియే యిట్టులు యుద్ధము చేయుచుండినచో గెలువఁగలఁ డని నిశ్చయింపలేక మిక్కిలి బుద్ధిమంతుఁడైన మాతలి యుద్ధమందే మనస్సంతయు నిలిపి యితరవిచారములేని రామచంద్రునితో నిట్టు లనెను

## —♦ ౧౧౧-వ సర్గము. శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రంబున రావణు వధించుట ♦—

ఉ. ఏమి మహానుభావ! మది ♦ నేమి యెఱుంగనివానిమాడ్కి నే
మేమొ మహాస్త్రముల్ పగతు ♦ నేసెదుఁ దత్కృతికిం బ్రతిక్రియల్
గా, మడియింప నియ్యసురుఁ ♦ గంజభవాస్త్రము వీడ వయ్య శ్రీ
రామ! సురోక్త శాత్రవప ♦ రాసనకాల మ దిప్డు సంధిలెన్. ౩౭౭౧

అర్థములు. కంజభవాస్త్రము = బ్రహ్మాస్త్రము, సురోక్త = దేవతలచేఁ జెప్పఁబడిన, శాత్రవ పరాసన కాలము=శత్రుఁడు మరణించుకాలము,సంధిలెన్= కలిగెను.

## తాత్పర్యము

ఇదియేమి మహానుభావా! రామచంద్రా! యేమియుఁ దెలియనివానివలెఁ వాఁడు వేసిన యస్త్రమునకు బదులు మహాస్త్రములు వేయుచుఁ గాలము గడుపుచున్నావు? వీనిపై బ్రహ్మాస్త్రము వేయుము. వీఁ డీగడియయందుఁ జచ్చునని దేవతలు చెప్పిరో యాకాల మిప్పుడు తటస్థించినది.

చ. అనవుడు సర్వలోకవిజ•యార్థికిఁ బాకవిరోధి కర్థిమై
మును వనజాననుండు కర•మున్ మహిమంబు మెయిన్ సృజించి యి
చ్చిన నతఁ డాస్థ నిచ్చె ముని•శేఖరుఁ డైన యగస్తి కాతఁడున్
దన కతిరక్తిచేఁ దొలుత • దండక నిచ్చిన యస్మహాస్త్రమున్. ౨౮౭౨

అర్థములు. సర్వలోక విజయార్థికి=సమస్తలోకములు జయింపఁ గోరినవానికి, పాకవిరోధికి=ఇంద్రునకు, అర్థిమై = ప్రీతితో, వనజాననుండు = బ్రహ్మ అగస్తికి=అగస్త్యునకు.

## తాత్పర్యము

మాతలి యిట్లు చెప్పఁగా సర్వలోకముల జయింపఁ గోరిన యింద్రునకుఁ బూర్వము బ్రహ్మదేవుఁడు మిక్కిలి మహిమముతో సృజించి యీయఁగా నాయన యగస్త్యున కిచ్చెను. ఆయన దండకలోఁ దన కిచ్చెను. అట్టి యస్త్రమును దీసెను. (అరణ్య. ౨౦ ౨ పద్యము చూచునది.)

సీ. పక్షభాగంబులఁ • బవనుండు ముఖమునఁ, బావకభాస్కరుల్ • పరఁగుచుండ
నాకాశమయ మైన•యంగంబు భాసిల్లి, మేరుమందరముల•గౌరవమున
రాజిల్లి దివ్యమై • రజతభూషిత మయి, జాజ్వల్యమానమౌ•సంహననము
సవితృవర్చస్సును • సకలభూతావళీ, తేజంబు దృఢపుంఖ•దీప్తి దనర
ఆ. నాగ్రహమున రోఁజు•నాశీవిషంబును, ధూమకలితకాల•ధూమకేతు
వెనయుదాని శాత్ర•వేభాశ్వపరిఘాళి, ద్వారములను జెండి•వైచుదాని. ౨౮౭౩

అర్థములు. పక్షభాగంబులన్=పార్శ్వంబులందు, తెక్కలుండు స్థలమందు, పవనుండు=వాయువు, ముఖమున - పావక భాస్కరుల్ = అగ్నియు సూర్యుఁడు, ఇవి యీ మంత్రబీజాక్షరము లని యెఱుఁగనగు, రజత భూషితమై = బంగారుచే నలంకరింపఁబడినదై , జాజ్వల్యమానము=మండుచున్న, సంహననము = శరీరము, సవితృవర్చస్సును=సూర్యకాంతియును, దృఢపుంఖదీప్తి=గట్టిపింజకాంతి, ఆశీవిషంబును = పామును, ధూమకలిత=పొగతోఁగూడిన, కాలధూమ కేతువు=ప్రలయకాల ధూమకేతువు, ఎనయుదానిన్=పోలుదానిని, శాత్రవ = పగవారి, ఇభ =

పనుఁగులను అశ్వ = గుఱ్ఱములను, పరిఘాళి=ఇనుపకట్ల గుదియల సమూహమును, ద్వారములను.

తాత్పర్యము

తెక్కలుండు భాగమును వాయుదేవుఁడు,ముఖమునందు సూర్యాగ్నులును నుండఁగా నాకాశమయమైన దేహముతో (ఆ యా దేవతలందు నావహించి యున్నారని భావము) మేరుమందర పర్వతములంత భారము గలిగి దేవ సంబంధమైన బంగారు భూషణములచే నలంకరింపఁబడి యుండుచున్న దేహము సూర్యకాంతి సకలభూతముల తేజస్సు, గట్టి పింజకాంతి గలిగి, కోపముచే బుసకొట్టు సర్పమును, పొగతోడి కాలాగ్నిని బోలుచు, శత్రువుల గజ తురగ పరిఘ గోపురముల భేదించునదియై.

కం. మేదోదిగ్ధము భూధర, భేదనదక్షంబు రుధిర•పిహితంబు మహా
నాదంబు వజ్రసారము, భేదననిరుపమము భూత•చిత్తభయదమున్. ౨౭౭౨

అర్థములు. మేదోదిగ్ధము = మేధస్సుచేఁ బూయఁబడి, భూధరభేదన దక్షంబు = పర్వతముల భేదింబు సామర్థ్యము గలదై ,రుధిరపిహితంబు=నెత్తుటచేఁ గప్పఁబడి, మహానాదము = పెద్ద ధ్వనిగలదై, వజ్రసారము=వజ్రమువంటి సత్త్వ గలదై, భేదవ నిరుపమము = నఱకుటయం దసమానము. భూతచిత్త భయదము =ప్రాణుల మనస్సున భయము కలిగించునది.

తాత్పర్యము

మాంసముచేఁ బూయఁబడి పర్వతముల భేదించు సామర్థ్యము గలదై నెత్తుటిచేఁ గప్పఁబడి పెద్ద ధ్వనిగలదై, వజ్రమువలె దృఢమై నఱకుటయం దసమానమై, ప్రాణిభయంకరమై.

ఉ. అప్రతిమానవీర్య మన•యంబు శివాచయకంక గృధ్రభ
క్షప్రద మంతకాభము ప్ర•శస్తతమేషువు వానరాళిచి
త్తప్రమదావహం బసుర•దండభయావహ మాత్మవంశకీ
ర్తిప్రతిపాదకంబు పర•బృందయశోహరణాసమానమున్. ౨౭౭౩

అర్థములు. అప్రతిమానవీర్యము=ఎదురులేని వీర్యముగలిగి,అనయంబు= సర్వదా, శివాచయ = నక్కలకు, కంక = రాపులుఁగులకు, గృధ్ర = గ్రద్దలకు, భక్షప్రదమయి = ఆహారము కల్పించునదియై, అంతకాభము = యమునితో సమానమైన, ప్రశస్తతమ + ఇషువు = మిక్కిలి శ్రేష్ఠమైన బాణము, వానరాళి చిత్త ప్రమదావహంబు = వానర సమూహముల మనస్సునకు సంతోషము గలిగించునది, అసురదండ భయావహము = రాక్షససేనకు భయము కలిగించునది, ఆత్మవంశకీర్తి ప్రతిపాదకంబు = తన వంశమునకుఁ గీర్తి తెచ్చునది, పరబృంద=

శత్రుసమూహముయొక్క, యశస్ = కీర్తిని, హరణ = హరించుటయందు, అసమానము=సమానమైనది లేనిది.

తాత్పర్యము

అసమానబలము గలది, సర్వదా నక్కలకు, కంకములకు, గ్రద్దలకు నాహారము కల్పించునది, యమునితో సమానమైనది, మిక్కిలి పొగడఁబడిన బాణము. వానరులకు సంతోషము రాక్షసులకు భయము కలిగించునది. తన (రామ)వంశము నకుఁ గీర్తి తెచ్చునది. శత్రువుల కీర్తి హరించుటయం దసమానమైనది.

కం. గారుడపక్షవిచిత్రిత, సారాద్భుతవాజయుతము • శతధృతిమంత్రో
దారము విధ్యుక్తంబు ప్ర,కారమునన్ వింటఁగూర్చెఁ•గాకుత్స్థుండున్. ౨౮౯

అర్థములు. గారుడపక్ష విచిత్రిత = గరుడపక్షి తెక్కలచే చిత్రింపఁబడి, సారాద్భుత=సారవంతమై, ఆశ్చర్యకరమైన, వాజ = తెక్కలతో, యుతము = కూడినది, శతధృతి మంత్రోదారము=బ్రహ్మమంత్రముచేఁ గొప్పది, విధ్యుక్తంబు ప్రకారంబు=శాస్త్రమునఁ జెప్పఁబడిన విధముగ.

తాత్పర్యము

గరుడపక్షి తెక్కలచేఁ జిత్రింపఁబడి ఆశ్చర్యకరమైన సారము గలిగిన తెక్కలు గలదై బ్రహ్మమంత్రముచే గొప్పదైన దానిని శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము రామచంద్రమూర్తి వింట సంధించెను.

శా. ఆ బ్రహ్మాస్త్రము మార్విఁ గూర్చుటయు హా•హాకార యుక్తంబుగా
నబ్రహ్మణ్యము లోలిఁ జేసె సకలా • శాంతస్థభూతాళి; స
ర్వాబ్రాసుల్ కలఁగెన్, వణంకె ధర, తీ•వ్రాటోపసంరంభుఁడై
యాబ్రహ్మఘ్నునిమీఁద వైవ రఘురా•మాధీశుఁ డయ్యస్త్రమున్. ౨౯౦

అర్థములు. అబ్రహ్మణ్యము=నేను జంపఁబడఁదగను, నన్నుఁ జంపవలదు అనుమాట. 'అబ్రహ్మణ్య మవధ్యోక్తౌ' అమరము - సకలాశాంతస్థ భూతాళి = అన్నిదిక్కుల యందుండు భూతములగుంపు - ఆ యస్త్రము తమ్ముఁ జంపునేమో యని భయపడి, మమ్ముఁ జంపవలదు, నిరపరాధుల మని చెప్పుకొన్నవి. సర్వ + అప్ + రాసుల్=సమస్త సముద్రములు, బ్రహ్మఘ్నునిమీఁదన్=బ్రాహ్మణహంత మీఁద - దీనివలన వీఁడు చంపఁబడుటకు సీతాహరణముకంటె బ్రాహ్మణహింస గొప్పకారణ మని యేర్పడుచున్నది.

తాత్పర్యము

ఆ బ్రహ్మాస్త్రమును సంధింపఁగానే దిక్కులయందుండు భూతములది తమ్ముఁ జంపునేమో యని భయపడి హాహాయని ధ్వనించుచు మమ్ముఁ జంపవలదని చెప్పుకొనెను. సముద్రములు కలఁగెను. భూమి వణఁకెను. మిగుల వేగముతోఁ గూడినవాఁడై ఆయస్త్రమును బ్రాహ్మణహంత యగు రావణునిమీఁద వేసెను.

కం. దంభోళిధర విముక్తము, దంభోళి యనం గృతాంత ♦ దారుణ మగుచున్
జంభారివైరియొమ్మున సం,రంభంబునఁ బడియెఁ దీవ్ర♦రంహస్స్ఫుటమై. ౨౮౭౮

అర్థములు. దంభోళిధర = ఇంద్రునిచే, విముక్తము = విడువఁబడినది, దంభోళి=వజ్రము, కృతాంతదారుణము=యమునివలె భయంకరము, జంభారివైరి= ఇంద్రశత్రువగు రావణుని, సంరంభంబునన్ =ఆటోపముతో,తీవ్రరంహస్ స్ఫుటమై =తీవ్ర వేగముతోఁ గూడినదై.

తాత్పర్యము

ఇంద్రుఁడు వేసిన వజ్రాయుధమువలె యమునివలె భయంకరమై యతివేగముగఁ బోయి రావణాసురుని యొమ్మమీఁదఁ బడెను.

ఉ. అమ్మహితాస్త్ర మిట్టులసు♦రాధిపువక్షము వ్రక్కలించి ర
క్తమ్మునఁ దోఁగి ప్రాణములు♦కాయమునుండి వెలార్చి భూమిగ
ర్భమ్మునఁ జొచ్చి వెల్వడి ధ♦రాతనయాపతితూణిఁ జొచ్చెఁ గా
ర్యమ్మును దీర్చి వేగ విన♦యమ్మున లోహితవర్ణితాంగమై. ౨౮౭౯

అర్థములు. తోఁగి = మునిఁగి, వెలార్చి = బయటఁ దీసి, లోహిత వర్ణితాంగమై=నెత్తుటిచే వన్నె వేయఁబడిన దేహము గలదై.

తాత్పర్యము

ఆ గొప్ప యస్త్రము ఈప్రకారము రావణాసురుని యొమ్మ చీల్చి యా నెత్తుటిలో స్నానము చేసి దేహమునుండి ప్రాణములను వెడలఁగొట్టి కార్యము నెఱవేర్చి భూమిలోఁ దూఱి వెలుపల వచ్చి వేగమున వినయమున రాముని పొదిలోఁ బ్రవేశించెను.

కం. ప్రాణంబుతోడఁ జాపము, బాణంబును నసురనాథుఁ♦బాసి యిలఁ బడెన్
ప్రాణము చెడి పడె గాత్రము, క్షోణిని హరినిహతవృత్ర♦సురవైరి యనన్.

తాత్పర్యము

దేహమును ప్రాణము వదలినట్లు విల్లు బాణములుకూడ రావణుని వదలి నేలఁ బడెను. ఇంద్రునిచేఁ జంపఁబడిన వృత్రుని దేహమువలె రావణుని దేహము శక్తి చెడి నేలఁ బడెను.

రామచంద్రమూర్తి తొలుతఁ జెప్పిన ప్రకారము రథమును, గుఱ్ఱములను, సారథిని జంపక వింటిని ద్రుంపక సాధన వికలునిఁజేయక రావణుఁ జంపెను.

ఉ. ఏలినవానిపాటుఁ గని♦యెంతయు భీతిని జావకున్న వా
రోలిని లంకకుం బఱచి♦దుర్గత రామజయప్రవృత్తికి
శ్లాఘలు వెన్నడించి తమ♦నారట పెట్టఁగ బాష్పవారితో
వ్రేలెడు మోముతోఁ జెడిన♦బీరముతోఁ దడి లేని నాల్కతోన్, ౨౮౮౧

అర్థములు. ఏలినవాని = ప్రభువుయొక్క.

### తాత్పర్యము

తమ ప్రభువు చచ్చుట చూచి చావక మిగిలిన రాక్షసులు రామ జయముచే సంతోషించు వానరులు తమ్ముం దఱిమి బాధింపంగా భయపడి కన్నీళ్ళు కాఱుచుండ మొగములు వ్రేల వేసికొని పౌరుషము చెడి నాలుక లెండ లంకలోనికిం బరువెత్తిరి.

కం. రావణుమరణంబును నీ, తావిభువిజయంబు రణక ♦ థాసామగ్రిన్
వేవిధములఁ బొగడుచు హ, ర్షావేశవశాత్ము లైరి ♦ యగచరవర్యుల్. ౨౮-౨౯

అర్థములు. హర్షావేశవశాత్ములు = ఆవేశించిన సంతోషమునకు వశోపడినవారు. తాత్పర్యము స్పష్టము.

### —♦ రావణుమృతికి లోకంబులు సంతోషించుట ♦—

సీ. అందమై త్రిభువనా ♦ నంద మై మింటను, దుందుభిధ్వానంబు ♦ క్రందుకొనియె
బృందమై విగళన్మ ♦ రందమై వర్షించె, మందారసుమతతి ♦ స్యందనమున
మందమై పరిమళా ♦ మందమై సుఖమూల, కందమై వీతెంచెఁ ♦ గమ్మగాలి
నందమై హితకర ♦ చ్ఛందమై స్తవవృష్టి, కందమై విబుధ వా ♦ క్యంబు లెసఁగె
తే. సర్వలోకభయంకర ♦ శాత్రవుండు, రావణుండు త్రిభువనవి ♦ ద్రావణుండు
శ్రీరఘూత్తముచే నామ ♦ శేషుఁడైనఁ, జారణామరు లెసఁగిరి ♦ సమ్మదమున.

అర్థములు. త్రిభువనానందమై = మూఁడు లోకములకు సంతోషకరమై. దుందుభిధ్వానము=దేవతలనగారాధ్వనులు, బృందమై=సమూహమై, విగళత్ + మరందమై = స్రవించుచున్న తేనెగలదై, మందారసుమతతి = కల్పవృక్షముల పూలగుంపులు, మందమై=మెల్లనిదై, పరిమళామందమై = సువాసనచే, దట్టమై, సుఖమూలకందమై = సుఖమునకు కూఁకటి వేరై, కమ్మగాలి = కమ్మనిగాలి. నందమై = సంతోషముతోఁ గూడి, హితకరచ్ఛందమై=మేలుచేయునభిప్రాయము గలదై, స్తవవృష్టి = స్తోత్రము లను వానకు, కందమై = మేఘమై, విబుధవాక్యంబులు=దేవతల మాటలు, త్రిభువన=మూఁడు లోకముల వారిని,విద్రావణుఁడు = పరువెత్తఁ జేసినవాఁడు, నామశేషుఁడు=పేరు మాత్రము మిగిలినవాఁడు.

### తాత్పర్యము

సమస్తజనులకు భయము కలిగించు శత్రువు, మూఁడులోకముల వారిని దన పేరు చెప్పిన భయపడి పరువెత్తునట్లు చేసినవాఁడు, శ్రీరామచంద్రమూర్తిచేఁ జావఁగా నందముగా మూఁడులోకములకుసంతోషకరముగ నాకాశమున దేవతలు దుందుభులు మ్రోయించిరి. కల్పవృక్షములనుండి తేనెలు గురియుచుఁ బూవులు గుంపులై వానవలె రాముని తేరిపైఁ బడెను.కమ్మనిగాలి మెల్లగా పరిమళముతోఁ గూడి సుఖకరముగ వీచెను. సంతోషకరములై మేలుచేయు నభిప్రాయముగలవై

దేవతలవాక్యములు స్తోత్ర మను వర్షమునకు మేఘము లయ్యెను. దేవతలు చారణులు లోనగువారు సంతోషించిరి.

సీ. శాంతమానసముల ♦ సంతసించె బుధాళి, దిశలు ప్రసన్నతా♦దశ వహించె
 గగనంబు నిర్మలా♦కారమై రాణించెఁ, గంప మందుట మానె ♦ క్ష్మాతలంబు
 కమ్మఁగ నెమ్మిఁగఁ ♦ దెమ్మెర పై వీచె, దిగులు లేకరుఁడుండు ♦ తేజ మెఱసె
 విచ్చలవిడి జనుల్ ♦ వీథులఁ దిరిగిరి, యధ్వరధూమంబు ♦ లభ్ర మంటె
ఆ. నాదమఱచి నిద్ర ♦ నందిరి లోకులు, గుండె లదరు టుడిగెఁ ♦ గోమలులకు
 నఖిలలోకవైరి ♦ యగు నసురేశుంపు, ఖచరలోకమునకుఁ ♦ గదలిపోవ. ౨౮౭౮

తాత్పర్యము

సమస్తజనవిరోధి యగు రావణుఁడు దేవలోకమునకుఁ బ్రయాణమై పోవఁగా దేవతలు శాంతచిత్తులై సంతోషించిరి. దిక్కులు తేటగా నయ్యెను. ఆకాశము నిర్మలమై యొప్పెను. భూమి వణఁకుట మానెను. చల్లగ సంతోషకరముగ సువాసన గలదై మందమారుతము వీచెను. సూర్యుఁడు భయము లేక ప్రకాశించెను. నిర్భయముగ జనులు వీథుల నెంటఁ దిరిగిరి. యాగములపొగ లాకాశ మంటెను. దిగులు లేక లోకులు నిద్రించిరి. ఆఁడువారికి గుండెలయదరు తగ్గెను. దీనివలన రావణుఁడెంత లోకకంటకుఁడై యుండెనో తెలియనగు.

ఉ. అంత విభీషణార్కతన♦యాదులు లక్ష్మణయుక్తులై విభు
 ప్రాంతముఁ జేరి యాహవజ♦యంబున భాసిలుచున్న యమ్మహా
 స్వాంతునిఁ బెక్కుభంగులఁ బ్ర♦శంస నొనర్చుచుఁ జుట్టి దేవతా
 కాంతుని దేవబృందముల♦కైవడిఁ గొల్చిరి పొల్చి రంతటన్. ౨౮౭౯

తాత్పర్యము

ఇట్లు రావణాసురుఁడు చావఁగా విభీషణుఁడు సుగ్రీవుఁడు లోనగువారు లక్ష్మణుతోడ రామచంద్రుని సమీపించి (ఇంతవఱకు వీరు దూరమునుండి చూచుచుండిరి) యుద్ధమందు గెలుపుగొని ప్రకాశించు నా మహాత్ముని ననేకవిధములుగ స్తోత్రముఁ జేయుచు దేవత లింద్రుని జుట్టుకొన్నట్లు చుట్టుకొనిరి.

—♦ ౧౧౨-వ సర్గము. విభీషణుఁడు రావణు కళేబరముఁ జూచి యేడ్చుట ♦—

కం. అన్నను రామాశుగసం, భిన్నుఁ గని విభీషణుండు ♦ చేరం జని యా
 పన్నుండై కాల్వలుగాఁ, గన్నులనీ రొలుక నేడ్చెఁ♦గడుదీనుండై. ౨౮౮౦

అర్థములు. రామాశుగ సంభిన్నున్ = రాముని బాణములచే భేదింపఁబడినవానిని.

తాత్పర్యము స్పష్టము.

శా. ఎన్నో యుద్ధములన్ జయించి ప్రథచే ♦ నేపారి వీరుండవై
 యెన్నో శాస్త్రములం బఠించి సుమనీ ♦ షీడ్యుండవై యుండి య

సన్నాన్నానూనసుసౌఖ్యతల్పముపయిం ♦ గై సేఁత నిద్రించు నీ
వన్నా ! నేఁ డిటు నేలపా లయితివే ♦ హా! దైవమా! యే మనన్. ౨౪౪౮

అర్థములు. ప్రథచే=కీర్తిచే, ప్రపారి=అతిశయించి, సుమనీషీడ్యుండవై=పండితులచే స్తోత్రము చేయఁబడినవాఁడవై, అసన్నన్న=జాలని, అనూన=కొలఁత లేని సౌఖ్యతల్పముపయిన్=సుఖకరమైనపానుపుమీఁద, కై సేఁతన్=అలంకరించుకొని.

తాత్పర్యము

ఎన్నోయుద్ధములందు జయించి వీరుఁడని కీర్తి సంపాదించి శాస్త్రము లెన్నియో పఠించి పండితులచేఁబొగడఁ బడియుండి స్థిరమై కొలఁతలేని సౌఖ్యము గూర్చుపానుపు మీఁదఁ బండుకొనువాఁడవు. అన్నా ! నేఁడిటు నేలమీఁదఁ బడవలసిన వాఁడ వై తివికదా! దైవమా, ఏమందును ?

ఆ. కాళ్ళు పాఱఁజాచి ♦ కనకాంగదసుభూష, ణాంచితంబు లీదు ♦ హస్తయుగము
క్షితిని విడిచి వీత ♦ చేష్టుండవై యిట్లు,పుడమి మకుట మెడలఁ♦బడఁగఁదగునె.

అర్థములు. కనక + అంగద సుభూషణాంచితంబు=బంగారు భుజకీర్తులచే నొప్పునది, వీతచేష్టుండవై=చేష్ట మానిన వాఁడవై, మకుటము=కిరీటము,ఎడలన్ = తొలఁగి పోఁగా.

హస్తయుగ మని చెప్పుటచే రావణుఁ డిప్పుడు రెండు చేతులవాఁడై యుండెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

కాళ్ళు పాఱఁజాచి బంగారు భుజకీర్తులచేఁ బ్రకాశించు రెండు చేతులు నేలఁబడవైచి చేష్టలు మాని కిరీటము నేలఁబడఁగా నిట్టు లుండఁదగునా ?

కం. అన్నా! యీగతి నగు నని, యెన్నోమాటలు వచింప ♦ నే నీతోఁ ? గా
మోన్నతి మోహంబున నీ,క న్నడులు రుచింప వయ్యె♦నసురాధీశా! ౨౪౪౯

అర్థములు. కామోన్నతి = కామాతిశయముచే, మోహంబునన్ = అజ్ఞానంబున.

తాత్పర్యము స్పష్టము.

సీ. కుంభకర్ణుం డేని ♦ కులిశకరారియే, నాప్రహస్తుండును న ♦ రాంతకుండు
నైనను నతిరథుఁ ♦ డా యతికాయుఁడేన్, బలిమికల్మిని నీతిఁ ♦ దలఁప రైరి
నీవును జింతింప ♦ వీవిధం బద్దాని, ఫలము వో నేఁ డిటు ♦ ప్రాప్త మయ్యె
నెంతయో చెప్పితి♦నంతయు వృథయయ్యెఁ, గాలంబుఁదప్పింపఁ♦గలుగు నెవఁడు
తే. పోయెను సునీతిసేతువు ♦ పోయెధర్మ
విగ్రహము సత్త్వసంగ్రహ ♦ విధము చెల్లె
స్తోత్రపాత్రంబు విషయంబు ♦ శూన్య మయ్యె
నన్న ! నీ వొక్కఁ డిలఁ బాసి ♦ యరుగుకతన. ౨౪౫౦

అర్థములు. కులిశకరారి=ఇంద్రజిత్తు, బలిమికల్మిని = బలము విశేషముగ గలవారమను తలంపుతో, సునీతిసేతువు=మంచి నీతికి ననకట్ట, ధర్మవిగ్రహము = ధర్మముయొక్క యాకారము, సత్త్వసంగ్రహవిధము=బలము సంపాదించు విధము.

తాత్పర్యము

కుంభకర్ణుఁడైనను, ఇంద్రజిత్తైనను ప్రహస్తుఁడైనను నరాంతకుఁడైనను అతికాయుఁడైనను బలముగలవారమని ప్రవర్తించిరేకాని యెంత బలవంతులకైనను ధర్మము శ్రేయస్కరము, అధర్మము హానికర మను నీతిని బాటించినవారుగారైరి. నీవును నాలోచించినవాఁడవు కావైతివి. దాని ఫలముగదా నేఁ డిట్లు ప్రాప్తించెను. నే నెంతయో వలదు వలదని చెప్పితిని. నేను జెప్పినదంతయు వ్యర్థమయ్యెను. కాలము నెవరు తప్పింపఁగలరు. నీ వొక్కఁడవు భూమిని విడిచిపోవుటచే నీతికి ననకట్ట లేదయ్యెను. ధర్మమునకు ఆకారము తొలఁగెను. బలమునకు నిలువ నీడ లేదయ్యెను. లోకమున స్తోత్రము చేయఁదగిన పదార్థము లేనిదయ్యెను.

ఆ. ఇనుఁడు నేలఁ ద్రెళ్ళె • నిరులలో శశి మున్గె, నగ్ని చల్లఁబడియె • నవనిమీఁద
నుద్యమంబు లేద • యుత్సాహమునకు నీ, వీరవరుఁడు మేను • విడుచుకతన.

అర్థములు. ఇనుఁడు = సూర్యుఁడు, ఇరులలో=చీఁకటిలో.

తాత్పర్యము

ఈ వీరుఁడు దేహమును వదలుటచే సూర్యుఁడు నేలఁ బడియెను. చంద్రుఁడు చీఁకటిలో మునిఁగెను. అగ్ని చల్లఁబడెను. ఉత్సాహమునకుఁ బ్రయత్నమే లేనిదయ్యెను. రావణునివలె నుత్సాహముతోఁ గార్యములు చేయువాఁడు లేఁడని భావము.

ఆ. రణతలంబునందు • రాక్షససింహంబు, ధూళి గ్రుంగి నిద్రఁ • దేలుభంగి
మృతినిఁ గూర నిపుడు • హతవీర మీలోక, మందు నేమిగలదు • మందలింప.

అర్థములు. గ్రుంగన్=మునుఁగఁగా, హతవీరము = చంపఁబడిన వీరులు గలది.

తాత్పర్యము

రాక్షససింహముగు రావణుఁడు యుద్ధమందుఁ జచ్చి దుమ్ములో మునిఁగిన కారణముచే వీరశూన్యమైన యీ లోకమందు వీరుఁడని చెప్పఁదగినవాఁ డెవఁడు గలఁడు ?

ఆ. ధీరతాప్రవాళ • మోరుపు పుష్పంబు, భృశతపోబలంబు • వీర్యబద్ధ
మూలమైన యసుర • మూర్ధన్య వృక్షంబు, రామమారుతమున • భూమిఁ ద్రెళ్ళె.

అర్థములు. ధీరతాప్రవాళము = ధైర్యమను చిగురు, భృశతపోబలంబు = గొప్ప తపస్సను బలము, వీర్యబద్ధమూలము = వీర్యమను వేరుచేఁ గట్టఁబడినది, అసుర మూర్ధన్యవృక్షంబు = రాక్షసశ్రేష్ఠుఁడను చెట్టు, రామమారుతమునన్ = రాముఁడను వాయువుచే, సావయవరూపకము.

తా త్ప ర్య ము

ధైర్యమను చిగుళ్ళు, ఓరుపనుపుష్పములు, గొప్పతేపస్సను బలము, వీర్య మను పేరు గల రావణుఁడను వృక్షము రాముఁ డను వాయువుచే నేలఁబడెను.

ఆ. బలవిషాణయుతము•కులవంశవంశంబు, కినుక కరుణ యనెడి • తనువు కరము
గలుగు రాక్షసేంద్ర•గంధేభ మడఁగారె, రామసింహవర ప • రాక్రమమున.

అర్థములు. బలవిషాణయుతము = బల మనెడి కొమ్ములతోఁ గూడినది, కులవంశవంశంబు - కుల = పితృపితామహాదుల, వంశ = వంశమనెడి,వంశము = వెన్నెముక గలది,'వంశో వేణౌ కులే సర్గే పృష్ఠస్యావయవేపిచ' దేహము నిలుచు టకు వెన్నెముక యాధార మైనట్లు పితృపితామహుల వంశము నిలువ కారణమైన వాఁడు, కినుక = కోప మనెడి, తనువు = దేహము, కరుణ యనెడి - కరము = తొండము, రాక్షసేంద్ర = రావణుఁడనెడి, గంధేభము=మదపుటేనుఁగు, రామ= రాముఁడనెడి, సింహ = సింహముయొక్క, వరపరాక్రమమునన్ = గొప్ప పరా క్రమముచేత, అడఁగారెన్=నశించెను.

తా త్ప ర్య ము

బలమనెడి కొమ్ము, కులవంశ మనెడి వెన్నెముక, కినుక యనెడి దేహము, కరుణ యనెడి తొండము గల రావణుఁ డను మదపుటేనుఁగు రాముఁడను సిం హముయొక్క పరాక్రమముచేఁ జచ్చెను.

తే. విక్రమోత్సాహజృంభిత • వికటహేతి, దీర్ఘనిశ్శ్వాసధూమంబు•దేహసత్త్వ
సత్ప్రతాపంబు గల రాక్ష•సప్రకాండ,వహ్నిఁ జల్లార్చె రాఘవ•వారిధరము.

అర్థములు. విక్రమోత్సాహ జృంభిత వికటహేతి=పరాక్రమమువలనఁ గలిగిన యుత్సాహ మనెడి విజృంభించిన భయంకరజ్వాల గలది, దీర్ఘ నిశ్శ్వాస ధూమంబు = నిట్టూర్పనెడి పొగ, దేహసత్త్వ = దేహబల మనెడి, సత్ ప్రతా పంబు = మిగుల వేఁడిమిగల, రాక్షస ప్రకాండ = రాక్షస శ్రేష్ఠుఁడను,వహ్నిన్ = అగ్నిని, రాఘవ = రాముఁ డనెడి, వారిధరము=మేఘము.

తా త్ప ర్య ము

విక్రమము వలనఁ గలిగిన యుత్సాహ మనెడి భయంకర జ్వాలయు,నిట్టూ ర్పనెడి పొగయు, దేహబల మనెడి వేఁడిమియు గల రాక్షసశ్రేష్ఠుఁ డను నగ్నిని రాముఁడనెడి మేఘము చల్లార్చెను.

తే. అసురవాలకకుద్విషాణాన్వితంబు, శాత్రవధ్వంసనంబు హిం•సారతంబు
చపలకర్ణేక్షణము సుర•శత్రువృషభముఁ, దాఁకి రాఘవద్వీపి వ•ధం బొనర్చె.

అర్థములు. అసుర = రాక్షసు లనెడి, వాల = తోఁకతోను, కకుత్ = మూఁపురముతోను, విషాణ = కొమ్ములతోను, అన్వితంబు = కూడినది, శాత్రవ ధ్వంసనంబు = శత్రువుల నాశము చేయునది, హింసారతంబు = హింసించుటయం

దాసక్తి గలది, చపల విషయ=చపలత యను, కర్ణము = చెవులు, ఈక్షణము = చూపులుగలది, సురశత్రు = రావణుఁడనెడి, వృషమున్=ఎద్దును, రాఘవద్వీపి= రాముఁడనెడి పులి.

తాత్పర్యము

రాక్షసులనెడి తోఁక మూఁపు కొమ్ములు గలదియు, శత్రువుల నశింపఁజేయు నదియు,హింసయం దాసక్తిగలదియు, విషయలోలత్వ మనెడి చెవులుకన్నులుగలది యగు రావణుఁడనెడి వృషభమును రామచంద్రమూర్తి యను పులి చంపెను.

కం. అని శోకసమాకులుఁడై, పనవి పనవి హేతుయుక్త•వాక్యంబులతో
వనరు విభీషణుఁ గని భూ,తనయానాథుండు పలుక•దయద్దైవాఱన్. ౨౬౭

అర్థములు. శోకసమాకులుఁడై = శోకముచే కలఁత చెందినవాఁడై, హేతుయుక్త=కారణములతోఁ గూడిన, దైవారన్=అతిశయింపఁగా.

తాత్పర్యము స్పష్టము

—• శ్రీరాముఁడు విభీషణునకు దుఃఖోపశమనఁబు చేయుట •—

ఉ. ఏమిటి కేడ్చెదయ్య బల•హీనత నీతఁడు దూలలేదు, సం
గ్రామకుతూహలుం డతిప•రాక్రమశాలి మహోత్సకుండు దై
ర్యామరభూధరంబు రవ•యంతయు జంకును గొంకులేక ని
స్సీమధృతిం బెనంగి తప•చే నయినంతయుఁ, గూరె మృత్యువున్. ౨౬౮

తాత్పర్యము

అయ్యా! విభీషణా ! యేల యేడ్చెదవు? బలహీనుఁడై యుద్ధము చేయలేక యవమానపడి యితఁడు చావలేదు. యుద్ధమందుఁ గోరిక గలవాఁడు.మిగులఁ బరాక్రమము ఉత్సాహము గలవాఁడు. మేరుపర్వతమువలె ధీరుఁడు. ఇట్టివాఁడు కొంచె మైనను ఓడుదునేమోయను సందేహముగాని చత్తునేమోయను భయముగాని లేక యపరిమిత ధైర్యముతో చేతనయినంతవఱకు యుద్ధముచేసి చచ్చెను.

కం. పరలోకసుఖముఁ గోరెడి, పురుషులు పెనువీకఁ బెనఁగి•పొలియుదు రనిలో
ధర క్షత్రధర్మమున నం,గరమునఁ దెగువారి కేడ్వఁ•గా న్యాయ్యంబే? ౨౬౯

అర్థములు. పొలియుదురు=చత్తురు, న్యాయ్యంబే=ధర్మయుక్తమా, పెనఁగి= యుద్ధముచేసి, వీకన్=పరాక్రమముతో.

తాత్పర్యము స్పష్టము.

కం. లోకత్రయిఁ గారించెను, నాకుల భంగించెఁ గలన • ననమబలుండై
చేకొనె వీరస్వర్గము, శోకింపఁగఁ దగునె యిట్టి•శూరున కనఘా! ౨౭౦

అర్థములు. కారించెను = బాధించెను, నాకులన్=దేవతలను, కలనన్ = యుద్ధమందు.

తాత్పర్యము

మూఁడు లోకముల బాధించెను. దేవతల జయించెను. యుద్ధమునందు ననమానబలము గలవాఁడై చచ్చి వీరులుపోవు స్వర్గమునకుఁ బోయెను. ఇటువంటి శూరున కేడువ వచ్చునా ?

తే. ఇట్టివాఁడె జయించు న•న్నట్టినియమ
మున్నె యెపుడైనఁ జెప్పుమా • యుద్ధములను ?
దాను బరుగెల్చుఁ బరులచేఁ • దాను జచ్చు
గెలుపు నోటమి నెవ్వాఁడు • పలుక నేర్చు. ౨౯౦౧

తాత్పర్యము స్పష్టము.

కం. క్షత్రియసమ్మతము పురా, ధాత్రీశాదిష్టితమ్ము • తగుగతి యిది యా
క్షత్రియున కాహవోత్క్షిత, గాత్రునకై కార్చరాదు•కన్నీరెందున్. ౨౯౦౨

అర్థములు. క్షత్రియసమ్మతము = క్షత్రియు లందఱు నంగీకరించినది, పురాధాత్రీశాదిష్టితమ్ము = పూర్వపు రాజులచే విధింపఁ బడినది, ఆహవ=యుద్ధమందు, ఉత్క్షిత=విడువఁబడిన, గాత్రునకై =దేహము గలవానికై.

తాత్పర్యము

ఈప్రకారము యుద్ధమందు మరణించుట క్షత్రియుల కిష్టమైన కార్యము. పూర్వపు క్షత్రియులు విధించినది కావున యుద్ధమునందుఁ జచ్చిన క్షత్రియునకై యెవరును కన్నీరు కార్చరాదు.

దీనివలన రావణుఁడు క్షత్రియుఁ డనుట స్పష్టపడుచున్నది. కావున బ్రాహ్మణుఁడు కాఁడు, విష్ణుస్మృతి యందు.

సమానవర్ణాసుపుత్రాః సవర్ణా భవంతి,

అనులోమాసు మాతృవర్ణాః, ప్రతిలోమా స్వార్యవిగర్హితాః, అని కలదు. కావునను రావణుఁడు రాక్షసక్షత్రియస్త్రీకి, నందు నవివాహితకుఁ బుట్టిన వాఁడు కావున బ్రాహ్మణుఁడు కాఁడు.

కం. ఇది నిశ్చయించుకొని నీ మదిఁ దత్త్వార్థంబు నిలిపి • మానుము వగపున్
బిదపటికెలనముఁ దీర్పఁగ, గొదగొను మన నతఁడు పలుకు•గురుశోకమునన్.

అర్థములు. పిదపటి కెలనము = తరువాత జరుగవలసిన కార్యము, గొదగొనుము=త్వరపడుము.

తాత్పర్యము

క్షత్రియధర్మ మిదియని నిశ్చయించుకొని వాస్తవార్థము మనస్సునందుంచుకొని తరువాత జరుగవలసిన కార్యములకై త్వరపడుము అనిన నతఁడు గొప్పశోకముతో నిట్లనియె.

ఉ. ఈతఁడు దేవతాచయస ♦ మేతుఁడు వాసవుఁ డొడ్డి తాఁకినన్
ఖ్యాతిగ లోఁగ కాతని య ♦ హంకృతి మాపె జగం బెఱుంగఁ బ్ర
స్ఫీతభుజాబలోద్ధతిని ♦ వీరవరా! నినుఁ దాఁకి సాగరం
బాతతవేలఁ దాఁకి చెడు ♦ నట్టులు భంగముఁ జెందె నేఁ డనిన్. ౨౫౦౮

అర్థములు. ఒడ్డి=సేనల వ్యూహముగాఁ బన్ని, లోఁగక=లోపడక.

తాత్పర్యము

రామచంద్రా! దేవేంద్రుఁడు సేనలను వ్యూహముగాఁ బన్ని యెదిరించినను లోపడక కీర్తికరముగ ప్రసిద్ధబలాతిశయమున నతని గర్వ మణంచెను. సముద్రము చెలియలి కట్టదాఁకి చెడినట్లు నిన్నెదిరించి నేఁడు యుద్ధమునందుఁ జచ్చెను.

సీ. ఎన్నెన్నియో మేలి♦యీవు లిచ్చినవాఁడు, గురుల దైవతములఁ♦గొలిచినాఁడు
అఖిలసుఖంబుల ♦ ననుభవించినవాఁడు, నాశ్రితావనుఁ డయి ♦ యలరినాఁడు
హితులకు నర్థంబు ♦ లెలమిఁ గూర్చినవాఁడు వైరులఁ గారించి♦వాలినాఁడు
అగ్నుల సేవేళ ♦ ననుసరించినవాఁడు, దీర్ఘతపంబునఁ ♦ దేలినాఁడు

తే. వేదవేదాంతవిదుఁడయి♦ వెలసినాఁడు, కర్మచణుఁడను యశమునఁ♦గ్రాలినాఁడు
ఔర్ధ్వదైహికకృత్యంబు ♦ లాచరింప,నాన తిచ్చెదె యనిన ద♦యాళుఁడనియె.

అర్థములు. ఈవులు = దానములు, ఆశ్రితావనుఁడు = ఆశ్రయించిన వారిని రక్షించిన వాఁడు, కారించి = బాధించి, కర్మచణుఁడు = కర్మకుఁడు, శాస్త్రోక్త కర్మములయందు నిష్ఠగలవాఁడు, దయాళుఁడు = దయ స్వభావముగఁ గలవాఁడు.

తాత్పర్యము

రామచంద్రా! వీఁడు మంచి యుత్తమ దానము లెన్నియో యిచ్చినాఁడు. గురువులను దేవతలను గొలిచినవాఁడు. అన్ని సుఖము లనుభవించినవాఁడు.ఆశ్రితులను రక్షించినవాఁడు.తన మేలు గోరిన వారికి వలసినంతధన మిచ్చినవాఁడు.శత్రువుల బాధించినవాఁడు. నిత్యము అగ్నుల సేవించినవాఁడు. గొప్ప తపస్సు చేసిన వాఁడు. వేదము, వేదాంతము చదివినవాఁడు. కర్మానుష్ఠానపరుఁ డని కీర్తిగనిన వాఁడు.కావున వీనికి పరలోకమున హితకరములైన ప్రేతకార్యములు చేయుమనెదవా? అనిన స్వభావముగ దయావంతుఁడైన రామచంద్రమూర్తి యిట్లనియె.

కం. వైరము మరణాంతము మన, కారియముల్ దీరె మీఁది ♦ కార్యములను సం
స్కారాదులఁ దీర్పుము నీ,కారము నితఁ డెట్టివాఁడొ♦యట్టిడ నాకున్. ౨౫౧౦

అర్థములు. మరణాంతము=మరణముతో ముగియునది.

తాత్పర్యము

విభీషణా! పగ యనునది జీవితకాలమందే కాని చచ్చిన వానిమీఁదఁ బగ యనునది లేదు. ఇప్పుడు మన మేమి చేసిన నతఁడేమి చేయఁగలఁడు?ఆవిధముగాఁ

ప్రతీకారము చేయలేనివాని విషయమున మన మేమియుఁ జేయరాదు. కావున వాని మీఁది పగ వాని మరణముతోఁ దీరెను. వాఁడు మనము పుట్టినది మొదలు శత్రువులు గాము. ఒక నిమిత్తమున విరోధము వచ్చెను. ఆ కార్యము చక్కఁబడెను. కావున నిమిత్తమెప్పుడు లేదో పగయు నప్పుడు లేదు. మన కార్యములు చక్కనైనవి. కావున నిఁక వాని మేలునకై చేయవలసిన సంస్కారములను జేయుము. వీఁడు నీ కెట్టివాఁడో నాకు నట్టివాఁడే. నీ కెట్లు తోఁడబుట్టినవాఁ డను ప్రీతిగలదో నాకు నట్లులే కలదు. నీకుఁ దోఁడబుట్టిన వాఁడైనపుడు, నీవు నాకు తోఁడబుట్టిన వారిలో నొకఁడైనపుడు వీఁడు మాత్రము కాఁడా? కావున వీనికిఁ గర్మములు చేయు విషయములో నే నన్యథా తలఁచెద నని తలఁపకుము.

ఈ సందర్భమునఁ బూర్వాచార్యు లిట్లు వ్రాసియున్నారు.

వైరము మరణాంతము – ఇంతవఱకు నాకు విరోధముగ జనస్థానమునుల బాధించుట, సీతను హరించుట, నాకుఁ బ్రాణప్రదమైన జటాయువును సంహరించుట లోనగు కార్యములు చేసినట్లు ఇఁక చేయఁజాలఁడు. నాయందు నిఁక వాఁడు పగ సాధింపలేఁడు.

మన కారియముల్ దీరె – రావణుఁడే వచ్చినను రక్షించెద నని చెప్పి వాఁడు వచ్చునా రక్షింతునా యని కోరిక గలవాఁడనై యుంటిని. వాఁడో, నా తల రెండుగాఁ జీల్చినను నేనొకనికి నమస్కరింపను అని మూర్ఖత వహించెను. ఆ కారణముచే నా కోరిక వ్యర్థపఱిచెను. వీనికి మేలు చేయవలయునన్న నా సంకల్పమునకు వీఁ డిప్పు డడ్డపడఁజాలఁడు. కావున నేను మేలు చేయవలయును. మరణించినవానికిఁ జేయఁదగిన మేలు పరలోకమున వానికి సుఖము గలుగుటకై యుత్తరక్రియలు చేయుటే, కావున వానిని వదలరాదు. ఆ కార్యములకు నే నడ్డపడెదనని తలఁపవలదు. సహాయపడెదను. వీఁడు నా యిష్టమున కిప్పు డడ్డపడఁ జాలఁడు కావున వీఁడు నాకు మిత్రుఁడే. (ఇదియే ప్రపత్తిలక్షణము. భగవత్ప్రవృత్తికి విరుద్ధమైన ప్రపత్తి లేకుండుటే ప్రపత్తిలక్షణము) కావున నీవు వాఁ డిరువురు నాకు సమానులే. వానికి కొడుకులు లేరుగావున శాస్త్రప్రకారము త్తరకర్మములు నీవు చేయవలయును. నీవు చేయకపోయితివా నేను జేయవలయును. మన యిరువురలో నొకరి కిది తప్పినది కాదు. ఇందలి ప్రథమపాదమున నకారము గాయత్రీ మంత్రము లోనిది.

## —• ౧౧౩-వ సర్గము. రావణుభార్యలు రావణుఁజూచి విలపించుట •—

కం. అని పలుకు చుండ రాఘవ, సునిశితశరములను సురనిషూదను మరణం
బును విని రాక్షసకాంతలు, వనరుచు నంతఃపురంబు వదలి భృశార్తిన్. ౨౫౦౭

అర్థములు, సునిశిత శరములను = వాఁడిగల బాణములచే, సురనిషూదను = దేవతల మర్దించిన రావణుని, వనరుచు = ఏడ్చుచు.

తాత్పర్యము స్పష్టము.

సీ. విరిసినజడలు పూ♦సరములతోఁ గూడి, వెన్నులఁ బ్రక్కల ♦ వ్రేలుచుండ
జడిగొనికాఱుబా♦ష్పముల పెల్లున జాఱి, తోరాడుపైఁటలు ♦ దడియుచుండఁ
గరతాడనంబుల ♦ గసిబిసిగొని హార,రత్నముల్ నేలపై ♦ రాలుచుండఁ
గనునీరు కప్పినఁ ♦ గనులు గానమిఁ గటి,భరమునఁ గాల్దడఁ ♦ బడుచునుండ
ఆ. మేను దూలిపోవ ♦ మేదినిఁ బొరలుచు, నెత్తి మోఁదికొనుచుఁ♦దత్తఱిలుచు
నధికశోకమునను♦హతవత్సగోవుల, పగిదిఁ బతిని జూడ♦వచ్చి రపుడు. ౨౯౦౦

తా త్ప ర్య ము

నేలఁబడి పొరలుటచే విచ్చిపోయిన జడలు పూలదండలతోడ వీఁపులమీఁదను రెండు ప్రక్కలందును వ్రేలాడుచుండఁగా, వర్షమువలెఁ గాఱుచున్న కన్నీళ్ళు స్రవించి వ్రేలాడు పైఁటలను దడుపుచుండఁగా చేతులతో రొమ్ములు కొట్టుకొనుటచేఁ జిక్కుపడిన హారములయందలి రత్నములు నేల రాలుచుండఁగా, నీరు గప్పుటచేఁ గన్నులు గానరామిని పిఱుఁదుల బరువునఁ గాళ్ళు దడఁబడుచుండఁగా, దేహములు తూలిపోవుచుండ నేలఁబడి పొర్లుచు తలలు కొట్టుకొనుచు దత్తఱలాడుచు శోకాతిశయమున దూడలు చచ్చిన గోవు లేద్చునట్లేడ్చుచు రాక్షస స్త్రీలు రావణుఁ జూడ వచ్చిరి.

దూడలు చచ్చిన యావులకు నుపమానము శోకాతిశయమునందు మాత్రమే యని గ్రహింపవలెను.

తే. ఉత్తరద్వారమునఁ గాచి♦యున్నయసుర,వరులు తమతోడ రాఁబతి♦నరసికొనుచు
వచ్చి రెల్లరు శోణిత♦బహుకబంధ, భీమమునకును ఘోరసం♦గ్రామమునకు.

అర్థములు. అరసికొనుచున్ = వెదకుచు, శోణిత = నెత్తుటిచేతను, బహుకబంధ = అనేకములైన మొండెముల చేతను, భీమము = భయంకర మైనది, సంగ్రామమునకు = యుద్ధభూమికి.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. హా! రాజనందనా! ♦ హా జీవితేశ్వరా!, హా ప్రాణనాయకా! ♦ హా మదీశ!
హానాథ! హానాథ! ♦ హాపతీ! యనుచును, నశ్రుసంపూర్ణనే♦త్రాబ్జ లగుచుఁ
బ్రాణేశు శోకపు♦రాయుణల్ కాంతలు, హతయూథప కరేణు♦వితతివోలె
నఱచుచు వెదకి మ♦హాకాయుఁ బటువీర్యు, నంజనచయతుల్యుఁ♦బ్రాణనాథుఁ
ఆ. బ్రధనపాంసుపతితుఁ ♦ బరికించి సంభిన్న, వనలతాళు లనఁగఁ ♦ బైన వ్రాలి
తలలు మోఁదికొనుచు ♦ విలపించి రెల్లరుఁ, జెక్కుభంగి రవము♦పిక్కటిల్ల.

అర్థములు. అశ్రు సంపూర్ణ = కన్నీళ్ళతో నిండిన, నేత్రాబ్జలు=కమలములవంటి కన్నులు గలవారు, హత = చంపఁబడిన, యూథప=యూథనాయకుఁడగు పెద్ద యేనుఁగు గల, కరేణువితతి=ఆఁడేనుఁగుల సమూహమును,అంజనచయతుల్య = కాటుక కుప్పతో సమానుని, ప్రధన = యుద్ధమందలి, పాంసు = ధూళి

యందు, పతితున్ = పడినవానిని, సంభిన్న = పగులఁబడిన, వనలతాళులు = అడవితీఁగెల గుంపులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఒక్కతె బహుమాన ♦ యుక్తిఁ గౌఁగిటఁ జేర్చి, తన చనవెల్లను దలఁచి ♦ యేడ్చె
నొక్కర్తు పదముల ♦ మక్కువమైఁ గ్రుచ్చి, తన నేలురీతిని ♦ బనవి యేడ్చె
నొక్కతె కంఠంబు ♦ నుపగూహన మొనర్చి, తను గారవించు విధంబు ♦ నేడ్చె
నొక్కర్తు పతిఁగని ♦ యుద్ధృతహస్తయై ప్రాణేశ్వరా! యని ♦ యవనిఁ బొరలె
ఆ. మూర్ఛపోయె నొకతె ♦ ముమ్మరంబగు శోక, మునను బలుక లేక ♦ మగుడ యొకర్తు
తనదు తొడను నాథు ♦ తల యుంచి తిలకించి, బాష్పవారి ముంచె ♦ వదనతలము.

అర్థములు. ఉపగూహనము=కౌఁగిలింత. ఉద్ధృతహస్తయై = చేతులెత్తినదై, ముమ్మరము=అధికము, తల — ఏకవచన ప్రయోగముచే రావణుఁడొంటి తలవాఁడై చచ్చెనని తెలియనగు.

కం. రావణు ధరణీతలగతు, నావనితలు చూచి చూచి ♦ యతిదుస్సహశో
కావిష్టచిత్తలై వా,పోవం గడఁగిరి గుహాళి ♦ బుద్ధిఁ దలఁచుచున్. ౧౧౦

అర్థములు. ధరణీతలగతున్ = నేలఁబడిన వానిని, దుస్సహ = సహింపరాని, శోక = వ్యసనముచే, ఆవిష్ట=ఆవేశింపఁబడిన, చిత్తలై = మనస్సు గలవారై, వాపోవన్=ఏడ్చుటకు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఏ మహాబలు పని ♦ నెదిరించి పాకారి, మానంబుఁ గోల్పోయె ♦ దీనుఁ డగుచు
నేమహావీరుని ♦ నెదిరించి శమనుండు, త్రాసంబునను నోల ♦ మాసగొనియె
నేశూరవరుఁడు గా ♦ రీశమిత్రుని నోర్చి, పుష్పకంబు హరించెఁ ♦ బొలుపు వెలయ
నెవ్వనిపే రన్న ♦ ఋషులు గంధర్వులు, తల నిక్కఁబెట్టఁగఁ ♦ దలఁకువార
ఆ. లెవనినామధేయ ♦ మెల్లసురాళికి, గుండెగాల మట్టి ♦ గండమగుఁడు
అట్టి దోర్బలాఢ్యుఁ ♦ డకటా! నేఁ డిట్లు, విగతజీవుఁడగుచు ♦ దెగినవాఁడు

అర్థములు. శమనుండు=యముఁడు, ఓలమాసగొనియె = మఱుఁగుపడిపోయెను, గారీశమిత్రుని=కుబేరుని, విగతజీవుఁడు=ప్రాణము పోయినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

ఆ. అసురతతికి వెఱవఁ ♦ డమరులకును జంకఁ, డహివరేణ్యులకును ♦ నదరఁ డట్టి
పరమసాహసునకు ♦ భయవిదూరునకును, మనుజువలన భయము ♦ దనరె నేఁడు!

అర్థములు. భయవిదూరునకున్ = భయము లేనివానికి, దోర్బలాఢ్యునకున్=భుజబలసంపత్తి గలవానికి.

తాత్పర్యము స్పష్టము

ఆ. దానవాళిచేత ♦ దానవారులచేత, నసురవితతిచేత ♦ హతుఁడు గాని
కడిఁదిబంట నీవు ♦ కాల్నడ మనుజుచే, ననిని హతుఁడ వైతె♦యనదవోలె ?
అర్థములు. కడిఁది బంటు=గొప్ప శూరుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. విన వైతివి సుహృదులనుడి, వినవైతివి మేలుకోరు ♦ పెద్దలపలుకుల్
కొని తెచ్చితి మృతికొఱకై, జనకాత్మజ దానవసుర♦సంఘము సమసెన్. ౨౯౧౮
అర్థములు. సుహృదులనుండి=స్నేహితులమాట.

తాత్పర్యము స్పష్టము.

ఉ. నీమహితంబుఁ గోరువర ♦ నీతివిదుండు విభీషణుండు నీ
సోదరుఁ డింత వచ్చు నని ♦ యూరక నీచెవి కూఁతిపోయఁదే ?
కా దని ధిక్కరించితివి ♦ కాఱులు పల్కితి వట్టివాని ని
ట్లీదనుజాళి నీవు మఱి ♦ యేమును గూలితి మింద ఱొక్కటన్. ౨౯౧౯
అర్థములు. వరనీతి విదుండు=ఉత్తమమైన నీతిమార్గము దెలిసినవాఁడు, కాఱులు = నిష్ఠుర వాక్యములు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. సీతను నీవు రామునకుఁ ♦ జెల్మితలంపున నిచ్చియున్న నీ
భ్రాతయు సంతసించు, రఘు♦రాముఁడు నీకు హితార్థి యౌను, మా
కీ తల్రవ్రాఁత ప్రాణధవ ♦ హీనత పాయు, విరోధి సంచయా
కూతము రిత్తయౌ, నసుర ♦ కోటి సమూలము ద్రుంగ కుండదే. ౨౯౨౦
అర్థములు. హితార్థి=మేలు కోరువాఁడు, ప్రాణధవ హీనత=వైధవ్యము, విరోధి సంచయ=నీకీడు గోరు పగవారి గుంపుయొక్క, ఆకూతము=అభిప్రాయము, సమూలము=మునుముట్ట, వ్రేళ్ళతోడ.

తాత్పర్యము స్పష్టము.

కం. పాపపుమనమున సీతను, జేపట్టఁగఁ గోరి హఠము ♦ చేయుటఁ గాదే
యీపురమున వారును మే,మీపగిది స్నపుముగుర♦మిటు పాడగుటన్. ౨౯౨౧
అర్థములు. హఠము=మొండితనము, హఠయోగమున నెంత బాధకలిగి నను సహించి యొక్కయాసనమందే పెక్కుకాల ముండుటచే నది మూర్ఖత్వము నకుఁ బర్యాయనామ మయ్యెను. పురమున వారు=పురమునందలి వారు, సప్తమ్యర్థమున నకారము, "చేటు పురంబున వారి కెమ్మెయిం, గా కెటులుండు" విరాట పర్వము భారతము.

తాత్పర్యము

నీ యొక్కని మూర్ఖత్వమువలన నీవు, మేము, ఊరివారు అందఱు చెడుట యయ్యెను.

కం. కావు పతీ! కాముకుఁడవు, కావు స్వతంత్రుఁడవు నీవు • కార్యముపట్లన్
దైవంబ నలుపు సర్వము, దైవోపహతు వ్యధించు•దక్కెడియేనిన్. ౨౫ ౨౦

అర్థములు. దైవోపహతున్=దైవముచేఁ గొట్టఁబడినవానిని.

తాత్పర్యము

నీ మృతికి కామము కారణముకాదు. ఆ విషయమునఁ గార్యములు చేయుట యందు నీవు స్వతంత్రుఁడవు కావు. సర్వము దైవవశము. దైవము తప్పఁజూచినపు డేదియైనఁ జంపఁగలదు. అది నిమిత్తమాత్రమే. ముఖ్యకారణము దైవమే.

కం. వనచరకోటులకును మన మనుజాశన సంఘములకు • మఱి నీకు వినా
శన మిటు చేకూరుటకును, దనుజేంద్రా! కారణంబు•దైవంబ చుమీ. ౨౫ ౨౧

తాత్పర్యము

వానరులు రాక్షసులు నీవు నాశనమైపోవుటకుఁ గారణము నీవు కావు. మఱి యెవ్వరుకారు. దైవమే కారణము.

కం. కలిమిని నైనను గామము. బలమున నేన్ మిగుల దేహ•బలమున నాజ్ఞా
కలనమున నేని శక్యమె, బలవద్విధిగతిని ద్రిప్పఁ • బ్రకటబలాఢ్యా. ౨౫ ౨౨

తాత్పర్యము

సంపదబలముచేతఁ గాని కామబలముచేతఁ గాని దేహబలముచేతఁ గాని అధికారబలముచేతఁగాని బలవంతమైన విధి సంకల్పము తప్పింప సాధ్యముగాదు.

కం. అని యీగతి శోకాకుల, మనములఁ గన్నీరు దొరఁగ • మనుజాశనుభా
మిను లెల్లఁ గురరులో యనఁ, బనవి పనవి యేడ్చుచుండ•వారలలోనన్.

అర్థములు. కురరులో=లకుముకులో.

తాత్పర్యము స్పష్టము.

## —• ౧౧౪-వ సర్గము. మందోదరీ విలాపము •—

తే. పెద్దభార్య మందోదరి • పేరిచెలువ, రావణుని ప్రియురాలు భ•ర్తను గకుత్స్థ
గోత్రదీపకహతునిఁగ•న్గొనుచు దుఃఖ, పాటు సైరింపలేకిట్లు•పలవరించు. ౨౫ ౨౪

అర్థములు. కకుత్స్థ గోత్ర దీపక = కకుత్స్థుని వంశమును ప్రకాశింప చేయువానిచే, హతునిన్=చంపఁబడినవానిని.

తాత్పర్యము స్పష్టము.

చ. అకట మహానుభావ! ధన•దానుజ! నీ వొక యింత యల్గినన్
వికలత నొందు వాసవుఁడు • వేలుపులున్ ధరణీసురోత్తముల్
తికమకలాడి పాఱుదురు • దిక్కులవెంబడి నట్టినీ వయో
యొకనరమాత్రుచేఁ బడుట • కోర్చితి వింతగ సిగ్గుమాలితే. ౨౫ ౨౫

అర్థములు. ధరణీసురోత్తముల్ = బ్రాహ్మణశ్రేష్ఠులు, సిగ్గుమాలితే = ఇంతటి గొప్పవాఁడ వొక మనుష్యమాత్రునిచేఁ జచ్చునంత సిగ్గులేనివాఁడవైతివా?

మందోదరి వీరపత్నిగదా! వీరపత్ని యైనది భర్త గెలిచినపు డెంత సంతోషింపవలయునో వీరమరణము చెందినపుడు తన వీరపత్నీత్వమునకు హానిరాలేదు గదా యని సంతోషింపవలసి యుండఁగా బాలిశురాలివలె నేడువ వచ్చునా? మందోదరి రావణ మరణమునకు నేడువలేదు. రావణుఁడు తన కంటె నధములని తాను భావించియుండిన మనుష్యులచేఁ జచ్చి, తన వీరపత్నీత్వమునకు హాని గలిగించెగదా! ఇది యెంత లజ్జావహము! ఎవ తెయైన వచ్చి నీ మగఁడు మనుష్యునిచేఁ జచ్చెనఁట నిజమా యనిన నేమి చెప్పుదునని యేడ్చెను.

కం. పొడిచితి ముల్లోకంబులు, నొడిచితి వెల్లెడలఁ గల్గు ♦ నుత్తమలక్ష్మిన్
బడసితివి పేరుఁ బెంపును, నడవిమనుజుచేతఁ దుదకు♦హతుఁ డైతె పతీ? ౨౫.౨౬

అర్థములు. పొడిచితివి=కొట్టితివి, ఒడిచితివి=బలవంతముగ హరించితివి.

తాత్పర్యము స్పష్టము.

కం. మనుజుల కవిషయ మగుని, వననిధి వసియించుకామ ♦ వర్త్మని నిన్నున్
మనుజుఁ డొకఁడు ద్రుంచె నన,న్మనుజాశనవర్య! యేమి♦న్యాయము చెపుమా?

అర్థములు. అవిషయము = విషయగోచరము గానిది, చేరరానిది, కామవర్త్మని = కామ మార్గమున సంచరించు వానిని, మనుజుఁడు మనుజులఁ దిను వానిని జంపుట యం దేన్యాయము గలదు? ఇది విపరీతము అవమానకరముగదా?

తాత్పర్యము స్పష్టము.

కం. ఇమ్ముగ నమస్తశస్త్రా, స్త్రమ్ములఁ బరిపూర్ణు నిన్ను ♦ రథికుని సంగ్రా
మమ్మున రాముఁడు చంపుట, నమ్మంగానేర నేను ♦ నాకపవైరీ! ౨౫.౨౮

తాత్పర్యము స్పష్టము.

కం. పరఁగ జనస్థానంబున, ఖరుని సహభ్రాతృ నెల్ల ♦ క్రవ్యాదులతోఁ
బరిమార్చుట విని రాముఁడు, నరమాత్రుఁడు గాఁ డటంచు♦నాఁడం దోఁచెన్.

అర్థములు. క్రవ్యాదులతో = రాక్షసులతో.

తాత్పర్యము

ఎప్పుడు జనస్థానమున తమ్ములను సర్వరాక్షసులతో రాముఁడు చంపెనో యది మనుష్య సాధ్యము కాని కార్యము కావున రాముఁడు సామాన్య నరుఁడు కాఁడని యప్పుడే తలఁచితిని 'శంకే రామ మమానుషమ్' అని వాల్మీకి చెప్పిన ఫక్కి ననుసరించి వ్యాసమహర్షి భారతమున ఆదిపర్వమున "తదానాశంసె విజయాయ సంజయ" అని మకుటము గల శ్లోకముల అఱువది తొమ్మిది వ్రాసెను. 'పరంకవీనా మాధా' రమ్మని వాల్మీకి చెప్పినది సర్వవిధముల సత్యము.

కం. సురలకు దనుజుల కైనను, జొరరానిది లంక దానిఁ ♦ జొచ్చె బలిమిమైఁ
గరువలిసుతుఁ డప్పుడె నేఁ,బరితాపముపడితిఁ జేటు♦పాటిలు ననుచున్. ౨౫.౩౦

అర్థములు. కరువలిసుతుఁడు=వాయుపుత్త్రుఁడు — హనుమంతుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. గిరికోటులతో నీరా,కరమున వనచరులు కట్టఁ ♦ గట్టినయపుడే
సురనాథవైరి! రాముఁడు, పరమాత్ముఁడు గాఁ డటంచు ♦ నమ్మితి జువిన్నా.

అర్థములు. నీరాకరమునన్=సముద్రమందు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆయముఁడె తా స్వయమ్ముగ, నీయవనీనాథురూప ♦ మిటు గొని నిన్నున్
మాయింప నప్రతర్కిత,మాయన్ ఘటియించెనో టు♦మత్ప్రాణేశా! అ౧౩ అ

అర్థములు. అవనీనాథు రూపము = రాజునాకారము, మాయింపన్ = రూపము లేకుండఁజేయ,అప్రతర్కిత మాయన్=ఊహించి తెలియరాని యద్భుతమైన శక్తిని, ఘటించెనోటు=ఘటియించె నేమో.

తాత్పర్యము స్పష్టము.

కం. కాకున్న వృత్రవైరియొ, పోకార్చెనో నిన్ను? నట్టి ♦ బూమెలు గలవే?
నాకాధిపతికి నీ దెస, నేకరణిం జూడ శక్తి ♦ యెక్కడ వచ్చెన్? అ౧౩౩

అర్థములు. వృత్రవైరియొ=ఇంద్రుఁడొ, బూమెలు=మాయలు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కాన రాముండు ని♦క్కము మహాయోగి య,నాదిమధ్యాంత స ♦ నాతనుండు
పరమాత్ముఁడును బరా ♦ పరుఁడు మహత్తుకుఁ, బరమమహత్తును♦బరమధాత
శ్రీవత్సవక్షుండు ♦ శ్రీనిత్యనిలయుండు, శంఖచక్రగదాది ♦ సాధనుండు
శాశ్వతుండు ధ్రువుం డ♦జయ్యుండు సత్యప, రాక్రముఁ డగువిష్ణు♦వవనిమీఁద

తే. మానుషశరీరమును బూని ♦ వానరత్వ, కలితవిబుధులతోడ జ♦గద్విభుండు
భువనహితకామ్యమునన్నిన్నుఁ♦బూర్వదేవ,సంతతులతోడ మ్రందించె♦సంగరమున.

అర్థములు. మందోదరి తొలుత సామాన్య మనుష్యుఁడు అందు నడవి మనుష్యుఁడగు రామునిచేఁ జచ్చుట యవమానప్రసంగమని ప్రారంభించి ఖరాదులను జంపుటచేతను లంక కాల్పించుటచేతను సేతువు కట్టుటచేతను రాముఁడు మనుష్యమాత్రుఁడుగాఁడు, దేవతగా నుండవలెనని తర్కించి యా దేవత యెవరు? సంహారశక్తిగల యముఁడా? దేవతాప్రభువు ఇంద్రుఁడా యని యూహించి ప్రత్యక్షముగా నీ దేవత లందఱు నీ చేత దెబ్బలు దినినవారే కావున అట్టివారు మాఱువేషములతోడ వచ్చి యేమి చేయఁగలరు? కావున రాముఁడు ఆ దేవతలకంటె గొప్పవాఁడుగా నుండవలెను.అట్టివాఁ డెవఁడని యాలోచించి మహాయోగీత్యాది విశేషణము లెవ్వని కన్వయించునో యట్టి విష్ణువే శ్రీరామచంద్రమూర్తి యని వ్యక్తీకరించుచున్నది.

మహాయోగి — యోగమనఁగా ధ్యానమునకు పేరు. 'యోగ స్సన్నహనే

ధ్యానే ॥నానా॥౮॥'. అట్టి ధ్యానము గలవాఁడు యోగి. ఇట్టి యోగులలో నందఱిలో గొప్పవాఁడు మహాయోగి — లోకరక్షణోపాయధ్యానము గలవాఁడు అనియర్థము.

'యోగో హ్యఘటితార్థస్య ఘటనం తేన సర్వథా, యస్యాస్తి నిత్యసంబంధం స యోగీ పరికీర్తితః' — ఇతరులు చేయలేనిదాని నెవఁడు చేయుచున్నాఁడో అట్టి దానితో నెవనికి విశేషముగ నిత్యసంబంధము గలదో యతఁడు యోగి. 'భార భృత్ కథితో యోగీ యోగీశ స్సర్వకామదః' అని విష్ణుసహస్రనామము.

'పశ్య మే యోగ మైశ్వర్యమ్' గీ॥ ౧౧-౮

'యోగేశ్వరః కృష్ణః — గీ — ౧౮-౭౮

'యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్' — గీ॥ ౧౮-౭౫

'మహాయోగేశ్వరో హరిః' — గీ. ౧౧-౯.

'యోగీ యోగ ఇతిజ్ఞానం సర్వజ్ఞానం సర్వజ్ఞో హ్యయత్యతః' యోగమనఁగా జ్ఞానము. అదిగలవాఁడు యోగి, సర్వజ్ఞుఁడని యర్థము, ఇది యితరులయం దౌప చారికము. భగవంతుఁడగు విష్ణువు మహాయోగి కావుననాయనయందు ముఖ్యము. 'యస్యజ్ఞానమయం తపః' ఎవని యాలోచన జ్ఞానమయమోయని కదా శ్రుతి చెప్పు చున్నది. మహాయోగి=స్వాభావిక జ్ఞానశక్తి యుక్తుఁడు, 'పరాస్యశక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియాచ' - శ్రుతి. భగవంతుని స్వభావసిద్ధమైన పర శక్తి జ్ఞానమని బలమని క్రియయని మఱియుఁ గొన్ని పేర్ల ప్రసిద్ధి గాంచినది. భగ వంతుని స్వభావసిద్ధ షడ్గుణ సంపత్తిలో జ్ఞాన మనునది యొక్కటి. జ్ఞానశక్తి బలై శ్వర్య వీర్య తేజస్సులు ఇవి స్వభావముగఁ గలవాఁడుగదా భగవంతుఁడు విష్ణువు?

మహాయోగి=మహాసన్నాహము గలవాఁడు. ఇచ్చట సన్నాహము ఆశ్రిత రక్షణమం దని యెఱుఁగవలయును.

మహాయోగి=వివిధవిచిత్ర జగన్నిర్మాణోపాయచతురుఁడు.

మహాయోగీ = బహుభవన సంకల్పముగలవాఁడు. 'బహుస్యాం ప్రజాయే యేతి' యని శ్రుతి.

'సోభిధ్యాయ శరీరాత్ స్వాత్ సిసృక్షు ర్వివిధాః ప్రజాః'॥ మనుస్మృతి.

మహాయోగి=జగన్నిర్మాణమున కుపయుక్తమైన ప్రకృతి పురుష కారకర్మ సంసర్గము గలవాఁడు.

మహాయోగీ - శరణాగత రక్షణాదులందు చాంచల్యములేని యుక్తి గల వాఁడు.

'యోగస్సన్నహనోపాయధ్యానసంగతియుక్తిషు' - అమరము.

అనాది మధ్యాంతుఁడు = మొదలు నడుమ తుద యనునవి లేనివాఁడు, జన్మవృద్ధిక్షయములు లేనివాఁడు.

సనాతనుండు=ఎప్పుడు 'అస్తి' కలఁడు అను నది తప్ప. "నాస్తి" లేఁడు అనునది లేనివాఁడు.

సదాతనోపి తదాతనవ న్నిత్యభోగ్యతయా అతిశయితః-సనాతనః=పురాణః-నిత్యనూతనభోగ్యత్వాత్ సనాతనతమ స్స్మృతః॥

సర్వదా యున్నవాఁడే యైనను ఎప్పటికప్పుడు క్రొత్తగా ననుభవయోగ్య మగుచుండువాఁడు, పురాపి నవశ్చ పురాణః - ప్రాఁతవాఁడైనను ఎప్పటికప్పుడు క్రొత్తవాఁడే. అట్టివాఁడు పురాణపురుషుఁడు.

పరమాత్ముఁడు - పరముఁడైన, ఆత్ముఁడు - పరమాత్ముఁడు. జీవాత్మల కన్నిటికంటెఁ బరముఁడైనవాఁడు- ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః॥ భ. గీ. ౧౫-౧౭. క్షరాక్షరములకంటె నుత్తముఁ డగుటచేఁ బరమాత్ముఁడు. పరమాత్మ=ఆత్మలకు ఆత్మయైనవాఁడు, అనఁగా సర్వాంతర్యామి యని భావము. య ఆత్మని తిష్ఠ న్నాత్మనోంతరో యమాత్మా న వేద యస్యాత్మా శరీరమ్- య ఆత్మాన మంతరో యమయతి॥ శ్రుతి ఎవఁడు ఆత్మ (జీవ)యందున్నాఁడో, తనయందుండు నెవనిని జీవాత్మ తెలిసికొనలేదో, ఎవనికి జీవాత్మ శరీరమో, ఎవఁడు లోపలనుండి జీవాత్మను నియమించుచున్నాఁడో యని శ్రుతి కర్థము. ఇట్టి వాఁడు పరమాత్మ.

పరమాత్మ- "యేన భూతా న్యాత్మవంతి నాయ మన్యేన చాత్మవాన్ అతోహ్యాత్మేశ్వరత్వాచ్చ పరమాత్మా ప్రకీర్తితః".

సమస్త భూతములు ఎవనివలన ఆత్మగల వగుచున్నవో, ఇతరముల వలన నెవఁడాత్మవంతుఁడు కాఁడో, ఎవఁడు ఆత్మల కీశ్వరుఁడో వాఁడు పరమాత్మ. పరోమా అస్యేతి పరమః- ఈయనకంటె పరమనునది లేదు. అట్టివాఁడు పరముఁడు - అట్టిపరముఁడగు ఆత్మ పరమాత్మ.

పరమాత్మా - స ఏవాత్మా పరమః - ప్రత్యగాత్మనః-ప్రకృతి సంబంధము లేని శుద్ధజీవాత్మకు ప్రత్యగాత్మ యని పేరు. ఆయాత్మలకంటెఁ బరముఁడు కావునఁ బరమాత్మ.

ఆత్మేశ్వరమ్. తై. నా. ౬-౧౧.

తస్మాద్ధాన్యన్న పరః కించ నాస॥ ౨ అష్ట. ౮-ప్ర-౯-౭.

న తత్సమ శ్చాభ్యధికశ్చ దృశ్యతే - శ్వే - ఉ. ౬-౮.

'యస్మాత్పరం నాపర మస్తి కించిత్' శ్వే. ఉ. ౩-౯ 'నపరం పుండరీకాక్షాత్ దృశ్యతే భరతర్షభ, పరంహి పుండరీకాక్షా న్నభూతం న భవిష్యతి.'

'నదైవం కేశవాత్పరం' భార. అశ్వ. శేష. ౨-౨౧ యస్మాత్పరస్మాత్పురుషా దనంతా దనాదిమధ్యా దధిక న్న కించిత్॥ జీవులకంటె శ్రేష్ఠుఁడు-అనంతుఁడు- అనాది, మధ్యుఁడునైన వానికంటె నధికుఁడు లేఁడో.

మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ, పరం హ్యమృత మేతస్మా ద్విశ్వరూపా న్నవిద్యతే, పరః పరాణాం పరమః పరమాత్మా. వి.పు. ౧-౨-౧౦ పరావరుఁడు=పరముఁడైన యెవ్వనికంటె నన్యమైనది లేదో, పరమైనది లేదో.

ఏది శ్రేష్ఠమైనదని మనము తలఁతుమో అట్టివానికంటె శ్రేష్ఠుఁడై, యంతకంటె నన్యమైనది లేనివాఁడు - వాసుదేవ స్సర్వమ్—సర్వం ఖల్విదం బ్రహ్మ-సమస్త చరాచరములు భగవంతుఁడే- నిమిత్త కారణము ఉపాదానకారణము తానేయైనవాఁడు, శ్రేష్ఠాన్యదూరయోరేషు పర స్స్యాత్ ॥నానా॥ర॥

మహాత్ముకు పరమ మహాత్మ— మహాత్ముకంటె అన్యదూర సమీపేతరోత్తరాద్యర్థ యోగంబునకు గంటె - కు వర్ణకంబులగు' - సు వ్యా. - కార - ౧౯

మహాత్మకు - ఉకార ఋకారంబులకు కు షష్ఠి పరమగుచో నగాగమంబు తఱచుగ నగు - సు, వ్యా తత్స - ౪౭ - తఱచుగ ననుటచే —

'నిమధేంద్రుఁడు బచ్చుకున్' శృం. నై - ౬ ఆ.

'సంగరంబనిన నుత్సవము కేగెడి క్రియ' నాచన సోమన, ౬ ఆ.

అండజాధీశ్వరు కొసఁగఁబోలు, విక్ర-౪ ఆ. నగుఁబాటుకోర్చి-భోజ. ౫ అ.

'వంతుకువచ్చు' పారి. ౧ ఆ. ఇత్యాది ప్రయోగంబులుగలవు. తఱచుగ ననుటచే దీర్ఘపు వర్ణముమీఁద కుషష్ఠి వచ్చునేని నకారాగమము నిత్యము.షష్ఠీ కు వర్ణకమెకాదు. పదాది కువర్ణకమైనను రారాదు. పూవు శబ్దమునకు పూయని రూపాంతర ముండినను కువర్ణముగాని కువర్ణకముగాని పరమైనపుడు పుకార లోపములేదు. 'కాలకంఠుని శిరసుపూ గగనగంగ' శ్రీనాథుఁడు.

మహాత్ములు = మనకంటె గొప్పవారు; ఇంద్రాదులు ? వారికంటె గొప్పవారు, మహాత్మునకు మహాత్ములు, బ్రహ్మాదులు; వారికంటె పరమమహాత్మ భగవంతుఁడు, 'మహతో మహీయాన్' శ్రుతి.

మహా తత్త్వమునకంటెఁ బరమైనది తమస్సు. దానికంటె పరముఁడైన మహాత్మ, తమసః పరస్తాత్। తమసఃపరః తమసస్తు పారే - శ్రుతి. తమస్సు వఱకు ప్రాకృత మండలము. తమస్సునకావల నప్రాకృతమైన వైకుంఠము, దాని యందుండు వాఁడని యర్థము. ఆదిత్యవర్ణం తమసస్తుపారే - శ్రుతి. దీనివలన స్థాన విశేషముచేతను పరమత్వము చెప్పఁబడెను.

పరమధాత - ధాత = సర్వమును ధరించినవాఁడు, డుధాఞ్ ధారణ పోషణయోః - బ్రహ్మ బ్రహ్మకంటెఁ బరముఁడు పరమధాత - బ్రహ్మరూపమున సృష్టిభారమును ధరించినవాఁడు,తపోబలముచే బ్రహ్మపదవికి వచ్చిన జీవునం దావేశించి యతనిచే సృష్టికార్యము చేయించువాఁడు. ధాత = పోషకుఁడు, పోషకులకు నందఱకుఁ బోషకుఁడైనవాఁడు- పరమధాత - ధాత - సృజించువాఁడు,యతో వా

ఇమాని భూతాని జాయంతే - యని శ్రుతి - అచిత్సమష్టి భూతాయాం ప్రకృతౌ చిత్సమష్టికమ్। గర్భం వేధాత్మకం ధత్తే యస్తు ధాతేతి చక్షతే- సర్వయోనులందు అచిత్సమష్టిభూతమైన ప్రకృతియందు విరించ్యాత్మక చిత్సమష్టి రూప గర్భము ధరింపఁజేయువాఁడు. 'మమ యోనిర్మహత్ బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్, భ. గీ. ౧౪-3. ధాతా క్షేత్రే కర్మబీజభూతం గర్భం దధాతి—"అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్' మనుస్మృతి.

తొలుత స్వరూపవర్ణనముఁ బట్టి పరమత్వము, ఆవల స్థానముఁబట్టి పరమత్వము. ఇఁక విగ్రహముబట్టి పరమత్వముఁ జెప్పుచున్నది.

శ్రీవత్సవక్షుండు = శ్రీకరమైన వత్సము శ్రీవత్సము— అది రక్తవర్ణము గలది. అది వక్షమునందుఁ గుడిప్రక్క నుండును. అట్టి మచ్చగలవాఁడు శ్రీవత్సవక్షుఁడు. దీనిచే సర్వేశ్వరద్యోతకము చెప్పఁబడెను. శ్రీనిత్యనిలయుండు.

ఇఁక జగద్రక్షణోపయోగ పురుషకారత్వము చెప్పుచున్నది. నిత్యముగా, వేఱుపాటనునది లేక లక్ష్మీదేవికి స్థానమైనవాఁడు.

సర్వదా శ్రీతోఁ గూడియుండువాఁడు. 'విష్ణో శ్శ్రీ రనపాయి' నీత్యాది.

శంఖచక్ర గదాది సాధనుండు = శంఖము, చక్రము, గద, నందకము, శార్ఙ్గము నను నాయుధములు ధరించినవాఁడు. సర్వదా యీ యాయుధములు ధరించియుండువాఁడు. లోకములో నాయుధధారు లందఱు తమ యాయుధముల సర్వదా మోచి తిరుగుచున్నారా ! కావలసినపుడు తీసికొనరాదా అనినట్లుకాదు. ఎవఁడైన పాహి శరణు అనఁగానే వెంటనే రక్షించునట్లుండవలెఁగాని యర్జునుని వలె నప్పుడాయుధశాలకుఁ బరువెత్తుచుట్లుండరాదు. ఆర్తుఁడగు భక్తుని రక్షించుటయందుఁ గాలవిలంబనమును లవమైన భగవంతుఁడు సహింపఁడు. గజరాజు చరిత్రము సాక్ష్యము. ఈ విషయమును బూర్వు లిట్లు చెప్పిరి. "పాతు ప్రణత రక్షాయాం, విలంబ మసహన్నివ, సదా పంచాయుధం బిభ్రత్ స న శ్శ్రీరంగనాయకః"

ఆయుధములు లేక భగవంతుఁడు కార్యములు చేయఁజాలఁడా యనిన నట్లు కాదు. సంకల్పముచేత సృష్టిసంహారాదులు చేయువానికి నాయుధములు లేవన్న లోటు లేదు. భక్తులు రక్షణమందు విశ్వసించుకొఱకు, దుష్టులు భయపడుకొఱకు. ఉత్తచేతులవాఁడు యుద్ధమునకుఁ బోయిన శత్రువులు దూరమునుండి యాయుధముతోఁ గొట్టిన వీఁడేమి చేయఁగలఁడని మూఢులు సందేహింతురు. శత్రువు లలక్ష్యము సేయుదురు. కావున నాయుధధారణము, నిత్యశ్రీ యనియు నిత్యశంఖచక్ర గదాధరుఁ డనియుఁ జెప్పుటచే దివ్యమంగళవిగ్రహనిత్యత్వము చెప్పఁబడెను. స్వరూపనిత్యత్వము సాధారణప్రాప్తి విషయము. అది ప్రత్యేకించి చెప్పవలసిన పనియే లేదు.

శాశ్వతుఁడు=అపక్షయ రహితుఁడు - దేశకాలవస్తు పరిచ్ఛేద రహితుఁడు, ధ్రువుఁడు, పరిణామ శూన్యుఁడు, ఇవి రెండు షడ్భావ వికారములు లేమిని దెలుపుచున్నవి.

'అపక్షయ వినాశాభ్యాం పరిణామర్ధి జన్మభిః, వర్జిత శ్శక్యతే వక్తుం యస్సదా స్తీతే కేవలం' అని విష్ణుపురాణము.

అజయ్యుండు = జయింప శక్యము గానివాఁడు, క్షయ్యజయ్యౌ శక్యార్థే- పాణిని, నిత్యశ్రీ యగుటచే నజయుఁడని భావము.

'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' ఆ సీతాదేవి యెవనిదో వానితేజ మప్రమేయమని యరణ్యకాండమున మారీచోక్తి.

అజయ్యుఁడు = ఉపాసకులకుఁ దప్పఁ దక్కినవారికి జయింప సాధ్యము గానివాఁడు.

సత్యపరాక్రముఁడు=సత్యమైన పరాక్రమము గలవాఁడు. నీవలె మాయా యుద్ధము చేయువాఁడు కాఁడు. కావుననే కదా చేతఁజిక్కిన వానిని నిన్నుఁ జంపక విడిచెను. రెండవసారి నీ రథ సారథి ధనుస్సుల దేనిని ద్రుంపక సాధన సంపూర్తి గల నినుఁ జంపెను. సత్యపరాక్రముఁడు=సత్యమే పరాక్రముగాఁ గల వాఁడు. ఆయన సత్యత్వమే లోకముల నన్నిటిని జయించుచున్నది. ఆయన పరాక్రమునకు వేఱుసాధన మక్కఱ లేదు.

మానుష శరీరమును = మనుష్యశరీరము వంటి శరీరమును వానరత్వ కలిత విబుధులతోఁడ = వానరులుగానైన దేవతలతో, జగద్విభుండు = ప్రపంచమున కంతయుఁ బ్రభువు కావున నీకుఁ బ్రభువే. ప్రభువు విషయమునఁ దక్కిన వా రెట్లు వినయవిధేయతలతో వర్తింపవలయునో యట్లు వర్తించి యుండిన నిన్ను రక్షించి యుండును. ప్రభుతిరస్కారము చేసితివి గావున నిన్నుఁ దండించెను. ఏల దండించెను? భువనహితకామ్యమునన్ = ప్రపంచమునకు మేలుగోరి, నీవు తిరస్కరించుటచే నాయనకు వచ్చిన యవమానము పట్టి లేదు. నీవలన లోకమును రక్షింపవలసి యున్నది. కావున నిన్ను దండించెను గాని నీయందు ద్వేషబుద్ధి గలిగి కాదు. పూర్వదేవ సంతతులతోఁడన్=నీకు సహాయులైన రాక్షసులతో, నీకు సహాయుఁడు గాని వానిని రక్షించెను. కావున నీ చావునకు నీవు కారణభూతుఁడవు కాని యితరులు కారు. రామునందు నిర్దయత్వము పక్షపాతము లేదు.

## తాత్పర్యము

ఈ కారణములచే నీ రామచంద్రమూర్తి వాస్తవముగ మహాయోగియు, ఆదిమధ్యాంత శూన్యుఁడును, సనాతనుఁడును, జీవాత్మల కన్నిటికంటె బరముఁడైన వాఁడును, పరాపరుఁడును, మహాత్ములకంటెఁ బరమ మహాత్మును, సర్వమును ధరించి పోషించువాఁడును, వక్షమందు శ్రీవత్సముగల వాఁడును, శ్రీదేవితో నిత్యముగఁ

గూడి యుండువాఁడును, శంఖచక్రాదుల సదా ధరించినవాఁడును, వికారశూన్యుఁడును, ధ్రువుఁడును, జయింప సాధ్యపడనివాఁడును, సత్యపరాక్రముఁడును అగు విష్ణువే జగత్త్రిభువను నాయనయే మనుష్యశరీరమువంటి శరీరమును ధరించి వానరులుగాఁ బుట్టిన దేవతలతో లోకము మేలుకొఱకు నీ తోడి రాక్షసులతోడ నిన్నుఁ జంపెను.

అదియేమి చిత్రమో! మహర్షులను వదలి సామాన్యజనులను గ్రహించితిమేని శ్రీరామచంద్రమూర్తి పరత్వమును గ్రహించినవారు సుమిత్ర, శబరి, తార, మందోదరి, వీ రందఱు నాఁడువారే. భాగవతమున "కటకట మోసపోయితిమి కాంతల పాటియు బుద్ధిలే"దని బ్రాహ్మణు లేడ్చిరి.

భారతమందు కుంతికి ద్రౌపదికి కృష్ణునం దున్నంత భక్తిశ్రద్ధలు పాండవులకు లేవు. భగవంతుఁడు భక్తిసాధ్యుఁడు. భక్తి స్త్రీలకు సులభసాధ్యము. కావున భగవంతుఁడు వారికి సులభుఁడు. పురుషుల కతి కష్టసాధ్యుఁడు.

కం. ఇంద్రియముల మును గెలిచి యతంద్రత ముల్లోకములను ♦ ధర్షించితి వా
యింద్రియములు పగ మది నిడి, యింద్రారీ! నిన్ను గెలిచె ♦ నియ్యెడ మరలన్.

అర్థములు. అతంద్రత=హెచ్చరికతో, ధర్షించితివి=ధిక్కరించితివి.

తాత్పర్యము

నీవు తపముచేయునపు డింద్రియముల గెలిచి యా బలమున మూఁడులోకములు జయించితివి. ఆ పగ మనస్సునం దుంచుకొని యింద్రియములు నిన్ను గెలిచి యీ దశకుఁ దెచ్చెను.

ఉ. చెప్పఁగలేదె నేను రఘు♦శేఖరుతోఁ బగ మానుమంచు ? నీ
వప్పలుకుల్ గ్రహించితివె ♦ యా ఫల మిప్పుడు దాపరించె, నీ
గొప్పతనంబు ప్రాణమును ♦ గూరిమిచుట్టము లెల్లసంపదల్
తెప్పునఁ గూల నేకతము ♦ లేకయె కోరితి వా ధరాసుతన్. ౨౫౩౬

తాత్పర్యము

రామచంద్రమూర్తితో విరోధము వలదు వలదని నేను జెప్పలేదా ? నా మాటలు నీవు వింటివా? విననిఫల మిప్పుడు నిన్నీగతికిఁ దెచ్చెను. నీపరువు ప్రాణము బంధువులను నందఱ నాశముచేయుటకుఁ గాకున్న నేమి కారణమున సీతను దెచ్చితివి?

కం. మతిలేవు గాక, చంద్రుని, సతికి నరుంధతికి మిన్న ♦ జానకిని బతి
వ్రత నతిమాన్యను బఱచితి, మతిమంతులు చనెడి సాధు♦మార్గమె యదియున్.

తాత్పర్యము

నీ వాలోచన లేనివాఁడవు. కావుననే రోహిణికంటె నరుంధతికంటె గొప్ప పతివ్రతయగు జానకిని గౌరవింపవలసినదానిని బాధపెట్టితివి. ఇది బుద్ధిగలవారుపోవు మంచిమార్గమా ? అరుంధతీ రోహిణులు పతివ్రతలేకాని లోకముచేఁ బూజింపఁ

బడువారుగారు. సీతాదేవి యట్లుగాదు. పతివ్రత యగుటయేకాక లోకముచేఁ దల్లివలెఁ బూజింపఁదగినది యని భావము.

సీ. వసుధకు వసుధ యా ♦ భర్తృవత్సల సీత, శ్రీకిని శ్రీయగు♦చెలువ మిన్న
యనవద్యసర్వాంగి ♦ యఖిలశుభాస్పద, మెచటనో యడవిలో♦నెవరు లేని
తలమునఁ గ్రుమ్మఱు ♦ దానిని వంచించి, మొఱ్ఱో యటంచును♦మొఱలు పెట్ట
నాత్మనాశక! యట్టు♦లపహరించితి గాని, యేమిసౌఖ్యముఁ గంటి♦వింతివలన?
ఆ. నమ్మహానుభావు ♦ రాలిపాతివ్రత్య, తపముబలిమి నీవు ♦ దగ్ధుఁ డైతి
పడఁతిఁ దాఁకినపుడె♦భస్మమై పోని నిన్, జూచి యడలి రగ్ని♦సురలుహరియు.

అర్థములు. వసుధకు=భూమికి, ధనమును ధరించునది, శ్రీకిని శ్రీ=లక్ష్మికి లక్ష్మియైనది, అనవద్య=దోషరహితమైన, సర్వాంగి=సమస్తావయవములు గలది, అఖిలశుభాస్పదము=సమస్త శుభములకు నాస్పదమైనది, ఆత్మనాశక = నిన్ను నీవే నాశము చేసికొనినవాఁడా, అట్టులు=మారీచుని మాయామృగముగాఁ బంపి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నీవు సీతాదేవి నేమని తలఁచితివి? ఆమెవలనఁ గదా వసుధకు వసుధయని పేరు వచ్చెను. శ్రీ శ్రీ యయ్యెను. అటువంటి స్త్రీరత్నమగు పతివ్రత, సీత.ఆమె యేయవయవమునందైన నొక్క దోషము కానరాదు.దోషములు లేకుండుటేకాదు, సమస్త శుభచిహ్నములు గలవు. అటువంటి యామెను నీవు భక్తితో నాశ్రయించి యుండిన నెంతో బాగుపడియుందువు. ఆ మార్గము విడిచి మహారణ్యములో నేమూలనో యెవరు లేని చోట నామె యుండఁగా మోసగించి మొఱ్ఱోయని యామె యేడ్చుచుండ మారీచుని పంపి యపహరించితివి. ఇది నిన్ను నీవు నాశము చేసికొను కార్యము కాదా? అపహరించుటొక్కటే కాని యామెవలన నీవు సుఖ మేమి యనుభవించితివి? సుఖమునకు మాఱుగ నామె పాతివ్రత్యముచే కాలిపోయితివి. ఆమె పాతివ్రత్యముచే నే నప్పుడే యేల కాలలేదందువేమో? ఆమెను నీవు దాఁకినపుడే భస్మమై పోని నిన్నుఁజూచి యందఱు దేవతలు భయపడిరి.

కం. పాపం బొనరుచునాతఁడు, పాపములఫలంబు కాల ♦ పక్వం బగుడున్
జేపడఁగ ననుభవించును, ద్రోపాడినఁ బోదు నిజము♦దోషాటవరా! ౨౫౯

తాత్పర్యము

నేను జేసినది పాపకార్యమైనచో నిప్పు దాకిన గాలునట్లు అప్పుడే పాపఫలము నే నేల యనుభవింప లేదందువేమో? అట్లు గాదు. విత్తనము నాటఁగానే ఫలము నోటికి రాదు. కాలపక్వము కావలెను. పాపము చేసినవాఁడా పాపఫలము కాలపక్వమై రాఁగా నప్పు డేమి చేసినను నది పోదు.

తే. శుభముఁ బొనరించువానికి♦శుభముగలుగుఁ, బాప మొనరింపఁదప్పదు♦పాపఫలము
పుణ్యరతుని విభీషణుఁ♦బొందె సుఖము, పాపశీలివి నీ కిట్టి♦పాటుగలిగె. ౨౬౦

తాత్పర్యము స్పష్టము.

కం. అంచితరూపంబున నా,చంచలలోచనను మించు ♦ సౌందర్యవతుల్
పంచన నీకుం గల రది, పంచశరునివలలఁ జిక్కి ♦ పరికింప వహో. ౨౯౪౧

అర్థములు. అంచిత రూపంబునన్ = సౌందర్యముచే, చంచలలోచనను= చలించు కన్నులు గలదానిని - సీతను, పంచశరుని = మన్మథుని, పరికింపవు = చూచినవాఁడవు కావు.

తా త్ప ర్య ము

సౌందర్యమునందు సీతకంటెఁ చక్కనివారు నీకుఁ బ్రక్కనేకలరు. కాని నీవు మదనునివలలోఁ జిక్కిన కారణముచేఁ జూడలేక పోయితివి.

ఆ. కులముచేత నైన ♦ గుణముచేనైనను, జక్కఁదనముచేతఁ ♦ జదురుచేత
నాకు మిన్న గాదు ♦ నాయీడు రాదు వై, దేహి; మోహితాత్మఁ దెలియవైతి.

అర్థములు. చదురు=చాతుర్యము.

తా త్ప ర్య ము స్పష్టము.

ఆ. నింద లేక పోదు ♦ బొందియ న్నానది, నిఖిలభూతములను ♦ నిశ్చయంబ
యెచట సీత! నీ వ♦దెచ్చట? నెట నుండి, మిత్తిఁ దెచ్చికొంటి♦మెలఁతమిషను.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. సీతాపతి రామునితోఁ, జేతోగతి సమ్మదమునఁ ♦ జెలఁగి రమింపన్
పీతసుకృత నగు నే నిఁక, నాతతదుఃఖాబ్ధి మునిఁగి♦యడలఁగవలసెన్. ౨౯౪౪

అర్థములు. పీతసుకృత=పుణ్యము పోయినది, నిర్భాగ్యురాలను.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. మందరకందరంబులను ♦ మానితరాజతశైలభూములన్
సుందరమేరుకూటముల ♦ సుందర ! యక్షవనాళులన్ మణీ
మందిరసీమలన్ సురవి ♦ మానములం దనివార మాలికా
బృందసుచేలయుక్తిఁ జరి ♦ యింతు రమింతు భవత్సమేత నై. ౨౯౪౫

అర్థములు. మందర కందరంబులను=మందర పర్వత గుహాలందును, రాజత శైల భూములన్=కైలాస పర్వత ప్రదేశములందును, మేరుకూటములన్ = మేరు పర్వత శిఖరములందును, యక్షవనాళులన్=చైత్రరథమందును, మణీమందిరసీమలన్=రత్నమయములైన యిండ్లయందును, సురవిమానములన్ = దేవతా విమానములందును, తనివారన్=తృప్తిగా, మాలికాబృంద=పుష్పహారములయు, సుచేల = మంచివస్త్రములయు, యుక్తిన్=కూడికతో, భవత్సమేతనై = నీతోఁ గూడినదాననై.

తా త్ప ర్య ము

మందరాద్రి గుహాలందును కైలాస భూములందును అందమైన మేరు శిఖరములందును కుబేరుని వనములందును రత్నగృహములందును దేవతా విమానము

లందును దృష్టితీర మంచి చీరలు కట్టుకొని హారములు ధరించి నీతోఁ దిరుగు చుండితినిగదా.

కం. కోరినభోగంబుల నే, నా రీతిగ ననుభవించి ♦ హతుఁడవుగా నో
వీర యిటు మూలఁబడితిని, ధీరమణుల సిరు లవేల ♦ క్షణభంగురముల్. ౨౫౪౭

తా త్ప ర్య ము

సీ. హా మహారాజేంద్ర ♦ యా సౌకుమార్యంబు, నా సుభ్రువును మఱి ♦ యా సమున్న
సంబు నా సుత్వక్కు ♦ చంద్రాబ్జరవితుల్య, కాంతి లక్ష్మిద్యుతి ♦ కామనీయ
మా కిరీటోజ్జ్వల ♦ మా దీప్తకుండల, మా మదాకులితలో ♦ లాక్ష మా మ
నోహరస్రగ్ధరం ♦ బా హాసరుచిరంబు, నగు తామ్రవక్త్రి మా ♦ ప్రాణనాథ
ఆ. రామబాణభిన్న ♦ మై మాంసమస్తిష్క, రుధిరయుక్తి మిగుల ♦ రూక్ష మగుచు
రథపరాగసమితి ♦ రహి తప్పి యీగతి, నేలఁ బడిన యదియు ♦ నిర్జితేంద్ర!

అర్థములు. సుభ్రువు = మంచి కనుబొమలు, సమున్నసము = ఎత్తైన ముక్కు, సుత్వక్కు = మంచిచర్మము, చంద్రాబ్జ రవితుల్యకాంతి = చంద్రునకు, కమలమునకు, సూర్యునకు సరిపోలు కాంతి, కామనీయ = అందమైన, మదాకులిత లోలాక్షము = మదముచే చలించు కన్నులు, మనోహర = మనస్సు నాకర్షించు, స్రక్ = హారములను, ధరంబు=ధరించునది, హాసరుచిరంబు=నవ్వుచే చందమైనది, తామ్రవక్త్రిము = ఎఱ్ఱనిముఖము, మాంస మస్తిష్క రుధిర యుక్తి = మాంసము తోను మెదడుతోను నెత్తురుతోను గూడినది, రథపరాగసమితిన్ = వేరి దుమ్ము రాశిచే, రహి = కాంతి.

తా త్ప ర్య ము

ఆ సుకుమారత్వము ఆ కనుబొమ్మలు అ ముక్కు ఆ దేహము సూర్య చంద్రులవంటి యా కాంతి ఆ కిరీటము ఆ కుండలములు మదముచేఁ జలించు నా కన్నులు మనోహరమగు మాలికల ధరించు మెడ ఆచిఱునవ్వుగల యెఱ్ఱని ముఖమా యిప్పు డిట్లు రామబాణములచే ఛేదింపఁబడి మాంసము నెత్తుటితోఁ గూడి పరుషమై రథచక్రములచే రేగిన దుమ్ముతో నిండి కాంతిచెడి యిట్టులున్నది ?

కం. మందమతి నోట నెన్నఁడు, డెందంబునఁ దలఁపనట్టి ♦ డెప్పర మిపు డీ
చందంబున వైధవ్యం, బందితి నది నీకుఁ బ్రాణ ♦ హానిం గూర్చెన్. ౨౫౪౮

తా త్ప ర్య ము స్పష్టము.

కం. జనకుఁడు దానవరాఁజట, ఘనబలుఁడగు వసురభర్త ♦ గాంతుండఁట నా
తనయుఁడు శక్రజితుండఁట, యని మిక్కిలి గర్వపడుదు ♦ ననవరతంబున్. ౨౫౪౯

అర్థములు. డెప్పరము, రూ - డెప్పరము = ఆపద.

కం. కేవలవిఖ్యాతబల, ప్రావీణ్యులు దృప్తవైరి ♦ పరిమర్దనులున్
భీవిరహితచిత్తులు వో, నావార లటంచు మిగులఁ ♦ నమ్మితి నాథా! ౨౫౫౦

అర్థములు. కేవలవిఖ్యాత బలప్రావీణ్యులు=మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన బలమున నేర్పుగలవారు, దృప్తవైరి పరిమర్దనులు = మదించిన విరోధుల దండించువారు, భీవిరహితచిత్తులు=భయములేని మనస్సుగలవారు.

తాత్పర్యము

నా బంధువులందఱు ప్రసిద్ధికెక్కిన బలము యుద్ధమందలి నేర్పుగలవారనియు, గర్వించిన శత్రువుల దండించు వారనియు, భయ మెఱుఁగని వారనియుఁ దలంచితిని గాని యిట్టు లగుట తలంచినదానఁ గాను.

కం. ఇట్టిప్రభావముఁ గలిగిన, దిట్టలు నీ సుతుఁడు నీవుఁ ♦ దెగితిరి నరుచే
నిట్టగుట దలఁప మెన్నఁడు,చిట్టలువో మీరు మనుజు♦చేతం దెగుటల్. ౩౫౫౧

అర్థములు. దిట్టలు = సమర్థులు, చిట్టలు=చిత్రములు.

తాత్పర్యము స్పష్టము.

సీ. నిద్దంపునీలంపు ♦ నీలిడాలు వహించి, ప్రాంశుమహీధరా ♦ భంబు నగుచు
నంగదవైదూర్య ♦ హారస్రగుజ్జ్వలం, బై విహరణకేళి ♦ హారి యగుచు
సంగ్రామతలముల ♦ సందీప్యమానమై, శంపాలతాయుత ♦ జలద మనఁగఁ
బరమాభరణచయ ♦ భావిభాసితమయి, కాంతుల నీనుచుఁ ♦ గ్రమ మైన
ఆ. నీ శరీర మకట! యాశుగసందోహ, శాతశల్యనికర ♦ సంచిత మయి
తాఁకుటకును లేమిఁ ♦ దమిఁ గౌఁగిలించెదు, భాగ్య మైన లేదు♦ప్రాణనాథ.

అర్థములు. నీలిడాలు = నల్లవన్నె, ప్రాంశుమహీధరాభంబు = ఎత్తైన కొండతో సమానము, అంగదవైదూర్యహారస్రగుజ్జ్వలంబై=బాహుపురులతోను వైదూర్యహారములతోను, పూలదండలతోను ప్రకాశించునదియై, హారి = మనోహరము, శంపాలతాయుత జలద మనఁగ=మెఱుపులతోడి మేఘమువలె, పరమాభరణచయ=ఉత్తమ భూషణ సమూహములయొక్క, భా=కాంతిచే,విభాసితమై=ప్రకాశించునదియై, ఆశుగసందోహ=బాణసమూహములయొక్క,శాత=పదునైన, శల్య=ములుకులయొక్క, నికర=సమూహముచే, సంచితమయి=కూడినదై.

తాత్పర్యము

నునుపైన యింద్రనీలములయొక్క నల్లని కాంతిగలిగి ఎత్తైన కొండను బోలి బాహుపురులచేతను, వైదూర్యహారముల చేతను, పూలదండల చేతను ప్రకాశించుచు వినోద విహారముల మనోహరమై యుద్ధభూములందుఁ బ్రకాశించునదియై మెఱుపులతోడి మేఘమో యన నుత్తమ భూషణముల కాంతిచే ప్రకాశించుచు కాంతులు ప్రసరింపఁ జేయుచు మనోహరమైన నీ శరీర మయ్యో! బాణముల పదునైన ములుకులతోఁగూడి తాఁకుటకును సాధ్యపడ కుండుటచేఁ గౌఁగిలించు భాగ్యమైన లేదు.

ఆ. పలుగుముండ్లవోలె॥సాయకంబులు మర్మ,తలము లంటఁదాక ॥ దారుణముగఁ
దెగినసిరలనుండి॥తెఱపిలేక స్రవించు, రక్తమునను మేను॥సిక్తమయ్యె. ౨౫౬౩

అర్థములు. పలుఁగు=పేదుపంది, సిరలనుండి = నరములనుండి, రక్తము= తడిసినది.

తాత్పర్యము

పేదుపంది ముండ్లవలె బాణములు ఆయువుపట్లవఱకుఁ బోయి గ్రుచ్చుకొని యుండుటచేతఁ దెగిన నరములనుండి విరామము లేక కాఱుచున్న నెత్తుటిచేత దేహము తడిసియున్నది.

కం. కట్టా! వాసవసాధన, కుట్టాకంబైన మేను ॥ గురుతరరఘువం
శేట్టుశరంబులఁ బవిహత,కుట్టారమువోలె నేలఁ॥గూలెనె యనిలోన్. ౨౫౬౪

అర్థములు. వాసవసాధనకుట్టాకము = ఇంద్రాయుధముల ఛేదించిన, మేను = దేహము, గురుతర = మిగుల గొప్పవగు, రఘువంశేట్టు = రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడు, పవిహతకుట్టారము = వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన పర్వతమువలె.

తాత్పర్యము

అయ్యో! యింద్రుని యాయుధములను ఛేదించిన దేహము రామచంద్రుని గొప్పబాణములచే వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన పర్వతమువలె యుద్ధములో నేలఁగూలెనా ?

కం. సత్యమ్ముగ స్వప్నం బిది, మృత్యువునకు మృత్యువగుచు ॥ మీఱిన నీవున్
మృత్యువునకు వశపడుదె? యసత్యమువో రామవిభుఁడు॥చంపుట నిన్నున్.

కలలో జరిగినది సత్యమైనను మేలుకొన్న దశలో నది యసత్యమని యెట్లు భ్రమింతుమో యట్లు నిన్ను రామచంద్రమూర్తి చంపుట వాస్తవమైనను మృత్యువునకు మృత్యువగు నీవు మృత్యువునకు వశపడుదువా యని భ్రమించుచున్నాను. కలలో జరిగినవి యసత్యమనుకొనుట భ్రమయైనట్లు నీవు రాముచేఁ జావలేదనుకొనుటయు భ్రమయే.

సీ. సకలజగజ్జాల ॥ సర్వార్థభోక్తను, వైరిహృత్స్ఫోటన ॥ పరుషవక్త్ర
సర్వదిశాపాల ॥ సముదయజేతను, నఖిలజగత్సృష్ఠ ॥ యప్రదాత
నహరాజకార్య ॥ శంకరద్వేషను, లంకాపురీద్వీప ॥ లలితగోప్త
నమదశాత్రవలోక ॥ సంఘాతనిగ్రహీత, శరనివాతకవచ ॥ సంగ్రహీత

ఆ. బహుళయజ్ఞలోప్త ॥ స్వజనయూథపగోప్త, దానవేంద్రహంత॥దతనియంత
లోకచయవిహర్త॥బాకారిమదహర్త బంక్తికంఠధర్త॥ప్రాణభర్త. ౨౫౬౬

అర్థములు. సకలజగజ్జాల = సమస్తలోక సమూహముల యందలి, సర్వార్థభోక్తను = సమస్తమైన యుత్తమ పదార్థముల ననుభవించినవానిని

వైరిహృత్ స్ఫోటన పరుషవక్తృ = శత్రువుల గుండెలు పగులునట్లు మాటలాడు వానిని, సర్వదిశాపాలసముదయజేతను = దిక్పాలక సమూహముల నన్నిటిని జయించిన వానిని, సకలజగత్సుభయప్రదాతఅన్ని లోకములకు విశేషభయము గలిగించిన వానిని, సహరాజతాహార్యశంకరక్షేప్తను=వెండికొండతోడ శివుని నెగురఁజిమ్మిన వానిని, లంకాపురీద్వీప లలితగోప్తృ=లంకాపురద్వీపమును జక్కఁగా రక్షించిన వానిని, సమద = మదముతోఁ గూడిన, శాత్రవలోక సంఘాత నిగృహీత=శత్రుజన సమూహమును నిగ్రహించిన వానిని, శఠనివాతకవచ సంగృహీత=వంచకు లగు నివాతకవచులను రాక్షసులను స్నేహితులుగా సంగ్రహించిన వాఁడు, బహుళ యజ్ఞలోప్తృ = అనేక యజ్ఞములు విఘ్నపఱచినవాఁడు, స్వజన యూథపగోప్తృ=తన బంధువులగు యూథపతులను రక్షించినవాఁడు, దానవేంద్ర హంత = కాలకేయులందు ముఖ్యులైన విద్యుజ్జిహ్వుఁడు (శూర్పణఖ మగఁడు) మొదలగువారిని జంపినవాఁడు, లోకచయవిహర్త=అన్నిలోకములందు సంచరించు వాఁడు, పాకారి మదహర్త = ఇంద్రుని గర్వము నణఁచినవానిని, పంక్తి కంఠ ధర్త=పదితలలు ధరించిన వానిని.

తాత్పర్యము

సమస్త జగముల నందు నుత్తమ పదార్థముల ననుభవించినవాఁడు, శత్రువుల గుండెలు పగులునట్లు మాటలాడువాఁడు, దిక్పాలుర నందఱ జయించినవాఁడు, సమస్త ప్రపంచమును భయపడఁజేసినవాఁడు, కైలాసముతోడ శంకరుని నెగఁజిమ్మినవాఁడు, లంకాద్వీపముఁ బాలించినవాఁడు, గర్వించిన పగవారిని నిగ్రహించినవాఁడు, మాయావులైన నివాతకవచులతో స్నేహముచేసినవాఁడు, అనేక యజ్ఞముల ధ్వంసముచేసినవాఁడు, తన బంధువుల రక్షించినవాఁడు, దానవులందు ముఖ్యులను జంపినవాఁడు, ఏకిక్కలి నియమించువాఁడు, సర్వలోకముల సంచరించిన వాఁడు, ఇంద్రుని మదము హరించినవాఁడు, పదితలలు ధరించినవాఁడు, నాకు ప్రాణభర్తయగువాఁడు.

కం. త్రాతను రణమాయానిర్మాతను పరిపంథియువతి • రాజీబాధా
దాతను స్వజనానందవి, ధాతను మత్పరమ కామ • దాతను వీడున్. ౨౫౫౮

అర్థములు. త్రాతను = ఆశ్రితులకు రక్షకుఁ డగువానిని, రణమాయానిర్మాతను=యుద్ధమందు నత్యద్భుతశక్తులఁ జూపువానిని, పరిపంథియువతి రాజీబాధాదాత = శత్రువుల యొక్క స్త్రీసమూహములకు బాధ కలిగించిన వానిని, స్వజనానంద విధాతను=తన బంధువులకు సంతోషము గలిగించిన వానిని, మత్పరమ కామదాతను=నా యుత్తమ కోరికల నన్నిటిని దీర్చినవానిని.

తాత్పర్యము

ఆశ్రయించినవారిని రక్షించిన వానిని, యుద్ధమునందు మాయలు నిర్మించు వానిని, దేవతాస్త్రీలను అసురస్త్రీలను మనుష్యస్త్రీలను హరించి బాధించినవానిని,తన

బంధువులకు సంతోషము గలిగించినవానిని, నా కోరికల నన్నిటిని దీర్చినవానిని, ప్రియుఁడగు వానిని.

కం. ఉత్తమశాస్త్రశ్రుతిచయు, వేత్తను సద్ధర్మమార్గ ♦ విధిమర్యాదా
ఛేత్తను బుణ్యజనాది,చ్ఛేత్తను సురనరసతీవి ♦ శేషాహర్తన్. ౨౫౫౪

అర్థములు. ఉత్తమశాస్త్ర శ్రుతిచయవేత్తను=ఉత్తమ ధర్మశాస్త్రములను నాలుగు వేదములను దెలిసిన వానిని, సద్ధర్మమార్గ విధి మర్యాదాఛేత్తను=మంచి ధర్మమార్గముఁ దెలుపు శాస్త్రముల మర్యాదను ఛేదించినవానిని, పుణ్యజనాదిచ్ఛేత్తను=పుణ్యము చేయు మనుష్యులు లోనగు వారిని ఛేదించిన వానిని, సురనర సతీవిశేషాహర్తన్=దేవతాస్త్రీలను మనుష్యస్త్రీలను విశేషముగ హరించి తెచ్చిన వానిని.

తాత్పర్యము

నాలుగు వేదములు ధర్మశాస్త్రములు చదివిన వానిని ధర్మశాస్త్రమర్యాద నుల్లంఘించిన వానిని, పుణ్యాత్ముల ఛేదించిన వానిని, దేవతాస్త్రీలను మనుష్య స్త్రీలను హరించినవానిని.

కం. నిను నా ప్రాణేశ్వరు రా,మనిశితశరనిహతుఁ జూచి ♦ మరణింపక నా
తనువునఁ బ్రాణము దాల్చుట, దనుజేశ్వర యింక శాశ్వ♦తమ నా బ్రదుకున్.

అర్థములు. రామనిశితశరనిహతున్=రాముని వాఁడిబాణములచేఁ జంపఁ బడినవానిని.

తాత్పర్యము

ఇటువంటి నిన్ను నా ప్రాణభర్తను రామశరములచే మరణించిన వానిని జూచియుఁజావక నాదేహమునఁబ్రాణములుండుటచే నేనుస్థిరజీవిని,నాకుఁజావులేదు.

తే. మేను నునుటంచతెక్కుల♦మెత్తలందు, వ్రాల్చి హాయిగ నిదురించు♦రమణ నీవు
రేణుపాటల మైన యిలా♦క్షోణియందు, నేమిసుఖ మని పన్నుండ ♦ నెత్తికొంటి?

అర్థములు. నునుటంచతెక్కుల మెత్తలందున్=మెత్తని హంసతూలికా తల్పములందు, రేణుపాటల=దుమ్ముచే నెఱ్ఱనైన, పన్నుండన్=పండుకొన, ఎత్తికొంటివి = ప్రయత్నించితివి.

తాత్పర్యము స్పష్టము.

కం. సౌమిత్రిశరంబుల సం,గ్రామంబున శక్రజిత్తుఁడు ♦ కడచుట విని నే
భూమిఁ బడితి ననుకొంటిని, నీ మరణముచేత నేఁడు♦నీఱైతిఁ బతీ! ౨౫౬౧

అర్థములు. కడచుట=చచ్చుట, నీఱు=బూది.

తాత్పర్యము స్పష్టము.

కం. చుట్టములు లేరటంచును, బుట్టదు వో చింత నాకుఁ ♦ బురుభోగంబుల్
నెట్టన యొసఁగెదినిను విడి, యెట్లోకో శాశ్వతసమల్ స♦హింతు న్వసటన్.

అర్థములు. శాశ్వతసమల్=అనేక సంవత్సరములు.

తాత్పర్యము స్పష్టము.

కం. నేను సహధర్మచారిణిఁ, గానా? నే నిట్లు వగవఁ ♦ గడు దవ్వాయి పో
రానియెడ కేగుటలు దగ, వౌనా? నిను విడిచి బ్రదుక ♦ నగునా నాకున్.

అర్థములు. సహధర్మచారిణి=నీతోడ ధర్మమును జేయుదానను.

తాత్పర్యము స్పష్టము.

కం. దీన నయి దుస్సహవ్యధ,చే నిటు పలవించుచున్నఁ ♦ జే విడిచి చనం
గా నాయమె? యేడువకే. మానినియుని ప్రీతి నొక్క ♦ మాటన రాదా ?

అర్థములు. దుస్సహవ్యధచేన్=సహింపరాని బాధచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. కోమలనీలదేహ! యవ ♦ కుంఠనమున్ విడనాకి కాల్నడన్
నీమహిషిం బురంబు విడి ♦ నే నిటువచ్చినఁ గోపగింప వే
లా మనుజాశనేంద్ర! ప్రియు ♦ రాండ్రు ముసుంగులు వీసి సిగ్గువో
నీమెయి రాఁగ నింద అది ♦ యేలొకొకిన్క వహింప వింతయున్? ౨౫౬౫

అర్థములు. అవకుంఠనము = ముసుఁగు, మహిషిన్ = పట్టపురాణిని, సిగ్గువోన్=సిగ్గువిడిచి, ఈమెయిన్=ఈ విధముగ.

తాత్పర్యము

మృదువైన నల్లని దేహము గలవాఁడా! నీ పట్టపురాణినగు నేను ముసుఁగు వదలి కాలినడకతో నూరు విడిచి పదుగురు చూచుచుండు చోటికె వచ్చితినిగదా, ఏల నీవు కోపింపవైతివి? నేనొకతెనేకాదు నీకు బ్రియులైనవారందఱు నిట్టులే ముసుఁగులుదీసి సిగ్గువిడిచి యీ విధముగ రాఁగా నేల కోపింపవు?

దీనివలన స్త్రీలు ముసుఁగులులేక వెలికి రాఁగూడదను నాచారము క్షత్రియ స్త్రీలయందు ఐశ్వర్యము పరువు పట్టి వచ్చినదని యేర్పడుచున్నది. సిగ్గుమాలిన శూర్పణఖ లెట్లుదిరిగినను నెవ రేమనగలరు? ఈ యాచారము భర్తృసన్నిధియందు లేదనిన ౨౫౬౫ వ పద్యమువలన నేర్పడుచున్నది. ఈ యాచారమునకుఁ బ్రభుత్వము, ఐశ్వర్యము, పరువు కారణమని మఱికొంద ఱట్టి స్థితియం దున్నవారు పాటించుటచేఁ దెలిసెడి. తక్కినవారియం దిది దురాచారము. ఐశ్వర్యము, ప్రభుత్వము కొన్ని దురభిప్రాయములకుఁ గారణము లగుచున్నవి. ప్రభువులు ధనికులు తమకాళ్ళఁ దాము నడచుటకూడఁ బరువునకు హానియనియే మూఢలోకములెలంపు.

కం. నీ లాలించు జనంబులు, ఖేలానసహచరులు నాథ ♦ కెలఁకుల నేడ్వన్
లాలింప వూఱడింపవు, పోలునె నీ కిట్టి కఠిన ♦ బుద్ధి హృదీశా ! ౨౫౬౬

అర్థములు. ఖేలానసహచరులు = కూడ నాడుకొనువారు, కెలఁకులన్ = ప్రక్కల.

తాత్పర్యము స్పష్టము.

సీ. పరమపాతివ్రత్య ♦ భవ్యశీలలఁ గుల, పాలికలను ధర్మ♦పరల భవ్య
వృద్ధశుశ్రూషణా♦విరతచిత్తల నీవ, యెందఱనో పతి♦హీనురాండ్రఁ
జేసితి వా సతు ♦ లీసున దుఃఖంబు, గరిమను దిట్టిరి ♦ కఠినఫణితి
వారిశాపము దాఁకి ♦ వైరిచేఁ జెడితివి, వా రెట్లు తిట్టి♦రాపగిది నయ్యెఁ
తే. బరమసాధ్వుల కన్నీరు♦ధరణిఁ బడవు, మనసు నొప్పించువారిచే♦టువకుఁగాక
యనెడు లోకప్రవాదంబు♦ప్రాణనాథ!, సత్యమయ్యెను నీయందు♦జగతియందు.

అర్థములు. పరమ పాతివ్రత్య భవ్యశీలలన్ = ఉత్తమ పతివ్రతా ధర్మ మనెడి శుభాచారముగలవారిని, కులపాలికలను=కులస్త్రీలను. 'కులస్త్రీ కులపాలికా' అమరము. వ్యభిచారములేక వంశమును రక్షించువారు కులస్త్రీలు, వ్యభిచరించు వారు కులటలు, ధర్మపరలన్=పాతివ్రత్యమె పరమధర్మ మని యుండువారిని, భవ్య వృద్ధ శుశ్రూషణావిరతచిత్తలన్=శుభకరులైన పెద్దల (అత్తమామల)శుశ్రూష చేయుటయందు నెడఁదెగని మనస్సుగల వారిని, ఈసునన్=కోపముతో.

తాత్పర్యము

ఉత్తమ పతివ్రతలను కులస్త్రీలను పెద్దల సేవచేయు వారిని స్త్రీలను నెంద ఱనో వారిని భర్తలను జంపి విధవలఁ జేసితివి. ఆ పతివ్రతలు కోపించి కఠిన వాక్కుల మావలెనే నీ భార్యలు విధవ లగుదురు గాక యని శపించిరి. వారి శాపముచే నీవు చచ్చితివి. వా రెట్లు చెప్పిరో యట్లులే మేము విధవల మైతిమి. ఉత్తమ పతివ్రతల కన్నీరు ఏనాఁటికైన నా కన్నీరు కారఁజేసినవారి నాశము చేయక వదలదు. పతివ్రతల కంటినీరు వ్యర్థముపోదు అను వాక్యములు లోకమున వ్యాపించి యున్నవి. అది నీ విషయమున సత్యమయ్యెను.

కం. శూరుఁడవై రణముల భుజ,వీరత గెలిచితివి నిఖిల ♦ విశ్వము నయ్యో
భీరుగతి శూరమానీ, నారీచౌర్యంబు సేఁత ♦ నైచ్యముగాదే. ౧౫౬౦

అర్థములు. భీరుగతిన్ = పిఱికివానివలె, శూరమానీ = శూరుఁ డని తలఁచుకొనువాఁడా, నారీచౌర్యంబు సేఁత = స్త్రీని దొంగిలించు కార్యము, నైచ్యము= క్షుద్రము గదా.

తాత్పర్యము

నీవు శూరుఁడవై 'లోకమంతయు భుజబలముచే గెలిచితిని, కావున నేను శూరుఁడ' నని నీవు తలఁచితివి. కాని నీవు నిజముగ శూరుఁడవు కావు. నిజమైన శూరుఁడవే యైన పక్షమున పిఱికివానివలె నాఁడు దానిని దొంగిలించు నంత నీచకార్యము చేయుదువా? మగవారికి భయపడిగదా నీవట్లు చేసితివి? దానినే వివరించి చెప్పుచున్నది.

సీ. హరిణమిషంబున ♦ నాశ్రమంబునుండి, దాశరథిని దవ్వు ♦ దలఁగఁ జేసి
జానకిఁ దెచ్చితి ♦ మానధనా! యిది, పిఱికితనానకు ♦ గుఱుతు గాదె
భీమాహవముల నేన్ ♦ బిఱికివి గావని, సత్య మే నెఱుగుదు ♦ సాహసాంక
యట్టి నీ విటు సేఁత ♦ యరయ దౌర్భాగ్యసు,పక్వలక్షణమయి ♦ పరిణమించె

ఆ. సత్త్రికాలవేది ♦ యైన నాదుమఱంది, నీవు సీతఁ దేర ♦ నిశ్వసించి
చూచి సత్యభాషి ♦ శుభచరిత్రుఁడు దాన, నసురతతికిఁ జేటు ♦ పొసఁగుననియె.

అర్థములు. హరిణమిషంబునన్=జింక నెపమున, "కంధరాదులకు మువర్ణకంబును బహుళంబుగ నగు" సు. వ్యా-తత్స. ౨౩. మిషాశబ్దము కంధరాదులలోఁ జేరినది కావున మిష, మిషము అని రెండు రూపంబులుగలవు, భీమాహవములనేన్=భయంకర యుద్ధమందు, దౌర్భాగ్య పక్వలక్షణము = నిర్భాగ్యదశ పండిన గుర్తు, త్రికాలవేది=కడచిన, జరుగుచున్న, జరుగఁగల కాలములం దేవేవి జరుగునో యవి తెలిసినవాఁడు.

తాత్పర్యము

జింక నెపము పెట్టి రామచంద్రుని నాశ్రమమునుండి దూరముగాఁ బోఁజేసి సీతను దెచ్చితివి. మానమే ధనముగాఁ గలవాఁడా! యిది పిఱికితనమునకు గుఱుతు గాదా? మానధనుఁడిట్టి యవమానకర కార్యము చేయునా? పిఱికివైన నన్ని యుద్ధము లెట్లు చేసితివందువేమో? నిజమే, నీవు భయంకర యుద్ధములందు పిఱికివి కావు నిజము నే నెఱుఁగుదును అట్టివాని కిట్టి దుర్బుద్ధి పుట్టుటకు కారణము నిర్భాగ్యదశ పక్వమై చెడుకాలము సమీపించుటచేతనే యని తలఁచెదను. అట్లు గాకున్న నట్టి వాని కిట్టి బుద్ధి యేల పుట్టును? నీ వే నాఁడు సీతను దెచ్చితివో యానాఁడే భూత భవిష్యద్వర్తమానములు తెలిసిన నామఱఁది సత్యవాదియు మంచి నడవడిగల విభీషణుఁడు నిట్టూర్పు విడిచి దీనితో రాక్షసులు నాశమగుదురని చెప్పెను. దైవ తంత్రము దప్పింప విభీషణుఁ డెంతెంతో ప్రయత్నించెనుగాని యది తప్పినదికాదు.

కం. కామక్రోధంబులచే, నీమెయి సమకూరె నింత ♦ కీవే మూలం
బామూలము చెడె నసుర, స్తోమము దిక్కేఁది లేక ♦ తూలించితివే. ౨౫౦

తాత్పర్యము

ఇంత యనర్థమునకు నీవు దుష్కామమునకు లోఁబడుట, హితము బోధించిన వారియందుఁ గోపపడుట కారణములు, కావున నీవలననే రాక్షసు లందఱు సమూలము నాశమైరి.

తే. నీవు సడిసన్నవాఁడవు ♦ నిఖలజగతి, బలపరాక్రమముల నీకు ♦ నగవఁ దగద
యనుచు నెఱుఁగుదునైనను ♦ నాఁడు దానఁ, గాన నాబుద్ధి దుఃఖాబ్ధి ♦ లీనమయ్యె.

అర్థములు. సడిసన్నవాఁడవు=కీర్తి కెక్కిన వాఁడవు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఓగో బాగో యొనరిచి, నీగతికిం జనితి వీవు ♦ నేనో నీపం
యోగంబుఁ బాయుకతమున, నాగతి యే మనుచు నగతు ♦ నాకైనాథా!

తాత్పర్యము

నీవు మేలే చేసితివో! కీడే చేసితివో అయినదానిని గుఱించి యిప్పుడు తప్పొప్పు లెన్నిన నేమి ప్రయోజనము? చేసిన దాని ఫల మనుభవింప నీగతికి నీవు

పోయితివి. కావున నీకై నేను దుఃఖింపలేదు. నీ కూటమి వదలిన నాగతి యేమని నేను నాకై దుఃఖించుచున్నాను. లోకములో నెవ్వరు చచ్చిన వారికై యేడుచు వారు లేరు. చచ్చిన వారివలనఁ దమకు లభించు చుండిన, లభింపఁగల సుఖము, సంతోషము, లాభము పోయెనే యని తమకై యేడ్చువారే.

సీ. నీహితకాముల ♦ నీతివాక్యాళికిఁ, జెడచెవినిచ్చితి ♦ వీరవర్య !
శుభము వచించిన ♦ సోదరపాళికి, మాఱుమోము నిడితివి ♦ మహితశౌర్య !
హేతుయుక్తంబుగ ♦ నీతియుతంబుగ, శ్రేయస్కరంబుగఁ ♦ జెప్పలేదె
తిన్ననిమాటల ♦ నెన్నియోమాఱులు, చిన్నతమ్ముఁడు చెవి ♦ యిచ్చి వింట
తే. కొఱఁత లేకుండ మారీచ♦కుంభకర్ణు,లపుడె నాతింద్రజియును నీకు♦నాప్తుఁ జెవులఁ
గూరిపోయరె? వినవైతి♦వారిపల్కు, బలమదంబున, దాన నీ♦ఫలము గలిగె.

అర్థములు. హితకాముల=మేలు గోరువారియొక్క.

తాత్పర్యము స్పష్టము.

తే. కాలజీమూతసంకాశ ♦ కనకచేల, తనువు సర్వంబు నెత్తుటఁ ♦ దడిసియుండ
ధరణి నిద్రించుగతిఁ బండి♦దైన్యగరిమ, నేఁడు నాతోడ మాటాడ♦వేల చెపుమ!

అర్థములు. కాలజీమూతసంకాశ=నల్లని మబ్బుతో సమానమైన దేహకాంతి గలవాఁడా! కనకచేల=బంగారు సరిగ వస్త్రము ధరించినవాఁడా, తనువు=దేహము.

తాత్పర్యము స్పష్టము.

కం. సాహసవీర్యధనుండును, నాహవమున విజయి దక్షుఁ ♦ డర్దితశత్రు
వ్యూహుండగుమాల్యవంతుని,దౌహిత్రుఁడ యేల చూడఁ♦దలఁపవు నన్నున్.

అర్థములు. సాహసవీర్యధనుఁడు=తెంపు బలము ధనముగాఁ గలవాఁడు. విజయి=గెలుపుగొనువాఁడు, దక్షుఁడు = ఏకార్యమైన సమర్థించి చేయువాఁడు, అర్దితశత్రువ్యూహుఁడు = బాధింపఁబడిన శత్రుసమూహము గలవాఁడు, దౌహిత్రుఁడవు = కూఁతు కొడుకవు, రావణుఁడు మాల్యవంతుని తమ్ముని దౌహిత్రుఁడు, కావున మాల్యవంతునకు దౌహిత్రుఁడే ఎక్కువ ప్రసిద్ధినిబట్టి యతనిపేరు చెప్పఁబడెను.

తాత్పర్యము స్పష్టము.

కం. లే లెమ్ము క్రొత్తపరిభవ, మీ లంకాపురికిఁ గలిగె ♦ నిపు డినరశ్మల్
చాలఁగ నిచె యెల్లెడలన్, వాలాయము చొచ్చె నైఁప♦వచ్చునె సీతున్ ?

అర్థములు. క్రొత్త పరిభవము = ఇదివఱ కెన్నఁడు లేని యవమానము, అనఁగా రావణు నాజ్ఞలేక లంకయందు సూర్యుఁ డెండ గాయ భయపడుచుండెను. ఇప్పు డతని యాజ్ఞ లేకయే విచ్చలవిడి కాయుచున్నాఁడు,ఇనరశ్మల్=సూర్యకిరణములు, వాలాయము=అడ్డము లేక.

ఇట్లు చెప్పుటచే నిది యుదయకాలమని యేర్పడుచున్నది. ఎల్లెడల నిన రశ్ములు వ్యాపించెననుటచే తొమ్మిదిగడియల ప్రొద్దై యుండవచ్చును.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. నీరజబాంధవాభ మయి ♦ నిర్జితసర్వవిపక్షజాల మై
భూరివిభూషణాంచితము ♦ పుష్పతతిన్ సతతార్చితంబు నై
ఘోరము నై పురందరున ♦ కున్ శతకోటి యనంగ నీకుఁ జె
న్నారు సముజ్జ్వలంపుఁ బరి ♦ ఘాయుధముం జెడ వేయితునకలై. ౩౫౭౮౮

అర్థములు. నీరజబాంధవాభము=సూర్యునితో సమానమైన కాంతిగలది, నిర్జిత = జయింపఁబడిన, సర్వ విపక్షజాలము = సమస్త శత్రుసమూహము గలది, భూరివిభూషణాంచితము=బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినది, అనేకములగు సొమ్ములచే నలంకరింపఁబడినది, భూరి స్వర్ణే బహౌ త్రిషు ॥నానా॥౨౨.సతత=ఎల్లప్పుడు, అర్చితంబు=పూజింపఁబడినది, పురందరునకున్ = ఇంద్రునకు, శతకోటి= వజ్రాయుధము, పరిఘాయుధము=ఇనుపకట్ల గుదియ.

తా త్ప ర్య ము

సూర్యునితో సమానమైన కాంతిగలదియు, సర్వశత్రువుల జయించునదియు, అనేకములైన బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినదియు ప్రతిదినము పూలచేఁ బూజింపఁబడినదియునై భయంకరమైనదియునై యింద్రునకు వజ్రాయుధమువలె నీకు నొప్పుచున్న పరిఘాయుధము వేయి తునకలై చెడినది.

కం. ఏమీ ప్రియురాలన సం,గ్రామమహిం గ్రుచ్చి నీవు కౌఁగిట నాతో
నేమియుఁ బలుకక యప్రియ, భామినివలెఁ జూడ నీకు ♦ భావ్యమె చెపుమా?

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఎట్టిహృదయ మిది ఛీఛీ, పట్టని వేతునుక లగుచుఁ ♦ బగులదు నిన్నీ
పట్టున రణనిహతుం గని, కట్టా యని స్నేహగరిమఁ♦గనునీ రురలన్. ౩౫౭౮౯

తా త్ప ర్య ము స్పష్టము.

ఆ. మనసు నిలుపలేక ♦ మయునితనూభవ, యసురనాథుపక్ష♦మందు వ్రాలె
మూర్ఛ తన్ను మిగుల♦ముంప సంధ్యారక్త, జలదమందు వెలుఁగు♦శంపవోలె.

అర్థములు. సంధ్యారక్తజలదమందు=సాయంకాలమున నెఱ్ఱనైన మేఘము నందు. శంపవోలెన్ = మెఱుపువలె, నెత్తుటిచే నెఱ్ఱనైన రావణుని వక్షమందు వ్రాలెను.

తా త్ప ర్య ము స్పష్టము.

చ. సవతులు హా! యటంచు నల ♦ సాధ్విని జుట్టి నితాంతశోకభా
రవశమునన్ మునుంగుచును ♦ రామ! యొఱుంగవె రాజ్యలక్ష్మియున్
భువనచయస్థితుల్ దశల ♦ పోకలతోడన మాఱుచుంట య
ధ్రువము లటంచు నిబ్బరముఁ ♦ దొయ్యలి! తాల్పుము మమ్ముఁ దేర్పుమీ.

అర్థములు. వామ=స్త్రీ, ఇచ్చట సంబోధన ప్రథమ.

తా త్ప ర్య ము

ఇట్లు పడిన మందోదరిని జుట్టుకొని హా హా యని యేడ్చుచు నధిక శోకమున మునుఁగుచు నామెనుజూచి యిట్లనిరి. సుందరీ! రాజుల సంపత్తు, భువనస్థితిగతులు, ననుభవించువారి దశలు మాఱు కొలఁది మాఱుచుండుననియు నిలుకడగా నుండు నవి కావనియు నీ వెఱుంగవా? కావున నీవు ధైర్యము తెచ్చుకొని మమ్ము సమాధానపఱుపుము. నీ వే యేడ్చుచుండిన మాగతి యేమి?

కం. అను చెలులకు నతి యయ్యో, యని ధారగఁ గనులఁ గాఱు ♦ నంబువులం దా
స్తనములఁ దడుపుచు నిజపతిఁ, బనవి పనవి యేడ్వ రామ♦భద్రుం డంతన్.

అర్థములు. అంబులన్ = నీళ్ళచే.

తా త్ప ర్య ము స్పష్టము.

—♦విభీషణుఁడు శ్రీరామునితో రావణుఁడు సంస్కారార్హుఁడుకాఁడని చెప్పుట♦—

కం. అయ్యా!విభీషణ నీ వీ,తొయ్యలులం గడకుఁ బంచి ♦ తూర్ణము నీ య
న్నయ్యకు సంస్కారంబులు సెయ్యమున నొనర్పు మన్న♦నెమ్మదిఁ దనలోన్.

అర్థములు. తొయ్యలులన్=స్త్రీలను

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఆలోచించి విభీషణుఁ, డోలిన్ ధర్మంబు తెఱఁగు ♦ నూహించి ధరా
పాలానువృత్తికై హిత,శీలుం డుత్తర మొసంగు ♦ శ్రీరామునకున్. ౨౯౦౮

అర్థములు. ఆలోచించి=ఈ సంస్కార విషయమున రామచంద్రుని వాస్తవాభిప్రాయ మెట్టిదో నేను దెలిసికొనక ముందు మించి యిదివఱకు నేను సంస్కారములు చేయుదునా యని యడిగితిని, చేయుమని చెప్పెనుగాని యది వలదనిన నే నే మనుకొందునో యని దాక్షిణ్యవశమునఁజెప్పెనో లేక యది వాస్తవాభిప్రాయమో తెలిసినది కాదు, అని యాలోచించి ధర్మంబు తెఱఁగు నూహించి ఏది ధర్మము? అన్న యను నభిమానముతో రామచంద్రమూర్తి యేమైన ననుకొననీయుని సంస్కారము చేయుట ధర్మమా? రామచంద్రుని యిష్టప్రకారము పోవుట ధర్మమా? నీళ్ళు విడుచువాఁడు లేక చచ్చిన యన్నకు సంస్కారమును చేయకపోయితినా లోక మే మనును? ఎంత కఠినుఁడు? చచ్చిన వానిమీఁదఁ బగ సాధించుచున్నాఁడు అనరా? సంస్కారములు చేసితినేని, చూచితివా నాయొద్దఁ జేరనే కాని నా విరోధిమీఁద నభిమానము వీనికిఁ బోయినది కాదు. ఏదో తన కార్యార్థమై చేరినాఁడే కాని యభిమాన మా ప్రక్కనే యున్నది యని రామచంద్రమూర్తి యనుకొనునేమో యని వితర్కించి సంస్కారములు చేయుట సామాన్యధర్మము. రాముని యిష్టప్రకారము పోవుట విశేషధర్మము. కావున ధరాపాలనానువృత్తికై =

రామచంద్రుని యభిప్రాయ మనువర్తించుటే బాగని తీర్మానించుకొని హితశీలుఁడు=మేలగు దానిఁ జేయు స్వభావము గలవాఁడు.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా నాలోచించి విభీషణుఁడు ధర్మ మేది యని యూహించి రాముని చిత్తవృత్తి ప్రకారము పోవుటే ధర్మమని తీర్మానించుకొని యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

సీ. ధర్మవృత్తంబులు ♦ దలఁచ ద్రోసినవాఁడు, కరుణావిదూరుండు ♦ గల్లరీఁడు
గలుషచిత్తుం డన్య♦కాంతాభిమర్శియు, భ్రాతృరూపముఁ గొన్న♦పరమవైరి
సకలాహితేరతుండు ♦జగదుపద్రవకారి, వీనికా నే నిష్ఠ ♦ విధిహితముగ
సంస్కారములు సేయఁ?♦జాల నావనికిని, నన్న యూటను బూజ♦కర్హుఁ డైన
తే. సంస్కృతికిఁ గాఁడు నే నది♦సలుపకున్న, నెట్టివారలు నను మున్ను♦కట్టిఁడి యని
తిట్టువారలో వార లీ♦చెట్టగుణము, విన్న నను మెచ్చువార లు ♦ క్ష్మితలేంద్ర!

అర్థములు. ధర్మవృత్తంబులు= ధర్మముతోఁగూడిన నడవడులను,కరుణావిదూరుండు = దయలేనివాఁడు, కల్లరీఁడు = అసత్యము లాడువాఁడు, కలుషచిత్తుండు=పాపపు మనస్సు గలవాఁడు, అన్యకాంతాభిమర్శియు=ఇతర స్త్రీలను బాధించిన వాఁడు, భ్రాతృరూపము=అన్నయను నాకారము. పరమవైరి = నన్ను జంపఁదలఁచిన విరోధి, సకలాహితేరతుండు =అహితములైన కార్యము లన్నియుఁ జేయుటయందుఁ బ్రీతిగలవాఁడు, జగదుపద్రవకారి=ప్రపంచమునకు నుపద్రవము కలిగించినవాఁడు, విధిహితముగన్=శాస్త్రమునఁ జెప్పఁబడినట్లు, శాస్త్రమునందు విశ్వాసము గౌరవము లేనివానికి శాస్త్రీయకర్మ మేల? సంస్కృతికిన్=శాస్త్రోక్త సంస్కారమునకు, కట్టిఁడి=మర్యాద హీనుఁడు, కట్టు+ఇఁడి=నియమహీనుఁడు.

తా త్ప ర్య ము

ధర్మప్రవర్తనము వదలినవాఁడు, దయలేని చోరుఁడు, అసత్యవాది, పాపపు మనస్సు గలవాఁడు, ఇతర స్త్రీల బాధించినవాఁడు, వానికి నన్న యేకాని నడవడియందు నాకు గొప్ప శత్రువు అహితకార్యము లన్నియు జేయుటయందుఁ బ్రీతి గలవాఁడు, ప్రపంచమున కుపద్రవము కలిగించిన వాఁడు, ఇట్టి వీనికా యిప్పుడు నేను శాస్త్రప్రకారము సంస్కారములు చేయవలయును. నేనాపని చేయలేను, అన్నగదా యందువేమో? అన్నయని లౌకిక గౌరవములు చూపుదును గాని పారలౌకిక కర్మములకు వీఁ డర్హుఁడుగాఁడు. నేను వీని కుత్తరక్రియలు చేయకున్న నన్నిపు డెవ్వరు శాస్త్రనియమము మీఱినవాఁడని తిట్టుదురో వారే వీని నడవడి తెలిసిన పిమ్మట విభీషణుఁడు సరియైన పనియే చేసినాఁడు, పతితునకు శాస్త్రీయ సంస్కారము లెక్కఁడ వని నేను జేసినది సరియని మెచ్చుకొందురు.

కం. అనవుడు నాతనిపలుకులు, విని పరమప్రీతి ధర్మ ♦ భృద్వర్యుఁడును వా
    క్యనిపుణుఁ డగు సీతాపతి, చనవున నోడికారి నసురసత్తము ననియెన్.

అర్థములు. పరమప్రీతిన్ = మిక్కిలి ప్రీతితో, పరమ్+అప్రీతి = చచ్చిన తరువాతఁ గూడ వీఁడు పగసాధించెద ననుచున్నాఁడే, వీఁడు సంస్కరింప కుండిన పరలోకమున వాని కెంతకీడో, ఆకారణమునఁ దన కెంతకీడో యాలోచింపలేకున్నాఁడే యని మిగుల నప్రీతిచే, ధర్మభృత్ =(౧) విల్లును పట్టెడివారి,(౨) ధర్మమును భరించు వారియందు, వర్యుఁడు=శ్రేష్ఠుఁడు, వాక్యనిపుణుఁడు = మాటలయందు నేర్పరి, నోడికారి=మాటలు చెప్పుటయందు సమర్థుఁడు.

## తాత్పర్యము

అని చెప్పఁగా నా పలుకులు విని యతని యందుఁ బ్రీతియుఁ జచ్చిన వాని మీఁదఁ బగసాధింపఁ బూనె నని యప్రీతియుఁ గలవాఁడై ధర్మమును (వింటిని, ధర్మమును) భరించువారియందు శ్రేష్ఠుఁడును మాటలయందు చమత్కారము గల రాముఁడు చనవుచే మాటలు చెప్ప సమర్థుఁడగు విభీషణున కిట్లనెను. ఇరువురు మాటలయందు సమర్థులు. విభీషణుఁడు రావణుఁడు సంస్కారార్హుఁడు కాఁడనుటకు నెన్ని చెప్పవలయునో యన్నియు యుక్తియుక్తముగఁ జెప్పుచున్నాఁడు. రామచంద్రమూర్తియు దాని ప్రత్యాఖ్యానము చేయుచున్నాఁడు.

కం. నాకుం బ్రియ మగుకార్యము, నీకుం దగుఁజేయ జయము ♦ నీమహిమను గా
    దే కలిగె నాకుఁ గావున, నీకు హితము నేను జెప్ప ♦ నెఱి యసురేంద్రా !

నాకుం బ్రియమగు కార్యము — అనుటచే నేను రావణుని సంస్కరించిన రామున కప్రియ మగునేమో యను సందేహము నివర్తించెను. 'నీకు హితము నేను జెప్ప నెఱి'—అనుటచే నీమేలు కోరి నేను జెప్పుచున్నా ననుటచే భయమువదలెను.

## తాత్పర్యము

విభీషణా! నీకు బ్రియము గాని యప్రియముకాని నేను జెప్పినది వినుము. ఆ ప్రకారము చేయుట నీకుఁదగిన కార్యము. నా మాట ధిక్కరించుట నీకుఁదగదు. నేను జేయరాని పని చేయుమని చెప్పిన నే నిట్లు చేయుదు వందువేమో? ఈయుద్ధమందు నీవు చేసిన సాహాయ్యమువలన నాకు జయముకలిగెను. నాకిట్టి మేలుచేసిన నీకు హితమైనది జెప్పుట నీతి. కావున నాకుఁ బ్రియమా యప్రియమా యని నీవాలోచింపరాదు. నాకుఁ బ్రియమని నీ కహితమైనది నేను జెప్పరాదు. కావున నీ మేలుగోరి నేను జెప్పినట్లు చేయుము.

చ. ఎఱుఁగుదు నే, నధర్మమున ♦ కేమియుఁ గొంకఁ, డసత్యమాడఁగన్
    వెఱవఁడు, రాక్షసేంద్రుఁ డవి ♦ నీతి, యుఁబైనను వీర్యవంతుఁడున్
    నెఱసరి తేజువాఁడు సుర ♦ నేతృముఖాదుల చేతనైన నో
    టఱఁ డని లోకరావణుఁ డ ♦ హార్యసుధీరుఁడు కేవలుం డొకో. ౨౫౦౮

## తాత్పర్యము

రావణుఁడు సంస్కారార్హుఁడు గాఁడు, పతితుఁ డనుటకు నీవు చెప్పిన కారణములు నేను దప్పనను, అవి నే నెఱుఁగనివాఁడనుగాను. అతఁడు అధర్మము నకు భయపడఁడని అసత్యవాదియని నీతిమాలినవాఁడని నే నెఱుఁగుదును. తెలిసియె నీవు వానిని సంస్కరింపుమని చెప్పితిని. ఏల చెప్పితివందువా? పతితునకుఁ బరలోక క్రియలు లేవనుట లోకసామాన్యవిధమునఁ జచ్చినవాని విషయమె కాని ధర్మ యుద్ధమందు న్యాయ్యరీతిఁ జచ్చిన వీరునివిషయము కాదు. వాఁడు బలశాలి, శూరుఁడు, తేజస్వి, ఇంద్రాదులకైన వెనుదీయువాఁడు కాఁడు. అట్టి లోకరావ ణుఁడు పర్వతమువంటి ధైర్యశాలి, సామాన్యుఁడా, యుద్ధమందుఁ జచ్చెను. వీరస్వర్గము వానికి లభింపవలయును. నీవు వానికి సంస్కారము చేయకున్నఁ బ్రేతత్వము పోదు. ప్రేతత్వము పోకున్న స్వర్గప్రాప్తి లేదు. వాఁడు కష్టపడి సంపాదించిన స్వర్గసుఖమును సంస్కరింపని నీవు విఘ్నపఱుచుటేగాక ప్రేతత్వబాధ కలిగించినవాఁడ వగుదువు. అది నీకు శ్రేయస్కరముకాదు. చచ్చినవానిని బ్రీతి గలవాఁడుకదా సంస్కరింపవలెను. వానియందు నాకుఁ బ్రీతిలేదు. నాయందు వానికిఁ బ్రీతిలేదు. ప్రీతి లేకుండుటే గాక యిరువురము విరోధుల మందువేమో.

కం. వైరము మరణాంతము మన, కారియముల్ దీరె మీఁది♦కార్యంబుల సం
స్కారాదులఁ దీర్పుము నీ,కారయ నితఁ డెట్టివాఁడొ ♦ యట్టిఁడ నాకున్.

చూ. పద్యము ౨౨౦౬. తాత్పర్యము

ఆ పద్యమునే మరలఁ జెప్పనేల యనిన అప్పుడు నేనిచ్చకములకై నీకుఁ జెప్పలేదు. పరమార్థబుద్ధితోఁ జెప్పితిని. ఆ మాటలే యిప్పుడు చెప్పెదను. నా యభిప్రాయము మార్చుకొనఁ గారణము లేదు. అప్పుడు నే నే యభిప్రాయ ముతోఁ జెప్పితినో యని సందేహింపఁ నీకుఁ గారణములేదని తెలుపుటకే.

కం. కావునఁ బంక్తిగ్రీవుడు, నీవలనన్ విధిహితముగ ♦ నిఖిలక్రియలన్
గోవిద! యందఁగ నర్హుఁడు, పావనయశమబ్బు నీకు ♦ భావింపు మెదన్.

అర్థములు. విధిహితముగన్ = శాస్త్రప్రకారము, ఎంత పాపాత్ముఁ డైనను వీరరణమునఁ జచ్చినవానికి వీరస్వర్గము కలదు. కావున వాఁడు సంస్కా రార్హుఁడు 'రావణువంటి పాపికి విరోధికి సంస్కారములు చేసినాఁడు, విభీషణుఁ డెంత సాధు'వను కీర్తి నీకుఁ గలుగును. కాని అపకీర్తి రాదు.

### —♦ విభీషణుఁడు రావణునకు దహనాదిక్రియలు దీర్చుట ♦—

సీ. అనుడు విభీషణుఁ డా మాట లాలించి, సంస్కారమునకయి ♦ జతనపడుచుఁ
జందనకాష్ఠసం♦చయములఁ జితిఁ బేర్చి, పద్మకోశీరము ♦ ల్పఱచి మీఁద
శాస్త్రోక్తముగ రంకు♦చర్మంబు పైఁ గప్పి, పశ్చిమవిధు లెల్లఁ ♦ బరఁగ జేసి
పితృమేధ మెల్లను ♦ విధ్యుక్తముగఁ జల్పి, చితికి నాగ్నేయంపు ♦ క్షితిని వేది

తే. సమరఁ జేసి యథాస్థాన • మందు నిల్పి, వహ్నిఁ బృషదాజ్యపూర్ణ స్రు • వంబు వైచి
చరణముల యొద్ద శకటంబు • సరగఁ ద్రోడల; యొద్దనుంచిరి యా రాక్ష • సోత్తముసకు

అర్థములు. జతనపడుచు = యత్నము చేయుచు, యత్నశబ్దభవము జతనము, చందనకాష్ఠ సంచయములన్ = శ్రీగంధపుఁ జెక్కల సమూహముతో, పద్మకోశీరముల్=పద్మక + ఉశీరములు = పద్మకాష్ఠ మను నోషధి, వట్టివేరు, రంకు చర్మము = తెల్లని వెంద్రుకలు, మెత్తని చర్మముగల యిఱ్ఱియొక్క చర్మమును, పశ్చిమ విధులు=అంతిమేష్టి లోనైనవి, విధ్యుక్తముగ = వేదోక్త ప్రకారము, పృషదాజ్యపూర్ణస్రువంబు= - పృషదాజ్యము=పెరుగుతో గలిసిన నేయి, 'పృషదాజ్యం సదధ్యాజ్య'మ్మని యమరము. దానిచే నించిన, స్రువము = హోమ పాత్రము, సరగన్=జోటిని.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి చెప్పిన యా మాటలు విని సంస్కరించుట కయి ప్రయత్నము చేసి కావలసిన పదార్థముల నెల్లఁ దెప్పించి స్త్రీలనెల్ల నావల నుండఁ జేసి శ్రీగంధపుఁ గట్టెలతో సొదపేర్చి దానిమీఁద పద్మకము, వట్టివేరు పఱచి, శాస్త్రమునఁ జెప్పినట్లు తెల్ల వెంద్రుకల యిఱ్ఱి చర్మము మీఁదఁ గప్పి యంతిమేష్టి గావించి వేదము నందుఁ జెప్పిన ప్రకారము పితృమేధమాతయు నెరవేర్పఁబడెను. ఇట్లు సంగ్రహముగఁ జెప్పిన దానిని వివరించి చెప్పుచున్నాఁడు. ఋత్విజులు చితికినాగ్నేయ భాగమునందు వేది నమర్చి, యందు బడమట గార్హపత్యము, తూర్పున నాహవనీయము, దక్షిణమున దక్షిణాగ్నిని నీ ప్రకారము దాని దాని స్థానమునందు దాని దానిని వరుసగా మూఁడగ్నుల నిలిపిరి. ఆవలఁ బెరుగు నెయ్యి కలసిన దానిని హోమపాత్రమున నించించి యా పాత్రమును ప్రతిపత్తికై యందలి చితియందు వైచిరి, ఆవల రావణుని పాదముల దగ్గఱ సోమరాజును దెచ్చుశకటమును కొడలనడుమ యుజ్ఞము కొఱకు వధ్యుంచు జోటిని నిలిపిరి.

సీ. అరణియు దారుపాత్రాళియు నుత్తరా,రణి యున్యముసలంబు • క్రమముగాఁగఁ
దత్తత్స్థలంబులఁ • దగ నిల్పి ఋష్యుక్త,పద్ధతి మేధ్యంపుఁ • బశువు జంపి
చితియొద్ద వేలిచి • ఘృతసిక్తదర్భలఁ, బఱచి కసన్నిభులు • పాఱుచుండ
దశకంఠు మాల్యగం•ధంబులఁ గై సేసి, వస్త్రంబుఁ గప్పి యా • వారు చితిని

తే. బోరుగులను జల్లిరంతటఁ • బోకు-మది వి,భీషణుం డగ్నినిచ్చి యా • విదపమునిఁగి
యార్ద్రవస్త్రంబుతోడ దూ • ర్వాభిమిశ్ర,తిలలు నీళ్ళును విడిచెను • ధీరతుండు.

అర్థములు. అరణి = అగ్ని మథించుకట్టె, దారుపాత్రాళియు = కొయ్య పాత్రములు, ఉత్తరారణి=నిప్పు మథించు రెంటిలో మీఁది కట్టెను, ముసలంబు= రోఁకలి, తత్ + తత్ + స్థలంబులన్=ఏదేది యెచ్చట నుంచవలెనో యచ్చట ఋషి + ఉక్త + పద్ధతిన్ = స్మృతులందుఁ జెప్పఁబడిన ప్రకారము, మేధ్యంపుఁ

బశుపున్=పవిత్రమైన ఛాగపశువును (మేఁకను) జంపి, ఘృతసిక్త దర్భలన్=నేతితోఁ దడిసిన దర్భలను, మాల్య గంధంబులన్=పూలదండల చేతను, చందనము చేతను, కై సేసి=అలంకరించి, ఓ వారు=బంధువులు, ఆర్ద్రవస్త్రంబుతోన్=తడిగుడ్డతో, దూర్వాభిమిశ్రితిలలు=లేఁత పచ్చిక కొనలతోఁ గలిసిన నూవులు, సుధీరతుండు=మంచి మనస్సు గలవాఁడు, పూర్వపు ద్వేషబుద్ధి గలవాఁడు గాక శ్రద్ధతోఁ గూడినవాఁడు, శ్రద్ధతోఁ జేయఁబడినది కదా శ్రాద్ధము.

తాత్పర్యము

అరణిని, కొయ్య పాత్రలను, ఉత్తరారణిని, రోఁకలిని – వీనిని వరుసగ దేనిదేనిని నెంచెం దుంచవలయునో యందం దుంచి స్మృతులందుఁ జెప్పఁబడిన ప్రకారము పవిత్రమైన ఛాగపశువును జంపి చితిసమీపమందు హోమముచేసి దర్భలను నేతిలోఁ దడిపి చితిమీఁదఁ బఱచిరి. ఆవల వారు కన్నీరు కాఱుచుండ రావణశవమును పూలదండలతోను గంధముతోను నలంకరించి మీఁద వస్త్రమును గప్పిరి. తరువాత కావలసినవారు చితిమీఁద బొరుగులను జల్లిరి. ఆవల దుఃఖపడుచు విభీషణుఁ డగ్నినిచ్చెను. ఇట్లగ్నినిచ్చి స్నానముచేసి తడిబట్టలతో దూర్వముతోఁ గలసిన నూవులు నీళ్ళు తీసికొని తర్పణము గావించెను.

కం. ఉదకంబు లిచ్చి మ్రొక్కుచుఁ, బదపడి యూరార్చి సతులఁ♦బనిచి నగరికిన్
సదమలమతిఁ జని వినయా,స్పదగతి శ్రీరామవిభుని♦సన్నిధి నిలిచెన్. ౨౫౩

తాత్పర్యము

ఈ ప్రకారము నీళ్ళు విడిచి నమస్కరించి యావల నాఁడువారుండు చోటికి వచ్చి వారికి సమాధానము చెప్పి వారి నందఱ నూరిలోకిఁ బంపి నిర్మలమనస్సుతో విభీషణుఁడు సవినయముగ రామచంద్రమూర్తి సన్నిధి నిలిచెను.

ఇది యంతయుఁ జైత్రశుద్ధమునఁ బాడ్యమినాఁటి చర్య.

కం. రాముఁడు సహసైన్యుం డై, సౌమిత్రియు భానుసుతుఁడు ♦ సంసేవింపన్
భీమబలు వృత్రుఁ జంపిన, భూమీధరవైరివోలెఁ♦బొలుచుచునుండెన్. ౨౫౪

అర్థములు. సహసైన్యుండై=సేనతోఁగూడినవాఁడై, భీమబలున్=భయంకర బలముగలవానిని, భూమీధరవైరివోలెన్=ఇంద్రునివలె.

తాత్పర్యము స్పష్టము.

## ౧౧౫.వ సర్గము. మాతలి శ్రీరామునిచే ననుజ్ఞాతుండై దివంబునకుఁ బోవుట.

సీ. రావణవధమును ♦ రామవిక్రమమును, రాక్షసవానర ♦ రణవిధంబు
సౌమిత్రి వీర్యంబు ♦ సౌభ్రాత్రగరిమంబు, మార్తండనందను ♦ మంత్రితంబుఁ
గథలుగాఁ జెప్పుచుఁ ♦ గలను వీక్షింపఁగ, వచ్చినదానవా ♦ స్వప్నచయము
మరలి పోవెను హర్ష♦భరమున నంతట, రాముండు మాతలిఁ♦బ్రేమ బొగడి

ఆ. యనుమతించె రథము • హరిహయు కడకును, మరలఁ గొంచుఁ బోవ • మాతలియును
నట్లు సలిపె నంత • నర్కజుఁ గౌఁగిటఁ, గ్రుచ్చి లక్ష్మణుండు • కూర్మిఁ దెలుప

అర్థములు. సౌభ్రాత్రగరిమంబు = అన్నదమ్ముల ప్రీతి యతిశయమును మంత్రితంబు=ఆలోచన విధము, అస్వప్నచయము=దేవతల సమూహము.

## తాత్పర్యము

యుద్ధమును జూడవచ్చిన దానవులు దేవతలు రావణుని జంపినవిధము, రామచంద్రమూర్తి పరాక్రమము, రాక్షసులు వానరులు యుద్ధముచేసిన తీరు, లక్ష్మణుని బలము, అన్నదమ్ములకుఁ గల భ్రాతృ వాత్సల్యాతిశయము, సుగ్రీవుఁడు చేయుచుండిన యాలోచన విధము, కథలుగాఁ జెప్పుచు సంతోషముతో మరలి వారి స్థానములకుఁ బోయిరి. తరువాత రామచంద్రమూర్తి మాతలికిఁ దనయందుఁ గల ప్రేమ పొగడి యిఁక నీవు రథము తీసికొని యింద్రునియొద్దకుఁ బొమ్మని సెలవీయఁగా నాయన వెడలిపోయెను. అంత సుగ్రీవునిఁ గౌఁగిలించుకొని రామచంద్రమూర్తి లక్ష్మణుఁడు బోధింపఁగా.

తే. అఖిలకపిసేన గొల్వ బ • లాలయంబుఁ, జేరి పరిసరతలవర్తి • సారకీర్తి
దివ్యకాంతి స్ఫురన్మూర్తి • భవ్యచరితు, లక్ష్మణు సుమిత్రపట్టిని • లలితగతిని.

అర్థములు. బలాలయంబు = సేనలు విడిసిన చోటును, పరిసరతలవర్తి= ప్రక్కనే యుండువానిని, సారకీర్తి = దృఢమైన కీర్తి సంపాదించినవానిని, దివ్యకాంతిస్ఫురన్మూర్తి = దేవతల తేజస్సుతోఁ బ్రకాశించు నాకారము గలవానిని, భవ్యచరితున్ = శుభకరమైన నడవడి గలవానిని, సుమిత్రపట్టి = సుమిత్రా దేవి చెప్పినప్రకారము తన్ను వినయ విధేయతలతో సేవించినవానిని, ఈలెంక గతి నీకు నెల్లెడ ధర్మంబు, జ్యేష్ఠానువర్తివై చెలఁగుచుంట, పుత్రక! సనాతనంబైన పుణ్యవృత్తి, మాకులంబున విదియసుమ్మి తలంప, దానమును యజ్ఞదీక్ష యుద్ధమున్మృతి" యని కదా బోధించి పంపెను, లలితగతిని=మనోహరమైనరీతిగా.

## తాత్పర్యము

సమస్త వానరసేన సేవింపఁగా, సేనలు విడిసినచోటికిఁబోయి, తనప్రక్కన నున్నట్టియు యుద్ధమునందు నడవడియందు మంచికీర్తి సంపాదించినట్టియు అన్న యుద్ధమందు జయించెఁగదా యని యత్యంత సంతోషముతో దివ్యకాంతితోఁ బ్రకాశించు నాకారముగలట్టియు తల్లి చెప్పినప్రకారము తన్ను వినయ విధేయతలతో సేవించుచు యుద్ధమునందుఁ దననిమిత్తమై ప్రాణమిచ్చినట్టియు లక్ష్మణుని.

## — • విభీషణ పట్టాభిషేకము • —

కం. చేరఁగ బిలిచి విభీషణుఁ, డారయ రక్తుండు భక్తుఁ • డత్యుపకృతి నా
కార ఘటించెను గావునఁ, గోరెద నభిషిక్తుఁ జేయఁ • గొమరుగ లంకన్.

అర్థములు. రక్తుఁడు = అనురాగముగలవాఁడు, భక్తుండు = నా సేవ కోరువాఁడు, అత్యుపకృతి=మిక్కిలి యుపకారమును, ఆరన్ =పూర్ణముగ, రక్తుఁ డనుటచే మిత్రకృత్యము, భక్తుఁడనుటచే దాసకృత్యము చెప్పఁబడెను. రక్తిలేని భక్తిలేదు. రక్తి భక్తి గలవాఁడు వానిని గార్యమునఁ బరిణమింపఁజేయవలెను. శుష్కాలాపములు శూన్యహస్తములు రక్తిగల భక్తుల లక్షణముగాదు. కావున ఉపకారము చేసినని చెప్పెను.

## తాత్పర్యము

నాయనా! రమ్మని దగ్గఱకుఁ బిలిచి విభీషణుఁడు నాయం దనురాగము గల వాఁడు, భక్తుఁడు, నాకు మిక్కిలి యుపకారము శక్తికొలఁది చేసినవాఁడు కావున నతని లంకయందు నభిషేకింపఁగోరెదను.

కం. పరమాభీష్టం బిది నా, కురుమతి నీ వరిగి దాని ♦ నొనరింపు మనన్
సరభసముగ సమ్మదమునఁ, బురికిం జని కనకకలశ♦ముల వేగమునన్. ౨౦౫౭

అర్థములు. పరమాభీష్టంబు = నాకుఁగల కోరికలలో నెపుడు విభీషణునికి బట్టాభిషేకము చేయుదునా యనునది గొప్పకోరిక, ఉరుమతి=గొప్ప మనస్సుతో, సరభసముగన్ = వేగముగ, సమ్మదమునన్ = సంతోషముతో, కనకకలశ ములన్ = బంగారు పాత్రముల.

పట్టాభిషేకము సముద్రతీరమున ముందే జరిగెనుగదా. ఇప్పుడు మరల నేల? ఇదివఱకుఁ జేసినది తాంత్రికము. అది రాక్షసు లెవ్వరు నెఱుంగరు. కావున సింహాసనమునఁ గూర్చుండబెట్టి, అందఱు రాక్షసులు చూచుచుండగా యథావిధి చేయుట ప్రశస్తమని చేయవలసివచ్చెను.

## తాత్పర్యము

ఇది నామనస్సునఁగల గొప్ప కోరిక. దీనిని నీవు గొప్ప మనస్సుచే నెఱవేర్చి రమ్మని చెప్పగాఁ సంతోషముతో వేగముగఁ బురములోనికిపోయి బంగారు పాత్రములను త్వరగా

సీ. కొనిపోయి కీశులు ♦ వననిధిజలములఁ, దెం డన్న వారలు ♦ తెచ్చుటయును
నవ దొండు దాఁ గొని ♦ యర్హోత్త మాసనం,బున విభీషణు నిల్పి♦బుధవిరోధి
మధ్యంబునందు స♦మంత్రకంబుగ నభి,షిక్తునిఁ గావింపఁ ♦ జెలఁగి యతఁడు
ప్రకృతిజనంబులఁ ♦ బ్రమదంబునను దేల్చి, సచివవర్గంబులు ♦ సంతసింప
ఆ. రామభక్తమైన ♦ రాజ్యంబుఁ గైకొని, యసురముఖ్యు లిచ్చు ♦ నక్షతలును
మోదకములు బుష్ప♦ములు లాజలును గొని, భద్రకరములైన ♦ వస్తువులను.

అర్థములు. బుధవిరోధి మధ్యంబునందు=రాక్షసులనడుమ, మోదకములు= లడ్డువాలు, లాజలు=పేలాలు, యుద్ధమునందుఁ జచ్చిన వారికై యాశౌచ ముండఁ బనిలేదు.

తాత్పర్యము

తీసికొనిపోయి సముద్రజలము తెండని పంపి వారు తీసికొని రాఁగా నందొకటి తాను దీసికొని రాజయోగ్యమైనయుత్తమసింహాసనమున నాయనను గూర్చుండఁబెట్టి రాక్షసు లందఱుఁ జూచుచుండ వారి నడుమ మంత్రయుక్తముగ నభిషిక్తునిగావించెను. విభీషణుఁడును సంతోషించి పురజనుల నధికారులను సంతోషింపఁజేసి మంత్రులు సంతోషింపఁగా రామచంద్రమూర్తి యిచ్చిన రాజ్యంబు గ్రహించి శ్రేష్ఠులగు రాక్షసు లాశీర్వదించి యిచ్చిన యక్షతలను లడ్డువములను పుష్పములను పేలాలను గ్రహించి శుభకరములైన వస్తువులు దీసికొని.

చ. కొని రఘురాముఁ జేరఁ జని ♦ కూరిమి వానిని వారి కిచ్చినన్
గని కృతకార్యు శ్రీ కలితు ♦ గాదిలిమిత్రముఁ బొంగి యన్నియుం
గొని యతఁ డుల్లసిల్లఁగ స♦కుంఠిత భక్తిని నొద్ద నున్న యా
హనుమను జూచి యిట్లనియె ♦ నాశుగనందన యిట్లొనర్పుమా. ౩౬౦౦

అర్థములు. కృతకార్యుని = చేయఁబడిన కార్యముగలవానిని, రామాజ్ఞనెఱవేర్పవలసినది తనకు విధి గావున పట్టాభిషేక మంగీకరించినవానిని- దీనివలన విభీషణుఁడు కామముచే రాజ్య మంగీకరింపలేదనియు రామాజ్ఞ మీఱరానిది కావున నంగీకరించెననియు భావము.

పొంగి = సంతోషముచే నుప్పొంగి, ఇట్లనుటచే నింతవఱకు నీ సేవ నాకుఁ గావలయును గాని రాజ్య మెవరికిఁ గావలెను? నాకు వలదనునేమో ? ఇంతటి వానికి నే నేమి మేలు చేసినట్టు అని క్రుంగినవాఁడు,ఇప్పుడు శ్రీకలితుని విభీషణుఁ జూచి పొంగెనని భావము. ఆశుగనందన = వాయుతనయ, ఇది శీఘ్రగమనమును సూచించును.

తాత్పర్యము

రామచంద్రు నొద్దకు వచ్చి సమర్పింపఁగా నాయన సంతోషముతో తాను జెప్పిన కార్యము చేసినవానిని ఐశ్వర్యముతోఁ గూడిన వానిని, ప్రేమగల స్నేహితునిఁ జూచి పొంగి యన్ని గ్రహించి యతఁడు సంతోషింపఁగాఁ దన సమీపమందున్న హనుమంతునిఁ జూచి హనుమంతా యని పిలిచి నీ విట్లు సేయుము.

**—♦ శ్రీరాముఁడు హనుమంతుని సీతాదేవి యొద్దకుఁ బంపుట ♦—**

సీ. చనుము విభీషణు ♦ సమ్మతి నైలంక, కందు రావణగృహ ♦ మందు నున్న
పృథ్వీజఁ బొడఁగని ♦ విజయవార్త వచించి, మిత్రతనూజ సౌ ♦ మిత్రియుక్తి
నేను సేమం బని ♦ యింద్రారి రావణు, నే జయించినమాట ♦ నెఱుక పఱచి
సంతసింపఁగఁ జేసి ♦ జలజాక్షి సందేశ మును గొని చనుదేరు ♦ మనఘయనిన
ఆ. రామునాజ్ఞ తనశి ♦ రంబున వహియించి, యసురులెల్లఁ దన్ను ♦ నాదరింపఁ
బంక్తికంఠువేశ్మ♦వాటిఁ బ్రవేశించి హర్షహీన యగుచు♦నడలుదాని. ౩౬౦౧

అర్థములు. విభీషణు సమ్మతిపై = విభీషణు నంగీకారము తీసికొని, ఇది వఱకుఁ బోయినట్టు దొంగతనముగాఁ గాదని భావము అప్పుడు శత్రుక్షేత్రము, ఇప్పుడు మిత్రక్షేత్రము. కావున మిత్రు ననుమతి లేక యతని యంతఃపురమునకుఁ బోరాదు. సందేశమును = వార్తను, అసురులెల్లఁ దన్ను నాదరింపన్=ఇదివఱకు పోయినప్పుడు ధిక్కరించినట్లుగాక ప్రీతితో రమ్మని వారే పిలుచుకొనిపోయి రని భావము. వేశ్మవాటి=గృహప్రదేశము, హర్షహీన=సంతోషము లేనిది.

తాత్పర్యము

ఆంజనేయా! విభీషణు ననుమతి తీసికొని లంకకుఁబోయి యందు రావణునింట నున్న సీతాదేవిని యుద్ధమందు నేను గెలిచిన వృత్తాంతముఁ దెలిపి సుగ్రీవుతోడను లక్ష్మణుతోడను నేను క్షేమముగానున్నాననియు రావణుని నేను జయించితిననియు తెలిపి సంతోషపఱిచి మరల నామె యేమి ప్రత్యుత్తర మిచ్చునో తెలిసికొని రమ్ము అని చెప్పఁగా రామాజ్ఞను శిరసావహించి రాక్షసు లందఱుఁ దన్ను నాద రింపఁగా రావణు నింటిలోఁ బ్రవేశించి సంతోషములేక దుఃఖించుచున్న దానిని.

**—♦ ౧౧౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికి విజయవార్తఁ దెలుపుట ♦—**

కం. సాతంకరోహిణీగతిఁ, జేతస్సుఖహీన యగుచుఁ ♦ జెలువతి రక్షః
స్త్రీతతిపరివృత యగు భూ,జాతన్ భూజాతమూల♦సంస్థం గనుచున్. ౨౬౦౨

అర్థములు. సాతంక రోహిణీగతిన్ = గ్రహపీడాభయముతోఁ గూడిన రోహిణివలె, చేతస్సుఖహీన=మనసున సుఖమనునది లేనిది, పరివృత=చుట్టుకొనఁ బడినది, భూజాతన్=సీతను, భూజాతమూలసంస్థన్=చెట్టు మొదట నున్నదానిని.

తాత్పర్యము

భయముతోఁ గూడిన రోహిణివలె మనస్సున సుఖములేక యందము చెడి రాక్షసస్త్రీలు చుట్టుకొన చెట్టుమొదటఁ గూర్చుండిన సీతను జూచెను.

కం. వినయమున వఁగి మఁగియుఁ, జని తనపేర్వాడి భక్తి ♦ సాష్టాంగముగా
వినతు లొనర్చి యచంచల, తనుఁడై నిలఁబడిన వాయు♦తనయుం గనుచున్.

తాత్పర్యము

అణఁకువచే దేహము ముడుచుకొని విజృంభణము మానిపోయి తన పేరు చెప్పి సాష్టాంగముగ సాగిలఁబడి నమస్కారములుచేసి త్రికరణముల కదలక మెదలక నిలువఁబడిన వాయుపుత్రునిఁ జూచి.

వాయుతనయుఁ డనుటచే శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు త్వరగా కార్యము చేసెనని భావము.

కం. స్మరియించి యతని కృత్యముఁ, బరమానందమున సీత ♦ పలుకక యున్నన్
ధరణిజ సౌమ్యాననముం,బరికించి ప్లవంగవరుఁడు♦పలుకం దొడఁగెన్. ౨౬౦౪

తాత్పర్యము

ఇదివఱ కతఁడు వచ్చినపుడు చేసిన కార్య మంతయు జ్ఞప్తికిఁ దెచ్చుకొని

మిక్కిలి సంతోషపడి సంతోషాతిశయమున పలుకలేక యుండఁగా సీతాదేవి యొక్క సుప్రసన్నమైన ముఖముఁ జూచి హనుమంతుఁ డిట్లు చెప్ప నారంభించెను.

కం. అమ్మా! మైథిలి! గాదిలి, తమ్మునితో నంబుజాప్త • తనయునితో సై
న్యమ్ములతో రావణు పీన, తమ్మునితో రామవిభుఁడు•తనరుఁ గుశలియై. ౨౬౦౭

తాత్పర్యము స్పష్టము

కం. సీతాసాధ్వీమణి! నీ, చేతఃపతి యరుల గెలిచి • సిద్ధార్థుండై
ప్రీతిని దన కుశలంబును, మాతా! నీతోడఁ జెప్పుమా•యని పనిచెన్. ౨౬౦౮

తాత్పర్యము

ప్రతివ్రతారత్నమవైన సీతాదేవీ! నీ మగఁడు శత్రువుల గెలిచి కార్యము సాధించి సంతోషపడి తన క్షేమవార్త నీకుఁ జెప్పుమని నన్నుఁ బంపెను.

కం. బాసటగాఁగ విభీషణుఁ, డోసతి! నీపతి ప్లవంగ • మోత్తమతతితో
శ్రీసౌమిత్రినయముచేఁ, దా సమరమునందుఁ గూల్చె•దశకంధరునిన్. ౨౬౦౯

అర్థములు. బాసట=సహాయుఁడు.

తాత్పర్యము

ప్రతివ్రతామణీ! నీమగఁడు సౌమిత్రి నీతిచేతను విభీషణుఁడు సహాయపడఁగను వానరసేనతో రావణాసురుని యుద్ధమందుఁ జంపెను.

కం. రచితాద్భుతకార్యుఁ డ,సంకుచితపరాక్రముఁడు నీవు • కుశల మడుగుచున్
వచియింపుమనుచుఁ జెప్పిన, వచనంబులు వినుము కర్ణ•పర్వంబులు గాన్. ౨౬౧౦

అర్థములు. రచిత+అద్భుతకార్యుఁడు=ఆశ్చర్యకరమైన కార్యము చేసినవాఁడు, అసంకుచితపరాక్రముఁడు = విస్తరించిన పరాక్రమము గలవాఁడు, కర్ణపర్వంబులుగన్ = చెవులపండువుగా.

తాత్పర్యము

తన పరాక్రమము వికాసము నొందఁజేసి యద్భుతకార్య మొనర్చిన రామచంద్రమూర్తి నీ క్షేమము విచారించి నీతో సంతోషకరములైన కొన్నిమాటలు చెప్పుమనెను. చెప్పెదను. వీనులవిందుగా వినుము. ఏమి చెప్పునోయని భయపడు నేమోయని సంతోషవార్తయే యని ముందుగానే చెప్పెను.

సీ. ప్రియముఁ జెప్పెద దేవి•వినుము నీ కనురక్తుఁడను జుమ్మి మిక్కిలి • వనజనేత్ర
మద్భాగ్యవశమున • మనియున్న దానవు, మత్పరాక్రమమున•మనకు జయము
ధర్మవేదిని గల్గెఁ • దలఁగి దుఃఖంబును, స్వస్థచిత్తవుగమ్ము • జనకతనయ!
హతుఁడయ్యె రావణుం•డఖిల లంకాపురి, మనవశంబున నున్న•దనుచుఁ దలఁపు

ఆ. కన్ను మోడ్పులేక • కలికి నీ కీ చెఱఁ, బాపఁ బ్రతినచేసి • వార్ధియందు
సేతు వొకటిఁ గట్టి • చేసిన బాసను, దీర్చుకొనఁగఁ గంటిఁ దియ్యఁబోణి. ౨౬౧౧

అర్థములు. నీ కనురక్తుఁడను=నీయందు ననురాగము కలవాఁడను, మద్భాగ్య

వశేమున = నా యదృష్టము కారణమున, మనియున్న దానవు = బ్రదికియున్న దానవు, నేను నిర్భాగ్యుఁడనై యుండిన నీవు మరణించి యుందువని భావము. మన కున్ = నీకు నాకు, నాజయము నీజయమే. నాభర్తయే రావలె, రావణునే చంపవలె నన్న నీమాట గెలిచినది కదా. ధర్మవేదిని = పాతివ్రత్య ధర్మము తెలిసినదానా, స్వస్థచిత్తవు = కలఁతలేక కుదుటఁబడిన మనస్సు గల దానవు. ఇవి రామచంద్రుని వాక్యములు.

### తాత్పర్యము

దేవీ! నీకుఁ బ్రియమైన దానిని జెప్పెద వినుము. నీ యందు మిగుల ప్రేమ గలవాఁడను. నా యదృష్టము కొలఁది నీవు బ్రదికి యున్నదానవు నా పరాక్రమము చేత మనకు జయము గలిగెను సతీధర్మము తెలిసినదానా! నీవు దుఃఖమును వదలుము. మనస్సునఁ గలఁక లేక దానిని కుదుటఁబడనిమ్ము. రావణాసురుఁడు చచ్చెను. లంక మన వశేమున నున్నది. నిన్నుఁ జెఱనుండి విడిపించెద నని ప్రతిజ్ఞ చేసి యది నెఱవేఱు వఱకు నిద్దురగొనక సముద్రమున సేతువు నిర్మించి చేసిన ప్రతిజ్ఞను నెఱవేర్చుకొంటిని.

చ. అణుసమమధ్య! రావణుగృహం బని భీతిలఁ బోకుమీ, విభీ
షణునకుఁ గైవసం బిపుడు సర్వము లంక సమస్తలక్ష్మి, ధా
రిణిసుత! స్వాలయంబునఁ జరించుగతిన్ మది నూఱడిల్లు మీ
క్షణమున నిన్నుఁ జూచు కుతుకాన విభీషణుఁ డేగుదెంచెడిన్. ౨౬౧౦

అర్థములు. అణుసమమధ్య = అణువుతో సమానమైన సూక్ష్మమైన నడుము గలదానా, కైవసము = స్వాధీనము.

### తాత్పర్యము

తనుమధ్యా! నీవు రావణు నింట నున్నదాన వని భయపడవలదు. లంకయు సర్వైశ్వర్యము విభీషణు స్వాధీనమందున్నది. కావున నీ సొంతయింట నున్నట్లు నిర్భయముగ నిశ్చింతముగ నుండవచ్చును. క్షణకాలములో నిన్నుఁజూచు కోరికతో విభీషణుఁడు రాఁగలఁడు.

కం. అన రాకేందునిభానన, విని దిగ్గన లేచి నిలిచి విగతక్రియయై
మునిగతి నుండఁగ సతి! యో, జన సేసెద వేల పలుకఁజాలవు నాతోన్? ౨౬౧౧

అర్థములు. రాకేందునిభానన = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలది, విగతక్రియ = ఏ చేష్టయు లేక, మునిగతి = మౌనము వహించి యేదియో యాలోచించుదానివలె.

### తాత్పర్యము

పదునాఱు కళలతోఁ గూడిన చంద్రునివంటి ముఖముగలదై సీతాదేవి తటాలున లేచి నిలఁబడెను గాని యేమియుఁ జేసినదికాదు. మాటయైన నేదియుఁ జెప్పినది కాదు. బొమ్మవలె నిలిచిన యామెనుజూచి హనుమంతుఁడు ఏమమ్మా! యేల నాతోఁ బలుకవు? ఏమి యాలోచన చేసెదవు?

## —♦ సీతాదేవి హనుమంతుఁ బ్రశంసించుట ♦—

కం. అని హనుమంతుం డడిగిన, వినియమపర యిట్టులనియెఁ ♦ బ్రియమున హర్షం
బున గద్గదకంఠంబున, విను మీ మౌనంబుకతము♦వినుతుఁ గపీంద్రా! ౧౦౧౨

అర్థములు. వినియమపర = ధర్మనియతియం దాసక్తిగలది.

### తాత్పర్యము

అని హనుమంతుఁ డడుగఁగా ధర్మనియతిగల సీతాదేవి ప్రియవాక్యము వినుటచేఁ గలిగిన సంతోషాతిశయమున గద్గదుపాటుగలదై డగ్గుత్తికతో నిట్లనియె. ఆంజనేయా ! నేను బలుకకుండిన కారణము చెప్పెద వినుము.

సీ. ప్రాణేశువిజయంబు ♦ భాషించు నీ ప్రియ,వాక్యముల్ విని పర♦వశతఁ జేసి
నిర్వాక్యనైతిని♦నిమిష మంజనపుత్ర!, మత్ప్రియంబు వచించు♦మాన్యునకును
నర్హోక్తు లేమని ♦ యందునా యని యెంతొ, యోజించితినిగాని♦యొకఁడు లేద
యర్హవస్తువునైన ♦ నర్పింతు నందునా, యీడైన దీ యిల ♦ నేది లేదు
ఆ. వివిధమణులుగాని ♦ విశ్వంబునం గల, వెండిగాని పైడి ♦ కొండగాని
యెల్లలోకములయు♦నేలికతనమైన, సాటిగాదు నిజము♦మాటకైన. ౨౬౧౩

### తాత్పర్యము

ఆంజనేయా ! నా ప్రాణేశ్వరు గెలుపువార్త చెప్పుచున్న నీ సంతోషకర వాక్యములు విని నా దేహము నేను మఱచుటఁ జేసి నిమిషకాలము మాటలాడ నేరక పోయితిని. ఇదియొక కారణము; స్మృతివచ్చిన తరువాత నాకుఁ బ్రియము లైన మాటలు చెప్పు పూజ్యునకు నేమిబదులు చెప్పుదునా యని యాలోచించితిని గాని నాకెంత సంతోషము నీవు గలిగించితివో, యంత సంతోషము నీకుఁగలిగించు మాట యేదైనఁ జెప్ప నెంతో యాలోచించితిని గాని నాకుఁ దోఁచినది కాదు. నాకుఁ దోఁపకుండుట నా యజ్ఞానముచేతఁ గాదు. అట్టి మాటయే లేదు. మాట చెప్పకుండినఁ బోనీ. ఏదైనఁ దగిన వస్తువు బహుమానముగా నియ్యఁదలఁచి యీ లోకమున నేది గలదని యాలోచించితిని. ఒక్కటియు సమానమైనదిగాఁ గనఁబడ లేదు. ఒక్కటిగఁ గాకున్నఁ బెక్కులు కలిపిన సరిపోవునేమో యని చూచితిని. లోకములో నుండు నన్ని రత్నములు, వెండికొండ, బంగారుకొండ, వేలువేలుగఁ గాని యన్ని కలిసినఁగాని సరిగాదని తోఁచెను, ఈ లోకమునఁ గాకున్న నితర లోకములం దున్నవేమో యని చూచితిని. అందును గానరాలేదు. ఇన్ని లోక ముల యాధిపత్యమే (బ్రహ్మత్వమే) నీ కిచ్చినఁ జాలునేమో యని చూచితిని. అదియు జాలదనియే తోఁచెను. నే నూపిరితో నున్నానని చెప్పినంత మాత్రమునకే నామగఁడు సంతోషించి నీ కీయందగినది యేదియు లేకుండుటచేఁ దన్నే నీకు సమ ర్పించుకొనెనని వింటిని; విజయరాముఁడనిన రెండుమాటల కదియు సరిగాదని నా యభిప్రాయము. ఇట్టు లాలోచించుచుండుటచే నీతో మాటలాడ నేరనైతిని.

శుభాలాపంబులందు శూన్యహస్తములందు మగని మించినది భార్య భార్యను మించినవాఁడు భర్త యని తోఁచును గాని సీతారాములట్టివారు గారని యనుభవజ్ఞు లెఱుఁగుదురు. నిర్మలమైన సీతారామసేవ వ్యర్థముగా నేనాఁటికిని బోదు. వారి నిగ్రహానుగ్రహములు రెండును సార్థకము లని ప్రమాణము చేసి చెప్పవచ్చును.

కం. నావుడుఁ బ్రాంజలి యగుచుం, బావని పతిహితముఁ గోరు • భవ్యచరిత్రా !
పావని! పతిజయకాంక్షిణి!, నీ వే తగుదమ్మ యిట్టి • స్నిగ్ధోక్తులకున్. ౨౬౧౮

అర్థములు. పతిజయకాంక్షిణి = మగని గెలుపు గోరుదానా, స్నిగ్ధోక్తులకున్ = స్నేహముతోఁగూడిన మాటలకు.

తాత్పర్యము స్పష్టము.

చ. పతివిజయంబు వాకొనిన • వాని కొసంగగ సర్వవస్తు వీ
క్షితిఁ గననంచు నర్మిలి వ • చించిన పల్కది స్నేహపూర్ణమై
యతులితసారయుక్తమయి • యన్నివిధంబుల దివ్యసన్మణీ
వితతులకంటె నా విబుధ • విశ్రుతరాజ్యముకంటె మిన్నయా. ౨౬౧౯

అర్థములు. వాకొనిన వానికి=చెప్పినవానికి, అర్మిలిన్=ప్రేమతో, అతులిత సారయుక్తము = అసమానమైన స్థిరాంశము గలది, దివ్యసన్మణీ వితతులకంటెన్=దేవతా సంబంధమైన చింతామణిలోనగు రత్నములకంటె, విబుధ విశ్రుత రాజ్యముకంటెన్=దేవతల ప్రసిద్ధ రాజ్యముకంటెఁ, మిన్నయా=శ్రేష్ఠమైనదగును. ఆంజనేయుఁడు ప్రతిఫలకాంక్షచే దాస్యముచేసిన వాఁడు కాఁడు. భగవంతుఁడు సంతోషించునట్లు దాస్యము చేయుటయే దాసుని కార్యము. ఆ ప్రకారము చేసిన వాఁడు హనుమంతుఁడు. క్షుద్రములయిన రత్నములు లోనైన నశ్వరపదార్థము లాయనకేల ?

తాత్పర్యము

మగని గెలుపుచెప్పిన వానికి నీయఁదగిన పదార్థము లేదని ప్రేమతోఁ జెప్పితివి. ఆ మాటయే స్నేహముచే నిండినదై అసమాన సారవంతమై యెన్నివిధములఁజూచి నను దేవతారత్నసమూహముల కంటె స్వర్గలోక ప్రభుత్వము కంటె శ్రేష్ఠమై యున్నది. ఏలన నవి యన్నియు నశ్వరములు. కొంతకాలముండి నశించునవి. మీ ప్రేమ యనునది యట్టిదిగాదు. దానియందుండుసారము వీని యన్నిటియందు లేదు. కావున ననశ్వరమైన మీ యనుగ్రహము నాయందున్నది. నా కదియె చాలును. ఈ తుచ్ఛములైన యైహికములు నాకేవియు వలదు.

కం. హతశత్రుని విజయిని సు,స్థితునిన్ శ్రీరాముఁ జూచి • దేవీ! యమర
క్షితిరాజ్యాదులకంటెను, నతిమాత్రోత్కర్ష మంది • యలరెద నేమన్.

అర్థములు. హతశత్రుని=శత్రువుల జంపిన వానిని, విజయిని = జయించిన వానిని, సుస్థితునిన్=మంచి స్థితిగలవానిని, అమర క్షితి రాజ్యాదుల కంటెను =

దేవలోక భూలోక ప్రభుత్వము లభ్బినదానికంటె; అతిమాత్రోత్కర్షము=మిగుల గొప్ప సంతోషమును. అలరెద = సంతోషించెదను.

తాత్పర్యము

అమ్మా! యీ పదునాలుగులోకముల ప్రభుత్వము నీవు నాకీయఁదలఁచుట నన్ను సంతోషపెట్టుటకే కదా. వానిని బరిపాలించు కష్టమునకు లోనై యను భవించు సంతోషమునకంటె నెంతో యెక్కువ యానందము శత్రువుల చంపి జయమునొంది స్వస్థుండుగనుండు రామచంద్రమూర్తిని జూచుటచే నాకుఁగలిగినది. కావున నీయధమ త్రైలోక్యప్రభుత్వము నాకేల ?

కం. అని హనుమంతుఁడు పల్కఁన, జనకాత్మజ శుభతరోక్తి • సంపద వెలయన్
గనుఁగవ నానందాశ్రులు, చినుకఁగ నిట్లనియె బ్లవగ • శేఖరుతోడన్. ౨౬౧౭

అర్థములు. శుభతర+ఉక్తి=మిగుల శుభమైన మాట.

తాత్పర్యము స్పష్టము.

కం. అతిలక్షణసంపన్నం, బతిమాధుర్యగుణభూష • ణాంచితమును న
ష్మత మష్టాంగయుతం బగు, మతియొప్పఁగ నీవ నేర్తు • మాటాడంగన్.

అర్థములు. అతిలక్షణసంపన్నము=ఆకాంక్ష, యోగ్యత, సన్నిధిలోనగు వాక్యలక్షణము లేవిగలవో వాని యన్నిటిచే నిండినది, అనఁగా శబ్దసాధుత్వముతో నిండినది. దీనినే రామచంద్రమూర్తి "ఈతఁ డింతసేపు మాటలాడ నొక్కమాట యేనియు నపశబ్దితంబుగాదు" అనెను. కిష్కింధ ౧-౨౫.

అతిమాధుర్యగుణ భూషణాంచితము=మిక్కిలి తీపుగుణము నలంకారముచే నొప్పినది. దీనినే రామచంద్రమూర్తి "సంశ్రవే మధురం వాక్య"మ్మని చెప్పెను. మాధుర్యమనఁగా తేనెబిందువు నోటఁబడఁగానే తీపు తెలిసినట్లు విన్నమాత్రము ననే ఆనందము కలిగించు గుణము.

అష్టాంగయుతము = బుద్ధితోఁగూడినది, 'గ్రహణం ధారణంచైవ స్మరణం ప్రతిపాదనం, ఊహాపోహార్థ విజ్ఞానం తత్త్వజ్ఞానంచ ధీగుణాః'యని యష్టాంగ లక్షణము. గ్రహించుట, ధరించుట, స్మరించుట, బోధించుట, ఊహించుట, అపూర్వము నూహించుట, అర్థము తెలియుట, తత్త్వము తెలియుట నను నివి యష్టాంగములు.

పూర్వము రామచంద్రమూర్తి హనుమంతుని మెచ్చుకొనినట్లే యిప్పుడు సీతయు మెచ్చుకొనుచున్నది. దీనివలన సీతాదేవికి లక్షణజ్ఞాన మెంత క్షుణ్ణమై యున్నదో తెలియనగు.

తాత్పర్యము

వాక్యలక్షణసంపత్తి గలిగి మాధుర్యగుణముచే నలంకరింపఁబడి యష్టాంగ యుక్తమైన బుద్ధితో మాటలాడ నీవే సమర్థుఁడవు.

చ. అనిలునకున్ సుతుండవు మ • హాత్మ! పరంబగు ధార్మికుండవున్
ఘనబల శౌర్య సత్త్వ శ్రుత • కాంతిపరాక్రమ ధీరతాక్షమా

వినయధృతి ప్రశస్తగుణ • విశ్రుత దాక్ష్యగుణాదులెల్ల నో
యనఘ! త్వదాశ్రయంబున మ•హారుచిసంపదఁ దాల్చి వెలెడిన్. ౨౬ ౧౯

అర్థములు. మాటలాడుటయందేగాక గుణములందును హనుమంతుఁడు గొప్ప వాఁడని చెప్పుచున్నది, అనిలునకున్=జగత్తునకుఁ బ్రాణమై,జగత్ప్రాణుఁడనిఅనిలుఁడని పేరు పొందిన వాయుదేవునకు, అనత్యనేనేత్యనిలః, అన ప్రాణనే,ఇతనిచే బ్రతుకుదురు కావున అనిలుఁడని వ్యుత్పత్త్యర్థము. సుతుఁడవు=పుత్త్రుఁడవు,కారణ గుణములుకార్యమందుండును గావున నీయందును బ్రదికించు గుణములుగలవు. కావుననేకదా నన్ను బ్రదికించితివి. లక్ష్మణుని వానరులను బ్రదికించితివి. ధార్మికుండవు = ధర్మగుణముగలవాఁడవు, బలము = ప్రయాసము సహించు శక్తి, శౌర్యము=యుద్ధోత్సాహము, సత్త్వము = దేహసారము, శ్రుతము = శాస్త్రజ్ఞానము; "శ్రుతం శాస్త్రావధృతయోః" అమరము, కాంతి=తేజస్సు, పరాక్రమము = సామర్థ్యము, ధీరతా=ధైర్యము, కలఁతపడ కారణ మున్నను గలఁత పడకుండుట, క్షమ = ఓర్పు, అపరాధమును సహించుట, వినయము = అణఁకువ, ధృతి=ధారణాశక్తి, ప్రశస్త = పొగడఁబడిన గుణములచే. విశ్రుత = ప్రసిద్ధికెక్కినవాఁడా, దాక్ష్యము=కార్యములందు నేర్పరితనము, త్వదాశ్రయంబునన్= నిన్నాశ్రయించుటచే.

## తాత్పర్యము

మహాత్మా! నీవు వాయుదేవునకుఁ గుమారుఁడవు. మిక్కిలి ధర్మగుణము గలవాఁడవు. గొప్పబలము శౌర్యము సత్త్వము జ్ఞానము కాంతి పరాక్రమము ధైర్యము ఓర్పు వినయము ధారణ యీ మొదలయిన గుణములచేఁ బ్రసిద్ధుఁడవు. నేర్పరితనము లోనైన గుణములు నిన్నాశ్రయించి మిక్కిలి కాంతి గలవై ప్రకాశించు చున్నవి, గాని వానివలన నీకు వచ్చిన ఘనత లేదు.

## —• హనుమంతుఁడు రాక్షసస్త్రీలఁ జంప సీతాదేవి యనుమతి వేఁడుట •—

తే. ఆమెవచనంబులను విని • హస్తయుగళి
మోడ్చి వినయంబు దోఁకఁగ • ముగుద కనియె
హనుమ యో తల్లి! యీ రాక్ష • సాంగనాళి
ననుమతించెద వేని నే • హత మొనర్తు. ౨౬ ౨౦

## తాత్పర్యము స్పష్టము.

సీ. పతిదైవముగ నీవు • భావించి యీవనిఁ గడుదుఃఖములఁ గుందఁ • గరుణ లేక
ఘోరరూపంబులఁ • గ్రూరశీలంబులఁ గ్రూరతరాక్షులఁ • గ్రూర లైన
రాకాసు లెల్లఁ బూ • ర్వము నిన్ను నదరించి, బెదరించి కష్టంబు • పెట్టువారు
వారి నెల్లర నేఁడు • పదములఁ గరముల, మోఁకాల డాకాల•ముష్టిహతులఁ

తే. జంపువాఁడను జెవులను♦ద్రెంపువాఁడ, వెంద్రుకలులాగి మొగములఁ♦బెటికిబటికి
యెగిరి దూఁకి పడంద్రోచి♦యీడ్చిపండ్లు, రాలఁగొట్టెద నిట్టి వా♦రమ్మ నిమ్ము.

అర్థములు. వనిన్ = వనమునందు, క్రూరశీలంబులన్ = క్రూరములైన నడవడులచే, క్రూరతరాక్షులన్=మిగుల క్రూరములైన చూపులచే, క్రూరలు= దయలేనివారు, డాకాలన్=ఎడమ కాలితో, ముష్టిహతులన్ = పిడికిటిదెబ్బలచే,

తాత్పర్యము స్పష్టము.

—♦ సీతాదేవి హనుమంతునితో రాక్షసస్త్రీలఁ జంపరాదనుట ♦—

కం. ఈరీతిఁ గూల్తు నీకప. కారిణులం గిల్బిషాత్మ♦కలఁ గ్రూరల నా
జారుగుణ సద్యశస్విని, మారుతసుతు ననియె ధర్మ♦మార్గస్థిత యై. ౨౬౨౨

అర్థములు. అపకారిణులన్ = అపకారము చేసిన స్త్రీలను, కిల్బిషాత్మకలన్ = పాపపుమనస్సు గలవారిని, చారుగుణ = మనోహరములైన గుణములు కలది, సద్యశస్విని=సత్కీర్తిగలది, ధర్మమార్గస్థితయై=ధర్మమార్గ మందున్నదై.

తాత్పర్యము

నీకపకారము చేసిన పాపపు మనస్సుగల దయలేని యీ స్త్రీలను నీ విధముగాఁ జంపుదును అని చెప్పఁగా మనోహరగుణములు గలిగి సాధుగుణము గలదని కీర్తి కెక్కిన సీతాదేవి ధర్మమార్గమం దున్నదై యిట్లనియె.

కం. రాజాశ్రయమున బ్రదుకుచు, రాజాజ్ఞకుఁ జిక్కి మిగుల♦ స్రగ్గి కెలస మ
వ్యాజగతిఁ దీర్చు నీదా సీజనములమీఁదఁ గినియఁ♦జెల్లునె నీకున్. ౨౬౨౩

అర్థములు. రాజాశ్రయమునన్ = కడుపుకూటి నిమిత్తమై రాజునాశ్రయించి బ్రదుకుచు.

తాత్పర్యము

రాజు నాశ్రయించి రాజునాజ్ఞకు లోపడి యడఁగి పడియుండి రాజుకార్యమును నిర్వహించనముగ నెఱవేర్చు నీ దాసీజనములమీఁద నీవు కోపపడవచ్చునా ?

కం. విను నాదురదృష్టంబున, మును చేసిన ఘోరపాప♦మున దుఃఖములో
హనుమ! యిటు లనుభవించితిఁ; దనచేసినకర్మ మెందుఁ♦దప్పుట గలదే ?

తాత్పర్యము స్పష్టము.

కం. ఇది యొందుదశాకాలము, కదిసెను నా కనుభవింతుఁ ♦ గా కని హనుమా!
మది నిశ్చయించి వీరల, బెదరులు నే సైచుకొంటి♦ విధిలేకబలన్. ౨౬౨౫

తాత్పర్యము

"కం. కలకాలము లే దలమట, కలకాలము లేదు సుఖము కాయము మోవం
గలిగిన నటుకొన్నాళ్ళీ, యిల నిటుకొన్నాళ్ళు దీని కేలావగవన్." పంచతంత్రము.

అను నీతిశాస్త్రవాక్యము ననుసరించి కొన్నాళ్ళు సుఖమనుభవించితిని. అదశ మాఱినది. ఇప్పుడు దుఃఖకాలము ప్రాప్తించినది. అది యనుభవించినట్లే దీని ననుభ

వింపవలయును అని యాంజనేయా! మనస్సున నిశ్చయించుకొని వేఱు మార్గము లేకుండుటను బలహీనను గావున వీరి బెదరింపులు సహించితిని. ప్రతీకారసామర్థ్యము లేనప్పుడు సహనమే సముచితము.

కం. నిర్జరవిరోధిపనుపున, దర్జించిరి వీర లతని • దాసులు గానన్
నిర్జితుఁ డౌట దశాస్యుఁడు. దర్జింతు రె యింక నన్నుఁ • దరుచరవర్యా!

అర్థములు. నిర్జరవిరోధి=రావణాసురునియొక్క, పనుపునన్ = ఆజ్ఞచేత, తర్జించిరి=భయపెట్టిరి, నిర్జితుఁడు=చంపఁబడినవాఁడు, తరుచరవర్యా=వానరశ్రేష్ఠా.

తాత్పర్యము

రావణుని కొలువునం దుండుటచే వాని దాసులు గావున వాని యాజ్ఞ చొప్పున వాఁడు చెప్పినట్లు వినకున్న చంపునని భయపడి నన్ను వీరు బెదరించిరి. ఇప్పుడు వాఁడు చచ్చెను. ఇప్పుడు వీరు వాని దాసులు గారు కావున నిఁక వీరు నన్ను బెదరింతురా? నాయందు వీరికి స్వయముగ ద్వేషబుద్ధి లేదు. వీరు పాపాత్మక లంటివి-వాని కొలువునందుండు దోషము తప్ప వీరియందు మఱి యేదోషము గలదు? వీరిచే నీ కార్యము చేయించిన దోషము వానిదిగాని వీరిది గాదు. వానికి భయపడిగదా వీ రీ కార్యము చేసిరి? కావున వీరియందుఁ బాపము లేదని నా యభిప్రాయము.

కం. మున్నొకవ్యాఘ్రంబునకుం, బన్నుగ వచియించె నొక్క • భల్లుక మీయ
త్యున్నతధర్మాన్వితమై, సన్నుతి గను నొకపురాణ • సచ్ఛ్లోకంబున్.

అర్థములు. అత్యున్నత ధర్మాన్వితము=ఉత్తమధర్మముతోఁ గూడినది; పురాణ+సత్+శ్లోకంబున్=పూర్వులు చెప్పిన యొక మంచి శ్లోకము.

తాత్పర్యము

ఈ విషయమునఁ బూర్వమొక యెలుఁగొక వ్యాఘ్రమునకు నుత్తమ ధర్మముతోఁ గూడిన యొక మంచి శ్లోకము చెప్పెను. అది చెప్పెద వినుము.

కం. తన కపకార మొనర్చిన; మనుజున కపకృతి నొనర్ప • మదిఁ దలఁపఁడు స
జ్జనుఁ డీనియతిం బ్రోవఁగఁ, బొనరున్ సజ్జనులు శీల • భూషణు లెందున్.

తాత్పర్యము

ఒకఁడు తనకు నపకారము చేసినను దాను సజ్జనుఁ డగునేని వానికి బదులపకారము చేయరాదు. ఈ నియతిని రక్షింప వలయును. ఏలన సజ్జనులకు శీలమె భూషణము. పూర్వమొక యడవిలో నొకపులి వేఁటగానిని దఱుముకొనివచ్చెను. వాఁడుపరువెత్తి యొక చెట్టెక్కెను. ఆ చెట్టుమీఁద నొక యెలుఁగుండెను. వాఁడు దానినిజూచి భయపడెను. నేనుండు చోటికి నీవు భయపడి వచ్చితివి. నిన్నుఁ జంపనని యది వానికి ధైర్యము చెప్పెను. పులి యెలుఁగును జూచి వీఁడు మన మృగజాతికే శత్రువు. కావున వీనిని గ్రిందఁ బడఁద్రోయు మనెను. వీఁడు నన్నాశ్రే

యించినవాఁడు కావున నేను బడఁద్రోయనని యది యందే నిద్రించెను. అప్పుడు పులి యోరి మూఢుఁడా! నిన్నది రక్షించుట నీయందు దయగలిగికాదు. నేను వెడలి పోఁగానే తాను నిన్నుఁ జంపఁదలఁచినది. అది నిద్రలేచి నిన్నుఁ జంపును. కావున దానిని గ్రిందఁ ద్రోయుమనెను. వాఁ డట్టులే చేసెను. అది యభ్యాసవశమునఁ గ్రిందఁబడక మఱియొక కొమ్మ పట్టుకొని పైకెక్కెను. అప్పుడు పులి నేను జెప్ప లేదా. వీఁడు ద్రోహి, నిన్నుఁ జంప యత్నించెను. కావున వానిని గ్రిందఁ ద్రోయుమనెను. అప్పు డా యెలుఁగువాఁడు ద్రోహియైన నేనును ద్రోహి గావ లయునని నిర్బంధముగలదా? అట్లు వాని నేను గ్రిందఁ ద్రోయుట ధర్మముకాదు. నేను ద్రోయననెను. పులి వెడలిపోయెను. వేటకాఁడును చెట్టుదిగి పోయెను.

శరణాగతరక్షణవిషయమై రామచంద్రమూర్తి సుగ్రీవునకు కపోతాఖ్యా నము చెప్పెను ఇప్పుడు సీతాదేవి హనుమంతునకు ఋక్షగీతము జెప్పెను. ఈ రాక్షసస్త్రీలు సీతాదేవికి శరణాగతలు. మిమ్ము రక్షించెద నని యభయ మిచ్చి నది. కావున వారిని రక్షింపవలసినభార మామెయం దున్నది.

కం. కపివర! పుణ్యులలోఁ బాపపుజనములలోన వధకుఁ • బాత్రులకల్లన్
కృపఁజూపవలయు సజ్జనుఁ డపరాధముఁ జేయనట్టి•యతఁడుం గలఁడే.

తాత్పర్యము

వానరేంద్రా? పుణ్యులు గాని పాపులు గాని వధ కర్హులై రేని అట్టివారి యందు సుజనుఁడు కృప చూపవలయును గాని వారిని జంపరాదు. ఏలన లోకమునం దపరాధము చేయనివాఁడు లేఁడు. హనుమంతా! నేను వీరి కే యపకారము చేయకున్నను వీరు నన్ను నిష్కారణముగ బాధించిరి కావున వీరు పాపాత్మకలని నీ యభిప్రాయము. వీరు పరాధీనపుబ్రదుకుబ్రదుకుచు స్వాతంత్ర్య మనునది లేక తమ్ము రక్షించువాని యిష్టప్రకారము నడవకుండిన వాఁడు చంపునని భయపడి నన్ను బాధించిరి గాని నా యందలి ద్వేషబుద్ధిచేఁగాదు. కావున వీరు పాపాత్మకలు గారని నా యభిప్రాయము.

నీ యభిప్రాయప్రకారము వీరు పాపినులైనను నా యభిప్రాయప్రకారము వీరు పాపినులు కాకున్నను వీరు వధ్యులే యైనను చంపఁబడఁదగరు. వీ రపరాధిను లనికదా వీరిని జంపెద నంటివి? లోకములో నపరాధము చేయనివా రెవరు? కావున నీ యభిప్రాయప్రకారము లోకమున రక్షింపఁదగినవారు లేరు. ఆకారణ మున సజ్జనుఁడను వాఁడును లేఁడు. రక్షించువాఁడు సజ్జనుఁడు. రక్షింపఁదగిన వాఁడే లోకములో లేనప్పుడు ఇఁక సజ్జనులతో నేమిపని? ఎవనిని సజ్జనుఁ డనవలె?

హను:-అమ్మా! నీవు చెప్పిన ప్రకారము లోకమున నందఱు వర్తించిరేని దండ భయములేని కారణమున నందఱు పాపమే చేయుదురు. లోకము పాపభూయిష్ఠ మగును. సజ్జనుఁ డనువాఁడే యుండఁడు. ఇట్టి స్థితి నీకు సమ్మతమా?

సీత:—ఆంజనేయా! 'యోగ్యః పురుషో నాస్తి, అయోగ్యః పురుషో నాస్తి' యన్నట్లు లోకమున కేవల యోగ్యుఁడనికాని కేవల మయోగ్యుఁడనికాని చెప్పఁదగినవాఁ డొక్కఁడు లేఁడు. ప్రకృతి గుణములకు నందఱు పాలుపడినవారే. ఒకసారి కాకున్న నొకసారియైన నొక పాపమైనఁ జేయువారే. కావున నీమతప్రకారము పోయిన నందఱను జంపవలసియేయుండును. లోకము జీవకోటిశూన్య మగును. దయ కెడమే యుండదు. ఇట్టి స్థితి నీకు సమ్మతమా ?

నా యభిప్రాయము చెప్పెద వినుము. పుణ్యాత్ములను మనము రక్షింపఁబని లేదు. వారి పుణ్యమే వారిని రక్షించు. రక్షింపఁబడవలసినవారు పాపాత్ములే. అట్టివారు మన రక్షణము కోరినేని వా రెటువంటివారని పుణ్యులా పాపులా యను విచారములేక రక్షింపవలయును. మనల నాశ్రయింపకపోయిరా వారిని దండింప వచ్చును. నేను రావణునకు శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహము సంపాదించు కొనుమని చిలుకకుఁ జెప్పినట్లు చెప్పితిని. వాఁడు నామాట వినఁడయ్యెను. వానిని జంపుట దోషమని నేనందునా? పాపాత్ములఁ దండింపవలయుననుట సామాన్య శాస్త్రము. శరణాగతుల రక్షింపవలయుననుట విశేష శాస్త్రము. విశేష శాస్త్రము సామాన్యశాస్త్రమును బాధించునుగాని సామాన్యశాస్త్రము విశేషశాస్త్రమును బాధింపదు. కావున వీరిని నీవు చంపరాదు. నామతప్రకారము దండ్యులను దండింప వలయునను సామాన్యశాస్త్రము భంగమయ్యెనేని శరణాగతుల రక్షింపవలయు నను విశేషశాస్త్రము నీవలన భంగమగును. ఏది మేలో యాలోచింపుము.

ఇది సీతాదేవి యభయప్రదాన పద్యము.

తే. మైత్రిభావించి తాన సంప్రాప్తుఁడైన, వాని నెటులైనఁ జేవీడువాఁడఁ గాను
వానియెడ నుండునేని నేదేని దోష, మద్ది గర్హ్యంబుగాదు సదాళిలకును.

అనునది రామచంద్రమూర్తి యభయప్రదాన పద్యము.

ఈ రెండును సమానార్థకములుగాఁ దోచినను వ్యక్తిస్వభావమునుబట్టి తల్లి దండ్రులయందుండు భేదము సీతారాముల వాక్యములయందుఁ గానవచ్చెడిని. తల్లి యెప్పటికి రక్షించు గుణము గలదేకాని దండపారుష్యము గలది కాదు. తండ్రి యందు దండించు గుణముగలదు. ఈ తారతమ్యమే యీ రెండు పద్యములందుఁ గలదు.

మైత్రి భావించి శరణాగతి చేయవలయునని రామచంద్రాభిప్రాయము. అట్టులే విభీషణుఁడు వచ్చి శరణు జొచ్చెను.

సీతాదేవి రాక్షసస్త్రీలు శరణుజొచ్చుట ప్రీతిచేఁగాదు, భీతిచేత, స్వయముగఁగాదు, త్రిజట ప్రేరణముచేత మైత్రి పాటింపకున్నను సీతాదేవి రాక్షసస్త్రీల రక్షించెను.

శరణాగతునందు దోష ముండినను దానిని లెక్కకుఁ దీసికొనరాదని రామచంద్రుమతము. దీనివలన దోషజ్ఞానము రక్షకునకుఁ గలదని యేర్పడుచున్నది.

శరణాగతుఁడు పాపియా పుణ్యుఁడా యను విచారమే కూడదనియు పాహి యనఁగానే అభయమ్మనవలయు ననియు సీతాదేవి మతము.

స్వతంత్రించి సీతాదేవి శరణాగతలైన రాక్షసస్త్రీల రక్షించుటచే నామె యందుఁ బురుషకారమేగాక శరణాగతరక్షణమందు స్వతంత్రశక్తియుఁ గలదని యేర్పడుచున్నది. భర్తృసన్నిధానమందుఁ బురుషకారభూత యనియుఁ బరోక్షమందు స్వతంత్రశక్తియనియు గ్రహింపవలెను.

తే. పాపములె చేయుచును గామ•రూపులగుచు
 భువనహింసావిహారు లై•పొలుచుచున్న
 యసురులకుఁ గీడు సేత కా•ర్యంబు గాదు
 సుమ్మటన్నను హనుమ యా•సుదతి కనియె. ౨౬౩౦

## తాత్పర్యము

ప్రాణములు దీయువారు కావున వీరసురు లనఁబడిరి. వీరు స్వభావముగఁ బాపములు చేయువారు, ఆ పాపములు చేయుటకు నెట్టి రూపములు ధరింపవలెనో యట్టి రూపములను ధరించువారు, వారుచేయు పాపమా లోకహింసయే కావున వీరు వధ్యు లందమా యనిన నా మతమునఁ గారు. వీరు పాపాత్ములని వారిని దండింపరాదు. ఏలయందువా వారి కా గుణము ప్రకృతిసిద్ధము. పుట్టువతోనే వచ్చినది. స్వభావము దురతిక్రమము. అది నీవు దండింపఁగానే పోవునదికాదు. పుట్టుతామసుని దండించినంతమాత్రముచేతనే సాత్త్వికుఁడుగాఁడు. పులిని తోఁడేలిని నీవు దండించినంతన గోవు కాఁజాలదు. వారువారు చేసిన పాపములకు వారువారు నరకశిక్ష యనుభవించి మఱుజన్మములందు, ఆ మఱుజన్మంబులందుఁ జిక్కఁబడవలయునుగాని యమునికృత్యము మనము చేసి చక్కఁబెట్టఁజాలము. దండమే మన కార్యముగ నెంచితిమేని క్రమక్రమముగ మన హృదయములు దయాశూన్యములై కఠినములగును. వారు బాగుపడుట యసత్యము, మనము చెడుట సత్యము.

అట్లుగాక మనము క్షమించితిమేని వారి మనస్సులం దొకవిధమైన మార్పు గలుగవచ్చును. "ఈమె విషయమున మనమింత క్రూరముగ వర్తించినను ఆకారణముచే మనము హింసకుఁ దగినవారమైనను కేవలదయను బురస్కరించుకొని యీమె మనలను రక్షించెను. ఈ వానరుఁడు మనలఁ జంపెదననిన నెంత భయపడితిమో మన మీమెను జంపెద మన్నప్పుడంత భయపడియుండునుగదా. ఛీ! దయలేని మన బ్రదు"కేమి బ్రదు కని వారికే తోఁచి యిఁకమీఁద నిట్టికార్యము మానినను మానవచ్చును. కావున దయకుఁ బారుష్య మేనాఁటికి సరిగాదు.

హను :— అమ్మా! యట్లైన నీవేల రావణుఁ జంపుమని నాచేతనే చెప్పి పంపితివి? వానికది స్వభావము అని నీ బాధ నీవు పడుచుండరాదా? ఇందఱ కేల యింత కష్ట మిచ్చితివి ?

సీత :— ఆంజనేయా! వారి కది స్వభావము కావున వారిచేతిలో మనము చిక్కి బాధపడవలయునని నా మతముగాదు. మన యాత్మరక్షణమునకై యెంత కృషి చేయవలయునో యంత కృషి చేయవలసినదే. మానరాదు. ఆత్మరక్షణ మవశ్యకార్యము. రావణుఁడు నయభయములకు లోఁబడినవాఁడు కాఁడు. సామ దానభేదములకు వశపడినవాఁడు కాఁడు. నే నెన్నోవిధములఁ జెప్పితిని. వాని వారలు చెప్పిరి. ఎవరుచెప్పినను వాఁడు నన్ను బాధించుట మానినవాఁడు కాఁడు. కావున నాత్మరక్షణమునకై నాకు స్వతంత్రశక్తి లేదుగావున నా భర్తను బిలిగొల్పవలసి వచ్చెను. ఇది నా రక్షణార్థమే కాని వానిని శిక్షింప వలయునను పట్టుదలతో గాదు. ఈ రాక్షసస్త్రీ లిట్టివారు కారు. కావున వీరిని రక్షింపవలయును.

ఈ స్త్రీలు సీతాదేవికి శరణాగతి చేసిరి. ఆమె యభయమిచ్చెను. శరణాగత రక్షణ విషయమున నీమె యభిప్రాయ మెట్టిదో క్రోధమునకుఁ బాలుపడునో పడదో పరీక్షింపఁగోరియే హనుమంతుఁ డామె నీ వరముఁ గోరెను. దీన సీతాదేవి సర్వభూతదయాళుత్వము అపరాధసహిష్ణుత్వము ఘటకత్వము ప్రకటపడెను. ఇట్టి యభిప్రాయము హనుమంతునికి లేదేని దిక్కుమాలిన యాఁడువారిమీఁదనా తన బలము చూపఁగోరెను. ఎదిరించిన లంక యాఁడు దని మెల్లగాఁ గొట్టిన వాఁడీ యాఁడువారలఁ జంపఁదలఁచునా?

శ్రీరాముడు నిర్దోషి కభయమిచ్చెను. సీతాదేవి సాపరాధుల కభయ మిచ్చెను. జగన్మాత యిట్లుగాక మఱి యెట్లు చేయఁగలదు? విభీషణరక్షణమందు శ్రీరామునకుఁ బ్రతిఫలకాంక్ష కలదేమోయని సందేహింపనైనఁ గారణము కలదు. సీతయందట్టిసందేహమున కెడమే లేదు.

ఈ ప్రకారము చెప్పఁగా హనుమంతుఁడు సీతాదేవితో నిట్లనియె.

**—• సీతాదేవి శ్రీరాముఁ జూడఁగోరుట •—**

కం. రామునకుఁ దగినపత్నివి, శ్యామా! సత్కీర్తియుక్త • వగు మింక నే
రామునికడ కేగెద నీ, వేమి బదులు చెప్పె దనిన • మృగలోచనయున్. ౫౬౩౧

తాత్పర్యము స్పష్టము.

కం. పతిఁ గనఁ గోరెద మారుత, సుత! యనఁ నతఁడనియెఁ బూర్ణ • శుభ్రాంశుముఖున్
హతవైరి లక్ష్మణాన్వితు, సతి! నిర్జరయుక్తశక్ర • సముఁ గనెదు విభున్. ౫౬౩౨

అర్థములు. పూర్ణశుభ్రాంశుముఖున్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలవానిని, హతవైరిన్ = విరోధులఁ జంపినవానిని, నిర్జరయుక్త = దేవతలతోఁ గూడిన, శక్రసమున్ = ఇంద్రుని బోలినవానిని.

**తాత్పర్యము**

ఆంజనేయా! నా భర్తను నేను జూడఁగోరుచున్నాను అని చెప్పఁగా నిండు చందురుఁ బోలు మోముగలవానిని పగవారిని జంపిన వానిని లక్ష్మణునితోఁ గూడి యుండువానిని దేవతలతోఁ గూడినయింద్రుని బోలినవానిని నీపతిని నీవుచూచెదవు.

కం. అని సాక్షాచ్ఛ్రియనఁ దగు, వనజాక్షికిఁ జెప్పి భక్తి • వలగొని రాముం
గనుఁగొనఁ దన్నికటమునకుఁ జనియెన్ వాయుజుఁడు వేగ • సంపద వెలయన్.

అర్థములు. సాక్షాత్ + శ్రీ = ప్రత్యక్షమైన లక్ష్మీదేవి, వలగొని = ప్రదక్షిణ నమస్కారములు గావించి, తన్నికటమునకున్ = రాముని సమీపమునకు.

**తాత్పర్యము**

ఈ ప్రకారము ప్రత్యక్ష లక్ష్మీదేవి వలెనున్న యా కమలాక్షికి చెప్పి యామెకు ప్రదక్షిణ నమస్కారము లాచరించి రామచంద్రమూర్తినిఁ జూచుటకు వేగముగ నాయనసన్నిధికిఁ బోయెను.

## —• { ౧౧౭-వ సర్గము. సీతాదేవి సందేశమును హనుమ శ్రీరామునితోఁ జెప్పుట. } •—

మ. చని కోదండగురూత్తముం గదిసి వా • చాదక్షుఁ డౌ నా మరు
త్తనయుం డిట్లను నేమెకై కడు నసా • ధ్యంబైన కార్యంబులన్
ఘనశక్తిన్ ఘటియించి తత్ఫలము లం • కానాథనాశంబు నీ
వొనరం జేసితి వట్టిసీత బహుదుః • ఖోపేతఁ గానందగున్. ౨౬౩౪

అర్థములు. వాచాదక్షుఁడు = మాటలయందు నేర్పరి.

**తాత్పర్యము**

ఇట్లు పోయి విలువిద్య నేర్చినవారిలో మిగుల గొప్పవాఁడగు రామచంద్రు సమీపించి మాటలయందు నేర్పరి యగు నాంజనేయుఁ డిట్లనియె రామచంద్రా! యేమెనిమిత్తమై మిగుల నసాధ్యమైన కార్యములు చేసి దానికి ఫలముగా రావణుఁ జంపితివో యట్టి సీతను దుఃఖించుచున్న దానిని జూడఁదగును.

కం. శోకాకులమతియై యస్రోకాశ్రులు గాఱ వనట • ప్రసుక్కుచు నుండిన్
త్వాన్మకన్యక సీవిజయం బాకర్ణించినక్షణంబ • యతిముద మందెన్. ౨౬౩౫

అర్థములు. శోకాకులమతియై = శోకముచేఁ గలఁతబడిన మనస్సుగలదై, అస్రోకాశ్రులు = విశేషముగఁ గన్నీరు, వనటన్ = దుఃఖముచే, ఉండిన్ = ఉండియును, సముచ్చయము 'యు' లోపింపఁగా మిగిలినరూపము.

తాత్పర్యము

శోకముచేఁ గలఁతచెందిన మనస్సు గలదై కన్నీళ్ళు విశేషముగఁ గార్చుచు దుఃఖించుచున్నను నీ గెలుపు విన్నమాత్రముచేతనే యా నిమిషమందే సీతాదేవి మిగుల సంతోషించెను.

కం. మునుపటినమ్మకమున నా, జనకాత్మజ నన్ను నమ్మి • సహలక్ష్మణునిన్
గనఁగోరెద సుకృతార్థుని, వనజేక్షణుఁ డైననాదు•వల్లభు ననియెన్. ౨౬౩౬

తాత్పర్యము

పూర్వము నేను నీ దూతనని నమ్మిన దగుటచే నిప్పుడు నీవు పంపిన వచ్చినా నని నమ్మి లక్ష్మణుతో నుండు నా వల్లభుని చక్కఁగా గార్యము నెఱవేర్చినవానిని కమలమువంటి కన్నులు గలవానిని జూడఁగోరుచున్నదాన ననెను.

సుకృతార్థుని నిన్నుఁ జూడఁ గోరె ననుటచే నీ వీ కార్యము నెఱవేర్పకున్నని న్నామె చూడ నిచ్ఛగించియుండదు అని భావము.

**—• శ్రీరాముఁడు సీతాదేవిఁ దోడితేర విభీషణు నియోగించుట. •—**

చ. అని హనుమంతుఁ డాడ సుకృ•తాత్మవరేణ్యుఁడు రామభద్రుఁడున్
గనుఁగవ నశ్రు లుబ్బ నిలఁ • గాంచుచు హుస్సని వెచ్చనూర్చుచున్
దనమదిఁ జింతచేసి సవి • ధస్థితు మేఘనిభున్ విభీషణున్
గనుఁగొని ధర్మసంశ్రయ ! వి • కారవిదూర ! సురారినాయకా ! ౨౬౩౭

అర్థములు. సుకృతాత్మ వరేణ్యుఁడు = ధర్మాత్ములందు శ్రేష్ఠుఁడు, ఇట్లు చెప్పుటచే నీయన చేయఁబోవునది ధర్మవిరుద్ధము కాదని భావము. కనుఁగవ నశ్రులుబ్బన్=కన్నుల నీళ్ళూరఁగా, ఇలఁ గాంచుచున్ = చింతాపారవశ్యముచే నేమియుఁ దోపక, భూదేవీ నీకడుపునఁ బుట్టినదానికిఁగూడ నిట్టికష్టదశ వచ్చెఁగదా యని నేలఁ జూచుచు, హుస్సని వెచ్చనూర్చుచున్=శ్వాసము బలమున విడుచుటచే హుస్సను శబ్దము పుట్టగా వేడిశ్వాసము పుచ్చుచు, చింతాబలము దీర్ఘమగు కొలఁది శ్వాసము బలము దీర్ఘముగా నుండును. చింతచేసి = చిరకాలము రావణు నింట నుండుదానిని, దటాలునఁ బరిగ్రహించిన లోకములో మహాపనింద కలుగును. లోకమునకై నిర్దోషురాలిని విడిచిన మహాదోషము తప్పదు. ఈ సంకటమం దేమి చేయుదునా యని విచారము, సవిధస్థితున్=సమీపమందుండు వానిని, మేఘనిభున్= మేఘముతో సమానమైన వానిని మేఘమువలె వేగముగాఁ బోఁగలవానిని, ధర్మ సంశ్రయ = ధర్మము నాశ్రయించి యుండువాఁడా ! వికారవిదూర = వికారము లేనివాఁడా.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడగు రామ భద్రుఁడు ఈపదినెలలుగా నానాబాధలు పడుచుండుదానిని శత్రువులు పెట్టినబాధ

చాలదని నేనుగూడ బాధపెట్ట వలసివచ్చెఁగదా యని కన్నుల నీరుబుకఁగా చింతచే పరవశుఁడై యేమియుఁ దోఁపక నేలచూచుచు వేఁడియూర్పును హుస్సని యూర్చుచు దీర్ఘకాలము, పగవాని-దుష్టుని, యింట నున్నదానిని గాముకుఁడై రాముఁడు మరలఁ బరిగ్రహించెనని లోకు లందు రేయని నిర్దోషురాలిని కఠినవ్రతముల నుండుదానిని నెట్లు విడిచి మహాదోషము మెడఁ గట్టుకొందునని చింత చేయుచు, సమీపమం దున్న వానిని మబ్బువంటివానిని విభీషణుఁజూచి ధర్మమున కాశ్రయమైన వాఁడా? వికారములేని మనస్సుగలవాఁడా! రాక్షసరాజా!

కం. సీతను వసుంధరాసం, జాతను దివ్యాంగరాగ•సకలాభరణో
 పేతను వేగమ మూర్ధ, స్నాతనుగాఁ జేసి తోడి•చయ్యనఁ దెమ్మా. ౨౬౩౮

అర్థములు. వసుంధరాసంజాతను = భూమియందుఁ బుట్టినదానిని, కావుననే యయోనిజను, దివ్యాంగరాగ = దివ్యములైన గంధాదులు పూసికొనినదానినిగా, సకలాభరణోపేతను = సమస్త భూషణములు ధరించిన దానిఁగా, మూర్ధస్నాతనుగా = తలంటుకొని స్నానము చేసిన దానిఁగా.

తాత్పర్యము

భూకన్యయగు సీతాదేవిని వేగముగ శిరస్స్నానము చేయించి గంధాదులు పూసికొనఁజేసి ఆభరణములు ధరింపఁజేసి తీసికొని రమ్ము.

రామచంద్రమూర్తి యుద్దేశము మంచిదైనను జేసినది సరియైనను గఠిన విషమ పరీక్ష దలఁచినపు డీయన రాక్షసుఁడా యని నోరారఁ దిట్ట బుద్ధి పుట్టుచున్నది.

ఉన్న దున్నట్లు వచ్చెనేని యామెను జూచిన నెట్టి వారికిని రాక్షసులకైనను కన్నీరు రాక యామెయందు జాలి పుట్టక తప్పదు. అట్టి సమయములోఁ దాను జెప్పఁ దలఁచిన కఠినవాక్యములు చెప్పినచో వినువా రందఱు నీయన రాముఁడు కాఁడు, రాక్షసుఁడు, కాకున్న నిట్టి యామెను నిట్లు మాటలాడునా యని తన్ను నిందింతురు. ఆ నింద తప్పించుకొనని ట్లుపాయము చేసెను.

సీ. అనుడు వేవే పోయి • యంతఃపురస్త్రీల, ననిచె సీతాసతి•కిని వచింప
 దివ్యాంగరాగవై • దివ్యభూషాంచిత, వై దేవి చతురంత•యానమెక్కి
 మీ నిన్ను నీభర్త•యీక్షింపఁ గోరెడు, నీకు భద్రం బగు • నియమశీల
 యనిన జానకి పల్కె•నస్నాత నగుచును, నసురేంద్ర! పతిఁ జూడ•నభిలషింతు
తే. నన విభీషణుఁడనిమెసీ•ప్రాణవిభుని, యాజ్ఞ యిది రాజప్రాణేశుఁ•డైన రాముఁ
 డెట్లు వచియించె నారీతి•నీవు సేయ, నర్హమగుఁగాదె యనిన నా•యవనితనయ.

అర్థములు. చతురంతయానము = పల్లకి, అస్నాత = స్నానము చేయనిదానవై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా నిగుడఁ ద్వరగాఁ బోయి యావార్త సీతకుఁ జెప్ప నంతఃపురస్త్రీలను బంపి తానును బోయెను. పోయి యమ్మా! నీవు దివ్యచందనాదులు పూసికొని దివ్యాభరణములు ధరించికొని పల్లకి యెక్కుము. నిన్ను నీభర్త చూడఁగోరుచున్నాఁడు. పతివ్రతా! నీకు మేలగును అనిన జానకి నేను స్నానము చేయకయే చూడఁగోరెదను అని తన యభిప్రాయము స్త్రీలతోఁ జెప్పించెను. ఆ మాట విని విభీషణుఁ డిది నీభర్తయాజ్ఞగాని నాకోరిక కాదు. నీకు భర్తయు రాజు నగు వానియాజ్ఞ నీవు పాలింపవలయునుగదా యనిన నాసీతయు.

తే. భర్తృదేవత నిజభర్తృ♦భక్తిశీల, సాధ్వి వల్లె యటం చట్లు ♦ సలిపె నంత
జలక మాడించి భూషణ♦జాలభూషి, తాంగి నొనరించి దివ్యవ♦స్త్రాళు లిచ్చి.

అర్థములు. భర్తృదేవత = పతియే దైవముగా నెంచినది. నిజభర్తృభక్తిశీల=తన భర్తయందు భక్తిగలదై యుండుటయే స్వభావముగాఁగలది, సాధ్వి= సాధుగుణముగల పతివ్రత, వల్లె = అట్లె కానిమ్ము, భూషణజాల = ఆభరణముల సమూహముచే, భూషితాంగి=అలంకరింపఁబడిన దేహముగలది,దివ్యవస్త్రాళులు= మంచిచీర, యుత్తరీయ మిచ్చి.

తాత్పర్యము

భర్తయే దైవమని తలఁచునదియు తనభర్తయందు భక్తిసేయుట స్వభావముగాఁ గలదియు సాధుగుణములుగల పతివ్రతయు నగుటచే సీత యట్టులే చేసెద ననెను. ఆమెను స్నానము చేయించి ఆభరణములచే నలంకరించి మంచి వస్త్రము లిచ్చి.

తే. మెఱుఁగులీనెడువస్త్రముల్ ♦ మేలిముసుఁగు, గాఁగ రాక్షసగుప్తమై♦, కాలుదివ్య
శిబిక జానకి నెక్కించి ♦ శీఘ్రగతిని, విభుని డాయంగఁ దెచ్చె వి♦భీషణుండు.

అర్థములు. రాక్షసగుప్తమై=రాక్షసులచేఁ గాపాడఁ బడునది, శిబిక = పల్లకి.

తాత్పర్యము

తళతళ మెఱయు సరిగవస్త్రములు పైముసుఁగుగాఁ గలిగి రాక్షసులు రక్షించు పల్లకియం దామె నెక్కించి శీఘ్రముగ విభీషణుఁడు రామచంద్రమూర్తి యొద్దకుఁ దెచ్చెను.

**—♦ సీతాదేవిరాక శ్రీరామునకు విభీషణుఁడు దెల్పుట ♦—**

కం. జానకి వచ్చుట యెఱిఁగియు, ధ్యానస్థితుఁ డైన దశర♦థాత్మజుఁ గని ర
క్షోనాథుఁడు వినయంబున, జ్యానాయక! వచ్చె ♦ నని తెలుపుటయున్.

తాత్పర్యము

జానకి వచ్చుట తెలిసి కూడ నేదియో యాలోచించుచున్న రామచంద్రమూర్తితో విభీషణుఁడు రాజేంద్రా! సీతాదేవి వచ్చె నని చెప్పెను.

కం. చిరకాలము రాక్షసుమం,దిరమున వసియించి మానినీమణి యపుడం
దరుదేర వినఁడు రాముని, నరుసము దైన్యంబు రోష మావేశించెన్. ౨౮౩

అర్థములు. అరుసము = సంతోషము, శత్రువును జయించి మరల సీతను బొందఁగలిగితిని కదా యని సంతోషము, దైన్యంబు = చిన్నపోవుట, రావణు నింటఁ జిరకాలముండెనుగదా యను నవమానబుద్ధిచే దైన్యము, రోషము = కోపము, ఇప్పుడు కోపము రావలసిన కారణము లేదు. ఎవరిమీఁదఁ గోపము? చచ్చిన రావణుమీఁదనా? బ్రదికిన సీతమీఁదనా? సీతమీఁదఁ గోపించుటకునాకు చేసిన దోషమేమి?

కామమునకు విఘ్నము కలిగనేని యట్లు విఘ్నము కలిగించిన వానిపైఁ గోపమువచ్చును. సీతాదేవి యట్టులేదియుఁ జేయలేదు. కావున నీకోపము వాస్తవమైనది కాదు. తాను జెప్పఁదలఁచిన మాటలు కోపముతోఁ జెప్పఁదగినవి కావున నీ కోప మారోపితమే—నటనమేకాని సత్యముగాదు.

తాత్పర్యము

దీర్ఘకాలము రావణునింట నుండిన సీతాదేవి యందు వచ్చినదని వినఁగానే రామచంద్రమూర్తి మనస్సునందు సంతోషము దీనత్వము కోపము ఆవేశించెను.

కం. అంతట సవిమర్శంబుగ, జింతించుచుఁ గనియె ముదము చెదరిన సరమా
కాంతుని మద్విజయరతా! చెంతకుఁ గొని రమ్ము వేగ సీత నటన్నన్.

అర్థములు. సవిమర్శంబుగన్ = వితర్కముతోడ. ముదము చెదరిన = సంతోషము చెడిన, రామచంద్రుని ముఖ నయన చేష్టావాక్యముల తీరు చూచి యేదియో యనర్థముగలదని సంతోషము చెడినవాఁడయ్యెను. మద్విజయరతా= నా గెలుపునందుఁ బ్రీతిగలవాఁడా, ఇచ్చట విజయమనఁగా శత్రుజయమువలనఁ గలిగిన కీర్తియని చెప్పవలయును. శత్రుజయమం దెట్లు నీవు నాకు సహాయపడితివో యట్లు ఇప్పుడు నాకు అపకీర్తి రాకుండ నన్నుఁగాపాడుకొనుటయందునునీవుసహాయపడుము. అనఁగా నేను జేయఁబోవుపనికి నీవు విఘ్నము కలిగింపకుమని భావము.

తాత్పర్యము స్పష్టము.

సీ. రామునినుడి విని రాక్షసనాథుండు, జతనమొనర్చెఁ ద జ్జనము నెల్ల
దూరంబు దొలఁగింపఁ మూర్ణంబ కంచుకుల్, పాగాలవారును బాఱుదెంచి
తొలఁగుఁడు పొండు దూరంబు చనుఁడని, బగళంబు సేయుచు భల్లుకముల
నసురులఁ బ్లవగుల నదలింప వారల, పెనురొదాళము విను వీఁది దాఁకె
తే. వానరాదులు దొలఁగుచో వారిరవము, వాయువశమునఁ దిరుగుడు పడు పయోధి
స్వనముఁ బోలినఁ దజ్జాత సంభ్రమములను, గాంచిదాక్షిణ్యవశమునఁ గనలు పూ

అర్థములు. జతనము = ప్రయత్నము, తూర్ణంబ = వేగముగ, కంచుకుల్ =అంతఃపురము కావలివాండ్రు, బగళింబు = తోలఁగించుచు, రొదాళము = ధ్వని, తజ్జాతసంభ్రమములను=ఆ విధముగఁ గలిగిన వేగిరపాటుగలవారిని.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి చెప్పినమాట విని యచ్చటనున్నవారి నందఱ దూరముగాఁ బంప యత్నించి కంచుకులను పాగాలవారిని నియమించెను. వారు అచ్చట గుంపుగా నుండిన భల్లుకములను వానరులను రాక్షసులను తోలఁగుడు దూరము పొండని యందఱను దోలఁగింపఁగా వారి ధ్వని యాకాశమంటెను. వానరులు లోనగువారు దోలఁగి పోవునపుడు కలిగినధ్వని వాయువశమునఁ గలఁతచెందిన సముద్రము ధ్వనివలెఁ గాఁగా ఆ విధముగఁ గలఁతపడుచున్న వానరులఁజూచి వారియందుఁ గల దాక్షిణ్యముచే కోపించి.

—• శ్రీరాముఁడు విభీషణుఁ గోపించుట. •—

కం. కోపారుణనయనుం డై, చూపులనె దహించుభంగిఁ • జూఱ చుఱ గనుచున్
భూపతి విభీషణుని నిటు, సోపాలంభముగ ననియె•నుత్తమమేధున్. ౨౪

అర్థములు. రోషారుణనయనుండై =కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసినవాఁడై, సోపాలంభముగ = మర్మము నాటునట్లుగ, ఉత్తమమేధున్ = ఉత్తమబుద్ధి గలవానిని ఇట్లనుటచే విభీషణుఁ డాలోచించి సరియైన కార్యమే చేసెనని భావము. అయినను రాముని కది సరిపడినది కాదు.

తా త్ప ర్య ము

కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి చూపులనే కాల్చువానివలెఁ జుఱచుఱ చూచుచు మిగుల బుద్ధిమంతుఁడై యాలోచించి పనిచేసివాఁడైనను విభీషణునిఁ జూచి రామచంద్రమూర్తి మర్మములు నాటునట్లు నిష్ఠురవాక్యముల నిట్లనియె.

కం. ఏలా నన్ను విభీషణ!; యేలద మొనరించి జనము • నిటు లేఁచె దిఁకీ!
చాలింపుము నీయత్నము,చాలున్ వీ రెల్ల నాకు•స్వజనులు సుమ్మీ. ౨౫

అర్థములు. ఏలిదము - రూ - ఎల్లిదము = చులుకన, స్వజనులు = సమీపబంధువులు.

తా త్ప ర్య ము

విభీషణా! యేల నన్నింత యలక్ష్యముచేసి నాయెదుటనే వీరినందఱ బాధించుచున్నావు? ఛీ! నీవు చేయుపని చాలింపుము. వీరందఱు నాకుఁ గేవల మాప్తులు. ఇప్పుడు నావారిని బరిభవించినవాఁడవు తేపు నన్నుఁ బరిభవించువాఁడవేకదా.

రామచంద్రమూర్తి వానరు లందఱు నావారని చెప్పుటచే నాయనకు వానరులవలె జీతము బత్తెము గోరక నిష్కామకైంకర్యము చేయువారిని తన యాప్తులవలెనే భావించుననియుఁ దన్నవమానించినను సహించునుగాని తనవారి యవమానమును సహింపఁడనియు సూచితము.

కం. చేలములు ప్రహరు లాలయజాలంబులు నిట్టి రాజ♦సత్కృతులు తెఱల్
చాలవు చెలువలఁ గావఁగ, స్త్రీలకు సంరక్షకంబు ♦ శీలంబె చుమీ. ౨౭ ౪౧

అర్థములు. చేలములు = వస్త్రములు, అనఁగా ముసుఁగులు, ప్రహరులు=ప్రాకారములు, కోటగోడలు, ఆలయజాలంబులు = ఇండ్లసమూహములు, రాజసత్కృతులు=రాజులకుఁ గల సమ్మానములు, తెఱల్=పరదాలు, శీలంబు= చక్కని నడవడి, ప్రాతివ్రత్యము.

## తాత్పర్యము

రాజస్త్రీ యీ గుంపంతయుఁ జూచుచుండ నెట్టులు గుంపులోనికి రాఁగల దందువా? వచ్చిన నేమి? ఆ మాత్రముననే నలువురముఖము దాను జూచి నలువురు తన్నుఁ జూడఁగానే చెడిపోవునా? ఆ కారణము చేతనా రాజస్త్రీల నెవ్వరు చూడరా దందువు. అది సరిగాదు. స్త్రీలను రక్షించునవి వారి ముసుఁగులు కావు, కోటగోడలు కావు, అంతఃపురములు గావు, ఇట్టి రాజగౌరవములుకావు, తెఱలు గావు. ఇవి యేవియు స్త్రీలను గాపాడఁజాలవు వారి మనస్సు దుర్వృత్తియందుఁ బోయెనేని యివి యేవియు నడ్డము రాఁజాలవు. మనస్సు చెడినచో వారు చెడినట్టే. కావున స్త్రీలను గాపాడునది వారి పాతివ్రత్యమే; వారి సదాచారసంపత్తియే.

మనుస్మృతి తొమ్మిదవ యధ్యాయమున—

'సూక్ష్మేభ్యోపి ప్రసంగేభ్యః స్త్రియో రక్ష్యా విశేషతః
ద్వయోర్హి కులయో శ్శోక మావహేయు ररक्षिताः. ౫

కొంచెమైనను దుష్టసాంగత్యము లేకుండ స్త్రీలను మిక్కిలి జాగ్రత్తతో రక్షింపవలయును. వా రట్లు జాగ్రత్తతోఁ గాపాడఁబడ రేని వారు రెండు వంశములను (మగనివంశము - తండ్రివంశము) శోకము పాలుసేయుదురు. (నరకప్రాప్తి కలిగింతురు.)

ఇమంహి సర్వవర్ణానాం పశ్యంతో ధర్మ ముత్తమమ్
యతంతే రక్షితుం భార్యాం భర్తారో దుర్బలా అపి. ౬

బ్రాహ్మణాదులగు సర్వవర్ణములవారును వారివారి భార్యల శీలమును రక్షించుట తక్కిన యన్ని ధర్మములకంటె ముఖ్యమైన ధర్మము భర్తలు కుంటివారు గ్రుడ్డివారు బలహీనులు నైనను భార్యలశీలమును గాపాడవలయును.

అట్లు భార్యను గాపాడుటంజేసి వ్యభిచారాదిసంకరదోషములు లేమిచే పరిశుద్ధమైన సంతతిని, శిష్టాచారమును, తన పెద్దల వంశమును, పరిశుద్ధమైన సంగతివలనఁ గలిగిన పరలోకక్రియలచేతఁ దన్నును పతివ్రతయగు భార్య యుండుటచే యాగాదుల కధికారము కలదు గనుక స్వధర్మరక్షణమును జేసికొన్న వాఁడగును. కావున భార్యాసంరక్షణ మవశ్యకార్యము.

శ్లో॥ పతి ర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే,
జాయాయా స్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః ॥౦॥

తన రేతస్సు రూపమునఁ దన భార్యాగర్భమందుఁ దాను ప్రవేశించి గర్భమై యా భార్యయందుఁ బుత్రుఁడుగ జన్మించుచున్నాఁడు. కావుననే భార్యకు జాయ యని పేరు కలిగెను. ఏలన భార్యయందు మరల భర్త జన్మించుచున్నాఁడు గదా. అట్టి భార్య చెడెనేని తాను జెడినవాఁడే.

'న కశ్చి ద్యోషితః శక్తః ప్రసహ్య పరిరక్షితుమ్,
ఏతై రూపాయయోగైస్తు శక్యాస్తాః పరిరక్షితుమ్' ।

స్త్రీలను బలవంతముగఁ గాపాడ నెవ్వరికిని దరముగాదు కావున వారి నీ క్రింది యుపాయములచే రక్షింపవలయును.

'అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్,
శౌచే ధర్మేఽన్నపక్త్యాంచ పారిణాహ్యస్య చేక్షణే' ॥

ధనమును గాపాడుట, వ్యయపఱుచుటయందును, ద్రవ్యములు శరీరము పరిశుద్ధపఱచుట యందును, పతిసేవ యందును ఈ మొదలగు కార్యములందును, వంటలు వార్పులయందును గృహోపకరణరక్షణ మందును నియమింపవలయును.

'అరక్షితా గృహే రుద్ధాః పురుషై రాప్తకారిభిః
ఆత్మాన మాత్మనా యాస్తు రక్షేయు స్తా స్సురక్షితాః'॥ ౧౩

కావలివాండ్రమూలమున నిర్బంధముతో సంరక్షింపఁబడు భార్య లెప్పుడును రక్షితలుగారు. ఏ యతివలు దమ్ముఁ దాము కాపాడుకొందురో యా స్త్రీలే చక్కఁగాఁ గాపాడఁబడువారు.

దీనివలన నిర్బంధరక్షణము వ్యర్థమనియు స్త్రీలు చెడకుండుటకై వారికిఁ దగిన విద్యా నీతి మత భక్తి విషయములు దెలుపవలయుననియు మంచిచెడ్డలు దెలిసినచో వారు చెడకుందు రనియు స్మృత్యభిప్రాయము. దీనినే రామచంద్ర మూర్తియుఁ దెలిపెను.

కం. సమరంబుల వ్యసనములన్. డమరముల స్వయంవరంబు౹నం బెండ్లి యెడన్
సుమతీ! యజ్ఞములందుం, గమలాక్షుల దర్శనం బ౹ కార్యం బగునే? ౨౬-౨౭

అర్థములు. స్త్రీలు పనిలేక వీథులవెంటఁ దిరుగరాదు గాని కార్యముల పట్ల వెలికిరాఁగూడ దను నియమము లే దనుచున్నాఁడు.

సమరంబులన్=యుద్ధసంబంధమైన కార్యములందు, మందోదరీ తారలవలె, వ్యసనంబులన్ = కష్టములు కలిగినపుడు, చంద్రమతి - దమయంతి - ద్రౌపది లోనగువారివలె, డమరములన్=కొల్ల మొదలగు దేశోపద్రవములందు, స్వయం వరమునన్ = తమ భర్తలను దాము వివాహార్థము కోరు సమయమున, పెండ్లి

వొడన్ = వివాహము జరుగునపుడు, యజ్ఞములందు=భర్తలు యజ్ఞము చేయు సమయమందు.

తాత్పర్యము

యుద్ధభూమియందు కష్టములు ప్రాప్తించినపుడు దేశోపద్రవములందు స్వయంవరమందు పెండ్లి వేళ యజ్ఞములందు నో బుద్ధిమంతుఁడా! స్త్రీలను జూచుట దోషముకాదు.

కం. ఈసీత రణతలస్థిత, మాసరదుఃఖములఁ బొంది ♦ మఱిఁగెడి నందున్
నా సవిధంబున నుండఁగ,దోసం బెయ్యదియు లేదు ♦ దోఁచిన బయలన్.

అర్థములు. రణతలస్థిత = యుద్ధభూమి యందున్నది, మాసర దుఃఖములన్ = దీర్ఘ కాలముగ సుఃఖముచే, మఱిఁగెడిన్=సంతసించుచున్నది, నా సవిధంబునన్=నా సమీపమున.

తాత్పర్యము

ఈసీత యుద్ధభూమి యందున్నది. చిరకాలముగ దుఃఖము లనుభవించుచున్నది. అదియును గాక నేను సమీపమందే యున్నాను. కావున నాభార్య నాయెదుట వెలుపల వచ్చుటయందే దోషములేదు.

దీనివలన నేస్త్రీయైనను వేడుకలకు వినోదములకు ఆటపాటలకు ఉబుసుపోకకు విచ్చలవిడి తిరుగ గాదనియు నక్కఱ లవసరముల బయట దిరుగుట దోషము కాదనియు నేర్పడుచున్నది.

**—♦ సీతాదేవి శ్రీరాము సమీపంబునకు వచ్చుట ♦—**

కం. కాన సుహృజ్జనసంవృతుఁ, డౌ నను గనుఁగాక జనకు ♦ నాత్మజ తోడితె
మ్మా నావుడు శంకించుచు, దానవసత్తముఁడు దేని♦దఱియఁగఁ దెచ్చెన్.

అర్థములు. సుహృజ్జనసంవృతుఁడు = స్నేహితులతోఁ గూడినవాఁడు, శంకించుచున్=రామచంద్రమూర్తి వాక్యధోరణిఁ బట్టి ఆయన మనస్సు ప్రసన్నముగ లేదు, ఏదో యనర్థము జరుగఁ గలదని సందేహించుచు.

తాత్పర్యము

ఈ కారణములచే స్నేహితులతోఁ గూడిన నన్ను సీత చూచునుగాక. తీసికొని రమ్మని అనఁగా విభీషణుఁడు సందేహపడుచు సీతాదేవిని సమీపమునకు దెచ్చెను.

కం. రాముని వాక్యంబులకున్, సౌమిత్రియు మారుతాత్మ♦సంజాతుండున్
దామరసాప్తతనూజుం, డేమోయని దుఃఖ మంది ♦ రెంతయు మదులన్.

అర్థములు. ఏమోయని=ఏమో యనర్థము కలుగఁ బోవుచున్నదని.

తాత్పర్యము స్పష్టము.

కం. రాముని పలుకువిధంబును, నాముఖచిహ్నములు గాంచి ♦ యఱ్ఱజముఖ్యుల్
భూమిజపై రామునకుం, బ్రేమము లేదనుచుఁ దెలిసి♦మిడుకుచునుండన్.

మీఁదఁ జెప్పిన యేమో యను దానిని వివరించుచున్నాఁడు.

తాత్పర్యము స్పష్టము

ఉ. ఆ వనజాక్షి సిగ్గున ని•జావయవంబులు ముడ్చికొంచు ర
క్షోవిభు వెంట వచ్చి నృప•సౌమ్యముఖాబ్జముఁ గోష్ఠిలో గనన్
మైవసనంబునన్ ముఖము•మాటుచు సౌమ్యతరాస్య డాసి య
వ్వావని యేడ్చె బిగ్గఱగఁ•బ్రాణధవా! యని యార్తిఁ దూలుచున్. ౩౬౫౮

తాత్పర్యము

సీతాదేవి సిగ్గుచేఁ దన యవయవముల ముడిచికొని విభీషణు వెంట వచ్చి రామచంద్రుని సౌమ్యముఖమును సభలోఁ జూచి తన యుత్తరీయమును ముఖమున కడ్డము వేసికొని మిగుల సౌమ్యమైనముఖము గల సీతాదేవి ప్రాణేశ్వరా యని గట్టిగా నేడ్చెను.

రామచంద్రుని ముఖము సౌమ్యమైనచో సీతాదేవి ముఖము సౌమ్యతరమని చెప్పఁబడెను.

ఉ. దీనతఁ గూరి వెండి పతి • దేవత విస్మయమున్ ముదంబు నెం
తేనిని నెయ్యము న్మది వ•హించి వినిర్మలపూర్ణ చంద్రతు
ల్యానన దీర్ఘకాలముగ•నర్మిలిఁ జూడని నాథు జాతరా
కానళినారిబింబసమ•క్రమముఖంబును జూచె నాదటన్. ౩౬౫౯

అర్థములు. ఎంతేనిని = ఎంతేనియును, సముచ్చయము లోపించి ఎంతేనిని అయ్యెను. ఏని కళయే కాని ద్రుతప్రకృతికము గాదు. మఱిన్, ఉండెన్, లేకను వలె నర్థవిశేషమున ద్రుతము వచ్చెను.

తాత్పర్యము

శోకము గల దయ్యుఁ బతియే దైవ మని తలఁచు పూర్ణచంద్రముఖ సీతాదేవి యాశ్చర్యము సంతోషము విశేషస్నేహముగలదై చాలఁగాలముగఁ జూడని తన భర్తయొక్క యుదయించుపున్నమనాఁటి చంద్రుని బోలిన మోమును ప్రీతితోఁ జూచెను. పున్నమనాఁ డుదయించు చంద్రబింబ మెఱ్ఱగా నుండును. అట్టులే రామచంద్రుముఖము కోపముచే నెఱ్ఱగా నుండె నని సూచన.

## —• ౧౧౮-వ సర్గము. శ్రీరాముఁడు సీతాదేవికిఁ దనజయంబుఁ దెలుపుట •—

కం. తన ప్రక్కన వినయమునన్, వినమితతనులతిక యగుచు • నిలుచుండిన సీ
తను గనిహృదయాంతర్గత, ఘనతరకోపమున నృపతి • కడఁగెం బలుకన్.

అర్థములు. వినమిత తనులతిక=వంగిన తీఁగవంటి దేహముగలది, హృదయాంతర్గత=హృదయమునందు, ఘనతర కోపమునన్ = అధికమైన కోపముచే, కడఁగెన్=ప్రారంభించెను, నృపతి=రాజు, నరులను పాలించువాఁడు, ఈకోపమునకు, ఇఁకఁ జెప్పఁబోవు మాటలకుఁ గారణ మేమనిన సీయన రాజగుటయే కారణము.

ఈమెయందు దోషము లేదని నే నెఱింగినను దక్కిన లోకము ఈమె నిర్దోష రాలని నమ్మదు. కావున నేను ప్రేమాతిశయమునఁ దటాలున స్వీకరించితినా యీమె యపకీర్తికి నే నపవాదమునకుఁ బాలుపడవలసివచ్చును. దుష్ట స్త్రీలకు దత్పతులకు మేము మార్గదర్శుల మగుదుము. 'యథారాజా తథాప్రజా' యని కలదు గదా! కావున మా యంతర్గత మెంత పరిశుద్ధముగా నున్నను శ్రేష్ఠుఁ డేది సేయునో తక్కినవారు విమర్శింపక యట్లే చేయుదురు. లోకసంగ్రహార్థము తగిన రీతిఁ బ్రవర్తింపవలయు నని తలఁచెను. ఆచరణముచే లోకమునకు ధర్మము నేర్పవలసిన యవతారము కదా రామావతారము. అనాగతవిధాతగా రామ చంద్రమూర్తి ప్రవర్తించినను పాపలోకము నిందింపక మానినది కాదు.

తాత్పర్యము

తన పార్శ్వమునందు దేహమును వంచి నిలువఁబడిన సీతాదేవిని జూచి తన హృదయమునఁ గల కోపాతిశయమున రాజగు రామచంద్రుఁ డిట్లు పలుక నారంభించెను.

ఉ. కంటకుఁ డైన శాత్రవుని • గం డడఁగించితి జన్యమందు, గై
కొంటిని నన్ను, నెయ్యది య•కుంఠితశక్తి నొనర్పఁ జెల్లు వా
ల్గంటిరొ! యంతయుం జలుపఁ•గంటిని, సార్థక మయ్యెఁ గింకయున్,
గెంటితి శత్రుధిక్కృతిని•గీర్తి వహించితి భూతలంబునన్. ౨౬౫౭

అర్థములు. కంటకుఁ డైన = ముల్లువలె బాధ గలిగించువాఁ డగు, జన్య మందున్=యుద్ధమందు, అకుంఠితశక్తిన్=మొక్కవోని సామర్థ్యముచేత, కింక= కోపము, శత్రుధిక్కృతిని = విరోధి ధిక్కారమును.

తాత్పర్యము

బాధ కలిగించిన విరోధిని యుద్ధమందుఁ జంపితిని. నిన్ను గ్రహించితిని. పూర్ణసామర్థ్యముచే నేది చేయఁదగునో యంతయుఁ జేయఁ గల్గితిని. నా కోపము సఫలమయ్యెను. పగవాఁడు చేసిన యవమానమును బోఁద్రోచితిని. భూమి యందుఁ గీర్తి వహించితిని.

కం. పగవానిని నవమానము, యుగపత్క్రియఁ జెఱిచినాఁడ • నుదుటున నాదౌ
మగఁటిమి జగము లెఱింగెను, మగువా! ఫలియించె నాస•మస్తశ్రమమున్.

అర్థములు. యుగపత్క్రియ=ఒక్కసారిగ, ఏకకాలమందు, ఉదుటున = బలగర్వముచే.

తాత్పర్యము

పగవానిని నవమానము నొక్కటిగ నేకకాలమందు నా బలగర్వముచేఁ గొట్టివేసితిని. నా శౌర్యము లోకము తెలిసికొనెను. నేను బడిన శ్రమ మంతయు సఫల మయ్యెను.

కం. నా పలికినయాబాస వృ,థాపడ కొనరించి నే స్వ ♦ తంత్రుఁడ నైతిన్
బాపురె యన నా సరిధా, త్రీపాలకులం దలెత్తి ♦ తిరుగంగంటిన్. ౫౯

అర్థములు. బాస = మాట, ప్రతిజ్ఞ.

తాత్పర్యము

నేను రావణాసురుని జంపెదనని చేసినప్రతిజ్ఞ వ్యర్థమై పోకుండఁజేసి నేను స్వతంత్రుఁడనైతిని. నా సరిరాజు లాశ్చర్యపడునట్లు వారిలో తలయెత్తి సగౌరవముగఁ దిరుగఁగంటిని.

కం. నే విడిచి యుండు నెడ నిను, నావిధిఁ జలచిత్తుఁ డసుర ♦ హారించెఁగదా
దైవకృతుం బగు దోషము, నావలన నిరస్తమయ్యె ♦ నరగురుశక్తిన్. ౬౦

తాత్పర్యము

నేను నిన్ను విడిచియుండు సమయమున నా చపలచిత్తుఁడు నిన్ను హరించెను గదా. ఈ దోషము దైవముదే. నీది కాదు, నాది కాదు. అట్టి దైవదోషమును నా పౌరుషముచే నివర్తింపఁ జేసితిని.

కం. పరిభవము దొడరె నేనియు, గురుశక్తిం దానిఁ దీర్ప ♦ గొనకొనఁడేనిన్
బురుషుఁడు పురుషుం డగునే, పురుషార్థము లట్టి నీచ ♦ పురుషున కున్నే.

అర్థములు. పరిభవము = అవమానము, తొడరెనేని = లభించినపుడు, గురుశక్తిన్ = గొప్ప పౌరుషముచే, తీర్పన్ = చక్కఁజేయ, గొనకొనఁడేనిన్ = పూనఁడయ్యెనా.

తాత్పర్యము

అవమానము సంభవించినపుడు దానిని గొప్ప పురుషశక్తిచే చక్కఁ జేయ యత్నింపని మగవాఁ డొక మగవాఁడా, ఆ నీచపురుషునకు పురుషార్థములం దేదైనఁగలదా! ఏదియుఁ గలుగదు.

ఇచ్చట ధర్మసందేహ మొకటి బాధించెడిని :

ఇచ్చట సీతాహరణము దైవకృతమని రామచంద్రమూర్తి యంగీకరించెను. సీతాదేవియు 'దైవంబే దోషకారి తథ్యము' ౬౮౦ వ. అనియుఁ జెప్పెను. ఇది సత్యమే కాని రామచంద్రమూర్తి యాదైవమును దన పురుషకారముచే నివర్తింపఁ జేసితినని ప్రజ్ఞలు పలుకుచున్నాఁడుగదా; యీ తెలివి పట్టాభిషేకము విఘ్నమైన కాలమున నెందుఁ బోయెను. పట్టాభిషేక విఘ్నము దైవకృతమని రామచంద్ర మూర్తి వాదించెను? అట్టి దైవకృతమును పౌరుషముచే నివర్తింపఁ జేసెదనని లక్ష్మణుఁడు వాదించెను. రామచంద్రమూర్తి దైవమే పరమని దాని నంగీకరించిన వాఁడుకాఁడు. అట్టులే యిప్పుడును సీతాహరణము దైవకృతమని యూరకుండక యేల పురుషప్రయత్నముచే దానిని జక్కఁ జేసెను?

దైవము, పురుషప్రయత్నము - ఈ రెంటిలో నేది బలీయ మన్నప్పుడు

దైవమే బలీయమనుట నిర్వివాదము. దైవబలము లేక పౌరుషము ఫలింపదు. మన యత్నము లేకయే దైవ మేదో యొక రూపమునఁ దన కార్యము సంఘటింపఁ జేయును. అయినను మన మొక ఫలము గోరితిమేని నది దైవమే యిచ్చునని పురుష కారము మానరాదు. దైవమిచ్చినదానితో సంతుష్టిపడి యుండువానికిఁ బురుష కార మనావశ్యకము. 'యోగక్షేమం వహామ్యహ'మను మాట ప్రమాణము.

పట్టాభిషేక విఘ్నమునకు మూలకారణము దైవమైనను అవ్యవధానకారణము జనకాజ్ఞ యైయున్నది. దైవమును ధిక్కరింపఁదలఁచిన జనకాజ్ఞ ధిక్కరించి నట్లగును. అది ధర్మవిరుద్ధము. ధర్మమునకు బాధకలిగించు పురుషకారము నిషిద్ధ మని రామచంద్రుని యభిప్రాయము. సీతాపహరణమం దట్టి సంకటములేదు. ఇచ్చట దైవమును బౌరుషముచే నివర్తింపఁజేయుటవలనఁ గలిగెడి ధర్మహాని లేదు. నివర్తింపకుండిన ధర్మహాని కలదు. కావునఁ బురుషప్రయత్నము కర్తవ్య మయ్యెను. అచ్చట దైవము ననువర్తించుటవలనఁ గీర్తి లభించెను. ఇచ్చట దైవము ననువర్తించిన నపకీర్తి వచ్చియుండును. ధర్మహానియుఁ గలిగియుండును. కావున ధర్మ విరుద్ధమైన పురుషకారము త్యాజ్యముకాని పురుషకారము లన్నియుఁ ద్యాజ్యములు గావు. ఒక ధర్మము మఱియొక ధర్మమును బాధింపరాదు. నిష్కామశుద్ధ ధర్మమునకంటె నర్థ కామముల సంబంధముగల ధర్మము జఘన్యము.

కం. జలనిధి లంఘించుటయున్, బలవద్రిపుపురము లంక ♦ భంగంబు మహా
బలసుతు శ్లాఘ్యక్రియలో, జలజాక్షి! నేఁడ చుమ్ము ♦ సఫలములయ్యెన్.

అర్థములు. మహాబలసుతు=వాయుపుత్త్రుఁడగు నాంజనేయుని యొక్క, శ్లాఘ్యక్రియలు=పొగడఁదగిన కార్యములు.

తాత్పర్యము

సముద్రమును దాఁటుట బలవంతుఁడైన శత్రువుపురము గాల్చుట లోనగు హనుమంతుని శ్లాఘ్యకార్యములు నేఁడు ఫలవంతము లయ్యెను.

కం. ఆలమున మహాశౌర్యం, బాలోచనములను హితసమంచితమంత్రం
బోలి నెలయించు వానరజాలేశ్వరుశ్రమము నేఁడు ♦ సఫలం బయ్యెన్.

అర్థములు. ఆలమునన్=యుద్ధమందు, హితసమంచిత మంత్రము=మేలుతోఁ గూడిన యాలోచనము, వానరజాలేశ్వరు = వానరసమూహముయొక్క ప్రభువు సుగ్రీవుని యొక్క, శ్రమము=కష్టము.

తాత్పర్యము

యుద్ధమునందు శౌర్యము ఆలోచనలందు మేలగు నాలోచనము చెప్పుచుండు సుగ్రీవునికష్టము నేఁడు ఫలించెను.

ఆ. దోషశీలుఁడైన ♦ తోడఁబుట్టినవానిఁ, బాసివచ్చి నాదు ♦ ప్రాపుఁ గాంచె
నిల్వి భీషణుండు ♦ నీ వరభక్తుని, శ్రమము సకల మిపుడు ♦ సఫలమయ్యె.

ఇందు విభీషణుఁడు భక్తుఁడనియే చెప్పఁబడెను.

తాత్పర్యము స్పష్టము.

చ. అని వచియించుచుండ హృదయాధిపుఁ డా మృగశాబనేత్ర లో
చనముల నశ్రువారిచయసంకలితంబులఁ జేయ రాముఁడు
న్గని నెయి వోయ మండు జ్వలనం బనఁ గ్రోధవివర్ధి తాకృతిం
బొనరెడి భ్రూకుటిన్ భువనమోహినిఁ జక్కఁగఁజూడ కిట్లనున్. ౧౦-౧౧

అర్థములు. మృగశాబనేత్ర = జింకపిల్ల కన్నులవంటి కన్నులు గలది. అశ్రువారిచయ సంకలితంబులు=కన్నీళ్ళతోఁ గూడినవి, నెయి, రూ, నెయ్యి = నేయి, జ్వలనంబు = అగ్ని, క్రోధవివర్ధితాకృతిన్ = కోపముచే వృద్ధిఁబొందిన యాకారము గలది, భ్రూకుటిన్=బొమముడిని.

తాత్పర్యము

తన హృదయేశ్వరుఁ డీ ప్రకారము పరులతో ముచ్చటించునట్టు లేవో తన విషయములు చెప్పుచు తన(సీత)విషయమై యంగీకారసూచకమైన మాట నొకటి నైనఁ జెప్పకయుండుటచే నామె కన్నులనిండ నీరు నించెను. అది చూచి రామచంద్రుఁడు మనస్సు మెత్తనచేసినఁ గార్యహాని యని తలఁచి యా కన్నీరు తన కోపాగ్నికి నెయ్యివలెఁగాఁగా కోపాతిశయమున బొమముడి దీర్ఘముచేసి విచ్చి మొగముఁ జూచిన మొగమాటమను సామెత ప్రకారము భువనమోహిని యగు నామెనుజూచిన తన మనస్సు మోహములోఁబడునని ముఖము సరిగాఁ జూడక.

కం. నాతీ! యరాతికృతపరిభూతిం దొలఁగింప గోరు పురుషుం డెది వి
ఖ్యాతిగ నొనర్పఁదగు నది, త్రాతల మెఱుఁగంగఁ జలుపఁగంటిని శక్తిన్.

అర్థములు. అరాతికృతపరిభూతిన్=శత్రువుచేసిన తిరస్కారమును, నాతీ= ఆఁడుదానా, ప్రియురాలా, ప్రాణేశ్వరీ యను మాటలు పోయినవి. ఆఁడుదానా యనుదశ వచ్చినది.

తాత్పర్యము

శత్రువుచేసిన యవమానమును తొలఁగించుకొనఁగోరు పురుషుఁ డే కార్యము ప్రసిద్ధముగఁ జేయునో యది లోక మెఱుఁగఁగ నాశక్తిని జేసితిని.

తే. జీవలోకంబులకు నెల్ల నేగినేయు, రాక్షసులచేత మును దురారాధ్యమైన
శమనుదిశఁ గుంభజుఁడు ముక్తసలిపినట్లు, శాత్రవార్దిత నిను ముక్తసలిపినాఁడ.

అర్థములు. జీవలోకంబునకున్ = ప్రాణికోటికి, నేగి = కీడు, దురారాధ్యము = సేవింపరానిది, పొందరానిది, శమనుదిశ=దక్షిణము, కుంభజుఁడు = అగస్త్యుఁడు, శాత్రవార్దితన్=విరోధిచే బాధింపఁబడిన.

తాత్పర్యము

లోకుల కందఱకుఁ గీడుసేయు రాక్షసులవలన సేవింప రాకయుండిన దక్షిణ

దిక్కును అగస్త్యుఁడు వారిబాధనుండి తప్పించినట్లు నిన్ను శత్రుబాధనుండి తప్పించి నాఁడను.

## —• శ్రీరాముఁడు సీతాదేవిని దా నొల్ల నని చెప్పుట. •—

కం. నెయ్యురసాహాయ్యంబునఁ, గయ్యంబున నరులఁ ద్రుంచి • గాసిపడుచు నేఁ
 డ్రయ్యుట నీకై కాదని, తొయ్యలి నీమదిని దెలియు • దువు గాక యిటన్.

 అర్థములు. డ్రయ్యుట = కలయుట.

తా త్ప ర్య ము

మిత్రుల సాహాయ్యముచే యుద్ధమున శత్రువులఁ జంపి శ్రమపడి యిట్లు నిన్నుఁ గలయుట నిన్ను గ్రహించుటకుఁ గాదని తెలిసికొనుము.

కం. కులగౌరవంబుఁ గావఁగ, నలరింపఁగ నాదుశీల • మపవాదంబున్
 దొలఁగింప గీర్తినిలుపఁగ, బలితపుఁ గయ్యముల గాసి•పడితిన్ వింటే.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. జనశంకిత చారిత్రవు, వనజాక్షి! నీవు నాదు • పజ్జన నిలువన్
 గనుకలక వానిముందటి, పెనుదీపమువోలె దాయ • విధ మైతి చుమీ.

 అర్థములు. జనశంకిత చారిత్రవు = జనులచే సందేహింపఁబడు నడవడి గలదానవు. లోకులు నీ నడవడి సందేహింతురే కాని నాకు సందేహము లేదని ధ్వని దాయ = శత్రువు.

తా త్ప ర్య ము

నీవు లోకులు సందేహించు చరిత్రము గలదానవై తివి. ఏలన నీవు వనజాక్షివి. తామరలవంటి కన్నులుగల యందగత్తెవు. కావున నిన్నాళ్ళు చెడక యుందువని లోకమెట్లు విశ్వసింపఁగలదు? ఇట్టి నీవు నాప్రక్కన నిలువఁబడి కనుల కలఁకవాని యెదుట నుంచఁబడిన దీపమువలె నన్ను బాధించుచున్నావు.

కనుకలఁకవాని ముందటి దీప మన్నప్పుడు దోషము దీపమునందు లేదు. పురుషునియందుఁ గలదు. అట్లే దోషము నీయందు లేదు. అపవాదభయముచే బాధపడు నాయం దున్నది. దీపమును దూరముగఁ గనులకుఁ గానరాక యుంచినఁ బురుషునకు సుఖము కావున నిన్ను నా యెదుట లేకుండఁ జేసితి నేని నేను సుఖింతును

కం. నాతీ! యనుజ్ఞ యిచ్చితి, వే తరలుము నీ కభీష్ట • విధమున నాశా
 వ్రాతంబుల నెట కేనియు, నీతోఁ గార్యంబు లేదు•నిజముగ నాకున్. ౨౦-౨౧

 అర్థములు. ఆశావ్రాతంబులకున్=దిక్కులకు, నీయిష్ట ప్రకారమే దిక్కున కైనఁ బొమ్ము, నా యెదుట లేకుండినఁ జాలును.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. ఉత్తమకులజాం డెవ్వఁడు, సత్తేజోయుక్తుఁ డన్య • సదనస్థిత యౌ
 నత్తమని మరల నెయ్యపుఁ జిత్తమునఁ బరిగ్రహించుఁ • జెపు మెపుడేనిన్.

అర్థములు. ఉత్తమ కులజుఁడు=గొప్పకులమునఁ బుట్టినవాఁడు, సత్ + తేజోయుక్తుఁడు = మంచి తేజస్సుతోఁ గూడిన వాఁడు, అన్యసదన స్థిత=ఇతరుల యింటి యందున్న దానిని, తరుణిన్ = వయస్సు స్త్రీని, నెయ్యపుఁ జిత్తమునన్= స్నేహ భావమున.

తాత్పర్యము

ఉత్తమవంశమున నుత్తమ జాతియందుఁ బుట్టినవాఁడు కీర్తి ప్రతాపములు గలవాఁడే పురుషుఁడైనను పరునియింట దీర్ఘకాలముండిన వయస్సువచ్చిన యాఁడుదానిని మరల భార్య యను స్నేహభావముతో గ్రహించునా? నీవే చెప్పుము. వయస్సు వచ్చిన తన భార్యను దాని పుట్టిన యింటనైన నెక్కువకాల ముండ నిచ్చెనేని దాని శీలము సందేహింపఁ దగినదే—'తన యిల్లాలి దాని పుట్టిన యింటన్ దడవుండ నిచ్చె నేనియుఁ బడఁతిని సంగడికిఁ దాన పంపుట సుమతీ' యని నీతి శాస్త్రము. కావున నిన్ని దినాలు శత్రువునింట నుండు నిన్ను నే నిట్లు పరిగ్రహింతును ?

ఉ. దుష్టుఁడు చూచె నన్నుఁ గడు • దోసపుఁజూపులచేఁ, దదంకసం
భ్రష్టవు నైతి, విట్టి నిను • రాజకుమారిక ! వంశశీలతన్
శిష్టుఁడ నంచుఁ జెప్పికొను • నే నెటు వెండి గ్రహింప నేర్చెదన్ ?
గష్టము మానహానికర • కార్యము రాముఁడు చేయఁ డెన్నఁడున్. ౨౬౩

అర్థములు. తదంక సంభ్రష్టవు = వాని యొడియం దుండుటచే భ్రష్టురాలవు, వంశశీలతన్=గొప్ప వంశమునఁ బుట్టుటచేత, గొప్ప సదాచారముచేత, గొప్ప వంశాచారముచేత, శిష్టుఁడను=సదాచార సంపన్నుఁడను, వెండి=మరల, మానహానికర కార్యము=గౌరవమునకు హాని కలిగించుపని రాముఁడు చేయఁడు, నేను జేయనని చెప్పుటకు మాఱు ప్రథమ పురుషమునఁ జెప్పుట యాత్మగౌరవార్థమని యెఱుంగునది. రాముఁడని పేరుగలవాఁడు కూడ నటువంటి పని చేయఁడని నామగౌరవద్యోతక మగు నర్థము.

తాత్పర్యము

దుష్కామ దోషముగల చూపుల నిన్ను దుష్టుఁడు చూచెను వాని కన్నులతో వాఁడు చూచిన నే నేమి చేయుదును? వానికన్నులు మూయుదునా యందు వేమో వాని యొడియందు నిన్నుంచుకొనుటచే భ్రష్టవైతివి. ఇట్టి నిన్ను నో రాచదానా ! సద్వంశమునఁ బుట్టి సదాచారసంపత్తి గలిగి సదాచారసంపన్నుఁడ నని చెప్పుకొను నేను మరల నెట్లు గ్రహింతును? అటువంటి నీచము గౌరవహానికర కార్యము రాముఁడు చేయఁడు సుమా, రాముఁడు కామదాసుఁడు గాఁడు.

ఉ. కావున నాదుకీర్తి నిలఁ • గాచుకొనన్ దశకంఠుఁ ద్రుంచి నీ
తా! విడిపించినాఁడ నినుఁ • దథ్యము నీపయి స్నేహమోహముల్

భావమునందు లేవు, మగు•వా! చను మిచ్చటనుండి నీకు మో
దావహమైనభంగి నెట•కైనను, నీకు ననుజ్ఞ యిచ్చితిన్. ౨౨

## తాత్పర్యము

ఈ కారణముచేత రాక్షసుఁ డెత్తుకొనిపోయిన తన భార్యను విడిపించుకొనలేకపోయినాఁడు రాముఁడను నపకీర్తి రాకుండుటకును శత్రువుల వధించి మరల భార్యను గ్రహించినాఁడను కీర్తి కాపాడుకొనుటకు నేను రావణునిజంపి నిన్ను వాని చెఱనుండి విడిపించితినిగాని నిశ్చయముగా నీమీఁది కామమోహములచేఁ గాదు. అవి నామనస్సునందు లేవు. ఆఁడుదానా! నీ విచ్చటనుండి నీకు సంతోషకరమైన చోటికిఁ బొమ్ము. నీ కనుజ్ఞ యిచ్చితిని.

సీ. మానినీ! చక్కఁగ • మఱిమఱి యోజించి, పలుకుచున్నాఁడ•స్పష్టఫణితి
నిలుము లక్ష్మణునొద్ద•నేనియు భరతుని, యొద్దనేనిఁ గపీంద్రు•నొద్దనేని
నీ విభీషణునొద్ద•నేని నీ కెది సుఖ, మబ్భంగిఁ జేయుమీ • యవనితనయ!
దివ్యరూపవు మనో•దృష్ట్యభిరామ వై తనయింట జిక్కఁగ•తరుణి నిన్నుఁ
తే. గాంచి దశకంఠుఁడట చాల•కాల మోర్చి, యూరకుండెడివాఁడు రంభోరు! వింటి
కాన నినునొల్ల నీయెడఁ•గామముండఁ, గాను జను మిచ్చకోలఁది ని•క్కంబయనిన.

## తాత్పర్యము

సీతా! నేను జెప్పునది యాలోచింపక యేదో నోరికివచ్చినది కోపవశమునఁ జెప్పుచున్నానని తలఁపకుము. పలుమాఱు చక్కఁగ నాలోచించి స్పష్టముగ జెప్పుచున్నాను. సందేహింపవలదు. నీవు స్త్రీవిగావున స్వతంత్రవై యుండరాదు. భర్త విడిచిన స్త్రీ బంధువులయొద్ద నుండవచ్చును. కావున నీవు లక్ష్మణునింటనో భరతునింటనో సుగ్రీవునింటనో విభీషణునింటనో యుండి కాలము గడుపుము. నీ కిం దేది సుఖకరమని తోఁచునో యట్లు చేయుము. నీవు వగలవలసిన కారణమేమి? నీయింట నేల యుండరాదనెదవా? నీవు దేవతాస్త్రీవంటి యందగత్తెవు. ఎట్టివారి చూపులను మనస్సునైన నానందింపఁజేయుదానవు. ఇట్టి నీవు వయస్సుదానవై తన యింటఁ జిక్కఁగా జూచి రావణుఁడా చాలఁగాల మోర్చి నిన్ను జెఱుపక యూరకుండువాఁడు? కాఁబట్టి నిన్నొల్లను. నీయందు నాకుఁ గామము లేదు. నీ యిష్టము వచ్చినట్లు బొమ్ము. నాయింట నుండిన నేను నిన్ను భార్యగా గ్రహించితినని లోకము సందేహించును. కావున నాయింటఁదప్ప నీ వెందైన నుండుము. ఇది నిశ్చయము.

చ. ప్రియము వినంగ నర్హ యయి•విశ్రుతశీల ప్రియంబు వేచుచోఁ
బ్రియుఁ డిటు లప్రియంబు లనఁ•బెద్దయుఁ గాలము చెల్లి యిట్టివా
క్యములు వింటఁజేసి మన•వామజహస్త నికృత్తసల్లకీ
క్రియ వసఁ గాడి బాష్పలహ•రిన్ వెలి గాఱిచె దుఃఖితస్థయై. ౨౩

అర్థములు. మదసామజ=మదపు టేనుఁగుయొక్క, హస్త=తొండముచే, నికృత్త=విఱువఁబడిన, సల్లకీక్రియన్ = అందుగుచెట్టువలె, వడఁకాడి = వణఁకి, బాష్పలహరిన్=కన్నీళ్ళ ప్రవాహమును.

తాత్పర్యము

ప్రసిద్ధపతివ్రతయగు సీతాదేవి ప్రీతికరమైన మాటలు వినయోగ్యురాలు కావున మగఁడు ప్రీతికరములైన మాటలు చెప్పును, విని సంతోషింప వచ్చును అని యెంత కాలముగానో వేచియుండఁగా ప్రియుడే యిట్టు లప్రియము పలుకఁగా దీర్ఘకాలము చెల్లియు నివి వినవలసివచ్చుటచేత మదపుటేనుఁగుతొండముచే విఱువఁబడిన యందుగుచెట్టు నీరు కార్చువట్లు శోకభయముల వణఁకుచు దుఃఖముచేఁ దపించుచు సీతాదేవి కన్నీళ్ళు వెల్లువగాఁ గార్చెను.

## ౧౧౯-వ సర్గము. శ్రీరాముని వాక్యంబులకు సీతాదేవి దుఃఖించి ప్రత్యుత్తరం బిచ్చుట

సీ. ఎన్నఁడు మును విని • యేనియు నెఱుఁగని, రోషనిష్ఠుర ఘోర • భాషణముల
నిండినసభను గాం • తుం డిటు వల్కిన, లజ్జచేఁ దల వ్రాల్చి • లలితశీల
తనువు నిల్పఁగ • లేక దారుణభాషణ, శరతాడ్యమాన త • చ్ఛల్యసమితి
మర్మంబులను నాటి • మఱి మఱి కోయఁగఁ, గన్నీటికాల్వలఁ • గార్చుకొనుచు
తే. నశ్రుజలములఁ దడిసిన • యాననంబుఁ, బైఁటకొంగునఁ దుడుచుచుఁ • భర్తఁ జూచి
యింతి గాద్గదికం బగు • నీరెలుంగు, కలుగ మెల్లన వచియించుఁ • గళవళమున.

అర్థములు. రోషనిష్ఠుర ఘోరభాషణములన్ = సీతాదేవి భర్త తన్నుఁ గోపించి మాటలాడఁగా విని యెఱుఁగదు. ప్రణయకోపంబున మాటలాడినను నిష్ఠురములు విని యెఱుఁగదు. నిష్ఠురముగ మాటలాడినను క్రూరములై భయంకరములైన మాటలు విని యెఱుఁగదు. అట్టి సీతాదేవి రహస్యమునఁ గాదు, నిండిన సభలో మఱియెవ్వఁడో కాఁదు-కాంతుఁడే,-మనోహరుఁడే-దారుణ=భయంకరములైన, భాషణ = మాటలనెడి శర = బాణములచే, తాడ్యమాన = కొట్టఁబడినది, తత్+శల్య+సమితి=ఆ ములుకుల సమూహము, మర్మంబులన్ = ఆయువు పట్టులను, గాద్గదికంబు = డగ్గుత్తికతోఁ గూడిన. ఈ రెలుంగు = సన్నని ధ్వని, కళవళమునన్=కలఁతతో.

తాత్పర్యము

పూర్వమెన్నఁడైనను రోషపుమాటలు, అందు నిష్ఠురవాక్యములు, అందు భయంకరములైన వాక్యములు ఎవ రాడినను విని యెఱుంగదు. అట్టిది నిండు సభలోఁ దన ప్రియుఁడే యిటు పలుకఁగా సిగ్గుచేఁ దలవంచి నిలఁబడలేక కఠిన భాషణములను బాణములచేఁ గొట్టఁబడి యా ములుకు లాయువు పట్టులఁ దగిలి

మీఁద మీఁద గోయఁగా కన్నీరు కాల్వలుగాఁ బాఱఁజేయుచు కన్నీటఁ దడిసిన ముఖమును బైఁటకొంగుచేఁ దుడుచుకొనుచు మగనిఁ జూచి గద్గదస్వరముతో సన్నని గొంతున నిట్లనియె.

ఉ. క్షుద్రుఁడు క్షుద్ర నాడుగతి ♦ శ్రోత్రవిదారణ రూక్షవాక్యముల్
భద్రచరిత్ర! పల్కఁ దగ♦వా నను బోఁటిని? నీ వదేమిగా
ఛిద్రము సంశయించితివి ♦ శీలమునం దటువంటిదానిఁగా
హృద్రస నెంచఁబోకు సుచ♦రిత్రముపై శపథంబు సేసెదన్. ౨౫౭౮

అర్థములు. క్షుద్రుఁడు = కులమున గుణమున నీచుఁడు, క్షుద్రను=కులమున గుణమున నీచురాలిని, శ్రోత్రవిదారణ = చెవులను జీల్చునట్టి, రూక్షవాక్యముల్ = పరుషపు మాటలు, భద్రచరిత్ర = శుభకరమైన నడవడి గలవాఁడా, ఇది యెత్తిపొడుపు మాటగానైన వాస్తవముగనైన గ్రహించ వచ్చును. ననుబోఁటినిన్=నావంటి దానిని, ఛిద్రము=సందు, రంధ్రము, హృద్రస=హృదయ ప్రదేశమున, సుచరిత్రముపై=పాతివ్రత్యముమీఁద, శపథంబు=ప్రమాణము.

తాత్పర్యము

భద్రచరిత్ర = వంశశీలతన్ శిష్టుఁడ నని చెప్పుకొనువాఁడా, కులమున శీలమున నీచుఁడగువాఁడు, కులశీలముల నీచయగుదానిని బల్కునట్లు చెవులు చీల్చు కఠినవాక్యము లెట్లు పల్కితివి? అందు నన్ను నుద్దేశించి యెట్లు పల్కితివి? నీవు శిష్టుఁడవైతివా నీ నోర నిటువంటి మాటలు రానేరావు. శిష్టులు నీచులనైన నిట్లు మాటలాడరు. నీవు క్షుద్రుఁడ వైతివా? యెంతటి క్షుద్రుఁడైనను కులశీలముల శిష్టయగు దానిని మాటలాడఁడు. నీవెట్టి వాఁడవైనను నీమాటలు నాకన్వయింపవు. నీవు వాస్తవమున గొప్పవాఁడవు. గొప్పవాఁడు మాట్లాడినట్లు మాట్లాడక యిట్లు మాటలాడుట నీకుఁ దగదు. నా శీలమునందేమి లోపము గలదని కనిపెట్టి నీవు నన్ను సంశయించితివి? నాశీలమునం దెటువంటి దోషము గలదని నీవు సందేహించితివో యట్టి దోషము నాయందు లేదని పాతివ్రత్యముపైఁ బ్రమాణము చేసెదను.

ఉ. స్త్రీలను నీతిహీన లగు♦చెన్నఁటి తాఁగల నాత్మ నుంచి యో
పాఖిలజాతి యంతయును ♦ నట్టిదిగాఁ దలపోయ నేల? మ
చ్ఛీలపరీక్ష నీవు మును ♦ చేసియ యుండిన నిట్టిశంకలన్
బోలఁగ వీడుమీ, కతము ♦ పుట్టదు పో యిటువంటివానికిన్. ౨౬౯

తాత్పర్యము

నేను సంశయించిన దోషము స్త్రీల యందు లేదా యందువేమో? ఏస్త్రీల యందుఁ గలదు? పతివ్రతల యందుఁ గలదా? నీతిమాలిన చెడ్డ అంకటాంగ్రడ యందుఁ గలదా? ఎవరో దుష్టస్త్రీ లేమో చేసినారని స్త్రీలంద అట్టి వారే యని

నీవు తలంప వచ్చునా? అట్లైనఁ బురుషులందు మంచివారు చెడ్డవారు లేరా? రావణుఁడు పురుషుఁడు దుష్టుఁడని నీవు నట్టివాఁడ వని నే ననవచ్చునా? తడికె త్రోసినవాఁడెవఁడనిన నాలు లేనివాఁడన్నట్టు లిన్నినాళ్ళు నేను నీయొద్దలేనప్పుడు నీ వెచ్చట నేమాటలాడితివో యని నేను సందేహింపవచ్చునా? కూడదు. ఏల? నీ నడవడి నేను బరీక్షించియున్నాను. అట్టి గుణము నీయందు లేదు. అట్టులే నీవు నా గుణము పరీక్షించియుండిన నిట్టి కుశంకలకుఁ గారణము గలుగదు. కాఁబట్టి యీ శంకలు వదలుము. ఈ శంకలకుఁ గారణమే లేదు. నా యందు దోషము స్థాపింపక కుశంకలచే నన్ను దండించెదవా? శంకామాత్రమున నొకఁడు దండ్యుఁ డని యేధర్మశాస్త్రము చెప్పుచున్నది.

కం నే వివశగ వ్రాలినచో, నావపు వతఁ డంటెఁ గాని ♦ నాసమ్మతిఁ గా
 దీవిషయంబునఁ జూడఁగ, దైవంబే దోషకారి ♦ తథ్యము నాథా. ౨౬౮౦

అర్థములు. వివశగన్ = పరవశురాలనై, వ్రాలినచో=నేలఁబడి యుండినపుడు, నా వపువు=నా దేహము, నా సమ్మతి గాదు=నే నంగీకరించినది కాదు, దోషకారి=దోషము చేసినవాఁడు, దైవంబె = నా పాలికి నీవే దైవము కావున నీదే దోషము.

తాత్పర్యము

నిన్ను వాఁ డంటెనా లేదా? అది దోషమగునా కాదా? యందువేమో! వాఁడు నన్నుఁ దాఁకినది నిజమే, కాదనను. వాఁడె నన్నుఁ దాఁకెను గాని నేనై వానిని దాఁకలేదు. వాఁ డెప్పుడు నన్నుఁదాఁకెను? నేను పరవశనై మూర్ఛపోయి పడియుండిన సమయంబునఁ దాఁకెను. నేను దానికి సమ్మతించినదానఁ గాను. నాయనుమతిమీఁద వాఁడు తాఁకలేదు. ఎట్లు స్పృశించినను దోషమా? దుష్టభావమున స్పృశించిన దోషమా? దుష్టభావమున స్పృశించిననే దోషమందువా? వానిదుష్టభావమునకు నే నెట్లుత్తరవాదిని గాఁగలను? నాభావము దుష్టమైన నన్ను నీవు దండింపవచ్చును గాని యితరులభావము దుష్టమని నన్ను నీవు దండింపవచ్చునా? నన్ను రక్షింపవలసిన భారము నీయందున్నది. నీవు రక్షింపగ పోయితివి. నీకర్తవ్యలోపమున నాకీ కష్టము కలిగెను. కావున దోషము నీదిగాని నాది గాదు. స్త్రీ లేవిషయమున స్వతంత్రలు కారుగదా?

కం. మానసము నాయధీనము, మానక నీయంద నిలిచె ♦ మానధన పరా
 ధీనపుగాత్రము నెడ నో,ప్రాణేశ్వర! యనద నేమి♦యగు నొనరింపన్. ౨౬౮౧

అర్థములు. అనదను=దిక్కులేని దానను.

తాత్పర్యము

నాథా! త్రికరణములలో కార్యములు చేయునవి మనస్సు, దేహము. మనస్సు తన సమ్మతి లేక పరాధీనము గాఁజాలదు. బలవంతముగా నొకఁడు దానిని లాగి

కొని పోలేఁడు. అట్టి నా మనస్సు నీ యందే నిలిచి యుండినది. ఉన్నది. ఉండఁ గలదు. అది నిన్ను విడిచి పోయినది కాదు. ఇఁక దేహమా, పరాధీనమైనది. ఒక రెట్లీడ్చిన నట్లు పోఁగలది. నా సమ్మతి లేకున్నను, నా యిష్టమునకు విరోధముగాఁ బరులు దాని లాగికొని పోవచ్చును. అట్టి దేహమువిషయమున రక్షకులు లేని నే నేమి చేయఁగలను ? అందుఁ బరవశనై పట్టువడినవు డేమి చేయఁగలను ? బలవంతుఁడైన వాని పట్టు నేను విడిపించుకొనఁగలనా? అక్కడికి నేల దూఁక యత్నించితిని, నాకు సాధ్యపడినదికాదు అరచితిని, ఏడ్చితిని. మీరు వచ్చినవారు కారు. ఇందు నా దోష మేమి కలదు ?

చ. చిరముగఁ గూడి యుండితిమి • చిత్తము లేకము గాఁగ, హాళిమైఁ
దిరిగితి మొక్కఁటై, పెరిఁగి•తి న్నినుఁ గూడి, పరస్పరంబు దాఁ
పుర మొకయింత లేద, యిటు•పొల్పుగ నుండియు నాదుశీలమే
యరయవ యేని నీవు, హత•నైతి హృదీశ్వర! శాశ్వతంబుగన్. ౨౬౭౨

## తాత్పర్యము

ఆ సమయంబున నీ మనస్సెట్లుండెనో నే నెట్లు తెలిసికొనఁగల నందువా? ఎట్టి స్త్రీయైనను దటాలున నున్నట్లుండి చెడదు, కొంత పూర్వప్రయత్నము వలయును. మొదట మనస్సుమారవలయును. దాని ననుసరించి చేష్టలు మాటలు మారును. వీని నింగితజ్ఞు లెఱుంగఁగలరు ఒక విషయమునఁ గాకున్న మఱియొక విషయమున నొక వేళఁ గాకున్న మఱియొక వేళ మనస్సు బయటపడును గాని పడక పోదు. కావున నట్టి దుష్ట స్త్రీగాఁ బరిణమించిన దానికైనఁ బూర్వరంగము కొంత కావలసియున్నది. నే నో పుష్పవతిని గాకముందే మీ యింటికి వచ్చితిని. అది మొదలు చిరకాలముగ మన మిరువుర మొక మనస్సుతో వర్తించితిమి. ఎక్కడఁ దిరిగినను మన మొకరి నొకరు విడిచి తిరిగినది లేదు. నీ తోడ నేను బెరిఁగితిని. పెద్దదాననైతిని. నీ రహస్యము నాకుఁ దెలియనిది, నా రహస్యము నీకుఁ దెలియనిది లేదు. ఒకరి సమ్మతి లేక మఱియొక రేకార్యము చేసినదిలేదు. ఈ విధముగ సూర్యుఁడు నెండవలె మనము విడనాడక యుండియు నా శీలము నీవు తెలిసికొనలేక పోయితివేని నీవు తెలివి తక్కువవాఁడ వని నే ననను గాని నీ లోపముచేత నేను శాశ్వతముగఁ జచ్చినదాననే యైతిని.

సీ. ఏటికి దాఁచితి • విందాఁకఁ బ్రాణేశ! నను నెమకంగ నా•నాఁడు పవన
తనయుని లంకకుఁ • బనుచుచో నప్పుడే, యేటికి విడనాడ • వీవు చెపుమ
యప్పుడే యతనితోఁ • జెప్పి యుండిన నీవు, విడిచిన ట్లుసుఱును•విడుచఁగాదె
నే మేను వాసిన • నీకును బ్రాణగొ,డ్డం బగు నిట్టిశ్ర•మంబు లేద
ఆ. నీసునెయ్యురకును • నిర్భరక్లేశంబు, నిష్ఫలంబుగాక • నెగడియుండు
నీసుహృత్తులకును • నీకును నా కెంత,శ్రమము నిడితి కంటె•జాగుసేత. ౨౬౭౩

అర్థములు. నెమకంగన్ = వెదకుటకు, నానాఁడు = నాఁడు + నాఁడు; నానాఁడు=ఆనాఁడే; ఉసురు=ప్రాణము, ప్రాణగోడ్డము=ప్రాణాపాయకరము.

తా త్ప ర్య ము

ప్రాణేశ్వరా! నాయందు నీకిట్టి దురభిప్రాయ ముండెనేని యేల యిన్నాళ్ళు దాఁచితివి? ఆనాఁడు నానిమిత్తమై లంకకు హనుమంతుని బంపినపుడే నీ నడవడి యందు నాకు సందేహముగలదు, కావున నిన్ను వదలితినని చెప్పిపంపియుండిన నీవు వదలినట్లు ప్రాణములుకూడ నన్నానాఁడె వదలిపోయియుండును. ఆ విషయమున నా ప్రయత్న మక్కఱయే లేక యుండును. నేను దేహమును విడిచితినా నీకిటువంటి ప్రాణాపాయకరమైన శ్రమము లేక యుండునుగదా? నీ స్నేహితులు పడిన కష్టము నిష్ఫలము గాకయుండును. నా స్నేహితుల కష్ట మెట్లు వ్యర్థమయ్యెను, రావణుని జంపితినిగదా యందువా? రావణుని జంపుట యెవరికొఱకై? నన్ను గ్రహించుటకుఁగదా? నన్ను గ్రహించితి నంటివే? ఏమి గ్రహించితివి? అశోక వనములో నున్నదానిని సముద్రతీరమున విడిచితివి. ఇదియా నీవు నన్ను గ్రహించుట? అదియునుగాక ఎప్పుడు నామీఁద నీకు సందేహము గలిగెనో యప్పుడే సీత చెడినది. రావణునిఁ జంపి యిఁక దానిని సాధించి ప్రయోజనము లేదని యూరకుండినయెడల నీకు నీ మిత్రులకు నీశ్రమము లేకుండునుగదా? లేదా హనుమంతునిచేత నీ వీ వార్త చెప్పిపంపిన నా మరణవార్త యాయనచే విని సీత చచ్చినది, ఇఁక రావణుని జంపి సాధించున దేమున్నదని సర్వప్రయత్నములు మానిన నీవు నీ స్నేహితులు సుఖపడి యుందురుగదా! చెట్టుపెట్టి నీళ్ళుపోసి పెంచి కాపుంచి ఫలించినపిమ్మటఁ బండు చేతికిఁ దీసికొని పాఱవేసిన వాని శ్రమము సఫలమైన దగునేని నీశ్రమము సఫలమే. నీ మనసు బయటఁ బెట్టుటయందు నాలసించి నాకు నీకు నీ స్నేహితుల కెంత కష్టము కలిగించితివో తెలిసికొనలేక పోయితివిగదా?

ఉ. కేవలకోప మూనుటను ♦ గీడును మేలుఁ దలంప లేక యో
భూవర! నీచమానవుని ♦ పోలిక యీఁడుతనంబు నొక్కఁటే
భావనజేసెదే, జనకు ♦ వ్యాజమునన్ ధరనుండి పుట్టుటల్
నావలపున్ సువృత్తముఁ ద ♦ లంపవు వృత్తవిధిజ్ఞ యే మనన్. ౫౬౨౨

తా త్ప ర్య ము

విమర్శనజ్ఞాన మనునది వదలి కోపము నొక్కదానినే గ్రహించిన వాఁడవగుటచే యిది మేలు, ఇది గీడు అని యాలోచింపలేక నీచమనుష్యునివలె నెద్దీసిన దనిన గాటఁ గట్టుమన్నట్లు లాఁడుది గావున చెడిపె యని తలంచితివి, అంతే కాని, జనకుఁడను నెపమున నయోనిజనై భూమియందుఁ బుట్టుటయు, నీయందు నాకున్న ప్రేమము, నా చక్కని నడవడి నీ వాలోచించినవాఁడవు కావు. నీకుఁ దెలియదా యనిన వృత్త విధి తెలిసినవాఁడవే, దాని నాలోచనకుఁ దేనపుడు దానివలన లాభ

మేమి? నీ వంశము నీ శీలము నీవు గొప్పగాఁ జెప్పుకొంటివి. నా వంశము నాశీలము నీ వాలోచింపవైతివి. వంశమందుఁగాని శీలమందుఁగాని నేమిట నీ కంటె నేను దక్కువదాననో చెప్పుము. నీ వంశప్రతిష్ఠ శీలము కాపాడుకొనవలయు నని నీ కున్నంత మాత్రము జ్ఞానము అభిమానము నాకు లేదా? లేదని చెప్పుటకు నీకేమి యాధారము గలదు? నిష్కారణసందేహము ప్రమాణముగా నెవరైన నంగీక రించిరా? అట్టి సందేహమును నీవు ప్రమాణముగాఁ దీసికొని నన్నునీ వెట్లు దండించెదవు? దోషము స్థిరపడినఁగదా దండింపవలయును? నీ రాజనీతి తెలుపు శాస్త్రము లేమి చెప్పుచున్నవి? సందేహము గలిగినంత మాత్రముననే దండింపు మని చెప్పుచున్నావా? దోషులను విడుచుటకంటె నిర్దోషుల దండించుట యెక్కువ పాప మని నీవు చదివిన గ్రంథములందు లేదా ?

సీ. నీ చిన్నతనమున • నేఁ జిన్నదాననై, వఱలుచు నిన్ను వి • వాహ మగుట
నాఁటఁగోలెను నిన్ను • నాథ! దైవంబుగఁ, దలపోసి నే భక్తి • వలుపుచుంట
యిద్దఱహృదయంబు • లేకంబుగా నెప్డుఁ, గలసియు మెలసియుఁ • గ్రాలుచుంట
నీకష్టసుఖము లే • నాకష్టసుఖములం, చన్నియవస్థల • ననుసరించి

ఆ. నేను దిరుగుచుంట • నిర్మలశీలంబు, నీ వెఱుంగనివియె • నీరజాక్ష !
యేలయొక్క యిప్పు • డిన్నియు వెనుకకు, నెట్టి శంక నొండె పట్టి • తీవు.

తా త్ప ర్య ము స్పష్టము.

ప్రాణేశ్వరా! 'నీ విషయమైన నా శంక నిష్కారణముగాదు. అశాస్త్రీయము గాదు. లోకములో నెవతెయో జారిణి యని స్త్రీలందఱు జారిణు లని నేను జెప్ప లేదు. మగనియొద్దఁ గాక నేఁ పరులయింటనైన వయస్సు వచ్చిన స్త్రీ యెక్కువ కాల ముండునేని దాని శీలము సందేహింపవలయును అని శాస్త్రము చెప్పుచున్నది. నీవో - పరుఁడే కాదు, నాకు శత్రువు, స్త్రీలవిషయమున దుష్టుఁడని పేరు పోయినవాఁడు, ఐదునాళ్ళు పదినాళ్ళు గాదు, పది నెలలు నీ వున్నప్పుడు శాస్త్ర ప్రకారము నేను సందేహింప వలయునా, పనిలేదా? కావున నా సందేహమునకు శాస్త్రము ప్రమాణము' అందువేమో, అయిన నేను జెప్పవలసినది లేదు.

## —• సీతాదేవి యగ్నిప్రవేశముఁ జేయుట •—

మ. అని డగ్గుత్తికతోడఁ బల్కుచును దుః • ఖాక్రాంతయై దీనుఁడై
ఘనచింతాబ్ధి మునింగి యున్న మఱఁదిం • గంజాక్షి వీక్షించి యీ
పెనుశోకంబున కౌషధం బగు చితం • బేర్పంగదే లక్ష్మణా !
యనఘా! యిట్టిమహాభిశాపహత నై • ప్రాణంబు నిల్పం జుమీ. -౧౬-౧౮

అర్థములు. అని = ఈ ప్రకారము చెప్పి, డగ్గుత్తికతో = గద్గద స్వరముతో, మహాభిశాపహతనై = అపనింద చేతఁ గొట్టఁబడిన దాననై.

## తాత్పర్యము

ఈ ప్రకారము గద్గద స్వరముతోఁ జెప్పి దుఃఖముచే నాక్రమింపఁబడినదై చిన్నవోయి గొప్ప వ్యసనములో మునిఁగియున్న మఱఁదిని లక్ష్మణుని జూచి సీతాదేవి యిట్లనియె. లక్ష్మణా! ఈ పెనుశోక మను వ్యాధికి నౌషధము అగ్ని ప్రవేశముదప్ప వేఱొకటిలేదు. భర్త యాజ్ఞ లేక నీవు ఆప్రకారము చేయవచ్చునా యందువేమో ఇప్పుడు నేను స్వతంత్రురాలను. భర్తృపరతంత్రనుగాను. "నీ కనుజ్ఞ యిచ్చితిని. నీ యిష్టమువచ్చినట్లు పొమ్మ"ని పారతంత్ర్యమునుండి నన్ను నా భర్త ముక్తురాలిని జేసెను. ఇఁక నేను జేయుకార్యమున కడ్డమువచ్చు నధికార మాయనకు లేదు. ఆయన యాజ్ఞగాని యనుమతిగాని యిఁక నాకనావశ్యకము. కావున నీకైనను నాయందుఁ బూర్వపుభక్తి గలదేని చితి పేర్పుము. ఇటువంటి యపనింద వచ్చిన పిమ్మట జీవచ్ఛవమై యేల బ్రదుకవలెను? ఇన్నిమాటలు మాటలాడినను సీతాదేవి నోర రామా యనిమాట రాలేదు. మునుపటి రాముఁడైనచో నిట్లు మాటలాడునా యని కాఁబోలు.

కం. నుతగుణతతులన్ మెచ్చని, పతిచేఁ బేరోలగమునఁ ♦ బరిహృత యగు నా
సతికిన్ యోగ్యం బగు నా,గతిఁ జనెదన్ వహ్నిఁ జొచ్చి♦కాకుత్స్థవరా.

అర్థములు. నుతగుణతతులన్=పొగడఁబడుగుణములచేతను, పేరోలగమునన్=పెద్దసభయందు, పరిహృత=వదలిపెట్టఁబడినది, ఆ సతికిన్=అటువంటి పతివ్రతకు.

## తాత్పర్యము

తన శ్లాఘ్యమైన గుణసమూహములను మెచ్చక నిండుసభలో నీవు దుష్టురాలవని భర్తచే వదలి పెట్టఁబడిన పతివ్రతకు నే గతి యోగ్యమో నేను నగ్ని ప్రవేశించి లక్ష్మణా యా గతికిఁ బోయెదను.

చం. అని జనకాత్మజాత యిటు ♦ లాడిన దీనత లక్ష్మణుండు రా
మునివదనంబుఁ జూచి నృప ♦ ముఖ్యుని యాకృతసూచితాశయం
బును గొని తన్మతంబునను ♦ భూరిచితన్ సమకూర్చ సీతయున్
వినతశిరస్కుఁడైన రఘు ♦ వీరుపకున్ వలగొంచు మెల్లఁగన్. ౨౬౮౮

అర్థములు. ఆకృతి=ఆకారముచే, సూచిత=సూచింపఁబడిన, ఆశయంబు=అభిప్రాయము, తన్మతంబునను=ఆయన సమ్మతిమీఁద, వినతశిరస్కుఁడు = తల వంచుకొన్నవాఁడు.

## తాత్పర్యము

సీతాదేవి యీప్రకారము చెప్పఁగా శోకాక్రాంతుండైన లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి ముఖముఁ జూచి యాయన యాకారము సూచించిన యభిప్రాయము గ్రహించినవాఁడై యాయన సమ్మతిమీఁద పెద్ద సాద చేర్పఁగా సీతాదేవి నిష్కారణముగ నిర్దోషురాలికి సంతాపము నిచ్చుచున్నవాఁడ నని విచార పడుచుఁ దల వంచుకొన్న రామచంద్రమూర్తికి మెల్లఁగఁ బ్రదక్షిణించి.

కం. ప్రవిమలగుణ జానకి హ,వ్యవహు సమీపించి మోడ్చి ♦ హస్తములు మదిన్
దివిషద్విప్రుల మ్రొక్కుచుఁ బవనసఖుం గూర్చి యిట్లు ♦ పలికెన్ భక్తిన్.

అర్థములు. ప్రవిమలగుణ = మిక్కిలి నిర్మలమైన గుణములు గలది, హవ్యవహున్=అగ్నిని, దివిషద్విప్రులకున్ = దేవతలకు, బ్రాహ్మణులకు, పవన సఖునిన్ = అగ్నిని.

తాత్పర్యము

మిక్కిలి నిర్మలమైన గుణములు గల సీతాదేవి యగ్నిహోత్రు సమీపించి చేతులు మోడ్చి మనస్సులో దేవబ్రాహ్మణులకు నమస్కరించి యగ్ని నుద్దేశించి భక్తితో నిట్లనియె.

కం. సత్యంబుగ నా హృదయము, నిత్యంబుగ రామునంద ♦ నిలిచి తలఁగదేన్
బ్రత్యయగతి నెల్లెడలం, దత్యంతము ప్రోచునన్ను ♦ హవ్యవహుండున్.

అర్థములు. ప్రత్యయగతిన్ = నమ్మకముగ, ఎల్లెడలందు = అన్ని సమయములందు, అన్ని ప్రదేశములందు.

తాత్పర్యము

నా హృదయము సత్యముగ నిత్యముగ రామునందే నిలిచి తొలఁగని దయ్యెనా నమ్మకముగ నన్నగ్నిహోత్రుండు సర్వదేశ సర్వకాల సర్వావస్థల యందు రక్షించునుగాక.

కం. శిష్టచరిత్రను నన్నున్, దుష్టగ భావించె విభుఁడు ♦ దుష్టను గాదేన్
స్పష్టముగ లోకసాక్షి యు,నిష్టముఁ దొలగించి దహనుఁ ♦ డెల్లెడఁ గాచున్.

అర్థములు. శిష్టను = సదాచారసంపత్తి గలదానను, లోకసాక్షి = లోకులుచేయు కార్యముల చూచుచుండువాఁడు, సూర్యుఁడు, అనిష్టము = కీడు, దహనుఁడు=అగ్ని.

తాత్పర్యము

సదాచారసంపత్తిగల నన్ను నా మగఁడు దుష్టురాలనని తలఁచెను. నేను దుష్టస్త్రీని గానేని సర్వజనులు చేయు కర్మములకు సాక్షి యగు సూర్యదేవుఁడు లోనగువారు స్పష్టముగ నమ్మెదని యగ్నిదేవుఁడు కీడు తొలఁగించి నన్ను రక్షించును గాక.

కం. మనమునసేన్ వాక్కునసేన్, దనువునసే నెపుడు సర్వ♦ధర్మజ్ఞుని రా
ముని నే నతిక్రమింపక, చనియెదనేన్ బ్రోచు నన్ను ♦ జ్వలనుం డెందున్.

తాత్పర్యము స్పష్టము.

చం. దినకరుఁడున్ నిశాకరుఁడు ♦ దిక్కులు వాయువు రేలు సంధ్యలున్
దినములు భూమి తక్కుఁగల ♦ దేవతలెల్లరు నాదు శీలమున్

మనము నెఱింగిరేని నను♦మానము నాయెడ లేదయేని యీ
జన మఖిలం బెఱుంగ నను ♦ సమ్మతిఁ గావుము హవ్యవాహనా! ౨౬౮

అర్థములు. దినకరుఁడున్ = సూర్యుఁడు, నిశాకరుఁడు = చంద్రుఁడు, హవ్యవాహనా=అగ్నిహోత్రా!

తా త్ప ర్య ము

సూర్యుఁడు చంద్రుఁడు దిక్కుల కధిపతియగు దేవతలు వాయువు రాత్రులు సంధ్యలు పగళ్ళు భూమి తక్కిన దేవతలందఱు నాశీలమును దెలిసియున్నవారై దానియందు సందేహము లేనివారై రేని యీ లోకులకందఱకుఁ దెలియునట్లు లగ్నిహోత్రుఁడా! నన్నుఁ గావుము.

తే. అనఘ యటుపల్కి సంగహీ♦నాంతరాత్మ,శిఖికి సద్భక్తితోఁ బ్రద♦క్షిణముఁ జేసి
మహితశిఖలొప్ప ధగధగ♦మండుచుండు, శుచిఁ బ్రవేశించె శుచితర♦శుద్ధచరిత.

అర్థములు. సంగహీనాంతరాత్మ = దేహాభిమానము లేని మనస్సుగలది, శిఖికి = అగ్నికి, మహితశిఖలు=పెద్దజ్వాలలు, శుచిన్ = అగ్నిని, శుచితర = మిగుల శుద్ధమైనది, శుద్ధచరిత=దోషరహితమైన నడవడి గలది, అగ్ని శుచియని సీతాదేవి శుచితరయని చెప్పుటచే నగ్నిహోత్రునికంటె సీతయే పవిత్రురాలని భావము. కావుననే యాంజనేయుఁడు సీతాదేవి యగ్నిని దహింపగలదు, అట్టి సీతను నగ్ని యేమి చేయఁగలఁడని చెప్పెను.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పి దేహాభిమానమువదలి యగ్నికి భక్తితోఁ బ్రదక్షిణించి పెద్ద మంటలు ధగధగమని యెగురుచున్న యగ్నిలో మిగుల పవిత్రమగు నడవడి గల సీతాదేవి ప్రవేశించెను.

చం. గడగడలాడె నప్పు డటఁ ♦ గల్గిన బాలకవృద్ధసంఘముల్
దడదడ గుండె గొట్టుకొనఁ♦ దద్దయు భీతిని, మేలిజాళువా
యొడిమెలు గ్రాల మేనఁ బుట♦ముంచిన పుత్తడిబొమ్మచందమై
పుడమికుమారి యెల్లజగ♦ముల్ గన మండెడుమంటఁ జొచ్చినన్. ౨౬౯

అర్థములు. మేలి జాళువా యొడిమెలు = మంచి బంగారు సొమ్ములు, పుత్తడిబొమ్మ=బంగారుబొమ్మ, సీతాదేవి బంగారు చాయగలది, ఆమె బంగారు సొమ్ములు ధరించుట బంగారు బొమ్మను బంగారు సొమ్ములతో నలంకరించినట్లుండెనని భావము. పుడమికుమారి=భూపుత్రి, సీత.

తా త్ప ర్య ము

ఆ బంగారు సొమ్ములు ధరించిన సీతాదేవి లోకములన్నియుఁ జూచుచుండగా మండెడు మంటలోఁ బ్రవేశింపఁగానే యచ్చటఁ జేరిన బాలురు వృద్ధులు భయముచే గుండెలు కొట్టుకొన గడగడలాడిరి.

ఆ. అమ్మహానుభావ • యగ్నిలోఁ జొరఁబడ, జలదరించి మూఁడు • జగము లప్పు
డమలినాగ్నిలోని • యాజ్యపూర్ణాహుతి, భంగిఁ గాంచె రెప్ప • పాటు లేక.

తాత్పర్యము

ఆ మహామహిమగల సీతాదేవి యగ్నిలో దుముకఁగా మూఁడు లోకములు కంపించి నిర్మలమైన మంత్రములచేఁ బవిత్రమైన యజ్ఞాగ్నిలోఁ బవిత్రమైన నేయి యాహుతి పడుచున్నట్లు రెప్ప వ్రాల్పక చూచిరి. ఈ యుపమానము సీతాదేవి పరమపవిత్ర యనియు నీమె యగ్నిలోఁ బ్రవేశించుటచే నగ్నికే తేజోభివృద్ధి కలిగెననియు గ్రాహ్యము.

శా. అచ్ఛం బైనమహాధ్వరాగ్నిఁ బడునా • జ్యంబో యనన్ వహ్నిలో
సచ్చారిత్ర వికారశూన్యమతి యై • శాంతిం జొరం బాఱఁగా
నచ్చో మూఁగినమానినీజనులు హా • హాకారపూర్ణాస్య లై
విచ్చంగన్నులతోడఁ జూచిరి భయో • పేతాత్మికల్ దిగ్భ్రమన్. ౨౬౮

అర్థములు. మహాధ్వరాగ్నిన్=గొప్ప యజ్ఞసంబంధమైన యగ్నియందు, ఆజ్యము=నెయ్యి, సచ్చారిత్ర = సాధువగు నడవడికగల పతివ్రత, వికార శూన్య మతియై = భయముగాని శంక గాని యేదియు లేని మనస్సు గలదై, శాంతిన్= సౌమ్యమైన మనస్సుతో, కోపములేని మనస్సుతో; మానినీజనులు = ఆఁడువారు, సీతాదేవి వచ్చునపుడు ఆమె వెంట ననేక స్త్రీలుకూడ వచ్చి రని గ్రహింపనగు; హాహాకార పూర్ణాస్యలై = హాహా; అయ్యో, అయ్యో యను ధ్వనులచే నిండిన నోళ్ళు గలవారై, విచ్చంగన్నులతోడ=కన్నులు బాగుగ తెఱచుకొని; భయో పేతాత్మికల్=సీతాదేవి కాలిపోవు నేమో యను భయముతోఁ గూడిన మనస్సు గలవారు; దిగ్భ్రమన్=దిక్కు తెలియక.

తాత్పర్యము

పవిత్రమైన యజ్ఞాగ్నియందు బడు నేతిధారవలె సీతాదేవి భయముగాని సందేహముగాని కొంకుగాని కోపముగాని వ్యసనముగాని యేదియు లేక యగ్నిలోఁ బ్రవేశింపఁగానే యచ్చట గుంపుగూడిన స్త్రీలందఱు భయపడి దిక్కు తెలియక యయ్యో యయ్యో యని గట్టిగ నఱచుచు కనుఱెప్ప లెగయించి చూచిరి.

తే. సౌరలోకంబునందుండి • శాపనిహతి, నిరయమున ద్రెళ్ళు నిర్జర • నీరజాక్షి
నాఁగఁ జూచిరి దేవతా • నాగయక్ష,సిద్ధగంధర్వదానవుల్ • సీత పడుట. ౨౬౯

అర్థములు. సౌరలోకము = స్వర్గము; నిరయమునన్=నరకమున; నిర్జర నీరజాక్షి = దేవతా స్త్రీ.

తాత్పర్యము స్పష్టము.

దేవతా స్త్రీ పుణ్యవశమున దేవతాస్త్రీయయ్యెను. అట్టిది నరకమునఁ బడ యోగ్యురాలుకాదు. అట్టులే సీతయు రావణాగమనము మొదలుకొని యగ్నిప్రవే

శము వఱకు సీతాదేవి పరమభాగవతుని లక్ష్మణుని దూషించిన ఫల మనుభవించెను. అగ్నిలోఁ బ్రవేశించినది మాయాసీతయనియు వెడలివచ్చినది నిజమైన సీతయనియుఁ గొందఱు చెప్పుదురు. ఈ యభిప్రాయమునకు వాల్మీకి రామాయణ మెడమీయదు. ౨౭౧౦ పద్యము చూడుము.

కం. మంటల దూఁకెడి యా వా,ల్గంటిం గని మూఁగియున్న♦కపులును నసురుల్
టంటమ్మను మదులన్ దివి, నంట వెస న్నించి రపుడు ♦ హాహారవముల్.

తాత్పర్యము స్పష్టము.

—♦ { ౧౨౦-వ సర్గము. దేవతలు శ్రీరామునకుఁ బ్రత్యక్షంబై సీతాదేవి నిర్దోషురా లని చెప్పుట } ♦—

కం. ఆ రవములు విని ధర్మా,చారుఁడు రాముండు బాష్ప♦సంపూర్ణాక్షుం
డారఁగ దుర్మనుఁ డగుచును, మూరుత ముండెం దనంత♦మునుఁగుచుఁ జింతన్.

అర్థములు. ధర్మాచారుఁడు=ధర్మప్రవర్తన గలవాఁడు, బాష్పసంపూర్ణాక్షుండు = కన్నీట నిండిన కన్నులు గలవాఁడు, ఆరఁగన్ = పూర్ణముగ, దుర్మనుఁడు=శోకముతోఁగూడిన మనస్సు గలవాఁడు, మూరుతము=అల్పకాలము.

తన భార్య తన కన్నుల యెదుటఁ బదుగురు చూచుచుండఁగా నిర్నిమిత్తముగ నగ్నిలోఁ బడుచుండఁగాఁ జూచి సహించుట మహాక్రూరకార్యమైనను ధర్మము నాచరించుట యందును, ధర్మ మాచరింపఁ జేయుట యందును శ్రద్ధగల రామచంద్రమూర్తి యా ధ్వనులు విని నిర్దోషురాలిని దనయం దెంతో ప్రేమగల దానిని నిష్కారణముగా లోకము నిమిత్తమై యెంత బాధ పెట్టవలసి వచ్చెనని కన్నులనిండ నీళ్ళు నించుచు శోకముతోఁ గూడిన మనస్సు గల వాఁడగుచు తన లోనే చింతచే మునుఁగుచు నల్పకాల ముండెను.

సీ. అంత వైశ్రవణుండు ♦ నఘశీలకర్శనుం, డగు దండధరుఁడు, స♦హస్రనయనుఁ
డగుమహేంద్రుండును♦నరిభంజనుండగు,వరుణుండునున్ వృష♦ధ్వజుఁడుశివుఁడుఁ
ద్రినయనుఁ డగు మహా♦దేవుండు, సర్వలో,కస్రష్ట బ్రహ్మజ్ఞ♦కాండవరుఁడు
నగు పితామహుఁడు నీ♦యుందఱు సూర్యస,న్నిభవిమానంబుల ♦ నింగి విడిచి
తే. లంక కరుదెంచి శ్రీరాముఁ♦బంకజాక్షు, నెదుట నిలఁబడి నవరత్న♦హేమభూష
ణాన్వితంబులు విపులక♦రాంబుజంబు, లెత్తి పల్కిరి చేమోడ్చి♦యెదుట ధరణి.

అర్థములు. వైశ్రవణుఁడు = కుబేరుఁడు, అఘశీలకర్శనుండు = పాపాచారుల దండించు వాఁడు, దండధరుఁడు = యముఁడు, సహస్రనయనుఁడు = వేయి కన్నులు గలవాఁడు, మహేంద్రుఁడు=ఇంద్రుఁడు, అరిభంజనుండు=శత్రువుల భేదించువాఁడు, వృషధ్వజుఁడు = వృషభచిహ్నము గల టెక్కెము గలవాఁడు.

త్రినయనుఁడు = మూఁడు కన్నులు గలవాఁడు, మహాదేవుఁడు = శివుఁడు, సర్వలోకస్రష్ట = సమస్తలోకముల సృజించువాఁడు, బ్రహ్మజ్ఞకాండవరుఁడు = వేదముల నెఱిఁగినవారి సమూహమందు శ్రేష్ఠుఁడు, సూర్యసన్నిభవిమానంబులన్ = సూర్యకాంతిగల విమానంబులను, నింగిన్ = ఆకాశమందు, విడిచి = ఎంత గొప్పవాఁడైనను భగవత్సన్నిధానమునకు వాహనముల మీఁదఁ బోరాదు నవతప్త = క్రొత్తగాఁ బుటము వేయఁబడిన, హేమభూషణాన్వితంబులు = బంగారు సొమ్ములతోఁ గూడినవి. విపుల కరాంబుజంబులు = విశాలములైన కరకమలములు, చేమోడ్చి = చేతులు జోడించికొని.

తాత్పర్యము

సీతాదేవి యిట్లగ్నిలోఁ బ్రవేశించిన తరువాత కుబేరుఁడు, పాపాత్ముల దండించు యముఁడు, వేయిగన్నుల యింద్రుఁడు, శత్రువుల మర్దించు వరుణుఁడు, వృషభధ్వజము మూఁడు కన్నులుగల శివుఁడు, సర్వలోకము సృజించువాఁడు వేదజ్ఞులలో శ్రేష్ఠుఁడు నగు బ్రహ్మ వీరందఱు సూర్యకాంతి గల విమానములపై నాకాశము వఱకు వచ్చి భగవత్సన్నిధానమునకు వాహనములమీఁదఁ బోరాదు కావున విమానములను ఆకాశమందే నిలిపి క్రొత్త బంగారుసొమ్ములు ధరించిన దీర్ఘబాహువు లెత్తి చేతులు జోడించి యెదుట నిలఁబడి యిట్లు పల్కిరి.

చం. నిలఁబడియున్న రాముఁ గని • నీవ మహాత్మ! సమస్తలోకము
లలుగఁగఁ జేయఁజాలినవ•లంతివి మిన్నవు జ్ఞానికోటిలో
జలజదళాక్షిజానకి కృ•శానుశిఖావళిలోనఁ జొచ్చినం
దలఁకక యుపేక్ష సేయఁ దగు•నా? నిను నీవ యెఱుంగ వేటికో? ౨౨౦

అర్థములు. వలంతివి = సమర్థుఁడవు, మిన్నవు = శ్రేష్ఠుఁడవు, కృశానుశిఖావళిలోనన్ = అగ్నిజ్వాలలందు, తలఁకక = చలింపక, పడినఁ బడనీ లెమ్మని.

తాత్పర్యము

ఎదుట భూమిమీఁద నిలఁబడియున్న రామచంద్రమూర్తిని జూచి మహాత్మా! సమస్తలోకములు సృష్టింప సమర్థుఁడవు జ్ఞానుల సమూహములలో శ్రేష్ఠుఁడవు. ఇట్టి నీవు సీతాదేవి యగ్నిజ్వాలలందుఁ బ్రవేశింపఁగాఁ బడినఁ బడనిమ్మని యుపేక్ష చేసి చలింపక యుండఁదగునా? ఏల నిన్ను నీవు తెలిసికొనలేక పోయితివి. మీఁది పద్యమున లోకసృష్టికర్త బ్రహ్మయని చెప్పఁబడెను. ఇచ్చట రామచంద్రమూర్తి యని చెప్పఁబడెను. బ్రహ్మచేయుసృష్టి అద్వారకము. భగవత్సృష్టి సద్వారకము. భగవంతుఁడే బ్రహ్మయందు దావేశించి యాయనచేఁ గార్యంబులు చేయించును. కావున చేయువాఁడు బ్రహ్మగాఁ గావవచ్చినను వాస్తవకర్త భగవంతుఁడే.

సీ. సకలనాకాలయ•సంఘనాథుండవు, వసువులలోఁ బ్రజా•పతివి మున్ను
ఋతుధాముఁ డనుపేర • నుతి గన్నవాఁడవు, సకలలోకములకు • నాదికర్త

నీవ స్వయంప్రభు • నీవ రుద్రులలోన, నష్టమరుద్రుండ • వసమతేజ !
యేనవమూర్తి వీ• వెల్లసాధ్యులయందు, నశ్వులు కర్ణంబు•లక్షియుగము
తే. చంద్రసూర్యులు జగములు•నమయు వేళ, నాదికాలంబునను నుండు•వనఘ నీవు
ప్రాకృతునిభంగివై దేహిఁ• బాయఁదగునె, కరుణఁజూడుము భూపుత్రిఁ•గంజనేత్ర.

అర్థములు. సకల=సమస్తమైన, నాకాలయ = దేవతల, సంఘ = గుంపునకు, నాథుండవు=రక్షకుఁడవు, వసువులలో, ప్రజాపతివి = ప్రజలకు స్వామివి, ఇది ఋతుధాముఁ డను పేరుగల వసువునకు విశేషణము. ఆదికర్తవు = మొట్టమొదటి సృష్టికర్తవు. అండాధిపతివరకు సద్వారక సృష్టికర్తవు, స్వయంప్రభువు= నీకు నీవే ప్రభువుగాని నిన్ను నియమించు ప్రభువు లేఁడు. అష్టమ రుద్రుఁడవు= ఎనిమిదవ రుద్రుఁడవు; "భవశ్శర్వస్తథేశానో రుద్రః పశుపతిస్తథా, ఉగ్రోభీమో మహాదేవ ఇత్యష్టౌమూర్తయ స్స్మృతాః" ఇందు నెనిమిదవ మహాదేవుఁడు విష్ణువే. వసురుద్రాదిత్యాది గణములం దన్నిట భగవంతుఁడు విభూత్యవతారమై తక్కిన వారికి నియామకుఁడై వర్తించుచుండును. ఏనవమూర్తివి=ఐదవమూర్తివి. ఈయన పేరు వీర్యవంతుఁడు "మనోనుమందా ప్రాణశ్చ శ్వేతయానశ్చ వీర్యవాన్, చిత్రర్ణ మోనయశ్చైవ హంసో నారాయణ స్తథా। ప్రభవోథ విధిశ్చైవ సాధ్యా ద్వాదశ జజ్ఞిరే" వాయుపురాణము. అక్షియుగము=రెండుకన్నులు, ప్రాకృతుని భంగిన్=సామాన్య జ్ఞానహీనమనుష్యునివలె.

### తాత్పర్యము

రామచంద్రప్రభూ ! నీవు సమస్తదేవతలకు నాథుఁడవు. వసువులలోఁ బ్రజాస్వామియై ఋతుధాముఁ డను పేరఁ బ్రసిద్ధిగన్న వాఁడవు. అన్ని లోకములకు నండాధిపతి పర్యంతము స్వయముగా సృష్టించి యావల నండాధిపతి మూలమున సద్వారకముగ సృజించువాఁడవు. నీకు నీవే ప్రభువు. నిన్ను నియమించువాఁడు లేఁడు. రుద్రులలో మహాదేవుఁ డను పేరుగల యెనిమిదవ రుద్రుఁడవు నీవే. సాధ్యులందు వీర్యవంతుఁ డను నైదవవసువు నీవ. నీకు నశ్వినీదేవతలు కర్ణములు. సూర్యచంద్రులు నేత్రములు. జగము లన్నియుఁ బ్రలయకాలమందు నశించినను నీవుమాత్రము మిగిలియుందువు. సృష్టికిఁ బూర్వమునందు నుండువాఁడవు నీవే. ఇట్టి నీవు సామాన్యమనుష్యునివలె సీతాదేవిని వదలవచ్చునా ? కమలాక్షా ! నీ వామెయందుఁ గనికరింపుము.

కం. అని లోకపాలు రెల్లరు, వినయంబున విన్నవింప • విని జగములకున్
వినియమకరణుఁడు రాఘవుఁ, డనియెం దత్త్రిదశనాయ•కావళితోడన్.

అర్థములు. వినియమకరణుఁడు = నియమము విధించువాఁడు, ఈ విశేషణము రామచంద్రమూర్తి యడుగఁబోవు ప్రశ్నము పారమార్థికబుద్ధి నజ్ఞానముచే నడుగ లేదని సూచించుచున్నది.

## తాత్పర్యము

ఈ విధముగ లోకపాలు రగు దేవత లందఱు వినయముతో విన్నవింపఁగా లోకముల నన్నిటిని నియమించు రామచంద్రమూర్తి యా దేవతానాయకుల సమూహముతో నిట్లనెను.

కం. మనుజుఁడ నని దశరథనృప,తనయుఁడ నని రాముఁడ నని•తలఁతును నన్నున్
 వినిపింపుఁ డెవ్వఁడను నె,వ్వనివాఁడను నేల నేను • బ్రభవించితినో. ౨౭౦

అర్థములు. మనుజుఁడను=మనుష్యుఁడను, దశరథ తనయుఁడ నని, ఎవ్వఁడను? ఇది స్వరూప విషయమైన ప్రశ్న. ఎవ్వనివాఁడను? ఇది తదీయుల విషయమైన ప్రశ్న. ఏల ప్రభవించితిని? ఇది కార్య విషయమైన ప్రశ్న.

ఇది తన పరస్వరూపజ్ఞానము లేక యజ్ఞానముచే నడిగిన ప్రశ్న కాదు. ఏలన ముందు పద్యములం దీయన పరత్వము చెప్పఁబడెను. అజ్ఞాని యని యెంచినను దానివలననే పరత్వస్ఫురణము కలిగియుండవలెను. చెప్పినను దెలిసికొనలేని మూఢుఁడా రామచంద్రమూర్తి? కావునఁ దెలిసియు దన విషయము పూర్తిగా సుగ్రీవాదులకుఁ దెలుపఁగోరి యీ ప్రశ్న గావించెను. సుగ్రీవున కింతవఱకు రామచంద్రమూర్తియందు పరత్వజ్ఞానము లేదు. ఉండెనేని విభీషణశరణాగతి యం దట్లు వాదించియుండఁడు. మనుష్యుఁడను భావముతోనే యిట్లు వాదించెను. ఇఁక వారిని కృతార్థులను జేయవలసియున్నది. కావున వారికిఁ దనయందు భక్తి ముదురుటకై తన విషయమైన జ్ఞానము వారికిఁ గలిగింపవలసియున్నది. తన్ను గుఱించి తాను జెప్పుకొనుటకంటెఁ బరులు చెప్పిన గుణము హెచ్చును. ఆకారణముచే బ్రహ్మచేఁ జెప్పింపఁదలఁచి యిట్లు ప్రశ్నించెను. సుగ్రీవాదుల యభిప్రాయమును దన యభిప్రాయముగాఁ జెప్పినపుడు బ్రహ్మ దాని సవరించెనా, సుగ్రీవాదుల యభిప్రాయము చక్కఁబడును.

ఇఁక దేవతలతో నేను మనుజుఁడను రాముఁడను దశరథతనయుఁడ నని చెప్పుటయం దభిప్రాయ మేమన:— దేవతలారా! మీరు నన్ను నాదికర్త యని స్వయంప్రభు యని యిత్యాదివాక్యములఁ బొగడుచున్నారు. ఆ దశలు మీరు చెప్పుట నాకు సంతోషకరముగాదు. నేను స్వయంప్రభువైన నెవనికేమి లాభము? ఆదికర్తయైన నెవని కేమి మేలు? పరుల కుపయోగపడని పదవు లుండిన నేమి లేకుండిన నేమి? అన్ని విధముల దీనులై శోచనీయులైన మనుష్యుల కా దశలలో నేమి చేయఁ గలిగితిని? ఇప్పుడు వారివలె నేను మనుష్యుఁడనై వారి కుపయోగపడఁ గలుగుటచే మీరు చెప్పెడి పరత్వమునకన్న నాకీ మనుష్యత్వమే సంతోషకరమైనది. అందులో నెల్లయ్య పుల్లయ్య యను పేరుగలవాఁడను గాక ప్రజలను రమింపఁజేయు వాఁడను నర్థముగల రాముఁ డనుపేరు గలవాఁడగుట

యెక్కువ సంతోషకరము. అట్టు చేయలేని మనుష్యత్వమేల ? అందు దశరథ కుమారుఁడను పేరుపొందుట మఱింత సంతోషకరము. ఎట్లన ?

'భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః, ప్రాణినాం బుద్ధిజీవినః
బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠాః, నరేషు బ్రాహ్మణాః స్మృతాః'

ఈ కారణముచే భూతములందు మనుష్యుఁడు కావునఁ దాను మనుష్యుఁడనని యందు స్వయంకృషివలన రాముఁడను పేరు సంపాదించి వారిలో శ్రేష్ఠుఁడనైతినని చెప్పి యంతకు శ్రేష్ఠమైనది దశరథపుత్రత్వమని చెప్పుచున్నాఁడు రాముఁడను పేరింతకుముందే పరశురామునకుఁ గలదు. ఏమి లాభము ? ఇప్పుడు సత్యమునకై ప్రాణమును, ప్రాణమునకంటెఁ బ్రియుఁడైన కుమారునివిడిచిన దశరథునికుమారుఁడను పేరు వచ్చుట గొప్పగదా. అటు గాకున్న పండితపుత్రుఁడను పేరు రాదా ? తనవలనఁ దండ్రికి గొప్ప పేరు వచ్చెను. అట్టివాని కొడుకనుటచేఁ దనకు గొప్పతనము లభించెను. కావున తన్ను దశరథకుమారుఁ డనుటయే తనకు సంతోషకరమని భావము.

ఈ సందర్భమున భవభూతి యుత్తరరామచరిత్రమందలి యీ వాక్యములనుసంధింపవగు.

కంచుకీ—రామభద్ర (ఇత్యర్ధోక్తే సాశంకమ్) మహారాజ !

రామః-(సస్మితమ్) ఆర్య. నను రామభద్ర ఇత్యేవ మాం ప్రత్యుపచారశ్శోభతే తాత పరిజనస్య. తద్యథాభ్యస్త మభిధీయతామ్.

అంతఃపురమున గావలియుండు కంచుకి రామచంద్రమహారాజును రామభద్రా యని పిలిచి మరల భయపడి మహారాజ యనెను. రాముఁడు నవ్వుచు నీకెట్టులభ్యాసమో యట్టులే పిలువుమని చెప్పెను.

ఈ వ్యాఖ్యాత కొన్ని సంవత్సరములకుఁ బూర్వము ఒంగవోలునకు బోయెను. అందొక పండితుఁడు పాఠశాలోపాధ్యాయుఁ డాయనను జూడవచ్చి మాటప్రస్తావనగా నీశ్లోక ముదాహరించి రాముని వాక్యము జ్ఞానకృతమా, యజ్ఞానకృతమా యని ప్రశ్నించెను. ఈ వ్యాఖ్యాత చెప్పిన సమాధానము లాయనకుఁ దృప్తికరములు గావయ్యెను. అప్పు డీయన యా పండితుని మీరు గొప్ప పండితులు, మీకు నే నేమని సమాధానము చెప్పఁగలను? ఇంతటి పండితుల యోగ్యత తెలిసికొనలేక యధికారు లల్పవేతనము లిచ్చెద రని శ్లాఘించెను. అప్పు డా పండితుఁడు నేను బండితుఁడఁగాను. నా కేమియుఁ దెలియదు అని యజ్ఞునివలెఁ బలికెను. అప్పు డీయన మీరు చెప్పినట్లు మీరజ్ఞులైన యెడల నేమని పండితపీఠ మలంకరించితిరి ? ఏమి తెలియనివారు విద్యార్థుల కేమి చెప్పెదరు ? ఇట్లాత్మవంచనము లోకవంచనము నగుకార్యము మీరు చేయవచ్చునా ? యని ప్రశ్నించెను. నే నడిగిన ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము వచ్చినది, తృప్తిపడితి నని చెప్పెను.

ఈ శ్లోకమువంటి మఱియొక శ్లోకమునకు నిట్టులే పెద్ద లర్థము చెప్పుదురు. వస్త్రాపహరణ కాలమున ద్రౌపది "శంఖచక్ర గదాపాణే ద్వారకానిలయాచ్యుత। గోవింద పుండరీకాక్ష, పాహి మాం శరణంగతామ్" అని ప్రార్థించెను. శంఖ చక్రగదాపాణీ - ద్వారకానిలయా - అచ్యుత- గోవింద-పుండరీకాక్ష, శరణాగతు రాలైన నన్ను రక్షింపుము.

శంఖచక్ర గదాపాణీ యనఁగానే కృష్ణుఁడు తల వంచుకొనెనట! ఈమె పరత్వ చిహ్నములు వర్ణించుచున్నదే - ఈశంఖచక్రగద లీమెమానము కాపా డుటయందు నెట్లుపయోగపడఁగలవని లజ్జించెను. ద్వారకానిలయ యనుటచే కృష్ణావతారము సూచించుచున్నదిగదా యని వంచినతల కొంచెమెత్తెను. గోవింద= గొల్లపిల్లవాఁడా యనఁగానే సంతోషముతో తల పూర్ణముగ నెత్తెననియు పుండరీ కాక్ష యనుటచే సంతోషముతోఁ గన్నులు వికసింపఁ జేసెననియుఁ జెప్పుదురు.

ఐదవతారములలో విభవావతారము అర్చావతారము లోకోపకారకములు. తక్కినవి భక్తులకుఁ గోఱగానివి. దేవతలును విభవావతారములనే యర్చింతురు. కావున వానినిగుఱించి చెప్పినపుడె భగవంతుఁడు సంతోషించును.

విష్ణుపురాణమందలి (౫-౧౩-౧౨) యీ కృష్ణవాక్యములు స్మరింపుఁడు.

గోవర్ధన పర్వత మెత్తినపుడు గోపాలురు కృష్ణుని బహువిధములఁ బొగ డిరి. అప్పుడు కృష్ణభగవానుఁడు ప్రణయకోపము గలవాఁడై వారితో నిట్లనెను:-

'యది వోఽస్తి మయి ప్రీతి శ్లాఘ్యోఽహం భవతాం యది। తదాత్మబంధు సదృశీ బుద్ధి ర్వః క్రియతాం మయి । నాహం దేవో న గంధర్వో న యక్షో నచ దానవః । అహం వో బాంధవో జాతో నైవ చింత్య మతోఽన్యథా ।

మీరు నాయందుఁ బ్రీతిగలిగి మీకు నేను శ్లాఘ్యుఁడనైతినా మీరు నన్ను బంధువనిమాత్రమే యెంచుఁడు. నేను దేవుఁడనుగాను, గంధర్వుఁడఁగాను, యక్షుఁడఁగాను, దానవుఁడఁగాను, మీకు నేను బంధువను. ఆ విధముగఁదప్ప నన్ను మీరు మఱియొకవిధముగ చింతింపవలదు అని చెప్పెను. దీనివలన భగవం తుని పరత్వమెంచి ధ్యానించుటకంటె భక్తులై బంధుభావముతో తండ్రి యనియో అన్న యనియో కుమారుఁడనియో భర్తయనియో స్వామియనియో ధ్యానించు టయే భగవంతునకు సంతోషకరము.

దీనివలన రామచంద్రునం దజ్ఞానముకల దను వాదము నిరస్తము. ఈశ్లోకము సూచించుచు నుపదేశసాహస్రియం దిట్లు వ్రాయఁబడినది. బ్రహ్మా దాశరథే ర్యద్వదుక్త్యై వాపనుదత్తమః యస్య విష్ణుత్వ సంబోధేన యత్నాంతర మూచి వాన్ ॥ ౧౦౦. తత్త్వమసి ప్రకరణము.

బ్రహ్మ రామచంద్రమూర్తికి నీవు విష్ణువని చెప్పుట చేతనే యాయన యజ్ఞానమును దొలఁగించెను. అజ్ఞానము తొలఁగుటకై మఱి యే ప్రయత్నము చేయ

లేదని భావము ఉపాసనములేని జ్ఞానమే యజ్ఞానమును నివర్తింపఁజేయు ననుటకై యిది వ్రాయఁబడెను.

రామచంద్రమూర్తియం దజ్ఞానము లేదని ముందే చెప్పఁబడెను. అందే తమశ్శబ్దమునందు వ్యాఖ్యయందు 'దాశరథినా రామేణ దేవకార్యసిద్ధయే మనుష్యావతార నాట్యేన స్వమాహాత్మ్యాచ్ఛాదనం స్వసంకల్పపూర్వకం యత్కృతం తదిహతమశ్శబ్దే నోచ్యతే। నతు ఈశ్వరస్య సంమోహా స్సంభవతి'.

దశరథరాముఁడు దేవకార్యము సాధించుకొఱకు మనుష్యావతారమను పేరుచేఁ దన మాహాత్మ్యము మఱుఁగుపాటును దేనిని సంకల్పించెనో యది యిందుఁ దమస్సనఁబడెను. ఈశ్వరునకు సమ్మోహములేదు అని యర్థము. నాటకములందు పాత్రము నిద్రపోవుటకు-కుంభకర్ణుఁడు నిద్రపోవుటకు నెంత భేదము కలదో యంత భేదమే జీవకోటుల యజ్ఞానమునకు, రామచంద్రమూర్తి యజ్ఞానమునకుఁ గలదు. నాటక పాత్రమందు నిద్రయేలేదు. అట్టులే రామునం దజ్ఞానములేదు. నిద్రించు కుంభకర్ణుని నీవు కుంభకర్ణుఁడవు నిద్ర లెమ్మనఁగానే లేవలేఁడు. అట్టులే తమస్సున మునిఁగిన జీవకోటులకు జ్ఞానము గలిగింప నుపదేశముమాత్రము చాలదు. ఉపాసన మావశ్యకము.

తాత్పర్యము

దేవతలారా! నన్ను నేను మనుష్యుఁడనని రాముఁడనిన దశరథకుమారుఁడనని తలఁచుచున్నాను. నే నెవ్వఁడు? ఎవ్వరివాఁడను? ఏల పుట్టితిని? తెలుపుఁడు.

కం. అని నుడివెడు కౌసల్యా, తనయుం గని బ్రహ్మవిత్ప్ర♦ధానాగ్రణి యా
వనజజుఁడు సత్యవిక్రమ, వినుమా సత్యంబు రామ ♦ విజ్ఞాపింతున్. ౨౦౬

అర్థములు. నుడివెడు=చెప్పుచున్న, బ్రహ్మవిత్+ప్రధానాగ్రణి=బ్రహ్మజ్ఞానము గలవారిలో శ్రేష్ఠులలో ముఖ్యుఁడు, ఇది నాభిప్రాయవిశేషణము, భగవత్తత్త్వము చక్కఁగా దెలిసి చెప్పుచున్నాఁ డనుట, వనజజుఁడు = బ్రహ్మ, విజ్ఞాపింతున్ = విన్నవింతును, సత్యవిక్రమ = యథార్థపరాక్రమము గలవాఁడా, సత్యమే విక్రమముగాఁ గలవాఁడా! సత్యము=ఉన్నదున్నట్టు.

తాత్పర్యము

అని చెప్పుచున్న రామచంద్రమూర్తినిఁ జూచి బ్రహ్మవేత్తలలో మొట్టమొదటివాఁడగు బ్రహ్మదేవుఁడు రామా సత్యవిక్రమా! యథార్థము చెప్పెద వినుము.

—♦ బ్రహ్మ శ్రీరాముని నుతించుట ♦—

దండకము. శ్రీరామ రామా! మహాభావ! నారాయణా! దేవ! లక్ష్మీమనానాథా! యనాథాధినాథా! విభూ! శంఖచక్రాయుధా! నీవ మున్నొంటికొమ్ముగంబు భూదారమై భూమి కాధారమైనిల్చు పెన్వేల్పవుం, జన్నరానున్న యాసూడులం గీడులం గూర్చి

వేధించి సాధించి బాధించు బల్లోపడవున్, నీవ బ్రహ్మంబు, సత్యంబు నీ, వక్షరంబెల్ల కాద్యుండవు మధ్యాంతసంస్థుండవును న్నీవ. లోకాళికిన్ సిద్ధధర్మంబు కర్మంబు మర్మంబునున్ నీవ, నీవే చతుర్బాహువున్ స్వామియున్ శార్ఙ్గివిన్ శంఖివిన్ ఖడ్గివిం గృష్ణుఁడున్ విష్ణుఁడున్ బుద్ధియున్ సిద్ధియున్ సత్త్వముం దత్త్వమున్ శాంతియుం దాంతియుం బూరుషాఖ్యుండవుం బూరుషోత్కృష్టరూపంబును న్నీవ, నీవే హృషీకేశ విఖ్యాతమూర్తీ! యజయ్యుండవున్ సర్వసేనానివిన్ గ్రామణీరత్నమున్ స్రష్టవుం ద్రష్టవున్ నీవ, నీయండ డింమున్ సమస్తం బుపేంద్రా! హరీ! మధ్వరీ! యింద్రకర్మా! మహేంద్రా! నరేంద్రా! మునీంద్రాదివంద్యా! పరా! పద్మనాభా! విరోధ్యంతకారీ! శరణ్యుండవున్ నీవ, నిన్నే సుమీ సర్వరక్షైక సామర్థ్యదక్షుండవున్ లోకచక్షుండవం చెల్ల దివ్యర్షు లుత్కర్ష భావించి సేవించి స్తోత్రంబుఁ గావింత్రు శాఖాసహస్రాత్మకామ్నాయరూపా! మహర్షిప్రవేశా! యనేకోరుజిహ్వా! జగత్పాళికిన్ వాద్యుఁడౌ కర్తవున్ ధర్తవున్ హర్తవున్ నీవ, నీవే స్వయంభర్తవున్, సిద్ధసాధ్యాశ్రయుం డీవ, నీవే సుమీ సృష్టికిన్మూందు భాసిల్లు రూపంబు, యజ్ఞంబును న్నీవ, నీవే వషట్కార మోంకారమున్నీవ, నీవే సముత్కృష్టయోగైకగమ్యుండవున్, భక్తరమ్యుండవున్ నీవ, నీ పుట్టువుం బుట్టువున్ గిట్టుటన్ వెండి నీవిట్టివాఁడంచు నెవ్వాఁడెఱుంగున్, రమాధీశ! గోజాతభూనిర్ఝరాక్రాంతభూతావళీ శైలదిగ్జాలకాంతార దేశంబులన్ నిండి రాణింతు వో దేవదేవేశ! నీవే కదా వేయిపాదంబులన్ వేయిశీర్షంబులన్ వేయినేత్రంబులం బూని భూతంబులన్ గోత్రసంఘాతసంస్థితమౌ భూతధాత్రిన్ వహింపన్ సహింపంగ దక్షుండ, నీ క్షోణి కల్పాంతవేళన్ మహాహీంద్రతల్పుండవై దేవ! గంధర్వ దైతేయ సంఘంబులం దాల్చి ప్రత్యక్షమై యుందు, వో రామ! నీ చిత్తమే నేను, నీ జిహ్వయే వాణి, రోమాళి దేవాళి, యోగీశహృద్ధామ! శ్రీ ధామ కన్ రెప్పలన్ మూయఁగా రేయి, విప్పం బగల్, నీదు విశ్వాసముల్ వేదముల్ రామ! నీకాని దావంతయున్ లేదు, సర్వంబులోకంబు నీకున్ శరీరంబు స్థైర్యంబు భూగోళ, మగ్నుల్ ప్రకోపంబు, శ్రీవత్సచిహ్నా! ప్రసాదంబు సోముండు, నీవే కదా మున్ను వైరోచనిం జేరి దానంబునుం గోరి పాదత్రయీన్యాసరూపంబునన్ సర్వలోకంబులున్ నిండి దండించి తా దైత్యు, దైత్యారికిం బట్టముం గట్టి రక్షించితో దివ్యమూర్తీ! లసత్కీర్తి! శ్రీలక్ష్మియే సీత. విష్ణుండవే నీవు, కృష్ణుండునున్ నీవ, నీవే ప్రజానాథవాచ్యుండ వా పంక్తికంఠున్ వధింపంగ నై మానుషీదేహమున జొచ్చి రక్షోధిపుం ద్రుంచి మా కార్యముం దీర్చి లోకంబులం దేర్చి తీ వింక హృష్టుండవై ధాత్రిఁ బాలించి యాపై దివిం జేరుమా, యో రమానాథ! నీ వీర్యసారం బమోఘంబు, నీ ఘోరశౌర్యం బమోఘంబు

నీ దర్శనంబే సమోఘంబు, నీ స్తోత్రమున్ మోఘమే వేళ నేవారికింగాదు, నిన్ భక్తిచేఁ గొల్చి చిత్తంబునం దాల్చు నీ భక్తులా వారికే లోపముల్ లేవు, నిన్నుం బురాణున్ సదాపూరుషోత్తంము నిశ్చంచలం బైన సద్భక్తి సేవించు భక్తుల్ జగద్రక్షకా! యైహికాత్యంత సౌఖ్యంబు లెల్లప్పుడుం గందు రీశా నమస్తే నమస్తే నమః.

అర్థములు. శ్రీరామ = లక్ష్మీదేవియందు రమించు రామా — రామచంద్రమూర్తీ, మహాభావ = మహాత్మా, నారాయణ = నారములనఁగా జలములు జీవకోటులు వానికి స్థానమై, యవి స్థానముగాఁ గలవాఁడా.

ఈ పదము జగత్కారణత్వమును జగద్ధారకత్వమును దెలుపును, "ఏకో హవై నారాయణ ఆసీన్న బ్రహ్మా నేశానో నేమే ద్యావా పృథివీ" అప్పుడు నారాయణుఁ డొక్కఁడే యుండెను. బ్రహ్మలేఁడు, శివుఁడు లేఁడు, ఈ యాకాశము లేదు, భూమియు లేదు. ఇట్లు అవాప్తసమస్తకాముఁ డగువానికి నీ సృష్ట్యాది వ్యాపారము లేల యని శంకరాఁగా 'లోకవత్తు లీలాకైంకర్య' మన్నట్లు క్రీడార్థమైయుని తెలుప నీవు దేవుఁడ వనుచున్నాఁడు.

ఈ పదమునకు నర్థము రామపరత్వ మను గ్రంథమందు విశేషించి వ్రాసియుండుటచే నిందు వివరింపఁబడలేదు. దేవ=ప్రకాశస్వరూపుఁడా, వ్యాఘ్రాదివత్ జీవతతేః మాయాపాశేన బంధనం కృత్వా నిత్యం క్రీడయతి యః స దేవః పరికీర్తితః ॥ పులులు మొదలైనవానిని త్రాళ్ళతోఁ గట్టి క్రీడించునట్లు జీవకోటులను మాయాపాశములచేఁ గట్టి క్రీడించువాఁడు. "దేవః క్రీడతి సర్గాద్యై రసురాన్విజిగీషతే. క్రియాఫలై ర్వ్యవహరన్ ద్యోతతే స్తూయతే బుధైః। మోదతే మాదయన్మూఢాన్ స్వాపయంశ్చ స్వమాయయా। ఫలార్థిభిః కామ్యమానః ఫలం ప్రాపయతే చ తాన్। ఏవం ధాత్వర్థ సంబంధా దేకో దేవ ఇతి శ్రుతేః ॥

శుద్ధో దేవ ఏకో నారాయణః ॥ శ్రుతి. లక్ష్మీసనాథా=సర్వదా లక్ష్మీదేవితోఁ గూడియుండువాఁడా; ఆటలు పాటలు గృహస్థునికేఁగాని యొంటరి సన్న్యాసికేల యను శంకరాఁగా లక్ష్మీసనాథుఁ డని చెప్పఁబడెను. అనాథాధినాథా=దిక్కులేనివారికి గొప్ప దిక్కైనవాఁడా! సోపాధికబాంధవు లందఱు చేయి విడిచినను భగవంతుఁడు చేయి విడువఁడని భావము "హా కృష్ణ ద్వారకావాస-క్వాసియాదవనందన? ఇమామవస్థాం సంప్రాప్తాం కి మనాథా ముపేక్షసే" యని ద్రౌపది యైదుగురు భర్తలు మామలు తాతలు బంధువులంద ఱుండియు ననాథ నని యేడువఁగా భగవంతుఁడు రక్షించెను. విభూ='విభ ర్విశ్వాత్మనా హ్యేవ వివిధం పరిపశ్యతి'=విశ్వాత్ముఁ డగుటచే సర్వము చక్కఁగా పాలించువాఁడు. శంఖచక్రాయుధా = పాంచజన్య మను శంఖమును సుదర్శనచక్రమును ఆయుధములుగాఁ గలవాఁడా - ఇట్లు దివ్యసాధనములు చెప్పఁబడెను. ఒంటిశ్లోం

గంబు=ఒక్క కొమ్ముగల, భూదారము=వరాహము, భగవంతుఁడు హిరణ్యాక్షుని నొంటికొమ్ము వరాహమై చంపి యా కొమ్ముచే భూమిని నుద్ధరించెను. 'ఉద్ధృతాసి వరాహేణ' అని శ్రుతి-"దంష్ట్రయా పర్వతేంద్రాణాంచాలనం కృతవా న్మహత్, తత స్తంతుష్టువు ర్దేవా ఏకశృంగత్వసిద్ధయే, ఏకశృంగవరాహో౽భూ త్తదాప్రభృతి మాధవః-" స్కాందము. ప్రళయవేళ భగవంతుఁడు వరాహమై యొక కొమ్ముతో భూమి నుద్ధరించి రెండవ కొమ్ముతో పర్వతములఁ గదలించెను. అప్పుడు దేవతలు రెండవకొమ్ము వలదని ప్రార్థించిరి. అది మొదలు నారాయణుం డొంటికొమ్ముగను గల వరాహమయ్యెను. వేల్పువు=దేవతవు, చన్న = కడచి పోయిన, రానున్న = ఇఁకముందు రాఁగల, సూదులన్=విరోధులను చనిన విరోధులు=మధుకైటభ హిరణ్యాక్ష హిరణ్యకశిపులు లోనగువారు, రానున్న విరోధులు=శిశుపాలాదులు, ప్రోడవు = సమర్థుఁడవు, బ్రహ్మంబు = 'బృహత్వాత్ బృంహణత్వాచ్చ బ్రహ్మేతి పరికీర్త్యతే' విస్తారమైనవాఁడు, విస్తారముగాఁజేయువాఁడు, సూక్ష్మదశయం దున్నవానిని స్థూలప్రపంచాకారమున విస్తరింపఁజేయువాఁడు. సూక్ష్మచిదచిద్విశిష్టుఁడైన బ్రహ్మమే స్థూలచిదచిద్విశిష్టుఁడై ప్రపంచముగాఁ బరిణమించును, "వ్యక్తావ్యక్త సమష్టి వ్యష్టి పురుషాన్ బృంహయతి, నిరతిశయకల్యాణగుణగణైః స్వరూపగుణవిభవై స్స్వయంచ బృంహతి."

"వ్యక్తావ్యక్త సమష్ట్యాది పురుషాం శ్చైవ నిత్యశః గుణైశ్చ కల్యాణతమై ర్బృహ్మ బృంహయతీతిచ॥ రూపైస్స్వరూపేణ గుణై ర్విభవైశ్చ స్వయం మహాః బ్రహ్మేతి సతువా బ్రహ్మ పదజ్ఞ స్సంతతి ప్రదః"

సత్యంబు = త్రికాలములయం దుండువాఁడు — అస్తి — జాయతే — పరిణమతే - వర్ధతే - అపక్షీయతే - వినశ్యతి - ఉండుట - పుట్టుట - మాఱుపడుట - పెరుఁగుట-తగ్గుట - నశించుట అను నాఱు వికారములు లేనివాఁడు - సత్సుసాధురితి సత్యః సజ్జనులందు సాధువు కావున సత్యము. "సత్యస్త్వ వితథాత్మత్వాత్ సతాంహితకరశ్చ యః॥ మూర్తామూర్తాత్మక స్సచ్చత్యచ్చాభవేదితి శ్రుతేః" అక్షరంబు=క్షయింపనిది - నాశము లేనిది — "ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి" శ్రుతి—"సదానుభూయమానో౽పినిస్సీమగుణగౌరవాత్ -ముక్తైః క్వచిన్న క్షరతీ త్యక్షరః పరికీర్తితః" ముక్తులచే సర్వదా యనుభవింపఁబడుచున్నను మేర లేని గుణగౌరవమువలనఁ దగ్గనివాఁడక్షరుఁడు. 'అక్షరం నాశరహితం బ్రహ్మైవాఖిల కారణమ్.' ఎల్లకు = అన్నిటికి, సమస్తభూతకోటికి — ఆద్యుండు = మొదటివాఁడవు, మధ్యాంతసంస్థుండు=నడుమఁ దుదనుండు వాఁడవు, ఆది మధ్యాంతములు లేనివాఁడనుటచే నిత్యత్వము చెప్పఁబడెను. లోకాళికిన్=జనసమూహమునకు, సిద్ధధర్మంబు=ధర్మమనఁగా శ్రేయస్సాధనము — భగవంతుఁడు నిత్యసిద్ధ సాధనము, భగవత్ప్రాప్తి కోరువారు కష్టించి సాధింపవలసినది లేదు. భగవత్ప్రాప్తికి భగ

వంతుఁడే సిద్ధోపాయము, కర్మము=భగవత్ప్రాప్తికై చేయుకర్మము భగవంతుఁడే, "బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతిం, బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా." భ. గీ. మర్మంబు=రహస్యము, చతుర్బాహువున్=నాలుగు భుజములు గలవాఁడవు తడవలు తడవలుగాఁ గాక నాలుగు పురుషార్థములను నొక్కసారిగనే యిచ్చువాఁడు. స్వామివిన్=స్వమ్ము, సొమ్ము, అది గలవాఁడు, భగవంతుఁడు సర్వస్వామి, ప్రకృతిపురుషు లందఱు నాయన సొత్తే. ఆయనది కానిది సమస్త లోకములందుఁ బరమాణువైన లేదు.

శార్ఙ్గివి=శృంగముచేఁ జేయఁబడినది శార్ఙ్గము, శార్ఙ్గమను విల్లుగలవాఁడు, శార్ఙ్గధన్వా త్వింద్రియా ద్యహంకారాత్మక శార్ఙ్గవాన్.

శంఖివిన్, శంఖ = పాంచజన్యమనుశంఖము గలవాఁడు, శంఖభృద్ధారయన్ శంఖం భూతాహంకరణాత్మకమ్॥ఖడివి=నందకమను ఖడ్గమును ధరించిన వాఁడవు 'నందకీనందకోస్యాస్తిఖడ్గో విద్యాత్మకోయుతః'విద్యాత్మకమైన నందకమనుఖడ్గము ధరించువాఁడు.

కృష్ణుఁడున్="కృషిర్భూవాచకశ్శబ్దో ణశ్చ నిర్వృతివాచకః। కృష్ణస్తద్భావయోగాచ్చ," భూమికి భారము దగ్గించి సుఖము గలిగించువాఁడు.

"ఏకాంత లీలారసతో నిర్వృతః కృష్ణ ఉచ్యతే,' ఏకాంతలీలానందానుభవము గలవాఁడు కృష్ణుఁడు, విశ్వంకరోతీతి కృష్ణః=అన్నిటిని జేయువాఁడు. 'దైత్యాన్ కర్షతీతి కృష్ణః' రాక్షసులను నలుపువాఁడు, నల్లని వన్నెగలవాఁడు గనుక కృష్ణుఁడు, చీఁకటిలో నుండు వస్తువుయొక్క స్వరూపస్వభావములు మన కేమియుఁ దెలియరావు. అట్టులే భగవంతుఁ డతిగంభీరుఁడు గనుక నల్లనివాఁ డని చెప్పఁబడును. గాంభీర్యము వలనఁ గదా సముద్రము ఆకాశము నల్లగాఁ గాన వచ్చుట. ప్రపంచము వ్యక్తము గాకముందు చీఁకటిలో నున్నట్లేకదా యుండెను. విత్తనము భూమిలో నున్నప్పుడు మన కేమి తెలియఁ గలదు? భూమిని బగులఁ దీసికొని మొలకగా వచ్చిన తరువాతనే తెలియవచ్చును. అట్టులే భగవంతుఁడు పరత్వమం దెట్టివాఁడైనది పూర్ణముగాఁ దెలియదు.

కృష్ణోయం కృష్ణవర్ణత్వా త్సదానందాత్మకత్వతః కృషి ర్భూవాచక శ్శబ్దః ణశ్చ నిర్వృతివాచకః,తయో రైక్యం పరంబ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే॥"విష్ణుఁడున్=విశ్వమును వ్యాపించియుండు వాఁడు.

౨. తన దయకుఁ బాత్రుఁడగు వాని నప్పుడే యచ్చటనే రక్షించువాఁడు–"స్వవిభూతిభూతంచిదచిదాత్మకంసర్వంవిశతీతివిష్ణుః–"తనవిభూతులగుచిదచిదాత్మకములం దన్నిటఁబ్రవేశించువాఁడు.'చరాచరేషు భూతేషు విశనాత్ విష్ణు రుచ్యతే.

బుద్ధి=జ్ఞానము బ్రవర్తింపఁజేయువాఁడు. తన భక్తుల కెట్టి జ్ఞానము నిచ్చిన దన్ను బ్రాపింతురో యట్టిజ్ఞానము నిచ్చువాఁడు–"నదేవా యష్టిమాదాయ రక్షంతి పశుపాలవత్।యంహిరక్షితు మిచ్ఛంతిబుద్ధ్యాసంయోజయంతితమ్॥"పశులకాపరి

పశువులను గట్టిపట్టుకొని కాపాడినట్లు దేవతలు కాపాడరు. ఎవరిని రక్షింపఁగోరు దురో వానికి జ్ఞానము కలిగింతురు.

సిద్ధియున్=మోక్షమును, కార్యసిద్ధిని కలిగించువాఁడు, 'అయమేవహ్యపాయశ్చ సిద్ధిస్సాధ్య శ్చాన్యథ్యతే యతః, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి'యన్నట్లు బ్రహ్మచర్యవ్రతనిష్ఠులు కోరు సిద్ధి యేదియో యదియగువాఁడు, 'సిద్ధి స్సమస్త సత్కర్మఫలరూపత యోచ్యతే.'

తత్త్వము='సారాంశభూతో జగతో యోసౌతత్త్వ మితి స్మృతిః,'ప్రపంచమునకు సారాంశమైన వాఁడు 'తత్త్వం తథ్యం పరంబ్రహ్మ.

శాంతి='సర్వాధికారా శ్శామ్యంతి సమాధౌ పరమే యతః। అత శ్శాంతి రితి ప్రోక్తః బుత్వర్గో భక్తిదో మనుః॥' పరమసమాధియం దధికారము లన్నియు నీయనయందు శమించును. 'శాంతి స్సమస్తవిద్యాయా నిర్వృత్తిర్బ్రహ్మకేవలమ్,'

దాంతి = ఓర్పు, అజ్ఞుండు చేసిన యపరాధములను జేపట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁడగుట, పూరుషాఖ్యుండవున్ = పురుషుఁడను పేరు గలవాఁడవు.' పురుసనోతీతిపురుషః'=విశేషముఁగ నిచ్చువాఁడు, "ముక్తేభ్య స్స్వాత్మపర్యంతదానాత్పురుష ఈరితః" ముక్తులకు వాఙ్మనసాపరిచ్ఛేద్య గుణవిభవ స్వానుభవము నిచ్చువాఁడు. 'పురుష స్సర్వ దేహేషు శేతే క్షేత్రజ్ఞరూపతః క్షేత్రజ్ఞ రూపమున సర్వదేహములందుండు వాఁడు 'యేన జగత్ పూర్ణం స పురుషః,' ఎవనిచే జగము నిండియున్నదో యతఁడు పురుషుఁడు, 'తేనేదం పూర్ణం పురుషేణ సర్వ' మ్మని శ్రుతి. పురాతనత్వాత్ పురుషః, పురాణుఁడు కావునఁ బురుషుఁడు "పూర్వమేవాహమిహాసమితి తత్పురుషస్య పురుషత్వమ్॥" అని శ్రుతి.

పురుషోత్కృష్టరూపంబు=పురుషులం దుత్తముఁ డగువాఁడవు, "యస్మాత్ క్షరమతీతోహమక్షరాదపిచోత్తమః,అతోస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః," క్షరమునకంటె నక్షరమునకంటె నుత్తముఁడను గావునఁ బురుషోత్తముఁడను.

హృషీకేశవిఖ్యాతమూర్తి = హృషీకేశుఁ డని కీర్తివహించిన వాఁడవు. హృషీకములు = ఇంద్రియములు, వానికి ఈశుఁడు. నియమించువాఁడు, అన్ని యింద్రియముల నాకర్షించు దివ్యమంగళవిగ్రహము గలవాఁడు-హృషీకా ణీంద్రియాణ్యాహుః తేషా మీశో యతో భవాన్। హృషీకేశ స్తతో విష్ణుః ఖ్యాతో వేదేషు కేశవః। భా. హరి. హర్షాత్ సౌఖ్యాత్ సుఖైశ్వర్యాత్ హృషీకేశత్వ మశ్నుతే, హర్షము, సౌఖ్యము, సుఖైశ్వర్యము గలవాఁడు కావున హృషీకేశుఁడు. ఇంద్రియాణాం నియంతృత్వాత్ హృషీకేశః ప్రకీర్తితః.

హృషీకేశో హృషీకాణా మింద్రియాణాం నియంతృణాత్, సూర్యాచంద్రమసో శ్శశ్వదంశుభిః కేశ సంజ్ఞితైః బోధయన్ స్వాపయంశ్చైవ జగ దుత్తి

ష్ఠతే పృథక్ ।స్థాపనా ద్బోధనాచ్చైవ జగతో హర్షణం భవేత్ । పరమాత్మా హృషీకేశ ఇత్యతః పరిగీయతే.

అజయ్యుండవు=జయింపరానివాఁడు, తాను జెఱుపఁదలఁచినవానిని రక్షించు వాఁడు లేఁడు, తాను రక్షింపఁబూనిన వానిని జెఱుచువాఁడు లేఁడు, అప్రతిహత సంకల్పుఁడు='త్రాతుం నశక్తా యుధి రామవధ్యమ్'అను వాక్యమును, ప్రహ్లాదాది చరిత్రములననుసంధించునది, సర్వసేనానివిన్ = దేవసేనా నిర్వాహకుఁడు, గ్రామణి= గ్రామం సమాజం సూరీణాం నయతి గ్రామణీశ్చ యః॥ నిత్యసూరుల సమూహా మును నడుపువాఁడు గ్రామణి - గ్రామణీ రితి నేతృత్వాత్ భూతగ్రామస్య కృత్స్నశః ॥ భూతసమూహముల కన్నిటికి నేత కావున గ్రామణి, గ్రామాధిపతి= ఇట్టివారిలో శ్రేష్ఠుఁడు గ్రామణీరత్నము.

స్రష్టవున్ = లోకముల సృష్టించువాఁడవు, ద్రష్టవు = సర్వసాక్షివి, డింఘున్ = లయించుసు, ఉపేంద్రా = ఇంద్రునకు వామనావతారమునఁ దోడఁ బుట్టినయిన వాఁడా, మధ్వారీ=మధు+అరీ=మధువను రాక్షసుని జంపినవాఁడా.

ఇంద్రకర్మా = ఇంద్రునిచేఁ గర్మము చేయించువాఁడా, మహేంద్రా = మహా+ఇంద్రా=ఐశ్వర్యము గలవారిలో గొప్పవాఁడవు, నరేంద్రా = జీవకోటుల కధిపుఁడవైన వాఁడా, మునీంద్రాదివంద్యా = ముని శ్రేష్ఠులచే స్తోత్రము చేయఁ బడువాఁడా.

పరా = అన్నిటికిఁ బరుఁడవైన వాఁడా, పద్మనాభా = బ్రహ్మజననము నకుఁ గారణమైన కమలము నాభియందుఁ గలవాఁడా! "కాలాత్మకంతు యత్ప ద్మం । నాభౌ యస్య స ఉచ్యతే । పద్మనాభ శ్చాష్టవర్ణో మహాసంతానదో మనుః," కాలాత్మకమైన పద్మమును నాభియందుఁ గలవాఁడు.

విరోధ్యంతకారీ=విరోధుల నాశముచేయువాఁడా, శరణ్యుండవు=రక్షించు వాఁడవు శరణుజొచ్చుటకు యోగ్యుఁడవు సర్వరక్షైకసామర్థ్యదక్షుండవు = సమస్త భూతములరక్షించుటయందే సామర్థ్యముగలవాఁడవు, లోకచక్షుండవు=లోకమునకుఁ గన్నయినవాఁడవు, సర్వముజూచువాఁడవు. ఉత్కర్ష=గొప్పదనము, శాఖాసహస్రా త్మక=వేయిశాఖలుగల, ఆమ్నాయరూపా=వేదస్వరూపా, వేదము భగవత్స్వరూ పము భగవంతుఁడు వేదస్వరూపుఁడు, వేదము శబ్దబ్రహ్మము, వాచకము, భగ వంతుఁడు వాచ్యుఁడు వాచ్యవాచకముల కభేదము మహర్షి ప్రవేకా=మహర్షులందు శ్రేష్ఠుఁడా, ఋషీఆలోచనే, ఋషీ గతౌ అనుధాతవులఁ బట్టి ఆలోచించి తెలిసి కొనువాఁడు ఋషి, వారిలో గొప్పవాఁడు మహర్షి. అట్టిమహర్షులలో గొప్పవాఁడు మహర్షిప్రవేకుఁడు, యస్య జ్ఞానమయం తపః, శ్రుతి. అనేకోరుజిహ్వా=పెక్కులు తొడలు నాలుకలు గలవాఁడా, జగత్పాలికిన్=లోకసమూహమునకు, ఆద్యుఁడా కర్తవు = మొదటికర్తవు, ధర్తవు = వానిని ధరించువాఁడవు, హర్తవు = సంహా

రించువాఁడవు, సృష్టిస్థితిసంహారములు చేయువాఁడవు నీవే, ప్రత్యక్షముగ స్వయముగ రక్షణము బ్రహ్మరుద్రుల మూలమున సృష్టిసంహారములు చేయువాఁడవు నీవే. స్వయంభర్తవు=లోకముల నన్నింటిని నీవు భరింతువు కాని నిన్ను భరించువాఁడు లేఁడు, నిన్ను నీవు భరింపవలసినదే, సిద్ధసాధ్యాశ్రయుండు = సిద్ధులు = ముక్తులు, సాధ్యులు=నిత్యులు. 'యత్ర పూర్వే సాధ్యాస్సంతి దేవాః,'అని శ్రుతి. ఈ యిరువురకు నాశ్రయమై నీతో సమానమైన భోగము లనుభవింపఁజేయువాఁడవు. 'భోగమాత్ర సామ్యలింగాత్'॥ బ్ర. సూ. సృష్టికిముందు సూక్ష్మరూపంబు, మఱ్ఱిచెట్టునకు విత్తనమువలె నుండువాఁడవు. నీవేయజ్ఞంబు = 'యజ్ఞో వై విష్ణుః' శ్రుతి, యజ్ఞోపకరణములు యజ్ఞారాధ్యులు ఇంద్రాదులు నీశరీరము.

వషట్ కారము=ఇది యుపలక్షణము, "చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవచ। హూయతేచ పునర్ద్వాభ్యాం స నో విష్ణుః ప్రసీదతు.

నాలుగు- నాలుగు - రెండు - ఐదు - మరల రెండు వీనిచే నెవఁడు ఆరాధ్యుఁడో యట్టి విష్ణువు నన్ననుగ్రహించును గాక యని యర్థము. నాలుగు = ఆశ్రావయ; మరల నాలుగు=అస్తు శ్రౌషట్ - రెండు వషట్, ఐదు-యే యజామహే - మరల రెండు యజ - ఇన్ని కలిసి పదునే డక్షరములు - ఓంకారము= ప్రణవము - ఓమిత్యేకాక్షరం బ్రహ్మ = నారాయణోపనిషత్తు - గిరామస్మ్యేక మక్షరమ్॥ గీత—

సముత్కృష్ట=మిక్కిలి శ్రేష్ఠమైన భక్తియోగముచేఁ బొందఁబడువాఁడవు, నాహం వేదైర్నతపసా నదానేన నచేజ్యయా, శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా, భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున, జ్ఞాతుం ద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప॥ గీత॥ "నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా నబహునా శ్రుతేన-యమే వైష వృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతేతనూం స్వామ్" శ్రుతి.

"యోగినామపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా, శ్రద్ధావాన్ భజతేయో మాం సమే యుక్తతమో మతః' భ. గీ. ౬-౪౭. కావున నుత్కృష్టయోగము భక్తియోగము-భక్తరమ్యుండవు = భక్తులకు మనోహరుఁడవైన వాఁడవు, పట్టునన్ =ఉనికి=స్థానము, గిట్టుటన్ =సంహారము, గోజాత=వృక్షములు, భూ=భూమి, నిర్జర = దేవతలు, వీరిచే-ఆక్రాంత = ఆక్రమింపఁబడిన, భూతావలీ = భూతసమూహము, శైల = పర్వతములు, దిగ్జాల=దిక్కులు సమూహములు. కాంతారదేశంబులన్ = అడవిప్రదేశములందు, "భూతాని విష్ణు ర్భువనాని విష్ణు ర్వనాని విష్ణు ర్గిరయో దిశశ్చ - నద్య స్సముద్రాశ్చ స ఏవ సర్వం యద స్తి యన్నాస్తిచ విప్రవర్య-" విష్ణుపురాణము.

నీవేకదా వేయి పాదంబులన్......దక్షుండవు=ఇందు పురుషసూక్తార్థము

చెప్పఁబడెను. క్షోణి = భూమి, కల్పాంతవేళన్ = ప్రలయసమయమున, మహోరగేంద్రతల్పుండవై = గొప్ప సర్పము పానుపుగాఁ గలవాఁడవై, ఈ సర్పము అనంతుఁడు సర్పప్రతీకము గుఱించి యిట్లు వ్రాయఁబడెను.

**The Primitive Symbol of the Serpent stood for divine wisdom, and perfection, regeneration and immortality.**

అంగాన్యన్యా దేవతాః అన్నట్లు దేవతలందఱు భగవంతుని యంగములు, ఈ వాక్యము ననుసరించి నేను నీ చిత్తము సరస్వతి నీ నాలుక - రోమములు దేవతలు-యోగిశహృత్ ధామ=యోగీశ్వరుల హృదయము స్థానముగాఁ గలవాఁడా, శ్రీధామ-ఇచ్చట శ్రీ భూమి కుపలక్షణము-"హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ"యని శ్రుతి-నిశ్శ్వాసములు=ఊర్పులు-"తస్యహవా ఏతస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేత ద్యదృగ్వేదః" శ్రుతి. దీని వలన వేదము లపౌరుషేయము లనియు ననాదులనియు భగవత్స్వరూపము లనియు నేర్పడెను. అవంతయున్=అవగింజంతయైన, పరమాణువు నంతయైన.

సర్వంబు లోకంబు నీకున్ శరీరంబు="యస్య పృథివీ శరీరం యస్యాపశ్శరీరం యస్య తేజశ్శరీరం యస్యవాయుశ్శరీరం యస్యా కాశశ్శరీరం యస్య మనశ్శరీరం యస్య బుద్ధిశ్శరీరం యస్యాహంకార శ్శరీరం యస్య చిత్తం శరీరం యస్యావ్యక్తం శరీరం యస్యాక్షరం శరీరం యస్య మృత్యు శ్శరీరం సఏష సర్వభూతాంతరాత్మా పహత పాప్మా దివ్యో ఏకో నారాయణః' ఇట్లు సుబాలోపనిషత్తు, ఛాందోగ్యము చెప్పుచున్నవి. శరీర మనఁగా ఏ చేతనునకు నేద్రవ్యము సర్వవిధముల స్వార్థమునకై నియమించుటకు ధరించుటకు శేషభూత మగుటకుఁ దగినదో యది యా చేతనుని శరీర మనఁబడును. ఆధేయ విధేయ శేషత్వములు శరీరలక్షణములు - కావున ప్రకృతియు జీవులు భగవంతునకు శరీర మగుటచే వాని సంసృష్టిచే నేర్పడిన సర్వ ప్రపంచ మాయనకు శరీరమే. విష్ణుపురాణ మిట్లులే చెప్పుచున్నది. శ్రీవత్సచిహ్న=శ్రీవత్స మను పేరుగల మచ్చ వక్షమందు గుర్తుగాఁగలవాఁడా. "లక్ష్మీస్సవాల్లభ్యసౌభాగ్య చిహ్నం శ్రీవత్సనామకమ్."ఇది మహాపురుషలక్షణము. శ్వేతరోమావర్తము. ప్రసాదము=ప్రసన్నత్వము, సోముఁడు=చంద్రుఁడు, వైరోచనిన్ = బలిని, విరోచను కొడుకును, పాదత్రయన్యాసంబునన్ = మూఁడడుగుల కొలఁతచే, దైత్యారికిన్ = ఇంద్రునికి, కృష్ణుండునున్ నీవ = ముందు కృష్ణుఁడుగా నవతరింపఁ బోవువాఁడవు నీవే, ఈ యవతారములు చెప్పుట ప్రత్యవతారమందు లక్ష్మినిన్ననుసరించియే యున్నదని తెలుపుటకే ప్రతి మన్వంతరమున దశావతారములు వచ్చునవే కావున రాఁబోవు కృష్ణావతార వృత్తాంతము బ్రహ్మ సూచించెను. కల్క్యవతారము రాఁగలదని మనకే తెలిసినపుడు రాఁగలది బ్రహ్మకుఁ దెలియదా? ప్రజానాథవాచ్యుండవు=ప్రజాపతి యని చెప్పఁబడువాఁడవు. మానుషీ దేహమున్=మనుష్యస్త్రీ, దేహమును, మా కార్యము=దేవతలకార్యములనో

ఘంబు=వ్యర్థము కానిది. నీ స్తోత్రము ఫలమీాయక వ్యర్థ మెప్పుడును గాదు. నిన్ భక్తిచేఁగొల్చి నిన్ను మనస్సున నుంచుకొను వారికి నే కొఱఁతయుఁ గలుగదు.

తాత్పర్యము స్పష్టము

ఆ అనఘమును బురాణ•మైతిహ్య మార్షంబు, నైన యీా స్తవంబు•ననుదినంబుఁ
 బరమభక్తితోడఁ•బఠియించువారికి, రాద దెప్పుడేన్ బ•రాభవంబు. ౨౦౦౦

అర్థములు. అనఘము = పాపము హరించునది పురాణము = పురాతనము, ఐతిహ్యము = ఇతిహాసరూపమైనది, ఆర్షంబు = వేదసిద్ధము, స్తవంబు = స్తోత్రంబు, అనుదినంబు = ప్రతిదినము, పరాభవంబు = మఱుజన్మము, (౨) బాహ్యాభ్యంతర శత్రుతిరస్కారము.

తాత్పర్యము

పై దండకమందు నిన్ను సేవించు భక్తులిహపరసౌఖ్యములనెల్లఁ గందురని చెప్పఁబడెను.

అట్లు భక్తి చేయలేనివారీ స్తోత్రమును ప్రతిదినము పఠించిరేని జన్మాంతర ప్రాప్తిని గాని కామక్రోధాదుల వలనఁ గాని బాహ్యశత్రువుల వలనఁగాని తిరస్కారము కలుగదని చెప్పఁబడెను. ఇది పాపహరము, పురాణము, ఇతిహాసము, వేదసంబంధమైనది. కావున దీనియం దిట్టి మహాత్మ్యము గలదు.

## —•{౧౨౧-వ సర్గము. అగ్నిహోత్రుఁడు సీతాదేవిని శ్రీరామునకు మరల నర్పించుట}•—

కం. అని మంగళకరసూక్తులు. వనజాసనుఁ డాడుచుండ • వైశ్వానరుఁడున్
 జనకసుత నంకతలమునఁ,గొని నరుఁడై చితను జిమ్ము•కొనుచున్ వచ్చెన్.

అర్థములు. మంగళకరసూక్తులు = మిగుల శుభకరములైన మాటలు, వైశ్వానరుఁడు=అగ్ని, అంకతలమునన్=ఒడియందు, బిడ్డనెత్తుకొన్నట్లు, నరుఁడై = మనుష్యాకారము గలవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము బ్రహ్మదేవుఁడు శుభవాక్యములచే రామచంద్రమూర్తిని స్తుతించుచుండ నగ్నిహోత్రుఁడు మనుష్యస్వరూపమున నగ్నియని గుర్తింప స్రుక్స్రువాదులను ధరించి బిడ్డ నెత్తుకొన్నట్లు సీతాదేవి నొడియందుంచుకొని పాదయందలి కట్టెలను చెదరఁజిమ్ముచు వచ్చెను.

సీ. తరుణార్క-బింబంబు - నిరసించుదానిని, నవ్యహాటకభూష•ణములదాని
 నీలకుంచితకేశ • జాలకంబులదాని, రక్తాంబరంబునఁ • గ్రాలు దాని
 వాడని మాలికా • భరణము ల్గలదానిఁ, జెక్కు- చెదరనిమేని • నిక్కు- దాని
 నంకురింపని చిత్త•సంకోచ మగుదాని, మునుపటిరూపంబ • మొనయు దాని

ఆ. సర్వలోకసాక్షి • జాతవేదుఁడు బాల, నొడిఁ గదించి తెచ్చి • పుడమిజేని
కిచ్చి యిట్టు లనియె•నీమె నీ వైదేహి, యీమెయందుఁ, బాప•మేమి లేదు.

అర్థములు. తరుణార్కబింబంబున్ = బాలసూర్యబింబమును, నిరసించు దానిన్=తన కాంతిచే ధిక్కరించు దానిని, నవ్యహాటక భూషణముల దానిని = మనోహరములైన బంగారాభరణములు ధరించిన దానిని, ఇవి విభీషణుఁడు సమర్పించిన భూషణములు, అంతకుముందు దేహమున సొమ్ములే లేవుకదా. నీలకుంచిత కేశజాలకంబులదాని = నలుపై యుంగరములవలె ముడుఁచుకొనిన తలవెండ్రుకలు విస్తారముగఁ గలదానిని, రక్తాంబరంబునఁ గ్రాలుదాని = ఎఱ్ఱనిచీర కట్టుకొన్న దానిని, ఈ యెఱ్ఱచీర విభీషణుఁ డిచ్చినది, ఆశ్రమ మందున్నప్పుడు కట్టుకొన్న చీర పచ్చనిది, లంకయందున్నప్పుడు కట్టుకొన్న చీర పచ్చనిదే, వాడని మాలికాభరణము ల్గలదాని=నిప్పుసెగకు కమలని పూలదండలు సొమ్ములు గలదానిని, ముత్యములు లోనైనవి నిప్పులలో వేసినఁ జెడిపోవును గదా, అట్లు పోలేదని భావము. ఆశ్రయ మాహాత్మ్యము వలన వానికి నట్టి శక్తి వచ్చెను. అంకురింపని= మొలక యెత్తని, పుట్టని; మునుపటి రూపంబ=అగ్నిలో ప్రవేశింపకముం దే రూపమున నుండెనో యా రూపమే కలదాని, అగ్నిలోఁ బ్రవేశింపకముందు శోకావేశముచే నుపవాసములచే బక్కచిక్కి తెల్లవాఱి యుండెను. ఇప్పుడట్టులే యున్నది జాతవేదుఁడు = అగ్ని.

### తాత్పర్యము

బాలసూర్యబింబమువంటి కాంతి గలదానిని, మనోహరము లయిన బంగారు భూషణములు ధరించినదానిని, నల్లని యుంగరముల వంటి తలవెండ్రుకలు గల దానిని, ఎఱ్ఱచీర కట్టుకొన్న దానిని, వాడిపోని పూలదండలు ఆభరణములు గల దానిని, కొంచెమైన కమలని దేహకాంతి గలదానిని, మనస్సునం దెట్టి సంకోచము లేని దానిని, నగ్నిలోఁ బ్రవేశించినపు డెట్లుండెనో యట్లే యున్నదానిని, నిట్టి బాలను సర్వలోకులు చేయుకర్మములకు సాక్షియగు నగ్నిదేవుఁడు బిడ్డనెత్తుకొన్నట్టు లొడిలో నెత్తుకొని తెచ్చి రామచంద్రున కిచ్చి యీమె నీ సీత, ఈమె యందుఁ బాప మేమాత్రము లేదు.

కొందఱ యభిప్రాయమున ఆశ్రమమందున్న సీత రావణాసురుఁడు రాక ముందుగ నగ్నిలో దాఁగియుండి యిప్పుడు వెల్వడెననియు నీనడుమ రావణాసురుఁడు హరించి తెచ్చినది మాయాసీత యనియుఁ జెప్పుదురు. ఈయభిప్రాయమున కాధారము లితర గ్రంథవాక్యము లందురు. శ్రుతిసమ్మతములైన స్మృతివాక్యములు గ్రాహ్యములు. తద్విరుద్ధములు త్యాజ్యము లని యెట్లు చెప్పఁబడెనో వాల్మీకి రామాయణమున కనుకూలించిన యితరపురాణవాక్యములు గ్రాహ్యము లనియుఁ దద్విరుద్ధములు త్యాజ్యములనియు నవి యా యా వక్తల యభిప్రాయమే కాని యాదికవి యగు వాల్మీకి యభిప్రాయముగా గ్రహింపరాదనియు నీ వ్యాఖ్యాత

యభిప్రాయము. ఈ రామాయణమునకు విరోధింపనివి యితర గ్రంథముల జెప్పఁబడినవి గ్రహించిన గ్రహింప వచ్చును, కాలనేమి కథవలనే యీ మాయాసీత కథయు దీనితో విరోధించు చున్నది. కావున గ్రాహ్యము కాదు.

౧. మాయాసీతను గల్పింప వలసిన కారణమే లేదు. స్పర్శదోష విషయమై యిదివఱకే వ్రాయఁబడెను.

౨. లంకలో వసించు చుండినది మాయాసీత యగునేని సీతాదేవి విషయమున లోకము జాలిపడఁ బనిలేదు. సీతాదేవి చరిత్రమే నీరస మగుచున్నది.

3. మాయాసీత యనఁగా నేమి యర్థము. ఇంద్రజిత్తు కల్పించిన సీత వంటిదా? ఇంద్రజిత్తు తన మాయచేతఁ గల్పించినదానివంటి దగునేని మాయావి పరోక్షమందు మాయ పనిచేయఁజాలదు. కావున నామాయాసీత యనునది సీత వంటి సత్యమైన వ్యక్తియే యని చెప్పవలయును. అట్లైనచో నామె ప్రవేశించుటకు ముందు చేసిన ప్రమాణముల వలన నామె దగ్ధకాక యుండవలెను. లేదా దగ్ధమై బూడిదయై యుండవలెను. మొదటి పక్షమున నిరువురు సీత లేర్పడుదురు. ఛాయాదేవి సంజ్ఞాదేవివలె అది విరుద్ధము.

౪. మాయాసీత యగ్నిలోఁ బడెనని యీ బ్రహ్మరుద్రేంద్రాదులు పరితాపపడివచ్చుట?

౫. సత్యసీతకుఁ బెండ్లినాఁ డీయఁబడిన జడబిళ్ళ మాయాసీత కెట్లులభించెను?

౬. కాకాసుర వృత్తాంతము మణిసిల తిలకము సత్య సీతావిషయమా? మాయాసీతా విషయమా?

౭. సత్యసీత పచ్చచీర కట్టుకొనినది, మాయాసీత యెఱ్ఱచీర కట్టుకొన్నది.

౮. సత్యసీత దశరథుఁడిచ్చిన సొమ్ములు ధరించినది. మాయాసీత విభీషణుఁడిచ్చిన సొమ్ములు ధరించినది. దశరథుఁడిచ్చినసొమ్ములవంటివే విభీషణుఁడిచ్చెనా?

౯. సత్యసీత చిక్కినదికాదు. మాయాసీత బక్కచిక్కినది తెల్లవాఱినది.

౧౦. మాయాసీత రామునితోఁ జెప్పినమాటలయందు వాస్తవముగ దానికి నన్వయించునది నొకటియైనఁ గలదా?

ఇత్యాది కారణములచే మాయాసీతావాదమే మాయావాదముగా నేర్పడుచున్నది.

కం. మానసమున భావనమున, ధ్యానంబునఁ గనుల నైనఁ ♦ దరుణీమణి యీ
జానకి సువృత్త నిన్నుం, దా నెప్పుడు మీఱలేదు ♦ తతశుభచరితా. ౨౭౧

తాత్పర్యము

అర్థములు. మనోవాక్కులచేఁగాని సంకల్పముచేఁగాని యనురాగముతో నితరులఁ జూచికాని యీయామె నిన్నెప్పు డతిక్రమించినదికాదు.

ఈమె యగ్నిలోఁ బ్రవేశించి వెడలిన సీత గాదేని యీ మాటలు పరిహాసాస్పదములు. ఉత్తరరామాయణమున సీతాదేవి వాల్మీక్యాశ్రమమందు విడుచుటకుఁ బూర్వము రామచంద్రమూర్తి లక్ష్మణుతో సీ పరీక్షావిషయము ప్రస్తావించెఁగదా. ఇచ్చట నగ్ని ప్రవేశించినది మాయసీత యగునేని యీవాక్యము లెట్లు సత్యములు

ఉ. నిన్నెడఁబాసి దీన యయి • నిర్జనసీమను నస్వతంత్ర యై
యున్న సుశీల నీమె దురి•తోగ్రచరిత్రుఁడు బల్మిఁ దెచ్చె, నుం
చె న్నిజగేహమందు, నటు•చేసినను న్నినుఁ జింత సేయుచున్
నిన్నె భజించెఁ జూ వికృత•నేత్రలు రక్కసులెప్డుఁ గావఁగన్. ౨౭౧౨

అర్థములు. నిర్జనసీమను=మనుష్యులులేని ప్రదేశమున, అస్వతంత్రయై=పరవశయై, ఇది సీతాదేవి చెప్పినమాటను స్థిరపఱుచుచున్నది. బల్మిఁ దెచ్చె=బలాత్కారముగఁ దెచ్చెను. మాయాసీతావాదము ప్రకార మీమాటలీమెయందు నన్వయింపవు. అగ్నిహోత్రుఁ డసత్యవాది యగును, వికృతనేత్రలు = వికారపుఁ గన్నులు గలవారు, ఈపద్యము మాయాసీతావాదమును నిర్మూలించుచు నగ్నిలోఁ బ్రవేశించిన సీతయే బయలు వెడలి వచ్చిన సీత యని స్థాపించుచున్నది.

తాత్పర్యము

నిన్నువదలి శోకతప్తయయి మనుష్యు లెవ్వరు లేని ప్రదేశమునఁ బరవశయై యున్నసమయంబున నీసాధ్విని పాపపునడవడిగల రావణుఁడు బలవంతముగా దెచ్చెను. తన యింట నుంచెను. అట్లు చేసినను వికారపుఁగన్నులు గల రాక్షసస్త్రీలు తన్ను రక్షింపఁగా నిన్నే ధ్యానించుచు నిన్నే భజించుచునుండెను గాని యితర విషయములందు మనస్సు పోనిచ్చినదికాదు.

తే. మోసగించెను దా నెంతో•యాసముంచె. ధిక్కరించెను బెదరించెఁ•గ్రక్కసించె
నేమిసేసిన లక్షింప • దీమె యతని, నవఘ నీయంద తనహృద • యంబు నిలిపి.

అర్థములు. తాను = రావణుఁడు, క్రక్కసించెన్ = కఠినముగా వర్తించెను. కర్కశించుయొక్క తద్భవము. ఈ పద్యముకూడ నశోకవనిలో దుఃఖించినది వాస్తవసీత యనియే తెలుపుచున్నది.

తాత్పర్యము స్పష్టము.

కం. రామా! విశుద్ధమానస, నే మాత్రం బైనఁ బాప•మెఱుఁగని సాధ్విన్
నామాటఁ బట్టి యేలుము, యీమెను నష్టంబు లాడ•కేమియు నిపుడే. ౨౭౧౪

తాత్పర్యము స్పష్టము.

## —• శ్రీరాముఁడు సీతాదేవిని బరిగ్రహించుట •—

కం. అని యాశ్రయాశుఁ డాడిన, విని ప్రీతాత్ముండు రామ•విభుఁ డశ్రుతతుల్
కనుదోయి ముంప మూర్తిం, బనఘుఁడు చింతించి యిట్టు•లను దహనునకున్.

అర్థములు. ఆశ్రయాశుఁడు=అగ్నిహోత్రుఁడు, అశ్రుతతుల్ = కన్నీళ్ళ సమూహములు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. జానకి శుద్ధురా లగుట ♦ సత్యమ యైనను దీర్ఘకాల మీ
దానవనాథు నంతపురిఁ ♦ దాని వసించుట నిప్పు దూరకే
యేను గ్రహించినన్ దశర♦థేశ్వరు పుత్రుఁడు రాముఁ డెంత ధీ
హీనుఁడు కాముకుండు గ్రహి ♦ యించె నతిం బరికింప కేమియున్. ౨౯౧౬

అర్థములు. ధీహీనుఁడు = బుద్ధిలేనివాఁడు; కాముకుఁడు=స్త్రీ కామము గలవాఁడు, పరికింపక=పరీక్షింపక, దశరథేశ్వరు పుత్రుఁడు రాముఁడు, దశరథుఁ డెంతి కాముకుఁడో రాముఁడు నంతి కాముకుఁడే.

తాత్పర్యము

జానకియందు దోషము లేదని నే నెఱుఁగుదును. నీవు సత్యమే చెప్పితివి ఐనను దీర్ఘకాలము రావణుని యంతఃపురమందు నుండిన కారణమున నిప్పుడు పరీక్షింపక గ్రహించితినేని యీ రాముఁడు తండ్రికిఁ దగిన కొడుకే బుద్ధిహీనుఁడు స్త్రీ కామవశుఁడు. మంచి చెడ్డ పరీక్షింపక మరల గ్రహించెనని.

చ. అని యిటు ముజ్జగంబులను ♦ నార్యులు పల్కరె నన్ను! దానికే
జనకజ భర్తృరా లనియు ♦ సాధ్వి యనన్యమనస్క యంచు నా
మనము నెఱింగి వర్తిలెడి ♦ మానితశీల యటం చెఱింగియున్
జనముల నమ్మఁజేయ నతి ♦ సత్యరతుఁడ నుపేక్షసేసితిన్, ౨౯౧౭

అర్థములు. సాధ్వి = పతివ్రత; అనన్యమనస్క=నాయందుఁ దప్ప నితరులయందు మనస్సు లేనిది, మానితశీల = పూజ్యచరిత్ర, సత్యరతుండ = సత్యమందు ప్రీతిగలవాఁడా.

తాత్పర్యము

నన్ను మూఁడు లోకంబులఁ బెద్దలు పల్కరా? ఆ నింద పడఁజాలక జానకి నాయందు భక్తి గలది. పతివ్రత, ఇతరులయందు మనస్సు లేనిది, నామనస్సు ప్రకారము వర్తించు పూజ్యచరిత్ర యని తెలిసియు లోకుల నమ్మఁజేయుటకై నే నుపేక్షించితిని. నీవు సత్యమందుఁ బ్రీతి గలవాఁడవు కావున నేను సత్యము చెప్పితిని.

చ. చెలువలమిన్న నన్నెపుడు ♦ శీలమహత్త్వము పేర్మిఁ గాచుకోఁ
గల దని, పంక్తికంధరుఁడు ♦ కాండధి నేలనుబోలె మీఱఁగా
వలఁతియు గాఁడటంచు, నతి ♦ బాపుడు మండెడుమంటపోలికం
దలఁపున నేని ధిక్కృతి యె ♦ నర్పఁగ లేఁ డని నే నెఱుంగుదున్. ౨౯౧౮

అర్థములు. కాండధి=సముద్రము, వేలను = చెలియలి కట్టను, వలఁతి= సమర్థుఁడు.

తాత్పర్యము

ఈ స్త్రీరత్నము తన పాతివ్రత్యమహిమచేఁ దన్నుఁ దాను గాపాడుకొనఁ గల దనియు, చెలియలికట్టను సముద్రుఁడు మించిపోలేనట్లీమెను మించి రావణుఁడు పోలేఁడనియు, నీమెయొద్దకు వచ్చునప్పటికి వానిదుర్వృత్తి నిలిచిపోవలసినదే యనియు, ఆపాపాత్ముఁడు మండెడు పెనుమంటను దిరస్కరింప సాధ్యపడన ట్లీమెను దాఁకి బ్రదుకలేఁడనియు నే నెఱుఁగుదును.

తే. రావణాంతఃపురంబున • రమ్యశీల, యర్హ గాదు సుఖశ్రీల • ననుభవింప
సూర్యునకు నెండవోలె నీ•సుందరాంగి, నన్ను విడనాడి యుండలే•దెన్నఁడేని

తాత్పర్యము

ఈమె రావణుని యంతఃపురంబున సుఖసంపద లనుభవింపఁ దగినదికాదు. ఆ పాపాత్ముని సొత్తు ఈమె వినియోగించుకొనఁ దగినదిగాదు. జారుల ద్రవ్యము సాధువులు గ్రహింపరాదుగదా. సూర్యుని విడిచి యెండ యేప్రకార మెన్నఁడైన నే నిమిషమందైన నుండదో య ట్లీమె నన్ను విడిచియుండదు, మనస్సుచే నైన నా సంయోగము వదలి యుండునది కాదు. 'రాఘవత్వే భవేత్సీతా' యన్నట్లు నిత్యానపాయిని యని భావము.

మీఁదఁ జెప్పిన యనన్యశబ్దముయొక్క యర్థ మిందు వివరింపఁబడెను. ఒక్క వస్తువు మఱియొక్క వస్తువుగా నగుట మనన్యత్వ మని చెప్పరాదు. ఏలన నొక వస్తువు మఱియొక వస్తువుగా నేనాఁటికిని నే దశయందును గాఁజాలదు. సూర్యున కెండ యనన్య మనినపుడు నిత్యసంయోగ మర్థముగాని ఎండ సూర్యుఁ డయ్యె నని కాని సూర్యుఁ డెండయయ్యె ననికాని యర్థముగాదు. ఎండ విశేష ణము — అంశము-సూర్యుఁ డంశి - విశేష్యము. గుణసామ్యము గలదు - కావున నేకము - జీవాత్మ పరమాత్మ సంబంధ మిట్టిదే యని గ్రహింపనగు.

ఉ. పూతచరిత్ర యీ జనక • పుత్రిక శుద్ధ జగత్ప్రియంబునన్
స్ఫీతసుకీర్తినిన్ సుమతి • వీడఁగఁ జాలనిభంగి నెట్లు భూ
జాతను బాయనేర్తు? సుర • సత్తములార! త్రిలోకపూజ్యులున్
ఖ్యాతులు స్నిగ్ధులీర లిటు • లానన నే నొనరింప కుందునే. .౨౦

అర్థములు. పూతచరిత్ర = పవిత్రమైన నడవడి గలది, శుద్ధ = పవిత్రురాలు, కల్మషహీన, సుమతి=బుద్ధిమంతుఁడు, స్నిగ్ధులు=స్నేహభావము గలవారు.

తాత్పర్యము

పవిత్రమైన నడవడిగల యీ సీత నిష్కల్మషహృదయము గలది. బుద్ధిమంతుఁడు సత్కీర్తిని వదలలేనట్లు నే నెట్లు లీమెను వదలనేర్తును. దేవతాశ్రేష్ఠులారా! మీరు మూఁడులోకములందుఁ బూజింపఁబడువారు. ప్రసిద్ధులు,

నాయందు స్నేహభావము గలవారు. ఇట్టి మీరారవుననివదానిని నేను జేయకుందునా? మీాకు సమ్మతమైన కార్యము చేయుటకే కదా నే నవతరించితి నని భావము.

కం. ఇటు తనయెఱిఁగిన విషయము, స్ఫుటముగ వచియించి నిఖిల♦సురసన్నుతుఁ డై
కుటిలాలక సీతం గొని, పటుతరసౌఖ్యంబు రామ♦భద్రుఁడు గూరెన్. ౨౭. ౨౧

**తాత్పర్యము**

ఈ ప్రకారము తనకుఁ దెలిసిన విషయము దేవతలకుఁ దెలియఁజెప్పి సీతను జేరఁదీసి రాముఁడు సుఖించెను.

భక్తిప్రపత్తుల ఫలము సాయుజ్యప్రాప్తి. అది యీా పద్యంబునఁ జెప్పఁబడెను. సీతాదేవి యత్యల్పకాలము భక్తిహీనయై ప్రాకృతపదార్థము మీాఁద మనస్సు పోనిచ్చుటచే లంకాప్రాప్తి యయ్యె నని ముందు చెప్పఁబడెను. ఇప్పుడు ముక్తి చెప్పఁబడెను. ఇప్పుడు సీతాదేవికి రామసాయుజ్యము ప్రాప్తించెను. సయుగ్భావము సాయుజ్యము. సమానత్వప్రాప్తి. పుంస్త్వస్త్రీత్వ భేదము తప్పఁ దక్కిన యన్ని విషయముల రామచంద్రమూర్తితో సమానురాలయ్యెను. ముక్తదశయందు జీవాత్మునకిట్టి సామ్యము లభించు నని,

"భోగమాత్ర సామ్యలింగాచ్చ" బ్ర॥ సూ॥ ౪-౪-౨౧.

"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా" యను శ్రుతియు జీవునకు బ్రహ్మానుభవము చెప్పుచున్నది. కావున సాయుజ్యముక్తి సీతారాములు కలయుట వంటిదని యెఱుఁగఁదగును.

## —♦ ౧౨౩-వ సర్గము. సీతా రామ లక్ష్మణులు దశరథు నందర్శించుట ♦—

సీ. సూర్యకులేశ్వరు♦శుభసుభాషితముల, విని శుభతరసూక్తి♦ ననియె శివుఁడు
భూరిభుజా! సిత♦పుష్కరలోచన!, పీనవక్షా! శత్రు♦భృద్వరేణ్య!
మాభాగ్యమున వైరి♦మర్దనా! యిమ్మహా, కార్యంబుఁ జలిపితి♦ కౌసలేయ!
మాయదృష్టంబున♦మహితదారుణతమం, బసురేంద్రభవము భ♦యంబుఁ బాసి
ఆ. తఖిలలోకములకు♦ నాశ్వసింపుము దీను, భరతు సీమజననిఁ♦ బ్రథితచరిత
యైన కైక లక్ష్మ♦ణాంబామణి సుమిత్రఁ, బట్ట మయ్యయోధ్యఁ♦గట్టుకొనుము.

అర్థములు. నవపుష్కరలోచనః క్రొత్త కెందామరలవంటి కన్నులు గలవాఁడా, "ఇది కప్యాసం పుండరీక ఇవ అక్షిణీ" యను శ్రుతివాక్యమును "పురుషః పుండరీకాక్షః" యను స్మృతివాక్యమును సూచించుచున్నది. ఎఱ్ఱకమలములవంటి కన్నులు గలవాఁడు- ఇది పరబ్రహ్మము యొక్క యసాధారణ చిహ్నముగా శ్రుతిస్మృతులు చెప్పుటవలనను దానినే శివుఁడు రాముని విషయమున ననువదించుటచేతను శ్రీరాముఁడుగా నవతరించిన విష్ణువే వేదాంతవేద్యుఁ డగు పరబ్రహ్మము అని చెప్పఁబడెను. గోవింద. పీనవక్షా = లక్ష్మీనివాస స్థానము గావున

బలిసిన ఱొమ్ము గలవాఁడా, శస్త్రభృద్వరేణ్య = శస్త్రముల ధరించిన వారిలో శ్రేష్ఠుఁడా! మహిత దారుణ తమంబు = గొప్పదియు భయంకరమైనదియు నగు చీఁకటిని, అసురేంద్రభవము=రావణు వలనఁ గలిగినది.

తాత్పర్యము

సూర్యవంశమునఁ బుట్టిన వారిలో గొప్పవాఁడగు రామచంద్రమూర్తి తమ్ముఁ గౌరవించి యిట్లు శుభవాక్యములు చెప్పఁగా శివుఁడు శుభతరవాక్యముల నిట్లనియె. గొప్పభుజబలము గలవాఁడా! క్రొత్తకెందామరలవంటి కన్నులు గలవాఁడా! విశాలవక్షము గలవాఁడా! ఆయుధములు ధరించిన వారిలో శ్రేష్ఠుఁడా, శత్రువుల సంహరించినవాఁడా, మాయదృష్టమున నీవీ గొప్పకార్యము చేసితివి. మాభాగ్యమున అఖిలలోకములకు రావణువలనఁ గలిగిన భయమును గాఢాంధకారమును దొలఁగించితివి. ఇచ్చట కార్యము తీరినది. అచ్చట భరతుఁడు దుఃఖించుచున్నాఁడు. ఆయనను నీ తల్లిని కీర్తికెక్కిన కైకను లక్ష్మణుతల్లి సుమిత్రను ఆశ్వాసపఱుపఁ బొమ్ము. అయోధ్య యందుఁ బట్టముఁ గట్టుకొమ్ము.

కం. అలరింపు సుహృజ్జనముల, నిలుపుము యిక్ష్వాకుకులము ♦ నిరుపమకీర్తిన్
వెలయుము, తురంగమేధము,సలుపుము సువదాన్యయశము♦జగములనిలువన్.

తాత్పర్యము

రామచంద్రమూర్తీ! నీ యవతార ప్రయోజనములలో సాధుపరిత్రాణము దుష్టవినాశము నను రెండు కార్యములు చాలభాగము నెఱవేర్చితివి. ఇఁకఁ మూఁడవది ధర్మసంస్థాపనము చేయవలసి యున్నది. దానికై నీవయోధ్యకుఁ బొమ్ము. స్నేహితుల సంతోషపెట్టుము. సంతానముఁ గాంచి యసమాన కీర్తిగల యిక్ష్వాకుకులము నిలుపుము. ఉత్తమదాత యను యశము లోకముల నిలుచునట్టు లశ్వమేధయాగము చేయుము.

కం. త్రిదివంబునకుం జనుమీ, పదపడి; యదె చూడు భూమిఁ ♦ ద్వజ్జనకుం డై
యుదితయశుం డై గురుడై, విదితుం డగు దశరథుండు ♦ వియదధ్వమునన్.

తాత్పర్యము

ఈ కార్యము లన్నియు నెఱవేర్చి పూర్వము నీవు సంకల్పించిన ప్రకారము వైకుంఠమునకుఁ బొమ్ము. అదిగో నాకాశమున జూడుము. భూమియందు నీకుఁ దండ్రియై కీర్తివంతుఁడై గురువై ప్రసిద్ధికెక్కిన దశరథుఁ డున్నవాఁడు.

తే. పుత్రరత్నంబ వగు నీదు♦భూరిమహిమఁ, దారితుం డయి శక్రప♦త్తనమునందుఁ
గలితసుశ్రీలఁ దేలుచు ♦ గగనయాన, మందు నిలిచినవాఁడు మ♦హానుభావ!

అర్థములు. మహానుభావ=గొప్పమహిమగలవాఁడా, తారితుండయి = తరింపఁబడినవాఁడు, గగనయానము=విమానము.

తా త్ప ర్య ము

ఉత్తమ గుణములుగల నీవు కొడుకైన కారణముచే నీవాతని సత్యము కాపాడుటచే నరకము పాలుగాక తరించి యింద్రపదవియందు మంచిసంపద యనుభవించుచు విమానమందు నిలిచియున్నాఁడు.

కం. సౌమిత్రితోడ నీవును, ధీమహితా! మ్రొక్కు మన్నఁ ♦ద్రిపురహరునుడిన్
రాముఁడు సానుజుఁడై యా, వ్యోమరథస్థున్ సుకాంతి♦యుక్తున్ జనకున్.

అర్థములు. త్రిపురహరునుడిన్ = శివుని మాట ప్రకారము, వ్యోమరథస్థున్=విమానమం దున్నవానిని, సుకాంతియుక్తున్ = మనుష్య శరీరమందున్న తేజస్సుకంటె నెక్కువ తేజస్సుగలవానిని, జనకున్=తండ్రిగా నుండిన వానిని.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. విరజోంబరధారిని గని, కరములు ముకుళించి మ్రొక్కె ♦ క్ష్మానాథుఁడు ము
ద్భరమునఁ బ్రాణప్రియుతరు, వరసుతు నంకంబుఁ జేర్చి ♦ పరిరంభించెన్.

అర్థములు. విరజోంబరధారిని = మలినములేని తెల్లవస్త్రముల ధరించిన వానిని, ముద్భరమునన్=సంతోషాతిశయముచే, ప్రాణప్రియతరున్ = ప్రాణముల కంటె మిగులఁ బ్రియుమైన వానిని, పరిరంభించెన్=కౌఁగిలించెను.

దీని వలనను భారతమున స్వర్గారోహణపర్వమున ధర్మరాజు ననుభవముఁ బట్టియు నీ లోకమువారు మరణించి యీ దేహములు విడిచి స్వర్గమునకుఁ బోయినను అచ్చట నిచ్చటవలెనే యొకరి నొకరు గుర్తింపఁగల యొక్కట్లు సూక్ష్మశరీరము గలవారై యుందురనియు పృథివీతత్త్వము క్షీణించి తేజస్తత్త్వ మెచ్చగుటచే కాంతి యతిశయించి యుండుననియు నేర్పడుచున్నది. ఈ పోలిక ప్రకృతి సంబంధము వదలువఱకు మాఱదు. కాంతి యతిశయించు చుండునే కాని పైపై లోకములకుఁ బోయినను యొక్కట్లు మాఱవు. ఒకరినొకరు గుర్తింప వచ్చును.

తా త్ప ర్య ము

తెల్లని నిర్మలమైన వస్త్రమును ధరించినవానిని జూచి చేతులు జోడించి మ్రొక్కెను. దశరథుఁడును సంతోషాతిశయమునఁ బ్రాణములకంటె మిగులఁ బ్రియుఁడైన ప్రియకుమారుఁజూచి యొడియందుఁజేర్చి కౌఁగిలించెను, మరణించిరని మనము తలంచు వారికిని మనకును దశాభేదము తప్ప మఱి యే భేదము కానరాదు. దశాభేద మనఁగా బాలుఁడు యౌవనవంతుఁడైనట్లు, ఈకారణముచేఁ బాపులుతప్ప దక్కినవారు మరణమునకు భయపడవలసిన కారణములేదు. అందు భక్తులకుఁ బ్రపన్నులకు నరకబాధలేదు. వీరు ప్రకృతిమండలము దాఁటి విరజానది స్నానము చేసి దానిని దాఁటి భగవత్స్వరూపధారు లగుదురు. అప్పటి శరీరము లప్రాకృతములు. అప్పటి శరీరధారణము వారి యిష్టానుసారమై యుండును. ప్రకృతినిర్బంధ మచ్చట లేదు.

## —♦ దశరథుఁడు శ్రీరామునిఁ బ్రశంసించుట ♦—

ఉ. ఈమెయిఁ గౌఁగిలించుకొని ♦ యెంతయు రక్తి మహీశుఁ డిట్లనున్
రామ! నిజంబు చెప్పెద సు ♦ రస్థిర మౌనిసురాళిచేత నె
న్నోమహనీయసత్కృతుల ♦ నొందుచు గౌరవ మందు చుండియున్
నామది లేదు సంతసము ♦ నాయన! నిన్నెడఁబాసి యుండుటన్. ౨౭౨౮

అర్థములు. సురస్థిరన్ = దేవలోకమందు.

### తాత్పర్యము

ఈ ప్రకారము కౌఁగిలించుకొని మిక్కిలి ప్రేమతో దశరథుఁ డిట్లనియె. రామచంద్రా! సత్యము చెప్పెదను. దేవలోకమందు మునులు దేవతలు నెంతో గొప్పగా నన్ను సత్కరించుచున్నారు. అయినను నిన్ను విడనాడి యుండుటచే నాయనా! నాకు సంతోషము లేదు.

దీనివలన రాగద్వేషములు స్వర్గలోకమందుండు వారికిని గలవని యేర్పడు చున్నది. రాగద్వేషములున్నప్పు డసూయా మాత్సర్యాదులు గలవు. రాజసూయయాగము చేసి తనకంటె గొప్పపదవి నుండువారిని జూచికదా పాండురాజు ధర్మరాజునకు రాజసూయయాగము చేయుమని చెప్పి పంపెను.

కం. దుర్ణయులం బొరిగని సంపూర్ణాత్ముండ వైన నిన్నుఁ ♦ బొడఁగనుటను ని
స్తీర్ణవనవాసు నిప్పుడు, పూర్ణమనస్కుండ నైతిఁ ♦ బుణ్యచరిత్రా. ౨౭౨౯

అర్థములు. దుర్ణయులన్ = చెడు నీతిపరులను - సంపూర్ణాత్ముఁడవు = పూనిన ప్రయత్నము పూర్ణముగా నెఱవేర్చిన వాఁడవు; నిస్తీర్ణవనవాసున్-వనవాస నియమము దాఁటిన వానిని-పూర్ణమనస్కుండను=నిండినకోరికగలవాఁడను.

### తాత్పర్యము

దుష్టులను సంహరించి పూనినపని సాంతముగా నెఱవేర్చి వనవాస నియమము కడముట్టించియున్న నిన్నుఁజూచి కోరిక నెఱవేఱుటచే సంతోషముతో నిండిన మనస్సుగలవాఁడ నైతిని.

ఉ. కానల నిన్నుఁ ద్రోయుమని ♦ కైక వచించిన నిష్ఠురోక్తు లీ
మానసమందు నాటినవి ♦ మానక యిప్పుడు కౌఁగిలించి స
న్మానితు నిన్ను లక్ష్మణుని ♦ మానితి దుఃఖము మంచుపాయుటన్
భానుఁడువోలె నే మరల ♦ భాసిలఁ గంటిఁగదయ్య పుత్రకా! ౨౭౩౦

### తాత్పర్యము

కుమారా! నిన్ను నడవులకుఁ బంపుమని కైక పలికిన పరుషవాక్యములను నా మనస్సున నాటి బాధించుచుండినవి. ఇప్పుడు వనవాసదీక్ష దీరిన నిన్ను లక్ష్మణునిఁ గౌఁగిలించి యీ దుఃఖముపాసితిని. మంచుపోఁగాఁ బ్రకాశించు సూర్యునివలె నైతిని.

కం. శిష్టుఁడు ధర్మాత్ముఁడు నగు నష్టావక్రుఁడు కహోళు ♦ ననువున నీవా
శ్రేష్ఠుఁడ వగు పుత్రుఁడవై, దిష్టమునఁ దరింపఁజేసి♦తివి నను వత్సా. ౨౬౩౧

తాత్పర్యము

సదాచార సంపన్నుఁడు ధర్మబుద్ధియగు నష్టావక్రునిచే నతని తండ్రి కహోళుఁడు తరించినట్లు నేను నాభాగ్యవశమున నీవు ప్రియపుత్రుఁడ వగుటచే దరించితిని.

కం. రావణవధాభిలాషులు, దేవత లెల్లరును నా కృ ♦ తిన్ విఘ్నంబున్
గావించిరి పురుషోత్తమ, యావిధ మేనిపు డెఱుంగు♦టయ్యెం దండ్రీ. ౨౬౩౨

తాత్పర్యము

రావణు వధయందుఁ గోరికగల దేవతలందఱు నేను నీకుఁ జేయఁదలఁచిన పట్టాభిషేకమునకు విఘ్నము గావించిరి. అది యిప్పుడు నాకుఁ దెలిసినది.

కం. జన్యమున నరులఁ బోరిగొని, వన్యావళినుండి మరలి♦వచ్చిన నిను దుః
ఖాన్యమతిఁ గనఁగఁజాలెను, ధన్యగదా నిన్నుఁ గన్న ♦ తల్లి కుమారా.

అర్థములు. జన్యమునన్=యుద్ధమందు, అరులన్ = శత్రువులను, పోరిగొని=చంపి, వన్యావళినుండి=అడవులనుండి, దుఃఖాన్యమతిన్ = సంతోషముతోఁ గూడిన మనస్సుతో.

తాత్పర్యము

యుద్ధమునందు శత్రువులఁజంపి యడవులనుండి మరలి యయోధ్యకు వచ్చిన నిన్ను సంతోషముతోఁ జూడఁగల నీతల్లి ధన్యురాలుగదా.

కం. వన్యాగతు సుఖయితు సౌజన్యధనా! యాభిషేక ♦ జలసంక్లిన్నున్
మాన్యుని రాజుగఁగందురు, ధన్యులువో పురముజనులు♦ధర్మవిచారా! ౨౬౩౪

అర్థములు. వన్యాగతున్=అడవులనుండి వచ్చినవానిని, సౌజన్యధనా = సుజనుల సద్గుణములు ధనముగఁ గలవాఁడా, అభిషేక = అభిషేక సంబంధమైన, జల=నీటిచే, సంక్లిన్నున్=తడిపిన వానిని, మాన్యునిన్=పూజ్యుని.

తాత్పర్యము

నీ వయోధ్యకుఁ బోవుటవలన ధన్య యగునది నీ తల్లిమాత్రమే కాదు. పట్టాభిషేకజలముచేఁ దడిసిన నిన్నుఁ దమరాజుగఁగొని పురజనులు ధన్యులగుదురు.

కం. అనురక్తుండును భక్తుఁడు, వినియమవంతుండు శుచియు ♦ విక్రమపరుఁడౌ
ననుజుఁడు భరతుఁడు నీవును, గనఁగోరెదఁ గలసి మెలసి ♦ గరిమ జరింపన్.

అర్థములు. అనురక్తుఁడు=ప్రేమగలవాఁడు, వినియమవంతుండు=ఇంద్రియ నిగ్రహము గలవాఁడు.

తాత్పర్యము

నీ తమ్ముఁడు నీయం దనురాగము గలవాఁడు, నీకు భక్తుఁడు, ఇంద్రియ నిగ్రహము గలవాఁడు, పవిత్రమైన నడవడిగలవాఁడు, పరాక్రమవంతుఁడు కావున వాఁడును నీవు కలసి మెలసి యైకమత్యముతో నుండఁ గోరెదను.